C NPR01B345

CL



I : NPRoI B345

(శ్రీ)

కందుకూరి వీరేశలింగకవికృత గ్రంథములు

1 వ సంపుటము – ప్రహసనములు.

చిగురుపాటి బుచ్చిరామయ్యగారు
పేనమలూరు
16-5-1950

3వ కూర్పు 1000.

కృష్ణాజిల్లా పెనమలూరు నివాసులు
చిగురుపాటి బుచ్చిరామయ్య గారు
డా॥ చంద్రశేఖర్ గారు
బహుకరించిన గ్రంథకం

ప్రకాశకులు:

హితకారిణీ సమాజము,
రాజమహేంద్రవరము.

1949.

కాపీరైటు] [వెల రు 6–0–0

రాజమహేంద్రవరము:

పిళ్ళారిశెట్టి సీతారామయ్య అండ్ సన్సువారి

శ్రీరామప్రెస్సునందు ముద్రింపఁబడినది.

1949.

విషయసూచి

		పుట.
1	అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము	1
2	విచిత్రవివాహ ప్రహసనము	30
3	మహాబధిర ప్రహసనము	
4	పునర్మరణ ప్రహసనము	111
5	బలాత్కార గానవినోద ప్రహసనము	154
6	కలహప్రియా ప్రహసనము	184
7	మహామహోపాధ్యాయ ప్రహసనము	212
8	యోగనిద్రా ప్రహసనము	242
9	మహావంచక ప్రహసనము	283
10	అసహాయసూర ప్రహసనము	314
11	కలిపురుషశనైశ్చర విలాసము	349
12	వేశ్యాప్రియా ప్రహసనము	370
13	కౌతుకవర్ధని	421
14	వినోదతరంగిణి	456
15	హాస్యసంజీవిని మొదటిభాగము	476
16	డిటో రెండవభాగము	592
17	డిటో మూడవభాగము	696

IV

V

పీఠిక

1848 లో వీరేశలింగముపంతులు జన్మించిరి. ఆ సంవత్సరమునకు 1857లో హిందూదేశమున ఆంగ్లేయులకు తుదిముట్టించుటకు గొప్పజాతీయోద్యమ మొకటి బయలుదేరెనని దేశచరిత్రకారులు దీనిని సిపాయిలకలహమని సాధారణముగా వ్రాసిరి. అప్పటి హిందూమతమునందును, ఆ నాటి మూఢాచారములయందును గాఢవిశ్వాసము గల్గియుండిన పూర్వాచారపరాయణులకును, నవ్యభావోదయమువలన వంగదేశమున రాజారామమోహనరాయుల నాయకత్వమున నేర్పడిచుండిన సంఘసంస్కరణపక్షమువారికిని, జరిగిన పోరాటమనికూడ ఈయుద్ధమును వర్ణింపవచ్చును. ఈ పోరాటమున హిందూదేశమున సంఘసంస్కరణాభిలాషులే విజయము నొందుటయు, వారియండను ఆంగ్లేయపరిపాలనము దేశమున స్థిరపడి విజృంభించుటయు జరిగినది.

ఆనాటి సంఘసంస్కరణపరాయణులకు నాటి ఆంగ్లేయపరిపాలనము దైవసంకల్పితమైన వరమువలె కన్పడినది. తమ సంఘసంస్కరణ ప్రయత్నములయందు ప్రజాభిప్రాయమును తమయెడల సుముఖముగఁ జేసికొనుట వారి కెమరీతగనుండినందున, తమ యుద్యమవిజయమునకు వారు తమదేశమును పాలించు విదేశప్రభుత్వముయొక్క ఆదరణము, సంరక్షణము, బడయుఁజూచుచుండిరి. ఆనాటి ఆంగ్లేయపరిపాలనము, పాశ్చాత్యనాగరికత, వీరి కనులకు దివ్యభముఁగొలిపి వారి నన్నివిధముల నాకర్షించినవి. పాశ్చాత్యనాగరికతతో బోల్చిచూచి తమ హిందూసంఘమున ఆనాడు గోచరించిన పెక్కులోపములను ఆ సంఘమురాచారముల నేవగించుకొని ఆ సంఘమును తీవ్రముగవిమర్శించుటకు వీరుపూనుకొనిరి.

ఈ పరిహాసనముల బడివినయెడల సమగ్రమును నిశితమునగు వీరేశలింగముయొక్క దృష్టి—అప్పటి ఆంధ్రహిందూకాచారములు, అందాంధ్రబ్రాహ్మణకుటుంబముల నిత్యజీవనము, ఆనాటి ఉద్యోగస్థుల దుండగములు, వారిలో కొందరి అధికారమదాంధత, లంచగొండితనము,

కరణము—వీనిపై బడినట్లు మనకు బోధపడును. వీరే
రచనయం దందెవేసిన చేయి. ఆతడు హాస్యప్రియుఁడు.
పోటునకు హాస్యరచన పదునుపెట్టినది. ఛాందసులగు ప్రతి
ధనబలము అధికారబలముఁ గల్గి స్వేచ్ఛావిహారులగు దుష్టు
నులలోని నాయకులకు, వినాయకులకు, గూడ ఈహాస్యరచన
గొల్పినది. ప్రజాసామాన్యముతోబాటు సహృదయులగు ఆనాటి
కులు నీ హాస్యరచనల నాసక్తితో జదువుచు కృమక్రమముగా
ను సంఘసంస్కరణాభిలాషులు కాజొచ్చిరి. సంఘసంస్కారపరా
లకును, వారి యనుచరులకును, వీరేశలింగము ప్రహసనములు
స్ఫూర్తిని నుత్సాహము గల్గించుచు వచ్చినవి.

ఆశయములకు నాచరణకు గల యవాంతరము ఈప్రహసన
ములో తీవ్రముగ విమర్శింపఁబడుచుండును. వేదసాదలలోని మాన
వత్వ
మును సమర్థించుచు ఆమానవత్వమును బోషించుటయే వీరేశలింగము
యొక్క ఆశయము. వీరేశలింగమువంటి ప్రతిభాశాలుర భగీరథయత్న
ములవలననే దేశమున భావస్వాతంత్ర్యావతరణమును దానివలన భారత
జాతీయజీవితమునకు నూతన వికాసమును నేడు జేకూరినవి. సాధారణ
హాస్యరచనలవలె ఊకదంపుకాక వీరేశలింగముహాస్యరచనలు వీనిని
జదివినవారికిని, వీని ప్రహసనముల వీక్షించినవారికిని, నేటికిని ఆనందము
జేకూర్చుచున్నవి. గద్యత్రిక్కన యని నేగుపడసి, ఆంధ్రసాహిత్యపరిషద
ధ్యక్షపదవి నలంకరించిన మహనీయుని వీక్షించినుండి వెలువడిన ఈరచనలు
నేటికిని గొత్తదనమేకలిగి, తరతరములనారికీ మానవజీవితమునందలి
వినోదఘట్టములఁ బ్రవర్తించుచుండును.

25_10_49.
రాజమహేంద్రవరము.

అడవి శంకరరావు B. A., L. T.,
ప్రధానోపాధ్యాయుడు,
వీరేశలింగ ఆస్థికోన్నతపాఠశాల.



Late Rao Bahadur Kandukuri Veeresalingam Pantulu

VIII

1

అపూర్వబ్రహ్మచర్యప్రహసనము.

ఇందు వచ్చుపాత్రములు.

రామాకాంతముపంతులు — కథానాయకుడు.

కరటకరెడ్డి — పంతులవారిసేవకుడు.

వెంకడు — తోటపనివాడు.

సోమభట్టు — పురోహితుడు.

శ్యామలాంబ — రామాకాంతముపంతులభార్య.

మోహిని — కరటకరెడ్డి భార్య.

రంగము — రాజమహేంద్రివరము రామాకాంతముపంతులుగారి గృహము.

[సేవకుడు కరటకరెడ్డి ప్రవేశించుచున్నాడు.]

కర — ఇక్కడికి రెండుసంవత్సరాలనుంచి నాభార్యను నాయజమానుడికంట పడకుండా కాపాడుకొని వచ్చినాను. అతనికంట బడితే యిక నాకు భార్యఆశ లేదు. యిదివరకూ నాయజమానుడు నేను బ్రహ్మచారి అనేభ్రమలోనే వున్నాడు. ఈప్రకారంగానే యింకా మోసంచేస్తూ నాబుద్ధిబలంచేత యీభ్రమ యెల్లకాలమూ వుండేటట్టు చేస్తాను. నాకు పెళ్ళాము వున్నట్టు పంతులుగారికి తెలిసి వున్నట్టయితే యిదివరకే నాకొంప మునిగేది. పెళ్ళాలు వున్న యీవీధివాళ్ళంతా ఆయనజీవానికి వుసూరు మని యేడుస్తూ వున్నారు. ఆయన మ్యానిసి పల్కవిూషనరూ, లోకల్‌ఫండుమెంబరూ, బెంచిమేజస్ట్రేటూ, జస్టిస్సు

కోరుప్పీడరూ టుగా వడంచేత యెప్పుడు యేమి చేసిపో తారో అని అందరూ జడుస్తూ ...ూరు. వాసుదేవరావుపంతులుగారి భార్య పుట్టింటికి వెళ్ళ బోవ ...వుండడంచేత ఆవిడనిమి త్తం మాపంతులుగారు యీవాళ ...ీ యదాటి కొవ్వూరు వెళుతారు. అమ్మగారు పుట్టింటికి వెళ్ళినారు. ఈవేళ నేను నాభార్యను యిక్కడకు దీసుకునివచ్చి అమ్మగారి పడక గదిలో నేను యీరాత్రిఅంతా ఖులాసాగా వుంటాను; అవతలినుండి యెవరో వస్తూవున్న ట్టున్నారు.

[రామా కాంతముపంతులు గారు ప్రవేశించు చున్నారు]

రామా—కరటకా! కరట్టకా! వాసుదేవరావు పెళ్లాము స్టీమరు మీదికి వెళ్ళిందా?

కర—ఇప్పుడే వెళ్ళింది. మీరు వెంటనే వెళ్ళితే స్టీమరు అందు తుంది. మీరు వేగిరం బయలు దేరవలెను. (తనలో) నేను యీరాత్రి యీాయనను యెలాగయినా పంపించి వెయ్యనలెను.

రామా—నన్నుకూడా వెళ్ళమన్నావా? మీఅమ్మగారుకూడా వూళ్ళో లేరు. ఇల్లు నీవు చూస్తూ వుంటావా?

కర—అవశ్యంగా వెళ్ళండి. నేను బ్రహ్మచారిని. పెళ్ళాము వద్దకు పోవలసినపని లేదు. నేనీరాత్రి యిక్కడనే పరుండి మీ ...ల్లూ వస్తువులూ మీకు పదిలంగా వప్పగిస్తాను.

రామా—ఈలోగా పూరినుంచి మీఅమ్మగారు రాదు గదా? మగవాణ్ణి కావడంచేత నేను దాన్ని వదలిపెట్టి వుండగలిగినా, అది పనికిమాలినఆడది కావడంచేత పట్టుమని పదిరోజులయినా పుట్టింటి కూడ నన్ను వదలిపెట్టి వుండలేదు. నేను వర్తమానం పంపించకుం డానే బండి చేసుకొని దుముంగున వస్తూ వుంటుంది. పుట్టిల్లు దగ్గిరచూరు కావడంచేత యీాఅసందర్భం వస్తూ వుంటుంది.

కర—ఆవిషయంలో మీ రేమీ భయపడనక్కర్లేదు. మీ గారు యీరోజుకు రారు. ఒకవేళ వచ్చినా నేను సర్ది కొవ్వూరు తగాదాలో స్థలం చూడడంనిమిత్తం వెళ్ళినాన్ని తాను. స్టీమరు మించిపోతుంది. మీరు త్వరగా వెళ్లవలెను.

రామా—నేను వేగిరం వెళ్లవలె నని నీకు బహుతొందరగా వున్నది. ఎందుచేత?

కర—నాకు యేమీ తొందర లేదు. కావలిస్తే వెయ్యేళ్లు యింట్లోనే వుండండి. వకరోజయినా వూరుదాటిపోతే చాలు నని సంతోషించడానికి నాకు పెళ్ళాము యినా వున్నదా యేమిటి?

రామా—ఆహాహాహా! పెళ్ళాలు వున్నవాళ్లందరికీ నేను వెళ్ళి పోవలె నని వుంటుం దేమి? నేను యిప్పుడు వ్యభిచారం మానివేసి పెద్ద మనిషి నవ్వతూ వున్నాను. మీదటినుంచి బొత్తిగా మానివేస్తాను. నేను వాసుదేవరావు పెళ్ళాముజానికమ్మను విడిచి వక్కసిమిషం తాళ లేను. ఆవిడ కేవలమూ జానకీదేవే. నాపాలిటికి శ్రీమహాలక్ష్మి. నీమాట తీసివెయ్యరాదు. నేనుకూడా ఆస్టీమరులోనే వెళుతాను. నేను వెళుతూవున్నాను. ఇల్లు పదిలము. మీ అమ్మగారు తాను వచ్చేలోగా మంచిదాసీని కుదుర్చు మని చెప్పి పోయింది.. అమాట మఱచిపోకు. ఇవిగో ఇంటితాళము చెవులు. రేపు ఆదివారం గనుక నేను రావడం రెండురోజులు ఆలస్య మయినా యిబ్బందిలేదు గా అమ్మ గారు ధవిళేశ్వరంనుంచి వస్తే తాళంచెవు లియ్యి.

(అని వెళ్ళిపోయినాడు.)

కర—ఈయనను పదల్చుకున్నాను. ఇఁక నాపెళ్లాం యిక్కడకు స్వేచ్ఛగా రావచ్చును. వచ్చేటప్పుడుమాత్రం నాపెళ్ళాము దోవలో యీయనకంట పడకుండా రావలెను. ఆలావస్తే ఈరాత్రి మాప్రభువు

పందిరిపట్టెమంచంమీద మామోహినీ నేనూ రాజ
ంగు వుంటాము. అదుగో మోహిని వస్తూ వున్నది.

[అప్పుడు మోహిని ప్రవేశించు చున్నది]

మోహి—కరటకకొడ్డీ! నీయజమానుడు పూరికి వెళ్ళినాడా?

కర—నీపుణ్యంచేత యిప్పుడే వెళ్ళినాడు. నీకు వీధిలోయెదురు పడలేదుగద? నీవు అదృష్టవంతురాలవు. నీకు యీరాత్రి పందిరిపట్టె మంచమూ పరుపూ దొరకుతుండి. నీవు మన వివాహంమాటమాత్రం యెవరితోనూ చెప్పకుమూ?

మోహి—ఎవరితోనూ చెప్పను. వక్క నాస్నేహితులు బుచ్చితోనూ అచ్చితోనూ మంగితోనూ—(ఆలోచించు)—యింకా యెవరితో చెపుతానా? మా మేనమామ పుల్లిగాడితోకూడా—

కర—సరి యేడిసినట్లే వున్నది నీరహస్యం. డప్పా పుచ్చుకొని టమటమా వేసేమాదిగవాడితోకూడా చెప్పు. నాయజమానుడితోనాకు పెళ్లి కాలేదని చెపుతూవున్నానుగదా. నాగుట్టు ఆయనకు తెలిస్తే?

మోహి—ఎవరితోనూ చెప్పవద్దని వాళ్లచేత చేతిలో చెయ్యి వేయించుకొంటాను లే.

కర—నీరహస్యం నీవు దాచుకోలేవుగాని యిక్ష యితరులు దాస్తారా? యెలాగా నాయజమానుడికి తెలియక మానదు. ఆడదాని పద్ద రహస్యం దాగదని పెద్దలు చెప్పినమాట వూరికే పోతుందీ?

మోహి—అవును నావద్ద రహస్యం దాగదు. రహస్యం దాగ పలేనంటే నీవు నాకు తెలియకుండానే పెళ్లి చేసుకోలేకపోయినావా?

కర—సరిసరి యిది మరీ విచిత్రముగా వున్నది నీకు తెలియ కుండానే నిన్ను నేను పెళ్లి చేసుకోవలసినది కామా? ఇటువంటి దేవ రహస్యాలు నాయజమానుడికేగాని నాకు తెలియవు.

మోహి—మనరహస్యం నీయజమానుడికి మనకు వచ్చినభయం యేమిటి? నన్ను చూచి అతడు స లేదో వక్క-పర్యాయం తీసుకునివెళ్ళి చూపు. తాను పెళ్ళి పడుతూ వున్నప్పుడు నవుకర్లు పెళ్లిఆడితేమాత్రం యెందుకు వుంటుంది?

కర—నిన్ను చూస్తే అతడు తప్పకుండా సంతోషిస్తాడు. అతడికి పెళ్ళిమాత్రమే యిష్టం లేకుగాని నీవంటి పడుచుపెళ్ళికూతు ళ్ళంటే చాలా యిష్టమే.

మోహి—ఆలాగైతే యింకా యెన్నాళ్ళు నేను యీరహస్యం దాచవలెను?

కర—ఎన్నాళ్ళో అక్కరలేదు. నేను ఈయనదగ్గిర నవుకరీ వదలుకున్నదాకా దాస్తే చాలును. నా కిప్పుడు ముప్పుయేళ్ళు వున్నవి. ముసలివాణ్ణి అయినతరువాత నేను నవుకరీ తక్షణం మాను కుంటాను. నేను నవుకరీ మానుకున్నదాకా దాచలేకపోతే నాయజ మానుడు ముసలవా డయినదాకా నైనా దాచు. అంతే చాలును. అతడు నాకంటె నాలుగేళ్ళుమాత్రం చిన్నవాడు. నీ వలాచేస్తే నాకు యితడు డబ్బు చాలా యిస్తాడు గనుక నేను యెప్పుడూ నవుకరీ వదలుకోకుండా సుఖంగా వుంటాను.

మోహి—నీవు నవుకరీ వదలుకున్నదాకానే రహస్యం దాచు తాను గాని అతడు ముసలివా డైనదాకా నేను దాచలేను. ఈలాగో యేలాగయినా కష్టపడుతాను గాని నాకోసం నీవు కేపువుదయాన్నుంచీ తప్పకుండా నవుకరీ మానుకుంటూ.

కర—నవుకరీ మానుకుంటే నీకు నగలూ బువ్వా యెక్కడ నుంచి వస్తుంది?

—ఆలాగయితే నీవు డబ్బు బాగా సంపాదించి పరు మంచాలు చేయించి నాకు నవుకర్లనూ చాకర్లనూ పెట్టి యెక్కించి ననున్ను పూరంతా తిప్పి సుఖపెడుతావా?

కర—అవన్నీ యీరాత్రే చేస్తాను. ఈరాత్రి మనం అమ్మ గారిగదిలో పరుపులమీదనూ పట్టెమంచాలమీదనూ పరుందాము; చీకటిపడ్డతరువాత పంతులుగారిబండిలో ఎక్కించి నిన్ను పెద్దవీధి గుండా తిప్పుతాను; తోటమాలీవెంకడిచేత నీకు కావలసినన్ని పనులు చేయిస్తాను.

మోహి—ఆలాగయితే పెళ్ళినాడుపెట్టిన మధురచీర కట్టుకుని అయిదునిమిషాలలో నేను యింటికి వెళ్ళి మళ్ళీ వస్తాను. ఈలోపుగా బండీ అన్నీ సిద్ధము చేయించు.

కర—వెళ్ళి యిక్కడ వున్నట్టు రా. నీవు వచ్చేటప్పటికి ఫల హారానికి మిఠాయికూడా తెప్పించి వుంచుతాను. మనం ఫలహారం చేసి చల్లపాటువేళ చల్లగాలిలో హాయిగా షికారు బయలుదేరుదాము.

మోహి—మంచిగంధమూ మల్లెపువ్వులూకూడా తెప్పించవలెను సుమా.

(అని పోవు చున్నది.)

కర—ఓరీ! వెంకా! తోటపని మానివేసి యిలా రా?

వెంక—(ప్రవేశించి) బాబూ! యెందుకండీ?

కర—పంతులుగారు పూరికి వెళ్ళేటప్పుడు నీవు తోటపని మానివేసి ఈరోజుల్లా నావర్దీలో వుండి నేను చెప్పినపనుల్లా చేయు మన్నారు. విన్నావా? నేను చెప్పినపని చెయ్యకపోతే నీకు నవుకరీ వుండదు సుమా. నీవు పెందరాళే భోంచేసి వచ్చి రాత్రి నేనూ నాభార్యా పడుకున్నప్పుడు నీవు మాకు పంఖా విసరవలెను. బండి

వాడితో చెప్పి సాయంకాలము షికారు వెళ్ళడాని తయారుగా వుంపించు. నీవు ముందుగా పోయి నేను యీ పంతులుగారికి వాడుకగా మిఠాయి యిచ్చే కిసిన్ సింగుచద్ద పంచదారమిఠాయి రెండుపొట్లాలు కట్టించుకుని రా.

వెంక—ఆలాగే చేస్తానుకానండి నీళ్ళు లేక పువ్వులచెట్లు చచ్చి పోయిన వని రేపు పంతులుగారు కోపపడితేనో—

కర—నాదగ్గర యెదురుమాట చెప్పక చెప్పినట్టు చెయ్యి. నీకు కొత్తగనుక యింకా తెలియలేదు గాని నాఆజ్ఞ అంటే పంతులగారి ఆజ్ఞకంటేనూ యెక్కువ. పంతులగారికి కోపమువచ్చినా నీవు పని చెయ్యగలవు గాని నాకు కోపంవస్తే వక్కనిమిషం పని చెయ్యలేవు. పంతులుగారు నిన్ను అంతగా అడిగితే నేను పసిమొద పంపించినానని చెప్పు.

వెంక—చిత్తము. చిత్తము.

కర—ముందుగా పోయి మిఠాయి తీసుకొని రా పో.

వెంక—పణసతొనలమిఠాయా? (అని వెళ్లు చున్నాడు).

కర—నేను యీవాళ నాయజమానుడికంటేనూ యెక్కువగా వుంటాను. ఈపాటి మోహిని వస్తూవుంటుంది. ఎవరో వస్తూవున్నట్టు అడుగులచప్పుడవుతూవున్నది. అది మోహినే అయివుండును. కాదు. బూట్సుచప్పుడులా గున్నది. అది యేమి నాయజమానుడు మళ్ళీవస్తూ వున్నాడు. అయ్యో! దైవమా! ఏమి యీదురదృష్టము! యిప్పుడు మోహిని వచ్చి యితనికంట పడితే నాకాపురం కూలిపోయిందే. ఇఖ నేను సంసారానికి నీళ్లు వదలుకోవలెను. నేను యేదోపని కల్పించుకొని వీధిలోకి వెళ్ళి నాపెళ్లామును రావద్దని చెప్పి వస్తాను. ఈలోపుగా మిఠాయి పట్టుకొని వెంకడు రాడుగదా?

రామా sంతముపంతులు ప్రవేశించు చున్నాఁడు.]

కర—కరటకా!

కరట—(ఎవ్వరయిన వచ్చుచున్నా రేమో యని గుమ్మముదగ్గఱ కుచు) అయ్యా! ఏమి మీరు వెళ్ళినారుకా రేమి?

రామా—నేను స్టీమరువద్దకు వెళ్ళేటప్పటికి వకఁతమాపా జరిగింది. టిక్కెట్లు పుచ్చుకొని, ఆతమాపా చూచి మళ్ళీనత్తామని యిట్లే అవతలికి వెళ్లేటప్పటికి స్టీమరువాళ్లు స్టీమరు తీసుకొని చక్కా పోయినారు. దివిన్యూవుద్యోగస్థులకోసం కనిపెట్టుకొనివుంటూ నా నిమిత్తం యెందుకు కనిపెట్టుకుని వున్నారుకారో వాళ్ళపని నేను రేపు పట్టిస్తాను. కరట! ఆతమాపా యేమో నీవు వూహించఁ గలవా?

కర—నాకు ఆమాత్రంబుద్ధి లేదు. అయినాకానీ మీకు యెవర్తో చక్కనిపడుచుచిన్నది కనపడ్డ దనుకుంటాను.

రామా—నీవు చక్కగా కనిపెట్టినావు. నీకు జ్యోతిషంకూడా తెలిసినట్టున్నదే. నీవు మాసిద్ధాంతిగారికంటెనూ దాఖలాగా చెప్పి నావు నీ వెక్కడ బుద్ధిహీనుడవు? నీవు బుద్ధికి బృహస్పతివి!

కర—ఇవంతా మీదయ.

రామా—నాకు మూడురోజులకిందట రతీదేవివంటి వోక చక్కనిచిన్నది నేనూ నాస్నేహితుఁడూ కలిసి వస్తూవుండగా కనపడ్డది. ఆచిన్నదే స్టీమరుమీదికి యెక్కబోతూవుండగా దూరంగా మళ్ళీ కనపడ్డది. నేను రేవుల్లోనుంచి వీధిమొగకు వచ్చేటప్పటికి యేమింట్లోకి పోయిందో మళ్ళీ కనపడ్డది కాదు. వీ దంతా యీచివరనుంచి ఆచివర వరకు నాలుగుమాట్లు తిరిగి యెక్కడా కనబడక ఇంతలో స్టీమరుకూడా దాటిపోయినందున తిరిగి యింటికి వచ్చినాను.

కర—(తనలో) ఇతని కేదో గొప్పయెర దొరికింది. అందుచేత

యిత్తణ్ణి మళ్ళీ పంపించివేసి. యీరాత్రి నేను భార్యతో వచ్చును. ఇత్తణ్ణి మాయచేసి యెక్కడా పడుచులు లేనిచోట వీధిఅరుగుమీద తెల్లవారిదాకా కూర్చోపెట్టి వస్తాను. (ప్రకా మీకు కనపడ్డచిన్నది యెట్టిది పలచని చిన్నది కాదుగదా?

రామా—అవును, యెట్టినిచిన్నదే. ఇంకా యేవయినా ఆనవాలు చెప్పు.

కర—ఆట్టే పొట్టికాకుండా పొడుగుకాకుండా వుంటుంది.

రామా—అవును. ఆలాగే వుంటుంది. మరినకగుర్తు చెప్పు.

కర—తలవెంట్రుకలు నల్లగా వుంటవి. కొప్పు పెడుతుంది.

రామా—అందరు కొప్పు పెడుతారు. అందరితలవెంట్రుకలు నల్లగానే వుంటవి. ఇదేం ఆనవాలు?

కర—అలాగయితే యెవరికీ లేని మంచిఆననాలు యింకొకటి చెపుతాను వినండి. ఆచిన్నది కుంకుమబొట్టు పెడుతుంది కాదు? కళ్లకి కాటుక పెడుతుంది.

రామా—ఈరెండుపనులూ అందరూ చేస్తారు.

కర—అందరూ యెందుకు చేస్తారు? మాఅన్నగారిపెళ్ళాం చెయ్యదు. ఆవిడ యెప్పుడూ బొట్టు పెట్టుకోదు. కాటుక పెట్టుకోదు. కొప్పు పెట్టుకోదు. గాజులు పెట్టుకోదు.

రామా—మీఅన్న పెళ్ళాం వెధనచిన్నది కాబోలును.

కర—అవును వెధవచిన్నదేకాబోలును. మీరన్నది యేఅన్న పెళ్ళామూ? ఇప్పుడు మీ మేనమామగారి యింట్లో పనిలోవున్న అన్న గారిపెళ్ళాము కాదూ? ఆవిడ వెధవే. ఆవిడను మొగుడు కోపమువచ్చినప్పుడు యెప్పుడూ వెధవా వెధవా అంటూవుంటాడు. నిరుడు మరిడి జాడ్యాలలో చచ్చినఅన్నగారిపెళ్ళాం వక్కపళ్ళేమూతం విధవ కాదు,

--మీఅన్నగారు బ్రతికివుండగా పెళ్ళాం వెధవ యెలా
ఉ?

కర--నన్ను పూకికే ప్రశ్నలువేసి భ్రమపెట్టకండి. మీరు
పైప్రశ్నలువేసినా నేను అబద్ధం ఆడను. మహారాజులాగు యింట్లో
కూర్చునేవారికి మీకు లోకంసంగతి యేమి తెలుస్తుంది? లోకంలో
దేవరహస్యాలు యెన్నో వుంటవి. యెరిగినవాణ్ణి నామాట నమ్మండి.
మొగుడు బ్రతికివుండగానే కొందరుపెళ్ళాలు వెధవలూ అవుతారు;
పెళ్లి అయినతరువాత కొందరుగృహస్థులు బ్రహ్మచారులూ అవుతారు.
ఇవన్నీ యిప్పు డెందుకు గాని మీరు చూచినది పొన్నమండ భీమన్న
కూతురు. దానిమొగుడు ముసలివాడు.

రామా--ఆచిన్నదానిసంగ తంతా నీవిచివరకే యెరుగుదువా?

కర--ఒక్కయెరగడమే కాదు. రేపు తెల్లవారేలోగా ఆచిన్న
దాన్ని మీసొమ్మే చేసివేస్తాను. మీరు యిప్పుడే బయలుదేరి వారి
యింటికి యెవరుగుండా వున్నఅరుగుమీద ఈరాత్రంతా పరుండ
వలెను. తెల్లవారేలోగా మీ కాచిన్నదాన్ని తీసుకునివచ్చి మీకన్నుల
పండుగ చేస్తాను. మీకు తెలియకుండా మీవద్దకు తీసుకురావడానికై
మీనిమిత్తం నేను ప్రయత్నం చేస్తూవున్నదే ఆచిన్నది

రామా--ఆలాగా? నీవు బహుబుద్ధిమంతుడవు. నీఋణం
నేను వుంచుకోను. ఆచిన్నదాన్ని నాకు దక్కించితివా, నీకు యిరువయి
రూపాయలు బహుమానం చేస్తాను. నేను యెప్పుడూ చేసినమేలు
మరిచిపోను సుమా.

[అప్పు డొకస్త్రీత్వగా మగని వెనుకవైపునుండి మోహిని లోపలికి వచ్చు చున్నది.]

కర--ఆయిరవైరూపాయలూ నాచేతిలో పడ్డవే. పాపం దాని
మొగుడు అదృష్టహీనుడు.

రామా—(మోహినిని చూచి) ఏమి యీభాగ్యం ఇవిగో నీరూపాయలు పుచ్చుకో. (అని చేతిలో పెట్టుచున్నాడు.

కర—ఏమి యీభాగ్యము! నాకు ముందుగానే రూపాయిస్తూవున్నారు? (అని వెనుక తిరిగి మోహినిని చూచుచున్నాడు.)

మోహి—(తెల్లపోయి నిలుచున్నది.)

రామా—ఆచిన్నదాన్ని మాటలోనే యిక్కడికి తలవసితలంపుగా రప్పించినావు? ఈమెకు వెయ్యేళ్ళు ఆయుస్సున్నది.

కర—(తనలో) అయ్యో! నాకొంప మునిగింది.

మోహి—కరటకా! నన్ను క్షమించు. నేను అసమయంలో వచ్చినాను.

రామా—అసమయం కాదు. మంచిసమయంలోనే వచ్చినావు. నాభార్య వూళ్ళో లేదు. ఈరెడ్డి నిన్ను రమ్మన్నది నానిమిత్తమే.

కర—(మోహినితో రహస్యముగా) ఇతడే నాయజమానుడైనరామాకాంతముపంతులు. మనరహస్యం జాగ్రత.

రామా—సుందరీ! నీపే రెవరు?

మోహి—నాపేరు మోహిని. నేను మీపాదసేవకురాలను.

కర—(రహస్యముగా) ఇతనికి పాదసేవకురాలవా? నీవు అలా అనబోకు.

మోహి—నేను నిజముగా సేవకురాలను కాను గోదావరి యొడ్డున కోపుర మున్న ముసలిగంగమ్మ కూతురిని.

రామా—ముసలిగంగమ్మకూతురవా? పాపము! మొగుడు పోయినప్పటినుంచీ జీవనాధికి జరగక గంగమ్మ చాలా యిబ్బంది పడుతూవున్నట్టున్నది. మీరు నిర్విచారంగా వుండండి. మీయిద్దరినీ నేనే పోషిస్తాను. నీవు మాపిల్లవాళ్ళను యెత్తుకుంటూ వుందువుగాని

ఎటుంది. మీరు రేపు వచ్చి మాతోటముంట్లో దిగండి. మీ వీరసంరక్షణ కనుక్కుంటూ వుండవలెను.

భ—(లేచి మోహినికిని రామాకాంతముపంతులకును నడుమ మోహినిని పొమ్మని సైగచేయుచు) మీకు పిల్లలు లేనిదీ యేపిల్లల నెత్తుకుంటుంది?

రామా—(కరటకకెడ్డిని వెనుకకు తోయుచు) ఆపని కాకపోతే మరివకపని చెప్తుతాను. ఈచిన్నది నేటినుంచీ పనిలో వున్నట్టే.

కర—(పని యొప్పుకోవద్దని వెనుకనుంచి సైగ చేయు చున్నాడు)

మోహి—నాకు పని వద్దు.

రామా—నీయిష్ట మైనపని చెయ్యనచ్చును. నీ కేపని చేత నవుకో చెప్పు.

మోహి—నా కేపని చేతకాదు.

రామా—ఏపనీ చేతకాకపోతే తోటమాలీ పువ్వులచెట్లకు నీళ్ళు పోస్తూవున్నాడో లేదో చూస్తూవుండువుగాని లే. మీరు రేపు వచ్చి మాయింట్లో ప్రవేశించండి. కరటకా! నీవు యీరాత్రి మన తోటయిల్లు ఖాలీ చేయించు.

మోహి—నేను మాయింటికి భోజనానికి వెళ్ళవలెను. నన్ను పోనియ్యండి.

రామా—నీకు తినడానికి పంచదారమిఠాయి తెప్పిస్తాను. వీక్షణనిముషం వుండు. మనము యిద్దరమూ తిందాము. కరటకా! నీవు పదుగెత్తుకుని వెళ్ళి నకపీసెడు పంచదారమిఠాయి పట్టుకుని రా.

మోహి—నేను మా అమ్మను అడిగి రావలెను.

రామా—నేను నిన్ను బండిలో తీసుకుని వెళ్ళి మీయింటివద్ద

దిగబెట్టి వస్తాను లే. తొందరపడకు. కరటకా! కదల మితాయీ పళ్ళూ తీసుకుని రా.

కర—(తనలో) నాకు చావుగా వున్నది. (ప్రకా) మోహినితల్లి యింటివద్ద కనిపెట్టుకొని వుంటున్నది. కూతురు ఏ రాకపోతే యేమిఅపాయము జరిగిందో అని మునలిది యేడిసిపోతుంది. ఈచిన్నదాన్ని వేగిరం పంపించివెయ్యండి.

రామా—ఆలాగైతే యీచిన్నది సుఖంగా వున్నదని నీవు పరుగెత్తుకొనిపోయి చెప్పి రా.

కర—(తనలో) నాకు మతి పోతూవున్నది. ఇప్పుడు యేమి చెయ్యడానికీ తోచకుండా వున్నది. తొందరపడి యేమయినా చేస్తే నాపనికి నీళ్ళు వదలుకోవలెను.

[మితాయిపొట్లము పట్టుకొని వెంకడు ప్రవేశించు చున్నాడు.]

వెంక—రెడ్డిగారూ! ఇదిగో మితాయి తెచ్చినాను.

కర—(తనలో) వీడుకూడా సమయానికే వచ్చినాడు.

రామా—వెంకా! పొట్లము యిలా తీసుకొని రా. ఇది మూగోసము. (అని పుచ్చుకొను చున్నాడు.) ఓరీ! నీవు వెళ్ళి బండి వాణ్ణి బండికట్టి సిద్ధముగా వుంచుమని చెప్పు.

వెంక—రెడ్డిగారి సెలవుప్రకారం నేను యిదివరకే చెప్పినా నండి. బండివాడు యెడ్లను కడుతూవున్నాడు.

రామా—(కరటకరెడ్డివంక చూచి) ఓరి దొంగా! నీ వన్నీ యిదివరకే యేర్పాటు చేసినావు! అందుచేతనేనా నేను పెళ్ళిమంటే పెళ్ళిక యేమీ యెఱుగనట్లు నటిస్తూ నిలుచున్నావు? ఎప్పుడో జరగ బోయే దంతా నీవు ముందుగానే కనిపెట్టి అన్నీ చెప్పకమునుపే జాగ్రతపెడుతూ వున్నావే! అన్నీ సరే కాని తల్లి యింటికాడ విచా

డా నీకూతురు భద్రముగా వున్న దని నీవు ముందుగా రావలెను. వేగిరం వెళ్ళు.

కర—ఈ వెంకణ్ణి పోయి చెప్పి రమ్మనరాదా?

రామా—ఈపనికి వెంకడు పనికిరాడు. వెంకణ్ణి వేరేపనిమీద పంపవలెను. ఇందుకు నీవే తగినవాడవు. నీవు అబద్ధాలు మహాబాగా చెప్పగలవు. నీశక్తి మటియెవరికీ రాదు. సమయోచితంగా నిమిషంలో కథ కల్పించి నమ్మేటట్లుగా నీవు బొంకుతావు. వెంకా! నీవు పల్లెలోకి తమలపాకులు వేసి పట్టుకుని రా.

కర—మీరు వూరికే నన్ను స్తుతిచేస్తూ వున్నారు. ఈ వెంకడు నాకంటెనూ యెక్కువఅబద్ధాలు ఆడుతాడు. వీణ్ణి పంపండి.

రామా—వీడు తే అబద్ధా లాడుతాడుకాని నీకుమల్లె కమ్మటట్లుగా చెప్పలేడు. నీవు అబద్ధమాడినా నిజంకంటెనూ దివ్యంగా వుంటుంది.

కర—అవునుగానండి—

రామా—అవునూ లేదు కాదూ లేదు. మీరుయిద్దరూకూడా తక్షణం పొండి. (అని కన్ను లెఱ్ఱజేసి కోపపడి కేకలు వేయుచున్నాడు)

వెంక—నేను వెళుతూవున్నాను. (అని పోవుచున్నాడు.)

కర—(తనలో) నేను కార్యం చెడగొట్టకపోతినా రెడ్డిని కాను. నీవు తే నేను పెళ్లిసోతాను కులకనలేదని సంతోషిస్తూవున్నాపు కాని—(అని వెళ్ళుచున్నాడు.)

రామా—నీవంటి చక్కనిది భూలోకంలో లేదు.

మోహి—అయ్యా! మీస్తుతికి నేను తగినదాన్ని కాదు.

రామా—ప్రియురాలా! నేను చెప్పినది వాస్తవము కానీ

స్తుతి కాదు. నీబుగ్గ లొక్క–సారి ముద్దు పెట్టుకోనిస్తావా

కర––(మరల ప్రవేశించి తొందరచేత చేతిలోని ఆ పళ్ళెము క్రింద పడవేయు చున్నాఁడు.)

రామా––ఓరి నిర్భాగ్యుఁడా! ఈ విస్మృతాన్ని నిష్కారణము బొదరకొట్టినావు. పళ్ళెము చప్పుడు విని వులికిపడి జాడుసుకున్నది.

కర––అయ్యో –– మీరు ముద్దు –– కాదుకాదు –– నేను పళ్ళెము––

రామా––(మిఠాయి పొట్లము విప్పి, ఉండలు మోహినిచేతిలో పెట్టుచు) మోహినీ! కూచుచో––ఓ నిర్భాగ్యుడా! నిన్ను పోయి మోహినితల్లితో వర్తమానం చెప్పి రమ్మంటే మళ్ళీ వచ్చినా వేమి? నీవు బుద్ధిపూర్వకంగానే పళ్ళెం పడవేసినావు.

కర––లేదు లేదు. తమలపాకులు మీకు నేను స్వయంగా తీసుకురావలెనని వెంకడిని అక్కడకు పంపినాను. మిమ్మలిని చూడగానే చెయ్యి నడుకెత్తి పళ్ళెం జారి పడిపోయింది.

మోహి––(తనలో) ఈసమయంలో మావాళ్ళు యెవరయినా వచ్చి చూచిపోతారేమో అని నాకు సిగ్గు వేస్తూవున్నది.

కర––(తనలో) నేను వీరిని విడిచి వక్కనిముషం అవతలకు వెళ్ళను. యేమిచేస్తారో చూతాము.

రామా––ప్రియురాలా! తినవేమి?

మోహి––మీరు చేసేఆదరణచేతనూ గౌరవంచేతనూ నాకు ఆకలి కనపడడం లేదు. (అని తిరుచున్నది.)

కర––(తనలో) అది మిఠాయి వుండలు యేలాగు మింగుతూ వున్నదో దాన్ని చూస్తే నానోరు వూట లూరుతూ వున్నది.

రామా––కరటకా! ఆత్రమలపాకులు ఇక్కడ పళ్ళెములో

తాయివుండలు యీచిన్నదానికి అండస్తూవుండు.

--(దగ్గరకు వచ్చి పళ్లెము బోర్లించు చున్నాడు.)

రామా--ఓ నిర్భాగ్యుడా! నీకు మతి పోయినట్లు వున్నదే. బోర్లించినా వేమి? అది తిన్నగా తీసి యీమితాయివుండ మోహిని కందియ్యి.

కర--(పుచ్చుకొని తానే తిను చున్నాడు.)

రామా--ఓరి నిర్భాగ్యుడా! నీకు పిచ్చి యెత్తినదా యేమి? (తనలో) దీని సౌందర్యం చూస్తే వీడికే ఆశ కలుగుతూవున్నట్టున్నది. అయినా వీడిమనస్సు పరీక్షచేసి చూస్తాను. (ప్రకాశముగా) ఈమె సౌందర్యం వర్ణించడానికి శక్యమైనది కాదు.

కర--ఆరంభంలో ఆలాగే కనుపడుతుంది కాని తరువాత--

రామా--ఆమందహాసము సొగసు చూచినావా?

కర--ఆపళ్ళు యికిలించడమా?

రామా--ఆకళ్ళఅందము కనిపెట్టినావా?

కర--చికిలికళ్ళు--

రామా--నీవంటిగుడ్డివాళ్ళకాలాగేకనపడతవి కాని మావంటి రసికులకు--

కర--(తనలో) ఈవ్యవహారం యింకా రెండు నిముషాలు యిలాగు జరుగుతూవుంటే నాకు నిజంగానే పిచ్చి యెత్తుతుంది.

రామా--ఓ మోహినీ! నీకు ప్రియు లెంద రున్నారు?

మోహి--ఒక్కడే.

రామా -- ఒక్కడేనా? ఆతడు మిక్కిలి చక్కనివాడు కాబోలును.

మోహి--ఆరంభములో ఆలాగే కనుపడుతాడు గాని తరు

వాత—ఏమయినా అంటే అతడు వంటరిగా వున్నప్పుడు తాడేమో అని భయము వేస్తూవున్నది.

రామా—అతనికి నీమీద అనుమానంకూడా వున్నదా?

మోహి—ఇప్పటిస్థితి చూస్తే అదికూడా వున్నట్టే కనపడుతూ వున్నది.

కర—ఇప్పుడు వెళ్ళి—(అని కాలు నేల తన్నుచున్నాడు)

రామా—అ దేమిటీ?

కర—ఏమీ లేదు. కాలు తిమ్మిరిగా వున్నది. (తనలో) ఇక నిజం చెప్పివేస్తాను.

రామా—వక్క-కాలే కాదు. నీకు వళ్ళంతా తిమ్మిరిగా వున్నట్టున్నది.

[ఆప్పుడు వెంకడు పరుగెత్తుకొని వచ్చుచున్నాడు.]

వెంక—అయ్యా! అమ్మగారు వస్తూ వున్నారు.

రామా—యేఅమ్మగారు రా?

మోహి—మాఅమ్మ వస్తూ వున్నదా?

వెంక—యేఅమ్మగారా? యేలినవారి భార్యాగారు. శ్యామలాంబగారు. నేను వెళుతూ వుండగా అమ్మగారిబండి యెదురుగా వస్తే నేను వెనక్కు పరుగెత్తుకొని వచ్చినాను.

కర—ఇక నేను బ్రతికినాను. నాకు మళ్ళీ ప్రాణాలు వస్తూ వున్నవి.

రామా—మీరు యీఆకులూ అన్నీ తీసివెయ్యండి. వేగిరం. కరటకా! నీ వీదొడ్డితలుపు తీసి మోహినిని యింటికి పంపించివెయ్యి. (అని తలుపువద్దకు పరుగెత్తుకొని పోయి) ఈపెరటితలుపు తాళము వేసి యున్నది. కరటకా! తాళంచెవి యేది?

—తాళంచెవా ?

రామా—అవును. తాళంచెవి వేగిరం ఇవ్వు.

కర—(దేహము తడవుకొనుచు) తాళముచెవి పోయింది.

రామా—అయ్యో! ఇప్పు డేమి చెయ్యను ? నాకు అసాధ్యం వచ్చినది. నాభార్యా బండి దిగి వస్తూవున్నది. కరటకా! నీ వీచిన్న దాన్ని యిప్పు డీవసారాలోకి తీసుకునివెళ్లు. నేను యెక్కురుగా వెళ్లి నాభార్యను తీసుకొని వస్తాను.

కర—మంచిది.

(అని మోహినితో వసారాలోకి పోవుచున్నాఁడు.)

[అప్పుడు శ్యామలాంబ ప్రవేశింపఁగా రామాకాంతముపంతు లెదురుగా పోవు చున్నాఁడు. మోహినిని విడిచి కరటుకరెడ్డి వచ్చు చున్నాఁడు.]

శ్యామ—ఓ ప్రాణేశ్వరా! మీకు తెలివి వచ్చినదా ? నేను మిమ్మల్ని చూడనేమోనని యేడుస్తూ వచ్చినాను.

రామా—ఈసోది యేమిటి? నీవు ఇప్పుడు పడిపోయినట్లు వంటరిగా యెందుకు వచ్చినావు ?

శ్యామ—మీరు దాచబోకండి. మీకథంతా నేను విన్నాను సుమా!

రామా—(తనలో) మోహినిమాట యెవరూ చెప్పలేదు గద. (ప్రకాశముగా) కథంతా విన్నావా? ఏకథ విన్నావు ?

శ్యామ—తాచుపాముకాటు బ్రతికినా చచ్చినా నాలుగు ఝూములలో తెలుస్తుంది. నాకు భూమిలో పసుపూ కుంకమూ పెట్టుకొని అయిదోతనం చెయ్యవలసినయోగం వున్నది గనుక నాపుణ్యం చేత మీరు సజీవులయి తేరుకున్నారు. మీరు చెప్పకపోయినా నాకు యీవృత్తాంతం చెప్పినది. (అని వృత్తాంతం చేతి కిచ్చు చున్నది.)

రామా— (ఉత్తరము పుచ్చుకొని చదువుచు) ఏ
వుత్తరం వ్రాసినదుర్మార్గుడు? నాకు రాత్రి తోటలో తా
కరించిందట! నేను స్పృహా తెలియకుండా పడి వున్నానట! నేను
కుతానో లేదో తెలియదట! దీనికింద దస్కత్తు లేదు. కరటకా!
యీపనస్తూకే యెవరిదో నీవు చెప్పగలవా? (అని చూపు చున్నాడు.)

కర—ఈపనస్తూరీ నాకు యెంతమాత్రమూ తెలియదు. ఇది
కొత్తవ్రాత. (తనలో) తన పెళ్ళాముతో యీయన తిరగడానికి వేగ
లేక గుమస్తా భీమారావూ నేనూ కలిసి వ్రాసినవుత్తరం వూరికే
పోలేదు. తగినపని చేసింది.

శ్యామ—ఇది దొంగవుత్తర మయినందుకు నాకు సంతోషంగా
వున్నది. మీ కేమీ తొందర కలుగలేదుగదా?

కర—పాముకాటు మహాచెడ్డది. దానివల్ల యెంతఅపాయ
మయినా వున్నది. ఈయన యెప్పుడూ భార్యను విడిచి వంటిగా
వుండకూడదు.

శ్యామ—నీవు కూడావున్న తరువాత భార్యలేనిలోపం వుండదు.
ఇటువంటిది ముందు యెప్పుడయినా మళ్ళీ తటస్థిస్తే నాకు ముందుగా
వర్తమానము పంపుమా.

కర—తప్పకుండా పంపుతాను. ఇక నాలుగురోజులకు తటస్థ
మవుతుం దనగానే మనిషిని పంపుతాను.

రామా—అయినదానికి విచారించిన కార్యమూ లేదు. మనము
లోపలకు వెళుదాము రా. (కరటకకర్ణితో రహస్యంగా) మేము వెళ్ళ
గానే మోహినిని అవతలికి పంపివెయ్యి.

శ్యామ—నాకు చెమట పట్టింది. లోపలికి రాను. కొంచెము
సేపు చల్లగాలికి యీవసారాలో మల్లిపందిరిదగ్గిర కూర్చుంటాను.

రోజూ సీళ్ళు పోయిస్తూవున్నారా?

మా—వసారాలోకా?

శ్యామ—వసారాలోకే వెళ్తుతాను.

రామా—(కరటకరెడ్డితో రహస్యంగా) నీ వేదో మాయో పాయం కన్పించి బొంకవలెను. తక్షణా యేదో అబద్ధం కల్పించి నామానం దక్కించు.

కర—అమ్మా! వసారాలో యెవరున్నారో మీకు తెలియదు. నన్ను క్షమించవలెను.

శ్యామ—వసారాలో యెవరున్నాగు? నిన్ను క్షమించడానికి యేంనేరం చేసినావు?

కర—ఒక చక్కనిచిన్నదాన్ని నేను తీసుకువచ్చి—

రామా—(తనలో) వీడు నాగుట్టు బయలపెడుతూ వున్నాడు.

శ్యామ—ఏమీ! నేను లేనిసమయంలో నాయింటికి ఆడదాన్ని తెచ్చినావా?

రామా—(కోపముతో) చక్కనిచిన్నదానా? కానీ చెప్పు చెప్పు.

కర—నేను చెప్పేది చివరదాకా వినండి. నాకు చెప్పడానికి సిగ్గు వేస్తూవున్నది. మీయిద్దరికీ కోపం తెప్పించడానికి కారణమయిన అనిర్దోషురాలు నాపెళ్ళామ.

రామా—నీభార్యా?

శ్యామ—నీపెళ్ళామా?

కర—అవును నాపెళ్ళామే. పంతులుగారు నీవునీమిత్తమయి మంచిదాసిని కుదుర్చుమని నాతో చెపితే నాపెళ్ళాము పెద్దమనిషి వళ్ళువంచి పనిచేసేదీ అని తీసుకుని వచ్చినాను. అమ్మగారు కొన్నాళ్ళు

చూచి తమమనసు వచ్చినట్లు పనిచేసేదని తోస్తే ది భార్యాభర్తల నిద్దరనీ పోషించేభారమే మీది.

రామా--(తనలో) వీడు బహుబాగా బొంకినాడు. వీడు చెప్పినది వక్కఱమయినా నిజం కాదనడానికి లేశమయినా ఆకాశము లేదు.

శ్యామ--నాకోసము శ్రమపుచ్చుకొని మీరు దాసీనిమిత్తము యింతప్రయత్నం చేసినందుకు నాకు సంతోషంగా వున్నది. కరటకా! యేదీ నీభార్యను నాకు చూపించు.

కర--రండి వెళ్ళి చూతాము.

(కరటకరెడ్డియు శ్యామలాంబయు పోవుచున్నారు.)

రామా--ఔరా! రెడ్డి! యెంతచక్కగా బొంకినావురా? నా కదివరకు నిజం తెలిసివుండకపోయినట్టయితే చెప్పినదంతా నేనూ నమ్మేదును. వీడు నిముషంలో ఆకొత్తదాన్ని పెళ్ళాముగా మార్చివేసినాడు. యెలాగయినా యీ అపూర్వవివాహంవల్ల మాదంపతులకు కలహం తప్పిపోయింది. నేటికి నేను బ్రతికినాను.

[శ్యామలాంబ ప్రవేశించుచున్నది.]

శ్యామ--నేను మన రెడ్డిపెళ్ళామును చూచినాను. దానివద్ద వినయమూ తెలివీ కావలసినంత వున్నవి. అది శూద్రదయినా యెంతో చక్కగా మాట్లాడినది. దాని కపటంలేనిమాటలు వింటే నాకు బహుసంతోషమయినది.

రామా--అది నీమనసుకు నచ్చినదిగద?

శ్యామ--చివరకు నాకు మంచిదాసీ దొరికింది. మనరెడ్డి దానిమీద ప్రాణములు విసుస్తూ వున్నాడు. మొగుడూపెళ్ళామూ యిద్దరూ మనుష్యుల్లు కనిపెట్టుకు వుంటారు. వాళ్ళ అనురాగమూ

వాస్తే నాకు ముచ్చ టవుతూ వున్నది.

రా—(తనలో) వాడు యెంతసేపటికీ కదలి రాకుండా దొడ్లో దానితో యేమి చేస్తూవున్నాడు?

శ్యామ—యీఅద్దంలో వాళ్లు కనుపడుతూ వున్నారు. మన రెడ్డి పెళ్ళామును యెలా ముద్దు పెట్టుకుంటూ వున్నాడో?

రామా—పట్టపగలు ఆడదాన్ని వా డలాచెయ్యడం నీకు యిష్టముగా వున్నదా?

శ్యామ—మొగుడు పెళ్ళామును ముద్దుపెట్టుకుంటే అందులో తప్పేంవున్నది?

రామా—తప్పితం లేదుగాని నేను వక్కమాటు కరటకరెడ్డిని కూకలు వెయ్యవలెను. నీ వవతలకు పో.

శ్యామ—పెళ్లామును ముద్దు పెట్టుకొన్నందుకు కాదుగద?

రామా—అందుకోసముకాదు. మరొకందుకు కూకలు వేస్తాను.

శ్యామ—ఆలాగైతే నేను లోపలికి పోయి వాళ్లుకాపురం వుండడానికి దంపుళ్ళగది చోటుచేయించి వస్తాను. (అని వెళ్లుచున్నది.)

[అప్పుడు కరటకరెడ్డి ప్రవేశించు చున్నాడు]

రామా—అప్పుడే మీరు రావడానికి తీరుబడి అయిందీ? యిరతవేగిరం దయచేశా రేమి?

కర—(శ్యామలాంబకు వినబడునట్లు బిగ్గరగా) క్షమించండి నాభార్యతో—

రామా—(మెల్లగా) నీభార్యా?

కర—అవును నాభార్యా. అమ్మగారు దాన్ని తమపనికత్తెగా వుంచుకోవడానికి వప్పుకున్నారుగనుక, ఆమెవద్ద యెలాగు నడుచుకో

వలెనో దానికిబుద్ధిచెపుతూ వున్నాను. మీరుయెరుగుదు

రామా—నీవు వట్టిరుూహాకోరువస నేను యే యిలాగంటి పనులు చెయ్యకుండా నిన్ను గుర్రపుకొడాతో బద్దలుకొట్టనలెను.

కర—ఈపరియాచకం బాగానే వున్నది.

రామా—బాగానే వుంటుంది. తెలివితక్కువదాన్నిచేసి నీ వాచిన్నదాన్ని చెరపడానికి చూస్తూవున్నావు. మాయింట్లో యిటు వంటిసీతిమాలినపనులు యెంతమాత్రమూ పనికిరావు.

కర—దైవముతోడు! నిజముగా అది—

రామా—నావద్ద నీఅబద్ధపుప్రమాణాలు గిమాణాలు సాగవు. నీ వాచిన్నదాన్ని యెందుకు ముద్ద పెట్టుకున్నావో చెప్పు.

కర—(తనలో) యెవరూలేనప్పుడు నేను రహస్యంగా ముద్దు పెట్టుకున్నసంగతి యితనితో యెవరుచెప్పినారో ఓయి దేవుడా! ఇక్కడ గోడలకుకూడా చెవులు వున్నవికదా?

రామా—నీవు మళ్ళీయేదో పెద్దఅబద్ధమాడడాని కాలోచిస్తూ వున్నావు. నీమాటలకు నేను మోసపోను.

కర—నేను అబద్ధం యెంతమాత్రమూ ఆడను. నిజంగా నేను మోహినిని ముద్దుపెట్టుకున్నాను. మీరు నమ్మినాసరే నమ్మకపోయినా సరే నిజం చెప్పినాను.

రామా—యెందుకు పెట్టుకున్నావు?

కర—మీకోసమే ముద్దుపెట్టుకున్నాను. అమ్మగారిమనస్సులో మీయందువుండే అనుమానం పోగొట్టడానికి నే నాపనిచేసినాను. నేను చేసినపని మీ క్షేమంనిమిత్తమేకాని నానిమిత్తంకాదు. సేవకులు యజమానులనిమిత్తమయి యెంతపని చేసినా వారికి మెప్పు కనుపడదు.

—అనుద్దు నాకోసంకాకుండా నీ కోసమే పెట్టుకున్నా యిప్పటికీ అనుమానము బాధిస్తూనే వున్నది. అదుగో యిలాగే వస్తూవున్నది. నేను లోపలికిపోయి యీతలుపు చాటులోనుంచి మీయిద్దరిచర్యలూ కనిపెడుతూవుంటాను. నీవు నన్ను మోసం చెయ్యలేవు.

కర—అయ్యా! మోహిని వకవేళ వచ్చి మోహించి నన్ను యేమయినాచేస్తే అదీ నాతప్పితమేనా? ఆడవాళ్లు వచ్చి యెదుట నిలవ బడ్డప్పుడు మగవాళ్లు మనసుపట్టలేరు. మీవిషయంలో నాశాయ శక్తులా పనిచేస్తానుగాని వకవేళ ఆచిన్నది తనంతట వచ్చి నన్ను—

రామా—దానికి ఫర్వాలేదు. నీవుమాత్రం మళ్ళీ యెప్పుడూ ముద్దు పెట్టుకోకూడదు. యీసారి నీవు మళ్ళీముద్దుపెట్టుకున్నట్లయితే నిన్ను గుర్రపుకొరడాతో చావగొట్టి మాయింట్లోనుంచి సాగనంపు తాను (అని లోపలికి పోయి తొంగి చూచు చున్నాడు)

[మోహిని ప్రవేశించు చున్నది.]

మోహి—ఆమె బహుదొడ్డయిల్లాలు. యిక మనరహస్యం మానివేసి మనం యిక్కడ సుఖంగా వుండవచ్చును.

కర—మెల్లిగా మాట్లాడు! మెల్లిగా. (తనలో) ఇది యెంత సొంజ్ఞచేసి చెప్పినా మెల్లిగా మాట్లాడకుండా వున్నది. నేను జవాబు చెప్పితే నాపని పోతుంది. చెప్పకుండా వుంటే పెళ్లాము పోతుంది. నా కంతా అసాధ్యంగానే వున్నది.

మోహి—నీవు నామొగుడ వని నే నిప్పు డందరితోనూ చెప్ప వచ్చును.

కర—(నవ్వుచు) నీమొగుడా! ఈరహస్యం కొంచెముసేపు చాలించు. అది యెల్లప్పుడూ పనికిరాదు.

మోహి—నీవు నాకు మొగుడవడం హాస్యా నుంచీ మనం మొగుడూ పెళ్ళాలూ కావడ మంతా యి: మయిపోయిందీ? (అని మొగముకు కొంగడ్డముపెట్టుకొని యే మంచిది యిప్పుడు నీవు నన్ను విడిచిపెడితే నాకు మొగుళ్ళు దొరకపోరులే. నాకు యిలాగంటిమొగుళ్ళు లక్షమంది దొరుకుతారు. నీవు వదలిపెడితే రేపు యీపాటికి నేను విధవావివాహం చేసుకుంటాను చూడు.

కర—(తనలో) నేను యిప్పుడు దీన్ని సముదాయించకపోయి నట్టయితే కార్యం చెడుతుంది (తనయజమానుడాగదిలో నున్నాడని సైగచేయుచు మెల్లగా) నేను నీ పెనిమిటినే, అందుకు సందేహము లేదు. కాని నాయజమానుడు—నేను స్వతంత్రుణ్ణి అయితే—మోసంచు తెలిసిందా?

మోహి—నాకు తిన్నగా తెలిసిందికాదు కాని వక్కముద్దు పెట్టు మోసిస్తాను.

కర—(తలుపుకేసి చూచి తనలో) నేను చొరవచేసి వక్కముద్ద పెట్టుకుంటాను.

మోహి—యేమి యింకా ముద్దుపెట్టుకోవడానికే అనుమానిస్తూ వున్నావేమి? పోనీ! నేను యిప్పుడు పోయి నీదుర్మార్గ మంతా అవ్వగారితో మనవిచేస్తాను.

కర—ఓభగవంతుడా!

మోహి—నేను పంతులుగారితోకూడా చెప్పుతాను. ఆయన బహుదొడ్డవాడు. నీవలె నన్నాయన అనాదరణ చెయ్యడు.

[శ్యామలాంబ ప్రవేశించు చున్నది.]

శ్యామ—ఏమిటి? మీరిలోమీరరచ్చపడే తగవులాడుకున్నారా?

అమ్మా ! తప్పితం దానిదికాని నాది కాదు.

కాహి - అమ్మా ! తప్పితమంతా ఇతనిదే. నేను తనకు చ్యబోతే పుచ్చుకున్నాడుకాను.

శ్యామ—యేమిటి! పెళ్ళిను ప్రేమతో ముద్దుయిస్తే పుచ్చుకున్నావుకావా? ఏది ఇవ్వమని నాయెనుట ముద్దు పెట్టుకో.

కర—(తలుపుకేసిచూచి) యిఖ నాతప్పితం లేదు (అని ముద్దు పెట్టుకొని) మోహినీ! జరిగిపోయినది మరచిపో. యిఖ నేను నీవుచెప్పినట్లు వింటాను.

రామా—(తలుపు తీసికొనివచ్చి కోపముతో) నేను యింత దూరము చెప్పినా నిర్భయింగా నీవు మళ్ళీ ముద్దు పెట్టుకున్నావుగా !

మోహి—అయ్యా! నాపైనిమిటిమీద కోపపడకండి.

రామా—(తనలో) పైనిమిటా? ఇదికూడా హాస్యానికన్న మాటే నిజిం చేస్తూవున్నదే. (ప్రకాశముగా) నేను యిప్పుడు వీడిపని తీసివేస్తాను.

శ్యామ—మీరు నిష్కారణంగా పని తీసివెయ్యకూడదు.

రామా— నిష్కారణంగా కాదు. కావలసినంతకారణం వున్నది. ఆకారణ మేమో రెడ్డికే తెలుసును.

కర—నాకా? నాకు యేకారణమూ తెలియదు.

రామా—నీకు కారణమేమీ తెలియదు గా?

శ్యామ—రెడ్డీ! నీవు మారుమాట యేమీ చెప్పవద్దు. మీ దంపతులు యిద్దరూ దంపుళ్ళగదిలోకి పొండి. నేను తరువాత ఈయనను సమాధానం చేస్తాను.

మోహి—రెడ్డీ! వెళుదాము రా.

శ్యామ—మీరు నిజముగానే వీళ్ళను పంపించివేస్తారా?

రామా—నేనుకాదు. నీవే పంపించి వేస్తావు. నట్టయితే వాళ్ళిద్దరూ మొగుడూ పెళ్ళాలు కారు.

శ్యామ—కారా?

రామా—కారు.

మోహి—(మగనితో) మనం వివాహ మయినసంగతి యీయనకు తెలియనే లేదా?

కర—వూరుకో.

శ్యామ—నా కీమాయ తెలియకుండావున్నది. వాళ్ళిద్దరూ కూడా బహుమంచివాళ్ళుగా కనపడుతూవున్నారే.

రామా—పయికి మంచివాళ్ళుగానే కనపడుతూ వున్నారు. వాళ్ళు నిజంగా భార్యాభర్తలయితే నాళ్ళను వెళ్ళగొట్టడానికి నాకు మాత్రం యిష్టం వుంటుందా?

కర—మేము పెళ్ళిచేసుకున్న మొగుడూ పెళ్ళాల మయినమాట నిజమయినట్టయితే మమ్మలిని వెళ్ళగొట్టడం మీకు యిష్టం లేదుగద? అలాగయితే దీనినిజమంతా ఆ వచ్చే శాస్త్రుల్లుగారు చెపుతారు. ఆయ ననుఅడగండి.

[అప్పుడు సోమభట్లు ప్రవేశించు చున్నాడు.]

రామా—అయ్యా! సోమభట్లుగారూ! నమస్కారము. మీరు యేంపనిమీద వచ్చినారు?

సోమ—ఈరోజున మీతండ్రిగారి తిథిప్రయోజనము. నిన్నటి రాత్రినుంచీ మీకోసం తిరుగుతూవుంటే మీదర్శన మయిందికాదు. వుదయమైనతరువాత నాలుగుమాట్లు యిక్కడకు వచ్చినాను. మీరు వంటిపుంటవఅకూ యింటికే రాలేదు.

రామా—అవును మా ఆడవాళ్ళు వూళ్ళో లేకపోవడంచేత

యింట్లో భోజనం చేసినాను. మీరు యీసంగతి చెప్పబోకండి. అంతగా కావలిస్తే తద్దినం రేపువుదయాన్న చాము.

సోమ—చిత్తము. ఆలాగే కానిత్తాము. నాకు నాలుగు రోజులలో తూర్పు వెళ్ళవలసినపని వున్నది. వెళ్ళితే నాలుగునెలల దాకా రానండి. ఈలోగా తమలోపలవచ్చే కార్యాలు మరియేమీలేవు.

శ్యామ—ఏమయ్యా బ్రాహ్మడా! నీకు వూరికి వెళ్ళనలసినపని వున్నదని యింతకక్కుర్తిపడుతావు? మామూమగారుపోయింది వైశాఖ మాస మయితే యీచైత్రిమాసంలో తద్దినం యేలాగువస్తుండయ్యా?

సోమ—అమ్మగారు! కోపపడకండి. నేను పంచాంగం పొర పాటుగా చూచినానుకాబోలును. మళ్ళీవెళ్ళి తద్దినాలజాబితా తిన్నగా చూచి వస్తాను. (అని పోఁ బోవుచున్నాఁడు.)

కర—(ఆపి) అయ్యా! మీరు మాయిద్దరికీ పెళ్ళిచేయించిన సంగతి యీయనతో వక్కసారి చెప్పి మరీపోండి.

సోమ—అవును. అందులో యేమితగాదా వున్నది? నేను మంత్రాలు తిన్నగా చెప్పలేదని యెవరయినా ఆక్షేపణచేసినారా యేమిటి? శూద్రపెళ్ళి, పురాణోక్తం గనుక మంత్రాలక్కరలేదు.

రామా—వీళ్ళకు మీరు పెళ్ళి యెప్పుడు చేయించినారు?

సోమ—రెండుసంవత్సరాలక్రిందట చేయించినాను.

రామా—కరటకా! నీవు రెండుసంవత్సరాలనుండి గృహస్థు పై వుండిస్నీ నావద్ద బ్రహ్మచారివిగానే నటించినావా?

కర—నేను వూరికే బ్రహ్మచారిగా నటించడం మాత్రమేకాని నిజానికి సంసారసుఖాలన్నీ అనుభవిస్తూనే వున్నాను. లోకంలో అనేకులు పేరుకు గృహస్థులనుని నటిస్తూవున్నా మీరుదయవల్ల సంసారీ

సుఖం లేకుండా నిజమయిన బ్రహ్మచారులుగానే వున్నా దేవరవారికే విశదము.

రామా—ఆసంగతి నీవు చెప్పనక్కరలేదు. నీవు దీన్ని డినమాట నిజమేనా!

కర—నిజమే. ముమ్మాటికీ నిజమే.

రామా—అన్నీ అబద్ధా లాడేవాడవు నీవు యిందులోమాత్రం నిజం చెప్పివుంటావా?

కర—యీవేళ నేను నిజం చెప్పడానికి ఆరంభం చేసినాను. దేవరవారు నేను యిఖ గృహస్థబ్రహ్మచారినిగా వుండవలసిన ఆవశ్యకం లేకుండా చేస్తే నేను నేటినుంచి సత్యహరిశ్చంద్రుణ్ణి అవుతాను.

రామా—కరటకా! ఇందాకటి నీఅవస్థలు తలుచుకుంటే నాకు నవ్వు వస్తూ వున్నది. ఇప్పుడు జరిగినదంతా మటీచిపోయి మీరు యిద్దరూ యిఖ మాయింట్లో సుఖముగా వుండవచ్చును. నేను యిఖ ముందు నీవు చెప్పిన గృహస్థబ్రహ్మచారులను నిజమైనగృహస్థులనుగా చెయ్యడానికే ప్రయత్నంచేస్తాను. లోపలికి పోదాము రండి.

కర—అలాగయితే మాకు యిదివరకు జరిగినవివాహం వివాహంకాదు. ఇప్పుడు మీరు జరిగించినదే వివాహము. నాబ్రహ్మచర్యం వదలి మీదయవల్ల నేను యిప్పుడు నిజమయిన గృహస్థు నవుతూ వున్నాను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

౩౦

చత్రివివాహప్రహసనము



ఇందు వచ్చుపాత్రములు.

ధనకోటిరాజుగారు——హైకోర్టువకీలు.

వేంకటపతిరాజు——ధనకోటిరాజుగారిఅన్నకుమారుఁడు.

తిమ్మయ్య——ధనకోటిరాజుగారిభట్టుఁడు.

మోహినీదేవి——రతిసుందరిమేనత్త.

రతిసుందరి——మోహినీదేవిమేనకోడలు.

రంగము——చెన్నపట్టణము. ధనకోటిరాజుగారికచేరీగది.

[వాఁతబల్లవద్ద కూరుచుండి వేంకటపతిరాజు ప్రవేశించు చున్నాఁడు.]

వేంక——(బల్లమీఁది కాగితములును కలములును క్రింద త్రోచి వైచి కోపముతో) వెధవపని. నేను యిఁక యీపని చూడను. యెన్ని మాట్లు అడిగినా చిన్నాయన పెళ్ళికి యిప్పు డేమితొందర వచ్చిం దంటాడు. నాకు యిప్పుడు యిరవైయేళ్లు కావచ్చినవి; బియ్యే ప్యా సయినాను. ఇంకా యెన్నాళ్ళు బ్రహ్మచర్యం చేస్తాను? చిన్నాయన వచ్చినతరువాత యీమాటు స్పష్టంగా అడిగి, పెళ్ళి చెయ్యనంటే దేశాంతరం లేచిపోతాను. గుమస్తా లేకుండా యీబండపని నేను చేస్తూ కూర్చుంటానా? (అని కలము క్రిందవేసి కోట్టు చున్నాఁడు.)

[ఇంతలో ధనకోటిరాజుగారు ప్రవేశించు చున్నారు.]

ధన——ఓరినిర్భాగ్యుఁడా! కాగితాలన్నీ అలాకింద వేసినావేమిరా?

వేంక—నేను యీపని నేర్చుకోను. నాకు దీనిపై యిష్టము లేదు.

ధన—నీవు నట్టికోతివి నీకు యేపనియందూ యిష్టం

వేంక—నీవు నాచేత ప్రొద్దున్న మొదలుకొని సాయంత్రం దాకా నట్టివెట్టిపని చేయిస్తావు. నేను చెయ్యలేను.

ధన—పనిపాటలు లేకుండా వూరికే సోమరిగా కూర్చుండి భోజనం చెయ్యగలవా?

వేంక—ఇదివరదాకా చూచినట్టు నన్ను యిక పిల్లవాణ్ణిగా చూస్తే పనికిరాదు. నేను యిప్పుడు పెద్దవాణ్ణి అయినాను.

ధన—అయితే యేమంటావు?

వేంక—నేను మీ అన్నగారి కొడుకును గానా?

ధన—అయితే?

వేంక—అయితే గియితే అంటే పనికిరాదు. నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పండి. మీవద్ద డబ్బు వున్నదా లేదా?

ధన—ఇప్పుడు నా డబ్బుసంగతి నీ కెందుకు?

వేంక—నన్ను మళ్ళీ ప్రశ్నలు వెయ్యక నేను అడిగినప్రశ్నకు వుత్తరం చెప్పండి. మీరు భాగ్యవంతు లవునురా కారా? జవాబు చెప్పండి.

ధన—(కోపముతో) నేను భాగ్యవంతుణ్ణికాను. నీకు యిప్పుడు కావలసింది యేమిటి?

వేంక—నాకు కావలసిందా? మొట్టమొదట మీరు మీఆఫీసు పని చూడడానికి వేరే గుమస్తాను పెట్టుకోండి. అటుతరువాత మీ ఆస్తిలో నాకు భాగం పంచిపెట్టండి.

ధన—నాది స్వార్జితం. నీకు భాగం యెట్లా వస్తుంది?

—ఈమధ్య హైకోర్టువారు క్లీడరీవుద్యోగంవల్ల సంపా
లో భాగం వస్తుందని తీర్పుచేసినారు.

ధన—(తనలో) వీడు సామాన్యుడు కాడు. (బిగ్గరగా) పని
నందుకు నీకు మంచిజీతం యిసానులే.

వేంక—జీతమా? వెధవజీతం. నీవు జీతం యివ్వకపోతే నాకు అన్నానికీ బట్టకూ జరగదా?

ధన—అన్నమూ బట్టాకంటె నీకు యింకా యేమి కావలెను?

వేంక—యేమికావలెనా? నాకు పెళ్ళాము కావలెను.

ధన.—(ఉలికిపడి) ఏమికావలెనూ?

వేంక—పెళ్ళాము.

ధన—పెళ్ళామా?

వేంక—అవును. పెళ్ళామే. నాకు పెళ్లయినా చెయ్యండి. లేకపోతే నేను గృహస్థాశ్రమంలో ప్రవేశించి సుఖజీవనం చెయ్యడానికి తగినంత సొమ్మయినా యివ్వండి.

ధన—నీకు పెళ్ళికి సొమ్ము యివ్వవలెనుగా?

వేంక—నేను పెళ్ళాడడం మీకు యిష్టం లేదా?

ధన—(కోపదృష్టితో) లేదు. లేదు. ముమ్మాటికీ లేదు.

వేంక—అలా కోపపడడం మీకు ధర్మం కాదు.

ధన—ఓరి దౌర్భాగ్యుడా! నీకప్పుడే భార్య కావలెనేమి? భార్యను యేమిచేసుకుంటావు? నాభార్య పోయి అంతకాల మయింది. నేను మళ్ళీ భార్యాను చేసుకోలేదు. భార్యా? ఆమాట తలుచుకుంటే నాకు భయం వేస్తూవున్నది.

వేంక—భార్యా అంటే భయమా? సంతోషమని మీ అభిప్రాయం కాబోలును. ఇంట్లో భార్యా వుంటే యెంతసంతోషంగా

వుంటుంది.

ధన—సంతోషం గాను మఃఖంగానే వుంటుంది. నేను స్వానుభవంచేత చెపుతూ వున్నాను. ఆడవాళ్ళు బహుగయు వాళ్ళు. భార్యా రావడం అనేఆపద పగవాడికయినా కోరగూడదు. పిల్లవాళ్ళూ బుద్ధిహీనులూ తప్ప మరియెవరూ పెళ్ళి కావలెనని కోరరు.

వేంక—మీరాలుబ్ధిత్వంచేతనే బ్రతికివున్న కాలంలో మూపిన్ని గయూళిదయి పోయుంది. దాన్ని బట్టి ఆడవాళ్లందరూ గయ్యాళివాళ్లనడం న్యాయం కాదు. ఇప్పుడు మీరు స్త్రీలు మంచివాళ్లు కారని యెంత మూపిస్తూవున్నా, మీరునూడా యెప్పుడో స్త్రీలవలలో పడి పెళ్ళి కావలెనని కోరేకాలం వస్తుందికాని రాకపోదు లెండి.

ధన—నేను పెళ్ళి కావలెనని కోరేకాలమా? యెన్నటికిన్నీ రాదు. నేను భార్య కావలెనని కోరేటంత గాసిన నయితే, అప్పుడు నేను నీకు—

వేంక—అప్పుడు నాకు యేమి యిస్తారు?

ధన—ఏమయినా యిస్తాను.

వేంక—ఖరవైవేలరూపాయలు యిస్తారా?

ధన—తప్పకుండా యిస్తాను.

వేంక—కాకేనా?

ధన—నీకే యిస్తాను.

వేంక—అన్నమాట తిరిగిపోకూడదు సుమండీ.

ధన—నేను యెప్పుడూ తిరిగిపోను.

వేంక—చేతులో చెయ్యి వెయ్యండి.

ధన—ఇదుగో వేస్తా.

(అని చేతిలోచేయి వేయుచున్నాడు.)

--అలాగయితే నేను వివాహం కావడం మీకు బొత్తిగా లేదా?

ధన --ఎంతమాత్రమూ యిష్టము లేదు. అయినా ఆలోచించి చెపుతాను. వకీలునిముషం తాళు. (ఆలోచించి) వకీలయితే నీవివాహానికి నేను యిష్టపడుతాను.

వేంక--(ఆసతో) ఎలాగయితే పడుతారు?

ధన--నీవు వివాహమాడబోయే చిన్నది యిరవైవేలరూపాయలు అర్జణం తీసుకుని వచ్చేదయితే నేను యిష్టపడుతాను. ఇక యిప్పటి కీప్రసంగం చాలించి, నేను ఘంటసేపట్లో మళ్ళీ వస్తాను. అందాకా పని చూస్తూవుండు. (అని వెళ్ళుచున్నాడు.)

వేంక--యింత నడివయస్సులో స్త్రీలవిషయము యితని మనస్సు చలించకుండా వుండడంచూస్తే, యితణ్ణి సృష్టించేటప్పుడు బ్రహ్మదేవుడు యితనిహృదయం రాతితోనో యినుముతోనో చేశాడని తోస్తుంది. ఓరతిసుందరీ! నాపినతండ్రిప్రతిజ్ఞ విన్నట్టయితే నీవు యెంత విచారిస్తావో! ఓహృదయేశ్వరీ! నేను యేమిచెయ్యను? అతని యిష్టం లేకుండా నిన్ను నేను యెలాగు పెళ్లిచేసుకోగలను? (అని లేచి యిటు నటు తిరుగుచు) యెవరోవస్తూవున్నారు. యెవరయి వుందురు? (కిటికిలోనుంచి చూచి) ఆమే. అవును. కాదు ఆమెకాదు. అవును. ఆమే. ఆవచ్చేది తప్పకుండా రతిసుందరి మేనత్త అయిన మోహినీదేవే. యీమె రతిసుందరికి తండ్రి తోడబుట్టిన దయినా, మంచిస్వభావంగలది గనుక మేనకోడలి సౌఖ్యంనిమిత్తమయి యేకష్టాలయినా పడుతుంది. (అని తలుపువద్దకు వెళ్లి) మోహినీదేవీ! అమ్మా! లోపలికి రా.

[అప్పుడు మోహినీదేవి ప్రవేశించుచున్నది.]

మోహి--(మెల్లగా) మీపినతండ్రి గారు రెక్కడ వున్నారు?

వేంక—ఆగదిలో యేదోజరూసుపని చూచుకుంట

(అని చూపుచున్నా

మోహి—అలాగయితే మనకార్యం మనం వేగిరం కోవలెను. నీవన్నప్రకారంగా నీవీవేళ యెందుకురాలేదో తెలుసుకుని రమ్మని రతిసుందరి నన్ను పంపినది.

వేంక—అయ్యో! మోహినీదేవీ! నాకు బహువిచారంగా వున్నది. రతిసుందరీ! న్నాప్రియురాలా! యీవార్త వింటే నీ వెంతదుఃఖిస్తావోకదా? యీవేళ అంతాఘరిష్కారమయింది. రతిసుందరీ నేనూ సుఖపడేయోగం దాటిపోయింది.

మోహి—ఎందుచేత? నీమాటలతాత్పర్యం యేమిటో నాకు తెలియకుండా వున్నది.

వేంక—మాచిన్నాయన ఇప్పుడు నాపెళ్లికి వప్పుకున్నాడు కాడు.

మోహి—ఎందుచేత? అతనికి యిన్నియేళ్లువచ్చినా వివేకం లేకుండా కేవల పశువుగా వున్నాడే. తాను పెళ్లాడలేదని అందరికీ పెళ్లి అక్కరలేదంటాడా?

వేంక—మాచిన్నాయన తాను యెనరో అయితేనేకాని పెళ్ళాడడం తటస్థించ దన్నాడు. ఆపేరుమాత్రం నేను నీతో చెప్పను.

మోహి—నేను మీచిన్నాయనకు, భార్యను అయి వున్నట్టయితే అతన్ని నేను చెప్పినట్లెల్లా వినేటట్టుచేసి నిమిషంలో యీయభిప్రాయమంతా మార్చివేస్తును.

వేంక—ఇందాకా చాలాసేపు ఆయనకూ నాకూ వివాహం విషయమయ్యే ప్రసంగం జరిగినది. ఆప్రసంగంలో నేను మాచిన్నాయనతో మీకు యిదివరకు స్త్రీలవిషయంలో కలిగిన అసూయ అంతా

అప్పుడో పక్కప్లాను మీకుకూడా పెళ్లి అవుతారని అనే మాచిన్నాయనగారు తానటువంటిగాడివ కావడం తటస్థిస్తే జువనే నాకుయిరవై వేలరూపాయలుయిస్తానని పందెంవేసినారు. ఇకు యిప్పుడు ముప్పయియేళ్లయినా నిండాలేవు. నీవు యేవుపాయం చేతనైనా మాచిన్నాయనగారిమనస్సు చలింపచేసినట్టయితే, ఆయన ఖజానాలోనుంచి యిరవైసంచులు కదిలి నాచేతులోకి వస్తవి.

మోహిా—గతిసుందరియొక్క సౌఖ్యంనిమిత్తం నన్ను యేమి చెయ్యమన్నా చేస్తాను. దానికి తల్లి నాలుగోయేట పోయినది. ఎనిమి దేళ్లు వచ్చేటప్పటికి దానితండ్రి నాఅన్నగారుకూడా హైకోర్టువకీలుగా వుండి కాలంచేసినాకు. నాఅన్నగారు పోయేటప్పటికి నాకు పద్దెనిమి దేండ్లుమాత్రమేవున్నా, తల్లిదండ్రులు లేనిబిడ్డ అని దానిసంరక్షణ నిమిత్తమే నేను వివాహంకూడా మానివేసినాను. దానికి యిప్పుడు పదహారేళ్ళవున్నవి. మీచిన్నాయనను మోహపుచ్చడం యెంతప్ర యాసమయినపని అయినా, మా రతిసుందరికీ నీకూ వివాహం సంఘ టనచెయ్యడానికి యెన్ని పాట్లయినా పడుతాను.

వేంక—ప్రయత్నంమాత్రం చెయ్యి. నీవు నిజంగా నాపినతం డ్రిని పెళ్లి చేసుకోనక్కరలేదులే.

మోహిా—నాఅన్నగారికిన్నీ నీపినతండ్రికిన్నీ పూర్వం చాలా స్నేహంసుమా. వారిద్దరూ బాల్యస్నేహితులు.

వేంక—ఆలాగా? ఆలాగయితే మనంచేసేప్రయత్నానికి అది సహాయకారిగానే వుంటుంది. ఎలాగయినా నీవు నీనేర్పునూ సామర్థ్య మునూ చమత్కారమునూ వాఙ్మాధుర్యమున్ను కనపరచి మాచి న్నాయనను వలలో పడవేస్తివా, మీరతిసుందరికి మంచిమొగుడు రావడమే కాకుండా మేనకోడలిభర్తకు యిరవయివేల రూపాయలు

కూడా చేతుల్లో పడతపి.

మోహి—ఇదంతా జరగడం నేను నీ పినతండ్రిని విడం వల్లనా?

వేంక—వివాహమాడడమా? అదయెప్పుడూ సాధ్యంకాదు. మాటలు చెప్పడంసులభంగాని కార్యంచెయ్యడం సులభంకాదు. ఆయనకు యెన్ని చిక్కులు తెచ్చిపెట్టిగా, తనఆస్తి అంతాఅయినా విడిచి పెడుతాడుగాని నిన్ననూత్నం వివాహంకాడు.

మోహి—అలాఅనబోకు స్త్రీలు తారసించినప్పుడు పురుషుడిమనస్సు యెంతగట్టివయినా కరగక మానదు. ప్రయత్నంచేసి ముందుగా మీచిన్నాయనగారి మనస్సులో కొంచెం కామాగ్నిని తగిలించి దరికొల్పినతరువాత, అది అంటుకుని మండుతూవుంటే మళ్ళీ ఆర్పివెయ్యడం సాధ్యంకాదుసుమా.

వేంక—అలా నిజంగా కామాగ్ని రవులుకొని మండితే మన్మథాగ్నిచేత కాలిచావడంకంటె తప్పకుండా వివాహా మాడడమే వుత్తమం. అయినాకానీ నీప్రయత్నంమాత్రం సాధ్య మవుతుం దనుకోకు. నేను యెరిగినంతవఱకు మాచిన్నాయనగారిమనస్సు స్త్రీలవిషయంలో రాయి అయిపోయినది. వజ్రంకంటెనూ కఠినమయిన ఆమనస్సు నూరగ్నిహోత్రాలు దరికొల్పినా కరిగేదికాదు. దాన్ని కరిగించేశక్తి లోకంలో యెక్కడనూ లేదు.

మోహి—ఒక్కచోటమాత్రం వున్నది.

వేంక—యెక్కడవున్నది?

మోహి—ఇక్కడ వున్నది. (అని తనహృదయమును చూపుచున్నది.)

వేంక—ఏదీ నీశక్తి చూతాము కామా!

—నీవే శీఘ్రికాలంలో చూచి మెచ్చుతావు. నాకు కావలసిన యుపాయం తోస్తూవున్నది. పూర్వంవకసారి నాయన్న మీచిన్నాయనగారున్ను కలిసి యేదోవక లా (ధర్మశాస్త్రం) న్నదని పుస్తకి తీసి వ్యాఖ్యం వేసి పురుషుడికి యిష్టంలేనిదే ఆతణ్ని మోహించిన వకచిన్నదానికి బలవంతంగా వివాహం చేయించినారు.

వేంక—అలాగంటి ఆక్టుకూడా వకటి అమలులోవుండేదా?

మోహి—వెనుక వుండేది. అది యిప్పుడు రద్దుకాకుండా వున్న ట్టయితే, యిరవైవేల రూపాయలున్ను నీచేతిలో పడ్డవే. యీకాలంలో ఆక్టులు గడియగడియకూ మారుతూ వుంటవి.

తిమ్మ—(తనలో నేమో యనుకొనుచు వెలుపల) ఈసంగతి నా యజమానుడితో చెపుతాను.

వేంక—(ఆమాటలాలకించి) అదుగో తిమ్మడు వస్తూవున్నాడు. మనంయిద్దరమూ మాట్లాడుతూవున్నట్టు వాడికితెలియకూడదు. నీవు యీదారిని వీధిలోకివెళ్లు.

(అని రొయికతలుపు తీయుచున్నాడు.)

మోహి—నీవేమో భయపడవద్దు. మరివకమోస్తరుగా నేను యిప్పుడే మళ్ళీవస్తాను. (అని వెళ్లుచున్నది.)

[అప్పుడు ధనకోటిరాజుగారును తిమ్మయ్యయు ప్రవేశించుచున్నారు]

ధన—ఓరి సోమరిపోతా! ఇంతసేపటిదాకా యెక్కడికి వెళ్ళి నావురా?

తిమ్మ—సోమిదేవమ్మగారి యింటికి. మీరుఅక్కడికి వుత్తరం యిచ్చి పంపించినారుకారా?

ధన—ఓరి వెధవా? యేమిటి తింటూవున్నావు?

తిమ్మ—నేను యీలాతింటూవుంటేనే బ్రతుకుతూవున్నాను,

లేకపోతే చచ్చిపోనా?

ధన—ఓరి తాగుబోతా? నీవు తాగడంకూడా మొదలుపెట్టలేదుగద!

తిమ్మ—యీమితాయివుండ మింగనియ్యండి. తరువాత చెపుతాను.

ధన—ఓరిబ్బగ్యుడా! నీకు మితాయి యెక్కడనుంచి వచ్చిందిరా?

తిమ్మ—నేను కొనుక్కున్నాను. రొక్కంయిచ్చి మరీకొన్నాను.

ధన—ఈరోజున నీకు నేనేమీ డబ్బియ్యలేదే.

తిమ్మ—మీరా? మీరా? మీరివ్వలేదు. నేను వేరే విధంగా డబ్బుసంపాదించుకోకుండా మీరు యిచ్చినదానితోనే తృప్తిపొంది వున్నట్టయితే నేను యిదివరకే స్వర్గానికి వెళ్లి వుందును.

ధన—ఓరిదొంగా! నేను యిచ్చినది కాకపోతే నీకు యింకా డబ్బెవరు యిస్తారురా?

తిమ్మ—ఎవరు యిస్తారా? మీపార్టీలు యిస్తారు. వారు మీస్వభావం యెరుగుదురు గనుక నాపూర్వ జాగ్రతలచి యేమున యిస్తూవుంటారు. యీరోజు వుదయాన్న కాగితాలు పట్టుకుని వెళ్ళి యిచ్చినంమకు సోమిదేవమ్మగారు బిళ్ళకుదుంలాగు రూపాయి చేతిలో పడవేసినారు.

ధన—(తనలో) అలాగయితే యికముందు నా క్లయింట్లకు కాగితాలు నేను స్వయంగానే తీసుకుపోవెళ్ళి యిస్తూవుంటాను. (బిగ్గరగా) ఏది? ఆరూపాయి నాచేతికియ్యి. నేను జాగ్రతచేసి పెడుతాను.

తిమ్మ—అపుడే ఆరూపాయి నాకడుపే జాగ్రతచేసి పెట్టింది. నాచేతులో డబ్బుపడితే నేను అక్కడనేకాని మరియొక్కడా దాచుకోను,

ధన—ఆఁ! యేమిటి? నీవు అప్పుడే రూపాయికి రూపాయి అంతా మింగివేసినావా?

తిమ్మ—రూపాయి మింగలేదు. రూపాయి విలువచేసే వస్తువులను మింగివేసినాను.

[అపుడు తలుపు ఎవరో తట్టుచున్నారు.]

ధన—తలుపు ఎవరో తట్టుచున్నారు. నీవు వెళ్ళి తలుపు తీసిరా. నేను లోపలికి వెళ్ళుతాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

తిమ్మ—చిత్తము. (అని వెళ్ళి తలుపుతీయుచు) తలుపుగుద్దుతూనిలుచోకు. వేగిరం లోపలికిరా.

[అప్పుడు మోహినీదేవి ప్రవేశించుచున్నది.]

మోహి—ధనకోటిరాజుగారు యింట్లో వున్నారా?

తిమ్మ—యెవరు వచ్చినారనిచెప్పను?

మోహి—మోహినీదేవిగారు.

తిమ్మ—(తనలో) ఆహాహా! మోహినీదేవిగారా? (బిగ్గరగా) మీరు వచ్చినపని యేమిటి?

మోహి—ఆపని మీరాయజమానుడితో చెపుతాను.

తిమ్మ—ఆలాగైతే. మీరు యేదోకేసులో సలహాపుచ్చుకోవడానికి వచ్చినట్టున్నారు.

మోహి—ప్లీడరుగారితో మాట్లాడడానికి వచ్చినాను గాని ఆయనవుకరుతో మాట్లాడడా కి రాలేదు.

తిమ్మ—నీవు భ్రమపడుచూ వున్నావు. నాకూ ఆయనకూ భేదంలేదు. నేను ఆయనకు అంతరంగ స్నేహితుణ్ణి.

మోహి—నీ వాలకం చూస్తే నీవందరికీ అంతరంగ స్నేహితుడిలాగే కనపడుచూవున్నావు.

తిమ్మ—పయిఆకారాన్ని పట్టి వూహా చెయ్యలేదు. పయి వేసం యేలాగున్నా లోపలిసారం కావలసినంత వుండవచ్చును. నీవేషం చూస్తే నీవు మాన్యాలూ గీన్యాలూ బాగావుంది బలిసి చాలాడబ్బు గలదానివలె కనపడుతూ వున్నావు.

మోహి—నేను డబ్బున్నదానిలాగు కనపడుతూవుంటే నీవు తెగయెండిపోయి డబ్బు లేనివాడవులాగు కనపడుతూవున్నావు

తిమ్మ—నీకు మాయజగన్నాడిదర్శనం కావలెనా?

మోహి—కావలెను.

తిమ్మ—ఆహాహాహా! ఆలాగయితే ఆయన యింట్లో లేరు.

మోహి—నేను యెరుగుదును. ఆయన యింట్లోనే వున్నారు. ఆగదిలోనే వున్నారు.

తిమ్మ—ఆలాగయితే ఆయన మిమ్మలిని యెరిగిన వారేనా?

మోహి—నేను ఆయనముఖంమాత్రం యెరుగుదును. నాకూ ఆయనకూ పరిచయం లేదు.

తిమ్మ—మీకూ ఆయనకూ పరిచయం లేనిమాటనిజమే. ఇది వరకు పరిచయమే వున్నట్టయితే, ఆయన ఆడవాళ్ళ .తరపున యేవ్యవహారంలోనూ వూరుకోడని మీకు తెలిసేవుంటుంది ఈమాటలు చెప్పి మీమనస్సును నొప్పి కలిగించడం నాకు యిష్టంలేక మీతో మృదువుగా ఆయన యింట్లో లేడని చెప్పినాను.

మోహి—మీ యజమానుడిసంగతి నాకు బాగా తెలుసును. ఆయన బాగా ఫీజు యిస్తే యెవరికేజులోనయినా పనిచేస్తారు.

తిమ్మ—ఆలాగయితే మీరు బాగా ఫీజుయివ్వగలవారే అనుకుంటాను.

మోహి—అధికంగాఫీజు యిచ్చేదాన్ని కాకపోతే నేను యిక్క-

డకు రానేర కపోదును.

తిమ్మ--ఆలాగయితే వ్యవహారంలో వుండేచిక్కులూ ప్లీడరు పడేపరియాసమూ మీరు బాగా తెలుసును కాబోలును!

మోహి--బాగా తెలుసును. పూర్వంమూ అన్నగారు లాయరు పనిలో వుండేవారు. ఆయన బ్రతికివున్నప్పుడు ఆయన వ్యవహారం నేనే చూచేదాన్ని.

తిమ్మ--మీకు లెక్కలుకూడా తెలుసునా?

మోహి--లెక్కలలో నాకు వట్టిసున్నాలకు కూడా విలువ కలుగచెయ్యడం తెలుసును.

తిమ్మ--సున్నాలకు విలువ యేలాగు వస్తుంది?

మోహి--ముందు అంకెలు చేరిస్తేసరి. నీ అంకిలి లేకుండా వుండడానికి యిదిగో. (అని యొకరూపాయ చేతిలో పెట్టుచున్నది)

తిమ్మ--(నవ్వి) అమ్మా! నీకు కోర్టువ్యవహారం బహుబాగా తెలుసును. అంతా యిందులో వున్నది. బంటోర్తు మొదలుకొని ప్లీడరుగారివరకూ డబ్బు చేతులో పడనిదే యేపనీ చెయ్యరు. అమ్మా! యిప్పుడు నావల్ల నీకు యేకార్యం కావలెను?

మోహి--మీ ప్లీడరుగారిదగ్గరం చేయించు. ఇంకోసారి వచ్చినప్పుడు నీకు కెట్టింపు బహుమానం చేస్తాను.

తిమ్మ--నీతిల్లికడుపు చల్లగా నీవు వెయ్యేళ్ళు వర్ధిల్లనలెను. ఇక నీకు నిమిషంలో నాయజమానుడి దర్శనంచేయిస్తాను. వుండండి. (అని తెళ్ళుచున్నాడు)

మోహి--నేను వీణ్ణి వశ్యంచేసుకున్నాను. ఇప్పుడు వక్కపరితిబంధం తక్కువయింది. ఓహనమా! నీప్రభావం యెవరు పొగడగలరు? లోకంలో యెంతటి వారున్ను నీకు దాసులేకదా? ఓభాషా

దేవి! ఇఖ నీవు నాకు తోడుపడి నాకు జయము కలుగ చెయ్యి. నీ అనుగ్రహంవల్ల నాకు యిదివరకు యెప్పుడూ సమయోచితంగా మాట్లాడడంలో పరాభవం రాలేదు.

[తిమ్మన్నయ్యయు ధనకోటిరాజును ప్రవేశించుచున్నారు]

ధన—అమ్మా! ఏదో వ్యవహారంలో నీవు నన్ను ఆలోచన అడగడానికే వచ్చినావని నా నవుకరు చెప్పుతూవున్నాడు.

మోహి—అవును. నేనంపసిమిత్తమే వచ్చినానుగాని నేను మీతో రహస్యంగా మాట్లాడవలసి యున్నది

ధన—ఓరితిమ్మా! నీవు అవతలకి పో.

తిమ్మ—చిత్తము. (అని వెడలిపోయి గుమ్మమువద్ద నొంచుండి వినుచున్నాడు)

మోహి—అయ్యా! నేనువచ్చిన వ్యవహారాన్ని గురించి మాట్లా డడానికి ముందుగా నాసంగతి కొంచెం చెప్పుతాను.

ధన—అవశ్యంగా చెప్పనచ్చును. మీరు కూర్చోండి.

(ఇద్దరును కూర్చున్నారు)

మోహి—అయ్యా! నేను యిప్పుడు మీసలహా కోరి వచ్చిన విషయం బహు వింతైనదిగా కనబడుతుంది అందుచేత— అందుచేత—

ధన—అమ్మా! తొందరపడబోకు. సానకాశంగా చెప్పవచ్చును.

మోహి—నేను యిప్పుడు మీకాలం వ్యర్థంపుచ్చడం లేదు గదా? మీకవతల తొందరపని వున్నదేమో!

ధన—లేదులేదు. నింపాపగాచెప్పు. పనివచ్చినప్పుడు వేరే పనివున్నా సావకాశంగా వినవలెను.

మోహి—మూలాన్నగారు రుచిన భూపతిరాజుగారు—

ధన—(ఆశ్చర్యముతో) భూపతిరాజుగారు మీకేన్నగారా?

ఆయుస నాకు పరిణమిత్రుడు.

మోహి—అవును. ఆయనా నేనూ యేకగర్భజనితులము.

ధన—ఆయన చాలా ధనం సంపాదించినారు. మీకుటుంబా నికి తగినంత ఆధారం వుంచి పోయినారా?

మోహి—ఆయన మాకు అన్నవస్త్రాలకు యేమీ లోపం లేకుండా తగిన ఆధారం చేసే పోయినారు.

ధన—ఆమాట వినడంచేత నాకు బహుసంతోషంగా వున్నది. నేను చూస్తూవుండేవాణ్ని. ఆయన కప్పుడు పదిపదహారు సంవత్సరాల వయస్సులోవున్న పెళ్లికాని తోడబుట్టిన పడుచు వుండేదే! ఆవిడ మీకు అప్పగారా? చెల్లెలా?

మోహి—ఆ పదహారేళ్ళ చిన్నదాన్నే నేను. నేను యిప్పటికిన్ని వివాహం చేసుకోనేలేదు.

ధన—ఓహో! నీవు యిప్పుడు యెంత మాటిపోయినావు. నిన్ను నేను యిప్పు డానవాలు పట్టలేకనేపోయినాను. నీరూపంకొంచెం—

మోహి—(అతనివంక తేరపార చూచుచున్నది)

ధన—అమ్మా! మారడంఅంటే నీవు మరివకలా గనుకోకు. నీరూపం కొంచెం మారినా అందం యేమీ చెడలేదు. ఇప్పుడు మరి వకమోస్తరుఅందం వచ్చినది. (తనలో) కొంచెం ముఖం ముదురుగా వున్నా యీమె యిప్పటికిన్ని చక్కనిదిగానే వున్నది.

మోహి—నేను యేమనుకుంటానోఅని మాట తిప్పుకున్నారు గాని, ఏ డెబ్బిమిదేళ్ళకింపట నేను యింతకంటె కోమలంగానే వుండి వుంటాను. మా అన్నగారు పోయినవిచారంచేత కూడా నారూపం కొంత మారిపోయింది.

ధన—ఏమిమాటీనా యిప్పటికీ నీరూపము యౌవనపురుషులను

పిపాసను కాకర్షించేలాగునే వున్నదిగాని మరిపక విధంగా లేదు. ఇప్పుడో ఎంత మనోరంజకముగా వున్నసీరూపము అప్పు డెంతమహో ద్రేకం కలుగచేసేదిగా వుండేదో?

మోహి—నాయందలి వాత్సల్యంచేత మీ రూరికే నన్ను స్తుతిచేస్తూవున్నారు. మనం మాట్లాడవలసిన కార్యం విడిచి దూరంగా వెళుతూ వున్నాము.

ధన—నేను శ్రద్ధగా వున్నాను వచ్చినకార్యంచెప్పు.

మోహి—ఇప్పుడు నా స్థితిగతులు మీకు పూర్ణంగా తెలిసినవికదా. నిజమయిన ప్రేమయున్ను గౌరవమున్ను గలిగి నేను మోహించిన వకపురుషుణ్ని యెలాగయిన బలవంతంగా నాకు వివాహం చేయించడానికి మీసహాయం కావలెను.

ధన—అదెంతపని? అవశ్యంగా చేస్తాను.

మోహి—ఆపురుషుడికి యిష్టంలేకున్నా వివాహం చేయించ వలెను.

ధన—అతని యిష్టానికి విరోధంగా చెయ్యడం కష్టమేకాని, అసాధ్యంమాత్రం కాదు.

తిమ్మ—(తనలో) వారు మెల్లిగా గుసగుసలాడుతూ వున్నారు. ఎవరికొంప తియ్యడానికో యీపర్యత్నం!

ధన—మరివకప్లీడరుదగ్గిరకు వెళ్లక యీవిషయంలో నావద్దకు సలహాకు రావడం నీవు మంచిపని చేసినావు.

మోహి—మీరు ఆమాట అనడం నాకు పరమసంతోషంగా వున్నది. నాకార్యం సఫలం కావలసినయోగం వుండి నా అదృష్టం చేతనే మీదగ్గిరకు రావడం తటస్థ మయింది.

ధన—(తనలో) పాపము! ఆపురుషుడీయం దీమె కెంతప్రేమ

వున్నదో!

మోహి—అయ్యా! యింటులో నేను ముందుగా చెయ్యవల సిన పని యేమో సెలవియ్యండి. యీవిషయములో మనము బహు జాగ్రతగా వుండవలెను.

ధన—జాగ్రతయేమిటి? రెండోవాసికి తెలియకుండా మన ఆలోచన బ్రహ్మభేద్యంగా వుండవలెను. మొట్టమొదట నీవు చెయ్య వలసినపని నీవు వెళ్లి ఆపురుషునితో మూడుమాట్లు వేరువేరు సమ యములందు రహస్యంగా గడియసేపు మాట్లాడిరావలెను. రహస్యంగా నని యెందుకు చెపుతూవున్నానంటే, అతడు నిన్ను కామించి వివాహ విషయమై నీతో రహస్యసంభాషణ జరిగిస్తూ వున్నట్టు నీవు ముందు పరిమాణంమీద న్యాయాధిపతివద్ద నమ్మకంగా సాక్ష్యం యివ్వడాని కనుకూలంగా వుండేనిమిత్తం. జాగ్రత. నీవు వెళ్లేటప్పుడు ప్రతిసారినీ యిద్దరుమ్గురు సాక్షులను పెట్టి మరి వెళ్లవలెనుసుమా!

మోహి—లా ప్రకారం అలాకావలెనేమి?

ధన—కావలెను. సరిగా నేను చెప్పినప్రకారం నీవు జరిగిస్తూ వున్నట్టయితే, తప్పకుండా నీవు కోరినపురుషుణ్ని నీకు వప్పగించడానికి నేను పూచీ పడుతాను.

మోహి—ఆ ఆక్ట్ ఇప్పుడు అమలులో వున్నదేకదా!

ధన—అమలులో వున్నదే. యీవిషయంలో నాసామర్థ్య మంతా ప్రయోగిస్తాను. ఇంతకాలం కష్టపడి నేను చదువుకున్న లా అంతా వ్యర్థమయిపోతుందా?

మోహి—నాకు మీరాయం దానమ్మక మున్నది. అయినా యిలాయిలా చేస్తే నీ కార్యం సఫలం అవుతుందని మీరు నక్కకాగి తంముక్కమీద వాసి యిస్తే మీరు నా విషయంలో మీ యీవ

చ్ఛక్తిని వుపయోగపరిచి కార్యసాఫల్యం చేస్తారని నాకు సంపూర్ణ విశ్వాసం వుంటుంది. తెలిసినమాత్రచేత ఆపదాన్నిగమక మనసులోవుండే ఆగుర్తాచేత మిమ్మలిని యిటువంటి కోరిక కోరుతూ వ్రగ్నాను. నాకో అభయహస్తం యివ్వడానికి మీ కేమయినా అభ్యంతర మున్నదా?

ధన--ఎంతమాత్రమూ అభ్యంతరం లేదు. సంతోషపూర్వంగా వ్రాసి యిస్తాను. (అని కలమును కాగితమును పుచ్చుకొని వ్రాసి యిచ్చుచున్నాడు.)

మోహి--ఇది వ్రాసి యివ్వడంవల్ల మీరు నాకు కలుగజేసిన ఆనందం యింతా అంతా అని చెప్పడానికి నాకు శక్యం కాకుండా వున్నది.

తిమ్మ--(తనలో) ఓహో! యీవిడ యౌవనపురుషుల పాలిటి మృత్యుదేవతగా వున్నదే!

ధన--నావంటి పురుషుణ్ణి వకణ్ణి ధన్యుణ్ణి చేసి బలవంతం గానైనా సమస్తాశ్రమాలలోకీ వుత్తమమైన,గృహస్థాశ్రమసుఖం ఆతనికి కలుగచేస్తున్నానుగదాయని నామనస్సులోనూ సంతోషం అపారంగా పొంగి పొర్లిపోతూ వున్నది.

మోహి--మీది సాధుహృదయం. మీకు మిక్కిలిశ్రమ కలుగజేసినాను.

ధన--ప్రయత్నం సఫల మయితే యిది వక శ్రమే కాదు. ఓసుందరీ! మళ్లీ యెప్పుడు వస్తావు?

మోహి--కొంచెంసేపటిక్రితమే వచ్చి నాకున్న నాపియుడి కిన్నీ జరిగిన పరిథమదర్శనపుసంగతి తిరిగీ తమతో మనవి చేస్తాను.

ధన--ఓసుందరీ! పోయిరమ్మ. ఈశ్వరుడు నీప్రయత్నము సఫలము చేయునుగాక?

మోహి--ఇదంతా మీఆశీర్వచనము? (అని వెళ్లుచున్నది)

ధన--(తనలో) నాభార్యపోయినతరువాత స్త్రీలతో చాలా సేపు మాట్లాడినది యీమెవక్క తెత్తోనె. స్త్రీలు చూడడానికి సంభాషించడానికీ మనోహరంగానే వుంటారు; కాని పురుషులు వాళ్ళవలలో పడితేమాత్రం మోసం తటస్థిస్తుంది. (బిగ్గరగా) ఓకీ తిమ్మా!

తిమ్మ--అయ్యా! వచ్చినానండి.

ధన--నీవు చీమలాగు పాకుతావు. వేగిరం నడిచి రాలేవేమి? యీవుత్తరాలు తీసుకునివెళ్లి పుచిరునామాలప్రకారం యెవరివి వారి కిచ్చి వచ్చేటప్పుడు సోమిదేవమ్మగారియింటికి వెళ్లి ఆవిడె నక్క-దోసకాయలు యిస్తానన్నది తీసుకునిరా.

తిమ్మ--చిత్తము. నక్క-దోసకాయలు రుచిగానే వుంటవి నా కవి బహుయిష్టము.

ధన--దోవలోనీకడుపాతుకత కనపరచక యిచ్చినకాయలన్నీ తిన్నగా యింటికి తీసుకుని రా. నేను వీధిలోకివెళ్ళి పావుగంటలో మళ్లీ వస్తాను. నేను మళ్లీనచ్చేటప్పటికి నీవు యిక్కడ వుండవలెను. దోసకాయలు తీసుకురావడం మరిచిపోకునూ! జాగ్రత.

(వీధిలోనికి వెళ్ళుచున్నాడు)

తిమ్మ--(ఆయనకేసిచూచి తనలో) నాకు దోసకాయ లక్క-రలేకుండా ఆవిడెమాటతోనే కడుపునింపింది. యీవేళ నాకు లావిష యము కావలసినంత తెలిసింది. నేను జన్మంయెత్తినతరువాత యిటు వంటి లా వున్నదని యెప్పుడూ వినలేదు. ఆలాగైతే యిఖ యే స్త్రీ అయినా యే పురుషుణ్ణి పడితే ఆపురుషుణ్ణి బలవంతముగా పెళ్ళాడి తోడేలు మేకపిల్లను నోట్లో వేసుకున్నట్లు ఇంత వేసుకోవచ్చును. ఇది మహాదొడ్డధర్మశాస్త్రం! ఇఖ నేను స్త్రీరూపం చూచినప్పుడల్లా బహు

జాగ్రతగా వుండవలెను. ఎవరో తలుపువద్ద పిలుస్తూవున్నారు. (వెళ్ళి తలుపు తీసి చూచి తొందరపడి) అయ్యో! ఆరంభములోనే నాకు స్త్రీదేవత ప్రత్యక్ష మయిందీ! దేవుడా! నాగతి యేమవుతుందో!—— అమ్మా! లోపలికి రా.

[అప్పుడు రతిసుందరి ప్రవేశించుచున్నది]

రతి——ధనకోటిరాజుగా రింట్లో వున్నారా?

తిమ్మ——లేరు. ఇంట్లో లేరు.

రతి——ఆయన వేగిరం ఇంటికి వస్తారా?

తిమ్మ——పావుగంటలో రావచ్చును. ఏమో యెలా తెలుస్తుంది? ఆయన గంటసేపటిలోనూ రావచ్చును. సాయంకాలందాకా రాకపోనూ వచ్చును. ఆయన ఇప్పుడు మాత్రం ఇంట్లో లేరు. అది నాకు తెలుసును. మీరు యిప్పుడు వెళ్ళి మళ్ళీ వస్తారా?

రతి——వెళ్ళను. ఆయన వచ్చినదాకా ఇక్కడనే వుంటాను.

(అని కూర్చున్నది)

తిమ్మ——(ఉలికి పడి) అమ్మా! నేను వంటరిగా వున్నాను.

రతి——వుంటే యేమి? నా కేమీ భయం లేదు.

తిమ్మ——నీ కేమీలేదుగాని నిన్నుచూస్తే నాకు మహాభయం గా వున్నది.

రతి——(నవ్వి) నీవు మహాధైర్యశాలివిగా వున్నావే! ఆడదాన్ని చూస్తే మగవాడికి నీకె భయం వేస్తూవున్నదా?

తిమ్మ——అందుచేతనే నాకు భయం వేస్తూవున్నది. నేను మగ వాణ్ణి కాకపోయినట్టయితే నాకు భయంపడవలసినఅవసరమే లేకపోవును.

రతి——నీ కెలావున్నదోగాని నిన్ను చూస్తే నాకు భయం వెయ్యడంలేదు.

[వేంకటపతిరాజు ప్రవేశించి రతిసుందరికి కనబడకుండ వెనుక నిలుచున్నాడు]

తిమ్మ—నీకు భయంవెయ్యదు. నాకది నిశ్చయంగా తెలుసును.

రతి—నీవు వట్టి పశుపాశువుగా వున్నావు. యిలాగు యింటికి వచ్చినపార్టీలను అవమానపరచడంనిమిత్తమే నీయజమానుడు నీకు జీతం యిచ్చి వుంచినాడా?

వేంక—(ముందుకు వచ్చి) ఏమిటిది? నీవు యీమెను ఎందుకు అవమానపరుస్తున్నావు?

తిమ్మ—ఈమె వ్యాజ్యదారురాలని నాకు తెలియదు. నేను యేమనుకున్నానా—నేను యిప్పుడే పొంచుండి విన్నాను—కాదు. ఆమాటకాదు—నేను వంటరిగావున్నాను. ధర్మశాస్త్రంచూడబోతే అదీకాదు. నేను యేమి చెప్పుతూవున్నానో నాకు నాకు తెలియకుండా వున్నది.

వేంక—(కుర్చీవేసి) ఓసుందరీ! దీనిమీద కూర్చుండు—ఓరీ! నీవు ముఖముందు యెప్పుడైనా ఇటువంటి దౌర్జన్యం చేసినావంటే—

(అని తిమ్మయ్యను వీధికేసి గెంటుచున్నాడు)

తిమ్మ—మీచిన్నాయనగారు వుత్తరాలు తీసుకుని వెళ్లమన్నారు. సోమిదేవమ్మగారి నడిగి దోసకాయలు తేవలెను. పోతాను.

(అని వెళ్ళుచున్నాడు)

వేంక—ఓసతిసుందరీ! ప్రియురాలా! మనపాలింటి కూర సింహంవున్న యీగుహాలోకే వెతుక్కుంటూవచ్చినావేమి? నీవు వచ్చిన పని యేమిటి?

రతి—ఆపనియేమో నాకూ తెలియదు. మాఅత్తయ్య తాను ఇక్కడికి నాలు గైదునిముషాలలో వస్తాను. ముందుగా వెళ్ళి కనిపెట్టుకుని వుండుమంటే వచ్చినాను. నేను యెందుకో సాక్షిగా వుండవలెనట.

నీన్ను చూస్తే నేను యెందులో సాటిగా వుండవలెనో చెపుతా వను కున్నాను.

వేంక—ఆవిషయం నీకెంత తెలుసునో నాకూ అంతే తెలుసును.

రతి—ఆవిడ యేపని తలపడితే ఆపని సాధిస్తుందని నాకు నిశ్చయంగా నమ్మకంవున్నప్పటికీ, ఆవిడె యిప్పుడు యేమిచెయ్యదలచు కున్నదో నాకు తెలియలేదు. ఆవిడే నిజంగా మగవాడయినట్టయితే యీదేశంలో వుండేలాయర్లు నందరినీ మించిపోను.

వేంక—అవును. ఆవిడముందర యే లాయరూ పనికి రాడు. అయినా కానీ ఆవిడె యీప్రయత్నంలో తప్పిపోయినట్టయితే మన బ్రిదు కప్పుడు యే మవుతుందో!

రతి—ఏమీకాదు. అప్పుడు నేను కఠినహృదయు డైనమీపిన తండ్రిని ప్రార్థించి, నిన్ను వివాహ మాడనియ్యక పోయినట్టయితే విరహతాపముచేత నేను ప్రాణాలు విడుస్తా నని చెపుతాను.

వేంక—అయినముందర ఆమాటలు సాగవు. వివాహాలు కావడంకంటె ప్రాణాలు విడువడమే ఆయువకు యెక్కువ యిష్టంగా వుంటుంది.

రతి—మీపినతండ్రిగారి విషయంలో ఆలా అనడం న్యాయం కాదు.

వేంక—ఓప్రియురాలా! ఆమాటలు నీవు నిజంచెయ్యకు. నేను వూరికే పరియాచికానికి అన్నాను.

రతి—అది నాకు తెలుసును. నీవు నన్ను కామించడమూ నన్ను వివాహము చేసుకోవడమూ కూడా పరియాచికానికే కాదుగద?

వేంక—నే నలా వివాహం ఆడను. అందులో పరియాచకం యేమీ లేదు.

రతీ—నన్ను వివాహమే ఆడవా? ఏ మేమిూ?

వేంక—ఓసియురాలా! నామాటల కపార్థాలు చెయ్యకు. నేను నిన్ను పరియాచకానికి వివాహ మాడ ననాన్ను. నీమిూద నాకు యెంత ప్రేమ వున్నదో నీమనస్సుకే తెలుసును. ఓసియురాలా! (వగ్గిరకువచ్చి) యేదీ వక్కముద్దు పెట్టు.

(అని కౌగిలించుకొని ముద్దు పెట్టుకొనుచున్నాడు)

[అప్పుడు దగ్గుచు ధనకోటిరాజు గారు ప్రవేశించుచున్నారు]

వేంక—మూచినాన్నయనగారు వస్తూవున్నారు.

రతి—(తొందరపడి) మిూచినాన్నయనగారా?

వేంక—అవును. వెంటనే మూర్ఛపో.

రతి—ఆ. ఆ. (అని యీతని చేతులలో మూర్ఛిల్లుచున్నది)

వేంక—(పినతండి)ని చూడనట్టు నటించుచు) ఓ కాంతా! నాకు బహువిచారంగా వున్నది. నేను ఆత్మార్పణ వేడుకుంటాను. అయ్యో! పాపము! ఈమె మూర్ఛపోయింది! నేను యిప్పుడు యేమి చెయ్యను? యీస్థితిలో యీమెను యిక్కడ వంటిగా విడిచి అవతలకు వెళ్ళ వల్లకాదు. ఎవరయినా కొంచెం చన్నీళ్లు తెస్తే బాగుండును. ఈసంగతి వింటే పరమచండాలు డైన తిమ్మన్నిి మూచినాన్నయనగారు తక్షణం తీసివేస్తారు. ఆయ నయినా యింటికి వస్తే బాగుండును.

ధన—ఇదిగో నేను వచ్చినాను. ఇదంతాయేమిటి?

వేంక—ఏమీ లేదు. మీబంటోత్రితు యీవెడెను విస్తారంగా అవమానపరచినాడు. నేను వచ్చి నాలుగుతన్ని వాణ్ని వీధిగోకి గెంటి వేసినాను. ఇంతలోకే యీవిడె మూర్ఛపోయింది.

ధన—మనం యిప్పుడు యేమిచేతాము? ఆడదానితో యీతం టాలన్నీ యిప్పుడు యెవరు పడుతారు? అబ్బాయీ! యిప్పుడు మనం

చెయ్యవలసినపని యేమిటి?

వేంక—కొంచెంసేపు మీరు యీచిన్నదాన్ని పట్టుకోండి. నేను వెళ్ళి సహాయం తీసుకుని క్షణంలో వస్తాను. (రహస్యంగా రతి సుందరితో) నీవు కదలమెదలకుండా వుండు.

ధన—పట్టుకోవడమా? నే నీచిన్నదాన్ని చేతులో పట్టుకో వలెనా? ఆపని నాచేత కాదు. నేను యిదివరకు యెప్పుడూ పరాయి ఆడదాన్ని నాచేతిలో పట్టుకో లేదు.

వేంక—(రతిసుందరితో రహస్యముగా) నీవు మూర్ఛలోనే వుండు. లేకపోతే మన యిద్దరికీకూడా భంగం వస్తుందిసుమా. (బిగ్గరగా) నాన్నగారూ! మీ రెలాగయినా కొంచెంసేపు పట్టుకోవలెను. నేను వీధిలోకి వెళ్ళి యీచిన్నదాన్ని తీసుకు వెళ్ళడానికి యే దయినా బండి తీసుకువస్తాను. ఈసమయంలో మనయింటికి యెవరయినా వస్తే—

ధన—అవును. అవును. అది సత్యమే కాని—

వేంక—కానీ లేదు. యేమీ లేదు. నేను వదలిపెడుతూ వున్నాను. వేగిరం వచ్చి పట్టుకోండి.

ధన— (దూరముగా నుండి యీమెను పట్టుకొనుచున్నాఁడు)

వేంక—(వెళ్ళుచున్నాఁడు)

ధన—అబ్బాయి! వేంకటపతీ! నన్ను వక్కణ్ణి వదలిపెట్టి వెళ్ళకు. అయ్యో! వాడు వెళ్ళిపోయినాడు. నేను పట్టుకోలేను. నా చేతులు వణకుతూవున్నవి. నేను వదలిపెడితే యీవిడకు దెబ్బతగులు తుందేమో! గట్టిగా పట్టుకోవలెను. (దగ్గఱకు జరిగి గట్టిగా పట్టుకొని మొగమువంకజూచి) ఈమె ముఖం యెంతమనోహరంగా వున్నది (అని యింతలో మోహినీదేవిని చూచి తొందరపడి రతిసుందరిని మెల్లగా క్రిందికి జార విడిచి తనచేతులు తీసుకొనుచున్నాఁడు)

[అప్పుకు మోహినీదేవి ప్రవేశించుచున్నది]

మోహి—అయ్యా! యిదేమిటండి!

ధన—ఏమో! నే నెఱుగను.

[వేంకటపతిరాజు ప్రవేశించుచున్నాడు]

వేంక—నాన్నగారూ! నేను బండి తీసుకుని వచ్చినాను. ఈమెకు తెలివి వస్తూ వున్నట్టున్నది. (రతిసుందరితో రహస్యముగా) ఓపిరియురాలా! ఈపాటి నీమూర్ఛవిడిచి తెలివి తెచ్చుకొని మెల్లగా లేచి రా. నీవు నీమేన త్తను యెరుగనట్టు నటించు.

(వారిద్దరును వెళ్లుచున్నారు)

మోహి—(వారు వీధిలోనికి వెళ్లువఱకును వారివంక చూచి అయ్యా! నాకు నిజంగా నవ్వు ఆగకుండా వున్నది.

ధన—ఏమి? నన్ను చూస్తే నీకు నవ్వు వస్తూవున్నదా?

మోహి—కాదు, అందుచేతకాదు. నాఅదృష్టదినాలు తలుచుకుంటే సంతోషం వస్తూవున్నది. నేను తలపెట్టినపని యే విఘ్నాలూ లేకుండా దివ్యంగా సాగుతూవున్నది. ఆపురుషుణ్ని నే నప్పుడే రెండు మాట్లు చూడడం అయింది. నేను యీసంగతి మీతో మనవి చేసి పెళ్ళుదామని వచ్చినాను?

ధన—నీవుమహాచెడ్డదానవు. అప్పుడే రెండుమాట్లుచూచినావా?

మోహి—చూచినాను. యీవేడిలోనే కార్యం సాగించవలెను గాని వేడి చల్లారితే తరువాత శ్రద్ధ వుండదు.

ధన—నీవు సాక్షులను పెట్టినావా?

మోహి—ఆసాక్షులు పెలుపల నున్నారు. (అని వీధివంక చూపుచు) యిందాకా నేను వచ్చేటప్పటికి మీరు కౌగిలించుకొన్నది మీకు దగ్గిరబంధువురాలా!

ధన—బంధుత్వ మేమీ లేదు. ఆమె యెవరోపరాయిచిన్నది. వీదో వ్యవహారవిషయంలో ననున్న ఆలోచన అడగడానికి వచ్చింది. నానవుకరు కొంచెంమోటుతనం చేసేటప్పటికి మూర్ఛ పోయింది. ఇంతలో నాఅన్నకుమారుడు వచ్చి వాణ్ని వీధిలోకి తరిమి వేసినాడు.

మోహి—ఆచిన్నదానితో కూడా వెళ్ళినపడుచుదిన్నవాడు మీఅన్నగారి కొమారుడా?

ధన—అవును. అత డామెను యింటికి తీసుకుని వెళ్ళినాడు.

మోహి—ఇంటికా? అలాగయితే ఆత డాచిన్నదాన్ని మీ వలె యెరగనివాడు కాడు కాబోలును.

ధన—ఓహోహో! నీమాటలవల్లనాకొక కొత్తసంగతే తెలిసినట్టున్నది.

మోహి—అదంతా నాకెందుకు? నేను యిక్కడికి పనిమీద వచ్చినాను. నాపని నేను చూచుకోవలెను. ఆవిషయంలో ముందు ననున్న యేమి చెయ్యమంటారో చెప్పండి.

ధన—నీవు ఇదివరకె రెండుసారులుచూచినావుగదా! మంచిది. నీతరపున నేను ప్లీడరునుగనుక నిన్ను కొన్నిసంగతు లడిగి తెలుసుకోవలసి వున్నది. నావద్ద నీవేమీ దాచకుండా నిజంచెప్పనలెను. నీవు మంచిస్థితిలోవున్నట్టు చెప్పినావని జ్ఞాపకం, నిజమేనా?

మోహి—సాధారణంగా అనుకూలమైనస్థితిలోనే వున్నాను.

ధన—నీ కేమయినాపిల్లలున్నారా?

మోహి—నాకు వివాహమే కాలేదు. నాసంరక్షణలో మా అన్నగారి కొమార్తెమాత్రం వక్కపిల్లవున్నది.

ధన—ఆచిన్నదానికి తండ్రి యేమయినా ధనంయిచ్చి పోయినాడా?

: మోహి—నావివాహాదినమందు దానికి యిరవై వేలరూపా యలు వస్తవి.

ధన—(తనలో) ఇరవై వేలరూపాయిలా! ఆచిన్నదాన్ని మా వెంకటపతి కిస్తే బాగా వుండును. (బిగ్గరగా) మీఅన్నగారు ప్లీడరీలో బాగా సంపాదించి వుందురు.

మోహి—సాధారణంగా సంపాదించినారు.

ధన—ఆయనపోయి యెంతకాలం అయింది.

మోహి—ఏ డెనిమిది సంవత్సరా లయింది.

ధన—ఆయనను గురించి మీరు యిప్పుడు మరిచిపోయి వుం టారు.

మోహి—యెంతకాల మయినా కొన్ని సంగతులు మరపునకు రావు.

ధన—అవు నవును. అది నిజమే. నీమేనకోడలికి సంబంధం యెక్కడన్నైనా కుదిరిందా? నాకు అన్నకుమారుడు వక డున్నాడు. వాడు మంచిచక్కనివాడు; యీవనంలో వున్నాడు. నేను ధనహీ నుణ్ణి కానిసంగతి నీకు తెలుసునుగదా?

మోహి—నాకు తెలియదా? నన్ను గెలిపించలేకపోతే మీరు యెంతో ఓడిపోతానని పందెంవేసినారే మీరు ధనవంతులు కాక పోతే యెలాపందెం వేస్తారు?

ధన—ఆహాహాహా! ఆవిషయంలో నేను పందెం ఓడిపోతా నని లేశమూ నాకు భయం లేదు. నీమేనకోడలికి యిరవై వేలరూపా యలు వస్తవనికాదా యిప్పుడు చెప్పినావు!

మోహి—నేను కోరినపురుషుణ్ణి నేను వివాహ మాడితే, అప్పుడు వస్తవి.

ధన—నీవు తప్పకుండా వివాహమాడుతావు. నాఅన్నకొడుకు విషయమును యేమాలోచించినావు?

మోహి—ముందుగా నాపెళ్ళిఅయితే, అటుతరువాత నామేన కోడలికి మొగుణ్ణిగురించి ఆలోచించడానికి కావలసినంతకాలం వుంటుంది. అయ్యా! మీరు మీఅన్నగారికుమారుడి వివాహాంనిమిత్తం యింత ఆతుర పడుచున్నారు గదా, మీవివాహం సంగతి యెందు కాలోచించినారుకారు?

ధన—నేను నీతో నిజం చెపుతాను. నాది వట్టి పిరికి స్వభావం నాకు స్త్రీలంటే భయము.

మోహి—భార్యవస్తే మిమ్మల్ని ధైర్యశాలినిగా చేస్తుంది.

ధన—నాకు కొంచెం కోపం హెచ్చు.

మోహి—భార్య కోపం పోగొట్టి శాంతుణ్ణి చేస్తుంది.

ధన—నాకు నామనస్సు వచ్చునట్టుగా నడవడంయిష్టం.

మోహి—ఆవిడె అదీ పోగొడుతుంది.

ధన—ఈవిషయం నీతో వాదించడం కష్టం, నీవు లాయరు చెల్లెలవుకాదా?

మోహి—ఆహేతువుచేతనే మీవంటి లాయర్ల జిత్తులూ, నావంటివాళ్ళ నేర్పు కలిస్తే మగీ సోభిస్తుంది అవునా! ఆహాహాహా! (అనినవ్వుచున్నది)

ధన—(తనలో) ఆహాహా! నిశ్చయించగా యిామె సంతోష దాయినిగా వున్నది.

మోహి—(తనలో) నిశ్చయంగా యితడు వివాహం ఆడ తగినవాడే.

ధన—(తనలో) యేస్త్రీతో వచ్చుటించినప్పుడుమూా యింత

సంతోషం యెప్పుడూ నాకు నాజీవితకాలంలో కలుగలేదు.

మోహి—(తనలో) ఇటువంటివాడు వివాహం కాకుండా వుండడంచూస్తే విచారకరంగా వున్నది. (బిగ్గరగా) అయ్యా! పొస్తు తం నేను సెలవు పుచ్చుకుని మళ్ళీ దర్శనం చేస్తాను ఈసారినచ్చి నప్పుడు కడపటిదైన మా ఊరిలో సంవర్ధనాన్ని గురించి మీకు మేలువార్త తేగలనని నమ్మకం.

ధన—ఆహాహా! అందుకు సందేహం లేదు. నీకు జయం కలుగుతుంది.

మోహి—నాకు జయంకలుగుతుందని మీకు నమ్మకంవుంటే కార్యం అయినట్టే ఆహాహాహా!

ధన—నిశ్చయంగా నీకు కార్యసిద్ధిఅవుతుంది. అనుమానంలేదు.

మోహి—ఆహాహా! నాప్రయత్నం విఫల మయితే మీరు వేసిన పందెం మాట జ్ఞాపకం వుంచుకోండి. మీరు నాకు దండుగ యివ్వవలసి వుంటుంది.

ధన—నాకాభయంలేదు. నీకార్యం విఘ్నంకాదు. నీఅభీష్టము శీఘ్రిముగానే నెరవేరుతుంది.

మోహి—మీ ఆశీర్వచన ప్రభావంవల్ల నెరవేరవలెను. నేను యిది మీరు యిచ్చిన వర మనుకుంటాను. నాయందు పరిపూర్ణాను గ్రహం వుంచండి. నేను సెలవు పుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నది)

ధన—(ఆమెవంకచూచుచు) ఆహాహాహా! ఈనిడెది బహు సుందరమయిన విగ్రహము. మొగం యెప్పుడూ నవ్వుతూ కలకల లాడుతూ వుంటుంది. నాకు యీమె భార్య అయితే నేను బహు సుఖంగావుందును. భార్యా? ఆమాట తలపెట్టకూడదు. వద్దు వద్దు. ఈయింద్రియ సుఖాపేక్షనుంచి నాహృదయము మళ్ళినుగాక!

[తిమ్మయ్య ప్రవేశించుచున్నాడు.]

తిమ్మ—నేను దోసకాయలు తీసుకువచ్చినాను. మీరు కొం చెముసేపు వోపిక పెట్టినట్లయితే నేను వెళ్ళనక్కరలేకుండా అవే యిక్కడకు వచ్చును.

ధన—నేను యింట్లో లేనప్పుడు మనయింటికివచ్చిన చిన్నదాన్ని యెందుకు జడిపించినావురా?

తిమ్మ—నేను జడిపించలేదు. ఆవిడెను చూచి నేనే జడుసుకున్నాను.

ధన.—దొంగవెధవా! ఆవిడెను చూచి నీవు జడుసుకున్నావేమి?

తిమ్మ—ఆవిడె నేను వుంటే భయంలేను తానున్నచోట నన్ను వుండవచ్చు నన్నది. నేనదివరకు విన్న మాటలమీద నాకు భయం నేసినది.

ధన—నీవేమిమాటలువిన్నావు?

తిమ్మ—మగవాడి యిష్టం లేకుండానే స్త్రీ పెళ్ళి వంటరిగా మూడుమాట్లు మాట్లాడివస్తే బలవంతంగా పెళ్ళి చేయవచ్చునని మీ రావిడెతో చెప్పడం నేను వినలేదా? మీతో చెపుతాను. నాకు యిష్టంలేనిది యెవత్తెయినా వచ్చి బలవంతంగా నన్ను పెళ్ళిచేసుకోవడానికి నేను లోబడుతానా?

ధన—ఓరి బండకుంకా! ఆమాటలు విన్నావట్రా?

తిమ్మ—విన్నాను.

ధన—ఎక్కడనుంచి?

తిమ్మ—తలుపుచాటునుంచి.

ధన—ఆచేతికర్ర యిలాగు తీసుకునిరా.

తిమ్మ—వీధిలోకి పెళ్ళుతారుకాబోలును. జోడుకూడా తీసుకునిరానా?

ధన—ముందుగా ఆకర్ర తీసుకుని రా.

తిమ్మ—ఇదుగో (అని తెచ్చియిచ్చుచున్నాడు.)

ధన—(పుచ్చుకొని దానితో తిమ్మయ్యను కొట్టి) వెధవా! ఇంత మందుకూడా యిలా తిలుపులవద్ద పొంచు నిలుచుండి వింటావా? బుద్ధి వచ్చిందా?

తిమ్మ—(ఆత్మసంరక్షణార్థము బల్ల నెత్తి కడ్డము పెట్టుకొని) నేనుపోయి మీమీద ఫిర్యాదు చేస్తాను.

[వేంకటపతిరాజు ప్రవేశించుచున్నాడు]

వేంక—నాన్నగారూ! ఇదియేమిటి?

ధన—నేను ప్రొద్దున్న వక క్లయింటుతో రహస్యంగా మాట్లాడినమాటలు యీామున్నపోతు విన్నాడు.

తిమ్మ—నావినడంవల్ల మీరిప్పుడు చెప్పడంవల్ల వచ్చేదానిలో సగం నష్టమయినా లేదు.

ధన—గాడిదా! నోరుమూసుకో! మేము మాట్లాడుకొన్న దానిలో రాజద్రోహం యేమీలేదు.

తిమ్మ—రాజద్రోహం దానిలో వెయ్యోపాలయినా కాదు. అది మీకూ నాకూ మగవాడై పుట్టినవాడికెల్లా అపాయకరమైనది.

వేంక—ఓరీ! నీకాతలుపు కనపడుతూ వున్నదా?

తిమ్మ—నిస్సందేహముగా కనపడుతూ వున్నది.

వేంక—నీమాట నాకు నమ్మకం తోచకుండావున్నది. ఆతలుపు వద్దకు వెళ్ళిచూపించు.

తిమ్మ—ఇదిగో (అని గుమ్మమువద్దకువెళ్ళి చూపుచున్నాడు)

వేంక—(వానిని తోసివేసి) ఛీ (అని వీధిలోకి గెంటి తలుపు లోపల గొళ్ళెము వేసి) నాన్నగారూ! అది యేమిటో యిప్పుడుచెప్పండి.

ధన—నేటి వుదయాన్న నేను వకక్లయింటుతో రహస్యంగా చెప్పినసలహాను తాను పొంచుండి విన్నా నని యీ కుక్కలకొడుకు నాయెకుట వప్పకుంటూవున్నాడు. ఆసంగతి యెందుకుకాని, నీకు భార్య కావలె ననాన్నవుగదా యింకా నీ వాకోరికతోనే వున్నావా?

వేంక—ఆకోరికతోనే వున్నాను.

ధన—నీకోసం చక్కని గుణవంతురా లయిన పదహారేళ్ల చిన్నదాన్ని మాట్లాడినాను.

వేంక— మీమేలు యెప్పుడూ మరచిపోను.

ధన—ఆచిన్నది యిరవై వేల రూపాయలు అరణంకూడా తీసుకువసుంది.

వేంక—ఆలాగైతే ఆచిన్నది మారతిసుందరి.

ధన—మారతిసుందరిని గురించి యెవరు చెప్పినారు? నేను కుదిర్చినచిన్నది వకస్నేహితునికూతురు.

వేంక—ఆలాగయితే ఆచిన్నది నాకు భార్యగా పనికిరాదు.

ధన—ఆచిన్నదే నీకు తప్పకుండా భార్య అవుతుంది? ఆ చిన్నది నీ కక్కరలేకపోతే నీకెప్పుడూ భార్యేరాదు.

వేంక—నేను మరికొంతకాలం కనిపెట్టుకొని వుంటాను.

ధన—ఇఖ నీకనిపెట్టుకు వుండడం పనికిరాను. నీవు ఆ చిన్నదాన్ని పెళ్ళాడితే పెళ్ళాడు. లేకపోతె నేను నీముఖం చూడను.

వేంక—ఆచిన్నదానా?

ధన—అవును. ఆచిన్నదాన్నే. నేను చెప్పినచిన్నదాన్ని వివాహం చేసుకుంటే నేను నాఆస్తిలో సగం నీకు యిస్తాను. చేసు

కోకపోతే యేమీ యివ్వకుండా నిన్ను కట్టుబట్టలతో నాయింట్లోనుంచి వెళ్ళగొడుతాను.

వేంక—నాన్నగారూ! ఆలోచించుకోవడానికి నాకు కొంచెం కాలం సావకాశంయివ్వండి.

ధన—పదినిముషాలకాలం యిచ్చినాను. ఈలోపుగా ఆలోచించుకో.

[తిమ్మయ్య ప్రవేశించుచున్నాడు]

తిమ్మ—అయ్యా! మోహినీదేవి వచ్చింది. ఆవిడే యిప్పుడు మిమ్మలిని వెంటనే చూడవలె నంటూవున్నది. (ధనకోటిరాజుగారి వద్దకివెళ్ళి మెల్లగా) ఆవిడె మిమ్మలిని పిశాచంలాగు పట్టుకున్నది. ఇఖ వదలిపెట్టదు.

ధన—వదురుబోతా! నీ అధికప్రసంగం చాలించి, ఆవిడను లోపలికి రమ్మను.

తిమ్మ—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు)

ధన—అబ్బాయీ! నీవు కూడా వెళ్ళి మోహినీదేవి వెళ్ళిన తరువాత మళ్ళీ రా.

వేంక—మంచిది. (అని వెళ్ళి మోహినీదేవియు నతడును ఏమేమో సైగలు చేసికొనుచున్నారు)

[మోహినీదేవి ప్రవేశించుచున్నది]

ధన—ఓసుందరీ! కార్యం నీ వనుకొన్నట్లయిసదా?

మోహి—దివ్యంగా అయినది. కాని నామనోభీష్టసిద్ధి అయ్యే కాలం మిక్కిలీ సమీపించడంచేత—మనస్సులో యేలాగో వున్నది. అది యిలా గంటీవని నేను చెప్పలేను. నాకు మూర్ఛ వచ్చేటట్లు వున్నది. (అని సోలుచున్నది)

ధన—(తొందరపడి మెల్లమెల్లగా సమీపమునకు వెళ్ళి పట్టు కొని) ఓ యీశ్వరుడా! నన్ను రక్షించు. తెల్లవారి లేచినతరువాత స్త్రీని నాచేతులతో పట్టుకోవడం ఈరోజున యిది రెండోమాటు. (ఆమె కేసిచూచుచు) అయ్యో! పాపము. (ఈ సమయములో తిమ్మయ్య వెంటరాగా వేంకటపతిరాజును రతిసుందరియు చప్పుడు కాకుండ మెల్లగా ప్రవేశించుచున్నారు)

ధన—— ఈవిడనుచూస్తే నాకు జాలివేస్తున్నది. చిన్న పిల్లవాడు నాతొడలమీద కూర్చుండి నాన్నా అని పిలుస్తూవుంటే కలిగేసంతోషం నేనువూత్తం యెందుకు పొందరాదు? ఇక్కడ యెవరూ సమీపంలో లేరు. (అని ఆమెను ముద్దుపెట్టుకొనుచున్నాడు)

తిమ్మ—(అప్పుడెదురుగావచ్చి నిలుచున్నాడు)

మోహ—(మూర్ఛ తేరి కేకవేయుచున్నది)

ధన——(నివ్వెఱపడి వేగిరము మాటరాక తడబడుచు) ఏ—— ఏ——ఏమిటిది?

మోహి——ఏమీలేదు. (తిమ్మయ్యనంకచూచి) ఏదోకొంచెం భయంవేసి వెనుక కొరిగినాను.

ధన——కొంకనక్కా! ఈగది విడిచి అవతలికి పో.

మోహి——అతడు వెళ్ళనక్కరలేదు. నేనుయిప్పుడు చెప్పబోయే దానికి రహస్యం అక్కరలేదు.

ధన——సత్యం. ఇఖ రహస్యంతో పనిలేదు. నీవిప్పుడు చెయ్యవలసిన పనల్లా ఆపురుషుడి పేరుమాత్రం చెప్పి సాక్ష్యాలను తీసుకుని రావలెను.

మోహి——సాక్ష్యాలు దగ్గరనే వున్నారు. ఆ పురుషుడిపేరు—— ఆహాహాహా!——నేను నిజంగా నవ్వు ఆపుకోలేకుండా వున్నాను. ఈమిం

భవలెను--ఆతడిపేరు--ఆతణ్ని మీరు బాగా యెరుగుదురు.

ధన--అతడు పురుషులలో ధన్యుడనిమాత్రం నే నెరుగుదును.

మోహి--అతడు ధన్యుడని మీరు మనస్ఫూర్తిగా తలు స్తారా?

ధన--నామనస్ఫూర్తిగా తలుస్తాను.

మోహి--ఆలాగయితే అతడు--ఆహాహా!--మీరు యిదివ రకే గ్రహించివుంటారు--అతడు సామాన్యపురుషుడు కాదు--హాహాహా!--ఆధన్యపురుషులుమీరే. ఆయనపేరు ధనకోటిరాజుగారు. ఇకుగో వీరే నాసాక్ష్యాలు.

[అప్పుడు వేంకటపతిరాజును రతిసుందరియు ముందుకు వచ్చుచున్నారు]

తిమ్మ--ఆహాహాహా! దివ్యంగా వున్నది. చివరకు ప్రభువు వా రీవిడెవలలో పడ్డారు.

ధన--మోహినీ! నీవు నాకు తగినదానవే.

తిమ్మ--మిమ్మలిని మించినది.

ధన--ఆచిన్నది యెవరు?

మోహి--నామేనకోడలు.

ధన--ఆచిన్నదానికి మరదైవేలడబ్బాయలూ వస్తవా?

మోహి--నేను కోరినపురుషుణ్ని నేను వివాహ మాడినతరు వాత వసవి.

ధన--ఎవరిని?

తిమ్మ--ఏలినవారినే. మీరే యీమెవలలో తగులు కొన్నారు. ఆహాహాహా!

ధన--మోటమన్నపోతా! వూరుకో--ఈచిన్నదాన్ని నేను యిదివరకు చూచినాను. ఆమ్మాయీ! నీవు యీవుపయోగాన్ని యిక్క-

డికి యెందుకు వచ్చినావూ?

రతి—నేను వేంకటపతిరాజుగారిని చూడడానికి వచ్చినాను.

ధన—ఆలాగయితే నీవు మావాణ్ణి యిదివరకే యెరుగుదువా?

రతి—ఎరుగుదును. ఆయన నన్ను వివాహం చేసుకుంటానని ఆరునెలలక్రిందనే మాట యిచ్చినారు.

వేంక—ఇఖ నేను దాచవలసిన పని లేదు. ఈమె చెప్పిన మాట నిజమే. నేను వివాహం చేసుకోవడానికి వరించి లోబరుచుకొన్నది యీ చిన్నదాన్నే. యీచిన్నదాని సుఖం కోరే మోహినీదేవి గారు మావివాహానికి మిమ్మల్ని వప్పించడానికి యింతప్రయాసపడ్డది.

ధన—వివాహ మంటే నాకు వుండే అసూయే మీకు యిరవై వేల రూపాయల అరణం యిప్పించిందా?

మోహి—నిశ్చయంగా. నేను మీకు భార్యను కాలేక పోయినప్పటికీ, ఆప్తురాలినిగానైనా వుంటాను.

ధన—ఓసుబ్బరాలా! నీ అమాయకత్వానికి చాలా సంతోషించినాను. యీఅమాయకత్వం నిన్ను చూచి నేను నేర్చుకుంటాను. (తనలో) పాపము నేను వద్దంటే యిప్పుడు యీమె యెంత చిన్న పోతుందో. నా మనస్సులో వున్న అభిలాషప్రకారంగా యిప్పుడు యీవిడెను వివాహం చేసుకోవడానికి వప్పుకుంటే యీదౌర్భాగ్యుడు వేంకటపతిగాడు బ్రతికివున్నంతకాలమూ నన్నాక్షేపించి నవ్వుతూ వుంటాడు (బిగ్గరగా) నాకు చాలా విచారంగా వున్నది.

వేంక—(ముందుకువచ్చి) విచారంగా యెందుకు వున్నది?

ధన—ఈమెను నిరాకరించవలసి వచ్చినందుకు.

వేంక—యెందుకు నిరాకరించవలెను?

ధన—నేను నిరాకరించడంవల్ల కలిగే దుఃఖానికి యీమె

కాళగలదని నీకు ధైర్యం వున్నదా?

వేంక—(తల యూ(చుచున్నా(డు)

ధన—తాటికాయలాగు తల ఆడిస్తా, వేమి? పరిహాసం మాని నే నడిగినదానికి జవాబు చెప్పు

వేంక—యీ మెయుందు మీకు నిజమైన యిష్టం వున్నదా? చెప్ప నక్కర లేదు. మీఅభిప్రాయాన్ని మీమాటలకంటె యిప్పుడు మీ చూపులే నాకు బాగా చెపుతూవున్నవి. ప్రస్తుతస్థితినిబట్టి మీసుఖమందు నాకు వుండే అపేక్షనుబట్టి నేను తప్పకుండా—

ధన—చాలును. నీఅభిప్రాయం నాకు తెలిసింది. మోహినీ! నీవు నాకు వోడిపోయినావు. నీఆస్తి నాకు యిచ్చుకోవలెను.

మోహి—ఎందువల్ల?

ధన—నాకు లోబడడంవల్ల. ఇప్పుడు పాణిగ్రహణంచేసి నిన్ను నాకు సమర్పించుకోవలెను. (అని చేయి చాచుచున్నా(డు)

మోహి—రాజుగారు నన్ను యిప్పుడు వేళాకోళం చేస్తూ వున్నారు—

తిమ్మ—(రహస్యంలో) ఆతడు నిన్ను పెళ్ళిచేసుకుంటే నీవే వేళాకోళం చేస్తావు.

మోహి—ఇది మోసానికి యెదురుమోసం కాబోలును.

ధన—ఇది మోసంగాదు. నేను నామనస్సూర్తిగానే చెపుతూ వున్నాను. నీవు నాస్వభావానికి సహించగలిగేటట్టయితే నిన్ను నా అర్ధాంగినిగా చేసుకొని నా ధనమంతా నీ స్వాధీనం చేస్తూవున్నాను.

మోహి— ఈ అనుగ్రహం నేను యెంతమాత్రమున్ను యెదురు చూడనిదిన్నీ ఆకస్మిక మయినదిన్నీ కాబట్టి నేన—నేను—

ధన—నీవు వప్పుకుంటావా?

మోహి--(కొంచెం సే పాఁగోచించి) ఆ. వప్పుకున్నాను.

ధన--హాహాహా! ఇప్పుడు నవ్వినలసిన వా రెవరు? మనపథమ దర్శన సమయమందే నిన్ను చెట్ట పట్టగల అదృష్టవంతుణ్ణి నేను కానేమోనని మనస్సులో కించపడ్డాను.

తిమ్మ--ఇప్పుడు నవ్వినలసినవాణ్ణి నేను. నాకు యజమా నుణ్ణి మించిన యజమానురాలు వచ్చినందుకు బహు సంతోషంగా వున్నది. (అని గంతులువేసి ఆడుచున్నాఁడు)

వేంక--మీకు ఇటువంటినుంచిభార్య దొఁకినందుకు నేను ఆనందిస్తున్నాను.

తిమ్మ--భార్యకాదు. అమ్మగారను.

వేంక--నాన్నగారూ! "నేను భార్యకావలె నని కోరేటంత గాడిద నయితే"-- ఆహాహాహా! నా యిరవై వేల రూపాయలూ దయచేస్తారా?

ధన--వెధవ యిరవైవేలరూపాయలు లక్ష్య మేమిటి? నాది యిఖ పదిరెట్లుధనం పోయినా, నేను యీ సుఖం వదులుకోను. అబ్బాయీ! నీ వాచిన్నదాన్ని వివాహ మాడి, నే నాచిన్నదాని మేనత్తను యెలా సుఖపెడతానో నీ వాచిన్నదా న్నలా సుఖపెట్టు.

మోహి--తుద కిదంతా విచిత్రంగా అయింది. ఇప్పుడు చూచినవాళ్ళకిందరికీ నా మేనకోడలినిమిత్తంకంటె నా నిమిత్తమే నే నెక్కువ ప్రయాసపడ్డట్లు తోస్తుంది. పరియాచికానికి భర్త అనుకున్న వాడు నిజంగా భర్త కావడమే తటస్థిస్తూవున్నది. ఇ దంతాచూడగా ధనకోటిరాజుగారు--

ధన--తాముపన్నిన వలలో తామే పడ్డారు--మిగిలినది నేను పూర్తి చేసినాను. (అందఱు నిష్క్రమించుచున్నారు)

మహాబధిరపరిహసనము

ఇందునచ్చు పాత్రములు.

సుసుంత్రుఁడు——ఇందుముఖితండ్రి.

ధనపాలుఁడు——ఇందుముఖిని వివాహమాడఁదలఁచుకొన్న వరుఁడు.

విజయవర్మ——విశాలాక్షీయన్న.

వసంతసేనుఁడు——అన్నపూర్ణమ్మకన్నఁడు.

ఇందుముఖి——సుమంత్రునికూఁతురు.

విశాలాక్షి——ఇందుముఖి చెలికత్తె; విజయవర్మ చెల్లెలు.

అన్నపూర్ణమ్మ——పూటకూళ్ళమ్మ.

చండిక——వంటలక్క.

సుబలుఁడు, రాముఁడు, కృష్ణుఁడు——అన్నపూర్ణ సేవకులు.

---

౧. రంగము——అమలాపురములోని పూఁటకూఁటియిల్లు.

[సుమంత్రుఁడును, ధనపాలుఁడును, కూరుచుండఁగా అన్నపూర్ణమ్మ పరివేశించుచున్నది]

అన్న——ఓరీ! సుబలా! రామా! కృష్ణా! ఒక్క చండిక తీప్ప నవుకర్లు యెవరూ కనపడ రేమి? బజారికి వెళ్ళడానికి యిక్కడ వక్క డూ లేడు.

(అని లోపలికి వెళ్ళుచున్నది)

సుసుం——ఈనిడెకేకలవల్ల నాకు ఆట తోచకుండా వున్నది. ఇఖ ఆట మానివేసి లేతాను. (అని చేతిలోని చిట్లు క్రింద పడవేయు చున్నాఁడు)

ధన—ఆటంత్తా పాడుచేసినారు. నాకు యీమాటు ఆగు బొమ్మలు వచ్చినవి చినరదాకా ఆడితే యీమాటు నేను తప్పకుండా గెలుస్తును. నేనుగెలిచేటప్పుడు మీరు యెప్పుడూ యిలాగే చేస్తారు. యిలాచేస్తే నాకు మహాకోపం వస్తుంది.

సుమం—(లేచి) నీవు కోపం చల్లార్చుకోవలెను. నీకు చీము చిటుక్కుమంటే కోపం వస్తుంది. చీటికీ మాటికీ యిలా ముక్కుమీద కోపంవుంటే సరిపడదు. నీకు నాకూతురుని యివ్వాబోతూ వున్నాను గనుక, మొఖమాటంలేకుండా చెప్పడం ధర్మమని చెపుతూవున్నాను.

ధన—కూతురిని యివ్వాబోతా నని నావంటి గొప్పయింటి బిడ్డను యిలా తృణీకరించడంమాత్రం మీకు ధర్మంకాదు. మీ కూతురూ వారూ యింకా వచ్చినారు కారు. నిష్కారణంగా యిలా ఆలస్యం చెయ్యడం నాకు యిష్టంగా వుండదు.

సుమం—పడవలు రానిదే వాళ్లు యెలావస్తారు? యింకా పడవలు వచ్చేవేళ కాలేదు. రాజమహేంద్రవరంనుంచి వచ్చే పడవలు పన్నెండుగంట లయితేనే కాని రావు. కొత్త పెళ్ళికొడుకువు గనుక నీకు తొందరగా వుంటుంది.

ధన—ఇది తొందరా? పన్నెండుగంట లయ్యేటప్పటికి పిండి వంటలతో భోజనం సిద్ధంకావలె నని యీపూటకూడావిడితో చెప్పి యేర్పాటుచేసినాను. ఆలస్యమైతే అన్నం చల్లారి పాడయి పోతుంది.

సుమం—నీవు మహా బుద్ధిమంతుడవు.

ధన— అవును, నేను బుద్ధిమంతుణ్ణే. మీ పళ్ళంకుర్రలో నన్నందరూ నూతన బృహస్పతిగా భావిస్తారు.

సుమం—అది గొప్పగా యెంచడానికి మీపళ్ళంకుర్రు అంత పెద్దగ్రామం కాదు. అక్కడ చదువుకున్న పండితులు యెవరూలేరు.

అందుచేత నీవక్కడ బృహస్పతివే కావచ్చును.

ధన—మీరు యెగతాళి చెయ్యకండి. నన్ను మావూళ్ళో వాళ్ళు పూర్వం చిన్నతనంలో తెలివితక్కువవాడే అనుకునేవారుగాని, నేను స్వతంత్రిణ్ణయి వెనుక రెండుమూసాలు రాజమహేంద్రంలో వుండి వచ్చినప్పటినుంచీ మావూళ్ళో బ్రాహ్మలు నన్ను బృహస్పతి కంటెనూ గొప్పవాణ్ణని నిత్యమూ స్తుతిచేస్తూ వుంటారు.

సుమం—ఆహాహాహా!

ధన—వోపికవుంటే మీమనసువచ్చినంత సేపు నవ్వండి. మొట్ట మొదట యెరుగక మావూళ్ళోవాళ్ళు నన్ను తెలివితక్కువగాడిదనే అనుకునేవారు. కాని మాతండ్రిగారు పోవటంతోటే నేను మూడు నెల్లల్లో మూడువేల రూపాయలు ఖర్చు చేసేటప్పటికి బ్రాహ్మలు అప్పుడు నా తెలివి కనుక్కుని స్తోత్రపాఠాలు చెయ్యడానికి ఆరంభించి నారు. మానాన్నగారు నిలవచేసినడబ్బు ఖర్చు చేసినతరువాత నాకు మరీ తెలివి వచ్చింది. యిప్పుడు పరదేశస్థుడు రెండురూపాయలు లప్పుడు వచ్చి అన్నంలేక నాలుక పెరుక్కున్నా చిల్లిగవ్వ చేతులో పెట్టను. ఇఖ నాకు పెళ్ళాం వస్తుంది. డబ్బు సాధుచేసుకోను. ఆహాహాహా! మీరు నాకు యెన్ని తోటలు వున్నవో కళ్ళారా చూచినారుకదా! హాహాహా! సంవత్సరానికి రెండువేలరూపాయలు వస్తవి. హాహాహా! మీకు సంతోషంగా వున్నదా? హాహాహా! ఇఖ నేను పెళ్ళి ప్రయత్నానికి మాపళ్ళంకుర్రు పెళ్ళవలెను! హాహాహా! మీకొమార్తె సుఖపడుతుం దని యిప్పుడు మీకు నమ్మకం తోచిందా? హాహాహా!

సుమం—అట్టే నవ్వబోకు. ఇప్పుడు సంతోషమంతా పొంగి పొర్లిపోతూవున్నది. అంతా యిప్పుడే అనుపోకుండా పెళ్ళినాటికి కొంచెం దాచుకో. (తనలో) ఈవాలకం చూస్తే నాఅల్లుడు వట్టి

బుద్ధిహీనుడులాగు కనపడుతూవున్నాడు.

[అన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది.]

సుబ్బు—అన్నపూర్ణమ్మగారూ! ఈపాటికి పడవలు వచ్చి వుంటవి. మావాళ్ళను తీసుకుని రావడానికి పంపించిన బండికోసం మేము వీధిగుమ్మంలో కూర్చుండి యెదురు చూస్తూవుంటాము. నాకూతురు రావడంతోటే కూర్చుండడానికి గది సిద్ధం చేయించండి.

అన్న—ఎంతసేపు? నిముషంలో సిద్ధం చేయిస్తాను—ఓసీ! చండీ! చండీ!

[అప్పుడు చండిక ప్రవేశించుచున్నది.]

చండి—అమ్మా! వస్తున్నాను. నేను యిక్కడికే వస్తూవుండగా మీమాట వినపడేటప్పటికి అమ్మగారు యేదో జరూరుపని వుండేకాని పిలవరని మళ్ళీ వెనక్కు వెళ్ళకుండా చటుక్కున చక్కా వచ్చినాను.

అన్న—ఆసోదంతా యెందుకు? నేను చెప్పిన పని చెయ్యి. యీతాళంచెవి పట్టుకొని వెళ్ళి దక్షిణపుసావిట్లో నాలుగోగది తలుపు తీసి చాపలూ అవీ వేసి సిద్ధంగా వుంచు ఇప్పుడే పడవలలో యీయన కొమార్తెమొదలయిన ఆడుగులు వస్తారు.

ధన—పిండివంటలతో భోజనం పెట్టడానికి తలకు వళ అర్ధ రూపాయ చొప్పున యిస్తానని యిదివరకే యేర్పాటుచేసినాను ఇందులో నీవు మళ్ళీ యేమీ పేచీ పెట్టగూడదు. కూరలూ పచ్చళ్ళూ యేమేమి చెయ్యవలెనో యిదివరకే యేర్పాటు చేసినాను. చెప్పిన దానికంటె యెక్కువగాచేసి పొమ్మని తెగ్గండంటే తరువాత నేను యిచ్చే వాణ్ణి కాను. ఇప్పుడే చెప్పివేస్తూవున్నాను. పిండివంటలతో భోజనం పెట్టనలసినవారు నలుగురే సుమా? నవుకర్లు భోజనానికి పూటకు

రెండేసి అణాలు. యీపకారం యివ్వడం నీకు చాలాలాభం. అయినా కానీ యిదివరకు వప్పుకున్నాను గనుక, అనుకున్నట్టు యిచ్చివేస్తాను.

అన్న—ఇది నాకే లాభమా? నేను యీఅన్నసత్రం పెట్టిన తరువాత యెప్పుడూ పిండివంటలతో భోజనం పెట్టడానికి—

ధన—ఆసంగతి పోనీ—మామగారూ! పిండివంటలతో పెట్టడానికి మనిషివక్కంటికి అర్ధరూపాయి యివ్వడానికి వప్పుకున్నాను. (తనలో) నాలుగర్ధలు రెండు రూపాయలు. అబ్బో! రెండు రూపాయలా? నవుకర్లు యెంతమంది వుంటారో!— (బిగ్గరగా చండికతో) నాగదికి పక్కనువున్నగదిలో భోజనానికి నాలుగువిస్తళ్ళు వేయించు. మేమంతా కలిసి భోంచేస్తాము. లెక్క నాలుగు విస్తళ్ళేసుమా!

చండి—మీరు నాతోచెప్పేది యింతేనా? ఇంకా యేమైనా వున్నదా?

ధన—అంతే. అంతే. నీతో యేమో చెప్పనలెనుకొని మరిచిపోయినాను. నేను పడుకునే గదిలో పరుపు వెయ్యేమి? జాగ్రత్త నేను చెప్పింది మరిచిపోకు.

చండి—డబ్బు చేతులోపడుకూవుంటే మీ యెదుటవున్నంత సేపూ నేను యేదీ మరిచిపోను. యీస్థలం విడిచి వెళ్ళితే తరువాత మీకు యెంతజ్ఞాపకమో నాకూ అంతే జ్ఞాపకము.

ధన—ఆహాహాహా! బాగా చెప్పినావు—మామగారూ! బండి వస్తూవున్నదేమో చూతాముర౦డి. (అని వీధిలోనికి వెళ్ళుచున్నాడు)

సుమం—చూచినకొద్ది నాఅల్లుడు వట్టి గాడిదఅయినట్టు స్పష్టమవుతూ వున్నది. ఇతను వట్టి కోపిష్టినీ లుబ్ధునూ పదరుపోతునూగా కనపడుతూవున్నాడు. ఇంతమట్టునకు వచ్చినతరువాత ఇక పిల్లనియ్యనడం బాగా వుండదు.

ధన--(వీధిలోనుండి) రండి మామగారూ! రండి.

సుమం--వస్తున్నాను. (అని వెళ్లుమన్నాడు)

చండి--అమ్మా! ఈధనపాలుడుగారు బొత్తిగా పనికి మాలిన వారుగా నున్నారు. ఈయన కిచ్చి పెళ్ళి చెయ్యబోయ్యే చిన్నదాన్ని తలచుకుంటే నాకు విచారంగా వున్నది నన్ను పెళ్ళి చేసుకోమంటే యితణ్ణి నేనుకూడా--

అన్న--ఈ విషయం నీకు యేమీ తెలియదు. ఇతను బుద్ధి హీనుడయినా డబ్బున్న బుద్ధిహీనుడు. లోకంలో డబ్బువుంటే--

చండి--నన్ను ఎవరో పిలుస్తూ వున్నారు. వెళ్ళితాను.

అన్న--పరుగెత్తబోకు. నేను చెప్పేమాట విని మరీ వెళ్ళు. యీ పెళ్ళివారు తప్ప మరి యెవరువచ్చినా చోటు లేదని చెప్పి పంపించి వెయ్యి. యెంతడబ్బు యిస్తామన్నా డబ్బు కాశపడి యెవరినీ లోపల ప్రవేశపెట్టకు.

చండి--గది లేదు. సావిడి లేదు. వసారా లేదు. కూర్చోడాని కయినా స్థలం లేదు. యేమీ లేదు. అని చెప్పుతాను.

అన్న--వూరికే వాగబోకు. నీ అధికప్రసంగం చాలించి యెవరు పిలుస్తూవున్నారో వెళ్ళి చూచిరా.

చండి--నిముషంలో చూచి వస్తాను. (అని పరుగెత్తుచున్నది)

అన్న--ఇది తెల్లవారి లేచింది మొదలుకొని రాత్రి పడుకోపోయిందాకా వూరికే వదురుతూ వుండడమేకాని పని యేమీ చెయ్యదు.

(చండిక యిందుముఖిని విశాలాక్షిని వెంటబెట్టుకొని మరల ప్రవేశించుచున్నది)

అన్న--అమ్మా! యిలారండి.

చండి—అమ్మలారా! యిలారండి. యిలారండి. గుమ్మం దాటే టప్పుడు జాగ్రత. కాలికి దెబ్బ తగులుతుంది గడప మెల్లిగా దాటండి. మీరు చాలా దూరాన్నుంచి వచ్చినారు కాబోలును. లోపలికి వచ్చి కూర్చుంటారా? అమ్మా! మీ పెట్టెలు—

అన్న—(చండికను చేయి పట్టుకొని యీవలికి లాగి రహస్యముగా) చండీ! నీవు వూరికే అరనక నోరు మూసుకో.

ఇంకు—పెట్టెలు మా నాన్నగారు లోపలికి పట్టించుకుని వస్తారు.

అన్న—అమ్మా! మీరు రావడం నాకు చాలా సంతోషంగా వున్నది. మీరు వస్తారని యీరోజున యిరవైమందిమార్గస్థులను బస దొరక దని చెప్పి పంపివేసినాను లోపలికి రండి

చండి—ఇరవైమందా? యెక్కడ యిరవైమంది? చలిది భోజనాలవేళలకు లోపుగానే బసలు లే వనిచెప్పి నేను వక్కొత్తెనే నలభైమందిని అవతలికి పంపివేసినాను.

అన్న—చండీ! వూరుకో—అమ్మా! మీరు వచ్చేముందరనే వక పడుచుచిన్నవాడు వచ్చేటప్పటికి బస దొరక దని చెప్పి పంపివేసినాను. అతడు వెళ్ళలేక వెళ్ళలేక వెళ్ళిపోయినాడు.

విశా—(ఇందుముఖితో రహస్యముగా) చెలీ! ఆవచ్చిన దతడే కాబోలు.

అన్న—అమ్మా! నేను వెళ్ళి మీగది తయారుగా వున్నదో లేదో చూచి వస్తాను—చండీ! మనము వెళ్ళుదాము రా. (అని యిద్దరును వెళ్ళుచున్నారు)

ఇందు—అతడే కాబోలునా? ఆహాహాహా! ఆపడుచు చిన్న వాడికి అనులాపురంలో పూటకూళ్ళసత్రంలో వుండవలసిన అవసరం

లేదు ఆ వచ్చినవాడు వకవేళ మనం రాజమహేంద్రివరంలో విడిచి పెట్టివచ్చిన నీవరుడు వెంకయ్యగారు కావచ్చును.

విశా—ఎవరయినా కావచ్చును. మాఅన్న విజయవర్మమాత్రం యెందుకు కాగూడదు? వారిద్దరిలో యెవరో వకరు మనకంటె ముందు పడవలో వచ్చి వుండవచ్చును. వస్తే యిద్దరూ వచ్చి వుండవచ్చును.

ఇందు—నీవు యిందాకాకూడా యిలాగే చెప్పినావు.

విశా—వారు సమీపానికి వచ్చివుంటారని నాకు దృఢంగా నమ్మకం వున్నది. నామాట నమ్ము.

ఇందు—ఓసీ! నీవు వూహలు మహాబాగా చేస్తావు. మానాన్న గారు రాజమహేంద్రవరాన్నుంచి యిప్పుడు నన్ను యెందుకు పిలిపించి నారో వూహచేసి చెప్పు. నేను యిరవయిసార్లు మళ్ళీ మళ్ళీ చదివినా నాకు బోధపడలేదు. ఇదిగో మానాన్నగారు వ్రాసిన వుత్తరం చదువు తాను విను. (అని యుత్తరము తీసి చదువుచున్నది). "అమ్మాయీ! ఆస్తి తోటలూ నేను స్వాయంగా చూచినాను. అవి చూడడంతోటె నాకు చాలా సంతోషం కలిగి నిన్ను ధన్యురాలినిగా చెయ్యడానికి నిశ్చయించు కున్నాను"— నన్ను ధన్యురాలినిగా చెయ్యడానికా? ఈమాటలు నాకేమీ అర్థం కావడంలేదు. తరువాత చదువుతాను విను—"మీరు వెంటనే పడవమీద బయలుదేరి అమలాపురంలో అన్నపూర్ణమ్మగారి స్నేహంలో నన్ను వచ్చి కలుసుకోండి. వచ్చేట ట్టయితే నీ స్నేహితురాలిని విశాలాక్షినికూడా వెంట బెట్టుకునిరా."

విశా—అన్నిమాటలూ నాకు అర్థమయినవి. నిన్ను ధన్యు రాలినిగా చెయ్యడం అంటే నీకు వివాహం చెయ్యడం. ఇక పెళ్ళి కొడుకు యెవ్వరంటావేమో? మాఅన్నగారు రయినవిజయవర్మే అవు తాడు. ఆస్తి తోటలూ వివాహకాలమందు మీ దంపతులకు

మీనాన్నగారు అరణా యిచ్చేవి. ఇప్పు డన్నిమాటలకూ అర్థం బాగా తెలిసిందా?

ఇందు—బహుబాగా తెలిసింది. నీ అన్నగారిని మాత్రం పుట్టి బుద్ధియెరిగిన తరువాత మానాన్నగారు యెప్పుడూ చూడలేదు. పేరయినా చెప్పకోగా వినలేదు ఇంతకంటే యేమి తెలియవలెను? మా మేనత్తగారియింటికి వెళ్ళినప్పుడు నాకు పెద్దాపురంలో మీఅన్న గారితో మొట్టమొదట పరిచయం కలిగినది.

విశా—అవును. నాకు యిప్పుడు వకటి తోస్తూవున్నది.

ఇందు—వెంకయ్యగారుతప్ప నీకు మరియేమీతోచదు. నేనూ తోచడం లేదు; మీఅన్నగారూ తోచడం లేదు; నేను యిప్పుడు చదివినవుత్తరంయొక్క అర్థమూ తోచడంలేదు.

(రాముడు వెంటరాగా చండిక ప్రవేశించుచున్నది)

చండి—అమ్మా! మీరాగది సిద్ధంగా వున్నది. మీకోసం నేను శ్రీమంతుడి గదంతా శుభ్రం చేసినాను. అది యీయింట్లోవున్నగదులలో కల్లా మంచిగది; మీ రాగ్గదిచూస్తే—

రాము—చండీ! అమ్మగార్లతో నీవు చెప్పేది వేగిరంకానియ్యి. నీవు చెప్పే దయిపోతే నేను చెప్పవలసింది నేను చెపుతాను.

చండి—అయ్యో! నేను మరిచే పోయినాను. అమ్మా! యితను రాముడు. ఇందాకా యితను నాతోచెప్పినాడు. ఏమని చెప్పినాడో? ఏమిటో మరిచిపోయినాను. జ్ఞాపకం చేసుకోనియ్యండి. మీరుకావడం తోటే తనతో—ఓరామూ! నేను చెప్పేది సరిగా వుంటూవున్నదా?

రాము—చండీ! నీవు వూరికే ఆయాసపడక నాపని నన్నే చెప్పనియ్యి. అమ్మా! రాజమహేంద్రపరాన్నుంచి వచ్చిన ఆడంగులు మీరే అనుసట్టయితే, యిదుగో మీలో వకరికి నేను వుత్తరం తెచ్చి

నాను. (అని విశాలాక్షి చేతికిచ్చుచున్నాడు.)

విశా—(పుచ్చుకొని) ఈ వుత్తరంపయిని చిరునామా లేదే. ఇది నీచేతికి యెవరు యిచ్చినారు?

రాము—ఆయన మీతో తనపేరు చెప్పుమనలేదు. ఆయన తనపేరు నాతోనూ చెప్పలేదు గనుక నేను యిప్పుడు చెప్పుదామన్నా చెప్పలేను.

విశా—(ఇంకనుఖితో) మనం యీవుత్తరం పుచ్చుకుందామా?

ఇందు—వుత్తరం పుచ్చుకుంటే నష్టం యేమి వుంటుంది? పుచ్చుకో.

రాము—అమ్మా! భయపడక పుచ్చుకో. వుత్తరం పుచ్చుకుంటే నష్టం యేమీలేదు. నేను యీసత్రంలో దిగినవారికి యెంత మందికో వుత్తరాలు యిచ్చినాను. నావుత్తరాలవల్ల యెప్పుడూ యెవరికీ నష్టం కలగడంలేదు. నామాట నమ్మండి.

చండి—అమ్మా! యితడు చెప్పినమాట నిజం. అందుచేతనే యీసత్రంలో వాళ్లందరూ యెప్పుడూ యితన్నే వుత్తరాలు యిమ్మంటారు.

విశా—ఈవుత్తరం పట్టుకువెళ్ళి యివ్వడానికి నీకు యివ్వలసింది యిచ్చినారా?

రాము—పుచ్చుకున్న తరువాత లేదని యెట్లా చెప్పను? అయినాకానీ మీరు కూడా యేమైనా యిస్తే వద్దనకుండా పుచ్చుకుని సంతోషిస్తాను. యీలోకంలో ధనంతో తృప్తి పొందినవారు యెవ్వరున్నారు?

విశా—ఇదుగో పుచ్చుకో. (ఒక అణా చేతిలో పెట్టి) దీనితో నీకు తృప్తి కలిగిందా?

రాము—అమ్మా! మీకు దేవుడు మేలు చెయ్యవలెను. ఈడబ్బుతో నాకు సంతోషం కలిగినట్టే యీవుత్తరంతో మీకు సంతోషం కలుగవలెను. (అని వెళ్ళుచున్నాడు.)

విశా—వుత్తరములో యేమి వున్నదో చూతాము. (అని విప్పి చదువుచున్నది)—"ఓకాంతలారా! యేమి జరిగినా చూడండి; వినండి; యేమీ మాటాడకండి. మీ రేమీ ఆశ్చర్యపడట్టు కనపడవద్దు. ఎందుచేత నేను యిలాగు చెప్తూవున్నానో, అదంతా మందు మీకే తెలుస్తుంది"—ఈవుత్తరం మనయిద్దరినీ వుద్దేశించి వ్రాయబడ్డ దనుకుంటాను. ఇందులో దస్కతు లేదు.

ఇందు—ఏమి జరిగినా విని వూరుకోవలెనా? ఆదస్తూరీ యెవరిదో నీ వెరుగుదువా?

విశా—గుర్తు పట్టడానికి తెలియడం లేదు. ఇది స్వాభావికంగా వ్రాసినవ్రాత కాదు. ఎవరో మారుదస్తూరీతో పట్టిపట్టి వ్రాసినారు. అయినా కానీ మనం యిందులో చెప్పినట్టు చేసి ఫలితం యేమి జరుగుతుందో చూతాము.

ఇందు—పర్యాణం మూలంగా మాసిపోయిన యీబట్టలు విడిచి మంచిబట్టలు కట్టుకుందాను. లోపలికి రా. (చండికతో) మా తండ్రిగారు వస్తే మేము యిప్పుడే వచ్చి కలుసుకుంటామని చెప్పు.

చండి—తప్పకుండా చెప్పుతాను. నేను వదురుబోతు నని నాయజమానురాలు నన్ను యెప్పుడూ తిడుతూ వుంటుంది. నేను వదురుబోతు కాదుండీ కానిదీ దేవుడికి తెలుసును. ఆసంగతి యెట్లా వున్నా నేను వచ్చినబాటసార్లకు చేసేవుపచారంలో మాత్రం యేమీ లోపం చెయ్యను.

ఇందు—అదంతా సరే కాని ముందు మాగది చూపించు

పోవలెను. ఇదిగో నీబహుమానము. (అని రెండణా లిచ్చుచున్నది.)

చండి--అమ్మా! దణ్ణాలు దణ్ణాలు ఇవంతా డబ్బుకోసం కాదు. కాని యెవ రైనా డబ్బు చేత్తో పెడితే—మీరు తొందర పడుతూవున్నారు—మార్గం యిది. యిలారండి - మీకర్థిక నేను మహారాణిగద్ద కనిపెట్టుకునివున్నట్టు వుంటాను. మీరు మాత్రం వాకిట్లోకివచ్చి "చండీ! చండీ!" అని పిలువనలెను. పిలిచే టప్పటి కల్లా యక్షిణీచేత వచ్చినట్టు మీరాయెదుట నిలువబడుతాను.

(ఇందుముఖియు విశాలాక్షీయు వెళ్ళుచున్నారు.)

చండి—ఈఅమ్మలు బహుమంచివారు. ఈ ఇద్దరిలో యెవరి కయినా ధనపాలుడు మొగుడుకావడం తటస్థ మయితే నాకయినట్టు దుఃఖపడుతాను.

ఇందు—(లోపలినుండి) చండీ! రావేమి?

చండి—అమ్మా! మరిచిపోయినాను. వస్తూవున్నాను. (అని వెళ్ళుచున్నది)

[అప్పు డన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది]

అన్న—ధనపాలుడు కుబేరు డంత ధనముగలవాడే కావచ్చును. కాని నేను యెప్పుడూ యింత బుద్ధిహీనుణ్ణి యీలోకంలో యెక్కడా చూడలేను. ధనాశచేత యీయిద్దరుకన్యలలో యెవరినైనా యీనిర్భాగ్యుడికి వివాహ మనే మిషమీద బలిపెట్టి టట్టయితే నామనస్సు బహుఖేదపడుతుంది. పాపం వీరిని చూస్తే నాకు జాలి వేస్తూవున్నది.

[ఈలోపల విజయవర్మ ప్రవేశించి మెల్లగా బల్లమీద కూరుచుండి ఏదో పుస్తకము చూచుచున్నాడు]

అన్న—(ఆశ్చర్యముతో) అయ్యో! ఈయన యెవరు? ఈయన

యిక్కడకు యేలాగు వచ్చినాడు? ఈయన రాక చూడగా యీయన పయినుంచి వూడిపడ్డట్టు వున్నది. అయ్యా! మీకు యేమికావలెను?

విజ —అక్కరలేదు. అక్కరలేదు. నీవు నానిమిత్తము శ్రమ పడి నీళ్లు తేవలసిన పని లేదు. నేను యెవ్వరికీ శ్రమ కలుగచెయ్యను.

అన్న —అయ్యా! మీరు యీరాత్రి యిక్కడ బస చెయ్య వలె నని వచ్చినా రనుకుంటాను.

విజ —కాదు కాదు. ఆతడు యీరాత్రి యిక్కడకు రానే రాడు. రేపు వుదయాన్న భోజనపువేళకు తప్పకుండా వచ్చి కలుసు కుంటాడు. (అని తల వంచుకొని చనువుకొనుచున్నాడు.)

అన్న —ఇతనిమాట యేమిటో నాకు తెలియకుండావున్నది. వసంతసేనా! తమ్ముడూ!

(వసంతసేనుడు ప్రవేశించుచున్నాడు)

వసం—అప్పా! వచ్చినాను.

అన్న—ఈయన యెవరు? యెక్కడనుంచి వచ్చినాడు? ఇతడు పిచ్చివాడా యేమిటి?

వసం—కాడు. పిచ్చివాడు కాడు. ఈయనకు మాటమాత్రం వకపట్టాన వినపడదు.

అన్న—ఇతడు యీ లోపలికి యెలాగు వచ్చినాడు?

వసం—ఈయన దొడ్డితోవను లోపలికి వచ్చినాడు. ఆయన గుర్రాన్ని తిన్నగా దొడ్లోకి తోలుకొనివచ్చి, అక్కడ గుర్రం దిగి, పట్టుకొమ్మని గుర్రం కళ్లెం నాచేతి కిచ్చినాడు. అప్పుడు నేను లోపల బస దిగడానికి స్థలం లేదని చెప్పినాను.

అన్న—మంచిపని చేసినావు. అంచుకు యిత డేమన్నాడు?

వసం—నవ్వి, "గుర్రానికి గుగ్గిళ్లకు శేరు వులవలు చాలును,

నీవు నాతో రానక్కర్లేదు. లోపలికి నేనే వెళ్తుతాను" అన్నాడు అప్పుడు నేను మాఅప్పతో మాట్లాడవలె ననాన్ను.

అన్న—దాని కేమన్నాడు?

వసం—"అబ్బాయీ! దీన్ని బాగాతోము" అని నాచేతులో ఏక రూపాయి పెట్టి తిన్నగా లోపలికి నడిచి వచ్చినాడు. అప్పుడు నాకు యేమి చెయ్యడానికీ తోచక నీతో చెప్పడానికి నేను కూడా వెనుక వచ్చినాను.

అన్న—స్థలం వుంటే గుర్రాన్ని పాకలో కట్టివెయ్యి.

వసం—కావలసినంతస్థలం వున్నది. ఇదుగో యితడు యిచ్చినది కొత్తరూపాయి సరి కొత్తరూపాయి. (అని వెళ్ళుచున్నాడు.)

అన్న—ఇతడు స్వంతయింట్లో వున్నట్లు సుఖంగా కాలిమీద కాలువేసుకొని కూర్చున్నాడు. ఇతడు బహుమంచివాడుగా కనపడుతూ వున్నాడు. ఇతనికి చెవుడు రావడంచూస్తే జాలి వేస్తూవున్నది. ఇతడు మంచి పడుచుతనంలో వున్నాడు. బహుచక్కనివాడు. అయినా యితడు యిక్కడనుంచి వెళ్ళిపోవలెనని చెపుతాను. (బిగ్గరగా) అయ్యా! పెళ్ళివారిచేత మాయిల్లంతా నిండివున్నది. ఇక్కడ స్థలంలేదు. మీరు మరివకచోట బస చూచుకోవలెను.

విజ—అమ్మా! అతడు వేళకు రాగలుగునో లేదో అని నాకు విచారంగానే వున్నది. కోర్టులో రేపువచ్చే కేజులలో మొట్టమొదటిదే అతనిది.

అన్న—ఇక్కడ బస దొరకదు. మీరు మరివకచోటికి వెళ్ళిపోవలెను.

విజ—సరే. నేను యీరోజున మీబసలోనే వుంటాను. నీవు బహు దొడ్డయిల్లాలవు. ఏకోంకపకారం నేను యీవూళ్ళోనున్న

న్నాళ్ళో మీ బసవిడిచి మరివకచోటికి వెళ్ళను. (అని పుస్తకము చదువు కొనుచున్నాడు)

అన్న—(గొంతుక సవరించుకొని) నేను గొంతుక బద్ద లయ్యే ట్టు యెంతబిగ్గరగా అరిచినా సక్క-మా టయినా యితనికి వినపడదు. ఇతడు బహు నెమ్మదిగానూ వినయంగానూ మాట్లాడుతూ వున్నాడు. ఇతడు యిక్కడ వుండడంవల్ల యింతవరకు యెవరిపనికీ అడ్డం రా వడంలేదు.

[ధనపాలుడు ప్రవేశించుచున్నాడు]

ధన—అన్నపూర్ణమ్మా! మేము యిలాగు భోజనంలేకుండా యెంతసేపు మాడదము? మేము సొమ్మి యిచ్చే టప్పుడు పెందరాళే మెతుకులు పడవేయనక్కరలేదా?

అన్న—నేను యెంతో తొందరపడే వంట చేయించినాను. నిష్కారణంగా కోపపడక కొంచెంసేపు శాంతం వహించండి. పని చేయించుకుని యిస్తూ వున్నారుగాని నాకు మీరు సొమ్మి ధర్మానికి యివ్వడంలేదు—ఓసీ! చండీ!

[చండిక ప్రవేశించుచున్నది.]

చండి—అమ్మా! యెందుకు పిలిచినాగు? మీ సెలవుప్రకారం వారికి గదిచూపి—

అన్న—నీవు వెంటనే మడికట్టుకొని వీరి భోజనానికి విస్తళ్లువేసి వడ్డన చేయించు.

ధన—చండీ! వేగిరం రా. మీయజమానురాలు చెప్పినట్లు వెంటనే చేయించు.

చండి—పక్షిలాగు యెగరడానికి నాకు రెక్కలులేవు. ఇక్కడ అక్కడా కూడా వక్కమాటే వుండడానికి నీకోసం దేవుడు నాకు

దేహాలు రెండైనా పెట్టినాడు కాడు. ఆట్టే తొందర పెట్టకండి. వెయ్యిమందికి సంతర్పణ చేసినప్పుడైనా నాకింతతొందర కలుగలేదు.

ధన—ఇది బాగా వున్నది. నౌకర్లు యిలా నిర్లక్ష్యంగా మాట్లాడుతూవుంటే నేను సహించలేను. పెద్దమనుష్యులు యిది తమ్మ అవమానంచేసినట్లు యెంచుకుంటారు. నీకు బుద్ధి చెపుతాను. నీవు ఇఖ ముందు యెప్పుడూ పెద్దమనుష్యులు మాట్లాడుతూవుంటే యెదురు జవాబు చెప్పకు.

చండి—పెద్దమనిషి నాతో మాట్లాడితే నేను యెప్పుడూ యెదురు జవాబే చెప్పను. (అని వెనుక తిరుగుచున్నది)

ధన—సరిసరి. బాగానేవున్నది. భోజనాలు రేపు చెయ్యవలెను గాని ఇఖ యివాళ వడ్డన అయ్యేటట్టే కనపడదు. దయచేసి లోపలికి వేగరంవెళ్లి వెంటనే వడ్డన అయ్యేటట్టు చెయ్యి.

చండి—అమ్మగారు కోపపడుతారుగాని లేకపోతే యితనికి బుద్ధివచ్చేటట్టు చేస్తాను. (అని వెళ్ళుచున్నది.)

ధన—అన్నపూర్ణమ్మా! బాగా విను భోజనాలవేళ యెవరైనా చక్కిలి అరటిపళ్లు తెమ్మంటే వెయ్యకు. అవిచాలా ప్రియం. ఆ ముసలాయన చక్కిలిపళ్లు తెమ్మంటే పొరపాటున పంపించినట్లు బొంతపళ్లు పంపించు. నేను చెప్పింది తెలిసిందా?

అన్న—భోజనానికి వచ్చినవారు యేవి కావలె నంటే అవల్లో వడ్డించి తరువాత సామ్మ పుచ్చుకోవడం యిక్కడ ఆచారం.

ధన—ఇదివరకు యేర్పరుచుకున్నప్రకారం పిండివంటలతోనూ కూరలతోనూ పెట్టే భోజనాని కయ్యే అర్థరూపాయికి మాత్రమే నేను జవాబుదారీ చేస్తాను. ఎవరైనా యెక్కువవస్తువులు కావలె నంటే వాటిసామ్మ వారివద్దనే పుచ్చుకోవలెను.

– [చండిక ప్రవేశించుచున్నది]

చండి—అయ్యా! వడ్డన అయింది. ఇఖ మీరు మీవారితో కూడా భోజనానికి రావచ్చును.

విజ—(లేచి) వడ్డనయిందటావా? ఇదుగో వస్తూవున్నాను.

(అని లోపలికి వెళ్ళుచున్నాడు)

ధన—ఇది మరీ బాగా వున్నది. అన్నపూర్ణమ్మా! తలకు అర్థ రూపాయి చొప్పున నేను సలుగురికేసుమా యిస్తానని చెప్పినాను. ఎక్కువమంది భోజనంచేస్తే అవతల నన్ను యివ్వమంటే నేనుయివ్వను. ఇప్పుడే చెప్పినాను.

అన్న—ఆహాహాహా!

ధన—నవ్వు. నీయిష్టం వచ్చినంత నవ్వు. నేను రెండు రూపాయలకంటె వక్కపమ్మిడీ యెక్కువ యివ్వను. వడ్డన యేగదిలో చేసినారో చూపింతువుగాని రా.

(అని ధనపాలుడును, అన్నపూర్ణమ్మయు వెళ్ళుచున్నారు)

తీ రంగము—భోజనములు చేసెడు పడటినుయిల్లు.

[విస్తరిముందు పీటమీద కూరచుండి విజయవర్మయు, సమీపములో నిలుచుండి చండికయు ప్రవేశించుచున్నారు]

విజ—(జనూళిర్చు) పుస్తకమును తీసి పత్రములు తిరుగ వేయుచు) మనకు కొనసీమ తోటలవల్ల సాలుకు రెండునేల యేనూరు రూపాయలు నస్తవి దాక్షారామ తాలూకాలో వున్నభూములను మూడునేల యేనూరు రూపాయలకు అమగకం చేసినాము. ఈయేడు

పంటలు బాగావుండవని అంటూవున్నారు. ఆలాగయినట్టయితే రహీతులను తొందరపెట్టక కొంత శిస్తు మానివేతాము. మండపేటకోమటి అయిదువేల రూపాయలు యీనెలాఖరులోగా తీర్చవలెను. పాపము! అతనికి వడ్డీ మానివేస్తాను. నాదగ్గిర యేభయివేల రూపాయలు నిలవవున్నవిగదా. అందులో పదివేల రూపాయలుపెట్టి యీగ్రామంలో ధర్మసత్రం వేయిస్తే బాగావుండేపేరట్టు తోస్తూ వున్నది. అయినాకానీ యీసంగతి సావధానంగా ఆలోచింతాము.

చండీ—ఈయన విస్తారం భాగ్యవంతుడు కావడమే కాకుండా ధర్మాత్ముడుగా కూడా కనబడుతూవున్నాడు. ఇతడు ధనపాలుని చుట్టం కామాల్సును. అందుచేతనే విందుకు పిలిచివుంటాడు.

(అన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది)

అన్న—చండీ! అన్ని వస్తువులూ జాగ్రత్తగా వడ్డించేటట్టు చెయ్యి. లేకపోతే ఆనిర్భాగ్యుడు ధనపాలుడు వచ్చి కాట్లకుక్కలాగు మనమీద పడుతాడు. ఈయన యిక్కడకు యేలాగు వచ్చినాడు?

చండి—ఆయనను మాటాడించక విను.

అన్న—ఆయనను మాట్లాడించడానికి బ్రహ్మాతరం గాదు. ఈగోడలతో మాట్లాడితే యెంత వినిపించుకుంటవో యీయనా అంతే వినిపించుకుంటాడు. ఈయనకు వల్లమాలిన చెవుడు.

చండి—పాపం ఇంత చిన్నతనంలో యీయనకు చెవుడు పట్టుకున్నదా! ఈయన బహు భాగ్యవంతుడు.

అన్న—ఈయన భాగ్యవంతుడని నీకు యెట్లా తెలిసినది?

చండి—ఆచేతులో వున్న పుస్తకం చదివి యీయన జమాఖర్చులు చూచుకొంటూవున్నాడు. మనం పావలాలు అర్థలూ లెక్కచూచుకునేటట్టుగా, ఈయన వేలూ లక్షలూ లెక్కచూచుకుంటూ

వున్నాడు.

అన్న—అలాగయితే యీ ఆయనను యిక్కడ కూర్చోనీ. ధన పాలుడు వచ్చి యేమయినా అంటే—

విజ—(తలయూచుచు) ఇక్కడ నవుకర్లు యెవరు వున్నారు?

చండి—ఈయన తనకువలెనే లోకానికంతా చెవుడయినట్లు యెంత బిగ్గరగా మాట్లాడుతూవున్నాడో! (అని సమీపమునకు వెళ్ళుచున్నది)

విజ—సరి. నీవే నా నవుకరువు? భోజనానికి యెంత ఆలశ్యం వున్నది?

చండి—ఆలస్యం లేదు. మీ సెలవు యెప్పుడయితే అప్పుడే వడ్డిస్తాము.

విజ—ఆహాహాహా! నేను నిన్ను అడిగినది ఆసంగతి కాదు. భోజనానికి యెంత ఆలస్యం వున్నదని అడిగినాను. (అన్నపూర్ణమ్మతో) అమ్మా! మీ నవుకరుకు కొంచెం చెవుకు కాబోలును. యీచిన్నది అందకత్తె.

అన్న — చండీ! ఈయన నిన్ను అందకత్తెవు అంటూ వున్నాడు. నీకంతే చాలునులే.

చండి—యీ ఆయనకు చెవులు చెడిపోయినా కళ్లు చెడిపో నందుకు సరిపోస్తూవున్నాను.

[ధనపాలుడును ఇందుముఖియు విశాలాక్షియు నుమంత్రిడును ప్రవేశించుచున్నారు]

ధన—ఇలాగురండి. మనకు మాత్రమే ప్రత్యేకంగా యీగది మాట్లాడినాను. ఇక్కడకు రెండోవారు రారు. మనం నలుగురమూ కలిసి యేకంగా భోజనం చెయ్యవచ్చును.

ఇందు—(విశాలాక్షితో రహస్యముగా) ఇతడు వెర్రివాడు లాగు వున్నాడు.

విశా—(ఇందుముఖితో రహస్యముగా) వూరుకో. అదుగో మనవిజయవర్మ వచ్చినాడు.

సుమం—పుస్తకంలో పత్రాలు తిరగవేస్తూ మనపీటమీద కూర్చున్నాడు. ఈయన యెవరు? ఇతడు మనవంక తలయెత్తి చూడ నైనా చూడడంలేదు.

ధన—అన్నపూర్ణమ్మా! మాగదిలోకి వచ్చి నా పీటమీద కూర్చున్నాడు. యితడు యెవరు?

అన్న—ఈయన యెవరో బహు తమాషావాడుగా కన బడుతూ వున్నాడు. నాకింతకంటె యేమీ తెలియదు. ఈయనను వుంచడమో పంపించివెయ్యడమో మీలో మీరే చూచుకోండి.

(అని వెళ్ళుచున్నది)

[అప్పు డిందుముఖియు విశాలాక్షియు సుమంత్రిడును తమ పీటలమీద కూరుచుండగా ధనపాలుడు తనకు పీట లేక నిలుచుండి విజయవర్మతో సంభాషణ కారంభించుచున్నాడు]

ధన—(విజయవర్మవీపుమీద తట్టి) అయ్యా! ఈగది మాది. మేము ప్రత్యేకంగా మాకోసం యేర్పరుచుకున్నాము.

విజ—మీరు బహుదొడ్డవారు. అక్కర లేదు. అగ్రస్థానమందు నేను కూర్చోను. మీఆదరణకు సంతోషించినాను.

ధన—మిమ్మలిని యిప్పుడు యెవరూ అగ్రస్థానమందు కూర్చో మనడం లేదు. మీరు యీగదిలోనుంచి తక్షణం లేచిపోవలెను. ఈ పీట నాది. (అని చేతితో పీట కొట్టుచున్నాడు)

నిజ—ఈ పీటమీదనుంచి లేచి మొదటిపీటమీద కూర్చో

మంటున్నారా? అక్కరలేదు. నాకు యిక్కడనే సౌఖ్యంగా వున్నది. పెద్దవాణ్ని ఆయననే ఆపీటమీద కూర్చోనియ్యండి.

ధన—ఈయన నామాట వినకుండావున్నాడు. మామగారూ! మీరు గట్టిగా చెప్పండి.

సుమం—పాపం ఈచిన్నవాడికి చెప్పుడని నీకు తెలియలేదా?

ధన—ఆమాట యితడు మొట్టమొదటనే నాతో యెందుకు చెప్పరాదు? అలాగైతే యిప్పుడు యీయనకు తెలిసేటట్టు చేస్తాను. (బిగ్గరగా అరచుచు) అయ్యా! ఇది నాగది. ఇది నాపీట; ఈయన నామామగారు; ఈ సుందరులు నా— (అని చూపుచున్నాడు)

విజ—చిన్నవాడవయినా నీయోగ్యత బహుదొడ్డది. అగ్నిస్థాన మందు కూర్చోకపోతే యీకన్యల యిద్దరిమధ్యనైనా కూర్చోమంటారా? అలాగే కూర్చుంటాను. పట్టుపట్టి అన్నిటిలోనూ మూర్ఖత్వం చెయ్యరాదు. (అని తనపీట వారియిద్దరిమధ్యను వేసికొని కూర్చున్నాడు)

ధన—(కోపముతో ఇటు నటు తిరిగి విస్తరి చేతబట్టుకొని) ఈ విస్తరి నాది. మీరు లేచిపోవలెను.

విజ—(విస్తరి చేతిలోనుండి పుచ్చుకొని) అయ్యా! నా నిమిత్తం మీకీ ఆయాసమంతా యెందుకు? మీరు తెచ్చియివ్వకపోతే యీవిస్తరి వడ్డనచేసేమనిషి తీసుకుని రాదా? మీరు శ్రమ పడకండి.

ధన—ఇది మరీబాగావున్నది. విస్తరిమాత్రమేకాదు. నాచెంబులజోడూ వెండిగిన్నెకూడా పుచ్చుకో. (అని కోపముతో తెచ్చి ముందు పడవేయుచున్నాడు)

విజ—(అవి పుచ్చుకొని తనవద్దపెట్టుకొని) అయ్యా! నేను

మీఋణం యెలా తీర్చుకోగలనో తెలియకుండా వున్నది. ఇంతమంది గృహస్థులను చూచినానుగాని మీఱువలె అతిథికి యింత శ్రద్ధాభక్తులతో స్వయంగా వుపచారం చేసేవారిని నేను యెక్కడా చూడలేదు. ఇకు మీరు వుపచారం చేస్తే నేను అంగీకరించను. ఎవరినైనా నవుకరును ఆజ్ఞాపించండి.

ధన—ఇప్పుడు నీకు వుపచారం యెవరు చెయ్యనచ్చినారు? నాకు స్థలంలేక నేను తంటాలు పడుతూవున్నాను. నేను యెక్కడ కూర్చోను? అలాగయితే నాకు భోజనమే అక్కరలేదు. నీవు పక్కడవే కూర్చుని భోజనం చెయ్యి. నేను వెళ్లుతాను. (అని కొంచెము నడుచుచున్నాడు)

విశా—అయ్యా! ఈ పెద్దమనిషికి చెవుకు. ఈయన చూస్తే ఘరానామనిషిలాగు కనపడుతూవున్నాడు. చెవిటివానితో వృథాగా యెందుకు ఆయాసపడుతారు? ఈయనను యీవిస్తట్లో భోంచెయ్యనిచ్చి మీరు మడివక విస్తరి వేయించుకొని కూర్చోండి.

సుమం—అవును. నీవు వేరే విస్తరి వేయించుకొని కూర్చో.

విజ—వడ్డన చెయ్యవచ్చును. నాఅభ్యంతరము లేదు.

(చండిక వడ్డించుచున్నది)

ధన—(చివరను కూచుచుండి) మామగారూ! మీరు యేమనుకున్నారోకాని యిదిమాత్రం బాగున్నదికాదు—చండీ! వేసుకున్న విస్తరి వకరికి విడిచిపెట్టి కడపజ్జాని కూర్చోవడం వ్యసనకరంగా వుంటుందో లేదో నీవుచెప్పు. నలుగురిలో తిరిగేవాడికి యింతకంటె అవమానం యేమిటి?

ఇందు—మీకు ఆసందేహం వుంటే నావిస్తరివద్ద యెగువను కూర్చోండి. (అని పోచుచున్నది)

ధన—అక్కర లేదు. అందుకోసం కాదు. కాని—

విజ—నావంటి కొత్తవాణ్ణి యీప్రకారంగా అందరికం టూ మొదట కూర్చోమని బలవంతపెట్టడం మీవంటి పరోపకార పారీణులకు తగివున్నది. మీరు చేసిన ఆదరణ నేను బ్రతికి వున్నంత కాలమూ మరిచిపోను. నామాట నమ్మండి.

ధన—ఆదరణాలేదు గీదరణాలేదు వూరుకో. నేను అన్న మాటలన్నీ నీకు వినపడ్డట్టయితే సిగ్గుమాలి యిటువంటి మాటలు యెప్పుడూ అనవు. చండీ! చండీ! వినుపించుకోవేమి? నాకు విస్తరి విస్తరి. తినడాని కారంభిస్తే బకాసురుడిలాగు యితడు పిండివంటలూ అన్నీ మింగివేస్తాడు. ఈవృకోదరుడు భోజనానికి మొదలుపెట్టకమునుపే నాకుకూడా వేరే వడ్డించు.

చండి—ఇల్లంతా తగులుపడిపోతూవున్నట్టు అలా అరుస్తా వేమయ్యా! మీకు యేమి కావలెను?

ధన—నాకు యేమి కావలెనా? ఈ చెనిటినాడు నావిస్తరి కడతేర్చినాడు. మరివకవిస్తరి కావలెను.

చండి—విస్తరా? (అని పరుగెత్తుచున్నది)

విజ—నేను చూచినవాటిలోకెల్లా యిది మహామంచి సత్రం.

ధన—ఇక్కడ అన్నిసౌకర్యము లయ్యగారికి యింకా బోధ పడలేదు. అయ్యా! వక్కసీముషం వోపికపెట్టు. అంతా తెలుస్తుంది.

విజ—మీరు నాకోసం కనిపెట్టుకొని వుండనక్కర లేదు. ఆరం భించండి. (అని తినుట కారంభించు చున్నాడు)

చండి—ఆహాహాహా! విస్తరి యిదిగోనండి.

ధన—ఎందుకు నవ్వుతావు? నవుకర్లు యిలాగు నవ్వడం నేను యెక్కడా చూడలేదు.

చండి— ఆభోజనం చేసేవారితో మీరు కలుసుకోవడానికి యెంతో తొందరపడవలెనుగదా అని నవ్వుతూ వున్నాను. ఈవిందు కయినసొమ్మంతా యిచ్చుకోవడం మీరేకదా?

ధన—సొమ్మా? నేనే యిచ్చుకోవడం! నాకూ ఆముగ్గురికీ నేనే యిస్తాను. నేను యెన్నడూ ముకూ— మొగమూ యెరగని ఆకొత్త వాడి తిండికి మాత్రం నేను యివ్వను. ఇప్పుడే చెపుతూవున్నాను.

సుమం—ఆలా అనడం సిగ్గులచేటు. అటువంటి పెద్ద మనిషి తనభోజనానికి. నిన్ను యి మ్మంటూ డగుకొన్నావా యేమిటి? అతడు నీవు యిచ్చినా వప్పుకోడు.

విజ—ఓసుందరులారా! ఈకూర బహుబాగావున్నది. మీకు తెప్పింతునా?

విశా—ధనపాలా ! ఇతడు చెపిటివాడయినా యెంతమర్యాదగా మాటాడుతూ వున్నాడో చూచినావా?

ధన—పొగడండి. ఇంకా పొగడండి.

విజ—కాంతలారా! క్షమించండి. మీరేమో మాట్లాడుతూ వున్నట్టునాన్నారు.

ధన—ఈనిడె మీసంభాషణ బహుమర్యాదగా వున్నదంటూ వున్నది. హాహాహా!

విజ—బాగానే వున్నది. కాని యిది నిలవవుండదు. ఇకి వకి మాసం పోయిన తరువాత పెడితే చాలకాలం నిలవవుంటుంది.

ధన—చండీ! నాకు మాత్రం వక్క చక్కికేళీ అరిటిపండు తీసుకుని రా. దాని ఖరీదు నేను వేరే యిస్తాను.

చండి—ఖరీదు పండు వక్కంటికి రెండేసి డబ్బులు. త్వరగా పండు. (అని క్రిందపెట్టుచున్నది.)

పీజ—(చటుక్కున పుచ్చుకొని) ఈపండు నాకోసం తెప్పించి నారా? మీరు చాలా మంచివాళ్ళు.

(అని యొలుచుకొని తినుచున్నాడు)

ధన—నేను తినవలెనని ఆశపడి యెంతో మంచిపండు తెప్పించుకుంటే యీగిజిగాడు మధ్య యెగరవేసుకుని పోయినాడు. ఇతనికి చెవులు పోయినట్లే కళ్ళుకూడా పోయినట్లయితే బాగా వుండును.

ఇందు—ఆహాహాహా! ఈశాపనార్థాలన్నీ వక్క అరటిపండు కోసమా?

ధన—నాకు యిష్టమయినది. వక్కఅరటిపండే.

విశా—ఇక్కడ దానితోక్క లున్నవి. అవి యిస్తునా?

ధన—కావలిస్తే ఆతోక్కలు నీవే తిను. నా కక్కర లేదు. నన్నందరూ వేళాకోళాలు చేస్తూవున్నారు. నేను విస్తరి విడిచిపెట్టి లేచి పోతాను. (అని లేవబోవుచున్నాడు.)

సుమం—లేవకు. కూర్చో కూర్చో.

ధన—(కూరుచుండి బిగ్గరగా విజయవర్మతో) అరటిపండు నిమిషంలో మాయం చేసినావు.

విజ.—పానకమా? ఏది తెప్పించినా తెప్పించ వచ్చును. ముందుగా యీఆడంగుల కేది యిష్టమో అది తెప్పిస్తే బాగా వుంటుంది.

ధన—ఆహాహాహా! ఏది యెలాగువున్నా నీమూలంగా మాకు కొంత వినోదమాత్రం కలుగుతూవున్నది.

విజ—అమ్మా! యింకా ధది చక్రికేళిపళ్ళు తెప్పించు. కొన్ని వీరికి కొన్ని నాకూ ఉపయోగపడతవి.

చండి—చిత్తము. (అని పరుగెత్తు చున్నది)

ధన—చండీ! ఆగు ఆగు. అర్ధరూపాయిలో నేను చక్రకేళి

అరటిపళ్ళు వెయ్యడానికి యేర్పరుచుకో లేదు. నేను నలుగురికీ నాలు గర్థలకంటె యెక్కువ యివ్వను తేవద్దు.

[చండి అరటిపండ్లత్తము చేతఁ బట్టుకొని ప్రవేశించి పండ్లు విజయువగ్గ చేతి కిచ్చు చున్నది]

విజ—(ఒక్కొక్క విస్తరిలో రెండేసి పండ్లు వేసి) పనస తొనలా? అవీ తెప్పిస్తాను. అమ్మా! యిందాకా నట్టింట బుట్టలో పెద్ద పనసతొనలు చూచినాను. వాటిలో యిరవై తొనలు తీసుకొని రా.

చండి—అవి పరిశ్రమయిన తేనెపనసతొనలు. తొనవక్కంటికి డబ్బు ఖరీదు. నిముషంలో తెస్తాను. (అని వెళ్లుచున్నది.)

ధన—పనసతొనలా ?

విజ—వీటి ఖరీదుకూడా మీరే యిస్తా మంటూవున్నారా ? మీ ఔదార్యము నాకు యిదివరకే తెలిసింది. మీరు నాకు చేసిన గౌరవాలలో యిది వకటి. అవుదార్యం మాట అటువుండగా మీరు చేసే హాస్యంవల్ల వినోదంగా వుండి నాకు జాము నిముషంగా పోద్ది జరుగుతూ వున్నది.

[పనసతొనలతో చండిక మరల ప్రవేశించుచున్నది]

ధన—చండీ! నేను చెప్పేది బాగా విను. ఈపనసతొనలూ పళ్ళూ చెవిటివాడు తెమ్మన్నాడు. వాటి ఖరీదుకూడా చెవిటివాడే యిచ్చుకోవలెను. నేను యిందులో వక్కటి తినను.

చండి—మాఅమ్మగారు యివన్నీ మీపద్దులోనే వేస్తారు. కావలిస్తే తరువాత మీరూ యీయనా లెఖ చూచుకొని సరి పెట్టుకోండి.

విజ—అయ్యో! ఈరోజు నాకు మీ సహపంక్తిని భోజనం లభించి నేను కృతార్థుణ్ణి అయినాను. ఈ యతిథిసత్కారము నేను మరవను.

ధన—మాయింటికంటె నీవు యముడియింటికి అతిథి వైతే నాకు బహుసంతోషంగా వుంటుంది.

విజ—ఇదంతా మీ ఆశీర్వచన ఫలం. దేవుడు మీరు కూడా ఆలాగే అనుగ్రహించవలెనని నామనస్ఫూర్తిగా ప్రార్థిస్తూ వున్నాను.

సుమం—అయ్యా! మీకీబధిరత్వం పుట్టినప్పటినుంచీ వున్నదా? మధ్య యేదయినా కారణంచేత వచ్చిందా?

విజ—లేదు లేదు. పనిమీదనే వచ్చినాను. నాకు యిక్కడ జరూరైనపని వున్నది.

ధన—ఆహాహాహా! మళ్ళీ ప్రసంగ మారంభ మయినది.

విజ—నేను యిక్కడకు వచ్చినపని బహుముఖ్య మైనది.

సుమం—చాలును. మీకథ నాకక్కరలేదు.

విజ—నామామగారు—కాదు నాకాయన మామవరుస అవుతాడు—ఆయన తన కూతురిని ఆచిన్నదాని యిష్టం లేకుండా వక నిర్భాగ్యుడి కిచ్చి వివాహం చెయ్య తలచుకున్నాడు. ఆవివాహం మాన్పించవలె నని యిక్కడకు వచ్చినాను.

ధన—నీవు కావలసినంతసేపు వాగు. నీమాటలు వినకుండా నేను భోజనం చేస్తూవుంటాను.

విజ—ఆచిన్నది అప్సరసవంటిది. ఆయన వివాహం చెయ్య దలచుకున్నవరుడు కేవల పశుపాయుడు. ఆ పశుపాయుడు నేను చెప్పిన తరువాత కూడా నామాట వినకపోతే, అతని రెండు చెవులూ మొదలంటా కోసిపెయ్యవలెనని నిశ్చయించుకుని వచ్చినాను.

ధన—(పనసతొనలు దూరముగా తోయుచు) నీకు చెవులు కొయ్యడమంటే తృణప్రాయంగా వున్నది.

విజ—నేనుహృదయపూర్వకంగా చెపుతూవున్నాను. అవినీవే.

ధన—నావా?

విజ—నవ్వులాటకు కాదు. నేనదిమనసూ్ఫ్.ర్తిగా చెప్పినమాటే.

ధన—నీవు యీలాగు మోటతనంగా మాట్లాడుతా వని మొదటిలోనే తెలిసివున్నట్టయితే నిన్ను యీగదిలోకి రాకుండానే పడగెంటుదును. మీరంతా చూస్తూవుండండి. నేను యీ అవమానం సహించేవాణ్ణి కాను.

విశా—ఇందుముఖీ! మనము లేచి వెళ్ళి చేతులు కడుక్కుం దామా? (విజయవర్మతక్క– అందరును లేచుచున్నారు. ఇందుముఖియు విశాలాక్షియు వెళ్ళుచున్నారు)

విజ—భోజనా లయినవా?

ధన—నీది కాకపోతే నీవు మళ్ళీ ఆరంభించు. నీ కేమి? నీవు పొట్ట బద్దలయ్యేటట్టుగా చెడతిన్నావు. నాకు నాలుగుముద్ద లైనా లోపలికి పోలేదు. (కొంచె మాలోచించి) చండీ! చండీ! వేగిరం యిలాగు రా.

చండి—వచ్చినాను. పనియేమిటో చెప్పండి.

ధన—నీవు పరుగెత్తుకుని వెళ్ళి మాభోజనాల కెంతయిందో పద్దువాయించుకుని రా. పో—ఓ చెవిటి మొద్దా! నీవు తిండి బహు బాగా తిన్నావు. ఇఖ డబ్బు యెలాగు యిస్తావో చూడవలెను.

చండి—వసంతసేనుడిచేత వాయించుకొని వస్తాను. (అని వెళ్లుచున్నది)

విజ—(ముందుకువచ్చి) మనం వెళ్ళకముందు సొమ్మ యివ్వ వలెను. చక్కికేళీపళ్ళకుకూడా మనం ఖరీదు యివ్వావలెను.

ధన—మనమేమిటి? చక్కికేళీపళ్ళకు నీవొక్కడవే యిచ్చుకో వలెను. అవి కావలెనని తెప్పించినది నీవే కాని నేను కాదు.

విజ—నిశ్చయంగా కాదు. మొట్టమొదట నే నలాగుద్దేశించు కున్నాను. (సుమంత్రుని జూపుచు) ఈ ముసలాయనకు దానితో యేమీ పని లేదు.

ధన—మాభోజనాలకు నేను యిస్తాను. చక్కికేళీ పళ్లతోనూ పనసతొనలతోనూ నా కు జరూరు లేదు.

విజ—మీ రింతగా నిర్బంధపరుస్తూ వున్నారుగనుక మీర న్నట్టే కానియ్యండి. ఇంకొకసారి మనమంతా కలిసి భోజనం చేసి నప్పుడు పనసతొనలఖనీ దంతా నేనే యిస్తాను.

ధన—యేమిటి?

విజ—నావద్ద సొమ్ము యెంతవున్నదో చూడవలెను. (అని మూట విప్పి చూచి) ఈనాలుగణాలును నాభోజనానికి. మిగిలిన అణాన్నరా యీవడ్డన చేసినావిడకు యిస్తాను.

ధన - భోజనానికి మనిషివక్కంటికి యెనిమిదణాలు.

విజ—పూర్వ మలాగే వుండేది గాని యిప్పుడు వస్తువులన్నీ ప్రియం కావడంచేత ప్రతిపూటకూటి యింట్లోనూ నాలుగేసి అణాలే పుచ్చుకుంటూ వున్నారు.

ధన— (అర్ధరూపాయ చేతబట్టుకొని విజయవర్మకు చూపి) ఎనిమిదణాలు. నీకు చెవులు వినబడకపోయినా కళ్లు కనపడతవనుకుం టాను. నీవు యెనిమిదణాలు యివ్వనలెను.

విజ—(ఆశ్చర్యముతో) ఆఁ! ఏమిటీ?

ధన—నీవు యెనిమిదణాలు యివ్వనలెను.

విజ—మీ రాదరణ చేసి శ్రమపడడమే కాకుండ మీనాలు గణాలు నా నాలుగణాలూ కలిపి యెనిమి దణ్ణాలూ మీరే యిస్తా మంటారా?

ధన—నీభోజనానికికూడా నేను యిస్తానా? అయ్యా! మీరు న్యాయం విచారించండి. ఇదిగో యింటి యజమానురాలు వచ్చింది.

[అప్పుడు పద్దుపట్టుకొని అన్నపూర్ణమయు చండీకయు ప్రవేశించుచున్నారు]

ధన—అన్నపూర్ణమ్మా! ఆపద్దు అతనికి చూపించి భోజనానికి మనిషి వక్కంటికి యెనిమిదణాలని చెప్పా.

అన్న—అయ్యా! పద్దు.

విజ—అమ్మా! యీపుణ్యాత్ముడు నాకు సమస్తోపచారాలూ చెయ్యడమే కాకుండా నాకయిన సొమ్ముకూడా తానే యిస్తానంటాడు.

ధన—నేనా? నేనా? నీసొమ్ముకూడా నేనే యిస్తే నీకు యీ వేళ కడుపునొప్పి రాకుండా తిన్న అన్నం అరుగుతుందీ?

విజ—ఈసారి మే మంతా ఇక్కడ మళ్లీ భోజనం చెయ్యడం తటస్థ మయితే—నేను చెప్పేది వినపడుతూ వున్నదా?—అందరి సొమ్మూ నేనే నీకు—(అని లేచుచున్నాడు)

ధన—లేచిపోక నేను చెప్పినమాట తిన్నగా విని మరీ వెళ్లు.

సుమం—ఇంతకంటె నీవు చెప్పదలచుకొన్నది వక కాగితం ముక్కమీద వ్రాసి చేతికిస్తే బాగా వుంటుంది.

ధన—ఈ చెనిటివాడికి చదవడం వచ్చునో రాదో యెవరికి తెలుసును?

సుమం—వక కాగితంమీద వ్రాసి, అసలు నీకు వ్రాతవచ్చి నట్లు కనపరుతూ.

ధన—వ్రాసి కనపరిస్తే బాగానే వుంటుంది. చిన్నతనంలో పంతులు నాకు వ్రాత తిన్నగా నేర్పినాడుకాడు. అయినా కానీ వ్రాస్తాను చండీ! మంచికలమూ కాగితమూ సిరాబుడ్డి యిలాతీసుకొని

రా. నాపెళ్ళాం—ఆహాహాహా—నాపెళ్ళాం—ఆహాహాహా—వచ్చిం దని కూడా నాబంధువులకు వుత్తరం వ్రాయవలెను.

విజ—నేను యెంతబతిమాలుకున్నా యితడు పుచ్చుకోకుండా వున్నాడు గనుక, ఓచిన్నదానా! యీసొమ్మంతా నీవే పుచ్చుకో.

(అని చండీక కిచ్చుచున్నాడు)

చండి—(పుచ్చుకొని) మీతల్లికడుపుచల్లగా మీరు వెయ్యేళ్ళు వర్ధిల్లవలెను—ధనపాలా! మీకు కావలసిన వస్త్రాలు అగూట్లో వున్నవి.

ధన—(పుచ్చుకొని వ్రాసి) అయ్యా! మీకు చదువువస్తే యిది చదవండి. (అని కాగితమును చేతి కిచ్చుచున్నాడు)

విజ—(పుచ్చుకొనిచూచి) "చెవిటిబాటసారికి"—ఇదియెవరిని వుద్దేశించి అన్నమాట? నిజంగా నాకు చెవుడే అనుకున్నా పెద్దమనిషి అయిన వాడికి యిలా వ్రాయడం మర్యాదగా వుంటుందా? నీవువట్టి బుద్ధిహీనుడవనుకో. అప్పుడు "ఈలోకంలో వుండే వారిలో నెల్లా బుద్ధిహీనుడయినవానికి" అని నిన్ను వుద్దేశించి నేను వ్రాస్తే బాగా వుంటుందా?

ధన—అదంత ముఖ్యమైనదికాదు. తరువాత చదువు.

(అని చేతితో చూపుచున్నాడు)

విజ—"నీవు భోంచేసింది దాకేపొయ్యేవారితో కాదు. వక మర్యాదాగృహస్థు చేయించిన వంటలో"—(ధనపాలునితో) ఆనూళ్ళే మొట్టమొదట యెందుకు చెప్పలేక పోయినారు? మొదట్లోనే మీరు నాకు చెప్పినట్టయితే పూటకూటివాళ్ళకిచ్చినట్లు డబ్బు యివ్వావచ్చి మీమనస్సుకు నొప్పి కలుగ చెయ్యకపోదును.

ధన—కడతేరా చదవండి. (అని విజయవర్మ చేయి పుచ్చుకొనుచున్నాడు)

విజ—"మనిషి వక్కంటికి అర్థరూపాయి చొప్పున నేను నలుగురికి మాత్రమే భోజనానికి నిర్ణయించినాను. పిలవకుండా వచ్చిన వాళ్ళకు విందు చెయ్యడం నాకు ఆచారం లేదు గనుకనూ, నీవు పిలవకుండా వచ్చినవాడవు గనుకనూ, నీభోజనానికి నీవే యిచ్చుకోవలెను. చిత్తగించవలెను. విధేయుడు ధనపాలుడు"—అంతే కద ? సంతోష పూర్వకంగా యిస్తాను. (అని బట్టకొంగుమూట విప్పి లెక్క చూచి) ఇవిగో ఫదణాలు. ఇందులో అర్థరూపాయి నాభోజనానికి. రెండణాలు నావంతుకు నేనుపుచ్చుకొన్న అరటిపళ్ళకూ పనసతొనలకూను.

ధన—తక్కిన అరటిపళ్ళకూ పనసతొనలకూ యెవరు యిస్తారు?

విజ—(చండికతో) అమ్మా ! నీకు యిందాకా యిచ్చినది నీవే పుచ్చుకో. (అని లేచి నడుచుచున్నాడు)

చండి—ఈయన బహు ధర్మాత్ముడు.

ధన—చండీ ! ఈసొమ్ము నీకు నాముూలంగా వచ్చింది. నన్ను పొగడవలెను.

చండి—మీరుకూడా మంచి బహుుూపం చేస్తే, ఆలాగే పొగుడుతాను. అమ్మగారు మానిమిత్తం కనిపెట్టుకుని వున్నారు. ముందుగా మీరు యివ్వనలసింది యివ్వండి.

ధన—మామగారూ ! నాకు నిద్రవస్తూ వున్నది. వేగిరం వెళ్ళి పడుకోవలెను.

సుమం—ముందుగా సొమ్మిచ్చిపొమ్మా.

ధన —సొమ్మా? దానికి తొందర లేదు. అన్నపూర్ణమ్మ గారు బాగా యెరుగును.

సుమం—నీవు ఆయనను యిమ్మని అంతతొందర పెట్టినప్పుడు నీదికూడా నీవు వెంటనే యిచ్చి వెయ్యవలసినదే.

అన్న—ఆయన చెప్పింది బాగుంది. మనవ్యవహారం ఇప్పుడే పరిష్కారం కావలెను.

ధన—ఇప్పుడే పరిష్కారం కావలెనేమి? ఆలాగైతే ముందు మీ సతానికి మేము బాగానేవస్తాము. నాడబ్బు నీవు పుచ్చుకోవడం ఇదే ఆఖరుసారి. తెలిసిందా? నేను ఇప్పుడు ఇవ్వవలసింది నలుగురికీ నాలుగర్థలు రెండు రూపాయలు. ఇవిగో పుచ్చుకో.

అన్న—(చేయిచాచి పుచ్చుకొని) ఇక పనసతోనలకు నాలుగణాలు అరటిపళ్ళకు నాలుగణాలూ వెరసి యెనిమిదణాలు రావలెను.

ధన—రెండురూపాయలూ గాక ఇంకా యెనిమిదణాలా? ఈ సారికి ఇస్తాను. పుచ్చుకో, ఇకముందు ఇలాగంటి వస్తువులు యెవరు తెమ్మంటారో వారే ఇచ్చుకోవలెనుగాని నేను ఇవ్వను సుమా. (అని ఇచ్చుచున్నాడు)

చండి—అయ్యా! నా బహుమానము. (అని చేయి చాచుచున్నది)

ధన—చండీ! నీవు వెళ్ళి దీని పక్కగదిలో నాపరుపు దులిపి పక్క వేసిరా. కదలవేమి? నాకు నిద్ర వస్తూవున్నది. వేగిరం వెళ్ళి పక్క వేసిరా.

చండి—ఇతడు వట్టి పిసినిగొట్టు. (అని వెళ్లుచున్నది)

ధన—(లేచి వేళ్లు లెక్క పెట్టుకొనుచు గదిలో తిరుగుచు) అబ్బో! రెండురూపాయలన్నరా? ఇంతసొమ్ము నేను ప్రతిసారీ ఖర్చు పెట్టలేను.

అన్న—నేను సెలవు పుచ్చుకుంటాను. (అని వెళ్లుచున్నది)

సుమం—ధనపాలా! నీతో మాట్లాడవలసి యున్నది. నాతో కూడా నాగదిలోకి వచ్చి పక్క అరగంటసేపు మాట్లాడి వెళ్తావా?

విజ——(లేచి ముందుకు వచ్చుచున్నాఁడు)

ధన——నేను యిప్పుడు రాను. నాకు యింకా ఆకలి తీర లేదు. మీరు వెళ్ళండి. నేను యింకా వక అరఘంటసేపు యీగదిలోనేవుండి తరువాత వెళ్ళి యీపక్క-గదిలోనే నాపరుపుమీద పసుంటాను.

విజ——(వారికి తెలియకుండా మెల్లగా నడచి ధనపాలునిపడక గదిలోనికి పోవుచున్నాఁడు)

ధన——మామగారూ! సెలవియ్యండి. నమస్కా-రము.

సుమం——దీర్ఘాయుష్య మస్తు! (అని లేచి నడుచుచు తనలో) వీడా నాఅల్లుడు? వీడు వట్టి లుబ్ధాగ్రేసర చక్రవర్తి. తెల్లవారేలోగా యీవివాహం తప్పించుకోవడానికి యేదయినా వుపాయం దొరికితే యితనికి యిదే ఆఖరు సెలవిచ్చి పంపివేస్తాను. నాకూతురికి యితని కంటె ఆ చెవిటివాడే తగినవరుడుగా కనపడుతూ వున్నాడు. అతనికి వక్క- చెవులు లేవుకాని యితనికి బుద్ధేలేదు. (అని వెళ్ళుచున్నాడు)

ధన——నా మామగారు వట్టి బుద్ధిహీనుడుగా కనపడుతూ వున్నాడు. నేనట! తనతో అరగంటసేపు వంటరిగా మాట్లాడవలెనట! నా తెలివిచూస్తే అతనిమనస్సునకు ఆశ్చర్యం కలిగి వుండవచ్చును. నేను యివన్నీ నాగదిలో పెట్టుకుని తింటాను. (అని మిగిలిన అరిటి పండ్లను పనసతొనలను పిండివంటలను పోగుచేసి మూట కట్టుచున్నాఁడు)

[అంతట చండిక ప్రవేశించుచున్నది]

చండి——అయ్యా! మీపక్క వేసివచ్చినాను. నేను వచ్చేటప్పుడు తనలో తాను "యీరాత్రి గదిలో సుఖంగా నిద్రిపోవలెను" అనుకుంటూ మీ చెవిటాయన మీగదిలోకి వెళుతూ వున్నాడు.

ధన——(నోటిలోనున్న బూరెముక్క-నమలి తొందరగా మ్రింగి)

ఈ చెవిటి గాడిదకొడుకు పొడుగునా నాకే—(కోపముతో పిడికిలి పట్టి) ముక్కు-మూవ వక్క-గుద్ది గుద్దుతాను— (తలుపునద్దకువెళ్ళి) కుక్క-లకొడుకు తలుపు లోపల గొళ్ళెం వేసుకున్నాడు— (తలుపు గుద్దుచు బిగ్గరగా) ఓరి చెవిటివాడా! ఈగది నాదిరోయి. నాగదిలో నుంచి యివతలికిరా.

విజ—(లోపలినుండి) ఇక్కడ నిశ్శబ్దముగా వున్నది. ఇఖ సుఖంగా నిద్రిపోవచ్చును.

ధన—(తలుపు గుద్దుచు) ఓహోయి! ఈలోపలిది నాపరుపు. లేచిరా. వేగిరం లేచిరా. (అని మరింత బిగ్గరగా గుద్దుచున్నాడు)

చండి—అయ్యా! మీచప్పుడునల్ల యీయింట్లోవున్నవాళ్ళం దరికీ నిద్రాభంగం కలుగుతుంది.

ధన—నాకు పడుకోవడానికి పరుపు లేనప్పుడు యితరులకు నిద్రాభంగమైతే నాకేమి? కాకపోతే నాకేమి? నేను యిప్పుడు యీత లుపు బద్దలుకొట్టుతాను. (అని తలుపు కాళ్ళతో తన్ని చేతులతో గుద్దుచున్నాడు)

విజ—గాలి మహా వేస్తున్నది. ఇది పాడు రాత్రిగా వున్నది.

ధన—ఇదిగాలికాదు. నేను నేను. తలుపులు బద్దలు కొడుతూ వున్నది ధనపాలుడు. నాగది నాకు విడిచిపెట్టివేసి నీవు మరివక చోట చూవు!

[అన్నపూర్ణమ్మ ప్రవేశించుచున్నది]

అన్న—ఇక్కడ యీచప్పుడంతా యేమిటి?

ధన—ఆచెవిటిముండాకొడుకు నన్ను వెలుపలపెట్టి లోపల తలుపు గడియపెట్టుకున్నాడు.

అన్న—అయినాకానీ నీవలాగు తలుపు బద్దలుకొట్టకూడదు.

ధన—తలుపులు బద్దలవుతవని నాకేమీ భయంలేదు.

అన్న—నీకు భయంలేదు కాని నాకు వున్నది—ఓసి చండీ! నీవు పోలీసుస్టేషనుకు వెళ్ళి వేగికం వక కనిస్టేబులును తీసుకునిరా.

విజ—ఇదంతా చూస్తే నేను చురదృష్టవంతుణ్ణిగా వున్నాను.

ధన—అడుగో! అతడు లోపల మూల్గుతూ వున్నాడు.

విజ—పగటివేళ నాచెవుడువల్ల అంత బాధలేదు గాని రాత్రి వేళ యిటువంటి పరాయిస్థలంలో అపాయకరంగా వుంటుంది. నా చందుగా పెట్టిలో మూడువందల కాసు లున్నవి. ఈపత్రాలలో తలుపులు వూడితే మొగిరిపోతవి. దొంగలు లోపల చొరపడి నన్ను నిముషంలో దోచుకుని పోవచ్చును. ఈచెవుడులో పిడుగులు పడుతూ వున్నా నాకు నిదర్ర మెలుకువ రాదు. నేను మంచం తలుపునగ్గిరగా వేసుకుని యీపెస్తోలితో—

ధన—(తలుపుదగ్గఅనుండి పక్కకు తొలగుచున్నాడు)

విజ—గుళ్ళబారుపెట్టి మొట్టమొదట యీగదిలో అడుగు పెట్టినవాణ్ణి తల మొగిరిపోయేటట్టుగా కాలుస్తాను. యీగుండు దెబ్బ గోడలలోనుంచికూడా దూరిపోతుంది!

ధన—(మరింత వెనుకకు జరుగుచున్నాడు)

అన్న—ఈరాత్రి నీ పనుపు మొలాగు రాదు. అది నిశ్చయం. ఇక గదిలోకి వదులుకొని కావలిస్తే యీబల్లమీద పడుకో.

ధన—నేను బల్లమీద పడుకోలేను. నాపళ్లు వత్తుకుంటుంది.

అన్న—మాయింట్లో యీబల్లతప్ప మరి యేమీలేదు. నీవు దీనిమీద పడుకునేదీ లేనిదీ యిక్కడ కూచుండి సావకాశంగా ఆలోచించుకుంటూవుండు. నేను వెళ్ళి పడుకుంటాను.

ధన—ఈరాత్రికి యీబల్లమీద పడుకుని చూస్తాను—

చండీ! నాకు వకదుప్పటి తలగడా తీసుకొనిరా.

చండి—ఇవిగో అవి యిక్కడనేవున్నవి. (అనియిచ్చుచున్నది.)

ధన—(పక్కవేసుకొని పరుండి) ఈ చెవిటివాడన్నట్లు యీ యింట్లో యెలాగంటి మనుష్యులున్నారో తెలియదు. దొంగలు దాక్కుని వుంటారని విన్నాను—ఓహో! యెవళ్ళో వస్తూవున్నట్టు న్నారు.

[వసంతసేనుడు ప్రవేశించుచున్నాడు]

ధన—ఆవచ్చేది యెవరు? ఓవసంతసేనా! నీవా! రా. మంచి సమయానికి వచ్చినావు.

వసం—ఏమి? ఏమి?

ధన—చెపుతాను విను. అతడు—అతడు—

వసం—అత డేమిటి?

ధన—అతని పిస్తోలు తలుచుకుంటే భయంవేస్తూవున్నది కాని లేకపోతే—

వసం—యేమి పిస్తోలు?

ధన—యేమీ లేదు. అతణ్ణి—అతణ్ణి—అతనికి వినబడుతుంది. మెల్లిగా మాట్లాడవలెను—వీడు దుష్టుణ్ణి నీకు యేమైనా యిస్తే తీసుకొనివెళ్ళి గుర్రపుతబేలా వద్దవున్న తూముకాలువలో పడవెయ్యగలవా?

వసం—అత డంతగా దుష్టుడైతే ఆపని నేను చెయ్యలేనుగాని నాతరపున బలమైన మనుష్యులను యిద్దరిని తీసుకునివచ్చి వాళ్ళ చేత చేయించగలను.

ధన—ఈఆలోచన దివ్యంగా వున్నది. యేమి చెయ్యవలెనో చెపుతానువుండు. వాళ్ళను తీసుకునివచ్చి సిద్ధంగావుంచు, నేను దొంగ

దొంగ అని కేక వెయ్యడంతోటే, ఆగదిలో వున్న దుష్టుణ్ణి వెలు పలిక యీడ్చుకునివచ్చి మెత్తగా దంచవలెను. నీకు నేను యేమిస్తా నా?—ఈరోజున నాకు వూరికే ఖర్చులే అవుతూ వున్నవి.

వసం—ఏమిస్తారు?

ధన—నాకు సొమ్మ్ర లక్ష్యం లేదు. పూర్తిగా వక్కరూపాయ యిస్తాను. నాలుగక్షరాలు రెండు రూపాయలు భోజనానికి. ఆర్థరూపాయి పళ్లకు. వకరూపాయి తూములకాలువలో పడ వెయ్యడానికి. అబ్బో! యీవేళ మూడురూపాయలన్నర ఖర్చా?

వసం—అంతకు తక్కువైతే, నేనాపనికి వప్పుకోను

ధన—అతను నాస్థలం ఆక్రమించుకొన్నాడు; నా భోజనం తన పొట్టను పెట్టుకున్నాడు; నాపరువు కడతేర్చినాడు. పోనీ డబ్బు పోతేపోయింది. రూపాయి యిస్తాను. పెద్దమనిషిని నామాట నమ్మ్ర. పని చెయ్యడంతోటే తెల్లనిరూపాయి తెచ్చి నీచేతులో పెడుతాను. (అని యేమో యాలోచించుకొనుచున్నాడు)

వసం—ముందుగా రూపాయి చేతులో పడితేనేగాని పని జరగదు. నేను యిందులో తటస్థంగావుండి సయివాళ్ళచేత చేయిస్తాను. వాళ్ళయిద్దరికీ కల్లుకు చెరివక పానలా యివ్వనలెను. పని జరగడంతోటే వాళ్లు వక్కసిట్టకు కనబడకుండా నూయ్యమై పోతారు. తక్కిన అర్థరూపాయీ నేను పుచ్చుకుంటాను.

ధన—సరే. డబ్బుపోయినా యెలాగయినా నాపగ తీర్చుకుంటేనేకాని నామనస్సుకు విశ్రాంతి వుండదు. నీ వీరహాస్యం యెక్కడా బయలు పెట్టకూడదుసుమా!

వసం—ఇకరిదగ్గిరవూటలు వకరిదగ్గిర నేను యెప్పుడూ చెప్పను. అసలు నాస్వభావమే అట్టిదగుటచేగామ, ఈపని యెవరుచేసినారో

బ్రహ్మకు తెలియునియ్యును.

ధన—నేను పడుకుని నిద్రపోతూవున్నట్టు నటిస్తాను. నేను ముందులో యేమీ యెరగనట్టు నర్మంవలెను. ఇదుగో రూపాయ. మహామంచి రూపాయ. (అని యిచ్చుచున్నాడు)

వసం—పుణికి మంచిలాగే కనబడుతూ వున్నది. చెల్లుతుంది గద? నేను పెళ్లి వస్తాను. (అని వెళ్లుచున్నాడు)

ధన—ఇప్పుడు నే నాచెవిటిపెద్దమ్మవారిపని పట్టిస్తాను. అయి నా కానీ నేను యిక్కడ పరుండి నిద్రపోతూవున్నట్టు నటిస్తూవుంటాను. ఏమీ యెరగనట్టు వుండి చెవిటివాడు తూముకాలవలో ప్రవేశించడం తోటే నేను మెల్లిగా నాగదిలో ప్రవేశిస్తాను. (అని బల్లమీద పరుండి కన్నులు మూసికొని) తూముకాలువలో పడ్డప్పుడు చెవిటివాడికి యెంత కోపం వస్తుందో! గొంతుక బద్దలయ్యేట్టు అరిచినా నేను సహాయం చెయ్యను. అత డాతూముకాలువలోనుంచి తనంతట తానే లేచి రావలెను. ఇందులో పాపం యేమీ లేదు. ఓరి చెవిటిపెద్దమ్మా! నామీద కోపంవస్తే నీవు నన్ను యేమి చెయ్యగలవు? నీవన్నట్టు చెవులు మొదలంటా కోస్తావా యేమిటి! ఇక్కడితో యిలాగంటిపనులు ముందు యెప్పుడూ చెయ్యకుండా నీకు బుద్ధి వస్తుంది. లోపల చెవిటివాడు నిద్ర పోయిందాకా వూరుకుండి, అప్పుడు దొంగ దొంగ అని కేకవేసి మావాళ్ళకు సొంజ్ఞచేస్తాను. అటుతరువాత నేను గుర్రపట్టేపడుకుంటే, అందరూ నన్ను నిర్దోషి అనుకుంటారు. చెవిటిముద్దా! ఈరాత్రి బట్టలు తడిసి గుర్రపుసాలవద్ద మురికికాలువలో సుగంధం అనుభవిస్తూ హాయిగా నిద్రపోతావు లే. లోపలచేరి మెత్తగా నాపరుపుమీద శయనించడంకాదు. పకవేళ నామీద ఫిర్యాదుచేసి రుజువుపరిచినా, స్వసంరక్షణార్థం చేసినానని చెప్పి తప్పించుకుంటాను. ఫర్వాలేదు.

[ఈప్రసంగము జరుగుచుండగా విజయవర్మ తలుపు తీసికొనివచ్చి ధనపాలుడు పెట్టుకొన్న దీపము పట్టుకొని వెళ్ళిపోవుచున్నాడు]

ధన—(కన్నులు తెఱచి చూచి) అయ్యో! గాలి లేకుండానే దీప మారిపోయింది? నాకు చీకట్లో భయం వేస్తూవున్నది. ఇక్కడ వంటిగా వుండలేను. అదుగో చెనిటివాడి గదిలో తలుపు సందుగుంచి దీపం కనబడుతూ వున్నది. వెళ్ళి చూస్తాను. (అక్కడకువెళ్ళి) తలుపు కూడా తీసివున్నదే. లోపలికి వెళ్ళుదునా? పిస్తోలు పుచ్చుకుని కాలుస్తాడేమో! ముందుగా తొంగి చూస్తాను. అతడు కొంచెం కదలగానే దొంగలు దొంగ లని కేకలువేస్తాను. (అనితొంగిచూచి) లోపల యెవరూ లేరు. అతను యెక్కడికో వెళ్లిపోయినాడు. అతడు దొంగయి వుండును. ఇంట్లోవాళ్ల పస్తువులు యేమయినా యెత్తుకుని పారిపోయినాడేమో! నారూపాయీ ముడికికాల్వా అన్నీ వ్యర్థమయిపోయినవి. అతడు తప్పకుండా దొంగయి వుంటాడు. దొంగయితే వెళ్ళేటప్పుడు యేమీ యెత్తుకుపోకుండా వుండడు. ఇఖ నేను దొంగ లని కేకలు వేసి ఇంట్లోవాళ్ళను లేపుతాను.

(అని గదిలో చేరి "దొంగ" "దొంగ" అని బిగ్గరగా అరచుచున్నాడు)

[అప్పుడు వసంతసేనుడును, ఇద్దరు మనుష్యులును ప్రవేశించుచున్నారు]

వసం—అదుగో అగదిలో వున్నాడు. అతడు యేమన్నా వీని పించుకోక గట్టిగా పట్టుకుని తిన్నగా తీసుకునివచ్చి తూముకొలవలో పడవేసి కాలికొద్ది మూటండి.

మను—లేళ్ళలాగు పరుగెత్తుతాము. (అని గదిలోనికి వెళ్లుచున్నారు)

ధన—ఇంట్లో అంతా చచ్చిపోయినారా యేమిటి? యెంత

కేకలు వేసినా నక్కరూ రారు. ఓరి దొంగలార్రో. (అని కేక వేయు చున్నాడు)

వసం —ఇక నేను వెళ్లిపోతాను. వాళ్ళాపసిచేస్తారు.

(అని వెళ్ళుచున్నాడు)

మను —(ధనపాలుని పట్టుకొనుచున్నారు)

ధన —ఇదేమిటి? మీరు పట్టుకోవలసింది నన్ను కాదు. ఆమ నిషి వేరే వున్నాడు.

మను—మన పని మనం చేతాము. (అని యిద్దరును ధన పాలుని పట్టుకొని చేతులమీద నెత్తుకొని వెలుపలకు వచ్చుచున్నారు)

ధన—దొంగలు. నిజంగానే దొంగలు చంపిరి చంపిరి.

(అని యరచుచున్నాడు)

[అప్పుడు దీపము పట్టుకొని సుమంతుడును, అన్నపూర్ణమ్మయు, చండికయు ప్రవేశించుచున్నారు]

అన్న—ఈ అల్లరంతా యేమిటి?

సుమం —నాకూతురిని యెవరో దుర్మార్గులు యెత్తుకుని పోయినారు.

ధన—మీరు నన్ను యిలా చెయ్యడం ధర్మంకాదు. వదలండి.

[విజయవర్మ ప్రవేశించుచున్నాడు]

విజ —(ధనపాలునితో) అయ్యా! మీరనుగ్రహపూర్వకంగా నాకోసం వుద్దేశించిన ముసికి కాలువలో మీకే ప్రవేశం కాకుండా మిమ్మలిని రక్షించడానికి వచ్చినాను. మీలో మీరు చేసుకున్నపసంగ మంతా నేను బాగా విని మీవుద్దేశం పూర్ణంగా గ్రహించినాను. మీరిప్పుడాలోచిస్తున్నదాన్ని వదిలిపెట్టనైనావదిలిపెట్టనలెను. లేదా నాతో దెబ్బలాట కయినా రావలెను.

ధన—నేను దెబ్బలాటకురాను.

సుమం—నాకూతురు యెక్కడ వున్నది?

ధన—యేమిటి? నీవు చెవిటివాడవు కానేకావా యేమిటి?

విజ—కాను. నేను చెవిటివాణ్ని కాను. నన్ను నీవు యిప్పుడు యేమి ప్రశ్న లడుగుతావో అనుగు. అన్నిటికీ జవాబులు చెపుతాను—(సుమంత్రినితో) అయ్యా! మీకుమార్తె యిక్కడనే వున్నది. ఆ చిన్నది తన చెలికత్తెతోకూడా నా దగ్గిరకువచ్చి నన్ను వివాహంచేసుకోవడానికి వప్పుకున్నప్పటికీ మీరు అనుమతి యిచ్చేదాకా పాణిగ్రహణం చెయ్యడానికి నే నంగీకరించలేదు.

[అప్పు డిందుముఖియు విశాలాక్షీయు ప్రవేశించుచున్నారు]

విజ—(ధనపాలునితో) ఏమయ్యా! మీమాట యేమిటి? నేను చెప్పినపనులు రెండింటిలో వక్కటి వెంటనే చెయ్యవలెను. యేది చేసేదీ వేగిరంచెప్పండి.

ధన—ఇప్పుడు నేను నిజం చెపుతాను. నాయందు గౌరవం లేకుండా యీ చిన్నది నన్ను యెగతాళిచేసి మాట్లాడడానికి మొదలు పెట్టింది. ఇటువంటి అలక్ష్యపుమనిషిని పెళ్ళాడడం నాకు యెంతమాత్రమున్ను యిష్టంలేదు. అయినా యిప్పుడు నేను యీ చిన్నదాన్ని వద్దంటే ముసలాయన ఖర్చులన్నీ తెమ్మంటా డేమోనని కాని లేక పోతే—

సుమం—నీ కోసంకోచం అక్కరలేదు. నిన్ను క్షమించి నేను ఖర్చులన్నీ వదలిపెడుతాను బుద్ధిహీనుడికి పిల్లనిచ్చ్యడంకంటె ఖర్చులు వదులుకోవడమే వుత్తమం. ఈ విజకువగ్గి తగిన వరుడయినట్టు స్థిరపడితే —

విజ—నే నర్థాన్నయినసంగతి మీకు తెలిసేటట్టు చెయ్యడానికి

పరిత్యాగం చేస్తాను. పరివర్తనవల్ల నాయోగ్యత మీకు కనపరచడానికి నాకవకాశం కలుగచేసినందుకు చాలా సంతోషంగా వున్నది— ఓ ధనపాలా! నాయోగ్యతచేతకంటె నీబుద్ధిహీనతవల్లనే నా కీలాభం కలిగింది కాబట్టి రాత్రిఅయిన భోజనపుఖర్చులన్నీ నేనే యిస్తాను.

ధన—పనసతొనలఖరీదూ అరటిపళ్ళఖరీదూ కూడనా?

విజ—అన్నీ యిస్తాను. అంతేకాకుండా నాపెళ్ళినాడు నిన్ను విందుకుకూడా పిలుస్తాను.

ధన—ఇప్పుడు నాకు బహుసంతోషంగా వున్నది. నీయందు నాకు మనస్సులో యేమీ ద్వేషంలేదని చూపించడానికి నీవెన్నిమాట్లు పిలిస్తే అన్నిమాట్లూ భోజనానికి వస్తూవుంటాను. అంతేకాకుండా— నేను యిప్పుడు యేమి చెప్పబోయినానూ?—జ్ఞాపకం వచ్చింది. నేను చెప్పను. చెపితే మీరంతా నవ్వుతారు. ఆహాహాహా! ఇందులో యెవరికి యెవరు యేమి అపకారంచేసినా అదంతా యిప్పుడు చెప్పవచ్చిన సంగతిని నేను మరిచిపోయినట్లే మరిచిపోయి యెవరి యిళ్ళకు వారు సంతోషిస్తూ వెళ్లుదాము.

(అందరు నిష్క్రమించుచున్నారు)

పునర్మరణ ప్రహసనము.

ఇందు వచ్చు పాత్రములు.

దృఢవ్రతుడు — మృదుభాషిణియొక్క భర్త.
సాహసవర్మ — మనోరంజనియొక్క ప్రియుడు.
మాధవుడు — సాహసవర్మయొక్క సేవకుడు.
చండశాసనుడు — మనోరంజనితండ్రి; మృదుభాషిణి యన్న.
దంభప్రియుడు — చండశాసనుని మిత్రుడు.
సుబలుడు — దృఢవ్రతుని సేవకుడు.
మృదుభాషిణి — దృఢవ్రతుని భార్య; మనోరంజని మేనత్త.
మనోరంజని — సాహసవర్మయొక్క ప్రియురాలు.
జానకి — మృదుభాషిణియొక్క పరిచారిక.

ఁ రంగము — రాజమహేంద్రవరములోని సాహసవర్మయిల్లు.

(కొత్తమీద పెద్దవెదురుపేళ్ళబుట్ట పెట్టుకొని మాధవుడు ప్రవేశించుచున్నాడు)

మాధ — (బుట్ట క్రింద దింపి మూతతీసి) నాకు యింతేచాలును. ఇది మహా పెద్దబుట్ట. ఈబుట్టలో వకమనిషి కాళ్ళు ముడుచుకొని హాయిగా పరుండవచ్చును. ఈబుట్టనిండా కావలసినన్ని వస్తువులున్నవి. ఈమూల రెండు కుంచాల బియ్యము వున్నవి. వాటిపక్కను చింతపండూ, వుప్పూ, మిరపకాయలూ, అన్నీవున్నవి. యీ సరుకులతో బజారులో మంచి దుకాణం పెట్టవచ్చును. ఇవన్నీ మా జానకికి పంపుతాను. ఇంతవిలవ గలిగిన యీవస్తువులతోనే దానిమనస్సు

కరుగక పోయినట్లయితే, యిఖ దాని మనస్సు దేవుడు నల్లరాతితో చేశాడని చెప్పవలెను.

(అప్పుడు సాహసవర్మ ప్రవేశించుచున్నాడు)

సాహ—హాహాహా! నాకు బహుసంతోషంగా వున్నది. చివరకు ఆచిన్నది వున్నచోటు కనుక్కొన్నాను. ఏమో! మాధవా! నీవు యిక్కడనే వున్నావా?

మాధ—యిక్కడనే వున్నానండి.

సాహ—మాధవా! నీకు శుభవార్త చెపుతాను. అదృష్టవశం చేత నాకు ఆవిడెవున్నచోటు తెలిసింది.

మాధ—మనోరంజని వున్నచోటేనా? ఎట్లా తెలిసింది?

సాహ—నాప్రియురాలు వకయింట్లో గది కిటికీలో కూర్చుండి వుండగా వెలపలనుంచి చూచినాను.

మాధ—మీరాయింట్లోకి వెళ్లలేక పోయినారా?

సాహ—వెళ్ళలేదు. నాప్రాణపదమయిన వస్తువుమీద కన్ను వేసినాను. ఇఖదాన్ని సాధించి తెచ్చే వుపాయాలన్నీ నాఅదృష్ట దేవత చేతులలో వున్నవి.

మాధ—మంచిదానిచేతులోనే వున్నవి. మీకోంక తీర్చడానికి అంతకంటె మంచివారు యెవరూ నాకు కనపడరు. అయ్యా! నామాట విని మీరు యీవృత్తాంతమ్ము మానివెయ్యండి. మీరు వకస్నేహితునియింట్లో రెండు మూడు మాట్లాచిన్నదాన్ని చూచి మారు పేరుతో వుత్తరప్రత్యుత్తరాలు జరిగిస్తూవున్నారు—

సాహ—ఈసంగతి నా పినతండ్రిగారయిన కేశవవర్మగారికి తెలిసి పోతుం దేమో నన్న భయంచేత మారుపేరుతో వుత్తరాలు వ్రాయనలసి వచ్చింది. నా ప్రియురాలితోనయినా నా నిజమయిన

పేరు నమ్మి చెప్పడానికి నాకు ధైర్యం చాలకుండా వున్నది. తనతో చెప్పకుండా నేను యిటువంటిపనులు చేస్తూవున్నానని తెలిస్తే చిన్నాయనగారు తన ఆస్తిలో నాకు చిల్లిగవ్వయినా యివ్వరని సీకూ తెలుసును. ఆయన పెద్ద లయినారు. ఇఖ చాలాకాలం జీవించరు. అంతధనం వూరికే పోగొట్టుకోరాదు.

మాధ—అవును. పోగొట్టుకోరాదు. తిరికిమవర్మా! మీనిజమయినపేరుకంటె మీరు యిప్పుడు కొత్తగా పెట్టుకున్నయీపేరే మీకు బాగావున్నట్టు నాకు తోస్తూవున్నది. మీరు వ్రాసిన వుత్తరాలు మీ మనోరంజనియొక్క దాసీది కనిపెట్టి వాటిని తీసుకుపెళ్ళి ఆమెతండ్రికి యిచ్చింది. అందుమీద అతడు ఆచిన్నదాన్ని మీకు కనపడకుండా యెక్కడికో బంధువులయింటికి పంపివేసినాడు. ఇంత టితోనైనా మీ ప్రయత్నం మానుకోండి.

సాహ—నేను మానను. ప్రాణపద మయిననాప్రియురాలు యెక్కడవున్నదో ఆస్థలం కనుక్కున్నతరువాతకూడా ప్రయత్నం మానుకోవడానికి నేను బుద్ధిహీనుణ్ణనుకున్నావా యేమిటి? నీకు చెప్పడానికి యింతకంటె మంచి ఆలోచన తోచకపోయినట్టయితే, యీ విషయం చాలించి యేమయినా మరివక సంగతి మాట్లాడు ఆబ్రహ్మరాక్షసిబుట్ట యిక్కడికి యెందుకు తెచ్చినావు?

మాధ—అదా? అదిమహారహస్యం. పరమరహస్యం. అయినా కానీ మీరహస్యాలన్నీ నాతో చెపుతూవున్నారు గనుక మీకు పిన డానికి యిష్టంవుంటే నారహస్యంకూడా మీతో చెపుతాను.

సాహ—తప్పకుండా వింటాను. చెప్పు చెప్పు.

మాధ—నాకు వకవేలు విడిచిన మేనమామ అవుతాడు. అతను బజారులో చిల్లర సుకాణం పెట్టుకుంటూ నెలాళ్ళకింద

పిల్లామూ బిడ్డలూ యెవరూ లేకుండా చచ్చిపోయినాడు. ఆతని తాలూకు వస్తువులన్నీ మేము నలుగురం పంచుకున్నాము. నావం తుకు వచ్చిన వస్తువులన్నీ నేను యీ బుట్టలో వేసి తెచ్చుకున్నాను. యీబుట్టపాళంగా యింటిలో పున్న సరుకులన్నీ నేను పెళ్ళాడడానికి ప్రయత్నం చేస్తూ పున్న మాజానకికి పంపించడాని కాలోచిస్తూ వున్నాను. అది వకరియింట్లో పనిలోవున్నది. అక్కడికి పంపవలెను.

సాహా—యెవరి యింట్లో?

మాధ—గోదావరివడ్డున నీళ్ళలోకివున్న పెద్ద మేడయింట్లో.

సాహా—ఏమి? కిటికీలకు పచ్చరంగు వేసిన ఆపెద్దమేడ యింట్లో నేనా?

మాధ—ఆయింట్లోనే. అక్కడ పనికత్తెగా వున్నది.

సాహా—ఓహోహోహో! నాకు పరమ సంతోషంగా వున్నది.

(అని చప్పట్లు చరచుచున్నాడు)

మాధ—మీసంతోషం చూస్తే యిందుతోనూడా పంపించ డానికి మీరు నాపెళ్ళానికి వక చీరెకూడా కొనిపెట్టేటట్టు తోస్తున్నది.

సాహా—కాదు కాదు. నేను వకసంగతి ఆలోచిస్తూవున్నాను.

మాధ—మీకు యేదో గొప్పఆలోచనే పుట్టిన ట్టున్నది..

సాహా—(చెయి పయి కెత్తి) ఈ నాలుగు రూపాయలూ చూచినావా?

మాధ—చూచినాను. అవి మీ చేతిలోనుంచి నాచేతిలోకి వస్తవి కాబోలును.

సాహా—నీవు వక్కపనిచేస్తే ఆలాగే వస్తవి. యీసరకులకు బదులుగా నన్నే యీబుట్టలోపెట్టి ఆయింటికి పంపించు. నాప్రాణ నాయకురా లయినమనోరంజని వున్నది ఆ యింట్లోనే.

మాధ—మిమ్మల్ని పంపెస్తే జానకి యేమనుకుంటుందో?

సాహ—యేమనుకుంటే యేమిటే. యీబుట్టలో యేమిపున్నవో వివరంగా వ్రాసి ఆచీటీ దీని కంటించు. వేగిరం నన్ను ప్రయాణంచేసి పంపించు. అక్కడకు వెళ్ళినతరువాత యెవరితోను చెప్పకుండా వుండడానికి చేతులో రెండురూపాయలు పెట్టి మీ జానకిని నేను సమాధానం చేసుకుంటాను.

మాధ—అలాగయితే యిందులో మిమ్మల్ని పెట్టి పైని కట్టడానికి రెండు తాళ్ళు యిప్పించండి. లోపలికి వస్తాను.

(ఇద్దరును నిష్క్రమించుచున్నారు)

---

౨. రంగము—వృద్ధవర్తుని యిల్లు.

(రోకలిచేత బట్టుకొని కోటిముందు నిలుచుండి మృదుభాషిణియు, మనోరంజనియు, ప్రవేశించుచున్నారు)

మృదు—అమ్మాయీ! మనోరంజనీ! నీవదేధ్యానంగా వూరికే విచారిస్తూ కూర్చోక యేపనినా పనిచేస్తూవుంటే పనిసందడిలో విచారం మరిచిపోతావు.

మనో—మరిచిపోవడంకూడానా? నేను యెప్పుడూ మరిచిపోను. నేను విచారంగానే వుంటాను. అత్తా! నేను వకటి చెపుతాను విను. నన్ను యీప్రకారంగా నీవు వోదార్చడానికి ప్రయత్నం చెయ్యడం యెంతమాత్రమూ బాగా వున్నది కాదు.

మృదు—నేను మంచి వుద్దేశముతో నీమేలు కోసరమే చేస్తూ వున్నాను. నీతండ్రికూడా మంచి వుద్దేశముతోనే చేస్తూవున్నాడు.

మనో—అవు నవును. మీ రన్నీ నామేలుకోసమే చేస్తూవుంటారు. మాసవతితల్లి నాకు తిన్నగా అన్నం పెట్టకుండా మాడుస్తూ

అవీ నామేలు కోసంమే నని చెప్పేది. ఇటువంటిమే ళ్ళంటే నాకు తల నొప్పి వస్తుంది.

మృదు—చుట్టాలయింటికి వెళ్ళినప్పుడు యెప్పుడో వక్కమాటు చూచినంత మాత్రంచేత వూరూ పేరూ యెరగని వక చిన్నవాణ్ణి మోహించి అతనితో వుత్తర ప్రత్యుత్తరాలు జరపడం బాగావున్న దేమో ఆలోచించుకో.

మనో—బాగా వుండడం యేమిటి? ప్రేమా, వుత్తర ప్రత్యుత్తరాలూ, యేమీలేకుండా డబ్బుకోసం పెద్దవాణ్ణి పెళ్ళిచేసుకుని తరువాత పోట్లాడుతూవుంటే బాగా వుంటుందా?

మృదు—(తనలో) ఇది నన్ను యెత్తిపొడుస్తూవున్నది. (బిగ్గరగా) చాలించు. ఈప్రసంగం చాలించు—

మనో—త్రివిక్రమవర్మవద్దనుంచి వుత్తరంకోసం యెదురు చూస్తూ తోటలో తిరుగుతూవుండి వుత్తగం రావడంతోటే నామనసు కలిసిన చెలికత్తెలను నలుగురిని దగ్గర వుంచుకొని చదువుతూవుంటే యెంతో హాయిగా వుండేది. అప్పుడు నాసంతోషం చూచి నాచెలికత్తెలందరూ తమ కటువంటి భాగ్యం లేకపోయినదిగదా అని విచారపడేవారు. అటుతరువాత వకనాడు నాచెలికత్తెలలో వకదానికి నాకూ మాటామాటా వచ్చి, అదిపోయి నాగుట్టంతా నాసవతితల్లియొక్క దాసీదానితో చెప్పింది. అదిపోయి నాసవతితల్లితో చెప్పగా, అవిడ ప్రోత్సాహపరిచి నాతండ్రిగారికి చెప్పించింది. ఆరోజున యింట్లో యేమి గడబిడ! యేమి అల్లరి! కేకలతో యింటివీధి పొంకులు నాలుగూ యెగిరిపోయినవి. నేను పెళ్ళిస్థలమయినా త్రివిక్రమవర్మకు తెలియ చెయ్యడానికి అవకాశం లేకుండా, ఆకస్మికంగా నన్ను యిక్కడకు యీమ్మచకునివచ్చి పడవేసినారు. పదహారేళ్ళచిన్నదాన్ని నన్ను నిపా-

రణంగా ఇలాగు క్షోభ పెట్టడంకంటె కూరకృత్యం లోకంలో యేదీ వుండదు. నీవు ఇన్ని నీతులు చెపుతావుగాని, పాపం నీపెనిమిటి విషయమయి నీవు యెందుకు కూరంగా నడుస్తూ వుంటావో చెప్పు.

మృదు—నీవు యిప్పుడు క్రూరత్వమనేది ఆయనకు తగినంత వివేకం లేకపోవడంవల్ల తటస్థ మవుతూవున్నది.

మనో—వివేకం లేకపోవడమూ గివేకం లేకపోవడమూ నాకు యేమీ కనపడడం లేదు. ఆయన యేజోక్యమూ కలుగచేసుకోకుండా యెవరు వచ్చినా మూర్ఖుడుతూ ఖుషిలాగు యెప్పుడూ పురాణాలు ముందు పెట్టుకుని చదువుకుంటూ కూర్చుంటాడు.

మృదు—ఇంటిజోక్యం యెంతమాత్రమూ కలుగచేసుకోకుండా వచ్చినవారితో టల్లా మాట్లాడుతూ వుండడమే పెద్ద అవివేకము. చిల్లరవిషయాలలోకూడా మన దాసీముండవంటిది వచ్చి ఆలోచన అడిగినా పొమ్మని కోపపడక యేదో చెపుతూ వుంటారు.

మనో—పాపం. ఆయన ధర్మరాజువంటివాడు.

మృదు—అందుచేతనే ఆయనను లోకువ చేసి మనగాసీది జానకికూడా మాటమాటకూ ఆయనదగ్గిరకు వెళ్లి యేదో వకటి అడుగుతూ వుంటుంది. అలా నెత్తిమీదయెక్కించుకోవడంచేతనే నామాటంటే లక్ష్యం లేకుండా అది నాతో సమానంగా వుండడానికి ప్రయత్నం చేస్తూవుంటుంది. నేను గాజులు తొడిగించుకుంటే అదీ గాజులు తొడిగించుకుంటుంది; నేను కొప్పులో పువ్వులు పెట్టుకుంటే అదీ పువ్వులు పెట్టుకుంటుంది; నేను రంగుచీర కట్టుకుంటే అదీ కట్టుకుంటుంది. ఇంటి కిబస యగవాడు దానితో చనువుగా మాట్లాడుతూ యేపడిగినా లేదనకుండా చేస్తూవుంటే, అది యేలాగంటి కోరికలు కోరుతుందో నాకు యెలా తెలుస్తుంది?

[తనలో తానే మాట్లాడుకొనుచు దృఢవ్రతుడు ప్రవేశించుచున్నాడు]

దృఢ—రేపు యేకాదశి వుపవాసంచేసి రాత్రి జాగరం చెయ్యవలెను. ఓసీ! యింట్లో యేమిచేస్తున్నావు?

మృదు—ప్రాణేశ్వరా! పొద్దున్న జానకీవిషయం అంతమాత్రం చెప్పినతరువాత యేమి చెయ్యకుండా యిలాగు నెమ్మదిగా వచ్చి నాతో మాట్లాడడానికి మీమనస్సు వప్పిందా?

దృఢ—అవును. నీవు పొద్దున్న యేమిటో చెప్పినావు గాని, అది యేమిటో నాకు జ్ఞాపకం లేదు.

మృదు—తనకూతురుని తీసుకుని నాసవితన్నగారు చండశాసనుడుగారు కూడా యిక్కడకు వచ్చి వున్నారు. నేను యిప్పుడు మీతో పోట్లాడకుండదు. నేను మీతో నేటి వుదయాన్న చెప్పిన సంగతే మరిచిపోయినారుగా!

దృఢ—నా ప్రాణేశ్వరీ! నిజంగానే మరచిపోయినాను. నేను నీవు చెప్పేమంచిసంగతులు మాత్రమే జ్ఞాపకం వుంచుకుంటాను.

మృదు—మీ మంచితనం చూస్తే నాకు వళ్ళు మండుకు పోతూవున్నది. మీవుపేక్షవల్ల నామనస్సుకు యెంతైన నొప్పి కలుగుతూ వున్నది.

దృఢ—నేను బుద్ధిపూర్వకంగా యెప్పుడూ నీ మనస్సుకు నొప్పి కలిగించలేదు. నీ విషయమందు నాకు వుపేక్ష లేదు. నేను యెప్పుడూ నిన్నే తలచుకుంటూ వుంటాను—అమావాస్యనాడు రాత్రి భోజనం లేదు.

[బాలకి ప్రవేశించుచున్నది]

బాల—అమ్మా! ఆవిడె—

దృఢ—అయ్యో! మరచిపోయినాను. నేను వుదయాన్న బజా

రుకు వెళ్ళినపుడు నీకోసం బొట్టుపెట్టి కొన్నాను. ఓ ప్రాణేశ్వరీ! అదుగో చూచినావా?

మృదు—మీరు చేసిన పనికి యీమిట్టిపెట్టి యిస్తే నాకోపం పోతుందనుకున్నారా యేమిటి? (కిటికీ తలుపు తీసి) మీరు యిచ్చిన వస్తువు యెక్కడ దాస్తానో చూడండి. (అని కిటికీలోనుండి గోదావరిలో పడవేయుచున్నది)

జాన—(తనతో) మాణిక్యంవంటి పెట్టె పారవేసింది. నాపిల్లయుడుకూడా నాతో వివాదపడి యిలాగంటి వస్తువు యే దయినా నాకోపం తీరడానికి బహుమానం పంపిస్తే బాగావుండును. నేనుమాత్రం గోదావరిలో పడవెయ్యనూ?

మృదు—నేను యేమిచేసినానో చూచినారా?

దృఢ—చూచినాను. బొట్టుపెట్టె కిటికీలోనుంచి గోదావరిలో పారవేసినావు.

మృదు—అందువల్ల మీకేమీ విచారం కలగలేదా?

దృఢ—యెందుకుకలుగుతుంది? నీవస్తువు నీవు పారవేసుకుంటే నాకేమి? యెవరివస్తువు వారు మనసువచ్చినట్టు చేసుకోవడానికి ప్రతి వాడికీ స్వతంత్రం వున్నది.

మృదు—పుటకి మంచివానివలె నటిస్తూ మీరు నన్ను యెంత క్షోభయినా పెడుతూ వున్నారు. ఏమయినా అంటే నానోరు బయల పడుతుంది.

జాన—అమ్మా! ఆనిడె—

మృదు—ఏమీ! నీవుకూడా యిక్కడే వున్నావా? (మనోరంజనితో రహస్యముగా) నేనన్నమాట నిజమవునో కాదో యీజానకిని చూడు. నేను తలదువ్వుకుంటే అది తల దువ్వుకున్నది. బొట్టుకూడా

నేను పెట్టుకున్న మోస్తరుగానే పెట్టుకున్నది — జానకీ! యేమిటి చెప్పవచ్చినావు?

జాన—అమ్మా! ఆవిడ యీమధ్యాహ్నం మీరు తన యింటికి వస్తారో రారో కనుక్కొని రమ్మని వర్తమానం పంపించింది.

మృను—ఆవిడ యెవరు?

జాన—కనకాంగిగారు మీ పెత్తల్లికూతురు.

మృను—అవును జ్ఞాపకం వచ్చింది. వస్తామన్నారని చెప్పు మను. పాపం కనకాంగికి వంట్లో జబ్బుగావున్నది.

జాన—(దృఢవ్రతునితో మెల్లగా) మీ యింటి యజమానురాలుగారు వెళ్ళినతరువాత మీకు వకటి చూపించవలసి వున్నది. జ్ఞాపకంచెయ్యండి.

మృదు—నేను తప్పకుండా వెళుతాను. కదలవేమి? జానకీ! నేను వెళ్ళననుకుంటున్నావా యేమిటి? మాఅమ్మగారు యిప్పుడే వస్తారని చెప్పు.

జాన—నేను మీరు వెళుతారేమోఅనుకున్నాను. ఇదుగో వెళ్ళి చెపుతాను. (అని వెళ్ళుచున్నది)

మృదు—ప్రాణేశ్వరా! మీకు సిగ్గులేకుండా నాయెదుట అలా నిలుచోవడం బాగావున్నదికాదు.

దృఢ—నీకు యిష్టంలేకపోతే నేను పుస్తకాల గదిలోకి వెళ్ళి పురాణపారాయణం చేసుకుంటానులే— ఏకాదశీవ్రతం నియమంగా జరపవలెను. (అని వెళ్ళుచున్నాడు)

మనో—పెనిమిటిని చూస్తే నీవు అలా చిర చిర లాడుతూ వుంటా వేమి?

మృదు—నీవు మహా పతివ్రతవు. నీ కాసంగతి తరువాత చెపు

కానులే. ముందుగా ఆపానకపుచెంబు యిలాగుతీసుకుని కా. అందులో యిప్పుడు నేను రోట్లో నలగకొట్టినమాను వేస్తే యెంత ఘాయిలాల్లో వున్నవారి కయినా కుంభకర్ణుడిలాగు నిద్రపడుతుంది. కనకాంగికి కాత్రి బొత్తిగా నిద్ర పట్టకుండా వున్నది యీమానును తీసుకునివెళ్ళి యివ్వ వలెను.

[పెద్దబుట్ట తలమీద పెట్టుకొని యిద్దరుమనుష్యులు ప్రవేశించుచున్నారు]

మృదు — అబ్బీ! యీనాకొసిబుట్ట యిక్కడకు యెందుకు తెచ్చినారు?

మను—జాసికమ్మకోసం తెచ్చినాము. మీనవుకరు మేడమీద వున్నది. అక్కడకు తీసుకు వెళ్ళమంటే తీసుకు వచ్చినాము.

మృదు—జాసికమ్మా? మంచిది. బుట్ట అక్కడ వుంచి మీరు వెళ్ళిపొండి.

మను—ఇక్కడ వుంచుతాము. (అని యుంచి వెళ్ళుచున్నారు)

మనో—నీవు అపుషధం తయారుచేస్తూ వుండు. నేను యింతలో లోపలికివెళ్ళి కనకాంగి అత్తగారి యింటికి నీకోకూడా రావడానికి నావూదాచీర కట్టుకుని వస్తాను. వెనుక త్రివిక్రమవర్మను కలుసుకోవడానికి యీవూదాచీర కట్టుకుని మాతోటలోకి యెంతో సంతోషంగా వెళ్ళేదాన్ని. (అని వెళ్లుచున్నది)

మృదు—ఇందులో యేమున్నది? ఈబుట్ట కదులుతూ వున్నట్టున్నది లోపల యెవడూ మనిషి లేడుగద?

[అప్పుడు సాహసవర్మ బుట్టలోనుండి పయికి దూముకుచున్నాడు]

సాహ — అమ్మా! అమ్మా! నిన్ను బతిమాలుకుంటాను. కేకలు వెయ్యబోకు. నేను పరాయివాణ్ణి యినా నీఅనుగ్రహం నమ్మి కొని వున్నాను,

మృదు—ఈవేషం యేమిటి?

సాహ—చల్లకువచ్చి ముంత దాచిన ప్రయోజనం లేదు. త్రివిక్రమవర్మ పేరు మీరు ముందివరకు విని వుంటారు. నేనేఅతణ్ణి.

మృదు—మనోరంజని ప్రియుడవు నీవేనా? నీవు యెవరవో యెక్కడివాడవో యెవరికీ తెలియదు. అయినాకానీ నీవునాఅనుగ్రహాన్ని నమ్మికొని వున్నానని చెప్పినావు గనుక, నిన్ను బయలపెట్టక నీకు సహాయం చేస్తాను.

సాహ—నీవు మహాదొడ్డదానవు.

మృదు—వచ్చినట్లుగానే నిన్ను మళ్ళీ పంపించివెయ్యడానికి నేను సహాయం చేస్తాను. బుట్టలోనికి తిరిగీ వెళ్లు. మళ్ళీ యిద్దరుమను ష్యులు యీబుట్ట నీవు యేస్థలానికి తీసుకుని వెళ్ళమంటే అక్కడకు తీసుకునివెళ్ళి విడిచి వస్తారు. నీవు యిక్కడికి వచ్చిన సంగతి యెవరికీ తెలియనియ్యను.

సాహ—(తనలో) ఇది మంచిఅనుగ్రహమే. (బిగ్గరగా) అమ్మా! నన్ను తిరిగీ బుట్టలోకి వెళ్ళమనడం మీకు న్యాయమా? బాగా ఆలోచించుకోండి. ఈబుట్టలో దూరడంవల్ల నాకు తగిలిన దెబ్బలూ గాయాలూ అటుండగా వత్తుకుని నావంటినిండా చాప అల్లినట్లు శిరస్సు మొదలుకొని పాదందాకా మీఅల్లికపని యెట్లా అంటుకున్నదో చూడండి.

మృదు—ఈబుట్టలో దూరడం కంటె నాకు వుపాయాంతరం యేమీ తోచడంలేదు. నీకు మామనోరంజనితో సంధానం కలుగచెయ్యడానికి నేను సహాయం చెయ్యాలను. పరపురుషుడితో నేను వంటరిగా మాట్లాడుతూవుంటే చూచేవారు యేమనుకుంటారో అదికూడా ఆలోచించలేదు, వేగిరం బుట్టలోకి వెళ్లు. బుట్టమోపునువెళ్ళడానికి నేను

యిప్పుడే మనుష్యులను తీసుకుని వస్తాను.

సాహ—అమ్మా! నీకు సాధనాంతరం తోచకపోయినట్టు తే యీకాగితంలో వ్రాసినచోటికి నన్ను పంపించండి. (అని కాగితము చేతి కిచ్చి బుట్టలో పరివేశించి) బుట్ట క్రిందివైపు మీదకీ మీదివైపు క్రిందికీ తిప్పకుండా జాగ్రత్తగా తీసుకుని వెళ్ళునండి.

మృను—ఆలాగే చెపుతాను. కదిలితే లోపలవున్న సామానుకు దెబ్బలు తగులుతవని కదలకుండా తీసుకుని వెళ్ళమని గట్టివృత్తరువు చేస్తాను. (అని వెళ్ళుచున్నది)

సాహ—వర్తకపు సరుకులాగు యిందులో కూర్చుండి నేను మళ్ళీ వెళుతానా? వెళ్ళను. (పుటకి వచ్చి) నేను యీయింట్లోనే యెక్కడయినా దాక్కుంటాను. నాకు బదులుగా యీబుట్టలో యే మనుషా వెయ్యవలెను. యీయింట్లో యేమి వున్నవి? యిక్కడ వకరోలూ, రోకలీ తలుపుకు యెత్తుపెట్టుకునే రాయీ కనుపడుతూవున్నవి. యివి యీబుట్టలో వేస్తాను. (అని వానిని బుట్టలోవేసి) యీవిడే చేతికి నేను బసచేసివున్న వారిపేరు వ్రాసి యిచ్చినాను. నాకు బదులుగా యివే అక్కడకు వెళ్ళుతవి. (అని వెళ్లుచున్నాడు)

[జూనకి పరిశీలించుచున్నది]

జూన—యీరోజున నాయజమానురాలు వొంటికే చీరచీరలాడుతూ వున్నది. ఆవిడే నన్ను చూస్తే యెప్పుడూ కోపపడుతూనే వుంటుంది. ఈసారి నన్నేమైనా అంటే నామనస్సులో వున్నది మొగంమీద అని వేస్తాను. ఆవిడే యిరుదొక్కో యీకిటికీలోనుంచి బొట్టుపెట్టె నిష్కారణంగా నీళ్ళల్లో పారవేసింది. అది తేలివున్నదేమో చూస్తాను. (అని కిటికీవద్దకు పోయిచూచి) అదుగో నాపిల్లయుడు మూధవుడు పడవులో యెక్కి షికారు బయలుదేరినాడు. అతనిదగ్గర యెవరో

ఆడది కూడా కూర్చున్నది. నేను చూడలేను. ఈమగాటు అతడు నన్ను చూడడానికి వచ్చినప్పుడు కట్టుకున్నబట్టలు చింపివేసి యిలా గంటి పని చేసినందుకు తగిన ప్రాయశ్చిత్తం చేస్తాను. ఇక్కడ యీ బుట్ట యేమిటి? దీనిమీద యేమిటో చీటి అంటించి వున్నది. చదువుతాను. జా—జా—జాన—జానకి—ఇది నాదే. ఇది వట్టి పాడు దస్తూరీ. నేను చదవలేను. తరువాత యెవరిచేత నయినా చదివిస్తాను. (అని చీటీ తీసి) ఈబుట్టలో యేదో పెట్టి పడవలో నేను యిప్పుడు చూచిన మానిర్భాగ్యుడు నాకు బహుమానం పంపించినాడు. నేను యిది పుచ్చుకోను. ఇందాకా తన భర్తగారు యిచ్చిన బహుమానాన్ని మాఅమ్మగారు యెలా చేసిందో నేనూ దీన్నిఅలాగే చేస్తాను. ఈకిటికీలోనుంచి యిది గోదావరిలో పడవేస్తాను. (అని యెత్తి చూచి) అమ్మా! ఇది యెంత బరువుగా వున్నది? తాళ్ళు. యెవరో వస్తూ వున్నట్టున్నారు. అడుగులచప్పుడవుతూ వున్నది.

దృఢ—(వెలుపలనుండి) ఈసంవత్సరం కార్తీకసోమవారాలన్నీ వుండవలెను.

జాన—ఆ వచ్చేది మాయజమానుడు దృఢవ్రతుడు గాను. ఈమన నిగర్వచూడామణి. ఈయనకు కోప మన్నమాట లేదు. అయ్యా! మీరా?

[దృఢవ్రతుడు ప్రవేశించుచున్నాడు]

దృఢ—జానకీ! ఇక్కడ యేమిచేస్తూ వున్నావు?

జాన—అయ్యా! మీరు నాకు వక్కువుపకారం చెయ్యవలెను. మీకు దేహంలో బాగా బలం వున్నదా!

దృఢ—(తనలో) ఇది నన్ను యీప్రశ్న యెందుకు అడిగి వుంటుంది?

జాన—అయ్యా! మరేమీ లేదు. సందేహించకండి. మీకు జెబ్బపుట్టి బాగా వున్నదేమో తెలుసుకోవడాని కడిగినాను.

దృఢ—సాధారణంగా వున్నది.

జాన—మీరు దొడ్డ మహారాజులు. మీకు శ్రమ యిచ్చి నందుకు క్షమించవలెను. మీరు న్యాయం దనుగ్రహించి యీబుట్ట కిటి కీలోనుంచి గోదావరిలో తొయ్యడానికి కొంచెం సహాయం చెయ్యగలరా?

దృఢ—యెందుకు తొయ్యడం?

జాన—అయ్యా! క్షమించండి. ఇది కొంచెం రహస్యమయిన సంగతి.

దృఢ—ఈబుట్ట గోదావరిలో వెయ్యడంరహస్యమా? నీమాట నమ్మతగి వుండలేదు.

జాన—నాప్రార్థన చిత్తగించి యీకాస్తపని చేసిపెట్టండి. యిది నేను గోదావరిలో యెందుకు తోయిస్తానో తరువాత సావకాశంగా తమతో మనవి చేస్తాను.

దృఢ—ఇప్పుడు చెప్పితే చెప్పినావు గాని యిటువంటిపనులు ముఖముందు నాతో యెప్పుడూ చెప్పకు. ఈమాటుమాత్రం చేస్తాను. అవతలవయిపున నీవు పట్టు. ఇది యెంత బరువుగా వున్నదీ! (ఇద్దఱును పట్టి బుట్ట గోదావరిలో త్రోయుచున్నారు)

జాన—ఎంత చప్పుడయిందో! నీళ్లు పయికి నిలువెడెత్తు లేచి బుట్ట తిన్నగా అడుక్కుపోయింది. నా కీసహాయం చేసినందుకు మీకు పదివేల దణ్ణాలు.

దృఢ—ఇది యెత్తే టప్పటికి నా చేయ్యింతా నొప్పిపెట్టింది. జానకీ! నీకు వక బుద్ధి చెపుతాను. నీవు యింకొకసారి యెప్పుడైనా

యిటువంటి రహస్య మయినపని చెయ్యవలసి వచ్చినప్పుడు నాతో చెప్పక యెవరి నైనా యిద్దరిని బలమైన మనుష్యులను మాటూడి తెచ్చుకో.

జాన—అయ్యో! క్షమించండి. మీకు పదివేలదణ్ణాలు పెడు తాను. ఈబుట్టలో పెట్టి విశ్వాసహీను డైనమామాధవుడు నాకు యేదో బహుమానం పంపినాడు. నాకు అతనిమీద బహుకోపంగా వున్నది. ఈసమయంలో అతను యిక్కడవుంటే బాగా వుండును. అప్పుడు యీబుట్టకు బదులుగా అతణ్ణే యీగోదావరిలో తొయ్యమని యేలినవారిని ప్రార్థిస్తును. తమరు నాయందువుండే దయచేతనూ తమ మంచి స్వభావంచేతనూ నాప్రార్థనను తప్పకుండా చెల్లించి వుందురు. (అని చెళ్ళుచున్నది)

దృఢ—ఇది వట్టి మతిలేని మాట లంటూ వున్నది. మొఖ మాటంచేత కాస్తపనిచేసిపెడితే నవుకర్లు యెప్పుడూ వేపుకుతింటారు. మాతోటమాలీకి యిదివరకు ఆరువుత్తరాలు వ్రాసిపెట్టినాను. ఈజానకి యిదివరకు తన ప్రియుడు వ్రాసినపుత్తరాలు నాలుగైదైనా నాచేత చదివించుకున్నది. నేను చదివే పురాణాలు జ్యోతిషగ్రంథా లనుకుని మా ఆవులను పాలు పితికే వాడు తన కొడుకు పెళ్ళికి ముహూర్తం పెట్టుమని వచ్చినాడు. ఆపను లన్నిటికంటెనూ యీబుట్ట తొయ్యడం పని బహు విచిత్రంగా వున్నది.

[మృదుభాషిణి ప్రవేశించుచున్నది]

మృదు—ప్రాణేశ్వరా! మీరు యిక్కడ బుట్టచూచినారా? పెద్దబుట్ట.

దృఢ—చూచినాను.

మృదు—మీరు కూడా లోపల దాకోక వచ్చును. అంత

పెద్దబుట్ట.

దృఢ—అవును పెద్దబుట్టే. (తనలో) జానకీ నేనూ తోడు పట్టి గోదావరిలో పడవేసినమాట చెప్పకూడదు. చెపితే ఖజ్జాకు వస్తుంది.

మృదు—ఈసంగతి మీరు యెవరితోనూ చెప్పనని నాచేతులో చెయ్యి వెయ్యండి.

దృఢ—నామాట నమ్మ్మ. నేను యెవరితోనూ చెప్పను.

మృదు—ఆబుట్టలో యేమి వున్నదనుకొన్నారు?

దృఢ—నాకు తెలియదు. వేమి వున్నదో నీవు చెపితే వింటాను.

మృదు—మనిషి వున్నాడు.

దృఢ—ఏమిటి ! మనిషా ?

మృదు—మనిషే. నిశ్చయంగా మనిషే.

దృఢ—(తనలో) మనిషికాదు. అందులో పెద్ద నయ్యం వున్నది. (బిగ్గరగా) ఓ పాణేశ్వరీ! నీవు యేదో పొరపాటు పడ్డావు.

మృదు—పొరబాటూ లేదు. యేమీ లేదు అతణ్ని నేను కళ్లారా చూచినాను. అతనిమాటలు చెవులారా విన్నాను. అతను యెవరనుకున్నాను? మన మనోరంజనిని మోహించి తిరుగుతూ వుండే త్రివిక్రమవర్మ. అతను బుట్టలో నుంచి యివతలికి వస్తా ననాడు. నేను యిట్లోనుంచి అవతలకు పంపివేస్తా ననాను. వీళ్ళయిద్దరికీ సంబంధం కాకుండా చెడ కొట్టడానికి నేను చేస్తూవున్న ప్రయత్నం మీకే తెలుసును.

దృఢ—ఈసంబంధం చెడకొట్టడంలో నీపగ మొదలంటా తీర్చుకున్నావు. అయ్యో! పాపం!

మృదు—తెల్లపోయి అలాచూస్తా రేమి? మీమనస్సు స్వస్థంగా

లేనట్లు కనబడుతూ వున్నది.

దృఢ—నామనస్సుకు స్వస్థం లేదంటూ వున్నావా? ఇది బుద్ధి పూర్వకమయిన పనికాదు. కేవలం పొరబాటుచేత జరిగింది. అయ్యో! అయ్యో! బుట్టలో మనిషి వున్నాడా?

(సుబలుఁడు ప్రవేశించుచున్నాఁడు)

సుబ—అమ్మా! మేమంతటా చూచినాము. మాకు యెక్కడా బుట్ట కనపడడంలేదు.

మృదు—కనపడడం లేదూ?

దృఢ—కనపడడంలేదు! ఇదియేమో వింతగా వున్నది! మీరది చూచి వుండరు.

మృదు—ఆలాగైతే జానకి తనబుట్టచూచి తీసుకొని వెళ్ళి వుండవచ్చును. సుబలా! నీవు వెళ్ళిపోవచ్చును.

సుబ—మంచిది. (అని వెళ్ళుచున్నాఁడు)

మృదు—నామనస్సులోయేమీ తోచకుండా వున్నది.

దృఢ—నాకూ తోచకుండానే వున్నది. కాని నీకు తోచక పోవడమంటే విరుద్ధంగా కనపడుతూవున్నది.

మృదు—ఆలాగంటారేమి? అతడు బుట్టలోనుంచి తప్పించుకునిపోయి చండశాసనుడికూతుర్ని కలుసుకుని మాట్లాడవచ్చును.

దృఢ—ఆవిషయమయి నీవు యెంతమాత్రమూ భయపడవలసినపని లేదు. అతడు బుట్టలోకూడా యీకిటికీలోనుంచి తప్పించుకొని పోయినాడు.

మృదు—మీరాగెరుగరాయేమిటి? ఆకిటికీ అవతల కింద పెద్దనది పారుతూ వున్నది.

దృఢ—అవును పారుతూవున్నది. అతడు నీళ్ళలో పడకుండా

యీ కీటికీలోనుంచి తప్పించుకుని పోలేదు అయ్యో! పాపము!

మృదు — నేను మనోరంజనదగ్గిరకు వెళ్తుతాను. కామాంధు లైవున్న యీయిద్దరూ కలుసుకుంటే వాళ్ళను మళ్ళించడానికి బ్రహ్మ తరంగాదు. చండశాసనుడు వక వేళ యిక్కడకు వస్తే బుట్టలో మనిషి వున్నట్టు అతగాడికో చెప్పకండేమి? (అని వెళ్లుచున్నది)

దృఢ — నేను ఈరహస్యా బయటల పుచ్చను. నేను తెల్లవారిలేచి మహోఘనకార్యం చేసినాను. నిష్కారణంగా వక ప్రాణం తీసివేసి నాను. అయిపోయింది మళ్ళీ తలపెట్ట రాదు. ఇక దీనివిషయు మయి నే నాలోచించను. మని షయితే బుట్టలో దూరి యెందుకు కూర్చో వలెను? ఇందులో నాతప్పితం యేమీలేదు నేను నిర్విచారంగా వుండ వచ్చును. నేను పుస్తకం చదువుకుంటూ మనస్సు దీనిమీదినుంచి మరివకదానిమీదికి మళ్ళించుకుంటాను. గౌతమీమాహాత్మ్యం చదువు దునా? పనికిమాలిన పుస్తకం. మళ్లీ నీళ్ళూ గోదావరీ జ్ఞాపకం వస్తూ వున్నవి.

[జానకి ప్రవేశించుచున్నది]

దృఢ — ఓహో! నీవు యిక్కడనే వున్నావా? నీవు మహా మంచిదానవు.

జాన — మగవాళ్ళందరూ నన్నాలాగే అంటారు.

దృఢ — ఓసి రంకుముండా! నాముఖంచూడడానికి నీకు మనస్సు యెలాగు వప్పింది?

జాన — నేను నిజంగా రంకుదాని ననే మీరు —

దృఢ — నీ వంతకంటెనూ నూరురెట్లు చెడ్డదానవు. ఆపనికంతా నీవే కారకురాలవు.

జాన — ఏపనికి?

దృఢ—ఆ ఘోరమైనపనికి. నరహత్యకు.

జాన—అయ్యో! మీరు నన్ను పరిహాసం చేస్తూవున్నారు.

దృఢ—పరిహాసమా! అబ్బుట్లలో మనిషి వున్నది యెరగనట్లు నటించడం నీకే తగివున్నది.

జాన—మీరు పన్నినది మంచియత్నం. మీరు నాతో హాస్యమాడుతూ వున్నారు కాబోలును. ఆబుట్టకు వకచీటీకూడా అంటించి వున్నది. అది తీసి నేను జేబులో వేసుకున్నాను. (చీటి పుచ్చుకొని తీసి) అయ్యా! ఇందులో యేమయినా హాస్యపుమాటలు వుంటే నన్ను యెగతాళి చెయ్యకండి. (అని చీటి చేతికిచ్చుచున్నది)

దృఢ—(చదువుచు) "నాపాణాధికురాల వయిన జానకి!"

జాన—ఓరి వెధవకాలమారి దొంగా!

దృఢ—"యింకులో పెట్టి నాయజమానుణ్ణి నీవద్దకు పంపించి నాను"

జాన—అయ్యో! (అని అరచుచున్నది)

దృఢ—అరవబోకు. అరవబోకు. నీవు గట్టిగా అరిస్తే యిప్పుడు నీకూ నాకూ కూడా తంటావస్తుంది.

జాన—అయ్యో! అయ్యో! అయ్యో! ఆచీటీ నన్ను చూడనియ్యండి. (చూచి) య—య—య—యజ—యజ—యజమా—యజమానుణ్ణి—మీరు చెప్పింది నిజమే. అయ్యో! అయ్యో! మనకు తప్పకుండా తంటా వస్తుంది.

దృఢ—అలాగైతే మొదటినుంచీ యీసంగతి నీకు తెలియనే తెలియనట్లున్నది.

జాన—ఎంతమాత్రమున్ను తెలియదు. యెవరైనా చదివి పెడితేనేగాని నేను వుత్తరాలు స్వయంగా చదువుకోలేను. నేను చిన్న

ప్పుడు గరల్సుస్కూల్‌లో చదువుకున్న నాలుగు ముక్కలూ మరిచి పోయినాను. మాదార్భాగ్యము నాకు యేదో పంపించినాడని అది మాఅమ్మగారు చేసినట్టు గోదావరిలో తొయ్యనలె ననే కాని నాకు రెండో ఆలోచన లేకపోయింది.

దృఢ—అయిందేమో అయింది. ఇఖ నేను ముందుసంగతిని గురించి ఆలోచిస్తూవున్నాను. నీవు బుద్ధిపూర్వకంగా చేసినావని నీమీద నిష్కారణంగా అనుమానపడ్డాను. నీవు నిర్దోషురాల వని నా కిప్పుడు తెలిసినది. మనమిద్దరమూ ముందుతో పసికిమాలిన దోషులమూ నిర్దోషులమూకూడానూ. ఆబుట్ట నీ అంతట నీవే తొయ్యక నన్నుకూడా యెందుకు రమ్మన్నావు? అయినా కానీ యీచీటీ కడతేరా చదువుదాము. (ఇద్దఱును దగ్గఱగాచేరి చదువుచున్నారు)

[అప్పుడు సాహసవర్మ ప్రవేశించుచున్నాడు]

సాహ—(తనలో) మనోరంజని నాకు యెక్కడా కనపడలేదు. ఈలోపల యెవడైనావచ్చి నన్నుచూచి యేమైనా అంటాడేమోనని ప్రతినిముషమూ భయంవేస్తూవున్నది. అక్కడెవరో వున్నారు. నేను అదృష్టవంతుణ్ణి. అతడు నాపూర్వపు స్నేహితుడు దృఢవ్రతుడు. అందుకు సందేహంలేదు (బిగ్గరగా) ఓయీ! దృఢవ్రతా!

దృఢ—(తనలో) అమ్మగో కనిష్టేబిలు వచ్చినాడు. (బిగ్గరగా) కాదండి ఇక్కడనుంచి కాదండి. అది నాకు పక్కయింట్లోవారి కిటికీలోనుంచి పడ్డది. (తేఱిపారచూచి) ఓయీ సాహసవర్మా! నీవా? నీవు క్షేమంగా వున్నావా? (తనలో) తలుపులన్నీ వేసి వుంటే ఇతడెవరిని వచ్చినాడు?

సాహ—(తనలో) నే నితేనితో బుట్టసంగతేమీ మాట్లాడక వూరికేచూడడానికి వచ్చినట్టు నటిస్తాను. (బిగ్గరగా) మీరంతాక్షేమం

గా వున్నారా? మిమ్మలిని చూచి నాలుగు సంవత్సరాలు పయిగా అయింది.

దృఢ—నాలుగు సంవత్సరాలా? అవును కావచ్చింది. నీవు పూర్వపు స్నేహితుణ్ణి జ్ఞాపకం వుంచుకుని చూడడానికి వచ్చినందుకు చాలా సంతోషంగా వున్నది.

సాహా—అవును చూడడానికే వెతుక్కుంటూ వచ్చినాను.

దృఢ—నామీద నీకు చాలా దయవున్నది గనుక వచ్చినావు. నేను యిక్కడ వున్నసంగతి నీకు యెట్లా తెలిసింది?

సాహా—మిమ్మలిని కిటికీలోనుంచి చూచినాను.

దృఢ—రా. రా. వెళ్దుదాము. యీమందుభాగం మేము కాపురంవున్నభాగం కాదు. యీయింటి వెనుకభాగం సరిగా నీళ్ళలో వున్నది.

సాహా—అవును. పావుగంటసేపటి క్రిందట యీదారిని గోదావరిలో పడవషికారు వెళ్ళినప్పుడు చూచినాను.

దృఢ—ఏమిటి? నీవు నన్ను కిటికీలోనుంచి చూచినావు కాబోలును! అప్పుడు నేను యేమయినా పనిచేస్తూవున్నానా?

సాహా—లేదు. అసలు నేను మిమ్మల్ని చూడనేలేదు.

దృఢ—అవును. చూడలేదు. నిశ్చయంగా చూడలేదు. అప్పుడు కిటికీలోనుంచి చెయ్యడానికి నా కేమిపని వున్నది?

సాహా—(తీసలో) ఇతనిమాటలు ధోరణి చూస్తే యేదో మింతగా వున్నది.

జాన—అప్పుడు నే నీయనసమీపమున నిలుచోలేదు కాబూ?

సాహా—లేదు.

దృఢ—సిటంగానే నిలుచోలేదు.

సాహ—(అని తనలో) యిదంతా యేమిటి? ఏదోతప్పుపని చెయ్యడంచేత వీరికి మనస్తిమితం లేకుండా వున్నట్టున్నది. ఈకిటికీవద్ద నిలుచుండి యీయన యీచిన్నదాన్ని ముద్దు పెట్టుకొని వుంటాడు. (బిగ్గరగా) మీరుచేసినపని నేను కనిపెట్టినాను.

దృఢ—అయ్యో! అది నీకంట బడ్డదా?

జాన—హా దైవమా?

సాహ—దృఢవ్రతా! నీవు మహాచెడ్డవాడవైనావు.

దృఢ—అవునవును — కాదు కాదు — నీమనస్సులో అస్మి పిచ్చివూహాలు పుడుతూవుంటవి. అయినా కానీ నీవెప్పటివలెనే నవ్వు మొగంతోటే కనపడుతూ వున్నావు.

సాహ—అవును. నాది యెప్పుడూ నవ్వుమొగమే. లోపల యేమివున్నా పైకి ఈనీళ్ళు యెలాగు శాంతంగావున్నవో నేను అలాగే వుంటాను.

దృఢ—(తనలో) ఇతని వుపమానాలు వింటే నాకు గుండెలు పగులుతూ వున్నవి.

జాన—(తనలో) యీపాడుపోలికలు చూస్తే నాకు తలనొప్పి వేస్తూ వున్నది.

సాహ—(తనలో) ఆబుట్టలో నావొళ్ళంతా నలిగి పోయింది. ఆ అలసటచేత నాకు నోరు యెండుకు పోతూన్నది. (బిగ్గరగా) మనలో మనకు వున్న పూర్వపు స్నేహాన్ని బట్టి యేమీ అరమరలేకుండా అడుగుతూ వున్నాను. దృఢవ్రతా! నాకు కొంచెం పానకం చేయించి తెప్పించగలరా?

జాన—యిరదాకో అమ్మగారు పానకం చేయించి కొంత గిన్నెలో పోసి వుంచినారు. అది తీసుకు వస్తానా?

దృష్ట--వేగిరం తీసుకు రా.

జాన--నిముషంలో తెస్తాను. (అని వెళ్ళుచున్నది)

సాహా--నేను యిప్పుడు ప్రయాణాలో చాలా అలసట పడి వచ్చినాను. దానితో నా కిప్పుడు దాహ శాంతి కావచ్చును. ఆ గిన్నెడు పానకమూ నేను యిప్పుడు గిన్నెడు అమృతంగా యెంచుకుంటాను.

దృష్ట--ఏమి? బండీమీద వచ్చినావా యేమి?

సాహా--(తనలో) బండిమీద కాదు. బుట్టలో వచ్చినాను. (బిగ్గరగా) నేను వెనుక చూచినప్పుడు మీకు భార్య లేదు. ఈసుధ్యను వివాహమాడినారు కాబోలును. ఈయింట్లో మీరు కాపురంవున్నారా?

దృష్ట--ప్రస్తుతం మట్టుకు వున్నాము. మేము యిక్కడ చిర కాలం వుండము.

సాహా--మరియెక్కడకు వెళ్తారు?

దృష్ట--(తనలో) బహుశా చెరస్తాలలోకి. (బిగ్గరగా) ఎక్కడకు వెళ్ళేది ముందు సంగతులనుబట్టి తెలుసుకోవలెను.

[జానకి గిన్నెపట్టుకొని ప్రవేశించుచున్నది]

జాన--అయ్యా! ఇదుగో తెచ్చినాను.

సాహా--(పుచ్చుకొని త్రాగుచు) పానకం దివ్యంగా వున్నది. పానకంలో పంచదార పెయ్యిక బెల్లం వేసినారు కాబోలును అడుగున నోట్లోకి తుక్కువస్తూ వున్నది. అది చెరుకు పిప్పేనా? నూలుక వేదుగా వున్నట్టున్నది. మీరు తోగినప్పుడు చేదు కనపడలేదా?

దృష్ట--నేను యెప్పుడూ పానకం తాగను.

సాహా--అలాగైతే మీరు మంచినీళ్లు మాత్రమే గుత్తచేసి నట్టున్నారు. నాకు కొంచెం వికారంగా వున్నది.

దృష్ట--మంచినీళ్ళు గుత్తచెయ్యడమా? నీళ్ళు గుత్తచెయ్యడ

మంచే నీ అభిప్రాయం యేమిటి? నేను మంచినీళ్ళు తప్ప మరియేమీ త్రాగనని నీ యభిప్రాయం కాబోలును.

సాహా--అవును. నా అభిప్రాయం అంతే. యీపనికిమాలిన తుక్కు-కంపె నేనుకూడా మంచినీళ్లు త్రాగితేనే బాగా వుండిపోను. నాకు లోపల యేలాగో వున్నది.

దృఢ--(తనలో) నాకూ అలాగే వున్నది.

జాన--(తనలో) నాకూ అలాగే వున్నది.

సాహా--నిజంగానే యీపానకంలో యేదో కలిసింది.

దృఢ--ఏమీ కలియలేదు. వట్టి అనుమానము.

సాహా--(చేతులతో కన్నులు మూసికొని) నీళ్లల్లో చేపలాగు లోపల తిరుగుతూ వున్నది.

దృఢ--నీళ్లల్లోనా? (అని కిటికీయొద్దకు పరుగెత్తుచున్నాడు)

జాన--చేపలాగునా? (అని కిటికీయొద్దకు పరుగెత్తుచున్నది)

దృఢ--ఏమి నీటిపైని తేలిందా?

సాహా--నాప్రాణాలు పోతూవున్నవి. నిశ్చయంగా యీపానకంలో యేదో కలిపినారు. అది విషము వుంటుంది.

(అని బల్లమీద మూర్ఛపోయి పడుచున్నాడు)

దృఢ--జానకీ! యిది యేమిటి? (అని రెప్పవాల్పక చూచుచున్నాడు)

జాన--(కన్నులు నలుపుకొనుచు) యిదేమిటి?

దృఢ--ఇది రెండో నరహత్య. జానకీ--

జాన--అయ్యో!

దృఢ-- (గిన్నె వాసన చూచి) ఈపానకంలో తప్పకుండా యేదో కలిసింది.

జాన—(ఏమ్చుచు) అలాగైతే నన్ను వురితీస్తారు.

దృఢ—బహుశా తీస్తారు. నీకూ నాకూకూడా రెండేసి వురి తాళ్ళు కంఠాసికి బిగియుడానికి సిద్ధంగా వున్నవి. నీ దుర్మార్గంలో నన్ను కూడా సహకారినిగా యేవుద్దేశంతో చేస్తూ వున్నావని?

జాన—ఇంతా కేవలం పొరబాటు!

దృఢ—నీ పొరబాట్లన్నీ పరిణామానికి వచ్చే పొరబాట్లు. బుట్టలోవాడా యేట్లో వున్నాడు; ఇక్కడ సాహసవర్మ విషప్రయోగం చేత ప్రాణాలు విడిచినాడు. ఇఖ మనను యిద్దరినీ తప్పకుండా వురి తీస్తారు. అప్పుడు పోయినవన్నీ మనవాటితోకూడా నాలుగుప్రాణాలవుతవి. ఇందువల్ల భూభారం కొంత తగ్గుతుంది.

జాన—అతడు పానకం యెందుకు కావలెననవలెను?

దృఢ—అసలు యితడు నేను పిలువకుండా మన యింటికి యెందుకు రావలెను? ఇతణ్ని యిక్కడకు రమ్మని యెవరు పిలిచినారు?

జాన—ఇతన్ని మనం యిప్పుడేమి చేతాము? ఆ బుట్టలోవాడికి సహాయంగా యితన్నికూడా ఈ కిటికీలోనుండి అవతలకు తోసివేతామా?

దృఢ—అవిగో యెనోన్నడవలు యీదారిని వెళుతూవున్నవి. మనం కిటికీలోనుంచి తోస్తే వాళ్లు చూస్తారు. (అప్పుడు తలుపుచప్పుడగుచున్నది) ఎవరో తలుపు గుద్దుతూవున్నారు. వారు లోపలికి వస్తూ వున్నారుకాబోలు!

జాన—అయ్యో! నాకు మూర్ఛవస్తూవున్నది.

దృఢ—ఇలాగంటి చిక్కు-సమయంలోనా? ఈకష్టసమయంలో నీవు యెంతమాత్రమూ మూర్ఛపోగూడదు. ఇప్పుడు నాకు నీ సహాయం అవశ్యంగా కావలసివున్నది. ముందుగా తలుపు లోపల గొళ్ళెం

మృదు—ఓపార్థివేశ్వరా!

దృఢ—(చదువుకొనుచున్నట్లుగా ఒక పురాణమువిప్పి ముంను వేసికొని) వస్తూవున్నాను. కేకలు వెయ్యకండి. (అని తలుపు తీయుచున్నాఁడు)

[అప్పుడు చండశాసనుఁడును, మృదుభాషిణియు ప్రవేశించుచున్నారు]

మృదు—ప్రభువువారికి ఆఖరికి యింతసేపటి కయినా మా పిలుపులు వినబడ్డవి. సంతోషించవలెను.

దృఢ—యింతసేపటికా? ఓపార్థివేశ్వరీ! నీవు నన్ను వక్కపిలు పుకంచె యెక్కువ పిలిచినావా?

మృదు—సరి సరి వక్కపిలుపా? మేము మీకు అధాత్తుగా చెవుడు వచ్చిందనుకున్నాము.

చండ—అన్ని తలుపులూ లోపలవేసి వుండడంచేత యీవిడె అనుమాన పడడాని కారంభించింది. ఈవిడ తప్పకుండా లోపల యెవరో వున్నారంటే, నేను వుంటే వున్నారు లోపల యేమిహాత్య జరగడం లేదుగదా వూరుకోమనాన్నాను.

మృదు—పార్థివేశ్వరా! లోపల తలుపు వేసుకుని మీరు యేమి చేస్తూవున్నారు?

దృఢ—పుస్తకం చదువుకుంటూ వున్నాను. కర్మవిపాకంలో నరహత్య పాపానికి యేమిప్రాయశ్చిత్తం విధించినాడో అని చూస్తూ వున్నాను. పుస్తకం విప్పివుండడం నీవు చూడలేదా?

మృదు—చూచినాను. చదవడానికి వీలులేకుండా పుస్తకం తల్లకిందుగా పెట్టివున్నది.

దృఢ—నేను పుస్తకము తల్లకిందులుగా కూడ చదువగలను. చదువువుందు శ్రద్ధవుంటే యేలాచదివినా చదువవచ్చును.

వేసిరా.

జాన—ఈపక్క తలుపు తప్ప తెక్కానవన్నీ ముదివరకే వేసి వున్నవి. ఇదికూడా వేస్తాను. (అని వేయుచున్నది)

దృఢ—ఇతణ్ణి యీ పెద్దమంచంమీద చివరగా పడుకోపెట్టి యెత్తు సరిపోవడానికి ముతని పక్కను చిన్నపరుపు వేసి పయిన పెద్ద పరుపు వేతాము. అప్పుడు పరుపుకింద మనిషి వున్నాడని యెవరూ కనుక్కోలేరు. (అని యట్లు చేయుచున్నారు)

చండ—(వెలుపలనుండి తలుపుగుద్దుచు) దృఢవ్రితా! దృఢవ్రితా!

మృదు—(వెలుపలనుండి) ఓపాణేశ్వరా! తలుపు తలుపు.

జాన—యీశవం అప్పుడే ఎంతబరు వెక్కిందీ!

దృఢ—వాళ్ళు తలుపవతల వున్నారు. మనము పరువూ దుప్పటీ బాగా వేసినాం గనుక ముఖవాళ్ళకు తలుపు తీస్తాను.

జాన—మనం ముద్దరమూ వక్కగదిలో తలుపులు వేసుకుని వున్నట్టు అమ్మగారికి తెలియకూడదు. ఆమె అపరే అనుమానపు మనిషి.

దృఢ—యీవీణె బుక్కాతీసి వీణె యెవరికీ కనపడకుండా మంచంకింద గోడవగ్గిరగా పెడుతాను. నీవు యీ బుక్కాలో దూరి వీణెవున్నట్లుగా ఆమూలను గోడ దగ్గిర నిలుచుని వుండు.

జాన—ఆపని వేగిరం చెయ్యండి.

దృఢ—(వీణెగవిసెనతీసి జానకిపయినగప్పి) నీవు యీ మూల యీ గలీబులో కదలకుండా నిలుచుండు. (అని వీణను మెల్లగా మంచ మునుకింద పెట్టుచున్నాడు)

చండ—ఓదృఢవ్రితా!

మృదు—అవునుకాని మీరు పేరితంలాగు మొఖాన్ని కళ లేకుండా తెల్లగా పాలిపోయినట్లు కనపడుతూ వున్నా రేమి?

దృఢ—పేరితమా? ఎక్కడ?

చండ—మీరు పేరితమంటే జ్ఞాపకం వచ్చింది. నామిత్రుడు దంభపియుడు యిప్పుడు వస్తాడు. అతను మీకు కావలసినన్ని భూత పేరిత పిశాచాదుల కథలు చెపుతాడు. అతను పరియంటినే తప్ప కుండా వకదెయ్యం ఆశరియించి వుంటుందని నమ్మిస్తాడు. బావా! నేను మీచదువుకు యేమీ అడ్డం రాలేదుగదా? మేము యిందాకా సంగీత విషయంలో వక తగాదాపడి మీరు చెప్పినట్టు వప్పుకుంటూ మనుకున్నాము. నేను వీణెకు యిరవైమూడు మెట్లంటే నాచెల్లెలు ముప్పయిరెం డంటుంది.

మృదు—అవును నేను యిప్పుడూ అలాగే అంటూవున్నాను. వీణెకు తప్పకుండా ముప్పయిరెండు మెట్లే.

చండ—కావు. నిశ్చయంగా యిరవయిమూడు మెట్లే.

మృదు—వూరికే అరిస్తే యేమిపరియోజనం? నిజానికి ముప్ప యిరెండు మెట్లు.

దృఢ—మీయిద్దరిలెక్కా సరిగానేవున్నది. మీలో యెవ రయినా వకరు మీ అంకెలు తారుమారుచేస్తే యిద్దరిలెక్కా వక్క టిగా టక్కున సరిపోతుంది.

మృదు—యిదా తగవుతీర్చడం? మీతీర్పు యేడిసినట్టేవున్నది.

చండ—పోట్లాడకు. నామిత్రుడు దంభపియుడు నచ్చేటప్ప టికి మనం వకరితోవొకరు తగువు లాడుకుంటూవుంటే బాగావుండదు.

[మనోరంజని పరివేశించుచున్నది]

చండ—ఓసీ! మనోరంజనీ! నీ మామధ్య వీణె నేర్చుకుంటూ

వుండే దానవు గదా వీణెకు యెన్ని మెట్లు వుంటవో చెప్పు.

మనో—నాకు జ్ఞాపకం లేదు. అదుగో ఆమూల నావీణెవున్నది లెక్క-చూచిచెపుతాను. (అని జాకి దాగియున్న వీణెగవిసెన చూపు చున్నది)

చండ—బావా! అది నీకు దగ్గరగావున్నది. మూతతీసి ఆవీణె యిలా నా చేతికియ్యి.

దృఢ—(తనలో) ఇప్పుడు మళ్ళీకొత్తచిక్కు వస్తూవున్నది. (బిగ్గరగా) వద్దు వద్దు. ఈవీణెమెట్లు సరిగా లేవు. ఈమధ్య కిందపడి కొన్ని విరిగిపోయినవి. ఇది పనికిరాదు.

మృదు—పనికివస్తుంది. నన్ను చూడనియ్యండి.

దృఢ—నేను పనికిరాదని చెపుతూవుంటేను—

మనో—ఆయన యెంతపట్టుగా మాట్లాడుతూ వున్నాడో?

మృదు—పనికిరాకపోతే పోయెను నన్ను మట్టుకొని చూడ నియ్యండి.

దృఢ—నీ వది ముట్టుకోకూడదు.

మృదు—నేను చూడకమానను.

చండ—తప్పకుండా చూడవలసినదే. వీణె దగ్గిరవున్నప్పుడే తగాదా పరిష్కారం చేసుకోకపోతే మరియెప్పుడు?

దృఢ—ఈ తగాదా పరిష్కార మయ్యేదికాదు.

మృదు—ఇదిగో యిప్పుడే పరిష్కారమవుతుంది. (అని లేచుచున్నది)

దృఢ—నిశ్చయం కాదు. (అని యడ్డమువెళ్ళి యీమెను పట్టు కొనుచున్నాడు)

[ఆప్పుడు వీణెమూల మూలనుండి కదలి నడుచుచున్నది]

చండ—అహాహాహా! వీణెగవిసెన నడుస్తూవున్నది.

మృదు—నా కిప్పుడంతా బోధపడ్డది. దానికింద యెవరో దుర్మార్గులు దాక్కున్నారు. వెంబడించి పట్టుకుంటాను.

మనో—నీతో నేనుకూడా వస్తాను.

దృఢ—(ఆమెను పట్టుకొని) వెళ్ళకు వెళ్ళకు.

[దంభపిశాచియుడు ప్రవేశించుచున్నాడు]

చండ—ఆహాహాహా! మిత్రుడా! క్షేమమా? నీవు యిక్కడికి మంచి సమయానికి వచ్చినావు.

దృఢ—సుఖం లేకుండా యిలాకుటుంబకలహం బాగావుండదు.

మృదు—నీవు చంపివేసినతరువాత కలహంలేకుండా యెలాగు వుంటుంది?

దృఢ—నేను యెవరిని చంపినాను?

మృదు—నాసుఖాన్ని.

దృఢ—అంతేగద? దానికి పర్వాలేదు.

చండ—బావా! నీస్థితియేమీ బాగావున్నదికాదు.

మనో—ఈయన భార్యను బహు బాధపెడుతూ వున్నాడు.

మృదు—ఈయన మూలంగా నాగుండెలు పగిలిపోతవి. (అని యేడ్చుచున్నది)

దంభ—ఏమపుకూడానా? ఇది మహా అనురాగంగల కుటుంబము. నేను అసమయంలో వచ్చినాను కాబోలును.

దృఢ—(తనలో) నాకు యిప్పుడు వక ఆలోచన తోస్తూ వున్నది. (భార్యతో నేకాంతముగా) ప్రాణేశ్వరీ! చెవులో మాట. నేను నీళ్ళల్లో యెవరిని పడవేసినానో నీకు తెలుసునుగదా?

మృదు—ఎవరిని?

దృఢ—బుట్టలోకూర్చుని వచ్చినవానిని.

మృదు—అయితే?

దృఢ—(ఏకాంతముగా) అతడు యింతకుముందు మన లోపలికివచ్చినాడు. చండశాసనుడిమాట నాకు వినపడడంతోటే, అతను చూచి మనమీద అనుమానం పడకుండా వుండడానికి ఆబుట్టలో వచ్చిన పెద్దమనిషిమీద నేను వీణెబురకా కప్పినాను. ఆ వెళ్ళింది అతడే. (తనలో) అతడు నిజంగా బ్రతికివస్తే నాకు సంతోషంగా వుండును.

మృదు—ఓస్ని! ఇంతేనా? ప్రాణేశ్వరా! మీరు మహాబుద్ధి కుశలతగలవారు—అన్నా! ఆబురకాలో యేమీలేదు. మనం వూరికే భ్రమపడ్డాము.

చండ—ఇప్పు డంతా బహు తృప్తికరంగా వున్నది.

మృదు—మీబావగారు మన సందరినీ వక్కసారి యేడిపించి తమాషా చూడడానికి వట్టి యంత్రం వేసినారు.

చండ—ఆయనయంత్రం బహుబాగాపారింది. నేనుయెప్పుడూ యిటువంటి తమాషా చూడలేదు.

దంభ—నేనూ చూడలేదు. యీ యింట్లో యేదో పిశాచం వుండివుంటుంది.

దృఢ—ఓప్రాణేశ్వరీ! నామీద నీవు నిష్కారణంగా సందేహపడ్డావు. నేను చేసిన తప్పిత మంతా—(తనలో) వక్కనరహత్య.

మృదు—మీరు కోపపడకండి. పయి సంగతులన్నీ చూస్తే మీ మీద అనుమాన పడడానికి తగినట్టు కనపడ్డవి.

చండ—వంటయి భోజనాలకు పిలిచేలోగా వక్కసారి చల్లపాటువేళ యీగోదావరివడ్డున తిరిగి వస్తామా?

మనో—ఇప్పుడు ప్రదోషసమయ మయింది. మంచి చల్లగాలి

కొడుతూ వుంటుంది. వక్క సారి హాయిగా తిరిగి వత్తాను.

దంభ—దయ్యాలకథలకు ఇది మంచి సమయం.

మృగు—ప్రాణేశ్వరా! వెళుదాము రండి.

దంభ—రండి. ఇక్కడనే గోదావరిలో పడి చచ్చిపోయి పిశాచ మయినవాడి కథ చెపుతాను రండి. ఆకథ దివ్యంగా వుంటుంది. (ఒక్క దృఢవ్రతుడు తక్క అందరును వెళ్ళుచున్నారు)

దృఢ—ఇప్పటికి నాకు వంటరిగా సమయం దొరికింది. ఇది నాకు వట్టి దురదృష్టదినం. తెల్లవారి లేచిన తరువాత రెండు నర హత్యలూ నక్క పోట్లాటా తటస్థమయినవి. సమయానికి జానకి యెక్క డకు పోయిందో! అదగో వస్తూవస్తూవున్నది.—జానకీ! నీవు యెలాగు వున్నావు?

[జానకి ప్రవేశించుచున్నది]

జాన—ఎలాగు వుండవలెనో అలాగు వున్నాను. నామనస్సులో వున్న ఆందోళనం మీకు చెపితే తెలియదు.

దృఢ—తెలుసును. అపరిమితంగా వుంటుంది.

జాన—మురికికంపు కొడుతూవున్న ఆబుకకాలో దూరి వూపిరి సలుపకుండా కూర్చున్నప్పుడు చచ్చిపోతా నేమో నని తోచింది.

దృఢ—నీవు చావకపోయినా చచ్చే టంత పని అయినా వుట్టింది. నాకు ఆ భాగ్యమూ కలుగలేదు.

జాన—నేను దానిలోనుంచి వూడిపడడంతోటే ప్రాణాలు లేచివచ్చి చల్లగాలి నిమిత్తం తిన్నగా గోదావరి వడ్డుకు పరుగెత్తినాను. అక్కడ పిల్లలు యేదో వృత్తాంతపత్రిక చదువుకుంటూ వున్నారు.

దృఢ—ఏమి వృత్తాంతాలు చదివినారు?

జాన— మొట్టమొదట యెవరోవక మనిషిని చంపినారని

చదివినారు.

దృఢ—వక్క మనిషినే కద! అలాగయితే ఆ పుణ్యాత్ముడు యెవరో మనంత దోషికాడు. యీరాత్రి మనం యిద్దరమూ తెల్ల వారినదాకా మేలుకునివుండి దాన్ని మనం యిద్దరమూ తోడుపట్టుకునివెళ్ళి యెవ్వరికీ తెలియకుండా గోదావరిలో వడవేసి రావలెను. దాన్నంటే దేన్నో బాగా తెలిసిందా?

జాన—తెలిసింది. సుబలుడు దుప్పటీపట్టుకుని పక్క వెయ్యడానికి వస్తూవున్నాడు. విసిపోతాడు మాట్లాడకండి.

[సుబలుడు ప్రవేశించి పక్కదులిపి పరుపునూడ దుప్పటి వేసిపోవుచున్నాడు].

దృఢ—ఓసీ జానకీ! మంచం యెంత బరువుగా వున్నదో వక్క మాటు యెత్తిచూతాము. అవతలవైపు పట్టు. (ఎత్తి చూచి) అబ్బో! ఇది వుసదీపు బలువుగా వున్నది!

జాన—బలువూ లేదు. యేమీ లేదు. యిది మనం యిద్దరమూ తోడు పట్టుకుని తీసుకు వెళ్ళగలము దింపండి. అదుగో వారు వస్తూవున్నారు.

[చండశాసనుడును, మృదుభాషిణియు, మనోరంజనియు, దంభప్రియుడును, ప్రవేశించుచున్నారు]

దంభ—(తనలో) ఇది మహామంచికుటుంబంగా వున్నది. ఈ చిన్నది నేను దెయ్యపుకథ యేది మొదలుపెట్టినా మాటిమాటికీ అడ్డమే వస్తూవుంటుంది. ఈముసలాయన యెంత మంచికథ చెప్పినా అంతా అబద్ధమంటాడు. (బిగ్గరగా) మన మంతా సుఖంగా యిల్లుచేరినాము.

చండ—మీకు కరకర లాడుతూ ఆకలి బాగా వేస్తూవున్నట్టున్నది.

దంభ—వేస్తూనే వున్నది. మధ్యాహ్నం రెండోమాటు ఫల

హారమున తరువాత మళ్ళీ యేమీ పుచ్చుకోలేదు.

చండ—మనం అదృష్టవంతులము. మనకు యీరాతి పిండి వంటలతో విందు దొరుకుతుంది.

దంభ—(తనలో) నేను యిక్కడకు వచ్చినతరువాత విన్న వాటిలో యిది వక్కటే మంచిమాట.

దృఢ—ఈరాతి కాదు. రేపుదయాన్న దొరుకుతుంది. ఈసారి రెండు యేకాదసులు వచ్చినవట. యింతకుముందే విన్నాను. యివాళ స్మార్తపు యేకాదశీ, రేపు వైష్ణవు యేకాదసీని. ఈరాతి కొంచెం అటుకుల ఫలహారం తప్ప యేమీ తినకూడదు. (తనలో) ముఖ్యమయి నది నాకు యీరాతి ఆకలి కావడం లేదు. వీళ్లతో కూర్చుని యేమి తినకుండా లేచిపోతే వీళ్ళు అనుమాన పడుతారు.

[సుబలుడు ప్రవేశించుచున్నాడు]

సుబ—ఓదంభప్రియా! మీబసలో పడుకోవడానికి ప్రత్యేకంగా గది లేదని మీనవుకరు మీతో చెప్పుమన్నాడు.

చండ—ఇక్కడకూడా అందరికీ పడుకోవడానికి మంచాలు లేనట్టున్నవి.

[పళ్లెములో ఆటుకులు వేసికొని జానకి ప్రవేశించుచున్నది]

దంభ—ఇక్కడ యెకుట వకమంచము కనుపడుతూ వున్నది.

చండ—మిత్రుడా! యీమంచము నీవు వుపయోగించుకొన వచ్చును. మేము లోపల యెక్కడైనా పడుకుంటాము.

జాన— అయ్యో! (అని కేక వేసి పళ్లెము క్రిందపడవేయు చున్నది.)

మృదు—దౌర్భాగ్యురాలా! పళ్ళెం అలాక్రిందపడవేసినానేమి? నీకేమి కళ్ళు కనపడవా యేమిటి?

దంభ—ఇది సరసంగా వున్నది. ఇక్కడ నవుకర్లకు కూడా కళ్లు నెత్తి మీదికి వచ్చినట్టున్నవి.

జాన—అయ్యా! యెందుకు గొల్లెం జారిపోయిందో చెపుతాను వినండి—ఏమయ్యా! నీకు దాన్ని వింతుకువచ్చినవాను మీరుకూడా నామీద కోపపడుతూ వున్నారు! మీరు నామీద కోపపడడానికి మీరు నన్నేమీ జీతమూ భత్యమూ యిచ్చి నిలపలేదు. నాకు కోపం వచ్చి నేను మళ్ళీ యేమయినా అన్నానంటే మీమనసుకు భారంగా వుంటుంది. వూరుకోండి.

దంభ—ఇది కొత్తఖుజ్జా. బాగా వున్నది!

చండ—ఆహాహాహా! బాగానే వున్నది. అటుకులు కిందపడి మయిలపడిపోయినవి. ఈరాత్రి మనకందరికీ యేకాదశీఫలం పూర్ణంగా లభించింది. మీకందరికీ జాగారపు పుణ్యంకూడా దక్కించుకోవలెనని లేకపోతే వెళ్లిపడుకుందాము రండి.

దంభ—యివేళ దివ్యమయిన విందు దొరికింది.

చండ—అలాగంటే యేకాదశి నిలహారం చేసిన పుణ్యంకూడా పోతుంది. మిత్రుడా! నీవు స్వస్థంగా యీమంచంమీద పడుకుని వేగిరం కళ్ళు మూసుకుని నిద్రపో. మేము లోపలికి వెళ్తుతాము.

జాన—వద్దు వద్దు. ఈమంచమీద యెవరూపడుకోకూడదు. దీనిది పాతనవ్వారు తెగిపోతుంది. దీనిమీద పరుపు లేదు. దీనిమీద యెవ్వరైనా పడుకుంటే కింద పడుతారు.

దృఢ—(తనలో) దీనికి దేవుడు మంచిఉపాయం తోపించినాడు.

దంభ—నేను మీనుగుతో జాగరంచేసినట్టు తెల్లవారిందాకా మేలుకోలేను. పడితేపడ్డాను నేను యీమంచంమీదనే పడుకుంటాను.

(అని పడుకొనుచున్నాడు)

మృదు—మనంకూడా వెళ్ళి పడుకుందాము రండి. ప్రాణే శ్వరా! మీకు యింకా నిద్రిరావడం లేదా?

దృఢ—ప్రాణేశ్వరీ! నీవు వెళ్ళి పడుకో. యేకాదశినాడు యెంతసేపు మేలుకుంటే అంత పుణ్యం వస్తుంది. నేను మధ్యాహ్నం ఆరంభించిన గ్రంథం పూర్తిచేస్తేనే కాని పడుకోవటానికి రాను.

మృదు—మీకు పురాణాలమీదనూ వ్రతాలమీదనూవుండే శ్రద్ధలో సగం సంసారంమీదవుంటే బాగుపడి పోదురు. (అని మృదు భాషిణియు, మనోరంజనియు వెళ్ళుచున్నారు)

దృఢ—(రహస్యముగా) జానకీ! ఇతనికి నిద్రిపట్టగానే కత్తెర వకటి పట్టుకుని నీవు యిక్కడకు రా. మనం అడుగునుంచి నవ్వారు కత్తిరించి, అతణ్ని కిందివైపునుంచి పయికి తీతాము. ఇతడు పయిని పడుకుని వుండగా పయి వైపునుంచి తియ్యడం సాధ్యం కాదు.

జాన—అప్పమయంలో వకవేళ యితడికి మెళుకున వస్తేనో?

దృఢ—అప్పుడు యితణ్నికూడా చంపుదాము. (అని వెళ్ళు చున్నాడు)

దంభ—(తనలో) ఇది కొంచెం అందకత్తెలాగున కనపడుతూ వున్నది. దీనితో కాస్తసేపు మాట్లాడుతాను. (బిగ్గరగా) పిల్లా! నీవు యిక్కడ కొంతసేపు వుండవచ్చును. తొందరగా వెళ్ళనక్కరలేదు.

జాన—మీనిద్రకు భంగం కలగచెయ్యడం నాకు యిష్టంలేదు.

దంభ—నా కసలు నిద్రే రావడం లేదు.

జాన—(తనలో) పరమమర్మాస్థుడు. అతడు మాపనికి విఘ్నం చేస్తూ వున్నాడు. (బిగ్గరగా) మీరు నిద్రిపోవలెను. వేగిరం నిద్రిపో

వలెను. వక్ర నిముషంలో నిద్రిపోవలెను. నిద్రిపోక తప్పదు. మీమ్మ
లిని యిద్దరు పట్టుకుని కదిపినాకానీ మెళుకువరానంత గాఢనిద్ర పోవ
లెను. (అని వెళ్ళుచున్నది)

దంభ—తెల్లవారగానే నేను యిక్కడనుంచి వెళ్ళిపోతాను.
ఇఖ నాదేహంలో ప్రాణంవుండగా యిటువంటియింటికి యెప్పుడూరాను.
ఎక్కడ చూచినా పోట్లాటలే. ఎక్కడచూచినా కేకలే. నాగ్రహా
చారంచేత యీరాత్రి నుపవాసంకూడా తటస్థించింది. కునికిపాట్లు
వస్తూవున్నవి. వీళ్ళసంగతి మరిచిపోయి హాయిగా నిద్ర అయినా
పోతాను. (అని నిద్రపోవుచున్నాఁడు)

[దృఢవ్రతుఁడును, జానకియు, కత్తెర చేతఁబట్టుకొని తలుపుసందునుండి
తొంగిచూచుచు ప్రవేశించుచున్నారు]

దృఢ—అతడు నిద్రిపోతూ వున్నాఁడు.

జాన—రేపు నేనూ పోతాను. (తనలో) బహుశా వురిస్తం
భాలకు.

దృఢ—ఇఖమనం ముందుగా మనపని చూచుకోవలెను.

జాన—మనది మంచిపనికాదు గనుక వుత్సాహం లేకుండా
వున్నది.

దృఢ—ఇతడు నిద్రిపోయినాడు. మన సందేహం పోవడానికి
దీపం యితని ముఖందగ్గిరగాపట్టి చూస్తాను. (అని లాంతరు దంభపై
యుని ముఖముమీద పెట్టుచున్నాఁడు)

దంభ—(ఉలికిపడి లేచినప్పుడు లాంతరు నెత్తికితగిలి దృఢవ్ర
తుని చేతిలోనుండి క్రిందపడి దీపమారిపోఁగా) అయ్యోపాపమా! ఇది
యేమిటి? నాతల పగిలిపోయింది నానెత్తి చిల్లిపడ్డది. ఈచీకట్లో నా
గ్రహాచారం కాలింది.

దృఢ—(హీనస్వరముతో) మన ప్రాణంమీదకి వచ్చింది. ఇప్పుడు మనం యేమిచేతాము?

జాన—(హీనస్వరముతో) నావళ్ళు వణకుతూవున్నది. ఇతణ్ణి లేపడం తప్పుపని చేసినారు. ఇఖ మన మా చచ్చినవాణ్ణి వెలపలకు తీసుకు వెళ్ళలేము.

దంభ—ఇక్కడ యేమిటో గుసగుసలాడుతూవున్నట్టు చప్పుడు వినబడుతూవున్నది. ఇంట్లో యేదైనా దెయ్యం వున్నదేమో నాకు భయం వేస్తూవున్నది.

జాన—(తనలో) నాకూ భయంవేస్తూ వున్నది.

దృఢ—(తనలో) నాకూ భయంవేస్తూవున్నది. (జానకితో) ఇఖమనం వెలపలకు వెళ్ళిపోవలెను. తలుపు యెక్కడవున్నది? (అని తడువుచు చీకుచున్నాడు)

దంభ—తప్పకుండా యీగదిలో యేదో పిల్లివున్నది. ఇదేమిటి? నేను పడుకున్న పరుపు కిందికీ మీదికీ యిలా కదులుతూవున్నది! పరుపు కింద యేదోవున్నట్టున్నది. అది నిశ్చయంగా దెయ్యమయి వుంటుంది. లేస్తూవున్నదే. ఓదయ్యమా! అణిగి పడుకో.

జాన—నాకు తలుపు కనపడడంలేదు. యీచీకట్లో యెవరయినా దొంగలు తలుపెత్తుకొని పోయినారేమో!

దృఢ—ఆపరుపుమీదివాడు అరుస్తూవున్నాడు. దారి కనపడదు.

[ఆప్పుడు సాహసవర్మ పరుపును, పరుపుతో దంభప్రియుడును కిందపడునట్టుగా లేచుచున్నాడు]

దంభ—అయ్యో! నన్ను చంపుతూవున్నారు. దొంగలు దొంగలు. దయ్యాలు ఓచండశాసనా వేగిరం రా.

[చేతిలో దీపము పట్టుకొని చండశాసనుడు ప్రవేశించుచున్నాడు]

దృఢ—దీపం వెలుతురు వచ్చింది శవంలేచింది పట్టుకో. (దృఢ వ్రతుడును జానకియు తమచేతులతో సాహసవర్మను గట్టిగా పట్టుకొనుచున్నారు)

చండ—ఈ అల్లరంతా యేమిటి? మీ కేకలతో యీచుట్టుపట్ల వాళ్ళ కందరికీ మెళుకువ వచ్చింది ఇందులో ముగ్గురు వకరిని వకరు కౌగలించుకున్నారు. నాలుగోవాడు చంపిరి చంపిరని కేకలు వేస్తూ వున్నాడు. ఇదంతా యేమిటి?

దృఢ—నేను మరిచిపోయినాను. మిమ్మలని యిద్దరినీ వకరిని వకరికి చూపలేదు. ఓచండశాసనా! ఇతడు సాహసవర్మ. ఓసాహసవర్మా! ఇతడు చండశాసనుడు.

చండ—సాహసవర్మను చూస్తే నాకు బహుసంతోషంగా వున్నది. ఇతడు యీలోపలికి యెలాగువచ్చినాడు?

జాన—అయ్యా! మీరు బ్రతికేవున్నారా? ఆశ్చర్యం!

దృఢ—ఇతడు నాకు ముఖ్యస్నేహితుడు.

చండ—ఇతడు జానకికికూడా ముఖ్య స్నేహితుడులాగే కన పడుతూవున్నాడు. ఓదంభప్రియా! నీసంగతి యేమిటి?

దంభ—నాసంగతా? ఒకటేమిటి? అన్నిని. ఈమంచమే యింట్లో మనుష్యులను కిందపడవేస్తుంది.

చండ—ఇంకా యెవరో వస్తూవున్నారు.

[సుబలుడు ప్రవేశించుచున్నాడు]

సుబ—ఎవరో ఒకమనిషి జానకిని చూడవలెనంటూ వున్నాడు. జానకి పేరుపున్న బుట్టనకటి అతనికి నదిలో దొరికినదట.

జాన—నాకొబుట్ట అక్కరలేదు. అతణ్ని పంపించివేసిపెయ్యి.

నే నాబుట్ట పుచ్చుకోను.

దృఢ——సుబలా! ఆబుట్టకూ బుట్టకు తెచ్చిన మనిషినీకూడా వీధిలోకి గెంటి వెయ్యి.

చండ——ఆబుట్టలో యేమివున్నదో తెలుసుకోకుండానే పంపించివెయ్యమంటూ రేమి?

జాన——అందులో యేమివున్నదో నాకు తెలుసును

దృఢ——తెలియదు. నీకు తేలియదు.

జాన——తెలియకపోయినా నాకు బుట్ట అక్కరలేదు. నాకు బుట్టలంటే వొళ్ళు గరుపొడుస్తుంది. బుట్టలు చూస్తే నేను జడుసుకుంటాను. నా కక్కరలేదు.

చండ——అందులో యేమయినా విలువగల వస్తువులున్నవేమో.

దృఢ——ఆ చిన్నదే అక్కరలేదంటూవుంటే, ఆ సంగతంతా మనకెందుకు? అది వద్దంటూవుంటే దానికి బలవంతంగా కట్టిపెట్టడం మనపని కాదు.

మాధ——(వెలుపలనుండి) సాహసవర్మగారు లోపల వున్నారు. నాకు తెలుసును.

సాహ——అది మా నిర్భాగ్యుడి కంఠస్వరము. ఓరీ! నేను యిక్కడవున్నాను.

[మాధవుడు ప్రవేశించుచున్నాడు]

జాన——ఓహోహో! విశ్వాసఘాతకుడైన మాధవుడా!

మాధ——(రోజుచు) అయ్యా! మీకు వృత్తరం తెచ్చినాను. (అని చేతికిచ్చి) మీరు యిక్కడవున్నసంగతి నాకు తెలుసును. ఎలా తెలుసునో చెప్పుకోండి. నేనే కాదూ మిమ్మల్ని——ఆహాహా ఈవృత్తరంలో యేమి వున్నదోకూడా నాకు తెలుసును, ఈవృత్తరం తెచ్చిన

మనిషి నాకంతా చెప్పినాడు మన ముసలాయన కేశవవర్మగారు కాలం చేసినారు.

సాహ—త్రివిక్రమవర్మను నేనే. నా నిజమయినపేరు సాహస వర్మ. నాకు యిప్పుడు కావలసినంత ధనం వచ్చినసంగతి మీకు యీ వృత్తరం వల్ల తెలుస్తుంది. యీవృత్తరం మనోరంజనికి చూపించండి.

దృఢ—ఏమీ! త్రివిక్రమవర్మా? త్రివిక్రమవర్మవు నీవేనా? వకబుట్టలోవచ్చి నాభార్యకు కనపడి మాట్లాడింది నీవేనా?

సాహ—అవును. నేనే మాట్లాడినాను.

దృఢ—అలాగయితే యిప్పుడు యెవరూ చావలేదు. జానకీ! మనము యెవరినీ చంపనేలేదు.

[మృదుభాషిణియు, మనోరంజనియు ప్రవేశించుచున్నారు]

మనో—ఏమి! త్రివిక్రమవర్మా!

సాహ—ప్రియురాలా! మనోరంజనీ! నీ అనుగ్రహం కనిపెట్టి వున్నాను.

చండ—అమ్మాయీ! నేనిదివరదాకా యితడే త్రివిక్రమవర్మ అని యెరుగను. ఇష్టమున్నపక్షమున నీవు యితణ్ణి వివాహ మాడవచ్చను. నా ఆటంక మేమీలేదు.

మాధ—జానకీ! ఈసంతోషసమయంలో మనంకూడా పెళ్ళి చేసుకుని మన యజమానులకు సంతోషం కలిగింతాము. (అసి చేయి పట్టుకొనుచున్నాడు)

దంభ—ఇదంతా నాటకంలాగు తోస్తూవున్నది. ఇది పరియాచకమా? అంతా నిజమేనా?

చండ—ఈ దాంపత్యం బుట్టకోసమేనా?

దృఢ—బుట్టకథంతా మీకు చేపువ్వుదయాన్న భోజనాలదగ్గర

చెపుతాను. ఈరోజున యీసాహసవర్మ మాచేతులలో రెండుమాట్లు చంపబడ్డాడు. అన్నీ కేపు మాట్లాడుకుందాము. ఇప్పుడే చాలాపొద్దు పోయింది. మనం యివాళపడ్డ ఆయాసమంతా పోయేట్టుగా హాయిగా నిద్రిపోయి తెల్లవారి లేతాము రండి. మీరు యెవ్వరూ నిద్రిలో యీకథ పలవరించకండి.

జాన—నాకు యీరాత్రి బుట్టలూ పానకంగిన్నెలూ కల లోకి రాకుండా వుండునుగాక.

దృఢ—నామిత్రి డైనసాహసవర్మ యీరోజున రెండుసార్లు చచ్చి బ్రతికినసంగతి మీరందరూ తెలుసుకున్నారుగదా? ఇకముందు యితడు రోజూ రెండేసిపూట్లు చావకుండా చిరకాలము సుఖంగా జీవించునుగాక! దంపతు లాయురారోగైశ్వర్యములు కలవా రయి సుఖింతురుగాక! మన మీరాత్రి సుఖంగా నిద్రిపోయి మంచిరోజున వీరిపెళ్ళికి తర్లి వెళుదాము రండి.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

బలాత్కారగాన వినోద ప్రహసనము

ఇందు వచ్చు పాత్రములు.

గానప్రియుడు—లీలావతికాంక్షి.
సంగీతరావు—గానప్రియునిమేనల్లుడు.
సుమతి—సంగీతరావుమిత్రుడు.
విస్మృపాత్రుడు—ఓర్వ దేశపు వడంగి.
గోవిందుడు—ఉద్యానవనపాలకుడు.
మాధవుడు—గానప్రియుని సేవకుడు.
వామనుడు—గానప్రియుని సేవకుడు.
లీలావతి—గానప్రియునికూఁతురు.

రంగము—రాజమహేంద్రివరములో గానప్రియుని యింటిలోని గది.

[వీణ ముందు పెట్టుకొని పాడుచు లీలావతి ప్రవేశించుచున్నది]

లీలా—(లేచి) ఈరాగము బహు కష్ట మయినది. ఇది నాకు యెప్పుడూ రాదు.

[అప్పుడు సంగీతరావు గుమ్మములోనుండి తొంగి చూచుచు ప్రవేశించుచున్నాఁడు]

సంగీ—(మెల్లగా) లీలావతీ! లీలావతీ!

లీలా—(ఉలికిపడి) యెవరు వారు?

సంగీ—(ముందుకు వచ్చి) భయపడబోకు. మరి యెవరూ కారు. నీమేనత్త కొడుకు సంగీతరావు.

లీలా—(ఎదురుగా వెళ్ళి కౌగలించుకొని) బావా! నిన్ను చూడడంచేత నాకుబహుసంతోషంగావున్నది. నీవు యిక్కడికి యెలాగు

వచ్చినావు? నిన్ను వాకట్లో యెవరూ అడ్డపెట్టలేదా యేమిటి? నిన్ను లోపలికి రానియ్యి వద్దని మానాన్నగారు నౌకర్లతో చెప్పినసంగతి నీకు యిదివరకే తెలుసునుగదా?

సంగీత—నాకూ అదే ఆశ్చర్యకరంగా వున్నది. వాకట్లో యెవ్వరూ వక్కపిట్ట లేరు.

లీలా—యివాళ నాన్నగారు నఖుకర్ల నంపరిసి వక విచిత్ర మైనపనిమీద పంపించినారు. నీవు సంగీతం పూర్తిగా నేర్చుకోకుండా తంజావూరు వదిలిపెట్టి అప్పుడే మళ్ళీ వచ్చినావేమి?

సంగీ—నేను మాగురువుగారివద్ద సెలవు పుచ్చుకొని వచ్చినాను. వచ్చేటప్పుడు నాతో వక స్నేహితుణ్ణి కూడా తీసుకుని వచ్చినాను. అతను యిప్పుడు సత్రంవద్ద వున్నాడు.

లీలా—(తలయూచి) ఇఖ నీవు సంగీతం వదలిపెట్టివెయ్యి. నన్ను వివాహం కావడానికి నీకు వక్కటే వుపాయం వున్నప్పుడు యిలాగు నీవు కాలం యెందుకు వ్యర్థంగా పోగొడుతావు?

సంగీ—అవు నవును. ఆ వుపాయం నాకు తెలుసును. నేను సంగీత పాటకుణ్ణి కావడ మని నీయభిప్రాయం. ఆవిషయంలో నీవు యెంత మాత్రమును సంకోచపడవలసినపని లేదు. నేను యిదివరకే సంగీ తంలో గట్టిగా కృషిచేసి యిఖవేరే సాధకం అక్కర లేకుండానే బిమ్మ టిని మెప్పించి నీ చెట్టపట్టగలనన్న ధైర్యంతోనే యిప్పుడునచ్చినాను. నా సామర్థ్యాన్నిగురించి నేను యేమిచెప్పను? మీనాన్నగారు వచ్చి యిప్పుడు పక్కనిముషం నాపాటవించే—(నవ్వి) నావిషయం నేను విశేషంగా చెప్పుకుంటే అత్మస్తుతిగా వుంటుంది—నేను కొంచెం పాడ గలను. మామగారు యెలాగు వున్నారు? ఆయన మునుపటివలెనే సంగీతమంటే చెవి కోసుకుంటూవున్నారా? ఎప్పు డాపుద్యోగం యేమ

యినా తగ్గిందా లేదా?

లీలా—ఇప్పుడాయనకు సంగీతపు పిచ్చ ముసుపటి కంటెనూ యాభయిరెట్లు యెక్కువ మురిసిపోయింది. ఆయనస్థితి చూస్తే ఆయనకు నిజంగానే మతిభ్రమయెత్తిందేమోనని నాకు తోస్తూవుంటుంది.

సంగీ—పాపం! ఆయనకు యిటుసంగీతంతో మతిపోతుంది.

లీలా—ఈమధ్య మైనూనుంచి వచ్చిన ఆగొప్పసంగీతపాట కుడి సంగతి వృత్తాంతపత్రికలలో చదివినప్పటినుంచీ బొత్తిగానే మతి పోయింది. ఆసంగీతపాటకుడి పేరు యెవరూ? యేమో మంచిపేరు. జ్ఞాపకం చేసుకుంటాను వుండు. ఆయనపేరు—మొదటి అక్షరం వీ—విశ్వనాథశాస్త్రుల్లా కాబోలును.

సంగీ—(నవ్వుచు) విశ్వపతిశాస్త్రిగారా?

లీలా—అవునవును. అమగో ఆయననే. ఇప్పుడు మా నాన్న గారు యేమిమాటాడినా ఆయనసంగీతాన్నిగురించితప్ప యురియేమీ మాట్లాడరు. రాత్రిళ్ళు నిద్రలో కూడా ఆయనసంగీతాన్ని గురించే పలవరిస్తూ వుంటారు. మొట్టమొదటినాటి రాత్రి ఆయనను పిలిపించి సంగీతం పాడిస్తూవున్నట్టు కలగని నిద్రలో బిగ్గరగా రాగాలు తియ్యడాని కారంభించేటప్పటికి నాకు భయంవేసి యేదో జబ్బువచ్చిందని వైద్యుడికోసం కబురులు పంపించడానికి ప్రయత్నం చేసినాను.

సంగీ—(నవ్వుచు) అవచ్చింది మగి యేజబ్బూకాదు. కేవలం సంగీతపు జబ్బు.

లీలా—చూడు. "మోసపోవద్దురా" అనే సారంగపాణి పదరి నేర్చుకోమ్మని నాన్నగారు నన్ను రాత్రి, పగలూ వూరికే ప్రాణాలు తీస్తూవున్నారు. అది మంచిది కాదంటే వినరు.

సంగీ—వానిమట్టు యిక్కడ యెవరికయినా వచ్చునా?

లీలా—యెవరికీ రాదు. ఆ పదం విశ్వనాథశాస్త్రి—కాదు, కాదు—విశ్వపతిశాస్త్రిగారు శనివారపుపేట జమీందారుగారివద్ద పాడి నారట. ఆపాట పట్టుకుని నాన్నగారు నన్ను పాడమంటారు. ఆ పదాన్ని కేవలమూ ఆశాస్త్రుల్లగారి ముఖతానే వినవలెనని యెంత ఖర్చు యినా యిస్తాను వకసారి దర్శనం యిచ్చి పొమ్మని ప్రార్థనపూర్వకంగా ఆయనకు వుత్తరం వ్రాసినారు.

సంగీ—(నవ్వుచు) సర్వసాధారణంగా ప్రతివాళ్ళూపాడే ఆ సారంగపాణిపదం పాడడానికి యెంతోసొమ్ము ఖర్చుపెట్టి విశ్వపతి శాస్తుల్లగారిని యిక్కడకు పిలిపిస్తారా? అట్లూ యెప్పుడూ జరగదు.

లీలా—తప్పకుండా జరుగుతుంది. ఈమధ్య నాలుగు రోజులు జ్వరం వచ్చి వెళ్లలేకపోయినారు గాని లేకపోతే నాన్నగారు స్వయంగానే యేలూరువెళ్ళి శాస్తుల్లగారిని వెంటబెట్టుకుని రావలె ననుకున్నారు.

సంగీ—ఆ పిచ్చవుత్తరాసకి యేమిజవాబు వచ్చింది?

లీలా—యేమీ జవాబేరాలేదు. అందుమీద నాన్నగారికి మహాకోపం వచ్చింది.

సంగీ—అలాగయితే ఆయనకోపం నేను శాంతపరుస్తానులే.

లీలా—నీవా? అది యెంతమాత్రమూ సాధ్యంకాదు.

సంగీ—నీవు కొంచెం వోపికచేసి కనిపెట్టివుండు. నేనాయనకు ఆశ్చర్యం కలుగజేసి అసంగీతపాటకుడు కానిలోపము కనపడకుండా చేస్తానోలేదో నీవే చూస్తావు. వకవేళ నామాటలు మీ తండ్రిగారి చెవులలో చొరకపోయినా నాసంగీతంమాత్రం ఆయనచెవులలోచూరి మనసు కరిగించకుండా మానదు.

గాన — (వెలుపలనుండి) లీలావతీ! లీలావతీ! (అని పెచ్చుస్వర

ముతో పిలుచు-మున్నా (డు)

లీలా—పిలవడంలో కూడా ఆరాగం తియ్యడం వింటూవు న్నావా? అతడు రాతీ్రి పగలూ యిదేమోస్తరు. ఆయన యిక్కడకు వస్తూవున్నాడు. నీ వాయనకంట సడకూడదు.

సంగీ—అవును. నేను యీదొడ్లో తోటలోకి వెళ్ళి నీకోసం కనిపెట్టుకొని వుంటాను. (అని సంగీతరావు వెళ్లగా లీలావతి వీణ చేత బట్టుకొనుచున్నది)

[అంతట గానపి్రయుడు పి్రవేశించుచున్నాడు]

గాన—అమ్మయీ! లీలావతీ! నీవు వొక్కత్తెవూ వున్నావా?

లీలా—(వీణ కి్రంద పెట్టి) వొక్కత్తెనే వున్నాను.

గాన—యింకా యెవరూ రానేలేదా?

లీలా—రా లేదు.

గాన—(తలుపు వద్దకుపోయి ఆలకించి) వూరుకో.

లీలా—అదేమిటి?

గాన—(చెవియొగ్గి యాలకించుచు) మాటాడకు వూరుకో.

లీలా—నేను మాట్లాడడం లేదు.

గాన—(ఆలకించి సంతోషముతో) అరుగో వాళ్లు వస్తూవున్న ట్టునా్నరు.

లీలా—యెవళ్ళు?

గాన—మన నవ్వుకర్లు. వాళ్లను అతనికి యెదురుగుండా పం పించినాను.

లీలా—యెవరికి యెదురుగుండా? వుత్తరాలు తెచ్చే బంట్రోతుకా?

గాన—(తిరస్కార భావముతో) బంట్రోతుకా? కాదు.

ఈదినం ఆమహానుభావుడి దర్శనముచేసి, ఆయన సేవచేసి, కర్ణోత్సవంగా ఆయనపాట విని, పరమానందంపొంది కృతార్థుణ్ణి అవుతాను.

లీలా—యేమిటా! మీవుత్తరంలో ప్రార్థించిన ప్రకారంగా మీరు యింకా ఆయన వస్తాడనే ఆశతోనే వున్నారా?

గాన—(తొమ్మ తట్టుకొనుచు) మెల్లగా ఆశ అంటావేమి? యేదయినా ఆలోచన యీ హృదయంలో ప్రవేశించిన తరువాత నేనది నెరవేరకుండా వదలిపెట్టను. (బిగ్గరగా) అతడు రావలెను. తీరా జున నిశ్చయంగా మనయింటికి వచ్చి తీరవలెను.

లీలా—ఆలాగా?

గాన—మరి యెలాగనుకొన్నావు? యివేళ నేను వకవుపాయం పన్నినాను. రేపుసాయంకాలం పిఠాపురం రాజుగారి యింటో పాట పాడడానికి విశ్వపతి శాస్త్రుల్లుగారు నిన్నటిదినం యేలూరు పడవయెక్కి ధవిళేశ్వరంమీదుగా యీరోజున పిఠాపురంవెళ్ళుతా రని నిన్నసాయం కాలం వృత్తాంతపత్రికలో చదివినాను. చదివి యేమిచేసినాననుకొన్నావు? నాచేవ్రాచూడు. వక్కమాట తప్పకుండా దర్శనమిచ్చి ఘంట సేపయినా మాగృహం పావనంచేసి వక్కపాటపాడి మళ్ళీ వెళ్లవల సినదని వుత్తరంవ్రాసి మనవుకర్ల చేతికిచ్చి తెల్లవారుజామునే బండినీ మనుష్యులనూ ధవిళేశ్వరం పంపించినాను.

లీలా—ఆయన యీదినం మనయింటికి వస్తారని తోచదు.

గాన—(బిగ్గరగా) తప్పకుండా వస్తారు. రాకతప్పదు. ఆయన మంచిమాటలతో రాకపోతే బలవంతంగానైనా పట్టుకుని తీసుకుని రావలసిందని నవుకర్లకు గట్టి వుత్తరువు చేసినాను.

లీలా—బలవంతంగానా? బలవంతంగా లాక్కువస్తే తరువాత జరగబోయేసంగతి ఆలోచించుకోండి.

గాన—నేను ఆలోచించుకొ'ను. నేను యేదయినా వకకార్యం చెయ్యవలెనని వుద్దేశించుకుంటే అది చెయ్యడమేకాని తరువాత దాని వల్ల యేమిజరుగుతుందో యెప్పుడూ ఆలోచించుగోను. అవతలవెయ్యి వచ్చినా పోయినా నేను తలపెట్టినకార్యం ముందుగా జరిగి తీరవలెను. నామాటకు తిరుగులేదు. యిూపాడుజ్వరంమూలంగా గాని లేకపోతే యీవుదయాన్న ధవిళేశ్వరం నేను స్వయంగానే వెళ్ళివుందును. ఆయ వను చూచినదాకా నాకు యేమీ తోచకుండా వున్నది. (ఆలకించి) ఈమాటు పొరబాటులేదు. (సంతోషముతో) బండిచప్పుడు వినపడుతూ వున్నది. ఆయన వస్తూ వున్నాడు. వస్తూవున్నాడు.

[అప్పుడు తొందరగా గోవిందుడు ప్రవేశించుచున్నాడు]

గాన—గోవిందా! గోవిందా! యేమి? మీ రాయనను తీసుకుని వచ్చినారా?

గోవిం—తీసుకుని వచ్చినాము. అతడైతే తప్పించుకుని పారి పోవడానికి చాలాప్రయత్నం చేసినాడు కాని మేము పోనియ్యకుండా ముగ్గురమూ మీదపడి కాళ్ళూ చేతులూకట్టి బండిలో పడవేసినాము.

గాన—మంచిపని చేసినారు. మీ రాయన యెక్కడదొరికి నాడు? పడవలు దిగేచోటనా? సత్రంవువద్దనా?

గోవిం—ఆరెండుచోట్లనూ కాదు. కాలవ వడ్డున కల్లుమకా ణంకాడ పట్టుకున్నాము. అత డక్కడ నిలుచుండి పిఠాపురం వెళ్లడా నికి చామర్లకోట పడవమీద కేవు యెంత పుచ్చుకుంటారని అడుగుతూ వున్నాడు. (నవ్వుచు) అతడు నిజంగా యేదో తక్కువ కులంవాడు గా కనపడుతూ వున్నాడు గాని వేషంవల్ల గొప్పవాడుగా యెంత మాత్రమూ కనపడడంలేదు. ఆయనదగ్గ బట్టలుమూటా గొడుగూ తప్ప మరియేమీ వస్తువులు లేవు.

గాన—సరి సరి నాకు తెలిసింది. అతడు పెద్దవేషంతో వెళితే దోవపాడుగునా పాడడానికి యెనరయినా పట్టుకుని పోతాడని మారు వేషం వేసినాడు. ఆయనను మీరు యెలాగు ఆనమూలుపట్టినారు?

గోవిం—నేను తిన్నగా దగ్గిరకువెళ్ళి చెయ్యిపట్టుకొని మీపేరు "విస్సప్పశాస్త్రుల్లు" కాదా అని అడిగినాను. అడిగేటప్పటికి అతడు తెల్లపోయి నాకేసి గుడ్లగూబలాగు తేరిపారచూచి "నాపేరు నీకు యెట్లా తెలిసింది?" అని ఆశ్చర్యపడి నిలుచున్నాడు. "అదంతా మీకెందుకు? మీరు వక్కపాట పాడుతారా? మీకు సంగీతం బాగా వచ్చు నని విన్నాను" అని నేను బదులు చెప్పినాను. "నన్ను కదలకుండా వుత్త రాది పిశాచంలాగు పట్టుకున్నావు నాచెయ్యి వదులు. నేను కొంచెం పదాలు పాడగలనుగాని నేను యిప్పుడేభోంచేసి సిఖాపురం వెళ్ళవలెను. తిండిలేకుండా పాటలు పాడుతూ కూర్చోవడానికి నాకు తీరదు" అని చెయ్యి వదుల్చుకొని పోబోయినాడు.

గాన—(నవ్వుచు) నీవు మహాబాగాకనుక్కున్నావు. బుద్ధంటే యిలాగు వుండవలెను.

గోవిం—నాకు నిజం తెలిసిపోయింది. మీరు చెప్పినసంగీత పాటకుడు యితడేనని నాకు తెలియడంతోటే, ఆయనకు మీనమస్కారాలుచెప్పి తిన్నగావచ్చి బండిలో కూర్చోమని మంచిమాటలతో చెప్పినాను. ఆయన నామాటలు లక్ష్యంచెయ్యక బండిలోకి రాకుండా తప్పించుకుని పోవడానికి చూడడమే కాకుండా కేకలువేసి నలుగురినీ పోగుచేసి తగవుపెట్టడానికికూడా ప్రయత్నంచేసినాడు. అయితే నేనా సంగతి కనిపెట్టి మీబండివాడికిన్నీ బంటోతుకుర్రు సంజ్ఞ చేసేటప్పటికి, వామనుడుర్రు మాధవప్రభుర్రు పిడుగుల్లాగు మీదపడి అతని నోటి వెంబడ్డి మాటరచ్చోగా కాళ్ళాచేతులూ విరిచికట్టి అతణ్ణి

బండిలో పడవేసి మళ్ళీ అక్కడ నిలవకుండా బండి వక్కపరుగున తోలుకుని వచ్చినారు.

గాన—బహుబాగా చేసినారా, నవుకర్లంటే ఘీవంటివాళ్ళు భుండవలెను.

[ఆపతలనుండి పిలుపులు వినబడుచున్నవి]

గోవిం—అరుగో మనవాళ్ళతణ్ణి లాకువచ్చినారు.

విస్సప్పపాత్రుడు—(వెలుపలనుండి) ఓపశువుల్లారా! నన్ను వదిలి పెట్టగడి. వదిలి పెట్టండి.

లీలా—(తనలో) నేను పరుగెత్తుకుని వెళ్ళి బావతో చెప్పి వస్తాను. (అని వెళ్ళుచున్నది)

[మాధవుడును వామనుడను ముందుకు తోయ్యగా వారితో పెనగు లాడుచు, చంకను మూటయు చేతిలో గొడుగును పట్టుకుని విస్సప్ప పాత్రుడు ప్రవేశించుచున్నాడు]

విస్స—(భయముతో వడకుచు) నన్ను వెళ్ళనియ్యండి నన్ను వెళ్ళనియ్యండి. నేను యేమీ చెయ్యను.

గాన—ఆయన వస్తాడు. మీరు వదలిపెట్టండి.

విస్స—(ముందుకు నడచుచు) నేను నిస్సందేహముగా దొంగల చేతులలో పడ్డాను. ఈ ప్రాంతములలో మహాచెడ్డదొంగలు వున్నారని నేను విన్నసంగతి ప్రత్యక్షంగా నాకే అనుభవం అయింది. వీళ్లు నావస్తువులు దోచుకుని నన్ను యిక్కడ చంపివేస్తారు.

గాన—(సేవకులతో) ఈయన తప్పించుకొని పారిపోకుండా యీ తలుపులూ కిటికీలూ అన్నీ వేసిరండి. (అని సేవకుల యొద్దకు వెళ్లుచున్నాడు)

విస్స—అయ్యో! నేను సాలిగూట్లోపడ్డ యీగలా గైనాను.

ళిఖి వీళ్ళతో పోట్లాడితే కార్యం లేదు. ఈకూ్రుడు దొంగలగురువు కాబోలును. ఈముసలివాడిమొఖం చూస్తేనే నాకు భయంవేసి ప్రా ణాలు పోతూవున్నవి.

గాన—ఓరీ! ళిఖి మీరు వెళ్ళిపొండి. (సేవకులు పోవుచు న్నారు)

విస్న—(తనలో) నన్ను చంపెన తరువాత పాతిపెట్టడానికి దొడ్డో యెక్కడనో గొయ్యి తవ్వడానికి వాళ్ళను పంపివేసినాడు. సం దే హం లేదు. నేను యెన్నాళ్ళో కష్టపడిసంపాదించుకొని మొలనువుంటే పోతుందని చంకమూటలో పెట్టుకొన్న యీభయి రూపాయల వెండి మొలతాడూ నేడు పోతుంది.

గాన—(వినయముతో దగ్గరకు వచ్చి) స్వామీ! స్వాగతము. విశ్వపతిశాస్త్రిగారికి స్వాగతము.

విస్న—దూరంగా వెళ్ళండి. మీసంస్కృతం నాకు తెలియదు. నన్ను ముట్టుకోకండి. (తనలో) ఈకిరాతుడు నవ్వుతూవున్నాడు. వీడి విషపునవ్వు చూడడంతోటే నాపళ్ళు గపుపొడిచి మనస్సు నీరవుతూ వున్నది.

గాన—(పాదము మొదలుకొని శిరస్సు వఱకును జూచి చిఱు నవ్వు నవ్వుచు) ఏదీ? "మోసపోవద్దురా" (అని పాడుచున్నాడు)

విస్న—(వులికిపడి) నాజోలికి రాకు. (తనలో) ఈ కిరాతుడు పీట్ట తనవలలో పడ్డవని సంతోషంగా పాడుతూ వున్నాడు. (వికార ముగా) హోడైవమా! ఏమి చేతును?

గాన—(దగ్గరకు జరుగుచు) ఒక్కసారి—

విస్న—వద్దువద్దు (అని వెనుకకు తొలగుచున్నాడు)

గాన—ఈలా తప్పించుకుంటే తప్పదు. (అని గొడుగు చేతిలో

నుండి లాగుకొన బల్లమీద పెట్టుచున్నాడు)

విస్న--(తనలో) ఇతడు తనపని ఆరంభించినాడు.

గాన--(చిఱునవ్వునవ్వుచు వినయముతో) మాయింటికి మిమ్మలిని రప్పించిన మాకంమాస్తే మీకు సందేహం లేకుండా అద్భుతం గానే వుండివుంటుంది.

విస్న--(తనలో) యిల్లరికంకంటె దీన్ని మనుష్యుల బోనంటే బాగా వుంటుంది.

గాన--ఇందులో తప్పితమంతా మీదేకాని నాదికాదు. మీరు నా వృత్తాంతానికి జవాబు వ్రాసినారుకారు.

విస్న--యేమి వృత్తరమో నేను యెరుగను. నాకు వృత్తరమే రాలేదు.

గాన--(నవ్వుచు) నేను యెరుగుదును. సాధారణంగా వృత్తరాలకు జవాబు వ్రాయునివారు చెప్పేసబబు యిదే.

విస్న--ఓ దొంగలపెద్దా! నీతో నేను పరిమాణపూర్వకంగా చెపుతాను. నాకు వృత్తరం యేమీ రాలేదు.

గాన--దొంగలపెద్దా? చివరకు నావే దొంగమాటలకింద కట్టి వేసినారా? ఈపరాచికాలు మానివేసి యిఖ మనం పెద్దమనిషి తరహాగా మాట్లాడుదాము.

విస్న--యింతకంటె పెద్దమనిషి తరహాగా మాట్లాడడం నాకు చేతకాదు.

గాన--మీరు యీదారిని వెళ్తుతూవున్నా రన్నసంగతి నాకు తెలియడంతోటే--

విస్న--(మఖము తుడుచుకొనుచు) మీ మగాటలు వింటే నాకు నవ్వు చేతటపడుతూ వున్నది.

గాన—(నవ్వుచు) బాగావున్నది. కానియ్యండి. కానియ్యండి. మీకు సుతి కావలెనా?

విస్న—నాకు సుత్తి అక్కరలేదు. నేను బాడితతో పనిచేసుకుంటాను.

గాన—(తనలో) బాడితఅంటే వీణె అయివుంటుందా? మరి యేదయినా దక్షిణదేశపు తంబూరా అయివుంటుందా? (బిగ్గరగా) దేనితోనో వకదానితో రానియ్యండి. పుచుకి రానియ్యండి. శంకరా భరణం.

విస్న—(అద్భుతపడి తనలో) ఇతడు నాదగ్గర నగవున్న సంగతి కూడా కనిపెట్టినాడు. ఆభరణ మంటూవున్నాడు. ఇతని అభిప్రాయం నా వెండిబిళ్ళలమొలతా డని కాబోలును. (బిగ్గరగా) నావద్ద ఆభరణం లేదు.

గాన—శంకరాభరణము. రాగము.

విస్న—(భయముతో తనలో) ఇతను యెక్కడివాడో. అసాధ్యుడులాగున్నాడు. ఆభరణం చంకలో వున్నసంగతికూడా గ్రహించినాడు! ఆభరణం ఇవ్వకపోతే నన్ను రాగాలు పెట్టేటట్టు చేస్తానంటూవున్నాడు.

గాన—రాగ మూరంభించకుండా యేమిటో ఆలోచిస్తూవున్నావు? యేమిటి? శంకరాభరణము.

విస్న—(భయముచేత వడకుచు) ఇతడు మళ్ళీతనపని కారంభిస్తూవున్నట్టున్నాడు. అయినా కానీ ఇతనిముఖంచూస్తే మంచివాడులాగు కనపడుతూవున్నాడు. ఇతనితో కొంచెం మంచి మాటలాడిచూస్తాను.

గాన—(చంకను తగిలించియున్న మూటమీద చేయివేసి)

మీకిది భారంగా వున్నది. నేను తీసి దాస్తాను.

విస్న—(మూటను గట్టిగా పట్టుకొని) అక్కర లేదు. నాదగ్గిరనే వుంచుకుంటాను.

గాన—అలా కాదు. ఇలా నాచేతి కివ్వవలెను. (అని బలవంతముగా మూటలాగుకొని బల్లమీద పెట్టుచున్నాడు)

విస్న—(తనలో) సందేహం లేదు. ఇది నా బొడ్డుకొంగు రూపాయలుకూడా శీఘ్రంగానే వెళుతవి.

గాన—ఆరంభించండి. (విస్నప్పసాతును) బలవంతముగా తీసికొనిపోయి కుర్చీమీద కూర్చుండబెట్టి) ఎలాగైతేయేమి మీరు ఇక్కడికి వచ్చినందుకు నాకు బహు సంతోషంగా వున్నది. మీకు నారదుడూ తుంబురుడూ గంధర్వులూ అప్సరసలూ యెవరూ చాలరు.

విస్న—(వడకుచు తనలో) ఓస్సీ! వీళ్ళందరూ యెవరు? వీళ్లంతా యీసరదారుకిందవున్న దొంగలు కాబోలును. యింతమందక్కర లేదు. నాప్రాణానికి యిందులో వక్కడు చాలును. అయినా యితణ్ణి మంచిమాటలతో బతిమాలుకుని చూస్తాను. (బిగ్గరగా) అయ్యా! మీకాళ్ళకు మ్రొక్కుతాను. నన్ను విడిచి పెట్టండి.

గాన— (నవ్వుచు) మీరు దొంగవేషం వేసి నావద్దనుంచి తప్పించుకుని పారిపోవడానికి చూస్తూవున్నారు. మీవేషాలు నాదగ్గిర సాగవు. నేను దొంగలకు గురువును. నాపని యెలాగు చెయ్యవలెనో నాకు బాగా తెలుసును.

విస్న—(తనలో) నీపనిలో నీవుగట్టివాడవని నాకు తెలుసును.

గాన—(నవ్వుచు) మాసినబట్టలు కట్టుకుని యీ బికారివేషం వేస్తే నేను మిమ్మలిని కనుక్కోలేకపోతా ననుకున్నారా?

విస్న—అనుకోలేదు. మీది అఖండశక్తి. ప్రియాణం మూలం

గా బట్టలు మాసినవి. (తనలో) వున్న దేమో పుచ్చుకునేవాడికి నా వేషం సంగతి యెందుకు? ఇంకా నావద్ద యేమివున్నవో కనుక్కోవడా నికి మాట్లాడుతూ వున్నట్టున్నాడు.

గాన—యిక మన మీ వృధాకాలక్షేపం మానివేసి మనపని చూచుకుందాము. నేను మిమ్మల్ని యిక్కడకు యెందుకు రప్పించి నానో మీకు తెలియనే తెలుసును.

విస్న—నేను మనస్సులో వూహచేసుకున్నాను.

గాన—అలాగయితే వెంటనే మొదలు పెట్టండి.

విస్న—యేమి మొదలుపెట్టను?

గాన—రూపక తాళము. దరువు.

విస్న—(తనలో) అయ్యో! యితడు నా రూపాయల సంగతి కూడా కనిపెట్టినాడు. ఇతనిమాటలు కొంచెం యాసగా వున్నవి. రూపాయ అనడానికి రూపకమంటూ వున్నాడు. రూపాయలు యివ్వ కపోతే నన్ను వకతాళం వేస్తాడట. వకదరువు వేయిస్తాడట. ఇతనివన్నీ సఖంసఖం మాటలు.

గాన—ఇక జాస్యం చెయ్యకూడదు. నేనుచెప్పినపని తక్షణం చెయ్యవలెను.

విస్న—నేను చెయ్యను.

గాన—నాకు కోసం తెప్పించకండి. మీరు నేను చెప్పినట్లు వెంటనే చెయ్యకపోతే నేను జ్వరంచేత బలహీనుణ్ణిగావున్నా వక్క సారి లోపలికి వెళ్ళివచ్చినానంటే మీచేత నేను బలవంతంగా చేయించ గలను.

విస్న—(తనలో) ఇందాకటి దుర్మార్గుల నందరినీ పిలుచుకుని వస్తాడుకాబోలును.

గాన—ఈ యింటి తలుపులూ కిటికీలూ అన్నీ వేసివున్నవి. మీకు తప్పించుకు పోవడానికి శక్యంకాదు.

విస్న— (దీనత్వముతో) ఓనాయకుడా!

గాన— (కోపముతో) ననున్న నాయకుడా గీయకుడా అని పిలువవద్దు. మీకు ఆలోచించుకోవడానికి రెండు నిముషాలు అవకాశం యిచ్చినాను. యీ రెండు నిముషాలలోనూ బాగా ఆలోచించుకుని నేను చెప్పినట్లు చేసేది చెయ్యనిదీ యేదోవకటి చెప్పండి.

[సంగీతరావు ప్రవేశించి వెనుకనుండి వినుచున్నాడు]

విస్న—నాప్రాణాలమీదికి వచ్చింది. ఓ నాయకుడా! యిటువంటి విషయంలో ఆలోచించుకోవడానికి నాకు రెండు నిముషాల్లా?

గాన—ఇక నాయకుడూ గీయకుడూ వదలి పెట్టండి. మీకు యిప్పుడే తెలియచెపుతూ వున్నాను. నేనుచెప్పినట్లు చేస్తేనేకాని మీరు యీస్థలాన్నుంచి ప్రాణాలతో వెళ్ళరు. (అని కోపముతో వెళ్లుచున్నాడు)

విస్న—ఇతను యింతదుర్మార్గానికి వడికట్టినతరువాత యీరూపాయలమాటకూడా యివ్వక తప్పదు. (అని బొడ్డుకొంగుమూటతడవుచున్నాడు)

సంగీ— (ముందుకువచ్చి వీపు తట్టి) నీవు ఆయన చెప్పినట్లు చెయ్యకూడదు.

విస్న— (భయముతో వెనుకకు తొలగి) అయ్యో! మరివక కొత్తవాడు వచ్చినాడు.

సంగీ— (తనలో) నాపాటనినకుండా నామామగారు ముందుగా యితనిపాట వింటే అంతా చెడిపోతుంది. (బిగ్గరగా) అయ్యా! మీరు యిక్కడకు వచ్చినసంగతి నేను యిప్పుడే విన్నాను. నేను ప్రవే

శించినపనిలో మరియెవరూ ప్రవేశించకూడదు.

విస్న—(ఆశ్చర్యపడి అర్థము తెలియక) ఆలాగా? (తనలో) యితడు మరివికదొంగలగుంపుకు నాయకుడు కాబోలును. వీరిద్దరికిస్నే పడనట్టువున్నది. వీరిద్దరిమధ్యనూ నేను చావవలసి వచ్చింది.

సంగీ—నామాటలకర్థం మీరు బాగా తెలుసుకోండి. మీరు లొందరపడి ఆయన చెప్పినట్లు చేశారంటే మిమ్మల్ని చంపుతాను.

విస్న—ననాన్ని చంపడం? పద్దువద్దు. మీకే యిస్తాను.

సంగీ—(ఆశ్చర్యముతో) యేమి యిస్తారు?

విస్న—యిరవయి రూపాయలూను.

సంగీ—(తనలో) ఇప్పుడు నాకు తెలిసినది. తాను ముందుగా పాడితే నాకు వచ్చేసొమ్మ పోతుం దంటూనుకొని యీరాత్రి తనకు దొరికే యిరవయి రూపాయలూ నాకు యిచ్చివేస్తానంటూవున్నాడు. ఇక మాటలకవకాశంలేదు. (బిగ్గరగా) నాకు రూపాయలతో పనిలేదు. అవి మీయిష్టంవచ్చినవారికి యిచ్చుకోండి. జాగ్రత్త యిప్పుడే తెలియ చెపుతూ వున్నాను. నేను యిప్పుడు చెప్పినట్లు మీరు చెయ్యక పోతే నేను చెప్పినంతపనీ చేసి తీరతానుసుమండీ. (అని దొడ్డిగుమ్మ మున తోటలోకి వెళ్ళుచున్నాడు)

విస్న—(మతిచెడి) నాకు మతిలేదు. ఇదంతా యేమిటో నాకు తెలియడం లేదు. మొట్టమొదట ననన్ను కాళ్ళూ చేతులూ కట్టి బండిలో వేసి యీడ్చుకునివచ్చినారు. అవతల ఆ ముసలివాడు వచ్చి యేమేమో అని పోయినాడు. యిప్పుడీ పడుచువాడు నన్ను చంపుతా నని బెదరిస్తూ వున్నాడు. ఇప్పుడు వాళ్ళకియినా పిచ్చియెత్తివుండవలెను. నాకయినా పిచ్చియెత్తివుండవలెను, అదుగో మళ్ళీ ఆ ముసలిముండాకొడుకు వస్తూవున్నాడు.

[చేతిలో కెద్ద పట్టాకత్తిని పట్టుకొని గానపియుడు ప్రవేశించుచున్నాడు]

గాన — (తనలో) ఈకత్తి చూడడంతోటే యితనికి బుద్ధి వస్తుం దనుకుంటాను. (బిగ్గరగా) నేను చెప్పిన రెండు నిముషాలూ అయిపో యినవి.

విస్న — (కత్తిచూచి తుళ్ళిపడి) ఓయి దేవుడా! యితడు కత్తి కూడా తీసుకుని వచ్చినాడు.

గాన — మీరు ఆలోచించుకున్నారా? సిద్ధంగా వున్నారా?

విస్న — (తడబడుచు) ఆ. ఆ ఆలోచించు కున్నాను. సిద్ధం గా వున్నాను. ఆకత్తి దూరంగా పెట్టి మాట్లాడండి.

గాన — ఆలాగే (అని కత్తి క్రిందపెట్టి) మీకు తుదకు యింత నేపటికి వివేకం వచ్చినందుకు సంతోషంగా వున్నది. (నవ్వు మొగ ముతో) ఇప్పు డంతా సిద్ధంగా వున్నది. మావాళ్ళందరూ కనిపెట్టుకుని వున్నారు.

విస్న — (భయముతో) నాకోసమా! యెందుకు? పాతిపెట్టి పయిని మన్ను వెయ్యడానికా?

గాన — మీమాట లేమిటో నాకు తెలియడం లేదు. మీకు బట్టలు సిద్ధంగా వున్నవి.

విస్న — (తనలో) వీళ్ళు నాకు బట్టలూ పువ్వులూ అలంకరించి యేదో దేవతకు బలి పెడుతారు కాబోలును. (బిగ్గరగా) యేమిబట్టలు?

గాన — మీరు ధరించుకోవడానికి తెల్లబట్టలు. మీరు వస్త్రా లు ధరించుకొనివచ్చి యేదీ ఒక్కసారి సురట.

విస్న — (తనలో) సురంటే కల్లు. నాకు కల్లుకూడా పోస్తారు కాబోలును. నాకు యిష్టం లేదు. (బిగ్గరగా) అది వద్దు.

గాన — అదికాకపోతేమరివకటాయెను "నారాయణగౌళ" —

విస్న—(తనలో) "నారాయణా" అని హరినామస్మరణ చేసు కోమంటూ వున్నాను. ఇక వీళ్ళు నన్ను చంపివేస్తారు.నిశ్చయం.

గాన— "ఏకతాళము" "ఆఠాణా" లేకపోతే "జంపె"; "హుసేని".

విస్న — (తనలో) ఓరి వీడిభాష కాలా! సగం సగం మాటలు చెప్పి నన్ను చంపుతూవున్నాడు! అయినా కానీ నాకు యితని మాటలు అర్థ మవుతూవున్నవి. అవతల యెవరినో కూర్చుండబెట్టి నాకు తెలియదని హింసూస్థానీమాట లంటూవున్నాడు. ఆఠణాఅంటే యెనిమిదణాలు. ఏకతాళం అంటే వక్కతాళం వెయ్యడం. మొట్టమొదటిదానికి నన్ను వక్కదెబ్బకొడితే యెనిమిదణాలు యిస్తాసని తాత్పర్యం. హుసేనా? ఇదియెవరో సాహేబుపేరు. జంపె తెలుస్తూనే వున్నది. సాహేబును పిలిచి నన్ను చంపుమంటూవున్నాడు. (బిగ్గరగా) ఓమహారాజా! నన్ను చంపకు. నీవు చెప్పినట్లు చేస్తాను.

గాన—నీవు మహాచెడ్డవాడవు—ఓ గోవిందా!

[గోవిందుడు ప్రవేశించుచున్నాడు]

గోవిం—అయ్యా! ఏమి సెలవు?

గాన—ఈయనకు యిప్పటికి జ్ఞాపకం వచ్చింది. ఈయన అలసి వచ్చినాడు. ఈయనను లోపలికి తీసికొనిపోయి మంచి బట్టలు కట్టబెట్టి ఫలహారం పెట్టించు.

విస్న—నాకు మూర్ఛ వచ్చేటట్లు వున్నది.

గాన—అస్మీపోతవి. రెండు పూరీలు తిని మిరిమూలచారు తాగండి.

విస్న—మిరిమూలచా రక్కగలేదు. నాకు దాహం వేస్తూ వున్నది. గేదెమజ్జిగ కావలెను.

గాన—వద్దు వద్దు. మజ్జగతాగితే గొంతుక పోతుంది. అది కావలిస్తే తరువాత—

విస్న—ఏ మజ్జిన తరువాత?

గాన—ఒక్కరాగం తీసినతరువాత.

విస్న— (తనలో) ఈమనిషలివాడిది రాతిహృదయం. ఇతడు నన్ను యిప్పుడు వేళాకోళాలు చేస్తూ వున్నాడు.

గాన—(విస్నస్సపాత్రని తోయుచు) ఇక అలస్యం చెయ్యక వేగిరం వెళ్లండి. (అని లాగుచున్నాడు)

విస్న—(తనలో) ఇతని వన్నీ కోతిచేష్టలులాగు వున్నవి. నాకు ఆకలి వేస్తూవున్నది. తరువాత యే మయినా కడుపునిండా భోజనం చేసి వస్తాను. (బిగ్గరగా) తిమ్మన్నగారూ! నమస్కారము. (అని గోవిం దునివెంట పోవుచున్నాడు)

గాన—తిమ్మన్నగారా? ఇదివట్టి మోటమాట. ఇతడు నాతో మోటసరసా లాడుతూ వున్నాడు. అయినాకానీ గొప్పవాళ్ళ దగ్గిర కూడా యేవో లోపాలు వుంటవి. మనం కూడాలు పాటిగా పట్ట రాదు.

[పక్కగదిలో నుండి లీలావతి ప్రవేశించుచున్నది]

లీలా—నాన్నగారూ! యిక్కడ మీరు వక్కరే వున్నారా?

గాన—అమ్మాయీ! రా. ఆయన పాడడానికి వప్పుకున్నాడు. ఆయనపాటవింటే నేడు మనం కృతార్థుల మవుతాము. ఆయన సంగీతం కర్ణరసాయనంగా విందాము. నీవు యిక్కడనుంచి కదలకు. నేను వెళ్ళి బహుమానం నిమిత్తం రూపాయలసంచీ పట్టుకుని వస్తాను. (అని పలుకుచున్నాడు)

లీలా—అలాగయితే యిప్పుడు వక్క నిమిషమయినా వృథా

గా పోగొట్టరాదు (అని దొడ్డిగుమ్మము వద్దకి పోయి మెల్లగా పిలిచి) బావా! యిలా లోపలికి రా. నాన్నగారు వెళ్ళినారు.

[సంగీతరావు ప్రవేశించుచున్నాడు]

సంగీ—ప్రియురాలా! లీలావతీ! యిందాకా నీతో చెప్పిన నా స్నేహితుణ్ణి చూచితివా? ఇతడు సంగీతమునందు నిధి. (అని రమ్మని చేసైగ చేయుచున్నాడు)

[అంతట సుమతి ప్రవేశించుచున్నాడు]

సుమ—అమ్మా! నమస్కారము.

సంగీ—నేను యిప్పుడు మీతండ్రిగారివినోదం నిమిత్తం పాట పాడడంలో నాకు సహాయం చెయ్యడానికి ఇతడు యింతదూరం నాతో కూడా వచ్చినాడు.

లీలా—ఈయనసుగుణసంపత్తి కినాకుబహుసంతోషంగావున్నది.

సుమ—అమ్మా! అది మీ విషయంలో నే ననవలసినమాట.

లీలా—(సంగీతరావుతో) నీవు వెంటనే పాడడానికి సిద్ధంగా వుండవలెను. నీ ప్రతిపక్షి పాటపాడడంనిమిత్తం బట్టలు వేసుకోవడా నికి లోపలికి వెళ్ళినాడు. నాన్నగారు ముందుగా అతనిపాట వింటే—

సంగీ—నా కాభయం లేదు. నేనతనినోరు కట్టిపెట్టినాను. (నడు చుచు) సుమతీ! లీలావతీ! యీగదిలోకి రండి. ప్రియురాలా! నీవీణ నా కియ్యి. (అని ప్రక్కగదిలోనికి వెళ్ళుచున్నాడు)

లీలా—ఇదిగో వచ్చి వీణయిస్తాను. (అని ముగ్గురును గదిలోనికి వెళ్ళుచున్నారు).

[అప్పుడు మంచిబట్టలు వేసికొని చేతులలో పూరీల దొంతరలతో విస్సప్పపాత్రికుడు ప్రవేశించుచున్నాడు]

విస్స—(పూరీలు నములుచు) వీళ్ళవుద్దేశం యేమోకాని నన్ను

గొంతుక దాకా మేసినాను. నన్ను యే దేవతకయినా బలి యిస్తారేమో! పోనీ దేవుడు నోసట వ్రాసిపెడితే యేదీ తప్పదు. మనస్సులో విచారానికి చోటియ్యరాదు. అందుచేత నేను ధైర్యంగా వుంటాను. వీళ్ళు యేమయినా దౌర్జన్యం చెయ్యడాని కారంభిస్తే దొంగలనీ చంపుతూ వున్నారనీ కేకలు వేసిన కార్యంలేదు. వీళ్ళు చాలామంది వున్నారు. యేలాగూ నన్ను వదలిపెట్టరు. ఇఖ నాచావు నిశ్చయం. ఇదే నాఆఖరు భోజనం గనుక కడుపుపట్టేనంత తిని మరీ చస్తాను. (అని పూరీలు వేగిర వేగిరముగా తినుచున్నాడు)

[మంచి బట్టలు కట్టుకొని చేతిలో రూపాయలసంచిని పట్టుకొని గానపియుడు ప్రవేశించుచున్నాడు]

గాన—(విస్నప్పపాత్రని తేరిపాఅజూచి) ఇప్పుడు మీరు మూరువేషంపోయి యెప్పటిరూపంతో కనబడుతూవున్నారు. (పూరీలు నమలుచుండుట చూచి) ఇదేమిటి? మీరు యిప్పుడు యేమిచేస్తూ వున్నారు?

విస్న—(నమలుచు) మీరు తినమన్నారుగనుక బలం చెయ్యడానికి పూరీలు తింటూ వున్నాను.

గాన—అతివిస్తారంగా తింటే గోధుమసిండి అరగదు.

విస్న—నాకు యిత్తరులది యెంతతిన్నా అరుగుతుంది. నేను కాళ్ళు తిని జీర్ణం చేసుకోగలను.

గాన—ఇన్ని తిన్నతర్వాత మీరు గవ్వకు పనికిరారు. మీ కంతం పోతుంది. (అని చేతిలోని పూరీలు లాగుకొనుచున్నాడు)

విస్న—(వడకుచు) అయ్యో! భగవంతుడా! (తనలో) వీళ్ళుయీ పూరీలలో యెవరినో చంపవలెనని విషం పెట్టినారు కాబోలును. పొర బాటున తిని నాచావుకు నేనే మంచు పుచ్చుకున్నాను. (మూర్ఛిల్లుచు

గద్గదస్వరముతో) అయ్యా! వేగిరం వైద్యుణ్ణి పిలిపించండి. ముందు తెప్పించండి.

గాన—మీగొంతుక అప్పుడే పాడయిపోతూవున్నది. స్వరం బాగా రావడం లేదు. అయినాకానీ మీకంఠస్వరం బొంగ్రాగా చెడి పోకముందే పక్క-సారి నన్ను బాగా వినియ్యండి.

విస్న—(చెవిచెంతఁజేర్చి బిగ్గరగా అఱచుచు) ఓ-ఆ-ఊ-కీ-కే-ఇక చాలునా? నీకు తృప్తికలిగిందా?

గాన—ఒకమోస్తరుగా వున్నది. స్వరం కొంచెం బొంగుగా వున్నది. అయినా కానీ ఫర్వాలేదు. ఏదీ? వరాళి, రూపకము.

విస్న—(తనలో) అయ్యో! యితడు మళ్ళీ మొదటికి వచ్చినాడు. వరాలూ రూపాయలూ తెమ్మంటూవున్నాడు. నన్ను వీళ్ళు యేలాగూ చంపకమానరు. నేను రూపాయలు యివ్వాను.

గాన—ఇఖ వ్యర్థకాలక్షేపం పనికిరాదు. ఇదివరకే కాలమంతా వృథాగా పాడయిపోయింది. వేగిరం కానియ్యండి. తక్షణం ఆరంభించకపోతే—(అని బల్లమీద నున్నపట్టాకత్తిని తీయుచున్నాడు)

విస్న—వద్దువద్దువద్దు. అది కిందపడవెయ్యండి. మీరు కోరినట్టుచేస్తాను.

గాన—(సంతోషముతో) నాకు బ్రహ్మానందముగా వున్నది. (రూపాయలమూటను చూపి) ఇదిగో మీబహుమానము. నూరు రూపాయలు.

విస్న—(అద్భుతపడి) నూరు రూపాయలా!

గాన—(వినయముతో) మీగొప్పతనానికి యిది యెంతమాత్రమూ అర్హమయినది కాదని నాకు తెలుసునుగాని నాభక్తినిబట్టి స్వీకరించవలెను.

విస్స—మీమాటలు నాకు బోధపడడంలేదు. మీరు యీ నూరు రూపాయలూ నాకు యెందుకోసం యిస్తారు?

గాన—మీ కంతా తెలుసును. మీరు వూరికే కాలయాపనం చెయ్యకండి. (అని బలవంతముగా తీసికొనిపోయి బల్లమీదనున్న వీణెవద్ద కూచుండబెట్టి వీణెమెట్లమీద నాతని వేళ్ళుమోపి) కానియ్యండి. కానియ్యండీ. (అని తాను పోయి కూర్చీమీదకూర్చున్నాడు)

[అప్పుడు చేరువగదిలోనుండి సంగీతరావు పాడగా దివ్యమయిన పాట వినబడుచున్నది]

పున్నాగవ రావళి రాగము—ఆట చాపు తాళము.

పల్లవి

మోసపోవద్దురా—వేశ్యల—మోహము వట్టిదిరా.

అను పల్లవి

కాసు పో మూలమిదేరా—చెలికాడ! యింతట నైన మేలు రోరా.

చరణములు.

1. దానితల్లి చెడ్డతొత్తు—దానన్న తమ్ము డింకొత్తు—
దానిసోదరి పలువవిత్తు—భయలేకతీసె హంసలనత్తు—
మోస॥

2. ఉప్పుచట్టి నమ్మించు—చెవులనున్నది కుసువపెట్టించు—
అప్పులపాలు చేయించు—అదియైతే తెమ్మని చాలకోపించు—మోస॥

3. ఇంటిపనులన్నీ చేయించు—నో—రెత్తితే కూయువద్దని మూయించు—
గొంటుకాడై చరియించు—వేణుగోపాల నినుగూడిరతుల

మెప్పించు—మోస॥

విస్న—(అద్భుతపడి) తనలో ఇతడు నన్ను పాడుమంటాడు. నాకు పాట చేతకాదు. అయినాకానీ ఇతడు యేమి చేసిపోతాడోనని టింగుటింగు వీణెవిూటుతూ పాడుతూ వున్నట్లు నటిస్తూ వున్నాను. ఇప్పుడు యెక్కడనుంచో తమాషాగా సంగీతం వినపడుతూ వున్నది. ఇది ఇంద్రజాలంలాగు వున్నది.

గాన—(కన్నులు మూసికొని తాళము వేయుచు తలయూచుచు) వహ్వా వహ్వా! భళీ భళీ! మేలు మేలు! శాబాసు శాబాసు! పాట ఇలావుండవలెను. ఈపాటకు మోళ్ళు చిగిరిస్తూవున్నవి.

విస్న—(యథాప్రకారముగా వేళ్ళు కదల్చుచు నోరు మెదల్చుచు తనలో) నేను ఇక్కడ యేదో దయ్యాలఇంట్లో వున్నాను. అయినాకాని ఇతడు నాకేమీ హానిచెయ్యకుండా వుండడానికి వీణ వాయిస్తూ పాడుతూవున్నట్లు నటిస్తాను.

గాన—నేడు దివ్యమైన పాట వినాను. ఇంతకాలానికి నేడు నాజన్మం సార్థక మయింది. కంఠం కేవలమూ కిన్నెర స్వరము.

[అప్పుడు నుమతి మరియొక పదము పాడుచున్నాడు]

శంకరాభరణము—ఆది తాళము.

పల్లవి.

ఏమి నేరమో—నన్ను బోనివ—నెంతభారమో—

నావలన నీ కెంతభారమో.

అను పల్లవి.

సామజవరదుడని మునుపే—సతీకిచ్చిన లేదా నాపై..

చరణము.

దీనబాంధుడని దేవదేవుడని—

మానఘనుడని ధర్మాత్మ్రడనుచు—
జ్ఞానధనులు గుణగానము చేయ బి—
రాన జూడవు త్యాగరాజార్చిత నాపై. ఏమి.

విస్న—(యథాపి)కారముగా వీణె మీటుచు పాడునట్లు నటించుచు తనలో) ఇప్పుడు గొంతుక మారిపోయింది. ఇది వేరేస్వరం. ఆపాడేది పిశాచం కాకపోతే యిన్ని గొంతుక లుండవు. (అని వికార చేష్టలు చూపుచున్నాడు)

గాన—(సంతోషపరవశుడయి) ఇప్పుడు మహాహ్లాదస్వరము మీద పాడుతూ వున్నాడు. స్వరంలో యిందాకటికంటె కొంచెం సారస్యం తక్కువగా వున్నట్టున్నది. లేదు. బాగానే వున్నది.

[అప్పుడు సంగీతరావుకు నుమతియు కలిసి పాడుచున్నారు]

గంభీరకళ్యాణిరాగము—రూపకతాళము

పల్లవి.

రాదా నామీద దయలేదా—మొరలిడగ విన.

అనుపల్లవి.

వాదా నీదాసుడ శ్రీనగద వేంకటేశ్వర విన.

చరణములు.

౧. పరమపురుష వినుము పతితపావన దీనజనావన—
కరి మొరాలకించిన శ్రీహరిహరియని మొరలిడవిన. రా.

౨ సతతము చాలామదిని సిజమ్ముగనమ్మిన యలదో—
పదిమానము గాచిన శ్రీపతి గతి నీ వనగా విన. రా.

3. తిరముగ వరములొసంగే వరపుడ వీవయనుచు శ్రీ—
హరి వరద వేంకటాద్రివిహార రారాయన విన. రాదా.

గాన—(ఆలకించి) ఏమి యీవింత? ఒక్కకంఠములోనుంచే

రెండు స్వరములు వినపడుతూవున్నవి? ఇటువంటి విచిత్రం నేను యిది వఱకు యెక్కడా చూడలేదు. (అని లేచి వెళ్ళి విస్సప్పపాత్రని కౌగిలించుకొని) ఓగాయకశిఖామణీ! నారదతుంబురాదులు నీకాలిగోరునుపోలరు. ఇదికూడా పుచ్చుకో. (అని తనవ్రేలివజ్రపుటుంగరమును దీసి యాతనివ్రేలికిఁ దొడుగుచున్నాఁడు)

విస్స—వద్దు. అది నావేలికి పట్టదు. వద్దు. బిగువు.

గాన—అది వజ్రంవేసిన వుంగరం. చాలాఖరీదు చేస్తుంది.

విస్స—ఆలాగా? మరిచిపోయినాను. ఆలాగయితే యీవుంగరం నావేలికి వద్దులు. సరిగా సరిపోతుంది.

గాన—(ఉత్సాహముతో) నాపేరు గానప్రియుడు. నేను లక్ష రూపాయల కధికారిని. నాకు వక చక్కని కూతురు వున్నది. మీరు యిక్కడ వుండి యీవార్థకదశలో నిత్యమూ మీసంగీతంతో నాచెవులకు విందుచేస్తూ వుండడానికి వప్పుకొన్నట్టయితే నాకూతురుని మీకిచ్చి వివాహం చేస్తాను.

విస్స—నాకు—మహారాజుగారుకూడా తనకూతురిని యిస్తారు.

గాన—వేళాకోళంకాదు. నేను నిజంగానే చెపుతూ వున్నాను. మీకు ధర్మపత్ని కావడమంటే నాకొమార్తెకుకూడా వరమసంతోషంగానే వుంటుంది.

[అప్పుడు లీలావతి ప్రవేశించుచున్నది]

లీలా—(తనలో) మానాన్నగారు యిప్పుడే యిటీ అంటూ వున్నారు? విశ్వపతిశాస్త్రికి సన్నిచ్చి వివాహం చెయ్యడమా?

గాన—అదుగో నాకూతురు. నాఆజ్ఞ చెల్లించడానికి సరిగ్గా సమయానికి వచ్చింది.

విస్స—ఓయీశ్వరుడా! యింతచక్కనిదాన్ని నేను యెక్కడా

చూడ లేదు!

గాన—ఒక్క సౌందర్యమూత్రిమే కాదు. దీనికి నమ్రతా, సుగుణసంపత్తి, విద్యా సమస్తమూ వున్నవి.

లీలా—నాన్నగారూ! నాప్రార్థన వినండి.

గాన—మాట్లాడబోకు. ఇటువంటి గాయకచక్రవర్తికి ధర్మపత్నివి కాగలిగిన నీభాగ్యానికి సంతోషించు

లీలా—మిమ్మలిని బతిమాలుకుంటాను. వక్కమాట వినండి.

గాన—వక్కమాట వినను! అరమాట వినను. నేను యేదైనా మాట అంటే ఆమాట తక్షణా జరిగి తీరనలెను.

విస్న—నన్ను యీమెతో వక్కమాటు మాట్లాడనియ్యండి. (రహస్యముగా గానవిద్యునితో) మీరు భయపడకండి. నేను వక్క రాగంతీసి యీచిన్నదాన్ని నావలలో పడవేస్తాను.

గాన—అలాచెయ్యండి. (తనలో) ఇతని పాటఅంటే మృగాలూ పక్షులూకూడా సంతోషిస్తవి. మనుష్యుల మనస్సులు కరగడాని కాశ్చర్యం యేమి వుంటుంది?

విస్న—అమ్మా! నేను మహాపాటకుణ్ణని మీతండ్రిగారు చేసే స్తోత్రాలకు నేను తగను. అయినాకానీ నాపాట వక్కసారి వినండి. (అని వికారముగా తలత్రిప్పుచు చేతు లాడించుచు పాడుచున్నాడు)

ఆరభిరాగము—చాపుతాళము.

అగ్నితీరునాళ్ళంట-అర్జుని కతలరట-
జోరా యెంతసోడ్డైనే-బారతకతే-
జోరా యెన్నియింతలే.

అనుపల్లవి.

సుగ్రీవజయము దీనిసుట్టూ బలాదూరు-

అగ్గురోరపు అయ్యోర్నడుగే సీసాచ్చిగ.

గాన—(చెవియొగ్గి విని) అబ్బే! ఈపాట యేడిసినట్టేవున్నది. గాడిద కూతలాగుఉన్నది. అయినాకానీ యింకొక్కనిముషంవిండాము.

విస్న—(మటింత బిగ్గరగా) చరణములు.

౧ ఇగినేశుపైనెక్కి—యి బీసనూడొచ్చి
బగుపెగ్గెలెన్నినో—పలికి దుశ్శాసనుని—
మొగముసూడగానే—మోర్చెపోయెనట్టె—
గుగురుమిగురనకుండ—గుడ్లగుక్కినే—అగ్గి.

గాన—(తనలో) ఇది సుతిమించి రాగాన్ని పడుతూ వున్నది. ఇళు మాన్పింతాము. (బిగ్గరగా) యేమి టీపాట? యీవెట్టిపాట!

విస్న—వూరుకోండి. మాటాడకండి. మద్దె రసబంగం చెయ్య కండి. చాలా చరణాలు వున్నవి. (అని మరింత యుత్సాహముతో పాడుచున్నాడు)

చరణము.

౨ ఇరన్నేశుసడ్డకు—డిందర్జిత్తోకరెయ్యి
దురియోదనుని చెవిలో—దూరి ముక్కినెనెల్లె.
అరసి పిసాసాలే—అశ్వద్దామను మింగె—
సురియోదమాయెనే—సూడయేదుకాయె—అగ్గి.

గాన—(చెవులలో వ్రేళ్ళు చెరువుకొని బిగ్గరగా) వూరుకో చాలించు. యీపాటి చాలించు. చెవులు గింగు రెత్తుతూ వున్నవి. వూరుకోవేమి? (అని చేయిపట్టుకొని తోసివేసి) నేను యేదో పొర పాటు చేసినాను. నీపేరు యెవరు?

విస్న—నాపేరు విస్నప్పపాత్రుడు. నేను వడ్డదేశపు వడ్రంగిని. కిరువుకు బరంపురాన్నుంచి లేచివచ్చి యేలూరులో వడ్రంపుపని చేసు

కుంటూ వున్నాను. పిఠాపురం తీర్థానికి మాపనివాళ్ళచేత ముందుగా అమ్మకానికి పెట్టెలు పంపివేసి నేను వెనుక వెళుతూవున్నాను.

గాన—నేను వట్టి బుద్ధిహీనుణ్ణయిపోయినాను. నీ వాగొప్ప సంగీతపాటకుడైన విశ్వపతిశాస్త్రినని భ్రమపడ్డాను. ఇందాకా మంచి పాట వినపడ్డదే. ఆపాడింది నీవు కావా?

లీలా—నాన్నగారూ! ఇతడు కాదు. ఆపాడింది మీ మేనల్లుడు సంగీతరావున్ను ఆతని స్నేహితుడు సుమతిన్నీ.

[సంగీతరావును సుమతియు ప్రవేశించుచున్నారు]

సంగీ—మామగారూ! యిందాకా పాడింది నేను. సంగీతం బాగా పాడడం నేర్చుకుంటేనేకాని మీరు కూతురిని యివ్వనన్నారని నేను తంజావూరు వెళ్ళి రాత్రి పగలూ కష్టపడి నేర్చుకొని మీదయకు పాత్రుణ్ణి కావడంనిమిత్తం మీరు యిప్పుడు విన్న మోస్తరు పాట పాడడానికి తగినపాండిత్యం సంపాదించుకొన్నాను.

సుమ—ఇతడు బహుర క్తిగా పాడుతాడు.

గాన—అబ్బాయీ! నీపాటకు నేను మెచ్చినాను. ఇఖ లీలా బతి నీ సొమ్మయింది. నీకిచ్చి పెళ్ళిచెయ్యడానికి నాకేమీ ఆక్షేపణ లేదు.

విస్న—నన్నువక్క-సంగతి చెప్పనియ్యండి.

గాన—మాకు నీసంగతులూ వద్దు యేమీవద్దు. నీవు యెంత శీఘ్రంగా మమ్మల్ని వదలిపెట్టి వెళితే మే మంత సంతోషిస్తాము.—. ఓరీ! గోవిందా! మాధవా! వామనా! దారిమాపి యితణ్ణి మీరు పోగిరం వీధిలోకి పంపివెయ్యండి.

[ముగ్గురు సేవకులు ప్రవేశించుచున్నారు]

విస్న—(సేవకునితో) మీరు నన్ను ముట్టుకోవద్దు. వీరితో నేను కొన్ని సంగతులు మనవి చేసుకోవలెను.—అయ్యాలారా!

వినండి. వీళ్లు నన్ను బలవంతంగా లాక్కువచ్చి నాపైయూణంచెడగొట్టి నాబట్టలన్నీ చింపివేసినారు. కాబట్టి యీబట్టలుమాత్రం నాకియ్యండి. నాకు యిచ్చిన పెళ్ళాన్ని పెళ్ళి వుంగరాన్ని కూడా కావలిస్తే పుచ్చుకోండి. నాకక్కరలేదు. (అని యుంగర మియ్యబోవుచున్నాడు)

గాన--అక్కరలేదు. ఆవుంగరం నీవు వుంచుకో. పొరపాటు చేత నేను నీకు చాలా తొందర కలుగజేసినాను దానికి ప్రతిఫలంగా నే నీవుంగరం నీకు బహుమానం చేసినాను. నీమూటా నీగొడుగూ కూడా తీసుకుని వెళ్ళిపో.

విస్న--వెళ్ళిపోతూ వున్నాను. వుంగరం దొరికినందుకు సంతోషంగానే వున్నది; కాని నాపాటమాత్రం కడతేరా వినకుండా పంపివేస్తూవున్నందుకు విచారంగా వున్నది. అయినా కానీ యీసారి యెప్పుడయినా యీదారిని వెళ్ళేటప్పుడు యిక్కడకువచ్చి కీర్తనలంతా వినిపించి మరీవెళుతాను లెండి. నేను వచ్చినప్పుడల్లా నేను చేసిన పెట్టలుమాత్రం రెండూ మూడూ కొంటూవుండండి. వెళ్ళినస్తాను దయవుంచండి. (అని వెళ్ళుచున్నాడు)

గాన--మన మందరమూకూడా లోపలికి వెళుదాము రండి. ఇవాళ ఇనంతా చిన్ననాటకంలాగు జరిగింది.

(అందఱును నిష్క్రమించుచున్నారు)

కలహప్రియాప్రహసనము

ఇందు వచ్చుపాత్రములు.

వీరభద్రుడు—ఒక వడ్రంగి పటాలములో నాయకుడు.

భీమయ్య—ఒక వడ్రంగి కనకాంగిపెంపుడుతండ్రి.

విశ్వకర్మ—ఒక వడ్రంగినరుడు

గోపాలుడు—ఒకగొల్లవాడు.

కనకాంగి—భీమయ్య పెంపుడుకూతురు.

సుబ్బమ్మ—ఒకచాకలిది. గూడెపునాయకురాలు.

వెంకమ్మ—ఒకచాకలిది.

బుచ్చమ్మ—ఒకచాకలిది.

శేషమ్మ—ఒకచాకలిది.

రంగము—రాజమహేంద్రవరములో గోదావరియొడ్డున చాకలిగూడెపు సమీపమున భీమయ్యయింటిముంగిలి.

[అప్పుడు బుచ్చమ్మ, శేషమ్మ, వెంకమ్మ బట్టలమూటలు పట్టుకొని ప్రవేశించుచున్నారు]

బుచ్చ—మనం తెల్లవారగట్ల లేచి యింటింటికీ తిరిగి బట్టలన్నీ పోగుచేసినాము. అలసట పోయిందాకా కొంచెంసేపు లోకాభిరామాయణం చెప్పుకుని మళ్ళీ పనిలోకి వెళుదాము. ఏదీ మన సుబ్బమ్మ యింకా రాలే దేమి? ఆవిడ లేకపోవడంచేత మనసభ అంతా చిన్న

వెంక—ఆవిడ యేదో పనిచేత రాలేదుగాని లేకపోతే మన కంటె ముందుగానే యిక్కడికి వచ్చివుండేది. ఆవిడచేతులు వూరికే వున్నా నోరు యెప్పుడూ వూరికే వుండదు ఆవిడ వచ్చేటప్పుడు యేమో కబుర్లు మూటకట్టుకుని వస్తుంది.

శేష—ఆవిడ ప్రతిదినమూ తెల్లవారి లేచేటప్పటికి యిన్ని కొత్తకబుర్లు యెక్కడనుంచి పోగుచేసుకువస్తుంది?

వేంక—మనం యీబట్టలు పోగుచేసుకుని వచ్చినట్లే వెళ్ళిన యింటికాడ నెల్లా నాలుగేసి కబుర్లు పోగుచేసుకుని వస్తుంది. ఆవిడ దగ్గిర ఆశుకవనంకూడా వున్నది యెక్కడా కబుర్లు దొరకకపోతే ఆవేళకు కొత్తవి నా నాలుగు కల్పించి మన కందరికి ఖులాసాగా పొద్దుజరిగేటట్టు చేస్తుంది. ఆవిడ తెచ్చే కబుర్లన్నీ ఫదిభాగాలు చేసి, అందులోవకభాగంలోఫదోవంతుమాటలుమాత్రమే నేను నమ్ముతాను.

బుచ్చ—నిజంగా యీవూళ్ళో అందరి వ్యవహారాలూ ఆవిడకు తెలుసును.

వెంక—ఆవిడ అందరి వ్యవహారాలలోనూ యిలాకా కలుగ చేసుకుంటుంది. ఆవిడ మాటలు చూస్తే నాకూకే నవ్వునస్తుంది. ఆవిడ నావ్యవహారంలో ప్రవేశించకుండా వున్నంతవరకు యెవరివ్యవహారంలో ప్రవేశించినా నాకు యిబ్బందిలేదు.

[అప్పుడు సుబ్బమ్మమాట వినబడుచున్నది]

బుచ్చ—ఓసీ! వూరుకో. ఆవిడ వస్తూవున్నది.

శేష—మనం ఆవిడెసంగతి మాట్లాడుకొంటూ వున్నట్లు ఆవిడకు తెలియకూడదు.

[అప్పుడు చంకకిందబట్టలమూట పెట్టుకుని సుబ్బమ్మ ప్రవేశించుచున్నది]

సుబ్బ—అమ్మగారా! యెన్నడూలేనిది నేను యివేళ మీ

అందరికంటెనూ ఆలస్యంగా రావలసివచ్చింది. అయితే యేమిలెండి. కబుర్లులేకుండా యిదివరదాకా వృథా అయినకాలమంతా వకటి నిమిషంలో కూడతీస్తాను. యివేళ మీలో యెవరయినా కనకాంగిని చూచినారా? యివేళ ఆవిడకు పెళ్ళిసుమా.

బుచ్చ—యెక్కువ సొగసుగా కనపడడానికి యివేళ ఆవిడ దువ్వుకోవడంలోనూ తొడుక్కోవడంలోనూ వున్నది. ఆవిడెవర్నినం మన కెక్కడ అవుతుంది?

సుబ్బ—యీపెళ్ళి సాగ్గాపడదు. నేను ముందుగానే చెపుతూ వున్నానను వినండి. పెళ్ళి అయినా దంపతులు సుఖపడరు. ఆపెళ్ళికొడుకు విశ్వకర్మ వట్టి గర్వాపోతు. అంతేకాకుండా అతను పెళ్ళికోసం గొప్ప వేషం వేసినాడు.

వెంక—ఆలాగా?

సుబ్బ—అతను గోదావరిగట్టు కారుఖానాలో పనిలో వుండి యిప్పుడు వీళ్ళతో ఆకారుఖానా అంతా తనదేవనిచెప్పినాడు. జంగం పేరయ్య కనకాంగిపెళ్ళికోసం పట్టుబట్టలూ పట్టుచీరే తీసుకుని వెళుతూ వుండగా చూచినాను. ఆపట్టుచీరెకు చుట్టూ జరీకుచ్చు వేసి కుట్టినాడు. వడ్రంపని చేసుకునేవాడికూతురు కేమిటి? పట్టుచీరె యేమిటి? ఇలాగు తలకుమించిన వ్యయంచేసి సంసారం పాడుచేసుకోవడంచూస్తే భీమయ్య వట్టిబుద్ధిహీనుడుగా కనపడుతూ వున్నాడు. ఇంతాచేస్తే యిది వాడి కూతురవునోకాదో!

బుచ్చ—యేమిటా! కనకాంగి అతనికూతురుకాదా?

సుబ్బ—మీరు న న్నాపశ్నల అడగకండి. ఇది అతనికూతురు అయితే అవనే అవుతుంది. కాకపోతే కానేకాదు.

బుచ్చ—ఇందులో యేదో రహస్యంవున్నది. చెప్పు చెప్పు.

సుబ్బ—నేను లక్ష్మివరహాలుయిచ్చినాచెప్పను. పాపం! ఆచీన్న దానినింద అపవాదలు వెయ్యడం నాకు యెంతమాత్రిమూ యిష్టం లేదు.

వెంక—నీవు మాకు చెప్పకపోతే చెప్పకపోయినావుకాని కన కాంగిగుట్టు యేదో నీకు తెలిసింది. అంతమట్టుకు నిశ్చయం.

శేష—సుబ్బమ్మా! నావక్కదానితోనూ చెప్పు. నేను యెవరి తోనూ చెప్పను.

సుబ్బ—నేను యెవరితోనూచెప్పను. దానిసంగతి మాఅమ్మ నిన్నసాయంకాలం నాకు యెంతోరహస్యంగా చెప్పింది. నేను యీసం గతి నావదినెగార్లముగ్గురితోనూ మాత్రం చెప్పినాను. అటుతరువాత నాప్రాణస్నేహితులయినవారితో అయిదుగురితోనో ఆరుగురితోనో యేకాంతంగా చెప్పినాను. వీరితోతప్ప యింతవరకు నేను యీసంగతి వక్కపిట్టతో చెప్పలేదు. అజాగ్రతగా వున్నప్పుడు యిప్పుడు మాటల పరాకున మీదగ్గిర కొంచెం నోరుజారి పయికి వచ్చింది.

వెంక—నేను యీసంగతి యెంతరహస్యంగా వుంచుతానో నీకే తెలుసును.

బుచ్చ—నాచెవులలో పడ్డమాట పయికిరాదని నీకే తెలుసును.

శేష—నా నోట్లోమాట నానోట్లోనే వుంటుందిగాని వెలు పలకు రాదనిమాత్రం నీకు తెలియదా?

సుబ్బ—అలాగయితే మీమాటనమ్మకంమీద మీతోకూడా చెపుతాను. ఈభీమయ్యకు పూర్వం వక పెళ్ళామూ కూతురూకూడా వుండేవారు. అత్త వారియింటికివెళ్ళినప్పుడు అక్కడ మరిడీజాడ్యాలచేత యిద్దరూకూడా చచ్చిపోయినారు. అటుతరువాత యితను కొన్నియేళ్ళ దాకా యీవూరికిరాక అక్కడనేవుండి కొంతకాలానికి యీపిల్లను

తీసుకొని మళ్ళీవచ్చి యిాయింట్లో పరివేశించినాడు. అందరూ యిా చిన్నది యితనికిూతురనుకుంటూ వున్నారు.

వెంక—ఇది నీకు నిశ్చయంగా తెలుసునా?

సుబ్బ—అప్పుడు మాఅమ్మ వీళ్ళయింట్లో బట్టలు వుతుకుతూ వుండేది. వీళ్ళసంసారస్థితి అంతా దానికి బాగా తెలుసును.

వెంక—అయితే కనకాంగి యెవరయి వుంటుంది?

సుబ్బ—ఎవరికి తెలుసును? అయితే వకవేళ అతని కూతురే అయి వుండవచ్చును. దానికేమిగాని విశ్వకర్మ యెంత దుర్మార్గుడో చూచినావా?

బుచ్చ—యెందుచేత?

సుబ్బ—వెనుక యితను ఆకారుఖానాలో వకవడ్రంగి కూతురుని పెళ్ళిచేసుకుంటానని ఖరారు చేసినాడు. యిప్పుడు యీవివాహం సంగతి తెలియడంతోటే పాపం ఆచిన్నది చిక్కి సగ మయిపోయింది. మొగవాళ్ళు మోసం చేస్తారు. పెళ్ళివిషయంలో మనం మొగవాళ్లను యెప్పుడూ నమ్మకూడదు. జాగర్త మీలో యెవరూ నమ్మి మోసపోకండి. (అప్పు డొకసుబ్బమ్మతప్ప తక్కినవారందరును బట్టలపాకలోనికి వెళ్ళుచున్నారు)

[పెళ్ళిచీర కట్టుకొని యింటిలోనుండి కనకాంగి వచ్చుచున్నది]

సుబ్బ—(ముందుకు వెళ్ళి కనకాంగిచేయి పట్టుకొని) అమ్మాయీ! యీదినం నిన్నుచూస్తే నాకు బహుసంతోషంగా వున్నది. యీచీరె నీకు యెంతో అందంగా వున్నది. (అని పాకలోని చాకె తలతో రహస్యముగా) నే నీమాట లంటే దీని కెంతభయంగా వున్నదో చూచినారా?

అందరు—ఆహాహాహా! (అని పకపక నవ్వుచున్నారు)

కన—నాస్నేహితుల కందరికీ యీదినం బహు ఖులాసాగా వున్నది.

[అప్పుడింటిలోనుండి భీమయ్య ప్రవేశించుచున్నాడు]

భీమ—సుబ్బనూన్నా! క్షేమమా?

సుబ్బ—యీదినం మీదర్శనం కావడమే నాకు క్షేమం. మీ దర్శనం దొరకడంచేత నాకు బహుసంతోషంగా వున్నది.

భీమ—చాకలమ్మలందరూ మహాపనిమీద వున్నారు.

అంద—అవును పనిమీదనే వున్నాము. హాహాహా! (అనినవ్వుచున్నారు)

సుబ్బ—నేనుకూడా పోయి పని చేసుకోవలెను. (అని పాకలోనికి వెళ్ళుచున్నది)

భీమ—అమ్మాయీ! నీపెళ్ళికంతా సిద్ధమయింది. బంధువుల నందరినీ పిలిచి వచ్చినాను. లగ్నసమయంలోవచ్చి వక్క-సారి వధూవరులను ఆశీర్వదించి పోవలసిందని నాగాచార్యుల పెళ్ళాన్ని మరీ మరీ ప్రార్థించినాను. అంతదూరం రాలే నన్నది.

సుబ్బ—(చాకెతలతో) నాగాచార్యులపెళ్ళాన్ని రమ్మని ప్రార్థించినాడట! ఆవిడెసుకుమారం చూచినారా?

అంద—హీహీహీహీ. (అని నవ్వుచున్నారు)

భీము—(ఆవంకజూచి) ఏమి నాగాచారి పెళ్ళామంటే మీకింత పరిహాసంగా వున్నదా? ఆవిడె సుకుమారికాదా?

సుబ్బ—కాకేమి? ఆవిడె మహా సుకుమారి. మొగుడు ఆవిడెను యింట్లో యేమీ పనిచెయ్యనియ్యడు. వక్క- సూరయ్యగారికుమారుడు వస్తేతప్ప మరియెవరువచ్చి పిలిచినా వీధి తలుపునా భార్యను పెళ్ళి తియ్యనియ్యడు. సూరయ్యగారి కుమారుడు పిలిస్తేమాత్ర ఆవిడె స్వ

యంగావెళ్ళి తలుపు తీస్తుంది; ఆయన యింట్లో ప్రవేశిస్తాడు; ఇంటి యజమాని వెంటనే వీధిలోకి పనిమీద వెళ్తాడు. ఇదినేను ప్రత్యక్షంగా చూచినాను.

భీమ—సంస్కారమీద లేనిదోషాలు వెయ్యరాదు. యీవకక్కరోజయినా పరులను ఆడిపోసుకోవడం మానివెయ్యండి. ఆనికే పిలువ లేదంటారు. మీరందరూ వచ్చి మాఅమ్మాయిపెళ్ళి చూచి పొండి.

సుబ్బ—నాకు యెవరిమీదా ద్వేషం లేదు. నేను యెప్పుడూ యెవరిమీదా లోకంలోవాళ్ళవలె లేనిపోని దోషాలు చెప్పను. యింత ప్రొద్దుయెక్కినా పెళ్ళికొడుకు యింకావచ్చినాడుకాడు. యిలాగుమీ కందరికీ ఆయాసం కలుగచెయ్యడం విశ్వకర్మకు ధర్మంకాదు. నేను వకవేళ పెళ్ళికి రాలేకపోయినా నీకూతురికీ అల్లుడికీ యెప్పుడూ శుభం కోరుతూ వుంటాను.

[అప్పుడు చాకిలందరును పాకలోనుండి యీవలకు వచ్చుచున్నారు]

వెంక—పెళ్ళికి నేనూ రాలేను.

బుచ్చ—నేనూ రాలేను.

శేష—నేనూ రాలేను.

సుబ్బ—యెక్కడ కైన వెళ్ళితే తనతో సమాన మయినవాళ్ళ యింటికి వెళ్ళవలెనుగాని తనకంటె తక్కువవాళ్ళయింటికీ వెళ్ళకూడదు. యెక్కువవాళ్ళ యింటికీ వెళ్ళకూడదు. నేను యీవూళ్ళో చాకిల వాళ్ళలో యింతపరువుగా బ్రతుకుతూ వున్నదానన్నెకాని వట్టిదాన్ని కాను.

బుచ్చ—కొంచెం యెక్కువ తక్కువగా నేనూ నీలంత పరువు గలదాన్నే.

శేష—నాపరువూ మీయిద్దరికంటెనూ తక్కువయిందికాదు.

వెంక—నా మొగుడు కచేరీ మషాల్చీపనిలో వున్నాడు. నాచేతులో నాలుగురూపాయలసొమ్మ వున్నది. నాకు మాత్రం పరువుకు యేమి తక్కువ?

సుబ్బ —అలాగయితే మనమందరమూ సమానమయినపరువు గలవాళ్ళమే. మనలో పరువుతక్కువవాళ్ళు వక్కరూ లేరు.

భీమ—ఇప్పుడు నేను మిమ్మలినందరినీ పేరంటానికి పిలుస్తూ వున్నాను.

సుబ్బ—నేను బహుశా వస్తాను. కనకాంగి నాకు ప్రాణ స్నేహితురాలు.

బుచ్చ—నేనూ ముఖ్యస్నేహితురాలనే.

వెంక—నేనూను.

శేష—నేనూను.

భీమ—అలాగయితే మీరందరూ యిళ్లకు వెళ్ళి పెళ్ళిముస్తా బయిరండి

వెంక—నేను బజారులో పట్టుకుళ్ళరవిక కొనుక్కుంటాను (అని వెళ్ళుచున్నది)

శేష —నేనూపట్టురవికే కొనుక్కుంటాను. (అని వెళ్ళుచున్నది)

బుచ్చ—మీరందరూ రవికెలు కొనుక్కుంటే నేను చీరె కొనుక్కుంటాను. అందరమూ కలిసి వెళుదామురండి. యిక్కడ మనబట్టలు సుబ్బమ్మ చూస్తూ వుంటుంది. (అని యందరును వెళ్ళగా సుబ్బమ్మ పాకలోనికి పోవుచున్నది)

కన—నాన్నగారూ! మీఅల్లుడు యింతసేపటిదాకా రాకపోవడానికి కారణం యేమయివుంటుంది?

భీమ—అతడు పెళ్ళికి యివీఅవీ సవరించుకుంటూవుండివుంటాడు.

సుబ్బ—(పాకలోనుండి) అంతతొందర పడకండి. పదుచువాడు వివాహానికి వచ్చేటప్పుడు చక్కపెట్టుకోవలసిన వ్యవహారాలు యెన్నైనా వుంటవి. పూర్వాపుసంబంధా లన్నీ వదులుకోవలెను. ఇవ్వనలసిన చోట యిచ్చి సమాధాన పరచవలెను.

భీమ—దాని మాటలకేమి? సుబ్బమ్మ యెప్పుడూ యిలాగంటి మాటలే అంటూవుంటుంది. విశ్వకర్మ యిప్పుడే వస్తాడు. అమ్మాయీ! నీవు యిక్కడ కనిపెట్టి చూస్తూవుండు. నేను యింతలో లోపలకావలసినవన్నీ సిద్ధంచేస్తూవుంటాను. (అని యింటిలోనికి వెళ్ళుచున్నాడు)

కన—అదుగో అతడు వస్తూవున్నాడు.

[అప్పుడు చెత బుట్ట పట్టుకొని విశ్వకర్మ ప్రవేశించుచున్నాడు]

విశ్వ—ఓసియురాలా! నీకోసం బజారులో కొన్నివస్తువులు కొనేటప్పటికి కొంచెం ఆలశ్యం అయింది. మనం సొమ్మ వృథాగా పోగొట్టరాదు. అందుచేత వస్తువులు యెక్కడ చవుకగా దొరుకుతవో అక్కడ కొంవామని బజారంతా తిరిగేటప్పటికి ఎంత ఆలస్యం అయింది.

సుబ్బ—(పాకలోనుండి) విశ్వకర్మగారూ! మీరు క్షేమముగా వున్నారా! మిమ్మలిని చాలాకాలానికి చూచినాను. మీరు మహాఅదృష్టమంతులు.

విశ్వ—సుబ్బమ్మా! మీవాకిరేవు యిక్కడనేనా?—కనకాంగీ! పిలియురాలా! నీవు వుండవలసినంత సంతోషంగా కనబడవేమి?

కన—యేమీలేదు. మీరు యింతసేపటివాకా యెందుకు వచ్చినారుకారా అని యిదివరదాకా ఆలోచిస్తూ వున్నాను.

విశ్వ—నేను యెందుకోసం ఆలస్యం చేసినానో నీకు తెలిసింది గనుక యిక విచారం పెట్టుకోరాదు. చూడు యిదుగో నీ కొన్నివస్తు

పులు తెచ్చినాగానో! దంతపుదువ్వెన వకటి; వక బొట్టుపెట్టె; యిత్తడి కుంకం బరిణె; యిత్తడి కాటుక కరాటం; యిత్తడి పాందాసు; యిత్తడి అడకొత్తు; యిత్తడి సున్నపుకాయ; మంచి అద్దము; అయిదు బొంబాయి రవికెల గుడ్డలు; రెండు పట్టుకవికెలు; వక మధురచీరె; రెండు వుప్పాడ చీరెలు. ఇవన్నీ చూచినతరువాతనైనా నీమనస్సుకు తృప్తికరంగా వున్నదా?

కన—వున్నది. (అని యీవస్తువులు పుచుకితీసి చూచి మరల బుట్టలో పెట్టుచున్నది)

సుబ్బ—పాకలోనుంచివచ్చి విశ్వకర్మగారూ! యీవస్తువులన్నీ యెక్కడకొన్నారు?

విశ్వ—మావస్తువులసంగతి నీ కెందుకు?

సుబ్బ—నాకక్కర లేదుగాని వూరికే అడిగినాను.

విశ్వ—కనకాంగీ! యీమధురచీరె కట్టుకుంటే నీవు యెట్లా వుంటావో చూడవలెనని వున్నది.

సుబ్బ—బహుబాగావుంటుంది. రంభ గాచున్నటుంది. ఆమధుర చీరె యిప్పుడు కట్టుకున్న పట్టుచీరెకు మించి వుంటుంది.

విశ్వ—ఓహోహో! నేను చూడనే లేదు. పిల్లయురాలా! నీకు పట్టుచీరెకూడా వున్నదా?

కన—ఈపట్టుచీరె నావంటికి తగి వున్న దనుకుంటాను.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) ఆపట్టుచీరె మహారాజుల పెళ్ళాలు కట్టుకోవలసిందిగాని సాధారణమయిన నీవంటి వడ్డంగి పెళ్ళాం కట్టుకోతగ్గదికాదు. ఇలాగు తలకు మించినవేషాలు వేస్తే చూచిన వారు నలుగురూ నవ్వుతారు. ఇలాంటివేషాలు సాగనిస్తే వక్క-రోజులో సిమిల్లు గుల్ల అవుతుంది ఈపట్టుచీరె కనకాంగికి యెన్నో

యిచ్చినారట.

విశ్వ—ఏమీ! యెవరో యిచ్చినారా?

సుబ్బ—చూడకో మెల్లిగా.

విశ్వ—(తనలో) సుబ్బమ్మ చెప్పినమాట నిజమయ్యేవుంటుంది. (బిగ్గరగా) కనకాంగీ! నీకు ఈచీరె యెవరు యిచ్చినాకు?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) ఆ అడగడంధోరణి చూచినావా? అప్పుడే పెళ్ళాంబూవ అధికారం చెయ్యడాని కారంభించినాడు.

కన—చూబాబు కోనిపెట్టినాడు.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) నీ వామాటలు నిజమనే నమ్మ్రతావా?

విశ్వ—కనకాంగీ! నీవు యీపట్టుచీరె కట్టుకుంటే చూచిన వాళ్ళు యేమనుకుంటారు? వడ్లవాడిపెళ్ళానికి పెళ్ళిలోనే యీనీటేమిటని నలుగురూ నవ్వరా? నీకు యిది తగదు.

కన—పయి వాళ్ళు నవ్వుకుంటే నవ్వుకోనియ్యండి. మనకేమి?

విశ్వ—(బిగ్గరగా) నీకు నేను యిది తగదని చెపుతూ వుంటేను—

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) మేలు మేలు! ఆలాగు వుండవలెను. చివరకు యేమి చేస్తావో యిందులో నీమొగతనం తెలుసుంది.

కన—యిది మాబాబు—

విశ్వ—మీబాబు మాట నాతోచెప్పకు. నాకదిజరూరులేదు.

సుబ్బ....ఇటువంటి స్వల్ప విషయంలో తగువులాడకండి. మీరు పెళ్ళి కాకముందే యిలాగు పోట్లాడితే పెళ్ళయినతరువాతకూడా యెప్పుడూ పోట్లాడుతూనే వుంటారు. ఈపనికిమాలిన పట్టుచీరెకోసం

యింతకలహా మేందుకు?

విశ్వ—(ముందుకువచ్చి) నేను యిప్పుడే చెపుతూ వున్నాను. నలుగురిచేతా నవ్వించుకోవడం నాకు యిష్టం లేదు.

కన—యెవరూ యెందుకు నవ్వుతారు? ఇది నాకు మాతండ్రి కొనిపెట్టినాడు.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) ఇలాగంటి పట్టుచీరె కొనిపెట్టడానికి దీనితండ్రిదగ్గిర డబ్బు యెక్కడ యేడిసింది?

కన—మళ్ళీ చెపుతాను. దీన్ని నాకు మాతండ్రి కొనిపెట్టినాడు. నేను కట్టుకుంటాను. నన్ను చూచి నవ్వడానికి యెవళ్ళసొమ్ము యేమి పడిపోయింది?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) బాగా చెప్పినావు.

విశ్వ—నీవు యీచీరె కట్టుకోకూడదు.

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) నీదగ్గర మొగతనం కాస్త కనపడుతూ వున్నది. ఆడదానికి లోబడకు.

విశ్వ—లోబడను.

కన—మీరు నిష్కారణంగా యెందుకు తగువులాడుతారు?

విశ్వ—నేనా? నేను తగువులాడడం లేదు.

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) ఈమొగుణ్ణి చేసుకుని నీవు సుఖపడవు—

విశ్వ—నీ వాచీరె విప్పివేస్తావా వెయ్యనా?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) వెయ్యనను. నీకేంభయం?

కన—వెయ్యను.

విశ్వ—అలాగైతే నీజోలి నాకక్కర లేదు. ఇప్పుడే నేను చెప్పినమాట వినినిదానవు యిఖ ముం దేమి వింటావు?

సుబ్బ—(విశ్వకర్మతో రహస్యముగా) మేలుమేలు! నీవు నా మనసుచ్చిన మగవాడవు. మగతనం అంటే ఇలాగువుండవలెను.

కన—ఇటువంటి స్వల్పవిషయంలోనే ఇలా తామసం నస్తూవుంటే, ముందు నిజంగా నాయంను తప్పితం వున్నప్పుడు మీరు నన్ను యేలాగు సార్లాచేస్తారు?

సుబ్బ—(కనకాంగితో రహస్యముగా) తగినట్టు బుద్ధిచెప్పినావు. ఆడదానివంటే నీవే ఆడదానవు.

విశ్వ—నీకు పట్టుచీరెమీదనూ వేషంమీదనూ తప్ప మరి దేనిమీదనూ ధ్యానం లేదు.

కన—నీవు యెప్పుడూ నీగొప్పతనమే చూచుకుంటావు. నీవు గర్విష్టివి.

విశ్వ—నీవు పనికిమాలినగయ్యాళివి.

కన—(వెనుక తిరిగి వెళ్లుచు) అవు నవును. నన్నలా అనవలసి నదే. ఇక నేటినుంచి నాకు నీతో సంబంధం విడిసోయింది. మరల ముందుకువచ్చి (ఇకనేను నీతో యెప్పుడూ మాట్లాడను.)

విశ్వ—(వెళ్ళుచు) మంచిది. ఇక నేనూ నీతో యెప్పుడూ మాట్లాడను. (అని మరల వచ్చుచున్నాడు.)

కన—ఇదుగో నీవు తెచ్చిన వస్తువులూ బుట్టాకూడా తీసుకునివెళ్ళు. (బుట్ట ముందుకు తోచి) ఈపనికిమాలిన వస్తువులు నా కక్కరలేదు. నీవి నీవే తీసుకునివెళ్ళు.

విశ్వ—మంచిది. అలాగే తీసుకొని వెళుతాను. (తనలో) ఇవి తీసుకునివెళ్ళి సగం ఖరీదుకైనా మళ్ళీ అమ్మివేస్తాను.

కన—మీరు నాదగ్గిరగా రాకండి.

విశ్వ—యెప్పుడూ రాను.

కన—మనకు యిదే ఆఖరుచూపు. (అని యింటిలోనికి వెళ్ళు చున్నది.)

విశ్వ—యిదే ఆఖరుచూపు. (అని వెళ్ళుచున్నాడు.)

సుబ్బ—(నవ్వుచు) హాహాహా! నాకిప్పుడు పరమసంతోషంగా వున్నది. చెప్పుకుని నవ్వుకోడానికి మాకు యీవేడుక రెండురోజుల దాకా సరిపోతుంది. ఇది వూళ్ళో యెలాగున చెప్పవలెనో ఆలోచించు కోవలెను. మనం చెప్పేటప్పుడు భీమయ్యకూడా దగ్గిరవున్నట్టే చెప్ప వలెను. అలా చెపితేనేకాని కథలో సొగసే వుండదు. విశ్వకర్మ చీరె నిన్ను కట్టుకోనియ్యనంటే, కనకాంగి నేను కట్టుకోకమాన నన్నది. అందుమీద విశ్వకర్మ నీ కాచీరె యెలావచ్చిందన్నాడు. దానికి యెల• వస్తే యేమి దానిమనసువచ్చినచోట సంపాదించుకొన్న దని తండ్రి అందుకున్నాడు. ఆపయిన చీరె కట్టుకోకూడ దని పకరూ, కట్టుకోక మానని వకరూ, కట్టుకుంటే యేమిచేస్తా వని వకరూ, మగ్గురూ మాటామాటా అనుకొని తరువాత కలియబడి కొట్టుకొని దెబ్బలాడి లేచిపోయినా రని చెపుతాను. మధ్య కొట్టుకోవడం పెడితేనేకాని వినేవాళ్ళకు యింపుగా వుండదు. ఆదెబ్బలాటలో విశ్వకర్మ కనకాంగిని కొట్టే క్రిందబడదోసినాడు. కనకాంగి కిందపడి యేడుస్తూ లేచి విశ్వ కర్మమొఖ మంతా బరికింది. దానిమీద కోపం వచ్చి విశ్వకర్మ కన కాంగికొప్పు పట్టుకొని పీకే టప్పటికి గుప్పెడు వెంట్రుకలు చేతు లోకి వూడివచ్చినవి. అప్పుడు భీమయ్య కలియబడి విశ్వకర్మబట్ట లన్నీ చింపినాడు. అటుతరువాత తండ్రి కూతురూ చేరి వంటిగాణ్ణి చేసి బ్రహ్మరాక్షసులలాగు మీదపడి చావకొట్టేటప్పటికి విశ్వకర్మ వాళ్ళతో గెలువలేక పారిపోయినాడు. యేసంబంధంలో నయినా కనకాంగి మూర్ఛవచ్చి క్రింద పడిపోయిం దనికూడా చెప్పవలెను. ఆహాహాహా

ఇప్పుడు వినడానికి యెంతయినా వేడుకగా వుంటుంది. యితరుల పోట్లా టంకే నాకు పండుగ.

[అప్పుడు వీరభద్రుడు ప్రవేశించుచున్నాడు]

వీర—(ముందుకు వచ్చుచు) ఇక్కడితో నాప్రయాణం తుద ముట్టింది. భీమయ్యయిల్లు యీసమీపంలోనే నని చెప్పినారు. పాపం కనకాంగి యెట్లావున్నదో! దాన్ని నేను యిప్పు డానవాలు పట్టలేనను కుంటాను. తనకు వకఅన్నగారు వున్నాడన్నసంగతయినా దానికి తెలి యదు. వకకారణంచేత యీసంగతంతా దాచవలసి వచ్చింది. (సుబ్బ మ్మనుచూచి) అమ్మా! వక్కసారి యిలాగువస్తావా?

సుబ్బ—(పాకలోనుండి వచ్చి) నాయనా! యేమికావలెను? బట్టలు వుతకడానికి చాకలిది కావలెనా? యీవూళ్ళో నాతోసమాన ముగా బట్టలు వుతికేవాళ్ళు యెవరూ లేరు. నెలజీతానికి కుదుర్చుకుం టారో చాకిరేవుకు యింతని యిస్తారో మాట్లాడుకోండి.

వీర—నాకు వడ్రంగి భీమయ్యయిల్లు యెక్కడో చెప్పవలెను.

సుబ్బ—భీమయ్యయిల్లా? మీరు కుర్చీలు కొంటారుకాబోలును.

వీర—మాకు యేమీ అక్కరలేదు. ఆతని యిల్లుమాత్రమే కావలెను.

సుబ్బ—అతడు మీకు యిప్పుడు కనపడడు. అతనికి యిప్పుడు మనసు స్థిమితంగా లేదు. యీవుదయాన్న అతనికూతురు కనకాంగికి పెళ్ళిలగ్నం పెట్టుకున్నారు. పెళ్ళి చెడిపోయింది

వీర—కనకాంగికా పెళ్ళి?

సుబ్బ—అవును కనకాంగికే. అదంతా మీతో చెపుతాను వినండి. కనకాంగికి గర్వం యెక్కువ. తనస్థితికి మించినవేషం వేసుకుని తిరుగవలె నంటుంది. అందుచేత వూళ్ళోఅందరూ యెక్కసచూచినా

కనకాంగిమాటే చెప్పకుంటారు.

వీర—కనకాంగి మంచిదికా దని చెప్పుకుంటారా?

సుబ్బ—బొత్తిగా మంచిదికాదని చెప్పుకుంటారు ఆమాటలు విసే తీరా పెళ్ళిసిద్ధమయ్యేటప్పటికి పొద్దున్న యింటికి వచ్చినవాడే పెళ్ళికొడుకు యిఖ తాను కనకాంగిని పెళ్ళిచేసుకోనని అనవలసినమాటలు మొఖంమీద అనివేసి వెళ్ళిపోయినాడు. ఈపెళ్ళి తప్పిపోవడంవల్ల వచ్చిననష్టం యేమీ లేదు. ఆపెళ్ళికొడుకు వట్టిదౌర్భాగ్యుడు.

వీర—నేను పనిలోనుండి కీర్తిసంపాదిస్తూవుంటే నాచెల్లెలు యీవూళ్ళోవుండి యింత అపఖ్యాతి తెస్తూ వున్నదా? నాకు బహు విచారంగా వున్నది. భీమయ్యయిల్లు యేదో వెంటనే చెప్పు!

సుబ్బ—అయ్యో! నీవు కనకాంగి తోడబుట్టినవాడవా? యీ మాటలు చెప్పి మీమనస్సు కాయాసం కలుగజేసినందుకు నాకు విచారంగా వున్నది. నేను యిప్పుడు మీతోచెప్పినదంతా యెవళ్ళో గిట్టని వాళ్ళు వూళ్ళో చెప్పుకొన్నమాటలుకాని ఆపుణ్యమూ పాపమూ నేనేమీ యెరుగనుసుమా. నేను యెరిగినంతమట్టుకు ఆ చిన్నదానివద్ద వక్రదుర్గుణం కనపడదు. అచిన్నది అన్నగారు వచ్చినారంటే బహు సంతోషిస్తుంది. అంత బుద్ధిమంతురాలు. యీచుట్టుపట్ల ఆడవాళ్ళలో మరియెవ్వరూ లేరు. ఆవినయంయేమి? ఆకలిసికట్టుతనం యేమి? ఆదయా దాక్షిణ్యా లేమి? ఆమాటపొందిక యేమి? యీవీధివాళ్ళంతా కనకాంగిని వెయ్యినోళ్ళ స్తుతిస్తూ వుంటారు. నీవు చెల్లెలికి చాలాడబ్బు తెచ్చినట్టున్నది.

వీర—ఇ దేమిటి? యేదిపట్టుకున్నా వదలను. నాకు చావుగా వున్నది. కాస్తసేపు సీకథ కట్టిపెట్టి నా కాయిల్లు చూపించు.

సుబ్బ—భీమయ్యగారియిల్లా? అతనియిల్లు యిదే.

వీర——ఇంతసేపు చంపకపో తే యీమాట మొట్టమొదటనే చెప్పలేకపోయినావా? (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు)

సుబ్బ——ఇతడు డబ్బుగలవాడు. అందుకు సందేహం లేదు. కనకాంగి భీమయ్యకూతురు కానిమాట యిప్పుడు స్పష్టపడింది. ఈ విడె యెవరో మహాధనికుడి కూతురు. ఇందులో యేదో పరమరహస్యం వున్నది. అడుగో విశ్వకర్మ వస్తూ వున్నాడు. కనకాంగికి భాగ్యవంతు డయిన తోడబుట్టినవా డున్నా డన్నసంగతి వించే వాడు మరీ యేడుస్తాడు.

[అప్పుడు విశ్వకర్మ ప్రవేశించుచున్నాఁడు]

విశ్వ——ఏమిబుద్ధి? నేను యిప్పుడు యేమిచెయ్యను? నేను బుద్ధి హీనుణ్ణయి నిష్కారణంగా మంచిమాట లాడనలసినదానికి బదులుగా తగవులాడినాను. ఎలాగయినా ఆడదానిమాట సాగనియ్యకూడదు. అది పట్టుచీరె కట్టుకోవడం మానివెయ్యనలెను.

సుబ్బ——విశ్వకర్మగారూ! మీకొకవిశేషం చెపుతాను యిలాగు రండి. మీరు యిందాకా పట్టుచీరె కట్టుకున్నందుకే హాశ్చర్యపడి పోయినారు యిప్పుడు కనకాంగికి బారసు చీరెలూ మొహిరీలపేర్లూ వజ్రాలనగలూ పెట్టుకోవలసినయోగం పట్టింది.

విశ్వ——ఛెప్పి, యిదంతా అబద్ధం.

సుబ్బ——ఛెప్పి మీరు నామాట అబద్ధంకింద కట్టివెయ్యవచ్చు ను. ఆచిన్నది భీమయ్య కూతురుకాదు.

విశ్వ——కామా?

సుబ్బ——కాదు. ఆవిడె యెవరో జమీందారు కూతురు. ఆవిడె అన్నగారు యిప్పుడే వచ్చినాడు. నేను కళ్ళారా చూచినాను. ఆయన మాటలు నేను చెవులారా విన్నాను. ఆయన బహుదొడ్డవాడు. ఆయన

యెనిమిదిగుర్రాలబండిలో వచ్చినాడు. బండీ యీగుమ్మందగ్గరనే నిలిచింది. ఆయన బండీదిగి నాదగ్గిరకు వచ్చినాడు. ఆయనను చూచేటప్పటికి నాకు సిగ్గుచేతనూ భయంచేతనూ కంపంయెత్తి వళ్ళంతా చెమట్ట పోసింది. అప్పుడు నేను మూర్ఛనచ్చి కింద పడిపోతా ననుకున్నాను. ఆయనకు కాస్తయినా గర్వం లేదు. కనకాంగిసంగతీ భీమయ్యసంగతీ నన్నడిగి చెల్లిలికి కావలసినంతధనం తీసుకువచ్చినా నని నాతో చెప్పినాడు. ఆయనతో నీపేరుచెప్పి నీవు మహామంచివాడవని చెప్పినాను. ఆయన యీపాకలోకి వచ్చి నాబట్టలు వుతకడంచూచి సంతోషించి నాకు తమ సంస్థానంలో పనియిప్పిస్తామన్నారు. ఆమాటలు చెప్పి నవ్వుతూ ఆయన దేవమాతలాగు యీయింట్లోకి వెళ్ళినాడు.

విశ్వ—ఇఖ నాబ్రతుకు యేమవుతుంది? నేను చెడిపోయినాను.

సుబ్బ—నీవు మొదలంటా చెడిపోయినావు. నీవు పొద్దున్న బుద్ధిపోయి ఆలాపోట్లాడకుండా వున్నట్టయితే యీపాటి కనకాంగి నీకు భార్యఅయి వుండును. అప్పుడు నీకు ముప్పయి నలభయి వేల రూపాయల ఆస్తి వచ్చివుండును. ఆమాపాయలసంచయి చూచుకుంటే నీకు యీపాటి పిచ్చ యెత్తకపోయిందా?

విశ్వ—ముప్పయి నలభయి వేల రూపాయలా? అన్ని రూపాయలు వుంటే గొప్పకారుఖానా పెట్టవచ్చును. మరి పొద్దున్న ఆచిన్న దానితో పోట్లాడడానికి నన్ను నీవు యెందుకు పురికొల్పినావు?

సుబ్బ—నిన్ను నేను పోట్లాటకు పురికొల్పినానా? సరిసరి! ఇది మరీ బాగావున్నది. నేను పొద్దున్న నీతో వక్కమాటమాట్లాడలేను. (అని పాకలోనికి వెళ్ళిచున్నది)

విశ్వ—నీమాటలు వింటే నాకు పిచ్చ యెత్తిపోకూ వున్నది. నీ వాడదాన వైపోయినావుగాని మగవాడ వయినట్టయితే యీపాటి

నాపగంతా తీర్చుకొంటను. నే నిప్పుడు యేమి చెయ్యను? వూళ్ళోవా
ళ్ళంతా ఇక్క నన్ను చూస్తే పరిహాసం చేస్తారు. ఇక నాకు నిశ్చయంగా
చావు వ్రాసింది. నేను నూతిలోనో గోతిలోనో పడవలెనుగాని నాకు
పెళ్ళాడి భార్యతో సుఖంగా కాపురం చెయ్యవలసిన యోగం లేదు.
యిందాకా పిలిచినారు. పంతులుగారికుర్చీ బాగుచేసి వచ్చి యేదో
సాహసకార్యం చేసుకుంటాను. (అని వెళ్లుచున్నాడు)

[అప్పు డింటిలోపలి వీరభద్రుడును, భీమయ్యయు ప్రవేశించుచున్నారు]

వీర—నేను విన్నదంతా అబద్ధమని నీవు నమ్మకంగా చెప్పడం
వల్ల నామనస్సులో విచారమంతా పోయింది. నీవుచెప్పినట్టుగా మన
కనకాంగి గర్వములేనిదీ అనువర్తనకలదీ అయివున్నట్టయితే నేను
యిప్పుడు యిక్కడకు వచ్చినందుకు నాకు సంతోషమేకాని విచారం
వుండదు. అది యిప్పుడు యింట్లోలేదుగనుక కొంచెంసేపు నేను వచ్చిన
సంగతి రహస్యంగానే వుంచండి. అప్పుడు నేను తనబీరవస్థితిలో దాని
నడత యెట్లా వుంటుందో స్వయంగా కనిపెట్టి, తరువాత మాతండ్రి
యిచ్చిపోయిన ఈభాగ్యమంతా దానింతో నేను సుఖంగాఅనుభవిస్తాను.

భీమ—మాతండ్రి మహావీరుడు. అతడూ నేనూ పసూలంలో
కొంచెంకాలమే పనిచేసినా, మేము యిద్దరమూ ప్రాణస్నేహితులుగా
వుండేవాళ్ళము.

వీర—మాతల్లి పోవడంచేత యింట్లో ఆడదక్కత లేక కూతురు
పోయి విచారస్తూవున్నావని నీకు పెంచుకోవడానికి యిచ్చిన కనకాం
గిని పెంచి పెద్దదాన్ని చేసినందుకు మాతండ్రిపోయినా నాకు విశ్వాసం
పోలేదు. నీవు బ్రతికినంతకాలమూ సుఖంగా జీవనం చెయ్యడానికి తగిన
జీవనాధారం నేను యేర్పరుస్తాను.

భీమ—ఆమాటలు యిప్పుడేమీ నాతో చెప్పవద్దు. మన కన

కాంగిని యివ్వాలచుకొన్న విశ్వకర్మను నీకు యిప్పుడు చూపిస్తాను. అతను భాగ్యవంతుడు కాకపోయినా మాటనిలకడ గలవాడునూ కష్ట పడి వొళ్ళు దాచుకోకుండా బాగాపాటుపడేవాడునూ పెద్దమనిషినీ అవును. వాళ్ళయిద్దరికీ వకరిమీద వకరికి మోహం విస్తారంగా వున్నది. గనుక వారి వివాహానికి నీవేమీ అడ్డం చెప్పనని తలుస్తాను.

వీర—నీవు చెప్పిన ఆయిదుగుణాలూ వుంటే లోకంలో యింకా ధనం యేమి కావలెను? అయినాకానీ నేను యీవూళ్ళోకి వచ్చిన సంగతీ కనకాంగికి ధనం తెచ్చినసంగతీ విశ్వకర్మకుకూడా తెలియకుండా వుండనియ్యండి. అతడికి నిజంగా కనకాంగిమీద ప్రేమవున్నట్టు నాకు కనపడ్డట్టయితే యీపెళ్ళికి నే నేమీ అభ్యంతరము చెప్పను.

భీమ—(రహస్యముగా) అలాగయితే నీవు బీదవాడవనిన్నీ భుక్తికి జరగక యిక్కడకు వచ్చినావనిన్నీ వదంతి వేస్తాను. ఆపాకలో చాకలిది మసకేసి చూచి మనం యేమిచెప్పుకుంటూమో అని ఆలకిస్తూ వున్నది. దానికి తెలిస్తే వూరంతా తెలిసినట్టు. మంచిసమయం తట స్థమయింది. (బిగ్గరగా) అయ్యో! వీరభద్రా! నీవనుభవించినకష్టాలూ నీబీదతనమూ వింటే నాగుండెలు బద్దలవుతూ వున్నవి.

సుబ్బ—(ఊలికిపడి) ఏమీ!

వీర—నేనేనీమో అకార్యం చెయ్యలేదుగదా అన్న ధైర్యము తప్ప నావద్ద యీరాత్రి భోజనానికి కూడా చిల్లిగవ్వ లేదు.

సుబ్బ—ఓయి దేవుడా! అంతా ఇంతేనా?

భీమ—మంచిది. నీవెంతమాత్రమూ అధైర్యపడబోకు. నీవు పడిదెకు తెచ్చుకుని వేసుకున్న యీబట్టలుచూస్తే యీవూళ్లో నిన్ను యెవళ్లూ బీదవాడని అనుమానపడరులే. నిన్ను గోదావరివడ్డు కారు ఖానాలో పనికి వప్పగిస్తానురా. (రహస్యముగా) తాలూకా కచేరీ

ఆవైపుననే వున్నది. అక్కడ సినోట్లు మూర్చుకొని మళ్ళీ యిప్పుడే వత్తాము. (అని వెళ్ళుచున్నారు.)

సుబ్బ--(పాకలోనుండి వచ్చి) ఇప్పుడు నేను వక కొత్తసంగతి కనిపెట్టినాను. అతనికి పూటపూటికి టికాణా లేదట. గర్భదరిద్రమట. కారుఖానా అని పేరుపెట్టుకొని వాళ్ళు వూళ్ళో ముష్టికి బయలుదేరినారు. సందేహంలేదు. లేకపోతే వకవేళ యెక్కడనయినా కన్నంవేసి పట్టుకు పోతారని యీవూరికి పారిపోయివచ్చినాడేమో! సందేహం లేదు. అదేఅయివుంటుంది. నేను యిప్పుడు యెంతయినా చెప్పనలసి వున్నది. వినేవాళ్ళు యిక్కడ వక్కరూ లేకుండావున్నారు. ఇప్పుడు వూళ్ళోకి పరుగెత్తుకుని పోయి నలుగురితోనూ చెప్పి పత్తునా? వెళుదామంటే బట్టలదగ్గిర కనిపెట్టుకుని వుండేవారు యెవరూ కనపడరు. యిందులో చిలువలూ పలవలూ కల్పించి గంపెడుకబుర్లు చెపుతాను. యిక్కడ వుండడానికి యెవరినైనా పిలుచుకుని వస్తాను.

(అని వెళ్ళుచున్నది)

[చేతిపేటికి కట్టుకట్టుకొని చేబాడిగ పట్టుకొని విశ్వకర్మ ప్రవేశించుచున్నాడు]

విశ్వ--(ముందుకు వచ్చి) నాకు యిప్పుడు యేమీ మతిలేదు. కుర్చీకాలు చెక్కపోయి పరధ్యానంచేత వేలు తెగకోసుకున్నాను. యిప్పుడు నాధ్యానమంతా కసకాంగిమీద వున్నది. తీరా సిద్ధమయిన పెళ్ళి చెడగొట్టుకోవడంచేత నాసుఖం పోయింది. సంతోషం పోయింది. వుత్సాహంపోయింది. నాకు తెలివికూడా సెలవుపుచ్చుకుంటూవున్నది.

[అప్పుడు సాధారణమైన బట్టకట్టుకొని కనకాంగి ప్రవేశించుచున్నది]

కన--(విశ్వకర్మనుజూచి) వి-వి-విశ్వకర్మా! (ముందుగా నేను పలుకరించకూడదు)

విశ్వ--క-క-కనకాంగీ! (నేను మురిపుగా పలుకరించరాదు)

కన—నీవు నన్ను పిలిచినావా?

విశ్వ—నీవే నన్ను పిలిచినా వనుకున్నాను.

కన—నేను పిలువలేదు.

విశ్వ—నేనూ పిలువలేదు. కనకాంగీ! నాకు యిప్పుడు నేత్రో త్సవంగా వున్నది.

కన—యేమిటీ!

విశ్వ—యేమిటూ? నీవు యిప్పుడు కట్టుకున్నకోక బహు బాగా వున్నది.

కన—నిజంగానేనా?

విశ్వ—నిజంగానే. యిందాకటి పట్టుచీరకంటె ఫరిరెట్లు బాగా వున్నది. ఇఖ మనవివాహం నిజంగా చెడిపోయినట్లేనా?

కన—(కన్నుల నీరు పెట్టుకొనుచు) ఏమిటీ? మనవివాహమా? ఆలాగే కనపడుతూ వున్నది.

విశ్వ—(తనలో) నేను మళ్ళీ అడిగితే, నేను తన డబ్బు కోసం పెళ్ళాడుతానంటూ వున్నా ననుకుంటుం దేమో? నే నేమి చెయ్యను?

కన—నిశ్వకర్మా! నేను యిక్కడ నిలుచుని కళ్ళ నీళ్ళ పెట్టు కుంటూవుంటే నీవు వూరికే చూస్తూ నిలుచున్నావుకాని నాదుఃఖం పోగొట్టడానికి కొంచెమయినా ప్రయత్నం చెయ్యడం లేదుగదా?

విశ్వ—(తనపైబట్టతో కన్నీరు తుడుచుచు) నాకు బహువ్యస నంగా వున్నది. నా కప్పుడు తెలియలేదు. నేను యిప్పుడు సిద్ధంగా వున్నాను.

కన—యెందుకు సిద్ధంగా వున్నావు?

విశ్వ—సీతో యిల్లీ యెప్పటిలాగు స్నేహంచెయ్యడానికి. నీకు

అభ్యంతరం లేకపోతే నాకు యేమీ అభ్యంతరం లేదు.

కన—నీవు నిర్దయుడవు. నీకు నామీద నిజంగా ప్రేమవున్న ట్లయితే ప్రొద్దున్న పట్టుచీరకోసం నాతో అలాపోట్లాడివుండవు. నేను యిప్పుడు యేమి చేసినానో చూచినావా? పట్టుచీరవిప్పి సాదాచీర కట్టుకున్నాను.

విశ్వ—నీకు నామీద దయవున్నది గనుక అలాచేసినావు. నీవు యిప్పుడు నివసనము వచ్చినచీర కట్టుకోవచ్చును. మనం యిద్దరమూ యిప్పుడు మళ్ళీ స్నేహితులమయినామా? అయినట్లే తోస్తూవున్నది. నీమొఖానికి యిప్పుడు కళ చేరుకున్నది. పెనవులసందునుంచి చిరునవ్వు బయలుదేరుతూ వున్నది. నీముఖవికాసము చూస్తే నాకు సంతోషంగా వున్నది. నాకు వక్కముద్ద పెట్టు! మళ్ళీ స్నేహితులమవుదాము. (అని కౌగిలించుకొని ముద్ద పెట్టుకొనుచున్నాడు.)

[అప్పుడు సుబ్బమ్మ ప్రవేశించుచున్నది]

సుబ్బ—ఓరితుంటరీ ! యిప్పుడు యేమి చేస్తూవున్నావు?

విశ్వ—నీవు ప్రొద్దున్న పెట్టినకలహాన్ని చంపివేస్తూ వున్నాను.

సుబ్బ—అయ్యో! యెంతదురదృష్టమూ.

విశ్వ—దురదృష్టమా?

కన—దురదృష్టమా?

సుబ్బ—దురదృష్టంకంటేనూ హీనమయినది. వట్టిసిగ్గులచేటు. కనకోంగీ! నీఅన్న వచ్చినాడు చూచినావా?

కన—నాఅన్నా! నాకు అన్నే లేడు.

సుబ్బ—తప్పకుండా వున్నాడు.

విశ్వ—ప్రియురాలా! నీవు యెరగనేయెరగవా? అతడు బహు ధనవంతుడు.

సుబ్బ--నీకు యీసంగతి తెలియునే లేదా? నీకు అన్నవున్నాను. అతను యీరోజున యిక్కడకు వచ్చినాడు అతడు కటికదరిద్రుడు. పూటకూటికి గతిలేదు. వట్టి బిచ్చగాడులాగు వున్నాడు.

విశ్వ.--యెవరు?

సుబ్బ--కనకాంగి తోడబుట్టినవాడు.

విశ్వ--అతడు భాగ్యవంతుడనే, గుర్తిపుబండీవున్నదనీ, నవు కర్లు వున్నారనీ, మంచిబట్టలు కట్టుకున్నాడనీ, యింతకుముందేకాదా నాతో చెప్పినావు.

సుబ్బ--అది అరగంట నేపటికిందట. ఇప్పు డాగుసుడు వెళ్ళి పోయినాడు. జనుల స్థితిగతులు నిముషంలో మారిపోతవి. అతగాడి వేషం మళ్ళీ వచ్చేటప్పుడు చూస్తిసిగదా ముష్టివాడి వేషంకన్నను కనాకష్టంగా వున్నది. నల్లగా మాసిపోయిన పాతచిరుగుల పీలికలగుడ్డ కట్టుకున్నాడు కాలికి జోడులేదు--

విశ్వ--చాలచాలును. ఈపాటి వూహకో. నీమాటలు నేను నమ్మను. మంచిజరీబట్టలు అరఘుటనేపటిలో మాసి చిరిగిపోయి పీలిక లయినయ్యంటే యెవరైనా నవ్విపోతారు.

సుబ్బ--నేను నిజం చెప్పినాను. నామాటలు నమ్మితేనమ్ము. నమ్మకపోతే నమ్మకు. (కనకాంగినంకం జూచి) నీఅన్నగారు నీవు భీమయ్య కూతురవు కావని స్పష్టంగా చెప్పినాడు. అతడు యిప్పుడు నిన్ను తమవూరికి తీసుకునిపోవడానికే వచ్చినాడు. దారిఖర్చునిమిత్తం కారుఖానాలో కూలిపనిచేసి సాయంతాన్నికి పావలాడబ్బులు సంపాదించి వాటితో యీరాత్రి నిన్ను మోటబండిమీద యెక్కించి తన వెంట తీసుకుపోతాడు. అతణ్ణి యింతకుముందే కార్ఖానాలో విప్పగించడానికి భీమయ్య వెంటబెట్టుకుని వెళ్ళినాడు.

[అప్పుడు భీమమ్మయ్యయు వీరభద్రుఁడును ప్రవేశించి వారికి కనబడకుండ వెనుక నిలుచున్నారు.]

విశ్వ—ఏమిటే! అతడు కనకాంగిని తనవెంట తీసుకునిపోతాడా? ఈవిడను తీసుకునిపోతే నన్ను కూడా తీసుకునిపోవలెను.

కన—సుబ్బమ్మా! నేను నీవు చెప్పిన దానిలో వక్కమాటయినా నమ్మను. నీవు మాకు, మళ్ళీ పోట్లాటపెట్టవలెనని చూస్తూనున్నావు. నేను యిప్పుడు మాతండ్రి కూతురిని కాననడం వట్టి దూషణగా వున్నది. లోకంలో యింతకంటె విచిత్రం లేదు.

సుబ్బ—నీకు తండ్రి యెవరో యెవరికీ తెలియదు. ఈవిశ్వ కర్మ అభమూశుభమూ యెరగని అమాయకుడు గనుక, నీవు యెవరి కూతురవో తెలుసుకోకుండా చేతులో దమ్మిడీగవ్వలైనా లేని నిన్ను, తగుదునని పెళ్ళాడడానికి తయారయినాడు. నీఅన్నగారిని చూడబోతే చిరుగులగుడ్డలూతానూ నీకంటెనూ గర్భదరిద్రుడుగా వున్నాడు.

విశ్వ—(దగ్గరగా వచ్చి) సుబ్బమ్మా! నేను వక్కమాట చెపుతాను విను. కనకాంగికి తండ్రివున్నా లేకపోయినా, యీచిన్నది బీదదయినా భాగ్యవంతురాలయినా, అన్నగారివి చిరుగులగుడ్డలయినా, జరీబట్టలయినా, వాటితో నాకు యేమీ పనిలేదు. నాకు కనకాంగిమీద మోహం వున్నది; నేను కనకాంగిని పెళ్ళాడుతాను. ఈవిడె అన్నగారికి బట్టలు లేకపోతే నాబట్టలలో కొన్ని యిస్తాను; యిల్లు లేకపోతే నా యింట్లోనే కాపురం వుండనిస్తాను; అన్నంలేకపోతే నేను మరింత కష్టపడి సంపాదించి పెడుతాను. నాకు వంట్లో సత్తువ వుంటేనూ యీరెండుచేతులూ చల్లగావుంటేనూ, యీవిడె అన్నగారు వచ్చినా తండ్రి వచ్చినా యేటీ వొక్కొక్కడు చొప్పున పదిమంది పిల్లలు వచ్చినా నళ్ళుదాచుకోకుండా పనిచేసి సంపాదించి అందరినీ

పోషిస్తాను. ఇఖ యిప్పుడేమి చెపుతావు?

వీర—(ముందుకు వచ్చి విశ్వకర్మ చేయిపట్టుకొని) నిన్నుచూస్తే నాకు బహు సంతోషంగా వున్నది. ఈకనకాంగి అన్నగారిని నేనే. నేను నీవల్ల సహాయంపొందడానికి బదులుగా నాచెల్లెలినీ సంవత్సరానికి మూడువందలరూపాయలు వడ్డీవచ్చే సొమ్ముకూడా నీకే నేను యిస్తూ వున్నాను.

కన—మీరు నాకన్నగా రవుతారా?

వీర.—(కనకాంగి చేయిపట్టుకొని) చెల్లాయీ! నీవు సౌభాగ్యవతివి కమ్మ. నీకు నేను అన్నగారినంటే నీకు అద్భుతంగానే వుంటుంది. మనవంశకథ అంతా యీరాత్రి నీవివాహం అయినతరువాత రేపు సావకాశంగా నీతో చెపుతాను.

విశ్వ—సంవత్సరానికి మున్నూరురూపాయలా ! మనం ఇఖ పెద్దకార్ఖానా పెట్టుకోవచ్చును.

సుబ్బ—అయ్యా! మీరు మహాదొడ్డవా రని నేను యిదివర కే విశ్వకర్మగారితో చెప్పినాను. కావలిస్తే ఆయనను అడగండి.

బుచ్చమ్మ, శేషమ్మ, వెంకమ్మ, గొల్లమస్తులు—(వెలుపలనుండి) సుబ్బమ్మ యెక్కడ వున్నది? చాకలి సుబ్బిముండ యెక్కడవున్నది?

విశ్వ—సుబ్బమ్మా! నీకోసం యెవరో చాలామంది వస్తూ వున్నారు.

[అప్పుడు బుచ్చమ్మయు, శేషమ్మయు, వెంకమ్మయు, గోపాలుడును, ప్రవేశించుచున్నారు.]

వెంక—(సుబ్బమ్మతో) ఓసీ చాకలితొత్తా! నేను బట్టలు వుతికే రామారావుపంతులుగారి భార్యవద్ద నావిషయము నీవు యే మని చెప్పినావు? మామడివేలు పెళ్ళిచేసుకున్న వాడుకాము, వుంచు

కున్నవాడని నీవు యెందుకు పేలినావు? ఇలాగంటి సంసారఘాతలు పలకడానికి నీకునో కొట్టావచ్చిందే! మాపంతులుగారు నీకు "కలహా ప్రియ" అని పేరు పెట్టినందుకు వూరికే పోలేదు.

బుచ్చ—(సుబ్బమ్మనుజూచి) నేను చిన్నప్పుడు గోదావరివడ్డున కూలికి పేడతట్టలు మోసేవాన్నని అబద్ధాలమాటలు పూజారాయ నతో యెందుకు చెప్పినావు?

శేష—(సుబ్బమ్మ దగ్గరకు పోయి) నేను వెనుక యెవరి యింట్లోనో యేదో యెత్తుకపోయినాననీ, నేను పదుచుదాన్నిగా కన పడడానికి తలవెండ్రికలకు రంగువేసుకుంటానని, బజారులో బట్టల దుకాణం వేసుకునే కోమటి మల్లయ్యతో యెందుకు చెప్పినావు?

సుబ్బ—నేను యెవరితోనూ యేమీ చెప్పలేదు.

వెంక—చెప్పినావు. (అని యొక లెంపకాయ కొట్టుచున్నది)

బుచ్చ—తప్పకుండా చెప్పినావు. (అనివీపుమీదగుద్దుచున్నది)

శేష—నీవు చెప్పినందుకు యేమీ సందేహంలేదు. (అని బుగ్గలు పొడుచుచున్నది.).

భీమ—నీవు ఇలాగంటి తంపులు పెట్టకుండా వీళ్ళనీకు బాగా బుద్ధి చెప్పినారు.

గోపా—ఆహాహా! దీనికి తగిన శాస్తి అయినది. ఇది నాపెళ్ళానికో యెవరికో రంకుకట్టిందట. నేనుకూడా ఆడదాన్నయినట్టయితే దీన్ని నాలుగు తన్నులు తన్నుదును.

సుబ్బ—అందరూ కాట్లకుక్కలలాగు మీదపడితే వంటరి కత్తెను యేమి చెయ్యగలను? ఇప్పుడు మీకాలంవచ్చింది. నవ్వండి. నవ్వండి. యేమి చేస్తాను? నేను రేపటినుంచి మీతో యెవరితోనూ మాట్లాడను. నాతో నేనే మాట్లాడుకుంటాను. నాతో నేనే నవ్వు

కుంటాను. (అని వెళ్ళబోతున్నది.)

గోపా—హాహాహా!

విశ్వా—ఇప్పుడు కలహాలమారి సుబ్బమ్మ మనను విడిచిపెట్టి వెళ్ళింది గనుక, ఇక యీరోజు మనమంతా సంతోషంగా వుండవచ్చును. మనం లోకంలో స్నేహమును గౌరవమును సంపాదించుకోవలెనంటే యెవరివిషయంలోనూ జబ్బుమాటలు చెప్పకుండా వుండవలెను. మనం యెవరివిషయంలోనైనా మంచిమాటలు చెప్పలేకపోతే మౌనం ధరించి వూరికే వుండడం మంచిది. పొద్దుపోయింది లోపలికి వెళుదామురండి. (అందరును నిష్క్రమించుచున్నారు.)

మహామహోపాధ్యాయపరిహాసనటము

ఇందు వచ్చుపాత్రములు.

—:o:—

కళావిదుఁడు—విద్యాలయం దాదరముగల యొకకుత్రియుఁడు.

ధీనిధి—కళావిదునికుమారుఁడు.

విద్యానాథుఁడు—ఒక యుపాధ్యాయుఁడు.

భీముఁడు— మహామహోపాధ్యాయతర్కపంచాననుఁడు – ఒక శాస్త్ర పండితుఁడు.

వసంతతిలక—కళావిదునిసేవకోడలు.

చంద్రిక—వసంతతిలక దాసి.

———

ఁ రంగము—కళావిదుని తోటలోని యిల్లు.

[అప్పుడు చంద్రిక ప్రవేశించుచున్నది]

చంద్రి—(చీపురుగట్ట చేతబట్టుకొని) నాకు పనిఅంటే బద్ధకం. యీపని మానివేసి వీధివంక చూస్తూ మహారాణిలాగు కూర్చుంటే బాగావుండును. మేడగోడ తుడవబోతే కింద పడిపోయిందని యీ చీపురుకట్ట వీధిలో పడవేస్తునా! అరుగో యెవరో వస్తూవున్నారు. మరి యెవరూ కాదు. వసంత తిలక.

[చీపురుకట్ట మెల్లగా పడుచు గృహములోనుండి వసంతతిలక ప్రవేశించుచున్నది]

వసం—ఓసీచంద్రీ! మామగారు వీధిలోకి వెళ్ళినారా?

చంద్రి—యిప్పుడే వెళ్ళినారు. మీ మేనమామగారు యిప్పుడే

కాదా గదిలోకూర్చుండి చదువుకోమని మిమ్మలిని లోపలికి పంపివేసి నారు. అమ్మా! మీరిప్పుడే మళ్ళీవచ్చినారేమి?

వసం—యెప్పుడూ అదేపనిగ కూర్చుని చదువుకోమంటే విసుగువస్తుంది. ఓసీ! నీతో చెప్పనా? నాకు కామబాధ మహావిస్తారంగా వున్నది. నాకు యిప్పుడు యేమి చెయ్యడానికీ తోచకుండా వున్నది.

చంద్రి—నాకూ ఆలాగే వున్నది.

వసం—చంద్రీ! నేను వెనుక యెప్పుడూ కామంచేత యింత బాధ యెరగను.

చంద్రి—అమ్మా! నాబాధ యెవరితో చెప్పుకోను. అవును కాని మీమేనమామగారు తనకుమారుడు ధీనిధిగారు చెన్నపట్నం కాలేజీనుంచి వచ్చినప్పటినుంచీ మిమ్మల్ని యిద్దరిని వక్కచోట వుండ కుండా చేస్తూవుంటారు యెందుచేత? నేనుచూస్తూవుంటాను. మీమేన మామగారికి మిమ్మలినీ ధీనిధిగారినీ కనిపెట్టి చూస్తూవుండడం తప్ప రెండోపని కనపడదు.

వసం—వూరికే అలా చూడడమే కాని అందువల్ల యేమీ ప్రయోజనంలేదు. ధీనిధి నేనూ కలుసుకోవలెనంటే ఆయన పట్టుగలడా?

[ధీనిధి ప్రవేశించుచున్నాడు]

ధీని—వసంతతిలకా! ఇప్పుడు వచ్చింది మరి యెవరూ కాదు. నేనే. లోందర పడబోకు.

చంద్రి—మీరు యిద్దరూ వేరేవేరే గదులలో కూర్చుని వక్కమోస్తరు చదువే చదువుకుంటూ వున్నట్లున్నారు. ఇప్పుడు మీమీ చదువులు కూడాపలుకోవడానికి వృథయులుకూడా యిక్కడికి వచ్చినట్లున్నారు.

ధీ:—అవును. అందుకేను వచ్చినాము; మానాన్నగారు నన్ను వక్క-సారిగా శేషాహివాల్మీకిని కమ్మంటారు. నైషధమూ, మాఘమూ, భారవీ, యీలాగంటి రాళ్ళవంటి పాతపుస్తకాలు మరికొన్ని చదువు మని రాత్రీ పగలూ వూరికే నాప్రాణాలు తీస్తూవున్నారు?

వసం—మీరు కాలేజీలో చాలాకాలం చదివినారు.

ధీని—అవును. యఫ్లైక్లాసులో రెండేళ్లూ, బియే క్లాసులో రెండేళ్ళూ నాలుగేళ్ళు చదివినాను. అక్కడ వున్నకాలంలోకూడా నాకు నీచదువే విస్తారంగా వుండేది. నీవు పెద్దదాన వవ్వతూవున్నావనీ, నామీద నీకు ప్రేమ హెచ్చుతూ వున్నదనీ, నీవు మహా సౌందర్యవతివనీ, నాధ్యానమంతా నీమీదనే వుండేది.

వసం—ఆలాగయితే మీరక్కడ చాలా మంచిచదువే చదివి నారు. ఇఖమీరు చదివింది చాలును.

చంద్రి—ఎక్కువ. యీమధ్య మీనాన్నగారూ చదువులపండితులు విద్యానాధుడుగారూ మాట్లాడుకోవడంలో యీకాలపు కుర్రవాళ్ళు అతివిస్తారంగా చదువుకుంటారని చెప్పుకున్నారు. అది నిజమేనా?

ధీని—విస్తారంగానే చదువుతారు. అయినాకానీ పురుషుడు వశరిని కామించివున్నప్పుడు చదవడం బహుకష్టం.

చంద్రి—అలాగయితే పెళ్ళయినతరువాత చదువు సాగుతుం దనుకుంటాను.

ధీని—సాగుతుంది. అప్పుడు మేము యిద్దరమూ కలీసి చదువు కుంటాము. పాపం! యీచంద్రికకు యీకామవిషయంలో యేమీ అనుభవరి లేదు.

చంద్రి—నాకూ వున్నది. నేనూ ఒకరిని కామించే వున్నాను; పెద్దమనుష్యులయిళ్ళల్లో పనిచేసే పడుచుతనంలో వున్న నావంటిబీద

వాళ్ళ నడతను ముఖ్యంగా చూస్తాను. అందుచేత నేను నిరుపు నాపై తల్లితోకూడా చెన్నపట్నం వెళ్ళినప్పుడు నేను యెవరిని పెళ్ళిచేసుకో వలెనో యేర్పరుచుకున్నాను. ఈ ఆరునెలలబట్టీ నాకు యేమీ పని తోచడంలేదు. ఈబట్ట రెండునెలలకిందటనే కొరుపట్టి గా యీకాస్త చిరుగూ కుట్టుకోనయినా కుట్టుకోలేదు.

వసం—(ముగదుకువచ్చి) ఓసీ చందీ! నీమొగుడి సంగతి నాతో కొంచెం చెప్పు. అతను పదుచువాడేనా? చక్కగా వుంటాడా? ఇంత మర్యాదగలవాడేనా?

చందీ—అతడు మహాచక్కనివాడు. యెప్పుడూ పెద్ద మనుష్యులదగ్గిర వుంటాడు. అతను యెప్పుడూ పెద్దఅంగరకా వేసుకుని జరీ నక్కీ చుట్టిన పాగా పెట్టుకుంటాడు.

వసం—ఆనక్కీ మంచిజరీదేనా?

చందీ—మంచి జరీదే. నడుముకు కట్టుకునే పటకా కూడా జరీదే.

ధీని—ఇప్పుడు తెలిసింది. అలాగయితే అతనికి యెవరివద్దనో బంటోర్తుపని.

చందీ—అయితే యేమి? అతని యజమానుడూ పూర్వం బీద వాడుగనే వుండేవాడట. యజమాను డయినప్పుడు నవుకరుమాత్రం యెందుకు భాగ్యవంతుడు గాకూడదు? యీ ఆరు నెలలబట్టీ నాకు అతని కబురే తెలియడం లేదు. విచారంచేత నాకు మతి పోకుండా వున్నది.

ధీని—చందీ! విచారింపబోకు. మాకు పెళ్ళి అయినతర్వాత అతను యెవరో కనుక్కుని తెప్పిస్తాములే. మాపెళ్ళి వేగిరం కాకుండా వుండడానికి యేదోతంత్రం జరుగుతూ వున్నది.

చంద్రి—అది మీకు యెలాగు తెలిసింది?

ధీని—మీచదువులపంతులూ మాతండ్రిగారూ కూర్చుని యే కాంతంగా యెప్పుడూ యేదో గుసగుస లాడుకుంటూ వుంటారు.

చంద్రి—వారియేకాంతంవల్ల యెవరికీ యేమీ నష్టంరాదు. వసం—మేము యీసాయంకాలం వుత్సవంలోకి వెళ్ళగలచుకున్నామని వారికేమయినా అనుమానం కలిగిందా?

చంద్రి—కలిగినట్టు లేదు. మీమేనమామగారు నాలుగు గంటలకు బండీవాణ్ని బండీ తోలుకుని రమ్మన్నారు. వారు మరియెక్కడికో వెళ్ళేటట్టున్నారు.

ధీని—అలాగయితే మనం యీరోజున వారిసి బుట్టలో వెయ్యవలెను. అదుగో మానాన్నగారు వస్తూవున్నారు. మీరు యిద్దరూ లోపలికి పరుగెత్తండి. నేను యీతోటలోకి వెళుతాను.

[వసంతతిలకయు చంద్రికయు లోపలికి పోవుచున్నారు]

ధీని—వీలయితే ఆయనకు కనపడకుండా నేను యీ దారిని తోటలోకి వెళుతాను. (అని మెల్లగా గోడదరినుండి పక్కకి పోబోవుచున్నాడు)

[అంతట కళావిదుడు ప్రవేశించుచున్నాడు]

కళా—పోకు పోకు. వుండు. ఇదేనా చదువుకోవడం? నీవు గది లోకూర్చుని కావ్యాలు చదువుకుంటూ వున్నావనుకున్నాను. చదువుకోవడానికి బదులుగా తోటగుమ్మంవద్ద ముంగిలాగు పాకుతూవున్నావా?

ధీని—చదువుకుంటూనే వున్నాను. వకచోట వక సుందరి యొక్క మంచిసౌందర్యవర్ణన కనపడితే దాన్నిచూచి ఆశ్చర్యపడుతూ వున్నాను.

కళా—అదియేదీ చూతాము చెప్పు.

ధీని—మీరు అధాత్తుగా రావడంతోటే పోయింది. కాస్త సేపు నేను ఆలోచించుకుంటూవుంటే మళ్ళీరావచ్చును.

కళా—నీవు చెప్పేది వట్టి అసందర్భంగా వున్నది. నేను చిన్నప్పుడు నీలాగే చదువుకునేవాణ్ణనుకున్నావా యేమిటి? పొద్దున్న లేస్తే రాత్రి పదిగంటలయిందాకా వక్కమోస్తగున చదివేవాణ్ణి. నేను సంస్కృతం మాత్రం చదవలేదు. నిన్ను సంస్కృతంలో కూడా పండితుణ్ణి చెయ్యడానికి నిశ్చయించుకున్నాను.

ధీని—మీరు అంతసేపూ చదివినదానిఫలం యేమిటో నాకు కొంచెం చెపుతారా?

కళా—వోపికపెట్టు దానిఫలం నీకు వేగిరమే తెలుస్తుంది. బహుశా యివాళే తెలియవచ్చును. ఆడుకో. ఆడుకో. ఇంకా యెంత సేపు ఆడుకుంటావు? ఇప్పుడు నీమనసువచ్చినచోటికి వెళ్ళవచ్చును.

ధీని—(తనలో) ఇవేళ యేదో వున్నది. ఇప్పుడు నేను వసంత శిలకవద్దకు వెళుతాను. (అని లోపలికి వెళ్ళుచున్నాడు)

కళా—వీడన్నట్లు నాకు విద్యారానిలోపం బాగా కనపడుతూ వున్నది. వీణ్ణయినా విద్యలో పుట్టివాణ్ణి చెయ్యవలెను.

(అని నడుచుచున్నాడు)

[అప్పుడు విద్యానాథుడు ప్రవేశించుచున్నాడు]

విద్యా—చంద్రికా! యెక్కడ వున్నావు?—ఓహోహో! కళా విదుషుగారు యిక్కడనే వున్నారా? మీరు యీదినం బహు సంతోషంగా వున్నట్టున్నారు.

కళా—విద్యానాథుడుగారా? రండి. ఇవేళ అప్పుడే బడి వదలి పెట్టి వచ్చినారేమి?

విద్యా—యిరాత్రి వూళ్ళోవుత్సవమని యిప్పుడే ఆటవిడుపు

యిచ్చినాను. మొన్నటిదినం మనం మాట్లాడినసంగతి యేమి ఆలో చించినాగు?

కళా—మీరు చెప్పినట్లే చెయ్యడానికి నిశ్చయించినాను.

విద్యా—మంచిపని చేసినారు. చిన్నవాళ్ళకు మంచిశిక్ష వుండ వలెను. బాగా శిక్షిస్తే నేకాని పిల్లలు యెప్పుడూ లొంగరు. నాబళ్ళో చదువ్రుకునే పిల్లవాళ్ళను నేను వకొక్కక్కప్పి రోజుకు డజను దెబ్బ లయినా కొట్టకుండా విడిచిపెట్టను. అందుచేత వాళ్ళకు యెంత విధే యత? యెంత భయము? యెంత సవ్యవ్తన? నాశిక్షలో వుంచడానికి మీకుమారుడు యిప్పుడు పెద్దవాడై పోయినాడేమో? యిప్పుడు సూళ్ళలో చదువుకునేవాళ్ళకు బొత్తిగా వినయ విధేయతలూ, పిన్న పెద్ద తారతమ్యాలూ యేమీ లేవు.

కళా—మీరు చెప్పినమాట సత్యము.

విద్యా—అలాగయితే మీఅబ్బాయికి సదా యింట్లో వుండి వినయవిధేయతలు నేర్పేగుర వుండవలెను.

కళా—అటువంటివాడే వుండవలెను.

విద్యా—బాగా ఆలోచించినారు. (తనలో) నే నయితే యిల్లు విడువకుండావుండి రెండుపూటలూ భోజనం చేస్తూ వుందును.

కళా—తెలివయినవాడు తక్కువజీతానికి రాడు. మాయింట్లో భోజనంపెట్టి ఆరునెలలవరకూ నెలకు యాభయ్యేసిరూపాయల చొప్పున జీతం యివ్వడానికి నిశ్చయించినాను.

విద్యా—(తనలో) నేనే యీపనికి తప్పకుండా తగినవాణ్ణి. (బిగ్గరగా) నెలకు యాభయి రూపాయలా? జీతం బాగానే వున్నది.

కళా—నేను యేర్పరచిన అయన బహుసమర్థుడు. అయన యీరోజున యిక్కడకు వస్తాడు.

విద్యా—(సంతోషముతో) ఆయన యిఖను వస్తాడా? యిది వఱకే యిక్కడికివచ్చి వుండలేదా?

కళా—యిదివఱకే వచ్చినున్నాడా? (అని తొంబరపడి చూచు చూన్నాడు)

విద్యా—మీరుచూడలేదా? (అని తాను ముందుకు వచ్చి నిలుచునాడు)

కళా—.మంచివుపాధ్యాయుడి సమిత్తము మీరు యెప్పుడు నాతో చెప్పినారో అప్పుడే పని చేసినాను. మాఅబ్బాయివిషయంలో యీవుపకారమంతా మీరు చేసిందే. మీమేలు నేను యెప్పుడూ మరిచిపోను. లోపలికి వెళ్ళవలెను. సెలవు పుచ్చుకుంటాను. (అని వెళ్ళు చున్నాడు)

విద్యా—అయ్యా! వక్కమాట. అప్పుడే వెళ్ళిపోయినాడు. సమయం వచ్చినప్పుడు పని నాకు యివ్వాకుండా మరివకడికి వేసినతరు వాత నామేలు మరచిపోయినా మరిచిపోకపోయినా వకటే. యిప్పుడు నన్ను మరచిపోయినారుగద?

[లోపలినుండి వచ్చి చంద్రిక ప్రవేశించుచున్నది]

చంద్రి—అయ్యా! యేమిటి ఆలోచిస్తూవున్నారు.

విద్యా—యింట్లోనే బస.

చంద్రి—యేమిటి?

విద్యా—రెండుమూట్లు పంక్తిని భోజనము, పుగా నెలకు యీభయి రూపాయలు.

చంద్రి—యేమిటి?

విద్యా—అన్నీ పోయినవి. మాబళ్ళోపిల్లలు యిచ్చే జీతా లన్నీ పోగుచేసినా నెలకు నాలుగయిదు రూపాయలకంటె యెక్కువ

రావు. యిప్పుడు వెళ్ళి నాబళ్ళో పిల్లలినందరినీ బాది వదిలిపెడుతాను. ఇంతమందిపిల్లలు యెందుకు? ధీనిధివంటివాడు వక్క-డుపుంటేచాలును.

చంద్రి—ధీనిధా?

విద్యా—ధీనిధి కాకపోతే ధీనిధితండ్రి. యెవరో వకరు. ఈము సలాయన తగినవాణ్ణి నేను యిక్కడవుండగా నామాట మరిచిపోయి తన కొడుక్కు గురువుగా వుండడానికి యెవడో బుద్ధిహీనుడుకోసం చెన్న పట్నం వాసినాడట. ఆనచ్చేవాడు యెనడో వేదజడు డయినశుద్ధశ్రోత్రి యుడయి వుంటాడు.

చంద్రి—అయ్యో! పాపం ప్రాణస్నేహితుడవు నీవూ లేమరచి పోయినాడా?

విద్యా—అయితే పెరటిచెట్టు యెప్పుడూ మందుకు రాదు. దూరపుకొండలు నునుపు. మనం అందరమూచేరి యిందులో వకవుపా యం చెయ్యవలెను. చంద్రికా! నీకు నేను పనిచేయించినందుకు నీవు నాకు సహాయం చెయ్యవలెను. ఆవచ్చే వుపాధ్యాయుడిమీద మనం అందరమూ అబద్ధాలు కల్పించి చెప్పి యీయింట్లో నిలువలేకుండా మూడుదినాలలో తోక తెంచుకుని పారిపోయ్యేటట్టు చెయ్యవలెను. మీరనవుకర్లందరూ చేరి అతణ్ణి నిత్యము యేడిపించవలెను. నేను వెళు తాను. అతడు రావడంతోటే నాకు కబురుచెప్పు. (అని వెళ్ళుచు న్నాడు)

చంద్రి—ధీనిధివిషయంలో చేసినకుట్రాలోచనంతో యిదా? నేను యిప్పుడేపోయి యీసంగతి ఆయనతో చెపుతాను. యెవరో యీప్రక్కకు వస్తూ వున్నారు. (అని చూచుచున్నది)

[ఉపాధ్యాయు డక్కడచానవడని భీముడు ప్రవేశించుచున్నాడు.]

భీము—మీవుత్తరంప్రకారంగా నేను యిప్పుడే వచ్చినాను.

నాతో పెట్టెలూ సామానూ యేమీ తీసుకొని రాలేదు. యీచిన్న మూటమాత్రం వక్కటి తెచ్చినాను. నేను ప్రయాణం చేసేటప్పుడు యెప్పుడూ సామానంతా యింటికాడనే దిగవిడచి వస్తాను. నేను వచ్చిససంగతి కళావిదుడుగారితో చెప్పడానికి యిక్కడ యెవరూ లేరా?

చంది)—(ముందుకు వచ్చి) మీరు యెవరు?

భీము—(చంది)కవంక తిన్నగాచూడక) ఓచిన్నదానా! నీవు పరుగెత్తుకునిపోయి యీవేళ వస్తారని యెసురుచూస్తూవున్న పండితుడు గుర్రపుబండియెక్కివచ్చి యిప్పుడే మీగుమ్మమువద్ద దిగినా రని కళా విదుడిగారితో చెప్పు. వేగిరం వెళ్ళు.

చంది)—ఆయనే యీయన కాబోలును. అక్కడక్కడ మని షిని పోలినమనిషి వుంటూవుంటాడు. (అని వెనుక తిరిగి చూచుచు మెల్లగా వెళ్ళుచున్నది.)

భీము—ఈమనిషి నాకేసి యెంగా తేరిపార చూస్తూవున్నదో. ఇది నన్ను దెయ్యమనుకున్నదో భూతమనుకున్నదో! ఇక్కడ నన్ను యెవరయినా ఆనవాలు పడుతారేమో! నేను మావుపాధ్యాయులు గారివేషం బాగా వేసినాను. ఆయన యిక్కడ యీయనకొడుక్కి వుపాధ్యాయులుగా వస్తానని వప్పుకున్నప్పటికీ యీమధ్య జ్వరం రావడంచేత రాలే నని వుత్తరంవ్రాసి టపాలో వెయ్యమని నాచేతికి యిచ్చినారు. ఆ వుత్తరం నేను టపాలో వెయ్యకుండా యీచొక్కా జేబులో వేసుకున్నాను. దుమ్ము దులిపించి తెస్తా నని ఆయన పాత శాలూ పుచ్చుకుని చొకలిదానియింటికి వెళ్ళి ఆయనబట్టలు పుచ్చు కుని యీవేషం వేసినాను. నేను అద్దంలో చూచుకుంటే అచ్చంగా సుసంస్కృతశాస్త్రుల్లగారులాగే వున్నాను. నేను సరిగ్గ మహామహో

పాధ్యాయతర్క-పంచాననులవారిలాగున వుండడానికి సందేహం లేదు. భోజనంకాకుండా నెలకు యాభయిరూపాయలు వస్తవి. వక్క-నెల వచ్చినా వచ్చినవే. యెందుకు పోగొట్టుకోవలెను? మావాళ్ళను చూచి రావడానికి నేను మాశాస్త్రుల గారివద్ద నెల్లాళ్ళు సెలవుపుచ్చుకున్నాను. యిఖ చదువుమాట విచారించవలెను. మాశాస్త్రుల గారు పండితులతో ప్రసంగాలు చేస్తూవుంటే చాలాకాలంనుంచి వింటూ వుండడంచేత నాలుగు సంస్కృతంముక్కలు పట్టుకున్నాను. అవి కొన్నాళ్ళుచాలును. ఆచిన్ననాడికి నాస్వభాష బాగా నేర్పుతాను. అరుగో ఆయన వస్తూ వున్నారు.

[అప్పుడు లోపలనుండి కళానిధుడు ప్రవేశించుచున్నాడు]

కళా—(ముందుకు వచ్చి నమస్కారముచేసి) స్వామీ! మీ దర్శనం కావడం నేడు సుదినం. మాగృహం పావనమయింది. మహా మహోపాధ్యాయతర్క-పంచాననులవా రంటే లోకప్రసిద్ధిగా వున్నది. అటువంటిలో కైకపండితులు నాకుమారుడికి గురువులు కావడంకంటె యెక్కువ అదృష్టం యేమివుంటుందీ?

భీము—మీరు వూరికే నన్ను ముఖస్తుతి చేస్తూవున్నారు. తమవంటిసుజనుల్ని చూడడంచేత నాకు బహుసంతోషంగా వున్నది.

కళా—మీరు మహావినయసంపన్నులు. మిమ్మల్ని మీయెదుట స్తుతిచెయ్యడం మీకు యిష్టంలేదు.

భీము—యెంతమాత్రమూ యిష్టం లేదు. మీరునిజంకని పెట్టినారు

కళా—నేను చదువుకున్నవాణ్ణి కాకపోయినా నాకు విద్య అంటే మహాఅభిలాష.

భీము—మీవిద్యాసక్తి అంతా నాబంటిపండితుల్ని పిలిపించడం లోనే తెలుస్తూవున్నది. నాచిన్నశిష్యుడు యెక్కడవున్నాడు? నాకు

తెలిసినదంతా ఆబాలుడికి మర్మం విడిచి చెపుతాను. నేను చెప్పినట్లు విని నేర్చుకుంటే నేర్చుకోవడానికి యెంతోకాలం పట్టదు.

కళా—మీరు అతణ్ని పసిపిల్లవాడనుకుంటూ వున్నారు. అంతపసివాడు కాడు. అతనికి యిరువయివొక్క—

భీము—యిరువయివకటా? (తనలో) యిరువయివక్క—మాసం కాబోలును.

కళా—అతను యిదివరకే కొంతచదువుకున్నాడు.

భీము—అలాగా? నేను అతడు పసిపిల్లవాడనుకున్నాను.

కళా—కాడుకాడు. అతను యీనాడే యింగ్లీషులోబి యే పరీక్ష ప్యాసుఅయినాడు. సంస్కృతంకూడా చాలావచ్చును.

భీము—అలాగైతే నేను అతగాడివిషయమై విశేషప్రయాస పడవలసినపని లేదు.

కళా—అతనికి కొంచెము వ్యాకరణమూ, తర్క-మూ, అలంకారశాస్త్రమూకూడా తెలుసును.

భీము—అంతా యిదివరకే తెలిస్తే నేను యిప్పుడు క్రొత్తగా చెప్పేది యేమున్నది?

కళా—మీరు అతనికి శాస్త్రాలలో మెరుగులు చెప్పవలెను. ముఖ్యంగా సత్ప్రవర్తన నేర్పవలెను.

భీము—ఓహోహో! మెరుగులా? యిప్పుడు బోధపడ్డది. అవి వక్క-నిముషంలో నేర్పుతాను. (తనలో) చెప్పులజోళ్ళకు మెరుగు పెట్టడమూ, వెండి బంగారపు వస్తువులకు మెరుగు పెట్టడమూ, అద్దాలకు మెరుగు పెట్టడమూ, అన్నీ నేర్పుతాను.

కళా—అతనికి వినయవిధేయతలూ మర్యాదలూ అన్నీ నేర్పవలెను. ఇంగ్లీషు చదువుకోవడంచేత వచ్చిన అవిధేయత ముఖ్యంగా

పోగొట్టవలెను. తమకు విశద మయిందా?

భీము—అంతా తెలిసింది. ఇఖ మీరు నాకు వేరే చెప్పనక్కర లేదు. నేను అతనికి నవుకర్లతో కలిసిమెలసి వుండకుండా వుండడమూ వాళ్ళమీద కోపపడకుండా వుండడమూ వాళ్ళకు లేనిపోనిపనులు చెప్పకుండా వుండడమూ, మొదలయినగృహనీతులుకూడా బోధ చేస్తాను.

కళా—అవీ చెప్పవలసినవేకాని, అవి అంత ముఖ్యమయినవి కావు.

భీము—కావు. ఆసంగతి నాకూ తెలుసును. అయినాకానీ చిన్న వని వాటినీ అలక్ష్యం చేయరాదు. నేను చెప్పవలసినవి లక్ష వున్నవి. అందులో మిక్కిలి స్వల్పమయినవి ముందుగా చెప్పేనాను. నాచెప్పే మోస్తరంతా మీరే చిత్తగిస్తారు.

కళా—సమస్తమూ తెలిసినమీతో నేను మనవిచెయ్యవలసినది యేమీలేదు. అయినాకానీ వక్కమాట మీచెవిని వెయ్యవలసి వున్నది. అతనికి నామేనకోడలయిన వసంతలీకమీద మోహం విస్తారంగా వున్నది. దాన్ని యితని కిచ్చి వివాహం చెయ్యవలననే, ఆచిన్న దాన్ని నేను చిన్నప్పటినుంచీ తెచ్చి యింట్లోవుంచుకుని విద్యాబుద్ధులు చెప్పిస్తూవున్నాను. అది యిప్పుడు యౌవనవతియై వున్నది. వాళ్ళ యిద్దరికీ వివాహం చెయ్యతలచుకున్నాను. కాని యిప్పుడే కాదు. నా భావం తమరు గ్రహించినారా?

భీము—గ్రహించినాను. మెరుగులన్నీ గ్రహించినదాకా పెళ్ళి చెయ్యదలచుకోలేదు.

కళా—(తనలో) తుదకు మంచివుపాధ్యాయుడు దొరికినాడు. (బిగ్గరగా) తమపడకకూ సామానులకూ గదులు చూపిస్తాను. ఈవూళ్ళో మీతోప్రసంగాసికి విద్యానాధుడని వక వుపాధ్యాయుడు వున్నాడు.

ఆయన పాండిత్యానికి మీతో సమానుడు కాకపోయినా, చిన్న తనంలో చాలా సంస్కృతం చదువుకొన్నవాడే. ఆయనను పిలిపించి మీదర్శనం చేయిస్తాను. (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు)

భీము—(తనలో) యీయింట్లో నేను యెలాగు నెగ్గుకువస్తానో!

కళా—ఎవడురా నవ్వుకర్లు?

భీము—అయ్యా! వచ్చెవచ్చె. (అని పరుగెత్తుచున్నాఁడు)

కళా—(ఆశ్చర్యముతో) ఇదేమిటి?

భీము—నాతాత్పర్యం మీనవ్వుకరువచ్చెనని. (తనలో) అయ్యో! అప్పుడే తంటాలు వస్తూవున్నవి. ఇఁక జాగ్రతగా వుంటాను.

[తాళముచెవులు తీసికొని చంద్రిక ప్రవేశించుచున్నది]

కళా—చంద్రీ! నీవు వెళ్ళి యీయన గాగది చూపించు. అయ్యా! నేను యిప్పుడే మీశిష్యుణ్ణి పంపుతాను.

(అని వెళ్ళుచున్నాఁడు)

చంద్రి—ఇత డత డయినందుకు యెంతమాత్రమూ సందేహం లేదు. (ఇద్దరును గదిలోనికి వెళ్ళుచున్నారు)

---

౫ రంగము — చదువుకొను గది.

[మహామహోపాధ్యాయతర్కపంచాననుని వెంట బెట్టుకొని చంద్రిక ప్రవేశించుచున్నది]

చంద్రి—ఇది మార్గము. ఇలాగండి. ఆయన లోపల వున్నారు.

భీము—(తనలో) ఈ విద్యానాథుడు ననుఁ వూరికే బాధపెడు తూవున్నాడు. అయినాకానీ నావిద్యార్థి తండ్రి ముసలాయన వెర్రి బాగులవాడులాగు కనబడుతూ వున్నాడు. కాబట్టి నేను వీరియింట్లో సుఖంగాతింటూ జీతంపుచ్చుకుని పనిలేకుండా వూరికేకూర్చోనచ్చును,

చంది)—ఇఖ నేను మనసుపట్ట లేకుండావున్నాను— ఓయీ! భీమా!

భీము—ఆపిలిచింది యెవరు? అయ్యో! నాకిప్పుడు మతి పోతూ వున్నది.

చంది)—అవును అతడే.

భీము—(చంది)కవంక చూచుచు తనలో) ఓహోహో! నే నప్పుడు పెళ్ళి చేసుకుంటానన్న చిన్నది యిక్కడికివచ్చింది! నేను నేను కానని దీనిదగ్గిర పరిమాణాలు చేస్తాను. (బిగ్గరగా) అమ్మా! నీవు చాలా శ్రమపడి నన్ను యిక్కడకు తీసుకుని వచ్చినావు.

చంది)—దున్నపోతా! నన్ను యెరగనట్లు నటిస్తావేమి?

భీము—(తనలో) ఇ దెక్కడిగ)హచారం! నేను యీ భూమి మీద అసలే పుట్టకపోతే బాగావుండిపోను. ఎరక్కపోయి పుట్టినాను. (బిగ్గరగా) నీతోడు! నిన్ను నేను నిజంగానే యెరగను. (తనలో) దీని ముఖం యెలా వెల వెల పోతూ వున్నదో!

చంది)—(ఏడ్చుచు) నీ మాటలవల్ల నాకడుపు పగిలి పోతూ వున్నది.

భీము—(తనలో) ఇది యేడవడానికి మొదలు పెట్టింది. ఇఖ వూరుకునేటట్లు లేదు. (పయికి) ప్రియురాలా! కాదుకాదు. అమ్మా! నీవు నీవే కాని, నేను అతణ్ని కాను. నీవు నన్ను చూచి నిన్నుమోసం చేసిన నిర్భాగ్యుడని భ్రమపడుతూ వున్నావు. (తనలో) అయ్యో! నాకు చావు వాసింది. మగవాళ్ళనాశనానికి యెక్కడా ఆడవాళ్ళు కారణం.

చంది)—(ఏడ్చుచు) నేను నీదుర్మార్గం అంతా బయిట పెడు తాను వుండు.

భీము—అలాచేస్తే మనం యిద్దరమూకూడా చెడిపోతాము,

నీముందులాభం చూచుకో. నేను నీప్రియుణ్ణి భీముణ్ణిసుమా. ఇప్పుడు మాత్రం మహామహోపాధ్యాయుణ్ణయి వున్నాను.

చంద్రి—ఎవడవైనా ననున్న వదిలిపెట్టకూడదు. (అని యేడ్చుచున్నది)

భీము—కళ్ళనీళ్ళు తుడుచుకో! నేను యెప్పుడూ నీడాసుణ్ణే. (అని కాళ్ళమీద పడుచున్నాడు)

[ఇంతలో కళావిదుడు ప్రవేశించుచున్నాడు]

భీము—ఓయి దేవుడా! ఇఖ నాకు బ్రతికేయోగం లేదు.

చంద్రి—అయ్యో! (అని తాళముచెవు లాతనముందు పడవేసి లోపలికి పరుగెత్తుచున్నది)

కళా—(వులికిపడి వెనుకకు రెండడుగులు నడచి) ఏమి యీవింత! ఇప్పుడు నాకళ్ళపడ్డది యేమయి వుంటుంది?

భీము—అయ్యా! ప్రమాణపూర్వకంగా చెపుతాను. నేను కాళ్ళనీళ్ళ—కాదు—నేను మోకారించుకుని కూర్చున్నానని మీరు భ్రమ పడ్డట్టున్నారు. అది వట్టిభ్రమేకాని యెంతమాత్రమూ సత్యం కాదు. నేను కాస్తయినా మోకారించుకుని కూర్చోలేదు.

కళా—ఓ పండితసార్వభౌమా! మీ రింకా ఆలాగే కూర్చున్నారే.

భీము—(తాళము చెవులు చేత పట్టుకొని) ఇది మోకారించుకొని కూర్చోవడం లాగు పయికి కనపడుతుంది కాని నిజంగా మోకారించుకోవడం కాదు. (లేచి) అచిన్నది యిక్కడ తాళంచెవులు పారవేసి పోయింది. నేను భరతశాస్త్రప్రకారంగా వాటిని తీసుకుంటూ వున్నాను. అంతేకాని మరియేమీ కాదు.

కళా—కాదుకాదు. మహామహోపాధ్యాయులవారు శృంగార

నాయకులుగా కనపడుతూ వున్నారు. పండితు లెప్పుడూ మహారశికులు గదా.

భీమ—అదికాదు. ఇది కేవలనత్రమత. వినయం పండితలక్షణము.

కళా—ఇది యేదో అపూర్వపండితలక్షణం కాని సామాన్య మయింది కాదు.

భీము—(గంభీరముగా) యిప్పుడు నాకంటె మీరే గొప్పపండి తులయినట్టు నటిస్తూవున్నారు. నాకంటెనూ మీకు యెక్కువ తెలు సునని గర్వం వున్నదా యేమిటి?

కళా—నాకు అటువంటి గర్వం లేదు.

భీము—ఇప్పుడు నాకు సంతోషంగా వున్నది. నాకంటె మీకే యెక్కువ పాండిత్యం వున్నట్టు గోపల మీకు వూహా వున్నట్టయితే మీరు యిచ్చే యాభయిరూపాయలూ నేనే మీకు యిచ్చి మీచేత నాపిల్లలకు నేనే చదువు చెప్పించవలసి వుంటుంది.

కళా—మీరు చెప్పింది సత్యం. ఇఖ ఆసంగతి పోనియ్యండి. మాఅబ్బాయిని మీకు వప్పగింత పెట్టడానికి వచ్చినాను. అరుగో మా ధీనిధినీ విద్యానాధుడుగారున్ను వస్తూవున్నారు.

[విద్యానాధుడును, ధీనిధియు ప్రవేశించుచున్నారు]

భీము—వారు రావడం నాకు సంతోషంగా వున్నది.

కళా—ఓ విద్యానాధా! మహామహోపాధ్యాయులవారు వీరే.

భీము—(విద్యానాధునితో) మీదర్శనం లభించడంవల్ల నేడు సుదినం.

విద్యా—అది నేనసవలసినమాట. (అని అసూయతో మొగము త్రిప్పుకొనుచున్నాడు)

కళా—స్వామీ! వీడే నాకుమారుడు.

భీము—ఇతడు బహుమంచి చిన్నవాడు.

ధీని—(తనలో) అవును. చందికచెప్పినది నిజమే.

విద్యా—(తనలో) ఇప్పు డేలాగైనా యీపండితుడి గర్వం అణచవలెను. (భీమునివద్దకు వెళ్ళి) అయ్యా! మీరు వుపదేశించే విద్య యొక్క- పధకం నాకు కొంచెం సెలవిస్తారా?

భీము—కొంచెం యేమిటి? అంతా సెలవిస్తాను. మాది పాత పతకం.

కళా—అబ్బాయీ! విను. ఈపండితులపరిసంగం వింటే నీకు చాలాసంగతులు బోధపడతవి.

విద్యా—మీది పాతపతకమా? అందులో మీరు నవద్వీపంలో చెప్పేపద్ధతిపరికారం బోధ చేస్తా రనుకుంటాను.

భీము—(తనలో) నవద్వీపం యేమిటో నాకు తెలియకుండా వున్నది. అది యేదో లంక. (బిగ్గరగా) నాది నవద్వీపంలో చెప్పే పద్ధతికాదు. దశద్వీపంలో చెప్పే పద్ధతీ కాదు. నాది లక్షద్వీపంలో చెప్పే పద్ధతి. తెలిసిందా?

విద్యా—(తనలో) ఇతనిమాటలు నాకు తిన్నగా బోధ పడడం లేదు. యితణ్ని మరివకపరిశ్న అడిగి చూస్తాను. (బిగ్గరగా) మీరు చెప్పింది తెలిసింది. మీది కాశీలో చెప్పేపద్ధతి పరికారంగా వుంటుంది కాదా?

భీము—కాశీలోనా? నేను యెప్పుడూ కాశీ వెళ్ళలేదు. నాకది తెలియదు. నేను చాలాకాలం కంచిదగ్గర వున్నాను. కంచిలో చెప్పే పద్ధతి నాకు బాగా తెలుసును.

విద్యా—(తనలో) ఇతడు చూస్తే వట్టిమూఢుడులాగు కన పడుతూ వున్నాడు. ఇతణ్ని వోడగొట్టివేస్తాను. (బిగ్గరగా) మీకు

మీమాంసలో బాగా ప్రవేశం వున్నది కదా?

భీము—మీమాంసం లేదు మామాంసం లేదు. ఏ దయినా మంచిప్రశ్న వెయ్యండి. పండితులతో చేసే ప్రసంగం యాలాగంటి దేనా? అడిగితే తర్కంలో అడగండి, వ్యాకరణంలో అడగండి, ఇంకా యేదయినా శాస్త్రంలో అడగండి. వూరూ పేరూ లేని మీమాంసం యేమి టయ్యా? నేను యెప్పుడూ మాంసంజోలికి పోను. అది శూద్ర యిళ్ళలో వుండేనవుకర్లపనిగాని నాపని కాదు.

విద్యా—(తనలో) ఇతడు మహాశాస్త్రవేత్తలాగుననే వున్నాడు. (బిగ్గరగా) ఏమిటీ యిప్పుడు సెలవిచ్చినారు? మీమాంస శాస్త్రం కాదా?

భీము—చాలును యీపాటివూరుకోండి. నేను మీతో యెంత మాత్రమూ యేకీభవించను. మీపాండిత్యం వేరు. మాపాండిత్యం వేరు. వకరిది వకరికి సరిపడదు.

విద్యా—అవును సరిపడదు.

భీము—ఎలా సరిపడుతుంది? పండితుడికీ పండితుడికీ కలుస్తుంది కాని మిడిమిడిజ్ఞానంగలవాడితో యెలా కలుస్తుంది?

విద్యా—మీశక్తి నాకు తెలిసిపోయింది. మిమ్మలిని నేను నిముషంలో ఓడగొట్టగలను.

భీము—నీవు యెప్పుడో ఓడగొట్టగలనంటూ వున్నావుగాని నేను నిన్ను యిప్పుడే ఓడగొడుతాను చూడు. ఇదుగో కాసుకో నాడెబ్బ. (అని పిడికిలి పట్టి చేయెత్తి విద్యానాథునిమీదికి తేచు చున్నాడు.)

కళా—(లేచి విద్యానాథు నావలికి త్రోచి) మీరు యిప్పుడు పొళ్ళండి.

విద్యా—(కోపముతో తలయూచుచు) దిత్తము.
(అని పోవుచున్నాఁడు)

భీము—(బిగ్గరగా నఱచుచు) ఫో-ఫో- నీవూనీమాంసంకూడా విరగడయిపొండి—ఈచదువులపంతులు వట్టి తెలివి తక్కువవాడని మీకందరికీ నిముషంలో తెలిసేటట్టు చేసినానా? అతడు తిన్నగా వాదం చెయ్యలేక తనచేతకానితనం కప్పిపుచ్చడానికి కోపం తెచ్చుకున్నాడు. లోపల సారంలేని. అల్పజ్ఞానులు చేసే మాయోపాయాలు యిలాగంటివే.

కళా—మీరు చెప్పింది సత్యము. అతణ్ని ఓడగొట్టగల సామర్థ్యం మీకుదగ్గిర వున్నదని నాకు యిదివరకే తెలుసును. అయినా కానీ యిప్పు డాయనశాంతమంతా పోయింది. నేను వెళ్ళి ఆయనను సముదాయించివస్తాను. ఈలోపుగా మీరూ మీశిష్యుడూ వకరిసంగతి వకరు మాట్లాడుకుంటూ వుండండి. (అని వెళ్ళుచున్నాఁడు.)

ధీని—. శిష్యుడికి గురువుగారి సంగతి యిదివరకే బాగా తెలుసును.

భీము—ఈరోజున పరాభవం యేమీ లేకుండా నాకు జయం కలిగింది. దేవుడు నాకు గొప్పగొంతుక యిచ్చినాడు.

ధీని—ఏదీ సత్తువకొద్దీ వక్కమాటు అరుపు. ఎంత గొంతుక యిచ్చినాడో చూతాము.

భీము—అరవనా? అబ్బాయీ! నీవు నమ్రతా పెద్దలయెడల గౌరవమూ నేర్చుకోవలెను. గురువులవిషయంలో అలా యేకవచన ప్రయోగం చెయ్యవచ్చునా?

ధీని—నీగురుత్వం యేడిసినట్టే వున్నది వూరుకో. నీసంగతంతా నాకు చందికే చెప్పింది.

భీము—అటువంటిదానిమాటలు వింటే అది యింకా యేమి యినా చెపుతుంది.

ధీని—చాలునులే యీపాటి నోరు మూసుకో. నీవు భీము డవన్న సంగతి నేను స్వయంగానే యెరుగుదును. నిరుడు సంకురాత్రి నాడు చెన్నపట్నంలో మేమంతా నాయుడుగారిమేడమీద సంగీతం పాడించినప్పుడు నీ వక్కడ ఫిడేలు వాయించలేదా?

భీము—ఓస్నీ! ఇక్కడ నన్ను అందరూ యెరుగుదురూ! మీరు యిప్పుడు నన్ను కనుక్కున్నారుగనుక నేను ముఖ కపటంవిడిచి నిజం చెపు తాను వినండి. నేను భీమున్నే.

ధీని—నీవు యెంతమాత్రమూ భయం లేకుండా యీవేషం వెయ్యడానికి యేలాగు సాహసించినావు?

భీము—ఇది యేమివేషం? పూర్వం నేను సాహసంచేసి తహ శీల్దారువేషం వేసి సర్కారుగ్రామంలోనే దస్తు వసూలు చేసి నాను. అటువంటివేషం కూడా పట్టుపడకుండా తప్పించుకొని పారి పోయినాను.

ధీని—నీవు అఖండశక్తి గలవాడవు. మారహస్యం వకటి వున్నది. అది నీవు దాచేపక్షమునకు నీగుట్టు బయలపెట్టకుండా నేను దాస్తాను.

భీము—ఆలాగయితే మీరహస్యమూ ప్రతినెలా నాయాభ య్యేసిరూపాయలూ కూడా దాస్తాను.

ధీని—మంచిది రూపాయలు నీమనసు వచ్చినట్టు చేసుకో. భీమా! యిప్పుడు మనలో వకరిసంగతి వకరికి బాగా తెలిసింది. ఇక నేను చెప్పేమాట విను. ఈసాయంకాలము మాతండ్రిగారు యిక్క డకు కోసుమీరంలోవున్న మూత్తోట చూడడానికి వెళుతారు, ఆయన

మళ్ళీ రాత్రిపొద్దుపోయినడాకా యింటికి రారు. ఆయన వెళ్ళినతరువాత మేము సాయంకాలము వృత్తనం చూడడానికి వెళ్తుతాము. ఈ వేళ మాతండ్రిగారికి తెలిసి నిన్ను అడిగినట్టయితే మేము యిల్లుకదలి యెక్కడకూ వెళ్ళలే దని నీవు ప్రమాణముచేసి చెప్పవలెను. అందు నిమిత్తమయి కొన్ని యేర్పాటులు చేసిరావడానికి యీలోపుగా పక్క మాటు వీధిలోకి వెళ్ళవలసి వున్నది. నీవు యింతలో యీబట్టలు పింజెలు పెట్టి నేను లోపలినుంచి వచ్చేటప్పటికి తమలపాకులు చుట్టి సిద్ధంగా వుంచు.

భీము — నావంటి మహామహోపాధ్యాయుడికి యిటువంటివి చెప్పవచ్చునా?

ధీని—నోరుమూసుకో. నీవు భీముడవుకాదా? (అని మీద పడవేసి వెళ్ళుచున్నాడు)

భీము—అవును మరిచిపోయినాను. నెలకు యాభయి రూపాయలుపుచ్చుకునేటప్పుడు యేపనిచెప్పినా చెయ్యనలెను. (అని యేదో పాటపాడుచు బట్టలు పింజెలు పెట్టుచున్నాడు)

[కళానిధుడు ప్రవేశించుచున్నాడు]

కళా—శాస్త్రిగారూ! నేను మా తోటలోకి వెళ్ళకముందు మీతో—(బట్టలు పింజెలు పెట్టుచుండుట చూచి) ఇదేమిటి? మా అబ్బాయిబట్టలు పింజెలు పెడుతూవున్నారా?

భీము—(తనలో) అయ్యో! నాకు చావు వచ్చింది. యిప్పుడు యేమని బొంకను? (బిగ్గరగా) అవును. ఈవిషయంలో మీరు మరివక లాగు అనుకోకండి. వక్కనిముషం ఓపిక పెడితే మీకంతా తెలుస్తుంది. మీకుమూకుడి విషయంలో నేను చేసేపనులలో యిదికూడా వకటి.

కళా—ఇదంతా చూస్తే నాకు భింతగా వున్నది. వక్కనిము

షం కిందట మీరు మూడాసీదానికాళ్ళమీద పడ్డారు; ఇప్పుడు మా వాడిబట్టలు పిండెలు పెడుతూ వున్నారు. మీసంగతి యేమీ నాకు బోధపడడం లేదు.

భీము—అయివుండవచ్చును. మీరు వక్కనిముషం శాంతం వహిస్తే నాతాత్పర్యం యేమిటో మీకే విశద మవుతుంది.

ధీని—(వెలుపలనుండి) నాబట్టలు యిలాగుతీసుకునిరా. వేగిరం తీసుకునిరా.

భీము—అదుగో! అదుగో! అతను నాకోసం కనిపెట్టుకుని వున్నాడు. ఈబట్టలు అతనికి యిచ్చి మళ్ళీ వస్తాను.

కళా—కనిపెట్టుకుని వుండనియ్యండి. మీరు వెళ్ళకూడదు. వాడు గురువుగారియెడల గౌరవం నేర్చుకోవలెను.

భీము—(తనలో) అతను యిక్కడకువస్తే నాపరు వంతా పోతుంది. నాగుట్టు బయల పడుతుంది.

[ధీనిధి మహావేగముతో ప్రవేశించుచున్నాడు.]

ధీని—మొద్దులాగు యెంతసేపటికి నాబట్టలు తీసుకొనిరావేమి? నేను యిప్పుడు—(అప్పుడు తండ్రినిచూచి సిగ్గుపడి యూరకున్నాడు)

భీము—నీకుఅడ్డంయేమిటి? యిష్టంవుంటే వక దెబ్బకూడాకొట్టు (కళావిదునివంక దిరిగి) ఇదుగో యిప్పుడు చూడండి. మీకుమారుడికి సత్ప్రవర్తన యెలాగు నేర్పుతానో. (ధీనిధితో రహస్యముగా) నేను మీబట్టలు పిండెలు పెట్టేనంతకు తక్కణంసేపు మీరుమాట్లాడకుండా నేనుచెప్పేనీతులు వినండి. నేను మీకు యిప్పుడు వినయం బోధిస్తాను. (బిగ్గరగా) ఇదిగో నీబట్టలు పుచ్చుకో. ఇలాగు పెద్దలవిషయంలో అపచారం చెయ్యడంవల్ల పెద్దలకు యేమీలోపం రాదుగాని చిన్నవాళ్లే దుర్నయం పట్టుపడి చెడిపోతారు. ఇలా నడుచుకోవడం నీకు యెంతమా

త్రిమూ శ్రేయస్కరంకాదు. దీన్నిబట్టి నీవు పెద్దలయెడల భక్తి, నమ్రత నేర్చుకోవలెను. తెలిసిందా?

ధీని — తెలిసింది.(అనిసిగ్గునటించుచుతలవంచుకొనుచున్నాఁడు.)

భీము — ఓకళావిదుడుగారూ! ఆచిన్నవాడివంక చూడండి. అతడు తలవంచుకొని యెలాపశ్చాత్తాపపడుతూ వున్నాడో? దీనితో బుద్ధివచ్చింది. యితను యిఖ యెప్పుడూ పెద్దలయెడ అనిధేయతగా ప్రవర్తించడు.

కళా — ఇదంతా నాకు నిజంగానే అద్భుతంగా వున్నది.

భీము — (ధీనిధిక్కో) నేను యిప్పుడుబోధించిననీతి నీవుయెప్పుడూ మరిచిపోకూడదు. ఇదిశిలాక్షరంవలె నీమనస్సులో నాటుకొనివుంటుంది.

కళా — (తనలో) సందేహంలేదు. ఈయన గొప్పవాడే. (బిగ్గరగా) మీబోధ చేసేవిధం అద్భుతంగా వున్నది. ఈమోస్తరు నేనుయెక్కడాచూడలేదు. ఇప్పుడు నేనువచ్చినపని మీతో చెప్పడం మరిచిపోయినాను. నేను వక ముఖ్యమయిన సంగతి మీతో చెపుదామని వచ్చినాను. ఈసాయంకాలం వూళ్ళో వుత్సవం జరుగుతుంది ఇతన్ని యెంత మాత్రమున్ను మీరు వుత్సవంలోనికి వెళ్ళనియ్యకూడదు. నాబండి దాకా నాతో దయచెయ్యండి. ఈవిషయములో మీతో కొన్నిసంగతులు మనవిచెయ్యవలసివున్నవి. (అనిభీమునితోఁగూడ వెళ్ళుచున్నాఁడు)

ధీని — ఆహాహాహా! ఈభీమిగాడు నాఅదృష్టంచేత నాగురువుగా దొరికినాడు. ఏమినాభాగ్యము!

[వసంతతిలక పరివేశించుచున్నది]

వసం — మామగారు యిప్పుడే వెళుతూవున్నారు. యింకొక్క నిముషంలో యీయిల్లంతా మనస్వాధీనం అవుతుంది. మనంస్వేచ్ఛగా వుండవచ్చును. మనం యివేళ వుత్సవంలోకి వెళ్ళడం వున్నదాలేదా?

ధీని—కొంతసేపు శాంతం వహించు. ఆమ్మన కొంచెంమాగి సాగడంతోటే మనమూనడుతాము. నీకోసం బండిమూట్లూడివచ్చినాను.

వసం—కావలసినంతసేపు వహిస్తాను. నాకు మహాసంతోషంగా వున్నది. తన ముసలిసరసుడు భీముడు మీకు గురువుగా వచ్చినాడని చందిక యిప్పుడే నాతో చెప్పింది. (అని నవ్వుచున్నది.)

ధీని—అవును. (అనినవ్వుచున్నాడు)

[చందిక ప్రవేశించు చున్నది]

చందిక—కళావిదుడుగారు తోటలోకి వెళ్ళిపోయినారు. ఆమ్మన బండిలోయొక్కబోతూ వుండగా విద్యానాథుడిగారి బళ్ళోపిల్లవాడు వకడు వకవుత్తరం తీసుకునివచ్చి చేతికిచ్చినాడు. ఆవుత్తరం చూడగానే లోపల యేదోవిచారంగలిగి ముఖం చిన్నపోయింది. అయినాకానీ ఆయన ఆగకుండా వెళ్ళిపోయినాడు.

ధీనిధి—ఆవుత్తరంయేమయివుంటుంది? చేమీలేదు. ఆవుత్తరం జోలి మన కెందుకు?

చందిక—అంతేకాదు చెప్పనలసింది యింకా వున్నది. ఆయన వెళ్ళిపోయినతరువాత మీమహామహోపాధ్యాయులుగారు నాదగ్గిరకు వచ్చి నీతో కొన్ని రహస్యమైనసంగతులు చెప్పవలసివున్నవి. నీగది యొక్కడ నని నన్ను అడిగినారు.

వసం—నీవు నీగది అతనికి చూపించినావా?

చందిక—చూపించలేదు. అదుగోసని కిటికీమాత్రం చూపించి మీతోటో చెప్పడానికి పరుగెత్తుకుని వచ్చినాను.

ధీని—ఓప్రాణేశ్వరీ! దీనిమాటలుయేమివింటావే? అనతల వుత్స వంటో యీపాటి తమాషాలారంభమవుతవి. వెళ్ళిచూతాముర్రా.

(అందరును వెళ్ళుచున్నారు.)

3. రంగము—బజారులోని కొట్టుముందరి యరుగు.

[ధీనిధిమిత్రుడగు సుహృదుడును మఱిముగ్గురుమనుష్యులును ప్రవేశించుచున్నారు.]

సుహృ—రథం యీవీధినుంచి వెళ్లేవేళ కావచ్చింది. ధీనిధి యింకా వచ్చినాడుకాడేమి?

మొదటివాడు—ఆతడు తండ్రితో తోటలోనికి వెళ్ళినాడేమో!

సుహృ—వెళ్ళివుండడు. అతను యిక్కడికి ఆడంగులతోకూడా వస్తానని యీవుదయాన్న నమ్మకంగా చెప్పి వెళ్ళినాడు. స్త్రీలకోసం నేను యిక్కొట్టు ఖాలీ చేయించి వుంచినాను. మా స్త్రీలుకూడా వచ్చి వున్నారు.

రెండవవాడు—అడుగో బండీముందు ధీనిధి వస్తూవున్నాడు.

[ధీనిధియు, వసంతతిలకయు, చంద్రికయు ప్రవేశించుచున్నారు]

అందరు—ధీనిధిగారూ! దయచెయ్యండి. మేమందరమూ మీ కాకనిమిత్తమే యెదురు చూస్తూవున్నాము.

ధీని—మీరు నాకోసం కనిపెట్టుకుని వుంటారనే తొందరపడి సాధ్య మయినంత శీఘ్రంగా వచ్చినాను. యిగకా సంగీతం ఆరంభించి నారుకాకేమి?

సుహృ—ఫిడేలు వాయించే జోగడు యింకా వచ్చినాడుకాడు. ఫిడేలుమాత్రం పొద్దున్నే యిక్కడ పెట్టి పోయినాడు. వర్తమానం పంపుతే వాడు యింటికాడ కనపడలేదు

ధీని—ఫిడేలువాయించేవాణ్ణి మరియెవరినైనా చూడవలెను. వసంతతిలకా! మీరాగదిలోకి వెళ్ళండి. యీదారిని వెళ్లేతమాషా లన్నీ మీకిక్కడనుంచి కనపడతవి.

వసం—చంద్రీ! మనం లోపలికి వెళుదామురా. (అని వెళ్ళు చున్నారు.)

[అప్పుడు రోజాచు భీనుఁడు ప్రవేశించుచున్నాఁడు]

భీము—అయ్యో! నేనుచచ్చిపోతాను. నావీపు విరిగిపోయింది.

ధీని—భీమా! అదేమిటి?

భీము—ధీనిధీ! నీవు యిక్కడనే వున్నావా? అనంతా నీతో నిమ్మళంగా చెపుతాను. మీతండ్రిగారు నిన్ను యిక్కడికి వెళ్ళవద్దని చెప్పినారుగదా యెందుకు వచ్చినావు?

ధీని—ఆట్టే అధికప్రసంగం చెయ్యక వూరుకో. ఈయన సంగీతం పాడుతాడు. ఇక్కడ ఫిడేలు వాయించేవారు యెవరూ లేకుండా వున్నారు. కాస్త సేపు వాయిస్తావా?—ఓసుహృదా! ఇతనితో సమానంగా ఫిడేలు వాయించేవారు పురదేశంలో యెవరూ లేరుసుమా. ఆ ఫిడేలు యితని చేతికివ్వండి.

భీము—వద్దు వద్దు. అటువంటి నీచపు పని నాకు చెప్పడం మీకు ధర్మం కాదు. నేను మీగురువు నన్నమాట జ్ఞాపకం వున్నదా? గురువుకు మర్యాద చెయ్యవలెను.

ధీని—కావలసినంతమర్యాద చేస్తాను. నీకు మా అందరికంటెనూ వున్నతాసనం యిస్తాము. ఆగూట్లోకూర్చుని వాయించు. నామాటకు యెదురుచెప్పినావంటే చావగొడుతాను.

భీము—నలుగురిలోనూ నాగౌరవ మంతా పోతూ వున్నది. ఫిడేలుయిలా తెండి. (అని గూటిలోకూరుచుండి వాయించుచున్నాఁడు)

సుహృ—"బుద్ధిరాదు బుద్ధిరాదు—పెద్దల సుద్దులు వినక—యోగములభ్యసించిన యాగము లెన్నిచేసిన—" (అని శంకరాభరణము రాగముమీద శాస్త్రీయముగా పాడుచున్నాఁడు)

భీము—మేలు మేలు! (అని యుత్సాహముతో తల యెగరవైచుచు వాయించుచున్నాఁడు)

[ఆసమయములో కళావిదుఁడును, విద్యానాధుఁడును ప్రవేశించుచున్నారు]

కళా—ఇక్కడ ధీనిధిన్నీ మహామహోపాధ్యాయులుగారున్నూ కూడా వున్నారా?

భీము—(చటుక్కున ఫిడేలు వెనుకకు పెట్టుకొనుచు) ఇఖ నేను చెడిపోయినాను.

కళా—ఉపాధ్యాయులుగారూ? మీచర్యలు చూస్తే నాకు సహనం వుండకుండా వున్నది.

భీము—మీరుయిక్కడ నన్ను చూచినారుకాబోలును? ఇక్కడ నేను వున్నమాట నిజమే కావచ్చునుకాని యిందులో నాతప్పితం యేమీలేదు. మీరుదగ్గిర శలపుపుచ్చుకుని నేను వస్తూవుండగా యిక్కడ నాకు ధీనిధి కనపడ్డాడు. అతణ్ని యింటికి తీసుకుని వెళ్ళడానికి నేను యిక్కడ వున్నాను. మీకిది స్పష్టముగా కనపడడం లేదా?

కళా—అదే నిజమైతే మీరు గూట్లో కూర్చుని తలతిప్పుతూ ఫిడేలు యెందుకువాయిస్తూ వున్నారు?

భీము—వాయించకపోతే వీళ్ళు కొట్టిపోతారని ఫిడేలు వాయిస్తూవున్నాను ఇఖ గూట్లో కూర్చోనడానికి కారణం వినండి. ఇది వున్నత స్థానము నావంటి మహామహోపాధ్యాయులకు అర్హమైనది.

కళా—ఇఖ నీమాటలు నేను యెంతమాత్రమూ నమ్మను.

విద్యా—ఇందాకా వీణ్ని చీపురుకట్ట పుచ్చుకుని వీపు బద్ద లయ్యేటట్టు కొట్టినాను. ఈసారికొడితే తల బద్దలకొడుతాను.

భీము—తలబద్దలు కొట్టడానికి నీతాతతరంకాదు. నేను యిక్కడ ఘరానా మనిషిలాగు నడుచుకుంటూ వున్నాను గాని చిల్లరమనిషి లాగు ప్రవర్తించడం లేదు.

కళా—మీవంటి ఘరానా మనుష్యులున్ను పండితులున్ను

నామేనళోడలివద్ద వున్న దాసీదానివంటిదాన్ని పెళ్ళి చేసుకోవడానికి ప్రయత్నం చేస్తారా?

భీము—నావంటి పండితుల కటువంటి భేదాలు వుండవు. నా దృష్టికి గొప్పవాళ్ళూ కొద్దివాళ్ళూ సమానమే. విద్యానాథా! చంద్రిక దగ్గిర యే మయినా డబ్బు వున్నదా?

విద్యా—అది నూరు రూపాయలు నాకు బదులిచ్చింది. అది నిన్ను పెళ్ళాడే టట్టయితే దాని నూరురూపాయలూ తక్షణం పార వేస్తాను.

భీము—ఆరూపాయిలూ యివ్వండి. నేను చంద్రికను పెళ్ళాడు తాను.

సుహృ—(ముందుకువచ్చి) నీపెళ్ళిలో నన్ను సంగీతం పాడడా నికి పిలుస్తావా?

భీము—రేపు ధీనిధికిన్ని వసంతతిలకకున్ను పెండ్లి అయ్యే టప్పుడు మా పెళ్ళికూడా వారిపెళ్ళితోనే అవుతుంది. అప్పుడు నీవువచ్చి సంగీతం పాడుదువుకానిలే.

కళా—వాళ్ళయిద్దరికీ రేపు పెళ్ళిఅవుతుందని నీతో యెవరు చెప్పినారు?

భీము—యెవరూ చెప్పలేదు. నేను వూరికే అనుకున్నాను.

కళా—నీవు శుద్ధదొంగవు. నీసంగతంతా నేను కనుక్కున్నాను. ఈవుత్తరంవల్ల నిజమయిన మహామహోపాధ్యాయ తర్క పంచా ననులవారు రావడానికి వప్పుకోనట్టు కనపడుతూవున్నది. నీవు ఆయన పేరు పెట్టుకుని దొంగవేషం వేసుకుని వచ్చినావు. నీవు యెవరు?

ధీని—నామాట వినండి. నేను యితడ్ని బాగా యెరుగుదును. కాలకర్మదోషంచేత యితడు యిప్పుడు యీవేషం వేసుకుని వచ్చినా,

ఇతడు బహుమంచివాడున్ను కష్టపడి పగిచేసేవాడున్ను. చంద్రికకు యితను తగినవరుడు. చంద్రికను యితనికి వినాహంచేయించి యితణ్ణి మనయింట్లో నవుకరీకి వుంచుకుందాము. ఇతనిదగ్గిర దొంగతనము లేదు. పరులసొమ్ము గమ్మిడీ హరించడు. బహునమ్మిక మయినవాడు.

భీము—ఆవిషయంలో మీరేమీ సందేహించకండి. పెళ్ళయిన తరువాత కొన్నాళ్ళు మీయింట్లో వుంచుకొని పరీక్షచేసి చూడండి. నాపేరు భీముడు. నేను వెనకటి భీముడిలాగు పనిచేస్తాను. ఈసభవారితో వక్కమనవి చేసుకుంటాను. యిఖముందు అయ్యగారి యింటికి మీరు వచ్చినప్పుడు మీకందరికీ తలుపులు నేనే తీస్తూవుంటాను.

కళా—నీవు అసాధ్యుడవు. యీపాటి యింటికి వెళుదాము నడవండి.

(అందఱును వెళ్ళుచున్నారు)

యోగనిద్రాప్రహసనము

ఈనాటకమునందు వచ్చుపాత్రములు.

మతిమంతుఁడు — యోగశాస్త్రాభ్యాసము చేయుచున్న యొకవృద్ధుఁడు.

సుబలుఁడు — మతిమంతుని మేనల్లుఁడు.

సదానందయోగి — భూతవైద్యము తెలిసినయోగి.

గజాననదాసు — వైద్యుఁడు.

రాముఁడు — మతిమంతునిసేవకుఁడు.

సుమతి — మతిమంతునికూఁతురు.

గౌరి — మతిమంతుని యింటిదాసి.

రంగము — మతిమంతుని యిల్లు.

[సుమతి ప్రవేశించుచున్నది]

సుమ — వొంటరిగాకూర్చుంటే యేమీ తోచకుండావున్నది. మాట్లాడడానికి వక్కరాముఁడుతప్ప మరియెవరూ కనపడరు. వాఁడు యెప్పుడూ యేదోసణుక్కుంటూవుంటాడు. నాన్నగారు యోగపుపిచ్చి లోపడి రాత్రిపగలూ ముక్కుమూసుకుని కూర్చుంటూ పాతతాటాకులపుస్తకాలు ముందు వేసికొని ఆకులు తిరగవేస్తూ రెండోధ్యానం లేకుండా వున్నారు. ఆపిచ్చిపుస్తకాలచేత ఆయనకు మతి పోతూవున్నట్లున్నది. అదుగో యేదో చప్పుడవుతూ వున్నది. (చూచి) రాముఁడు పుస్తకాలకట్ట కింద పడవేసినాడు. ఓరీ! రామా! యేమిటి చేస్తూవున్నావు?

[అప్పుడు రాముడు ప్రవేశించుచున్నాడు]

రాము—యేమీ చెయ్యడంలేదు. పుస్తకాలు చేతులోనుంచీ జారిపోయినవి. దిక్కుమాలినపుస్తకాలు వొక్కొక్కటి నాలుగేసిమళ్ళ బలువు వున్నవి. ఈగదిలోకి తీసుకురావలసినవి యిటువంటివి పదిపుస్తకాలున్నవి. ఈపొస్తకం కాలిమీద పడి కాలివేళ్ళన్నీ నలిగి పోయినవి. (అసిచేతిలోని పుస్తకములు బల్లమీద పెట్టుచున్నాడు)

సుమ—(నవ్వుచు) ఆపుస్తకం కింద పడవేసినందుకు నాన్న గారు కోపపడుతారేమో!

రాము—.నేనుపడవెయ్యలేదు. దానంతట అదేపడ్డది. చేతులో వుండకుండా పసిపిల్లకాయలాగు జారి కింద పడ్డది నాతప్పితం యేమీ లేదు.

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—వస్తూవున్నాను. వచ్చె వచ్చె—అమ్మగారూ! చూచి నారా ఆయన యెలాగు తొందరపెడుతూ వున్నారో?

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—.తొందరపడకండి. వస్తూవున్నాను. ఇక్కడ నేను ఆదుకోవడంలేదు. (అని కిందపడ్డపుస్తకమును చేతితో తీయుచున్నాడు)

[అంతట మతిమంతుడు ప్రవేశించుచున్నాడు]

మతి—రామా! మిగిలిన పుస్తకాలు నీవు యివేళ యిక్కడకు తీసుకునిరావడం వున్నదా? రోజంతా యిక్కడనే వుంటావా?—అమ్మాయీ! నీవూ యిక్కడనే వున్నావా?

సుమ—యిప్పుడేవచ్చినాను. తోటలో నాకు సంపెంగపువ్వులు కోసి యిస్తామన్నారు వస్తారా?

మతి—యిప్పుడు రావడానికి తీరుబడిలేదు. నేను యిప్పుడు

పుస్తకంలో ప్రాణాయామాన్నిగురించి చదువుతూ వున్నాను. అది అర్థం కావడం లేదు. అది గ్రహిస్తే నేకాని నేను యెక్కడికీ రాను—— ఓరీ రామా! మాటలు ఆలకిస్తూ అలా నిలుచున్నావేమి? నీవు కింద కూర్చుండి పుస్తకాలన్నీ బల్లమీద నయసగా పెట్టు.

రాము——చిత్తము. (అని యొకపుస్తకము క్రిందవేసి దాని మీద కూర్చున్నాడు)

మతి——ఓరి పశువా! పతంజలిమీద కూర్చున్నావేమిరా? లేలే. అపచారం వస్తుంది. అతను యెవరనుకున్నావు? మొట్టమొదట యోగ సూత్రాలు చేసినమహానుభావుడు.

రాము——అపచారం రావడానికి నేను యెవరిమీదా, మనిషి మీద కూర్చోలేదు. బట్ట బుర దవుతుం దని యెందుకూ పనికి మాలిన యీపాతతుక్కు-పుస్తకంమీద కూర్చున్నాను. కింద మనిషి వుంటే మనిషికూర్చోవడానికి నాకంత బొత్తిగా కళ్ళు కనపడ వను కున్నారా యేమిటి?

మతి——అది పనికిమాలిన పాతతుక్కు-పుస్తక మట్రా? దాని విలువ చదువురాని శుద్ధపశువువు నీకు యేమి తెలుస్తుంది? నేను నిన్నటి రోజల్లా కష్టపడి అంటలుకట్టుకూపోయిన పత్రాలన్నీ జాగ్రత్తగా విడ దీసి పురుగులు దులిపివేసి కట్టకట్టినాను. రెండువ్యాఖ్యానాలతో వున్న దాన్ని పనికిమాలినతుక్కంటావురా?

[అప్పుడు మతిలో నొకయుత్తరము పట్టుకొని గౌరి ప్రవేశించుచున్నది]

గౌరి——అయ్యా! మీకు టపాలో వుత్తరం వచ్చింది. (అనిచేతి కిచ్చి వెళ్ళుచున్నది)

మతి——ఏమిటీ! వుత్తరమా? ఆగమశాస్త్రవేత్త అయిన గౌరీపతి శాస్త్రుల దగ్గరనుంచి కాబోలును. (అని చూచి) కాదు కాదు.

ఈవుత్తరం తరువాత నెమ్మదిగా చదువవచ్చునులే. (అని కిందపడ వేయుచున్నాడు)

సుమ—నాన్నగారూ! మీరు వుత్తరంవిప్పి చదువుకోకుండానే కిందపడవేసినారు. దానిలో యేవయినా జరూరుసంగతులున్నవేమో! నేనువిప్పి చదువుదునా? (అని యుత్తరము పుచ్చుకొని చూచి) దీని మీద పెద్దాపురంముద్ర వున్నది. ఇది మామయ్యదగ్గరనుంచి వచ్చింది వేగిరం చదవండి.

మతి—(ఉత్తరమువిప్పి చదివి) పిచ్చివాడా! ఇదిబాగానేవున్నది. అంతకంతకు పిచ్చిముదిరితే యేమో స్తరుకు వస్తుందో. అయినా ఫర్వాలేదు. నేను యోగదృష్టితో చూచి మనోబలం వుపయోగపరిస్తే యెటువంటి వాణ్ణయినా నిముషంలో వశపరుచుకోవచ్చును. అతను రావడంతోటే ప్రయత్నంచేసి చూస్తాను. ఇప్పుడు వెళ్ళి వక్కనిముషం ప్రాణాయామంబట్టి మళ్ళీవస్తాను. (అని యుత్తర మక్కడ పడవైచి వెళ్ళుచున్నాడు.)

సుమ—నాన్నగారు వూరికే జపంపిచ్చలో పడిపోయినారు. తిన్నగా వేళకు భోజనానికైనా రావడంలేదు. నేను యీవుత్తరములో యేమి వున్నదో చదువుతాను. (అని చదువుచున్నది)—"మీచెల్లెలు పోయినప్పటినుంచీ మీమేనల్లుడికి విచారంచేత బొత్తిగా పిచ్చియెత్తిపోయినది"—పాపం సుబలుడికి పిచ్చియెత్తింది కాబోలును. అతణ్ణి చూచి నాలుగుసంవత్సరాలు కావచ్చింది. ఇక్కడ వున్నప్పుడు అతను నామీద యెంతో ప్రేమగా వుండేవాడు. తరువాత చదువుదాము—"అతనికి యేమీ తోచక వూరికే పిచ్చివాడులాగు తిరుగుతూ వున్నాడు. అతనికి మనస్సు స్వస్థపడేదాకా కొంతకాలం మీదగ్గిర వుండడానికి నేటిసాయంకాలమే మీదగ్గరకు పంపిస్తూన్నాను. దేపుమధ్యా

హాస్పిటలికి అక్కడకు వస్తాడు"—రేపు మధ్యాహ్నమకా? అలాగైతే యింక కాస్తసేపటికి వస్తాడు—"అతని విషయం మీరు కొంచెం శ్రద్ధవహించి మనస్సు స్థిమితపడేట్టు చెయ్యనలెను. సుమతితోకూడి అల్లరిగా తిరగ నియ్యకండి. మావాణ్ణి మీరాయోగపిచ్చలో మాత్రం దింపవద్దు. వాడికి యిదివరకువున్న పిచ్చచాలును."

రాము—అలాగైతే యిక మన యింట్లో పిచ్చవాళ్ళ వకరికి యిద్ద రవుతారు.

సుమ—వక రెవరురా?

రాము—అయ్యగారు.

సుమ—నోటిమీద తన్నిపోయేరు. ఇటువంటి పేలాపనలు పేలకు. గారిని నేను రమ్మన్నానని నాగదిలోకి పంపించి నీవు వెళ్ళి నీ పని చేసుకో. పో. (అని వెళ్ళుచున్నది)

రాము—అమ్మా! యిప్పుడే వెళుతాను. అయ్యో! అప్పుడే యీవిడ వెళ్ళిపోయిందే. అమ్మాయిగారికి నామీద కోపంవచ్చింది కాబోలును. అదుగో గారి యిక్కడకే వస్తూవున్నది. నేను వెళ్ళ నక్కరలేదు.

[గారి ప్రవేశించుచున్నది]

గారి—ఓయీరామా! నీవు యింటరిగా యిక్కడ యేమి చేస్తూ వున్నావు? మామూలుప్రకారంగా నీలో నీవు సణుక్కుంటూ వున్నావా యేమిటి?

రాము—నేను చేసే పనే నీవు చేసేట్టయితే నీవు నాకంటె యెక్కువ సణుక్కుందువు. పురుగుల దులిపివేసి వక్కపుస్తకానికి వర్ణంవేస్తే నాకు వుండేకష్టం నీకు అప్పుడు తెలుస్తుంది. ఓసీ! గారీ! ఈరోజు మనయింటికి యెవరో వస్తారట! యెవరువస్తారో యెరుగుదువా?

గౌరి—యెరగను. యెవరో మంత్రాలు తెలిసిన యోగులు వసా రనుకుంటాను.

రాము—కాదు కాను. వకపిచ్చివాడు వస్తూవున్నాడు.

గౌరి—పిచ్చివాడా? నాకు భయంవేస్తూవున్నది. అతను యెవరినీ కొట్టితిట్టేవాడు కాడుగద.

రాము—ఏమో తెలియదు. అతడు మన యజమానుడికి జతగా వుంటూడు. అయినాకానీ అతడుకూడా తాను వచ్చేటప్పుడు పాత తాటాకుల పొస్తకాలుయేమయినా తెస్తాడేమోనని నాకూ భయంగానే వున్నది.

గౌరి—పొస్తకాలు తెస్తేనేమికాని అతడు కొట్టేవాడవునో కాదో కనుక్కు-ని ముందుగా చెప్పవూ!

రాము—కనుక్కో నక్కరలేదు. వాళ్ళకు కొంచెం వ్యతిరేకంగా యేమయినా చేసినా అన్నా పిచ్చివాళ్ళందరూ కొడుతారు. నీవు జాగ్రత్తగా వుండవలెను. నీవు అతను చెప్పినట్లుగా చెయ్యకపోతే నీకొప్పులో వెంట్రుకలు నాలుగూ వూడదీసి చేతులో పెడుతాడు.

గౌరి—అలాగైతే నాకు మరీభయం వేస్తూవున్నది. మూర్ఛ వస్తూవున్నది. (అని మీద పడబోవుచున్నది.)

రాము.—గౌరీ! దూరంగా పో. ఇక్కడ మూర్ఛపోకు. నీకు మూర్ఛపోవడం యిష్టంగా వున్నట్టయితే లోపలికి పోయి నీళ్ళపాయి కాడ నిప్పులలోనో నీళ్ళలోనో మూర్ఛపో.

గౌరి—రామా! నీవు యింత క్రూరుడవవుతావని నేను యెన్నడూ అనుకోలేదు. నీవు నామతి పోగొట్టివేసినావు. (అని యేడ్చుచున్నది.)

రాము—నీకేమి భయము లేదు యేమువకు. ఆ పిచ్చివాడు

సీజోలికి రాకులే. ధైర్యంగా వుండు.

గౌరి—నీవు చెప్పినమాటలు విన్నతరువాత మళ్ళీ ధైర్యం యెలా వస్తుందీ? మూర్ఛ వస్తూవున్నది. ఇనుగో మూర్ఛపోతూ వున్నాను. (అని సోలుచున్నది.)

మతి—(వెలుపలనుండి) రామా! రామా!

రాము—అయ్యో! అయ్యగారు పిలుస్తూ వున్నారు.

గౌరి—ఇటువంటి మూర్ఛలో నీవు నన్ను వదిలిపెట్టి వెళ్ళ కూడదు.

రాము—మూర్ఛపోవడానికి ఇది సమయం కాదు. మన యజమానుడు జపంమీద కూర్చున్నప్పుడు సమయం కనిపెట్టి చెప్పుతాను. నీవప్పుడు కావలసినంత సేపు సావకాశంగా మూర్ఛపోవచ్చును. ఇప్పుడు తేచి వేగిరం యింట్లోకి పరుగెత్తు.

గౌరి—నీమాటప్రకారం నడుచుకుంటాను. (అని లేచివెళ్ళు చున్నది.)

[అంతట మతిమంతుడు ప్రవేశించుచున్నాడు.]

మతి—ఓరి మొద్దా! పిలవగానే యెందుకురావు? నీవు యెప్పుడూ దానితో పరియాచికా లాడుతూ కూర్చుంటావు.

రాము—ఆలాగంటి పని నేను యెప్పుడూ చెయ్యడం లేదండి. అదే నన్ను పరియాచికాలు చేస్తూవుంటుంది.

మతి—చాలును. ఈపాటినోరుమూసుకో. ఈవేళ మనయింటికి నామేనల్లుడు వస్తూవున్నాడు. అతనికి కొంచెం చిత్తచాంచల్యం.

రాము—అని యేమిటండీ?

మతి—మరేమీ లేదు. మతిభ్రమ వస్తూవుంటుంది.

రాము—మీరుచెప్పినవేమో నాకు తెలియవు. ఆవచ్చేవి రెండూ

యేమో జంతువులనుకుంటాను. అవియేనిమా హానిచేసేవికావుగద?

మతి—జంతువులూ లేదు. నీమొఖమూ లేదు వూరుకో. నామేన ల్లుడివిషయంలో నీవే చాలాశ్రద్ధ పుచ్చుకోవలెను. అతణ్ణి నీవు యెప్పుడూ కనిపెట్టివుండి చూస్తూ మంచిమాటలు చెపుతూ కోపం రాకుండా చెయ్యవలెను. అతణ్ణి రెచ్చకొట్టినావంటే నీతలకాయ బద్దలుకొడుతాడుసుమా జాగ్రత్త. అతనికి యెప్పుడూ చిరాకు తెప్పించకు.

రాము—తెప్పించను. అతనిమీద యెప్పుడూ వకకన్ను వేసి జాగ్రతగా వుంటాను.

మతి—(ఆలకించి) అదుగో బండిచప్పుడవుతూవున్నది. అతను వచ్చినట్టున్నాడు. రామా! అతణ్ణి నీవు వెళ్ళి లోపలికి తీసుకునిరా.

రాము—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు.)

మతి—సదానందయోగికిన్ని గజాననదాసుకున్ను వర్తమానం పంపించినాను. వారుయిద్దరూవచ్చి యితణ్ణి సావకాశంగా పరీక్షచేసి చూచి జబ్బుయొక్క స్వభావం నిశ్చయంచేసి చెపుతారు. వారిద్దరూ నిస్సందేహంగా చిత్తచాంచల్యమనే నిశ్చయం చేస్తారు. పాములమంత్ర గాడు తాచుపామును వశ్యంచేసుకున్నట్టు నేను యీరోగిని యోగ దృష్టిచేత చూచి నిముషంలో లోబరచుకుంటాను. యోగమహిమ కన పరచడానికి యిప్పుడు మంచి అవకాశం కలిగింది. మనోబలంచేత యెటు వంటిరోగాలనైనా మళ్ళించవచ్చును. అతడు యెంతఅల్లరి చేస్తూవున్నా మనస్సు స్థిరపరిచి తేరిపారచూచినానంటే యోగనిద్రచేత చిత్రపు ప్రతిమలాగు అయిపోతాడు. అదుగో అతను వస్తూవున్నాడు. నేను లోపలికి వెళుతాను. అతణ్ణిచూస్తే నాకు దేహం పులకరిస్తూవున్నది.

(అని వెళ్ళుచున్నాడు.)

[సుబలుఁడును రాముఁడును ప్రవేశించుచున్నారు.]

సుబ—పడవలు కొంచెం ఆలస్యంగా బయలుదేరినా యెలాగైతేనేమి కష్టపడి అనుకున్న వేళకు యిక్కడ చేరినాము.—ఓయి రామా! మా సామానంతా లోపల యేదైనా గదిలో పెట్టించు. ప్రయాణం తొందరలో రాత్రి నేను తిన్నగా భోజనంచెయ్యలేదు. ఆకలి వేస్తూవున్నది. వంటయిందేమో కనుక్కొనిరా.

రాము—(ఇల్లు నాలుగుపక్కలనుచూచి) వీటిలో యెవరినీకొట్టడానికి యితనికి అవకాశం లేకుండా చేస్తాను. (అని గొడమూలలనున్న చేతికఱ్ఱ లన్నియు పోగుచేయుచున్నాఁడు)

సుబ—(కోపముతో) ఓరీ! నీతో నేను చెప్పినపని యేమిటి? నీవు యిక్కడ చేస్తూవున్న పనియేమిటి?

రాము—చిత్తము చిత్తము. వెళుతూ వున్నాను. (అని కట్టెలు చేతఁబట్టుకొని నడుచు చున్నాఁడు.)

సుబ—వీడిమోస్తరు చూస్తే తమాషాగా వున్నది. ఇక్కడ వుంటే నేనాకర్రలు యెత్తుకుని పారిపోతా ననుకున్నాడు కాబోలును. ఈసావిట్లో నేను యిదివరకు కూర్చుని నాలుగుసంవత్సరాలు అయింది. అప్పుడు నేనూ సుమతీ యెంతో వినోదంగా ఆడుకుంటూ వుండేవాళ్లము. సుమతి యీపాటి బాగా పెద్ద దయి వుంటుంది. అప్పటికే యెంతో అందంగావుండేది.

మణి—(తలుపుచాటునుండి చూచుచు) అమ్మాయీ! సుమతీ! మీబావస్థితి చూచినావా? గారీ! మమ్మలిని తోసుకుని రాకు. నీవు తరువాత చూస్తువుకానిలే.

సుబ—మానాన్నగారు నన్ను యిక్కడకు అధాత్తుగా పంపించివేసినారు. మామామగారు వట్టిచేదస్తుడు. ఇప్పుడు యోగపు పిచ్చలోపడి

నిద్రాహారాలు లేకుండా రాత్రిపగలూ దానిలో మునిగితేలుతూ వున్నాడట. అయినాకానీ యిక్కడ నాకు మనసుకలిసినసుమతి యింట్లో వున్నదిగనుక వేడుకగా పొద్దుగడపవచ్చును. యీ తాటాకుపుస్తకాలన్నీ మామగారి పాతపురాణాలు కాబోలును.

మతి—(చెవిలో గుసగుస లాడుచు) అమ్మాయీ! అవి పాత పురాణాలట. తాను కాదు. నేనే పిచ్చోపడి వున్నానట. ఆమాటలు విన్నావా? ఈగొడవ చూసికే తొందరపడుతూవున్నది. దాన్నిచూడనియ్యి. మనం వెళుదాము. (అని వెళ్ళుచున్నారు.)

సుబ—(తలయెత్తిచూచి) యెవరో గుసగుసలాడుతూ వున్నట్లున్నారు. అదుగో ఆతలుపువద్దిక యెవరో చీరెకట్టుకుని నిలుచున్నారు. (అని తలుపువద్దికి వెళ్ళి తలుపుతీసి గౌరిని ఈవలికి లాగుచున్నాడు.)

గౌరి—(కాళ్ళుబాదపడి) మహాప్రభో! నన్ను రక్షించండి. చంపకండి. నాతల్లిముసలిది. దానికి నేను తప్ప మరియెవరూ దిక్కులేరు. నేనూ పదిహేడేళ్ళదాన్ని. కొంచెంకాలంలోనే పెళ్ళిచేసుకుని సుఖపడవలె ననుకుంటూ వున్నాను. నాప్రాణాలు కాపాడండి.

[అంతట రాముడు ప్రవేశించుచున్నాడు.]

రాము—(తనలో) ఈసిచ్చవాడు దీన్ని కాగిలించుకోవడానికి ప్రయత్నం చేస్తూవున్నట్లున్నాడు. ఇది వకవేళ అయితే మదపిచ్చి అయివుంటుంది.

సుబ—(పకపక నవ్వుచు దాసిని లేనదీసి) హాహాహా! నీకిప్పుడేమీ ప్రాణభయం లేదులే. (సుబవంకచూచి) ఆవచ్చినవారెవరు?

రాము—బాబూ! నన్ను కొట్టకండి. నేను వెళ్ళిపోతాను. (అని గంతులు వేయుచున్నాడు.)

సుబ—అమ్మా! నీవు వెళ్ళిపో.

గోరి—దేవుడా! ఇవేళకు బ్రతికిపోయినాను. (అని లోపలికి పరుగెత్తుచున్నది.)

సుబ—పాపం యిది పడుచుతనంలో బాగానే వున్నదికాని దీనికి కొంచెం వెర్రి అనుకుంటాను. వెర్రి కాకపోతే యేమీకారణం లేనిదే నన్ను చూచి భయపడి యిల్లాగు వెర్రికేకలు వెయ్యదు. వీడు కూడా లోపలికి పరుగెత్తబోతూవున్నాడు. (అని పై బట్టపట్టుకొని) ఓరిపిచ్చివాడా! యెక్కడికి పరుగెత్తుకుపోతావు?

రాము—బాబూ! బాబూ! నాబట్ట చింపివెయ్యకండి. నెల్లాళ్ళయినా కాలేదు. కొత్తబట్టకొనుక్కొన్నాను.

సుబ—(బట్ట విడిచి) ఓరి మూఢుడా! నేను నీబట్ట చింపుతానని నమకున్నావుట్రా?

రాము—అయ్యా! మీకు దణ్ణం పెడుతాను. దూరంగా వుండండి. నాజోలికి రాకండి. మీపిచ్చిచేష్టలు నామీద చూపకండి.

సుబ—దున్నపోతా! నావి పిచ్చిచేష్టలు అంటావురా? (అని రాముని జుట్టు పట్టుకొని వంగతీయుచున్నాడు.)

రాము—బాబూ! చస్తిని చస్తిని. (అని కేకలువేయుచున్నాడు)

[అప్పుడు మతిమంతుడు ప్రవేశించుచున్నాడు.]

మతి—మావాడికి పిచ్చి మహాయెక్కువగావున్నది. నవుకర్లు నందరినీ కొడుతూవున్నాడు. నేను యోగదృష్టితో చూచి యితన్ని తక్షణం శాంతపరుస్తాను. (అని రెప్పవాల్పక చూచుచున్నాడు)

సుబ—(నేసమామను చూచి తొందరపడి) మామయ్యా! వీడు నావి పిచ్చిచేష్టలంటే కోపంవచ్చి కొంచెం జుట్టు పట్టుకున్నాను. అంతేకాని మరేమీకాదు.

మతి—(యోగదృష్టితో చూచుచు సమీపమునకు వెళ్ళి

చేయిపట్టుకొని) నాడి బహువడిగా కొట్టుకుంటూ వున్నది. ఇటువంటి వాళ్లకు వుండేమో స్తరేయిది.

సుబ—(తనలో) ఈయనకు మతిపోయిందా యేమిటి? రెప్ప వాల్పకుండా దయ్యాలు పెట్టేవాడులాగు నావంక ఆలాచూస్తాడేమి?

రాము—(మతిమంతుని వెనుకకు వచ్చి చెవిలో రహస్యముగా) సమయగానికి మీరు రాకపోయినట్టయితే యితడు యీపాటి నన్ను చంపి వేసును. ఇతనిది సాధారణమయినపిచ్చకాదు. యితణ్ని తాళ్ళోగీళ్ళో వేసి కట్టిపెట్టి గదిలోవేసి వుంచవలెను. లేకపోతే మీయింటికి వచ్చే వారికి యెవరికైనా అపాయం వస్తుంది.

[అప్పుడు సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—(భయపడుచు వచ్చి) నాన్నగారూ! (సుబలుని చూచి తొందరపడి) యిక్కడ మీరు వక్కరే వున్నారనుకున్నాను.

సుబ—సుమతీ! నన్నుచూచి యెవరినో పరాయివాణ్ని చూచి నట్లు ఆలాతొందరపడుతావేమి? నేను నీబావను సుబలుణ్ని. నన్నప్పుడే మరచిపోయినావా? (అని సుమతిచేయి పట్టుకొనుచున్నాడు.)

రాము—అదుగో వకదాన్నివదలి రెండో ఆడదానివీద పడ బోతూవున్నాడు.

సుమ—నన్ను ముట్టుకోకు. పడుచువాళ్ళు యెదిగినఆడదాన్ని ముట్టుకోరాదు. (తనలో) ఇతనిమోస్తరుచూస్తే నాకంతపిచ్చవాడుగా కనపడడంలేదు.

సుబ—దగ్గిరబంధువులలో అటువంటి అభ్యంతరాలు వుండకూడదు. చిన్నతనంలో మనంయిద్దరమూ ప్రాణస్నేహితులముగా వుండేవాళ్లము కామా?

సుమ—నాచెయ్యివదులు. చిన్నతనంలో చేసినట్టు యిప్పుడు

చెయ్యరాదు. (అని చేయివదల్చుకొనినెళ్లి బల్లమీద కూర్చున్నది)

మతి—(రెప్పవాల్చక సుబలుని యోగదృష్టితో చూచుచు తనలో) ఇతడు లొంగిపోయినాడు. కాస్తసేపు దృష్టిపట్టి చూచేటప్పటికి పరమసాధువైనాడు. ఆహా! యేమియోగబలము! (బిగ్గరగా) అబ్బాయీ! నీకు ఆకలిగావున్నట్టున్నది. నీవుకొంచెంసేపు నీమరదలితో మాట్లాడుతూకూర్చో. నేను లోపలికి వెళ్లి నీకుకావలసినవి జాగ్రత పెట్టించి యిప్పుడే వస్తాను. (అని సుమతియొద్దకువెళ్లి అమ్మాయీ! నీవు కొంచెంసేపు యితనితో మంచిమాటలు చెప్పుతూ వుండు. అతసు యేమన్నా అపునని అన్నిటికీ తలపూపుతూ వుండు. ఆతనికి వ్యతిరేకంగా యేమీచెప్పకు. వాళ్ళుచెప్పింది కావంటే పిచ్చవాళ్లకు పిచ్చ యెక్కువై కోపంవస్తుంది సుమా! (అని వెళ్లుచున్నాడు.)

రాము—ఆయన లేనప్పుడు నేను మంత్రిస్తాను. (అని సుబలుని కేసి రెప్ప వాల్చక చూచుచున్నాడు.)

సుబ—(చేతితో రాముని జూపుచు) సుమతీ! వీడికి కొంచెం మతిభ్రమ వున్నదనుకుంటాను.

సుమ—వున్నది. తప్పకుండా వున్నది. (తనలో) ఇత డన్న మాట కర్థం యేమిటో.

సుబ—వీణ్ని పిచ్చవాళ్ళ వైద్యశాలలోనుంచి తీసుకుని వచ్చినారేమి.

సుమ—మామామయ్య కోనసీమ వెళ్ళినప్పుడు అమలాపురం నుంచి తీసుకుని వచ్చినారు. (ఇంతలోజ్ఞప్తి తెచ్చుకొని) కాదు కాదు. పిచ్చవాళ్ళ వైద్యశాలలోనుంచే తీసుకుని వచ్చినారు.

సుబ—(నవ్వుచు) సుమతీ! నీ వలాగు తడబడుతూ మాట్లాడుతూ వేమి? నాదగ్గిర నీకు భయం యెందుకు? నీ కావుంగరం మాము

య్యగారు కొత్తగా చేయించినారా? నీచేతిని వుండడంవల్ల ఆవుగరా నికి యెంతో అందం వచ్చింది. (ఆని చేయి పట్టుకొను చున్నాడు.)

సుమ—(చటుక్కున చేయి తీసికొని తనలో) చూట్టూడడాన్ని పట్టి చూస్తే యితడు మంచివాడులాగే కనపడుతూ వున్నాడు గాని పిచ్చివాడులాగు కనపడడం లేదు. (బిగ్గరగా) మీరు వూరికే నన్ను స్తుతి చేస్తూవున్నారు.

సుబ—సుమతీ! సిగ్గువిడిచి దగ్గిరగా వచ్చి కూర్చో. యెవరో కొత్తవాడిలాగు నన్ను మీరూమీరూ అంటూ వుండకు. మనలో మనకు మర్యాదలు యేమిటి? ముసుపు పిలిచేటట్టుగానే నీవు అని పిలు స్తూ వుండు. మనం చెట్టాపట్టాలు వేసుకుని యీతోటలో తిరుగుతూ పళ్ళు కోసుకొని ఆడుకుంటూ వుండేవాళ్ళం ఆసంగ తంతా అప్పుడే మరిచి పోయినావా?

సుమ—మరిచి పోలేదు. మనం వకరోజు శాస్తుర్లుగారితోట లోకి వెళ్ళి నారింజపండు కోసినప్పుడు జరిగినతమాషా నీకు యిప్పుడు జ్ఞాపకం వున్నదా?

సుబ—బాగా జ్ఞాపకం వున్నది. అతను మనల్ని తరుముకువచ్చే టప్పటికి మనం లేళ్ళలాగు పరుగెత్తుకువచ్చి వీధిలో పడ్డాము. అతడు మనను పట్టుకోవలె నని వెనుక పరుగెత్తుకొని వచ్చి పరుగెత్తలేక కాలు జారి బొండులాగు బురదకాలువలో పడ్డాడు. బట్టలన్నీ బురదయి పోయినవి. ఆసంగతి చెప్పుకుని మనం నెల్లాళ్ళదాకా రోజూ కడుపు లుబ్బేటట్టుగా నవ్వుకుంటూ వుండేవాళ్ళము. ఆచిన్ననాటి ఖులాసా దినాలు మళ్ళీ రావు.

సుమ—అటువంటిదినాలు మళ్ళీ రావు. అప్పుడు నీవు పిచ్చ— (జ్ఞప్తికి తెచ్చుకొని) కాదు కాదా. నాఅభిప్రాయం అదికాదు. యేమో

లేదు. (అని తొందర పడుచున్నది.)

సుబ—సుమతీ! అలా భయపడుతా వేమి? తొందరపడబోకు. నాదగ్గిర నీకు భయం యెందుకు?

సుమ—(లేచి మెల్లగా లోపలికినడుచుచు) మానాన్నగారు—

సుబ—మీనాన్నగారు యేమిటి? ఆయన చూస్తే యేమి చేస్తాడు? తల కొట్టివేస్తాడా యేమిటి? వచ్చి కూర్చో. (అని చేయి గట్టిగా పట్టుకొని లాగుచున్నాడు.)

సుమ—(తనలో) ఇతనికి పిచ్చ యెక్కువవుతూ వున్నది. (బిగ్గరగా) అవును. మీరు చెప్పినదంతా నిజం. అయిన మనను యేమీ చెయ్యలేదు. వచ్చి కూచ్చుంటాను. నాచెయ్యి వదలండి.

సుబ—ఇదిగో వదలినాను.

సుమ—మీకు వంటయిందేమో కనుక్కొని వస్తాను. (అని చటుక్కున లోపలికి పోయి తలుపు వేసుకొనుచున్నది)

సుబ—ఇదేమిటి? (అని అబ్బురపడి నిలుచున్నాడు)

[రెండుగిన్నెలును, ఒకగరిటెయు పట్టుకొని రాముడు ప్రవేశించుచున్నాడు.]

రాము—ఇదుగో మీకు ఔషధం—కాదు, భోజనం తీసుకుని వచ్చినాను.

సుబ—అగరిటెలోది యేమిటి?

రాము—బుడంపరుగులు నేతిలో వేయించినాము.

సుబ—అగిన్నెలోదో?

రాము—ఒకగిన్నెలోది మిరియాలచారు, రెండోగిన్నెలోది పెస రట్లూను. పొట్టు తియ్యకుండా ముడిపెసలు నూరి కొట్టులు చేసినాము.

సుబ—యేడిసినట్లే వున్నది. యీభోజనం ఈపాడుకొట్టులు యెవరికికావలెను?

రాము—కోపపడకండి. మీరు రెండురొక్కలు ఫలహారం చేస్తే కడుపులో కొంచెం చల్లపడి శాంతిస్తుంది. భోజనం చెయ్యండి.

సుబ—(లేచి రామునిజుట్టు పట్టుకొని గట్టిగా ఊపి) నన్ను యీవిధంగా అడవిమృగంలాగు చూడడానికి యింట్లోవాళ్ళందరూ కలిసి యేదో కుట్రచేసినారో లేదో నిజం చెప్పు.

రాము—(జుట్టు వదల్చుకొనుచు) నాజుట్టు వదలండి. మృగం లాగు చూడడానికి కుట్ర చెయ్యడం యేమిటి? మీరు నిజంగా ఆలాగే కనబడుతూ వున్నాను. మీరు పెద్ద భల్లూకపుపట్టు పట్టినారు. అడవి మృగ మైనా యింతపట్టు పట్టదు. మీరు నాజుట్టు వదలకపోతే కానాకు పోయి బంటోతును తీసుకుని వస్తాను.

సుబ—నీ అవకతవకప్రసంగం మానకపోయినట్టయితే యిప్పుడు నాలుగు తన్ని నిన్ను యింట్లోనుంచి అవతలికి సాగనంపుతాను. (తనలో) బాగా ఆలోచిస్తే వీడితో విరోధం పడడం బాగా కనపడడం లేదు. ఇకు వీడితో మంచిమాట లాడుతాను. వీడివల్ల యేదైనా వుప యోగం వుంటుంది. (బిగ్గరగా) రామా! నేను వూరికే వేళాకోళానికి జుట్టు పట్టుకుని వూపినాను. అంతేకాని మరేమీ లేదు. నీవు మహా మంచివాడవుగా కనపడుతూ వున్నావు. ఇదిగో రూపాయి యిస్తూ వున్నాను పుచ్చుకో. (అని రూపాయి చేతిలో పెట్టుచున్నాడు.)

రాము—(పుచ్చుకొని సంతోషముతో) మీరు మహాదొడ్డ వారు. మా యజమానులవంటివారు ఖదిమంద్దైనా మీతో సమానం కారు.

సుబ—నాకు ఆకలిగా వున్నది. తెచ్చినవి విస్తట్లో వడ్డించు.

రాము—చిత్తము. (అని రొట్టెలు విస్తరిలో వేసి నిలుచున్నాడు.)

సుబ—(విస్తరిముందు కూరుచుండి) ఇవేమిటి? యీరొట్టెలు నల్లగా వున్నవి? వీటికంటె మరియేమయినా చేసినట్టయితే బాగా వుండును. (అని తినుచున్నాడు.)

రాము—చెయ్యి కడుచుకుంటారు. జాగ్రతగా తినండి.

సుబ—చెయ్యి కడుచుకోవడానికి నేను పసిపిల్లవాణ్ణి అనుకున్నావా యేమిటి? రామా! యివి బాగున్నవికావు. తినడానికి వీటి కంటె యేమయినా మంచివి తెస్తూ?

రాము—మరేమీ తేవడానికి వల్లకాదు. అయ్యగారు యివి మాత్రమే మీకు పెట్టుమన్నారు. యివన్నీ పైత్యహారపువస్తువులట.

సుబ—అయ్యగారిని—(ఆపుకొని) పైత్యహారమూ లేదు యేమీ లేదు. మరి యేమయినా తీసుకొనివస్తూ. నాకు వీటితో ఆకలి యెంత మాత్రమూ తీరలేదు.

రాము—అలాగా? (అని గరిటెయు గిన్నెలును తీసికొని పరుగెత్తుచున్నాడు.)

సుబ—వీడు నేను గరిటెలూ గిన్నెలూ యెత్తుకుని పారిపోతా ననుకున్నాడు కాబోలును. అవన్నీ వీడు యెంతతొందరగా తీసుకుని పోయినాడో? ఇక్కడిమోస్తరు చూస్తే నా కంతా విచిత్రంగా కన పడుతూవున్నది. దాసీది పిచ్చిదిగా వున్నది. ఈరాముడు తెలివిమాలిన మోటపశువులాగు కనపడుతూ వున్నాడు. నామరదలు కూడా నన్ను చూస్తే పెద్దపులినో వెలుగుబంటినో చూచినట్టు భయపడుతూ వున్నది. ఇఖ నా మామగారిసంగతి చెప్పనక్కరలేదు. ఆయనకు పాడు పొస్తకాలు చదవగా చదవగా మతిపోయింది. మహారాణిగారిని చూచినట్టు ఆయన నాకేసి వూరికే రెప్ప వాల్చకుండా చూడడం మొదలు పెట్టినాడు, ఆయనకు పిచ్చి అనినంమకు ఆవగింజంతయినా సందేహం

లేదు. కాని సుమతిసంగతిమాత్రం నా కేమీ బోధపడడం లేదు. ఇప్పుడు సుమతికి నకవుత్తరం వ్రాసి రాముడిచేత పంపిస్తాను. (అని వ్రాయుచు చదువుచున్నాడు)—"అత్యంత ప్రియురాల వైనసుమతీ! నన్ను చూస్తే నీ కంత సిగ్గూ భయమూ రావడానికి కారణం యేమిటి? నీకు నామీద కోపం రావడానికి నేను యేమి నేరం చేసినాను? నేను చేసిన అపరాధం చెప్పినట్టయితే నేను వెంటనే నీకాళ్ళమీద పడి క్షమాపణ కోరుకుంటాను. కాబట్టి నాయందు దయవుంచి విచారగ్రస్తుడనై వున్ననన్ను సంతోషపెట్టవలె నని మరీమరీ వేడుకుంటూ వున్నాను. నీచిన్ననాటి ప్రియమిత్రుడు సుబలుడు"—ఇది చాలును.

[పోకదొన్నెయు పుస్తకియు చేతబట్టుకొని రాముడు ప్రవేశించుచున్నాడు.]

రాము—ఇవిగో మీకూ పెసరట్లు మళ్ళీ తెచ్చినాను. ఈసారి ఆకలి తీరేటట్టుగా కావలసినన్ని తినండి. (తనలో) ఇప్పుడు గరిటె తీసి వేసి దొన్నెలు తెచ్చినాను గనుక వీటితో ఎవరికీ హాని చెయ్యలేడు. (అని క్రింద పెట్టుచున్నాడు)

సుబ—(విస్తరిముందు కూరుచుండి) ఈమాటయినా మంచి రొట్టెలు తెచ్చినావా? వెండిగిన్నె లోపల పడవేసి యీవెధవదొప్ప తెచ్చినా వేమి? లోపలికి వెళ్ళి గిన్నె తీసుకుని రా. (అని పోకదొప్ప విసరివేయుచున్నాడు)

రాము—గిన్నె తీసుకునిరాను. మిమ్మలిని నమ్మి మీచేతికి గిన్నె యివ్వడం క్షేమం కాదు. (తనలో) ఈయనచేతికి గిన్నెలూ గరిటెలూ యిచ్చి వాటితో నాతల బద్దలుకొట్టించుకుంటానా? నాకు అపాయం రాకుండా యేలా కాపాడుకోవలెనో నాకు బాగా తెలుసును. నేను మోసపోను.

సుబ—(కోపముతో) జాగ్రత నన్ను నీవు దొంగవాణ్ణిగా

భావిస్తూ వున్నట్టున్నావు.

రాము—ఆసంగతి నా కేమీ తెలియదు. మీ కది ముదిరితే అపాయం సంభవిస్తుంది గనుక మీదగ్గర గిన్నెలు మొదలయిన గట్టి వస్తువులు యేమీ వుంచవద్దని మీ మామగారు సెలవిచ్చినారు.

సుబ—(కోపముతో) ఏదిముదిరితే—

రాము—మీ కున్నజబ్బు.

సుబ—జబ్బేమిటి?

రాము—అయ్యగారు దానికేమిటో పేరు పెట్టినారు. జ్ఞాపకము చేసుకుని చెపుతాను వుండండి. "చిచ్చాల్యం" జ్ఞాపకం వచ్చింది. అవును అదే.

సుబ—నీమొఖం చిచ్చాల్యం యేమిటి?

రాము—దానికి యింకోపేరు "తిభ్రిమ"

సుబ—మతిభ్రిమ అనా నీ తాత్పర్యం?

రాము—అవును ఆమాట అదే.

సుబ—మొదటిమాట చిత్తచాంచల్యం కాబోలును.

రాము—నానోరు తిరగదు. మీ మామగారు నాతో చెప్పింది యిప్పుడు మీ రన్నమాట.

సుబ—(నవ్వుచు) ఇప్పుడు నా కంతా బోధపడ్డది.

రాము—అవును మీకు బోధపడ్డది. (అని నవ్వుచున్నాడు.)

సుబ—(నవ్వుచు) ఈవింత బహుబాగావున్నది. ఆ పిచ్చిముస లాయనే నాకు పిచ్చని యెందుకనుకున్నాడు?

రాము—ఏమో! నాకు తెలియదు.

సుబ—నీకు తెలియకపోతే పోయిందిగాని నీవు నాకు వకీలు సహాయం చేసిపెడుతావా?

రాము—ఏమిసహాయం? మీచేతులూ కాళ్ళూ కట్టిపెట్టవలెనా యేమిటి?

సుబ—అలాగంటిపనికాదు.నాకు మామగారివిషయంలో వక్క-తమాషా చెయ్యవలె నని వున్నది.

రాము—అయ్యో! పాపం ఆయనకు—

సుబ—తొందరపడకు. మరేమీ కాదు. వూరికే పరియాచకం. అందులో నీవు సహాయంచేస్తే నీకు వకరూపాయి యిస్తాను.

రాము—అలాగైతే ఆలోచిస్తాను. ఆయన విషయంలో చేసేది యీపొస్తకాలు తగలపెట్టడం తప్ప మరేమీ నాకు కనపడదు. ఈపుస్తకాలన్నిటినీ అగ్నిహోత్రుడికి సమర్పణచేస్తే నాకు యెంతో సంతోషంగా వుంటుంది. అలా చేస్తురూ! నాశ్రమ నివారణ అవు తుంది. వీటిపురుగులు దులపలేక చచ్చిపోతూ వున్నాను.—ఓఅగ్ని దేవుడా! నీకు నమస్కారం చేస్తాను. ఈయన పాతతాటాకులపుస్తకా లన్నీ పూర్ణాహుతిగా సమర్పిస్తాను. గనుక, మీరు వక్క-పుస్తక మయినా మిగలకుండా కంఠపూర్తిగా భక్షించి నన్ను కృతార్థుణ్ణి చెయ్యండి.

సుబ—చెయ్యవలసిన పని మనము యిద్దరమూ కొంచెం సేప టిలో నిశ్చయింతాము గాని నీవు ముందుగా యీవుత్తరం తీసుకుని వెళ్ళి సుమతికి యిచ్చి రా. యిదుగో రూపాయి (అని యిచ్చి చున్నాడు.)

రాము—(పుచ్చుకొని) రూపాయ పుచ్చుకోవడానికి నా కేమీ అభ్యంతరం లేదు. గాని వుత్తరం మాత్రం నేను తీసుకొని వెళ్ళను, వుత్తరం ఆ ఆడదానిచేత పంపించండి.

సుబ—గారిచేతనా? అది నన్నుచూస్తే పరుగెత్తుతుంది. నా

దగ్గిరకే రాదే.

రాము—దాని చేతులో రెండణాలడబ్బులు పారవెయ్యండి. అప్పుడది కావలసినంతదగ్గిరగా వస్తుంది. దానికి కావలసిం దంతే.

సుబ—అలాగయితే ద్దాన్ని వక్క-సారి యిక్క-డికి పంపించు.

రాము. —నిముషంలో పంపుతాను. (అని వెళ్ళిపోయినాడు)

సుబ—(ఒంటరిగా) నేను ఆలోచించింది బహుబాగా వున్నది. వీరందరూ కలిసి వస్తే కాస్తసేపటిలో తమాషా చేస్తాను. రామణ్ణి బెదరకొట్టకూడదు. వీడు యిందులో చాలా పనికివస్తాడు. అదుగో అప్పుడే గౌరి వస్తూవున్నది.

[బెదరి బెదరి చూచుచు గౌరి ప్రవేశించుచున్నది.]

గౌరి—అయ్యా! రాముడు మీరు యెందుకో నన్ను రమ్మన్నారని చెప్పినాడు.

సుబ—అవును. యీవుత్తరం సుమతికి తీసుకుని వెళ్ళడం నిమిత్తం పిలువ మన్నాను. అటువంటి సౌందర్యవంతురాలికి వుత్తరం తీసుకుని వెళ్ళడానికి నీవంటి అందగత్తెలు తప్ప యితరులు తగరు.

గౌరి—(తనలో) యితణ్ణి పిచ్చివా డంటారేమి? ఈయన యువరాజులాగు మాట్లాడుతూ వున్నారు.

సుబ—(ఉత్తరము చేతి కిచ్చి) యీవుత్తరం తీసుకునివెళ్ళి నీయజమానురాలి కియ్యి. యిదుగో నీబహుమానము. (అని నాలుగు అణాలిచ్చుచున్నాడు.)

గౌరి—(సంతోషముతో) వుత్తరం యిచ్చివస్తాను. వుత్తరంతీసుకొని వెళ్ళినప్పుడల్లా యిలా బహుమానం యిస్తూవుండవలెను.

సుబ —నీవు బహుమంచిదానవు. ఆలాగే యిస్తూ వుంటాను. వేగిరం వెళ్ళు. (అని వీపుమీద తట్టుచున్నాడు.)

[ఆప్పుడు మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(తనలో) అదుగో సుబలుడు దాన్ని కొడుచూవ్నున్నాడు. నేను మళ్ళీ యోగదృష్టితో చూచి శాంతపఁగచవలెను.

గౌరి—(చూచి పరుగెత్తుచు) అరుగో! అయ్యగారు వస్తూ వున్నారు. (అని వెళ్ళుచున్నది.)

సుబ—ఆ వెర్రివాడా! (అని మరియొకదారిని వెళ్ళుచున్నాఁడు)

మతి—అయ్యో! కుర్రవాడు తప్పించుకొనిపోయినాడు. పిచ్చ యింత వేగంగా హెచ్చిపోవడం నేను యెక్కడా చూడలేదు.

[రాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

రాము—అయ్యా! మీకోసం యెవరో యిద్దరు పెద్దకుంకం బొట్లు పెట్టుకొనివచ్చి వాకిట్లోనిలుచుని వున్నారు. వారిని చూడడం తోటే దెయ్యాలపోతులేమో నని నాకు భయంవేసింది.

మతి—వారు వైద్యులయివుంటారు. సందేహంలేదు. వారిని లోపలికి తీసుకొని రా.

రాము—అదుగో వారే వస్తూవున్నారు.

[సదానందయోగియు, గజాననదాసును ప్రవేశించుచున్నారు]

మతి—(సుబలుని కొఱకు నాలుగు దిక్కులను జూచి) మా వాఁడు యిప్పుడు యెలాగో వెళ్లినాఁడు. సందేహం లేదు. అతను మళ్లీ యిప్పుడే వస్తాడు. రావడంతోటే అతణ్ని మీకు చూపిస్తాను. మీరు జాగ్రత్తగా వుండవలెను. పట్టుకి చూడడానికి అత నంతపిచ్చవాడుగా కనపడడుగాని యీవ్యాధి మీవంటి ఘనవైద్యులు చక్కగా శోధించ తగ్గదని తలుస్తాను.

సదా—మీరు చెప్పినదాన్నిబట్టి చూస్తే మీవాడికి పైత్య చలన మని నిశ్చయిస్తాను.

గజా—ఉమించవలెను. అది పైత్యచలనం కాదు. భూతావేశ మని నేను భావిస్తాను.

సదా—మీరు మహాభాగా కనిపెట్టినారు. (తనలో) ఇతనికి యేమీ తెలియదు.

గజా—(తనలో) యేమీ తెలియకపోయినా యితడన్ని తనకే తెలుసునంటాడు.

మతి—మీ రతణ్ని సావకాశంగా పరీక్షచేసి చూడవచ్చును. మీరు వైద్యులని చెప్పక నాస్నేహితులనిమాత్రము చెపితే అతను మీతో మనసిచ్చి మాట్లాడుతాడు. అలాచేస్తే బాగావుండదా?

సదా—దివ్యంగా వుంటుంది.

గజా—బాగానే వుంటుంది.

మతి—అతనివిషయంలో మీరు బహుజాగ్రతగా వుండవలెను. ఎక్కొక్కప్పుడు అతనికి పిచ్చకోపంవస్తుంది. అలాగంటప్పుడు అతను వళ్ళో పై తెలియకుండా దౌర్జన్యం చేస్తాడు. ఇందాకా మానవు కరునూ దాసీదాన్ని కొట్టినాడు. అయితే నేను వెంటనే వచ్చి యోగ దృష్టితో చూచేటప్పటికి ఆ వుద్రేక మంతాపోయి నిముషంలో శాంతపడిపోయినాడు. మీ కేమైనా తొందర కలిగితే నన్ను వెంటనే పిలవండి. నేను వచ్చి యోగదృష్టితో చూచి తక్షణం శాంతుణ్ని చేస్తాను.

సదా—ఈవిషయంలో నాకు మీసహాయం అక్కరలేదు. అది మేము నిత్యమూ చేసేపనే. అదుగో! ఆవచ్చేది అతనే కాబోలును.

[సుబలుడు ప్రవేశించుచున్నాడు.]

మతి—(రహస్యముగా) అవును అతనే. (సుబలునితో బిగ్గరగా) అబ్బాయీ! వీరిద్దరూ నాస్నేహితులు. బహు తెలిసినవారు. గొప్ప

విద్వాంసులు.

సదా—(మతిమంతునితో రహస్యముగా) ఆముఖులక్షణంచూ డగానే నాకు పైత్యచలన మయినట్లు నిశ్చయంగా పొడకట్టుతూవున్నది.

గజా—(మతిమంతునితో రహస్యముగా) అతని చూపునల్ల యిది గ్రహణలక్షణమయినట్లు నాకు స్పష్టపడిపోయింది.

మతి—(ఇద్దరితోను రహస్యముగా) మీరిద్దరూ ఆలోచించుకొని యేదో నిశ్చయం చెయ్యవలెను; యిఁక మిమ్మలిని యిద్దరినీ యితనివద్ద విడిచి నేను వెళుతాను. (సుబలునితో బిగ్గరగా) అబ్బాయీ! నేను వక్కసారి లోపలికి వెళ్ళివస్తాను. ఈలోపుగా నీవు యిద్దరితోనూ మాట్లాడుతూవుండు. వీరు బహుమంచివారు. (అని వెళ్ళుచున్నాఁడు)

సుబ—(తనలో) ఈమనుసలివాళ్ళు యిద్దరూ నా కేసి చూచి యేమో ఆలోచిస్తూవున్నారు. వీరుకూడా మా మామగారి యోగపు పిచ్చలో చేరినవా రనుకుంటాను. (బిగ్గరగా) అయ్యా! దయ చెయ్యండి. నేను యిూవూరు మంచి దనుకుంటాను.

సదా—బహుమంచిగ్రామం.

గజా—ఇక్కడ సమస్తసదుపాయాలూ వున్నవి.

సుబ—ఈయేడు పంటలు బాగా వున్నవా?

సదా—బాగానే వున్నవి.

సుబ—మీ కేమయినా నల్లమందు వెయ్యడం అలవాటు వున్నదా?

సదా—లేదు. మిమ్మల్ని మేము కొన్ని ప్రశ్నలను వెయ్యవలె నని వున్నది. అడుగవచ్చునా?

సుబ—అడగవచ్చునుగాని నేనే ముందుగా కొన్ని ప్రశ్నలు వేస్తాను. వాటికి జవాబు చెప్పండి. మాతండ్రిగారి మేనమామకొడుకు

మీతల్లిగారి మేనత్త మనుమ డైనట్టయితే, అతను పూజారి జాంబ వంతుడికి యేమవుతాడు?

సదా—యేమీకాడు.

సుబ—నేమీకాకపో తే నన్ను మీరు యిలాగంటి సందర్భం మాలిన ప్రశ్నలుమాత్రా వెయ్యకండి.

సదా—(తనలో) నే ననుకున్నట్టే యితనిది తప్పకుండా పైత్య చలనమే. (బిగ్గరగా) మీ రేమీ సందేహపడవలసినపని లేదు. మే మటువంటి ప్రశ్నలు వెయ్యము. ఏమండీ! గజాననదాసుగారూ! మీ రేమంటారు?

గజా—యెంతమాత్రమూ వెయ్యము. (తనలో) ఇది భూత లక్షణమే సందేహము లేదు.

సుబ—అలాగయితే ఆరంభించండి.

సదా—మీవూళ్ళో వింత వర్తమానాలు యేమయినావుంటే చెపుతారా?

సుబ—(తనలో) వీళ్ళు వర్తమానపత్రికలకు వార్తాసేవాళ్ళు కాబోలును? వీళ్ళకు తగినట్టు చెపుతాను. (బిగ్గరగా) మావూళ్ళో వక లేగదూడ అయిదుకాళ్ళతో పుట్టింది. వకముసలావుకు మూడుకొమ్ము లున్నవి.

సదా—(తనలో) దీనితో యితనికి పైత్యలక్షణ మయినట్టు స్థాపన అయినది. అయినాకానీ యింకొక్క-ప్రశ్నకూడా అడిగి చూస్తాను. (బిగ్గరగా) ఇవి వింతసమాచారాలే! రామాయణం విన్నారు గదా రాముడికి సీత యే మవుతుందో చెప్పగలరా?

సుబ—(తనలో) వీళ్ళు నన్ను పిచ్చవాణ్ణిచేసి ఆడించవలెనను కుంటూవున్నారు. వీళ్ళకు బుద్ధినచ్చేటట్టు జవాబుచెపుతాను. (బిగ్గరగా)

మీకు యీయన అయినట్టే రాముడికి సీత మేనమామ మొగుడవు తుంది. తెలిసిందా?

సదా--(తనలో) ఇక ప్రశ్న లక్కరలేదు. ఇప్పుడు పిచ్చి స్థిర పడ్డది.

గజా--(తనలో) ఇతణ్ని యిప్పుడు దెయ్యం సంపూర్ణంగా ఆవహించే వున్నది. (బిగ్గరగా) అయ్యా! యోగిగారూ! మీ సెల వైతే నేను కూడా యీచిన్నవాణ్ని ఒకటి రెండు ప్రశ్నలు అడుగు తాను. అబ్బాయీ! యిప్పుడు మీయెనట యెవరై నా నిలుచున్నట్లు కనపడుతూ వున్నారా?

సుబ--కనపడుతూ వున్నారు. మీరు యిద్దరూ నిలుచున్నట్లు కనపడుతూ వున్నారు.

సదా--అబ్బాయీ! మిమ్మల్ని నేను ఒక్కప్రశ్న అడుగుతాను గాని మరివికలాగు అనుకోక సరిఅయిన జవాబు చెప్పండి. మీతండ్రి గారికి యెప్పుడయినా పైత్యభ్రమ వుండేదా?

సుబ--(తనలో) వీళ్ళు బుద్ధిమాలిన ప్రశ్నలు వేస్తూవున్నారు. అయినాకానీ యింకా యేమి అడుగుతారో ఒక్కనిముషం ఓపికచేసి వింటాను. (బిగ్గరగా) లేదు.

సదా--పోనీ. మీబంధువులలో యెవరికైనా వున్నదా?

సుబ--వున్నది. మా మేనమామగారికి యోగపుపిచ్చి వున్నది. (తనలో) ఇక నే నీపాడుప్రశ్నలకు జవాబు చెప్పలేను. నిద్రవచ్చినట్టు నటిస్తాను. (అని గోడకుఁ జేరగిలఁబడి కన్నులుమూసికొనుచున్నాఁడు)

సదా--(దగ్గిరకు పోయి మెల్లగా చేయిపట్టుకొని చూచి) చేతిలో పైత్యనాడి బాగా ఆడుతూవున్నది. గజాననదాసుగారూ! మీరుకూడా చూడండి.

గజా—(చేయిపట్టుకొనిచూచి) యిది పైత్యనాడికాదు. తప్ప కుండా భూతనాడి ఆడుతూ వున్నది. ఇది గ్రహలక్షణం.

సుబ—(కన్నులువిప్పి లేచి) మీరు నాకు నిద్రాభంగం కలుగ చేస్తూవున్నారు. మీరు తక్షణం యీగదివిడిచి వెళ్ళకపోయినట్టయితే మిమ్మలిని యిద్దరినీ కొట్లోపెట్టి తాళం వేస్తాను. (అని ముందుకు వచ్చుచున్నాఁడు)

ఇద్దఱు—(చేతులడ్డముపెట్టుకొని వెనుక వెనుకకు నడుచుచు) తాళండి వెళుతూ వున్నాము. (అని గుమ్మముచేరి పరుగెత్తుచున్నారు)

సుబ—వేగిరం వెళ్ళకపోతే యీపుస్తకాలకట్ట పుచ్చుకుని నెత్తి పగలవేస్తాను. (అని రెండుచేతులతోను రెండు తాటాకుల పుస్త కములు పిసరివేయుచున్నాఁడు.) దెబ్బ తగలలేదు. వాళ్ళు తప్పించు కుని పారిపోయినారు. ఇఖ నేను యీయింట్లో వుండకూడదు. యీ వూళ్ళో యింతమంది పిచ్చవాళ్ళు బాహాటంగా తిరుగుతూవుంటే పట్టు కోకుండా పోలీసువాళ్ళు యేమి చేస్తూవున్నారు? నేను యిప్పుడు మా యుసలి పిచ్చాయనను తీసుకునివెళ్ళి ప్లేషనులో వప్పగించి ఆయన కూతురిని తీసుకుని లేచిపోతాను. సుమతికూడా నేను కనపడినప్పుడల్లా యేదో వింతగా చూస్తుంది.

[సుమతి ప్రవేశించుచున్నది.]

సుమ—(కలయఁజూచి) యీపుస్తకాలన్నీ యీలాగు పారవేసి వున్నవేమి?

సుబ—సుమతీ! యీపుస్తకాలా?

సుమ—(తనలో) ఇతడే పారవేసినట్టున్నాడు. న న్నేమి చేసి పోతాడో అని నాకు భయం వేస్తూ వున్నది. (అని పరుగెత్తఁబోవు చున్నది.)

[తేజి పాలు చూచుచు మతిమంతుఁడు పరికించుచున్నాఁడు.]

మతి—అమ్మాయీ! భయపడకు. అబ్బాయీ! కొంచెం శాంతించు. పుస్తకాలు పాడుచెయ్యకు. (అని యాతనివంక రెప్ప వాల్చకి చూచుచున్నాఁడు.)

సుబ—మామా! అంతాచెపుతాను వినండి. నేను మహా నెమ్మదైనవాణ్ని. నాకు సాధారణంగా కోపగా రాదు. యీమధ్యింట్లో జరుగుతూవున్న పిచ్చపనులవల్ల నావంటి శాంతుడికికూడా కోపం వస్తూవున్నది. యిఖ నైనా మీరు యీపిచ్చపనులు కట్టిపెట్టకపోతే మిమ్మలినికూడా మెడపట్టుకుని అవతలికి గెంటివేస్తాను.

మతి—(చిఱునవ్వుతో రెప్పవాల్చక చూచుచు) సుబలా! కొంచెం శాంతించు. (తనలో) యిప్పుడు లొంగుబాటులో లేడు. పోలీసుబంట్రోతు వస్తే బాగా వుండును.

సుబ—శాంతిస్తాను. (అని మీదికి వచ్చుచున్నాఁడు.)

సుమ—బావా! ముసలాయనజోలికి రాకు. (అని యిద్దఱికిని నడుమ వచ్చుచున్నది.)

మతి—అమ్మాయీ! అడ్డంరాకు. నాకు భయంలేదు. నన్ను యోగదృష్టితో చూడనియ్యి.

సుబ—ఓప్రియురాలా! నీ వేమీ భయపడకు. నీతండ్రికి నేనేమీ అపాయం చెయ్యను. మామగారూ! నేను వక్కనిముషం మీతోమాత్రతో మాట్లాడవలెను. దయచేసి మీరు వక్కపర్యాయం అవతలికి వెళ్ళండి. (అని సుమతిని ముందుకు లాగుకొని మతిమంతుని మెల్లగా గుమ్మమువద్దకు త్రోసికొనిపోయి యావలకుఁ బంపి తలుపు వేయుచున్నాఁడు.)

సుమ—అయ్యో! మానాన్నగారు—

సుబ—సుమతీ! నీ వికారపుచేష్టలు మాని వక్కనినుషం నాతో నెమ్మదిగా మాట్లాడు. యీలావచ్చికూర్చో నాకేసి బెగరి చూడకు. నాహృదయేశ్వరీ! భయం మాని నేను యిప్పుడు తరిమివేసిన యిద్దరు ముసలివాళ్ళూ యెవరో చెప్పు.

సుమ—(కూచుండి) వారు పిచ్చవైద్యులు.

సుబ—వాళ్ళు పిచ్చవాళ్ళని నేను చూడడంతోటే అనుకున్నాను.

సుమ—వారికి పిచ్చలేదు. వారు పిచ్చకుదిర్చే వైద్యులు. నీ పిచ్చ యెటువంటిదో చూడడంనిమిత్తం వారు వచ్చినారు.

సుబ—యేడిసినారులే. సుమతీ! భయపడకు. తిన్నగాకూర్చో. నాకేసి మొగం యెత్తిచూడు. మనబాల్యస్నేహం మంతా యీనాలుగు సంవత్సరాలలోనే మరచిపోయినావా?

సుమ—(అతనివంక చూచుచు) బావా! నీకు నిజంగా పిచ్చ వున్నదో లేదో చెప్పు.

సుబ—నీ కలాగంటి సంశయం యెందుకు కలిగింది?

సుమ—తల్లి పోయినప్పటినుంచీ మీనేనల్లుడికి విచారంచేత పిచ్చియెత్తిపోయిందని మీనాన్నగారిపేర మీబావయ్యగారే వ్రాసినారే.

సుబ—దాని కర్థం స్పష్టంగా తెలుస్తూనే వున్నది. విచారంచేత పిచ్చయెత్తిపోయిందంటే దుఃఖంచేత యేమీ తోచకుండా వున్నదని అర్థం నీకు బోధపడలేదా? నన్ను చూచినతరువాత యిప్పుడైనా నాకు పిచ్చ లేదని నీకు నిశ్చయం కలిగిందా లేదా?

సుమ—నీవు యిప్పుడు మంచివాడవుగానే కనపడుతూ వున్నావు.

సుబ—అలాగైతే నిన్ను వక్రపరీక్ష అడుగుతాను. నిజం చెప్పు. నిన్ను మీనాన్నగారు యెవరికైనా యిచ్చి వివాహం చెయ్యడానికి నిశ్చయించినారా యింకా లేదా?

సుమ—(తలవంచుకొని) యింకా యెవరికీ యివ్వడానికి నిశ్చయం చెయ్యలేదు.

సుబ—ఆలాగయితే నన్ను వివాహం చేసుకోడానికి నీకు యిష్టం వున్నదా? మనం యిద్దరమూ మేనత్తమేనమామ బిడ్డలమూ బాల్యస్నేహితులమూ మాత్రమే కాకుండా యేకశరీరులము కూడా కావలె నని నాకు కోరిక వున్నది. వేగిరం చెప్పు.

సుమ—నేను ఆలోచించుకొని చెపుతాను.

సుబ—ఆలోచనా లేదు యేమీ లేదు. వప్పుకో.

సుమ—నీవు యీసంగతి మీనాన్నగారిని అడగవలెను.

సుబ—ఆయన వప్పుకోడు. ఆయన యిప్పుడు నన్ను చేసిన అవమానానికి నేను తగినపని చేస్తాను.

సుమ—నీవు ఆలాగంటివని యెంతమాత్రమూ—

సుబ—కొందరపడబోకు. నిజంగా నేను యేమీ చెయ్యను. పరియాచకానికి వక్రతమాషా చేస్తాను. ఇందులో నాకు నీవు కూడా సహాయం చెయ్యవలెను.

సుమ—అదేమిటో అంతా నాతోచెప్పు.

సుమ—ముందుగా చెప్పడానికి వల్లకాదు. కాని కొంచెం సేపటికి నీ కదంతా తెలుస్తుంది. ఆయన నన్ను పిచ్చివాణ్ణిగా కట్టి వేసినాడు. ఆయనవిషయంలో ఆపని నేను చేస్తే ఆయనకు యేలాగు వుంటుందో చూతాము.

సుమ—ఆయనకు యేమీ శరీరబాధమాత్రం చెయ్యకు. ఆయన

పిలుస్తూవున్నారు. నేను తలుపుతీసి లోపలికి వెళ్ళిపోతాను. (ఆ ప్రకారముగా చేయుచున్నది.)

[మంగలికత్తి చేతఁబట్టుకొని మతిమంతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

మతి—(తనలో) నేను యిప్పుడు యితనికి తల గొరగవలెను. లేకపోతే పిచ్చ నిమ్మళించదు.

సుబ—(తనలో) ఇతడు మంగలికత్తి తెచ్చినాడు. గొంతుక కోస్తాడా యేమిటీ? (బిగ్గరగా) మామా! ఆగండి. ఆచేతిలోది దూరంగా పెట్టండి.

మతి—(తనలో) ఇతని కప్పుడే అనుమానం కలిగింది. యేమరి పాటుగా వున్నప్పుడు ఆపని చెయ్యవలెను. (బిగ్గరగా) అబ్బాయీ! నాదగ్గిరగా వచ్చి కూర్చో.

[గౌరి ప్రవేశించుచున్నది.]

గౌరి—(మతిమంతునితో) అయ్యా! తమకోసం యెవరో తమా షావేషం వేసుకుని వకమనిషి వచ్చినాడు. (అని తనలో నవ్వుకొనుచు సుబలునికి చేసైగ చేయుచున్నది.) అతను ఠాణానుంచివచ్చినా నని చెప్పినాడు.

మతి—అతణ్ణి లోపలికి తీసుకుని రా. తక్షణం తీసుకుని రా. (తనలో) సందేహం లేదు. అతను పోలీసు బంటోతు. అతను మంచి సమయంలో వచ్చినాడు. అతను యితనితల కట్టిగాపట్టుకుంటే యీ కత్తితో నేను తుదముట్టించేస్తాను. (అని కత్తి పయికి తీయుచున్నాఁడు.)

గౌరి—యిప్పుడే తీసుకునివస్తాను.

(అని వెళ్ళుచున్నది.)

సుబ—(మతిమంతుని మొగమువంక చూచుచు) ఈమనుసలా యీనకు నిజంగానే పిచ్చ అనుకుంటాను.

[మొగము కనబడకుండ ఎఱ్ఱతలగుడ్డ వికారముగా చుట్టుకొని రాముడు ప్రవేశించుచున్నాడు.]

మతి—ఇఁక నేను సిద్ధంగా వుండవలెను. (అని కత్తి క్రిందపెట్టి బట్ట సవరించుకొనుచున్నాఁడు)

సుబ—ఇదుగో రాముడు వచ్చినాడు. నాఅదృష్టం బాగా వున్నది. (అని రామునకు చేసైగచేయఁగా రాముఁడు మరల సైగ చేయు చున్నాఁడు.) మామా! ఈమనిషి వేషం బహువిచిత్రంగా వున్నది. ఇతడు ఇక్కడికి యెందుకు వచ్చినాడు?

మతి—యెందుకూలేదు. వూరికే వచ్చినాడు. ఇతడు గారిడీ చేస్తాడు. (అని రామునిదగ్గరకు పోయి సుబలుని చూపి సైగచేసి మెల్లగా) నేను పట్టుకోవడానికి కబురుపంపించిన చిన్నవాడు ఇతడే. నీవు భయపడకుండా గట్టిగా పట్టుకోవలెను.

రాము—మీరు ముందు నడవండి. ముసలివారు మీరే భయ పడకపోతే నేను భయపడుదునా?

మతి—(రామునితో) నేను యోగదృష్టితో చూచి అతణ్ని కదలమెలకుండా చేస్తాను. అతడు నిశ్చేష్టితుడై చిత్రపుపతిమలాగు వున్నప్పుడు నీవు వెళ్ళి పట్టుకోవలెను.

రాము—మీయోగదృష్టి గీగదృష్టి యేమీ నాకు సహాయం అక్కరలేదు. నేను సిద్ధంగా వున్నాను.

మతి—నే నాకుర్చీ తెచ్చి ఇతనికి యెదురుగా వేసుకుని కూర్చుంటాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

సుబ—(రామునితో) ఆతడు కుర్చీలో కూర్చోవడంతోటే నీవు వెనుకనుంచి తాళ్ళువేసి వెంటనే కట్టవలెను.

రాము—మంచిది అలాగే చేస్తాను. ఇదుగో తాళ్ళు నా

చేలోతు సిద్ధంగానే వున్నవి. (అని చూపుచున్నాడు)

మతి—(కుర్చీ తెచ్చి సుబలున కెదురుగా వేసికొని కూరు చుండి రెప్పవాల్చక సుబలుని చూచుచు) అబ్బాయీ! జాగ్రతగా కూర్చో (అని వెనుకతిరిగి రాముకి సైగలు చేయుచుగా సుబలు దుకూడ సైగలు చేయుచున్నాడు) అబ్బాయీ! నీవు యిందాకా చాలా దురుసుగా వున్నావు. ఇప్పుడు నెమ్మదిపడ్డా వనుకుంటాను. (అని రెప్ప వాల్చక మరల సుబలుని చూచుచున్నాడు.)

సుబ—అవును (అని కన్ను లరమోడ్చి కుర్చీకి జేరగిలబడి కూర్చుండి నిద్రిపోయినట్లు నటించుచున్నాడు.)

మతి—(మెల్లగా) ఇదే సమయం. ఇతడు నాతిపోమహిమచేత యోగనిద్రలోపడి దేహం తెలియకుండా వున్నాడు. ఇతణ్ని యిప్పుడు పట్టుకుని కట్టిపెట్టివెయ్యి.

రాము—అలాగే చేస్తాను. మీరు రెప్పవాల్చకుండా అతని కేసి చూస్తూవుండండి. (అని తాళ్ళు పయినుండి పోనిచ్చి మతిమంతు నినే కుర్చీ కంటకట్టుచున్నాడు.)

మతి—(పెదగులాడుచు) ఓరి బుద్ధిహీనుడా! ఇంకుంకో నీవు పొరపాటుపడి వకరిని కట్టడానికి వకరిని కట్టినావు.

రాము—వూరికే పెదగులాడకండి. నేను యెప్పుడూ పొర పాటుపని చేసేవాణ్ణి కాను. (అని మరింత గట్టిగా బిగించి కట్టు చున్నాడు.)

మతి—(కోపముతో) ఇదేమిపని? నేను చెప్పినాకానీ నీకు బుద్ధిరాకుండా వున్నదేమి? పిచ్చివాణ్ణి నేను కాను. నాకు యెదు దుగా కుర్చీమీద కూర్చున్న అతడు పిచ్చివాడు.

రాము—(అద్భుతపడ్డట్టుతలయూచుచు) పిచ్చివాళ్ళు యెప్పుడూ

ఇలాగే అంటూవుంటారు.

సుబ—నాకు బహువిచారంగా వున్నది?

రాము—నాకూ విచారంగానే వున్నది. అయినాకానీ పిచ్చి వాళ్ళ విషయంలో చెయ్యగలిగినపని చెయ్యక తప్పదు.

మతి—(ఆగ్రహముతో) ఓరి పశువా! నేను పిచ్చివాడ నుటా? (అని పండ్లు పటపట కొరుకుచున్నాడు.)

రాము—ఇతనిది సాధారణమయిన పిచ్చకాదు. నేను ఇంత మంది పిచ్చివాళ్ళను చూచినాను గాని ముసలితనంలో ఇలా పళ్ళు కొరికేపిచ్చి నేను ఇదివరకు యెక్కడా చూడలేదు. మీరేమంటారు?

సుభ—అవును. ఇది బహుప్రబలమయిన పిచ్చి.

మతి—సుబలా! నీవు పిచ్చిలోవుండి యీదౌర్జన్యంలో నీవు నాకు యేమీ సహాయం చెయ్యలేని స్థితిలో వున్నందున నాకుబహు వ్యసనంగా వున్నది.

సుబ—నాకూ వ్యసనంగా వున్నది.

రాము—ఈపిచ్చాయనతో మాటకుమాట జవాబు చెప్పకండి.

మతి—ఓ రామా! ఓసుమతీ! ఓగౌరీ! వేగిరంవచ్చి నన్ను విడదలించండి. (అని పెనుగులాడుచు కేకలు వేయుచున్నాడు.)

[సుమతి ప్రవేశించుచున్నది]

సుమ—అయ్యో!—

మతి—(వికారముగా కాళ్ళును చేతులుసు గింజుకొనుచు) అమ్మాయీ సుమతీ! రా. వేగిరం రా. నాకట్లు విడిపించు. పిచ్చివాణ్ణి నేను కానని యీపశువుతో చెప్పు.

సుమ—(ఏడ్చుచూ) అయ్యో! గొప్పవిపత్తువచ్చినది. యీమధ్య మీచేష్టలుచూచి యెప్పుడో యింతగతి పడుతుందని నేను యిదివరకే

భయపడుతూ వున్నాను.

రాము—అమ్మా! యెందుకు విచారిస్తావు? పిచ్చివాణ్ని కట్టి వేస్తే క్షేమమేకాని యెవరికీ విపత్తు లేదు.

మతి—(కన్ను లెఱ్ఱఁజేసి పండ్లు కటకట కొఱుకుచు) పరమ సిర్రాబ్బ్యురాలా! బుద్ధి లేకుండా నీవుకూడా నీతండ్రికి పిచ్చి అంటూ వున్నావా? చూడు నిన్ను—(అని ముందుకు జరుగుచున్నాఁడు)

సుమ—(పరుగెత్తి) సుబలా! నన్ను రక్షించు. ఓరీ! అబ్బీ! నీవు ఆయిసను గట్టిగా పట్టుకుని నామీదికి రాకుండా చెయ్యలేవా?

రామ—చేస్తాను. మనయింట్లో చేంత్రాడు యెక్కడ వున్నది?

మతి—(కోపముతో) ఓరిశుద్ధదున్నపోతా! నీకండకావరం—

రామ—ఈయనను చూడండి. ఈయనపని యీలా కుదరదు. అయ్యా! సుబలా! ఈయనకు వీవరం చేసి నివ్మకాయల పులుసు పట్టించి నీళ్ళు పోస్తేనే కాని ఈవుద్రేకం తగ్గదు.

సుబ—అలా చేతాము. దీనితో పిచ్చి బొత్తిగా పోకపోయినా కొంచెం ఉపశాంతి కలుగుతుంది. (అని క్రిందనున్న మంగలికత్తి తీయఁ బోవుచున్నాఁడు.)

మతి—(మరింత గట్టిగా గింజుకొనుచు) సందేహం లేదు. వీళ్ళు యిప్పుడు నన్ను చంపివేస్తారు. ఎక్కడ్నారి నేను వీళ్ళను యోగదృష్టితో చూచి స్తంభింపజేస్తినా—

[సుబలుఁడును, రాముఁడును మతిమంతుని తలగొఱుగుటకు సిద్ధపడుచుండఁగా సదానందయోగియు, గజానసదానును ప్రవేశించుచున్నారు]

సదా—(గజాననసదానుతో) ఇది మరీవింతగా వున్నది.

సుబ—(వెనుకకుతిరిగి వారిని చూచి) ఇదగో యయ్యాయనపిచ్చోళ్ళు హితులుకూడా వచ్చినారే. రామా! ఎక్కడనిమువం ఆగు.

రాము—ఈలోగా నీళ్ళతో తల తడుపుతూవుంటాను.

సుబ—వద్దువద్దు. (అని మతిమంతుని వెనుకవైపునున్న సదా నందయోగి గజాననదాసులవద్దకు వెళ్లుచున్నాడు.)

రాము—మంచిది. (అని వెనుకతిరిగి చూడకుండ మతిమంతుని కుర్చీలో నదిమిపట్టుచున్నాడు.)

సుబ—(ఆవైద్యాలచేతులు పట్టుకొని) మీరు మంచిసమయంలో వచ్చినారు. మీరాక నాకు బహుసంతోషంగా వున్నది.

సదా—నాకూ సంతోషంగానే వున్నది.

గజా—నాకూనూ.

సుబ—మీరు యిటువంటిఘనవైద్యులన్నమాట నాకు మొట్ట మొదట తెలియలేదు. మీగు యిద్దరూ ధన్వంతరియొక్క అపరావ తారాలు.

సదా—ఈచిన్నవాడు చాలాబుద్ధిమంతుడులాగు కనపడుతూ వున్నాడు.

గజా—అయ్యా! మీరు మహాసరసులు.

మతి—(వారి కంఠస్వరము గుఱుతుపట్టి) ఓసదానంద యోగీ! గజాననదాసా! మీరు యిది చూచినారుగాదా? నన్ను మీరు చూడ గలరుగాని మిమ్మలిని నేను చూడలేను. మాయింట్లోవున్నవారందరికీ వకసారిగా పిచ్చియెత్తిపోయింది. ఈశుపాయుడు పోలీసువాడి వేషం వేసుకునివచ్చి నన్ను కట్టివేసినాడు.

సుబ—అయ్యా! మా మామగారు యెటువంటి దురవస్థలో వున్నారో మీరు చిత్తగించినారా?

రాము—యెవరికీ హాసి కలుగ లేకుండా తన్ను కోపాడుతూ వున్నవాణ్ని నన్ను యెలాగు దూషిస్తూవున్నారో చూచినారా?

సదా—ఇదిగో వచ్చి చూస్తాము. (అని వారిద్దరును చేరువకు రాగా రాముడు ముందుకు వచ్చుచున్నాడు.)

మతి—ఇప్పుడు కన్నులయెదటికి వచ్చినావు. ఇఖ యోగ దృష్టితో చూచి నిన్ను నిముషంలో నాస్వాధీనం చేసుకుంటాను. (అని రామునివంక రెప్పవాల్చక చూచుచున్నాడు.)

రాము—నీమంత్రం పారకుండా నేనూ మిమ్మలిని యోగ దృష్టితో చూస్తాను. (అని గ్రుడ్లు పెద్దవిచేసి తేటిపార చూచు చున్నాడు.)

సదా—(మతిమంతునివంక చూచి) ఈయన వెర్రిచూపులు చూస్తూవున్నాడు. గుడ్లు పెద్దవయినవి. ఇది పిచ్చకావడానికి సందేహం లేదు. నేను మొదటినుంచీ యీయనకు యెప్పుడో పిచ్చ యెత్తుతుందనే అనుమానపడేవాణ్ని.

గజా—(మతిమంతుని తేరిపార చూచి) ఆముఖచిహ్నాలనుబట్టి చూస్తే యిది భూతావేశంగా తోస్తూవున్నదిగాని చూపులలో పిచ్చ లక్షణం యెంతమాత్రము కనపడడం లేదు.

సదా—మనం నాడికూడా పరీక్షచేసి చూతాము.

రాము—అయ్యా! వైద్యులు చెయ్యి చూస్తారట. మీచెయ్యి వక్కమాటు చూపండి.

సదా—అయ్యా! కుడిచెయ్యి యిలాగివ్వండి. (అని మణికట్టు పట్టుకొనుచున్నాడు.)

గజా—ఎడమచెయ్యి నాచేతి కివ్వండి. (అని పట్టుకోబోవు చున్నాడు.)

మతి—(చేయి వదల్చుకొని గిజుకొనుటచేత కట్టినతాళ్ళు కొంచెము వదులు కాగా కుర్చీతోలేచి) ఓ ముసలిగాడిదెకొడుకు

ల్లారా! మిమ్మలిని యిద్దరినీ తల బద్దలుకొడుతాను వుండండి. నాకు కాదు మీకే పిచ్చయెత్తింది. (అని యిద్దటిని చెరియొకగుద్దును వేయఁగా వారు పరుగెత్తుచున్నారు)

రాము—(మతిమంతుని కుర్చీకాళ్ళు పట్టుకొని వెనుకకులాగుచు) మీకు భయం లేదు. మెల్లిగా పరుగెత్తండి.

మతి—పిచ్చికుక్కలకొడుకుల్లారా పారిపోకండి. (అని కుర్చీతో రాముని వారికేసి యీడ్చుచు రాముఁడును తానును ముందుకు పడుచున్నారు.)

సుబ—అయ్యో! (అని నవ్వు పట్టలేక నోటికి చేయడ్డము పెట్టుకొని క్రింద కూలఁ బడుచున్నాఁడు.)

సుమ—అయ్యో! (ఏడ్చుచు తండ్రికి సహాయపడుటకు పరుగెత్తుచున్నది.)

రాము—నామోకాళ్ళు విరిగిపోయినవి. (అని లేచి సుమతి సహాయముతో మతిమంతుని కుర్చీకట్లు విప్పుచున్నాఁడు.)

సుమ— బాబయ్యగారూ! మీకు దెబ్బ తగలలేదుగదా. సుబలా! నీవు వట్టి అల్లరివాడ వయినావు (రాముని మొగమువంక చూచి) ఓస్సి! వీడు మన రాముడేనా? తలగుడ్డా వేషమూ చూచి యెవరో అనుకున్నాను.

మతి—(మెల్లగా లేచి) రాముడా? వీడికిచేటుకాలం వచ్చిందేమి? యింతలో యేదో కుటిల వున్నది. (వెనుకతిరిగి సుబలుఁడు నవ్వుచుండుట చూచి) ఆ పిచ్చకుర్రవాడు యేలా నవ్వుతూవున్నాడో? ఇదంతా అతనిపని అయి వుంటుంది.

సుబ—మామా! మీకు వెయ్యినమస్కారాలు చేస్తాను. ఈ పని చేసినందుకు నన్ను క్షమించండి. మీదగ్గిర చేరేవాళ్ళూ మీ

దగ్గిర యోగమనీ మంత్రాలనీ మాట్లాడేవాళ్ళూ యెటువంటివాళ్ళో చూపించడానికి నేను యీపని చేసినాను

మతి—(తనలో) వీడు మహా తెలివయినవాడుగా కనపడుతూ వున్నాడు. (బిగ్గరగా) అబ్బాయీ! యిక యీవైద్యులనిద్దరినీ మన యింటికి యెప్పుడూ రానియ్యను. నేను నీ వన్నట్లు యోగపుశిచ్చు మానివేసి తెలివి గలిగి వుంటాను.

రాము—వీ రిద్దరూ సఖ్యపడ్డారు. ఈయన నాతాళం పట్టిస్తాడు. దూరంగా నెళ్ళవలెను.

మతి—(రాముని జూచి) పోకు. ఆగు. నీకు యేమిశిక్ష చెయ్యవలెనో నాకు తెలియకుండా వున్నది.

రాము—ఈచిన్నవాడిదిగాని యిందులో నాతప్పితం యెంత మాత్రమూ లేదు.

మతి—చాలును. ఈపాటి నోరుమూసుకో. నిన్ను పనిలో నుండీ తీసివెయ్యవలెను.

[అంతట గౌరి ప్రవేశించుచున్నది.]

గౌరి—అయ్యా' మీరు నామనవి చిత్తగించవలెను.

మతి—ఓరీ! నీ వీగౌరిని పెళ్ళాడుతావా? నిన్ను క్షమిస్తాను.

రాము—ఏమి? గౌరీ! నన్ను పెళ్ళిచేసుకుంటావా?

గౌరి—అయ్యగారియిష్టం వుంటే నేను వద్దంటే మానుతుందా?

మతి—(తనలో) బావా మరదలూ వాళ్ళు యెట్లా మాట్లాడుకుంటూవున్నారో!

సుబ—మామగారూ! మీస్నేహితులను పంపించి వారిచేత నన్ను కావలసినన్నిప్రశ్నలు వేయించినారు. మిమ్మలిని నేను నక్క ప్రశ్న వేస్తాను. దానికి జవాబు చెప్పండి. మీకొమార్తెను నాకు

యిస్తారా యివ్వరా చెప్పండి.

మతి—అమ్మాయీ! యీ దేమిటి? ఇతనిజబ్బుసంగతి నీ వెరుగు దువుగదా.

సుమ—ఆవిషయంలో నాకేమీ భయంలేదు. నేను వ్యుపచారం చేస్తూవుంటే యితని కన్నిపిచ్చలూ పోతవి.

సుబ—ఆమాట నిశ్చయం. మీ రావిషయంలో యేమీ భయపడవలసిన పనిలేదు యిప్పుడు నేను మీకు మంచివాణ్ణి కానని తోస్తే యిఖ ముంటైనా మీచేత నిజంగా మంచివా ణ్ననిపించుకోవ డానికి ప్రయత్నంచేస్తాను. నా నడతవల్లనే మీ కన్నీ తెలుస్తవి.

మతి—అమ్మాయీ! నీచుట్టూ పిచ్చకొడుకులనూ పిచ్చ కూతుళ్ళనూ పెట్టుకోవడానికి నీకు యిష్టంవున్నట్టయితే నీకోరికకు నేను యేమీ అడ్డం చెప్పను. ఇంతలేసీ యింతలేసీ పిల్లవాళ్ళను నేను నిత్యమూ యోగదృష్టితో చూస్తూ యీకంటితో యిద్దరినీ ఆకంటితో యిద్దరినీ శాంతపరుస్తూ వుంటాను. నాయోగమహిమ లోకానికి కనపరచడానికి నాకు ముందు మగచిఅవకాశం కలుగుతుంది. (సుమతిని సుబలుని చెఱియొకచేతితోను నిమురుచు) బిడ్డలారా! నీరు దీర్ఘా యుష్మంతులయి సుఖపడండి.

రాము—(గొరిచేయి పట్టుకొని ముందుకువచ్చి) అయ్యా! మీరు మమ్మలినికూడా వక్కమాటు ఆశీర్వదించండి. యిదే నాకు మీ ఆఖరుదీవెన. ఇదివరదాకా స్వతంత్రంగా వుండేవాణ్ణి. ఇప్పుడు యీగొరమ్మచేతులో పడ్డాను. ఇది యిక నన్ను నగలు తెమ్మని చంపుతుందో బ్రతికిస్తుందో దేవుడికి తెలియవలెను. మీకు నాచాపు తప్పించవలెనని వున్నట్టయితే రెండువందలరూపాయలు ఇవ్వండి. నగలు చేయించుకుంటాము. మీ పాతతాటాకుల పుస్తకాలు వక్కవడి నాకు

దయచేసినారంటే యీశీతాకాలము చలిమంటవేసుకుని మీరు పెళ్ళి చేయించినదాకు మీపేరు చెప్పుకుని సుఖపడుతాము. అప్పటితో నాకు నిత్యమూ పురుగులు దులపవలసిన బాధకూడా విరగడైపోతుంది.

మతి—ఓరీ మోటపశువా! పవిత్రమైన పుస్తకాలవిషయమై అటువంటి మాటలంటే పాపం వస్తుంది. వూరుకో.

సుమ—రామా! బాబయ్యగారి మనసు నొచ్చేమాట లనకు. మావివాహం అయిన తరువాత మిమ్మలిని ఇద్దరిని మాదగ్గిర వుంచుకుని నీపెళ్ళాము నిన్ను మింగివెయ్యకుండా కాపాడుతాములే.

సుబ—మామగారూ! మీరు నన్ను నిష్కారణంగా పిచ్చివాణ్ని చేసినారు. అందుచేత నేను మిమ్మలిని మళ్ళీ పిచ్చివాణ్ని చేసినాను. వంతుకువంతు సరిపోయింది. ఇకమించి ఇఖ మీరు చెయ్యవలసిన పని శీఘ్రంగా చేయించండి.

మతి—రండి లోపలికి వెళుదాము. రామా! నీవు బంధువుల కందరికీ శుభలేఖలుతీసుకొని వెళ్ళవలెను. రేపు ప్రయాణానికి సిద్ధంగా వుండు.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

మహావంచకప్రవాసనము.

ఇందు వచ్చుపాత్రములు.

జియ్యరుసూరి—భనికుండగు నొక చైతన్యమతస్థుడు.
దామోదరుడు—జియ్యరునూరి సేవకుడు.
నారాయణుడు—కంఠీరవదేవుని సేవకుడు.
శ్రీమన్మహామండలేశ్వర కంఠీరవదేవు—రామానుణి సియుడు.
వంచకాచార్యులు—కంఠీరవదేవుని కల్పితజనకుడు.
భవానిసింగు—రాజభటుడు.
శివప్రసాదు—రాజభటుడు.
రామామణి—జియ్యరుసూరికూఁతురు.
పార్వతి—జియ్యరుసూరి దాసి.

౧. రంగము—బృందావన పురములోని జియ్యరుసూరి యిల్లు.

[దామోదరుడును పార్వతియు ప్రవేశించుచున్నారు]

దామో—పొద్దున్నే లేవడంవల్ల యెంతలాభం వున్నదో చూచినావా! గువరుణ్ణి చూచిపోతారనే భయంలేకుండా మనం స్వేచ్ఛగా సరసాలాడుకుంటూ వున్నాము.

పార్వ—మన యజమానురుగారు లేచివచ్చేవేళ అయింది. ఆయన యీసమయంలో యిక్కడకు వస్తే యేమనుకుంటారు?

దామో—ఆయన మన యిద్దరిపెళ్ళీ చెయ్యవలెసనుకుంటారు. ఆయన యేమనుకుంటే యేమిలే. నేను అనేదాన్ని విను. నేను

యిక్కడ పనిచేస్తూవున్న ఘది సంవత్సరాలలోనూ నాజీతంలోనుంచీ నాహా స్తలాఘువంచేతనూ నూరురూపాయలు కూడబెట్టినాను. అనుభవించేవారు లేకపోతే పదేళ్ళనుంచీ కూడబెట్టిన యీసొమ్మంతా వ్యర్థమయిపోతుంది.

పార్వ—నేను అనుభవిస్తాను. ఆసొమ్మ నాకియ్యి.

దామో—వూరికే అనుభవించడంకాదు. నీవు నాతో కలిసి అనుభవించవలెను.

పార్వ—మనం యిద్దరమూ కలిసే అనుభవింతాము. మన అమ్మగారు కంఠీరవదేవుడిగారిని మోహించినసంగతి నీవు విన్నావా?

దామో—ఆవిడె కతనిమీద మోహంవున్నసంగతి యెరుగుదును గాని, అయ్యగా రావివాహానికి వప్పుకోరు. ఆయనకు యీసంగతి తెలియడంతోటే—

జియ్యరునూరి—(వెలుపలినుండి) దామోదరా! మొఖం కడుక్కోవడానికి నీళ్ళు.

దామో—అరుగో అయ్యగారు లేచినారు. నేను వేగిరం వెళ్ళవలెను. వక్కముద్దు పెట్టు వెళ్ళిపోతాను. (అని వెళ్ళుచున్నాడు.)

పార్వ—దామోదరుడు వెళ్ళిపోయినాడు. వీడు నాకంటికి యమధూతులాగు వున్నాడు. పైత్యహారమని అయ్యగారు పొద్దున్నే పెసరట్టు ఫలహారం చేస్తారు. నేను అన్నీ సిద్ధంచెయ్యవలెను. అడుగో టపాబంటోతు దొడ్డిలోవను వుత్తరం తీసుకునివచ్చినాడు. ఇది దామోదరునికి కంఠీరవదేవుడుగారు పంపించినది వుంటుంది. నేను వెళ్ళి పుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నది.)

[దామోదరుడు వెంటరాగా జియ్యరునూరి ప్రవేశించుచున్నాడు.]

జియ్య—దామోదరా!

దా మో——అయ్యా!

జి——యేమీ లేదు. నీతో చెప్పకూడదు. పెసరట్టు ందా?

దా——అుంది. అయ్యా! నాతో——

జి——నీతో చెప్పను. వి స్తరి తీసుకుని రా.

దా——చి త్తం దయచేసి——

జి——వూరుకో? రొట్టెలు తీసుకుని రా.

దా——తీసుకువస్తాను.

జి——వచ్చేటప్పుడు రాత్రి వచ్చిన వృత్తాంత పత్రిక కూడా తీసుకుని రా.

దా——చి త్తం. (అని వెళ్ళుచున్నాఁడు.)

జి——(పీటమీఁద కూరుచుండి) నేను యీవూరికివచ్చి యీ తోట యింట్లో ప్రవేశించి ఖులాసాగా వున్నాను. ఆపెద్దమేడలో వున్నప్పుడు నన్నందరూ వచ్చి డబ్బుకోసం వూరికే బాధపెడుతూ వుండేవారు. ఈయిల్లు వూరిచివరను మారుమూలను వుండడంచేత యిక్కడకు ఆట్టేమంది రారు. అడుగో దామోదరుడు వార్తాపత్రిక పట్టుకుని వస్తూవున్నాడు.

[దామోదరుఁడు పెసరట్లును, వృత్తాంతపత్రికయు, ఉత్తరమును పట్టుకొని ప్రవేశించుచున్నాఁడు.]

దా——పెసరట్టు——

జి——పెసరట్లు కింద పెట్టి పత్రిక ముందుగా యిలా ఇయ్యి.

(అని పుచ్చుకొనుచున్నాఁడు.)

దా——అయ్యా! పెసరట్లు చాలునా? ఇంకా రెండు తేనా?

జి——చాలును. వకటి యిలా చేతికందియ్యి. (అని పత్రిక విప్పి చదువుచున్నాఁడు)——"ఇప్పుడు కొత్తమోస్తరు మోసాలు మఱి

యెక్క-వవుతూ వున్నవి. కాకినాడలో వారంరోజులకిందట మంచి బట్టలు కట్టుకొని గోపాలదాసని పేరుపెట్టుకుని బంధువుడనని వక పెద్దమనిషియింట్లో ప్రవేశించి వారియింట్లో భోజనంచేసి తరువాత వారియింట్లో వున్న వస్తువులు కొన్ని యెత్తుకొని వకడు పారిపోయి నాడు. అతనిజాడ యింకా యేమీ తెలియలేదు. దర్యాప్తుచెయ్యగా అతని నిజమయినపేరు వంచకాచార్యుడనిన్నీ, అతను యింకా అనేక చోట్ల యిటువంటి మోసాలు చేసినాడనిన్నీ పోలీసువారికి తెలియ వచ్చింది.''—ఇది వట్టి పాడుప్రపంచము. అందరూ మోసగాళ్ళుగానే కనపడుతూ వున్నారు. యెవరినీ నమ్మకూడదు. మనం బహుజాగ్రతగా వుండవలెను. (అని రొట్టె నములుచు) దామోదరా! మంచి తీర్థం తీసుకుని రా.

దా—మీపేటదగ్గిరనే పెట్టేనాను. తమరు సెలవిచ్చినట్లు యీ లోకం వట్టి పాడులోకంగా కనపడుతూవున్నది. ఇఁక యీలోకం వదలిపెట్టి మరియొక్కడికైనా లేచి వెళ్ళవలెను.

జి—రొట్టెలు బాగా వున్నవి కావు. వీటిని తీసుకుని వెళ్ళు. నీచేతిలోనిది యేమిటి?

దా—ఇదా? వుత్తరం టపాబంటోతు యిప్పుడే తీసుకుని వచ్చినాడు.

జి—(చేతితో పుచ్చుకొని) ఈవు త్తరం నాకేనా?

దా—కాదు. అమ్మగారికండి.

జి—అమ్మాయిదా! ఇది దానిప్రియుడు వ్రాసిందయివుంటుంది.

దా—అందుకు నాకేమీ సందేహంలేదు.

జి—నీకు సందేహం యెందుకు వుండవలెను? నీవు వెళ్ళి మా అమ్మాయిని వెంటనే యిక్కడికి పంపించు.

దా—చిత్తం. (అని వెళ్ళుచున్నాఁడు.)

జి—వీడు వూగికే అధికప్రసంగం చేస్తాడు. యిఁక ముందు వీణ్ణి విస్తారం మాట్లాడకుండా వుండేటట్టు చేసి యేప్రశ్న అడిగితే ఆప్రశ్నకు మాత్రమే జవాబు చెప్పేటట్టు చెయ్యనలె. అదుగో అమ్మాయి వస్తూవున్నది.

[దామోదరునివెంట రామామణి ప్రవేశించుచున్నది.]

రామా—నాన్నగారూ! మీవద్దకు నాది యేదో వుత్తరం వచ్చిందట. యిప్పిస్తారా?

దా—వుత్తరం వచ్చినసంగతి నేనే యీమెతో చెప్పినాను.

జి—నీవే చెప్పినావు గనుక నీవే అనుభవించు.

(అని నెత్తిమీఁద రెండుదెబ్బలు వేయుచున్నాఁడు.)

దా—నేను యిఁక యెప్పుడూ చెప్పను. పారిపోతాను. (అని పరుగెత్తుచున్నాఁడు)

జి—అమ్మాయీ! యిదుగో నీవుత్తరం. యీవుత్తరాలసంగతి నాకు బాగా తెలుసును. కామకులు వ్రాసే యిటువంటి వుత్తరాలను నమ్మి నీవు యెప్పుడూ మోసపోవద్దు. లోకానుభవం తెలిసినపెద్దవాణ్ణి గనుక నీకు బుద్ధి చెపుతూవున్నాను.

రామా— (తనలో) ఆలాగయితే యిది కంఠీరవదేవుగారు వ్రాసిందని యీయనకు తెలిసిందికాబోలును.

జి—యిందుకోసం నాకు నీమీఁద కోపం లేదు. యిది యెవరు వ్రాసిందో చెప్పు నాకు అంతేచాలును.

రామా—మీతో అంతా చెపుతాను. యీవుత్తరం వ్రాసిన ఆయన బహుగొప్పవాడు, నిజమయిన ప్రేమచేతనే నన్ను వరించినాడు, ఆయన పేరు—

[కరలు చేయుచు దాసోదరుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

దా—శ్రీమన్మహామండలేశ్వర కంఠీరవదేవుగారు.

రామా—ఆయన యిక్కడికే వచ్చినారా? అలాగయితే నేను వెళ్ళవలెను. (అని వెళ్ళుచున్నది.)

జి—మహామండలేశ్వరుడా? అలాగయితే ఆయనను వెంటనే దయచెయ్యమని చెప్పు.

దా—చిత్తం. (అని వెళ్ళుచున్నాఁడు.)

జి—మహామండలేశ్వరు డైతే చాలా గొప్పవంశంలోవాడై వుంటాడు.

[కంఠీరవదేవు ప్రవేశించుచున్నాఁడు.]

కంఠీ—జియ్యరుసూరిగారూ! నేడు బహుసుదినం. తమదర్శనం దొరకడంవల్ల నాకు బహుసంతోషంగా వున్నది.

జి—నేను ముసలివాణ్ణి; యీగౌరవానికి నేను అర్హుణ్ణి కాను. మీవంశంలో మీరే కడపటివారనుకుంటాను.

కం—దురదృష్టవశాచేత నేనే యిప్పుడు కడపటివాణ్ణయి మిగిలివున్నాను. మాపెద్దలందరూ దైవవశంచేత వక్కరూ లేకుండా కాలంచేసినారు. నాపేరు యీదేశంలోవుండే రాజసభలలో యెగత ప్రసిద్ధికెక్కిన దయినప్పటికీ, నేను వివాహం చేసుకోకపోయినట్టయితే మావంశము నాతోనే నష్టమయి పేరులేకుండా పోతుంది. మీ అనుమతిని పొంది మీకూమార్తెను భార్యనుగా గ్రహించవలె ననే వుద్దేశంతో నేను యిప్పుడు తమదర్శనానికి వచ్చినాను.

జి—నేను వక్కటి చెప్పుతాను వినండి. యెంతగొప్పవంశంలో పుట్టినవాడయినా డబ్బులేకపోతే యేమీ ప్రయోజనంలేదు. నాచిన్న తనంలో నేను భీదతనంవల్ల బహుకష్టాలు పడివున్నవాడను గనుక

డబ్బులేనివాడికి యెవరికీ నాకూతురిని యివ్వకూడదని నిశ్చయం చేసుకున్నాను. మీకు తగినంత ధనం వున్నట్టు మీరు నాకు తృప్తికరంగా కనపర్చేటట్టయితే పిల్లదాన్ని మీకు యిచ్చి వివాహం చెయ్యడానికి నాకు యేమీ అభ్యంతరం లేదు. యీపని మీరు చేసేవరకూ మీరు మళ్ళీ మాయింటికి రావలసిన పని వుండదు.

కం—అదెంత భాగ్యము? నేను యిప్పుడు ప్రమాణంచేసి చెపుతాను.

జి—ప్రమాణాలూ గిమాణాలూ నాకు యేమీ పనికిరావు. ఆ వ్యాపారం నేను చాలాకాలంక్రిందటనే కట్టిపెట్టినాను.

కం—(తనలో) ఇప్పు డీముసలివాడితో అసాధ్యం వచ్చింది. ఇప్పుడు యేమిచెయ్యను? యెలాగయినా యితణ్ణి మోసం చెయ్యవలెను. (బిగ్గరగా) దైవానుగ్రహంవల్ల నాకు కావలసినంత ధనమూ వసతులూ వున్నవి. నాయిష్టంవచ్చినప్పుడల్లా వెళ్ళివుండడానికి మా వూళ్ళో నాకు గొప్ప రాజభవనం వున్నది. (తనలో) సెంట్రల్ జయిలు తప్పకుండా రాజభవనమే.

జి—అంతేనా? యింకా యేమయినా వున్నదా?

కం—మంచి యిల్లూ ఫలవృక్షములూ వున్న వుద్యానవనం వకటి కూడా వున్నది. (తనలో) చిత్రివస్తుప్రదర్శనశాలా తోటా పట్నంలో వారి అందరిహక్కూ గనుక అందులో నాకుకూడా హక్కు వున్నది.

జి—మీకు భూములు యేమయినా వున్నవా?

కం—వందలకొద్ది కానులున్నవి. (తనలో) వక్కాని భూమైనా నాకు లేకపోయినా అయిదురూపాయల డబ్బులు మొన్ననే మార్పించినాను గనుక మూడువందలకానులు పైగా వున్నవి.

జి—అది సరే కాని మీవద్ద కొక్కం యెంతవున్నది?

కం—అది యింతా అంతా అని నేను చెప్పలేను. . (తనలో) యేమీ లేనప్పుడు యింత ని యెలాచెప్పగలను? ఆవున్న డబ్బులలో నైనా కొన్ని వాడుకున్నాను గనుక యిన్నని సర్దిగా చెప్పలేను.

జి—అయిపోయింది. యిక వకప్రశ్నమాత్రం అడుగుతాను. యీఆస్తంతా మీకు యేలాగువచ్చింది?

కం—మాతండ్రిగారివల్ల వచ్చింది. ఆయన యిప్పుడు యీ ఆస్తంతా అనుభవిస్తూ గోదావరీతీరంలో రాజమహేంద్రివరంలో వున్నారు.

జి—ఇంతకుముందు మీరు మీవంశంలో మీరే కడపటివా రని చెప్పినట్టున్నారే?

కం—అవును. ఆయన వక్కడుపోతే నేనే కడపటివాణ్ణి. అదంతముఖ్యమయింది కాదు. ఆయన వున్నా లేనట్టే. ఆయనసంగతే నేను మఱచిపోయినాను. ఆయన బాహుముసలివాడు.

జి—ఆలాగైతే మీరు మీతండ్రిగారిని వక్కపర్యాయం ఇక్కడకు పంపిస్తే ఆయనా నేనూ మాట్లాడుకొని సంబాధనిశ్చయం చేసుకుంటాము. అప్పుడు మాచిన్నదాన్ని మీరు వివాహంకావచ్చును.

కం—అయితే—

జి—అయితే గియితేలు నావద్ద పనికిరావు. నేను ఖండితంగా మాట్లాడుతూ వున్నానని కోపగించుకోక మీ తండ్రిగారిని వక్కపర్యాయం తీసుకునిరండి. నాకు పని వున్నది. నేను వెళుతాను.

(అని నెళ్ళిచున్నాడు.)

కం—ఇదంతా నా తెలివితక్కువమాటలవల్ల తటస్థమయింది. నేను యేది యెలాగైనా రామామణిని సంపాదించుకోవలెను. సంపాదించుకుంటాను, పెళ్ళాన్ని సంపాదించుకోవడంకంటె ముందుగా నేను

యిప్పుడు తండ్రిని సంపాదించుకోవలెను. నాకు యిప్పుడు అధాత్తుగా తండ్రి యెక్కడదొరుకుతాడో యేమిూ. తెలియకుండా వున్నది. యెవరికో వకరికి వేషంవేసి ప్రస్తుతం వకతండ్రిని యెరువు తెచ్చుకోవలెను.

[నారాయణుడు ప్రవేశించుచున్నాడు.]

కం—నీకు యిక్కడ యేమి కావలెను?

నారా—నా కేమీ అక్కరలేదు. మీకేమైనా కావలెనా?

కం—కావలెను. నాకు తక్షణం వకతండ్రి కావలసివున్నాడు. నారాయణా! ఇందులో నీవు నాకు సహాయం చెయ్యవలెను.

నారా—రెండేళ్ళబట్టి మీవద్ద నన్ను నవుకరీవుంచుకుని మీకు తండ్రికావలసివున్నమాట వక్కనాడూ చెప్పినారుకారే.

కం—అప్పటిమాటంతా యెందుకు? ఇప్పుడు చెప్పినాను తీసుకుని రా. వ్యర్థంగా కాలహ్రేపం చెయ్యకు.

నా—నాకు యిప్పుడు ఆకలివేస్తూవున్నది. నా ఆకలి తీరితేనే కాని నేను యిప్పుడు యేపనీ చెయ్యను.

కం—నీ వాసత్రింలో భోంచేసిరా లేదా?

నా—యెలా భోంచేస్తాను? అన్నంపెట్టిస్తాను వాకిట్లో వుండు మని నన్ను కూర్చోపెట్టి మీరు లోపలికి వెళ్ళి భోజనంచేసి దొడ్డితోవను పరుగెత్తివచ్చినారు. నాసంగతి ఆ మహాసత్రింలో కనుక్కునే వా రెవరు? నేను కడుపుకాలుతూ కూచ్చుని కూచ్చుని మీరు వెళ్ళినారని విని మీజాడ వెతుక్కుంటూ యిక్కడికి పరుగెత్తుకుని వచ్చినాను.

కం—చీ ఛీ నోరుమూసుకుని వూరుకో. వక్కపూట భోజనం లేకపోతే యింత బ్రహ్మాండంచేస్తూ వున్నావూ! స్వామిభక్తిగల సేవకుడు యెన్ని వుపవాసాలు చేసిఅయినా స్వామికార్యం నిర్వహించవలెను. నీవు ప్రయత్నం చేసి నాకు వకతండ్రిని సంపాదించిపెట్టినా

వంటే దానితో సోదరివర్గమూ నాదరివర్గమూ కూడా విరగ్గడ్డపోతుంది.

నా—ఆలాగైతే మీకు తండ్రి అసలే లేడా?

కం—వున్నాడు. కాని నేను తండ్రి నని పయికివచ్చి చెప్పే వాడు యిప్పుడు యెక్కడా కనబడకుండా వున్నాడు.

నా—ఆలాగైతే ఇఖ మీకు తండ్రి దొరకనే దొరకడు.

కం—పోని నీవు నాతోకూడా రా. మనం యిద్దరమూ కలిసి తండ్రికోసం వెతుక్కుంటూ వెళుదాము.

నా—యెక్కడికి వెళుదాము?

కం—యెక్కడికా? మక్కాకుపోదాము రా.

(అని వెళ్ళుచున్నాడు.)

నా—నాకు యెక్కడకు పోయినా యింతకంటె నష్టంరాదు. వెళుతాను. (అని వెళ్ళుచున్నాడు)

---

౫ రంగము—ఊరిబయలి రచ్చచావడి.

[అటుకులు తినుచు వంచకాచార్యులు ప్రవేశించుచున్నాడు.]

వం—ఎవరో వస్తూవున్నట్టున్నారు. ఇక్కడినుంచి వేగిరం పారిపోవలెను. అక్కడ లేదు. ఉండవచ్చును. నా అంతటి బుద్ధిమంతుడికి భోజనం లేకుండా యీబండమీద కూర్చుండి అటుకులు తినవలసిన యోగం పట్టింది. ఆవచ్చేవారు యెవరయివుందురు? ఇతడు విచారం చేతనో సంతోషంచేతనో మనసుకు యేదో వుద్యోగం కలిగినవాడుగా కనపడుతూవున్నాడు. నా పాలిటి భాగ్యదేవత మోసంచేసి వక్కపూట తిండి కయినా యితనివద్ద సంపాదించుకోనడానికి యితణ్ణి యిక్కడికి పంపివుంటుంది.

[కంఠీరవదేవు ప్రవేశించి, వంచకాచార్యు లక్కడ నున్నట్టే చూడకి
ముందుకును వెనుకకును నడుచుచున్నాడు.]

కంఠీ—నాకు తండ్రి యెలాగు దొరుకుతాడు?

వంచ—(తనలో) తండ్రా!

కం—వక్క తండ్రి దొరికితే నాకు రామామణి, ధనమూకూడా దొరుకుతుంది. తండ్రి దొరక్కపోతే భార్యాపోతుంది చెరసాల ప్రాప్త మవుతుంది. నాకు యేమీ తోచకుండా వున్నది.

వం— (ముందుకు వచ్చి తనలో) యీ పెద్దమనిషి యేదో చిక్కులో వున్నట్టు కనపడుతూవున్నాడు. (బిగ్గరగా) అయ్యా! మీరు యేదో కష్టంలోవున్నట్టున్నారు. మీకు నావల్ల సహాయం యేమయినా కావలసివున్నదా?

కం—నీ కంఠస్వరం నేను తరుచుగా విన్నదిలా గున్నది. మనం యిద్దరమూ యెక్కడనో వకచోట కలిసివున్నట్టున్నది. చుట్టలు యెగుమతిచేసి కోస్తాలనుంచి బంగారపుయిసుక తెప్పిస్తామని కాకినాడలో పెద్దమేడలో పెట్టినకంపెనీకి మీరు కార్యనిర్వాహకులుగా వుండలేదా?

పం—అవును. ఆకంపెనీలో భాగస్థుడుగా చేరుమని మీతో చెప్పినాను. మీరు వున్నారుకారు.

కం—వుండలేదు. నేను పుట్టి బుద్ధియెఱిగినతరువాత చేసిన తెలివిగలపని అది వక్కటే అని తలుస్తాను. తరువాత ఆకంపెనీస్థితి యేమయింది?

వం—లక్షరూపాయల పెట్టుబడిగల ఆకంపెనీవారు యింటి అడ్డి నిమిత్తం వ్యాజ్యంవచ్చేటప్పటికి హాజరువారంటు వస్తుందేమో యని నానాముఖాలా పారిపోయినారు. నేను కార్యనిర్వాహకుణ్ణి

గనుక, ఆకంపెనీవారికి ముందుగా నేనే దారిచూపి పారిపోయినాను. అప్పటినుంచీ నేను నాస్వార్జితధనంవల్లనే జీవనంచేస్తూవున్నాను:

కం—కంపెనీ దివాలాతీసినతరువాత మీవద్ద ధనం యెలాగు వచ్చింది?

వం—అప్పటినుంచీ నేను జనులను లోకోపకారంనిమిత్తం అనేకవిధాల మోసాలుచేసి ధనం సంపాదించి జీవనం చేస్తూవున్నాను.

కం—యిది మరీఘింతగా వున్నది. మోసం చెయ్యడంవల్ల లోకోపకారం యెలా తటస్థమవుతుంది?

వం—చెపుతాను వినండి. లోకంలోవుండే జనులందరూ మోసపుచ్చేవారూ మోసపోయేవారూ అని రెండు తెగలుగావుంటారు.

కం—ఇది మంచివిభాగమే.

వం—లోకంలో మోసంచేసే బుద్ధిమంతులు తక్కువగానూ మోసపోయ్యే బుద్ధిహీనులు యెక్కువగానూ వుంటారు. బుద్ధిమంతుల వల్ల బుద్ధిహీనులకు ఉపకారం కలుగుతుంది గనుక, అల్పసంఖ్యాగల వంచకులవల్ల అధికసంఖ్యాగల వంచితులకు ఉపకారం కలుగుతుంది. అనగా బహుజనోపకారం కలుగుతుందని తాత్పర్యం.

కం—అది యెలాగు?

వం—మీకు విప్పిచెపితేనేకాని తెలిసేటట్టు లేదు. చెపుతాను వినండి. పెద్దకంపినీకి కార్యనిర్వాహకుణ్ణి గనుక పెద్దషాపులోకి వెళ్ళి పదికోట్లకు గుడ్డ చింపించి కుట్టించి తయారుచేయించి బిల్లుతో కోట్లు మీయింటికి పంపవలసిం దని ఆర్డరు యిస్తా ననుకో. ఆర్డరుప్రకారం కోట్లు వస్తవి. నావద్దనుంచి షాహుకారుకు పక్కదబ్బిడీ వెళ్ళదు. దర్జీవాడు కుట్టినంచుకు షాహుకారువద్ద కూలి పుచ్చుకోకుండా వుండడు గనుక, ఆకూలితో వాడిపెళ్ళామూ బిడ్డలూ భోజనంచేస్తే కుటుంబాని

కంతా వుపకారం కలుగుతుంది; వాడు కావలసినవస్తువులు బజారులో కొంటాడు గనుక వాళ్ళందరకూ వుపకారం కలుగుతుంది; వాడు సాయంకాలం మిగిలినసొమ్ము పట్టుకుని కల్లంగడికి వెళుతాడు గనుక అక్కడ వాళ్ళకు వుపకారం కలుగుతుంది; అక్కడ తాగి పడిపోతే పోలీసువారు పట్టుకుంటే నేరాలుపట్టుకున్నందుకు పోలీసువారికి వుపకారం కలుగుతుంది; మరునాడు మేజస్ట్రేటు జుమానాచేస్తే గవర్నమెంటువారికి లాభం కలుగుతుంది. యిలాగంటి వ్యవహారాలవల్ల వర్తకుడు దివాలాతీస్తే భగవద్భక్తికలిగి అతనికి వుపకారం కలుగుతుంది; యిలాగు చెప్పడానికి మొదలుపెడితే యెన్నివుపకారాలయినా చెప్పవచ్చును. నావక్కమోసంవల్ల ప్రజలు మొదలుకుని దొరతనంవారి వరకూ యెంతమందికి వుపకారం కలిగిందో కనిపెట్టినారా?

కం—మోసంవల్ల యిలాగంటి లోకోపకారం వుంటుందని నే నిదివరకు యెప్పుడూ ఆలోచించలేదు. (తనలో) దీన్నిపట్టి చూస్తే యితడు నాకు తండ్రిగా వుండడానికి తగినవాడుగానే కనపడుతూ వున్నాడు. (బిగ్గరగా) మీరు దివర కెప్పుడయినా నాటకంలో వేషం వేసి కథ వినిపించినారా?

వం—మీరో?

కం—మీరు యెప్పుడయినా తండ్రిగా వున్నారా?

వం—నాకు పెళ్లి కాలేదుగనుక ఆప్రశ్న నన్నడగకండి. నిజం చెపితే అన్నీ తంటాలు వస్తవి.

కం—నాఅర్థం నిజమయిన తండ్రి అనికాదు. మీరు నాటకంలో యెప్పుడయినా తండ్రివేషం వేసినారా?

వం—అదెంతసేపు? నిముషంలో వెయ్యినచ్చును. రెండు చొప్పబెండ్లు పళ్ళు పెట్టుకుని మీసాలకూ గడ్డానికీ మరిపాలతో తెల్ల

బూచ్చు అంటించుకుంటే అరఘుడియలో అరవము తండ్రివేషాలు వెయ్యవచ్చును. ఆపుని "అబ్బాయీ! యెన్నాళ్లకు నిన్ను చూచినానురా?"— (అని గట్టిగా కంఠీరవదేపుని కౌగిలించుకొని)—ఇలాగే. అంతా నాకు తెలుసును.

కం—దివ్యంగా వున్నని. నీవు నాకు తండ్రివి కాదగినవాడవే. నాకు తండ్రివి కావడానికి ముందుగా నీవు నాకు వక్కచిన్నపని చేసి పెట్టవలెను. నీవు యీపుత్తరం తీసుకునివెళ్ళి సమీపంలోనే వక యింట్లోయిచ్చి రావలెను. (అని చెవిలో చెప్పుచున్నాడు.)

వం—ఆలాగే చేస్తాను.

కం—మామనిషిని వేరే వకచోటికి పంపించినాను. నీవు వచ్చిన దాకా యిక్కడ కనిపెట్టుకుని వుంటాను.

వం—ఇదుగో వెళుతూ వున్నాను. వక్కసంగతి అడగడం మరిచిపోయినాను. యీపూట మీభోజనం యెక్కడ?

కం—వెళ్ళిరా. తరువాత మనంయిద్దరమూ కలిసే భోంచేతాము.

వం—కూరలు వుంటవా?

కం—వుంటవి.

వం—పప్పో?

కం—పప్పూను.

వం—నెయ్యో?

కం—నెయ్యీని.

వం—పెరుగో?

కం—అన్నీ వుంటవి. వేగిరం వెళ్లి రా. (అని వెళ్లుచున్నాడు)

వం—చున మోసము బాగాపారింది. ప్రపంచమంతా మోసం తోనే వున్నది. యెక్కడ చూచినా వీరిని వారూ వారిని వీరూ

మోసం చేస్తూవుంటారు.

(పాట — ద్విపద.)

1. పట్టణంబులయందు ♦ పల్లెలయందు,
బిట్టుగా జనులెల్ల ♦ భేదంబు లేక,
వేసాలు వేయుచు ♦ వేయువిధాల,
మోసాలుచేయుచు ♦ మురువొందుచుందు.

2. అప్పిచ్చువా రెల్ల ♦ నధికాశచేత,
నప్పులుగొనువారి ♦ నలయింపఁ జూడ,
నప్పులుగొను వార ♦ లందఱి మించి,
యప్పులు నెగవేయ ♦ నరయుచుండుదురు.

3. కాముకజనుఁడు తా ♦ కాంక్షించినటి
కామిని వంచింప ♦ గణసలేనట్టి
మాయలు పన్నుచు ♦ మరిబొంకుచుండు;
వేయేల ? మోసంబు ♦ విశ్వమంతయును.

(అని పాడుచు వెళ్ళుచున్నాఁడు.)

[అంతట కంఠీరవదేవు మరల ప్రవేశించుచున్నాఁడు.]

కం — అతడు మహాబుద్ధిమంతుఁడు. నాతండ్రి కావడానికి బాగా తగివున్నాఁడు. నన్ను బాధపెట్టే అప్పులవాళ్ళు యిక్కడ యెవరూ లేరు. ఇక్కడనాప్రాణం హాయిగా వున్నది. నాకు కాబోయే తండ్రి వచ్చేలోపుగా యేమి చెయ్యవలెనో ఆలోచించుకుంటూ వుంటాను. (అని కన్నులు మూసికొని, ఆలోచించుచున్నాఁడు.)

[అప్పుడు హాజరువారంటు పట్టుకొని భవానిసింగు, శివప్రసాదు అను భటులు ప్రవేశించుచున్నారు.]

భవా — అదుగో! అతను యిక్కడ వున్నాడు. ఈసారి యితను

నన్ను తప్పించుకొని పారిపో లేడు. యీవుచ్చు యితనిచేతులకు వేసి బిగించినామంటే యితడు మనకు చిక్కినట్టే.

కం—(తనలో) ఈసారి యీధనంతో ధనమిత్రుని వదుల్చుకో వచ్చును. ఆచిన్నదానిధనవంతా నాచేతిలో పడితే దాన్ని యెలాగు వుపయోగించుకోవలెనో తెలియకుండా వున్నది.

భవా—తెలుస్తుంది. (అని శివప్రసాదుతో మెల్లగా దగ్గఱకు వచ్చుచున్నాడు.)

కం—(తనలో) రామామణికీ నాకూ వుండే బంధము—

భ—(తనలో) ముందుగా యీబంధముమాట చూచుకో. (అని యుచ్చు చేతికి తగిలించి బిగించుచున్నాడు.)

కం—(ఉలికిపడి కన్నులు విచ్చి) ఇదేమిటి? (అని పెనగు చున్నాడు.)

భ—చేత నయితే యీతాళ్ళు తెంపు చూతాము. కిందటి మాటు నీవు మాకోర్టు బంట్రోతులను గుద్ది పారిపోవడంచేత యీసారి మేము సాధనాలన్నీ పట్టుకుని జాగ్రత్తగా వచ్చినాము. ఇప్పుడు నీవు మమ్మల్ని గుద్దడానికి వల్లలేదు.

కం—(చేతులు లాగుకొనుచు) మోటపశువుల్లారా! కట్టు విప్పండి. విప్పకపోతే—

భ—వూరికే గింజుకోకు. ఈసారి నిన్ను భద్రంగా తీసుకుని వెళుతాము లే—శివప్రసాద్! నీవు వెళ్ళి వకబండికుదిర్చి తీసుకుని రా. నీవు వచ్చిందాకా నేను యితణ్ణి భద్రంగా వుంచుతాను.

శివ—జాగ్రత్త! (అని వెళ్ళుచున్నాడు.)

కం—అయ్యా! మీ రెవరు?

భ—భవానిసింగు,

కం—భవాసిసింగుగారూ ! మీరు కొంచెం కట్టు వదులుచేసి వక్కచెక్క విడిచిపెట్టినారంటే బొడ్డుకొంగునన్నమూట విప్పి బంగారపుకాసులు మీచేతుల్లో పెడుతాను.

భ—నీఆటలు నాదగ్గిర సాగవు (బొడ్డుకొంగు తడవి) ఇక్కడ యేమీ మూట లేదు. వట్టిదే.

కం—నీకు జ్ఞానం లేదు. యెవరిబొడ్డుకొంగున అనుకున్నావు?

భ—ధనమిత్తురిబొడ్డు కొంగున. మళ్ళీ సొమ్మ్ర యే మయినా వుంటే నీకు సమర్పించడానికి నిన్ను భద్రంగా తీసుకొని రమ్మన్నాడు.

కం—ఆలాగా? ఇప్పుడు నంచకాచార్య లిక్కడ వుంటేనా—

[వంచకాచార్యులు ప్రవేశించుచున్నాడు.]

వం—ఇదుగో సమయానికి వచ్చినాను. ఆహాహాహా! ఇదేమిటి కొత్తవినోదంగా వున్నది? ఈబట్టలేమిటి? చేతులు కట్టడ మేమిటి?

కం—కట్టివుండడంచేత నాచేతులు నేను వుపయోగించుకోలేను. నీచేతులు స్వేచ్ఛగా వున్నవి వాటిని బాగా వుపయోగించు—తెలిసిందా?

వం—తెలిసింది. (చేయెత్తి చరవబోయినట్లుగా భవాసిసింగు దిగ్గదికి వెళ్ళి) విడిచిపెట్టు.

భవా—ఇతణ్ణి విడిపించినావంటే నీకు యేమిశిక్ష అవుతుందో తెలుసునా?

వం—చీ చీ విడువు.

భ—ఓ శివప్రసాద్! ఎక్కడవున్నావో పరుగెత్తుకుని రా.

వం—శివప్రసాదు కాదు నీతాత యెవడువస్తాడో రానియ్య. వేగిరం ఇతణ్ణి విడిచి మూరంగా పో.

భ—ఇదుగో మెల్లిగా విడిచిపెట్టి వెళుతూవున్నాను. కొంచెం

ఓసికపెట్టు. (అసి మడివేసి జరుగు చున్నాడు.)

వం—వోపికాలేదు గీపికాలేదు పో. (అని భవానిసింగును ఈడ్చి తరిమివేయుచున్నాడు) జస్టీ జనాను వొళ్ళంతా చెమటలు పట్టుట్టుగా పరుగెత్తుతూవున్నాడు. మిమ్మల్ని యెలావదిల్చినానో చూచినారా?

కం—నీవు మంచిసమయంలో పుట్టిపడ్డావు. మనం గొప్పగండం తప్పించుకున్నాము. అడుగో! జియ్యరుసూరి యిలాగు వస్తూవున్నాడు. వేగిరం కట్లువిప్పు లేకపోతే నేను పాడయిపోతాను.

వం—ఈయుడి రాదు.

కం—అది జారుముడి కాదా?

వం—కాదు గట్టిముడి.

కం—ఏమిబుద్ధి? ఈస్థితిలో ఆయనను నేను యెట్లాచూడను?

వం—నీకు నేను వకవుపాయం చెపుతాను. నాబట్ట వంటినిండా కప్పుకుని చేతులు పుకి కనబడకుండా నోటితో మాట్లాడు. చేతులతో చెయ్యవలసినపని యేమయినావస్తే నీవెనుక నిలుచుండి నేనే చేస్తాను. పెద్దవాడు గనుక ఆయనకు కళ్ళు తిన్నగా కనబడవు. (అని తనపయి బట్ట కప్పి తాను వెనుక బట్టలో దూరుచున్నాడు.)

కం—ఈవుపాయం బాగావున్నది ఆయన దగ్గిరకు వచ్చినాడు. నమస్కారమాలు పట్టలేము.

[జియ్యరుసూరి ప్రవేశించు చున్నాడు.]

కం—అయ్యా! నమస్కారము. మీరు యిలాగు దయచేసినా కేమి?

జి—ఎవరు? కంఠీరవదేవుగారా? మీరు నీతండ్రిగారి రాక నిమిత్తం యిక్కడ యెరుకు చూస్తూవున్నారు కాబోలును. నేను మా

తోటలోకి వెళుతూ వున్నాను.

కం—ఆయనకోసమే నిరీక్షిస్తూవున్నాను. ఝూమునేటినుంచి కనిపెట్టుకొని వున్నా యింకా ఆయనజాడ కనపడడం లేదు. నిన్ననే కొలిగ్రాం పంపినాను.

జి—ఆయన యిప్పుడు రాకపోతే సాయంకాలను వస్తారు. నాకూతురివివాహం విషయంలో యేమీ మోసం లేదుగదా?

కం—ఇందులో మోసం కూడానా?

జి—మీవద్ద పొడుంకాయ వున్నదా?

కం—నేను తొందరలో తేవడం మరిచిపోయినాను.

జి—నేను రాత్రే చేయించినాను. యీపొడుం యెలాగున్నదో చూడండి. (అని పొడుముకాయ చేతి కందిచ్చుచున్నాడు.)

కం—ఈరాత్రే చేయించినారా? (వంచకాచార్యులు చంక క్రిందనుండి చేయిచాపి పొడుముకాయ యందుకొని ముక్కుదగ్గర పెట్టుచున్నాడు.) దివ్యంగా వున్నది. యెక్కడ తెప్పించినారో కాని యిటువంటి పొగాకు మాగోదావరిలంకలోకూడా పండదు. (వంచకాచార్యులు పొడుముకాయను మరల నిచ్చివేయుచున్నాడు.)

జి—పొద్దెక్కుతూవున్నది. నేను యిక సెలవు పుచ్చుకొని తోటలోకి వెళ్ళివస్తాను.

(అని వెళ్ళుచున్నాడు.)

వం—నామోసం బాగా సాగిందా?

కం—దివ్యంగా సాగింది. నీవు మోసాల రాజువు. నేను మరిచిపోయినాను. నాయెములలో పలుదోమపుల్లలు కోసుకునేకత్తి వున్నది. అది పుచ్చుకుని మళ్ళీ వాళ్ళు రాకమునుపే—

వం—చెప్పనక్కరలేదు. తెలిసింది. (అని కత్తి పుచ్చుకొని

కట్లు కోసివేయుచున్నాఁడు.)

కం—ఇప్పుడు నాకు బంధవిమోచనం కలిగింది. మనం వేగిరం వెళ్ళి యీమునుసలాయనను వలలోపడవేసే ప్రయత్నం చెయ్యవలెను.

వం—నక్కడెబ్బలో చేతాము.

కం—ఆపాలంలోనుంచి వచ్చేవాళ్లు యెవరు?

వం—ఇందాకటి బంటోతులు.

కం—ఇఖ మాటలకవకాశం లేదు. నాచిక్కబలం చూపవలెను. (అని పరుగెత్తుచున్నాఁడు.)

వం—యెవరికోసం దొరకుండా పరుగెత్తు. ఓబంటోతుల్లారా! వగరుస్తూ పరుగెత్తుకునిరండి. మీరు పట్టుకోవడానికి యిక్కడ యెవరూ లేరు. చేతనయితే నాపరుగు కలుసుకోండి. నేను లేడిలాగు పరుగెత్తుతాను. (అని పాఱిపోవుచున్నాఁడు.)

---

3 రంగము—జియ్యరునూరి యిల్లు.

[పార్వతియు, దామోదరుఁడు ప్రవేశించుచున్నారు.]

పార్వ—దామోదరా! నేను యెక్కడకు వెళితే అక్కడి కిల్లో గోకలాగు వెగట తిరుగుతూ వుంటావేమి? నేను యిందాకా యిచ్చినరొక్కెముక్క తింటూ వకమూల అణిగి కూర్చోరాదా? వెళ్ళు.

దామో—నీసెలవుప్రకారం వెళ్ళి మళ్ళి యిప్పుడే వస్తాను. (అని వెళ్ళుచున్నాఁడు.)

పార్వ—నేను మాఅమ్మగారిలాగు గొప్పదాన్ని అయితే బాగా వుండును. నాకు భాగ్యం యెత్తుకోవడానికి వెనుక యెవరికలది రెండుడబ్బులయిస్తే వేరుముక్క- కడుతాసన్నది. అరుగో అమ్మగారు వస్తూవున్నారు.

[రామామణి ప్రవేశించుచున్నది.]

రామా--పార్వతీ! ఈప్రదయాన్న వెళ్ళిన తరువాత కంఠీరవ దేవుగారు నాకు యేమయినా వు త్తరం పంపించినారా?

పార్వ--లేదు. నావద్దకు పంపలేదు.

రామా--దామోదరా!

[దామోదరుడు ప్రవేశించుచున్నాడు]

దామో--అమ్మా! వస్తూవున్నాను.

రామా--నీవు యీవు త్తరం తీసుకుసివెళ్ళి పూటకూళ్ళయింటి కాడ యిచ్చి వస్తావా?

పార్వ--దామోదరా! కదలవేమి?

దామో--నాపని కుక్కలాగు యిక్కడికీఅక్కడికీ తిరగడంతో సరిపోతూ వున్నది. (అని వెళ్ళుచున్నాడు.)

రామా--పార్వతీ! నేను మావాళ్ళయింటికి వెళ్ళినకాలంలో కంఠీరవదేవుగారు యిక్కడికి రాలేదని నీకు నిశ్చయంగా తెలుసునా?

పార్వ--రాలేదు యెంతమాత్రమూ రాలేదు.

రామా--అతడు యిప్పుడు యేమి వుపాయం ఆలోచిస్తూ వుండివుంటాడు? అతనికి నామీద ప్రేమవున్నందుకు లేశమూ సందేహం లేదు. కాని అతని వుపాయాలు సాగుతవో లేదో అని మాత్రం నాకు సందేహంగా వున్నది. రాజసుహేంద్రివరంలో అతనికి తండ్రి వున్నట్లు నేను యెప్పుడూ వినియుండలేదు.

పార్వ--(ముందువంకచూచి) అరుగో ఆయన వస్తూవున్నారు.

[కంఠీరవదేవు ప్రవేశించుచున్నాడు.]

కంఠీ--ప్రియురాలా! రామామణీ! నిన్ను చూడడంచేత నాప్రాణాలు లేచివచ్చినవి.

పార్వ—బహుదొడ్డవాడు. ఈయన దేవుడులాగు మాట్లాడు తున్నాడు.

రామా—మీరు యింతదూరం నాకోసం నడచివచ్చినారా? యే మయినా యెక్కి రాలేదా?

పార్వ—ఆయన యెండొకెక్కి వచ్చినారు.

రామా—పార్వతీ! యీపాటి నీవు వెళ్ళిపో.

పార్వ—వెళుతూవున్నాను. (తనలో) వీరు యిద్దరూ కలుసు కోవడంతోటే యేదో రహస్యం వున్నట్టు న న్నవతలికి పంపివేస్తారు. నేను అవతలికి వెళ్ళి వీరు యేమి చేస్తూవుంటారో యీతలుపుసందు నుంచి చూస్తూవుంటాను. (అని వెళ్ళుచున్నది.)

కంఠీ—ఓపార్వతీదేవీ! వ్యవహారమంతా కుదిరింది. రేపు తెల్ల వారేలోగా మీతండ్రిగారి అనుమతితోనే నిన్ను నాసొమ్మునుగా చేసు కుంటాను.

రామా—కంఠీరవా! నీవగ్గిర వున్నతప్పితమల్లా తలకుమించిన పెద్దయెత్తులు యెత్తడ మనుకుంటాను.

[పార్వతి ప్రవేశించుచున్నది]

పార్వ—అమ్మా! బాబయ్యగారిసెల వయింది. మిమ్మలిని ఆయన పుస్తకాలగదిలోకి తీసుకుని రమ్మన్నారు.

రామా—కంఠీరవా! నేను యిక్కడ వుండడం వల్లకాదు. వెళ్ళి పోతాను. నీవు చేసేప్రయత్నం సఫలంకావడం నాకు యిష్టమేకాని నీగౌరవానికికాని నాయోగ్యతకుకాని భంగంవచ్చేపనిమాత్రం నీవు యెంతమాత్రమూ చెయ్యకూడదుసుమా. (అని వెళ్ళుచున్నది.)

పార్వ—(తనలో) వీళ్ళు నన్ను అవతలికిపంపించడానికి యెప్పుడూ మభ్యచిపోరు. అయినా కానీ! వీళ్ళు చాలాసేపు మాట్లాడుకోవడానికి

అవకాశం లేకుండా వెంటనే వచ్చి పంపివేసినాను. నేను పోవలెను.
(అని వెళ్ళుచున్నది.)

కంఠీ — నా ప్రియురాలినూటలతో నాధైర్యమంతా చెడి పోయింది. జియ్యరుసూరిగారివద్దకు వెళ్ళి, ఆయనకాళ్ళుపూడపడి, చేసిన దంతా వప్పుకుంటాను. (అని వెళ్ళబోవుచున్నాడు.)

[అంతట తెల్లగడ్డముతోను మీసములతోను ముసలివేషము వేసికొని చేత కట్టి పట్టుకొని వంచకాచార్యులు ప్రవేశించుచున్నాడు.]

కంఠీ—నీవు యెవరు? ముందుగా వర్తమానం చెయ్యకుండా పెద్దమనుష్యులయింట్లో యిలా ప్రవేశించినా వేమి?

వంచ—నేను యెవరినా? నన్ను నీవు ఆనవాలు పట్టనేలేదా? కన్నతండ్రిని తెలుసుకునేవాడు యెంతటివాడు కావలెను? నీవు చేసుకున్న తండ్రినే నీవు గుర్తుపట్టలేకుండా వున్నావు.

కంఠీ—ఆహాహాహా! ఏమీ! వంచకాచార్యులా?

వంచ—అవును. కర్రి గడ్డమూ మీసాలూ అన్నిటితోనూ వచ్చినాను.

కంఠీ—నీవు వేసినవేషంలో కథ బాగా వినిపించగలవా?

వంచ—మీచిత్తంవచ్చినట్లు వినిపిస్తాను. నేను యేమోస్తరు ముసలికథ వినిపించవలెను? "నేను వీధులలో ఆడుకునేదినాలతో అర్వై యేళ్ళకిందట" అని పాతికథలుచెప్పే ముసలివేషం కావలెనా? "ఆహాహా! ఇహీహీ శబాసు! మహామంచికథ. ఆహాహా! ఇది తలుచుకుంటే నాకు చిన్నప్పటికథ జ్ఞాపకం వస్తూవున్నది. ఇహిహిహీ" అని మాటమాటకూ నవ్వుతూవుండే ముసలివేషం కావలెనా? "ఇప్పటి వాళ్ళను చూస్తే నాకు తలకాయనొప్పి. వాళ్ళమాట తలపెట్టకు. కాలమంతా చెడిపోతూవున్నది. సాడుకాలం వచ్చింది. యెవరితో

నైనా మాట్లాడితే నాకు చిరాకు'' అని చిరాకుపడుతూ నిష్కారణంగా కొరకొరలాడుతూవుండేముసలివేషం కావలెనా ? ఈమూడింట్లో యేది కావలెను?

కంఠీ—సమయం కనిపెట్టి నీ యిష్టంవచ్చినట్లు చెయ్యి. ఆ ముసలాయనమనసు కనిపెట్టి యెప్పటి కెలాగుమాట్లాడవలెనో అలాగు మాట్లాడు. నేను చెప్పినసంగతిమాత్రం మరిచిపోకు.

వం—చూడు. ఆయనను నావలలో యెలా పడవేస్తానో!

కంఠీ—ఆలాగయితే కార్యం యెంతశీఘ్రంగా నెరవేరితే అంతమంచిది. ఆయన పొస్తకాలంటే చెవి కోసుకుంటాడు. ఆయన యిప్పుడు పొస్తకాలగదిలో వున్నాడు.

వంచ—ఇక ఆయనవద్దు మనపుస్తకంలో యెక్కించుకోవచ్చును.

కంఠీ—ఆలస్యంచెయ్యక వెంటనే వెళ్ళు.

వం—నామనస్సులో నేను నలఅంతా పన్నినాను. ఆముసలి గొడ్డు నావలలో పడుతుంది వెళుదామురండి.

(అనియిద్దఱును వెళ్ళుచున్నారు.)

---

౪. రంగము—జియ్యరుసూరి పుస్తకములగది

—o—

[జియ్యరుసూరి ప్రవేశించుచున్నాడు.]

జియ్య—కంఠీరవదేవు తనతండ్రిని యింకా పంపించినాడు కాడు. అతనికి వకవేళ తండ్రిలేనేలేడేమో! అమ్మాయికి యిష్టంవుంటే అతణ్ని పెళ్ళిచేసుకోవచ్చును.

పార్వ—(వెలుపలనుండి) అయ్యా! నేను లోపలికి రావచ్చునా?

జియ్య—పార్వతా? రావచ్చును. రా.

[పార్వతి ప్రవేశించుచున్నది]

పార్వ—అయ్యా ! ఆయన వచ్చినాడు.

జియ్య—ఆయన యెవరు ?

పార్వ—కంకీకవదేవుగారి తండ్రిగారండి. ఆయన మహాతమా పాగా వున్నారు. మిట్టపళ్ళా జనపనారపీచువలె గడ్డమూ మునలిపంపు లాగు వున్నారు ఆయనచేతులో పెద్దకర్ర వున్నది.

జియ్య—ఆయనను లోనలికి తీసుకొని రా.

(అని లేచుచున్నాడు.)

పార్వ—కర్రనూ అయననూ కూడానా ?

జియ్య—అందరినీని.

పార్వ—ఆయన గుమ్మంవద్దనే వున్నారు. (అని వెళ్ళుచున్నది.)

[వంచకాచార్యులతో పార్వతి మరలఁ బ్రవేశించుచున్నది.]

పార్వ—అయ్యా! ఇది మార్గము. అదుగో ఆ నిలుచున్న వారే జియ్యరుసూరిగారు. (అని వెళ్ళుచున్నది.)

వంచకాచార్యుడు—(ఆయనవీపు తట్టి) బావగారు క్షేమంగా వున్నారా?

జియ్య—మీరు మునలివారయినా చాలాబలంగా వున్నారు—పార్వతీ ! ఈయనకు కుర్చీవెయ్యి—కూర్చుండమనండి.

వంచ—(కూచుండి) సంగతంతా విని సంతోషించినాను.

జియ్య—మీకుమారునివృత్తరం అంది వెంటనే బయలుదేరి వచ్చినారు కాబోలును.

వం—వృత్తరం లేకుండానే వచ్చినాను. మీకంకీకవుణ్ణి నేను యిపూరు వచ్చినతరువాతనే చూచినాను.

జియ్య—మీరు అలసి వచ్చినారు, కొంచెముపాలు దాహం

పుచ్చుకుంటారా ?

వంచ--సిద్ధంగావుంటే కొంచెం ఫలహారంకూడా చేస్తాను.

జియ్య--పార్వతీ! వెండిగిన్నెతో పాలూ పూరీలూ యిలా తీసుకుని రా.

వం--మీరు బహు మర్యాదస్థులు. (అని తా)గుచున్నాడు.)

జియ్య--కాలం వ్యర్థంగా పోగొట్టడం యెందుకు? ఫలహారం తోపాటు మన వ్యవహారంకూడా చక్కబెట్టుకుందామా ? మాతో సంబంధంచేసుకోవడం మీకు యిష్టంగా వున్నదా?

వంచ--పరమానందముగా వున్నది.

జియ్య — మీ భూములన్నీ గోదావరితీరనుందు వున్న వని విన్నాను.

వంచ—నిజంగానా ?

జియ్య—నిజంగానే. మీభూములకు పన్ను లేదుగదా?

వంచ—నేను సర్కారుకు చిల్లిగవ్వ పన్ను యివ్వవలసిన పని లేదు.

జియ్య-- (లేచి) మీసంభాషణవల్ల నాకు తృప్తి కలిగింది. కాఁపలసింది పార్వతి నడిగి తెప్పించుకొని యిక్కడ మీరు సావకాశంగా ఫలహారంచేస్తూవుండండి. ఈసమీపంలోనే మాకు బంధువుడున్ను స్నేహితుడున్ను ఒకాయనవున్నాడు. ఆయనతో యీసంగతి ఆలోచించి కార్యనిశ్చయం చేసుకొని వస్తాను.

వంచ--వెళ్ళిరండి.

జియ్య--మళ్ళీయిక్కడవున్నట్టే వస్తాను. (అనివెళ్ళుచున్నాడు)

వంచ--ఆయన వెళ్ళినాడు. ఇక్కడ నావేషం బాగాపారింది. ఇక కంఠీరవదేవు రామామణిని వివాహం చేసుకుంటాను. నేను పడ్డ

శ్రీమకు నాకుకూడా కొంతలాభం కలుగుతుంది. తెలివితక్కువవాళ్ళు సత్యమే జయ మంటారుగాని నిజానికి అసత్యమే జయం. నేను చేసే మోసాలూ అబద్ధాలూ యెలా సాగుతూవున్నవో!

[పార్వతి ప్రవేశించుచున్నది.]

పార్వ—అయ్యా! యేమిటి సెలవిస్తూ వున్నారు?

వంచ—ఓసిభూతమా! నేను యెవరితోనూ అనసమాటలు నీవు వొంచుండి యెందుకు వింటూవున్నావు?

పార్వ—యెన్ని తెచ్చినా చాలకుండా భూతంలాగు అన్నీ నీవే దిగమింగివేస్తూ వున్నావు. భూతాన్ని నీవా? నేనా?

వంచ—పోనీ వూరుకో. నీవు యీసంగతి యెవరితోనూ చెప్పకు. నీకు తరువాత నేను దేమయినా యిస్తాను. మీయజమానుడు యింట్లోలేడు. ముందుగా యీపూరీలు నాలుగుతిను.

(అని యిచ్చుచున్నాడు.)

పార్వ—(పుచ్చుకొని తినుచు) మీకు మేలు కలుగవలెను. మీరు మాఅమ్మ బ్రతికినంతకాలం బ్రతకండి.

వంచ—చెప్పులచప్పు డవుతూ వున్నది. యెవరో వస్తూ వున్నట్టున్నారు.

[జయ్యరునూరియు, కంఠీరవదేవును, రామామణియు, దామోదరుడును ప్రవేశించుచున్నారు]

జయ్య—కంఠీరవా! నీవుచేసినమోసం, నీఅంతట నీవే ధారాళంగా చెప్పివేసి క్షమార్పణ కోరడంచేత నీవుచేసిన తప్పును నేను క్షమించినాను.

కంఠీ—అయ్యా! పక్కమనవి—

జయ్య—నీవేమీ చెప్పనక్కరలేదు. మాచిన్నదానికి నీ ప

బ్బక్కఅ లేదు. నీవు గుణవంతుడవైతే—

వంచ—(వెలుపలినుండి) నేనుకాను నేనుకాను. అది మరివకరు. వనిలిపించిన వాడికి శిక్ష లేదు. నాయజమానుడు వారిలో వున్నాడు. పట్టుకొండి.

[పార్వతి వేషధారిగా భవానిసింగుచేతను శివప్రసాదుచేతను పట్టుకోబడి వంచకాచార్యుడు ప్రవేశించుచున్నాడు]

కంఠీ—ఏమిరా! వంచకాచార్యులా?

వంచ—ఏమివంచకాచార్యులు? చివరకు వంచకాచార్యులే వంచతుడయినాడు. నేను లోపల ఫలహారప్రయత్నంలో వుండే టప్పటికి వీళ్ళు వెలుపల నన్ను పట్టుకోవడపు ప్రయత్నంలోవుండి అధాత్తుగా మీదపడ్డారు.

భవా—ఇప్పుడు పట్టుపడ్డది నీవువక్కడవేకాదు. నీయజమానుడుకూడా పట్టుపడ్డాడు. ఇఖ తప్పించుకుపోవడానికి వల్లకాదు. వెలుపల పోలీసువారిని కావలి పెట్టివచ్చినాము.

జయ్య—మాయింట్లోవుండగా యెవరికీ కష్టములుగరాదు. వీరు యెంతసొమ్ము యివ్వవలెనో నేను యిచ్చివేస్తాను. వీరిని వదలి పెట్టండి.

భవా—ఇతణ్ణి వారంటుమీద పట్టుకున్నమనిషిని విడిపించి నందుకు పట్టుకున్నాము. ఇతణ్ణి విడిచిపెట్టవల్లకాదు.

జయ్య—వెండిరూపమున్న యీమందు మీచేతికి తగిలితే యితన్ని పట్టుకోవడానికి మీకే చేతులురావు. ఇవి పుచ్చుకొని పొండి. (అని పదిరూపాయలు చేతిలో పెట్టుచున్నాడు.)

భవా—ఈసుందుతో నాచేతులు కట్టివేసినారు. మీఔషధం శివప్రసాదుచేతికికూడా తగిలిస్తేనేకాని అతనిచేతులు కట్టుపడవు.

శివ—నాచేతులా?

జియ్య—మాట్లాడకు. నీచెయ్య యిలాగుపట్టు. (అని యతని చేతిలో మరిపదిరూపాయిలు పెట్టుచున్నాడు.)

శివ—మేము యెప్పుడూ డబ్బుకు లోపడే వాళ్లంకాము. లక్షనర హాలుకుప్పపోసినా మేము వక్కఅక్కిముకార్యం చెయ్యము. మీవంటి పెద్దలమాట మీరరాదుగనుక వీరిని విడిచిపెడుతూవున్నాము. బాకీ సొమ్ము దయచేయించండి.

జియ్య—దామోదరా! వీరిని తీసుకొనివెళ్లి లోపల సొమ్మిప్పించి పంపివేసిరా.

దామో—చిత్తము. (ముగ్గురును వెళ్ళుచున్నారు.)

జియ్య—వంచకా! నీకు రాజమహేంద్రివరంలో తోట వున్న దనిబొంకి నన్ను మోసం చెయ్యతలచుకొన్నావుకావా?

వంచ—నాకక్కడ తోటలేదా? నిజంగానే వున్నది. నేను చెప్పినవానిలో యేమీమోసంలేదు. ఆవూళ్ళో మ్యూజియంతోటమాదే.

జియ్య—చందాలువేసికట్టింది అది అందరిహక్కూకన్న. నీది యేలాగుఅయింది?

వంచ—నేను అందరిలోవాణ్ణే గనుక అందరితోటిపాటు నాదీఅయింది.

జియ్య—ఆహహా! నీయుక్తికి సంతోషించినాను.

వంచ—మీకొక్కరేయేమిటి? నాయుక్తికి అందరూ సంతోషించేవారు. చిన్నతనంలోనే నాతమ్ముడయిన దామోదరుణ్ణి—

[దామోదరుడు ప్రవేశించుచున్నాడు]

దామో—దామోదరుణ్ణా? యెవరు నాపేరెత్తుతూవున్నారు?

వంచ—దామోదరుణ్ణి మోసం చేసి వాడిచేతులో వుండే

పళ్ళూ పంచనారా తింటూవుంటే నాశక్తికి నన్ను మాతల్లికూడా మెచ్చుకునేది.

దామో—గొప్పవాడుకావలెనని చిన్నతనంలోనే దేశాలు తెగించిపోయిన జనార్దనుడవా నీవు? మాజనార్దనుడు చిన్నతనంలో నాచేతిలోయేమివున్నా యిట్టే మాయంచేసి యెత్తుకొనిపోయేవాడు.

వంచ—ఆజనార్దనుణ్ణే నేను. యిల్లువిడిచి వెళ్ళినతరువాత నాశక్తిసామర్థ్యాలచేత నేను వంచకాచార్యుల నయినాను. దామో దరా! యిలావచ్చి నిన్ను కాగలించుకో. ఇప్పుడు నేను కొడుకును పోగొట్టుకున్నా తమ్ముణ్ణి సంపాదించుకొన్నాను. (అని కౌగిలించుకొను చున్నాడు.)

దామో—అన్నయ్యా! అప్పుడే యింతముసలివాడవైపోయి నావేమి?

వంచ—నేను ముసలివాణ్ణి కావడం నీకు యిష్టంలేకపోతే యిదుగో మళ్ళీ పడుచువాణ్ణవుతాను చూడు. (అని క్రొత్తగాపెట్టు కొన్నపండ్లను నిూసములను గడ్డమును తీసివేయుచున్నాడు.)

పార్వ—దామోదరా! నీవు నన్ను పెళ్ళాడుతావా?

దామో—నేను అన్నమాట తప్పను. తప్పకుండా నిన్ను పెళ్ళిచేసుకుంటాను.

కంఠీ—నీతమ్ముణ్ణి చూచి మన మంతా మంచిమార్గం నేర్చు కోవలెను. వంచకా! నీవు యింతటినుంచి అబద్ధాలూ మోసాలూ మానివేసి పెద్దమనిషివికావలెను. నేనూ అవుతాను.

వంచ—నేను రూపంచేత యిప్పుడే పెద్దమనిషినయినాను. ఇఖ నడతచేతకూడా అవుతాను. ఇప్పుడే నిశ్చయం చేసుకున్నాను.

జిష్ణు—కంఠీకవా! ఇప్పుడు పశ్చాత్తాపంకలిగి నిజంగానే

నీనడత తిన్నచేసుకునే టట్టయితే నాకూతురిని నీకు తప్పకుండా యిచ్చి నిన్ను యిల్లరికం వుంచుకుంటాను.

కంఠీ—మామా! ముందు నానడత మీరు జాగ్రతగా పరీక్ష చేసి చూడండి. నాకు యింతటితో బుద్ధి వచ్చింది. మోసాలూ అబద్ధాలూ కొంతకాలం లాభకరంగా వున్నా కడపట సత్యమే జయిస్తుంది.— ఓ మహాజనులారా! నామాట నమ్మండి. అల్పలాభం నిమిత్తమయి అబద్ధాలూ మోసాలూ మానండి. లోపలికి వెళుదాము రండి.

(అని అందఱును వెళ్ళుచున్నారు)

అనహాయశూరపరిహాసనము.

ఇందువచ్చు పాత్రములు.

భావరాజు భీమరాజు — మహాశూరుఁడు.

పెంటయ్య — మహావీరుఁడు.

వీరభద్రుఁడు — సరస్వతిపిరియుఁడు.

భీమరాంబ — భీమరాజు భార్య.

సరస్వతి — భీమరాజుకూఁతురు; వీరభద్రునిపిరియురాలు.

రంగము — భీమరాజుగారి ముందరిలోగిలి.

[భీమరాంబయు సరస్వతియు పరివేశించుచున్నారు.]

సర — (విచారముతో) అమ్మా! ఆయన యెలాగు వున్నారు?

భీమ — అమ్మాయీ! యెలాగువున్నా రని చెప్పను? రాత్రి పొద్దుపోయి యింటికి వచ్చినప్పటినుంచీ ఆయనచర్య నాకు మహా వింతగా వున్నది. నాకు యేమనిచెప్పడానికీ తోచదు. యేమాట అడిగినా దేనికీ జవాబు చెప్పరు. వూరికే పరధ్యానంగా వుంటారు. రాత్రి యెవరియింట్లోనైనా కన్నంవేసినారో, యెవరినైనా తలకాయ బద్దలుకొట్టినారో, యేదో అటువంటి గొప్పకార్యం చేసి వుంటారు.

సర — మానాన్నగారివిూద నీవు నిష్కారణంగా లేనిదోషాలు ఆరోపిస్తూ వున్నావు.

భీమ — నిష్కారణంగానా? మొట్టమొదట రాత్రివంటిగంట దాకా ఆయన యింటికేరాలేదు. వచ్చిన తరువాత రాత్రి తెల్లవారిం దాకా నిద్రపట్టక మంచంవిూద ఇటూ అటూ దొర్లుతూ తన్నో

తానేమో అర్థంలేనిమాటలు గొణుక్కుంటూ పలవరిస్తూనేవున్నారు. రెండోఅంశము తెల్లవారిన తరువాత మూలగదిలో ముసుకు వేసుకుని కూర్చుండి కచేరీవేళ అయిందని భోజనానికి యెన్నిమార్లు పిలిచినా లేచి రాకుండా వున్నారు. ఇదివరకు యెప్పుడయినా యింత పొద్దెక్కిం దాకా కచేరీకి వెళ్ళకుండా యింట్లో అట్టేవున్నాకేమో చెప్పు. యేదీ లేకపోతే యెందుకు అట్టే వుంటారు? ఆయనకు యిష్టమయినకూర అని నేను యెంతో ఆపకిత్తో మువ్వంకాయ చేసి పిలిచినా రాలేదు. ఇంతకూ యిదంతా నాదురదృష్టం.

సర—నీవు తొందరపడబోకు. ఆయనమనస్సు స్వస్థంగా లేక పోవడానికి అనేక కారణాలు వుంటవి. ఈమధ్య మనయింటికి చుట్టాలు రావడం యెక్కువఅవడంచేతనే కాదా నేనుకూడా లోపలి భవంతి లోనే సర్దుకుని యిదివరదాకా నేను పడుకునే తోటలోవున్న యీ ముందరభవంతి కాళీచేసి అద్దెకు యివ్వడానికి సిద్ధం చేసినాను.

భీమ—నీవు యేవిధంగా సర్దిచెప్పినా నామనస్సుకు సమా ధానం కలుగదు. నేను వట్టి అదృష్టహీనురాలిని. అమ్మాయీ! నీకు వక్కసంగతి చెప్పుతాను విను. నివు మాత్రం యెప్పటికి నీదేహాన్ని స్వేచ్ఛనూ యితరులకు అమ్మకోకు.

సర—స్వేచ్ఛను అమ్మకోవడం అంటే నాకు యేమీ అర్థం కావడంలేదు. అమాటలకు వివాహం అని నీఅభిప్రాయం అయివున్న ట్టయితే నాన్నగారు యిప్పుకుంటే వీరభద్రరాజును నేను తప్పకుండా పెళ్ళిచేసుకుంటాను. అతనికి కచేరీలో పనికావడంతోటే మావివా హానికి నాన్నగారు వప్పుకుంటామన్నారు.

భీమ—అమ్మాయీ! యీవిషయంలో నీకు లోకానుభవరి త్తిగాలేదు. ముందుగా తొందరపడి యేదైనా కార్యంచేస్తే తరు

పాతే విచారించవలసివస్తుంది. నేను ముసలివాణ్ణి చేసుకుంటే సుఖ పడుతానని నీతండ్రిని రెండో పెళ్ళివాణ్ణి వివాహం చేసుకున్నాను. చేసుకున్నందుకు నేను యిప్పుడు యెలాగు విచారిస్తూ వున్నానో చూస్తూవున్నానా ? వీరభద్రరాజు వచ్చినాడా అని యీవుదయా న్నుంచీ మీతండ్రిగారు నన్ను చాలామాట్లు అడిగినాగు.

సర—నిజంగా అడిగినారా? యిదివరదాకా ఆయన వీరభద్ర రాజుకు కచేరీలో పని అయ్యేవరకూ ఆపేరే తనవద్ద తలపెట్టవద్ద న్నారు నాకు వేగిరం వివాహంచెయ్యవలెనే ఆసక్తిచేత యిప్పుడు ఆయనమనస్సు మార్చుకున్నట్టున్నారు. అయ్యో! యిప్పుడు వీరభద్ర రాజువస్తే బాగా వుండును. ఇది కచేరివేళగనుక నాన్నగారు యింట్లో వుండరనుకుంటాడేమో అతనికి యెవరిచేతనైనా వర్తమానం పంపిం తునా ? నాన్నగారు వుండగావస్తే సంబంధనిశ్చయం యిప్పుడే అవుతుంది.

భీమ—వూరుకో. మీనాన్నగారు వస్తూన్నారు. మనయిప్పటి ప్రసంగం ఆయనముందర యేమయినా అనేవు సుమా! జాగ్రత.

[వీధివంక తొంగిచూచుచు భీమరాజుగారు ప్రవేశించుచున్నారు.]

భీమ—యెవరూ వస్తూవున్నట్టులేదు. యేమివచ్చినాసరే నేను వకమాటు కచేరీకివెళ్ళి ముఖంచూపించి రాకతప్పదు. యివేళ కచేరీకి యింత ఆలస్యంగా వెళ్ళినందుకు యేదయినా కారణం కల్పించుకొని పోవలెను. నిన్నటిరాత్రి వ్యవహారం యెలా ముగిస్తుందో నాకు తెలియకుండావున్నది. (భార్యను కొమాత్రంగాచూచి) మీరు యిక్కడ యేమి చేస్తూవున్నారు ? మీకు యేమికావలెను ? అలాచూస్తారేమి!

భీమ—మీయాయినడత నాకు యేమీ బోధపడకుండావున్నది.

సర—నాన్నగారూ! యీవుదయాన్నుంచి మీచూపులు

యెలాగోవున్నవి.

భీము—(తనలో) నాముఖంచూచి వీళ్ళు యెలాగో నాసంగతి కనిపెట్టినారు. (బిగ్గరగా). నాముఖం కేసి చూడడమూ పిచ్చివూహాలు చెయ్యడమూతప్ప మీకు యింట్లో వేరే యేమీ పనిలేదా? పొండి. ఇఖ నాతో మాటుమాట ఆడకండి. అమ్మాయీ! నేను కచేరీకి వెళ్ళడానికి నాతలపాగా అంగరఖా యిలా తీసుకుని రా. పోరేమి?

సర—వెళుతూవున్నాము. (నడుచుచు) పిన్నీ! ఇదేమిటి?

భీము—యేమనిచెప్పను? లోకంలో మొగవాళ్ళంతా యిదే మోస్తరు. యింతపొద్దెక్కి- యిప్పుడు భోజనంచెయ్యకుండా కచేరికి వెళుతారట. (అని యిద్దఱును వెళ్ళిచున్నారు.)

భీమ—(అంతట కలయఁజూచి) అందరూ వెళ్ళినారా? వెళ్ళినారు? నేడు యెటువంటి పాపిష్టిరాత్రి గడపినాను. అది రాత్రికాదు. నాపాలిటికి వకమహాయుగంలాగు కనపడ్డది. నేనుయెప్పుడూ నాటకాలు చూడడానికి వెళ్ళేవాణ్ణికాను. భోంచేసి శిరస్తాదారుగారి యింటికి వెళ్ళివస్తూ దోవలో నాటకంఆడుతూ వున్నారంటే యిట్టేలోపలికిపోయి నాను. అప్పుడు నారొంటిని అర్థరూపాయి వుండడంచేత దానితో రెండవతరగతి టిక్కట్టుకొని బల్లమీద కూర్చున్నాను. నేను కూర్చోవడంతోటే వెనుకనుంచి యెవళ్ళోఅల్లరివాళ్ళు పాగాఅడ్డం తీసివెయ్యమని కేకలు వేస్తే నాతలపాగాతీసి నేను కూర్చున్నబల్లమీద పక్కగా పెట్టినాను. నాటకం అయిపోయే ముందర నాతలపాగాకోసర చూచుకునేటప్పటికి కనపడ్డదికాదు. దగ్గిరవున్నవాళ్ళను యెవరినిఅడిగినా లేదన్నారు. అందుమీద నాబల్లమీద వున్నవారినందరినీ లెమ్మనేటప్పటికి నాపాగా వక పెద్దమనిషిముడ్డికింద నలిగివున్నది. "ఏమయ్యా! నాపాగా మొత్తగా వేసుకుని కూర్చోవడం మీకు ధర్మమేనా?"

అని నేనా పెద్దమనిషిని మందలించేటప్పటికి తాగివుండడంచేత నన్ను అతను తిట్టి అడ్డమయిన కారుకూతలు కూసినాడు. నేను శాంతంవహించి వూరుకునేవుందును గాని దగ్గిరనున్నవాళ్ళందరూ పోత్సాహంపరిచి పురియెక్కించడంచేత రోషంవచ్చి నేనుకూడా తిట్టి అతణ్ని మెడపట్టుకుని గెంటినాను. అతడు కిందపడిలేచి "యిది నాటకంపాక అయింది గనుక బ్రతికిపోయినావు నీపేరూ యిల్లూ చెప్పు. రేపు యేమిచేస్తానో చూడు" అన్నాడు. నేను "భావరాజు" అని యింతలోనే అతనివూహ జాలిపుట్టడంచేతనో మరియెందుచేతనో కాని కోపమంతా మింగివేసి "మంగళవారపుపేట" అని చెప్పినాను. అతను వెంటనే తన జేబులో నుంచి వకకాగితముతీసి దానిమీద తనపేరు "పెంటయ్య లక్ష్మీవారపు పేట సత్రము" అని వ్రాసి నాచేతికిచ్చి రేపు దెబ్బలాడుదాము రమ్మన్నాడు. నేను యింటిపేరుచెప్పి పేరుచెప్పకపోవడంచేతనూ, పేట తప్పు పేట చెప్పడంచేతనూ యీబుధవారపుపేటలో నన్ను అతను కనుక్కోలేడు. పెంటయ్య అనేపేరు నిజమయినదిగా నమ్మడానికి వీలులేదు. అతని ముఖంచూస్తే అతడు ఖూనీలుచేసే తెంపరిగా కనపడ్డాడు. అతడు యెక్కడ కనపడుతాడో అని నేనుయివేళ వీధిలోకివెళ్ళలేదు. నేను వీర భద్రరాజుతో మాట్లాడవలెను. అతను తనకు నాయందు గురుభక్తి అనిన్ని సమయంవస్తే నానిమిత్తం ప్రాణాలయినా విడుస్తాననీ చెప్పుతూ వుంటాడు. యిప్పుడు సమయంతటస్థించింది గనుక నాతరపున వాడితో పోట్లాడడానికి పెనుకతియ్యడని తలుస్తాను. అతను దిట్టంగావున్నాడు. యిటువంటి యిద్దరు పెంటయ్యలను కొట్టగలడు..

[అంగరక్కాయును, తేలగుడ్డయును పట్టుకొని సరస్వతియు, భీమకొంబయు ప్రవేశించుచున్నారు]

సర—నాన్నగారూ! యివిగో.

భీమ—(అంగరకా తోడుగుకొనుచు) దోవలో అతను నాకు యెదురుపడుతాడేమో! (మొగము కనపడకుండ తలపాగా ముందుకు పెట్టుకొని) ముందుగానే జాగ్రతపడడం మంచిది—అమ్మాయీ! లోపలికి వెళ్ళి బణాచుపచ్చడం తీసుకునిరా.

సర—మంచు వేసవికాలములో బణాచుపచ్చడం యెందుకు?

భీమ—యెందుకై తేనేమి? నామాటకు అడ్డంచెప్పక తీసుకునిరా!

భ్రీమ—అమ్మాయీ! వెళ్ళితీసుకునిరా. ఆయన నిన్నువదల్చి కోవలెనని పని కల్పనచేస్తూవున్నారు.

భీమ—వదల్చుకోవలెననా? నేనేవదలుతాను. 'ఇఖముందు నీవు వక్కచానవూ సుఖపడుదువుగాని లే. కాపురానికివచ్చిన నాలుగు సంవత్సరాలలోనే అప్పుడే నేనంటే నీకింత విసుగుదలగావున్నదా? నీకోరికే లభిస్తుంది. పోనీ నీతోనేను యిప్పుడు తగువులాడను.

సర—(పచ్చడముతో ప్రవేశించి) ఇదుగో తెచ్చినాను.

భీమ—(పుచ్చుకొని మొగమునిండ ముసుగు వేసికొని) అమ్మాయీ' వెళ్ళివస్తాను. నాతప్పులు క్షమించండి. (తనలో) ఏదయినా అపాయంవస్తే యిదే ఆఖరు సారువు.

(అని వెళ్ళుచున్నాడు.)

భ్రీ—ఆయనమాటలు విన్నావా? అందులో చాలా అర్థం వున్నది. నేనువక్కచానీని సుఖపడడమట! ఈవక్కమాటలోనూ యెంత అర్థమయినా వున్నది.

సర—నాకు యేమీ కొత్తఅర్థం కనపడడంలేదు.

భ్రీమ—నీకు కనపడడంలేదు. పెళ్ళి చేసుకుని నాలుగేళ్ళపాటు మొగుడితో వుంటేనేకాని యిటువంటిని యేవీ కనపడవు. నాకు పనివున్నది లోపలికి వెళ్తుతాను. యెవ్వరైనా అడ్డుకుఅడిగితే తోటబం

శాళా నాలుగురూపాయలకు యిచ్చివెయ్యి. నీపెళ్ళివిషయంలో నేను యిందాకాచెప్పింది మరచిపోకుమా. మగవాళ్ళంతా వక్కరేలచ్చు. వక్కరినీ నమ్మరాదు. యెవరినైనా మగవాణ్ణి పెళ్ళిచేసుకోవడానికి ముందుగా బాగా ఆలోచించుకో. (అని వెళ్ళిపోయినది.)

[వీరభద్రరాజు పరికేశించి సరస్వతికి కనబడకుండ వెనుకనిలుచున్నాడు.]

సర—ఆలోచించుకోనా? ఇదివరకే బాగాఆలోచించుకున్నాను. వీరభద్రరాజు తనమీద మక్కువవున్నదా అనిఅడిగితే మాట్లాడక వూరుకున్నాను. నామనస్సులో వున్న కోరికకె చెప్పే టట్టయితే మక్కువ వున్నదని వెంటనే చెప్పనలసిందే. అయితే నాకు అతనిమీద మోహంవున్నసంగతి కొంతకాలందాకా తెలియకుండా వుంచుతాను.

వీర—ఏమీ!

సర—ఎవరు వారు? మీ రేనా? తనలో తాను రహస్యంగా మాట్లాడుకునే మాటలు యెవరూ వినకూడదు.

వీర—కొందరు వినవచ్చును. అవునుగాని ప్రియురాలా!—

సర—నన్ను ప్రియురాలా గియురాలా అనకండి. ఇవేళమీరు యింతసేపటివాకా యెందుకు మాయింటికిరాకుండా ఆలస్యంచేసినారో వివరంగా చెప్పేవరకూ నేను మీతో మాటాడను.

వీర—ప్రొద్దున్నంతా వుద్యోగంకోసం అనుసరిస్తూ వారింటి కాడ కూర్చున్నాను.

సర—చాలును. ఇక చెప్పనక్కరలేదు. నేను తృప్తిపొందినాను.

వీర—మీ రీబంగాళా ఖాళీచేసినట్లున్నారు. ఇది నేను అద్దెకు పుచ్చుకుంటాను. నాకు వుద్యోగం అయి మనపెళ్ళికి మీతండ్రిగారు వప్పుకునేవరకూ ఇందుమూలంగానైనా నేను యెప్పుడూ నిన్ను మాస్తూవుంటాను.

సర—సరిసరి. చాలును. నీవు ఇక్కడ వుండవద్దు. యీసంగతి మానాన్నగారికి తెలిస్తే మనయిద్దరమూ ఆలోచించుకుని యేదోపన్ని నామని అనుమానపడుతారు. మీకు ఇల్లు యివ్వడానికి అసలేవప్పుకోరు.

వీర—నేను వెళ్ళి మీసవతితల్లితో మాట్లాడుదునా?

సర—వద్దు మనం యిద్దరమూ వంటరిగా యిక్కడవున్న సంగతి ఆవిడకు తెలియకూడదు.

వీర—అయినాకానీ

సర—నేను చెప్పినట్టు చెయ్యకపోతే మీరు యీయింట్లో వుండడానికి నేనే వప్పుకోను.

వీర—ఆలాగైతే నేను వెళ్ళిపోతాను. (అని వెళ్ళుచున్నాడు.)

[అవ్వాయిభీమరాంబ తొందరగా ప్రవేశించుచున్నది]

భీమ—ఇక్కడయెక్కడనైనా యిల్లు అద్దెకు దొరుకుతుందా అని యెవరో వీధిలో అడిగితే పొరుగువారు మనయిల్లు చెప్పినారు. మాటవినపడి నేను పని వదలిపెట్టి వేగిరంవచ్చినాను. అరుగో ఆయన ఇలాగువస్తూన్నారు.

సర—ఆలాగైతే అద్దె నీవేమాట్లాడి పరిష్కారంచెయ్యి. నేను లోపలికి వెళ్ళివస్తాను. (అని వెళ్ళుచున్నది.)

[మొగము కనబడకుండ బట్టమునుగు వేసికొని పెంటయ్యప్రవేశించుచున్నాడు.]

భీమ—దారియిది ఇలాగురండి.

పెంట—(మునుగుతీసి ఇంటికేసిచూచి) ఈయిల్లు యెవరిది?

భీమ—భీమరాజుగారిది. మీరు ఇంటికోసం వెతుకుతూ వున్నారుకాబోలును.

పెంట—అవును. ఆయన మీకు యేమవుతారు? తాతగారా?

భీమ—కారు. ఆయనమావాడే.

పెంట—మీ యింటిఆయనా? ఈ యింట్లో వేరే పురుషులు యెవరూ లేరుకదా.

భ్రమ—లేరు.

పెంట—అలాగైతే యీయిల్లు బహుబాగావున్నది.

భ్రమ—పోరుగంటా బహుమంచిది. దీనికివున్న లోపమల్లా ఇదివూరికి చివరను కొంచెం మారుమూలగా వున్నది.

పెంట—నాకు ఆలాగంటియిల్లేకావలెను. అది యెంతమాత్ర మూలోపంకాదు. ఇళ్ళమీద ఇళ్ళువుండడంకంటె ఇలాగంటితోటలూ దొడ్లూఅంటే నాకు బహుసంతోషం.

భ్రమ—మీరీవేళ పొద్దున్నుంచీ భోజనం చెయ్యలేనట్టున్నది. మీకు తొందరగా వున్నట్టయితే మాకువండుకున్న అన్ననూ కూరలూ మీకుపెట్టి మేము మళ్ళీ వండుకుంటాము. మంచి మువ్వంకాయ వండినాను. నాలుగుఅణాలు యిస్తే యీపూట మీకు పెరుగుతోభోజనం పెడుతాను. (తనలో) ఈచల్లారిపోయిన అన్నమూ కూరలూ యీయనకుపెట్టి కచేరీనుంచి ఆయన వచ్చేటప్పటికి మళ్ళీ వంటచేస్తాను.

పెంట—(తనలో) ఇక్కడ భోజనంకూడా దొరికింది. నేను యీరోజున గుమ్మందాటివెళ్ళనక్కరలేదు. (బిగ్గరగా) నీవు మహాదొడ్డ యిల్లాలులాగు కనపడుతూ వున్నావు. నీతో నేను బేరమాడను. ఇంటిఅద్దె యెంతో కూడా చెప్పివెయ్యి. నన్ను పరాయివాణ్ణిగా చూడక మీకుటుంబంలో వకణ్ణిగా చూడవలెను. అయ్యో! మడిబట్ట లేదుగదా?

భ్రమ—ఈపూటకు మానారిపట్టుబట్ట యిస్తాను. కట్టుకోండి.

(అని తెచ్చియిచ్చుచున్నది.)

పెంట—ఇన్నిచోట్ల తిరిగినాను గాని నీవంటి దొడ్డయిల్లాలిని

నాజన్మంయెత్తినతరువాత నేను యెక్కడాచూడలేదు. (అని పట్టుపంచె పుచ్చుకొని) ఇటువంటి భార్య దొరకడంచేత మీయింటాయన చేసు కున్నపుణ్యమే పుణ్యం.

భీమ—మీరు నన్ను వూరికే పొగుడుతూవున్నారు.

పెంట—నేను చెప్పినదంతా నిజం ఇది ముఖస్తుతికాదు.

[సరస్వతి ప్రవేశించుచున్నది.]

భీమ—ఈచిన్నది నాకూతురు.

పెంట—కూతురా? ఈచిన్నది మీచెల్లెలో అప్పగారో అను కున్నాను. సవితికూతురు కాబోలును. —అమ్మాయీ! నీవుకూడా నీతల్లిగారు చూపించినదయే నామీద కనపరచవలెనుసుమా.

సర—మీరు బహు దొడ్డవారు. ఇటువంటి సత్పురుషులు మాపుణ్యంచేత మాయింటికి కాపురానికి వచ్చినారు.

పెంట—నేను ధన్యుణ్ణయినాను. అమ్మా! అద్దెమాట చెప్పి నారుకారు.

భీమ—నెలకు నాలుగురూపాయలు.

పెంట—ఇదిగో వకనెల అద్దె పుచ్చుకోండి. (అని నాలుగురూ పాయ లిచ్చుచున్నాఁడు.)

భీమ—(పుచ్చుకొని) ముందుగానే యిస్తూవున్నారా?

పెంట—యెప్పుడైతేనేమి ఇవ్వవలసింది ముందుగానే ఇచ్చి నాను. (తనలో) ఈవిడె అద్దె పుచ్చుకున్నది. ఇక బ్రహ్మ దిగివచ్చినా నెల్లాళ్ళదాకా నన్ను యీ యింట్లోనుంచి యెవరూ లేవకొట్టలేరు. (అని లోపలికి వెళ్ళుచున్నాఁడు.)

సర—(తల్లితో రహస్యముగా) ఇతఁడు తమాషా మనిషిలాగు వున్నాడు. నాన్నగారూ యితడూ తగవులాడకుండావుంటే బాగా

వుండును.

పెంట—(కిటికీలోనుండి చూచుచు) ఈయిల్లు బహుతేమాపా గావున్నది. చుట్టూ తోటలు యెంతో ముచ్చటగావున్నవి. ఈవైపున పున్నాలచెట్లున్నవి. అవతలవైపున కూరగాయల పాదులు వున్నవి. అమ్మా! వడ్డనచేయిస్తారా!

భ్రమ—మా అమ్మాయి వెళ్ళి తెస్తుంది. అమ్మాయీ! నీవు వెళ్ళి అన్నమూకూరలూ పట్టుకువస్తావా?

పెంట—నాపుణ్యంచేత నేడు యీఅమ్మాయిచేతివడ్డన కూడా నాకు లభ్యమైనది.

సర—ఇదుగో తెస్తాను. (అని వెళ్ళుచున్నది.)

పెంట—యీఅమ్మాయి మహామంచిది. ఈపిడెపేరు యెవరు?

భ్రమ—సరస్వతి. మీపేరుయెవరో సెలవిస్తారా?

పెంట—నాపేరా? పేరు మంచిదైతేనేకాని మీవంటివారితో చెప్పకూడదు. నాది చెప్పరానిపేరు.

భ్రమ—మీపేరు యెవరికీ తెలియకుండా ఇక్కడ వుండవలెనని వుద్దేశించుకున్నారా?

పెంట—లేదు. అటువంటివుద్దేశం యెంతమాత్రమూలేదు. నాపేరు ప్రసిద్ధిలోకిరావలెననే నావుద్దేశం. ఏనాకానీ ఇటువంటి చెడ్డ పేరుతో నాకు మంచిపేరు యేలాగువస్తుందో తెలియకుండావున్నది. (అని పేరు మెల్లగా చెప్పుచున్నాడు)

భ్రమ—(ఉలికిపడి) ఏమీ!

పెంట—నాపేరు మీకసహ్యంగా వుంటుందని నాకు తెలుసును. అని మాపెత్తండ్రిపేరు నాకు పెట్టినారు. ఈపేరు మార్చుకోవడపు వుద్దేశంతోనే ఇప్పు డీవూరికి వచ్చినాను. మాపెత్తండ్రిగారు

బ్రతికివుండగానే ఆయన నావుద్దేశం కనిపెట్టి పేరుమార్చుకోకుండా వుంటే సంవత్సరానికి నూరురూపాయిలు వచ్చే తనమాన్యం నాకు వుండేటట్టును పేరు మార్చుకునేటట్టయితే ఆమాన్యం తనపెళ్ళానికి వెళ్లేటట్టును యేర్పాటుచేసి చచ్చిపోయినాడు; ఆవిడిప్పుడు యీ వూళ్ళోవున్నది. వక చిన్నది నన్ను పెళ్లిచేసుకుంటా నని తీరా వినాహం సిద్ధమయ్యేటప్పటికి యీపాడుపేరు మార్చుకుంటేనేకాని పెళ్లిచేసుకో నన్నది. ఇప్పుడావిడె మూపెత్తండ్రికి మూడోపెళ్ళి పెళ్ళాను! ఆవిడెకు పద్దెనిమిదేళ్ళ వుంటవి. ఇక్కడి స్త్రీపునర్వివాహ సమాజంవారి ప్రోత్సాహంవల్ల ఆవిడె రెండునెలలకిందట వకభాగ్యవంతుణ్ణి మళ్ళీ పెళ్ళి చేసుకున్నది. ఆవిడెకు యీమున్నిమూరురూపాయలూ దేమీలక్ష్యం లేదు. ఆవిడెను బతిమాలుకుని యెలాగైనా ఆవిడెచేత ఈమాన్యం తనకు అక్కరలే దనిపించుకుని పేరు మార్చుకోవలెనని ఇక్కడకు వచ్చినాను. ఆవిడె నాలుగురోజులకిందట మొగుడితో యెక్కడికో వూరికి పెళ్ళిందట. ఆవిడె బహుమంచిమనిషి. చిన్నప్పుడు బాలికాపాఠశాలలో చదువుకున్నది. ఆవిడెకు ఇష్టంలేకుండానే మూడోపెళ్ళి మొగుణ్ణి తల్లిదండ్రులు కట్టిపెట్టినాగు. ఆవిడె తిరిగివచ్చిందాకా ఈ వూళ్ళో వుంటాను.

భీమ—మీకార్యం వేగిరం సఫలం కావలెనని నేనుదైవాన్ని ప్రార్థిస్తాను.

పెంట—నీతల్లికడుపుచల్లగా నీనోటిమాట ఫలించవలెను.

భీమ—మంచివారికి దైవం యెప్పుడూ సహాయం చేస్తాడు. నేను సెలవుపుచ్చుకుంటాను. (అని వెళ్ళుచున్నది.)

పెంట—ఇఖ నేను తప్పించుకున్నాను. ఆపెద్దపులినోట్లోనుంచి తప్పించుకున్నాను. అతడు వెళ్ళి నేను చెప్పినయింటికి వెళ్ళిచూచి నేను

యెక్కడికో పారిపోయినానని పేటంతా వెతుకుతాడు. వూళ్ళోవున్న స్త్రీలూ వంటపూటియిళ్ళూ అన్నీ వెతికినా నేను యెక్కడా కన పడను. నేను యీమారుమూలను బుధవారపుపేటలో వుంటానని అతను అనుకోడు. రాత్రి కొంచెంతాగి మత్తుగా వుండడంచేతగాని లేకపోతే నానిజమయిన పేరూ వున్నస్థలమూ చెప్పివుండను. రాత్రి సంగతి తలుచుకుంటే నావొళ్ళంతా గరపొడుస్తూవున్నది. నే నేమిటి? ఆజానుబాహుడైన ఆమోఘమునలివాడితో పోట్లాడడం యేమిటి? ఆమత్తులో వొళ్ళు తెలియక వూరికే దెబ్బలాడుతానన్నాను. ఆ నర హంతకుడు పెందరాళే లేచేవాడు కాకపోవడంచేత నేను చాలా ప్రొద్దెక్కి లేచినా వేగిరం వూటకూళ్ళకు యివ్వావలసినసొమ్ము యిచ్చివేసి అతను అక్కడికి రాకమునుపే తప్పించుకొని పారిపోయి వచ్చినాను. అతడు ప్రొద్దున్నే వచ్చినట్టయితే యీపాటికి నాపని యేమవునో!

[అప్పుడు వీరభద్రరాజు ప్రవేశించుచున్నాడు]

వీర—యెవ రక్కడ?

పెంట—(భయపడి) దగ్గిరకు రాకండి. (వీరభద్రరాజు మొగము వంక చూచి) మిమ్మల్ని చూచి నిష్కారణంగా వులిక్కిపడి జడుసుకున్నాను.

వీర—ఏమరిపాటున వచ్చినందుకు క్షమించండి. (తనలో) ఇతడు యెవరై వుంటాడు?

పెంట—(తనలో) జాగ్రత్తగా వుండవలెను. ఇతడు వకవేళ మనజూడ తియ్యడానికి పంపించిన వేగువాడై వుండవచ్చును. (బిగ్గరగా) క్షమాపణ అక్కర లేదు. నేను ఇక్కడ వున్నానని మీరు యెరుగరు కాబోలును.

వీర—యెరగను. నేను భ్రమరాంబగారితో మాట్లాడిపోవ

డానికి వచ్చినాను.

పెంట—నాకు యిల్లిచ్చిన యీ యింటామెతోనా?

వీర—యీ యిల్లు మీకప్పుడే ఇచ్చివేసిందా!

పెంట—ఇచ్చివేసింది. అప్పుడే పావుగం టయింది వచ్చి నేనీ యింట్లో ప్రవేశించినాను.

వీర—(తనలో) వకదాని తరువాత వకటి నాకన్నీ దురదృష్టాలే వస్తూవున్నవి. ఇఖ భ్రమరాంబతో మాట్లాడిన ప్రయోజనం లేదు. ఇతనితోనే యెలాగైనా మాట్లాడి యీ యిల్లు పుచ్చుకోవలెను. (బిగ్గరగా) అయ్యా!

పెంట—(ఉలికిపడి నలుదిక్కులుచూచి యెవ్వరును లేకుండుట చేత ధైర్యము తెచ్చుకొని) నాకు చెవుడు లేదు. మీరంత బిగ్గరగా పిలువనక్కర లేదు.

వీర—మీరు పుచ్చుకున్న యీ యిల్లు నాకు ముఖ్యముగా కావలసి వున్నది.

పెంట—నాకూముఖ్యంగానే కావలసివున్నది. మీరుప్రయత్నం చేస్తే వూళ్ళో కావలసినన్ని ఇళ్ళు దొరుకుతవి.

వీర—అవునుగాని నాకు యీ యిల్లే అవశ్యంగా కావలెను. నిజం చెపుతాను వినండి. ఈ యింటియజమానుడయిన భీమరాజుగారి కూతురు సరస్వతియీద నాకు చాలాప్రేమ వున్నది. ఆచిన్నదాన్ని వివాహంచేసుకోవడానికి నేను ప్రయత్నంచేస్తూ వున్నాను. నేను యీ యింట్లో వుంటేనేకాని మావివాహానికి ఆయన వప్పుకోడు. కాబట్టి మీరు సిద్ధమైన పెళ్లికార్యానికి భంగంకలుగచెయ్యక వేరే ఇల్లు కుదుర్చుకుంటారని నమ్ముతాను.

పెంట—నేను నీకు నాచేతనైనసహాయం చేస్తానుగాని ఇందులో

వక్కసంగతి వున్నది. రాత్రి యీవూళ్ళో నేను వక పెద్దమనిషితో తగవులాడి నాతో పోట్లాటకు రమ్మని నాపేరూ వున్న ఇల్లూ వ్రాసి యిచ్చినాను. ఆపెద్దమనిషి యెవరో అదివరకు నేను యెప్పుడూ చూచి వుండలేదు. నాకైతే భయంలేదుగాని ముక్కూ మొగమూయెరుగని వాళ్ళతో పోట్లాడడం నాకిష్టంలేదు. అందుచేతనే నేను ఇదివరదాకా వున్న పూటకూటియిల్లు వదలివేసి ఇక్కడవచ్చి ప్రవేశించినాను. నేను యీవూళ్ళోకొంచెంకాలమే వుంటాను. ఈలోపుగా మరివకచోటికి వెళ్ళడానికి నాకు యిష్టం లేదు.

వీర—ఈచుట్టుపట్ల చాలా యిళ్ళు దొరుకుతవి. మీకు యింతకంటే మంచియిల్లు చూచిపెడుతాను. మీరు నాకు యీమాత్రపు వుపకారంచేస్తారా, మీప్రాణానికి నాప్రాణమయినా అడ్డంవేసి యెవరి వల్లనూ యేవిధమైన తొందరా రాకుండా నేను జాగ్రతపెడుతాను.

పెంట—నీమాటలువింటే నాకు జాలివేస్తూవున్నది. నీవు తప్పకుండా నీవుచెప్పినంతా చేసేవాడవే. నేను చెప్పేసంగతికూడా విను. నేను యీవూళ్ళో యెంతోకాలంవుండను. కొన్నిరోజులే వుంటానో కొన్నిఘంటలే వుంటానో!

వీర—అంతేనా?

పెంట—శ్యామలాంబ అనే ఆవిడెకు నేనువ్రాసిన వుత్తరానికి జవాబునిమిత్తం యెదురుచూస్తూవున్నాను.

వీర—కొత్తపేటలో వున్న శ్యామలాంబా?

పెంట—అవును. ఆవిడెను నీవుయెరుగుదువా?

వీర—యెరుగుదును. ఆవిడెను కొత్తగా పెళ్ళాడింది నామేన మామే. వక్కనిమిషం తాళండి జ్ఞాపకం చేసుకుంటాను. తనపేరు మార్చుకోవడానికి సెలవడుగుతూ కొన్నిరోజులక్రిందట ఆవిడెకు ఉత్తరం

వాసిన పూర్వభర్తతాలూకు బంధువుడవు నీవేకాదుగద?

పెంట—ఆ దురదృష్టవంతుణ్ణి నేనే.

వీర—మీ పేరు—

పెంట—చెప్పకండి. చెప్పకండి.

వీర—(నవ్వుచు) ఆహాహా!

పెంట—నవ్వకండి. ఇది నవ్వులాటన్యనహారం కాదు. ఇది ముఖ్యమయినకార్యం. ఆవిడే వూళ్ళోకి రావడంతోటే—

వీర—ఆవిడే వూళ్ళోకి యీవుదయాన్నే వచ్చింది.

పెంట—ఆలాగైతే ఆవిడెవర్గరనుంచి నావుత్తరానికి జవాబు రావడంతోటే—

వీర—మీరు యీయింట్లోనుంచి వెళ్ళిపోతారు. నాకు తెలిసింది. నేను యిప్పుడు పక్షిలాగు యెగిరిపోతాను.

పెంట—యెక్కడికి?

వీర—మీవుత్తరానికి జవాబుతీసుకురావడానికి. నేను యెంతో సేపువుండను. ఈలోపుగా మీకు నాపని యేమయినా కావలసివున్న ట్టయితే నాపేర వుత్తరం వ్రాసి కొత్తపేటలో సన్యాయింటికి పంపండి. మీరు పరోపకారధురీణులు. మీమేలు నేను యెప్పటికి మరిచిపోను. మీతరపున నిలిచి యెవరితోనైనా పోట్లాడమంటే పోట్లాడుతాను. నాపాణం యిమ్మనాన్న యిస్తాను. (అని వెళ్ళబోతున్నాడు)

[విస్తరియు, చెంబులును, పీటయు పట్టుకొని సరస్వతి ప్రవేశించుచున్నది]

సర—వీరభద్రరాజు యీయనతో మాట్లాడి వెళుతూ వున్నాడు. వీరిద్దరికీ పూర్వపరిచయం వున్నట్లున్నది.

పెంట—(గడిలోపల) ఈపట్టణంలో కంపుయెక్కువగా వున్నా యిక్కడ వుండేజనులు బహుమంచివాళ్ళుగా కనపడుతూ వున్నారు,

ఈచిన్నవాడు నానిమిత్తం తనప్రాణమయినా యిస్తానన్నాడు. ఇతను మహామంచి అంతఃకరణ కలవాడు. నాకు యిల్లు దొరకకపోయినా యీయిల్లు యితనికి యిచ్చివేస్తాను. (అని యీవలికి వచ్చుచున్నాడు)

సర—అయ్యా! మీకూరలూ అన్నమూ పొయిమీద కొంచెము వెచ్చపెట్టి మాపిన్ని పోస్తూవున్నది.

పెంట—అమ్మాయీ! నీవా? అంతా పరిష్కారమయింది. ఈయిల్లు అతనికియిచ్చివేస్తాను. నీవు చిరకాలం సుఖపడవలెనని ఆశీర్వాదం చేస్తూవున్నాను.

సర—మీ మాటలు నాకేమీ తెలియడం లేదు.

పెంట—అవును. తెలియవు. యోగ్యురాండ్రయిన కన్నెలకు యిటువంటివి యేమీ తెలియవు. సరస్వతీ! నీవద్ద రెండు యోగ్యతలు వున్నవి. నీకు చక్కదనమూ వున్నది. దానికి తగినట్టు వినయమూ వున్నది. నేను వక్కసారి యీగదిలోకి వెళ్ళివస్తాను. నీవు సంతోషముగా వుండు. ఈయిల్లు అతనికి యిచ్చివేస్తాను. (అని లోపలికివెళ్ళుచున్నాడు.)

[భీమరాంబ ప్రవేశించి విస్తరిలో వడ్డించుచున్నది]

భీమ—ఈయన యెక్కడికి వెళ్ళినాడు? అన్నమూ కూరలూ మళ్ళీ చల్లారిపోతవి.

[భీమరాజుగారు తలుపుతీసుకొని ప్రవేశించుచున్నాడు.]

భీమ—(భార్యను కౌగిలించి చేసైగచేసి దగ్గరకు పిలిచి మెల్లగా) నేను వెళ్ళినతరువాత మనయింటికి నాకోసం యెవరయినా వచ్చినారా?

సర—యెవరూ రాలేదు.

భీమ—ఓప్రాణేశ్వరీ! యెవరూ రాలేదా?

భీమ—రా లేదు.

భీమ—నాకు సంతోషంగా వున్నది. (అని గంతులు వేయు చున్నాడు.)

భ్రమ—మీాయిందాకటి విచారమంతా పోయి మళ్ళీ యెప్పటి సంతోషం వచ్చిందా?

భీమ—నేను వకప్పుడు విచారంగావున్నానా? నాకు యెప్పుడూ విచారం లేదు. నేను యెప్పుడూ సంతోషంగానే వుంటాను.

భీమ—విచారం లేకపోతే పోనియ్యండి. మీాయిందాకటి స్థితి చూస్తే నాకు నిజంగా భయం వేసింది.

భీమ—ఇకముందు యెప్పుడూ అలాభయపడబోకు.

సర—నాన్నగారూ! మీరువెళ్ళినతరువాత మీశలవుప్రకారం యీాయిల్లు వకరికి అద్దెకు యిచ్చివేసినాము.

భీమ—యెవరికి యిచ్చినారు?

భ్రమ—ఆయన యెవరో మహామంచివాడు. వక నెల అద్దె ముందుగానే యిచ్చివేసినాడు.

భీమ—రండి. మనకు మంచిదినాలు వస్తూవున్నవి. ఆయన యెక్కడ వున్నాడు? ఆయనకు నేను మర్యాద చెయ్యవలెను.

సర—ఆగదిలో (అని చూపుచున్నది)

భీమ—అతిధిసత్కారం చెయ్యడానికి యజమానులు మీరు వచ్చినారు గనుక మీరుమేము లోపలికి వెళుతాము. (అని భీమ రాంబయు సరస్వతియు వెళ్ళుచున్నారు.)

భీమ—ఇక నేను నిర్విచారంగా వుండవచ్చును. మా యింటికి కాపురానికి వచ్చినాయన నాకు సహాయంగా వుంటాడు. (విస్తరివంక చూచి) అప్పుడే వంటయిందా! మువ్వంకాయకూడా వున్నది. నాకు

యిప్పుడు మనస్సులో విచారంపోయిందిగనుక యీఅన్నమూకూరల్నూ విస్తరీకూడా మింగి వెయ్యవలెనని వున్నది నాకు యినేళ యిక్కడ వడ్డించింది. నేను లోపలికిపోయి పాగా అంగరకా తీసివేసి యిప్పుడే వస్తాను. (అని వెళ్ళుచున్నాడు)

[పెంటయ్య పరివేషించుచున్నాడు.]

పెంట—ఇప్పటికి నాపాణాలు కుదుటపడ్డవి. ఇప్పుడు ఖులా సాగా భోజనం చెయ్యవచ్చును. (అని పీటమీద కూరుచున్నాడు.)

[బట్టలు తీసివేసి భీమరాజు మరల పరివేషించుచున్నాడు]

భీమ—నాపట్టుపంచె కనపడ్డదికాదు. పోనీ. నాకు యిష్టమయిన మువ్వంకాయ వున్నది కనుక యీబట్టలతోనే భోజనంచేస్తాను. (అని విస్తరివద్దకు వెళ్ళుచున్నాడు; అప్పుడు వారిద్దఱును ఒకరినొకరు వానవాలు పట్టుచున్నారు)

పెంట—(భయముతో) ఎవరు?

భీమ—(భయముతో) ఏమి?

పెం—ఇదుగో ఖూనీచేసేవాడు.

భీమ—ఇదుగో నరహత్యచేసేవాడు. (వెనుకకువచ్చి తనలో) పీడు దొంగలాగో నాయిల్లు కనుక్కుని యిక్కడికే వచ్చినాడు.

పెంట—(తనలో) నేను యెక్క డొక్కడికి వెళ్ళినదీ యితడు వేగులవాళ్ళను పెట్టి కనుక్కున్నాడు.

భీమ—నన్ను హింసించడానికి నీవు మాయింటికే వచ్చినావా?

పెంట—నీయిల్లా? ఈయిల్లు నాది.

భీమ—ఈయిల్లు నీదా? (తనలో) ఈకిరాతుడు నాయింట్లో పరివేశించి, నాపట్టుబట్ట కట్టుకుని, నామువ్వంకాయలు మింగివెయ్యడానికి తయారుగా వున్నాడు. నామనస్సులో వెక్క దురూహాకూడా

పుడుతూ వున్నది. ఈదురాత్ముడు నన్ను కడతేర్చి నాపెళ్లాన్ని వివాహమాడవలెనని తలచుకొని వుంటాడు. (బిగ్గరగా) నీవు నాభార్య ను చూచినావా? ఈయింటావిడెను చూచి వుంటావు.

పెంట—ఆవిడె నీ భార్యా? అటువంటి చక్కని పడుచుచిన్న దాన్ని నీవంటి ముసలివాడికి యిచ్చి పెళ్లి చేసినారా? పాపం! ఆచిన్న దాని దురదృష్టం. నీవు వుండేస్థలం నీవుచెప్పిన మంగళవారపుపేట కానేకాదా?

భీమ—నీవు లక్ష్మివారపుపేట సత్రములో వున్నట్టు కనపడదు.

పెంట—నీపేరు భావరాజుకాదా?

భీమ—భావరాజు భీమరాజు.

పెంట—(తనలో) ఇఖ యితని సంగతి తెలిసిపోయింది. యితను వట్టి పిరికివాడు. భయంచేత రాత్రి పేరు చెప్పకుండా యింటిపేరు మాత్రం చెప్పినాడు. వున్న స్థలంకూడా అబద్ధపుచోటు చెప్పినాడు. అందుచేత నేను ధైర్యంగావుండి మహాశూరుణ్ణి అయినట్టు కనపర్చ వచ్చును. (బిగ్గరగా) అయ్యా! నావిషయంలో మీరు తప్పు అభి ప్రాయం పడుతూ వున్నారు. నేను వ్రాసియిచ్చినట్టు నేను లక్ష్మి వారపుపేట సత్రములోనే వున్నాను. నీవు పిరికివాడవన్న సంగతి రాత్రే కనిపెట్టి నీతోకూడా మనిషిని పంపి యెక్కడవుంటావో కనుక్కుని యిక్కడకు వచ్చినాను. ఇఖ నిన్ను నేను రాత్రిపగలూ మధ్యాహ్నమూ యెప్పుడూ వదలిపెట్టను.

భీమ—అయ్యా! నేను కొత్తగా పెళ్ళిచేసుకున్నాను.

పెంట—నీభార్యయందు నాకుండే గౌరవంచేత ఆసంగతి యేదో విధంగా యిప్పుడే ఫణిపాకారం చేసుకుందాము. (చేయి పట్టుకొని లాగుచు) ఇదగో యీగదిలోకి వెళుదాము రా.

భీమ—అయ్యా! నిర్దోషిని చంపి నరహత్యాపాపం కట్టుకోవడం మీవంటివారికి తగునా?

పెంట—(తనలో) ఇఖ నేను యితణ్ణి మనసువచ్చినట్టు ఆడించ వచ్చును. (బిగ్గరగా) నీకు యెవ్వరైనా స్నేహితుడు లేడా? నీకు బదులుగా అతణ్ణి పంపు.

భీమ—స్నేహితుడా? (తనలో) ఇది బాగా వున్నది. ఇప్పుడు నాప్రాణాలు దక్కినవి. వీరభద్రరాజు యిదివరదాకా మాకుటుంబం నిమిత్తం తన ప్రాణాలు విడుస్తానంటూ వుండేవాడు. దాని నిజం యిప్పుడు తెలుస్తుంది. (బిగ్గరగా) వున్నాడు. అతనికి యిప్పుడే వుత్తరం వ్రాస్తాను. (అని కాగితమును కలమును పుచ్చుకొనుచున్నాడు.)

పెంట—(తనలో) ఇతడు నిజంగానే వ్రాస్తూవున్నాడు. ఇతనికి యిప్పుడు ధైర్యం వచ్చినట్టున్నది. ఇప్పుడే దీనికి తగినప్రతిక్రియ చెయ్య వలెను. (అని ఆలోచించుచున్నాడు.)

భీమ—(తనలో) ఇఖ నాకు భయం లేదు. (అని వ్రాయుచున్నాడు.)

పెంట—(కాగితమును కలమును పుచ్చుకొని యిట్లు వ్రాయుచున్నాడు.) "ఓ స్నేహితుడా! నీవు కామించిన చిన్నదాని తండ్రి నాశతుర్వు. కాబట్టి నీవు నాతరపున వుండడం బాగా వుండదు. అందు చేత నాకు సహాయుణ్ణిగా మరియెవరినైనా వెంటనే సంపాదించవలెను. ఇది మహామహా ముఖ్యమయినకార్యం. నాగౌరవం ముఖ్యంగా కాపాడ వలెను—విధేయుడు. పెం—

తాజాకలం—నీవు నాకు బదులుగా పోట్లాడవలెనన్నసంగతి నీకు బాగా తెలుసును గదా? దిట్టంగా పోట్లాడడానికి చేతనయిన వాణ్ణి సంపాదించవలెను."

భీమ—(ఉత్తరము మడంచి పై పేరువ్రాసి) ఈవుత్తరం తీసుకుని వెళ్ళేవారు యెవరు?

[పాలచెంబు చేతబట్టుకొని యొకగొల్లవాడు ప్రవేశించుచున్నాడు.]

గొల్ల—అయ్యా! మీకు పాలు పంపించినారు.

భీమ—పాలు యిలా తీసుకునిరా. (అని దూరముగా తీసికొని వెళ్ళి గొల్లవానితో రహస్యముగా) ఈవుత్తరం తీసుకునివెళ్ళి వెంటనే వీరభద్రరాజుకు యిచ్చిరా.

గొల్ల—(పుచ్చుకొని) చిత్తము. (అని నడుచుచున్నాడు.)

పెంట — (గొల్లవానితో వీధిగుమ్మముదాక నడిచి నీవు యీవుత్తరం మంగళవారపుపేట సత్రంలో వున్న వీరభద్రరాజుగారికి యివ్వవలెను. ఈపని చేసినందుకు నీకు రెండణాలు యిస్తాను. (అని యుత్తరమును సొమ్మును చేతిలో పెట్టుచున్నాడు.)

గొల్ల—యిప్పుడే యిస్తాను. (అని వెళ్ళుచున్నాడు.)

భీమ—(ముందుకును వెనుకకును నడుచుచు తనలో) ఈవ్యవహారంలో యేదో చిత్రం జరుగుతుంది. (పెంటయ్యతో) ఇప్పటి స్థితిని బట్టి చూస్తే యిఖ మనం యిద్దరమూ వకఁ-యింట్లో వుండడం పొసగదు. ఈమాటల సూచన మీకు తెలిసిందా?

పెంట—నాకు సూచనలూ గీచనలూ తెలియవు. నేను ముందుగా అద్దెయిచ్చివేసినాను. నెలదినములదాకా యిది నాయిల్లు. నేను యిక్కడనుంచి కదలను. ఇక్కడనేవుండి నాకూరలూ నాఅన్నమూ నేను యిక్కడనే తింటాను. (అని విస్తరిముందు పీటమీఁద కూర్చున్నాడు)

భీమ—నీకూరలూ నీఅన్నమూనా? నీచర్యచూస్తే నావొళ్ళు మండుతూ వున్నది. నీవు నాయిల్లు వదలివెళ్ళనంటూ వున్నావుగా? నేనే

యిల్లు విడిచి లేచి పోవలెనుకాబోలును.

[దీపముపట్టుకొని భ్రిమరాంబ ప్రవేశించుచున్నది]

భ్రిమ—ఈగడబిడంతా యేమిటి?

భీమ—నీవు నాకు అడ్డంరావద్దు. నాహంతకున్నీ నిన్నూ వదలి పేసి నేను వెళ్ళిపోతాను. (అని వెలుపలికి వెళ్ళుచున్నాడు.)

పెంట—(వంకాయతో అన్నము తినుచున్నాడు)

భ్రిమ—(దగ్గరకువెళ్ళి) ఏమయ్యా! మీరు నాభర్తగారిని హత్యచేస్తారా? నాకు యీపసుపు, కుంకమూకూడా లేకుండా చేస్తారా? సరస్వతీ! సరస్వతీ! (అని యేడ్చుచున్నది)

పెంట—చేస్తేయేమి? ఈముసలిమొగుడు పోతే నీకు కావలిస్తే యింతకంటె మంచిమొగుడే వస్తాడు.

[సరస్వతి పరుగెత్తుకొని వచ్చుచున్నది]

సర—పిన్ని యేమిటి?

భ్రిమ—నాకుయేమీ తెలియదు. ఇక్కడయేదో ఖూనీ జరగ పోతుంది.

సర—ఖూనీ జరుగుతుందా?

భ్రిమ—నాభర్తగారు నాకంటె ముసలివారయితే అయినారు. నాకు ఆయనయండే యిష్టము. మీరు ఆయనజోలికి వెళ్ళనవలె నంటే ముందుగా నన్ను చంపి మరీఆయనమీదికి వెళ్ళండి.

పెంట—ఆలాగయితే ఆయన బ్రతికిపోయినాడు.

[వీరభద్రరాజు తొందరగా ప్రవేశించుచున్నాడు.]

భ్రిమ—వీరభద్రా! నీకు యిక్కడ జరిగేసంగతంతా తెలిసినట్టయితే—

వీర—నాకంతా తెలుసును. (పెంటయ్యతో రహస్యముగా)

మీరు పంపించినమనిషి నాకు దోవలో కనపడ్డాడు.

పెంట—నావుత్తరం చదువుకొన్నారా?

భీమ—నేను వుండగా నాభర్తగారికి యేమీ అపాయం రానియ్యను. ఆయన పోట్లాడవలసివుంటే ఆయనకు బదులుగా నేను పోట్లాడుతాను.

పెంట—నిన్ను ప్రతినిధినిగా నేను వప్పుకోను. నేను తుపాకుల కయినా కత్తులకయినా వోపగలనుగాని ఆడవాళ్లగోళ్లతో వోపలేను.

భీమ—నేను యిప్పుడు వెళ్ళి యీచుట్టుపట్లవాళ్లనందరిని పిలుచుకునివస్తాను.

వీర—అమ్మా! నీవు యేమీ తొందరపడక యీవ్యవహారమంతా నాకు వదలిపెట్టు. ఇందులో నీభర్తగారికి అపాయంరాదు. నామాట నమ్ము.

భీమ—వీరభద్రా! నేను అంతకూ నిన్నే నమ్మినాను. వెధవ రికంమాట తలచుకుంటే నావళ్ళు వణుకుతూ వున్నది. (అని వెళ్ళుచున్నది)

సర—ఓయీ! మా కుటుంబముయొక్క గౌరవమంతా నీ చేతులో వున్నది. మానాన్నగారికి యేమీ అపాయం రానీయకు. (అని వెళ్ళుచున్నాడు.)

పెంట—నీవు మంచిసమయానికి వుట్టిపడ్డావు. నాచీటి నీకు అందిందా?

వీర—మీమనిషి నాకు దోవలో కనపడ్డాడు. భీమరాజుగారు కూడా అతనిచేతికే వుత్తరం యిచ్చి పంపినారు. ఆయన నన్ను తనకు సహాయుణ్ణిగా వుండవలెనని కోరినారు.

పెంట—ఆలాగైతే మరీమంచిది, యీవ్యవహారం సులభంగా

పరిష్కారమవుతుంది.

వీర—అవుతుంది. సరస్వతియందు నాకు యెంతప్రేమవున్నా నీయందుకూడా నాకు విశేషగౌరవం కలిగింది. ఆగౌరవం కనపర్చడానికిఇప్పుడు సమయం వచ్చింది.

పెంట—ఇది నీయోగ్యతకు తగివున్నది.

వీర—మీకు సహాయుణ్ణి సంపాదించినాను.

పెంట—సంతోషంగా వున్నది.

వీర—అతను మహాపౌరుషశాలి. భీమరాజుగారు క్షమార్పణ కోరి మీరు యిద్దరూ సమాధానపడుతామన్నా పడనిచ్చేవాడుకాడు. మీరు ఓడిపోయినా మీస్థానమందు నిలిచి పగ తీర్చుకుంటాడు.

పెంట—నావుత్తరంలో తాజాకలం నీవు చదువలేదాయేమిటి?

వీర—భీమరాజుగారు బహుకోపధారులు. మీరు భయపడకూడదు. మీరు ధైర్యంగా నిలువవలెను. యుద్ధంలో మీ ఆయుధము లేమిటి?

పెంట—నాతాజాకలం నీస్నేహితుడికి చూపించవలెను.

వీర—తెలిసింది. ఆయుధాలు తుపాకీలు. ఒకరికొకరికి పదిహేనుబారలదూరము.

పెంట—అవంతా నాకేమీ తెలియదు మీలోమీరే చూచుకోవలెను.

వీర—ఇప్పుడీఅపాయం తప్పించుకోవడానికి వున్నసాధనమంతా మీధైర్యంలో వున్నది. ఆయనయెదుట మీరు భయంకరంగా కనపడవలెను.

పెంట—ఆయనయెదుట యిదివరకే వుండవలసినదానికంటె యెక్కువ భీకరంగా కనపడ్డాను.

వీర—ఈవ్యవహారమంతా నాకు విడిచిపెట్టండి.

పెంట—విడిచిపెట్టినాను. నా జరూరు లేకపోతే నీ వన్నట్లు తుపాకులే ఆయుధాలు. దూరమూ పదిహేనుబారలే. నావుత్తరంలో వున్న తాజాకలం మీరతనికి వినిపించి వుండవలసినది. (అని లోపలికి వెళ్ళుచున్నాడు)

వీర—ఇప్పటికి వకరిని దారికితెచ్చినాను. ఇఖ రెండోవారిని కూడా స్వాధీనం చేసుకోవలెను.

భీమ—(తలుపులోనుండి తల లోపలికిపెట్టి) వీరభద్రా!

వీర—భీమరాజుగారా?

భీమ—నీకోసమే నేను ఇక్కడ కాసుకుని వున్నాను. నాకేసి చూడకుండానే నీవు తుపాకిన లోపలదూరినావు. అతణ్ణిచూచినావా?

వీర—అత నాగదిలోనే వున్నాడు. మెల్లగా మాట్లాడండి. మీరు మహావీరుడితో యుద్ధము చేయవలెను. అతను దయాదాక్షిణ్యములు లేనివాడు.

భీమ—ఆక్రూరుణ్ణి మొగటినుంచీ నేను ఆలాగే అనుకున్నాను. వాడు కూ్రరరాక్షసుడు.

వీర—మీరు ధైర్యంగా వుండవలెను. అటువంటి వాడియెదుట మీరధైర్యము యెంతమాత్రమూ కనపరచకూడదు. యెంతసాహసం గలవాడుకూడా ధైర్యంగలవాడికి వెనుకతీస్తాడు. మీకు యిందులో యేదయినా ప్రాణాపాయమే వచ్చేటట్టయితే మీకుటుంబాన్ని నేను సంరక్షణచేస్తాను. భయపడకండి. మీవుత్తరంచూస్తే నాకు చోలాజాలి వేసింది. మీరే వోడిపోవడం తటస్థమయితే మిమ్మలిని నేను యెప్పుడూ తలచుకుంటూ వుంటాను.

భీమ—నావుత్తరం సీవు తిన్నగా చదవలేదు.

వీర—చదివినాను. ఈసంగతి వెల్లడయ్యేట్టయితే లోకానికి మీకు పిరికివాడనేట్టు కనపడనిచ్చి మిగాగౌరవానికి భంగంకలిగేట్టు చేస్తాననుకున్నారా యేమిటి?

భీమ—అందులో నా పిరికితనంయేమిటి? నాతకపున నిన్ను పోట్లాడమని కోరలేదా?

వీర—దానికీ అంతేఅర్థము.

భీమ—అందులో యేమీలేదు. వకరిపక్షంగా వకరు యుద్ధం చెయ్యడం సర్వసాధారణంగా జరుగుతూనేవుంటుంది. అందులో పౌరుషహీని యేమీవుండదు.

వీర—వుండకపోవచ్చును. యీ వ్యవహారం మీలో మీరే చక్కపెట్టుకోవలెను. ఇందులో మీకు యేమీ అపాయం లేకుండానే నేనొకవుపాయం ఆలోచించినాను.

భీమ—అదియేమిటోచెప్పు. అది బాగావున్నట్టయితే నేను కూడా ధైర్యంలో ఆతనికి తీసిపోయేవాణ్ణి కానట్టు కనపరుస్తాను. నేను ఆలోచించినవుపాయం మహాసూక్ష్మమయింది.

భీమ—ఆలాగయితే వేగిరంచెప్పు.

వీర—మీయిద్దరికీకూడా నేనే సహాయుణ్ణిగా వుండి మీయిద్దరి తుపాకీలలోకూడా నేనే మందు కూరుతాను.

భీమ—మందు కూరుతావా?

వీర—వట్టి మందు కూరుతాను. గుండ్లు వెయ్యను.

భీమ—నేను ఆలాగే అనుకున్నాను.

వీర—మీరు యిప్పుడే యీగదిలోనే పోట్లాడవలెను.

భీమ—నీవు కూడా దగ్గిర వుండవలెను. నాకు తుపాకి చూస్తే భయంపుట్టి వేస్తుంది.

వీర—మీరు చూడ నక్కర లేదు. అప్పుడు నే నీగదిలో దీపాలు తీసివేస్తాను.

భీమ—అలాగయితే చీకటిలో కుమ్మ్రిలాటా?

వీర—అతను ఆగదిలో వున్నాడు. నేను వెళ్ళి ముందరి దేవ్ర్పాటులన్నీ చేస్తాను. (అని వెళ్ళుచున్నాడు.)

భీమ—నాగుండెలు కొట్టుకుంటూ వున్నవి. అయినా కానీ నాకు యేమీ అపాయం రాదని నిశ్చయంగా తెలుసును కనుక నేను మాటలలో కావలసినంత శూరత్వం కనపరుస్తాను. అగ్నిహోత్రంలో నిదుర పోకడానికి వస్తూ వున్నది.

[పెంటయ్యతో వీరభద్రరాజు ప్రవేశించుచున్నాడు]

పెంట—(రహస్యముగా) నాకేమీ అపాయం రాదని మీరు దృఢంగా చెప్పగలరా?

వీర—కాపలసినంత దృఢంగా చెప్పగలను.

భీమ—(పెంటయ్య మొగమువంక చూచుచు తనలో) వీడి మొఖం దెయ్యపు మొఖంలాగు వూరుకున్నది.

వీర—నాయనలారా! ఇది మహా గొప్పకార్యంగాని సాధారణమయింది కాదు. ధైర్యశాలులలో నెల్లా ధైర్యశాలులైన మహా శూరులిద్దరున్ను నాయెదుట నిలుచున్నారు. నాకు బహు సంతోషంగా వున్నది. (పెంటయ్యను చూపుచు భీమరాజుతో) అయ్యా! ఈయన నిన్నరాత్రి నాటకపుపాకలో మీతలగుడ్డమీద కూర్చుని మీకవమానము కలుగచేసినాడు కాబట్టి మీరాయుద్ధం కాచుకోవడానికి సిద్ధంగా వున్నాడు.

పెంట—అవును సిద్ధంగా వున్నాను.

భీమ—నీవు నన్ను అవమానపరచడం నన్ను వక్కణ్ణే అవ

మానపరచడం కాదు. పెద్దమనుష్యుల కందరికీ అవమానం కలుగజేసి నావు. అందుచేత నీమీద అందరూ పగతీర్చుకోవలెను.

పెంట—నేను పగతీర్చుకుంటాను.

వీర—అంతా సిద్ధమయిందా?

భీమ—(భయముతో) అంతా.

పెంట—(గద్గదస్వరముతో) అంతా.

వీర—(ఇద్దరిమీద చెరొకయొక చేయియువైచి) లోకంలో పౌరుష శాలులంటే మీరిద్దరే పౌరుషశాలులు.

పెంట—(ధైర్యము తెచ్చుకొని) తుపాకులా?

భీమ—తుపాకీలే.

పెంట—బారుచేసినవేనా?

భీమ—బారుచేసినవే.

పెంట—మందువేసేనా ?

భీమ—మందువేసే.

పెంట—ఇంకా—

భీమ—అన్నిని—

పెంట—దీపాలు లేకుండానేనా ?

భీమ—దీపాలులేకుండానే.

పెంట—నేను సిద్ధంగా వున్నాను.

భీమ—నే నంతకు మునుపే వున్నాను.

వీర—(రెండు తుపాకులు చూపి) ఇవిగో మీఆయుధాలు.

ఇద్దఱు—(ఊలికిపడి కొంతసే పనుమానించి, తుదకు చెరొకయొక తుపాకియు పుచ్చుకొనుచున్నారు.)

భీమ—వీరభద్రా! నీచెయ్యి నాభుజమీద పెట్టి నాగుం

డెలు కొట్టుకుంటూ వున్న వేమోచూడు.

వీర---(ఇద్దరి ఔొమ్మలమీాదను చేయివేసి) లోపల అసలే గుండెలు లేనట్లు మహానెమ్మదిగా వున్నది. మీాకు యిద్దరూ గుండెలు తీసిన బంట్లు. నేను మూామమూాట్లు చప్పట్లు చరుస్తాను. మూాడ్ోమాటు చరవగానే కాల్చండి. నేను యిప్పుడు దీపాలు తీసుకు వెళుతాను.

పెంట---కాలుస్తాము.

భీమ---కాలుస్తాము.

వీర --- ఇప్పుడు మీాయిద్దరి కోరికప్రకారమూా తలుపులు వేస్తాను. (అని వేయుచున్నాడు.)

భీమ---నాకోరికప్రకారము. (తనలో) ఇందులో యేదోకొంచె తనం వున్నది. నాజాగ్రతమీాద నేనువుంటాను.

పెంట---(తనలో) అతను చీకటి కావలెనంటూ వున్నాడు. అతని కేదో లోపల దురుద్దేశం వున్నది.

వీర---(దీపములు చేతితో పట్టుకొని) ఇిక మీారు చెప్పవల సిాది యేమీా లేదుగదా?

పెంట---లేదు.

భీమ---లేదు?

వీర---ఇిక నేను వెళుతాను. (అని వెళ్ళబోవుచున్నాడు.)

భీమ---(మరల పిలిచి తుపాకిచూాపి వీరభద్రరాజుతో రహస్యముగా) అందులో యేమీా భయం లేదుగదా?

వీర---భయం లేదు.

పెంట---(వీరభద్రరాజుతో రహస్యముగా) అపాయకరంకాదు గదా?

వీర---కాదు (అని వెళ్లుచున్నాడు.)

భీమ—(కొంచెము తాళి) నేను చీకటిలో వుండలేను. నాకు చిన్నప్పుడుసమేతూ చీకటంటే భయం. అనేక క్రూరమైన నేరాలు చీకటిలోనే చెయ్యబడుతవి. అదుగో! అతను కదులుతూవున్నట్టునాన్నాడు.

పెంట—(కిటికీవద్దకుఁబోయి) ఈచీకటిలో పెట్టి నన్ను మోసం చెయ్యవలెనంటే నేను తప్పించుకోలేనా? (కిటికీతలుపుదీసి) అతను దగ్గిరకువచ్చినాడంటే, ఒక్కమూకుమూకి కిటికీలోనుంచి అవతలపడి క్షణంలో ప్రాణాలు దక్కించుకుంటాను. నాకు ఫర్వాలేదు.

భీమ—(ఆలకించి) అతను కిటికీతలుపు తీసినాడు. అతనికి తప్పకుండా ఖూనీచెయ్యడపు వుద్దేశం వున్నది. ఖూనీచేసి ఆకిటికీలోనుంచి పారిపోవడానికి చూస్తూవున్నాడు. (కిటికీతలుపు తీసి) అతను దగ్గిరకు వచ్చినాడంటే నేను యీకిటికీలోనుంచి దూకి యిరుగుపొరుగువారి నందరినీ కేకలువేస్తాను.

వీర—(వెలుపలినుండి రెండుసారులు చేతులు చరుచుచున్నాడు)

పెంట & భీమ—(ఇద్దరును భయముచేత వడకుచు, ఎవ్వరయిన సమీపమునకు వచ్చినపక్షమున వెలుపలికి దుమికవలెనని చెరియొక కిటికీలోను కూరుచున్నారు.)

వీర—(మూడవసారి చప్పటలు చటిచి లోపలికి వెళ్లి యొక తుపాకీ ఆకాశమున పేల్చుచున్నాఁడు.)

పెంట—అతను మొట్టమొదట తుపాకీకాల్చినాడు.

భీమ—మొదట అతనే తుపాకీ కాల్చినాడు.

(ఇద్దరును చెరియొక కిటికీలోనుండియు వెలుపలికి దుముకుచున్నారు)

[భీమరాంబయు సరస్వతియు చప్పుడు విని పరుగెత్తుకొని వచ్చుచున్నారు.
దీపములుపట్టుకొని వీరభద్రరాజు మరల ప్రవేశించుచున్నాఁడు]

భీమ—ఖూనీ. ఖూనీ.

సర—పోలీసువారు. పోలీసువారు.

వీర—భ్రమరాంబా! సరస్వతీ ! వూరుకోండి. యెవరికీ యేహానీ జరగలేదు.

భీమ—నా భర్తగా రెక్కడ వున్నారు ? పాణేశ్వరా ! యెక్కడ వున్నావు?

భీమ—(కిటికీలోనుండి తొంగి చూచుచు) ఇదిగో ఇక్కడ వున్నాను.

భ్రమ—(అంతట చూచుచు) ఇక్కడ యెక్కడ?

భీమ—తోటకూరమడిలో.

వీర—పెంటయ్యగారు యెక్కడ వున్నారు?

పెంట—(రెండవకిటికీలో నుండి తలదూర్చి) నేను యిక్కడ వున్నాను.

సర—(అంతటను జూచి) యెక్కడ?

పెంట—ఇక్కడ చేమంతిమడిలో.

భీమ—మీరుయిద్దరూ అక్కడ యేమిచేస్తూ వున్నారు?

భీమ—యుద్ధము.

పెంట—ఘోరయుద్ధము.

వీర—మీయుద్ధము తోటకూరమడిలోనూ చేమంతిమడిలోనూనా? లోపలికి రండి.

[భీమరాజును పెంటయ్యయు లోపలికి వచ్చుచున్నారు]

భీమ—మీరు రావడంచప్పుడు మేము విన్నాము.

పెంట—మేము మీరు పోలీసువారనుకున్నాము.

భీమ—అగదుచేతనే మేము అగతలికి దూకినాము.

పెంట—అంతేకాకుండా— అంతేకాకుండా—

వీర—యేమయితే యేమిలెండి. మీరిద్దరూ మీగొర వాలు నిలుపుకున్నారు. మీరు యిద్దరూ నేడు రణశూరు లనిపించు కున్నారు.

భీమ—(పెంటయ్యతో) అయ్యా! మీవల్ల గౌరవం కలిగితే నాకు బహుసంతోషంగా వుంటుంది.

పెంట—అది మీకు యిదివర కే కలిగినది.

భీమ—మీమీద నేను తుపాకీకాల్చను.

పెంట—అనగా రెండోమాటా?

భీమ—రెండో మాటేమిటి? యిప్పుడు తుపాకీ కాల్చిన వారు మీరు.

పెంట—మీరు.

భీమ—కాదు. మీరే.

పెంట—గుండు నాచెవివద్దనుంచి రయ్యిమని పోయింది.

భీమ—మీగుండు నాతలవెండ్రుకలను దూసుకుని పోయింది.

వీర—అయ్యలారా! వ్యవహారం పరిష్కారమయింది గనుక యిక మన కావిషయమయి వాదం అక్కరలేదు.

పెంట—అది బాగా వున్నది. భీమరాజుగారూ! మీచెయ్యి యిలాగు యివ్వండి.

భీమ—సంతోషంతో యిస్తాను. అయ్యా! మరిచిపోయినాను. మీపేరేమిటి?

వీర—పెం—

పెంట—చెప్పకు చెప్పకు. (అని వీరభద్రరాజునోరు మూయు చున్నాడు.)

[ఒక సేవకుడు ప్రవేశించుచున్నాడు]

సేవ—అయ్యా! వీరభద్రరాజుగారికి వుత్తరం తెచ్చినాను.

వీర—నాకా? (అని పుచ్చుకొని విప్పి చూచి లోపల నున్న యొకయుత్తరము పెంటయ్య కిచ్చుచున్నాడు.)

పెంట—ఈపుత్తరం యెవరు వ్రాసింది?

వీర—మీకు మీపెత్తల్లి వ్రాసింది.

పెంట—చివరకు జవాబు వచ్చింది. నాచేతులు వణకుతూ వున్నవి. (అని విప్పి చదువుచున్నాడు.)—"ఓపిరియ పుత్రిడా! నీ వంతిదీనత్వముతో చేసిన ప్రార్థనను నేను నిరాకరించలేదు. మీ పెత్తండ్రిగారు యిచ్చినఆస్తి నాకు అవశ్యంలేదు గనుక, అది నీవే స్వేచ్ఛగా అనుభవించు. ఇక నీయిష్టం వచ్చినట్లుగా నీపేరు మార్చుకో వచ్చును. ఇట్లు నీపెత్తల్లి శ్యామలాంబ."—నాకు బహు సంతోషంగా వున్నది. నేడు మహా సుదినం. (అని గంతులు వేయుచు) భీమ రాజుగారూ! భ్రీమరాంబగారూ! నేటికి నేను చరితార్థుణ్ణి అయినాను. నామీద దయవుంచండి. మిత్రుడా! ఇక యీయిల్లు నీకు విడిచిపెట్టి తక్షణం వెళ్ళిపోతాను.

వీర—వెళ్ళిపోతారుగాని ముందు మీపేరేమిటి?

పెంట—నేను యిదివరకు యేమీ ఆలోచించుకోలేదు. ఇప్పుడు మన అందరి బుద్ధీ వుపయోగించి ఆలోచింతాము. ముందుగా నన్నా లోచించనియ్యండి.

భీమ—రామయ్య.

భీమ—సోమయ్య.

వీర—భీమయ్య.

వీర—కోమయ్య.

పెంట—యివన్నీ సర్వసాధారణమయిన పేర్లు. వీటిలో వకటీ పనికిరాదు. ఎందులోనూ తొందరపడకూడదు. రేపురాత్రి మళ్ళీ మన

మంతా యిక్కడచేరి సావకాశంగా ఆలోచింతాము. అయినా కానీ నేను యిప్పుడే వెళ్ళిపోతూ వున్నాను. గనుక వెనుకనుంచి నాపేరు మీకు టపాద్వారా తెలియచేస్తాను. మిమ్మలి నంగరినీ వదిలిపెట్టి వెళ్ళనలసి నచ్చినందుకు నాకు చాలా విచారంగా వున్నది.

(అని వెళ్ళబోవుచున్నాడు.)

భీమ—మాలోపలి యిల్లుకూడా చూచి వెళుదురు గాని వక్క—సారి లోపలికి రండి.

(అందఱును వెళ్ళుచున్నారు.)

కలిపురుష శనైశ్చర విలాసము.

ప్రథమరంగము—భూలోకము.

[కలిపురుషుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

కలి—నేను కృతార్థుణ్ణి అయినాను. ఇప్పుడు భూలోకంలో నారాజ్యం స్థిరంగా స్థాపించినాను. ధర్మదేవతయొక్క మూడుకాళ్ళు విరుగకొట్టినాను. ధర్మదేవత నొంటికాలుతో కుంటుకుంటూ చావకుండా బ్రతకకుండా వున్నది. ఇంచుమించుగా జను లందరూ నాకు భక్తులయినారు. దేవుణ్ణి ఆరాధించడం మానివేసి నేను యేర్పరచిన బొమ్మలపూజ చేస్తూ ప్రజలు మోసము లవుతూ వున్నారు; సత్యం వదలిపెట్టి అనృతవాదు లవుతూ వున్నారు. ఇంట తిని యింటివాసాలు లెక్క పెట్టినట్టుగా కృతఘ్ను లవుతూ వున్నారు. అయినా కానీ యింకా కొందఱు ధర్మాన్నీ సత్యాన్నీ జ్ఞానాన్నీ వదిలిపెట్టలేక పీకులాడుతూ వున్నారు. అపరిమితంగా వున్న నాదాసుల సహాయంచేత వాళ్ళనుకూడా రూపుమాపివేస్తే నామనోరథం పూర్ణంగా సఫల మవుతుంది. అయినా కానీ వాళ్ళకు యింకా కొంతకాలం గ్రహచారం బాగా వున్నట్టున్నది. భూమిమీదవున్న నాకు సహాయంగా ఆకాశం మీదవున్నశనికూడా కలిస్తే నేను అందరినీ వక్రనిముషములో స్వాధీనం చేసుకుంటాను. అందుకోసం ముందుగా శనిని ధ్యానిస్తాను.—

శ్లో. చాపాసనో గృధ్రరథ స్సునీలః పశ్చాన్ముఖః కాశ్యపతిః ప్రతీచ్యాం
సశూలచాపేషు వరప్రదశ్చ సౌరాష్ట్రదేశే ప్రభవశ్చ సౌరీ
నీలద్యుతి ర్నీలవపుః కిరీటీ గృధ్రస్థిత శ్చాపకరోధనుష్మాన్
చతుర్భుజసూర్యసుతఃప్రసాంతస్సచాస్తుమహ్యంవరమందగామీ.

[అంతట శనైశ్చరుడు ప్రత్యక్షమగుచున్నాడు.]

శని—ఓరీ! కలీ! నీభక్తికి మెచ్చినాము. నీకు వరప్రదానము చేసి కార్యసిద్ధి సమకూర్చడానికి మేముకూడా యీభూలోకంలో నివాసం చేస్తాము.

కలి—స్వామీ! మీఅనుగ్రహంవల్ల నేనుధన్యుణ్ణి అయినాను.

శని—ఓరీ! నీకు మావల్ల యేమి కావలెను? నీవు బహు సమర్థుడవు. నీసామర్థ్యానికి సంతోషించి నీవు మమ్ము వేడుకోక పూర్వాల కూడా నీకు మేము సహాయం చేస్తూనే వున్నాము. నల మహారా జంతటివాణ్ణి సమస్త బాధలూ పెట్టి, భార్యతో వియోగం కూడా కలుగచేసిన నీకు సామాన్యులయిన యీలోకంవాళ్లు యెంత? గుడి మింగేవాడికి గుళ్ళో దేవుడు వట్టివడియుంకదా?

కలి—స్వామీ! ఇదంతా తమప్రసాదంవల్ల జరిగిందేకాని నాసామర్థ్యంవల్లకాదు. దేవుడంటే జ్ఞాపకం వచ్చింది. నేను జనులను దేవుణ్ణి యెంతకొలవకుండాచేసినా మానక కొంతమంది మానసికంగా దేవుణ్ణి వుపాసనచేస్తూ సత్యశౌచాదులు మంచివని బోధిస్తూ కొంతమందిని తమమార్గంలోకి దింపుతూ వున్నారు. ఇది చెడగొట్టడా నికి యేమివుపాయం?

శని—వక్కటే వుపాయం యేమిటి? లక్ష వుపాయా లున్నవి. సత్యానికి వక్కటేమార్గంకాని అబద్ధానికి అన్నిమార్గాలే. నిజం చెప్ప వలెనంటే పంకాయను పంకాయ అని వక్కటే చెప్పవలెనుగాని అసత్యాలాడవలెనంటే బీరకాయ బెండకాయ అని లోకంలో పేర్లన్నిన లక్ష చెప్పవిచ్చును. మొట్టమొదట మంచివాళ్ళనందరినీ చెడ్డవా ళ్ళని లక్షవిధాల అపవాదాలు వేతాము. వాళ్ళు చేసే మంచిప్రయ త్నాల కన్నింటికీ దురుద్దేశాలు కల్పించి ప్రకటింతాము. మాయో

పాయాలచేత వాళ్ళమంచిపేరు చెడగొట్టి అపకీర్తివచ్చేటట్లు చేతాము. లోకంలో మనకంటెమంచివాళ్ళు లేరనీ, మనమొక్కళ్ళమే కష్టపడి లోకోపకారం చేస్తూవున్నామనీ అబద్ధాలాడి నమ్మింతాము. మనదాసులనందరిని యీపనికి ప్రేరేపింతాము. మన ప్రయత్నంముందర యీలోకంలో దేవుడిప్రయత్నం యేమీ సాగదు.

కలి—అదంతా బాగానేవున్నది కాని దేవుడిమీది విశ్వాసం పోగొట్టడం యేలాగు?

శని—దానికి రెండు మంచి మార్గాలున్నవి. అసలు దేవుడే లేడని బోధించి నమ్మించడం వకటి. ఆత్మ లేదని బోధించి నమ్మించడం యింకొకటి. యీ రెండువిధాలచేతనూ జనులను నాస్తికులను చేస్తే మన అభీష్టం పూర్ణంగా సఫల మవుతుంది అప్పుడు మనమే దేవుళ్ళం కావచ్చును.

కలి—ఈయుగంలో మనమే దేవుళ్ళము. జనులు మనదాసులయి మనమాట నమ్మినట్టు దేవునిమాట నమ్మరు. మనకు అంతరాత్మలు నిజంగానేలేవు. కాబట్టి యెవరికీ అంతరాత్మలు లేనేలేవని బోధింతాము.

శని—ఆలాగే బోధింతాము. మనంకూడా జనులలో చేరితేనే తప్ప మనకోరిక సఫలం కాదుగనుక మనం మనుష్యవేషాలు వేసుకుని వాళ్ళల్లో చేరుదాము. మన భక్తులసంఖ్య విస్తారముగాయున్నది గనుక వాళ్ళల్లో నాయకులను తీసుకుని రేపురాత్రి నీవు మాయింటికి రా. చెయ్యవలసినపను లన్నీ అప్పుడు రహస్యంగా ఆలోచింతాము.

కలి—చిత్తము. (ఇద్దరూ వెళ్ళుచున్నారు.)

ద్వితీయరంగము—శనైశ్చరుని గృహము.

[శనైశ్చరుఁడును, మద్యపిశాచియుఁడును, దాంభికుఁడును ప్రవేశించుచున్నారు]

శని—భక్తాగ్రేసరులలో నాయకులను తీసుకుని మాయింటికి యీరాత్రిరావలసిందని నిన్ననే కలిగాడితో చెప్పినా, వాడు యింకా వచ్చినాడుకాడు. దేవలోకం విడిచి భూలోకానికి రావడంచేత నాకు యేమీ తోచకుండావున్నది. ఈపాడులోకంలో వేడుకగా ప్రొద్దుపుచ్చడానికి అప్సరస్త్రీలైన లేరు.

మద్య—యీలోకంలో అప్సరస్త్రీలు లేకపోయినా ఆలోపం లేకుండా పూరూరా కావలసినంతమంది అప్సరస్త్రీలను మించే వేశ్యాస్త్రీలున్నారు. వాళ్ళు లేకుండా యీలోకంలో దేవతలకు యెవరికీ పుత్సవాలైనా జరగవు. తమరూ దేవతలలోవారే గనుక యేలినవారు యీరాత్రి రంభనుమించే వక భోగస్త్రీతో వినోదంగా కాలం గడపవచ్చును. అటువంటిదాన్ని వకదాన్ని నేను యిదివరకే ప్రభువు వారిదర్శనానికి రావడానికి యేర్పాటు చేసినాను. అది యీపాటికి యిల్లు బయలుదేరి వుంటుంది.

శని—నీవు భక్తాగ్రేసరుడవు. నీభక్తికి మెచ్చినాము.

దాంభి—(తనలో) రంభనుమించే వేశ్యాస్త్రీ అంటూవున్నాను. అది నా ప్రియురాలై వుంటుంది. అదేకాకపోతే యీవూళ్ళోవున్న వేశ్యాకాంతలలో రంభను మించేది మరియెవతె వుంటుంది. అందుచేత నేను యీకార్యానికి విఘ్నాలు పెడుతాను. దేవతలకు దివ్యజ్ఞానం వుంటుందిగనుక నామనస్సులో ఆలోచన యీయనకు తెలిసి నన్ను శపిస్తాడేమో! అయినా జడియవలసినపని లేదు. దేవతలు భక్తులు యేమి తప్పితంచేసినా క్షమిస్తారు. (బిగ్గరగా) స్వామీ! నేను శ్రోత్రియుణ్ణి గనుక వకవిన్నపం చేసుకుంటాను. వేశ్యాసంభోగంవల్ల

తమకు వ్యభిచారదోషం వస్తుందేమోనని దాసుడు భయపడుతూ వున్నాడు.

శని—ఆభయంతో పని లేదు. దేవతలకు వ్యభిచారదోషంలేదు. దేవతలకు స్వభార్యలు వుండరు గనుక పరస్త్రీసాంగత్యమువల్ల వారికి దోషం లేదు.

దాంభి—దాసుడిది యింకొక్క మనవి వున్నది. దేవవేశ్యల వద్ద వుంటవో లేవోగాని మావేశ్యలవద్ద బూచులుంటవి. వాళ్లతో సుఖానికి పోతే "అర్థగడియ భోగమూ ఆరునెలలు రోగమూ" అన్నట్టు సుఖజాడ్యాలు పట్టుకుంటవి. జాగ్రత.

శని—మాకాభయంలేదు. దేవతల మైనమావి శిలాకఠినదే హాలుగనుక మాశరీరాలకు రోగాలు సోకవు. అమృతపానంచేత మాకన్నీ నివారణమవుతవి. అమృతపానంచేత చావు లేనపుడు రోగాలు యెక్కడనుంచి వస్తవి?

దాంభి—మీరు యివన్నీ వదల్చుకున్నా మాతృభూతాలను వదుల్చుకోలేరు. "పిటులపాలిటి యమదూత వేశ్యామాత" అని మాలో కవులుకూడా వర్ణించివున్నారు. దేవతలుగనుక మీకీవిషయం లో అనుభవంలేదు. మాలో పూర్వం వక పరమభాగవతాగ్రేసరుడు తన్ను మాతృభూతం పట్టుకొనేటప్పటికి యేమహామంత్రంచేతనూ వదల్చుకోలేక దేవలోకంలో లేకుండా యీలోకంలో వాళ్లను సృష్టించి నందుకు బ్రహ్మదేవుణ్ణి యీవిధంగా తిట్టినాడు—

గీ. తనకునేమిత్రివ్వి తలకెత్తిరమను। లీయుర్వీమనుజులేనియెసఁగరైరి?
నింగి వారసతుల నిర్మాతృకలఁజేసి। పుడమి మాతృభూతములసృజించె.

శని—దేవతల మగుటచేత మమ్మా భూతాలు సోకవు. మేము అమృతపానంచెయ్యడంచేత నీవు చెప్పిన మాతృభూతాలు వెయ్యిపట్టు

కుస్సా మనుష్య చంపలేవు. మద్యప్రియా! నీ వేమంటావు?

మద్య—దేవరవారు చెప్పింది సత్యం. వెనుకచేసిన అమృత పానానికితోడు యిప్పుడు అధరామృతపానంకూడా దొరుకుతుందిగనుక యిఖ బొత్తిగానే భయంలేదు. ఈరెండుపానాలూ చాలకపోతే సురా పానముకూడా చెయ్యవచ్చును. అది కడుపులో పడితే స్వర్గసుఖమంతా భూలోకంలోనే కలుగుతుంది. దానితల్లికడుపు చల్లగా కల్లమ్మవారు వెయ్యేళ్ళు వర్ధిల్లవలెను. కల్లుముతకు నేను వెయ్యినమస్కారాలు చేస్తాను. (దాంభికునితో నేకాంతముగా) ఒరే! నోటికాడికల్లు పడ గొడితే పాపం వస్తుందిసుమా. అడ్డు చెప్పబోకు.

దాంభి—(తనలో) ఈశనిగాడిచేత సురాపానం చేయిస్తే ఆ మయికంలో వేశ్యమాట మరిచిపోతే యిప్పటికి నాశని వదలుతుంది. నేను ప్రోత్సాహం చేస్తాను. (బిగ్గరగా) సుర దివ్యమైనది. భూలోకంలో వున్న దివ్యమయిన వస్తువల్లా కల్లే. అందుచేతనే మాపెద్దలు దానికి దివ్యులతో సమానంగా "సుర" అని పేరుపెట్టినారు.

శని—దానియం గంత సుగుణ మున్నదా? మనుష్యులు యజ్ఞా లలో దేవతలకు సమర్పించే సోమరసం నేను పానంచేసినాను. అది అమృతంకంటెనూ బాగావుంటుంది. అంతరుచిగా వుంటుందా?

దాంభి—వెధవరసం సోమరసం యేమిటి? మధురసం తాగితే మీరు మళ్ళీ వదిలిపెట్టరు. మీరు పెళ్ళిటప్పుడు ముంతెడుకల్లు తీసుకుని వెళ్ళి కాస్తకాస్త దేవతలకు చవిచూపిస్తే రేపటినుంచి దేవతలంతా కల్లంగళ్ళకాడనే వుంటారు. సోమరసమే మెచ్చుకునేవారు మధురసం రుచిమరిగితే మళ్ళీ వదలిపెట్టుతారా? నేను వెనుక యజ్ఞం చేసినప్పుడు సోమిదేవితో కలిసి సోమరసం కొంచెంపానంచేసి చప్పగా యేడిసినట్లే వుండేటప్పటికి తుపుక్కున అధ్వర్యుడిమొఖంమీద వుమ్మేసినాను. తరు

వాత శాక్తేయంలో ప్రవేశించి కల్లు వక్క-సారి చవిచూచినతరువాత అప్పటినుంచీ మళ్ళీవదలడం లేదు. దానిమహిమ మహాదొడ్డది. మీరు సేవించవలెను.

శని--ఆలాగయితే దేవతానివేదనకు తీసుకురండి.

మద్య--అయ్యా! ఫేనుకృతార్థుణ్ణి అయినాను. నేను తాగగా మిగిలింది కల్లుమంతలో సగం వున్నది. అది దేవతానివేదన చేసుకుంటాను. అది యెంగిలిదని దేవరవారు సందేహపడవలసినపని లేదు. మూడువిధాలపానాలలో దేనికీ వుచ్ఛిష్టంలేదు. కావలిస్తే దానికి పరిమాణపద్యం చదువుతాను.

క. పొగచుట్టకు సతిమోవికి
నగణితముగ మద్యమునకు నమృతంబునకున్
దగ నుచ్ఛిష్టము లేదని
ఖగవాహనుతోడఁ గాలకంఠుఁడు పలికెన్.

(అని కల్లుమంత చేతికిచ్చుచు) ఓసురాదేవీ! అమ్మవారూ! తల్లీ! నీవీ దేవుడిహృదయంలో చొచ్చి నీమహిమ చూపించి భక్తుడికి వరాలు యిచ్చేటట్టు చెయ్యవలెను. నీకు ప్రొక్కుతాను. నేను కోరేవరమల్లా నన్ను యీదేవుడు కల్లుసముద్రంకాడ పడవెయ్యవలెను. నేను యెన్ని దేశాలు తిరిగినా పురాణాలలోనేకాని కల్లుసముద్రం యెక్కడా కనపడకుండా వున్నది. నాకు కల్లుసముద్రం యెవడుచూపితే నాపాలిటి కతడే దేవుడు.

శని--(పుచ్చుకొని కల్లుత్రాగి) రుచి దివ్యంగా వున్నది.

మద్య--కొంచెంసేపు తాళితే తలకెక్కి మరీ దివ్యంగా వుంటుంది. సురయొక్క మహిమ సురలకైనా దుర్లభమే. అది తాగితే వెయ్యేళ్ళు తపస్సుచేసినయోగులకయినా సాధ్యంకాని అద్వైతసిద్ధి

వక్కనిముషంలో అవుతుంది. అప్పుడు ద్వంద్వాలు యేమీ వుండవు. బ్రహ్మానందం కలుగుతుంది. మురికికాలువలు హంసతూలికాతల్పాలవుతవి. బట్టవిప్పివేసుకున్నా కట్టుకున్నా వక్కటేలాగు వుంటుంది. బట్టవిడిపోయి దిగంబరినై నేను మొన్న మురికికాల్వలో పడి వీధిపక్కను సురాపానమహిమచేత బ్రహ్మానందం అనుభవిస్తూవుంటే ఆనందపరవశుడనైవున్న నాకు మాబంధువులు వచ్చి బ్రహ్మరథంపట్టి యింటికి తీసుకునివెళ్ళి బిందెడునీళ్ళ నెత్తిమీద అభిషేకం చేసినారు.

దాంభి—సురాపానంలో యిటువంటిసిద్ధులు యింకాయెన్నెన్నో వున్నవి. అప్పుడు సరస్వతీదేవి తన చిన్ననాటి తడబాటుపలుకులతో జిహ్వాగ్రమందు నటిస్తూవుంటుంది. కొందఱు మూఢులు సురాపానం పాపమంటారుగాని పాపమేఅయితే తాగినవాళ్ళను బ్రాహ్మలు యెందుకు కులంలో వెలివెయ్యరని ఆలోచించరు.

శని—(నాలుక తడఁబడ) ఆరెరెరే. బ్రొబ్రొబ్రోగంది.

మద్య—అదుగో! అదుగో! దేవుణ్ణి కల్లమ్మవారు పూనింది. సురాదేవి ఆవేశించడంచేత యిప్పుడిప్పుడే వాక్కువస్తూ వున్నది. ఓయీ! దాంభికా! చుట్ట తీసుకుని రా. ధూపంవేసి యీదివ్య జ్ఞానంలో వుండగానే మనం యీదేవుణ్ణి అడిగి పురాణాలలో వుండే మనసంశయాలన్నీ తీర్చుకుందాము.

దాంభి—సందేహాలు తీర్చుకోవడానికి యిదే సమయం. స్వామీ! యిప్పటివాళ్ళు భూమి తిరుగుతూవున్న దంటారు. అది నిజమేనా?

శని—ఆరెరేరే. అంతా నిజం. భూమి తిరుగుతూ వున్నది. కొట్లు తిరుగుతూ వున్నది. సమస్తమూ తిరుగుతూ వున్నది. నాదేహం కూడా తిరుగుతూ వున్నది. బోగంది బోగంది. (అని మీఁద పడఁ

బోవుచున్నాఁడు.)

దాంభి—(తనలో) ఇతడు మత్తుగొనివున్నా మరిచిపోకుండా బోగంది బోగంది అని పలవరిస్తూ వున్నాడు. ఇతనివాలకం చూస్తే మొగవాళ్ళమీదకూడా పడేటట్టు వున్నది. బోగంది ఆదోవను వస్తూ వున్న దని వీధిలోకి పంపుతాను. (బిగ్గరగా) స్వామీ! బోగంది వీధి దోవను వస్తూ వున్నది. ఆలా విజయం చెయ్యండి.

[అప్పుడు పరదోషారోపకుని, అసత్యుని, స్తుతిపాఠకుని వెంటఁబెట్టుకొని కలి ప్రవేశించుచున్నాఁడు.]

కలి—అసత్యా! మనం యిప్పుడు యెవ్వరూ చూడకుండా చీకట్లో వచ్చినాము. అరుగో శనైశ్చరులవారు మన కెదురుగా వస్తూ వున్నారు.

శని—(కలిని గాఢముగా కౌగిలించుకొని) ఆసాసీ! ఒక్క ముద్దు పెట్టు. (అని ముద్దు పెట్టుకొని) అరెరెరే! ఈమర్త్యలోకంలో ఆడవాళ్ళకుకూడా మీసాలు వస్తవి!

కలి—(పెడమొగము చేసి కన్నులు మూసికొని) అయ్యో! కల్లుకంపు కొడుతూ వున్నది. దేవా! కరవకండి కరవకండి. నేను మీ భక్తుణ్ణి.

శని—బోగందాన్నికూడా భక్తు డంటారా? ఈలోకంలో బోగంవాళ్ళవి గుడ్డికళ్ళు.

మద్య—గుడ్డికళ్ళు కావు. మనుష్యులు గనుక యిష్టంవుంటే కళ్ళుమూసుకుంటారు.

కలి—దేవా! మనం వకరిని వకరు పట్టుకుంటే కార్యం లేదు. మనం యిద్దరమూ చేరి యితరులను పట్టుకోవలెను. నేను మీసేవ కుణ్ణి కలిగాణ్ణి. నన్ను కరవకండి. గిల్లకండి.

శని—ఇవి దంతక్షతనఖక్షతాలు. మనుష్యలోకంలో రసికత్వం లేదా ? ఓస్త్రీయురాలా !

కలి—నేను మగవాణ్ణి. కలిగాణ్ణి. ఆడదాన్నికాను.

శని—ఆడదికాకపోతే నాకక్కరలేదు. ఫోఫో! (అనితొలి యుచు) ఎవడవూ? కలిగాడవా ? కలిదోషహారమయినశ్లోకం చదివి కలిని వదల్చుకుంటాను.

శ్లో. కర్కోటకస్య నాగస్య దమయంత్యా నలస్య చ
ఋతుపర్ణస్య రాజర్షేః కీర్తనం కలినాశనం.

కలి—స్వామి! దాసుణ్ణి తమశెలవుప్రకారం వచ్చినాను. నాయెడల ప్రసన్నులు కావలెను.

దాంభి—స్వామివారిని సురాదేవి కొంచెంకొంచెంగా వదలిపోతూవున్నది. ఓకలీ! దేవతలు స్తోత్రంచేస్తేనేకాని ప్రసన్నులు కారు. స్తుతిచెయ్యి.

శని—స్తుతిపాఠకా! శనిస్తోత్రం చేస్తాము పట్టు—

శ్లో. ఇంద్రనీలద్యుతి శ్యామో వరదో గృధ్రవాహనః
బాణబాణాసనధరః కర్తవ్యో ఽ ర్కసుత స్సదా.

శని—(ప్రసన్నుడై) ఓయీ! కలీ! నీవా? రమ్ము రమ్ము. మనసభికులందరూ వచ్చినారా ?

కలి—మీవద్దనున్న యిద్దరూ కాక నాతో ముగ్గురు వచ్చి పంచమహాపాతకునినలె నాయకత్వానికి సరిపోయినారు. ఈసభకు యేమి పేరు పెడుదాము?

శని—ఈసభకు ఆత్మస్తుతి పరనిందాసమాజ మని పేరు పెడుదాము?

పర—ఈపేరు మేమందరమూ ఆమోదించినాము.

కలి—ఇక సభావుద్దేశములు నిశ్చయించవలెను.

శని—నేను అగ్నిసనాధిపతినయి నిశ్చయాలు వాస్తాను చూడండి—

౧. సత్యసంధుల నందరినీ అసత్యవాదులని పుకటించి, అనేక మాయోపాయాలు పన్ని పామరులను నమ్మించవలెను.

౨. ఏకపత్నివ్రతస్థులను జారులని చాటించవలెను.

3. సభికులందరూ శనైశ్చరునీ కలినీమాత్రమే సమస్తస్థలముల యందున్ను స్తుతిస్తూ వుండవలెను.

౪. మంచివాళ్ళకు దాంభికులనిన్నీ, అసత్యవాదులనిన్నీ, పాపాత్ములనిన్నీ, వంచకులనిన్నీ, క్రూరులనిన్నీ, నిఘంటువులలోవున్న పాడుపేర్లన్నీ పెట్టి పిల్లడించవలెను.

౫. సమాజముయొక్క యీమఖోద్దేశములన్నీ నెరవేర్చడానికి శనిగారు అగ్నిసనాధ్యక్షులుగాను, కలిగారు కార్యదర్శులుగాను, వుండవలెను.

స్తుతి—వీటికి నేమందరమూ ఆమోదించినాము. కేవలము దేవతలకు తప్ప ఆలోచించకుండా యిటువంటి నిశ్చయాలుచెయ్యడం శక్యంకాదు. ముప్పయిమూడు కోట్ల దేవతలలోను మీరే అగ్రగణ్యులు.

అస—ఈస్తుతిపాఠకుడు చెప్పినదంతాసత్యము.

పర—అసత్యవాది సత్యంచెప్పినాడు. మనప్రభువులవంటి బుద్ధిమంతులున్ను, ఈశ్వరోపాసకులవంటిబుద్ధిహీనులున్నూ లోకంలో లేరు.

కలి—పరదోషారోపకుడప్పుడే పని కారంభించినాడు. మనం దిగ్విజయం చేస్తాము. మనంచేసుకున్న అయిదునిశ్చయాలున్ను పంచరత్నాలవలె వున్నవి. ఇప్పుడు రాత్రి రెండుజాము లయిందిగనుక

పని కారంభించడానికి యిది మంచి ముహూర్తము. జారచోరులకు కన్నులపండు వైనచీకటికూడా మనోహరంగా వున్నది. మనను యెవరూ తెలుసుకోలేరు. ఊరిమీదపోయి పడదామురండి. మనం భూమిమీద దేవుడిరాజ్యం రూపుమాపి మనరాజ్యం స్థాపించవలెను.

శని—మీఅభీష్టం సిద్ధించేటట్టుగా ఆశీర్వదించినాము. పొండి.

మధ్య—మనకు దేవతావరం లభించినది. యిక వెళుదాము రండి. (అందరు నిష్క్రమించుచున్నారు)

తృతీయరంగము—కలిపురుషమందిరము.

[కలిపురుషుడును, శనైశ్చరుడును, పరదోషారోపకుడును, అసత్యుడును, స్తుతిపాఠకుడును ప్రవేశించుచున్నారు.]

శని—ఓకలీ! నీవుమనసభావుద్దేశాలుయెంతవరకు నెరవేర్చినావు?

కలి—అభినవబృహస్పతు లయిన యీమంత్రుల మంత్రబలం చేత యెంతపని అయినా చేసినాను. అసత్యుడూ మొదలయినవారిని వూరిమీదికి పంపించి చెడిపోతూవున్న యీలోకాన్ని వుద్ధరించడానికి మనం యిద్దరమూ యీవూళ్ళో అవతరించినామనినీన్ని, మనం చేసే లోకోపకారకార్యం సహించలేక ఓర్వలేనివాళ్ళు మనను నానాబాధలూ పెడుతూవున్నా యీకలియుగంలో మన మిద్దరమాత్రమే సత్యానికి నిలిచి దేహాలకాసపడక తంటాలు పడుతూ వున్నామనినీన్ని అందరూ నడుము కట్టుకునిలిచి మనకు తోడుపడి మనశత్రువులమీద ధ్వజమెత్తవలెననినీన్ని, యింటింటా తెలివిమాలిన పిల్లలవద్దా మూఢులయిన పెద్దవాళ్ళవద్దా ఘోషపెట్టించి వాళ్ళకు మనశత్రువులమీద ద్వేషంకలిగేటట్టు చేసినాను.

శని—ఇంతేనా ఇంకా యేమయినాచేసినావా? మనం చెయ్యా

వలసిన పని కొండంతవుండగా వొక్క-యీవూళ్లో కాస్తపని చేస్తే యేమవుతుంది? మనకీర్తి లోకానికంతా వ్యాపించవలెను.

కలి—ఆలాగయితే మన అసత్యుడూ మొదలయినవాళ్లను వుపన్యాసాలు చెయ్యడానికి వూళ్లమీదికికూడా పంపుదునా?

శని—యేడిసినట్టేవున్నది; వాళ్లకు పని చేతకాదు; యేమీచేత కాదు. ఈవిషయంలో నీవు యింకా వోనమాలకాడనే వున్నావు. ఇక నీశిష్యులమాట చెప్పవలసినదేలేదు. నేను పాఠశాలపెట్టి మిమ్మల నందరిని తరిబీతుచేస్తేనేకాని మీరు యీలోకంలో గుడ్డిగవ్వకయినా పనికిరారు. లోకంలో లక్షవూళ్ళు వుంటూవుండగా వీళ్ళు నాలుగు వూళ్లకువెళ్లి పనిచేస్తేయేమవుతుంది? మనం యిక్కడవుండే న్యూస్ పేపర్లకు వ్రాసి లోకమంతా పని చేయవలెను.

కలి—ఈవుపాయం దివ్యంగా వున్నది. ఇది యిదివరకు నాబుద్ధికి తట్టినదికాదు.

శని—వూరికే ఆలోచిస్తే కార్యంలేదు. పనికి పూనవలెను. న్యూస్‌పేపర్లకు పంపడానికి చటుక్కున నాలుగువృత్తరాలు వ్రాయి. వక్కరు వ్రాసినట్టు తెలియకుండా కిందదస్కతులు వేరేవేరే చేయించ వలెను.

కలి—" మహారాజశ్రీ — పత్రికాధిపతిగారికి. అయ్యా ! ఈ లోకరక్షణార్థము మావూళ్లో శనైశ్చరుడున్ను, కలిపురుషుడున్ను, యిద్దరు దివ్యపురుషులు అవతరించినారు. వీరు అజ్ఞానాంధకారములో మునిగివున్న జనులకన్నులు విప్పి జ్ఞానసూర్యోదయం కలుగచేస్తూ వున్నారు. ఈ పుణ్యపురుషుల మూలంగా బొలుర మనస్సులలో మూఢత్వతమస్సు పోయి జ్ఞానజ్యోతి దేదీప్యమానంగా వెలుగుతూ వున్నది"—దీనివింద యెవరిదస్కతు చేయించను?

శని—"సత్యవాది" అనేపేరుతో అసత్యుడిదస్కతు చేయించి యీవేళే టపాలో వేయించు. పుష్పమాసానికి యింకొకవృత్తరం వ్రాయించు.

కలి—ఇదుగో వ్రాస్తూవున్నాను.—"మ॥ పత్రికాధిపతిగారికి. మీపత్రికలో కలిపురుషశనైశ్చరుల విషయంలో సత్యవాదిగారు వ్రాసినది చదివి సంతోషించినాను. ఆమహాపురుషులు లోకాన్ని వుద్ధరించడానికి పాటుపడుతూవుంటే ఈర్ష్యాగ్రస్తులయిన దుష్టులు పాపానికి భయపడక వారికి హానిచెయ్యడానికి చూస్తూవున్నారు. ఆశుం శలు చేసే దుష్ప్రయత్నాలు యెప్పటికీ కొనసాగవు. అగ్నిహోత్రాలు చేటతోమూస్తే అణగిపోతవా? మహానుభావులకు అపకారం తల చడంచేత తమదౌర్జన్యం లోకానికి వెల్లడించుకోవడమే కాని వాని వల్ల యేమీ ప్రయోజనం వుండదు. కొందరు బుద్ధిహీనులు నిష్ఫూలు చెయ్యకపోతే .యీపాటికి కలిపురుషుడున్ను శనైశ్చరుడున్ను మా వూరికేకాకుండా లోకానికంతా కొండంత వుపకారం చేసి వుందురు. దేశంయొక్క పుణ్యంచేత మనుష్యలోకంలో అవతరించిన యీదివ్య పురుషులకు లోకమంతా తోడుపడవలెను"—దీనిలో యెవరిచేత దస్కతు చేయించవలెను?

శని—"గుణగ్రహణపారీణుడు" అనే పేరుతో పరదోషారోప కుడిచేత దస్కతు చేయించు. ఆపయినూసానికి యింకొకవృత్తరం తయారు చెయ్య.

కలి—చిత్తము— "మ—హా—రాశ్రీ—పత్రికాధిపతిగా రికి. సత్యవాదిగారున్ను గుణగ్రహణదురీణుడుగారున్ను వ్రాసినపుత్త రాలు చదివి ఈపట్టణంలో అశేషజనము సంతోషించినారు. అందులో చెప్పబడిన పురుషులను వర్ణించడానికి నాచేత కాదు, సరికదా నెయ్య

నోళ్లుగల శేషుడికయినా అలవి కాదు. వారిద్దరూ కేవలమూ లోకరక్ష
ణార్థము మనుష్యలోకంలో అవతరించిన శివకేశవులు. వారికీర్తి
యిదివరకే మూడులోకాలనూ దాటి పోయినది. వారివద్దనున్న సుగు
ణాలు దేవుడివద్దనైనా లేవు. వారి పరోపకారచింత చూడగా వృద్ధి
రించడానికి బ్రహ్మసృష్టిలోనున్న లోకాలు యేమూలకూ చాలవని
తోస్తూవున్నది. ఇదిస్తోత్రంకాదు. వున్న నిజంలో నేను సహస్రాంశ
మయినా చెప్పలేదు"—ఇది యెవరిపేరుతో పంపించవలెను?

శని—"స్తోత్రపరాఙ్ముఖుడు" అనేపేరుతో స్తుతిపాఠకునిచేత
దస్కతుచేయించు. యింకొకవుత్తరంవ్రాస్తే సీతాకాలమంతా సరిపో
తవి. ఇంకొక్కటి వేగిరం వ్రాయి.

కలి—దేవరవారి శెలవుప్రకారం చేస్తాను.—"మురాశ్రీ—
పత్రికాధిపతిగారికి. సత్యవాదిగారున్ను గుణగ్రహణ పారీణుడుగారున్ను
స్తోత్రపరాఙ్ముఖుడుగారున్ను నీపత్రికలో కురిపించిన వాఖ్యామృత
రసవర్షమువల్ల పరగుణ సుధాబింబలేశముచేత తృప్తిపొందే నాకే ఆవ
గింజంతయినా తృప్తి కలిగినదికాదు. ఆమహానుభావుల విషయంలో
నేనుకూడా కొన్నిమాటలు చెప్పి కొంచెం తృప్తినొందుదమంటే అసూ
యాపరులు నిత్యసత్యవ్రతుణ్ణి అయిననన్ను స్తోత్రపాఠకునిగా తలుస్తా
రేమోనని భయం వేస్తూవున్నది. నావినయమూ, నాసత్యప్రియ
త్వమూ, నాసదాచారసంపన్నతా, నానిష్ఠాగరిష్ఠత్వమూ, నామహాకులీ
నతా, నాగుణగ్రహణైకపారీణత్వమూ, తెలిసినవారు యెవ్వరూ
నావిషయంలో అన్యథా భావనచెయ్యరుగాని యేమీ తెలియని పామ
రులకయినా అటువంటిమాట పుట్టించడానికి యెందు కవకాశము యివ్వ
వలెనని సంకోచంచేత నామనస్సంతోషమునుకూడా మానుకుంటూ
వున్నాను. లోకోపకారార్థమై కలిమహాపురుషులున్ను శనైశ్చరచక్ర

వర్తిగారున్ను యీలోకం వున్నంతకాలమూ శాశ్వతంగా వర్ధిల్లుదురు గాక!—'' ఇది యెవరి సంతకంతో పంపించను?

శని—''వినయాలంకారుడు'' అనేపేరుతో దాంభికుని చేవ్రాలు చేయించి పంపించు. ఈవృత్తరాలు యిప్పటి మనచాతుర్మాస్య వ్రతాసికి చాలునుగాని మనశిష్యులైన అసత్యుడు మొదలైనవాళ్ళకు కొన్ని నీతులు నేర్పనలెను. వాళ్ళను యిలాగు రమ్మను.

కలి—అసత్యా! స్వామివారేదో వుపదేశిస్తారు. శ్రద్ధతో విను.

అస—మహోపసాదము.

శని—మనశత్రువులను గురించి యెవరివిషయమై యేలాగు ప్రవాదములు వెయ్యవలెనో కొంచెము చెప్పుతాను విను. ముందుగా మనశత్రువులలో యెవరిపేరైనా వకరిపేరు చెప్పు.

అస—.హరిశ్చంద్రుడు.

శని—''హరిశ్చంద్రుడు ఆడితప్పనివాడని వాడుకేకాని అది యెంతమాత్రమూ నిజముకాదు. అతడు మొన్ననాతో గంటలో నాలుగబద్ధాలాడినాడు. పనిహీనురోజులకిందట దాంభికునితో నిము షములో మూడుఅబద్ధాలాడినాడు. నెలకిందట పరదోషారోపకుడితో వక్కటిణంలో రెండబద్ధాలాడినాడు. వశిష్ఠుడు ఆయన పురోహితుడు గనుక అతనిమాట నమ్మకూడదు. విశ్వామిత్రుడు విరోధిఅంటా కేమో అతడూ రాజబ్రుహే గనుక అతనిమాటలూ నమ్మకూడదు. పురాణాలలో వ్రాసినవాళ్ళందరూకూడా బ్రుహ్మలేగనుక వాళ్ళయెవళ్ళ మాటలూ మొదలే నమ్మరాదు. యిదంతా వట్టి బూటకము. హరిశ్చంద్రుడు అసత్యవాది అని స్థాపించడానికి మాకలిమహారాజుగారివద్దనూ, కైశ్చరమహారాజుగారివద్దనూ కావలసినన్ని అమోఘనిదర్శనాలు వున్నవి. లోకంలో వారు యిద్దరేసత్యసంధులు''—అని యీమోస్త

రుగా చెప్పవలెను. ఇవి జ్ఞాపకం వుండవేమో కాగితంమీదవ్రాసుకుని పాఠం చెయ్యి. దాంభికా! నీవు వకరిపేరుచెప్పు.

దాంభి—దధీచి.

శని—"దధీచి దానానికి ప్రసిద్ధికాని జనులు నిజానిజాలు కను కోక్కలేరు. దధీచి అంతటి లుబ్ధుడు లోకంలో మరియెవడూ లేడు. అతడు యెవ్వరికి వక్కదమ్మిడీయిచ్చినపాపాన్ని పోలేదు. ఇందుకును వెన్నెముక యిచ్చినారంటారు. అది కేవలంమాయ; వట్టిగారిడీ; శుద్ధ ఇంద్రజాలము. కనికట్టుచేత వెన్నెముకలాగు కనపడ్డదేకాని నిజంకాదు. దధీచి పరమలోభి అనిచెప్పి వెయ్యిప్రమాణాలు చెయ్యగలను"—నేను యిప్పుడు చెప్పినసంగతులు మరచిపోక, నీకు చదువురాదు గనుక వేద పాఠకులలాగు సంతచెప్పుకో. పరదోషారోపకా! నీ వెవరిపేరయినా చెప్పు.

పర—వేదవ్యాసుడు.

శని—"వేదవ్యాసుడు విద్యానిధి అన్నమాట కల్ల. పల్లెదానికి పుట్టినవాడికి చదువు యెక్కడనుంచి వస్తుంది? నేను నిన్న పరీక్షచేస్తే సుమతీశతకములో వక్కపద్యానికి అర్థం చెప్పలేకపోయినాడు. తెలియనివాళ్ళు వ్యాసుడికి యేమో పాండిత్యం వున్నదనుకుంటారు. అతడు వట్టిసుంత. అతనికి పాండిత్యం వున్నదో లేదో మహావిద్వాంసుణ్ణియిన నాకు తెలియవలెనుగాని యితరులకు యేమి తెలుస్తుంది? అతనికి ఓ అంటే నా కాదని శాస్త్రప్రమాణాలతో కావలిస్తే నేను సిద్ధాంతం చేస్తాను. స్వంతంగా వ్రాసుకున్నవి గనుక పురాణాలలో వూరికే తాను సర్వజ్ఞుడైనట్లు ఆత్మస్తుతి చేసుకున్నాడు."—ఈవాద మంతా తర్కప్రకరణాలు వల్లించినట్లు వల్లనచెయ్యి.

మధ్య—మీరు సెలవిచ్చినమాటలలో నాకు వక్కసంశయం

వున్నది. వ్యాసుడికి అక్షరజ్ఞానం లేకపోతే పురాణాలు యెట్లాచేసినా డంటే యేమిచెప్పను ?

శని — ఇటువంటి కుశ్శంకులు యెప్పుడూ చెయ్యకు. నీవు మధ్యస్థీయుడవు గనుక తాగుపోతుమాటలు మాట్లాడుతూ వున్నావు. నేను నీప్రశ్నలకు వుత్తరం చెప్పను. శిష్యులకు యెప్పుడూ గురువు చెప్పేమాటలయందు భక్తివిశ్వాసాలు వుండవలెను. గురువు నిప్పు చల్లగా వుంటుందంటే తక్షణం వేదవాక్యంలాగు నమ్మవలెను. సంశయం పడితే గురుధిక్కారమహాపాతకం వస్తుంది. ఆపాపం వెయ్యిజన్మాలు యెత్తినా, వెయ్యితపస్సులుచేసినా విముక్తిపొందక పిల్లిబ్రహ్మత్యలాగు పట్టుకుంటుంది. నీవు యింకా మా శిష్యానుశిష్యులకు శిక్షాస్మృతి చేసి గురుజనవిశ్వాసరహస్యం నేర్చుకుంటేనేకాని మాకు శిష్యుడవయి మా వుపదేశం పొందడానికి తగవు. మీరందరూకూడా పోయి మాదాసాను దాసులవద్ద కొంతకాలం పరిచర్య చేసి గురుభక్తివిశ్వాసాలు నేర్చుకొని మా విద్యాదానానికి అర్హత సంపాదించుకొని మళ్ళీరండి. పొండి.

(అందరు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థ రంగము — కలిపురుషునిగృహము.

[కలిపురుషుడును, శనైశ్చరుడును ప్రవేశించుచున్నారు.]

కలి — ఓ శనైశ్చరచక్రవర్తీ! మనం యెంతగా పనిచేస్తూవున్నా మనపని పూర్ణంగా సాగడంలేదు. మన కంగబలం తక్కువగా వున్నది. మూడులోకాలికి మనం యిద్దరం యెంతపని చెయ్యగలము? లోకానికి వొక్కడొక్కడుచొప్పున చూచినా, అధమం మూడులోకాలికీ మిగ్గిరయినా వుండవలెను. దేవుడికి విరోధి మహాబలవంతుడైన సైతాను వొకడు వున్నాడు. అతణ్ణికూడా మనలో చేర్చుకుంటే మనం

త్రిమూర్తుల మఖుతాము. అప్పుడు మూడులోకాలూకూడా మనని తేరి చూడలేవు. అతణ్ని మనలో చేర్చుకోవడంకూడా కష్టం లేదు. మొన్న మీరు ఆస్వాదించినపానపాత్ర పకటి ముందు పెట్టి దానిలో కాస్తసుర పోస్తూవుంటే అతడు మనను విడువడు.

శని—సైతాను మ్లేచ్ఛుడు. మ్లేచ్ఛసంపర్కం యెవరికిన్నీ కూడదు. అందులోనూ దేవతలమయినమాకు బొత్తిగానే పనికిరాదు.

శ్లో. సభాయాం స్పర్శనేనైవ మ్లేచ్ఛన సహ సంవిశేత్
కుర్యాత్స్నానం సచేలం తు దిన మేక మభోజనం. రక్ష.

మ్లేచ్ఛుణ్ని సభలో ముట్టుకొన్నా కూడావున్నా సచేలస్నానం చేసి దినమల్లా వుపవాసం చెయ్యవలసిం దని కేవలస్మృతి విధిస్తూవుండగా దేవతలలో వెలిఅయ్యేట్లుగా నేను మ్లేచ్ఛసంపర్కానికి వప్పుకొంటా ననుకొన్నావా? వప్పుకోను. నీవు అశక్తుడవు గనుక యితరులసహాయం లేకుండా యేమీ చెయ్యలేవు. నేను ఆకాశంమీద వుండి నాశక్తిచేత మూడులోకాలు కాదుగదా పధ్నాలుగులోకాలునూకూడా అల్లాడిస్తూ వున్నాను. శనిగ్రహమంటే సామాన్యమనుకొన్నావా యేమి? నీవు పూర్వం వక్ర నలమహారాజును లోబరుచుకోలేక అతనికి లోబడడం చేతనే నీ అశక్తి దుర్జనత్వమంతా బయలపడ్డది.

కలి—నాసామార్థ్య మెరుగకుండా నిష్కారణంగా నన్ను మీరు దూషిస్తూవున్నారు. నన్ను దూషించినతరువాత మిమ్మలినిమాత్రం నేను వదలిపెడుతా ననుకొన్నారా యేమిటి? చిన్నప్పుడు సవితితల్లి చేత తిట్లుతిని కాలు యీచుకొనిపోయి భూమిమీద మోపలేక బయలు పట్టుకొని తిరిగేవాడికి నీకుమాత్రం నాకంటె యెక్కువశక్తి యేలాగు వస్తుంది? గుర్రం ముక్కులోనుంచి పుట్టిపడ్డ దేవవైద్యులు అశ్వనీదేవ తలు నీకు సోదరులువున్నా నీకుంటికాలు యిప్పటికీ కుదరలేదు. నీవు

తిన్నగా నడవలేక పోవడంచేతనేకానా నీకు శనైశ్చరుడని పేరు వచ్చింది? అమ్మపుట్టిల్లు మేనమామవద్ద చెప్పినట్లు నీమర్మంఅంతా యెరిగిన నావద్ద నీగొప్ప చెప్పుకోకు.

శని--నాపుట్టింటికీ నావంశానికీ యెవరెరిగినా యేమీలోపం లేదు. నాతండ్రి లోకాన్నంతా వెలిగించే సూర్యభగవానులు. అతడు ప్రాతఃకాలమున బ్రహ్మస్వరూపుడున్ను, మధ్యాహ్నమున శివస్వరూపుడున్ను, సాయంకాలమున విష్ణుస్వరూపుడున్ను అవుతాడు. అతని తేజస్సు యేమనుకున్నావు?

కలి--అంత తేజస్సుకలవాడు కావడంచేతనే నీతల్లి మొగుణ్ణి విడిచి ఆడగుర్రమై పారిపోయేటప్పటికి, నీమాతామహుడు విశ్వకర్మ నీతండ్రిని చిక్కంలోపెట్టి తేజస్సంతా దిగచెక్కి పారవేసినాడు.

శని-- నాతండ్రిని తరిమెనపట్టినప్పుడు రాలిన పొడుంకూడా వూరికేపోలేదు. ఆపొడుం పెట్టి మాతాత విష్ణుదేవుడికి చక్రమున్ను శివుడికి శూలమున్ను యిందుడికి వజ్రాయుధమున్ను చేసి యిచ్చినాడు.

కలి--ఈపుక్కిటి పురాణాలన్నీ నాకు తెలుసును. వకపురాణంలో దధీచి వెన్నెముకతో వజ్రాయుధంచేసినారనివున్నది. వకపురాణంలో చెప్పినట్లు మీతండ్రిని తరిమెనపట్టి రాలినపొడుంతో వజ్రాయుధంచేసినమాట నిజమా? యింకోపురాణంలో చెప్పినట్లు దధీచి వెన్నెముకతో వజ్రాయుధంచేసినమాట నిజమా?

శని--(తనలో) యిటిగుట్లు తెలిసిన వీడితో విరోధం పెట్టుకోరాదు. మంచిమాటలు చెప్పి వీణ్ణి సమాధానంచేస్తాను. (బిగ్గరగా) ఓకలీ! నీమనస్సు కనిపెట్టడానికి యీమాటలన్ని వేళాకోళానికన్నానే కాని నిజంగా నీవు శక్తిహీనుడవని నాతాత్పర్యం కాదు. నీవంటివాడి

మంతుడు లోకంలో మరిఁయెవడూ లేడు. నేను కిందవుండి భూలోకంవా రిలో మెలగుతూవుంటే నాశక్తిచూపించలేను కాబట్టి నేను పయినివుండి మిమ్మలినివిఱిచి నీశత్రువులను పట్టుకుని నీకు సహాయం చేస్తూవుంటాను. నీవు నైతానును నీతోచేర్చుకొని మీరు యిద్దరూ యిక్కడ పనిచేస్తూ వుండండి. నేను గృహమండలంలోనికి పోయివస్తాను. నేను పైని శుభ దృష్టితో చూస్తూవుంటే కింద నీవు దిగ్విజయం చేస్తావు.

కలి—(తనలో) ఈశని నన్ను పట్టుకోవడగచేత యెంగతనిచేసినా పేరు బయలికి రాకుండా వున్నది. వీడు నన్నువదలిపోతే నాకు యెవరూ పోటీలేకుండా నేనే యీలోకంలో యేకచ్ఛత్రాధిపతి నవుతాను. ఈశని నన్ను వదలకుండా యిక్కడవుండడముకంటె పయినివుండి నామేలు కోరుతూ వుండడమే మంచిది. నాచేతికిందవుండి పనిచెయ్యడానికి నాకు సమ్మతాను వక్కడుచాలును. (బిగ్గరగా) స్వామీ! మీరు భూలోకంలో చాలకాలం వున్నారు. మీరు యీపాటి మీలోకానికి విజయంచేసి మీదాసుణ్ని సౌమ్యదృష్టితో చూస్తూవుండండి. మీరు పయినివున్న బలంచేత నేను యీలోకమంతా దిగ్విజయం చేస్తాను.

శని—మంచిది నీవునీపనికి పో. మేము అంతర్ధాన మవుతాము.

(ఇద్దఱును పోవుచున్నారు.)

వేశ్యాప్రియ పరిహాసము.

ఉపోద్ఘాతము.

ఒకానొక హూణనచన పరిబంధకారుఁడు తన గ్రంథపీఠికయం దీక్రింది కథను వ్రాసియున్నాఁడు:—

పూర్వమొకచిత్రికాకారుఁడు వేడుకకొఱ కేదుఁన విచిత్రపటము నొకదానినూహించి వ్రాయవలెనని యెంచి యాలోచించి వీరభటుని వలెఁ గూచుండిన పండ్లులేని యొక ముసలిభల్లూకమును, దానిసర సను ముక్కునకు సులోచనములు తగిలించుకొని గువ్వలాగునఁ గూరు చుండి వృత్తాంతపత్రికను చదువుకొనుచున్నట్లొక గుడ్లగూబను, వాని పక్కను తూలికను చేత ధరించి చిత్తరువు వ్రాయఁగూరుచున్న యొకకోతి యెదుట తలకు కిరీటము పెట్టుకొని కూరుచుండి తన ప్రతి రూపమును వ్రాయించుకొనుచున్న ట్లొకగాడిదను ఒకచిత్రఫలకము నందు రంగులతో లిఖించి యందఱికిని జూపెను. అచ్చటివారందఱును వినోదముచూచి చిత్రికారునివ్రాత నేర్పున కద్భుతపడి మెచ్చుకొని కొంతసే పానందించి, ఆచిత్రపటమునుగూర్చియే పరిసంగించుచు నింటికిఁ బోవుచుండఁగా తోవలో నొకకలహప్రియుఁడు పూర్వము నండులో కొలువుచేసి యుపకారవేతనము నొంది వచ్చినయొక వృద్ధభటునివంకఁ జూచి "అయ్యా! మీరు గ్రహింపఁగలిగినారో లేదోకాని యాచిత్రి కారుఁడు మిమ్మ్ము పరిహసించుటకే యాభల్లూకమును వ్రాసినాఁడు

సుండీ" అని పలికెను. "ఎవ్వని పరిహాసించుటకు గుడ్లగూబను వ్రాసి
యుందును?" అని మరియొకడడిగెను. సులోచనములు పెట్టుకొని యా
గుగపులలోనున్న యొకవృద్ధపండితుని చేతితో జూపి కలహాప్రియుడు
"ఆగుడ్లగూబను నిస్సందేహముగా సీయన నెగతాళి చేయుటకే వ్రాసి
నాడు." అని చెప్పెను. "ఎవరినుద్దేశించి యాగాడిదను వ్రాసెను?"
అని యింకొకడడిగెను. ఆవిషయములో సందేహమే లేదు. తలకు
కుళ్ళాయి వేసికొన్న యాచిన్నవాని నాక్షేపించుట కది వ్రాసినాడు
చూచినారా? తానే బొమ్మలు వేయగలుగుదునన్న గర్వముచేత ఆదు
ర్మార్గుడీచిన్నవాని నెట్లు గాడిదనుచేసినాడో! అంతపనిచేసిన యాక్రూ
రుని నూరక పోసయ్యగూడదు." అని యుత్తగముచెప్పె కలహాప్రియు
డాముగ్గురుని కలహామునకు పురికొల్పెను. అవునవు ననియప్పు డా
ముగ్గురును తలయూచి ఒండొరులతో కలియబలుకుకొని చిత్రికారు
నికి బుద్ధి చెప్పవలెనని మహారోషముతో బయలుదేరి వాని యింటికిం
బోయి "ఓరిఅల్పుడా! పండ్లుచూడినవని నన్ను వెక్కిరించుచున్నావురా?
ఈచేతితో నీపండ్లూడగొట్టి నీకిప్పుడు బుద్ధి చెప్పెదను చూడు" అని
యొకడును, "ఓరి చండాలుడా! నేను గుడ్లగూబనటరా? ఇటువంటి
వ్రాత లెప్పుడును వ్రాయకుండ నీగుర్తిపూడబెరికెదను చూడు" అని
యొకడును, "ఓరి బుద్ధిహీనుడా! నేను గాడిదనటరా? ఎడమకాలితో
సిన్నిప్పు డందఱీమందఅను గాడిద తన్నిన కొట్టుతన్నెదనో చూడు"
అని యొకడును, కయ్యమునకుం గాలుదువ్వుచు బోయి కాట్లకుక్కల
లాగున వానిమీదబడిరి. తాను వానిలో నెవ్వరిని ఉద్దేశించలేదని
యాచిత్రికారుం డెంతమొఱ్ఱిపెట్టినను వానిమాట లెవ్వరును చెవిని
బెట్టక "నన్నుద్దేశించనిపట్టమున బోసినో రేలపెట్టితివ"ని యొకడును,
"నన్నుద్దేశించని పటమున ముక్కుద్దమేల పెట్టితివ"ని యింకొకడును,

"నన్నుద్దేశించనిపట్టమున కుళ్ళాయి యేలపెట్టితివ"ని నేత్రోకడును తగవు లాడ మొదలు పెట్టిరి. చిత్రకారుడావలకు వారినుద్దేశించక పోయిననను, ఆకలహావార్త యూరంతటను శీఘ్రముగా వ్యాపించినందున నాడు మొదలుకొని పురజనులందఱును ఆముసలిబంటును ఎలుగుగొడ్డనియు, ఆవృద్ధవిద్వాంసుని గుడ్లగూబనియు, ఆపడుచు విద్యార్థిని గాడిదయనియు పిలువ మొదలుపెట్టిరి.

పయినిజెప్పిన ప్రబంధకర్త యీకథనువ్రాసి పంపినవారును, సులోచనములు పెట్టుకొనువారును, కుళ్ళాయి ధరించుకొనువారును లోకములో తాముమాత్రమే కాక యితరు లనేకులుందురు గాన, పుస్తకములో వ్రాయఁబడిన దానిని దేనిని తమ్ముగూర్చియే యని భ్రమపడవలదని తన చకువరులకు హితోపదేశము చేసెను. ఆగ్రంథ కర్త చూపినమార్గము ననలంబించి యిప్పుడు నేనును నాప్రహసనములు చదివెడువారి నందఱిని వానియందలి పాత్రములయందు వర్ణింపఁబడిన గుణములు కొన్ని తమయం దుంటనుబట్టి తమ్మేద్దేశించియే యని వ్రాయఁబడిన వని బహుజనసామాన్యములైన గుణములను తమ యొక్కరియందే యారోపించుకొని కోపగించుకోక, అట్టిగుణము లధిక జనసామాన్యములగుట తెలిసికొని యానందింపఁ బ్రియత్నింతురని ప్రార్థించుచున్నాను.

గ. రంగము—దంభాచార్యులవారిగృహము.

[దంభాచార్యులును, మాయాచార్యులును ప్రవేశించు చున్నారు.]

దంభా—నేను ఇందాకా అడిగినదానికి మీరు తగినసమాధానం చెప్పినారు కారు. మన అమ్మాయిపెళ్ళికి బోగంమేళం పెట్టుమన్నారా? వద్దన్నారా?

మాయా—వద్దనడం కూడానా? యే అప్పో సప్పో చేసి తప్పకుండా పెట్టండి. బోగంమేళమే లేకపోతే ఇఖ పెళ్ళి యేమిటి?

దంభా—మొన్న మీరు వివేకాచార్యులతో మనయింట్లో పెళ్ళికి బోగంమేళం లేకుండా చేస్తామన్నారటే!

మాయా—వూరికే ముఖప్రీతికోసం అన్నాను. అవన్నీ మాయ మాటలు. వాళ్ళపట్టుంవాళ్ళతో నేను అలాగే అంటాను. వాళ్ళతో అన్నమాటలు మీరు పాటిగా పట్టబోకండి.

దంభా—బహుబాగా చెప్పినారు. ఇప్పుడు మీహృదయం నాకు బాగా తెలిసింది. మొన్న మావాడు చెప్పేటప్పటికి ఆలాగంటి లోక విరుద్ధమయిన మాట మీరు యెలాగు అన్నారా అని నాకు అత్యద్భుత మైనది. అది సరేకాని బోగంమేళానికి మనకు డబ్బు యెక్కడనుంచి వస్తుంది?

మాయా—ఎక్కడనుంచో వకచోటనుంచి వస్తుంది. మీరు ఆవిషయంలో అనుమానించకండి. మీకు వున్నమాన్యం అమ్మివేసి బోగంమేళం పెట్టండి. డబ్బువుంటే మాన్యం యెప్పుడైనా వస్తుంది కాని తరువాత లక్ష్మీవరహాలు యిచ్చినా గణికాపాణినాథరావుగారి మేళం వంటి మేళం రమ్మంటే రాదు.

దంభా—మాన్యం యిదివరకే అమ్మివేసినాను. ఇఖయెవరూ అప్పు

మాయా—అమాటలు నాతో చెప్పకండి అప్పు యివ్వకపోతే

మీ భార్యావంటను వున్నగుల్లలు తెగనమ్మి మేళం పెట్టండి. ఇప్పుడు మేళం పెట్టకపోతే మీపరువు పోతుంది. మీరు మహాభాగ్యవంతులనిన్నీ, దానకర్ణులనిన్నీ, వేశ్యాజనసత్కారవిద్యలో మహామహోపాధ్యాయులనిన్నీ, గణికాప్రాణనాథరావుగారితో మనవి చేసినాను. ఆయన యిప్పుడే మీదర్శనానికి వస్తామన్నారు. మనం వెయ్యిమందిని మోసం చేసిఅయినా నూరుకల్లలాడిఅయినా డబ్బు తెచ్చి బోగంమేళం పెట్ట వలెను గాని బోగంవాళ్లవిషయంలో పెద్దమనిషితో ఆడినమాట తిరగ రాదు. అందులోనూ యిది ఆయన స్వంతమేళము.

దంభా—నా పెళ్ళాముకు బొందున పుస్తెతప్ప మరి యేమీలేదు. గణికాప్రాణనాథరావుగారు వూరికే మేళం పంపించరా?

మాయా— ఊరాగంటికోరిక మనవంటి పరువుగలవాళ్ళు యెప్పుడూ కోరరాదు. ఆయన వస్తూవున్నారు మెల్లిగా మాట్లాడండి. అరుగుమీద చిరుగుచాప వేసినారు మంచిచాపలేదా యేమిటి?

[గణికా ప్రాణనాథరావుగారు ప్రవేశించుచున్నారు.]

దంభా—(లేచి) దయచెయ్యండి.

మాయా— (దంభాచార్యులతో రహస్యముగా) చిరుగు కన పడుకూ వున్నది. కప్పుకున్న బట్టతీసి పయిని వేసికోండి. (బిగ్గరగా) గణికా ప్రాణనాథరావుగారు దయచెయ్యడంచేత మాయిల్లు పావనం అయింది. దంభాచార్యులుగారికీ మీకూ ఇదివరకు యెప్పుడూ పరిచయం లేదు. దయచెయ్యండి.

దంభా—ఓరీ! భీమయ్యా! పెద్దమనుష్యులు వచ్చినారు. వేగిరము తివాసీ తీసుకురా. ఏమిరా పలకవు?

గణి—అక్కఉలేదులెండి. నేను చాపమీదనే కూర్చుంటాను. మనలో మనకు మర్యాద లేమిటి? (అని కూరుచున్నాడు.)

[లోపలనుండి చిన్నమ్మ ప్రవేశించు చున్నది.]

చిన్న—నాన్నగారూ! మీరు యెవరిని పిలిచినారు?

దంభా—(తనలో) ఏపేరుతో పిలిచినానో మరిచిపోయినాను. చివర "అయ్య" అన్నమాట జ్ఞాపకం వున్నది. ఆపేరు సోమయ్య కాబోలును! (బిగ్గరగా) మరియెవరినీ కాదు. తివాసీ తేవడానికి సోమయ్యను పిలిచినాను. ఈయన చాపమీదనే కూర్చున్నారు. అక్కర లేదు లే.

చిన్న—నాన్నగారూ! సోమయ్య యెవరు?

దంభా—అది మన కొత్తనఫ్కరు పేరు. నీకు తెలియదులే వూరుకో. పెళ్ళికియెదిగినపిల్లలు పెద్దమనుష్యులయెదుట మాట్లాడరాదు. నీవు మాట్లాడబోకు. (తనలో) మళ్ళీ యింకొకటిచెపితే తంటావస్తుంది. ఈమాటు నఫ్కరు పేరు తిన్నగా జ్ఞాపకం వుంచుకోవలెను. మొదటి అక్షరం "సో" రెండోఅక్షరం "మ" చివరిది "అయ్య" సోమయ్య-జ్ఞాపకం వున్నది.

గణి—ఇప్పుడు మీరు వివాహం చెయ్యబోయేది యీ చిన్న దానికేనా?

దంభా—అవునండి. దీనికే. లేక లేక పుట్టడంచేత దీనికి యేమీ నగలు చేయించిపెట్టక యేభ్రాసినిగా వుంచినాము.

చిన్న—నగలు అమ్మకేలేవు—

దంభా—అమ్మాయీ! వూరుకో. అమ్మ వంటినిండా పెట్టుకోకపోతే నగలు లేవనుకున్నావా యేమిటి? భోషాణంలో వున్నవన్నీ నగలు గాక యేమనుకున్నావు? అమ్మాయీ! నీవు వేగిరం వెళ్ళి రామయ్యను యీలాగు పంపించు. (తనలో) ఇప్పుడు నేను చెప్పినదేనా పేరు? మొదటిఅక్షరం మరిచిపోయినాను. మధ్యఅక్షరం 'మ' బాగా జ్ఞాపకం

వున్నది. కామయ్య గాభోలును! (బిగ్గరగా) తెల్లబోయి అలాచూస్తా వేమి? నీవు యేమీ మాట్లాడక లోపలికి వెళ్ళి వేగిరం కామయ్యను పంపించు వెళ్ళు. మాట్లాడకు.

గణి— (తనలో) వీరియింట్లో "భీమయ్య" "సోమయ్య" "రామయ్య" "కామయ్య" నలుగురు నవుకర్లు వున్నారు. ఈయన నిశ్చయంగా భాగ్యవంతుడయి వుంటాడు. (బిగ్గరగా) అమ్మాయి పెళ్లికి యెన్ని బోగంమేళాలు పెడుతారు?

మాయా—తమమేళం వున్నతరువాత యేమేళమూ యెందుకు? తక్కినవన్నీ దివిటీకింది దీపాలు. తమమేళానికి వేయినూటపదహార్లు గౌరవంచేస్తే వెయ్యిమేళాలు వున్నట్టుంటుంది.

దంభా— (మాయాచార్లుతో రహస్యముగా) అంతసొమ్మి మనం యెక్కడనుంచి తెస్తాము? (బిగ్గరగా) వెయ్యిన్ని నూటపదహార్లు కాదుగదా లక్షవరహాలు యిచ్చినా, అదంతా సార్థకవ్యయం.

మాయా— దంభాచార్లుతో (రహస్యముగా) అనడంతోటే ఇచ్చినామా యేమిటి? వట్టినూటకు ఆలాగే యిస్తాననండి. పెద్దమొత్తం ఇస్తామంటే గౌరవంగా వుంటుంది. (బిగ్గరగా) అంతకు సందేహం యేమిటి? ఆచార్లగారి వుదారసాహసానికి ఎన్నిలక్షలవరహాలు యిచ్చినా యిచ్చినవారే.

గణి—మీయింట్లో పెళ్ళి యింకా యెన్నిదినములు వున్నది?

దంభా—ఎన్నోదినములు లేదు. రేపు విదియనాటికి సరిగ్గా నెలదినములు వుంటుంది.

గణి—మీయింట్లోపెళ్ళికి తప్పకుండా మామేళాన్నేపంపుతాను. మీరు మరి యేమేళాన్ని కుదుర్చుకోకండి. విటేంపల్లిరావుగారి లోపల పఘువారం వివాహం జరుగుతుండట. నేను అక్కడికి నక్కమాటు

పోయి వస్తాను. నేను వకటి రెండు రోజులలో మావూరికి వెళితేనే కాని సమయానికి మేళం సిద్ధం గాదు. మళ్ళీ సాయంకాలం వచ్చి నేను దర్శనం చేస్తాను.

దంభా—కొంచెంసేపు దయచెయ్యండి. తాంబూలం పుచ్చుకొని మరీవెళ్ళుదురుగాని. (తనలో) నవుకర్ల పేరేమో మళ్ళీ మరిచిపోయినాను. మధ్య 'మా' జ్ఞాపకం వున్నది. ఇతనికి పేరంతా జ్ఞాపకం వున్నదేమో అడిగి చూతాము. (మాయాచార్లతో రహస్యముగా) మనం యిందాక పిల్చిన నవుకర్ల పేరేమిటి? నీకు బాగా జ్ఞాపకంవుంటుంది. మధ్య అక్షరం 'మా'.

మాయా—(దంభాచార్యులతో రహస్యంగా) నాకు బాగా జ్ఞాపకం వున్నది. మధ్యక్షరం 'మా' అయితే అది వేమయ్యా, శ్యామయ్యా అయివుంటుంది. ఈరెండూ కాకపోతే తప్పకుండా మామయ్య అయివుంటుంది.

దంభా—(తనలో) అన్ని పేర్లతోనూ పిలుస్తాను. అందులో యేదోవకటి అవుతుంది. (బిగ్గరగా) వేమయ్యా! శ్యామయ్యా! మామయ్యా! పంతులుగారికి తాంబూలం పళ్ళెంతోతీసుకురండి. ఏమి వొక్కరూ పలుకరేమి? అయ్యా! పంతులుగారూ! యింట్లో యెందరు నవుకర్లు వున్నా మాయింటిది అందరికీ అన్ని పనులూచెప్పి వక్కసారిగా అవతలికి పంపివేస్తుంది. తీరా పెద్దమనుష్యులు వెళ్ళబోయేటప్పుడు తాంబూలం తేవడానికిపిలిస్తే సమయానికి వక్కనవుకరూ లేకపోయినాడుగదా?

గణి—తాంబూలానికేమి? నేను మళ్ళీవచ్చినప్పుడు యీ తాంబూలమూ ఆతాంబూలమూకూడా పుచ్చుకుంటానులెండి. మీనవుకర్ల పేర్లు బహుచిత్రంగా వున్నవి. అందరపేర్లలోనూ మధ్య మకారమే వున్నది.

మాయా—మా అనగా లక్ష్మి అర్థము. యజమానులు కోటీశ్వరులని చూపించడానికి లక్ష్మిప్రదమయినమకారము వీరినవుకర్ణ ందరూ తమపేరుల్లో మధ్య వుంచుకుంటారు.

గణి—నేను సెలవు పుచ్చుకుందునా?

దంభా—తమరు తాంబూలంపుచ్చుకోకుండా వెళ్ళడం ధర్మం గాదు. మీరు విజయంచేసేముందే వూళ్ళోకి వెళ్లినవుకరు తిరిగీ వచ్చేదాకా కొంచెంసేపుతాళి తాంబూలం పుచ్చుకుని నన్ను గౌరవించి మరీ దయచెయ్యండి.

గణి—అతడు వచ్చేటప్పటికి మళ్ళీ వస్తాను. మీయింట్లో తాంబూలం పుచ్చుకోకుండా వెళ్లను. వక్కమూటు సెల వియ్యండి.

(అని వెళ్ళుచున్నాడు)

దంభా—ఈగణికాపాణినాధరావుగారు బ్రాహ్మణులుకదా! ఈయనకు బోగంమేళం యెక్కడిదండీ?

మాయా—ఇప్పుడు మేళంలో గజ్జెకట్టే మీనాక్షి తల్లిని యీయన వుంచుకొన్నాడు. ఆ అభిమానంచేత మీనాక్షికి విద్య చెప్పించి, అది యెక్కడకు మేళానికి వెళ్ళినా యీయనకూడా వూరూరూ తిరుగుతూ వుంటాడు.

దంభా—అలాగయితే మనకు డబ్బు లేకుండా యీమేళం వస్తుందేమో చూడండి. మీరు మాయవేషం వేసి ముఖస్తుతుల కారంభిస్తే యెంతటివారూ మీవలలో పడుతారు.

మాయా—ముందు మేళం రానిస్తురూ. తరువాత డబ్బు విషయంలో యేదో మాయవేషం వేతాము. మీరూ ఆలోచించండి. నేను యిప్పుడు యీపనిమీదనే వెళ్లివస్తాను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

---

౨. రంగము—దంభాచార్యులవారి పడమటిల్లు.

[దంభాచార్యులును, భార్య చారుమతియు, కూతురు చిన్నమ్మయు పరివేశించుచున్నారు.]

దంభా—ఓసీ! అమ్మాయి పెళ్ళి దగ్గిరకు వస్తూవున్నది. ఐదు రోజులూ యెలాగు గౌరవంగా వెళుతవో అని నాకు బెంగగా వున్నది.

చారు—మీరు యేమీ బెంగ పెట్టుకోవలసిన పని లేదు. యీ పెళ్ళికోసం మీరు మాయాచార్లమాటలు విని బడాయికోసం లేనిపోని అప్పులు చెయ్యకండి. ఏనిటి మాయాచార్లూ మీరూ యిందాకా మహా మాట్లాడుతూ వున్నారు?

దంభా—మరియేమీ లేదు. ఈ పెళ్లి విషయమే మాట్లాడినాము. మనం పెళ్లికి యేమిఖర్చులుచేస్తే నలుగురిలోనూ గౌరవంగావుంటుందా అని ఆలోచించినాము. అప్పు చెయ్యకపోతే విద్యాలవారికి నాలుగు రోజులూ యింతపప్పూ అన్నం పెట్టడానికయినా నావద్ద యేమీ లేదు. అప్పు యిచ్చేవారుకూడా యిప్పుడు యెవరూ కనపడడం లేదు.

చారు—ఇచ్చేవారు వున్నా మనం ముఖముందు అప్పుచెయ్యక కుప్పంగా వాడుకుందాము. నిన్నసాయంకాలం నేను పుట్టింటికి వెళ్ళినప్పుడు నా వదినెగార్లు యిద్దరూ తమ వంటినిండా నగలు పెట్టుకుని కూర్చుని నేను మోడులాగు నగలు లేకుండావుండడం చూచి హాస్యానికన్నట్లుగా అన్నగారు పెట్టిన నగలన్నీ మేమేమయినా తెమ్మనిపోతా మనా దాచి వచ్చినావని నన్ను ఆక్షేపించేటప్పటికి, నేను మారుమాట చెప్పక వూరుకున్నా దగ్గిర కూర్చున్న మాఅమ్మకు చిన్నతనంగావుండి కోపంచేత లేచిపోయినట్లుగా చివాలున లోపలికి లేచిపోయి తనపెట్టె తీసి నూరురూపాయలు వొళ్ళోపోసుకుని నన్ను సాగనంపడానికి వచ్చినప్పుడు వీధిలో నాతోకూడా దూరంగావచ్చి వెనుక తిరిగి చూచి

కోడళ్ళు చూడకుండా, యేవైనాచిల్లరసగలు చేయించుకుని వంటిని పెట్టుకోవలసినదని ఆనూరురూపాయలూ రహస్యంగా నాచేతిలో పెట్టి పోయింది. అవి మీకు యిస్తాను. అప్పు చెయ్యకుండా వాటితో పెళ్లి ఖర్చులు సరిపెట్టండి.

దంభా—ఈరూపాయలు సమయానికి దేవుడు పంపించినాడు. మంచివారికి దేవుడు సహాయం చేయక మానడు. నీ స్నేహితురాలిని సత్యవతిని అడిగి మరి పదహారురూపాయలు చేబదులు తెచ్చినావంటే యీనూట పదహారురూపాయలూ సధ్యా యిప్పుడు బోగంమేళానికి సరిపోతవి. మరి యేఖర్చు చేసుకోకపోయినా యింతకంటె యిచ్చునో లే మని గణికాపాణినాధరావుగారిని బతిమాలుకొని యధాశక్తిని యీరూపాయలు ఆయనచేతిలో పెట్టి బోగంమేళం పెడితే మనపరువు కొంత నిలుస్తుంది.

చారు—నామాట విని యీపెళ్ళికి మీరు బోగంమేళం మాని వేసివెయ్యండి. బోగంమేళం పెడితే మనకు లేనిపరువు రానూ రాదు. పెట్టకపోతే వున్నపరువు పోనూపోదు.

దంభా—ఆలాకాదు; పెళ్ళిలోబోగంమేళం పెడితే యొక్కువ గౌరవంవుంటుంది. చదువురాకపోవడంచేత మగవాళ్లకు వుండేపరువూ మర్యాదా నీవు గ్రహించలేవు. బోగంమేళం లేకపోతే వూళ్ళో పెద్ద మనుష్యులు యెవరయినా మనవీధిగుమ్మం తొక్కి చూస్తారనుకున్నా రా? ఆపెద్దమనుష్యులు మేళంలేకపోతే దేవుడిగుళ్ళోకే వెళ్లారు. మన యింటి కెక్కడవస్తారు?

చారు—మనయందు నిజంగా ప్రేమవున్నవారు బోగంమేళం వున్నా మనయింటికి తాంబూలానికి వస్తారు; లేకపోయినా వస్తారు. ఆలాకాకుండా బోగంమేళంకోసమేవచ్చే పెద్దమనుష్యులను మనయింటికి

రాకుండా వాళ్ల ఇళ్ల కే వెళ్లనివ్వండి. నేను యెంతచదువుకోకపోయినా చదువుకున్నవాళ్లతో సహవాసం చెయ్యడంచేత నాకూ కొంచెం మంచీ చెడ్డా తెలుసును. చదువుకున్న సత్యవతికూడా యెప్పుడూ బోగం మేళం పెట్టడం మంచిదికాదని నాతో చెప్పుతూనే వుంటుంది.

దంభా—సత్యవతితో సహవాసం వచ్చినతరువాతనే నీకు కూడా ఇటువంటి సంబ్భ్రమలు పుడుతూవున్నవి. నీవు ఇదివరకే చాలా చెడిపోయినావు. ఆడవాళ్ళు నాలుగుముక్కలు నేర్వడంతోటే పరువూ మర్యాదా అన్నీ మరచిపోయి, పెడయుక్తులు పన్నుతారు. చదువునేర్చిన ఆడదానితోనూ, వంటనేర్చిన మగవాడితోనూ యెవ్వరూ వోపలేరు.

చారు—అందుచేత మీ ఇష్టప్రకారం నేను చదువురాని దానినే మీకు భార్యనైనాను గాదూ?

దంభా—నీకు చదువురాకపోయినా చదువుకొన్నవాళ్ల సహవాసం చెయ్యడంచేత నీవు వాళ్లను మించిపోయినావు. ఈప్రకారంగా మాటకు యెదురుమాటాడి మొగుడితో వాదంచెయ్యమనికూడా నీకు సత్యవతే నేర్పిందా?

చారు—ఏబుద్ధిలేనివాళ్ళకి స్వతహాగా పుట్టవలెను గాని యితరులు నేర్పితే యేమాత్రం నిలుస్తుంది? సత్యవతి యెప్పుడూ మొగుడికి యెదురుచెప్పక ఐకమత్యంతో వుండవలెననే బోధిస్తుంది గాని పోట్లాడుమని బోధించదు. సత్యవతి, మొగుడు యెంత అన్యోన్యంగా వుండి ప్రతివిషయములోనూ యేకవాక్యంగావుంటారో చూచినారా? ఆదంపతులను చూస్తే నాకు ముచ్చట అవుతుంది.

దంభా—సత్యవతికి మడీమునులా స్నానమూసంధ్యాలేని ఇంగ్లీషు

చదువుకొన్న మొగుడు దొరికినాడు గనుక యిద్దరికీ కలిసిపోయింది. వాళ్ళకు యిద్దరికీకూడా సిగ్గూ బిడియమూ పరువూ ప్రతిష్ఠా యేమీ లేదు. వాళ్లు మొగుడూపెళ్ళామూ పట్టపగలు మాటాడుతారని వూళ్ళో నలుగురూ చాటున వాళ్లను ఛీ అంటూవున్నారు. మొండికెత్తిన వాళ్లను యెవరు యేమిచేస్తారు?

చారు—వాళ్లసంగతి మనకెందుకుగాని మీరుమాత్రం పెళ్ళికి వృధాఖర్చు బోగంవాళ్లను మాన్పించండి.

దంభా—నీవు నామాటకు అడ్డంచెప్పకు. బోగంవాళ్ళు రావడం వధూవరులకు బహుశ్రేయస్కరం. నల్లపూసలకు త్తిగంటు బోగంది గుచ్చితేనేకాని పిల్లదానికి అయిదోతనం వుండదని పెద్దలు చెప్పే మాటలు నీవు విన్నావా? లేదా? వక్కకు త్తిగంటు గుచ్చడంచేతనే అంతశ్రేయస్సువుంటే అయిదురోజులూ పెళ్లి యింట్లోవుండి ఆడుతూ వుంటే యెంతశ్రేయస్కరమో నీ కేమి తెలుసును?

చారు—నిరుటిసంవత్సరం మనుగుడుపులో మొగుడుపోయిన చెల్లమ్మకు త్తికంటు బోగందే గుచ్చించిందిసుమండీ.

దంభా—వూరికే యిటువంటి పిచ్చిపేలాపనలు పేలక నోరు మూసుకో. పెద్దమనిషి గణికాప్రాణనాథరావుగారితో ఖెయ్యిన్ని నూట పదహార్లిచ్చి వారిమేళం వుంచుతానని యెన్నో గొప్పలు చెప్పినాను. పెద్దమనిషికి మాటయిచ్చి తప్పిపోతే యీ అయిదురోజులలోను తల యెత్తుకుని తిరగడానికి శక్యమవుతుందీ?

చారు—బోగంవాళ్ళను మానివేసి, యీ అయిదురోజులూ యెలాగో వకలాగు కొంచెం తలవంచుకొని తిరిగితే తరువాత అప్పులు లేకుండా యెల్లకాలమూ తలయెత్తుకుని తిరుగవచ్చును. ఇతరులతో లేనిగొప్పలు యెందుకు చెప్పనలెను?

చిన్నమ్మ—— అమ్మా! యిందాకా నాన్నగారు "సోమయ్యా భీమయ్యా" అని లోపల యెందరో నవుకర్లువున్నట్టు వాళ్లయెవట యెన్నో పేర్లు పెట్టి పిలిచినారు.

దంభ—— అమ్మాయీ! వేలెడంత లేవు. నీవుకూడా అమ్మతో చేరినావా?

చిన్న——నాన్నగారూ! కోపపడకండి. నేనువాళ్లయెదుట యేమీ అనకూడదని వూరుకున్నానుగాని వూరికే అబద్ధా లాడవచ్చునా?

దంభా——పాడుసూళ్లకు పంపించడముచేత యింతలేసివాళ్లనూ మతి చెడిపోతూ వున్నది. గుడ్డువచ్చి పిల్లను వెక్కిరించినట్టు నీవు నాకు బుద్ధులు చెప్పవస్తూ వున్నావు. రేపటినుంచి బడికి పోకుండా నీకు చదువు మానిపిస్తాను వుండు.

చారు——అమ్మాయీ! నీ వేమీ మాటాడకు. ఇంట్లో పెద్ద నవుకరును నేను వుండగా వేరే నవుకర్లు యెందుకు? యేమికావలెనో చెపితే నేను తీసుకుని వస్తునుగాచూ?

దంభా——. (తనలో) ఇవి తానే నవుకరు నంటూవున్నది. ఇది బాగా వున్నది. గణికాప్రాణనాథరావుగారు వచ్చి చూచినప్పుడు నగలు లేకుండా వున్నదీన్ని నాభార్య అంటే గొప్పగా వుండదు. మా యింట్లో నవుకరని చెపుతాను. (బిగ్గరగా) గణికాప్రాణనాథరావుగారికి తాంబూలం తెమ్మనడానికి గౌరవంగా వుంటుందని వట్టిపేర్లు పెట్టి నౌకర్లను పిలిచినాను. ఆయన యిప్పుడు మళ్లీవస్తారు. తాంబూలం కావలెను. అమ్మాయీ! నీవు యిప్పుడు సత్యవతిగారి యింటికి వెళ్లి అమ్మ యిమ్మన్న దని పండుతమలపాకులూ పోకచెక్కలూ తీసుకునిరా.

చిన్న——అమ్మా! అడిగి తీసుకుని రానా?

చారు——తీసుకుని రా.

దంభా--నీకు అమ్మమాటేకాని నామాట పనికిరా దేమి?

చిన్న--వెళుతూవున్నాను.

(అని వెళ్ళుచున్నది.)

దంభా--ఓసీ! ఓసీ! పెద్దమనిషి యింటికివచ్చినప్పుడు యెవరైనా యెగటవుండి కాస్త చెప్పినపని చేస్తూవుంటేనేకాని బాగా వుండదు. నీవు పరుగెత్తుకొనివెళ్ళి లోపల దూరక కాస్తసేపు సిగ్గు విడిచి యెదట వుండి ఆపనీ యీపనీ చేస్తూవుండు.

చారు--నేను వుండలేను. నాకు పెద్దమనిషియెదుట వుండి మాట్లాడడానికి సిగ్గువేస్తుంది సుమండి.

దంభా--ఏమిసిగ్గు? కాస్తసేపు సిగ్గు వదలివెయ్యి. సిగ్గు లేకుండా మొగవాళ్ళు, ఆడవాళ్ళూ కలిసి మాట్లాడుతూవుంటే కుటుంబాలు మంచిస్థితికి వస్తవనీ, మొగవాళ్ళు మోటమాటలు మాటాడకుండా జాగ్రతగా వుంటారనీ సత్యవతి చెప్పుతూవుంటావు గదా? అవన్నీ వట్టిమాటలేనా? ఈవిషయంలో నీకు మీగురువుగారి వుపదేశం యేమీ పనికిరాలేదు.

చారు--మీరు యింతకుముందేకాదూ నేను సత్యవతి సహవాసంచేసి చెడిపోతూవున్నానని నన్ను యెత్తిపొడిచినారు! ఇప్పుడు మళ్ళీ సత్యవతి చెప్పినట్లు చెయ్యమంటారేమి?

దంభా--ఒక్కసత్యవతిమాత్రమే కాకుండా నేనుకూడా చెయ్యమంటూ వున్నాను. గనుక యీవేళకు నేను చెప్పినట్లువిను.

చారు--ఆలాగేసంటాను. భర్తగారి ఆజ్ఞ అయినతరువాత యేమి చెయ్యమన్నా చెయ్యక తప్పుతుందా? యెవరో వస్తూవున్నారు.

దంభా--మరియెవరూ కాదు. గణికాప్రాణనాథరావుగారే. నీవు లోపలికి వెళ్లక యెదట నిలువబడి నేను చెప్పిన పనల్లా చేస్తూవుండు.

[గణికాపోణనాధతావుగారు ప్రవేశించుచున్నారు.]

గణి—ఆచార్లగారూ! మీనవుకర్లు యెవర్నైనా వచ్చినారా? ఇంకావక్కరూ రానేలేదా?

దంభా—వాళ్ళు దొంగముండాకొడుకులు. ఏమిపనిమీదపోతే అదేపోకగా పోతారు. ఇంకావక్కడూ రాలేదు. మీకు యిప్పుడు పుష చారానికి యేమీలోపం రాదులెండి. (గణికాపోణనాధరావుతో రహస్యముగా) ఆసిలుచున్నమనిషి మా ఆడనవుకరు. ధానిచేత ఓరు కావలసినపని చేయించుకోవచ్చును.

గణి—అమ్మా! నీవు యెక్కడికైనా వెళ్ళి చుట్టకాల్చుకోవ డానికి కాస్తనిప్పు తీసుకునిరా. ఈచుట్టలు నాకోసం ఇప్పుడేపత్యేకంగా చుట్టినవికావడంచేత యింకా తడిగావున్నవి. వక్కసారి యెండలో పెట్టిరా. (అని చేతికియ్యబోవుచున్నాడు.)

చారు—(తనలో) ఇతడు వట్టి మోటపశువులాగు వున్నాడు. ఇతనికి చెప్పనచ్చినపనీ చెప్పరానిపనీ తెలియదు. (అని మాటాడక నిలుచున్నది.)

గణి—ఆచార్లగారూ! మీనవుకరుకు చెవుడాయేమిటి? మాట వినుపించుకోదు. మీరు మంచినవుకరునే సంపాదించినారు. వెయ్యివర హాలుయిచ్చి కొన్నారాయేమిటి? ఓలితక్కువని గుడ్డిదాన్ని పెళ్ళాడితే కుండలన్నీ పగలగొట్టిందట!

దంభా—అయిదువందల రూపాయలు కర్చుపెట్టి తెచ్చు కున్నాను. ఓలితక్కువలేదు. ఇదిచెప్పినపనల్లా చేసేదేకాని కొంచెం మెల్లగా చేస్తుంది. (రహస్యముగా) ఆడదికావడంచేత చుట్ట ముట్టుకోవ డానికి సంశయిస్తూవున్నట్టున్నది.

గణి—ఆహాహాహా! మహాదొడ్డనవుకరు! చుట్ట ముట్టుకోవడానికే

యింత సందేహిస్తూవున్న మనిషి భోజనమయినతరువాత మన యెంగిలి విస్తళ్ళయినా తీసివేస్తుందా? అవీ మనమే తీసుకోవలెనా?

చారు—(తనలో) ఇతనికి కులస్త్రీల విషయము యెలాగు మాట్లాడవలెనో తెలియదు. ఇంకొకమాటు ఇలామాట్లాడితే నేనులోపలికివెళ్ళిపోతాను. (బిగ్గరగా) ఈయనకు మంచితీర్థము కావలెనేమో కనుక్కోండి.

గణి—చుట్టతాగినతరువాత పుక్కలించి వెయ్యడానికి కావలెను గాని యీలోపుగా అక్కరలేదు. అయ్యా! ఆచార్లగారూ! మీకు బోగంమేళ అనశ్యంగాకావలెనుగాదూ! మీరుచ్చేకట్నరి ఇందాకా చెప్పిన లక్షవరహాలేనా? యీలోపుగా ఇంకాయేమయినా యెక్కువ చేసినారా? మీయింట్లో మహాలక్ష్మి వూరికే కిందపడి దొర్లుతూవున్నప్పుడు యెంతకర్చుచేసినా మీకు లక్ష్యం లేదు.

దంభా—(తనలో) విటోందరావు నాదగ్గరడబ్బులేదని యితనితో చెప్పినట్లున్నది. (బిగ్గరగా) డబ్బుకేమి? కోటివరహాలు యిచ్చినా నిలువదు. మాటవక్కటి శాశ్వతంగా వుంటుంది.

చారు—మీయింట్లోపెళ్ళికి బోగంమేళంపెట్టను. బోగంమేళం పెట్టడం మావియ్యాలవారికి యిష్టంలేదు.

గణి—ఆచార్లుగారూ! ఈవిడెమాటలుచూస్తే మీకేయీవిడె యజమానురాలుగా కనపడుతూవున్నది గాని మీరు యీవిడెకు యజమానుడుగా వున్నట్టు కనపడదూ. యీవిడే మిమ్మలిని ఆజ్ఞాపిస్తూ వున్నదే..

దంభా—చిన్నప్పటినుంచీ మీయింట్లోనేవుండడాన్నిబట్టి చనువు చేత తోచినదల్లా అంటూవున్నది. మీకు ధీసిమాట్లు పాటిగా పట్టవలసిన పనిలేదు,

[తమలపాకులును పోక చెక్కలును చేతబట్టుకొని చిన్నమ్మ ప్రవేశించుచున్నది.]

చిన్న—అమ్మా! సత్యవతి వెండిపళ్ళెంకూడా కాపలెనేమో అడిగి రమ్మన్నది. వాళ్ళయింట్లో పండాకులు లేవట. పచ్చిఆకులు యిచ్చినది.

చాకు.—యీఆకులుచాలునులే. మనయింట్లో యిత్తడిపళ్ళెంలో పెట్టి తాంబూలంయిస్తాను. బడివేళ అయ్యాతూవున్నది. నీవు వెళ్ళి పాఠాలు చదువుకో.

గణి—(తనలో) యీచిన్నది "అమ్మా" అనిపిలుస్తూవున్నది. ఈవిడ నిజంగా యీచిన్నదానితల్లికాదుకదా? (బిగ్గరగా) అమ్మాయీ! యీపిడె నీకేమయినా చుట్టమా?

చిన్న— ఈమె మాఅమ్మ, ఈయన మానాన్నగారు.

గణి—అమ్మా! నీవు యింటి యజమానురాలవని మొరగక యీయనమాటలు నమ్మి పనికత్తెనుకొని చెప్పరానిపనులు చెప్పినాను. క్షమించవలెను.

చాకు—చెప్పితే యేమీతప్పులేదు. నేను అయ్యనకు నిజంగా పనికత్తెనే.

దంభా—పెట్టెనిండా పెట్టెడునగలూ బట్టలూవున్నా వక్కటీ పెట్టుకోకుండా ఇలాగంటిబీదవేషం వేసినందుకు బుద్ధిచెప్పటట్టు చెయ్యా వలెనని యీయనతో నీవు మాయింటిపనికత్తెవని చెప్పినాను.

చాకు—బట్టలూనగలూ పెట్టినిండా బూజుపడుతూవున్నని—

గణి— చాలును, మీ యింటిగుట్టంతా వినోదరావుగారి యింట్లో నాకు తెలిసింది. దంభాచార్లగారూ! మీయింట్లో పెళ్ళికి మూడేళ్ళాన్ని వూరికేనే పంపుతాను, యీవూళ్ళో పనికిమాలినవాళ్ళ కొందరు బోగంమేళాలువుండకూడదని వాదాలుచేసి మీటింగులుచేస్తూ

వున్నారట మనంకూడా మీటింగులుచేసి వాళ్ళకు గర్వాభిప్రాయమిచ్చి౦ చేతాము.

దంభా—మీరు తలుచుకుంటే తప్పకుండా చెయ్యవచ్చును. ప్రపంచం పుట్టినప్పటినుంచీ వున్న పూర్వాచారం ఇప్పుడు నలుగురు పక్షిగాళ్ళుచేరి పొమ్మ౦టే పోతుందండీ! మనం వాళ్ళమీటింగులకు వెళ్ళి మనలోమనం వేరేమీటింగులు చేసి వాళ్ళప్రయత్నం మొలక లోనే తుంచివెయ్యవలెను.

గణి—ఆపని యెంతసేపు? నిముషంలో చేతాము. నేను వక్క-చుట్ట తాగివచ్చి యీవిషయంలో గట్టిఆలోచన చేస్తాను. మీరుకూడా యీలోపుగా మీపని చక్క-పెట్టుకొనండి.

(అందఱు నిష్క్ర-మించుచున్నారు.)

3 రంగము—వికేంద్రిరావుగారి చావడి.

[వికేంద్రరావుగారును, గణికాప్రాణనాథరావుగారును, మాయాచార్యులుగారును ప్రవేశించుచున్నారు]

నికే—మీరు చెప్పిన ఆలోచన అనుకూలంగా వున్నది. అలాచెయ్యనవలెను.

గణి—అనుకూలంగా వుండని ఆలోచన యెప్పుడూ చెప్పను. వేశ్యాలు లేకపోతే సంగీతం పడిపోతుందని మీరు గట్టిగా వాదించ వలెను.

వికే—మీమనసు వచ్చినంత గట్టిగావాదిస్తాను. సభలో నోవా దరితో యింటిమీన పెంకులు యెగిరిపోవలెను. నేను యింతమంది బొగంవాళ్ళనూ గుడిసేటివాళ్ళనూ ఆసరించడమేకాని వొక్కనాడూ వాళ్ళ పాటమాత్రం విని యెరగనుసుమండీ. మీతోడు నిజం చెప్తున్నాను.

గణి—మీరు చెప్పినదానికి సందేహంకూడానా? సంగీతం వుండవలెనని వాదించడానికి పాట తెలియనూ అక్కరలేదు; పాట విననూ అక్కరలేదు. ఇంతమంది పెద్దమనుష్యులు పెళ్ళిళ్లలో తాంబూలానికి వస్తారుగదా వాళ్లలో నక్కడైనా పాట తెలిసినవాడు వుంటాడండీ? వాళ్లమొఖం బోగంవాళ్ళుమాత్రం యేమి పాటపాడి యేడుస్తారు? వాళ్లకు పాటలకన్న ముఖాలు బాగావుంటవి. అందుచేత చాలామంది వాళ్లముఖాలు చూడడానికే వస్తారు. కొంతమంది వూరికే లాంఛనానికి వచ్చి వాళ్ళు పాడిసంతసేపు తమలో యేమో మాట్లాడుకుంటూ వుంటారు.

వీటే—మీరు చెప్పినది సత్యం. సంగీతం యెగగనివాణ్ని నేను సంగీతంకోసం బోగంమేళం వుండవలెనంటే మనప్రతిపక్షులు ఆక్షేపించరుగదా? వాళ్ళు మహాచెడ్డవాళ్ళు.

గణి—వాళ్లమొఖం వాళ్ళు ఆక్షేపించేది యేమిటి? వాళ్లు నోరుయెత్తేటప్పటికి పదిమందిచేత చప్పట్లు కొట్టించి సభలో అల్లరి చేయించనూ? సంగీతం వచ్చినవాళ్ళు బోగంవాళ్లను ఆదరిస్తే అందులో సారస్యమేలేదు. సంగీతరూపంగా ప్రతిఫలం అపేక్షించకుండా సత్కరిస్తేనే గౌరవం యెక్కువగా వుంటుంది. మనం అనుకున్నపనికి మీరు కూడా మద్దతు చెయ్యవలెను.

వీటే—ఆపనికి నేను తగినంత మద్దతు చేస్తాను. బడిపిల్లలలో కొందరు పోఖరీలు వున్నారు. పెద్దమనుష్యులం మనం చూటునవుండి వాళ్లను కాస్త ప్రోత్సాహం చేస్తే సభలో వాళ్ళు మనం వాగమన్నట్లల్లా వాగుతారు. వాళ్లతో మేళనాయకులను యిద్దరిని యిక్కడకు వచ్చేటట్టు నేను యిదివరకే బందోబస్తు చేసినాను. బోగంవాళ్ళు లేకపోతే సంసార్లందరూ చెడిపోతారని మనం ముఖ్యంగా వాదించవలెను.

గణి--ఆవాదం మానివేస్తామా? బోగంవాళ్లకులం వుద్ధరించ డానికి వెయ్యియుక్తులు పన్నుతాను. మాయాచార్లుగారూ! మీరు మాట్లాడకుండా మౌనం ధరించినా రేమి?

మాయ--నేనూ వూరికే కూరుచోలేదు. మాయోపాయాలే ఆలోచిస్తాను. బోగంమేళాలు పెళ్ళిళ్లకు పెట్టకపోతే పూర్వాచారానికి విరుద్ధమనిన్నీ, శిష్టాచారవిరుద్ధంగా నడుచుకుంటే పాపంవస్తుందనిన్నీ, నేను శ్రుతిస్మృతిప్రమాణాలతో అమోఘమైనవాదం చేస్తాను.

విటే--అందులో వేశ్యలను పిలువకపోతే హిందూమతానికే భంగం వస్తుందనికూడా మరిచిపోకుండా చెప్పవలెను సుమండీ.

గణి--- మీకు శక్తిపూజేకాని హిందూమతమంటే అభిమానం లేదుగదా, ఈవాదం చేస్తారా?

విటే--నమ్మకం యేమిటి? నాకు దేనిలోనూ నమ్మకం లేదు. లేకపోయినా ఆవేళకు అన్నిటిలోనూ నమ్మకం వున్నట్టు నటిస్తాను. అరుగో నేను రమ్మన్న యిద్దరుకుర్రవాళ్లూ వస్తూవున్నారు. వాళ్లను యిక్కడ కూర్చోబెట్టి, మన ప్రతిపక్షులను లేవిడికొట్టించడం విషయ మయి ఆలోచించడానికి లోపలికి వెళ్లి మళ్ళీ వత్తాను.

గణి--అది రహస్యకార్యం గనుక ఆలా చేలోపలికి వెళుదాము.

[గిరిరావును, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

విటే--అబ్బాయీ! రండి. మాయాచార్లుగారికి దొడ్లో యేదో పురిదువేరు కావలెనట. చూపించి యిప్పుడే వస్తాము. మీరు యింతలో మాట్లాడుకుంటూ వుండండి.

గిరి--చిత్తము. వెళ్లిరండి.

(ముగ్గురును వెళ్ళుచున్నారు.)

రాజ--నీవు యిందాకా అడిగింది చెపుతాను విను. వైశాఖ

మాసంలో మూచెల్లెలిపెళ్లికి మానాయనగారు పుష్పాలవాళ్ల మేళం పిలిపించినప్పుడు సమస్తాభరణభూషితురాలయి రాత్రి దీపాలవెలుగున గేదెకంఠంకీరవాణి గజ్జెకట్టుపాటకి దానిమొఖం చూడగానే నా వొళ్లంతా చెమట దిగబోసి బట్టలన్నీ తడిసి ముద్ద అయినవి.

గిరి—మండువేసవికాలంలో నీకు వేరేస్నానం అక్కరలేకుండా వొళ్లంతా చల్లపడి హాయిగా వుండి వుండవచ్చును.

రాజ—చల్లపడాలేదు యేమీ లేదు. నాకు తాపంమాత్రం యెక్కువయింది.

గిరి—వొళ్ళుతడిస్తే తాపం యెలా యెక్కువవుతుంది?

రాజ—యెండవల్ల కలిగిన పుటతాపం చల్లారినా లోపల మొట కరించిన కామాగ్ని రగులుకుని మండడం మొదలుపెట్టడంచేత.

గిరి—ఆకామాగ్నిని తరువాత యెలా చల్లార్చుకొన్నావు?

రాజ—యెలాగా! నిజం చెప్పనా? ప్రాణస్నేహితుడవు గనుక నీతో చెపుతాను. మరి యెవరితోనూ చెప్పకేమి. మన శృంగార పరిబంధాలలో కవులు వర్ణించే అధరసుధారసపానం— చెప్పడానికి నాకు సిగ్గువేస్తూన్నది.

గిరి—అంతసిగ్గుగా వుంటే చెప్పకు. నాకు బోధపడ్డది. కామ జ్వరానికి అధరామృతం వొక్కటే అమోఘమయినదివ్యౌషధం. బహు ధనసాధ్యమయిన అధరసుధ విద్యార్థివి నీకు యెట్లా సాధ్యమయింది? నీపాలిటికి ధన్వంతరిలాగు కీరవాణే అడ్డపడి మీనాన్నగారు దయచేసిన సంభావననుపట్టి ధర్మార్థంగా మందిచ్చి నీప్రాణాలు నిలువబెట్టింది కాబోలుకు! తరువాత వయిద్యకట్టమయినా యెలా తెచ్చుకోగలిగినావు?

రాజ—తరువాత నేను వైద్యం చేయించుకున్న సంగతి నీకు యెలాగు తెలిసింది? ఆఖర్చు మాతండ్రిగారే పెట్టినారు.

గిరి--వైద్యకట్నమంటే కీరవాణికి చెల్లించవలసినకట్నమని నా అభిప్రాయం.

రాజ--సరిసరి! నీఅర్థం తెలిసింది. బుద్ధివుంటే మార్గాలు దేవుడే తోపిస్తాడు. కీరవాణిమేళం చాలించి వెళ్లగానే నేను యింట్లోకి వెళ్ళేటప్పటికి నాకంటియెదుట గదిగూట్లో తెల్లగా పెండిగిన్నె వకటి కన పడ్డది.

గిరి--ఆగిన్నె యెత్తుకొనిపోయి దాని కిచ్చినావా యేమిటి?

రాజ--అబ్బే. నేను యింగ్లీషు చదువుకుంటూ ఆలాగంటి దొంగపని యెప్పుడయినా చేస్తాననుకున్నావా యేమిటి? ఆగిన్నె అక్కడ అట్టేవుంటే యెవరైనా యెత్తుకుపోతారని మెల్లగా తీసి జేబులో నేసి కొని జాగ్రత్తచేసినాను.

గిరి--ఆగిన్నె తరువాత మీవాళ్ళకు యిచ్చివుందువు.

రాజ--యిచ్చేవుందునుగాని యింతలో వకతమాషా జరిగింది. ఆగిన్నె చేతపట్టుకొని నేను తిన్నగా కీరవాణియింటికి వెళుతూవుండగా దోవలో వకబీదవాడు తనవద్దవున్న పదిహేనురూపాయలూ కంసాలి యింటికి తీసికొనిపోయి వాటితో పెండిగిన్నెఅవుతుందా అనిఅడుగుతూ వున్నాడు. కంసాలి యిరువదిరూపాయలకు తక్కువఅయితే కాదంటూ వున్నాడు. ఆమాటవిని బీదవాడు మిగిలినరూపాయలు తెచ్చుకోలేక దుఃఖపడుతూవుంటే, జాలిగుండెకలవాణ్ణి కావడంచేత ఆబీదవాడి దుఃఖం చూచి మనసు కరిగినవాణ్ణయి వాణ్ణి చేస్సైగచేసి నేను దూరంగా పిలుచుకొనిపోయి, అటువంటి బీదవాడికి చేసినదే వుత్తమ దాన మని యెంచి వాడివద్దవున్న పదిహేనురూపాయలూ పుచ్చుకొని యెవరితోనూ చెప్పవద్దనిచెప్పి యిరవైయైదురూపాయలగిన్నె వాడికి దానం చేసినాను.

గిరి — సొమ్మ పుచ్చుకొని గిన్నె యిస్తే, అందులో దానం యేమున్నది?

రాజ — నీవు వట్టిముంచమతివి. నీవు ధర్మసూక్ష్మం యేమీ గ్రహించ లేవు. పది హేనురూపాయలు పుచ్చుకొని యిరవు అయిదు రూపాయలగిన్నె యిస్తే తక్కిన పదిరూపాయలూ దాన మవుతివా. మరి యేమయినా అవుతవా? నేను చేసినదానం యిప్పుడు నీకు బోధ పడ్డదా?

గిరి — ఈ దానంసంగతి తరువాతనయినా మీ వాళ్ళతో చెప్పినావా?

రాజ — ఎందుకు చెపుతాను? ఎప్పుడూ చెప్పలేదు. నీవు యింత చదువు చదువుకున్నా నీకు యింకా గుప్తదానప్రభావము బోధపడనే లేదు. చేసినదానం చెప్పుకుంటే పుణ్యం పోతుందని యీసంగతి యిప్పుడు ప్రాణనిమిత్తమైన నీవక్కడితో తప్ప మరి యెవ్వరితోనూ చెప్పలేదు. నీవుకూడా యీరహస్యము యెవ్వరితోనూ చెప్పకుండా దాస్తే యీపుణ్యంలో సగం నీకుకూడా వస్తుంది.

గిరి — నాక్కరూపాయలైనా మీవాళ్ళకు యిచ్చినావా? అదీ లేదా?

రాజ — యెందుకు యిస్తాను? రూపాయలు మావాళ్ళ చేతులలో పెడితే యింటికోసం పాడుకర్చు చేస్తారని నే నారూపాయలు దేవ తార్పణం చేసినాను.

గిరి — భోగాని కని దేవుడిగుళ్ళో దేవుడికి సమర్పించినావా?

రాజ — ఏమన్నావూ? భోగ — లేదు. రాతిదేవుడికి యిస్తే పుణ్యం లేదని ప్రాణంతో వున్న దేవతకే సమర్పించినాను.

గిరి — మనలో ప్రాణంతో వున్న దేవతికూడా వుంటుందా?

రాజ—నీవు వూరికే హింసువు ననడమేకాని వేదశాస్త్రువాసన నీకు అణుమాత్రమూ లేదు. ఇన్నియేళ్ళు వచ్చినా మనవేశంలో "మాతృదేవోభవ" అని వున్నవాక్యం నీవు వినసేలేదుగదా? వేద విశ్వాసం కలవాణ్ణి గనుక నేను తిన్నగా ఆరూపాయలు కీరవాణీ ఆలయానికి తీసుకొనిపోయి దానితల్లి అయినమాతృదేవతకు సమర్పణ చేసినాను. అందువల్ల నాకు పుణ్యమూ పురుషార్థమూకూడా కలిసి వచ్చింది. "ఏకకీమూ ద్వ్యర్థకరీ" అని చెప్పినపండితు డెంతటి బుద్ధి మంతుడు.

గిరి—నీతాత్పర్యం యిప్పటికినాకు పూర్తిగా బోధపడ్డది. సరి సరి! ఆముడుపు చెల్లించి వృద్ధ దేవతానుగ్రహం పొందడంవల్ల, నీకు కామాగ్నితాపం చల్లారడానికి వరం లభించినది. అయితే ఇలాగంటి పని చెయ్యడం దొంగతనం కాదూ?

రాజ—నీచదువు యేడిసినట్లే వున్నది. యెంతచదువుకొన్నా నీకు వివేకం రాలేదు. తనసొత్తుకు తనకు దొంగతనం యేమిటి? కొడుకును నేనుపుట్టగానే నాతండ్రిఆస్తిలో నాకు సగంభాగంవుంటుంది. నాతండ్రి నేనూ సమానభాగం కలవాళ్ళం కావడంచేత నాతండ్రి ఖర్చు పెడితే యెంతో నేను ఖర్చుపెట్టినా అంతే. నీవు యిప్పుడు దొంగ తనంగా చేసినానంటూ వున్నావుగాని నాకు స్వతంత్రం వచ్చినతరువాత నాఆస్తి అంతా కీరవాణికి దొరతనంగానే దానంచేస్తాను చూడు.

గిరి—మహాదొడ్డపని చేస్తావు. తరువాత యింట్లో మీవాళ్ళు గిన్నె వెతుక్కొని విచారపడ్డారా?

రాజ—విచారం యెందుకుపడుతారు? పెళ్ళిళ్ళలో యేవైనా రెండూ మూడూ వస్తువులు పోవడం ఆచారం గనుక యేదీ పెద్ద వస్తువు పోకుండా దీనితో సరిపోయిందని సంతోషమే పడ్డారు. నా

యీచిన్న కార్యంవల్ల యెంతమందికి సంతోషం కలిగిందోచూచినావా?

గిరి—యెవరికి సంతోషం కలిగినా నీభార్యకుమాత్రం తప్ప కుండా దుఃఖమే కలిగి వుంటుంది. మనక్లాసులో కుర్రవాళ్లు కొందరు నీవు చెప్పినట్టుచెయ్యడం భార్యాద్రోహం అంటారు యేమిటిరా?

రాజ—యేడిసినారులే. వాళ్ళమొఖం! కుర్రవాళ్ళకుయేమి తెలుసును? వాళ్ళు వివేకరాహిత్యంయొక్క దుర్బోధవల్ల మంచీచెడ్డా తెలియక చెడిపోతూవున్నారు. మనం కోరితెచ్చుకొన్న భార్యలవిషయంలో చేస్తే యింకాకొంత భార్యాద్రోహం అనవచ్చునుగాని మనయిష్టం అడగకుండా మనచిన్నతనంలో మనతల్లిదండ్రులు పెళ్ళిచేసినప్పుడు యేమిచేసినా ద్రోహం లేదు. అయినా నాభార్యకు విద్యలేదు; మా యింట్లో దానితో నేను పగలు మాట్లాడడానికయినా వల్లకాదు. అంతేకాకుండా అది మహా అనాకారి.

గిరి—అనాకారివిగాక నీవుమాత్రం మహా చక్కనిచుక్కలాగు వున్నావాయేమిటి? నీవు నాకిచ్చిన నీఫోటోగ్రాఫుచూడుమని నాచేతి హితుడిచేతికిస్తే, అతనుచూచి దానికి వెనుకవైపున తోకకూడా తగిలించినపతంగానికి ఆంజనేయవిగ్రహాంకింద అమ్మనచ్చు నని చెప్పినాడు. ఆయనచెప్పినట్టు నీకుతోకకూడావుంటే శ్రీరాములవారి కాలంలో వుండినట్టయితే నీవు రామసేనాధిపత్యం పొంది వుందువు. నీ కిప్పుడయినా ఆటంకంలేదు. మనవూళ్ళోవుండే మర్కటసేనకంతా యిప్పుడూ నీవే నాయకుడవు. ఓరీ! నీవు స్త్రీలకు విద్య కూడదంటావే మళ్ళీ నీ పెళ్ళాం చేసువుకున్నదికాదని లోపంయెంచుతావేమి?

రాజ—విద్యఅంటే సంగీతవిద్య అని నాయభిప్రాయం. నా పెళ్ళామునకు పాడడము యేమీ చేతకాదు. కీరవాణి యెలా పాడుతుం దనుకున్నావు?

గిరి—నీవు చెప్పనక్కర లేదు. దాసిపాట నేను విన్నాను. ఈ వూళ్ళోకల్లా బాగా పాటపాడేది మామనోరంజనికూతురు ఒక్కత్తె. మీకీరవాణిపాటపాడితే మృగాలుకూడా వినడానికి వస్తవి. మీకీరవాణికి ఇంటిపేరు గేదెకంఠంవారు అనివుండడంకంటె గాడిదకంఠంవారు అనివుంటే యెక్కువసార్థకంగా వుంటుంది. మొన్న పెళ్ళివారింట్లో పాటకారంభించి మీకీరవాణి కంఠంయెత్తేటప్పటికల్లా తమచుట్టము అనుకొని వీధులో గడ్డిమేస్తూవున్న చాకలిగుర్రాలు రెండు తమమేత మానుకొని లోపలికి పరుగెత్తుకొని వచ్చినవి.

రాజ—మీ మనోరంజని కూతురుమాత్రం దాసికంటె బాగా పాడుతుందేమి? చాకలిగుర్రాలుకూడా పాట గ్రహించగలవేమో యెవరెరుగుదురు? "వేత్తి గానరసం ఫణి" అన్నట్టు పాములే పాట గ్రహిస్తూవుంటే చాకిగుర్రాలుమాత్రం యెందుకు గ్రహించలేవు?

గిరి—అని గ్రహించినట్టు మరియెవరూ గ్రహించలేరు. పాట బాగా గ్రహించడానికే దేవుడు వాటికి పెద్దచెవులు పెట్టినాడు. చాకి గుర్రమని వాటిపేరులోనే గుర్రమనేపదం వున్నది. గుర్రానికి గంధర్వ నామము లోకప్రసిద్ధం. గంధర్వశబ్దమునకు పాటపాడువాడన్న అర్థము నీకూ తెలుసును. గాంధర్వమనగా పాట. నీవు వినవలెనంటే కీరవాణి యింటికి వెళ్ళడానికి బదులుగా నాత్రోకూడా చాకిరేవుకాడికి వస్తే డబ్బులేకుండా నిత్యమూ కావలసినంత గాడిదగాంధర్వము నీచెవుల బడేట్టట్టు చేస్తాను.

రాజ—బోగందన్న గౌరవమునా లేకుండా నీవు మాకీరవాణిపై బహుళాక్షేపిస్తూవున్నావు. ఇదినరవాకా బోగంవాళ్ళు వుండడం మంచిదని కేపుమీటింగులో వాదిస్తానని బహుజంభాలు కొడుతూ వున్నావు. తీరాసమయం వచ్చేటప్పటికి సభలో నోరెత్తక దగాచేస్తా

వాయేమిటి? అలాచేస్తే మనకందరికీ బహుచిన్నతనం సుమా. అరుగో విశేంద్రరావుగారు మొదలైన మూర్తిత్రయమూ వస్తూవున్నారు. యీపాటి మనప్రసంగం చాలింతాము.

[విశేంద్రరావుగారుమ, గణికాపాణినాథరావుగారును, మాయాచార్లుగారును మరల ప్రవేశించుచున్నారు.]

విశే—అబ్బాయీ! మీ రనుకుంటూవున్న చివరమాటలు మేము వినాన్ను. మీరు వాళ్ళసభలో జంకులేకుండా మాట్లాడకపోతే చిన్నవాళ్ళకు మీకుమాత్రమేగాక మిమ్మలిని నమ్ముకునివున్న పెద్ద మనుష్యులకు మాకుకూడా చిన్నతనంగా వుంటుంది. మీరు రేపుయెలా మాట్లాడుతారో వాళ్లు తలవంచుకునేటట్టు చెయ్యవలెను.

రాజ—చిత్తము. మీపాటిపు వుంటే మేము యెంతపనైనా చేస్తాము.

గణి—మీకు యేమీ భయంలేదు. మే మంతా మీపక్షమే వుంటాము. మేమే అన్నమాట యేమిటి? వాళ్లవాళ్లు యెవళ్ళో విరోధులు కొందరుతప్ప వూరంతా మనపక్షం. ఏదీ మీరు యెలా మాట్లాడుతారో రేపు చూతాము కాదూ! మీమాటలు విని వాళ్లు తలవంచుకుని యింటికిలేచిపోవలెను. ఇప్పుడు పాడవుతూవున్న హిందూమతాన్ని మీరు వుద్ధరించవలెను. ఒకవేళ మీరు బ్రాహ్మణ్యాన్నే కీరపాణియింట్లో తరవాణిఅన్నమూ తినివచ్చినా మొఖాన్ని విభూదిమాత్రం బాగాపెట్టుకోవలెను. సదాచారం గనుక రాత్రి బోగంవాళ్ల యిళ్లల్లో కొంచెం సురాపానం చేసినా తాళాలుతోనూ మద్దెళ్లతోనూ భక్తిమాత్రం బాగాకనపర్చవలెను. మీకు కర్తవ్యమంతా విశేంద్రరావుగారు భుజ దేశిస్తారు. మనం యిక్కడ మీటుకావడం రహస్యం గనుక యెవరైనా అడిగితే మీరు విశేంద్రరావుగారియింటికి వెళ్లనేలే దనండి. మేము వెళ్లి

వస్తాము. (అని వెళ్ళుచున్నారు.)

వీటే—అబ్బాయీ! మీరు లోపలికిరండి. రేపటియుద్ధానికి మిమ్మలిని తయారు చేస్తాను. (అందఱును నిష్క్రమించుచున్నారు.)

---

౪ రంగము—సభామందిరము.

[గిరిరావును, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

గిరి—ఓరీ! రాజరత్నమూ మనం యిద్దరముమాత్రమే వచ్చినాము. ఇంకాయెవరూ సభికులు రాలేదు.

రాజ—మనం ముందుగా వచ్చినాము. సభికులు రావడానికి కావలసినంతవేళ వున్నది. వీటేంద్రరావుగారు వాసియిచ్చిన వుపన్యాసం బాగా వల్లనవేసినావా? తడుముకోకుండా సభలో మంచిసీళ్ళ ప్రాయంగా యేకరువు పెట్టవలెను.

గిరి—ఆవిషయంలో యేమీ ఫర్వాలేదు. కుర్రవాళ్ళను మనని ముందుకుతోసి తీరా సమయం వచ్చేటప్పటికి వారు తాము యేమీయెరగనట్లు తటస్థంగా వూరుకుంటారేమోనని నాకు భయంగా వున్నది.

రాజ—పెద్దమనుష్యులు వారు యెప్పుడూ మనవిషయంలో మోసంచెయ్యరు. పారిలో వీటేంద్రరావుగారు బహుసమర్థులు. వారు మనవిషయంలో యెంతపనైనా చేస్తారు. మనమీద గిట్టనివాళ్ళు యేమయినా కేజు గీజు తీసుకునివస్తే మాయూచార్లుగారు యెంతపనైనా చేస్తారు. ఆయన కోర్టులో జడ్జీనుండు వాదించడమే కాకుండా పుటకీ నీతివాక్యాలు చెపుతూనే లోపల మాయోపాయాలు పన్ని యెంతవాణ్ణి నిముషంలో పడతోస్తారు.

గిరి—ఆయనవద్ద అంతసామర్థ్యం వున్నదా?

రాజ--నీవు మొరగవుగాని మొత సామర్థ్యమునా వున్నది. మొన్న బుచ్చిరాజుగారి ఫోర్జరీకేజులో సాక్ష్యాలను తరిబీతుచేసి అబద్ధం నిజంగా కనపడేట్టు చేసినారు. ఆయనకే జడ్జిగారుకూడా హాశ్చర్య పడ్డారు.

గిరి--ఆయన సాక్ష్యులను అంతబాగా తరిబీదు చేస్తారేమి?

రాజ--తరిబీదేమిటి? స్కూలుమేష్టరు విద్యార్థులకు బోధించే దానికంటెనూ యెక్కువపని చేస్తారు. ఆయన మొన్న వక్కకేసులో పల్లెటూరునుంచి వచ్చినసాక్షికి బోధచేసేటప్పటికి సాక్ష్యమంతా వాక్ట్లో పంజరంలోవున్న చిలుకకుకూడా వచ్చింది. ఇక మనుష్యులకు రావడంలో హాశ్చర్య మేమివున్నది?

గిరి--గొప్పసామర్థ్యమే?

రాజ--ఇదేమిసామర్థ్యం? ఇంకావున్నది. సాక్ష్యులవిషయంలో తాను యింతపని చేసినా తన యెదటపార్టీతరఫు ప్లీడరు సాక్ష్యులకు బోధ చేస్తూవున్నాడని వదంతి వేసి విశ్వేంద్రరావుగారి సహాయంచేత వూరంతనిని నమ్మించినాడు. వక్కటాకీని పలికించి నిజం అబద్ధంగానూ అబద్ధం నిజంగానూ క్రొత్తసృష్టి చేయించడానికి ఆయనవద్ద కావలసినంత జట్టు వున్నది.

గిరి--గణికాప్రాణనాథరావుగారు యెటువంటివారు?

రాజ--ఆయన వేశ్యాభిమానంచేత పని మానుకొని యింట్లో కూర్చుండి వూరూరూ తిరుగుతూవున్నారు. ఈవిషయంలో ఆయన యెంతపనిఅయినా చేస్తారు. వేశ్యలకు యెంతజనవశ్యంవున్నదో వేశ్యల మూలంగా ఆయనకు అంతజనవశ్యం వున్నది. అగ్నిహోత్రుడికి వాయు దేవుడు సహాయమయినట్లు ఈయనకిప్పుడు విశ్వేంద్రరావుగారుకూడా సహాయులయినారు. ఈమూర్త్రితయమూ చేరడంచేత శత్రువుల కుతం

త్రాలనన్నిటినీ. నిమిషంలో భస్మంచేసి ముగ్గురూ మూడులోకాలు జయిస్తారు. ఈరోజున విశ్వేంద్రరావుగారు మనప్రతిపక్షులను లేవిడీ కొట్టించడానికి యెంతమందిని తమతో తీసుకువస్తారో చూడు.

గిరి—అందరినీ మొగవాళ్ళనేనా? బోగంవాళ్ళనుకూడా తీసుకునివస్తారా?

రాజ—సభలో వేశ్యాపక్షం వాదంచెయ్యడానికి కీరవాణిత్రల్లి గారుకూడా వస్తారు. ఆమెయొక్క వాక్చమత్కారం నీవే చూస్తావు.

గిరి—ఏమిటీ! చెప్పవూ? ఈరోజుసభకు విశ్వాముండతల్లికూడా వస్తుందేమి?

రాజ—నీవు బొత్తిగా పరువూమర్యాదాయెరగకుండా మాట్లాడుతూవున్నావుసుమా జాగ్రత్త! బోగమమ్మవారన్నగౌరవముంటా లేకుండా, ఆజగన్మోహినిని ముండఅంటావా? ఇది యెంతతప్పుమాట! ఇటువంటి మాటఅంటే నేను సహించలేను. నాకు మహాకోపం వస్తూవున్నది. కావలిస్తే నన్ను "గాడిదా" అనిపిలువు నేను పడుతాను. అంతేకాని బోగమమ్మవార్లనుమాత్రం నాయెదుట యెప్పుడూ—

గిరి—ఈపాటి నీచమువు చాలించు. అదుగో వివేకరావుగారూ మొదలయినవారు వస్తూవున్నారు. మెల్లగామాట్లాడు. అదుగో సభకు గుంపులుగుంపులుగా చాలామంది వస్తూవున్నారు.

[వివేకరావుగారును, సత్యప్రియాచార్యులుగారును, సయధ్యానరావుపగతులు గారును, బహుజనులతో ప్రవేశించుచున్నారు.]

వివే—చాలామంది వచ్చినారు. మనమీపాటి పని ఆరంభించ వచ్చును. విశ్వేంద్రరావుగారున్ను గణికాపాణితాధరావుగారున్ను పెద్ద మూకను వెంటబెట్టుకుని వస్తూవున్నారు.

రాజ—ఇంకాకొంచెంసేపు ఆగండి. మాచూచార్యులుగారు

రావలెను.

సత్య—మనం యెవరికోసమూ ఆగనక్కర లేదు. ఇష్టంవున్న వారు సమయానికే వస్తారు.

నయ—ఇవేళ యెప్పుడూ యేమిూటింగుకూ రానివారందరూ వస్తూవున్నారు. యేదో విశేషం వున్నది.

వివే—నయభూషణరావు పంతులుగారూ ! చెవులో మాట. (రహస్యముగా) విజేంద్రరావుగారు మీటింగులో అల్లరి చేయించడానికి యెవ్వరినో మూకను పోగుచేస్తూవున్నారని తోటలో తెలిసి పోలీసు యిన్స్పెక్టరుగారికి వర్తమానం పంపించినాను. ఇద్దరు ముగ్గురు కనిష్టేబిల్సును తీసుకుని త్వరగా దయచెయ్యమని మీరుకూడా యెవరి చేతనైనా కబురు పంపించండి.

నయ—(రహస్యముగా) అలాగా? నా కీసంగతి తెలియనే లేదు. మావాణ్ని పంపిస్తాను.

వివే—మీటింగు ఆరంభింతాము. నేను సత్యప్రియాచార్యులు గారిని అగ్రాసనాసీనులుగా ప్రార్థిస్తూవున్నాను.

నయ—నేను శకండు చేస్తూవున్నాను.

రాజ—మాయూచార్లుగారు ఛైర్మానుగా వుంటే బాగుంటుంది.

నయ—అబ్బాయీ! విద్యార్థివి నీకు యింకా యేమీ తెలియదు వూరుకో. మాయూచార్లుగారు యింకా రాలేదు. ఆయన వస్తారో లేదో తెలియదు.

వినే—తప్పకుండా వస్తారు.

వివే—వస్తే వస్తారు. సత్యప్రియాచార్యులుగారిని అగ్రాసనాసీనులుగా చెయ్యడం అయిపోయింది. పనికారంభింతాము. భోగం వాళ్ళను వివాహాది శుభకార్యములలోనూ, వుత్సవాలలోనూ పిలిచి

గౌరవించడంచేత చాలా అనర్థాలు కలుగుతూ వున్నవి.

రాజ—లేవు లేవు.

వివే—అలాఅయితే వ్యభిచారం మంచిదనా నీ అభిప్రాయము? భోగంవాళ్ళకులవృత్తి వ్యభిచారం—

రాజ—వ్యభిచారం మంచిదని నేనూఅనను. వ్యభిచార మంటే నాకు మిక్కిలికోపమే. 'నేను మొన్నరాత్రి భోజనం చేసి తాంబూలం వేసుకుంటూ కీరవాణియింటికి యిట్టే వెళ్ళేటప్పటికి అక్కడ స్కూలుపిల్లవా డొకడు నాకంట బడ్డాడు. చూడడంతోటే నాకు మహాకోపం వచ్చి తిట్టి కొట్టి నాస్నేహితు డని అయినా చూడకుండా తక్షణం వాణ్ని అక్కడనుంచి తరిమివేసినాను. ఇప్పటిపిల్లవాళ్ళకు బొత్తిగా నీతి లేదు.

నయ—నీతిమంతులు తమ రక్కడకు రాత్రివేళ యెందుకు దయచేసినారు?

రాజ—యెందుకా? యెందుకో మరిచిపోయినాను, జ్ఞాపకం చేసుకుంటాను, ఆలోచించి చెప్తాను. ఎందుకు వెళ్ళినానా? భోగం వాళ్ళయింటికి యెవరయినా బుద్ధిహక్కువ పిల్లవాళ్ళు వెళుతారేమో మందలింతామని వెళ్ళినాను. గిరిరావూ! నేను వెళ్లింది అందుకే కామా ? (రహస్యముగా) మొద్దుబాగు వూరుకుంటా వేమి? అవు నని చెప్పు.

గిరి—(రహస్యముగా) నేను అబద్ధం చెప్పను.

రాజ—(రహస్యముగా) చెపితే తప్పులేదు. నీకు చుట్టలు కొనుక్కోవడానికి డబ్బు యిస్తానులే చెప్పు.

గిరి—(రహస్యముగా) ఏమిచ్చినా చెప్పను.

రాజ—మాజట్టులో కొత్త వాళ్ళను చేర్చుకోకూడదు; చేర్చు

కుంటే చెప్పినమాట వినక సమయానికి రసాభాసం చేస్తాగు. నీకంటె పెద్దవాణ్ణి నేను వూరికే రోజూ లక్షలబద్ధాలు ఆడుతూవుంటే నీవు డబ్బు యిస్తానంటూవున్నాకాని ఎొక్కలబద్ధమూడడానికి సందేహిస్తా వేమి?

వివే—ఓసభాసదులారా ! చూచినారా ? విద్యార్థులుకూడా బోగంవాళ్ళయిళ్ళకు వెళుతూ వున్నారని యీచిన్నవాడు చెపుతూ వున్నాడు. ఇది సంసారులయిళ్ళకు బోగంవాళ్ళను పిలిపించడంవల్ల వచ్చినఅనర్థం. ఈయనర్థం మనం యింతటితోనైనా తొలగించడానికి ప్రయత్నం చెయ్యనలెను. ఆరంభమయినతరువాత వ్యభిచారం తాను ఎొంటిగా వుండదు. దొంగతనమున్ను తాగుబోతుతనమున్ను కూడా దానికి యెప్పుడూ తోడుగా వుంటవి.

రాజ—తాగుబోతుతన మంటే జ్ఞాపకం వచ్చింది. శ్రీరామ నవమినాటిరాత్రి కీరవాణి దేవుడిగుళ్ళో గజ్జెకట్టి ఆటచాలించి యింటికి వెళ్ళబోయేటప్పుడు పోయి, రహస్యంగా గరుడవాహనం చాటున దాచుకున్న సారాబుడ్డి చూచుకునేటప్పటికి ఖట్టిబుడ్డి వున్నది. యెలాగు చూచినాడో కాని మొన్ననేను తయిమివేసిన పిల్లవాడే మెల్లిగా పోయి యెవ్వరూ చూడకుండా దాన్ని యిట్టే తాగివేసినాడు. అక్కడికీ నాకు పెళ్ళికళ్ళు వున్నని గనుక వాడు లేనదంతోకేకసిపెట్టి నేను పెంట పెళ్ళేటప్పటికల్లా నోట్లో పోసుకొని నన్నుచూచి తెల్లపోయినాడు. ఏమిరా యిలాచేసినావంటే యిూబుడ్డి నీ దని యెగ నన్నాడు. మరి వకరిదై తేమాత్రము తాగవచ్చునా అంటే, మంచినీళ్ళనుకుని తాగినా నన్నాడు. అబద్ధాలుకూడా ఆడుతావురా అంటే, నీవు రోజూ కీరవాణి యింట్లో తాగుతూవున్న సంగతి అందరితోనూ చెపుతానని పది మందిలోనూ కేకలువెయ్యడాని కారంభించినాడు, అటువంటి తెంపరి

వాడితో పోట్లాడితే నాకే పరువుతక్కువని నేను నోరుమూసుకొని వూరుకున్నాను. నేను ఔషధానికని రహస్యంగా కేరవాణియింట్లోకాస్త బ్రాందీ పుచ్చుకుంటూవున్నందుకు వాడు యెంతదౌర్జన్యం చెయ్యడానికి సిద్ధమయినాడో చూచినారా ? నేను యిందాకా పొరపాటుగా చెప్పినాను. నేను కేరవాణియింటికి రాత్రిళ్ళు సంగీతం వినడానికి వెళుతూవుంటాను. బోగంవారివృత్తి పడగొట్టడానికి యిలాగు బ్రహ్మాప్రయత్నం చెయ్యడంకంటె మీరు తాగుబోతుతనం మానిపించడానికి కృషి చేస్తే బాగా వుంటుంది.

వెంకయ్య—నీతివృత్తికీ వేసుపురుగులలాగు మీరుయిద్దరూ చేరి మావిద్యార్థుల కందరికీ అపఖ్యాతి తెస్తూవున్నారు. మీవంటి పనికిమాలినవాళ్ళు వూళ్ళో వకరిద్దరు వుంటే యెరగనివాళ్ళు తక్కినవాళ్ళందరూ యిలాగంటినాళ్ళే అనుకుంటారు. సభలలోకిపిచ్చి యిటువంటి వేలాపనలు వేలకుండా మిమ్మల్ని చితకకొడితే—

రాజ—నోరు మూసుకో. యింకా యిలా వాగుతూవున్నావంటే యింటికి వెళ్లేటప్పుడు దోవలో నిన్ను నిజంగానే చితకపొడిపిస్తాను. విద్యార్థులలో విద్యార్థులకే కట్టులేదు. వొకడు యేటికితీస్తే వొకడు కాటికితీస్తూ యతి అంటే ప్రతి అంటాడు. అరుగో మనమాయాచార్లగారు పోలీసుయిన్స్పెక్టరుగారినీ కనిస్టేబిలును వెంటబెట్టుకుని వస్తూవున్నారు. ఈవేళ యేదోవిశేషం జరుగుతుంది.

[మాయాచార్యులుగారును, పోలీసుఇన్స్పెక్టరుగారు మొదలయినవారును ప్రవేశించుచున్నారు]

వీకే—మూసుచార్లుగారూ! దయచెయ్యండి (రహస్యముగా) గిరికావును గోకి) అబ్బాయీ! యిక ఫర్వాలేదు. నీవు చెప్పదలచుకొన్నది నిర్భయముగా చెప్పు!

గిరి — (రహస్యముగా) ఎలాగు ఆరంభించవలెను ? నేను వల్లించుకొన్నదానిమొదలు మరిచి పోయినాను. మొదలు వస్తే నేకాని చివరంటా జ్ఞాపకం రాదు. వక్కమాటు జేబులో కాగితం తీసి చూచుకుందునా ?

విటే—(రహస్యముగా) కాగితం పుచ్చుకొని తియ్యబోకు. నాదస్తూరీ యెవరయినా ఆనవాలుపడితే తంటావస్తుంది. మొదలుపోతే పోయిందిలే. అందులో యేమీ లేదు. వాళ్ళను తిట్టడం ప్రధానమయింది. అక్కడనుంచి ఆరంభించు.

గిరి — (రహస్యముగా) పోలీసుఇనస్పెక్టరును చూస్తే నాకు భయం వేస్తూవున్నది.

విటే —(రహస్యముగా) నీ కేమీభయంలేదు. ఆయనను మనపూర్ణాచార్లగారే వెంటఁబెట్టుకునివచ్చినారు. ఆయన మనకే సహాయంచేస్తాడు. ఆయనకు నిన్ను ఇంట్రడ్యూసు చేస్తాను. బాగామాట్లాడు. (బిగ్గరగా) అయ్యా! ఇనస్పెక్టరుగారు దయచేసినారా? సంతోషంగా వున్నది. ఈచిన్నవాణ్ణి యెరుగుదురా? ఇతడు బహుబుద్ధిమంతుడు. ఈదినం సభలో వుపన్యాసం చెయ్యడానికి వచ్చినాడు.

ఇన్ —ఇతను యెవరో జ్ఞాపకం లేదు. పేరుచెపితే యితనిసీరు పోలీసురిజిష్టరీలో వుంటే చూచి జ్ఞాపకం చేసుకుంటాను.

గిరి—నాపేరు గిరిరావు. నన్ను మీరు మరిచిపోయినారు. నేను మిమ్మలిని మరిచిపోయినాను. మిమ్మల్ని నేను ఎడివరకు యెప్పుడూ దర్శనం చెయ్యలేదు.

ఇన్—అసలు నీవు నన్ను యెప్పుడూ చూడనిదే మరిచిపోవడం యెట్లా తటస్థ మయింది?

గిరి—అవును. నేను మిమ్మలిని వొక్కమాటూ చూడనిదే

మరిచిపోయినాను. యెలాగు మరిచిపోయినానో యిప్పుడు చెప్పలేను. నాలెక్చరయినతరువాత సావకాశంగా జ్ఞాపకం చేసుకోవలెను.

వివే—— ఓసభాసదులారా! యిప్పుడు వూరికే కాలహరణ మవుతూవున్నది. మన మిప్పుడు చెయ్యవలసినపని చిత్తగించండి. వివాహాదులలో వేశ్యలను మనబిళ్లకు రప్పించడంవల్ల కలుగుతూవున్న నష్టము లెన్నోవున్నవి. వాటినన్నిటినీ బుద్ధిమంతులయినమీకు వివరించి చెప్పవలసినపని లేదు. అందులో మనపిల్లవాళ్లు చెడిపోవడానికి మూలంగా వున్న రెండుమూడు నష్టాలు——

గిరి——పిల్లవాళ్లకు యేమీ నష్టాలులేవు. పిల్లవాళ్లు బోగంవాళ్లవల్ల యెంతమాత్రమూ చెడిపోవడంలేదు. పిల్లవాళ్లసంగతి మాపిల్లవాళ్ళకు తెలియవలెనుగాని గడ్డాలూ మీసాలూ నెరసినముసలివాళ్లకు మీకు యేమి తెలుస్తుంది? బోగంవృత్తి మంచిదికాదనేవాళ్లు వట్టి పౌరుషహీనులు; వాళ్లవద్ద మగతనం లేదు; రసికత్వం లేదు; సంగీత సారస్యం లేదు. సంగీతమందు రుచిలేనివాళ్ళు నరహంతకులైన క్రూర కిరాతులని మహాకవి అయిన షేక్స్పియరు చెప్పినాడు. పిల్లవాళ్లకు బోగంవాళ్ళు అవశ్యంగా వుండవలెను. ఇప్పుడు సాధారణంగా పిల్లవాళ్లకు కలుగుతూవుండే వీర్యనష్టవ్యాధులకు బోగంవాళ్ళు అవశ్యంగా కావలెనని డాక్టర్లుకూడా చెపుతూవున్నారు. ఇవంతా నావుపన్యాసంలో వున్నది. ముందుగా నావుపన్యాసం వింటే మరి యెవరివుపన్యాసాలూ అక్కర లేకుండా యీమీటింగుతోనే పనిలేకుండా పోతుంది. కాబట్టి సభవారు ముందుగా నావుపన్యాసం వినవలెను.

నెం——పెద్దలంతా వుంటూవుండగా కుర్రవాళ్లం ముందుగా యీసభపన్యాసా లేమిటి? యీపాటి కుర్రోళ్ళు. అనుభవశాలులైనవారు చెప్పింది విన్నతరువాత మనం చెప్పవలసింది యేమైనా వుంటే చెపుదాము.

సత్య—అబ్బాయీ! యీసభ పిల్లవాళ్ళు మాట్లాడడంకోసం వుద్దేశించినది కాదు. కాస్తసేపు వూరుకోండి. పెద్దలండరూ చెప్పవల సింది చెప్పడ మయినతరువాత అవకాశంవుంటే మీకు తోచింది మీరు చెప్పదురుగాని యిప్పుడు కూర్చోండి.

గిరి—పబ్లీకుమీటింగులో పెద్దలేమిటి? పిన్నలేమిటి? యెవళ్ళు బా'గాచెపితే వాళ్లే పెద్దలు. మాకు పెద్దలతోనూ గిద్దలతోనూ పనిలేదు. ముందుగా మేము చెప్పేదే వినవలెను. మేమిప్పుడు చెప్పకపోతే యీ పెద్దలనేవాళ్ళంతా యేవేవో ముందుగా నోటికి వచ్చినట్లు మతిమాలిన మాటలు కొన్నిచెప్పి కాలం వృధాగా పాడుచేసి తరువాత మేము చెప్పేవి వినడానికి టైములేదంటారు?

సత్య—అబ్బాయీ! కూర్చో. ఇలా మృదువుతప్పినమాటలు మాటాడుతూవుంటే పిల్లవాళ్ళను అసలే మాట్లాడనియ్యను.

గిరి—నేను కూర్చోను. నాకు వొకరి ఆజ్ఞయేమి? నన్ను మాట్లా డనియ్యడానికీ మాట్లాడనియ్యకపోవడానికీ యెవరికి అధికారం వున్నది? నేను యిప్పుడు ముందుగా వుపన్యాసం చేస్తాను. యెవరు అడ్డంవస్తారో చూతాముగాదూ?

సత్య—ఇన స్పెక్టరుగారూ! మీరు కొంచెం యీపిల్లవాళ్ళు అల్లరి చెయ్యకుండా మీటింగు సాగేటట్లు చెయ్యవలెను.

గిరి—మాటలు బాగారానియ్యండి. అల్లరీ గిల్లరీ అంటూవుం టారు. ఈమాటు అటువంటిమాట మళ్ళీ అంటే యేమిచేస్తానో—

ఇన—ఓయీ కనిస్టేబిల్! నీవు యీపిల్లవాణ్ణి చెయ్యిపట్టుకొని అవతలికి పంపించెయ్యి. పిల్లవాళ్ళు యెవరయినా అల్లరిచేసినారంటే మిమ్మలినందరినీ వీధిలోకి గెంటించివేస్తాను జాగ్రత! వూరికే కూర్చుని వినండి.

గిరి—(తనలో) మనవాడనుకున్న పోలీసుయినస్పెక్టరే వాళ్ళల్లో చేరినాడే? నేను నోరుకసి తీరేట్టుగా వుపన్యాసం చెయ్యడానికి వల్లకానట్టువున్నది. అయినాకానీ ప్రయత్నంచేసి చూస్తాను. (బిగ్గరగా) నాజోలికియెవరూ రాకూడదు. న్యాయంచెయ్యడానికి యేర్పడ్డ పోలీసు వాళ్లే యిలా అన్యాయం—

ఇన—చూస్తావేమి? ఆపిల్లవాణ్ణి వీధులోకి యీడ్చుకొనిపో. వీధులోకూడా అల్లరిచేస్తే ప్లేషనుకు తీసుకొనిపోయి నేను వచ్చినదాకా కొట్లో పెట్టు.

కని—చిత్తము. (అని గిరిరావును తీసుకొని పోవుచున్నాడు.)

విటే—పబ్లీకుమీటింగులో స్వేచ్ఛగా మాట్లాడడానికి అందరికీ స్వతంత్రం వుంటుంది. ఇలాచెయ్యడం యెంతమాత్రమూ ధర్మంకాదు. నేనీసంగతి వెంటనే పోలీసు సూపరింటెండెంటుగారికి తెలియచేస్తాను. ఇటువంటి దౌర్జన్యం జరిగిన యీమీటింగులో పెద్దమనిషి అయినవాడు యెవడూ వుండగూడదు. గణికాప్రాణనాథరావుగారూ! రండి. మనము లేచిపోదాము. (అని కోపముతో సభవిడిచి పోవుచున్నాడు)

గణి — (తనలో) నేనుకూడా వెళితే యెదురుచెప్పేవాళ్ళు యెవరూ లేకుండా వాళ్ళదే రామరాజ్యం అవుతుంది. కీరవాణిత్రిల్లి యింకా రాకుండా వున్నది. అది వచ్చి వీళ్ళఫదిమందిలోనూ దులిపి వదిలిపెడితే వీళ్ళమొఖాలకు సిగ్గు వస్తుంది.

(తెరలో) మావంటి ఆడవాళ్ళకూట్లో మన్నుపొయ్యడం ధర్మంకాదు.

నయ—ఎవరిదో స్త్రీకంఠం వినబడుతూ వున్నది. అదుగో సగం నెరిసినతలకు నల్లరంగు వేసుకొని పడుచువేషంతో కీరవాణిత్రిల్లి ముసలిది సభలోకే వస్తూవున్నది.

విటే— స్వాభావికమయిన అందం తగ్గడంతోటే పరులను

మోసం చెయ్యడానికి కృత్రిమవేషం వేసుకోవల్సివస్తుంది, అది ఇక్కడికి యెందుకువస్తూవున్నదో !

[కీరవాణి తల్లి ప్రవేశించుచున్నది.]

కీర—అయ్యాలారా ! మీరు నేటికాలానికి మహాదొడ్డపని తల పెట్టినారు. వినాశకాలానికి విపరీతబుద్ధులు పుడుతవి. ఆడవాళ్ళకూట్లో దుమ్ముపోసి వాళ్ళవుసురు పోసుకుంటే మీకు జయంకాదు. మీ పెద్దలు దేవతాకన్యలని మా కులంవారిని పూజచేసి మాకు మాన్యాలు దయ చేసినారు. తమకూతుళ్ల పెళ్ళిళ్లలో మంగళసూత్రం మేము తాకుతేనే కాని పవిత్రం కాదని భావించేవారు. అట్టిమహాత్ముల కడుపునపుట్టి ప్రపంచంపుట్టినప్పటినుంచీ వున్నటువంటిన్ని మీపాలింటి కులదేవత లనుగా భావించి పూజించవలసినటువంటిన్ని మావంటి గంధర్వకన్యలను మళ్ళా మాన్యాలుయిచ్చి ఆదరించడానికి బదులుగా కూడు పడగొట్టి మూలచ్ఛేదం చెయ్యడానికి దీక్ష పట్టడంవల్ల మీకు మహాప్రతిష్ఠ వస్తూవున్నది.

సత్య—ఈసభ పురుషులకోసం వుద్దేశించబడ్డదిగాని బోగంవాళ్లు వచ్చి దూషించడంకోసంగాదు. అమ్మా! నీవు వెళ్ళిపో.

కీర—వెళ్ళిపోవడానికి నేను పిలువకుండా రాలేదు. పెద్దమనుష్యులు రమ్మంటేనే వచ్చినాను.

గణి—పెద్దమనుష్యులు రమ్మనడం యెందుకు ? నీఅంతట నీవే రావచ్చును. ఆపెద్దమనుష్యులపేర్లు ఇక్కడ చెప్పక నీవు చెప్పనలసిం దేనిటో సభవారితో నిర్భయంగా మనవి చేసుకో.

సత్య—ఇన్‌స్పెక్టరుగారూ! తమరు దాన్ని మాట్లాడకుండా బందోబస్తు చెయ్యవలెను.

రాజ—"దాన్ని" అని అగౌరవంగా మాట్లాడుతూ—

ఇన్—ఓజవాన్! ఆబోగందాన్ని యీపిల్లవాణ్ణికూడా అవ తలికి పంపించివెయ్యి.

మాయా—నేను యిందులో మధ్యస్థుణ్ణి. యిందులో వొక్క న్యాయం వున్నది. మనం బోగంవృత్తికి భంగం కలుగచెయ్యడానికి ప్రయత్నం చేస్తూవున్నామ. గనుక వాళ్లు చెప్పేదికూడా విని మరీతీర్పు చెప్పడం న్యాయంకాని యేకకక్షీవిమర్శమీద తీర్మానం చెయ్యడం న్యాయం కాదు. కాబట్టికీరవాణితల్లి చెప్పేదంతా విడడం నాఅభిమతం. తరువాత సభవారియిష్టం. నేను న్యాయంకోసం చెపుతూ వున్నానుగాని యిందులో నాకు యేమీ సంబంధం లేదు.

సత్య—ఇది న్యాయసభ కాదు. ఇక్కడ ప్లీడరీవాదాలతోనూ సాక్ష్యాలతోనూ కక్షిదార్లవివాదాలతోనూ యేమీపనిలేదు. జార వృత్తిలో వున్నవారిని మనయిళ్లకు పిలవడంవల్ల నష్టాలు కలుగుతూ వున్నవని తెలుసుకుని మనం బాగుపడడానికి తగినసాధనాలు ఆలో చించుకోవడానికి చేరినసభగాని యిది బోగంవాళ్లతో వాదం చెయ్యడానికి యేర్పడ్డసభ కాదు.

కీర—మీరు యింగ్లీషు చదువుకుని పెద్దవుద్యోగాలు సంపాదించి డబ్బుకోసం లోభించి యిటువంటిఅకార్యకరణానికి పూనుకుంటే మీరు అపకీర్తిపాలయి పోతారు. మాకులం నేడు పుట్టినదా? బ్రిహ్మదేవుడు—

సత్య—అయ్యా! ఇనస్పెక్టరుగారూ! మీరు అమునిషిని వూరుకుండేటట్టు చెయ్యవలెను.

ఇన్—నీవు మీయింటికి వెళ్ళిపో. నీవు యిక్కడవుంటే మర్యాద దక్కదు.

కీర—నేను సభచేస్తారు రమ్మంటే వచ్చినానుగాని లేకపోతే

రాకనే పోదును. మీరు యిటువంటిసభలు లక్షచేసినా మాయింటికి వచ్చేమహారాజులు మాయింటికి రాకనూపోరు; వారు మాకు యిచ్చేవి యివ్వకనూ పోరు. ఈయింగ్లీషు చదువుకున్న మహారాజులే కొందరు మీరు యిందరు .యిన్నివుపన్యాసాలు చేస్తూవున్నా తమపెళ్ళాలను వదలిపెట్టి చీకటిపడగానే ముసుగు వేసుకుని మాయిళ్ళల్లో దూరి కానుకలు సమర్పించి మాకు దాసు లయి సేవ చేస్తూ వున్నారు. మీ అరణ్యారోదనం వినేవారు యెవరు? (అని సభనిషిచి పోవుచున్నది.)

గణి—బహుబాగా చెప్పినది. ఆమె లోకమాతగాని వేశ్యమాత కాదు. ఇటువంటిసభలో వుంచే సిగ్గుమాలినవాళ్లు వుంటారు గాని మానవంతుడు వుండడు. (అని దానివెంట బోవుచున్నాడు.)

వివే—వేశ్యాప్రియులు యిద్దరూ లేచిపోయినారు. యిఖ మన సభ సాగవచ్చును.

మాయా—కానియ్యండి. అంతా వాళ్ళపక్షంగానే వుంటే బాగావుండవని పుట్టి రెండుచూట లన్నాసుకాని హృదయంలో నేనూ మీలో చేరినవాణ్ణే సుమండీ. నన్ను మీరు వేరేవిధంగా భావించకూడదు. క్రీడరీవృత్తి బోగవృత్తి వొక్కటేమో స్తరుది. వేశ్య వీటువద్ద యెన్నిటుక్కలు కనపరుస్తుందో క్రీడకూడా డబ్బు లాగ డానికి పార్టీలవద్ద అన్నిటుక్కలు కనపరచవలెను. ఇది వుద్యోగధర్మం.

వివే—మీరు చెప్పినది నిజం. మీరు ముందు క్రీడరవృత్తా రనే మీపెద్దలు మీకు మూయగాచాల్లగాని సార్థకనామం పెట్టినారు. పొద్దుపోతూ వున్నది. మనం నిగూటింగు వేగికం ముగించవలెను. సభలలో వేశ్యలు పాడేపాటలూ, పట్టేఅభినయాలూ, అన్నీ పడుచు వాళ్లను సన్మార్గాన్నుంచి తొలగించడానికి అనుకూలమయినవిగానే

వుంటవి. ఇప్పు డాబోగంది చెప్పిపోయినట్టు ఇంగ్లీషు చదువుకొన్న వాళ్ళుకూడా చీకటి పడ్డతరువాత వేశ్యల ఇంటిబంటు లవుతూవున్నా రన్నప్పుడు, ఆనష్టాలు నేను ప్రత్యేకించి మీకు చెప్పవలసినపనే లేదు. వేశ్యలవల్ల ధననష్టం కలుగుతుంది. వివాహాలలో మేళాలకింద వేలకొద్ది ఖర్చుచేసి కూటిపేదలయినవారిని మీ రెందరిని చూడడం లేదు? తమ పెద్ద లార్జించినభూములుకూడా వేశ్యలకు వ్రాసి ఇచ్చి జోగు లయిన వారిని మీరు యెందరిని చూడడం లేదు? ధననష్టమేకాకుండా వేశ్యా ప్రియులకు దేహముకూడా పాడవుతూవున్నది. సుఖరోగములవల్ల బాధపడుతూవున్నవారిని మీ రెందరినో నిత్యమూ చూస్తూవుంటారు గదా! ఇందువల్ల అనేకులాపడత పాడవుతూ వున్నది. పెద్దలను చూచి వాళ్ళ పిల్లలుకూడా పాడవుతూవున్నారు. అనేకులు నీతిమాలినవా రయి తమ భార్యలకుమాత్రమే కాక యిరుగుపొరుగువారికికూడా ద్రోహము చేసినవా రవుతూవున్నారు. ధనాశ చూపి వేశ్యలను పోషించాలనుకొని చెయ్యడం, వివాహమాడి పతివ్రతలు కాదగినవేశ్యలను జారిణులనుగా చెయ్యడమంటచేత వేశ్యలకుకూడా ద్రోహమే. వేశ్యావృత్తి లేకపోతే సంగీతం చెడిపోతుం దని కొంద రంటారు. వేశ్యావృత్తివల్లనే సంగీతం చెడిపోతూ వున్నది. జారిణులవద్ద సంగీతం వుండడంచేత కులస్త్రీ లది నీచంగా యెంచి సంగీతం నేర్చుకోకపోవడంవల్ల పురుషులు సంగీతాని కాశపడి వేశ్యలయింటికి పోతూ వుండడమూ వేశ్యలు సంగీతాన్ని పురుషులను తమవలలలో పడవేసుకోవడానికి సాధనంగాచేసుకోవడమూ తటస్థ మవుతూవున్నది. సర్వజనాదరణీయమయిన సంగీతం వేశ్యలపాలు కాక యీవేల బడితే సంసారస్త్రీలు దానిని తమపాలు చేసుకొని భర్తను సంతోషపెట్టి గృహములు స్వర్గతుల్యములుగా చెయ్యడానికి దాన్ని వుపయోగిస్తారు. కాబట్టి వివాహాదిశుభకార్యాలలో బోగం

మేళాలను పిలిపించడం మానివేసి పురుషులచేత పాడించడానికి యీ సభవారు రిజల్యూషన్ చెయ్యవలెనని నేను ప్రొపోజు చేస్తూవున్నాను.

నయ--నేను శకండు చేస్తూవున్నాను.

సత్య--అందరూ ఆమోదించినారా?

మాయా--సభవారందరూ ఆమోదించినారు.

సత్య--సభవారందరూ యేకవాక్యంగా ఆమోదించినారని రిజల్యూషన్ ప్రాసినాను. ఇంకా చెయ్యవలసిన పనేమున్నది?

నయ--ఈసభవారిలో యెవ్వరున్ను శుభకార్యాలలో తమ యిళ్ళకు బోగంవాళ్లను పిలవకుండా వుండడానికిన్ని బోగంమేళం వున్న చోటికి తాము వెళ్లకుండా వుండడానికిన్ని మనబాలికలకు విద్యతోపాటు సంగీతంకూడా చెప్పించడానికిన్ని రిజల్యూషను చెయ్యవలెనని నేను ప్రొపోజుచేస్తూ వున్నాను.

ఇన్--నేను శకండు చేస్తూవున్నాను.

సత్య--సభవారందరూ దీని కామోదించినారా?

మాయా--ఆమోదించినారు.

సత్య--ఈనిర్ణయంకూడా యేకవాక్యంగా నిశ్చయింపబడ్డట్టు ప్రాసినాను. ఇప్పటికే చాలాప్రొద్దుపోతూవున్నది గనుక మీరు యేర్పరచుకొన్న యీశ్లాఘ్యవిషయమయి నేను విస్తరించి చెప్పతలుచుకోలేదు. మీరు యీగ్రామములోనేకాకుండా యితరగ్రామములలోకూడా సభలు చేసి వేశ్యావృత్తివల్ల కలిగేనష్టాలు జనులకు బోధపరిచిన్ని, వుపన్యాసాలుచేసిన్ని, చిన్నగ్రంథములు ప్రచురపరచిన్ని, వృత్తాంతపత్రికలకు ప్రాసిన్ని, సాధ్యమయినంతవరకు యీదురాచారమును మాన్పించడానికి ప్రయత్నం చేస్తారని నమ్మితూవున్నాను. ఈశ్వరుడు మీకు మంచిబుద్ధిని పుట్టించి మీకు తోడగుగాక? ఇంతటితో సభ

చాలింతాము.

వివే—అగ్రాసనాసీనులుగారికి సభవారినందనములు సమర్పిస్తూ వున్నాను.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

---

౫. రంగము—దంభాచార్యులవారియిల్లు.

[దంభాచార్యులు, మాయాచార్యులును, చారుమతియు ప్రవేశించుచున్నారు.]

దంభా—ఆడదానిమాట విని గణికాప్రాణనాథరావుగారికి మాట యిచ్చి యెలాతప్పిపోనండీ? మాయాచార్లబావగారూ! ఇందులో మీరు న్యాయం సెలవియ్యండి. పెద్దమనిషి బోగంమేళంకూడా వూరికే పంపిస్తానన్నాడుగదా!

చారు—మేళం వూరికే రావడంతోటే మహావైకుంఠంవచ్చి మనవొళ్ళో పడ్డదాయేమిటి? అన్నయ్యా! చూచినారా? మీబావగారు పెళ్ళికొడుకు లేకపోయినాసరే బోగంమేళంవుంటే చాలునంటారు. జ్ఞానాచార్యులుగారు పెళ్ళిలో బోగంమేళం పెట్టేటట్టయితే తమకుమారుడికి చిన్నమ్మను చేసుకోమని రూఢిగా వర్తమానం పంపించినారు. తీరా కుదిరినసంబంధం చెడిపోతే మళ్ళీమంచిసంబంధం రాదు. జ్ఞానాచార్లగారి కొమారుడు బీ. యే. పరీక్షకు చదువుకుంటూ వున్నాడు. మంచి బుద్ధిమంతుడు. పిల్లదానిరూపమున్ను చదువున్ను బుద్ధిస్థిని చూచి పిల్లవాడు తాను మనఅమ్మాయినేకాని మరియెవరినీ పెళ్ళిచేసుకోనంటే జ్ఞానాచార్లుగారు మన సంబంధానికి వొప్పుకున్నారుగాని మనకు మాన్యాలూ మడులూ వున్నవనీ మనం కట్నాలూ కానుకలూ పెడుతామని ఆశపడి మనసంబంధం కోరలేదు. భాగ్యనంతులు వారికి కట్నాలిచ్చి పిల్లనిస్తామని లక్షమంది తిరుగుతూవున్నారు. గణికాప్రాణనాథరావుగా

కేమో బోగంమేళము పెట్టడానికి వియ్యాలవారు వొప్పుకోకపోయినట్ట యితే, వారిసంబంధం చేసుకోవద్దని యీయనతో చెప్పినారట! ఆయన మాటలు పట్టుకొని మీవెట్టిబావగారు మంచిదని తలచూచినారట! ఈవింతచూచినారా? మీరు కాస్తకూకలు వెయ్యండి.

మాయా— బావగారూ! ఆడవాళ్ళకు అంతయిష్టంగావున్నది గనుక సిద్ధమయినసంబంధం వదులుకోవడం మంచిదికాదు. మేళంలేక పోతే మానేనుగాని మీపిల్లను తప్పకుండా జ్ఞానాచార్లుగారికుమారుడికే యివ్వండి. చిన్నవాడు బహుబుద్ధిమంతుడు.

దంభా— పిల్లవాడేమిబుద్ధిమంతుడు? ఇదంతా పిల్లవాడిమూలంగానే వచ్చింది. పిల్లవాడు పట్టుపట్టకపోతే మేజువాణీకి జ్ఞానాచార్యులుగారు యెలాగయినా వప్పుకొందురు. మొన్నజరిగిన మీటింగులో వివేకరావు గారి దుర్బోధచేత తాను యికమందు బోగంమేళం చూడనని ఆచిన్న వాడేమో కాగితంమీద దస్కత్తుచేసివచ్చినాడట! మనం పెద్దమనుష్యులం యింతమంది వుండగా యెవరిమాటా లక్ష్యంలేకుండా మనకళ్ళముందర పుట్టిన మొన్నటిపిల్లవాడు పంతంపడితే పిల్లవాడికి బుద్ధిచెప్పి అదమాయించక వాడిపంతం నెగ్గించి పెద్దమనిషి గణికాప్రాణనాథరావు గారి మాట బోటుచెయ్యడం మీకుగూడా ధర్మమనే తోచిందా?

మాయా—ధర్మానికేమి! అన్నిధర్మాలే. మనం ముందుకార్యం చెడకుండావుండేసాధనం చూచుకోవలెను. గణికాప్రాణనాథరావుగారి మాటా చెల్లించినట్టును పిల్లవాడిమాటా చెల్లించినట్టును వుండేవుపాయం నేను వొకటి ఆలోచించినాను. ఆలాచేస్తే వుభయులును సమాధానపడుతారు. పెళ్లిలో మేళంమాన్పించి పిల్లవాడిమనసు సమా

ధానపెట్టండి. పెళ్లిఅయినతరువాత వూరికేపంపించిననాళ్ళు ప్రతిరోజూ మీయింట్లో మేళంపెట్టి గణికాప్రాణనాథరావుగారిమనసు సమాధానం పెట్టండి.

చారు--అన్నయ్యచెప్పిన ఆలోచన బాగావున్నది.

దంభా--నాకు బాగానేవున్నట్టున్నది. ఏదో ముక్కుబద్దలయ్యేట్టు మహాచెడ్డపరిమళం వస్తూవున్నది. అరుగో గణికాప్రాణనాథరావుగారును విచేంద్రరావుగారును దయచేస్తూవున్నారు.

మాయా-- వారిరాక తెలియపరచడానికి వారివద్దనుంచి యీ పరిమళం గ్రహించి ముందుగా వాయుదేవుడు దూతగా వచ్చినాడు. ఈసువాసనయొక్క మోస్తరుచూస్తే యిది యెక్కడిదో పశ్చిమఖండంనుంచి సీసాలలో దిగుమతిఅయిన అమూల్యపరిమళంగా తోస్తూవున్నదిగాని మనదేశపుదిగా తోచడం లేదు.

దంభా--వారు వచ్చినారు వూరుకోండి.

[గణికప్రాణనాథరావుగారును, విచేంద్రరావుగారును ప్రవేశించుచున్నారు.]

దంభా---అయ్యా! తమరు ఇంతరాత్రివేళ దయచేసినారేమి? దయచెయ్యండి.

గణి--ఇంతకుముందే తృప్తిగా పెరుమాళ్లసేవ చేసినాము.

మాయా-- (తనలో) పానోత్సవం చేసినారుకాబోలును. ఈ సంగతి మీరు చెప్పనక్కరలేకుండా మీసువాసనే చెపుతూవున్నది. (బిగ్గరగా) పెరుమాళ్ళసేవ చేసినారేమి?

గణి--అహహహా! మీరెవరూ? మంజువాణిగారా! మేము పెరుమాళ్ళసేవచేసినా మంచితెలివితో వున్నాము. ఆహాహాహాహా!

విచే -- గణికాప్రాణనాథరావుగారు పరియాచక మాడుతూవున్నారు. మాత్రో యిన్నిమాటలూచెప్పి తీరా సభలోకిపోయి వాళ్లకు

పట్టం చేరడంచేత మీకు మగతనం లేదని మిమ్మల్ని ఆడదాన్నిగా కట్టి పరిహాసం చేసినారు. గణికాప్రాణనాథరావుగారూ! మాయూచార్ల గారిని మీరు బాగా పరిహాసం చేసినారు.

గణి—— ఆహాహాహాహా! మీ రెవరు? ఓహోహో! క్షీరవాణి తల్లిగారా? మీ మీసాలు చూడడంతోటే ఆనవాలు పట్టినాను.

విటే—— (తనలో) ఈయనకు ముల్లు బయలుదేరినప్పుడు యింత మత్తు లేదు. ఇంతలోనే స్పృహ తప్పిపోయినది. ఒళ్ళు తూలుతూ వున్నది. కళ్ళు తిరుగుతూ వున్నవి. ఈయనను కొంచెంసేపు వూరు కుండేటట్టుచేసి నేను మాట్లాడుతాను. (బిగ్గరగా) మాయూచార్లుగారు యెదటిపార్టీలో చేరడంచేతనూ దంభాచార్లుగారు బోగంమేళం లేకుండా పెళ్ళి చెయ్యడానికి ఒప్పుకోవడంచేతనూ కోపావేశంచేత ఒళ్ళు తెలి యక యీయన యేవేవో అంటూవున్నారు. గణికాప్రాణనాథరావు గారూ! మీరు కొంచెంసేపు శాంతించండి. మీరు చెప్పమన్న మాట లన్నీ నేను వీరితో మనవి చేస్తాను.

గణి——ఆహాహాహాహా! అవును. మాతండ్రిగారు నాకంటె చిన్న వారు. ఎవరు కాదంటారో కాదనండి.

విటే—— గణికాప్రాణనాథరావుగారు బహు బుద్ధిమంతులు. తండ్రిగారు యేళ్ళచేత పెద్దలయినా బుద్ధిచేత తమకంటె చిన్నలేనని యీయన అభిప్రాయము. ఈయనమాటలలో యెంత గూఢార్థ. మున్నదో చిత్తగించినారా? సాధారణులకడుపునకూడా గొప్పవారు పుడుతారు. ఈయనతండ్రిగారికి బోగంవాళ్ళంటే యిష్టం లేదట! అందుచేత యేళ్ళు గడిచినా, ఆయనను చిన్నవాడనే చెప్పవలెను. అయ్యా దంభాచార్లుగారూ! నే నొక్కమాట చెప్తాను వినండి. మాయూచార్లుగారు శత్రుకోటిలో చేరిపోయినారు గనుక శత్రుపక్షం

వారిమాటా ఆడవాళ్ళమాటా మీరు యొంతమాత్రమూ వినక పెళ్లిలో బొగంమేళం తప్పకుండా పెట్టి గణికాప్రాణనాథరావుగారితో చేసిన శపథం నిలుపుకోండి. పెద్దమనుష్యులతో అన్నమాట తిరుగరాదు. ముష్టిసంబంధం యీసంబంధం తప్పిపోతే నేను రేపు యీపాటికి మీ చిన్నదానికి యింతకంటె మంచిసంబంధం తీసుకువస్తాను. సందేహించ కండి. ధైర్యంతెచ్చుకోండి. ధైర్యం పురుషలక్షణం. మీరు ఇందులో మాట తప్పిపోతే గణికాప్రాణనాథరావుగారు మిమ్మల్నిసికూడా ఆడ దానికింద కట్టివేస్తారు.

గణి—ఆహాహాహాహా! శ్రీకృష్ణులవారి చెల్లెలు రంభ వస్తుందట. నేను కైలాసానికి వెళుతాను. (అని వీధిలోకి పరుగెత్తుచున్నాడు.)

విటే—అయ్యా! దంభాచార్లుగారూ! మీరు మాట తప్పి పోవడంచేత యీయనకు యెటువంటిఅవస్థ పట్టినదో చూచినారా? మీరు పెళ్ళిలో బొగంమేళం పెడతామని ఖరారు చేస్తేనేకాని యీయనమనస్సు కుదుట పడదు. ఆడవాళ్ల మాటవిని మీరు మరి వొకలాగుచేస్తే నరహత్యాదోషం వచ్చి మిమ్మల్ని చుట్టుకుంటుంది. గణికాప్రాణనాథరావుగారు మీమీద కోపంవచ్చి మీతో చెప్పకుండా పరుగెత్తుతూవున్నారు. నేనుకూడా యిప్పుడు ఆయనతో వెళ్ళి మెల్లిగా తెల్లవారేలోగా కోపం పోగొట్టి వుదయాన్ని మేము యిద్దరమూ మళ్లీ వస్తాము. (అని వెళ్లుచున్నాడు.)

మాయా—ఈతాగుబోతులు వదలిపోయినారు. తప్పతాగి వొళ్లు తెలియక మనమీదపడి కొట్టకుండా వీధిలోకి పారిపోయినారు. మనం బ్రతికినాము. దంభాచార్లుగారూ! యీ పెద్దమనుష్యులను యెప్పుడూ మనయింటికి రానియ్యకండి. యెంతతాగినా విటేందరిరావుమాత్రము తెలివిగానే వున్నాడు.

దంభా ---అయున యెప్పుడూ తెలిపిగలిగే వుంటాడు. బంధువులు మీరు యింతగా చెపుతూవున్నారు గనుక పెళ్ళిలో బోగంమేళం మానివేస్తాను. గణికాప్రాణనాథరావుగారు వూరికే పంపిస్తే తరువాత గృహప్రవేశానికి మేళంపెట్టి వూళ్ళో పెద్దమనుష్యుల నలుగురినీ తాంబూలానికి పిలుస్తాను. ప్రొద్దుపోతూవున్నది. వెళ్ళి పడుకుందాము.

(అందఱు నిష్క్రమించుచున్నారు)

ఉపసంహారము.

నే నీప్రహసనమునొక్క యుపోద్ఘాతమునందు నాప్రహసన ములు చదివెడివారినందఱిని వానియందలి పాత్రములయందు వర్ణింప బడిన గుణములు కొన్ని తమయం దుండుటనుబట్టి తమ్ముద్దేశించియే యవి వ్రాయఁబడినవని యెంచుకోవలదని ప్రార్థించినను అ, ఇ, ఉ, ఋ, అను దుష్టచతుష్టయ మొకచోటఁజేరి రహస్యముగాఁ దమలోఁ దా మిట్లనుకొనిరని తాను చాటునఁనుండి విన్నదానిని హాస్యప్రియుఁడిట్లు వినిపించుచున్నాఁడు---

అ---వేశ్యాప్రియప్రహసనమంటే యేమిటి?

ఇ---వేశ్యలయం దిష్టము గలవారిని గురించినప్రహసన మని వాళ్ళ అభిప్రాయము.

ఉ---వాళ్ళ అభిప్రాయం యేడిసినట్లేవున్నది. నేను వాళ్లకే తగిలేట్లు దీనికి అర్థం చేస్తాను చూడు. వేశ్యాప్రియప్రహసనమంటే, వేశ్యలకు అప్రియమయిన ప్రహసనమని వొకఅర్థము.

ఋ--- యీఅర్థాలకేమిగాని అందులోవున్న పాత్రలు యెవరిని గురించి వుద్దేశించబడినవో బుద్ధిమంతులు మీరు వూహించండి.

అ__గణికాప్రాణనాథరావని నన్నుద్దేశించి వ్రాసివుంటారు.

ఋ__అందుకు సందేహమేమి? ఆపేరులో మొదటిఅక్షరము లోనే గాపూవ అకారము పెట్టినారు కనిపెట్టినావుకావా?

ఇ__ఆలాగయితే విటేంద్రిరావంటే నేనయివుంటాను. మొదట వి లో ఇకారము వున్నది.

ఋ__బాగాఫూహచేసినావు. వాళ్ళు యెంతతంత్రం చేసినారో కనిపెట్టినావా? అన్నీ మొదటిఅక్షరాలే పెడితే మనం తెలుసుకుపోతా మని, ఉకారము దంభాచార్యులలో నాలుగోఅక్షరంలో పెట్టినారు.

ఉ__ఓహో! యిప్పుడు బోధపడ్డది. దంభాచార్యులంటే నేనని వాళ్లవుద్దేశముసుమా!

అ__నాకు యిప్పుడిప్పుడు వొక్కొక్క సంగతే బోధపడుతూ వున్నది. గణికాప్రాణనాథరావు వేశ్యాభిమానంచేత పని మానుకుని యింట్లోకూర్చున్నాడని వ్రాసినారు. ఈసంగతి యిప్పుడు నేను సంవత్స రమునుంచి సెలవుపుచ్చుకుని యింట్లోవుండడం మనసులో వుంచుకొని వ్రాసినారు.

ఋ__ అదివక్కటే కాదు. మీరు పుట్టి వొప్పుకోరుగాని మీరు యెప్పుడూ బోగంవాళ్లతో ప్రొద్దుపుచ్చుతూవుండడం ముఖ్యంగా మనసులో వుంచుకుని మిమ్మల్ని ఆక్షేపించడానికి__

ఇ__ వూరుకోండి. హాస్యప్రియుడు పొంచుండి మనమాటలు వింటూవున్నాడు. మనం లోపలికిపోయి మాట్లాడుకుందాము రండి.

(నలుగురును లేచిపోవుచున్నారు.)

కౌతుకవర్ధని.

ప్రథమాంకము.

౧. పరిదేశము—నృసింహారావుపంతులవారి గృహము.

[నృసింహారావుపంతులుగారు కూరుచుండియుండగా ఆయన స్నేహితుడగు సుబ్బారావుపంతులుగారు పరివేశించుచున్నారు]

నృసిం—ఏమండీ సుబ్బారావుపంతులుగారూ! మీరు నాలుగు రోజులనుంచి బొత్తిగా దర్శనమియ్యడమే మానివేసినారు.

సుబ్బ—జరూరుగా కాకినాడ వెళ్లవలసిన పనివుండి మీతో మాట్లాడిననాటిసాయంకాలమే పడవమీఁద వెళ్ళి యీరోజు భోజనపు వేళకు మళ్ళీవచ్చినాను. నేను వూళ్ళోవుంటే మీదర్శనం చెయ్యకుండా వుంటానా?

నృసి—వూళ్ళో విశేషాలేమండీ? మీరు వెళ్లిన యీనాలుగు దినములనుంచీ నాకు వూళ్ళోవిశేషా లేమీ తెలియడమే లేదు.

సుబ్బ— మీ రెరుగని నిశేషా లేమున్నవి? భీమరాజుగారు సకుటుంబముగా కాశీయాత్రివెళ్ళినసంగతి మీరు విన్నారుకాదా?

నృసి—ఆయనభార్యా పుట్టింటకాడ యీవుదయాన్న వుండగా నేను చూచినాను. ఆయనమామగారు మనయింటియెదుటనే. కాపురం వున్నారు. వారి అడంగులు నిత్యమూ మాయింటికి వస్తూ పోతూ వుంటారు. ఆయన సకుటుంబముగా యాత్రకు వెళ్లినాగని చెప్పుతూ వున్నారు. మీరు పొరబాటుగా విన్నట్టున్నారు.

సుబ్బ—సరిసరి. మీరిగకా పెరటిదోవనే వున్నారు. భార్య అంటే యేభార్య అనుకొన్నారు? ఆయన దివాణంవారితోకూడా

యాత్రకు విజయంచేసినారు.

నృసి-- దివాణం యేమిటి? నేనీమాట కొత్తగా విన్నాను.

సుబ్బ-- మీరింకా వినలేదా? భీమరాజుగారు కొత్తగా వుంచుకొన్నబోగందాని యింటికి దివాణం అని పేరు పెట్టినారు.

నృసి-- ఆ పేరు బహుచక్కగా కుదిరినది. ఆజ్ఞ పెట్టేవారులేక అంతకంతకు యీవూరు బహుచెడిపోతూవున్నది. ప్రతివాడికీ కట్టుకున్న పెళ్ళాన్ని వగలిపెట్టి ముగడను వుంచుకోవడపు రోగంవొకటి పట్టుకున్నది. వూళ్ళో పెద్దమనుష్యులమని తిరిగే తలగలవారు నలుగురే యీలాగు హద్దుచెడి ప్రవర్తిస్తూవుంటే, యిక చిల్లరచేష్టలు చేసేవారిని అదమాయించేవారు యెవరున్నుంటారు?

సుబ్బ--అదమాయించే దినాలు చాలాకాలంకిందనే వెళ్ళిపోయినవి. పూర్వము నాచిన్నతనంలో యీవూళ్ళో ముండను వుంచుకొన్నవాడు వకడో యిద్దరో వుండేవారు. వుద్యోగస్థులలోనల్లా వకక్కనరసయ్యనాయుడు వుండేవాడు. అతడుసైనా యిప్పటిలాగు యింత హద్దుచెడి తిరిగేవాడుకాడు. వూరు మాటుమణిగినతరువాత రాత్రి పది గంటలకు రహస్యంగా రెండవకంటివా డెరుగకుండా ముసుగువేసికొని బోగందాని యింటికివెళ్ళి వీధిలో యెవ్వరూ లేకుండా చూచి లోపల ప్రవేశించి మళ్ళీ తెల్లవారిగట్ట చీకటివుండగానే యింటికివచ్చి చేరేవాడు. అక్కడికే ఆతణ్ణి అందరూ వేళాకోళం చేసేవారు. బంధువులు యెవ్వరూ అతనియింటికి వెళ్ళేవారుకారు. నలుగురిలోకి వెళ్ళడానికి సిగ్గుబాటుగావుండి అతడు సభలోకి యెక్కడికి తాంబూలానికి సమేతం వెళ్ళేవాడుకాడు.

నృసి--ఈకాలంలో ఆసిగ్గూ, గిగ్గూ అన్నీ వదలిపోయినవి. పూర్వకాలములో బోగందాన్ని వుంచుకోవడంఅంటే తలవంపులుగా

యెంచబడేది; యిప్పుడు బోగందాన్ని వుంచుకోవడమే ప్రతిష్ఠగాను వుంచుకోకపోవడం అప్రతిష్ఠగాను యెంచబడుతూ వున్నది. అప్పుడు బోగంవాళ్ళు తమ్మువుంచుకొనేవాళ్ళులేక తంటాలుపడుతూవుండేవారు. ఇప్పుడు వుంచుకునేవాళ్ళు బోగంవాళ్ళు చాలక తంటాలుపడుతూ వున్నారు. ఆకాలములో బోగంవాళ్ళయింటికి వెళ్లితే యెవరైనా చూచిపోతారేమోనని సిగ్గుచేత రహస్యముగా నెళ్లేవారు; ఈకాలములో అందరూచూస్తే గౌరవమని బాహాటముగా పట్టపగలే పదిమందిని వెంటబెట్టుకొని మరీవేశ్యలయింటికి వెళుతూవున్నారు. కులంవారు యెవ్వరూ కూకలువేసేవారు లేక స్థితిచెడిపోతూవున్నది.

సుబ్బ—ఇప్పు డేమైనాఅంటే కులంవారినే కూకలు వేస్తారు. పెద్దవుద్యోగాలలోవుండేవారు నలుగురూ ముండలను వుంచుకోవడం చేత కులంవారికి వారిని వెళ్లి అనుసరించకుండా జుగప్సు; తెల్లవారి లేస్తే వారిని అనుసరిస్తూ వారియిళ్ళచుట్టూ తిరుగుతూ వారివల్ల జీవనంచేసేవారు వారి నేప్రకారముగా మంచలించ గలుగుదురు? పెద్దమనుష్యులన్నవారే ఆప్రకారంగా వ్యభిచరిస్తూవుండడంచేత పోషికీలు బొత్తిగా హద్దుమీరి విచ్చలవిడిగా తిరుగుతూవున్నారు. ఆపెద్దమనుష్యుల అనుగ్రహం సంపాదించుకోవలెననేవారందరూ బోగంవాళ్ళచేత సిఫారసులు చేయించుకుంటేనేకాని వారి అనుగ్రహం రాదు.

కృష్ణ—ఇంకొకటి చూచినారు కారా? ఇప్పుడీవూళ్ళో బోగంవాళ్లను వుంచుకొన్నవారందరూచేరి వుంచుకోనివాళ్లను నపుంసకులని పరిహాసం చెయ్యడానికి మొదలుపెడుతూ వున్నారు.

సుబ్బ—యీవూళ్ళోవాళ్ళు మాత్రమే కాకుండా యీజిల్లాలో వున్న బోగంవాళ్లందరూ వచ్చి యీవూళ్ళో కాపురంవున్నా చాలక లోకంలోవుండే ఆడవాళ్లందరూ బోగంవాళ్లయితే బాగావుండునని

కొందఱుమహానుభావు లనుకొంటూ వున్నారు.

నృసి—ఇంత గొప్పఆలోచన తోచినవా డెంతబుద్ధిమంతుడో కాని యీలోకిక లోకములోవుండే సముద్రాలలో నీళ్లన్నీ కల్లయితే బాగావుండునని కోరిన తాగుబోతులోకికకంటెనూ బాగా వున్నది.

సుబ్బ—కులంవారు యేమీ చెయ్యకపోతే పోనీ. మతాచార్యులైనా యిలాకాపుచ్చుకొని యీదురాచారం మాన్పడానికి యేమైనా పనిచేస్తే బాగుండును.

నృసి—ఇప్పుడా మతాచార్యులమాట వినేవా రెవరు? ఆమతాచార్యులుకూడా యీపెద్దమనుష్యులను ఆశ్రయిస్తేనేకాని వారికి భిక్షలు జరగవు. ఆమతాచార్యుల కీసంగతి తెలిస్తే వాళ్లనద్ద డబ్బుపుచ్చుకొని పాదపూజ సమర్పించినావుకావని ముండలు లేనివాళ్లకే వెలి వేస్తారు.

సుబ్బ—నాకిప్పుడు వెళ్లవలసినపని వున్నది. ఇంకొకసారి మన స్నేహితుల మండలిమూ ఆలోచించుకొని యిందులో యేమిపని చెయ్యవలెనో విచారింతము.

నృసి—మంచిది. ఈపటి ఆదివారమునాడు మనమందరమూ కూడి తప్పకుండా యేదో వకటి ఆలోచిస్తేనేకాని పట్నంసంగతి బొత్తిగా బాగావున్నది కాదు.

సుబ్బ—తప్పకుండా ఆలాగే చేతాము.

(అని నిష్క్రమించుచున్నారు.)

3. ప్రదేశము—నాగభూషణరావుపంతులుగారి గృహము.

[నాగభూషణరావుగారును, గంగాధరశాస్త్రిలుగారును, రామసోమయాజులుగారును ప్రవేశించు చున్నారు]

నాగ—యీవూళ్ళో సుబ్బారావుపంతులునూ్న నృసింహారావు పంతులునూ్న మహామర్మాగ్రులు. మనము అక్రమపుపనులు చేస్తూ వున్నామని రేపు వూళ్ళో యేమో సభచేయించవలెనని వాళ్లు అందరి యిళ్లచుట్టూ తిరుగుతూ వున్నారట. మీకేమైనా తెలిసిందా?

గంగా—యేడిసినారులెండి. వాళ్ళు సభచేస్తే యీవూళ్ళో వెళ్లే వారు యెవరున్నారు? ఆలాంటి పోఖీలందరూ పదిమంది జట్టువున్నారు. వెళితే వాళ్ళు పదిమందీ నృసింహారావుయింటికి వెళుతారు.

రామ—ఇందువల్ల వాళ్ల వోర్వలేనితనం వక్కటే కనుపడుతుం దిగాని వాళ్లు మన నేమిచెయ్యగలరు? మనము ముండల నుంచుకుంటే వాళ్లసొమ్మేమైనా పడిపోయిందా యేమిటి? యిప్పుడు పెద్దమనిషితనమా బొత్తిగా పోతూవున్నది. ఇటువంటి పోఖిరీవాళ్లను అణిచివెయ్యడానికి మన మేమయినా చేస్తేనేకాని బొత్తిగా బాగావున్నదికాదు. యిదివఱి దాకా మనముచూచి చూడనట్టు వూరుకుంటూవుంటే వాళ్ళాడిన ఆట ల్లా సాగివస్తూవున్నవి.

గంగా—ఆవును. మనము వూరుకోరాదు. నాకు ఇంగ్లీషు రాదు గనక ఆక్టులు యేమీ తెలియవు. రామసోమయాజులుగారూ! మీరు పెద్దకోర్టుప్లీడరులు; మనము వాళ్లను యేమైనా చెయ్యడానికి లాలో ఆధారం వున్నదేమో చూడండి.

రామ—వాళ్లు సభచెయ్యనియ్యండి చెపుతాను. పినాల్‌కోడ్డు కమ్మెంటరీ చూచి డిఫేమేషన్‌కింద ఫిర్యాదు తెత్తాము. నేను ముందుగా తహశ్శీలుదారుగారితో మాట్లాడి బందోబస్తు చేస్తాను.

గంగా—డిఫేమేషన్ అంటే యేమీ తెలిసిందిగాదు. తెనుగున స్పష్టముగా చెప్పండి.

రామ—డిఫేమేషన్ అంటేనా? మీకు తెనుగు కావలెను?

నాగ—కొంచెం ఇంగ్లీషు వచ్చును గనుక నేను చెప్పుతాను వినండి. డిఫేమేషన్ అంటే మానసష్టము.

గంగా—సరిసరి తెలిసింది. మీరు చేసిన ఆలోచన బహుబాగా వున్నది. నాకింతకంటె మరివక ఆలోచన తోస్తూవున్నది. వాళ్ళిద్దరునూ స్కూలులో చదువుకొని బొత్తిగా సంధ్యాస్నానం మానివేసినారు. శంకరాచార్యులవారికి వ్రాసి వాళ్లకు ఆంక్షపత్రిక తెప్పిస్తే—

రామ—అది బాగావుండదు. ఇప్పుడు నేనుమాత్రము సంధ్య వారుస్తూవున్నానా యేమిటి? సంధ్య యేమిటి? నాన్సెన్సు!

గంగా—మీరు ఇంగ్లీషులో యెంతపండితులైనా ఆలాగున అన వద్దు. బ్రాహ్మలము గనుక నిజముగా సంధ్య వార్చకపోయినా పైకి వారుస్తూవున్నామని చెప్పనలెను.

నాగ—మీరు చెప్పినట్టు డిఫేమేటరీచార్జే బాగావున్నది. మొన్న పలినెలనుంచి బత్తు వాళ్ల యింట్లో పెళ్లికి వచ్చిన మేళంలో పద్ధాలుగేళ్ళ కుఱ్ఱది మహాబాగా వున్నదండీ. మనలో యెవరైనా దానికి కన్నెరికము చేస్తే మహాబాగా వుండునండి.

రామ—నేనీసంగతి యిదివరకే ఆలోచించినాను. వాళ్ళు దాన్ని యావజ్జీవం నెలకు ౙం రూపాయలు చొప్పున యిచ్చి వుంచుకుంటానని పత్రం వ్రాసియిస్తే అంగీకరిస్తామని అడుగుతూవున్నారు. ప్రస్తుతములో అయిదువందల రూపాయలమట్టుకు ఖర్చుకుకావలెను. ఒక జమీందారీ వ్యాజ్యంలో వెయ్యిరూపాయిల ఫీజు రావలసివున్నది. ఆసొమ్మువస్తే

వుత్సవం వైభవంగా జరిగించి మన స్నేహితులను పదిమందినీ పిలిచి మీరాయెదుటనే పీటలమీద కూర్చోవలెనని వున్నది.

గంగా--మీరదృష్టవంతులు. మీకోరిక తప్పకుండా ఫలిస్తుంది. జమీందారీవ్యాజ్యంకాకపోతే మీరు వూళ్లో యేపాపుకారువద్దనైనా బదులు తెప్పించగలరు. యేకోమటినిఁదినైనా వక్కబరాతం వ్రాసి నాచేతికివ్వండి. మీచీటీ పట్టుకొనివెళ్ళి వక్కనిమిషంలో సొమ్ముతీసుకొనివచ్చి పీటలమీద కూర్చున్నప్పుడు దానిపైటమీదికి నూరురూపాయల బనారసుఖండువా, మీకు యాభైరూపాయల పట్టురెక్కచాపూనాలుగు ఘుషియలలో తీసికునిరాకపోతే నాపేరు మారుపేరు పెట్టండి. ఛీ! వెధవబ్రతుకు; అటువంటివాళ్ళ బ్రతుకెందుకండీ? బ్రతికివున్న నాలుగురోజులూ యింతఖులాసాగా బ్రతకవలెను.

రామ--చేతిలో సొమ్ము హాజరువుంచే యీసాయంత్రం శుభ ముహూర్తం పెట్టించి యీమధ్యాహ్నమే మీకు విందులు చేయింతును. రెండు నెలలనుంచి ఖాయిలాగావున్నందున కోర్టుకు వెళ్ళకపోవడంచేత పార్టీలఫీజు యేవిధంగా చేతులో పడలేదు. ఖాయిలా కుదుర్చుకోవడముకు యిదివరకే బదులుచేసి అక్కడక్కడ సొమ్మ తెప్పించాను; మరి యాభై రూపాయలు పోయినా మంచివైద్యుడిదగ్గిర అవుషధం పుచ్చుకోవడం మంచిదని యీవైద్యుణ్ణి యేలూరునుంచి పిలిపించాను. యితడు వుండగానే మీవంట యేమైనా జీర్ణించినపాతజాడ్యములున్నవేమో రహితం చేయించుకోండి. దిక్కుమాలిన ముండాకొడుకు వెనుక యీవూళ్లో వకడిదగ్గర మందు పుచ్చుకుంటే వాడు రసం పెట్టినాడు. అందువల్ల కాళ్ళుపడి నిరుటి సంవత్సరము నాలుగుమాసములు మహా శ్రమ పడ్డాను.

గంగా--మీరువుంచినదానివద్ద జాడ్యములు లేవని వాడు కేకి

రామ—దానిదగ్గర లేవండీ మొన్నకొత్తగా మండపేటనుంచి మేళం వస్తే పొరబాటున దానివద్దకి—

గంగా—సరిసరి తెలిసింది. ఆముండ నేను యెరిగినదే. నేను పడపరేళ్ళువచ్చినది మొదలుకొని యిప్పటికి రెండువందల ముండలను చూచినానన్నా నమ్మవలెను. నాకు యెప్పుడూ గొప్పరోగాలుయేమీ తగలలేదుగాని నక్కసారిమాత్రం యేదో చిత్రమయిన కోస్తాజాడ్యం తగిలి చచ్చేవాడినే బ్రతికినాను. నాలుగురోజులు నన్ను కింద పడవేశారు. నాగభూషణరావుగారూ! మీఅన్నగారు యీజాడ్యాలమూలంచేతనే కాదా చచ్చిపోయినాను.

నాగ—అబ్బరూ చస్తారండీ! ఆయువు మూడినవాడు యెవడో వకడు చస్తాడు. మనమంతా యింతకాలమునుంచి యీవ్యాపారములో సంచరిస్తూ వున్నాము. యిప్పుడైనా చచ్చినామా? మనం వక్క విషయములోమాత్రం జాగ్రత్తగా వుండవలెను. చూచినముండతోనల్లా దేవుళ్ళాడడం మాని యెప్పుడూ వక్కదాన్ని వుంచుకుంటూవుంటే నూరేళ్లయినా ఫర్వాలేదు.

గంగా—మీరు వక్కదాన్నే వుంచుకున్నారుగదా మొన్న మీకు కొందుకు రోగం వచ్చినదండీ?

నాగ—బొత్తిగా రోగాలు రావనా? అప్పుడప్పుడు వస్తూ వున్నాకాని ప్రాణభయం యెప్పుడూ వుండదు. నేను వుంచుకున్నది మహాపతివ్రత సుమండీ. నేను వక్కదినం లేకపోతే, అది యింట్లో తిన్నగా అన్నం తినదు. నేను పైగా దర్యాప్తు చేసినాను. నాతో యీ సంగతి దానితల్లే పదిసారులు రహస్యంగా చెప్పింది. దానికి పరపురుషుడంటే గడ్డిపరకతో సమానం రోగములు శరీరతత్వం పడక వాటంతట అవే వుడుతవీ.

గంగ—మీరు వుంచుకొన్నది వక్కత్తే కాదండీ! మనవూళ్లో బోగంవా ళ్ళందరూ అదేమో స్తరువాళ్ళు. మొత్తంమీద బోగంవా ళ్లందరూ పతివ్రతలే. ఇప్పుడు నేను వుంచుకొన్నది పరపురుషుడి మొఖంవంకనైనా చూడదు. మన అదృష్టంచేత మనకు యిటునంటి వాళ్లు తటస్థమయినారేకాని మరినకటి కాదు.

రామ—మీరు వుంచుకున్నవాళ్ళు యింకా వూళ్ళోకి మేళాని కైనా వెళుతారుగాని నేను వుంచుకున్నది యెప్పుడూ వీధిగుమ్మం బొత్తిగా తొక్కిచూడదు. నేను వుంచుకున్న రెండేళ్లనుంచీ దీన్ని యెక్కడా గజ్జెకట్టడం మానిపించివేశాను. నాలుగురూపాయల జీతం యిచ్చి, ప్రత్యేకం వకమనిషినికూడా దానిగుమ్మంకాడ కావలివుంచాను. భోగరాజుగారు వుంచుకొన్నదేమో లోపాయికారీని మరివకణ్ణి వుం చుకొని వాడికి సొమ్మంతా దోచి పెడుతూవుందని వింటాను.

గంగా—ఈసంగతి ఆనిక నిమ్మళంగా మాటాడుకొందాము గాని మనము మొట్టమొదట అనుకొన్నవిషయం బొగాఆలోచించి వేగిరం యేదోవకటి చెయ్యవలెను. లేకపోతే వాళ్ళు మరీ హద్దుమీరి రేపు మీరు కన్నెరికంచేస్తే బొత్తిగానే అల్లరిచేస్తారు.

రామ—చూడండి. వాళ్లరోగం నేను వారంరోజులలోగా కుదు రుస్తాను. మన నిప్పుడు మాటాడినసంగతి యెవరికీ తెలియనియ్యకండి. కోర్టువేళ అయినది యిప్పటికి లేతామా!

(అందఱును వెళ్ళిపోవుచున్నారు.)

---

3. పరిదేశము—ఒక వేశ్యగృహము.

[వేశ్యయగు మంజువాణియు దానితల్లియగు సారసాక్షియుఁ బ్రవేశించుచున్నారు.]

సార—వేశ్య విటునిమీద తనకెంతప్రేమవున్నాకానీ తల్లిమాట

మీరరాదు. ఇది కులధర్మము. నేను నీకు కన్నతల్లినా అంటావేమో! దినమునకు పదిమంది మొగుళ్ళవుటచేతనూ సదా యేవో సుఖజాడ్యములు వంటిని జీర్ణించి వుంటవిగనుకనూ బోగముండాళ్ళకు సంతాన మెలాకలుగుతుంది? నిన్ను నేను పెంచుకున్నట్టే నాతల్లి ననున్నూ పెంచుకున్నది. కాబట్టి మనకులములో తల్లిఅంటే పెంపుడుతల్లి అనే అర్థము. డబ్బుయిస్తాడా? నగలుపెడతాడా? నీవాబ్రాహ్మణుచిన్న వాణ్ని మనయింటికి రానియ్యకు.

మంజు—నీవు యెన్నిఅన్నాకానీ యీవిషయములో మాత్రము నేను నీమాట వినను. ఆరామయ్యగారినింద నాకు వలపువున్నది. లక్ష రూపాయలు పోయినా నేను ఆయనను విడిచిపెట్టను. ఆయనకు యిచ్చే వల్లా నెలకు రెండువరాలేకదా? అంతకు పదిరెట్లసొమ్ము గణించి నీ చేతులో పెట్టడంలేదా?

సార—నీకుచిన్నతనం. యింకాబాగా తెలియదు. నెలకు ముప్ప యిరూపాయలిచ్చి నిన్ను గంగాధరశాస్త్రుల్లు వుంచుకున్నాడుగదా? ఆయన కీసంగతి తెలిస్తే బాగా వుంటుందా? నామాట విని యీబీద బ్రాహ్మడితో రేపటినుంచి మాయింటికి రావద్దనిచెప్పు.

మంజు—యింతకాలమునుంచి రామయ్యగారు మనయింటికి వస్తూవున్నారుగదా? గంగాధరశాస్త్రిగారికి యెప్పుడైనా నామీద యేవిధమయిన అనుమానమయినా కలిగిందా? రామయ్యగారు శాస్త్రుల్లు గారివద్ద తిరుగుతూ నాకూ ఆయనకూ మధ్య రాయబారాలు తెస్తూ వుండడంచేత రామయ్యవంటి నమ్మకమైన మనిషి వుండబట్టే తనకు మర్యాద దక్కుతూవున్నదని ఆయన అందరివద్దా చెప్పుకుని సంతోషిస్తున్నాడు. డబ్బుకోసంతప్ప నిజంచేత శాస్త్రుల్లుగారిమీద నాకు యేమీ ప్రేమలేకపోయినా, ఆయనవద్ద నున్నప్పుడు లేనిమోహం

తెచ్చిపెట్టుకుని, ఆయన లేకపోతే నాకు ప్రపంచమే లేదన్నట్టుగా నటిస్తూ వుండడంచేత కట్టుకొన్న భార్యకైనా యింతప్రేమా యింత విశ్వాసమూ వుండవని నావిషయమున ఆయన అందరితోనూ శ్లాఘించి చెపుతూ వుంటారు.

సార--ఇది అంతా నీప్రయోజకత్వ మనుకొన్నావా యేమి? నీబాగుకోసమై నేనెన్నివిధములుగానైనా తంటాలుపడి యీకాడికి తెచ్చి నాను. ఆయన యెక్కడికైనా వూరికి వెళ్ళిరాగానే నీవారోజులలో మరింత స్వేచ్ఛగాను ఖులాసాగాను వున్నప్పటికీ మీరు వెళ్లిన రెండు రోజులబట్టీ మాచిన్నది మీకోసం బెంగపెట్టుకుని తిన్నగా అన్నంతిన లేదు. మంచిబట్ట కట్టుకోలేదు. మంచంమీదనుంచి లేవలేదని చెప్పే దానిని. నీకోసం వస్తూ పోతూ వుండేవాళ్లచేతకూడా ఆలాగే చెప్పించే దానిని.

మంజు--నీ తరిబీతుచేత నేనున్ను తదనుగుణంగానే మాటలు చెప్పడంచేత యిప్పుడు పూర్తిగా ఆయనకు నామీద నమ్మకము కుదిరి పోయింది. మొట్టమొదట మనయింటికి యెవరైనా నాకోసం వచ్చినప్పుడు కంటబడుతూ వుంటే సందేహపడి కొన్నాళ్లు వకమనిషిని కావలివుంచి నాను. ఆణ్ని వకటి రెండుసార్లు నావద్దకు రానియ్యడంచేత, నావంటి పతివ్రత లోకములో లేదనిన్ని నామీద యేదైనా దోషం యెంచితే పుచ్చి పుటుగులుపడిపోతారనిన్ని వాడు చెప్పేవాడు. ఇప్పుడు అటు వంటి అపనమ్మకం యేమీ లేదుకాని నిజం తెలియక నేను రోగిష్టి దాన్నికదా అని విచారిస్తూవుంటాను. ఆయన వైద్యుణ్ని పిలిపించి అవుష ధం యిప్పించడంతోనే లోపలికివెళ్లి వేసుకుంటానని చెప్పి మాత్ర అవ తల పాఅవేసి వస్తూవుంటాను.

సార--ఈ వుపాయంమాత్రము మొదట నీకెవ్వరునేర్పినారు?

నేను చెప్పి పెట్టబట్టి నెలకు పదిహేనురోజులు తలనొప్పి అని తలకు పట్టువేసుకొని ఆయన వచ్చేటప్పటికి బాధపడుతూ కూర్చుండి ఆయన కొంచెముసేపు విచారపడి యింటికివెళ్ళగానే పట్టు కడిగివేసికొని తెల్ల వారినదాకా సరసునితో ఖులాసాగావుంటావు. నీవు యెంతసంపాదించినా పయిగా నెలకు యాభైరూపాయలకంటె యెక్కువసంపాదించలేను. నాకాలంలో నేను వుంచుకొన్న నాయుడుయిచ్చేదిగాక యేనెలలోనూ నూరురూపాయలకు తక్కువలేకుండా సంపాదించే దానను. శాస్త్రుల్లుగారు కోర్టుకు వెళ్ళినతరువాత నీ వింకా పగలు సంపాదించడం తక్కువ.

మంజు—అదంతా నీవు శాస్త్రుల్లుగారివద్దనే తీస్తావు. నేనెప్పుడూ ఆయన సంతోషంచేత చేతిలో పెట్టితేనేతప్ప వక్కడబ్బు యిమ్మని అడగను. నీవే పిల్లదానికి చీరెలులేవనీ రవికలులేవనీ పొరుగువాళ్ళపెట్టుకొన్న నగలుచూచి ముచ్చటపడుతూవున్నదనీ చెప్పి యిచ్చేజీతంగాక కావలసినంతడబ్బు పయిగా లాగుతావు.

సార—ఇదేమిచూచినావు? నాకాలములో నేను యెన్నివిధాలనో డబ్బులాగేదాన్ని. వీటుకు పోటీలుపెట్టి సంపాదించేదానిని. భాగ్యవంతులబిడ్డలను రహస్యంగా రానిస్తూ, వాళ్ళను మాయింటికి రాకుండాచేస్తానని తలిదండ్రులవద్దకూడా డబ్బు సంపాదించేదానిని. అదుగో యెవ్వరో తలుపుకుస్తుతూ వున్నారు. నేనుచెప్పిన సంగతి బాగా ఆలోచించుకో.

(అని వెళ్ళుచున్నది.)

ద్వితీయాంకము.

---

౧. ప్రదేశము—నృసింహారావుపంతులుగారి కచేరీచావిడి.

[నృసింహారావుపంతులుగారును, సుబ్బారావుపంతులుగారును, బసవరాజుగారును ప్రవేశించుచున్నారు.]

నృసిం—మనము యీరోజున మూడుగంటలకు సభచేస్తామని వ్రాస్తే అందరూ వస్తామని నాలుగుగంటలన్నర అయినా యింకా యెవ్వరూ వచ్చినారు కారు.

సుబ్బా—ఇఖనూ రారు. బోగంవాళ్లను ఆడిస్తామంటే చీట్లు వ్రాయకపోయినా ఘంటకు ముందుగానే వచ్చి కూర్చుని వుందురు.

బస—అలా కాదు. మనవాళ్ళు మూడుగంటలకంటే సాధారణముగా అయిదుఘంటలకు కాని రారు. ఎవరు రాకపోయినా వీరభద్రుడుగారూ మొదలయిన మనస్నేహితులయినా ముఖ్యముగా వస్తారు.

నృసిం—మన హిందువులలో ఇదియొక దురాచారం విస్తారంగా వున్నది. యెప్పుడూ వేళకు రాయ. పగలు రెండుగంటలకంటే అయిదు ఘంటలకు వస్తారు.

సుబ్బా—అట్లా వచ్చినా కొంచెం బాగానే వుంటుంది. వస్తా మని చెప్పి బొత్తిగానే రానివారికంటె నయంకాదా?

బస.—అరుగో వీరభద్రుడుగారు మటికొందరుస్నేహితులతో వస్తూవున్నారు.

[కొంతమందితో వీరభద్రుడుగారు ప్రవేశించుచున్నారు.]

నృసిం—ఏమండీ వీరభద్రుడుగారూ! యిటువంటిసంగతులలో ముఖ్యముగా శ్రద్ధపుచ్చుకొనేవారు మీరే యిలాగున ఆలస్యంగావస్తే

మరి యెవరు వేళకు వస్తారండీ ?

వీర—నేను యింటికాడ తొందరపని వుండగా చూచుకుంటూ వుండి యెవరయినా వచ్చినారేమో చూచి రమ్మని మావాణ్ణి రెండు మాట్లు పంపినాను. వాడు వచ్చి యెవరూ రాలేదన చెప్పడంచేత కొంచెం ఆలస్యంగా వచ్చినాను.

సుబ్బా—ఇప్పుడే అయిదుగంటలు దాటిపోయింది. యికనెవరూ వచ్చేటట్టు కనపడదు. మనం అనుకున్నసంగతి యీవున్నవారితోనే ఆలోచించుదామా ?

వీర—ఆలోచించవచ్చును. వారితరఫున మాటాడడమునకు బుచ్చిరాజుగారు వచ్చినారు. తక్కినవారు రానిలోపం వుండదు.

బుచ్చి—నేనున్నా యేమి జరుగుతుందో తమాషా చూతా మనే వచ్చినాను. మీరు సభలో చెప్పబోయ్యేహాంతే మేమిటో సెల వియ్యండీ.

సుబ్బా—మనవూళ్లో పెద్దలందరూ వుపేక్షచేసి వూరుకోవడం చేత వ్యభిచారం అంతకంతకు యెక్కువవుతూ వున్నది.

బుచ్చి—పెద్దలు వూరుకోక వురిపెట్టుకుంటారా ? డబ్బున్న వాళ్ళు మనసువచ్చినట్లు బోగందాన్ని వుంచుకొని సుఖపడుతారు. వాళ్ళడబ్బు వాళ్ళు పాడుచేసుకుంటూ వున్నారుగాని మిమ్మలి నేమీ తెమ్మనడం లేదు. డబ్బున్నవాళ్ళు ముండలను వుంచుకుంటే మధ్య మీకూ నాకూ యేమి పట్టింది?

వీర—మీరు కొంచెం ఆలోచించి మరీమాట్లాడండి. ఇతరులు పాడవుతూ వుంటే చూస్తూ వూరుకోవడం మానవధర్మం కాదు. వాళ్ళను చూచి—

బుచ్చి—ధర్మం కాకపోతే భూభారం అంతా యిప్పుడు మీరు

తీయస్తారా ?

వీర—తీర్చగలిగినా తీర్చలేకపోయినా సాధ్యమయినంతవఱ్ఱుకు ప్రయత్నం చెయ్యడం మన కందరకూ విధి. వకరుచెడి తిరుగుతూ వున్నప్పుడు మనం చూస్తూ వూరుకుంటే వాళ్ళను చూచి రేపు మన వాళ్ళుకూడా ఆపనిలోనే ప్రవేశించి చెడిపోతారు. అప్పుడు ఆనష్టము కంతకూ మనమే కారణం అవుతాము. మరివకరు చేస్తూ వున్నప్పుడు మీ కిది తప్పితంగా తోచకపోయినా, రేపు మీకుమారుడు పెద్దవాడయి మీకోడలిని వదలిపెట్టి బోగందాన్ని వుంచుకొని యిల్లో డబ్బంతా పాడుచేస్తూవుంటే అది తప్పితగ అవునో కాదో మీకు బాగా తెలుస్తుంది.

బుచ్చి—తెలిసి మనము యేమిచేస్తాము? బోగగవాళ్ళనూ గుడిసేటివాళ్ళనూ అందరినీ మనము వ్యభిచారం మాని పెళ్ళిచేసుకో మంటే నాళ్ళు చేసుకుంటారా? ఆడవాళ్ళనే మానపలేకపోతే మనము మగవాళ్ళను యెక్కడ మాన్పకలుగుతాము?

వీర—నేను చెప్పినదాన్ని తిన్నగా వినండి. మీరుచిన్నతనంలో మగవాళ్ళల్లోనైనా యింతవ్యభిచారం వుండేదా? ఎవడైనా పగడు ఆకాలంలో ముండను వుంచుకుంటే పెద్దమనుష్యులు యెవరూ వాణ్ణి మర్యాద చెయ్యకపోవడంచేత భయంకలిగి తక్కినవాళ్ళందరూ నీతి గలిగి వుండేవారు. యిప్పుడు పెద్దమనుష్యులు చూచి హర్షించి వూరు కోవడంచేతనే కాదా ప్రతివాడుకున్న విచ్చలవిడిగా భార్యలను వదిలిపెట్టి ముండలను వుంచుకుంటూ వున్నారు ?

బుచ్చి—యెవళ్ళో వుంచుకోనక్కర లేకపోతే లోకంలో బోగం వాళ్ళను బ్రహ్మదేవుడు యెందుకు పుట్టించినాడు? అందరూ వ్యభిచారం మానితే వాళ్ళగతి యేమి కావలసివుంటుంది? యిప్పుడు సంసారుతే

బోగంవాళ్ళకంటే యెక్కువగా జాగ్రత్తం చేస్తూవున్నారు. వాళ్ళను యెవరు యేమంటూవున్నారు? ఆడవాళ్ళనే యేమీ చెయ్యలేకుండా వూరుకుంటూ వుండగా మగవాళ్ళను ఆజ్ఞపెడితే సాగుతుందా?

వీర—ఆడవాళ్ళు వ్యభిచరిస్తే మాత్రము చూస్తూ యెవరు వూరుకోమన్నారు? ఆలాటివాళ్ళను నలుగురిని యింట్లోనుంచి వెళ్ళ కొడితే తక్కువవాళ్ళకు బుద్ధి వచ్చి తిన్నగా వుంటారు. మనమతంలో ఆలాగంటిపని లేకపోవడంచేతనే ప్రతీఆడదీ స్వేచ్ఛగా తిరుగుతూ వున్నది.

బుచ్చి—ఆడవాళ్లుచేసేదిరహస్య కృత్యం. అది పబ్లీకులోకి తీసు కొనివస్తే సంసారాలు కూలి పోవా? మన మాలాగంటి పనులలోకి దిగితే పాపం వస్తుంది.

వీర—పోనీ బహిరంగంగా తిరిగే మగవాళ్ళమాట ముందు ఆలోచించరాదా? వకణ్ణి యిద్దరిని కులంలో వెలివేస్తే తక్కువవా ళ్ళందరూ వక్కదెబ్బను బోగంవాళ్ళను విడిచిపెడుతారు.

బుచ్చి—మగవాళ్ళకు తప్పితంలేదు. అయినాకానీ నేను మీతో బా'గా వాదించలేను. వచ్చేవారం మావాళ్ళందరినీ తీసుకొనివస్తాను. అప్పుడు బోగంవాళ్ళను వుంచుకోవడం మంచిదా కాదా అని వాదం చేతాము. ఎవరుగెల్చేదీ మీకప్పుడు విశదం అవుతుంది. ఇప్పుడు చీకటి పడుతూవున్నది. ఈపాటి యింటికివెళ్దుదాము. సభ మర్తబుచెయ్యండి.

(అందఱును వెళ్ళుచున్నారు.)

అ. పరిదేశము—నృసింహారావుపంతులుగారి కచేరీసావడి.

[గతవారము వచ్చినవారును వెంకన్నగారు మొదలయిన మజిలీందఱును ప్రవేశించుచున్నారు.]

నృసి—ఏమండీ బుచ్చిరాజుగారూ! మీరు కొందటిసారి మీ స్నేహితులనందరినీ వాదించడముకు తీసుకునివస్తామన్నారు. యిప్పుడందరూ వచ్చినారా?

బుచ్చి—తొందరపని వుండడంచేత వారెవరూ వచ్చినారుకారు. గంగాధరశాస్త్రులుగారు భోజనం చెయ్యడంతోనే రహస్యస్థలమునకు శయనింప బోయినారట. నాగభూషణరావుగారును రామసోమయాజులు గారును తామిటువంటి సభలకు రామన్నారు. సుబ్బయ్య సోమయాజి గారు వెయ్యిమందిచేరి వెయ్యిసభలు చేసుకొన్నా తమకేమీ లక్ష్యము లేదన్నారు. ఒక వెంకన్నగారు మాత్రము వచ్చినారు.

వెంక—బోగందాన్ని వుంచుకోవడంవల్ల యేమిదోషంవున్నదో ముందుగా నాకు చెప్పండి.

వీర—బోగందాన్ని వుంచుకోవడంవల్ల అన్నిదోషాలే. చిన్న ప్పటినుంచీ తల్లిదండ్రులు పెంచిన దేహం పాడవుతుంది; పెద్దలుచెప్పిన ధర్మములన్నీ నేలపా లవుతవి; పూర్వులు సంపాదించిపెట్టిన ధనమంతా పోతుంది; మంచివారు మనను విడిచిపెట్టగా దుర్మార్గులతో సహవాస మబ్బుతుంది; భార్యలును బిడ్డలును దుఃఖిస్తారు; లోకులు నిందిస్తారు; నరకము మనకోసము యెదురుచూస్తూ వుంటుంది; జూదము, పానము, అసత్యము మొదలయిన దుష్కార్యముల కన్నిటికిని లోబడవలసి వస్తుంది.

వెంక—యివన్నీ విచారిస్తే లోకంలో మనము సుఖపడేది యెట్లాగు?

వీర—వేశ్యాసంభోగంవల్ల మీరేమో సుఖపడుతూవున్నామనీ భ్రమపడుతూవున్నారు. మీరనుభవించేదల్లా దుఃఖమేకాని సుఖమెంత మాత్రమూ కాదు. తాగి కిందపడి దొర్లుతూవున్నప్పుడు సుఖముగానే కనపడినను తరువాత దేహము నొప్పిచేసి దుఃఖమని తెలిసేలాగుననే జారత్వం చేసేవాళ్ళకున్ను పరిస్థితకాలంలో యెల్లావున్నా తరువాత వయసుచెల్లి బాధపడేటప్పుడు మొదట పడ్డదంతా దుఃఖమేనన్న సంగతి తెలుస్తుంది.

వెంక—ఈలోకంలో బ్రతికేదే నాలుగుదినాలు. ముసలితనం వచ్చినదాకా బ్రతుకుతామో లేదో యెవరు చూచినారు? బ్రతికిన నాలుగురోజులూ సుఖమనుభవించి మరీచత్తాము.

వీర—ముందుసంగతి విచారించకుండా అప్పటికి తోచినట్లల్లా చెయ్యడం బుద్ధిమంతుల లక్షణంకాదు. మన మేపని చేసినా ముందు దానివలన సుఖం కలుగుతుందో లేదో చూచుకొని మరీచేస్తూవుండవలెను. అట్లాకాకపోతే అప్పుడు డబ్బునస్తుందనే సంతోషముచేత దొంగతనాలుకూడా చెయ్యవలసి వస్తుంది. రోగముకు మందువేస్తే వెగటుగా వుంటుందని మానుకొని తరువాత బాధపడవలసి వుంటుంది.

వెంక— మీరుచెప్పినవానివలె యిందులో యేమైన వెంటనే సుష్టం కలుగుతుందా?

వీర—ఒక్కదినము సంభోగ మపేక్షించి మన నరసింహాముపడ్డ పాట్లు మీరు చూడలేదా? కాళ్ళుపడి ఆరునెలలు తీసుకుని చివరకు చచ్చినవాడే బ్రతికినాడు.

వెంక—అవును. ఆతడు బ్రతకడం తల్లికడుపున మళ్ళీ పుట్టడం కాని మరివకటికాదు. అతని తల్లికడుపుచల్లగా నూరురూపాయలు పుచ్చుకొన్నా డెర్రిసను కుదరనిరోగమే కుదిర్చినాడు. స్థిరంగా ఒక్క-

దాన్ని వుంచుకొని దానితోవుంటే యీలాటివెప్పుడూ తటస్థించవు.

వీర—వక్కదానితోటే వుండేటట్టయితే వక్కభార్యతోనే వుండక రాదా? వకవేళ మగవాడు ఆలాగవున్నా డబ్బుకోసం అంగహీనుని కైనా తన శరీరాన్ని అమ్మడానికి సిద్ధముగావుండి ఏమాత్రమూ మంత్రములూ పన్ని బహుకుటుంబములను కూలద్రోయుటకు భూమిపూది అవతరించిన బోగంది వకడితోవుంటుందా?

వెంక—మీరు బోగంవాళ్లను మహామోసిస్తూ వున్నారు. ఎవ్వరూ వుంచుకోకపోతే భూమిలో బోగంకులం వుంటుందా?

వీర—వుండకపోతే ఏమినష్టం? వాళ్లు లేకపోతే మనమంతా సుఖపడుతాము. వ్యభిచారమునిమిత్తమై ప్రత్యేకంగా వకజాతి లేకుండా చేయుటకు మనమంతా త్రికరణశుద్ధిగా యీశ్వరుణ్ణి ప్రార్థించవలెను.

వెంక—మీరు మొట్టమొదటికే బోగంవాళ్లకులానికి పేటన పెడుతూవున్నారా? వాళ్లు లేకపోతే సంగీతం యేలాగు వృద్ధిఅవుతుంది? దేవుడివుత్సవాలలోను పెళ్ళిళ్లలోను ఆడేవారు యెవరు వుంటారు?

వీర—కావలిస్తే మగవాళ్లచేత పాడించరాదా? సంగీతం డబ్బుకు పడుచుకునే లంజెపాలు కాబట్టే దానిగౌరవ మంతా పోయింది. వాళ్లు పాడేబూతుకూతలకంటే హరికీర్తనలు పాడిస్తే బాగా వుండదా? దేవుడిదగ్గిర—

వెంక—ఆహాహా! హరికీర్తనలు పాడిస్తే వివాహాలు యిం బాగానే శోభిస్తవి. యిం టాంబూలాలకు పిలిచిన పెద్దమనుష్యులు బాగానే వస్తారు.

వీర—యేమి? ఆఁ నవ్వుతారేమి? పతివ్రతాధర్మము నేర్పవలసిన వివాహములలో లంజలచేత బూతుపాటలు పాడిస్తేనేకాని

భగవద్విషయమైనగానము చేయిస్తే బాగా వుండదా?

వెంక—— మొగవాళ్ళుపాడితే సంగీతము యేమిళోభగానైనా వుంటుంది. వ్యభిచారానికంటే మీ కేమైనా దోషం వుంటుందని చెపితే కొంచెం బాగావుంటుందిగాని పాటపాడించడంకూడా కూడదంటే నలుగురూ నవ్వుతారు. బోగంవాళ్ళు పాడితే యేమిసష్టం వుంటుంది?

వీర—— మీకిప్పు డాలాగే కనపడుతుంది. చిన్నప్పటినుంచీ వుగ్గుపాలతో పురుషులను తమవలలో పడవేసే వుపాయాలే నేర్చుకుని మాయచేసి చేతిడబ్బెల్లను దోచుకొని పరులను పాడుచేయుటకే ప్రతిజ్ఞ పట్టికంకణము కట్టుకొనికూర్చున్న వెలయాండ్రవల్ల నష్టంకలుగుతుందా అని వేరే అడగనక్కరలేదు. నిజానికి వాళ్లు ఆడడంగాదు; తమ అభినయముచేతను దీపముపెలుతురున తళుక్కుమను మోహినీవేషము చేతను లోబఱచుకొని వాళ్లే చూడవచ్చినవారిని తమ చూపులచేత ఆడిస్తారు. అలా చూడవచ్చినప్పుడే మోసపోయి చెడిపోయినవా రెంత మంది వున్నారుకారు? వాళ్లు వ్యభిచరించేనాళ్లు కాకపోతే పాటవల్ల నష్టం లేదు. స్త్రీలే కావలెనంటే సంసారస్త్రీలచేత మంచిగానము చేయించరాదా?

వెంక——వాళ్ళసంగీతం విన్నవాళ్ళంతా చెడిపోతారా?

వీర—— అంతా చెడిపోకపోయినా చాలామంది చెడిపోతారు. సంసారము త్యజించి అడవులలో కందమూలాదులు తినేఋషులు సహితము స్త్రీలవలలోపడి వారికి దాసులయి తిరుగుతూవుండేవారని చెపుతూవుండగా వుప్పూ పులుసూ తిని సంసారములో పడి కొట్టు కుంటూవుండే యితరులకు కామము జయించడానికి శక్యమవుతుందా? ఎంతమంచివాడికైనా మొదట చెడ్డదిగా తోచినప్పటికీ పదిసారులు

పెళ్ళి వరుసగా బోగంవాళ్ళను చూస్తూ వుండడంచేత మనసు చలించి రాగారాగా మంచిదా చెడ్డదా అనే సందేహము కలుగుతుంది. తరువాత మంచిదనే తోస్తుంది. అటుతరువాత సరిగా ఆపనిలో ప్రవేశించుటకే బుద్ధిపుడుతుంది. అప్పుడు మనసు కొంచెం బాధించినా వారు చెయ్యలేదా వీరు చెయ్యలేదా అని దృష్టాంతములు తెచ్చుకొని సమాధానపరుచుకొని మొదట ఆవృత్తిలో ప్రవేశించినతరువాత క్రమ క్రమముగా బోగంవాళ్ళకు యింటిబంటులే అవుతారు. ఏమండీ! లక్ష్మీనరసింహాముగారూ! నేనుచెప్పినది నిజమా? అబద్ధమా?

లక్ష్మీ—మీరు చెప్పిం దంతా వాస్తవము. నాకు చిన్నతన మయినా స్వల్పానుభవంలోనే యిలా చెడిపోయినవాళ్ళను వందమందిని చూచినాను. శుభకార్యములలోకూడా బోగంవాళ్ళచేత పాడించడం ఆడించడం బొత్తిగా మానివెయ్యవలెను. అటువంటిసమయములలో మనబంధువులలోనిస్త్రీలే పాటలు పాడితే యెంతబాగా వుంటుంది? ఈబోగంవాళ్ళను వుంచుకునేవాళ్ళను వకరినిచూచి వకరు పాడవుతూ వున్నారు. మన మందరమూ చేరి వీళ్ళల్లో కొంచరిని కులంలోనుంచి వెలివేస్తే అందరూ బాగుపడుతారు. కుంటివాడికీ గుడ్డివాడికీ వకడబ్బు యివ్వనివాళ్ళుసమేతం యెంతమంది నెలకు యిరవయ్యేసిరూపాయ లిచ్చి బోగంవాళ్ళకు చదువు చెప్పిస్తూవున్నారో చూడండి. యేమండీ బుచ్చిరాజుగారూ! మీరీవేళ మౌనము ధరించినారు!

బుచ్చి—గుడ్డునచ్చి పిల్లను వెక్కిరించినట్లు నేటికాలానికి మీ రందరూ యింగ్లీషు చదువుకొని మమ్మ్ల వేళాకోళం చెయ్యడం ఆరంభించినారు. చెయ్యండి. కలియుగం అయిదువేలసంవత్సరాలు కావచ్చినది. ఇక వర్ణసంకరమౌతుంది. మీవంటిమహానుభావులు భయలుదేరినతరువాత యెన్నివింత లగునాపుడతవి.

వెంక—— దేవతలకాలంనుంచీ వున్నబోగంవాళ్ళనే మీరు వద్దంటూ వున్నారు. యిఖ మీతో మాట్లాడవలసినది లేదు. మీ మనస్సు వచ్చినట్లు చెయ్యండి. చీకటిపడుతూ వున్నది. వెళ్ళిపోదాము లెండి.

(అందఱు వెళ్ళు చున్నారు.)

---

3. పరిచేదము—నృసింహారావుపంతులుగారి సావిడి.

[నృసింహారావుపంతులుగారు కూరుచుండియుండఁగా వెంకన్నగారు పరివేశించుచున్నారు.]

నృసిం—ఏమండీ వెంకన్నగారూ ! యీరోజున వుదయాన్నే యిలాగు దయచేసినారు !

వెంక——కొంచెం కోర్టు వ్యవహారం వుండగా మీకు వకాల్తు నామా యివ్వవలెనని వచ్చినాను.

నృసిం—ఆవ్యవహారస్వభావం యేమిటి ?

వెంక — నాతమ్ముడిభార్యా మనోవర్తికి నామీద వ్యాజ్యం వేసినది. అది నాతమ్ముడిభార్యాకాదని అయినా వాదించవలెను లేదా నాతమ్ముడూ నేనూ విభక్తులముగనుక నేను మనోవర్తి యివ్వవలసిన జరూరు లేదన్నైనా వాదించవలెను.

నృసిం—మీరు మళ్ళీపండితులు ఈలా అబద్ధ మాడవచ్చునటయ్యా ?

వెంక—"వారిజాక్షులందు వైవాహికము లందు। ప్రాణ విత్త మాన భంగమందు। చకితగోకు లాగ్రజన్మరక్షణమందు। బొంకవచ్చు నఘము పొంద దధిప!" అని శాస్త్రం వున్నది. ఇది స్త్రీలవిషయం గనుక అబద్ధం ఆడవచ్చును ; అంతేకాకుండా యిందులో విత్త భంగం

కూడా కలుగుతుందిగనుక అసత్యం పలుకవచ్చును. ఇందులో యింకొక ధర్మసూక్ష్మంకూడా వున్నది. నేను బ్రాహ్మణ్ని. అగ్నిజన్మరక్షణమందు కూడా బొంకవచ్చునని యున్నది. యీమూడువిధములచేతనూ యిం దులో వెయ్యిఅబద్ధా లాడినా పుణ్యం వస్తుందిగాని పాపం యెంతమా త్రమూరాదు.

నృసిం—మీయుఱిదలు యెన్నేళ్ళది ?

వెంక—దానికి పదహారేళ్ళు వుంటవి. మీరు వయస్సు అడిగితే జ్ఞాపకం వచ్చినది. అది వ్యభిచరించి చెడి తిరుగుతూ వున్నదిగనుక మనోవృత్తి యివ్వవలసిన పని లేదని వాదిస్తే బాగావుంటుందా?

నృసిం—వెంకన్నగారూ ! మీరు శాస్త్రం చదువుకొన్నందుకు వూరికేపోయిందికాను. మీరు అసమానములైన వూహలు వూహి స్తావున్నారే.

వెంక—ఇందులో నేను చేసిన వూహయేమున్నది! నేను చెప్పిన దంతా శాస్త్రం. శిష్టులకందరికీ పురాణాలు పరమప్రమాణాలు. యిప్పటివాళ్ళు యింగ్లీషు చదువుకొని నాస్తికులయి పురాణములు ప్రమాణములు కావంటారు. వీళ్ళముఖం చూస్తే పాపం వస్తుంది. నిన్నటిసభలో చూచినారుకారా ?

నృసిం—నిన్నటిమీటింగులో యేమిఅక్రమం జరిగింది ?

వెంక—అంతా అక్రమమే; అక్రమంగాక కొంతక్రమం యేదీ సిందాయేమిటి? మీరు యింగ్లీషు రానివారుగనుక మనవిచేస్తూ వున్నాను. కృతయుగంనాటినుంచీ వస్తూవున్న సదాచారం యిప్పుడు మానవలె నట! పూర్వము పురూరవుడు ఊర్వశిని వుంచుకోలేదూ ! మనుష్యులమాట యేమిటి? దేవతులందరూ రంభ మేనక మొదలయిన వాళ్ళను వుంచుకోలేదా? యజ్ఞాలు మొదలయిన పుణ్యకార్యాలు

చేసి స్వర్గానికి వెళ్ళినా అక్కడా రంభా మొదలయిన దేవవేశ్యలతో సంభోగమేనా మరియేమైనా వున్నదా? యేమీ తెలియక నాలుగు యెంగిలి యింగిలీషుముక్కలు చదువుకోవడంతోటే వూర్వాచారాన్ని పెద్దలనీ దూషిస్తారు.

నృసిం—పూర్వాచారం మంచిదో కాదో ఆలోచించక్కర లేదండీ!

వెంక—మీకుకూడా యిటువంటిబుద్ధే పుట్టిందండీ! ఇది కలి యుగం యెవ్వరేమిచేస్తారు? యిక శాస్త్రాలుచేసిన పూర్వపువాళ్ళంతా వట్టిబుద్ధిహీనులు! అనాదిగా జరుగుతూవున్న ఆచారాన్ని మానడానికి నాలుగు వచ్చీరాని యింగిలీషుముక్కలు చదువుకోడంతోటే మనము మహాబుద్ధిమంతులము! "యథారాజా తథాప్రజా" అన్నాడండీ. గోవుమాంసం తినేవారు ప్రభుత్వానికి వచ్చినతరువాత యిక యెలా అవుతుందండీ? ఇప్పుడు బొత్తిగా సిడులుపోయినవికదాండీ? సహగమనం చెయ్యనియ్యరు గదాండీ? అమ్మవారని ఆలోచించకుండా గోదావరిని కట్టివేసినారుగదాండి? దేవతులనే యిలా చేసే వాళ్ళకు మనుష్యులంటే లక్ష్యమే లేదు. బ్రాహ్మణుల మాన్యాలకు పన్నులు కట్టినారు. "కలౌ పంచ సహస్రాణి జాయతే వర్ణసంకరః" అన్నమాట నిజంఅయినది. అందరికంటే బ్రాహ్మణులయెక్కువ వేమంటారు; గుళ్ళో దేవుళ్ళను రాళ్ళంటారు; దయ్యాలు లేవంటారు. పురాణాలలో చెప్పిన గల్లుసముద్రాలూ నేతిసముద్రాలూ అబద్ధమంటారు; సూర్యుడూ చందుడూ అచేతనములంటారు; వారికి పెళ్ళాలూ బిడ్డలూ వుండరంటారు; నదులలో స్నానంచేస్తే పాపాలు పోవంటారు; ఇక చేయిటి? యింగ్లీషుచదువుకున్నవాళ్ళకు సర్వం నాస్తి. అటువంటి నాస్తికులను పట్టుకొని శిక్షించేవారు లేరు. పూర్వంవలె రాతిగానుగులలో పెట్టి

ఆడించేరాజులుంటే వీళ్ళు యిట్లా అంటారండీ?

నృసిం—పురాణాలలో చెప్పిన సంగతులన్నీ నిజమేనండీ?

వెంక—నిజంగాకే యీమంత్రాలూ తంత్రాలూ అబద్ధమనుకున్నారా యేమిటి? అన్నీ నిజం. ఇంగ్లీషువారు వూరికే ధనం పాడు చేస్తూవున్నారుగాని యీకాలవలు తవ్వించడం మానివేసి బ్రాహ్మణులకు డబ్బిచ్చి వరుణమంత్రాలు చదివించి సహస్రఘటాభిషేకాలు చేయించమనండి. వర్షాలు యెలాకురిసి పంటలు పండుతవో చూతాము. ఈ సేనలన్నిటినీ తీసివేసి బ్రాహ్మలచేత మహామంత్రాలు జపంచేయిస్తే శత్రువులంతా వక్కదెబ్బలో నశించిపోరండీ? భూకంపాలు మొదలయినవి వస్తే తక్కినపనులన్నీ మానివేసి గ్రహశాంతులు చెయ్యవలెను.

నృసిం— గవర్నమెంటువారు వట్టి పిచ్చివాళ్లుగాని నీవంటి పెద్దలఆలోచన పుచ్చుకోవలసినది.

వెంక— నా ఆలోచన పుచ్చుకుంటేనా, యింతమంది దేవుళ్ళు వుండరనే యీనాస్తికు లందరినీ వక్కసారి జయిలులో పడవేయిస్తాను. ఇప్పటివాళ్లకు గురుశుశ్రూష బొత్తిగా లేదు. నేను మాగురువుగారి వద్ద చదువుకొనేటప్పుడు దొడ్డి తవ్వి సంవత్సరానికి కావలసిన కూరలు పండించేవాడిని; యిద్దరు కూలివాళ్లు మొయ్యలేని మూటలను పొలంలో నుంచి పట్టుకొనివచ్చి యింటికాడ వప్పగించేవాణ్ణి; మట్టిఆకులు కోసి తెచ్చి విస్తళ్ళు కుట్టేవాణ్ణి; యింట్లో పనులన్నీ నేనే చేసేవాణ్ణి; ఆయన అనుగ్రహం వచ్చి తీఱుబడిగా వున్నప్పుడు రెండుముక్కలు చెప్పేవాడు; వొకొక్కక్కనాడు అదీ లేదు. అలా కష్టపడి యిరవయి యేళ్ళు వ్యాకరణం చదువుకొన్నాను. ఆలాకష్టపడడంచేత మావిద్యలు ఫలిస్తవిగాని యిప్పటివాళ్ళచదువులు ఫలిస్తవండీ? యింగ్లీషు చదువు

కొన్నవాళ్ళ వట్టి దురాచారులు; నదిలో బురదనీళ్ళని నూతిలోనీళ్ళల్లో మునుగుతారు; స్నానము చెయ్యడం వంటిశుభ్రంకోసమట ! వట్టి దుర్వినీతులు గుడ్డివాళ్ళకూ కుంటివాళ్ళకూ దానంచేస్తే పుణ్యంవస్తుం దట! ప్రాచీనసదాచారములను దూషిస్తారు; యీ బోగంవాళ్ళను వుంచుకోవడం యెంతకాలంనుంచి వస్తూవున్న సదాచారము ? మీరు కూడా యిందులో ప్రవేశించడం బాగావున్నది కాదు. వీరభద్రుడు మొదలయినవారు వట్టి దుర్వాదములో దిగుతారు; తదనుగుణంగా శ్రోతుల కపార్థాలు చేస్తారు; స్మృతులకు తమ యిష్టానుసారముగా అర్థం చేస్తారు; శ్రుతిస్మృతులలో వ్యభిచారం కూడదంటే దానికి బోగంవాళ్ళను కూడా వుంచుకోరాదని అర్థమట! అట్టివారు కలి పురుషులు. యీనవనాగరికుల మాటలు నమ్మి మోసపోయి యీ సదాచారములను మీరు మాన్పపూనుకుంటే నిందలపాలయిపోతారు. ఇలా చెడిపోతారంటే వాళ్ళు మావంటిసాధువులను నిందిస్తారు. మీ రిందులో ప్రవేశించవద్దు. మీశ్రేయస్సు కోరి చెప్పినాను. బాగా ఆలోచించుకోండి. నావ్యాజ్యంలో వకాల్తునామామాట యేమి చేసినారు?

నృసిం—నేను మీవ్యాజ్యంలో వకాల్తునామా పుచ్చుకోను. మరివకప్లీడరు కియ్యండి. నేను అబద్ధపువాదం చెయ్యను.

వెంక—యీమాట మొదటనే చెపితే యిదివరకే వెళ్ళిపోదునే. బ్రాహ్మణకార్యం ఫీజు లేకుండా చేస్తారేమోనని ఆశపడి వచ్చినాను.

(అని కోపముతో వెళ్ళిపోవుచున్నాడు.)

తృతీయాంకము.

---

౧. ప్రవేశము—నృసింహారావుపంతులుగారి సావిడి.

[నృసింహారావుపంతులుగారును, సుబ్బారావుపంతులుగారును ప్రవేశించుచున్నారు.]

నృసిం—సుబ్బారావుగారూ! ఒకచిత్రము జరిగింది విన్నారా?

సుబ్బా—ఏమిచిత్రము ?

నృసిం—నెలదినములనుంచి మనబొపిరాజుగారు నెలకు యిరవై రూపాయలుజీతం చేసి బోగందాన్ని వుంచినారట !

సుబ్బా—ఆఁ! ఇది మహా ఆశ్చర్యంగా వున్నదే! నిజంగానే ఆయన బోగందాన్ని వుంచుకొన్నారా? ఊరికే మీరు వేళాకోళాని కన్నారా?

నృసిం—వేళాకోళానికి కాదు. నిజమే చెప్పుతూ వున్నాను. నేనున్ను నిన్నరాత్రి విని మొట్టమొదట నమ్మలేదు. తరువాత వాకబు చేస్తే నిజ మని రూఢిగా తెలిసింది.

సుబ్బా—ఆయన యెప్పుడూ పరస్త్రీలవంక మొగం యెత్తి ఐనా చూచేవాడు కాడే.

నృసిం—అవును. ఆయన అలాటివాడే. మొట్టమొదట నేను పనికి సిఫారసు చెయ్యడానికి సబుజడ్జిగారియింటికి తీసుకుని వెళ్ళతానంటే అక్కడ యెప్పుడూ బోగంవాళ్లువుంటారని వకపట్టాన వచ్చినాడు కాడు. తరువాత మెడలువిరిచి వకరోజు బలవంతముగా తీసుకు వెళ్ళినాను.

సుబ్బా—అప్పు డేమి జరిగింది ?

నృసిం—సావిట్లో బోగంవాళ్ళు కూర్చున్నపక్కకు దూరంగా

వకమూలను కూర్చున్నాడు. వాళ్ళు పాడుతూవున్నంతసేపూ వాళ్ళ మొగంవంకైనా చూడక తల వంచుకొని కూరుచున్నాఁడు.

సుబ్బా — తరువాత రోజూ ఆయనదర్శనానికి వెళుతూ వచ్చేవారా ?

నృసిం—.వీధిలో నిలుచుని కనుక్కుని బోగంవాళ్లు లోపల లేరని కబురు తెలిసినతరువాత మరీ లోపలికి వెళ్ళేవారు. ఆయన వెళ్ళిన తరువాత బోగంవాళ్లువస్తే మధ్య లేచిపోతే బాగుండ దని విధిలేక ముళ్ళల్లో కూర్చున్నట్టు కూర్చుండేవాడు.

సుబ్బా —అటువంటివాడు ముండను యేలాగు వుంచుకున్నా డండీ? ఇది మహాఆశ్చర్యంగా వున్నది.

నృసిం — చెపుతానువినండి. యివతలకు వచ్చినతరువాత అక్కడ బోగంవాళ్ళు వుంటారని వెళ్లడానికి సిగ్గవుతూవున్నదని నాతో వూరికే చెపుతూవుండేవాడు ఇలాకొన్నాళ్ళు జరిగినతరువాత పాటవింటే యేమని తలయెత్తకనే మెల్లిగా చెవియొగ్గి పాట విన మొనలుపెట్టినాడు. తరువాత కొంచెందగ్గిరగా కూర్చుంటేనేకాని పాట తిన్నగా వినపడదని కొంచెం కొంచెంగా యివతలకు జరగడం ఆరంభించినాడు.

సుబ్బా — పాటమాత్రము వింటూవుంటే యిబ్బంది లేదు. మనంమాత్రం తాంబూలానికి వెళ్ళినప్పుడు వినడం లేదా?

నృసిం — ఆలాకొన్నాళ్లు జరిగినతరువాత మొగంవంకచూస్తే యేమని యెవరూచూడనప్పుడు నేత్రాభినయం చూడడానికి వాళ్ల మొగంవంకచూస్తూ యెవరయినా చూచినప్పుడు చూపు మళ్ళించు కుంటూ వుండేవాఁడు. ఈప్రకారం కొన్నాళ్ళు జరిగినతరువాత మటి వకరు చూస్తూవున్నాకానీ అందరూ చూడడంలేదా అని పాడేదాని అభినయం బాగా చూడమొనలుపెట్టినాఁడు. క్రమక్రమముగా సంగీత

ముందలి అభిరుచి అధికమై సబుజడ్జీగారి యింటికి తరుచుగా వెళ్లడం సాగించినాడు.

సుబ్బా—చూచినాకా తఱుచుగా చూస్తూవుండడంచేత యెలా గంటిమార్పు కలిగిందో!

నృసిం— అది యేమిమార్పు? చూడగా చూడగా అభినయ మందు దృష్టిలేక దానిమొగం చూడవలెననే చూడ మొదలుపెట్టి నాడు; కాని ప్రథమమందు ఆలాచూడడం అన్యాయమని తోచి బుద్ధి మళ్ళించుకుంటూ వుండేవాడుగాని రాగారాగా మాటిపోయి వూరికే మొగంచూస్తే యేమిదోషము అని అందం చూచి ఆశ్చర్యపోవడముకు ఆరంభించినాడు.

సుబ్బా—అంతవఱకు వచ్చినప్పుడు చెడిపోవడముకు సందేహం లేదు.

నృసిం— అలంకరించుకొనివచ్చి దీపము వెలుతురున పాడుతూ వుంటే దానిమొగం అంతకంతకు మరింత అందముగా కనుపడుతూ వుండేది. తరువాత దానిపొందు యెంతసుఖముగా వుంటుందో అని బుద్ధి పుట్టిందట. యీసంగతంతా నాతో అతడు వెనుకచెప్పి తనబుద్ధి మళ్ళించుకున్నాననిన్ని వాళ్లయింటికిమాత్రము యెప్పుడూ వెళ్లననిన్ని చేతిలో చెయ్యి వేసినాడు. ఇంతలో అతనికి సబుజడ్జీగారు కోర్టులో ప్లీడరుపని వేయించినారు.

సుబ్బా—పని అయినతరువాత యేమయినది?

నృసిం— పని అయినతరువాత సబుజడ్జీగారి అనుగ్రహంచేత డబ్బుకూడా దొరకడం ఆరంభించినది. బోగందానితో సంభోగం దోష మనితోచినా, మాటాడడంలో యేమీ దోషం లేదని ఆపాడేదానితో సరసాలాపము ఆరంభించినాము. ఇలాగు సరసాలెక్కువ కావడంతోటే

తక్కినవారు తెలుసుకుని కారువా పట్టించినప్పుడు దానిచేత ఆయనకు గంధం పూయించడం ఆరంభించినారు. ఆస్పర్శసుఖంవల్ల స్వర్గం దొరికినట్టు సంతోషించి పక్కమాటు మొలాగైనా దానిపొందు పడయవలెనని రాత్రి దానియింటికి సగంమారం వెళ్ళి పాపమనితోచి మళ్ళీ వచ్చినాడని ఆయన స్నేహితుడే నాతో చెప్పినాడు.

సుబ్బా—తరువాత యేమయింది?

నృసిం.— కట్లు కొంతకాల మాబోగముదానిమొగము చూచినప్పుడెల్లా ఆశ పీడింపగా, పాపమని మనసు బోధించి నివారింపగా, తుదకు కామబాధకు లోబడి పాపభీతివిడిచి చొరవచేసి వకసారి దాని యింటికి వెళ్లినాడట. అటుతరువాత అతణ్ని మనసు బహువిధాల చీవాట్లు పెట్టి బాధింపగా పదిదినము లేమీ తోచకుండావుండి దాని ముఖం తలుచుగా చూస్తూవుండడంచేతనూ దాని మాయమాటలు పలుమాఱు వింటూవుండడంచేతనూ దానివలలోబడి నెలదినములనుంచి దాన్ని బహిరంగంగానే వుంచుకొన్నాడట.

సుబ్బా—బొపిరాజుగారిని ఆయన బంధువులు యెవరూ కూకలు వేసినారుకారా?

నృసిం—మొట్టమొదట కొన్నాళ్ళు బంధువులకు మొగం కన పర్చకుండా తప్పించుకొని తిరుగుతూ వుండేవాడు. తరువాత కనపడి వారుచెప్పిన బుద్ధివిని మాటాడక వూరుకుండేవాడట! ఇప్పుడిప్పుడు బోగందాన్ని వుంచుకుంటే యేమిదోషం? నేను మాననని తెగించి స్పష్టంగా చెపుతూవున్నాడట.

సుబ్బా—వాళ్ళవలలో పడ్డతరువాత మళ్ళడం కష్టం. ఇక చెడిపోతాడు.

నృసిం— ఇక చెడిపోవడంయేమిటి? యిదివరకే చెడిపోయి

నాడు. డబ్బంతా దానికి దోచిపెడుతూవున్నాడు. ఈనెల్లాళ్లలోను రెండువందలరూపాయలు పాడుచేసినాడు. పెళ్ళాము మెడలోవున్న పట్టెడ కొట్టి తీసుకొనిపోయి తాకట్టుపెట్టినాడు. తండ్రిగారు సంపాదించిన వెండిచెంబులజోడు నిన్నవుదయాన్ని అమ్మివేసినాడు.

సుబ్బా—ఆరంభంగనుక వళ్ళో పయీ తెలియకుండా డబ్బు పాఅవేస్తూవున్నాడు. దానితల్లి మహాచెడ్డమనిషి.

నృసిం—చెడ్డముండయేమిటి? ఇదివరకు యెందరు లక్షాధికారులను బిక్షాధికారులను చేసి ముష్టిచెంబు చేతికిచ్చి గుమ్మంవద్దకు రాకుండా తరిమివేసింది? బాపిరాజుగారు బుద్ధిమంతులూ చదువుకున్నవారూ అని సంతోషిస్తూవుంటే తుపక్రీపకారం దిగింది.

సుబ్బా—ఇక ముం దేమవుతుందో? యింతటితోనైనా బుద్ధి తెచ్చుకుని మళ్లుకోవడం వుత్తమం.

నృసిం—ఇక మళ్ళడం అబద్ధం. ఇదివఱ కీవృత్తిలో ప్రవేశించిన వారి నందరినీ చూడడంలేదా యేమిటి? వీరియెక్కువేమిటి? రెండు రోజులు పోయినతరువాత యిల్లూ వాకిలీకూడా అమ్ముకొని సమస్త పాడుపనులకూ లోబడి యిల్లూ వళ్లూ గుల్ల చేసుకుంటూ యెప్పుడో వకప్పుడు రోగాలచేత దేహం విడుస్తాడు. తరువాత పెళ్ళాము తిండి తిక్కాణా లేకుండా ఫలానివాడిపెళ్ళాము నని ముష్టి యెత్తుకొని బ్రతుకుతుంది.

సుబ్బా—పోనియ్యండి. వకసారి బాపిరాజుగారిని మనయింటికి పిలిపించి మొగము వాచేట్టుగా రహస్యంగా చివాట్లుపెట్టి మళ్లించడానికి ప్రయత్నం చేతాము. వినకపోతే అతనికర్మము మన మేం చేస్తాము? నాకు పనివున్నది వెళ్ళివస్తాను. (అని చెళ్ళుచున్నాడు.)

ఏ. ప్రదేశము—పట్టణమందిరము.

[పెద్దషడ్ మునసభగు భీమరావుపంతులుగారును, నృసింహారావుపంతులుగారును, రామసోమయాజులుగారును మఱికొందఱును ప్రవేశించుచున్నారు]

భీమ—ఏమండీ! ఈరోజున మూడుగంటలకే సభ అని వర్తమానం పంపినా యింకా అందరూవచ్చినారుకారేమండీ? ఇంతేనా యింకా యెవరైన వచ్చేవారున్నారా?

నృసిం—తమరు సభ చేయిస్తామంటే రానివారెవరైనా వుంటారా? అందరూ వస్తారు. మీసభ చెయ్యడం వుద్దేశమేమో నాకు తెలియదు.

భీమ—మీ రీమధ్య బోగంవాళ్ళవిషయములోకాదా వూళ్లో చాలా గడిబిడ చేస్తూ వచ్చినారు; ఆ విషయములో నేను మీ అందరికంటె యెక్కువ అనుభవం గలవాడిని గనుక నాకు తోచినసంగతి చెప్పడానికి మిమ్మలినందఱినీ పిలిపించినాను.

నృసిం—తమరు మూప్రయత్నానికి అనుకూలంగా చెప్పుతారా ప్రతికూలంగా చెపుతారా?

రామ—తప్పకుండా వారు మూపక్షంగానే వాదిస్తారు. వారు మీకు ప్రతికూలంగా గాకపోతే అనుకూలంగాచెపుతారా? లోకానుభవం గలవారందరూ మూపక్షంగానే మూటూడుతారు.

భీమ—నేను యేపక్షంగా మాట్లాడేది అందరూ వచ్చిన తరువాతగాని చెప్పను. ఈలోగా మరివకసంగతి యేదైనా మాటాడుకొందాము.

రామ—మీరు పించన్ పుచ్చుకొని అప్పుడే రెండేళ్లు కావచ్చినదికాబోలును. మీరు మునసఫీ మహాబాగా చేశారు.

భీమ—ఈజనవరితో రెండేళ్లనూద మూడుమాసము లయినది.

పనిలో వున్నప్పు డేమీ తెలిసింది గాదు. మునసఫీ చేసేకాలంలో నేను నెలకు ఫదివేలు సంపాదించేవాణ్ని. పని మానుకునేవరకు పూర్వం సంపాదించినది నక్కగుడ్డిగవ్వ లేదు. ఇప్పుడింకా నాకు రెండువేలు రూపాయలరుణా లున్నవి.

రామ — ఎంతసంపాదించినాకానీ మీ రెవరినీ లొట్టపెట్టి పుచ్చుకునేవారు కారు.

భీమ—నిర్బంధపరిస్తేనేకాని యెప్పుడూ డబ్బు యివ్వరు. ప్లీడర్లందరితోనూ స్నేహంగావుండి వాళ్ళు యేమి అల్లరిచేసినా మాటాడేవాణ్ని కాను. అందుచేత వక్కమోస్తరుగా అంతకాలం సాగివచ్చినది.

రామ — సివిల్‌కోర్టుకు యెదుట మీకచేరీ వుంటూవున్నా యేమీ లక్ష్యంలేకుండా అంతకాలము సాగిరావడం చూస్తే మీరు బహుజాగ్రత్తగా పనిచేసినట్టు కనపడుతుంది.

భీమ—జాగ్రతయేమిటి? నేను సాధ్యమయినంతవరకు న్యాయమయినపక్షమునే డబ్బు పుచ్చుకుని జడ్జిమెంటు హైకోర్టుకువెళ్ళినా తిరిగిపోకుండా వుండేటట్టు వ్రాసేవాణ్ని. చిల్లరగా పుచ్చుకున్నంత లాభము మరి యెందులోనూ లేదు. ఇచ్చేవాడికే కష్టంగా వుండదు పుచ్చుకునేవాడికి కావలసినంతడబ్బు వస్తుంది. నేను పిటీషనువక్కంటికి రూపాయీ అర్థా పావలా చొప్పున పుచ్చుకున్నా ఫక్తు పిటీషన్‌లలో రోజుకు ముప్ఫయిరూపాయలకు తక్కువలేకుండా కళ్ళచూచేవాణ్ని. నేను లంచం పుచ్చుకుంటానని హైకోర్టుజడ్జీలకు తెలుసును. సివిల్ జడ్జీకి తెలుసును. అయినా నేను యెప్పుడూ దొరికేవాణ్ని కాను. నాలుగు, మూడు లంచం యిచ్చేవాళ్ళు ఫిర్యాదు చేసుకోరు. ఫిర్యాదు చేసుకున్నా రుజువుపర్చడం మహాకష్టం. ఎవరు ఫిర్యాదు చేసినవాడికే శిక్ష అవుతుంది.

నృసిం—అరుగో మనవా రంతా వస్తూవున్నారు.

[పది పండ్రెండుగురు పెద్దమనుష్యులు ప్రవేశించుచున్నారు.]

రామ—అందరునూన్నా వచ్చినారు. వేగిరం యీమీటింగు విషయం చెప్పివెయ్యండి మళ్ళీ చీకటిపడుతుంది.

భీమ—(లేచి నిలుచుండి) నాయనలు దయచేసి పెద్దమనుష్యులంతా దయచేసి వున్నారు. మీరు చేసేసభవిషయమై రెండుమాటలు మనవిచేసుకుంటాను. ఈవిషయంలో నాకు వున్న అనుభవం మీలో యెవరికీ లేదు. నేను మునసభీ చేసేకాలంలో ఒకొక్కనెలలో యిరవైవేలరూపాయలు సంపాదించానన్నా నమ్మవలెను. అంతడబ్బు సంపాదించినా యింకా సంపాదించవలెననే వుండేది. నా డబ్బంతా ముండలకిందఖర్చుపెట్టేవాణ్ణి. అప్పుడు యెవరు చెప్పినా వినక బోగందాన్ని చూస్తే నాకు స్వర్గం దొరికినట్టు వుండేది. అప్పుడు వాళ్ళ మాయలో బడి లోకం తెలిసేదేకాదు. దానికి ఫలం డబ్బంతాపోయి రుణాలపాలయి వుండడమే కాకుండా రోగాలచేత వళ్ళంతా పాడు చేసుకుని యిప్పటికీ బాధపడుతూవున్నాను. ఈబాధ చూస్తే వొకొక్కప్పుడు దేహంవిడిస్తే బ'గావుంటుందని తోస్తుంది. నిర్దోషులయిననాకొడుకులు నాదోషంచేత వచ్చినజాడ్యాలచేత ముగ్గురు వరుసగా పోయినారు. నాభార్య బ్రతికివున్నంతకాలమూ జాడ్యాలచేత బాధపడుతూనే వుండేది. ఇప్పుడు నేను యీలోకం వదిలిపెట్టడానికి సిద్ధంగా వున్నాను. పెళ్ళేటప్పుడు పాపం వొకటితప్ప పెంటవచ్చేది మరియేదీ కనపడడం లేదు. కాస్త దేహంలో జబ్బువచ్చినప్పుడల్లా మరణం జ్ఞాపకంవచ్చి నేను పడేబాధ యింతం తని చెప్ప శక్యముగాదు. కాబట్టి మీరు నాబుద్ధి విని బోగంవాళ్ళసహవాసం మానివేస్తారని మిక్కిలి కోరుచున్నాను. అందువల్ల మీకు ఇహపరములు రెండూ కలవు.

నృసిం—వారు బహుబాగా చెప్పినారు. వారు పెద్దలు గనుక అందరూ ఆ ప్రకారం నడుచుకుంటే సరోత్తమముగా వుంటుంది.

రామ—మేము చేసేపని అక్రమమైనదని మాకూ తెలుసును. అయితే పడుచుతనంలో వుండడంచేతనూ అలవాటు పడంచేతనూ వకపట్టాన మానలేకుండా వున్నాము. మీరు మీ అనుభవంచేత సమస్తకష్టములనూ తెలుసుకొని మాకు హితం చెప్పుతూ వున్నారు గనుక సాధ్యమయినంతశీఘ్రంగా మావృత్తినుంచి మళ్ళుకుంటాము.

భీమ—మీ కీబుద్ధి స్థిరంగా వుండేట్టు చేయవలె నని నా యిష్టదైవమును నిత్యమూ ప్రార్థిస్తూ వుంటాను.

(అని సభ చాలించుచున్నారు.)

సంపూర్ణము.

వినోదతరంగిణి

ప్రథమాంకము.

౧. ప్రదేశము—సోమయాజులుగారియిల్లు.

[సోమయాజులుగారు ప్రవేశించుచున్నారు.]

సోమ—(తనలో) వార్థకదశలో వివాహము చేసికొన్నవారికి హ్లాదైకకాడను యీలాగుననే యుండును. "ఆలు కాదది వాలి"న్న సామెత నాకిప్పుడనుభవమునకు వచ్చినది. అయ్యో! అంతమంది వద్దను చుండగా వినక బుద్ధి గడ్డితిని వివాహమాడినపాపఫల మనుభవిం పక తీఱునా? పెద్దభార్య పోయినతరువాత నాలుగేండ్లదాక ఎవ్వ రును పిల్లనియ్యనందున పాలలోఁబడ్డ బల్లిలాగున పరితపించి, తుదకు యజ్ఞము నిమిత్తము యాచించి ఆర్జించిన సొమ్ములోనుండి మిగుల్చు కొన్న ఆరువందలరూపాయలును పిల్లదానితండ్రి మొగమున తగుల బెట్టి ముండెంతో సుఖపడవలె నని కొండంత ఆశతో ఆఱుసంవత్సర ములపిల్లను కట్టుకొన్నాను. కొత్తగా గృహప్రవేశమునకు తీసికొని వచ్చినప్పుడు నన్నును ఆచిన్నదానిని చూచి, యెఱుగనివారందఱును నాకది మనుమరాలనుకొనిరేకాని యెవ్వరును భార్యయని తెలిసికో జాలకపోయిరి. పెండ్లి అయినదిమొదలుకొని పిల్లది యెదిగి యెప్పుడు కాపురమునకు వచ్చునా, ఆమహాభాగ్య మంతయు నేనెప్పుడు బావుకొం దునా, అని నోటిలో వేలు పెట్టుకొని గుటకలు మ్రింగుచు దినమొక కల్పముగా గడుపుచు నేను తొందరపడినకొలదిని పిల్లది యీడేరుట వెనుకకేపోవుచువచ్చెను. కడపట చిన్నది పెద్దదయి యింతకాలమునకు నాతపము ఫలించెనుగదాయని సంతోషపడెడు దినములు వచ్చునప్ప

టికి దైవము నామేలును చూచి ఓర్వలేక యింటికి నాతో కాపురము చేయవచ్చెడులోపలనే దానిని నాపాలిటి యమదూతనుగా మార్చివేసి నాను. అప్పటినుండియు దానికి నాపొడ గనబడిన, ।తాచుపామును, చూచినట్లుండును. ఈగ్రహచారమునకుతోడు నాకు చంద్రయ్యయను కపటశిష్యుడొకడుకూడ దాపురమయినాడు. వానిని చూచినప్పుడెల్ల దానికి ప్రాణము లేచివచ్చును. అత డింట నున్నంతసేపును కలకల లాడుచు నవ్వుచు పేలుచు స్వర్గములో నున్నట్లుండును; ఆదుర్మార్గుని మాయింటికి రావద్దన్న ఉన్నగోడుకూడ చెడునేమోయని మానుష మునకు నిలిచి నేనెరిగియు ఎరుగనట్లు నటించుచున్నాను. నన్ను చూచినతోడనే దాని కేడుపుమొగముపడి యెక్కడలేని చిరాకును వచ్చి నన్ను చండాలుని జూచినట్లు చూచును. రాత్రి నాతో గది లోనున్న నాలుగుగడియలును మొగము ముడుచుకొని ప్రాణములు బిగబట్టుకొని మాటాడక యమలోకములో ఉన్నట్లుండును. వశ్యౌష ధము ఇచ్చెదనని యొకవేరు చేతిలోబెట్టి మొన్నటిపైరాగివాడు నిష్కారణముగా నాలుగురూపాయలు ఎత్తుకొని పోయినాడేగాని మందుగుణము కొంచెమయిన అగపడి అదినాతో మొగమిచ్చి మాటా డుటయయినను లేకపోయెను ! అదిగో సోమిదేవి చీపురుగట్ట పట్టుకొని చావడిలోనికి వచ్చుచున్నది.

[సోమిదేవి ప్రవేశించుచున్నది.]

సోమ—ఓసీ ! ఓసీ! ఒకసారి దగ్గరకు వచ్చి చెవిలో మాట చెప్పెదను విని పో.

సోమి—సరి ! సరి ! మీనోటి కస్తమానము "ఓసీ! ఓసీ!" అన్నమాటకు విసుగులేదు. మీకు నాతో వేమిరహస్యము వచ్చినది? మగడుపోయినముండవలె మీరు రాత్రింబగళ్ళు పనిపాటలు లేక

యిల్లుపట్టుకుని పదలదు. మహారాజువలె వీధిలోకిపోయి యేదైన పని చూచుకోరాదా ? నీవింటలేకపోయిన, ఇంతలో పెండ్లాము నెవ్వారును ఎత్తుకొని పాటిపోరులెండి.

సోమ—ఏమే ? నీకు నాతో మాటాడుటే బంగారముగా నున్నది ? నేనెంతో నీమీదిప్రేమచేత దేవతార్చనకని యింటింట దిరిగి నిత్యమును మంచిపువ్వులు తెచ్చియిచ్చినను, ప్రతిదినమును ఇంటిముం జూరుపెండ్లెలో పెట్టుటేకాని యొక్కనాడయినను ముచ్చటదీఱ నేను చూచుచుండగా కొప్పులో ముడుచుకోవు. విలువచీర లిచ్చినను మఱు నాటికే చింపివేయుదువుకాని ఒక్కరాత్రియైనను పడకగదిలోనికి కట్టుకొనిరావు. నన్నుచూడగానే దయ్యముపట్టినదానివలె తల విరియ బోసికొని చింపిరితలతో బూచివలె గనబడుదువు.

సోమి—చాలు ! చాలు ! ఈపాటికి నీచదువు చాలించు. నీకె ప్పుడును నన్నాడిపోసికొనుటతోనే సరిపోవును. ఆలిని ఒల్లనివానికి ఈలకూరలో ఉప్పు ఎక్కువయినదట ! —దైవమా ! ఇంట నా కీపో రెప్పుడు విఱుగడచేసెదవో—

సోమ—ఓసీ ! కోపపడకే. ఎవ్వరో లోపలికి వచ్చుచున్నారు. వాకిటిలో చెప్పులచప్పు డగుచున్నది. ఉత్తప్పుడు లేకపోయిన మానె గాని, ఇతరు లింటికివచ్చినప్పుడయిన, బిగ్గరగా మాటాడక నాయెడల ఇంతభక్తిచూపి పతిపూజచేయుచున్నట్లు పయికిన నటించుచురావే.

సోమి—(మొగమున నెటిక విఱిచి) భక్తికాదు. నీమొగమున పెద్దమొద్దులు పెట్టవలెను. ఎవ్వరోవచ్చుచున్నారుగాని లేకపోయిన పటమున చేతిలోనున్న యీచీపురుగట్ట పుచ్చుకొని నాకసితీఱ పెద్ద పూజచేసి వదలిపెట్టుదును.

(అని లోపలికి పెళ్ళుచున్నది.)

[అవధానులు ప్రవేశించుచున్నాడు.]

అవ—సోమయాజులుగారూ ! లోపల మీరేమో పనిమీద ఉన్నట్టున్నారు. ఒక్కసారి నడవలోకి వచ్చెదరా ?

సోమ—వచ్చుచున్నాను. (అని వెళ్ళుచున్నాడు.)

అవ—సోమయాజులుగారూ ! ఈదినము ప్రొద్దున మనవీధిలో జరిగిన విపరీతము చూచినారా ?

సోమ—నాయనా ! ఏమివిపరీతము ? నే నేపాపకర్మము నెఱుగను. తెలివిమాలిన మనసోమిదేవి యేమైన—

అవ—కాదు కాదు. ఎవ్వరో పిల్లనుగని చంపివేసి రాత్రివేళ మనగుమ్మమున కెదురుగా వీధిలో పాఱవేసినారు.

సోమ—(తొందరపడి) నాయనా ! అంతచేటుకాలు మెవరికి వచ్చినది ? ఎవరు—ఎవరు పారవేసినారు ?

అవ—మీరెఱుగరా ? (మెల్లగా) భీమారావుపంతులుగారి మఱిదలేమో కని పారవేసినదని యిరుగు పొరుగుల అమ్మలక్కలు చెప్పుకొనుచున్నారు. వెనుక మీరేకదా ప్రతిదినము పంతులుగారు సభకు వెళ్ళినతరువాత మధ్యాహ్న మక్కడికి పోయి వేదాంతము చెప్పుచు వచ్చితిరి.

సోమ—వెనుక నేనే చెప్పుచువచ్చితినిగాని, ఈనడుమ నావలె వట్టిమాటలుచేతనే కాకుండా అనుభవముచేతకూడా నుపదేశించిన వేదాంతమును చెప్పగల పడుచుశాస్త్రియొకడు ప్రవేశించినందున పది నెలలనుండి నా కుద్యోగమయినది. ముండలు తిండి తిని తిన్నగా ఉండ లేక కండకావరమున కన్నుగానక యిలాగున కానిపనులు చేయుదురు.

అవ—అదియంతయు మీ యుపదేశమునుబట్టియే కాని మరి యొకందుచేతగాదు. అయినను అట్టిపనులకు లోఁబడుటలో స్త్రీలలోష

మేదియు లేను. మూడేండ్లముండలు మగడుపోయినతరువాత, ఏదో విభమున కోరికతీర్చుకోక ఉప్పును పులుసును తిను దేహాములతో ఎంత కాలము తిన్నగా ఉండగలరు ? అన్నిసౌఖ్యములను అనుభవించి అట్టి వదియేండ్లుదాటి సమస్తము తెలిసిన మీవంటిపెద్దలుసహితము పెండ్లి చేసికొని సుఖపడ గోరుచుండగా నడివయసులోనున్న బాలవిధవలు కామబాధకు లోబడుట ఆశ్చర్యమా ?

సోమ — ఆముండలసంగతి మన కెందుకుగాని, ప్రసంగము తీసికొని వచ్చినావు గనుక నీతో నే నొకరహస్యము చెప్పెదను. నే నెంత ముసలితనంలో పెండ్లియాడినను, మన సోమిదేవివంటిపతివ్రత మటియొకతె లేదు సుమీ. అబద్ధమాడరాదు. దాని అడకువయు, పతిభక్తియు, ఏమిచెప్పను? మంచిగుణములన్నవి దానిని జూచి మటి యొకస్త్రీ నేర్చుకొనవలెను.

అవ — అవును. మీరు చెప్పకపోయిన, ఆమెగుణములు పొరుగున నున్నవాడను నాకు తెలియవా? ఇప్పుడు చంద్రయ్యవచ్చి మీవద్ద వేదమును చదువుకొనుచున్నాడా?

సోమ — చదువు మానివేసినాడుగాని; యిప్పుడుసహితము మాయింటికి దినమునకు నాలుగుపర్యాయములు వచ్చి చూచి పోక మానడు. వానికి నాయెడల పరమవిశ్వాసము; నేను లేకపోయినను ఎప్పుడును మాయిల్లు వదలడు; వా డందఱశిష్యులవంటివాడు కాడు; పరమయోగ్యుడు.

అవ — అవునవును. అతడు చీకటికైన భయపడక రాత్రులు గూడ మనయింటివద్దనే తఱుచుగా నుండగా జూచుచున్నాను. మొన్న రాత్రి మీరు గడియసేపు తలుపువద్దఱి కేకలువేసినప్పుడు లేచివచ్చి తలుపుదీసిన దతడే.

సోమ--ఒక మొన్నరాత్రియే కాదు. సోమిదేవి యింట ఒక్క తెయు ఉండలేదని నేను లేనప్పుడు రాత్రియు పగలునుకూడ దానికి సహాయముగా మాయింటనే ఉండి నేను వచ్చినతోడనే వెళ్లిపోవుచుండును. మనగ్రామములో దొంగలభయము విస్తారముగనుక, యింటి భద్రముకొఱకు తలుపులు వేసికొని మఱిలోపల కూరుచుందురు. ఇంత జాగ్రత్తగానున్నను, నాలుగుదినములక్రిందట మాపడకగదిలో తాళము పెట్టెలో నున్న నూఱురూపాయలశాలువ పోయినది సుమీ. ఇట్లు తెఱు చుగా వచ్చుచుండునని వానియొద్దనుగాని మాయింటిదానియొద్దనుగాని ఒక్క దుర్గుణము లేదుసుమీ! నీపాదములసాక్షి నామాట నమ్ము. ఒకరినొకరు కన్నెత్తి చూడనైనా జూడరు.

అవ--ఆసంగతి అంతయు నే నెఱుగుదును. మీరు వేఱే సెల వియ్యనక్కరలేదు.

సోమ--దాని కేమిగాని మొన్నటిసంగతి యేమిచేసినావు?

అవ-- మొన్నటిదినము మనమందరమును జేరి ఆలోచించి స్త్రీలతో రహస్యము చెప్పగూడదని సిద్ధాంతము చేసికొన్ననాడే నే నింటికి వెళ్ళినతరువాత, మీ యఁదటిమాట ప్రకారముగా భోజనము నకు లేవక మంచముమీద ముసుగు పెట్టుకొని పరుండి మనసులో లేని విచారమును పైకి నటించ మొదలుపెట్టితిని.

సోమ--. నీభార్య భోజనమునకు లేవవలసినదని తొందరపెట్ట లేదా?

అవ-- నూరుసారులు వచ్చి పిలిచి తొందరపెట్టినది. నేను మొగము చిన్నపుచ్చుకొని యెంతసేపటికిని లేవకుండుట చూచి నా కేమో ఆపద వచ్చినదని ఊహించి కారణమును తనతో చెప్పుమని నన్ను వేయివిధముల నిర్బంధపెట్టినది.

సోమ—నీవేమి చెప్పినావు?

అవ—ఎంతసేపటికిని చెప్పక చాలాసేపు తంటాలుపెట్టి, నా విచారకారణమును మటియెవ్వరితోను జెప్పనని నామీదను, బంధువుల మీదను, దేవునిమీదను లక్ష్మప్రమాణములు చేయించి తుదకు నేను కడుపుతో నున్నానని చెవిలో రహస్యముగా చెప్పితిని.

సోమ—అంత విరుద్ధమయినసంగతి నమ్మినదా?

అవ—మాఅమ్మాటాడక ఒక్కనిముషములో నమ్మినది.

(తెరలో)

"నీభార్య ముండామోసినదయ్యా!" అని చెప్పినతోడనే విరుద్ధమనుకోక చదువుకొన్న సోమయాజులుగారే నమ్మి యేడువ మొదలుపెట్టినప్పుడు, చదువులేక మూఢురాండ్రైన మనస్త్రీలు యింతకంటె విరుద్ధమైన సంగతిని చెప్పినను నమ్ముదురు.

సోమ—అదిగో సుబ్బారావుగారి కుమారుడు గోడచాటునుండి మన మనుకొనుచున్నమాట లన్నియు విన్నాడు.

అవ—ఇంగ్లీషుబడియందు చదువుకొను కుఱ్ఱవాండ్రు మనవంటి వారి నెప్పుడును ఎగతాళి చేయుచుందురు. చదువు లేనప్పుడే పట్టపగ్గములు లేని స్త్రీలు, చదువుకూడ నున్నయెడల బొత్తిగానే నెత్తెక్కి మగలను వేపుకొని తినరా?

సోమ— అదిగో! ఎవరో బంట్రోతువచ్చి నిన్ను పిలుచుచున్నాడు.

[బంట్రోతు ప్రవేశించుచున్నాడు.]

బంట్రో—ఎవరయ్యా? అవధానులుగారూ! తహశ్శీలుదారుగారు మీయింటికివచ్చి మిమ్ము పిలుచుకుని రమ్మనాన్నారు. వేగిరము రండి.

అవ—సోమయాజులుగారూ ! వెళ్ళుదము మీరుకూడ రండి.

(అందఱు వెళ్ళు చున్నారు.)

---

౨. ప్రదేశము—అవధానులుగారి చావిడి.

[తహశీల్దారుగారును, గుమాస్తాయును కూరుచుండియుండగా, అవధానులును సోమయాజులును, బంట్రోతును ప్రవేశించుచున్నారు.]

తహ— ఏమయ్యా? అవధానులుగారూ! రాత్రి ప్రసవమయి అప్పుడే డూరి వెంబడిని పెత్తనములకు బయలుదేరినావు ?

అవ—(తొందరపడి) అయ్యా ! అయ్యా! ఏమిటండి ? ఏమిటండి?

తహ—(నవ్వుచు) మీకు మంత్రసాని యెవరు ? రాత్రి పిల్లను గన్నందుకు, కాయముపెట్టి మిమ్ము లంకణములు కట్టలేదా? మీకు పురిటినీ ళ్ళెప్పుడు ?

అవ—(నిశ్చేష్టితుడయి) అయ్యా! చిత్తము. (అని తెల్లపోయి చూచుచున్నాడు.)

తహ—(చిఱునవ్వునవ్వి) మీరేమో గడిచినరాత్రి శిశువును గని చంపి వీధిలో పాఱవేశినారని మాగుమాస్తాగారు సెలవిచ్చు చున్నారు. ప్రొద్దున మీగుమ్మమువద్దనున్న శిశువును మీరు బలవంతముగా చంపినారా ? లేక దానంతట అదే చచ్చినదా ?

అవ—(వడవడ వణకుచు) నేనేపాపకర్మము నెఱుగను. ఎవ్వరో గిట్టనివారు మాయింటికి కానిపేబులును ప్రొద్దున—(అని తడబడు చున్నాడు.)

తహ—నీవీలాగున వడకుచు తడబాటుబడుచుండుట చూడగా నీవు నేరము చేసినట్లే కనబడుచున్నావు.

గుమా—అవధానులుగారూ ! మీకు వచ్చిసభయము లేదు. నిజము ఒప్పుకోండి.

అవ—— నేను కాదు. భీమారావుగారి మఱిదలు——

గుమా—— (చేయెత్తి యదలించి) ఈపాటిచాలించు.

సోమ—— (మెల్లగా) నీపుణ్యమాయెను. ఊరకుండవయ్యా! తహశ్శీలుదారుగారు చెడ్డవారు. పెద్దమనుష్యులకు నిష్కారణముగా అవమానము——

తహ —— అవధానులూ! ఏమో చెప్పవచ్చి ఊరకున్నాము వేమయ్యా!

అవ——అయ్యా! మ ఱేమియు లేదు.

తహ——ఏమియు లేకపోవుటయేమి? ఈశిశుహత్యావిషయమును నీవెఱుగనిదేమియు లేదు. తిన్నగా చెప్పకపోయినపక్షమున శిక్షయగు నుజుమా. భీమారావుగారి మఱిదలని యేమో చెప్పమొదలు పెట్టినావు ఆసంగతి పూర్తిగాచెప్పు.

సోమ——(చెప్పవలదని చేసైగ చేయుచున్నాడు.)

అవ——(కొంచె మాలోచించి) భీమారావుపంతులుగారి మఱిదలు బుద్ధిమంతురాలని చెప్పబోయి తమరశ్రద్ధగా నున్నారని చెప్పక ఊరకున్నాను.

తహ——నేను నిన్ను శిశువుసంగతి అడుగుచుండగా మధ్య ఆసంగతి యెందుకు తెచ్చినావు?

గుమా——అయ్యా! ఇతడు పరమ ఛాందసుడు. ఈపని నిజముగా ఇతడుచేసినదేకాని మఱియొకటి కాదు. తనమీదివాడు తప్పించుకొనుటకు లేనిపోనిదేదో పన్నబోయినాడు. పురుషుల కిప్పుడప్పుడు సంతానము కలుగుటకూడ కలదు——ఏమయ్యా! సోమయాజులుగారూ! మొన్న మీరు పురాణముచెప్పినప్పుడుగూడ మాంధాతకో, మరియెవ్వరికో పుత్రుడుపుట్టినాడని చదువలేదా?

సోమ—అవును చదివినాను—

తహ—సోమయాజులూ ! నాముందఱ ఇటువంటిచిచ్చిమాటలు చెప్పక ఊరకుండవయ్యా—ఏమయ్యా ? అవధానులూ ! మాటాడక మొద్దులాగున నిలువబడి యూరకున్నావు?

అవ—భీమారావుపంతులుగారి మఱుదలే కని పాఱివేసినది—

గుమా—పెద్దమనుష్యులవిషయమై యిటువంటి కారుకూతలు కూయకు.

తహ—ఆ బ్రాహ్మణుడు నిజము చెప్పబోవుచుండగా మధ్య మీరడ్డము వచ్చెద రేమి ?

గుమా—ఈ బ్రాహ్మణుడు బిడ్డనుకన్నమాటే వాస్తవము.—

తహ—(కోపదృష్టితో) సరి ! సరి ! మీకీప్రపంచజ్ఞానమే లేదు. నేనేమో నవ్వులాటకన్నమాటనే నిజమని నిలువదీయ జూచెద రేమి?

గుమా—మీరు విస్తారము చదువుకొని పరీక్ష లిచ్చినారన్న మాటయేకాని, ఇటువంటివిషయములలో మీకు అనుభవము చాలదు. ఇదివరకు నాకు సర్కారులో ముప్పదినాలుగుసంవత్సరములు సార్వాయి సైనది. నేను పనిలో ప్రవేశించునప్పటికి మీకొకవేళ పుట్టినారో లేదో ఏలాగునను మీకంటె ఎక్కువ అనుభవము గలవాడను; నామాటయందు తమరు కొంచెము విశ్వాసముంచవలెను.

తహ—ఈసంగతిలో మీరిక మాటాడకండి. మగవానికి పిల్ల పుట్టినదన్న, ఎవ్వరైనను నవ్వకొనిపోయెదరు.

గుమా—నా మాటయందు మీకు నమ్మకము లేనియెడల, ఈవిషయమై గ్రామములో అందఱును ఏమిచెప్పకొనుచున్నారో యీ బంటోతు నడిగి చూడండి.

బంటో—గ్రామమున నశేషజనమును ఈ బ్రాహ్మణుడే బిడ్డను కన్నాడని వింతగా చెప్పుకొనుచున్నారు మహాప్రభూ !

తహ—అవధానులూ ! ఊరిలో ఇంతమంది యుండగా, ఈ యపవాదము నీమీదికి వచ్చినదేమయ్యా ?

అవ — మొన్న మేమందఱమును మాటాడుకొనునప్పుడు స్త్రీలతో రహస్యము చెప్పకూడదని మాలో నొక రనగా దానినిజము పరీక్షించవలెనను ఉద్దేశముతో ఎవరితోను జెప్పనని ఒట్టుపెట్టించుకొని మహారహస్యమని నేను కడుపుతోనున్నట్టు నాభార్యతో జెప్పినాను. నాపెద్దకడుపు మీకందఱికును గనపడుచునే యున్నదికదా. ఇంతకంటె నేమియు నేనెఱుగను.

తహ—ఆహా ! తెలిసినది. చదువులేని మూఢస్త్రీలు నిజమయినరహస్యమును చెప్పినను దాచలేరు. నీవన్నమాటను రహస్యముగా నిభార్య యెవరితోనో చెప్పి యుందును. ఆమాట ఆనోటినుండి ఆనోటి మీదుగా పోయి తుదకు నీవు సరిగా పిల్లనుగన్నట్టే మారినది. ఇప్పుడు మావద్దకు వచ్చినప్పటికి, ఈచచ్చినపిల్ల నీవు కన్నదేయయినది.

అవ—చిత్తము. చిత్తము.

తహ—మీరు స్త్రీలకు పునర్వివాహములు కూడ వందురు. అవి లేకపోబట్టియేకదా యిట్టి ఘోరకృత్యములు నిత్యమును మన స్త్రీలలో జరుగుచున్నవి. ఎంతో శ్రోత్రియుల మని చెప్పుకొనుచు, మీవంటి సోమయాజుల పేళ్ళువారే యిటువంటి అంకుముండలచేత లక్షీవత్తులవ్రతములు మొదలయినవి చేయించి సంకోచింపక హస్తోదకములు పుచ్చుకొని ముందుగా భోజనమునకు సిద్ధపడుదురు. మీవంటి ముసలివాండ్రు సహితము మూడేండ్లపిల్లను పెండ్లిచేసుకొనుచుండగా, వయసులో నున్నప్పుడు సహితము పెండ్లి చేసికొనకుండుటకు స్త్రీల గ్రహచార మేమి కాలినది?

సోమ— పూర్వ జన్మమునందు చేసికొన్నపాపముచేత స్త్రీలు

విధవ లగుదురు. చేసికొన్న దెవ్వరికిని అనుభవింపక తీఱదు.

తహ—ఇట్టిస్త్రీలు పూర్వజన్మమునం దెవ్వరో, ఏమిపాపము చేయుటచేత వారి కిప్పు డీయవస్థ తటస్థించినదో మీ కేమయిన తెలియునా?

సోమ—నాకు తెలియదు.

తహ—అది తెలియకపోయిన ఘానెగాని, పూర్వజన్మమున మీ రెవ్వరో, యిప్పుడు మీకీజన్మ మెందుకు వచ్చినదో మీసంగతియైన మీకు తెలియునా?

సోమ—అది అంతకుమునుపే తెలియదు.

తహ—ఈబాలవిధన లందఱును పూర్వజన్మమునందు మీవంటి శుద్ధశ్రోత్రియులే అయియుందురు. సందేహము లేదు. పునర్వివాహము కూడదని పూర్వజన్మమునందు స్త్రీలను శోభపెట్టిన పాపఫలము ఈ జన్మమునం దీరీతిగా అనుభవించుచున్నారు. అప్పటి పూర్వసువాసినులే యిప్పటి మీరూపములతో అవతరించి స్త్రీపునర్వివాహములు కూడవని మీరు పూర్వజన్మమునందు తమ్ము పెట్టినబాధకై మరల కసితీర్చుకొను చున్నారు.

సోమ—తమ రీలాగున పెల వియ్యకూడదు.

తహ—ఊరకే నవ్వుల కన్నాను. ఈజన్మమున మనదోషము చేతనే స్త్రీలు దుఃఖము ననుభవించుచుండుట ప్రత్యక్షముగా గనబడు చుండగా, నీవు పూర్వజన్మపాప మనేద వేమయ్యా?

సోమ—తమవద్ద నే నేమి మాటాడగలను?

తహ—సోమయాజులుగారూ! మేము భీమారావుపంతులుగారి మజిదలిసంగతి విచారణ చేయవలెను. మీరు ముందుగా వెళ్ళి మేము వచ్చేడిలోగా కూరుచుండుటకై మీ వీధియరుగుమీద చాప వేయించ

కలరా?

గుమా—— (తసలో) ఈవేళ నిష్కారణముగా పెద్దమనుష్యుల కొంప మునిగినది.

సోమ—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు.)

తహా——సోమయాజులు వ్యభిచారమువల్ల దోషము లేదని మిట్ట వేదాంతములు బోధించి, భీమారావుపంతులుగారి మఱదలివద్ద వెనుక నేమో నాలుగువందలరూపాయలసొమ్ము కాజేసినాడట!

గుమా——అవును. ఆ వేదాంతమే యిప్పు డీయనభార్యకు చక్కగా అక్కఱకు వచ్చినది.

తహా——ఇప్పటికే మిక్కిలి ప్రొద్దెక్కినది. మనము వెళ్ళుదము రండి. (అందఱును వెళ్ళుచున్నారు.)

---

3. ప్రవేశము—సోమయాజులుగారి యిల్లు.

[సోమయాజులును, భార్యయు ప్రవేశించుచున్నారు.]

సోమ——ఏమే తలుపునద్ద ఎంతసేపు పిలిచినను పలికినావుకావు? కేకలు వేసివేసి గొంతుక బద్దలై పోయినది.

సోమ—నేను లోపల ఏమో పనిసందడిలో వున్నాను. మీ పిలుపు నాకు వినబడలేదు.

సోమ—తహశీల్దారుగారు మనయింటికి వచ్చెద మన్నారు. మే మింతకుమునుపు ఇక్కడ వేసికొని కూచున్న పెద్దచాప యేమైనదే?

భార్య—ఏమో యేమయినదో నాకేమి తెలియును? నాకు మీచాప కనిపెట్టుకొని ఉండుట తప్ప వేరేపని లేదా?

సోమ—నేను తలుపునద్దసిలుచుచున్నప్పుడు బుట్టిన చాపచుట్టి నట్లు చప్పుడయినంమున, చాప చుట్టి లోపల పెట్టినావేమో అని

అడిగినాను.

భార్య—అన్ని చప్పుడులును నీకు వినబడును. ఆగదిలోచాప లేదు. తలుపు తీయకుండి. మీరు వీధితలుపు తీసి వెళ్ళినప్పుడు, చాప యెవ రెత్తుకొనిపోయినారో! మఱి యెవరింటికయిన వెళ్ళి యొక చాప తీసికొని రారాదా?

సోమ—(ఆగదితలుపు తీసి) అదిగో మూల చాపచుట్ట కన బడుచున్నది.

భార్య—మీకాచాప పనికిరాదు. సుబ్బారావుగారి యింటికి వెళ్ళి మంచిచాప తెచ్చుకొండి.

సోమ—(చాపచుట్ట చేతితో పట్టుకొని లాగుచు) ఏమే చాప చుట్ట యెంతలాగినను రాక బరువుగా గనబడుచున్నది.

భార్య—(అడ్డము వచ్చి చాపచుట్టపట్టుకొని) ముసలివారయి నారు. చాపయెత్తుటకయినను మీచేతులో సత్తువ లేదు. నాకీచాపతో పని యున్నది. మఱియొక చాప తెచ్చుకొండి.

సోమ—(పయినుండి చాపచుట్టలో తొంగిచూచి) యీచాప చుట్టలో ఎవడో కూర్చున్నాడు—ఓరి దొంగగాడిదకొడుకా! లోపల కూర్చున్నా వేమి? పైకి లేచి రారా.

భార్య—ఊరికే లేనిపోని యల్లరి చేయకుండి. నాకు కొంచెము తలనొప్పినచ్చి యీవైద్యుని పిలిపించినాను.

సోమ—ఓరి కుక్కలకొడుకా? ఏమిరా చాపచుట్టలో నుండి యింకను లేచిరావు?

వైద్యుడు—(లేచి వచ్చి) మాటలు మిగులబోకు. నీభార్యకు వైద్యము—

సోమ—లంజెకొడుకా! వైద్యమునిమిత్తము వచ్చినగాడిద

కొడుక వయినపట్టమున చాపచుట్టలో దూరవలసిన పని నీకేమివచ్చి నదిరా ?

భార్య—తలనొప్పిచేత బాధపడుచుండగా ఉపకారమునకయి మందియ్యవచ్చిన పెద్దమనుష్యుని బతిమాలుకోవలసినది పోగా నిష్కారణముగా తిట్టమొదలు పెట్టినారేమి? మీరసలే అనుమానపు మనుష్యులని చాపచుట్టలో—

సోమ—తాళు. ఎవరో నన్ను వీధిగుమ్మములో కేకలు వేయుచున్నారు. (వైద్యునివంక చూచి) పెద్దమనుష్యులురాబట్టి యిప్పటికి బ్రతికిపోయినావు వెళ్ళు—వచ్చె వచ్చె. కేకలు వేయకుండి. (అని చాపపట్టుకొని వీధియరుగువద్దకు పరుగెత్తుచున్నాడు.)

[తహశీలుదారు మొదలగువారు ప్రవేశించుచున్నారు]

తహ—మేము వచ్చునప్పటికి చాపలువేయించి సిద్ధముగా ఉండుమని ముందుగానే మిమ్ము పంపినను, మేము వచ్చినతరువాతను కూడ చాపతెచ్చుట కింతయాలస్యము చేసినావేమయ్యా?

సోమ—చిత్తము. చిత్తము. లోపల మా సోమిదేవికి కొంచెము జబ్బుగానుండి వైద్యునికొఱకు వెళ్ళి తీసికొనివచ్చినాను. అందుచేత కొంచె మాలస్యమయినది. క్షమించవలెను. (అని చేతిలోనిచాపచుట్ట విప్పి అరుగుమీద వేయుచున్నాడు)

తహ—(చాపమీద కూరుచుండి) గుమాస్తాగారూ ! కూరుచుండుండి. అవధానులూ! నీవుకూడ కూరుచుండు. సోమయాజులుగారూ ! నిలువబడినారేమి ? కూరుచుండరాదా ? (అందఱును కూరుచున్నారు)

గుమా—భీమారావుపంతులుగారిని పిలుచుకొనిరాబోయిన బంటోతు ఇంకను రాలేదు.

తహ— వైద్యుడుగారూ! ఆలాగు తలనిండ ముసుగు వేసుకొని దొంగవానివలె తలవంచుకొని పాఱిపోవుచున్నా వేమయ్యా! ఒకసారి యీలాగున రండి.

వైద్య—చిత్తము. (అని వచ్చి కూరుచున్నాఁడు.)

తహ—సోమయాజులుగారియింటి కేమిపనిమీద వచ్చినారు?

వైద్య—కొంచెము సోమయాజులుగారితో మాటాడవలసినపని యుండగావచ్చి ఆయన యింటలేనందున వచ్చినదాకా కనిపెట్టుకొని యుండి మాటాడి వెళ్ళిపోవుచున్నాను.

తహ—దాని కేమికాని యీవీధినిజరిగిన శిశుహత్యవిషయము మీ కేమైన తెలియునా?

వైద్య—నా కెంతమాత్రము తెలియదు.

సోమ—ఈయనకు తెలియని దేమియు లేదు. కడుపుదిగబడుట కీయనే మందిచ్చినాడు.

వైద్య— ఈయన పురాణము చెప్పుచున్నప్పుడు వెనుక నొక సారి భీమారావుపంతులుగారి మరదలకి మందియ్యవలసినదని నన్ను బహునిధముల బతిమాలుకొన్నాడుగాని నేను ఆపని కొప్పుకోలేదు.

[బంట్రోతు ప్రవేశించుచున్నాఁడు]

తహ—ఏమోయి నీవొక్కడవే వచ్చినావు?

బంట్రో— భీమారావుపంతులుగారు బసలో లేరు. ఆయన మఱదలిగారికేమో పదిదినములనుండి జబ్బుగానుండి మంచముపట్టినదట!

తహ— మనమిప్పుడు వెళ్ళి భోజనముచేసి తిరిగి వత్తము. బంట్రోతు! మధ్యాహ్నము వీరినందఱిని మాయింటివద్ద హాజరుపెట్టు.

బంట్రో—చిత్తము మహాప్రభూ! (అందఱు వెళ్ళుచున్నారు.)

---

४. प्रवेशमु—तहश्शीलुदारुगारि पडकगदि.

[तहश्शीलुदारुगारुनु, भार्य्ययु प्रवेशिंचुचुन्नारु]

तह—नीवु मटि येमाट चेप्पिननु विंदुनुगानि, ईमाट मात्रमु विननु. इटुवंटिमाट लेप्पुमनु नात्रो चेप्पबोकु.

भार्य—ईविषयमुलो मीरु नामाट विनक तप्पदु. भीमाराव्रुपंतुलुगारु सोमयाजुलचेत नावद्दकु नूटु कासुलनु पंपिनारु. वेयिरूपाय लेंतकालमु संपादिंचिन वच्चुनु? मीवद्द पदियेनुरूपायलु जीतमुलोनुन्न गुमास्ता नालुगुवेल रूपायलुपेट्टि मेड कट्टिनाडु. आयनकोडलु मोन्न पेट्टुकोनि वच्चिननगलु चूचिन नाकेंतो मुच्चटैनदि. नाकु नूटुवरहाल गुल्लटैन लेवु. मीरु तेच्चेडिजीतमु बुव्वकुनु गुड्डलकुनु सरिपोवु चुन्नदि. मोन्न मोन्न चिन्नयुद्योगमुललो प्रवेशिंचिनवारंदटु मनसुवच्चिनट्टु संपादिंचि भार्य्यलकुनु बिड्डलकुनु देहामुनिंड नगलु दिगवेयुचुन्नाय. मी रिंतकालमुनुंडि पनिचेयुचुन्न प्रयोजन मेमि? नाकु पेट्टुकोन मंचिसोम्मु लेदु; पिल्लवानि मेडकु बंगारपुकंटैनను లేదు. మీకు రేపు కొంచెము కాలిలో మల్లు గుచ्चుకొన్నయెడల, తరువాత నాబ్రతుకును పిల్లలబ్రతుకును ఏమి కావలెను?

తహ—(తనలో) అయ్యో! నే నిటువంటి యక్రమమున కెట్లు లోబడుదును? ఈరాక్షసి నెట్లు సన్మార్గమునకు దింపగలుగుదును! (బిగ్గరగా) నీ వెన్నిచెప్పినను రాజకార్యవిషయములలో నీమాట వినను. మనకు ధనము శాశ్వతము కాదు. దేహములు శాశ్వతములు కావు. నిత్యమయిన పరలోకసుఖమును విచారించుకోవలెను.

భార్య—మీరు నామాట వినని పక్షమున, నే నీ రాత్రి నూతిలో

పడి చచ్చెదను.

తహ—చావడిలోని కెవ్వరో వచ్చినారు; నీవు లోపలికిపో.

భార్య—నామాట వినకపోయిన నే నన్నంతపనిని చేసి తీఱ్ఱాడి దానను జుండీ. (అని వెళ్ళుచున్నది.)

తహ — (తనలో) స్త్రీలు విద్యలేని హేతువుచేత యుక్తా యుక్తములు తెలియక పశుతుల్యురాండ్రైనందునగదా పురుషుల కీటువంటి మనోవ్యథలు సంభవించుచున్నవి. నేను వానిమాట వినని యెడల, తప్పక చెప్పినంతపనియు జేయును. దాని నెట్లు విడిచిపెట్టి ఊరకుండగలను? ప్రత్యక్షముగా పాపకార్యమున కెట్లు ఒడిగట్టనేర్తును? నా కేమిచేయుటకును పాలుపోకున్నది. పూర్వము మానాయనగారు బ్రతికియున్నప్పుడు సహితము లంచములు పుచ్చుకొమ్మని ఆయన యెన్నివిధముల నిర్బంధపెట్టినను లోబడక తప్పించుకొని వచ్చినాను.

[భీమారావుపంతులుగారును, గుమాస్తాగారును ప్రవేశించుచున్నారు.]

భీమా—(కాళ్ళబీరద పడి) మీ రేలాగునైనను రక్షించి మామానము నిలువబెట్టవలెను. ప్రస్తుతవ్యవహారములో మా కేమైన అవమానము తటస్థించినయెడల మాకుటుంబ మంతయు ఏకకాలమున మీము కట్టుకట్టుకొని గోదావరిలో దిగవలసినదేగాని యిక మేము ప్రజలలో తలయెత్తుకొని బ్రతుకవలసినవారము కాము.

తహ—మీరు కాళ్ళు వదలుండి. నేను మీవ్యవహారములో న్యాయము చేయుటకు సందేహము లేదు.

గుమా—అలాగున కాదు. తమరిందులో వారిని రక్షించెద మని అభయహస్త మియ్యవలెను.

తహ—మంచిది వెళ్ళిరండి.

గుమా — భీమారావుపంతులుగారూ ! తహశీలుదారుగారి

వాక్యము రామవాక్యము. హరిహరాదు లట్టిట్టయినను, వారినోటి నుండి వచ్చినమాటకు తిరుగు లేదు, నైలళ్ళు పుచ్చుకొనిరండి.

(అందఱు వెళ్ళుచున్నారు.)

---

౫. పరిదేశము—సోమయాజులుగారి యిల్లు.

[సోమయాజులును, అవధానులును పరివేశించుచున్నారు.]

అవ—భీమారావుపంతులుగారి మఱదలివ్యవహారములో ఏమో ఉపద్రవము వచ్చుననుకొన్నాను. తమ కేమియు లేకుండ ఇట్లే తేలిపోయినదే.

సోమ—ఇందులో మంచిచెడ్డాలు తహశ్శీలుదారుగారి భార్య వారిని రక్షించినది. పెద్దమనుష్యులవిషయములో మఱియొకవిధముగా జరిగించినపక్షమున నూతిలో పడెద నని ఆమె గట్టిపట్టు పట్టబట్టిగాని, లేనియెడల నిస్సందేహముగా పంతులుగారిమఱఁది లీపాటి కారా గృహము పరివేశించినదే.

అవ—ఇందులో నీ వేమో పంతులుగారి పక్షమున లంచము పట్టుకొనివెళ్ళి తహశ్శీలుదారుగారిభార్య కిచ్చినా వని గ్రామములో పరివాదము గలిగినది వాస్తవ మేమైన నున్నదా?

సోమ—అది నిజమే. మేమీపనిని పంతులుగారును నేనును గుమాస్తాగారునుతప్ప బ్రహ్మకు తెలియకుండ మహారహస్యముగా జేసి నాము. అప్పుడే అందఱికిని ఏలాగున తెలిసినదయ్యా?

అవ—(ఆశ్చర్యపడి) ఈవిధవవ్యవహారములో తహశ్శీలుదారు గారు లంచము పుచ్చుకున్నారయ్యా? ఏమి యీయాశ్చర్యము; రవ్వంత సహాయముచేసినపక్షమున పదివేలరూపాయల నిచ్చెదమన్న సిరంవారి వ్యవహారములోనే గుడ్డిగవ్వ పుచ్చుకోక వెనుక శిక్ష వేసినాడే.

సోమ--అవును. అప్పుడలాగుననే చేసినారుకాని మేమిందులో గొప్పయంత్రము చేసినాము. కన్ను చెదరనట్లుగా ఒక్కసారి నూఱు కాసులు తీసికొనివెళ్ళి తహశ్శీలుదారుగారిభార్యచేతిలో పోసి, మాకు మీరుతప్ప వేఱే దిక్కులేదని రెండుకాళ్ళును పట్టుకొన్నాము. కార్యము చేయకపోయినయెడల నూతిలోనో గోతిలోనోపడి చచ్చెదనని భార్య పట్టుపట్టి కూచున్నతరువాత, ఎంతమంచివాడును లోబడక యేమిచేయ గలడు?

అవ--శిష్ట కాకపోయిన మానెగాని, గ్రామములోని మన సభాపతు లందఱును పంతులుగారిమఱదలిని వెలివేసెద మన్నారు. ఆ సంగతి యేమైనది?

సోమ--డబ్బుగలవారి కెప్పుడును ఏవెలులును రావు. నలుగురు సభాపతులును నాలుగుపదులు పుచ్చుకొని రేపటిదినము జరుగు కాశీ సంతర్పణలో భోజనములకు సిద్ధమయినారు. రెండేండ్లక్రిందట ఎవరినో తీసికొని లేచిపోయి రెండునెల లావలనుండి మరల రాగా భీమారావు పంతులుగా రింటపెట్టుకొన్నప్పు డేమిచేసినారు? అప్పుడు మీరందఱును జేరి కులములో జేర్చుకొన్నారా లేదా? ఆతరువాతనేకాదా యీమె కాశీయాత్రవెళ్ళినది. అప్పటినుండియు సంతర్పణ జరగలేదట! రేపు సంతర్పణ జరిగించి, ఆమెయే బ్రాహ్మణులచేతులలో హస్తోదకము వడ్డించునట!

అవ--మన బ్రాహ్మణ్యము బొత్తిగా చెడిపోవుచున్నది. ఇప్పు డన్నిటికిని డబ్బు ప్రధానము. ఈపాడువ్యవహారము మనకెందుకు? వెళ్ళిపోదము లెండి.

(అని యిద్దఱును లేచి వెళ్ళుచున్నారు.)

సంపూర్ణము.

హాస్యసంజీవని

ప్రథమభాగము.

ఆచారము.

[చేదస్తపు చెలమమ్మా, ఆచారపు అన్నమ్మా ప్రవేశించుచున్నారు.]

చెల.— అన్నమ్మతల్లీ! యీకాలపువాళ్ళకు బొత్తిగా ఆచార మన్నమాట లేదు. మరీ నాకోడలు కాపురానికి వచ్చినతరువాత యింట్లో వట్టిమాలకూడు కలుస్తూవున్నది. యిక మనవంటివాళ్ళం బ్రతకకూడదు. యేమైనాఅంటే యెదురుకెదురు నాకే చాదస్తమంటారు.

అన్న— చెలమమ్మా! చెపితే నమ్మ్రతావోలేదోకాని అరవై యేళ్ళదాటినా మాయింటిఆయన యిప్పటికి ఆచారమన్న మాట యెరగడు. నేనుమాత్రం యేలాగేలాగో కొంచెం ఆచారం నిలుపుకుంటూవున్నాను. మావీధిలోనుంచి ముట్టువాళ్ళు వెళితే రెండువందలు తిట్టి మాయింట్లో కుండలన్నీ తీసి పారవేస్తాను. సగంముప్పాతికపాళ్ళు నానోటికి వెఱచి వాళ్ళు చాకిరేవుకు అవతలవీధినుంచి చుట్టుతిరిగి పోతారు. తుప్పుమొదలుకొని సమస్తవస్తువులూ రోజూకడిగి శుద్ధిచేస్తాను. మావారు వీధిలోనుంచి వచ్చేటప్పటికి యెదురుగుండా చెంబెడు పేణ్ణీళ్ళు కలుపుకునివెళ్లి మీదపోసి శుద్ధిఅయినతరువాత మరీ లోపలికి రానిస్తాను. మొన్న శీతాకాలంలో రాత్రిచలివేళ మీద పేడనీళ్ళు పోసినా నని కోపం వచ్చి నా మొగుడు మూడునెలలు యింటికి రాక

లేచిపోయినాడు. పోసిపొమ్మని వూరుకున్నాను. మనకు గోమయం వేస్తేనేకాని యేదీ శుద్ధికాదుగదా ?

చెల — నీవు అదృష్టవంతురాలవుగనుక వొక్కమోస్తరుగా ఆచారం జరుపుకుంటూవున్నావు. నాకు నీలాగుజరుగదు. అక్కడికీ నేను రోజుకు రెండువందలస్నానాలు చేస్తాను. యివేళమట్టుకు యిప్పటికి పదిస్నానాలు చేసినాను. తెల్లవారిలేచి దొడ్లోకివెళ్ళినప్పుడు కాలికింద యేమోమెత్తగా తగిలి అదియేమిగుడ్డోఅని తలనిండా స్నానముచేసి నాను. తరువాత మాకోడలు దగ్గిరనుంచి వెళ్ళినప్పుడు పైటకొంగుతగిలి నట్లు అనుమానం కలిగి మళ్ళీ స్నానము చేసినాను. గోదావరికివెళ్ళి స్నానముచేసి బిందెయెత్తుకొనివస్తూ బట్టలువుతుక్కునేవాళ్ళనీళ్లు పడ్డట్లు తోచి మళ్ళివెళ్ళిమునిగినాను. తీరా వడ్డుకువచ్చేటప్పుడు నీళ్ళలో కాలి కేదో ఆకు తగిలి అంటతప్పేలాలు తోమేవాళ్ళు వేసినఅంట్లాకని నీళ్లు పారపోసి వెళ్ళి మళ్ళీస్నానముచేసినాను. తరువాత బిందెత్తుకొని సగుం దూరం వచ్చేటప్పటికి యిరవైగజాలదూరములో మూలవాడు కనబడి నీళ్లు నడివీధిలో పారపోసి వాణ్ణినాలుగుతిట్టి వాడిజీవానికి వుసూరు మంటూ మళ్ళీ వెనుకకు గోదావరికి వెళ్ళి స్నానముచేసి నీళ్ళు తెచ్చు కున్నాను. యింటికి వచ్చినతరువాత పొయ్యిమీద యెసరుపెట్టి దాసీది తోమితెచ్చిన గరిటె తోలుచుకోబోయి దానిని మసి వదలనందున నూతిదగ్గిర మళ్ళీ స్నానముచేసినాను. ఆ అంట్లతప్పేలాలలో వకటి తీసు కునివెళ్ళి మాకోడలు లోపలపెట్టినందున, యింట్లోవస్తువులన్నీ తడుపు కొనేటప్పటికి జామయినది. తీరా వంటచేసుకుంటూవుండగా బల్లి మీద పడి వకమాటున్ను, శూద్రివాళ్ళమాట వినబడి వకమాటున్నూ రెండుస్నానాలుచేసినాను. యీలోగా అన్నంచిమిడిపోయింది. వేగిరం మునిగివచ్చి అన్నంతప్పేలాదింపి, ఆపొయిమీద కూరవేసి గంజివార్చి

కున్నాను. ప్రొద్దుటినుంచీ మడికట్టుకొని కూర్చున్నందున కడుపుబ్బి అవ తలకు పోవలసివచ్చి ఆఖరుస్నానము చేసినాను. ఎన్నిస్నానాలయినవో లెక్కపెట్టినావా?

అన్న-- చాలాస్నానాలు చేసినావు. నేను నీకంటె పదిరెట్లు స్నానాలు చేశాను. మాయింట్లో కుక్కవచ్చి అప్పుడప్పుడు యేమైనా ముట్టుకొనిపోతూ వుంటుంది. అప్పుడు వస్తువులన్నీ దూరముగా పారవేసి యిల్లు శుద్ధిచేసి గోమయం పూసుకొని నాలుగుస్నానాలు చేస్తాను.

చెల— నేను మును పెప్పుడయినా మాదొడ్లోకి గాడిదెవస్తే రాయి పుచ్చుకొని కొట్టి వూరకుండేదాన్ని. నీవు మొన్న చెప్పినప్పటి నుంచీ వకవేళ పరాకున మునపటి అలవాటుచొప్పున రాయి విసిరినా వెంటనేపోయి స్నానం చేస్తాను. నీవు మునుపు రోజూ గోమయం తినే దానవు యిప్పుడు తింటూవున్నావా?

అన్న--పెద్దదాని నయినాను. మునపటిలాగు తినలేను. అక్కడికీ మూడుపూటలూకలిపి వుసిరికాయంతవుండ కళ్ళుమూసుకొని మింగుతాను. గోమయం యెంతతింటే అంత పుణ్యము. గోవు అల్పాచమానం చేస్తూవుండగా వెళ్లి తోకతో నెత్తిమీన చల్లుకొని పంచితం మూడు పిడిసిళ్ళ లోపలికి పుచ్చుకుంటే మరీ పుణ్యం. ఆలాగు విడవకుండా ఆరు నెలలు ప్రతిరోజూ పుచ్చుకుంటే బొండెతో స్వర్గం వస్తుందట. ఆలా యెవరికీ లభించను. మొన్న నేతివారింటికి పొద్దున్నే పేడకు వెళ్లేటప్పటికి వారి పెల్లాపు అల్పాచమానం చేస్తూవున్నది. పంచితం నెత్తిమీద చల్లుకోవలెనని వెనుకకు వెళ్ళి తోక పట్టుకునేటప్పటికి మొఖంనిండా వక్కతన్ను తన్నింది. దానితో పెనకుక్కపడి వక్కబొట్టయినా మీద చల్లుకోకుండానే యింటికి వచ్చినాను.

చెల--నీవు మూడుదినాలబట్టే మొగానికి సున్నపుగట్టు వేస్తూ వున్నావు. అందుచేతనేనా?

అన్న-- అవు నందుచేతనే అప్పుడు నెత్తురువచ్చి గాయమైనది. తడిబట్ట కట్టుకుంటే గాయం చీంపోస్తుంది. పట్టుబట్ట కట్టుకోమని మా వారు మూడురోజులబట్టే పోరుతూ వున్నారు. రోజూ వుతికి ఆరవెయ్యకుండా పట్టుబట్ట మడికి పనికివస్తుందేమో నీ కేమైనా తెలియునా?

చెల-- పనికివస్తుందని పెద్దలు చెప్పుతారు. భోజనముచేసి విడిచినతరువాత దర్భాసనంలో కడితే దానికి యెన్నాళ్లయినా మయిల లేదుసుమా. మా అబ్బాయి పట్టుబట్ట నేను ఆరునెలలకు వకపర్యాయం వుతుకుతాను. అప్పుడు దానిలోనుంచి నాలుగుకుంచాలమురికి పోయి జిడ్డు నీళ్ళల్లో తేరుతుంది.

అన్న--మడిబట్ట అంటే జ్ఞాపకం వచ్చింది. దక్షిణాదివాళ్ళకు బొత్తుగా మడి లేదు. ఆదేశములో శుభ్రఅనాచారం. మొన్న మా యింటికి వక దక్షిణాదిబ్రాహ్మడు భోజనానికి వచ్చినాడు. తెల్లగా పువ్వులాగు చాకలిది వుతికితెచ్చినబట్ట కట్టుకొని వూరంతా తిరిగివచ్చి ఆబట్టతో విస్తరిదగ్గిర కూర్చున్నాడు. యిదేమంటే తాను కట్టుకున్న తరువాత విడువలేదు, తనది మడిబట్ట అంటాడు. వాడి కేమి చేటు కాలం వచ్చిందోకాని బ్రాహ్మన్నే గోదావరివొండునీళ్ళలో ముంచి తెచ్చుకున్న నాపంచె చూచి కావలిస్తే నీది మయిలబట్ట అన్నాడు.

చెల--నీళ్ళు లేకపోయినాకానీ వక్కసారి బురదలో అయినా ముంచి పిడిచి ఆరవేస్తే మడిబట్ట అవుతుంది. ఆదేశపువాళ్ళకు మడంటే యేమిటో, మయిలంటే యేమిటో తెలియదు.

అన్న--వుండు, నీతో మాట్లాడుతూ పరాకున గోడమీద

చెయ్యివేస్తే బల్లితోక కామల్సును చేతికి తగిలింది. అదుగో గోడమీద మాలబల్లి పాకుతూవున్నది. నేను వెళ్ళి స్నానం చెయ్యవలెను. నాలుక యిగిరిపోతూ వున్నది. స్నానం చేస్తేనేగాని నోట్లో మంచినీళ్ళచుక్క పోసుకోవల్లకాదు.

చెల — నీవు నన్ను తగలలేదుగదా నేనుకూడా స్నానం చెయ్యవలెను.

అన్న — నేను దూరంగానే వున్నానుకాని, అయినా యెందు కయినా మంచిది. గోదావరిలో వక్కముణక లేసి నీసందేహం తీర్చుకుని మరీవస్తా. (అని ఇద్దఱును వెళ్ళుచున్నారు.)

అపాత్రిదానము.

ప్రదేశము — రాజవీధి.

[వెంకటావధానులు ప్రవేశించుచున్నాడు.]

వెంక — (తనలో) భోజనమునకు తడుముకోనక్కరలేకుండా పదిఘంటలకల్లా వాది రెండుకూరలతో వంట చేయిస్తూవున్నాడు గదా? సాక్ష్యం యివ్వడానికయి పుచ్చుకొన్న నాలుగురూపాయిల లోనూ వక్కచిల్లిగవ్వ కర్చుపెట్టను. రాత్రి వెళ్ళినముండ ప్రతిమాటు పావలాకుతక్కువ పుచ్చుకోదు. దానిదగ్గిర సంకటాలు వున్నవేమోనని భయంగా వున్నది. అయినాకానీ ఫర్వాలేదు. అథమం యీరాత్రికి కావలసిన నాలుగణాలయినా యీపూట యీవూళ్ళో సంపాదించ వలెను. ఇవాళ సాక్ష్యం అయితే రేపుసాయంకాలానికి మావూళ్ళో కుశలంగా వుంటాను. ఆవచ్చేచిన్నవాణ్ణి యీయిల్లు యెవరిదో అడుగుతాను.

[ఒక చిన్నవాఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వెంక—అబ్బాయీ! ఈయిల్లు యెవరిది?

చిన్న—కోర్టునాజరు రామదాసుపంతులుగారిది.

వెంక—వారి యింటిపేరు యెనరు?

చిన్న—వాడ్రేవువారు.

వెంక—ఆయనతండ్రిపేరు యెవరు?

చిన్న — భీమరాజుగారు కాబోలును. నేను బజారుకు వెళ్ళవలెను. (అని వెళ్ళుచున్నాఁడు.)

వెంక—(లోపలికి వెళ్లి) అయ్యా! రామదాసుపంతులుగారండీ! నేను చదువుకొన్న బ్రాహ్మణ్ని, తమ దర్శనంసిమిత్తం వచ్చినాను.

రామ—(లోపలినుండి వచ్చి) మీ దేవూరయ్యా?

వెంక—మాది పడమట కృష్ణాతీరమండి; నేను జిల్లాంతమూ వేదం అధ్యయనం చేసినానండి. మాతండ్రిగారు చనునంచేసినారు.

రామ—మీరు యీగ్రామం యెందుకు వచ్చినారు?

వెంక—కాశీయాత్రకు వెళ్లవలెనని బయలుదేరి వస్తూవుండగా మధ్య యేలూరు దాటినతరువాత దొంగలుకొట్టి నాదగ్గిరవున్నరూకీ చెంబూ నాలుగుబట్టలూ ఫదిరూపాయల రొక్కమూ దోచుకొనిపోయి నాదండి. నేను యిప్పుడు కట్టుగుడ్డలతో యీగ్రామం వచ్చినాను. చేతిలోకి చెంబు లేదండి. తమకీర్తి జగద్విశ్రాంతమయినదండి. మీరు దాన కర్ణులు. తమరినిచూస్తే నా దరిద్రవిమోచనం అవుతుందని చంద్రుడికోసమయి చకోరపక్షులు వెతుక్కుంటూ వచ్చినట్టు నేను మీవూరు బయలుదేరినప్పటినుంచీ దోవపొడుగునా మిమ్మే స్మరించుకుంటూ వచ్చినాను. తమరు బహుదొడ్డబ్రాహ్మలు.

రామ—మీరు యిప్పుడు యేమంటారు?

వెంక—చెంబుమాత్రము మీరు కొనిపెట్టవలెను. కాశీరామేశ్వరములదాకా రామదాసుపంతులుగారు చెంబు కొనిపెట్టినారని చెప్పుకుంటాను. తమపేరు శాశ్వతంగా వుంటుంది. అయ్యా! తమకు వాడ్రేవు భీమరాజుపంతులుగా రేమవుతారండీ?

రామ—వారు మా తండ్రిగారు.

వెంక—ఆలాచెప్పండి; భీమరాజుపంతులుగారంటే లోకప్రసిద్ధి. ఇన్నిదేశములు తిరిగినానుకాని, ఆయనవంటి దాతను నేను మఱి యెక్కడా చూడలేదు. మొదటినుంచీ మీవంశమే అటువంటిది.

రామ—మా అన్నగారు మీజిల్లాలో తహశ్శీలుదారీ చేసినారు. మీ రాయన నెరుగుదురా?

వెంక—ఏతాలూకాకండీ?

రామ—గుడివాడతాలూకాకు.

వెంక—వారి నామధేయం?

రామ—వెంకటచలంగారు.

వెంక— ఓహోహో! వాడ్రేవు వెంకటాచలంపంతులుగారు మీఅన్నగారండీ? వారి నెరుగకపోవటమేనా! వారు నిరన్నప్రదాతలు. మీజిల్లాలో అంతటా వారిపేరు విఖ్యాతిమోసినది. ఆయనకు చదువు కొన్న బ్రాహ్మణ్ణి అని నాయందు పరమభక్తి. ఆయనది కేవలం ఈశ్వరావతారం.

రామ—ఓయి బంట్రోతు! వీధిలో యెవ్వరో కేకలు వేస్తూ వున్నారు చూడు.

బంట్రో—ఇద్దరుగుడ్డివాళ్లండి; ముష్టి పెట్టుమని కేకలు వేస్తూ వున్నారు.

రామ — గాడిదెకొడుకులను అరవకుండా అవతలికి కొట్టు.

ఈవూరు గుడ్డివాళ్ళతోను కుంటివాళ్లతోను నిండిపోయింది. తెల్లవారి లేస్తే ముష్టిముష్టి అని నిలువనియ్యకుండా వున్నారు.

బంటో—అందుకో నకడు బహు ముసలివాడండి. కప్పుకో డానికి బట్టసమేతూ లేదండి. చలిచేత వణుకుతూ వున్నాడు.

రామ—ముసలివాడూ లేదు గిసలివాడూ లేదు. వాళ్ళను అవ తలికి గెంటి యీరూపాయ మార్చి యీబ్రాహ్మడికి పావలా యిచ్చి తక్కిన మూడుపావలాలూ పట్టుకొని రా.

వెంక—మరివకరిద్రవ్యం కలియకుండా చెంబుకు కావలసినది తమరు దయచేయించవలెను. వక్క రూపాయపావలాఅయితే సరి పోతుంది.

రామ—ఏమిటో మాకుతోచింది మేమిచ్చినాము. తక్కినది మరివకచోట యాచించండి.

వెంక—"యాచ్నామోఘా వరమధిగుణేనాఽధమేలబ్ధకామా" అన్నాడండి. లేదనిపించుకొన్నా నేను తమవంటి పుణ్యపురుషులను యాచిస్తానుగాని లక్షవచ్చినా నీచులను యాచించనండి. తమరైతే గొప్పధర్మాత్మలే. మీసొమ్ము నాకింతే ప్రాప్తమున్నది.

రామ—ఈబ్రాహ్మడి కింకో రెండణాలుకూడా యియ్యి.

బంటో—చిత్తము. (ఇద్దఱును వెళ్ళుచున్నారు)

వెంక—(వీధిలో) ఈగచ్చరుగుల యిల్లెవరిదోయి?

బంట్రో—జోస్యుల-భీమయ్యగారిది.

వెంక—ఆయన కేమిపని?

బంటో—ఏమీ పనిలేదు డబ్బుగలవాడు. జూదమాడి రోజుకు నాలుగురూపాయలు గెలుస్తాడు. నెలకు యిరవైరూపాయల జీతంయిచ్చి ముండను వుంచినాడు.

వెంక— ఆరూపాయి యీలాగిస్యా. తక్కిన పదణాలూ నేను యిస్తాను. (అని బొడ్డుకొంగుమూటదీసి చిల్లరయిచ్చి రూపాయిపుచ్చు కొని బంటోతును పంపివేయుచున్నాడు.)

వెంక—(లోపలికి వెళ్ళి సావిట్లో కూరుచున్న యొకనల్లని మనుష్యునిజూచి) తమరేనా భీమయ్యగారు? తమదర్శనంచేసి కృతా ర్థుణ్ణిఅయినాను. ఇదివరదాకా తమఖ్యాతి వింటూరావడమే కాని యెప్పుడూ దర్శనంమాత్రం చెయ్యలేదు. యిప్పుడు నేను మూర్తిని చూస్తే నేను విన్నదానికీ యిప్పుడు చూచినదానికీ సరిపోయినది. వుంటారు లోకములో మహానుభావులు ! మీరు చూడబోతే యింత వున్నారు. మీకీర్తిచూడబోతే మూడులోకములూ నిండినదేమండీ?

భీమ— శాస్త్రుల్లుగారూ ! మీదేవూరండీ ?

వెంక—పడమట కృష్ణాతీరమండి. కాశీయాత్రి వెళ్ళుచూ వచ్చినానండి. దారిలో దొంగలు కొట్టినారండి. మహారాజులు తమరు వకవస్త్రం దయచేయిస్తారని తమకీర్తి విని వచ్చినాను. నెలకు రెండు వందిలరూపాయలు తెచ్చుకునే వుద్యోగస్తులుకూడా దాదృత్వంలో మీలో సహాసాగింపైనా పోలరు.

భీమ—మీరు చేతిలో డబ్బులేనిసమయంలో నచ్చినారు. నిన్న వచ్చినట్లయితే నేనే మంచిపంచెలచాపు కొనిపెడుదును. అయినాకానీ యీరూపాయపుచ్చుకొని వకపైనుపంచె కొనుక్కోండి.

వెంక—చిత్తము. చిత్తము. నాకు ఇదేపదివేలు. రామదాసు పరితులు నాజరీ చేస్తూవున్నాడన్నమాటేకానీ వక్కపావలా యిచ్చేట ప్పటికి పెద్దలు దిగివచ్చినారు. లోకములో దానకర్ణులన్ననూటి తమకే చెల్లింది.

భీమ - శాస్త్రుల్లుగారూ ! నమస్కారము:

వెంక—బహుధనకనక వస్తువాహన సమృద్ధి రస్తు. అప్పపుత్ర బహుధనమస్తు. (అని వీధిలోకి వెళ్ళి తనలో) కోర్టువేళ కావచ్చినది. వేగిరం వెళ్ళవలెను, యీపూట రూపాయిఆరుఅణాలు దొరికినవి. ఎప్పుడూ నేను బోగందానితో వెళ్లలేదు. ఈరాత్రి యీరూపాయి యిచ్చి బోగందానియింటికి వెళుతాను. పట్నవాసాలలో బోగంవాళ్ళు బహుఅందముగా వుంటారు. యింకొకసాక్ష్యందొరికితే బాగా వుండును. మరినాలుగురూపాయలు సంపాదిస్తును.

(అని వెళ్ళుచున్నాడు.)

గురుశ్రీష.

[వెంకన్నశాస్త్రిల శిష్యులగు శివయ్యయు, శంకరయ్యయు ప్రవేశించుచున్నారు.]

శివ—ఏమిరా? శంకరయ్యా! మన కీముండాకొడుకు చెప్పే చదువూలేదు వల్లకాడూలేదు. పనిచెయ్యలేక చచ్చిపోతూ వున్నాము. ప్రొద్దున్నేలేచి వంగచెట్లకు నీళ్ళు తోడిపొయ్యమంటాడు. నిన్న నేను పొయ్యలేనంటే అడ్డమయినతిట్లూ తిట్టినాడు. నీపని నయం నీకంతగా పని చెప్పడు.

శంక—నాలాగుచేస్తే నీకు చెప్పకపోను. నీవు రాకమునుపు ననూ్న యిలాగే రోజూ వంగచెట్లకు నీళ్ళుపొయ్యమని చంసేవాడు. వొళ్ళుమండి వకరోజు యింట్లో యెవరూలేకుండాచూచి చెట్లన్నీ పీకి పారవేసి యేమీయెరగనట్లు వూరుకున్నాను. ఆపని యేవరో దుర్మార్గులు చేసినారని నాటుగుతిట్టి వూరుకున్నాడు. తరువాత యేలాగో రెండునెలలకు నేనే ఆపని చేసినానని తెలిసి, అప్పటినుంచీ నాకు యిటు

వంటిపనులు చెప్పడం మానివేసినాడు.

శివ—మావూళ్ళో శాస్త్రులవద్ద రఘువంశం మూడేళ్ళు చదువు కొన్నాను. వక్కముక్కా తెలిసిందికాదు. ఆశాస్త్రులు యెప్పుడూ పని చేయించుకోవడమేకాని పాఠమే చెప్పేవాడుకాడు. ఈవూరు వచ్చి మూడునెల లయినది. ఈమూడునెలలనుంచీ చదివినా మేఘసందేశంలో పదిశ్లోకము లయినా అయినవికావు. ఆ అయినవాటికైనా అర్థం తెలియడంలేదు. "వ్రపకీడా" అంటే "ఉద్ఘాతక్రీడ" లంటాడు. నాకు దీనికీ దానికీ కూడా అర్థం తెలియక మొన్న మనగురువుగారి నడిగితే కుశ్మాండలు చేస్తావని చెడతిట్టినాడు.

శంక—అది మనగురువుకే తెలియదు. నెల్లాళ్ళక్రిందట నేను యిలాగంటిపిశ్నే అడిగేటప్పటికి గురుధిక్కారం చేసినావని ననూ అలాగే తిట్టినాడు. శుద్ధ తెలివితక్కువవాణ్ణి అని అందరితోనూ చెప్పడము మొదలుపెట్టినాడు. తరువాత నేను సంగతి తెలిసి యేమిచెప్పినా తలవూచి మహాబాగా తెలిసిందని సంతోషించడం మొదలుపెట్టినాను. అప్పటినుంచీ లోకంలో నావంటిబుద్ధిమంతుడు లేడని అందరితోనూ చెప్పి పొగుడుతూ వున్నాడు.

శివ—యిఖ ముందు నేనూ ఆలాగే చేస్తాను. బట్టలు వుతుకు మంటే రోజూ రెండుబట్టలు చింపుతాను. నీళ్లుతోడుమంటే చెంబు నూతిలో పడవేస్తాను. అక్కడితో రోగం కుదురుతుంది. అదుగో గురువుగారు వస్తూవున్నారు. పాఠం చదువుతూవున్నట్లు కనబడవలెను. వడిగ్గా కేకలు వెయ్యి.

[వెంకన్నశాస్త్రి ప్రవేశించుచున్నాడు.]

వెంక—ఏమిరా శిష్యుల్లారా? వంగచెట్లలో కలుపు తియ్యమన్నాను తీసినారుటా?

శంక—తియ్యలేదు. ఆనికె చల్లబాటువేళ శివయ్య తీస్తాడని నేను వూరుకున్నాను.

శివ—శంకరయ్య సాయంకాలం తియ్యవచ్చునంటే వూరుకున్నాను.

వెంక—ఓరి గాడిదెల్లారా! ఇప్పుడు బొత్తిగా గురుశుశ్రూషపోయినది. కుఱ్ఱముండాకొడుకులంతా బొత్తిగా పాడవుతూవున్నారు. స్కూళ్ళల్లో చదువుకున్నవాళ్ళను చూచి మీకూ చేటుకాలం నస్తూవున్నది. గురుశుశ్రూషవల్ల యెంతఫలం వున్నది? మాకాలంలో నేను యెంతశుశ్రూషచేసి విద్య సంపాదించినాను? నేను మాగురువుగారి దొడ్డి తవ్వి కూరలువేసి నిత్యం నీళ్ళు పోసేవాణ్ణి; పొలంలోకి వెళ్ళి పశువులకు గడ్డి తెచ్చేవాణ్ణి; ఆయనతోకూడా వూరంతా తిరిగి పొత్తరలు యింటికి జేరవేసేవాణ్ణి; పడుకున్నప్పుడు కాళ్ళు గుద్దేవాణ్ణి; పదిహేనురోజులకు వక్కశ్లోకమయినా చదువుకోవడానకు తీరుబడిలేకుండా పని చేసేవాణ్ణి.

శంక—మీరు బలంగలవారు గనుక మీరు ఆలాగు చేసేవారు. మే మిప్పు డంతపని చెయ్యలేమండి. మేమూ మా చేతనైనంతపని చేస్తూనేవున్నాము. అదుగో రామారావు వస్తూవున్నాడు. అతను స్కూలులో ఆరునెలలనుంచి సంస్కృతము చదువుకుంటూ వున్నాడు. అతనికి మాకంటె పదిరెట్లు యెక్కువ వచ్చినది. మూడేళ్ళబట్టి చదువుకుంటూవున్నా మాకు అర్థమూరాదు యేమీరాదు.

వెంక—మీకు చదువు మెల్లిగా వచ్చినా గురుశుశ్రూషాఫలం యెక్కడికిపోతుంది? దానిప్రభావం మీరు యెరుగరు. దత్తాత్రేయునకు పరిచర్య చేసి కార్తవీర్యార్జనుడు సర్వైశ్వర్యధుర్య డయిన చక్రవర్తి అయినాడు.

[రామారావు ప్రవేశించుచున్నాడు.]

శంక—పూర్వం వాళ్ళేమయినారో కాని యిప్పుడు మీరాదగ్గిర పదేళ్ళనుంచి చదువుకుంటూ వున్న శిష్యులు ముష్టి యెత్తుకుంటూనే వున్నారు. చదువు లేక వట్టిగాడిదలుకూడా అవుతూ వున్నారు. వాళ్ళ తరువాత నాలుగువెనుకలు స్కూల్లో ప్రవేశించినవాళ్ళు పండితు లయి గొప్పవుద్యోగాలు చేస్తూవున్నారు.

రామా—శాస్త్రుల్లుగారూ! మోచేటిపద్దంనోము చేసి లక్ష్మీదేవి ఐశ్వర్యవంతురాలునూ సువాసినీయునూ అయినది కాదండీ?

వెంక—మీకు గురుశుశ్రూష లేకపోవడంచేత యిటువంటి విపరీతబుద్ధులు పుడుతూ వున్నవి. కల్లుసముద్రాలు లేవంటారు. నేతి సముద్రాలు లేవంటారు. ఇంగ్లీషు చదువుకునే వాళ్ళందరూ కారవాది నగకాలలో పడిపోతారు. గురుశుశ్రూషాప్రభావం చెపుతాను విను. దానివల్ల విద్యార్థులు అహంకారవిరహితులును, విజితేంద్రియులును అవుచారు; లోకానుభవము తెలిసి వివేకవిలసితు లవుచారు; స్వామ్య తారతమ్యజ్ఞానము పొసంగును; సైరణ యెసంగును; అవిమృశ్యకారిత యడంగును; దీర్ఘదర్శిత సెలంగును; వర్ధిష్ణులగు బుద్ధిమంతులు దానినే యాసింతురు; దానివలన సత్ప్రవర్తనము కలుగును; విద్యార్థులు జగన్నుతులగుదురు; వేయేల? గురుశిశ్రూషవలన సమస్తైశ్వర్యములును కలుగును.

రామా—శాస్త్రుల్లుగారూ! మీరు ఫలశ్రుతి బహుబాగా చదివినారండి. మొన్న మా పురోహితుడు మాఅమ్మ లక్ష్మివత్తుల నోము చేసుకొన్నప్పుడు దానివలన సమస్తసంపదలూ కలుగుతవనిన్నీ ఆయురారోగ్య పుత్రపౌత్ర ధనకనక వస్తువాహనసమృద్ధి కలుగుతుం దనిన్నీ వేయిజన్మాలలో చేసిన పాపమంతా పోతుందనిన్నీ స్వర్గంలో

దేవత లంతా వుపచారం చేస్తూవుంటా రనిన్ని కల్పం మీలాగే చదివి నాడు. పుణ్యం వస్తుందని డబ్బు లాగడానికి వుపాయం కనిపెట్టినారు. గురువులున్నూ యిలాగే శిష్యులచేత చాకిరీ చేయించుకోవడానికి యిది యొక వేషం వేసినారు.

వెంక—ఇంగ్లీషుబళ్ళలో చదువుకునేవా ళ్ళంతా వట్టిపుంఠలు; వాళ్ళకు పిన్న లేదు. పెద్ద లేదు. మహానుభావులు చెప్పినదాన్ని వేళాకోళం చేస్తారు. డబ్బిచ్చి చదువుకోవడంచేత మీరు చదువుకొన్న ఫలం లేదు. మీకు చదువువచ్చినాకానీ వినయాదిసద్గుణములు పట్టుపడవు. జీతము పుచ్చుకొనుటచేత నుపాధ్యాయులు సేవకులగుచున్నారు; వేతనమిచ్చు చుండుటచేత విద్యార్థులు ప్రభువు లగుచున్నారు.

శంక—ఆలాగయితే విద్యార్థులు ఉపాధ్యాయులను కొట్టడానికి బదులుగా ఉపాధ్యాయులే విద్యార్థులను కొట్టుచున్నా రేమండీ?

వెంక—గాడిదెకొడుకా! నీకుకూడా పొయ్యికాలం వచ్చినది. ఈలాగంటి కుశ్నంకలు—

రామా—మీ కీవినయాదిసద్గుణములు గురుశుశ్రూషవల్లనే వచ్చినవికావండీ—

వెంక—అబ్బాయీ! లేచిపో. నిన్నుచూస్తే నాకు వళ్ళు మహా మండుతుంది. మీనాయనగారినిచూచి వూరుకున్నానుగాని లేకపోతే—

రామా—కొంచెం శాంతించండి. మీశుశ్రూషవల్ల మీశిష్యు లకుకూడా సద్గుణము లలవడినవి. మీరు దోవలో వస్తూవస్తూ యెవళ్ళ దొడ్లోనో వీధిలోనుంచి నారింజకాయలు కోయిస్తే మీశిష్యులకు శృంగారకట్టెతో పూజ జరిగిందట.

శంక—ఎవరియింట్లోనోకాదు; మనవుప్పువారి యింట్లోనే మా శివయ్య గోడయెక్కటప్పటికి లోపలినుంచి తిట్లారంభించడముతోనే

మాగురువుగారూ నేనూ సందులోనుంచి కనబడకుండా పారిపోయి నాము. ఇంతలో లోపలనుంచి వచ్చి పట్టుకొని దొంగతనం చేసినావని యీశివయ్యనే మొత్తగా పిండిపెట్టి సాగనంపినారు.

వెంక—ఓరిగాడిదెకొడుకా! గురుతిరస్కారము చేస్తూవున్నావు. యిక యెందుకూ అక్కరకురాకుండా మన్నుకొట్టుకుపోచావు. రామా రావూ! నీతండ్రిగారివద్దకు పద. (అని లేచుచున్నాడు.)

రామా—(లేచి నడుచుచు) మీరు చెప్పినట్లు మీవిద్యార్థి మొన్నటినుంచీ జగన్నుతు డయినాడు. (అని వెళ్ళుచున్నాడు.)

వెంక—(కొంతదూరము వెళ్ళి) ఆపక వచ్చి మీతండ్రిగారితో నీ ఆకతాయితనమంతా మనవిచేసి కొట్టిస్తానువుండు. గురుశుశ్రూష లేకుండా నీవు చదువుకొన్న చదు వెందుకూ పనికిరాదు. అవకీతచరిత్రం చూడు. (అని మరల వెనుకకు వెళ్ళిపోవుచున్నాడు.)

పెళ్ళి వెళ్ళినతరువాత పెద్దపెళ్ళి.

---

౧. రంగము—వీధియరుగు.

[రామారావుగారును నారాయణరావుగారును వీధిఅరుగుమీద కూరుచుండి యుండగా పురుషోత్తమరావుగారి కొమారుడు మాధవరావుగారు దారిని పరుగెత్తుకొని వెళ్ళుచు ప్రవేశించుచున్నారు]

రామా—ఏమండీ! మాధవరావుగారూ! స్నేహితులము యింతమందిపిలుస్తూవుండగానే మాట వినుపించుకోకుండా పరుగెత్తుతూ వున్నారు. మామీద యింతదయతప్పడం ధర్మమా?

మాధ—మాతండ్రిగారికి వంట్లో జబ్బుగా వుండడముచేత వెంక టాచార్లగారి యింటికివెళ్ళి అవుషధంపుచ్చుకుని పరుగెత్తుకొని వెళుతూ

వున్నాను. ఇప్పుడు మాట్లాడడానికి నాకు సావకాశం లేదు. మళ్లీవచ్చి మీతో మాట్లాడుతాను. క్షమించండి.

రామా— వక్కమాట వినిపొండి. మీతండ్రిగారు మొన్ననే కాదటండీ పెళ్ళిచేసుకుసివచ్చినారు. అప్పుడే జబ్బేమిటండి?

మాధ— "అమ్మగారు గృహప్రవేశమూ అయ్యగారు స్మశాన ప్రవేశమూ" అన్నసామెత నిజంగా వున్నది. ఈచమురుకాళ్ళపెద్దమ్మ యేమహూర్తాన్ని పెళ్ళామయిందోకాని మంగళస్నానాలయిన రాత్రి మంగళసూత్రధారణం చేసేటప్పుడే మాతండ్రిగారికి చలీజ్వరమూ వచ్చినది. ఆనాలుగురోజులూ మళ్ళీ జ్వరం రాకపోవడముచేత పెళ్ళిలో మాత్రం యేమీఅబ్బంది లేకుండా యథావిధిగా జరిగిపోయింది.

రామా— మనుగుడు పయిండా? యింకా అవశిష్టం వున్నదా?

మాధ— మనుగుడుపులోనే లంఖణాలన్నట్టు ఆభాగ్యంలోనే విరోచనాలు పట్టుకున్నవి. అక్కడివైద్యుడు లంఖణంకట్టడంచేత మరీ నిస్త్రాణ యెక్కువయితే యిక్కడ మంచివైద్యుడు మనవెంకటాచార్లు గారు వున్నారని సవారీభోయీలనుచేసి రాత్రికిరాత్రి యీవూరు తీసుకుని వచ్చినాను.

రామా— మనుగుడుపులో యిదీ అదీతింటే పెద్దలుగనుక అజీర్తి చేసి వుండును.

నారా— విరోచనాలమీద లంఖణాలు యెంతమాత్రమూ కట్టకూడదు. ఆవైద్యుడు వట్టితెలివితక్కువవాడుగా కనబడుతూవున్నాడు.

మాధ— మాతండ్రిగారు ఆట్టేపెద్దవారు కారు. ఆయన పెళ్ళి చేసుకోవడానికి తగినవయస్సులోనే వున్నారు. మనఅందరికంటెనూ ఆయనే దృఢంగా వున్నారు.

నారా— ఆయనకు అరవైయేళ్లు దాటినవండీ!

మాధ— యెక్కడిదండీ? మొన్నటిభాద్రిపదమాసానికి యాభై నాలుగుసంవత్సరములు దాటినవి. మీదటికి పించన్ పుచ్చుకొని యింటి కాడ కాలిమీద కాలు వేసికొని కూర్చుండి భార్యతో సుఖపడవలెనని యత్నిస్తూవున్నారు.

నారా— కొత్తపెళ్లికూతురు యెవరిచిన్న దండీ?

మాధ— యెవరిచిన్నదైతేనేమి? కస్తూరివారి చిన్నది.

నారా— ఆచిన్నదాన్ని నేను యెరుగుదును. చిన్నదానికి ఫది సంవత్సరము లుంటవి; బహులక్షణవతి.

మాధ— యేచక్కదనంవుంటే నేమి గుణంమాత్రం మంచిది కాదు. పెళ్ళిరోజుననే నా కీమగడు వద్దని యెక్కడలేనిఅల్లరిచేసి వక పట్టాన పీటమీద కూర్చున్నదేకాదు. అన్నగారువచ్చి నాలుగుకొట్టి బల వంతంగా పీటమీద కూర్చోపెట్టినాడు.

నారా— అలాగైతే మొగుడితో బాగానే సంసారం చేస్తుంది.

మాధ— దాని సంసారంయిల్లు బంగారంగాను మాతండ్రిగారికి యిప్పుడు నిమ్మళంగా వుంటేనేతప్ప మరివకవిధంగా అయితే తరువాత మనోవర్తికోసం మాపాణాలమీద కూర్చుంటుంది. కాపురానికి వచ్చిన తరువాత సవితిబిడ్డలను మమ్మల్ని తిన్నగా చూస్తుందండీ?

నారా— మీకు వయస్సెంతండీ?

మాధ— నాకు యిప్పుడు యిరవైయేడో సంవత్సరము.

రామా— కావలిస్తే ముండను వుంచుకోవచ్చును. పెద్దతనంలో పెళ్ళి చేసుకోవద్దని మీతండ్రిగారితో ఘట్టిగా చెప్పలేకపోయినారా?

మాధ— ఆయనకు మాతల్లిగారు జీవించివున్నప్పటినుంచీ వక ముండ వున్నది. యెంతమందిముండలు వున్నా చేసుకున్న పెళ్ళాము వంటిదికా దని ఆయన భ్రమపడ్డారు. ఆయన మాతల్లిగారు పోయిన

పదమూడోనాడే వివాహం చేసుకోవలెనంటే మా నిర్బంధంచేతనే యేడాదివరకూ మానివేసినారు.

నారా—ఇంత పెద్దవాళ్ళకు తల్లిదండ్రిలు పిల్ల నేలాగు యిస్తా రండీ ?

రామా—డిప్టీకలెక్టరీ చేస్తూవుంటే డబ్బు కాశపడి చచ్చిన శవానికి పిల్ల నివ్వ్రంటే లక్షమంది ఇస్తారు.

మాధ—మాటలసందడిని చాలాసే పయినది. మాతండ్రిగారికి వేగిరం అవుషధం యివ్వవలెను. నేను వెళ్ళుతాను. మీరు వక్ర-పర్యా యం వచ్చి మాతండ్రిగారిని చూచిపోరా?

రామా— మేమూ లోపలికి వెళ్ళి మంచిబట్టలు కట్టుకుని వస్తాము. మీరు నడుస్తూ వుండండి.

మాధ—చిత్తము. సెలవుపుచ్చుకుంటాను. (అని వెళ్లుచున్నాడు)

నారా—ఇఖ వెంకటాచార్లు చేతిలో పడ్డతరువాత "నాచేతి మాతా్ వైకుంఠయాతా్ అన్నట్టు!" యీఘటం నెగ్గేది కాదు. మనము వెళుదాము రండి. (అని వెళ్ళుచున్నారు.)

---

౩. రంగము—పురుషోత్తమరావుగారి యిల్లు.

[వైద్యుడు వేంకటాచార్యులును, సిద్ధాంతి శివయ్యయు, బంధువులు వరదరాజును, కనకరాజును ప్రవేశించుచున్నారు]

వర—యేమ్లోవున్నదని చెప్పను? పూర్ణంగా వాయువుచేసుకుని వున్నది. వైద్యలోపం యెంతమాత్రిమూ లేదు. వైద్యుడు చేతనయిన పని అవుషధం యివ్వగలడుగాని ఆయుర్దాయం పోయగలడా? యింతకూ కొత్తగా పెళ్ళిచేసుకొన్న పెళ్ళాముయొక్క అదృష్టం యేలాగువున్నదీ తెలియదు.

కన—ఇవిడ అయిదోతనం తిన్నగా వుంటే మీవైద్యం రాకనే పోను. ముసలివాణ్ని లంఖణాలుకట్టి నిష్కారణంగా పాడుచేసినారు.

వెంక—అబ్బాయీ! నీవుచిన్నవాడవు నీకుయేమీ తెలియదు. వూరుకో. లంఖణాలలో యెంతగుణం వున్నదనుకొన్నావు యేమిటి? "లంఖణం పరమౌషధం" అన్నశాస్త్రకారు డంత వెట్టివాడేనా? నేను చెప్పినప్రకారం విని మధ్య లంఖణం చెడగొట్టకుండా వున్నట్టయితే నాలుగులంఖణాలతో రోగం నిశ్శేష మయిపోయేది. మధ్య డ్రైస్సరుని వకణ్ని తీసుకునివస్తే వాడు గోధుంజావ పోయించి రంగమంతా చెడ గొట్టినాడు. తీరా చెడిపోయినతరువాత యెన్నిలంఖణాలు కడితే యేమి వున్నది? యెన్నిమందులు వేస్తే యేమివున్నది?

కన—డ్రైస్సరు అవుషధం యిచ్చినది నక్కపూటే కాదూ?

వెంక—చెడగొట్టడానికి వక్కపూట కాదుగదా వక్కనిముషం చాలును. యిందులో నావైద్యలోపం పిసరంత లేదు. డబ్బుకు వెనుకా ముందూ చూడక దివ్యౌషధాలుకుప్పెలు పగలగొట్టిపోసినాను. వాత రాక్షసం, వాతవిధ్వంసి, వాతాంతకరసం, వాతమూషిక మార్జాలం, వాతపన్నగగారుడం; ప్రళయాగ్నిరసం మొదలయిన కాకచేసే అవుషధా లన్నీ పోసినాను. చివరకు చింతామణికూడా వేసినాను.

కన — ఈ ఔషధాలపేర్లన్నీ యెప్పుడు వల్లించినావయ్యా! నీదగ్గిర డబ్బు లేదుగదా వైద్యశాస్త్రం చదువుకోనిదీ యీఅవుషధా లన్నీ యెట్లా చేసినావు?

వర—పెద్దల్ని ఆక్షేపించరాదు. వూరుకో; ఆయన యేఔష ధాలూ లేకపోతే వూళ్ళో అందరికీ యెలా అవుషధం యిస్తూవున్నాడు? వైద్యుడియందు గురివుంచే ఆయన మన్ననలిపి చేతిలోపెడితే యెటు వంటిరోగాలూ నిముషంలో కుదురుతవి.

కన— ఈయననుమాన్సించి డాక్టరుచేత అవుషధం యిప్సించిన ట్టయితే వ్యాధి నిమ్మళించేది.

వర— ఆవైద్యం తెల్లవాళ్ళకేకాని డాక్టరువైద్యం నల్లవాళ్ళకు యెంతమాత్రినూ పనికిరాదు. వాళ్లు మాంసమూ రొట్టే తింటారు గనుక వాళ్ళతత్వాలకూ మనతత్వాలకూ చాలా భేదం వుంటుంది. మనతత్వాల మీద నల్లవైద్యమే బాగానడుస్తుంది.

వెంక—"తుదకబ్బెరాతురకకూ "డన్నట్టు లోక్యులందరూపోగయి యింత శిష్టుగావున్న బ్రాహ్మడికి అవసానకాలమందు మాలనీళ్లు నోట్లో పోయించడానికి మాధవరావుగారిని డాకుదొరకోసం పంపించినారు. డాక్టరు డాక్టరనడమేకాని వాళ్లకు నాడిచూడడమైనా తెలుసునండీ?

కన—అన్నీ నీకే బాగా తెలుసును. మీరందరూ ఆశ వదలుకున్న మీ పెత్తండ్రికుమారుడికి మొన్ననేకాదూ డాక్టరు కుదిర్చినాడు?

వెంక—వాళ్ళు రణవైద్యంలో ఘట్టివాళ్లు. అంతేకాని మరివక దానిలో పనికిరారు. వైద్యంమాట వల్లకాడుగాను మాలనీళ్లు త్రాగి బ్రాహ్మణీకమూ మతమూ పోగొట్టుకోమండీ? డాక్టరువస్తే ముందుగా పొక్కు-పాలాస్త్రి వేసి ప్రాణం వుండగానే చంపినేస్తాడు.

శివ—ఈవైద్యాలవల్ల యేమీకార్యంలేదు. ఇప్పుడు పురుషోత్త మరావుగారికి శనిచాలదు; సవగ్రహజపంచేస్తే అంతా నిమ్మళిస్తుంది. నేను పోరి నాలుగు రోజులనుంచి జపాలు చేయిస్తూవున్నాను. గుళ్లోకి అభిషేకాలనిమిత్తం బ్రాహ్మలు వెళ్ళినారు. అభిషేకంచేసివచ్చి తీర్థం లోపలికి యిస్తే కాస్తసేపటికి అంతా నిమ్మళంగా వుంటుంది.

వర—పంతులుగారికి కోళ్లన్ని నొప్పులుగా నున్నవి. నాకుచూస్తే ప్రయోగలక్షణంగా కనబడుతూ వున్నది. అయినాకానీ బుద్ధిమంతులు

మీరుకూడా ఆలోచించవచ్చును.

శివ—నాకూ ఆసందేహమే తోచి భూతవైద్యుణ్ణి పిలిపించి విభూతి పెట్టించినాము. తెల్లవారిగట్ల ఆడవాళ్ళు సోదికి వెళ్ళితే పేరం టాలుగుడివద్ద మాలదికూడా పెద్దపెళ్లామ పట్టినదనీ విరోధులు ప్రయోగంచేసినారనికుండా చెప్పినది. ఈనవగ్రహజపాలు అన్నింటికీ మంచివే. గ్రహశాంతికయి బ్రాహ్మణసంతర్పణమాత్రం బాగా జరగవలెను.

వర—ఆగండి. లోపలనుంచి కామావధానులుగారు యేమిటో కేకలు వేస్తూవున్నారు—ఏమండోయి కామావధానులుగారు!

కామా— (లోపలనుంచి) మాధవరావుగారు యింకా రాలేదు గదా? ఈపాటి పంతులుగారికి ప్రాయశ్చిత్తం చేస్తే బాగా వుంటుంది. దక్షిణ యివ్వడానికి మాధవరావుగారు లేరు. యేమిబుద్ధి?

వర—యింతలోకేఫర్వాలేదు. కొమారుడువచ్చినదాకాఆగండి.

కామా—యింకాయేమి ఆగమంటారు? యిఖ డాక్టరు జరూరు లేదు. కనిపెట్టుకొని వుండక తక్షణం బయలుదేరి రమ్మని వర్తమానం పంపించండి. మంచంమీద ప్రాణాలు పోకుండా మనము పంతులుగారిని భూశయనం చెయ్యవలెను. మాధవరావుగారు మంచిసమయానికి లేక పోయినారుగదా? నాకు యిప్పుడు వుత్క్రమణగోదానం వస్తుంది. ప్రాణోత్క్రమణసమయం వచ్చింది.

వర— అబ్బాయీ! మనంయేదోవక వంకపెట్టుకుని వెళ్ళిపోదామురా. అట్టేవుంటే పీనుగును మొయ్యమంటారు.

కన— యిటువంటి ఆపద వచ్చినప్పుడే సహాయం చెయ్యకపోతే మనబంధుత్వంయెందుకు తగలబెట్టనా? నేనురాను. కావలిస్తే మీరు వెళ్లండి.

కామా—వేగిరం లోపలికి రావలెను. పంతులుగారికి ఆఖరు మొగుపులు వచ్చినవి. ప్రాణాలు పోయినట్టున్నవి.

వర—నేను మాధవరావుకోసం వెళ్ళుతాను. మీరు తదంగం కాసిస్తూవుండండి. నక్షత్రం మంచిదేమో చూడండి. కాకపోతే యిల్లు వదలిపెట్టవలసి వస్తుంది. భగ్గూరుంటే ఆయనను పంచపాళీలో పెట్టండి.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ఉన్మత్తప్రలాపము.

[చెన్నపురిలోని యున్మత్తవైద్యశాలలో పిచ్చిపంతులుగారును, వైద్యశాస్త్రులుగారును సంభాషించుచుండగా వివేకాచార్యులుగారు ప్రవేశించుచున్నారు.]

పంతు—శాస్త్రులూ ! అదుగో ఆచార్లు వస్తూవున్నాడు. వాడి మొఖం మండ; వాడిల్లు వల్లకాడుగాను.

శాస్తు—(మెల్లగా) ఆచార్లు వంటిగా వస్తూవున్నాడు. మనం యిద్దరంవున్నాము. కొడదామా?

ఆచా—యేమోయి పంతులూ! దారిపట్టుకుపోయేవాణ్ణి నిష్కారణంగా ఆలా తిడుతూ వున్నావు. అమావాస్యకూ పౌర్ణమికీ పిచ్చి యెక్కువవుతూ వుంటుంది. ఇవాళ పౌర్ణమిగనుకనా ఆలా వాగుతూ వున్నావు?

పంతు—మావంటి వృత్తమపురుషుల గృహాచారంచేత మన దేశానికి మ్లేచ్ఛప్రభుత్వంవచ్చి బొత్తిగా వర్ణసంకరం అవుతూవున్నది; యెక్కడ చూచినా వట్టి మాలకూడు జరుగుతూ వున్నది. ఇప్పుడు ఖైనుకట్టికాల మయితేనా నీవంటిదుర్మార్గుల నందరినీ యిలాగంటి

"ఆక్యగర్వితమయిన" పనులు చేస్తూవున్నందుకు వక్కదెబ్బకు తలలు బద్దలుకొట్టి చంపివెయ్యమూ?

ఆచా—ఆత్మస్తుతి పరనిందా మహాభాగా చేసుకుంటూ వున్నావు. ఎన్నాళ్ళు వాగుతావో వాగు—నీనోరు నొప్పిపెట్టి నీవే వూరుకుంటావు. నీవంటిపిచ్చివాళ్ళనే మాటలకు నాకు యెంతమాత్రమూ విచారం లేదు. పిచ్చివాడవు కావడంచేత నీవు యెన్నితిట్లుతిట్టినా కోపం రావడానికి బదులుగా నిన్ను చూస్తే నాకు జాలి వేస్తూవున్నది.

పంతు—ఇటువంటి వేలాపస పేలుతూవుంటే నాకు పిచ్చియెత్తి వళ్ళు తెలియక యేమయినా చేసిపోతాను లేచిపో. నాకు నిజంగా పిచ్చి యెత్తినట్టయితే యీపాటి నీతలకాయ రెండుచక్కలుచేసి నాఅక్కస్సంతా తీర్చుకోనూ?

ఆచా—వెట్టి వెయ్యివిధాలన్నాడు. నీకు పిచ్చివేరే యెత్తనక్కర లేదు. ఇదివరకేకావలసినంతవున్నది. మరీపిచ్చియెక్కువైనవాళ్ళు కనపడ్డ వాళ్ళనందరినీ కొడుతారు. నీవంటి సాధారణపుపిచ్చివాళ్ళు తిట్లతో మాత్రం సరిపెడుతారు. పర్వదినాలలో పిచ్చ ముదురుతుంది కాబట్టి నీవు నెలకు వకపర్యాయం పౌర్ణమిపౌర్ణమికిఅందరినీ తిడుతూవుంటావు. నీపిచ్చ యెప్పుడు కుదిరి మంచివాళ్ళలో పడుతావా అని భగవంతుణ్ణి యెప్పుడూ ప్రార్థిస్తూవుంటాను.

పంతు—యేడుస్తూవుంటావు. ఇప్పుడు కాని కాలాలు వచ్చినవి యేమీ నోరెత్త వల్లకాదు. మూలప్రభుత్వం కావడంచేత అన్నీ నిర్బంధాలే. అడ్డమయినవాళ్ళూ చదువుకోవడమే; అడ్డమైనవాళ్ళూ వుద్యోగాలు చెయ్యడమే; యెవరినీ కాస్త తిట్టవల్లకాదు; కొట్టవల్లకాదు; యీపాడుకలికాలం యెప్పుడు పోతుందో.

శాస్త్రి—ఒక్క మగవాళ్ళకేకాకుండా యెన్నడూ యెరుగము

ఆడవాళ్ళకుకూడా చదువు వచ్చిందయ్యా! ఆడముండల చదువుమూలాన్ని యెక్కడా నిలవడానికి వల్లకాకుండావచ్చింది. గరల్ స్కూలులో చదువుకుందట. . దాసిచదువు చట్టుబండలుగాను మూడేళ్లముండ నాపెళ్ళాము పేడ ముట్టుకుంటే అసహ్యా అని నన్ను యెదిరిస్తుంది. గోమయం యెంత శుచిఅయినవస్తువు? నాబ్రతుకుపెట్టుకుని మొన్న అమావాశ్యనాడు దానిచేత మూడుపేడపుండలు మింగించలేకపోయి నాను.

ఆచా— ఓయిపిచ్చిబ్రాహ్మడా! నీకు అమావాశ్యనాడు పిచ్చి యెత్తుతుందా యేమిటి? అసహ్యం లేకుండా పేడముద్దలు మింగమనడం యేమిటయ్యా?

శాస్తు— అమావాశ్య పితృదినంగనుక శుచిగా వుంటేనే కాని బ్రాహ్మడికి పెట్టడానికి పనికిరాదని కాస్తగోమయం వంటికి రాసుకొని శాస్త్రార్థం కాస్తలేసి గోమయంపుండలు నోట్లో వేసుకొని తలనిండా స్నానం చెయ్యమన్నాను. ఫడేళ్లముండ మాన్యమూ యిల్లు అమ్మి పెయ్యిరూపాయలు పొయిలో పోసి కొనుక్కొన్నందుకు మొగుడుమాట వినకక్కరలేదూ? ఫడేళ్లముండ అరవయియేళ్ళువచ్చిన నామాటే వినక పోతే యిఖ యెవరిమాట వింటుంది?

పంతు— ఇప్పటి ఆడవాళ్ళు మొగుడిమాట వినేవాళ్ళు గినే వాళ్ళు కారు. ముందున్నది ముసుళ్ళపండుగని నీసాట్లు ముందున్నవి. నీపెళ్ళాం యెదిగి కాపురానికి వచ్చినతరువాత నాజ్యోతిషం నిజముం దని అప్పుడు తెలుచుకుంటావు. ఆడముండలకు చదువు వచ్చినతరువాత వాళ్ళు లొంగుతారటయ్యా? యీచదువు మనపుట్టి ముంచివేస్తూ వున్నది. యేమీకాకపోతే మనము యేనాడయినా యీ వెధవముం డల పెళ్ళిళ్ళు వినీ కనీ యెరుగుదుమయ్యా? కలియుగాత్యంచేత యీ

విపరీతాలన్నీ పుడుతూ వున్నవి. "కలౌ పంచసహస్రాణి జాయతే వర్ణసంకరః" అన్నాడు. ఇక కొన్నాళ్ళలో అంతావర్ణసంకర మయి పోతుంది.

శాస్తు—మీరు విధవపెళ్లిళ్ళంటే నాపళ్ళు వణుకెత్తుతూవున్నది. యెరకక్కపోయి ముడిసి ముప్పున చచ్చుకున్నముండను కట్టుకున్నాను. ముండామొయ్యడంతోటే అది మళ్ళీ యెక్కడ పెళ్ళిచేసుకుంటుందో! ఓ భగవంతుడా? అది విధవావివాహం చేసికోవడం నాకళ్లపడకుండా చేస్తూ.

ఆచా—శాస్తుర్లూ! నీవు బ్రతికివుండగా నీపెళ్ళా మెట్లాముం డామోస్తుందయ్యా? వెర్రివాడివలె వున్నావు. అరవైయేళ్ళు దాటిన తరువాత మాన్యాలూ మళ్ళూ తెగనమ్మి యిది యెందుకువచ్చిన పెళ్లయ్యా? కాటికి కాళ్లుచాచుకొని నీవు యింకా చిన్నపెళ్లామితో కాపురంచేసి సుఖపడుదామనే పెళ్లి చేసుకున్నావా? నీవన్నట్లు నీ పెళ్లాం మళ్ళీపెళ్ళిచేసుకుంటే నీవంటిముసలిముండాకొడుకుల కందరికీ చిన్నపిల్లలను వివాహమాడి వాళ్ళకొంప తియ్యకుండా వక్కనూటు బుద్ధి వస్తుంది.

శాస్తు—నేను కర్మచెడిపోతుందని గృహస్థధర్మానికి పెళ్ళిచేసు కున్నానుగాని సౌఖ్యంకోసం చేసుకున్నానండీ? నామూడోపెళ్ళాము బ్రతికివున్నప్పుడే నాకు సంసారసుఖం అక్కరలేకపోయింది. పెద్దవాణ్ణి యినానుగనుక యజ్ఞంచేస్తే స్వర్గసుఖం కలుగుతుందని అపత్నికుణ్ణి కాకుండా వుండడానికి పెళ్ళి చేసుకున్నాను.

ఆచా—నీవు యజ్ఞంచేసి చస్తావో లేదోకాని నీతదనంతరము మళ్లీ పెళ్ళిచేసికోకుండావుంటే నీ పెళ్ళాంమాత్రం నరమేధయాగాలు చాలాచేస్తుంది. యజ్ఞఫలం అప్పుడో నీకు పూర్ణంగా లభిస్తుంది.

పంతు—మళ్ళీ పెళ్ళిచేసుకున్నవాళ్లు కులభ్రష్టులయి యెందుకూ పనికిరాకుండాపోతారు. మొన్న పెళ్ళిచేసుకున్నవాళ్ళతో గలిసి భోజనం చేసినంతమాత్రంచేతనే ఇకపెద్దమనిషి యింటిమీద పిడుగుపడ్డది. పెళ్ళి చేసుకున్నవాడి యింట్లో ముసలిముండ చచ్చిపోయింది. ఇటువంటి దుష్కార్యాలలో ప్రవేశిస్తే యేకీడూ మూడకుండా వూరికే పోతుందా యేమిటి? సజ్జనఘోష తగలక మానదు.

అచా — శాబాస్! నీవన్నపలుకులు మెచ్చతగి వున్నవి. నీ వన్నమాటలు దొరతనంవారికి తెలిస్తే నీకు చాలా బహుమానం చేస్తారు. ఇది రాణీగారు వింటే నీకాళ్ళకు గట్టిల్లోహంతో అందెలూ గొలుసులువేసి గవర్నమెంటువారు కట్టించిన దివ్యభవనాలలో కాపురం వుంచి సర్కారుజీతాలమీదవుండే భటులను కావలియిచ్చి యెల్లకాలమూ అన్నవస్త్రాలు దొరతనంవారి ఖర్చుమీదనే యిస్తూ వూరు డాటి పెళ్ళ నక్కర లేకుండా నిన్ను బహు ఆదరణ చేస్తారు. యీ మహారాజ యోగం నీకు యెప్పుడో తప్పకుండా పడుతుంది. భోజనము చేసినవారి యింటిమీద పిడుగుపడితే అపాయం లేకుండా పోయిందిగాని, సర్కారు లెక్కలు చూస్తే యీయేడు పిడుగుపడి హిందూదేశంలో నలభై తొమ్మండుగురు కాలం చేసినారు. వాళ్ళంతా విధవావినాహాలు కూడదనేవాళ్ళేనట. అదంతా యెందుకు? యీపట్నంలోనే వక్కవారం దినాలలో విధవావివాహాలు వద్దనేవాళ్ళు బహురోగాలచేత బాధపడి రెండువందలమంది చచ్చినారు. అదవాళ్ళవుసుర కొట్టకుండా వూరికే పోతుం దనుకున్నారా?

పంతు—నీతో మాట్లాడితే పాపం వస్తుంది. మీ కందరికీ యిలాగంటిదుర్బుద్ధులు పుడుతూ వున్నవి గనుకనే యిప్పు. డంతా అర్థాయుష్షు ముండాకొడుకులు పుడుతూ వున్నారు. ఈమర్మార్థ

పరిభుత్వంమూలాన్నిగాని లేకపోతే నిన్ను నిలివెడుగొయ్యితీసి పాతి వేస్తును. రావయ్యా శాస్త్రుల్లూ లోపలికి వెళుదాము.

ఆచా—యెన్నినిగ్బంధాలు వున్నా యెంతభయం వున్నా పిచ్చి వాళ్లు గనుక నోటికివచ్చినట్లు వాగడానికి మీకేమీ అభ్యంతరం లేదు. పిచ్చివాళ్ళతో వాదంచేసి ఘంటసేపు వ్యర్థంగా పోగొట్టినాను. మీరు యెన్ని కారుకూతలు కూస్తూవున్నా అయ్యేవేమో కానే అవుతవి. నేను వెళ్ళిపోతాను. (అని అంగటును నిష్క్రమించుచున్నారు.)

గ్రహణములు.

[పంతయ్యపంతులును, సింగయ్యసిద్ధాంతియు ప్రవేశించుచున్నారు]

సింగ—పంతులూ! ఏమిషయ్యా పేపరు చదువుచూవున్నావు?

పంత—పయి అమావాస్యనాడు సూర్యగ్రహణ మటండి.

సింగ — యేడిశ్శారులే. నేను పంచాంగం గుణించినాను. యెక్కడా గ్రహణం రాలేదు. పేపర్లల్లో అస్నీ అబద్ధాలే వేస్సారు. వాళ్ళమొఖం తెల్లవాళ్ళకు చాలూమూలం తెలియదు. యేదియెట్లా పోయినా బ్రాహ్మణీకం నిలపడానికి గ్రహణాలు వక్కటి దాఖలాగా వుంచూ వున్నవి.

పంత—వక్కబ్రాహ్మలేకాని తెల్లవాళ్ళు గ్రాహణాలు యెప్పుడు వస్తవో చెప్పడం లేదా? ఇందులో టూఆధిక్యం యేమిటి?

సింగ — బ్రాహ్మలు చెప్పినట్లు వాళ్ళు వెయ్యేళ్ళు తల్లక్రిం దయినా చెప్పలేరు. బ్రాహ్మలవద్దనే మర్మం గ్రహించి వాళ్లూ యిప్పు డిప్పుడు కొద్దిగా తంటాలుపడుచూ వున్నారు. బ్రాహ్మలు డబ్బుకోసం కక్కుర్తిపడి మనశాస్త్రాలన్నీ వాళ్ళకు చెప్పి పాడుచేస్తూ వున్నారు.

రహస్యంగావుంచుతే శాస్త్రంకాని అందరికీ తెలిస్తే శాస్త్రంగొమిషీ! శాస్త్రాలనగా మంత్రాలనగా అందరికీ తెలిస్తే పాటి తప్పిపోచవి. దాని కేంగాని తెల్లవాళ్లు గ్రహణాలకు యేమికారణం అంచారయ్యా?

పంత—సూర్యుడికీ భూమికీ మధ్య చంద్రుడు అడ్డంవస్తే సూర్య గ్రహణం పడుతుం దంటారు, సూర్యుడికీ చంద్రుడికీ మధ్య భూమి వుండి భూమినీడ చంద్రుడిమీద పడితే చంద్రగ్రహణం పడుతుం దంటారు.

సింగ—రామరామరామా! యెంత అబద్ధాలు వ్రాసినారయ్యా? వాళ్ళకు వక్కటీ తెలియదు. అన్నివిషయాలలోనూ యిలాగే శాస్త్ర జ్ఞానం లేక యుక్తులు తెచ్చి సంకరంచేసి పాడుచేస్తూ వున్నారు. నాకు వెయ్యిరూపాయలు యిస్తే గ్రహణాలసంగతి సమర్మంగా చెప్పి సంశ యం వదిలిస్తునే. ఖజానాలో అన్నిరూపాయలు వున్నవి. నిష్కారణంగా కాలవలకిందనూ రోడ్లకిందనూ పెట్టి పాడుచెయ్యకపోతే సద్బ్రాహ్మణ్ణి నాకు వెయ్యిరూపాయలు యిచ్చి యిల్లుకట్టించియిస్తే వాళ్లకు యెంత పుణ్యం వుంచుంది? ఈవుద్యోగస్థులంతా వూరికే లంచాలు కాచెయ్య డమేకాని యిటువంటి సత్కార్యానం వక్కటీ వాళ్లచేత చేయించరు. ఇప్పుడు బొత్తిగా బ్రాహ్మణభక్తి పోయింది. మాణిక్యంవంటికర్మ భూమంతా కిరస్తానీమయమయి పోయింది.

పంత—రేపు నాకు వుద్యోగం అయితే కలక్టరుగారితోచెప్పి మీకు మాన్యం యిప్పిస్తానుగాని గ్రహణాలసంగతి యేమిటో నాకు సమర్మకంగా చెప్పండి.

సింగ—నాకు యెక్కడనో దూరంగావుండే మాన్యం పనికి రాదు. నామాన్యానికి తూర్పువైపునవున్న గమల్లవాడిమాన్యం వాణ్ణి వెళ్ళకొట్టివేసి నాకు యిప్పించండి. అలా యిప్పిస్తానని నాచేతులో

చెయ్యివెయ్యండి. మీకుతప్పకుండా మీదటికి శిరస్తాదారీ అవుచుంది. ఇదియెంతకలికాలంఅయినా బ్రాహ్మణవాక్యం పూరకేపోదు. అందులోనూ తపశ్శాలినిగనుక నావాక్యం అమోఘంగా పట్టుకుంచుంది. వాడిజీవనం చెడగొట్టడంవల్ల మీకు యేమిపాపం లేకుసుమండీ? వాడికేమి తట్టుగాలా? గమళ్ళముండాకొడుకు మాన్యంలేకపోతే కల్లు గీచుకొని బ్రతుకుచాడు. అప్పుడు వాణ్ని కులవృత్తిలో ప్రవేశపెట్టి వర్ణాశ్రమధర్మం నిలవపెట్టినపుణ్యంకూడా మీకు వస్తుంది. యేదైనా కానీ బ్రాహ్మణపూజతో సమానమయినపుణ్యం మరివకటిలేదు. దేవుడైనాకానీ బ్రాహ్మణవాక్యంఅంటే శిరసావహిస్తాడు. శ్రీకృష్ణమూర్తి వారిని చూడలేదా? బ్రాహ్మణులను తిరస్కరిస్తేనేకాదా ఇంద్రద్యుమ్న మహారాజు యేనుగైపుట్టినాడు. నృగమహారాజు వూసరవిల్లిఅయిపోయినాడు.

పంత— ఆగొడవంతా యెందుకు? గ్రహణాలసంగతి సెలవిస్తురూ.

సింగ— పూర్వం సముద్రమథనకాలమందు గాడిదకొడుకు రాహువ్రుగాడు దేవతలలో కూర్చుండి అమృతం తాగినాడు. ఆసంగతి సూర్యుడూ చంద్రుడూవెళ్లి చెప్పేటప్పటికి శ్రీవిష్ణుమూర్తివారు చక్రం ధరించి వాడితల రెండువక్కలు చేసివేసినాను. చూచినారా శ్రీమన్నారాయణమూర్తికికూడా దేవతాపక్షపాతం యేలాగున్నదో? మేమూ భూదేవతలం, మాయందుకూడా అందరికీ ఆ పక్షపాతం వుండనలెను. బ్రాహ్మణపక్షపాతికి యెప్పుడూ సర్వశ్రేయస్సులూ కలుగుచవి. బ్రాహ్మణాశీర్వాదప్రభావం వర్ణించడానికి బ్రహ్మకయినా తనచేతకాదన్నాడు.

పంత— మధ్యమధ్య మీవ్యాఖ్యానం చాలించి కథ కానిస్తురూ.

సింగ— మీరు చిన్నలుగనుక బ్రాహ్మణప్రభావం తిన్నగా

తెలియదని కొంచెం సూచన చేసినాను. భూసురమహాత్మ్యం పూర్ణంగా చెప్పడానికి బ్రహ్మదేవుడిచేతనే కానప్పుడు నాతరమవుచుందా? నాతాత తర మవుచుందా? జగన్మోహినీ అవతారం ధరించినశ్రీహరి శిరస్సునొ ట్టివేసినా అమృతం తాగడంచేత వాడు చావక ఆవుక్కురోషం కడుపులో వుంచుకొని పర్వదినాలలో సూర్యుణ్ణి చంద్రుణ్ణి మింగి సకల బాధలూ పెడుతూ వుంచాడు. ఆమూలముండాకొడుకు మూలంగా ఆమహానుభావులకు యెంత ఆపద వచ్చిందండీ? ఆ లోకారాధ్యులకు మబ్బుల సోకినప్పుడు మనం తప్పకుండా స్నానం చెయ్యనలెను. ఆసమయంలో పట్టుస్నానమూ విడుపుస్నానమూచేసి బ్రాహ్మలకు దానాలూ ధర్మాలూచేస్తే ఆపుణ్యం యింతాఅంతాఅని చెప్పనలవికాదు. మహానుభావు లయినవారు దశవిధదానాలూచేసి లక్షలకొద్ది సంభావన యిచ్చి పుణ్యము సంపాదించుకొంచాడు. ఇప్పుడు యిస్కూళ్ళల్లో చదువుకునే మోటముండాకొడుకులు జుట్టయినా తడపకుండా వడ్డున కూచ్చుండి స్నానాలు సేసేవాళ్ళను మీదిమిక్కిలి వెక్కిరిస్తారయ్యా!

పంత—ఈప్రసంగాలు మానివేసి కథ నాంగం కానిస్తురూ!

సింగ—ఇంకాయేమివున్నది? పట్టడంకారణం అంతే. గ్రహణం పట్టడంతోటే తెలుసుకుని బ్రాహ్మలు స్నానం చేసి మంత్రాలు ప్రయోగిస్తే అవి వజ్రాయుధాలై తగిలి ఆపాపగ్రహం నిలవలేక హడిలి విడిచి పారిపోతుంది. ఈకర్మభూమిలో అంటే బ్రాహ్మలకు తెలిసి మంత్రాలు జపిస్తే రహువూ కేతువూ పారిపోచాడుగాని వర్ణాశ్రమ ధర్మాలు లేని మ్లేచ్ఛదేశములలో సూర్యచంద్రులకు ఇటువంటిఆపద వస్తే యెలా నివారణ అవుచుందో!

పంత—ఆఫ్రికాదేశంలో సిద్ధీలు గ్రహణం పట్టినప్పుడు పాము కరచిందని పెద్ద కేకలువేసి కొమ్మ్రలువూది డప్పులు వాయించి భూమి

ఆకాశమూ కోలాహలధ్వని ముచ్చేటట్టు గందరగోళం చేసి గ్రహణం విడిచినతరువాత తమచప్పుడుకు ఝుషిసి ఆపాము సూర్యుణ్ణీ చంద్రుణ్ణీ విడిచి పారిపోయిందని సంతోషిస్తారట.

సింగ — అది నిజమేకాబోలును. కర్మబాహ్యులయినందున వాళ్ళకు మంత్రాలులేక ఆవిధంగా జడిపించి రాహుగ్రహాన్ని పార దోలుతారు. వాళ్ళా కొంతపుణ్యాత్ములే. యెవళ్ళా యేవిధంగాను పూనుకోకపోతే దుష్టగ్రహంవల్ల మహాత్ముల కటువంటిబాధ వచ్చిన ప్పుడు యేమిదిక్కు? ఆవేళకు భగవంతుడు యెవరినో వకరిని ఆధారం చూపిస్తాడు.

పంత — చీనాదేశములోకూడా ఘోరసర్పంవచ్చి పట్టుకున్నదని భేరీలు వాయించి గంటలు కొట్టి దాన్ని బెదరకొట్టడానికై పెద్దధ్వని చేస్తారట.

సింగ — ఇంకా యేమిషయ్యా! ఇప్పుడు నిజం బోధపడ్డదా? చీనావాళ్ళాఅందరూకూడా పాము కరిస్తే గ్రహణం పట్టుచుందని వప్పుకుంచూవున్నారా? ఆపాముపేరే రాహువు. ఇంతమందికి ఇలా తెలుస్తూవుండగా యీ తెల్లవాళ్ళకు యీమూర్ఖత్వం యేమిషయ్యా? వాళ్ళ మొఖం భూమినీడయేమిషి? చంద్రుడు అడ్డంరావడం యేమిషి? శ్వేతముఖులకు స్వతహాగా తెలివీలేదు మావంటిబుద్ధిమంతులు చెప్పితే వినే నేర్పూ లేదు. అయ్యో! మాటలసందడిని మరిచిపోయినాను. సంభావన నించిపోచుంది. గమళ్ళతాతయ్యగాడి యింట్లో యివాళ శోభనం. త్వరగా వెళ్ళవలెను.

(అని లేచిపోవుచున్నాడు.)

యోగ్యాయోగ్య విచారము.

[పరాంకుశరావుగారు కూర్చుండియుండగా సోమేశ్వరశాస్త్రులుగారు ప్రవేశించుచున్నారు.]

పరాం—ఏమండి శాస్త్రులగారు ప్రొద్దున్నే దయచేసినారు?

సోమే—తమతో వక్కహాంశం మనవిచేసుకుంచాను. కోపం రాదుగదా?

పరాం—యేమిటో చెప్పండి.

సోమే—మీతమ్ముడు భ్రష్టయిపోవుచున్నాడు. మీరేమీ కనుక్కోవడం లేదుగదా? మీరు మాకు ప్రభువులు గనుక మీ శ్రేయస్సునుకోరి చెప్పుచాను. మీవాడు పోఖరీలసహవాసంకూడి పరమ పోఖరీ అయిపోయినాడు. మీరు తక్షణం శ్రద్ధచేస్తేనేకాని నిష్కారణంగా చెడిపోచాడు.

పరాం—మావాడు పోఖరీ అని యెవరూ చెప్పుకోగా నేనెప్పుడూ వినలేదే? వాడు యెప్పుడయినా ముండయింటికి వెళుతూవుండగా మీరు చూచినారా? వాడు దీపాలు పెట్టినతరువాత చదువేమో వాడే మీకాని యెప్పుడూ గుమ్మందాటి వీధులో అడుగుపెట్టను. మీరు మరి యెవరినిచూచి మావా డనుకొన్నారో!

సోమే—మీపాదాలతోడు! తప్పకుండా మీవాడేనండి. ముండలతో వెళితేనేకాని పోఖరీ కాకూడదా యేమిటి? మీభావగారి కొమారుడు ఇంట్లోడబ్బంతా తీసుకొనిపోయి ముండలకు పెడుచాడు. వాడు యెంతపెద్దమనిషండీ? మీవాణ్ణన్నట్టు అతగాణ్ణి పోఖరీఅంటే జిహ్వా పుచ్చి పురుగులు పడవూ? అతనిబిళ్లగోచియేమి? ప్రాతస్నానాలుయేమి? విభూతి పింజికట్లేమి? బ్రాహ్మణభక్తియేమి? అతనంతశిష్టు యీవూళ్ళో

మరి యెవరైనా వున్నారండీ? నేను కనబడితే యెప్పుడూ దణ్ణం పెట్ట కుండా వుండడు. మీరు నామాట నమ్మండి. నమ్మకపోండి. మీవాడు తప్పకుండా పోఖరీ. మీరు చెప్పించేమాలచదువు కొంపతీస్తూవున్నది.

పరాం—మీమాటలు నాకు తెలియడం లేదు. మావాణ్ణి మీరు యేమిచూచి పోఖరీ అంటూవున్నారో స్పష్టంగా చెప్పండి.

సోమే—యేమి చూచినానా? అన్నీ చూచినాను. మీవాడు మొఖాన్ని విభూతి పెట్టడు; జారుగోచీ పెడుచాడు; మొన్న బూడ్సుల జోడు తొడుక్కుని మొఖాన్న బొట్టులేకుండా పట్టపగలు వీధిలోనుంచి వెళుచూవుంటే నేను కళ్ళారా చూచినాను. పోఖరీతనానికి బూటుసులు తొడుక్కోవడముకంటెనూ ఇంకా యేమి కావలెనండీ!

పరాం—మీరు చూచిం దంతా ఇంతేనా మరి యేమయినా వున్నదా? ఇందులో నాకు జబ్బు యేమీ కనబడటంలేదు.

సోమే—నేను యివిగాక లచ్చి చూచినాను. చెప్పమంటే చెపు చాను. మీవాడు బ్రాహ్మలకు దణ్ణం పెట్టడు; గుళ్లోకివెళ్ళడు; నూతల్లోకి వెళ్ళివచ్చి బట్టలు తడిపి స్నానం చెయ్యడు సరిగదా బంధ్యా లైనా తడపడు; వరదవచ్చినప్పుడు గోదావరిలో స్నానం చెయ్యమంటే బురదనీళ్ళంచాడు; గోమయం శుచి కాదంచాడు. మీరు చెయ్యనండి లచ్చినండి మీవాడు తప్పకుండా చెడిపోచూ వున్నాడు. మీరు వుపేక్ష చేస్తే బ్రాహ్మణీకం భ్రష్టయి పోతుంది. వర్ణాశ్రమధర్మాలు సమూలం నశిస్తవి.

పరాం—ఇప్పుడు నన్ను యేమి చెయ్యమంటారయ్యా?

సోమే—నా ఆలోచన అడుగుచూవున్నారు గనుక మీకు యిహ పర సాధనమైనటువంటిన్ని బ్రాహ్మణీకం నిలిచేటువంటిన్ని

వర్ణాశ్రమధర్మాలు చెడకుండా వుండేపటునంటిన్ని పరమార్థం చెపు చాను. నేను చెప్పినట్లు చేస్తానని చేతులోచెయ్యి వెయ్యవలెను. ఇదంతా మీబాగుకోసమూ మిచిన్నవాడి బాగుకోసమూ కాని మరివకటి కాదు సుమండీ? నామాట నమ్మండి. ముఖ్యంగా మీరు నామాట యందు పూజ్యతం వుంచి తక్షణం మీవాడికి మాలచనువు మానిపించి నముకచమకాలూ మంత్రిపుష్పమూ చెప్పించండి. జునపాలు గొరిగి వేయించుకొని ఖాయిగా వచ్చినాకానీ మానకుండా బ్రాహ్మన్నే స్నానం చేసి మొఖంనిండా విభూతి పెట్టుకొని, బ్రాహ్మను కనపడ్డప్పుడల్లా దణ్ణం .పెడితేనేకాని భోజనం పెట్టమనీ ఇంట్లోకైనా రానియ్యమనీ మీరు గట్టిగా చెప్పండి. మీ పెద్దలు దేవబ్రాహ్మణభక్తి కలవారనీ బహుప్రతిష్ఠ సంపాదించినారు. మీవాడిమూలంగా పూర్వులకందరికీ అప్రతిష్ఠ వస్తూవున్నది. కులంబోయిన తరువాత అవతల వుద్యోగం యెందుకండీ? కులాచారధర్మం తిన్నగావుంటే తిండికి లేకపోతే ముష్టి యెత్తుకోవచ్చును. దాల్లో యేమీ లోపం లేదు.

పరాం—మావాడియందు మీరు కసిపెట్టినలోపాలు ఇంతేనా మరి యే మైనా వున్నవా? ఈమాత్రానికి వాడిచనువు చెడగొట్టడం నాకు యిష్టం లేదు.

సోమే—మీరుకాగా ఇలాగు సంశయిస్తూన్నారుగాని గుళ్ళో గోపాలస్వామివారిని రాతిబొమ్మ అన్నాడని గోపాలరావుగారితో చెపితే నామాటప్రకారం తక్షణం కొమారుణ్ణి ఇంగ్లీషుబడి మానిపించి ఇంట్లో మూడుపూటలూ వేదం చెప్పిస్తూవున్నారు. మీవాడిదగ్గిర నేను చూచింది పెద్దలోపం వకటి చెపుతాను. ఇంగ్లీషు మానిపించి వేస్తారా?

పరాం—అది యేమిటో చెప్పండి.

సోమే—నిన్నగాక మొన్న నేను బహిర్భూమికి వెళ్ళివస్తూవుం డగా యెడ్లబండివకటి శూద్రికుర్రివాడి కాలిమోదనుంచి పోవడానికి సిద్ధమయ్యేటప్పటికి నేను వద్దని కూకలువేస్తూవున్నా నామాట లక్ష్యం చెయ్యక మైలబడి శూద్రికుర్రివాణ్ణి ముట్టుకొని ఇవతలకు తీసుకు వచ్చినాడు. ఆలాగు శూద్రివాణ్ణి ముట్టుకుని బట్టలు ఇంట్లో కలిసితే ఇంకా బ్రాహ్మణీకం యేమియేడిసింది? మాలకూడంతా కలిసిపోచూ వున్నది. నేను వెనుక వకపర్యాయం వక శూద్రకుర్రవాడు చెట్టుమీద నుంచి పడిరక్తప్రవాహాలుకట్టి యేడుస్తూవుంటే బట్ట మయిలపడిపోచుం దని కర్రైనా చేతికసరాయిచ్చి లేవతీసినానుకాను. ప్రాణం పోయినా కాసి వర్ణాశ్రమధర్మాలు ఆప్రకారంగా నడపవలెను.

పరాం—మావాడు చేసినపని నాకు సంతోషంగానే వున్నది కాని కోపపడడానికి యిందులో నాకు హేతువేమో కనబడడంలేదు.

సోమే—ఇంగ్లీషుచదువువచ్చి వర్ణసంకరమై పోచూవున్నది. మీరు ఇంగ్లీషుచదివినవారె. సంగతి తెలిసివుండిన్నీ నీతో ఇలాగం టివి చెప్పడం నాదేబుద్ధితక్కువ. కలౌ పంచసహస్రాణి జాయంతే వర్ణ సంకరః అన్నాడు. ఇది తప్పదు; వర్ణసంకరం కావడానికి బ్రాహ్మణజన్మం యెత్తినవాడు శూద్రివాణ్ణి ముట్టుకోవడంకంటె ఇంకా యేమికా వలెను? నేను చెప్పినమాటలు నీకు యేమీ రుచించడం లేదు. ఇదంతా కలికాలమహత్యం.

పరాం—శాస్త్రులుగారూ! కోపంచెయ్యకండి. మావాడిదగ్గర నిజమయినతప్పిదం మేమునావుంటే శలవివ్వండి. శిక్షిస్తాను.

సోమే—ఆలాగైతే చెపుతాను శిక్షించండి. మొన్న యీ మధ్య వకజటూంతస్కూల్లోచదువుతున్న బ్రాహ్మణుడు డబ్బుకు అవసరం వచ్చి మీవాడు చదువుకుంచూవున్నవారి యింట్లోవున్న వస్తువొకటి

వారితో చెప్పకుండా తీసుకువచ్చి తాకట్టుపెట్టుకుంటే మీవాడు సాక్ష్యంపలికి శిక్షవేయించినాడు. అది దొంగతనమష! గొప్పతప్పిదమష! బ్రాహ్మణవిషయంలో అబద్ధమాడితే బహుపుణ్యం వస్తుందని యెంత మందిచెప్పినా వినక కచేరిలో నిజంచెప్పివేసినాడు. ఆబ్రాహ్మడు ఓ వాడిమూలంగా జయిలులో యెంతక్షోభపడ్డాడు? ఆబ్రాహ్మడి వుసురంతా మీవాణ్ణి చుట్టుకొని కౌరవాదినరకాలలో పడిపోడూ? బ్రాహ్మణ్ణియేడిపిస్తే బాగుపడచాడండీ? పూర్వము మనరాజులు ధర్మ పరిపాలనం చేసేకాలంలో బ్రాహ్మడు యెంతతప్పిదం చేసినా పూజించే వారుగాని శిక్షించేవారుకారు. ఇప్పుడంతా కలిమయం అయిపోయింది. వాడు యెలాగంటిబ్రాహ్మడోకాని ఆశిక్షవేసినఅధికారీ బ్రాహ్మడేనష! కులాభిమానంలేకపోయినతరువాత వాడుబ్రాహ్మడుకాడు పరమచండాలుడు.

పరాం—తప్పిదం చేసినవాడికి శిక్షవేస్తే దూషించడం న్యాయంకాదు.

సోమే—ఆగండి. మీకుకూడా ఆలాగే తోచినతరువాత యిఖ మీతో మాటాడడం భావ్యంకాదు. వెళ్ళిపోచ్చాను.

(అని వెళ్ళుచున్నాడు.)

వర్ష ము.

[గణపతిరావు కూరుచుండి చదువుకొనుచుండగా శంకరశాస్త్రిగారు ప్రవేశించుచున్నారు.]

గణ—శాస్త్రులుగారూ! నమస్కారమండి.

శంక — దీర్ఘాయుష్యమస్తు! వంశాభివృద్ధిరస్తు! రాజద్వారే

రాజభజనే సర్వదా దిగ్విజయమస్తు!

గణ—అప్పుడే ఆశీర్వచనమంతా అయిపోయిందండీ? ఇక మీకు మరేమీరావడీ?

శంక—ఈ ఇంగ్లీషుచదువుకునేవాళ్లకు మమ్మల్నిచూస్తే వేళాకోళంగా వుంటుంది.

గణ— వేళాకోళం కాదండీ! నీరు తాతగారవుతారుగనుక హాస్యానికన్నాను. కోపం వుూచకండి

శంక—చిన్నవాడవు నీవొకమాటఅన్నాకానీ నాకు కోపంలేదు నాయనా! నీవు చదువుకునే పుస్తకంపేరు యేమంచారు!

గణ—దీనిపేరు "ఫిజికల్ జాగ్రఫీ" అంటారు.

శంక—అందులో యేమివుంచరి?

గణ— అందులోనా? భూమినిగురించీ వాయువునుగురించీ సముద్రాన్నిగురించీ అనేకసంగతులు వుంటవి.

శంక—నీవు యిప్పుడు చదివేభాగం దేన్నిగురించి?

గణ— వర్షాన్నిగురించీ మేఘాల్నిగురించీ చదువుతూవున్నాను. అదిమాకు యివాళ పాఠం.

శంక— వర్షం యెందుకువస్తుందని చెప్పుతాడు? ఇంగ్లీషుపుస్తకాలపద్ధతి మేఘాలంటే యేమిటి?

గణ— సూర్యకిరణముల వేడిమిచేత సముద్రములోనూ నదుల లోనూ మడుగులలోనూ వుండేనీరు ఆవిరిరూపంగా పయికిలేచి వకచోట కుండుకొని పైనిగాలిలో మేఘంగాయేర్పడి బరువు యెక్కువయినప్పుడు నీరు కిందపడుతుంది. దాన్నే వర్షమంటారు.

శంక— అంతేనేకాని మేఘాలకు ప్రాణం వుండడమూ ఇంపుకి డికి మాహానాలు కావడమూ అంతా అబద్ధమే అంచారా?

గణ—నిస్సందేహంగా అబద్ధమే. మేఘాలకు యేమిటి? ప్రాణం వుండడం యేమిటి? వాటికి పొగా ఆనిరీ గాలీ తప్ప మరి యేమీ వుండదు.

శంక— నీవు చెప్పినది యెంతమాత్రమూ నమ్మశగి వుండలేదు. మేఘాలకు తప్పకుండా ప్రాణం వుంచుంది. పూర్వం యక్షుడిపెళ్ళాం దగ్గిరకు రాయభారంకూడా పట్టుకువెళ్ళినవి. మేఘాలు సముద్రంలోకి వెళ్ళి నీళ్ళు తాగుచూవుండగా అనేకులు చూచినారు. అలా నీళ్ళు తాగివచ్చి అల్పాచమనం చేస్తే ఆనీరు వర్షరూపంగా భూమిమీద పడుచుంది. అందుచేతనే వర్షపునీరుకు భూమిమీద పడితేనేకాని శుద్ధి లేదు.

గణ—మేఘాలు సముద్రంలోకి వెళ్ళి నీళ్ళు తాగుతూవుండగా మీ రెప్పుడైనా చూచినారా? పామరులు చెప్పనలసినమాట పండితులై వుండికూడా మీరుకూడా విశ్వసిస్తా రేమి? మేఘము లేమిటి? నీళ్ళు తాగడం యేమిటి?

శంక—అయ్యయ్యో! నామాట నమ్మకపోతే నేను యేమి చెప్పను? మేఘములు వచ్చి సముద్రములోనే కాకుండా దాహం వేసినప్పుడు కోయవాళ్ళకుండలలోకూడా కొండలమీదికి వచ్చి నీళ్ళు తాగి పోచవి. కోయవాళ్ళు పొంచివుండి నీళ్ళు తాగడానికి కుండలలో దూరి నీళ్ళు కత్తుకుతూవున్నప్పుడు చటుక్కున మూతవేసి కుండకింద మంటపెట్టి మేఘాలను వండుకుని తించారు. ఈసంగతి మామేనమామ చూచినాడు.

గణ—ఆయనను అడిగితే ఆయనకూడా తన మేనమామ చూచినా డని చెప్పుతాడు. ఈలాగంటిపెచ్చికథ లన్నీ అంధపరంపరగా వ్యాపించి మూఢులు నమ్ముతారు. యెవరూ యేమీ చూచినవా

రుండరు. కోయవాళ్ళమాట యెందుకు? మీరు యెవరూ యింట్లో లేనప్పుడు మీబిండెలలో మంచినీళ్ళు మాయింట్లో పోసుకుని ఆనీళ్ళు మేఘములు తాగిపోయిన వనీ మా మేనమామ చూచినా డనీ మా దొడ్లోవాళ్ళు మేఘాన్ని వండుకుతిన్నా రనీ నేను చెపితే మీరు నమ్మ్రతారా?

శంక—మీరు లక్ష చెప్పండి. వెయ్యి చెప్పండి మేఘాలు జంతువులు కావడానికి సందేహం లేదు. యెండకాకచేత నీళ్ళ పయికి వెళ్ళి కింద పడుతూ వుండడమే వర్ష మయితే రోజూ వర్షం కురుస్తూనే వుండును. మేఘాలకు యజమానులు వున్నారు. వాళ్ళ సెలవైతేకాని అవి వర్షం కురియవు.

గణ—మీరు చెప్పినపకారం అల్పాచమానం చెయ్యడానికి కూడా యజమానులుశలవు కావలెనా యేమిటి? అలాగయితే మహా గొప్ప యజమానులు దొరికినారు.

శంక—నేనూ అనేకశాస్త్రాలు చదివినముండాకొడుకును. నా మాట బొత్తిగా తీసివెయ్యకండి. కావలిస్తే మీకు కావలసినన్ని శాస్త్ర పమాణాలు కనపరుస్తాను. మేఘాలకు వరుణదేవుడూ ఇంద్రుడూ యిద్దరు యజమానులు. వారిసెలవైతేనేకాని వర్షం కురియదు, అందు చేతనే కొన్నిదేశాలలో వర్షం కురియక క్షామం పడుచుంది. పూర్వం ద్వాదశవర్ష క్షామాలు యెందుకు వచ్చేవి?

గణ—జనుల తెలివితక్కువచేత వచ్చేవి. ఆనకట్టులు కట్టి కాలవలు త్రివ్వించి దేశమంతా నీరు పవహించేట్టు చేస్తే ద్వాదశ వర్ష క్షామాలూ గీమాలూకూడా హడలి పారిపోతవి. ఇప్పు డీకాలవలు త్రివ్వించినతరువాత ద్వాదశవర్ష క్షామాలు యెప్పుడైనా రాగా మీరు చూచినారా?

శంక—అబ్బాయీ! చిన్నవాడవు నీ కేమీ తెలియదు. పూర్వ కాలపువారిని పెద్దలను అలా తిరస్కరించరాదు. వారు సర్వజ్ఞులు; యేమీ లేకపోతే వారు నిష్కారణంగా దేవత లున్నారని చెప్పరు. వర్షాలు లేనప్పుడు వారు వరుణమంత్రాలు చదివి వక్కనిమిషంలో వర్షాలు కురిపించేవారు. దేవత లందరూ వారికి ప్రత్యక్షం. వర్షాలు లేనప్పుడు జను లందరూ వెళ్ళి బ్రాహ్మలకాళ్ళు పట్టుకుని వారిని సంతోషపరిస్తే తమ మంత్రశక్తిచేత వర్షం కురిపించి లోకాని కంతటికీ సంతోషం కలుగచేసేవారు. బ్రాహ్మలవద్ద అలాగంటిమహత్యము వున్నది. గనుకనే అందరూ వారిని భూదేవత లని పూజ చేస్తారు.

గణ—అదంతా బ్రాహ్మలు తమఆధిక్యం నిలువడానికి పన్నిన పన్నుగడ. ఆదేవతలు బ్రాహ్మలకు యెంతప్రత్యక్షమో శూద్రులకూ అంతే ప్రత్యక్షము. బ్రాహ్మలుకోరితే వర్షం కురిసేట్టయితే శూద్రులు కోరినా వర్షం కురుస్తుంది.

శంక—అబ్బాయీ! బ్రాహ్మణభూషణ నీకు శ్రేయస్కరం కాదు. బ్రాహ్మలయందు తప్పకుండా గొప్పమహత్యం వున్నది. ఇప్పుడుకూడా బ్రాహ్మలకు డబ్బు యిచ్చి వారిచేత వరుణమంత్రాలు చదివించి సహస్రఘటాభిషేకాలు చేయిస్తే యెలా వర్షాలు కురుస్తవో చూచినావా? నిరుడుసంవత్సరము పెన్నేటిగ్రామంలో కాపులంతా పోగయి నూరురూపాయలు చందాలువేసుకొని బ్రాహ్మలచేత సహస్ర ఘటాభిషేకం చేయిస్తే అదివరకు వక్కచుక్క పడనిది మూడురోజుల్లా వర్షం కురిసింది.

గణ—ఇదంతా బ్రాహ్మలు జనులను తెలివితక్కువబాళ్ళను చేసి వాళ్ళడబ్బు కడతేర్చడానికి పన్నినయంత్రంకాని అంతకంటె వేరే యేమీ లేదు. ఆవెఱ్ఱికుండలసీళ్ళా గుళ్ళో పోయించడంకంటె తమ

పొలాలలో పోసుంచుకుంటే పొలాలలో కొంతభాగ మయినా తడిసి పోను. ఆ నూరురూపాయలూ ఖర్చుపెడితే మళ్ళింగా వకమోట నుయ్యి వచ్చును. ఆ నూరురూపాయలూ కూలివాళ్ళకు యిచ్చి నీళ్ళు తోడించి పోయించినా బహుబాగా పొలాలు పండేవి. మూఢులు గనుక వాళ్ళు నిష్కారణంగా నూరురూపాయలు బ్రాహ్మలపొట్ట పెట్టి పాడుచేసినారు. నిరుటిసంవత్సరం మనవూళ్ళో సహాస్రిఘటాభిషేకంచేస్తే పయినుంచి వక్కచుక్కనీరు పడ్డదికాదు. వీధులుమాత్రం రొచ్చుసడి ఫదిరోజులు నడవడానికి వల్ల అయినది కాదు.

శంక—మంత్రప్రభావం కాకపోతే రెండోవూళ్ళో కురవడానికి కారణంయేమిటి? నాకు తోచక అడుగుచాను చెప్పండి.

గణ—మంత్రప్రభావం అయితే యీవూళ్ళో కురవకపోవడానికి కారణంయేమిటో మీరుచెప్పండి చూతాము. ఈసహాస్రిఘటాభిషేకాలు వేసవికాలంలో వర్షాలుకురిసేనుందు చేస్తారు. వాటంతటవి వర్షాలు కురిస్తే బ్రాహ్మలు అవి తమమహత్యంవల్లనే అంటారు. కురియకపోతే కన్నంలో దొంగను తేలుకుట్టినట్లు మాట్లాడక వూరుకుంటారు. తరువాత వర్షాలు కురిసినా కురియకపోయినా ముందుగా బ్రాహ్మలకు సంభావనలూ సంతర్పణలూ తప్పవు. ఇదిఅంతా పట్టపగలు అందరూ మేలుకుండగా చేసేమోసము.

శంక—అబ్బాయీ! యీపరిసంగం ఇఖచాలించు. అంతకంతకు బ్రాహ్మణభూషణ మెక్కువ అవుచూవున్నది. బ్రహ్మద్వేషం ముదిరినతరువాత ఇఖవాడితో మాట్లాడరాదు. ఇప్పుడు ఇంగ్లీషు చదువువచ్చి యీమూలచదువుమూలంగా శాస్త్రాలూ ఆచారాలూ మన్నుకొట్టుకొని అంతా భ్రిష్టయిపోచూవున్నది. ఇంగ్లీషు చదువు కున్నవాళ్ళు పట్టి కిరస్తానీముండాకొళ్ళు. అన్నింటికీ కుళ్ళంకలుచేసి

లోకమంతా మూలకూడుచేసి పాడుచేస్తూవున్నారు. రామ రామ రామ రామా! ఇఖ యీమాటలు వింటే పాపం వస్తుంది?

(అని చెవులుమూసికొని లేచిపోవుచున్నాడు)

హిందూమహాజనుల మతసభ.

— 0 —

[శైవులు, వైష్ణవులు, మాధ్వులు, స్మార్తులు మొదలైన హిందూబ్రాహ్మణ మహాజనులు సభ చేరియుండగా లౌకికవ్యవహారములోనున్న యొక శాస్త్రిలవారు ప్రసంగించుచున్నారు]

శాస్త్రి—ఇంతమంది యిన్ని తెగలవారు వక్కచోట యీప్రకారంగా సమావేశంకావడంచూస్తే హిందువులలోవుండే ఐకమత్యము మరియెవరిలోకూడా లేనట్లు స్పష్టమవుతూ వున్నది. ఇటువంటి ఐకమత్యం మనలో వున్నదిగనుక మధ్యమధ్య యెన్నిఅవాంతరాలువచ్చినా ప్రభుత్వాలు యెన్నిమారినా మనవేషచోదితమయినమతం యెన్ని ప్లేచ్ఛమతాలవారు పాడుచెయ్యడానికి ప్రయత్నము చేసినప్పటికిన్ని మేరువు పర్వతమువలె సుస్థిరంగావుండి యెంతమాత్రం చెడకుండా నేటివరకూ అవిచ్ఛిన్నంగా సాగుతూవున్నది. అయితే యిప్పుడు ఘాదరీలవల్లనూ, కిరస్తానీమతబోధవల్లనూ మిషనేరీసూళ్ళల్లోచెప్పే మూలచదువువల్లనూ మనమతం పాతుకదిలేస్థితి వచ్చేటట్లు కనబడుతూ వున్నది. ఇప్పుడు మనం వెంటనే జాగ్రతపడి పునాది బలపరిస్తేనేకాని అంతా చెడిపోతుంది. ఇదివరకు యెక్కడనో యెవరో కిరస్తానీమతంలో కలిసినారని చెప్పుకోవడమేకాని యిప్పుడాగ్రహచారం ప్రత్యక్షంగా మనకే సంభవించినది. వారముదినములలోపుగా యెప్పుడూ లేనిది మనవూళ్లో వొక వైష్ణపు చిన్నవాడును, వైదికపుచిన్నవాడును కూడా కిరస్తానీమతంలో కలిసి

పోయినారు. ఈవారమురోజులనుంచీ వూరంతా అల్లకల్లోలంగా వున్నది. ఇప్పుడు మనం యిక్కడ సభచేరినది ముందు మనం చెయ్యవలసిన పని యేమిటో ఆలోచించడానికయి వున్నది. గనుక బుద్ధిమంతులు వారి వారికి తోచినదాన్ని చెప్పుతారని కోరుతాను. రామచంద్రరావుపంతులు గారు లౌక్యమంచూ వైదికమందుకూడా సిద్ధులు. వారు మొదటచెపితే బాగావుంటుంది.

రామా—— మనమతం మనకుర్రవాళ్ళకు బాగా తెలియకపోవడంచేత వాళ్ళు అన్యమతంలో ప్రవేశించడం తటస్థమవుతూవున్నది. మను దేవాలయాలలోనో మరి యేబహిరంగస్థలములలోనో వారానికి రెండుసార్లు పిల్లలందరూ పోగయ్యేటట్టు చేసి కొంతమందిపండితులచేత వాళ్ళకు మనమతం బోధచేయిస్తూ వుండవలెను. నేను చెప్పినది బాగా వున్నదా?

మహాజనులు——బహుబాగావున్నది. తప్పకుండా రేపటినుంచీ ఆలాగు చెయ్యవలసినదే. అయితే యీమతబోధ యేదేవాలయంలో చేస్తే బాగావుంటుంది? పండితుల్ని యెవరిని పెడుదాము?

వ్యాసరాయాచార్యులు—— ఈ వేదశాస్త్రపాఠశాల ఆంజనేయ స్వామివారికోవెలలో పెట్టి ముఖ్యప్రాణాచార్యులుగారిని పండితుల్నిగా యేర్పరిస్తే బాగావుంటుంది.

రామానుజాచార్యులు—— కాదు. కాదు. శ్రీ కేశవస్వామివారి ఆలయంలో తిరుమంటపంమీద పాఠశాల పెట్టించి శ్రీ వేదాంతదేశికాచార్యులవారిని పండితులనుగా నియమిస్తే బహుదివ్యంగా వుంటుంది.

బసవయ్యఅయ్యవార్లు—— శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి గుళ్లో పాఠశాలవుంపించి వీరభద్రయ్యవార్లంగారిని పండితులనుగా పెడితే మరీ బాగావుంటుంది.

రామా--ఆగుల్లో పెడితే మాపిల్లలను మేము పంపము.

బస -- మీగుల్లో పెడితే మాపిల్లలను మేమంతకుమునుపే పంపము.

పరబ్రహ్మసోమయాజులు--మాకు శివకేశవులు యిద్దరూ సమానమే. పాఠశాల వకరోజు శివాలయంలోనూ వకరోజు విష్ణాలయములోనూ వుంచి హరిశాస్త్రులవారిని పండితులనుగా పెట్టండి. యెవరికీ యిబ్బంది లేకుండా వుంచుంది.

రామా--స్మార్తపండితుణ్ణి వేస్తే మాకు పనికిరాదు.

వ్యాస--మాకంతకుమునుపే పనికిరాదు.

బస--మాకు బొత్తిగానే పనికిరాదు.

రామా--మాకు వైష్ణవపండితుడే వుండవలెను.

వ్యాస--మాకు మార్వపండితుడే వుండవలెను.

బస--మాకు శైవపండితుడే వుండవలెను.

వెంకట్రావుపంతులు--మీరూ మీరూ యేమీ లేదే ముందుగానే యెందుకు దెబ్బలాడుతారు? వకస్మార్తపండితుణ్ణి, వకవైష్ణవపండితుణ్ణి, వక లింగధారిపండితుణ్ణి, వక మార్వపండితుణ్ణి వేసి అన్ని మతాలూకూడా చెప్పించాము. మీలో మీరు తగువులాడకండి. స్థలవిషయము యేమీ తగాదా రాకుండా దేవాలయాలలో మానివేసి పాఠశాల కొత్వాలుసావిట్లో పెట్టించాము. ఇక మతవిషయంలో యేమి ముందుగా చెప్పవలెనో ఆలోచించండి.

రామా--ఆలోచించేది యేమిటి? ముందుగా మనదేవుడు యెలాగంటివాడో పిల్లవాళ్ళకుబోధించవలెను. ప్రతికోజూ శ్రీస్వామి వారికోవెలలోకి బాలకులు తప్పకుండా వెళ్ళేట్టుచేసి మనం చేసే బోధకునూన్నా వాళ్ళుచూచే దివ్యమంగళవిగ్రహానికిన్న సరిపడేట్టుగా

దేవుడు చతుర్భుజు డనిన్నీ లక్ష్మీసమేతు డనిన్నీ శంఖచక్రవిరాజితు డనిన్నీ ముఖమునందు తిరుచూర్ణనామ—

రంగాచార్యులు—మీరు చెప్పేదా:ల్లో చివర స్పష్టంగా లేదు. నామం సంగతిసగురించి చెప్పేటప్పుడు ముక్కుమీద కిందపాదం వుండవలెనో లేదో ఆసంగతి యీసభవారిముందరనే స్పష్టంగా పరిష్కరించండి.

రామా—ముక్కుమీద పాదం తప్పకుండా వుండవలెను.

గంగా— ముక్కుమీద పాదం సుతరామూ పనికిరాదు. పాదం వుంటే వాడిమొఖమే చూడకూడదు.

రామా— పాదం లేకపోతే తక్కిన వెన్నివున్నా యేమీ ప్రయోజనం లేదు. ఏమండి ఆచార్లవా రందరూ మామాట చొరకుండా ఆలా కేకలువేస్తారు?

రంగా—మీవాళ్ళు కేకలువేస్తే మావాళ్ళుమాత్రం వూరుకుంటారా? ఇందులోమాత్రం అంతపౌరుషం చచ్చినవారు యెవరు?

వెంక—మీ వడఘుబి తెంఘుబి ఖజ్జాలు కాలిపోను. ఇక్కడ దొమ్మీలాడకండయ్యా.

బస—వారి తగాదామాట అవతలవుంచి ముందుగా మేము చెప్పేది వినవలెను. రామానుజాచార్లు చెప్పేదానికి మే మసలే వప్పుకోము. దేవుడు త్రినేత్రుడనిన్నీ పార్వతీసమేతు డనిన్నీ త్రిశూలఖట్వాంగవిరాజితుడనిన్నీ విభూతిధారి అనిన్నీ బోధించవలెను.

రామా—ఆలా చెపితే పాఠశాల సాగనేసాగదు. విభూతి రుద్రాక్షలు ధరించి లింగం కట్టుకున్నవాణ్ణి చూస్తే సచేలస్నానంచేసి చాంద్రాయణవ్రతం చెయ్యవలెను.

బస — తిరుమణి తులసిపూసలు ధరించి చక్రాంకితాలయిన

వాణ్ని చూస్తే భూప్రదక్షిణం చేసివచ్చి పాపం పోవడానికి వందమంది మహేశ్వరులకు భోజనం పెట్టవలెను.

వ్యాస—చక్కిలికితాలమాట యెత్తితే మీకూ మాకూ బాగా జరగదు. జాగ్రత్త. దేవుడినుఖానికి అంగారంపెట్టి పంచముడ్రిలూ వుంచవలెను.

పర—దేవుడికి యేచిహ్నాలూవద్దు. స్మార్తాచారాలు తెలిసి నిత్యమూ పిల్లవాళ్ళ స్నానసంధ్యావ్యనుష్ఠానాలు చెయ్యడానికి శ్రుతి స్మృతులూ వాటి భాష్యాలూ చెప్పించి జీవేశ్వరులకు భేదం లేదన్న అద్వైతసిద్ధాంతం బోధిస్తే సరిపోతుంది.

వ్యాస—అద్వైతసిద్ధాంతం మాలో యెవరికీ పనికిరాదు, స్మార్తుల మొఖం చూస్తే సచేలస్నానం చెయ్యవలెను.

రామా—స్మార్తులమొఖం చూస్తే చాంద్రాయణం చెయ్యవలెను.

బస—స్మార్తులమొఖం చూస్తే భూప్రదక్షిణం చెయ్యవలెను.

వెంక—మీరునిష్కారణంగా స్మార్తులను యెందుకుమాష్టీస్తారు. మనం వచ్చినపని చూచుకోవలెను. ఈప్రకారంగా మీరందరూ దొమ్మిగా మాట్లాడక నీలో పెద్దలు యెవరో వారిని మాట్లాడమనండి.

రామా—మాలో ఆమూల కూరుచున్న గండభేరుండాచార్యుల వారు భాగవతాగ్రేసరులు.

వెంక—వారు ముఖానికి విసనకర్ర అడ్డంపెట్టుకున్నా రేమి?

రామా—వారు స్మార్తుల ముఖమున్ను శైవులముఖమున్ను చూడరు. అందుకోసం అడ్డంపెట్టుకున్నారు.

బస—మాలో చిక్కయ్య అయ్యవార్లంగారు కేవలమూ

పరిమథగణాలలోనివారు. యీసభకు వైష్ణవులు వస్తారని వారు ఇక్కడకు విజయం చేయలేదు.

రంగా—యేడవలేకపోయినాడు.

బస—ఓఆచార్లు మొత్తుకోలేక పోయినాడు.

రంగా—మీశైవులు శక్తిపూజ పేరుపెట్టి తాగుతారు.

బస—మీవైష్ణవులు రామానుజకూటమని పేరుపెట్టి తాగడమే కాకుండా మాంసంకూడా తింటారు.

రంగా— (లేచి) ఆరి గాడిదెకొడుకా! మావైష్ణవులను దూషిస్తావురా?

బస—(లేచి) ఆరిలంజెకొడుకా! మాశైవులనుదూషిస్తావురా?

రంగా—వైష్ణమతమందు అభిమానంవున్న వాళ్ళంతా లెండి. యెవరుగెలుస్తారో చూతాము.

బస—శైవమతమందు అభిమానమున్నవాళ్ళంతా నడుంకట్టుకుని నిలుచోండి. యెవరుగెలిచేదీ కనబడుతుంది.

పర—హరిశాస్త్రులుగారు మాలో బ్రాహ్మణ్యాలు.

వెంక—వూరుకోవయ్యా! బ్రహ్మణ్యాలూలేదు గిహ్మణ్యాలూలేదు. వూరుకోకుంటే యిప్పుడు మేజస్ట్రీటు జరుగుతుంది. ఆచార్లుగారూ! మీరు యింటికి వెళ్ళండి. అయ్యవార్లంగారూ! మీరింటికి విజయంచెయ్యండి. ఈసారి చాలించి మరివకసారి మళ్ళీసభచేతాము.

(అని బతిమాలుకొని అందరినీ యిండ్లకు పంపివేస్తున్నారు.)

శకునములు.

——:0:——

[పాపయ్యపంతులవారును, కామయ్యశాస్త్రులవారును ప్రవేశించుచున్నారు.]

కామ——పాపయ్యపంతులుగారూ! మీకు గొప్ప ఆపద సంభవించినది. ఈదొర వట్టి కిరాతుడు. నూరురూపాయలపని నిష్కారణంగా పోయింది. జాతివాడిస్వభావం యెరిగినవారు మీరు రెండుదినాలు ముందుగానే బయలుదేరక పోయినారండీ?

పాప——ఆడవాళ్ళను తీసుకొని మంచీచెడ్డా విచారించకుండా దూరభారం యెలాగుబయలుదేరసండీ! అమావాస్యకుముందే బయలుదేరుదామంటే దోవలో అమావాస్యనస్తే మంచిదికాదని పెద్దలు చెప్పినారు.

కామ——అమావాస్య వెళ్ళినవిదియనాడు బైలుదేరినా రెండు రోజులు ముందుగానే వస్తుర.

పాప—— అమావాస్య వెళ్ళినపాడ్యమి ప్రయాణానికి బొత్తిగానే మంచిదికాదు. విదియనాడు బయలుదేరుదామంటే ఆరోజు శుక్రవారమయినది. అక్కడికే మొండిచొరవచేసి బయలుదేరుదామని ఆలోచిస్తూవుంటే తుసుక్కుమని లోపల యెవరో తుమ్మినారు. అటువంటి అపశకునమయినతరువాత యేదియేమయినా ప్రయాణం చెయ్యకూడదని నాటికి మానివేసినాను.

కామ—— పోనీ తదియనాడు తెల్లవారుగట్ట బయలుదేరకపోయినారా?

పాప——అన్నీ యెరిగినవారు మీరూ ఆలాగే సెలవిస్తారేమి? పిల్లలను తీసుకొని శనివారం వుదయాన్న ముహూర్తంపూట యెలా

బయలుదేరను? అమధ్యాహ్నం వర్జ్యం వచ్చినది. వర్జ్యం వెళ్ళిసతరువాత రాత్రిప్రయాణంనిమిత్తము బండికోసం వర్తమానం పంపించవుంటే గుడ్లగూబ కూసింది. అందుకోసం ప్రయాణము మానినను. ఆ మరునాడు చవితి ప్రయాణానికి మంచిదికాదని మీ రెరింగినదేకదా?

కామ—మీరు పంచమినాడు వుదయాన్న బయలుదేరినారు కాబోలును. అలాగయినా యిక్కడకు మూడుకోజులకిందనే రావలసినదే.

పాప—ఆరోజునా బయలుదేరలేదు. ఆరోజు వుదయాన్న నక్షత్రం మంచిదయినదికాదు. అదికాకుండా వర్జ్యంకూడా వచ్చినది. మధ్యాహ్నం బయలుదేరుదామంటే భోజనంచేసి ప్రచారుచేస్తూవుండగా మాల బల్లి మీదపడితే జ్యోశిష్కుణ్ణి పిలిపించి స్నానంచేసి దీపం పెట్టుకొని శాంతి గీంతీ చేసుకునేటప్పటికి దీపాలవేళయింది. రాత్రి భోజనాలు చేసి బయలుదేరుదామంటే పెద్దలందరూ చుక్కయెమురు వెళ్ళకూడదన్నారు.

కామ—మరునాడు షష్టిగనుక ఆరోజునా బయలుదేరలేదనుకుంటాను.

పాప—వక్క షష్టిమాత్రంఅయితే యోగాగయినా బయలుదేరుదును. ఆవేళ పిడుగువలె మంగళవారంకూడా వచ్చినది. ఈరెంటికీతోడు ఆ దినం వట్టిపాడునక్షత్రం.

కామ—ఇఖ సప్తమినాడు బయలుదేరినారు. అక్కడికి బండీ బోగానడిచినది. మీరు నిన్న భోజనానికే యిక్కడకు రాయచేసినారు.

పాప— సప్తమీబుధవారం ప్రయాణానికి బహు అనుకూలమయిన దినం అయినప్పటికీ ఆ దినం వుదయం బయలుదేరడానికి సంద

ర్భపడ్డదికాము. అప్పుడు నిర్ణయంమాత్రం వుంచినాము. ఆదినం మా చిన్నకుఱ్ఱవాడు పుట్టినదినం. ఆదినం పండుగచేసుకుని భోజనాలుచేసి బయలుదేరితేకాని వల్లకాదని ఆడవాళ్లు పట్టుపట్టినాయు. ఆవుదయాన్నే బయలుదేరితే దొంగలమట్టి మధ్యాహ్నమే దాటిపోదుము. భోజనాలు కాగానే బయలుదేరుదామని బళ్ళుకట్టించి తీరా యెక్కబోయేటప్పటికి వెధవముండ యెదురుగుండావచ్చి మళ్ళీలోపలికిపోయి అరఘంటసేపు ఆగినాము. అప్పుడు బయలుదేరినా దీపాలు పెట్టకముందే దొంగలమట్టి దాటుదుము. మళ్ళీ వీధిగుమ్మంలోకి వచ్చేటప్పటికి వంటిబ్రాహ్మడు యెదురుగుండావచ్చినాడు. అందుచేత మళ్ళీ లోపలకువెళ్ళి కొంతసేపు ఆగినాము. ఇఖ యిలాగుచేస్తూవుంటే కార్యములేదని వీధులో యెవడూ నడవకుండా జాగ్రతపెట్టి పొరుగింట్లోనుంచి వకముత్తయిదువ యెదురు గుండావచ్చేట్టట్టు బందోబస్తుచేసి చటుక్కున బండియెక్కి బయలు దేరినాము. యెంతమంచిశకునంచూచి బయలుదేరినా ఆవెధవముండ యెదురుగావచ్చినవేళ యెటువంటిదోకాని మాఅనుభవం మాకు వెంటనే అయింది. రాత్రి పదిఘంటలకు మేము దొంగలమట్టినద్దకు జడుస్తూనే వచ్చినాము. మేము ఝుషిసినట్టుగానే యెట్లాగ్రహించినారోకాని దొంగలు సమయానికి వచ్చి నగలన్నీ యెత్తుకొనిపోయినారు. మేము మంచిశకునం చూచుకుని బయలుదేరడంచేత ప్రాణాలపుమాత్రం అపాయం లేకుండా బ్రతికి బయలపడ్డాము.

కాము—దానిముండా మోసినసొమ్ము మీరు సొమ్ము కేమీ పిచారపడవలసినపని లేదు. ప్రాణాలు బాగుంటే సొమ్ము మరివకనాటికి గణించుకోవచ్చును. శెలవుదినాలు అతిక్రమించి వచ్చినా రని దొర ముండాకొడుకు అక్రమంగా పని తీసివెయ్యడంచేత యెల్లకాలమూ జరిగేజీవనానికి భంగం వచ్చిన దని నాకు బహువిచారంగా వున్నది.

ఇదంతా అనుభవించేవాళ్ళము మా దురదృష్టంగాని తమకేమి మహా రాజులే. ఇదివరకు గడించుకొన్న వానితోనే జీవం చేస్తాము.

పాప—నాకు యేలినాటిశని వున్నదని జ్యోతిష్కులు చెపుతూ వచ్చినారు. ఇదీ దానిఫలం. మొన్న నేను జాతకం చూపిస్తే మా వూళ్ళో జ్యోతిష్కుడు మీకు సంవత్సరంలో ధననష్టం ఎస్తుందని చెప్పి నాడు. అదంతా దాఖలా యిస్తూవున్నది. ఇఖనుండు జరగవలసిన సంగతి ఆలోచించవలెను. అడుగో మాఅబ్బాయి స్కూలులోనుంచి వచ్చినాడు. వాడు శకునాలూ గిఖునాలూ లక్ష్యంచెయ్యక బయలు దేరుమని నాతో చెడపోరినాడు.

[సుబ్బారావు ప్రవేశించుచున్నాడు.]

కామ—చిన్నవాడు ఈసంగతులన్నీ ఆయనకేమి తెలుసునండీ? అందులోనూ యిస్కూళ్ళల్లో చదువుకునేవాళ్ళకు బొత్తిగా దేవుడూ చెయ్యనూ వారమూ వర్జ్యమూ యేమీ అక్కరలేదండీ. వాళ్ళకూ కాలం వచ్చి సంసారం మీదపడితే అప్పుడు అన్నీ తెలుస్తవి.

సుబ్బా—ఇక మాకు యెన్నిసంసారాలు మీదపడ్డా ఇప్పుడు తెలిసినదానికంటె యీవిషయంలో యెక్కువగా తెలియదు.

పాప—కుర్రవాడు వాడితో నేమిగాని ముందు చెయ్యవలసిన పని యేమిటో బాగా ఆలోచించి చెప్పవయ్యండి.

కామ—చెయ్యవలసినపని యేమున్నది? శని చాలదు గనుక మీరు నవగ్రహజపం చేయించి బ్రాహ్మణులచేత గ్రహశాంతి చేయించవలెను. దానినిమిత్తము దశవిధదానాలూ హోమాలూ చేయించవలసి వుంటవి. అటుతరువాత మీశక్తికొలది రెండువందలకో మూడువందలకో బ్రాహ్మలకు సంతర్పణ చేసి మీకు తోచినమాత్రం సంభావన యివ్వవచ్చును.

సుబ్బా-- నాన్నగారూ! మీరు యిక యిలాగంటి పాడుఖర్చు యేవిరా చెయ్యకండి. బ్రాహ్మలు యెలాగయినా మీచేత ధదిడబ్బులు ఖర్చుపెట్టించి దిట్టంగా భోజనాలుచేసి దక్షిణలు పుచ్చుకొని యెలా గయినా తమరు బాగుపడడానికి చూస్తారు. నామాటలు విని మీరు జపాలూ తపాలూ మానివేసి దొర అనుగ్రహం సంపాదించడానికి చూడండి. మీరు లంచాలు పుచ్చుకుని బ్రాహ్మలకు సంతర్పణలూ సమారాధనలూ చేస్తారని వినడంచేత మీమీదవున్న కోపంచేత దొర యిలాగున చేసినాడేకాని లేకపోతే యిలాగు చేసేవాడుకాడు. ఇక్కడ దొరకు అనుగ్రహం రాకపోతే యీ బ్రాహ్మలకు పెట్టేసొమ్ము పెట్టి చెన్నపట్నం వెళ్ళి అప్పీలు చేసుకుంటే తప్పకుండా కార్యమవు తుంది. మీరు వారాలూ వర్జ్యాలూ యీచాదస్తమంతా మాని నేను చెప్పినప్రకారం విదియనాడే బయలుదేరివున్నట్లయితే యీ చిక్కులన్నీ లేకుండా మహారాజువలె మీపనిలో మీరు తిన్నగా వుండి వుందురు.

పాప-- యేమో యిక జరిగిపోయినదానికి విచారిస్తే కార్యం లేదు. ముందుసంగతి చూచుకోవలెను. మనం జ్యోతిషం బొత్తిగా కొట్టివెయ్యరాదు. మనసొమ్ము కొంత బ్రాహ్మలహృదయంలో పడితేనే కాని మనం యే అప్పీలుచేసినా కార్యం వుండదు. నవగ్రహజపాలు వకక్ యీపనికోసమే కాకుండా అనేకవిధాల మంచివి. ఈవేళ మొదలు కొని ముందుగా సూర్యసమస్కారాలు చేయుంతాము.

కామ-- పాపయ్యపంతులువారు కేవలమూ బ్రహ్మణ్యులు. వారికి తెలియని దేమీలేదు. బ్రాహ్మలకు యెంతయిస్తే భగవంతుడు అంత సంతోషిస్తాడు. భగవంతుడు సంతోషిస్తే సమస్తకార్యాలకూ

విజయం కలుగుతుంది. అబ్బాయీ! నీకింకా యంచీ చెడ్డా తెలియదు వూరుకో.

సుబ్బా—మీకన్నీ తెలుసును. ఇదివరకు బ్రాహ్మణులకు పెడుతూవచ్చినఫలం నేటికిట్లాకనబడ్డది. నేనుచెపితే వింటారుగనుకనా? మీ మనసువచ్చినట్లు చెయ్యండి. (అని వెళ్లుచున్నాడు.)

దురాచారదూషణము.

[విశ్వేశ్వరరావుగారును, గరళకంఠశాస్త్రులవారును ప్రవేశించుచున్నారు.]

విశ్వే—శాస్త్రుల్లుగారూ! వూళ్ళో విశేషాలు యేమిటి?

గర—విశేషాల కేమివున్నవండి? అంతా కలికాలం వచ్చినది. ఈయింగ్లీషుచదువుకున్న వారిమూలంగా అంతా వర్ణసంకర మావుతూ వున్నది. బాగా ఆలోచిస్తే యిగంతా వాళ్ళవాళ్ళ బుద్ధిజాడ్యంలో వున్నదిగానండి యింగ్లీషుచదువులోనూ యేమీలేదండి. ఇంగ్లీషులో తమకంటె యెక్కువపాండిత్యంగలవారూ యెక్కువపరీక్షు యిచ్చిన వారూ యెవ్వరున్నారు? తమ బ్రాహ్మణపక్షపాతమూ మతాభిమానమూచూస్తే నాకు యెంతో ముచ్చటవుతుంది. యిది తమముందర ముఖస్తుతికోసం అనేమాట కాదుసుమండీ? నేను యిది నిజంగా త్రికరణ శుద్ధిగా చెప్పేమాట.

విశ్వే—అవునండి. ఇప్పుడన్నీ పాడుదినాలు వచ్చినవి. పూర్వపు రాజుల కాలమయితే మనమెంతైనా చేతుము. మనం లోపల యేమిచేసినా యీవర్ణసంకరం చేసేవాళ్ళను బహిరంగముగా యేమీ చెయ్యడానికి వల్లపడదు. అందుచేతనే లోపల నాకు వాళ్ళమీద

గొంతుక కాడికి కోపం వున్నా పుకి యేమిా యెరుగనివాడివలె నటిస్తాను.

గర—మీరు అవశ్యం వాళ్ళ కలాగు కనపడవలసినదే. ఆలా వుంటేనేకాని వాళ్లమర్మాలూ రహస్యాలూ ఆలోచనలూ తెలుసుకొని వాళ్ళను సాధించడానికి వల్లపడదు. సమస్తతంత్రములూ తమకంటె యెవరికీ యెక్కువ తెలియువు. మిత్రభేదం వుంటేనేకాని కార్యం కానేరదు. రాజనీతిలో విష్ణుశర్మ మిత్రభేదమును యెంతబలముగా చెప్పినాడు? పంచతంత్రంలో కరటకదమనకులు వృషభందగ్గిర మంచిమాటలు చెప్పి మిత్రభేదంచేసి దాన్ని యెలాగు చంపినారు? చిరంజీవి అనే కాకి గుడ్లగూబలతో స్నేహంచేసి వాటినన్నిటిని యేలాగు నాశనంచేసినది? ఇలాగంటి కథలు పుస్తకాలలో వింటూవుండడమేకాని అటువంటిస్త్రీ మీవద్ద తప్ప మరి యెక్కడా చూడలేదు. వాటినలెనే మీరు మీ కార్యం సాధించి చివరకు జయభేరీ వేస్తారు.

విశ్వే—దైవానుగ్రహమువల్ల మనకృషి నెరవేరవలెను కాదండి. మన ఆచార్లవాళ్ళ కమునా బుద్ధి లేదు. మనదగ్గిరకు వచ్చినప్పుడు తలకాయ ఆడించి పోయినా అవతలకు వెళ్ళినతరువాత వాళ్ళూ మనం చెప్పినట్లుల్లా చెయ్యరు. పాడుముండాకొడుకులు దొరికేడబ్బు పోతుం దేమో అని జడుస్తారు. మెట్టుమోదమాట మనలో యెవళ్ళకూ కట్టు లేదండి. నిజంగా వీళ్ళల్లో కట్టయినా వున్నట్టయితే నేను చేసేకృషికి యెంతపని అయినా జరుగును.

గర—అవునండి మనవాళ్ళల్లోనే కట్టువుంటే వాళ్ళాడినట్లుల్లా సాగుతుందండీ? ఇంకా మీమతంలో కొంచెం కట్టు వున్న దండి. చూచినారా మొన్న మనవాళ్ళు యెంత విరుద్ధమైనకార్యం జరిగించి నారో? అతిబాల్యవివాహాలు కూడదని శాస్త్రానికిన్ని శిష్టాచారానికిన్ని

కేవలం విరుద్ధంగా వాదం చేస్తూవున్నందుకు పురుషోత్తమరావుగారి యింటికి యెవరూ పెళ్ళికూడదని కట్టుచేసుకున్నామా అండి? అటువంటి స్థితిలో మన శిరస్తాదారుగారూ మొదలయినవారంతా అతణ్ని వెంట వేసుకుని పెళ్ళి చెరుకుతోటలో కలిసి చెరుకుపానకం పుచ్చుకున్నారట. యిటువంటి అకార్యకరణం జరిగినతరువాత వాళ్ళను పెలి వెయ్యకుండా వుంటే యింకా మతం యేమిటండీ. మీరు యింపులో గట్టిశ్రద్ధ చెయ్యవలెను.

విశ్వే—మీస్మార్తులలో మీరును జంబుకశాస్త్రులగారును కలిసి పని చెయ్యండి. ఆచెరుకుపానకం తాగినవాళ్ళలో మామతంవాడు కూడా వకడు వున్నాడట. అతగాడివిషయంలో నేను తగినంతపని చేస్తాను. మీరు యింటికి వెళ్ళేటప్పుడు మరిచిపోకుండా లోకాచార్యులుగారిని మాయింటికి పంపించి మరీ వెళ్ళండి అతగాడు వకమాటు నన్ను యెంతమాట అన్నాడనుకొన్నారు? ఆమాట విన్నప్పటినుంచీ అతని మీద నాకు కోపం వేధిస్తూవున్నది. మొన్న మేముయిద్దరమూ వకచోట కలుసుకున్నప్పుడు "పంతులుగారు యెక్కడా దర్శనంలే" దన్నాడు. దర్శనంకోసం నేను తనయింటిచుట్టూ తిరుగుతూవుంటానుకొన్నాడా?

గర—ఆయనకు చిన్నతనంకూడ నండి. అదృష్టవశంచేత నెలకు నాలుగువందలు సంపాదిస్తూవున్నాడన్నమాటేకానండి లోకానుభవం యెంతమాత్రమూ లేదు. అనవచ్చినమాటా అనరానిమాటా తెలియదు. తమగౌరవం చూడకుండా తమరిని అటువంటిమాట అనడం కేవలం తప్పితం.

విశ్వే—నన్ను అతగాడు మర్యాద యెరుగకుండా చిన్నతనపు మాటలు అనడం యీవకక్కమాటే కాదండి. చాలామాట్లు ఆలాగే

చేసినాడు. యీమధ్య యెవరితోటో నేను బోగందానితో వెళ్ళి రోగాలు తగిలించుకొన్నానని ప్రశంస చేసినాడట! నేను మగవాణ్ణి గనుక మహారాజువలె నాడబ్బు నేను ఖర్చుచేసుకుని మనసువచ్చిన వాళ్లతో తిరుగుతాను. తనకుమల్లె అతిబాల్యవివాహాలు కూడవనే వాళ్లతోనూ వేదశాస్త్రాలు పౌరుషేయము లనేవారితోనూ స్నేహం చేసి కులహాని వచ్చేకార్యం యేమీ చెయ్యలేదుగదా? ఇప్పటివాళ్ళకు నవ్వకర్లను తిన్నగా వుంచుకుని వాళ్లచేత పని పుచ్చుకోవడం తెలియదు. నేను వక్కనవ్వుకరును వుంచుకుంటే ముందుగానే రెండుపనులకు అక్కరకువచ్చేటట్టు ఆలోచిస్తాను.

గర__అవునండి. తమకూ వారికీ సాపత్యం యెక్కడండి? ఇప్పుడు మనం చెయ్యవలసిన కార్యం ముందుగా ఆలోచించవలెను. బుద్ధియందు తమరు బృహస్పతిని మించినవారు. తమకూ కచేరీకి వేళ వుతూ వున్నది. వేగిరం సెలవియ్యండి. తమబుద్ధికి అసాధ్యం యేమీ లేదు.

విశ్వే__మీరు స్మార్తుల నలుగురి యిళ్ళకూ వెళ్ళి మొన్న తోట లోకి వెళ్ళినవాళ్ళయిళ్లకు యెవళ్ళూ తాంబూలానికీ భోజనానికీ వెళ్ళకుండానున్న పిలవకుండానున్న బందోబస్తు చెయ్యండి. తన శిరస్తాదారీ యిక్కడ యేమైనా పనికివస్తుందేమో చూతాము.

గర__ఆయన శిరస్తాదారీ డాబూదర్పమూ యేమీ లేదు. మూలనున్న ముసలిముండ లేవమ. డబ్బుపుచ్చుకోవడం చేతగాక మేమేమో లంచాలు పుచ్చుకోమనీ బహుసిస్టాపరులమనీ సిగ్గులేకుండా చెప్పుకుంటారు. అప్రయోజకులంతా మడికట్టుకునే కూర్చుంటారు. ఈయన వచ్చి శిరస్తాదారీవఖరే చంపివేసినాడు. వుద్యోగం వున్నదని నలుగురికి వుపకారంచెయ్యనా అపకారంచెయ్యనా యేమీ లేదు,

వెనుక కొండ్రాలావు పంతులుగారు శిష్టాదారీ చేసినప్పుడు గర్భాలలో పిండాలు అదిరిపోయేవి. వక్కాకేక వేస్తే వూళ్ళోవాళ్లంతా గడగడవడకి బట్టలలో అల్పాచమనం చేసుకునేవారు. తెల్లవారేటప్పటికి గుమ్మం కాడ కూరలకావిళ్ళయితేనేమి కర్రలకావిళ్ళయితేనేమి పెరుగుకావి ళ్ళయితేనేమి నూరుకావిళ్ళు వుండేవి. ఆయన నెలకు ఫదివేలు సంపా దించినా సంపాదించేవాడు. ఆవుద్యోగం తమకయితే తమదీ ఆలాగంటి హోదే. నిమిషంలో దొరను జేబులో వేసుకోరా? ఆలాగంటి అధి కారం పట్టినప్పుడు మీపేరు చెపితే యెవరైనా చెరువులోనీళ్ళు తాగు తారండీ? మీరు బాగుపడ్డా మావంటివారిని ఫదిమందిని బాగుచేసినా ఆహోదా మీకేరావలెను.

విశ్వే—ఆ వుద్యోగం నాకయితేనా యిలాగు శాస్త్రవిరుద్ధంగా నడిచేవాళ్లనందరినీ యేదోపక వంకపెట్టి పట్టితెప్పించి కొట్లోపెట్టించి వొక్కొక్కణ్ణే డజన్ బాజీ వేయించనూ? నాకు నాలుగేళ్ళు శిరస్తాదారీ కానియ్యండి. నేను పశువులను కట్టివెయ్యడానికికూడా బంగారపు గొలు సులు చేయిస్తానోలేదో మీరే చూస్తారు—అరుగో గౌరీపతిగారు వస్తూవున్నారు. మీరు విజయం చెయ్యండి.

[గౌరీపతిగారు ప్రవేశించుచున్నారు.]

గర—నమోనమః నేను సెలవుపుచ్చుకుంటానండి.

గౌరీ—నేను రావడంతోనే మీరు వెళుతూవున్నారేమండీ?

గర—అయ్యా! మాయింట్లో శుభకార్యాలు వున్నవండి. బజా రుకు వెళ్లవలెను. తరువాత తమబసవద్దకు వచ్చి దర్శనం చేసుకుంటాను. ఇందులో తమసహాయము లేకుండా శుభకార్యాలు కావండి. అక్షి తుణ్ణి మరిచిపోకండి. (అని వెళ్ళుచున్నాడు)

విశ్వే— నాలుగుముక్కలు చదువుకున్నా డన్నమాటేకాని

యీ బ్రాహ్మడు వట్టిచేదస్తుడండి.

గౌరీ—వక్క చానస్తుడుమాత్రమేకాకుండా దుర్మార్గుడుకూడానండి.

విశ్వే—మాకుక్కను చూచినారా? దీనికి ఘుడియకువకమాటు పేలుపడుతూ వుంటనండీ.

గౌరీ—మీరు కుక్కను మట్టుకుంటూవుంటే యీశాస్త్రుల్లు వూరుకుంటూడండీ?

విశ్వే—కుక్కను మట్టుకుంటే శాస్త్రుప్రకారం తప్పులేదనిన్నీ కాశీలో కాలభైరవుడంటే మహామడి అనిన్నీ అక్కడ కుక్క మట్టుకుంటే యెవరయినా అన్నం పారవేస్తే కళ్ళు పోతవనిన్నీ తెలియనివాళ్లు కుక్కను మట్టుకోరాదంటారనీ బహుశ్లాఘించినాడు.

గౌరీ—ఈయనే మొన్న కుక్కను పెంచినవాళ్ళ మొగంచూస్తే పాపం వస్తుందని అచ్యుతరావుగారి యింటివద్ద శ్లోకం చదివినాడు.

విశ్వే—యిలాగంటి ఛాందసునిమాట మనం పాటిపట్టరాదు. నాకు యిలాగంటిపిచ్చి యేమీలేదు. యీలాగంటి వేదజడులమాట లక్ష్యంచెయ్యకుండా మనంపనిచేస్తేనేకాని మనదేశం బాగుపడదండి. మీరు చెరుకుతోటలోకివెళ్ళినప్పుడు నన్ను పిలుచునివెళ్ళినారు కారుగదా?

గౌరీ—శిరస్తాదారుగారు మీవద్దకు మనిషినిపంపిస్తే చీట్లపేక ఆడుతూ కూర్చుని వుపద్రవమయిన కడుపునొప్పి వచ్చిందని చీటివ్రాసి పంపించినారట కాదూ?

విశ్వే—కాదండికాదండి. నాకు నిజంగానే కడుపునొప్పి వచ్చిందండి. చీట్లపేక యెందుకాడుతూవున్నానంటే—జ్ఞాపకం చేసుకుంటాను—యెందుకాండి—నిద్రరాకుండాను.

గౌరీ—భోజనం చెయ్యకముందు వుదయాన్న నిద్రిపోతేనేమి? మీకు కడుపునొప్పివుంటే అసలు నిద్రవస్తుందండీ?

విశ్వే—మీతోడు నామాట నమ్మండి. యెందుచేతనోకాని వైద్యుడు వుదయాన్నకూడా నిద్రిపోవద్దన్నాడు. వకవేళ వైద్యుడు మరియేదైనాచెపితే నేనే ఆలాగుఅనుకున్నానేమో! మీకు ఆసందేహం వుంటే రేపు మళ్ళీ పిలవండి. చెరుకుపాసకంకాదు మీతోకలసి భోజనం కూడా చేస్తాను.

గౌరీ—వెనుక తాంబూలాసకి పిలిస్తే రాలేదుగాని యిప్పుడు భోజనానికి వస్తారు.

విశ్వే—నా కయితే నిజంగా రావలెననే వున్నదికాసండి మా అన్నగారిభయంచేత రాలేకపోయినాను. మీరు ననున్మన్నించవలెను. యీరాత్రి మాలోపల నెల్లూరునుంచి వచ్చినబోగంవాళ్ళచేత పాట పాడిస్తాముగాని తమరు దయచేస్తారా? అందులో పడుచుకుర్రది బహు బాగా పాడుతుం దండీ.

గౌరీ—మీరు సంగీతంలో సరసులు. దాన్ని గ్రహిస్తారు. అందులో నా కేమీ అభిరుచి లేదండి. మీకు యింకా భోజనానికి వేళ కాలేదండీ?

విశ్వే—అయింది. తమరు మాట్లాడుతూవుంటే కూర్చున్నాను.

గౌరీ—అలాగయితే సెలవు పుచ్చుకుంటాను.

(ఇద్దఱును వెళ్ళుచున్నారు.)

నవనాగరికులు.

[నరసింగరావుగారును, రామారావుగారును ప్రవేశించుచున్నారు.]

నర—రామారావు! ఎక్కడా జాడలేదు. యింగ్లీషు చదువు తోనివాళ్ళంతా బొత్తిగా శూపరిస్టిషన్‌లో మునిగిపోయినారు. వాళ్లకు

బొత్తిగా జ్ఞానం లేదు. నీవు తరుచుగా మాసహవాసం చేస్తూవుంటావు గనుక నీకు శూపరిస్టిషన్ అంత లేదు.

రామూ—మీరు శూపరిస్టిషన్ అని తరుచుగా అంటూవుం టారు. ఆమాట కర్థ మేమిటండీ?

నర—శూపరిస్టిషన్ అంటే మూఢభక్తి. పిచ్చినమ్మకము. అని దానిఅర్థము. దానిచేతనే మనవాళ్ళంతా లేనిపోనిచాదస్తం పెట్టుకుని దేహం చెడకొట్టుకుని అనేకవిధాల నష్టములు పొందుతారు.

రామూ—మీకుమాత్రం ఆశూపరిస్టిషన్ లేనా? మీరు వొళ్లు చెడకొట్టుకోవడం లేదా?

నర— నీవనేమాట నాకు తెలిసింది. నావిషయంలో అది శూపరిస్టిషన్‌లో చేరినదికాదు. వాళ్లయిష్టం లేకుండా చిన్నతనంలో తల్లిదండ్రులుచేసిన మ్యారియేజి బైండింగు కాదు. నాకు యిష్టంలేని దాన్ని తీసుకునివచ్చి నాతండ్రి నాకు కట్టిపెడితే నేను వప్పుకోవడం ధర్మం కాదు. దాన్ని యేలేవాడు నాతండ్రా నేనా? అందుచేత నేను దాన్ని విడిచిపెట్టి బోగందాన్ని వుంచుకుంటే అందులో యేమిస్ని తప్పిదం లేదు. వయస్సు వచ్చినతరువాత సంభోగం లేకుండా వుంటే అనేకరోగాలు పుడుతవని అనేకమందిడాక్టర్లు చెప్పినారు. నే నిప్పుడు దేహం కాపాడుకోవడంనిమిత్తమే వేశ్యను వుంచుకున్నానుగాని మరి వకటి కాదు.

రామూ—నేను యెంత యింగ్లీషు చదువుకోకపోయినా భగవం తుడు దయచేసినజ్ఞానం నాకూ కొంత వున్నది. మీయిష్టం లేకపోతే మొట్టమొదట మీతండ్రిగారు పెళ్ళిచేసేటప్పుడే వద్దని గట్టిగా పట్టుపట్టి యెందుకు వివాహం చేసుకోవడం మానలేకపోయినారు? మీరు సమా ధానపడి వివాహం చేసుకోవడంచేత చేసుకున్నభార్య కురూపి అయినా

మూర్ఖురాలయినా మరి యెటువంటిలోపంగలదిఅయినా యేలడం విధాయకం. అలా యేలకపోతే తండ్రిగారు చేసినారన్న తప్పితాన్నిబట్టి నిర్దోషురాలయినభార్యను నిష్కారణంగా శిక్షపెట్టడం పాపం గాదా? మీరు మొట్టమొదటనే వివాహం కాకపోతే ఆచిన్నది తన్ను సుఖపెట్టే వాణ్ని మరి యెవరినైనా పెళ్ళిచేసుకొనునే.

నర—నాన్సెన్సు నీవు రీజన్ లేకుండా మాట్లాడుతూవున్నావు. ఇంగ్లీషు రాకపోవడంచేత మంచీ చెడ్డా యెరగవు. అవంతా నీకంటె నాకు బాగా తెలుసును. నాహోల్తుకోసమూ ప్లెజర్‌కోసమూ నేను బోగలదాన్ని వుంచుకుంటే దాని కేమయినా నేను అన్నానికీ బట్టకూ లోసం చేస్తూవున్నానా?

రామా—అన్నానికీ బట్టకూ కాకపోతే స్త్రీలకు ముఖ్యంగా కావలసినదానికేమో దానికి లోపం జేస్తూవున్నారు. మీరు చెప్పిన ప్లెజర్ మీవకక్కరికేకాని స్త్రీల కక్కర లేదా? తండ్రిమాత్రం కూతురి అనుమతి పుచ్చుకుని మరీ పెళ్ళి చేస్తూవున్నాడా? నా అనుమతిమీద వివాహం చెయ్యలేదుగనుక బలవంతముగా కట్టిపెట్టినవాణ్ని వదిలిపెట్టి నాయిష్టంవచ్చినవాడితో సుఖపడుతానని భార్య అంటే మనకు యెట్లా వుంటుంది? లోకంలో అందరూ చక్కనివాళ్లే వుండరు. భార్య చక్కనిదైతే పురుషుడు కురూపి అవుతాడు. మగడు చక్కనివాడైతే భార్య కురూపి అవుతుంది. యెవరి కేది తటస్థమైతే దానితో తృప్తిపొంది వుండవలెను.

నర—నీవు మహాఅధికప్రసంగం చేస్తూవున్నావు. మావంటి రిఫైన్డ్ జెంటిల్‌మెన్‌తో వాదం చెయ్యడానికి నీవు తగవని యిదివరకే చెప్పినాను. నీవు మానవకవిషయం మాట్లాడు.

రామా—ఇంగిలీషు చదువుకున్న మీనాగరికతకూ ఇంగిలీషు

చదువుకోని మావంటివాళ్ళ అనాగరికతకూ నాకు యేమీ భేదం కన పడడంలేదు. నాకు తెలియక అడుగుతాను. పరివర్తనలో యేమి వ్యత్యా సం వున్నదో చెప్పండి. మీతో నాకు వున్న స్నేహాన్ని పట్టి చనువుచేత అడుగుతూవున్నాను. మనసులో కోపం వుంచుకోకండి మేమి?

నర—పిచ్చివాడా! తెలియనివాళ్లు పిచ్చప్రశ్నలువేస్తే నావంటి తెలిసినవాళ్లకు కోపంవస్తుందనుకున్నావా యేమిటి? అడిగినావుగనుక మాకూ మీకు వుండేభేదం చెపుతానువిను. మీరు పుణ్యంవస్తుందని నదు లలోనూ చెరువులలోనూ బురదనీళ్లలోనూ మునుగుతారు. మేము శుభ్ర మైన నీళ్లలోనేకాని స్నానము చెయ్యము. మీరు దేవుళ్లని రాళ్లకూ కర్రలకూ మొక్కుతారు. మేము వక్క దేవుణ్ని ధ్యానము చేస్తాము. మీరు శూద్రులు మొదలయినవాళ్ళు ముట్టుకుంటే మయిలపడుతామని దూరంగా తొలుగుతారు. మేము శుచిగావుంటే యెవరినైనా ముట్టు కుంటాము. మీరు చేవస్తంచేత యివి తినగూడదనీ అవి తినగూడదనీ మానుతారు. మేము దేహారోగ్యానికి అనుకూలమయినవన్నీ పుచ్చుకుం టాము. మీరు నోములూ వ్రతాలూ వుపవాసాలు చేస్తారు. మేము అవన్నీ పిచ్చిఅని మానివేస్తాము. మీరు చెప్పులుతొడుక్కుని బిళ్ళ గోచీలు పెడుతారు. మేము బూట్సూ కోట్లూ మొదలయినవి వేసు కొని దొర్లవలె వుంటాము. ఇలాగంటి వ్యత్యాసాలు మీకూ మాకూ లక్షవున్నవి.

రామా—మీకు వున్న నాగరికతఅంతా బూట్సులలోనూ కోట్ల లోనేకాని మనసులోనూ నడతలోనూ యేమీ కనబడదు. మీరు యేవి పడితేఅవి పుచ్చుకుంటామనిచెప్పి చెడతాగుతారు. రహస్యంగా మాం సం తింటారు. మళ్లీపైకి ఫదిమందిలోనూ అవియేమీ వప్పుకోక మాగా గువున్నట్లే నటిస్తారు. ఇన్నికబుర్లుచెప్పేవాళ్ళు మీరు తద్దినాలు మాని

వేసినారా? కార్యాలు వచ్చినప్పుడు విగ్రహాలను పూజించడం మాని వేసినారా? శూద్రులను ముట్టుకుంటామని పబ్లికుగా వాళ్ళతో కలిసి భోజనం చేస్తూవున్నారా? పుకి దొంగమాటలు యెన్నైనా చెపు తాడు.

నర—కాలంవస్తే క్రిమంగా అన్నీ చేస్తాము. ఇప్పుడు మేము చెప్పేమో స్తరుగా అన్నివిషయాలలోనూ చేస్తే చాలానష్టాలు వస్తవి! ఇంగ్లీషు చదువుకున్నవాళ్ళు తాగుతారని నీవు మహాఆక్షేపణ చేస్తూ వున్నావు. తాగడం జబ్బు అనుకున్నావాయేమి? మితంగా తాగితే దేహానికి బహుమంచిది; అన్నం జీర్ణమవుతుంది; వంట్లో ఖులాసాగా వుంటుంది. మేము తాగితే ఫములూ నూర్లూ ఖర్చుపెట్టి సీమసారాలు తాగుతాముకాని దేశవాళీసారాలు తాగము.

రామా—మీరుకూడా అన్నీ మీరు చెప్పినట్టు చెయ్యనికాడికి మమ్మలిని ఆక్షేపించడం యెందుకు? యేదీ సారాతాగుతానని పబ్లికుగా వచ్చి చెప్పండి. మీపర్జు చూతాము. మీరు చెప్పేమాటలలో మీకు నమ్మకంవుంటే యేదీ మీ వెధవచెల్లెలికి మళ్ళీపెళ్ళిచెయ్యండిచూతాము. లేకపోతే మీరెండోచెల్లెలికి సమర్తాడినదాకా పెళ్ళిచెయ్యకుండా అట్ట వుంచండి. చెప్పే శ్రీరంగనీతులన్నీ కనబడతవి. చేసేవి మాఘస్నా నాలూ దూరేవి దొమ్మరగుడిసెలూ అన్నట్టు కదిలిస్తే అందరిలోపాలూ బయలుపడతవి. దొర్లమెప్పుకోసం వాళ్ళముందర మీరు మనసువచ్చి నట్టల్లా తాగుతారు. అంతకంటే మీకూ మాకూ యేమీ భేదం కన బడడంలేదు.

నర—ఆలాకాదు. మేము రీజన్ లేనిది యేమీ చెయ్యము. మేము యెల్లప్పుడూ సమిష్టిమీద ప్రపంచంయొక్క యావత్తుసుఖం ఆలోచిస్తూవుంటామేకాని ప్రత్యేకంగా వక్కరిసుఖం చూడము.

ప్రపంచములో జనసంఖ్య యెక్కువఅయితే కాటకాలు సంభవిస్తవి. అందుచేత విధవావివాహాలలో మేము యిలాకా పుచ్చుకోము. బాల్య వివాహములు మాన్పవలసినదేకాని అప్పటికాలంలో సాగవు. యేవీ వెయ్యికుటుంబాలని వక్కమాటుగా నాతోరానీ నేను నాచెల్లెలికి సమర్థాడినతరువాత వివాహం చేస్తానోలేదో చూస్తువుగాని.

రామూ—మీమాట్టుకు మీరు రాకపోతే వెయ్యిమంది యెలాగు వస్తారు? అందరూకూడా మీలాగే ఆలోచిస్తారు. మొట్టమొదట వక్కడు దోవతొక్కి చూపిస్తే తరువాత వకరినిచూచి వకరు అందరూ ఆదోవనే నడుస్తారు. కార్యంలేనిమాటలతో యేమిప్రయోజనము? లక్ష మంది నాతోవస్తే జాతివదలిపెడతానని నేనూఅంటాను. అదీలేదు ఇదీ లేదు. యెందులోవున్నా చెప్పినప్రకారం నడుచుకునేవారు యెవరో వారిని నేను మెచ్చుకుంటాను. చెప్పినదివకటీ చేసేదివకటిగాను వుండే దొంగలు యెందులోవున్నా కార్యంలేదు. మీవద్ద వక్క సీసాకాయల నాగరికతతప్ప మరియేమీ కనబడడంలేదు. ఇంగ్లీషు చదువుకున్న వాళ్లల్లో తాగకుండావుండేవాళ్లకు సారా వుపయోగం మీకు తెలిసినట్లు తెలియదాయేమిటి?

నర—వాళ్లకు తెలియనే తెలియదు. తెలిస్తే వాళ్ల కన్విక్షన్ ప్రకారం యెందుకు నడుచుకోరు?

రామూ—మీరు యేమో యింగిలీషుమాటలు మహావేసుం టూగు. వాటిఅర్థం నాకు తెలియదు. మీరన్న కన్విక్షనంతా పనికి మాలిన తాగడంలోనూ తినడంలోనూ కనబరచకపోతే లోకోపకార మయిన కార్యాలలో యెందులోనయినా కనబరచరాదా? మీరు తాగ డంలో యెన్నిలాభాలుచెప్పినా యిలాగే మాటలు చెప్పి మంచివయ స్సులో బాగుపడేకాలంలో అకాలమరణం పొందేవాళ్లను నేను తాగు

బోతులలో నూటికి తొంభయితొమ్మండుగురిని చూస్తూవున్నాను.

నర—మితంగా తాగకపోతే ఆలాగంటివి వస్తవి. నేను వుద్యోగం సంపాదించిన మూడేళ్లనుంచీ కొంచెంగానో గొప్పగానో బ్రాందీ మొగలయినవి పుచ్చుకుంటూనే వున్నానుగదా! నేను యింకా చావక పోవడంయేమి?

రామా—నాకూ అదే ఆశ్చర్యముగా వున్నది. ప్రీత్వా ఆరంభించినతరువాత మీస్నేహితుడు నాలుగేళ్ళదాకా బ్రతికినాడు. మొట్ట మొదట మితంగా తాగుతామని ఆరంభించినవా రంతా కొన్నాళ్ళలో మితంమాట మరచిపోతారు. మీ మొట్టమొగటి మితానికీ యిప్పటి మితానికీ చాలా భేదం వున్నది.

నర—అవును. తప్పకుండా భేదంవున్నది. మనుష్యులకు క్రిమంగా అభివృద్ధి పొందుతూవుండడం సహజగుణం. అదంతా యిప్పుడు నీకు ఎక్స్‌ప్లయిన్ చెయ్యడముకు నాకు అవకాశంలేదు. కచేరీవేళ అయింది. మళ్ళీ రా చెపుతాను.

రామా—మీరు చెప్పబోయేఅభివృద్ధికీ మీకూకూడా ఫదివేల నమస్కారాలు. నాకు మీరు యేమీ చెప్పనక్కరలేదు. ఆ అభివృద్ధి లేకపోతేనే నేను ఫనికాలాలపాటు సుఖంగా బ్రతుకుతాను.

(అని వెళ్లిపోవుచున్నాడు.)

లోకోత్తరవివాహము.

---

౧. రంగము—కరుణాకరశాస్త్రిగారి వీధియరుగు.

[కరుణాకరశాస్త్రిగారును, కుట్టింభర సోమయాజులుగారును ప్రవేశించుచున్నారు.]

కరు—సోమయాజులుగారూ! మన ముసలయ్య తాతగారికి ఆస్తి యేమాత్రం వుంచుందయ్యా?

కుట్టిం—అంతా యాభై వేలరూపాయలఆస్తికి పుణ్యం వుంచుందని చెప్పుకుంచారు. మాన్యాలమీదనే సాలుకు వెయ్యిరూపాయలు వస్తవష.

కరు—ఇంతఆస్తి యెలా సంపాదించినాడయా?

కుట్టిం— ఈయన ముప్ఫయియేళ్ళ యేకాధ్వర్యంగా అమల్ దారీ చేసినాడు. ఆకాలంలో అందరికీ కొయ్యపుస్తెలు కట్టించి తాలూకా అంతా దోచుకున్నాడు. ఇప్పటికి పింఛన్ పుచ్చుకొనే ముప్ఫయియేళ్ళయినది. వెనుక పోయినయిద్దరుభార్యాలూ పాడుచేశారుగాని లేక పోతే లక్షరూపాయలఆస్తి పైగా వుండును.

కరు—ఈయనకు అన్నీ యెన్ని పెళ్ళిళ్ళు అయినవి?

కుట్టిం— అయిదుపెళ్ళిళ్ళు అయినవి. ఈమహానుభావురాలు అయిదోపెళ్ళాము. ఈవిడె అందరకూ ధర్మసత్రం వేసింది.

కరు—యెక్కడనో వొక్కొక్కపతివ్రత తప్ప ముసలిమగనిని చేసుకుసవాళ్లంతా యీలాగే వుంచారు. యీాయనకు వక్కభార్యా వల్లనూ సంతానము లేదుగదా?

కుట్టిం— ఈయన పడుచుతనంలో పెళ్ళాన్నివదిలివేసి పోఖరీగా తిరిగి అనేకజాడ్యాలు తగిలించుకొన్నాడష. ప్రథమభార్యా యీ విచా

రంచేతనే చచ్చిపోయిందని మానాయనగారు చెప్పుచూవచ్చేవారు. రెండోభార్యను నేను యెరుగుదును. ఆవిడ బహుపెద్దమనిషి. ఆమెకు సంతానం కలిగింది కాదని పింఛన్ పుచ్చుకొన్నతరువాతనే మూడో పెళ్లి చేసుకున్నాడు. ఆమె బహుపరిసిద్ధురాలు. ఆమెకాలంలో వీరి యిల్లు వెనుక యీయన అమల్‌దారీ చేసినకాలంలో వుండేటట్టు ఆమె ఆశ్రితులతోను వుమేజువారులతోనూ నిండి వుండేది. ఆమె దానగుణం చేత యిల్లంతా యితరులకు దోచిపెట్టింది. పోచూపోచూ నక్క-కొడుకునుమాత్రము కని మరీ పోయింది. ఆమె పోయినసంవత్సరములోనే రెండోభార్యకూడా పోయింది. తరువాత యీయన నాలుగోపెళ్లి చేసుకున్నాడు. ఆమెకూడా బహుపరిసిద్ధురాలే. అయితే అందులో ఆమె కొంచెం పతివ్రత. వక్క-వంటబ్రాహ్మణోన్ని చాకలవాణ్ణో యింట్లో వుండేవాణ్ణో యెవ్వరినో వక్క-రినే నమ్మకొని వాళ్లనే అందినంత మట్టుకు పెట్టి బాగుచేసింది. యీయనకొడుకూ కోడలూ పెద్దవాళ్లయి ఆమెతో పడక పోట్లాడి లేచిపోయి మేనమామగారి యింటివద్దవుండి యిద్దరూకూడా మరిడీజాడ్యంచేత కాలం చేసినారు. తరువాత ఈ అయిదోఅవిడచరిత్ర రెండేళ్లబట్టి మీరు చూస్తూనే వున్నారుగదా?

కరు--ఈమె విస్తారం ఖాయిలాగా వున్నట్టున్నది. యీమె యింతటితో సెలవుపుచ్చుకుంటేనే బాగుండును. ముసలయ్యతాతగారు యీసారయినా మంచిదాన్ని పెళ్లిఆడుచారు.

కుఱ్ఱి--శతవృద్ధు యింకా ఆయనకు యెవ్వరు పిల్లనిస్తారు?

కరు--యేమహాభావులయినా యిస్తారు. సహస్రమాసజీవి ఆయనకు పిల్లనివ్వడమే యివ్వడము. అటువంటివాడు అల్లుడు కావడం భాగ్యం యెంతపుణ్యంచేస్తే వస్తుంది? అదిగాక యెవరికయినా డబ్బు

చేదా యేమిసి? డబ్బుచూస్తే కొండమీదిదేవుడు దిగివస్తాడు. అంతగా యెవరూ పిల్ల నియ్యకపోతే మాఅమ్మాయిని యిచ్చి ఆకన్యాదాన ఫలము నేను దక్కించుకుంచాను. కన్యనిచ్చి డబ్బు పుచ్చుకంటే పాపం వున్నదికాని సాలంకారకన్యాదానంచేస్తే వెయ్యియజ్ఞాలుచేసిన ఫలం వస్తుందని శాస్త్రాలు చెపుచూవున్నవి.

కుటీం—మీరు వూరికే వేళాకోళానికి అంచూవున్నారుగాని లేక లేకపుట్టిన వక్కచిన్నదాన్ని మీరుమాత్రం యిస్తారా?

కరు—ఇస్తే యేమి తప్పా? నాప్రతిజ్ఞ వినండి. పంతం వచ్చిం దంటే నాతో సమానమయినసాహసం గలవాడు మరివకడు లేడు. నేనే గనుక పిల్ల నియ్యకపోతే నాచెవులవి కుండలాలు గావు; నేను చదువు కొన్నది శాస్త్రము కాదు.

కుటీం—ఇస్తే తప్పిదమనికాదు. అటువంటివారికి కన్యాదా నము చెయ్యడమే కేవలమూ పరమార్థం. తమవంటిపండితులయిన మహానుభావుల కెవరికోతప్ప యీకలికాలంలో పరమార్థచింతలేదు. మీరు చిన్నదాన్ని యిదివరకే యెవరికో యివ్వడానికి నిశ్చయించినట్టు విన్నానే.

కరు—ఇంకా ప్రధానం కాలేదు. "దత్తా మపి హరే త్సార్వా చ్ఛ్రియాం శ్చేద్వర అవజేత్." అని మంచివరుడు దొరికినట్టయితే యిచ్చినదానినైనా మళ్ళీపుచ్చుకొమ్మని యాజ్ఞవల్క్యులవారు ధర్మశా స్త్రంలో సెలవిచ్చినారు. మొన్న దశమినాడే వివాహము కావలసినది. యింతలో ముసలయ్యతాతగారి భార్యా ఖాయిలామాట విని యిది యేదీ తేలిందాకా నిలుపుదామని మాయింట్లో మయిలవచ్చినదనిబొంకి రెణ్నాళ్ళ వట్టిదేమయిలబొట్టు పెట్టినాను. వివాహకార్యంలో అబద్ధ మాడితే దోషంలేదు. నూరుకల్లలాడి వక్కయిల్లు నిలువబెట్టుమన్నారు.

అంతేకాకుండా శ్రీమద్భాగవతంలో "వారిజాక్షులందు వైవాహికము లందు ప్రాణవిత్తమానభంగమందు చకితగోకులాగ్ర జన్మరక్షణమందు బొంకవచ్చు నఘముపొందదధిప" అని శుక్రాచార్యులవారు వివాహ కార్యంలో అబద్ధమాడవచ్చునని మొదటనే స్పష్టంగా చెప్పివున్నారు. "ప్రాణపత్నివచ్చుచో బరిణయమున" నని పంచమవేదమయిన శ్రీమహా భారతంలో వేదవ్యాసులవారుకూడా బొంకితే పాపములేదని ఆనతిచ్చి నారు. అంతగా వాళ్ళు చిక్కులుపెట్టి బాధిస్తే వాళ్లవద్ద పుచ్చుకొన్న సొమ్ము గిరగిరతిప్పి మొఖంమీద పారవేస్తాను. మాపెత్తండ్రిగారి కుమారుడు యిప్పటి శంకరాచార్యులవారు తనకూతురువిషయంలో ఆలాగే చేసినారు.

కుట్టిం—మీ దివ్యసంకల్పంవల్ల ఆచిన్నది జీవించదు. నేడో నేపో అన్నట్టువున్నది. మీకర్మిష్టతయేమి? మీతపః ప్రభావమేమి? మీశిష్టత్వమేమి? సిద్ధసంకల్పులు మీవంటి బ్రహ్మణ్యులకోరిక వూరికే పోతుందా? మీకు భాగ్యంవచ్చినతరువాత బంధువుల్ని బీదవాణ్ణి నన్ను నక్కకంటజూచి కనిపెడుతూ వుండవలెనుసుమండీ!

కరు— అది మీరు నాతో చెప్పవలెనా? ముసలయ్యతాత గారికి పళ్ళువూడిపోయినవి. ఇంద్రియపటుత్వము పోయినది. చెవులు తిన్నగా వినబడవు. చూపు తిన్నగా కనబడదు. తలవణకుచూ వున్నది. నెత్తి యేకులబుట్టలాగు అయినది. భర్తృహరిచెప్పినట్లు అన్నీ ముసలివైనవిగాని వక్కఆశమాత్రం ముసలితనంపొందకుండా రోజుకు రోజు పడుచుదవుచూవున్నది. ముసలయ్యగారు అధాత్తుగా యేవే ళనో గుటుక్కుమనకుండా యీమముండపోయిన పదమూడోనాడయినా ముడిపడితే ఆస్తి అంతా మనకే దక్కుతుంది. ఆవిడెకు వైద్యం యెవరు చేస్తున్నారూ? అది నేను విచారిస్తాను లెండి. మయిల పది

రోజులు లేకుండావుంటే బాగా వుండును. అయిదోపెళ్ళానికి వక్క రోజుతో సరిఅని కారిక తీసుకొనివస్తే పనికివస్తుందా ? యీలాగా కర్మలు చేసేటప్పుడు స్నానాలలో ప్రాణం యెక్కడపోచుందో.

కుక్కిం—ఇవన్నీసరేకాని బుద్ధివచ్చినపిల్ల మీ కొమార్తె వప్పుకుంచుందా?

కరు — వప్పుకోక యేమిచేస్తుంది? కుళ్ళంకలు చేసి అడ్డాలు పెట్టిపోచుందేమో అనే మాపిల్లను నేను గరల్సుస్కూలుకు పంపినాను కాను. వప్పుకోవడానికీ వప్పుకోకపోవడానికీ దానికి స్వతంత్రం యెక్కడిది ? "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అని మనస్మృతిలో వున్నది. మీరు వినలేదా ? "పితా రక్షతి కౌమారే" అన్నాడు గనుక తండ్రి శవానికికట్టిపెట్టినా కూతురు చచ్చినట్లు వప్పుకోవలెను. దానికిమాత్రం డబ్బు చేదా యేమిషి ? కాస్తపాణమూ గుటుక్కుమన్నతరువాత డబ్బుపెట్టుకుని హాయిగా సీమరాణివలె సమస్తసుఖాలూ అనుభవించ వచ్చును. దాని సుఖానికి తల్లిదండ్రులము మేముమాత్రం అడ్డం పెడచాపూయేమిషి ? యెవరు వచ్చినా చూచీచూడనట్లు వూరుకుండి యెప్పుడయినా యిబ్బంది వస్తే పాపపరిహారార్థం శిశుయజ్ఞం చేసి కులం చెడకుండామాత్రం చూస్తాము. ఈకలియుగంలో నరమేధయాగాలు యెందుకు లేకుండా చేసినారయ్యా ?

కుక్కిం — మీరు శెలవిచ్చినట్లు అమంత్రకంగా రహస్యముగా జరుగుతపని సమంత్రకంగా మానివేసినారు. ఇదీ మతాలలో చేసినదే. ఈశిశుమేధంచేస్తేనే కులంలో ప్రతిష్ఠ; చెయ్యకపోతే కులం చెడిపో చుంది. కులకట్టుబాటు అలాగువుండవలెను.

కరు — సోమయాజులుగారూ ! మీరు సోమంచేసినారుగదా? అశ్వమేధాంతమూ శ్రోత్రియము చేసినారుగదా ? యీనరమేధయా

గము క్రియ మీకెక్కడనయినా వచ్చినదా ?

కుక్షిం—ఈక్రియ నాకు రాలేదు. ఇది ఆయుర్వేదములో కాబోలును వున్నది. వైద్యశాస్త్రం తెలిసినవారి నడిగితే తెలుస్తుంది. ఈయాగాలలో వారే అధ్వర్యులు. హోతలు మొదలయినవారంతా స్త్రీలు. ఇందులో స్త్రీలయూజమూన్యం విస్తారం.

కరు — ఆమాట అవసరం వచ్చినప్పుడు విచారింతాముకాని ముసలయ్యతాతగారి భార్యాసంగతిమాత్రం విచారిస్తూ వుండవలెను.

కుక్షిం — అది విచారింపనక్కరలేదు. ఆచిన్నది పోయినట్లె యెంచుకొని మీరుప్రయత్నంలో మీరు వుండండి. ఆనిడ రేపోమాపో స్వర్గానికివెళ్ళి భర్తకోసం ప్రతినిమిషమూ యెదురుచూస్తూవుంచుంది! ఆయనకూ వుబ్బసపుదగ్గు. జాతివైద్యం మంచిదికాదని తెనుగువైద్యం చేస్తూవున్నారు. 'నాచేతిమాత్రా వైకుంఠయాత్రా' అన్నట్లు యీ వైకుంఠవైద్యునిచేతులో పడ్డవారు యెవ్వరూ స్వర్గలోకసుఖానికి వెళ్లకుండా యీపాడులోకంలో చిరకాలం కష్టం అనుభవిస్తూవుండరు. కొన్నాళ్ళు హెచ్చుతగ్గుగా యీదంపతులను యిద్దరనూ ఈయనే మాట దక్కించుకుంచారు.

కరు—ఆలాగయితే మీరెలాగయినా బతిమాలుకొని మూడు ముళ్ళు పడేవరకూ ముసలాయనకుమాత్రం అవుషధం యివ్వకుండా జాగ్రత పెట్టండి. సప్తపది అయినతరువాత కావలిస్తే కావలసినన్ని మందులు యివ్వవచ్చును. సప్తపదితో వివాహం పూర్తి అయి ఆస్తి వస్తుంది కాదండీ ?

కుక్షిం—మీ కాతొందరయేమి ? నాగవల్లి అయినదాకా కూడా మందు యివ్వకుండా ఆపుదాము. తరువాత గృహప్రవేశ మహోత్సవమూ దినవారమహోత్సవమూ వక్కసారే కావచ్చును.

ఖర్చుతో ఖుష్బు కలిసి వస్తుంది.

కరు — మీ నోటివాక్కాన అంతటిభాగ్యం పట్టనలేనుగామా? యీమునలియుండాకొడుకు తనచేతిమీదుగా యెందరినో భార్యలను చంపినాడు. యింకాతీసుకుంటూ యిలాగే బ్రతుకుచా డేమో !

కుట్టిం—ఈసారి బ్రతుకకుండా నాది పూచీ. మీకన్యాదాన ఫలం వూరికేపోదు. డబ్బు పుచ్చుకోకుండా కన్యాదానం చేస్తే యీ మాత్రంఫలం కలుగలేకపోతే ఇఖ మనశాస్త్రాలన్నీ నట్టివేకావలెను మీరుకూడా యింట్లోనేవుంచారు గనుక ఇఖ ఆయనదినాలు వేళ్ళ మీద లెక్కపెట్టవలసినదే.

కరు—పెళ్ళిలోమాత్రం విస్తారఖర్చు కాకుండా చూడండి. పయినచెప్పిన యిబ్బంది యేమీ రాకుండా దేవాలయములో ముడి పెట్టి వక్కపూటలో పెళ్ళికానిస్తే అంతాపదిరూపాయలలో అవుచుంది; అవతలయేమయినా ఫర్వాలేదు.

కుట్టి ం — అలాగే చూతాము. ఇప్పుడు పనివున్నది. నేను వెళ్ళి మళ్ళీవస్తాను.

కరు—చిత్తము వెళ్ళిరండి. కార్యమయినదాకా ఇది బ్రహ్మ భేద్యంగా వుండవలెను సుమండీ.

(అని యిద్దఱును వెళ్ళుచున్నారు.)

తి. రంగము—ముసలయ్యగారి గది.

[ముసలయ్యగారు యేమ్చుచుండగా కుట్టింభరసోమయాజులుగారు ప్రవేశించుచున్నారు.]

కుట్టి ం— పోయినదానికోసం మీరు యేడిస్తే కార్యం లేదు. బహుపెద్దలయినారు. గట్టిగా యేడిస్తే మీ కెక్కడ శోష వస్తుందో

మొగవాళ్ళు మీరన్నివిధాలా అదృష్టవంతులే. అనుభవించవలసిన యోగం లేక అదే మన్నుకొట్టుకొని లేచిపోయిందికాని యిష్టంవుంటే భాగ్యవంతులు మీకు రేపే యీపాటికి యింతకంటె మంచిపెళ్ళాము వస్తుంది.

ముస — లోకానికి కొంచెం పుకి యేడవకపోతే బాగా వుండదు. ముందుగా మీమనసు తెలియక యేడవకపోతే మీ రేమను కుంటారో అని పుకికంటతడి పెట్టినట్టు నటించినానుకాని యీముండ పోవడం మనసులో నాకు సంతోషంగానే వున్నది. పుకిచెప్పుకుంటే అప్రతిష్ఠ; యీముండ నన్ను గర్భాధానంనా డయినా పుని చెయ్యి వెయ్యనిచ్చినది కాదు. నాకు అసలే దీని వెనుకటిదానికాలంనాడే కామం పోయింది. అయినప్పటికీ వెనుక అనుభవించి అలవాటుపడి వున్నవాసనచేత యెప్పుడయినా కొంచెం భ్రమపుట్టి మీద చెయ్యి వెయ్యబోతే ముసలికంపని కస్సుమని కాట్లకుక్కలాగు కరవవచ్చేది. అసలది తిన్నగా పడుకోవడానికి గదిలోకే వచ్చేదికాదు. యెప్పుడయినా తప్పిదారివచ్చినా వెంటనే దీపం తీసివేసి మళ్ళీ బయటతలుపు గొళ్ళెము పెట్టిపోయి అవతల పరుండేది. కడుపుబ్బుకొనివచ్చి అల్లాచ మానానికి వెళ్ళడానికి వల్లకాక ముసలముండాకొడుకును లోపల వక్కణ్ణీ చీకట్లోచచ్చిపోయేవాణ్ణి. గృహచ్ఛిద్రం వెల్లడిచేసుకోరాదు.

కుటీం—అలా కాదు. నేను మీస్వజనంలోవాణ్ణి. నాతో చెప్పితే యేమీ రహస్యభంగం వుండదు.

ముస—అందుచేతనే యిదంతా నీతో చెప్పినాను. దీనికి కడుపు వచ్చినప్పుడు నాకు మరీ అసహ్యంవేసినది. వకరోజు వళ్ళు మండి కడుపు దింపుకొమ్మని అల్లరిచేతా మన్నింతకోపంకూడా వచ్చినది. మళ్ళీ కడుపు చించుకుంటే కాళ్ళమీద పడుతుందని నాలోనేనే పస్తా

యించుకొని వూరుకున్నాను. ఆకడుపుపుణ్యంగా వక్కరోజు రాత్రి వచ్చి నామీద చెయ్యివేసి కౌగలించుకొని పడుకుంది. నాకక్కడికే బ్రహ్మానంద మయినది. నాసత్యంగా చెపుతాను. జన్మాసికల్లా శివరాత్రి యింతకుతప్ప నేను దానిమీద యెప్పుడైనా చెయ్యివేసిన పాపాన్ని పోతే మూత్యుకోరిహం చేసినట్టు.

కుట్టిం—సరిసరి! మీరు వట్టుషెట్టుకోకపోతేమాత్రం మీమాట నేను నమ్మనాయేమిటి? మీరుచెప్పినవన్నీ వేదవాక్యాలు.

ముస — తరువాత వృద్ధాస్యంలో మంచిపుత్రుడైనా పుడుతాడని ఆశపుట్టి మీవంటివారినందరినీ విందుకు పిలిచి మహావైభవంతో పుత్రోత్సవం చెయ్యవలెననుకుంటూవుండగా ఆరోనెలనే కడుపు దిగబడిపోయింది. నిరుడు యీకడుపు రాకమునుపు దీనిమనసులో మరివక దుర్బుద్ధికూడా వుండేది. యెందుకదంతా యిప్పుడు?

కుట్టిం — సందేహించకండి. అదియేమిటో నాతో సెలవియ్యండి. నేనురహస్యం యెవరికైనా వెల్లడిచేస్తానను కున్నారా యేమిటి?

ముస — నేను వేగిరం చచ్చిపోతే యీడబ్బు పట్టుకొనిపోయి వళ్ళీయెవరినైనా పడుచువాణ్ణి పెళ్ళిచేసుకోవలెనని దానిమనసులో వుండేది. విధవావివాహాలు చెయ్యడం బాగావున్నదని వకనాడు అది అనడంచేత నేను దాని మనసులో అభిప్రాయం కనిపెట్టినాను.

కుట్టిం— బుద్ధిమంతులు అంతమాత్రం మీరు కనిపెట్టలేరూ? అసలు మీరు ఆవలిస్తే పేగులు లెక్కపెట్టేవారు. మీబుద్ధికి బృహస్పతికూడా చాలడని నాయభిప్రాయము. యెంతబుద్ధిమంతుడూ కాకపోతే బృహస్పతి లేచిపోయినభార్యను కడుపుతోవున్నదాన్ని తెచ్చి యింట్లో పెట్టుకొని అంతసహనం వహించగలడా ?

ముస—ఆడవాళ్ళు మహాచెడ్డవాళ్ళు. యెంతచెడ్డవాళ్ళూ కాక

పోతే "తలతడివి బాసచేసిన జలజాక్షుల నమ్మరాదు సారంగధరా" అన్నమాట వూరికే పుట్టిందీ? వాళ్ల కున్నంతకామము లోకములో యెవరికీలేదు. అందుచేతనే శాస్త్రకారుడు "సాహసం షడ్గుణంచైవ కామంచాష్టగుణం భవేత్" అని చెప్పినాడు. స్త్రీలనుకోసి వుప్పూపా తరలో వూరవేసినా పాపం లేదు. వాళ్లను చిన్నప్పుడే తలగొరిగించి ముసుగువేసి మూల కూర్చుండబెట్టి తిన్నగా తిండిపెట్టక బ్రతికివున్నంత కాలమూ మాడ్చి చంపవలెను. అలాచేసినా వీళ్ల కామంపోక అడ్డమయిన అకార్యాలూ చేస్తూ వున్నారు. ఇప్పుడు స్త్రీపునర్వివాహసమాజాలంటూ మనపాలిటికి మృత్యుదేవతలువలె వకటి పోగయినవి. చిన్న పిల్లలను చేసుకొన్న నావంటిముసలివాళ్ళ కందరికీ వాటిపేరు చెపితే వళ్ళు దడయెత్తుతుంది. ఆడముండలకు రెండోపెళ్ళి యేకాలంలోనైనా వున్ననటయ్యా! యిప్పు డీమాలప్రభుత్వమూలంగా అన్నీ విడ్డూరాలు పుడుతూ వున్నవి. మహాకలి ప్రవేశించింది. యిఖ వర్ణాశ్రమ ధర్మాలు నిలిచేయోగం లేదు. వెధవముండలపాలింటికి మనస్వాముల వార్లున్ను పండితులున్నూ చేరి యిలాగు పనిచేస్తూవుండబట్టికాని లేక పోతే వాళ్లందరూ వక్కడెబ్బను పెళ్ళిచేసుకోరా?

కుక్కిం—తమరు ముందు కార్యంసంగతి చూడవలెను.

ముస — ఏది వివాహకార్యంసంగతాయేమిటి? యెవరయినా నాకు యిప్పుడు పిల్లనిస్తారా? శాస్త్రుల్లగారి కూతురట! యెవరో యీ మధ్య ఫదేళ్ళపిల్ల మనయింటికి వచ్చినది. ఆపిల్లను మనకిస్తే మహా బాగా వుండును.

కుక్కిం—ఆవిషయం నేను కృషిచేస్తాను. మీకు పెళ్ళికూతురిని సంపాదించడపుపూచీ నాది.

ముస—యేదోవకపిల్ల కాదు. నేను యిప్పుడు చెప్పినపిల్లే బహు

బాగావుంటుంది. కామల వుడిగినవాడికి నీకు పెళ్ళియెందుకంటూ రేమో వినండి. "ధర్మప్రజాసంపత్యర్థం" అని వివాహంలో సంకల్పం చెపు తారు. కొందరు దాసికర్మము ధర్మసంతానమునిమిత్తమంటారు. కొం దరు ధర్మమునిమిత్తమూ సంతానము నిమిత్తముకూడా నంటారు. అందులో యెలాగయినా ధర్మం ముఖ్యము. వెధవవివాహాలు కామం నిమిత్తం చేసుకునేవివాహాలు వివాహాలేకావు.

కుక్షిం—అవును మీరు కేవలమూ ధర్మమునిమిత్తమే వివాహ మాడబోవుతున్నారు. వివాహం కర్మలు నిలవడానికికాని కామం కోసముకాదు. మీపూర్వజన్మపుణ్యంవల్లనో చేసుకున్నదాని పతివ్రతా మహత్యంవల్లనో కలిగితే సంతానమూకలుగవచ్చును.

ముస—అవును కలిగితే కలుగనూవచ్చును. ముసలవాళ్ళకు పడుచుతనంవచ్చే మందు యేమయినా వున్నదేమో మన వైద్యుణ్ణి అడుగవలెను.

కుక్షిం—అటువంటిమందులు గోసాయిలవద్ద వుంటవి. పూర్వం యయాతికివచ్చినట్టు మీకు ముసలితనంపోయి ఎప్పుడయినా పడుచు తనం రావచ్చునేమో ? మీఅదృష్టం యెవరుచూచినారు ?

ముస—మనవూరికి గోసాయిలు వచ్చినప్పుడల్లా నాతో చెపుతూవుండండి. ఏపుట్టలో యేపామున్నదో యెవరుచూచినారు? అందరినీ అనుసరిస్తూవుంటే యేమహానుభావుడయినా అనుగ్రహం వచ్చి పడుచుతనంవచ్చే మందో మంత్రమో వుపదేశంచేస్తాడు. లేకుంటే యోగం నేర్చుకొని యెల్లకాలమూ బ్రతికే సదుపాయము ఆలో చింతునా ?

కుక్షిం—అది సర్వోత్తమమయినది. రోజూ వూపిరి బిగపట్టడం అభ్యాసం చేస్తే యెల్లకాలమూ బ్రతుకవచ్చును.

ముస—తరువాత యేమిచేసినా ముందుగా పెళ్ళిచేసుకుంటే యెందుకయినామంచిదే. నాలుగు కొట్టినా తిట్టినా స్వతంత్రంగా చేసుకున్న పెళ్ళామునంటిది వకటికాదు. పెళ్ళామని వకటివుంటే ముసలివాడికి కాళ్ళు పడుతుంది. చేతులుపడుతుంది. ఇందుకో కర్మలు నిలవడం మరీముఖ్యము.

కుట్టి—అలాగయితే మళ్ళీ పెళ్ళి అయినతరువాత అవుపాసనమూ అగ్నిహోత్రాలూ వైశ్వదేవమూ వుంచండి.

ముస—అబ్బో! అన్ని నేను వుంచలేను. లౌక్యాగ్నిహోత్రాలు నాకు యెప్పుడూ వున్నవి. ఈవుబ్బసపుదగ్గుమూలంగా రాత్రీ పగలూ మరీ అవిచ్ఛిన్నముగా జరుగుతూవున్నవి. యీచిల్లరవన్నీ మానివేసి చేస్తే నాకు వక్కయజ్ఞం చెయ్యవలెనని వున్నది. యజ్ఞంచేస్తే రంభా సంభోగం కలుగుతుందట కాదూ? నాకు రంభను పెళ్ళికాగలించుకోవలెనని మహా ఆపేక్షవున్నది. నేనైతే భోగంవాళ్ళను చాలామందిని వుంచుకొన్నాను కాని వాళ్లయెవళ్ళూ చక్కదనానికి రంభకు చాలరట! యజ్ఞంచేస్తే వక్కరంభేనా యింకా అక్కడ వున్నవాళ్ళు యెవళ్ళయినాకూడా వస్తారా ?

కుట్టి—యజ్ఞంచేస్తే రంభా, మేనకా, ఊర్వసీ మొదలైన అప్సరస్త్రీలందరూకూడా వస్తారు.

ముస—ఊర్వసికూడా తప్పకుండా వస్తుంది గదా! ముసలివాణ్ణి అని వకవేళ రాదేమో! తీరా స్వర్గానికి వెళ్లిన తరువాత అప్పుడు రాకపోతే నే నేమిచెయ్యను ?

కుట్టి—మీరు అధైర్యపడకండి. మీరుయింకా నూరేళ్ళు బ్రతికివెళ్ళినా యజ్ఞంచేస్తే వాళ్ళు మీరు యెప్పుడు వస్తారా అని యెదురు చూస్తూవుంటారు. మనశాస్త్రాలు అలాగు చెపుతూవున్నవి. అవి

యెన్నటికీ అబద్ధాలు కావు.

ముస—అలాగయితే మనశాస్త్రాలు బహు మంచిశాస్త్రాలు. వాటితో సమానమయినవి జగత్తులో లేవు. నాకు తప్పకుండా నేను చెప్పినపిల్లను యీమధ్యాహ్నం వివాహంచేయించండి. వెంటనే యజ్ఞం చేసివేస్తే యీలోకంలో భార్యతో సుఖం లేకపోయినా స్వర్గలోకంలో అయినా రంభతో సుఖపడుతాను. రంభ నాతో కుదురుగావుంటుందా? యింతలో యజ్ఞం చేసినవాడు మరి యెవడైనా వచ్చినాడని పరుగెత్తుతుందా? పోనీ దానిముఖం చూస్తేనే చాలును. నిముషాలమీద పెళ్లి కానియ్యండి.

కుట్టిం—శవం యింకా యింటినుంచి కదలలేదాయెను. మయిల పదిరోజులూ వెళ్ళకుండా పెళ్లి యేలాగవుతుంది ? పదమూడోరోజు దాకా ఓపిక చెయ్యండి.

ముస—అయ్యో ముండా ! బ్రతికే చచ్చీకూడా నన్నేడిపిస్తూ వున్నావు ? చచ్చేముండ మయిలలేకుండానయిన చావరాదా ? నేను వుత్తరక్రియలు మానివేస్తే మయిల రాకుండా వుంటుందా?

కుట్టిం—అలా మానివెయ్యడం శాస్త్రవిరుద్ధం. మీరు మయిల పట్టి కర్మ ఆచరించవలెను.

ముస — మయిల పట్టవలెనని కర్మ చెయ్యవలెననీకూడా మీరు యిందాకా చెప్పినశాస్త్రములోనే వున్నదా?

కుట్టిం—ఆ శాస్త్రంలోనే వున్నది.

ముస—అలాగయితే మనవి వట్టి వెధవశాస్త్రాలు. ఆశాస్త్రాలు చేసినవా ళ్ళందరూ కేవలమూ బుద్ధిహీనులు. వాటి నన్నిటినీ కట్టకట్టి వక్కనూటు తగల పెట్టించండి. శాస్త్రములు యేమిటి? ముసలముండా కొడుకును పెళ్ళిచేసుకోకుండా పెళ్ళాము పోయినతరువాత పదిరోజులు

ఆగమనడం యేమిటి? నేను యిలాలోగా పోతే నాయజ్ఞమూ రంభా సంభోగమూ అన్నీ మన్నుకొట్టుకొని పోవలసినదేనా?

కుక్షి౦—మీరు సిద్ధసంకల్పులు. అన్నీ మీయిష్టప్రకారమే జరుగుతవి. యోగుల కీకర్మకాండయేమీ అక్కరలేకుకాని సంసారంలో వుండేవారికి యిలాలోకంకోసం అన్నీ కావలెను.

ముస—అలాగయితే నేను యిఖను సంసారం విడచి వైరాగ్యం అవలంబించి యిప్పుడే యోగి నవుతాను. నాకీలోకంతో సంబంధం లేదు. ఈమధ్యాహ్నం పెళ్ళి చేయించండి. గడ్డమూ గోళ్ళూ వక్కసారిగా పెరిగి తల జడలు కట్టిపోతే వక్కసారిగా యోగినయిపోదును.

కుక్షి౦—శవం దాటిపోయినతరువాత ఆప్రయత్నం చేతాము కాని ముందుగా శవము కదిలేవుపాయం చూడండి. బంధువులందరూ యీసంగతి కనిపెట్టి ముందుగానే ముఖాలు చాటువేసినారు. షది రూపాయలు ఖర్చుచేసి పీనుగును బయలుదేరదీసి దహనంచేసి వస్తేనే కాని భోజనాలుకూడా లేవు.

ముస—నాకు పెళ్ళికి ముఖ్యంగా ఆశాస్తుల్లగారి కూతురే కావలెనుసుమా. ఆపిల్లకుమనిలనచ్చి మొన్ననళినినాడు ముహూర్తం తప్పిపోవడం మనఅదృష్టం. ఆశాస్తుల్లు వెయ్యేళ్ళుతలకిందుగా తపస్సు చేసినా మనవంటిఅల్లుణ్ణి సంపాదించలేడు. ఆచిన్నదాన్ని వివాహమూ డితే తండ్రి మంచిపండితుడుగనుక వకవేళ నేనేనుయిపోయినా కూతురికి మళ్ళీ పెళ్ళి చెయ్యడు. అతడికి కొంచెం వేదంముక్కలు వచ్చి అర్థం తెలియకుండా వుంటే మరీ బాగావుండును.

కుక్షి౦—నాకు వెయ్యిరూపాయలు యిస్తే ఆపిల్లను మాట్లాడి తప్పకుండా యిప్పిస్తాను.

ముస—ఆలాగే యిస్తాను. నీకూ నాకూ యిదే ఖరారు. నీవు

వాహకులకోసం వెళ్లేటప్పుడు పిల్లదానితండ్రితో మాట్లాడి మరీ వెళ్ళు.
(యిద్దఱును వెళ్ళుచున్నారు.)

రోగచికిత్స.

[సోమసుందరశాస్త్రి మొదలయినవారు కూరుచుండియుండ, శంకరరావుగారు ప్రవేశించుచున్నారు.]

శంక— ఏమండీ! మీఅబ్బాయికి వంట్లో యేలాగువున్నదండీ? నేను చెప్పిన వైద్యుణ్ణి పిలిపించినారుకాదుగదా?

సోమ— అబ్బాయికి అంతకంతకు జబ్బు యెక్కువవుతూవున్నది గాని యెంతమాత్రమూ నిమ్మళంలేదు. మనవాళ్ళకు జాతివైద్యం పడదండీ. అందుచేతనే మీరు చెప్పిన డ్రైవరును పిలిపించలేదు.

శంక— జాతివైద్యంకాకపోతే నల్లవైద్యమయినా యెవరిచేత చేయిస్తూవున్నారు? అందులోనయినా కొంచెము మంచివాణ్ణి విచారించవలెను.

సోమ— ఇంకా యెవరిచేతనూ మందు వేయించడంలేదు. మొట్టమొదట మూడురోజులు జ్వరం కాస్తే వూళ్ళో అమ్మవారు వున్నదిగనుక వకవేళ అమ్మవారు వస్తుందేమో వయిద్యం చేయిస్తే జబ్బు చేస్తుందని మొదలికి మందు యివ్వలేదు. మూడోరోజురాత్రి మాయింట్లో ముసలమ్మ చెప్పిమాచి భూతనాడి ఆడుతూవున్నదని స్పష్టంగా చెప్పినది. యిఖ ఆవిడే ఆలాగున చెప్పినతరువాత మనము వైద్యపరిమేయం తలపెట్టడం మంచిదికాదని మానివేసినాను. ఆవిడ యెనభయియేళ్ళుదాటిన మనిషి. చేతినాడెం ఆవిడకు తెలిసినట్లు మఱి యెవరికీ తెలియదు. ఆవిడచెప్పినమాట అబద్ధమయివుండదు. ఆవిడకు

ఫదిమందికొడుకులూ కూతుళ్ళూపుట్టి అంతా కాలంచేసినారు. అంత మందికి ఖాయిలాలు వచ్చి ఆమె దగ్గిరవుంటూ చూస్తూవచ్చినప్పుడు మనం తప్పకుండా నమ్మవలసినదే.

శంక—మీరు భూతవైద్యం చేయిస్తూవున్నారా యేమిటి ?

సోమ—యేమిటో అటువంటిదే చేయిస్తూవున్నాను. మన వేమూరి సాంబన్న మంత్రించి విభూతి లోపలికియిచ్చి యింత వంటి నిండా పూసినాడు. ఆరాత్రి మాపిల్లవాడు మరీమొక్కవ కేకలువేసి తెల్లవారినదాకా పలవరిస్తూనేవచ్చినాడు. మంచంమీదపడి యిటూ అటూ వూరికే దొర్లినాడు. మంత్రిపువిభూతికావడంచేత తాపంపెట్టి లోపలిభూతం అలాగున ఆవేదనపడ్డదని మేము అనుకున్నాము. అటు తరువాత సాంబన్నవచ్చి చెయ్యిచూచి అతనూ అలాగే చెప్పినాడు. మేమనుకొన్నదానికీ అతడు చెప్పినదానికీ సరిపోయి దాఖలాయిచ్చినది.

శంక — మీఅబ్బాయికేమిటి? సాంబన్నగాడి వైద్యమేమిటి? వాడు నిరుటిదాకా మాఅన్నయ్యగారియింట్లో వంటచేస్తూ పరమ శుంఠగా వున్నాడు.

సోమ—అయ్యా ! ఆలాఅనవద్దు. యేపుట్టలో ఏ పామున్నదో యెవరికి తెలుస్తుంది ? సాంబన్న మీయింట్లో వెండిచెంబుయెత్తుకొని పారిపోయి జయిలులోనుంచి విడుదల అయినతరువాత మళయాళం వెళ్ళి ఆరునెలలు అక్కడవుండి అనేకమంత్రాలు నేర్చుకొన్నాడు. యీవూళ్ళో వాడు యెంతమందికి భూతవైద్యం చేస్తూవున్నాడనుకొన్నా "యేమిటి ? అనేకమందికి కుదిరిందని మంచినమ్మకమయినవాళ్ళు చెప్పినారు. పాడిపగ్గర యేమీ సామర్థ్యం లేకపోతే ఆలాగున గడ్డం పెంచి కుంకం పెట్టుకుని చేతులో పేపబెత్తముతో పాంకోళ్ళు తొడుక్కొని వీధులో నిర్భయంగా తిరగగలడండీ ? నేను వక్కమాట అనుగుతాను.

దానికి సమాధానం చెప్పండి. వాడిది వట్టివేషం అయినట్టయితే మన చుట్టుపట్ల ఇంతమందిమంత్రిగా ఉన్నారుగదా వాళ్ళందరూ చూస్తూ సహించి వూరుకుంటారా? సాంబన్నదగ్గర మంచి మహిమవున్నందుకు వాడు విభూతిపెడితే తెల్లవారినదాకా మూవాడు మంచముమీద పడి దొర్లి కొట్టుకోవడమే గొప్పదాఖలా.

శంక—మీకు ఇదే దాఖలా ? ఇంతకంటె వేరేయేదైనా కన బడ్డదా? మొత్తంమీద మంత్రాలని వేషంవేసుకున్న వాళ్ళంతా పెద్ద దొంగలు.

సోమ—హరిహరీ ! ఆలాగంటిమాట అనకండీ చాలాపాపం వస్తుంది. ఈసాంబన్న వెంకప్పసోమయాజులుగారి భార్యకు గ్రహం సోకి యెన్నివిధాలా వదలిపోనప్పుడు మూడునాళ్ళలో కుదిర్చినాడు. అప్పటినుంచే సాంబయ్యను సోమయాజులుగారు అరమరా అభ్యంతరమూ లేకుండా లోపలికి రానిస్తూ ప్రాణంతో సమానంగా చూచుకుంటూవున్నారు. అతనిగ్గర యేమీమహత్యం కనబడకపోతే యజ్ఞాలూ క్రతువులూచేసి డెబ్బదియేళ్ళుదాటిన ముసలిముండాకొడుకు యితణ్ణి యెందుకుగౌరవంచేస్తాడు? సాంబన్న వైద్యముచేసినతరువాత వళ్ళుశుభ్రంగా కుదిరి సోమయాజులుగారిభార్యా కడుపుతోవున్నదని కూడావిన్నాను. పెద్దతనంలో వివాహము చేసుకున్నా అదృష్టం మంచిది గనుక సోమయాజులుగారికి కొడుకో కూతురో పుడుతారు.

శంక—సరిసరి ! ఇదా ! దీనిపూర్వోత్తర మంతా నీకంటే నాకు బాగా తెలుసును. మా యింటియెదుటనే కాదూ వెంకప్పసోమయాజులుగారిల్లు. ఆయనపెళ్ళాముకు యిరవైయేళ్ళలోపు వయస్సు. మొగుడు డెబ్భైయేళ్ళ దాటిన ముసలిముండాకొడుకు. అందుచేత యిద్దరికీ కలియక వూరికే తగువులాడుతూ వుండేవారు. ముసలిముం

డాకొడుకుకు, వూరికే అనుమానం. చెట్టులాగు సంభమయేళ్ళకొడుకు వుండగా మళ్ళీ పెళ్ళిచేసుకోవడానికి ముసలివాడు వెంకప్పసోమయాజులికి యేమిపొయ్యకాలము ? మాఅన్నగారికి యింట్లో వంటబ్రాహ్మడుగావున్నప్పుడే యీసాంబయ్యగాడు మెల్లిగా ఆసోమిదేవమ్మను అంటుకున్నాడు. యీమధ్య వెంకప్పసోమయాజులుచెల్లెలు యింట్లో వుండి పైఆట ఆడడానికి ఆవిడకు సందుదొరకకపోతే వదినెగారిని వెళ్ళగొట్టడానికి నెల్లాళ్ళు ఆదయ్యం పట్టింది. ఆవిడను పట్టుకున్నవి బ్రతికినదయ్యాలేకాని చచ్చినదయ్యాలు కావు. వారియింట్లో సాంబయ్య దయ్యంవదల్చడమంతా యిదేను.

సోమ--పోసి యెవరియింట్లో యేనుయితే మన కేమి ? మంటి పిల్లి అయినా యెలుకను పట్టడం ప్రధానం. ఇతని మంత్రప్రభావంచేత మన పిల్లవాడివళ్ళు నిమ్మళిస్తే మనకంతే చాలును.

శంక-- అపుషధం యిప్పించకపోతే యేలా నిమ్మళిస్తుంది? మీరు యీవెర్రిభ్రమలు మాని యిఖనైనా మంచివైద్యుణ్ణి పిలిపించి మందు వేయించండి. యీభూతవైద్యాలతో యేమీ కార్యము లేదు.

సోమ--ఆరంభించినతరువాత నాలుగురోజులు చూచి గుణగ లేకపోతే మరివక చికిత్స చెయ్యనలెనుగాని మనము తొందరపడితే కార్యం లేదు. వక్క మామునలమ్మమాటే నమ్మివుండక కూనలమ్మ గుడికాడ మాలది యేమి చెపుతుందో అని సోదికి పంపించినాను. అది కూడా ఫదిరోజులక్రిందట తలంటి నీళ్లుపోసుకుని వీధిలోనుంచి వెళుతూ వుండగా రావిచెట్టుమీదను వున్న కామినీగ్రహం మోహించి పట్టిందని చెప్పింది. ఆమాలది చెప్పినమాట బహుదాఖిలా. మొన్న మా యింటికి ముష్టికి వచ్చిన యెరకలదాన్ని శకునం అడిగినా కొంచెం భేదంగా చెప్పినదిగాని మెట్టుమీద గ్రహము సోకినదనే చెప్పినది.

అదీ దాఖలాగా చెప్పేమనిపేను. ఈగ్రహాలుకూడా తమపేర్లు తిన్నగా చెప్పవు. వకరితో వకలాగునా మరివకరితో మరివకలాగునా చెపుతవి. చూచినారుకారా కూనలమ్మగుడికాడ కామినీగ్రహ మని చెపితే యెరకలమనిషి బ్రహ్మరాక్షసి అని చెప్పినది. యీరెండిట్లో యేదయినా చికిత్స వకటేను. అందుచేతనే మొన్నరాత్రి పిల్లవాణ్ణి స్నానం చేయించి ముగ్గులో కూర్చుండబెట్టి మంత్రాలు చెప్పి యెంతో తంతు చేసినారు. దెయ్యము వదిలిపోవడంచేత గాబోలును మావాడు శోష వచ్చి కూర్చోలేక వెనుకకు పడిపోయినాడు.

శంక—ఇప్పుడు మీవాడికి దెయ్యమూ లేదు భూతమూలేదు. ఇంతటితోనయినా ఆపయిత్నం మానివేసి వెంటనే వైద్యపుసంగతి చూడండి.

సోమ—మొన్నటిరాత్రి కోడిసిట్టను దిగదుడుపుపెట్టి భూతాన్ని సీసాలోదింపి పాతిపెట్టించి మారణహోమం చేయించడంతోటే అన్నీ వదిలిపోయినవి. ఇప్పుడు మావాడి కాగ్రహబాధ యేమీలేదు. ఇది ప్రియోగలక్షణంగా కనుపడుతూవున్నదని వక స్నేహితుడు చెప్పే టప్పటికి దానికోసము వీరహనుమంతము జపం చేయించి విభూతి పెట్టిస్తూవున్నాను. ఇప్పు డాఅనుమానం నాకు యేమీ లేదు. కాని యీమధ్య మరివకటి వచ్చినది. వేరంటాలు గుడికాడిది సోది యేమి చెప్పగలుందో అని అడిగి చూచేటప్పటికి అది వెంకటేశ్వరులు పూని బాధిస్తూవున్నాడని కొత్తసంగతి చెప్పినది. ఇదేమిటిరా వకటిపోతే వకటి వచ్చినదని విచారిస్తుండగా యింట్లో మామేనత్తకు ఆవహించి వెంకటేశ్వరులు తానని బయలుపడ్డాడు. ఆమట్టుగా తల్లి తనవంటిని రెండువస్త్రములు ముసుగుపుకట్టి చిన్నవాడివల్లు కుదిరి బాగావుంటే కుటుంబసహితంగా తిరుపతికొండమీదికి వెళ్లి వేణి యిస్తానని, నిలువు

దోపు యిస్తానని మొక్కుకొన్నది. వెంకటేశ్వరులకు అబోతును అచ్చుపోసి విడుస్తానని నేనుకూడా మొక్కుకున్నాను.

శంక — మీరు యెంతసేపు చెప్పినా గ్రహాలూ దేవతలూ ప్రియోగాలే చెపుతారుగాని అవుషధంమాట తలపెట్టరు. పది రూపాయలసొమ్ము పోతేపోయింది. మీరు తక్షణం వెళ్ళి వైద్యుణ్ణి తీసుకువచ్చి మందు వేయిస్తారూ.

సోమ — మీమాటలు చూస్తే నే నేమో డబ్బుకు వెనుకా ముందూ చూస్తూవున్నా నని మీకభిప్రాయ మయినట్లు కనపడుతూ వున్నది. దాని ముండామోసినడబ్బు ప్రాణంకంటె డబ్బెక్కువండీ? పిల్లవాడు తిన్నగా వుంటే సర్వసోపారమూ దేవుడికి దోపుయిమ్మనాన్నా యిస్తాను. నామనస్సులో పిల్లవాడివళ్ళు కుదిరినతరువాత వెయ్యి రూపాయలుపెట్టి తిరుపతిలో దేవుడిగుడికి దక్షిణపుగుమ్మానికి వెండి రేకు తాపడం చేయించవలెనని సంకల్పించుకొన్నాను. ఫక్తు సాంబన్నకు యాభైరూపాయలు యిచ్చినాను. యిప్పుడు జపాలకిందనూ హోమాల కిందనూ యెంతో అవుతూ వున్నవి. రేపు గ్రహశాంతినిమిత్తమై సంతర్పణకు యెంతలేదన్నా నూరురూపాయలవుతవి. సూర్యనమస్కారాలుచేసే బ్రాహ్మలకు యెంతో యిస్తున్నాను. సిద్ధాంతిగారే జాతకం చూచి శనిగ్రహం చాలదని చెప్పేవరకు నవగ్రహజపాలుకూడా నిన్న ఆరంభించి చేయిస్తున్నాను. అందుచేత రాత్రి పిల్లవాడు కదలమెదల కుండా మంచంమీద నెమ్మదిగా పరున్నాడు. ఇందులో ఆడ్వంటాలు వకసంచీకి దాటుతుందిగాని అంతకులోపు కాదు.

శంక — మీరు యెంతఖర్చుచేసినా క్రిమయినమో స్తరుగా వినియోగించడం లేదు.

సోమ—తాళండి. లోపల యేమో కేకలు వేస్తున్నారు. యేమయ్యా ? వెంకయ్యా ! ఆగందగ్గిగోళం యేమిటి ?

వెంక—ఇంకా యేమి వున్నది ? అబ్బాయికి యెక్కిళ్లు పుట్టినవి. వెర్రిచూపు చూస్తున్నాడు. చేతులోనాడి పైకిలాక్కుపోతూవున్నది. కాళ్ళూ చేతులూ చల్లబడినవి.

సోమ—వెంకయ్యా ! నీవు చటుక్కున పరుగెత్తి రుద్రియ్య గారిని తీసుకునిరా. చింతామణి అయినా అమృతమైనా వేయింతాము. మన ప్రయత్నలోపం యేమీ లేదు. చేతనైనట్లల్లా తంటాలు పడ్డాము, డబ్బుకు వెనుకా ముందూ చూడక రూపాయ చిల్లిగవ్వగా ఖర్చు చేసినాము. దైవం తిన్నగా చూడకపోతే మనప్రయత్నాలు యేమీ అక్కరకు రావు. ఆయువు లేకపోయినతరువాత వెయ్యిమందివైద్యులు వచ్చిమాత్రం ప్రాణాలు పొయ్యగలరా ? నీవు వైద్యుడికోసం వేగిరం పరుగెత్తు. నేను లోపలికి వెళుతాను. (అని వెళ్ళి చున్నాడు)

శంక—పాపం పిల్లవాణ్ని నిష్కారణం మందువెయ్యక బలవంతముగా చంపివేసినారు. ఈభూతవైద్యులనూ వీళ్ళనూపట్టుకొని నరహత్య చేసినందుకు శిక్షచేస్తే బాగావుండును. పెళ్ళిఅయి ఆరునెలలు కాలేదు. ఆచిన్నదాన్ని చూస్తే నాకు బహువిచారంగా వున్నది. లోకంలో అనేకులు మూఢత్వంచేత రోగాలువచ్చినప్పుడు మందువేయించక దయ్యాలనీ భూతాలనీ యేడుస్తూ స్నానాలు చేయించీ తడిబట్టలు కట్టించీ దెబ్బలు కొట్టించీ తిండి పెట్టక మాడ్చీ మంతపాగలు వేసి బ్రతికేవాళ్ళనుకూడా చంపివేస్తారు. ఈ హిందూదేశానికి యీమూఢత్వం యెప్పుడు వదలి పోతుందో, జనులు దేహారోగ్యవిధులు తెలుసుకొని చేదస్తం వదలి యెప్పుడుబాగుపడతారో, ఇఁక నేనువెళ్లిపోతాను. (అని వెళ్ళిచున్నాడు)

మూఢభార్య—మంచిమగఁడు.

——:0:——

[సోమంచి సోమయ్యగారును, కామమ్మగారును ప్రవేశించుచున్నారు.]

సోమ—యేమే యీవాళ తొమ్మిదిగంటలక్కల్లా వంట కావలె నని చెపితే యింకా మడికట్టుకున్నావేకావు. తహశ్శీలుదారుగారు సర్గ్గా పదిగంటలక్కల్లా కచేరీకి వస్తామన్నారు.

కామ—ఆయన పదిగంటలకు వస్తే మీరు భోంచెయ్యకుండా కచేరీకి వెళ్ళి యేకంగా సాయంకాలం వచ్చి తినండి. మీరు వట్టి మూల కూడు యింట్లో కలుపుతూ వున్నారు. ఆచారం లేదు వ్యవహారం లేదు. మడి లేదు మయిల లేదు. తెల్లవారేటప్పటికి కుంభం విస్తట్లో పొయ్యి మంటారు. మడీ మయిలా లేకుండా పట్నవాసాలలో పెరిగినవాళ్ళు చేసేట్టుగా చిన్నప్పటినుంచీ పల్లెటూరిలో ఇంత ఆచారవ్యవహారాలు గల యింట్లో పెరిగిన నేను పట్టుబట్ట కట్టుకొని వంట చెయ్యమంటే చెయ్యను. మాతండ్రిగారు మావూళ్ళో అపరాహ్ణం తిరిగితేనేగాని భోజనానికి వచ్చేవారేకారు. చద్దికూడుతిన్నట్లు మీరు సూర్యోదయానికి వంటచేసి పెట్టమంటే యేలా అమురుతుంది ?

సోమ—నేను యెంతమొత్తుకున్నా నీవు వకరోజు రెండు ఝాములకూ, వకరోజు వంటిఝుంటకూ, వకరోజు అన్నం చివిడిచీ, వక రోజు అన్నం వుడకనియ్యకా పెడుతూ వున్నావు గాని వేళపట్టున జిహ్వాకు రుచిగా ఇంతఅన్నము పెట్టవుగదా ? వేళకు భోజనం లేక పోవడంచేత నెల్లాళ్లకిందట యెంతో ఖాయిలాపడి చచ్చిబ్రతికినాను. వేళకు కచేరీకి రావని నీ వంటమూలంగా రోజూ తహశ్శీల్‌దారుగారు అందరిముందరా నన్ను చివాట్లు పెడితే నాకు సిగ్గు వేస్తూవున్నది. వైద్యుడుకూడా వేళకు భోజనం చెయ్యకపోతే మళ్ళీజబ్బుచేస్తుందని

చెపుతూ వున్నాడు.

కామ—మీకు యేలాగయితేనేమి వెధవవైద్యుడు దొరికినాడు. నాలుగు ఇంగ్లీషుముక్కలు నేర్చుకుని కులం చెరపడానికి మాలనీళ్లన్నీ సీసాలో పోసి యిస్తాడు. మీ కామాత్రం వివేకం లేదు. వాడుయిచ్చిన దద్దా తాగి కులభ్రష్టు లయి పోతూవున్నారు. ప్రాణంపోయినా మా పల్లెటూళ్లోవా ళ్లెవళ్లయినా జాతిమందులు పుచ్చుకుంటారేమో చూడండి. వాడిపిండాకూడువైద్యం వేళకు భోజనం లేకపోతే రోగం వస్తుందట ! యీరోగాలు వచ్చేవాళ్లందరికీ వేళకు భోజనాలు లేక పోవడంచేతనే వస్తున్నవాయేమిటి? రోగం రావలసిన కారణార్థంవుంటే యేలాగూవస్తుంది. మంచూ మాకూ అక్కరలేకుండా లేతలో నాలుగు లంఖణాలుచేస్తే వక్కదెబ్బను ఫదిరోజులనాటికి వళ్ళు నిమ్మళంగా వుంచును. డబ్బుఖర్చుకూడా అక్కరలేకుండా కుదురును. మీరు గోదావరిలో పోసినట్టు పాతికరూపాయలు వాడిచేతిలో పోసినారు. అన్నిరూపాయలూ పుచ్చుకుని ఆనుండాకొడుకు వక్కలంఖణమైనా కట్టకుండా యీనీళ్ళూ ఆనీళ్ళూ లోపల పోసి గోధుంజావ పెట్టించినాడు. వాడు సిజమైనవైద్యుడైతే జబ్బుచేసినప్పుడు యెన్నడైనా గోధుంజావ యిప్పిస్తాడా ? గోధుంజావ యెంతజలుబు యేనుటి ? మీరు నాఅయిదో తనం చల్లగా వుంచబట్టి బ్రతికినారుకాని వాడివైద్యంచేత బ్రతకలేదు. ఆవైద్యం వద్దు మానమంటే ఇప్పటికి మీరు నామాట వినరు.

సోమ—ఆవైద్యంమాట యిప్పు డెందుకు? మంచు వంటమాట చూస్తూ.

కామ—మీరు వూరికే అన్నం వుడికిందికాదనీ అన్నం చిము డుతుందనీ వంకలుపెడుతారు. కచేరీ కచేరీ అని వూరికే తొందరపడితే అన్నం యేలావుడుకుతుంది ? అన్నం వుడుకుతూవుండగా మూయిలగుడ్డ

కాలికి తగిలినా పాలఫుట్టి నెత్తికి తగిలినట్టు అనుమానమయినా నూతి దగ్గరకు వెళ్ళి స్నానంచేసేటప్పటికి కొంచెం ఆలస్యం అయి, కొంచెం అన్నం చిమడుతుంది. పట్నవాసపువాళ్లవలె అనాచారపుకూడు వెట్టడం నాచేత కాదు.

సోమ — పోనీ వెనకటిమాట కేమి యిప్పుడు కచేరీకి పొద్దు యెక్కుతూ వున్నది. వేగిరం మడికట్టుకుంటూ. నిన్నరాత్రివచ్చేటప్పుడు రేపు తప్పకుండా ఘడిఘుంటలకే రావలసినదని మరీమరీ చెప్పడమే కాకుండా రేపు వేళకురాకపోతే జునుమానా వేస్తామని కూడా తహశ్శీలుదారుగారు సెలవిచ్చినారు.

కామ — ఆయనకేమి యెన్నైనా చెప్పుతాడు. ఇంటికాడ స్నానసంధ్యాద్యనుష్ఠానాలన్నీ తగలబడిపోతూన్నవా యేమిటి ? అమావాస్యనాడైనా స్నానమూ చట్టుబండలూ యేమీలేదు. ముట్టు ముండలాగు తెల్లవారేటప్పటికి పొట్టకింతతిని కచేరీలోవచ్చి కూర్చుంటాడు. భార్యాకూడా ఆయనకు తగినదే దొరికింది. మడికట్టుకుని కాస్త కేశవా నారాయణా అనుకోమని అయినా చెప్పదు. ఆవిడ గరల్సునూళ్ళులో చదువుకున్నదట. ఆనిడకూ వేదాంతమే. యీ ఆచారాలు యేమిటి? మడి యేమిటి? అంతా చాదస్తం అంటుంది. ఆమాత్రంవేదాంతం మాకు తెలియదు. నేను చెవినిల్లుకట్టుకొని పోరు తూవుండబట్టిగాని లేకపోతే మీరుకూడా యీపాటి సంధ్యావందనం ముక్కలు నాలుగూ మరిచిపోయేవారే. యెంతసేపు ? నేను సుబ్బమ్మ గారింటికివెళ్ళి కొత్తపేడ తెచ్చి వంటిల్లు అలుకుకుని పొయిశుద్ధి చేసి గోదావరికి పోయి స్నానంచేసి వచ్చి పొయిలో నిప్పువేసుకొని వంటచేస్తాను. మీరు యీలోపుగా స్నానం చేసి తడిబట్టతో సంధ్యా వందనమూ బ్రహ్మయజ్ఞమూ పితృతర్పణమూ దేవతార్చనా చేసు

కుంటూవుండండి. దాసీముండ మనుంట్లో నిస్నటిపేడా యీవాళ పేడా కలిసివేసింది. అది శుద్ధికి పనికిరాదు. బచ్చలపాదును మడిబట్ట ఆరకడితే దానినీవ కాకి రెట్టవేసి మీబట్టా నాబట్టా అన్నీ మయిలపడి పోయినవి. అవి అన్నీ ఎప్పుడు పట్టుకుని వెళ్ళి తడిపి వుతికి తడిబట్ట కట్టుకుని వంట చెయ్యనలెను. నాకు తడిబట్టఅంటే లక్ష్యములేదు. మీరు వక్కరోజు బట్ట ఆరకపోతే యెంతో గందరగోళం చేస్తారు.

సోమ — తడిబట్ట వంటికి చాలాజబ్బు. దానిమూలముగా రోగాలు వస్తవి.

కామ— చాల్లెండి యీపాటి. ఇప్పుడు తడిబట్ట కట్టుకుంటే రోగాలు వస్తవిఅంటూవున్నారు. రేపు సంధ్యానందనం చేస్తేకూడా రోగాలు వస్తవిఅంటారు. మీకు వట్టి మూలకూడుతింటే యేరోగాలు రావు. ఆచారవ్యవహారాలు లేకపోతే యీబ్రాహ్మణీకం యెందుకు? మెళ్లో జంధ్యాలుయెందుకు? తీసి కుక్కమెళ్ళో వెయ్యరాదూ? మూ అమ్మకు యెంతఆచారము! యెంతనిష్ట! రోజూ ఘడిస్నానాలుచేసి యెప్పుడూ తడిబట్టతోనే వుండేది. ఇప్పటికీ ఆనిడెకు యీభయమేళ్ళ వచ్చినవి. యేరోగాలూ లేవు. మీరు ఘంటసేపు తడిబట్ట కట్టుకుంటే అన్నిరోగాలూ వస్తవి.

సోమ— —యీమాటలతో పొద్దుపుచ్చక యిఖనయినా గోదావరికి వెళ్ళి స్నానంచేసి వచ్చి వేగిరం మడికట్టుకుని వంటచేస్తూ. ఇవాళ మాకచేరి పరీక్షచెయ్యడానికి దొరగారు వస్తారు.

కామ— —వంటఅంటే వూరికే మాటలుచెప్పినట్టే అనుకున్నారా యేమిటి? దాసీది ఇంకా ఘంటకుగాని అంట్లుతోమి తీసుకురాదు. తీరా తెచ్చినతరువాత యిత్తడిసిబ్బికి మసి వదలకపోయినా వంటతప్పే

లాకు అంటువున్నా మళ్ళీవెళ్ళి స్నానంచేసి రావలెను. గోదావరిలో స్నానంచేసి వస్తూవుంటే బట్టలువుతికేవాళ్ల నీళ్ళు మీావపడతవి. కాస్త సేపు ఆగమంటే వాళ్ళు ఆగరు. అదేమంటే వాళ్ళంతా ఖుజ్జాకు వచ్చి కాట్లకుక్కల్లాగు మీాదపడుతారు. యెమురుకెమురు నాకే చాదస్తమని అడ్డమయినమాటలూ అంటారు. మీారు కాస్తకల్పించుకొనివచ్చి వక్కమాటు మీాకేమిపొయ్యికాలంవచ్చిందక్రా అని ఖుజ్జా ఆడరుగదా? మీారు వక్కమాటు కూకలువేస్తే వాళ్ళు నన్ను యెందుకు వేళాకోళాలు చేస్తారు? మీారు లోకువచెయ్యబట్టె నేను అడ్డమయినవాళ్లకూ లోకువయినాను. "మగడు వల్లనిదాస్ని మారివల్ల" దన్నసామెత వూరికేపుట్టినదా? యీబట్టలు వుతికేవాళ్లమూలంగా వక్కరోజున గోదావరిలో ఫదేసి స్నానాలు చేస్తాను. అన్నీ తప్పించుకొని బిండె యెత్తుకొని తీరా వీధులోకి వచ్చేటప్పటికి వాళ్లయిల్లు వల్లకాడుగాను వీధులుతుడిచేవాళ్లు యేసందులోనుంచో కావిడి యెత్తుకొని యెదురుగా వస్తారు. వాళ్లప్రాణాలకు వునూరుమని బిండెడునీళ్ళూ అక్కడ పార పోసి చచ్చినట్లు మళ్ళీ వెళ్ళి చీడీలన్నీ దిగి నీళ్ళుముంచుకొని బరువుతో తిరపతికొండయెక్కినట్లు పయికెక్కి రావలెను. మీారు తాలూకాలో హేడ్డుగుమాస్తాపని చేస్తూవున్నారన్నమాటేకాని ఆమాలమండా కొడుకులని కాస్త కూకలువేసి బ్రాహ్మలు నీళ్ళు తెచ్చుకునే వీధులలో ప్రొద్దున్న తిరుగవద్దని పెంటలు తుడిచేవాళ్లను ఆజ్ఞపెట్టలేరుగదా? యేమి హేడ్డుగుమాస్తాపని చేస్తూవున్నారోకాని మీాకు మూలనున్న ముసలిముండ లేవదు. బొందున పుస్తెతప్ప ఫదివరహాలగుల్ల లయినా చేయిగచి పెట్టరు. లంచాలుపుచ్చుకుంటే తప్పట! మీారూ మీాతహా శీలుదారుగా రేకాని మీావెనుకటివారికి మీామాత్రం తెలియలేదా యేమిటి? వారు దోసిళ్ళాది సంపాదించేవారని అంతా చెప్పు

కుంటే వినడానికి ముచ్చట వేస్తుంది. మీరు యిద్దరూ వుద్యోగానికి వచ్చి వుద్యోగం వఖరంతా చంపివేసినారని తక్కిన గుమాస్తాలపెళ్ళా లందరూ చెప్పుకుంటారు.

సోమ—నీకు యింకా నగలు యెందుకు? వున్ననగ లయినా యెప్పుడయినా పెట్టుకొని యేడుస్తావాయేమిటి? నీచేదస్తంచేత యెప్పుడుచూచినా స్నానాలలోనూ ఆచారాలలోనూ మునిగి బూచి లాగు తల విరబోసుకొనిశూర్పుంటావు. చక్కగా తలదువ్వుకొని కొప్పు పెట్టుకొని నాలుగునగలూ వంట పెట్టుకొని మంచిచీర కట్టుకొని వుండగా చూడవలెనని నాకెంతో మనసు వేస్తుంది.

కామ—మీకన్నీ మనసువే స్తవి. ఆచారవ్యవహారాలు అక్క రలేకపోతే మీరు వెళ్ళి కిరస్తానీలో కలవండి. నేను పూర్వజన్మమందు చేసుకున్న పాపంచేత పట్నవాసంలో పడ్డాను. రామరామా! అంతా వర్ణసంకరంవచ్చింది. మీకు దేవుడూలేడు, దయ్యమూలేదు. గోమయం పేరుచెపితే అసహ్యించుకుంటారు. నోములూ వ్రతవాసాలూ అక్కర లేదంటారు. దేవుడుగుళ్లలో దేవుళ్లను రాతిబొమ్మ లంటారు. జాగ రాలు చేస్తే వళ్ళు జబ్బుచేస్తుందంటారు. మంచికోజూ చెడ్డకోజూ విచా రించరు. శకునాలూ సోములూ అబద్ధమంటారు. రోగంవస్తే అమ్మ వారు కాపరంటారు. బ్రాహ్మణీకం యేమీ అక్కరలేకుండా తెల్లవారే టప్పటికి మింగి కూర్చోమంటారు. నేనుకాగా మీరు పెట్టినపాట్లన్నీపడి యేమూలకూడు యింట్లోకలుపుతూవున్నా అన్నిటినీ సహించి వూరు కుంటూవున్నానుకాని మీరు చేసేఅనాచారానికి మరివక పెండ్లాము వచ్చినట్టయితే యీపాటి గోదావరిలోనో నూతిలోనోపడి చచ్చిపోను. కచేరీకి వెళ్ళినగుడ్డలతో యిల్లంతాతిరిగి బిందెలుకూ నీళ్లుకూడా ముట్టు కుంటారు. మీకు ఆచారం వంటను పుట్టుకురావలెనుగాని ఆడదాన్ని

నేను యెన్నిటికని మొత్తుకోను ?

సోమ—నీవు యీవాళ వంట చేస్తావా లేదా ? అప్పుడే ఘడి ఘంటలు కావస్తూవున్నది. ఈరోజు రాత్రి యెనిమిదిఘంటలుదాకా మళ్ళీ యింటికి రావడానికి వల్ల కాదు. నీవు వంట చెయ్యకపోతే భోజనం చెయ్యకుండా కచేరీకి వెళుతాను.

కామ—అన్నిటికీ నన్ను యీలాగు యేడిపిస్తూవున్నా రేమి ? యీవాళ శుక్రవారముగదా నేను తలనిండా స్నానం చేసి శుక్రవారాల నోమునోచి చెప్పుకొని అక్షింతలు వేసుకోకుండా యేలాగు ముందర మీకు వడ్డిస్తాను ? ఆకథ నాకు రాదు ! వెంకాయమ్మగారి యింటికి వెళ్ళి ఆవిడకు తీరుబడి అయినదాకా వుండి కథ చెప్పించుకురావలెను. మళ్ళీ నేను ఆలస్యంగా వెళితే యీలోపుగా ఆవిడ భోజనం చేసి కూర్చుంటే యిల్లిల్లూ తిరిగి తంటాలుపడలేను. మిమ్మల్ని యెప్పుడు చేసుకున్నానో నానోములూ వ్రతాలూ అప్పుడే భగ్గున ఆహుతి కొనిపోయినవి. మీకు పుణ్యమూ పురుషార్థమూ అక్కరలేదు. పందితిన్నట్టు కడుపు కింతతింటే చాలును.

సోమ—కోపపడబోకుము. నేను భోజనంచెయ్యకుండానే కచేరీకి వెళతాను. వేళ అయినది. నీనోములూ వ్రతాలూ అన్నీ అయినతరువాతనే మెల్లిగా వంట చెయ్యి? కొంచెం అక్షింతలు తీస్తావా మొగాన్ని బొట్టుపెట్టుకొని వెళుతాను.

కామ — వెళ్లండి. తిండి తినకుండా వెళ్లి నన్ను సాధిస్తారా యేమిటి? మీరు యెప్పుడు కడుపులో కాలితే అప్పుడే వచ్చి భోజనం చేస్తారు. ఓరి దిక్కుమాలిన దేవుడా ! నీయిల్లు వల్ల కాడుగాను. నాకు వేగిరం చావు పెట్టనుగదా. నాకు వల్ల కాటిసంసారం వచ్చింది. వక్క మాటుచస్తే యీబాధ విరగడైపోను. నన్ను నలుగురినోళ్ళలోనూ

పెట్టి అల్లరిచెయ్యడానికి యిలా చేస్తూవున్నాను.

సోమ — ఆట్టే విసుకోకు. నేను వెళ్ళిపోతూ వున్నాను. నీ యిష్టం వచ్చినప్పుడు వంట చెయ్యి. (అని వెళ్ళిపోతున్నాడు.)

శిశుపోషణము.

[రావూరి రామయ్యపంతులుగారు, భార్యయైన కనకమ్మ సహితముగా ప్రవేశించుచున్నారు.]

రామ — ఓసి పాడురండా ? నీ కేమి చేటుకాలం వచ్చిందే ? పిల్ల వాణ్ని అలా కొట్టి యేడిపిస్తూవున్నావూ ?

కన — మీరు అస్తమానమూ నన్ను ఆడిపోసుకోవడంతోనే సరిపోతుంది. అల్లరిచేస్తే పిల్లవాణ్ని కాస్తఆఁ అని అదమాయించడానికి వల్ల కాదు. యేమైనా అంటే పెద్దపులిలాగు మీదపడుతారు. నే నన్నిటికీ దాడలు దగ్గిరగా నొక్కుకొని సగం చచ్చి పడి వుంటాను. అక్కడికీ నాకు వుండరాములు లేకుండా వున్నవి. నేను లోకంలో వాళ్ళ పెళ్ళాలవంటిదానినైతే మీరు నన్ను వక్కనిమిషం బ్రతకనియ్యక పోదురు.

రామ — పిల్ల వాడు నిజంగా అల్లరి చేసినప్పుడు యేమైనాశిక్ష చేస్తే నేనుమాత్రం యెంత కంటాను ? ఇప్పుడు వాడు యేమినేరం చేసినాడని చెళ్ళా చెళ్ళా అయిదువేళ్ళా అంటుకునేలాగు వాడిపీపు మీద ఆలా చరిచినావు ? వాడు చేసినతప్పిదంఅల్లా అమ్మ తలమీద నీళ్ళు పోసిందని చెప్పడమేగా మరి యేమైనా వున్నదా ?

కన — అది చాలదూ. యింకా యేమితప్పిదం కావలెను ? ఆడవాళ్ళకు మొగవాళ్ళతో చెప్పుకూడని రహస్యాలు యెన్నైనా

వుంటవి. వేలెడువెడవ లేడు యిప్పటినుంచీ గడుగాయతనం నేర్చుకుని రహస్యాలన్నీ యిలాగు చెపుతూవుంటే ముందు వీడు యేమి అక్కరకు వస్తాడు ? మీకు నామీద కోపం రావడానికి వూరికే అమ్మతలమీద చన్నీళ్లు పోసిందని చెప్పడమేనా యెందుకు పోసినానో యే మయినా చెప్పినాడా ?

రామ—యెందుకు పోసినావో యిప్పుడు నీవు చెపుమా. నేను విని సంతోషిస్తాను.

కన—నామాటలంటే మీకు వేళాకోళాలూ వెక్కిరింతలూను. వాళ్ళు చేసేవల్లడిపనులు కనపడవు. నేను యేమయినా అంటే నానోరు అందరికీ కనపడుతుంది. వాడు పనికట్టుకువెళ్ళి దొడ్లో దాసీదాని కొడుకును ముట్టుకున్నాడు. తలనిండా నీళ్ళు పొయ్యకుండా బ్రాహ్మణ జన్మం యెత్తినతరువాత వాణ్ని శూద్రికూడు యెలా తిననియ్యను ? అది కాకుండా వాడామట్టుగా వచ్చి పరుపూ మంచమూ ముట్టుకుని బట్టలన్నీ మయిలపడవేసినట్టయితే అవి అన్నీ తడిపి ఆరవెయ్యలేక చావవలెను. పాతాళలోకంలో వున్నవి. నూతిలోనుంచి చాదెడునీళ్లు పయికి వెల్లగిలి వచ్చేటప్పటికి పేగులు తెగిపోతవి. ఆడవాళ్లకు వుండే కష్టాలు మగవాళ్లకు యేమి తెలుస్తవి ?

రామ—నీకు యెన్నివిధాలబోధించినా చాదస్తం ఆవగింజా తయినా వదలలేదు. చిన్నపిల్లవాడు శూద్రివాణ్ని ముట్టుకుంటే యింట్లోబట్టలన్నీ తడిపి ఆరవెయ్యవలెనా ? నీవు రోజుకు మూడు సార్లు తడుపుతూవుంటావుగనుకనే చీకిపోయి బట్టలన్నీ మూణ్ణాలకే మళ్ళీ చిరిగిపోతూవుంటవి. నీవు యింటికి జ్యేష్టాదేవివి పోగయినావు.

కన — మీరు వెయ్యిఅనండి లక్షఅనండి. మీకుమల్లే మయిల కూడు నానోటికి పోదు. మీరుచిన్నప్పటినుంచీ మాలబళ్లలో చదు

వుకుని కిరస్తానీవాళ్లతో సహవాసం చేస్తూవున్నారుగనుక ములా మడీ ఆచారమూ వ్యవహారమూ అక్కరలేకుండా అడ్డమయినవాళ్లనూ ముట్టుకున్నబట్టలతోవచ్చి స్నానమయినా చెయ్యకుండా పట్టుబట్ట చుట్టపైట్టుకుని మయిలకూడు తినడం మీకు అలవాటుఅయినది. అటు వంటి యెంగిలిమెతుకులు నాకు లోపలికి పోవు. అందుచేతనే నేను మీవిస్తట్లో కూర్చోక వేరేవిస్తరి వేసుకుని తిని మీయెంగిలివిస్తరి తీసివేసి తలనిండా స్నానము చేస్తాను.

రామ — పెద్దదానవు నీవుయెన్నిస్నానాలు చేసినా ఫర్వాలేదు. మూడేండ్లకుర్రివాణ్ణి రోజూ చన్నీళ్ళల్లో మూడేసిస్నానాలు చేయిస్తూవుంటే వాడికి రొంపపట్టి మొసమొసలాడుతూవున్నాడు. చలి వాడివంటికి మీర్జాతొడగమంటే తొడగక యెప్పుడూ మోమలాగు వుంచుతావు.

కవ — వాడికి పదేళ్ళు పయిని పడ్డవిగనుక మీర్జా వంటిని వుంచునునా? చంటిపిల్లవాడు నన్ను ఘుడియఘుడియకూ ముట్టుకునే వాడికి మీర్జా యెలాగుతొడగను? నన్ను వూరికే రవ్వాపెట్టడమే కాని మీరు మంచీ చెడ్డా యెరగరు. వాడు నిముషనిముషానికీ నన్ను వచ్చి ముట్టుకుంటూవుంటే మడిగట్టుకుని వంటచేసేదాన్ని నేను యెన్ని స్నానాలుచెయ్యను? నేను స్నానాలంటే ఝడియనుగాని నూతులో నీళ్ళు తోడడమంటే భయపడుతాను తిన్నగా తిరుగుతూవున్నంత ముట్టుకేగాని తరువాత నాకు రోగం వస్తే నన్ను చూచేవారు యెవరు? నేను యెంతచదువుకోనిదాన్ని అయినా తెలియక అడుగుతానుగాని యెక్కడనైనా స్నానాలు చేస్తేనూ తడిబట్టలు కట్టుకుంటేనూ రోగాలు వస్తవండీ? అవి రావలసినయోగంవుంటే యేలాగూవస్తవి. రోజూ యీస్నానాలు చేసేవాళ్లందరికీ రోగాలు రావడం లేదేమి?

రామ—చాలులే. యుూపాటిచ్చూకుకో. నీకు పిల్లలను పెంచడం యెంతమాత్రమూ తెలియదు. ఆవమరచి నిద్రపోతాడని పిల్లవాడికి నల్లులకుపోసే వేడినీళ్ళు పోస్తావు. వద్దంటే వినవు. అంపుచేత వాడికి వళ్ళంతా గజ్జి చిడుమూ పట్టుకొనినచ్చింది. అదేకాకుండా యెక్కడివో ముదికిని పాతబట్టలు తెచ్చి పక్కవేసి నులకమంచముమీద పిల్లవాణ్ణి పరుండబెడుతావు. ఆమంచానికితోడు దానికింద కుంపటికూడా పెట్టి పొగ పెట్టడంచేత కిందికి వేలాడుతూవున్న నులకచేరులు అంటుకొని పిల్లవాడికాలు కాలి పుండు యిప్పటికీ తిన్నగా మానలేదు.

కన—పిల్లవాడి కాలుకాలడంకూడా నాతప్పిదమేనా ? దైవం చేసినదానికి నేను యేమిచెయ్యను ? మంచంకింద కుంపటి లోకంలో అందరూ పెడుతూవున్నారా నేను వక్కదాన్నే పెడుతూవున్నానా ? పిల్లవాడైనతరువాత కాలూకాలక చెయ్యికాలక యెలావుంటుంది ? పిల్లవాడికి నేడినీళ్ళుపొయ్యడంచేత గజ్జి పడుతుందంటారు. యీవిరుద్ధం యెక్కడయినా వున్నదా ? పిల్లలకు చమురురాసి వేడినీళ్ళు పొయ్యకపోతే బలుబుచేసుకొనిరాదా ? లోకంలో అందరివలె నేను కూడా అంతవేన్నీళ్ళు పోసినట్లయితే మీరు నన్ను మింగివేస్తుడు. మొన్న సుబ్బమ్మగారియింట్లో యేడాదికుర్రవాడికి నీళ్లుపొయ్యమంటే గూవంటిదాన్ని వేడిచేత చెంబు పట్టుకోలేక పోయినాను. అటుతరువాత పిల్లవాడు ఝామునేపటిదాకా హాయిగా నిద్రిపోయి మళ్ళీలేచి నాడేకాడు. పిల్లవాళ్ళకు వేడినీళ్ళు యెంతఆరోగ్య మనుకున్నారు యేమిటి ? వంటికి యెంతవేన్నీళ్లుపోస్తే అంతమంచిది. ఆడపసికీ మగపసికీ మీరు అన్నిటికీ మధ్య అడ్డంవచ్చి పిల్లవాణ్ణి చెడగొడుతూవున్నారు. పిల్లవాళ్ళకు అన్నమూ నీళ్ళే బలము. ఎన్నిమాట్లు అన్నం పెడితే అంతమంచిది. మీకు యిలాంటివి యేమీ తెలియవు. పిల్లలను

పెంచడం ఆడవాళ్ళకంటె మగవాళ్ళకు మీకు యెక్కువ తెలుస్తుందా యేమిటి? ఆడదానిచేతి అర్థమూ మగవాడిచేతిబిడ్డా నిలవదనిచెప్పిన శాస్త్రకారుడు అంతవెర్రివాడేనా? మీకు యేమీ తెలియకపోవడం చేతనే పిల్లవాడిపక్కకు చిన్నగుడ్డలువేసినానని ఆక్షేపిస్తూవున్నారు. పక్కలో వుచ్చపోసేవాళ్లకు మురికిబట్టలూ పీలికలూకాకపోతే వుతికిన తెల్లమడతలు పక్కవేసుకుంటారా?

రామ—నీవు అన్నమంటే జ్ఞాపకం వచ్చినది. వాడికి రోజూ కూరికూరి యేడుస్తూవుండగా నోటికి మిరపకాయరాసి యెక్కువ అన్నం పెడుతూవు. అందుచేత వాడికి వూపరపొట్ట పెరిగినది.

కన—నేను అన్నం యెక్కువపెట్టడంచేత వూదరపొట్టకాలేదు. మీరు జాత్యైవైద్యంనమ్మి వుగ్గు పుతిరోజూ పెట్టనియ్యకపోవడంచేతనూ చిన్నప్పటినుంచీ అన్నం పెట్టనియ్యక పాలల్లో నీళ్ళు కలిపి పోయించడం చేతనూ యీవూదరపొట్ట వచ్చింది. జగత్తులో అందరూ ఆరునెలలు వచ్చినప్పటినుంచీ పిల్లలకు అన్నం పెట్టిస్తూవుంటే యీపాలు పోయించ డపుగ్రహచారం మనవక్కరియింట్లోనే వచ్చినది. మీరు జోక్యంకలుగ జేసుకోక పిల్లవాణ్ణి నేను పెంచినట్లల్లా పెంచనిస్తే యీగజ్జి వూదర పొట్టా యేమయినా వుండునా?

రామ—నీవు పిల్లను పెంచడం మహాబొగావున్నది. మననవుకరు వాడిచేతికిచ్చి సాయంకాలం గాలిలో తిప్పడానికి పంపుమంటే పంపవు. నాన్నతో వున్నది లేదనిచెప్పుమనీ, లేనిది వున్నదనిచెప్పుమనీ అబద్ధాలు నేర్పుతూవున్నావు. బూచివాడు వస్తాడనీ యెత్తుకుపోతాడనీ బెదిరించ డంచేత భయపడి వాడు నిద్రలోకూడా వులికులికిపడుతూ వున్నాడు. "నీ అమ్మ నీ అమ్మ" అని ముద్దుకు వాడికి అందరినీ తిట్టడం నేర్పుతూ వున్నావు. వాడు తిడితే వూరికే సంతోషిస్తావు. దీపాన్ని జేజెఅని చెప్పి

దణ్ణం పెట్టిస్తూవుండడంచేత నీమూలంగా మొన్న వాడు నిష్కారణంగా చేతులు తెగకాల్చుకున్నాడు. నేనంచేసినప్పుడూ చెయ్యినప్పుడూకూడా వాణ్ని వూరికే కొట్టి తిడుతూవు. చూడు. నారాయణరావుపంతులుగారి భార్య పిల్లను యెలా పెంచుతూవున్నదో.

కన—ఆవిడపేరు నాదగ్గర చెప్పకండి. నాకు తలకాయ నొప్పి వేస్తుంది. ఆవిడ పెంపుకు మీరు సంతోషపడవలెను. వాళ్ళకుతోచదు. మావంటి తెలిసినవాళ్ళు చెపితే వినరు. అన్నీ తమకే తెలుసునని గర్వం కూడాను. పండువంటికుర్రివాణ్ని గాలిలోతిప్పకమ్మా దిష్టితగులుతుంది పిట్టలు పొడుతవని చెపితే నామాట లక్ష్యం చేసినది కాదు. నామాట వినినందుకు తరువాత అనుభవించేటప్పుడే తెలుస్తుంది. నేనంత తెలియకనే మీరు యెన్నివిధాలచెప్పినా పిల్లవాణ్ని గాలిలో తిప్పకుండా జాగ్రత్తపెడుతూవున్నానా యేమిటి? పిల్లవాడు అప్పటినుంచి వక్క. మోస్తరుగా పట్టినపట్టు విడువకుండా యేడుస్తూవున్నాడు. మీరు వక్క పర్యాయం యెత్తుకొనివెళ్లి సముదాయించండి. నేను లోపల పనిచేసు కోవడానికి వెళ్తుతాను. (అని వెళ్ళుచున్నది.)

కు లా భి మా న ము.

——:0:——

పరిదేశము—పాపయ్యనాయుడుగారి లోపలిసావిడి.

[పాపయ్యనాయుడుగారును, వీరయ్యనాయుడుగారును ప్రవేశించుచున్నారు]

వీర—ఏమండి నాయుడుగారూ! అంతా బాగుండగా మనోళ్లు కర్మమే కాలిందా యేమిటి? బ్రాహ్మలలో యెవరు గొప్పవుద్యోగాల లోకి వచ్చినా వాళ్లు తమవారినేగాని మనవారిని యెవరినీ ఆఫీసులో చేరనియ్యరు, ఇంత పెద్దవుద్యోగంలో వున్నప్పుడు మీరుమాత్రం మన

వాళ్లను నలుగురినీ ఆఫీసులోచేర్చి బాగుచెయ్యరాదండీ?

పాప-- నాకు ఆలాగే చెయ్యవలెనని వున్నది. అయితే మన వాళ్లలో ప్యాసు అయినవాళ్ళు విస్తారంమంది లేరు. ప్యాసయినవాళ్లయితేగాని దొరలు అంగీకరించరు. అయినా నాచేతనైనంత ప్రయత్నం చేస్తాను. నిజానికి మనశూద్రులకంటె బ్రాహ్మణులలో యెక్కువమంది పరీక్షలు ప్యాసవుతారు. వాళ్ళు విస్తారం పాటుపడుతారు. వాళ్లకు తెలివికూడా వున్నది. మనవాళ్ళకు నాలుగు రూపాయలపని కావడము తోటే తాగడం మొదలుపెట్టి తిన్నగా పనిచెయ్యరు. ఏమైనా అంటే తిరగబడి మనతాళమే పట్టడానికి చూస్తారు. మంచిచెడ్డలు బొత్తిగా యెరగరు. తరువాత వీళ్లకు యెందుకు పనియిచ్చినామా అని పస్తాయిం చవలసి వస్తూవుంటుంది. ఏలాగయినప్పటికీ కులాభిమానం వుండడం విధాయకం గనుక యేలాగయినా యిఖముంది ఖాలీలు వచ్చినప్పుడు పట్టుపట్టి మనవాళ్లకే యిప్పించి వాళ్లను పైకి లెగదియ్యవలెననే వున్నది. గోవిందరావుపంతులుగారికాలంలో యెక్కడచూచినా బెండ కాయబొట్లవారినేకాని మరివకరిని ఆఫీసులోకి రానియ్యలేదు. పద్మ నాభయ్యగారి హయాంలో ఆఫీసులో అందరూ నోట్లో మూగెడేసి చుట్టలూ వారూ నియోగపరిభవులే చేరినారు. వీరభద్రయ్యగారి దినాలలో తద్దినబ్రాహ్మణార్థాలు మానివేసిన వైదీకస్వాములందరూ వుద్యోగాలలోనే ప్రవేశించినారు. ఖాదర్ సాహేబుగారి కాలంలో ఆఫీ సంతా సాహేబుల సుయమయింది. మొన్న అప్పలాచార్లగారి రోజు లలో ఆఫీసునిండా పంగనామాలవారే కనబడేవారు. ఇప్పుడు మన కాలం వచ్చిందిగనక యేతంటాలు పడిఅయినా మనవాళ్ళను ఫదిమం దిని బాగుచెయ్యడం విధి.

వెంకయ్యనాయుడుగారు — పాపయ్యా! మీరు మాట్లాడే మాటలు విని లోపలనుంచి లేచివచ్చినాను. మనవాళ్ళను యెలా గయినా వృద్ధిలోకి తీసుకురావలసినదేకాని యితరులకుమాత్రం నిష్కారణంగా హాని చెయ్యరాదు. పద్మనాభయ్యగారి కాలంలో నియోగి అని చెప్పుకోనివాడిది పాపం. సమగ్రించుకోవలసిన మంత్రిపుష్పంకూడా మహా తక్కువగానే వుండేది.

పాప. — మన కులంవాళ్ళవద్ద అటువంటిదానికి నేను యేమీ ఆశపడను. నేను వూరికే వుపకారానికే పనులు చెప్పిస్తాను. అయితే ప్యాసు కానివాళ్ళకు పనివేస్తే న్యూసెన్సువాళ్ళు వూరుకోరు. వాళ్ళ పుట్టి అంతా మునిగిపోయినట్లు యేడుస్తారు. నాకు వేపర్లు యిబ్బంది వక్కటి భాధిస్తూవున్నది. యెట్లాగయినా యీవూళ్ళో వేపరు పడిపోయే ట్లట్లు చేస్తామంటే నలుగురూ కలిసి రారు. అక్కడికీ నాశాయశక్తులా తంటాలుపడి నాతో కార్యంవున్నవాళ్ళు యెవళ్లూ చందాలు వెయ్యకుండా చేస్తూ వున్నాను. వెంకయ్యమామగారు నిలుచునే వున్నారు. యిలా నచ్చి కూర్చోండి.

వెంక — అక్కరలేదు. మళ్ళీ లోపలికి వెళుతాను. నాయనా! యిప్పుడు అనుకున్న వెర్రిపనిమాత్రం నీవు యెన్నటికీ తలపెట్టకు. నీవు తిన్నగా న్యాయంగా నడుచుకుంటే న్యూసెన్సులకు యేమీ భయపడ నక్కరలేదు. వేపరు వుంటే నిన్ను యేమిచేసింది? దాన్ని చెడగొట్టడానికి నీవు లేనిపోనివెర్రివేషాలలో దిగితే మొదలికే మోసం వచ్చి నీవే చెడిపోతావు. మనవాళ్లల్లో నీవునక్కడవు కాస్త మంచిపనిలో వుండడంచేత నీమూలంగా మాకుకూడా గౌరవంగా వుంటూవున్నది. వీళ్లమాటా వాళ్ళమాటా విని లేనిపోనివిరోధం తెచ్చుకుని ఆవున్న కాస్తగౌరవమూ చెడగొట్టకు.

పాప — యీవూళ్లో సూకలుకుర్రివాళ్ళు మహాపొగరెక్కి వున్నారు. వాళ్ళు యెంతటివారినీ లక్ష్యం చెయ్యరు. తహశ్శీలుదార్లు కూడా నాదగ్గిర జడుస్తూవుంటే వీళ్ళు భయమూ భక్తిలేకుండా నాముందర పెంకిజవాబు సవాళ్ళువేస్తారు. సూకళ్లలో ప్యాసయిన వాళ్ళు యెవళ్ళు అర్జీలు పంపించుకొన్నా థొరదగ్గరకు వెళ్లకుండా ధర ఖాస్తులు తొక్కిపెట్టి వకుడికీ పనికాకుండా చేస్తాను.

వెంక — నాయనా! అంతఘోరం యెప్పుడూ చెయ్యవద్దు. అలాచెయ్యడంవల్ల యెప్పుడో మనకే ముప్పు వస్తుంది. ఈకాలపు కుర్రివాళ్ళు కుర్రివాళ్ళుకారు. నీకంటే నాకంటేకూడా యెక్కువ ఇంగ్లీషుచదువుకున్నారు. వాళ్లకు అయిష్టం పుడితే పేపర్లలో యేకి థొరలకు మనమీంగ అసూయత పుట్టిస్తారు. వాళ్ల జోలికి నీవు యెప్పుడూ పోకు. సాధ్యమయినంతమట్టుకు నీవు పక్షపాతంలేకుండా నడుచుకుంటేనేకాని పల్లెటూళ్లలోని కరణాలూ రహితులూ వూరుకున్నట్టు పట్నవాసాలలో వాళ్లు ఝుడిసి వూరుకోరు.

పాప — అందుచేతనే వాళ్లపేరు చెపితే నాకు వళ్లుమండుకొని వస్తూవుంటుంది. జమీందార్లసమేతు నన్ను గౌరవంచేస్తూవుంటే వేలిడేసి ముండావాళ్లకు వీళ్ళకు యింతపొగరుబోతుతనంయేమి? పెద్ద మనుష్యులను లక్ష్యంచెయ్యనందుకు వీళ్ల గర్వం అణచాలనండి అందుకోనూ బ్రాహ్మణకుర్రివాళ్ళను బొత్తిగానమ్మరాదు. వాళ్ళ కొంపలు తీస్తారు.

వెంక — అది వట్టివెట్టిమాట. దుర్మార్గులు అన్ని జాతులలోనూ వుంటారు. చదువుకున్నవాళ్లలో యేజాతిలోనయినా దుర్మార్గులు తక్కువగానేవుంటారు. చదువుకున్నవాళ్ళ నక్కినయాలు కనపడుస్తూ వంగివుండగని పొగిడితక్కువవాళ్లను తెచ్చిపెడితే వాళ్లు వంగివంగి సలా

ముజేస్తూవున్నా లోపల తడిగుడ్డతో గొంతుకలు కోసి హాని చేస్తారు. నేను నీకంటెపెద్దవాణ్ని కనుక నామాట విను. మనము యింతమంచిస్థితి లో నున్నప్పుడు జాతి మత భేదం విచారించకుండా యోగ్యతవున్నప్పుడు అందరినీ సమానముగా చూడవలసినదేకాని వకరియందు కారుణ్యము వహించి వారికి అపకారం చెయ్యడానికి చూడడం యిహానికీ పరానికీ కూడా మంచిదికాదు. మనఘటాలు శాశ్వతాలుకావు. మనం న్యాయంగా ప్రవర్తించకపోయినట్టయితే మనకు కొంచెంకాలునొచ్చినప్పుడు అందరూ తలోగాయి వేస్తారు. మనం వుపకారం చేసినవాళ్లకుకూడా అపకారం కలుగుతుంది. చూచినావుకావా గోవిందరావుపంతులకు బదిలీ కావడంతోనే పద్మనాభయ్యగారు వచ్చి ఆఫీసులో వేపారిపురుగు లేకుండా యెలాయేరివేసినాడో! ఆతరువాత వచ్చిన ఖాదర్ సాహేబు నియోగులందరినీ మెల్లిగాసాగనంపి గడ్డాలసాహేబులందరినీ ఆఫీసు లో దూర్చినాడు. అటుపిమ్మట వచ్చిన మనశేషాచలంనాయుడు కొం దటు మనవాళ్ళనుచేర్చినా రంగాచార్లు వచ్చి మనవాళ్ళను గయబత్తుకు పంపి హుజూరంతా స్వాములమయం చేసినాడు. అటుతరువాత వచ్చిన నరసయ్యశెట్టి కోమట్లలో యెవ్వరూ ప్యాసయినవాళ్ళు లేకపోయినా తనభావమరిదినీ యింట్లోవంటచేసే వాణ్ణి చేర్చి పనులు యిచ్చినాడు. ఇప్పుడు నీవు వచ్చినావు. నీవు అందరినీ స్వాజనాన్ని చేరిస్తే నీతరువాత వచ్చినవాడు వాళ్లందరికీ తీసరాలు చేస్తాడు. ఇప్పుడు కాలమంతా మారిపోయింది. ఆకాశరామన్న అర్జీలు కూడా పడుతవి.

పాప — అందుకోసం యిప్పుడు యేమంటారు? మనవాళ్ళకు యెవళ్ళూ పనులు యివ్వకుండా మానుమంటారా యేమిటి?

వెంక — రామరామ. నేను ఆలావక్కనాటికి అనను. ప్యాసయి వుండీ మనవాళ్ళు తగినవాళ్ళయినయెడల వాళ్ళకే తప్పకుండా యివ్వా

వలసినది. వకరిఅన్నం అన్యాయంగా తీసివేసిమాత్రం ప్రత్యేకంగా మనవాళ్ళకు యివ్వకూడదు. పక్షపాతం చెయ్యకుండా మంచిపరీక్షలు ప్యాసయి తగినవాళ్ళు వున్నప్పుడు యితరులకుకూడా అన్యాయం లేకుండా పనులు చెప్పిస్తూవుండవలెను. ఆలాగయితే మనకు యెవళ్ళూ అపకారం చెయ్యడానికి చూడరు. పుణ్యం భగవంతుడూ సంతోషిస్తాడు. మీతండ్రిగారు బంట్రోతుపనిలోవుండి మిమ్మల్ని పోషించడానికే యెంతో కష్టపడినారు. ఆయనపోయినతరువాత మీతల్లిగారు వారినీ వీరినీ కాళ్ళుపట్టుకుని చందాలు వేయించి మీకు చదువు చెప్పించినది. ఆమె దైవభక్తివల్లనూ మంచితనమువల్లనూ మీరింత మందరికి వచ్చి నేటికాలానికి గొప్పస్థితిలోకి వచ్చినారు అంతమాత్రం చేత మీవెనుకటిస్థితి మరిచిపోయి విర్రవీగరాదు. పరులయినాకానీ యోగ్యులయితే వాళ్ళను ఆదరించి చేతనయిన సహాయం చెయ్యి. అయోగ్యులు మనవాళ్ళయినా వాళ్ళను చేరనియ్యకు. పెద్దవాణ్ణి గనుక నీక్షేమం కోరి చెపుతూవున్నాను. నామాట తోసివెయ్యకు.

పాప—సరిసరి! అంతమాట సెలవియ్యకండి. మీరంటేనాకు గురుస్థానము. సాధ్యమయినంతమట్టుకు మీరు చెప్పినట్టేనడుచుకోవడానికి ప్రయత్నంచేస్తాను. యేలాగయినా బాపనవాళ్లను పైకిరాకుండా అణిచివెయ్యవలెను. నాకు ఆఫీసువేళ అయింది. భోజనానికి లేస్తాను, తమరు దయచెయ్యండి. (అని వెళ్ళుచున్నాడు)

వసూళ్ళు.

——:o:——

[భీమేశ్వరరావుగారు, వరదారావుగారు మొదలయినవారు కూరుచుండి యుండగా హనుమంతరావుపంతులుగారు ప్రవేశించుచున్నారు.]

వర—ఏమండి హనుమంతరావుపంతులుగారు నాలుగుఘంట లకే మీాటింగని యిస్పాము చదువుచేసినారు ? యిక్కడ మిమ్మలిని యెవరూ వసూళ్లువెయ్యమని పట్టుకోరు లెండి. కొంచెం పెందరాళ్లేనే దయచెయ్యవచ్చునే.

హను — నేను మొన్న మీాయింటికి రాకపోవడం బోగంవాళ్లకు వసూలు వెయ్యబడుతుందని అనుకున్నారా యేమిటి ? యిష్టం వుంటే నేను రాకపోయినా కానీ రెండురూపాయలు పంపించలేనూ ?

వర—ఏదీ పంపించరాదూ ? వూరికే కబుర్లు చెప్పడమేకాని మీరు డబ్బు వదలరు. డబ్బుకూ ప్రాణానికీ లంకె. మీరు నిజంగా మీాయింట్లో వసూలు వెయ్యబడుతుం దనే రావడం మానివేసినారు.

హను —పోనీ అలాగే అనుకోండి. నేను వచ్చి వెయ్యకపోతే మాత్రం మీరు నన్ను యేమైనా కొడతారా యేమిటి ? నేను రాక పోయినా మీరు బంటోతు నిచ్చి భాగవతులను మా యింటికి పంపించినారే.

వర — పంపించినాకానీ మీా రివ్వలేదుగదా ? మీరు రాక పోయినా మీరు వక్కరూపాయ యివ్వకపోరన్నధైర్యంచేత మీాపేరు పెట్టి వసూలు చదివించినాను. అంతమందిలో మీాపేరున వసూలు చదివించినతరువాత యివ్వకపోతే చిన్నతనం కాదూ ?

హను—నాకు యేమీా చిన్నతనం లేదు. నేను వెళ్ళకపోయిన తరువాత వట్టి అపాత్రవ్యయం యెందుకు చెయ్యవలెను ? నేను వసూళ్లు

మంచివి కావని మానివేసినానుకాని డబ్బులక్ష్యంచేత కాదు.

వర — మీరు చేసేవన్నీ సత్ప్రాత్ర్యయాలూ ఇదిమాత్రం అపాత్ర్యయమూనాయేమిటి? స్నేహితులిని సంతోష పెట్టడానికయినా మీరు యివ్వవచ్చును. నెలకు రెండువందలరూపాయలు ఆదాయం వచ్చే మీరే యివ్వకపోతే ఇతరులు యిస్తారండీ? మిమ్మలిని చూచే తక్కినవాళ్ళుకూడా బంటోతును పంపిస్తే మొకం చాటువేసి ఇంట్లో వుండిస్నే లేదనిపించి వూరికే తిప్పుతూ వున్నారు.

హను — షదిరూపాయలూ షదిహేనురూపాయలూ జీతాలు పుచ్చుకొని కుటుంబసంరక్షణ చేసుకోవడమే కష్టంగా వుండేవాళ్ళు మీరు నెలకు నాలుగుమాట్లు మీయింటివద్ద భాగవతాలూ మేజువాణీలు కటించుకొని తేపతేపకూ రూపాయీ రెండురూపాయలూ పెట్టి తెమ్మంటే యెన్నిమాట్లూ తిప్పక యెలాగు యివ్వగలరండీ? యీ విషయంలో మీమూలంగా మీతాబేదార్లకు బహుబాధగా వున్నది. మొన్న మీగుమస్తా వకడు మీరాడించినభాగవతపువాళ్ళకు రూపాయ యిచ్చుకోలేక యివ్వకపోతే మీ రేమయినా అపాయం చేసిపోతారని యేడుస్తూ వెళ్ళాం చామంతిపువ్వు తాకట్టుపెట్టి అమ్మవారికి ముడుపు చెల్లించినట్లు చెల్లించినాడు. చిన్నజీతగాళ్లు యెంతయినా భపడుతారో వందలకొద్దిజీతాలు పుచ్చుకొనేవాళ్లకు మీకు యేమి తెలుస్తుంది? మీకంత చూడవలెనని సరదా వుంటే స్థితిగలవాళ్ళ సొమ్ము మీరే యిచ్చి ఆడించుకొని షదిమందిస్నేహితులనూ వూరికే పిలిచి సంతోష పెట్టరాదూ?

వర — స్నేహితు లందరికోసం కాకపోతే ఇది నాపక్కడికోసమే ఆడించుకొన్నా ననుకొన్నారా యేమిటి?

హను — యే స్నేహితులసమిత్తమయినా మీరు తాబేదార్లకు

చీట్లు వ్రాసి అందరినీ పిలిపించి వాళ్లచేత పనూళ్ళు వేయించడమూ, వాళ్ళు రాకపోయినా వాళ్లపేర్ల జాబితా వ్రాసి వసూలు చెయ్యడానికి మీ బంట్రోతును జతయిచ్చి పంపడమూ, మీకు భావ్యమైనపని కాదు. ఇన్నిపరీక్షలు వ్యాసై ధారలదగ్గిర గొప్పగా తిరుగుతూవుండే వారు మీరే యిలాగు చేస్తూవుండగా తక్కిన పూర్వకాలపు వుద్యోగస్థులు చేశారంటే హాశ్చర్య మేమి వున్నది ? మీరు గవర్న మెంటు వుద్యోగస్థులు గదా అన్నిరూలూ్నా యెరిగివుండిన్నీ యిలాగంటి అక్రమములు చేస్తూవుంటే మీకు యెప్పుడయినా మాటరాదండీ?

వర — మొన్నటిభాగవతం నేను ఆడించినాను అనుకుంటూ వున్నారా యేమిటి ? రాణీగారు పుట్టినదినమని రాజభక్తి కనపర్చడం నిమిత్తమయి పద్మనాభంగారు భాగవతం ఆడించతలచి వారియింటి కాడ స్థలం లేకపోవడంచేత మాయింటికాడ ఆడించినారు. చూచినారు కారూ చీట్లలో యెవరు దస్కతు చేసినారో!

హను — చాలు చాలు యీపాటి యీదొంగవేషాలు చాలించండి. వూళ్ళో అందరూ మీరు ఆడించినా రనుకుంటూవున్నారా? పద్మనాభంగారు ఆడించినా రనుకుంటూవున్నారా?

వర — వాళ్ళు యేమనుకుంటే యేమి? చీట్లు వ్రాసి ఆడించినది పద్మనాభంగారు. ఆయనకు సహాయం కావలెనంటే నలుగురు బంట్రోతులను నేను యిచ్చినాను.

హను — మీవేషాలన్నీ నాకు తెలుసును. మొన్నవచ్చి యిచ్చినవాళ్లందరూ మిమ్మలిని జూచి యిచ్చినారుకాని పద్మనాభగారిమొగం చూచి వక్కరూ యివ్వలేదు. మంత్రిసానిదగ్గిర మగ్గం దాస్తారా యేమిటి? తల్లిపుట్టిల్లు మేనమామచద్ద దాచినట్లు మీరు భాగవతులను పిలిపించి మాయింటికాడ రేపు ఆడిస్తామని చెప్పడమూ

పద్మనాభంగారిచేత చీట్లు వ్రాయించడమూ మన స్నేహితులను నలుగురినీ తప్పకుండా రమ్మని పిలవడమూ అన్ని యెత్తిగిన నాదగ్గిర కూడా మీరు యిలాగు మర్మం పెడుతూవున్నారు. పూర్వపువా ళ్ళంతా మంచివాళ్లు కారని ఆక్షేపిస్తూ మే మేమో ఇంగ్లీషు చదువు కున్నవారమూ న్యాయముగా ప్రవర్తించేవారమూ అని చెప్పుకునే మనమే యితరు లంతా నవ్వేటట్టుగా మనం చెయ్యరానిపనిని పకరి పేరు పెట్టి చెయ్యడమూ మన తాబేదార్లచేత వాళ్లకు చందాలు వేయించడమూ యేమి న్యాయము ? ఇదేనా మననాగరికతాలక్షణము?

వర — మీరు మహాఆక్షేపిస్తూవున్నారు. అది వకరికి వుపకా రంచెయ్యడంగాని లంచాలు పుచ్చుకోవడం కాదులెండి. ఇందులో తప్పితం యేమివున్నది?

హాను — తప్పితం యేమీ లేకపోయినట్టయితే చీట్లు మీపేరు పెట్టి యెందుకు వ్రాయించినారుకారు? నామతానికి యింతకంటె లంచమే బాగా కనుపడుతూవున్నది. అక్రమమయినా తనకు యేదైనా వుపకారం కలిగితే లంచంయిచ్చేవాడు సంతోషిస్తూయిస్తాడు. ఆ లం చాలు పార్టీలవగ్గిరనేకాని గుమస్తాలదగ్గిర పుచ్చుకోవడం వుండదు. ఈలంచం మన పయిఅధికారిగనుక యెప్పుడు యేసంకబెట్టి యెందులో నోక్కుతాడో అనేభయంచేత వచ్చేఫదిరాళ్ళూ తిన్నగా మూసగ్రాసాని కయినా చాలక తంటాలుపడే గుమస్తాలు యేమిస్తూ విధిలేక యిస్తారు. ఇంతకంటె యీలంచానికీ ఆలంచానికీ నాకు అంతగా భేదం కనపడడం లేదు. మీరు తాబేదార్లజోలికి పోక స్నేహితులకు పన్నుకడుతూ వున్నారు. దానితో తృప్తిపొంది వూరుకోరాదా?

వర— ఇది పన్నువంటిదా? దీనిలో స్నేహితులను యెవర యినా యిస్తేనేకాని వల్లపడదని నిర్బంధపెడుతూ వున్నానా? వకర

రిచ్చుకోవడం కష్టంగా వుంటుందిగనుక స్నేహితులు నలుగురూచేరి చందాలు వేసుకొని యెవరికీ ఆయాసం లేకుండా వేడుక చూడడం వంటిదికాదా ?

హాను—ఇందులోనూ కావలసినంత నిర్బంధంవున్నది. సర్కారుపన్ను అయినా రూపాయకు తక్కువవుంటుంది కాని, యెంతబీద వాడయినా మీపన్ను రూపాయకు తక్కువ వుండదు. నిర్బంధంలేక పోతే ముందుగా చీటిలోనే రూపాయకు తక్కువకాకుండా యిచ్చేవారే రావలసినది కాని తక్కినవారు రానక్కరలేదని స్పష్టంగా వ్రాస్తే యెంతబాగావుండును ? మహోదయవున్నట్టుగా వినోదంచూడడానికి స్నేహితులను పిలిచినట్టుగాపిలిచి తీరారావడంతోటే తప్పించుకపోవడానికి వల్లకాకుండా పద్దువెయ్యడానికి కాగితం చేతికిచ్చి భాగవతపువాళ్లచేత మీపేర్లుచెప్పి నూటపదహార్లు వట్టిదే పొలంకేకలు వేయించీ యివ్వకుండాపోతే నలుగురిలోనూ చిన్నతనంగావుండేటట్టు చెయ్యడముకంటె నిర్బంధమే నయము. మీయింట్లో వేడుక చేస్తే యిష్టంవున్నా లేకపోయినా మీతాబేదార్లు ఫదిమందీవచ్చి చచ్చినట్టు రూపాయి రూపాయీ సమర్పించి పోవలెను. బక్కవాళ్ళయింట్లో యెవరియింట్లో నయినా యీవేడుకే జరిగితే మీరు వారియింటికి వెళ్ళడమే పరువు తక్కువని భూరుకుంటే చచ్చినట్టు సొమ్మంతా వాళ్లే యిచ్చుకోవలెను. ఈవేడుకంతా మీకు డబ్బుఖర్చుకాకుండా, పేరు మీకు దక్కడానికి వచ్చింది. నిజంగా వేడుక యితే యిదివరకు యీవూళ్ళో జరుగుతూ వున్నప్రకారం టిక్కెట్లుపద్ధతి పెడితే యెంతబాగావుంటుంది. అప్పుడిష్టంవున్నవారు డబ్బిచ్చి చూస్తారు. తక్కినవారు మానుతారు. మీరు మహాపెద్దలంతా బయలుదేరి యీ మంచిపద్ధతి చెడగొడుతూ వున్నారు.

వర—పోనియ్యండి పంతులుగారు వచ్చినారు. లెక్చరు ఆగంభం అవుతుంది. యీపాటి యీఉపన్యాసంగం చాలించండి.

(అని చాలించుచున్నారు.)

——:0:——

[పరమేశ్వరయ్యగారిసోదరిలో వాసుదేవసోమయాజులుగారును భానుమూర్తి దీక్షితులుగారును, సోమనాధశాస్త్రిగారును, కామావధానులు గారును ప్రవేశించుచున్నారు.]

పర—ఏమండీ సోమయాజులుగారూ ! మీరు యేలాగైనా యీవిషయంలో సహాయం చెయ్యవలెను. మాఅమ్మాయిని తనకో మారుడికి చేసుకోవడానికి నారాయణమూర్తిగారినికూడావప్పించినాను. మీరు కాస్త అభ్యంతరంలేదని అందరూ చెబవిస్తే రేపు చైత్రిమాసంలో వివాహకార్యం అయిపోతుంది.

వాసు—ఇందులో నేనువక్కణ్ణే స్వతంత్రిణ్ణిగాను. పెద్దలు భానుమూర్తిదీక్షితులుగారు వున్నారు. ఇక శాస్త్రులుగారు సరేసరి. అవతల కర్మజ్యేష్ఠులు కామావధానులుగారు వున్నారు. వారందరూ వప్పుకుంటే నాఅడ్డం యేమీలేదండి. నేను యెప్పుడూ మీచెలపకు బద్ధుణ్ణే—ఏమండీ దీక్షితులుగారు ! మీరు చెలవియ్యండి.

భాను—నేను మీకంటె యెక్కువవాణ్ణాయేమిటి ? మీకంద రికీ సమ్మతమయితే నాకూ సమ్మతమేను—ఏమండి సోమనాధశాస్త్రి గారూ ! మీరు మాట్లాడక వూరుకున్నారు ?

సోమ—నామాటకేమి ? శాస్త్రంలోవున్నది నేను కనపరు స్తాను. ముందుగా మీఅందరి అభిప్రాయాలూ చెప్పండి.

కామా — అదుగో సోమనాధశాస్త్రిగారు శాస్త్రంచదివిన వారుగనుక వక్కముక్క అడ్డంవేసినారు. ఆయనయెలాగూ లవుక్యం యెరిగినవారు. యెంతయు కిగామూడినారో చూడండి. మనమంద రమూ శుద్ధవైదీకం చేసినాము. ఆయన మనస్సులో అభిప్రాయం యెవరికైనా తెలిసిందేమో చెప్పండి.

పర — శాస్త్రుల్లుగారూ ! మనశాఖవారు మీరే అడ్డంపెడుతూ వున్నారుయేమిటి ?

సోమ — రామరామా' నేను యేమీ అడ్డం చెప్పలేదు. శాస్త్రంలో వున్నమాటలు యేమిటో నన్ను అడిగితే నేను చెపుతా నన్నాను. మీరు మీపిల్లదాన్ని మీ మనసువచ్చినవారికి వివాహం చెయ్యండి. నా అభ్యంతరం లేదు.

కామ — అవునయ్యా శాస్త్రిగారూ! ఇదివరకు యెన్నడైనా ముతకినాటివారికీ వెలినాటివారికీ సంబంధాలు వున్నవషయ్యా ?

సోమ — ఇదివరకు యెప్పుడూ లేకపోతే ఇప్పు డుంచవి. ఇచ్చే ముతకినాటివారికి అభ్యంతరం లేకపోతే పుచ్చుకోవడానికి వెలినాటి వారికి యేమిఅభ్యంతరం వుటుంది?

భాను — యేమి అలాగు అంటూవున్నావు? నీవు ముతకినాటి వాడవుగనుకనా అభిమానంచేత వెలినాటివారికంటె ముతకినాటివారు మహాయెక్కువఅని మమ్మలిని మహాతృణీకరించినావు! ఇప్పుడు విచా రించే ప్రభువు వుంటే వెలినాడు యెక్కువో ముతకినాడు యెక్కువో వక్కనిముషంలో తేలుతుంది.

సోమ — విచారించేవారుంటే నాకూసంతోషమే. నిజం బయ లుపడక మానదు.

పర — ఇందులో యెవరూయెక్కువగారు. ఉభయులూ సమా

ను లే వూరుకోండి.

సోమ—ఆలాగంటే నేను యెందుకు వప్పుకుంచాను ? మురికి నాటివారు తప్పకుండా శ్రేష్ఠులు. వెలినాటివాళ్లు వెలివాళ్ళు. వాళ్లతో సంబంధంచెయ్యడంమాట అటుండగా అసలు పంక్తిభోజనాలే చెయ్యరాదు. గుట్టుగా వూరుకుంటేనేతప్ప కదిలిస్తే అందరిలోపాలూ పైకి వస్తవి.

భాను—నీపాండిత్యం యేడిసినట్టేవున్నది. ఇన్నాళ్ళూ చదువుకుని వెలిశబ్దానికి ఇదా నీవుచేసిన అర్థం ? వెలిఅంటే తెలుపు అర్థము. అనగా స్వచ్ఛమైనవారని తాత్పర్యము. ఈదేశములో స్వచ్ఛమైన బ్రాహ్మణులు యెవరైనావుంటే వెలినాటివారేకాని మరివకరు కారు. మీ మురికినాటివాళ్ళు యెందుకూపనికిరాని నిర్భాగ్యులు. వాళ్లుపాపాత్ములు. అందుచేతనే వాళ్ళను నల్లనిముఠకితో పోల్చినారు. సంస్కృతములో పంకంఅంటారు. పంకం అనగా పాపంఅర్థం. అందుచేత మురికినాటివాళ్ళు వట్టి పాపాత్ములు. వాళ్ళతో పంక్తిభోజనాలు చెయ్యరాదు.

సోమ — ఛీ ఛీ ! శాస్త్రం తెలిసినవాణ్ణి నేనువుంచూవుండగానే నాముందర పదాలికి ఇటువంటి అపార్థాలు చేస్తూవున్నావు ? యెవరైనా సదసుడైన ప్రభువుండి సభ చేయించినట్టయితే శబ్దార్థ విచారముచేసి నిన్ను చెప్పుతీసుకుని కొట్టింతును.

భాను—శాస్త్రమని కుండలాలు వేసుకుని తిరగడంతోటే సరి అనుకున్నావాయేమిషి ? మేమంతా వూరుకుంచూవుంటే నీఆటలు సాగుతూవున్నవి. నిజంగా నేనే శబ్దార్థవిచారం చెయ్యడానికి ఆరంభిస్తే నీవూ నీగురువూకూడా కుండలాలూ శాలూలజోడూ విడిచిపెట్టి తోకతెంచుకొని పారిపోవలెను. నీవు లుచ్చావుగనుక నాతో అర్థ

విచారం చెయ్యకే కారుకూతలు కూస్తూవున్నావు.

పర__ దీక్షితులుగారూ ! మీకు నమస్కారం చేస్తాను. నా మాట విని కోపం చెయ్యక శాంతించండి. శాస్త్రులుగారూ ! మీరు కూడా కొంతశాంతం అవలంబించవలెను. వీరిలో ముడికినాటివారి యెక్కువాలేదు. వెలినాటివారితక్కువాలేదు. నాడు అంటే దేశమని అర్థము. వేగినాటివారూ, వెలినాటివారూ, ముడికినాటివారూ, కాసర నాటివారూ, వీరంతా వేరువేరు దేశాలలోవుండే బ్రాహ్మలేకాని అంతకంటె వేరేయేమీభేదంలేదు. ఇప్పుడు పలానాడుఅంటే చేగలానాడు అంటే తాలూకాలపేర్లు చూడడంలేదాయేమిటి ? వెలినాడంటే తెలనేలగల తాలూకావారనీ, ముడికినాడంటే బురదనేలగల తాలూకావారనీ, మొట్టమొదట అర్థమెవుంటుంది. పూర్వం యీనాళ్లభేదాలులేకుండా వకరితో వకరు వివాహాలు చేసుకొనేవారు. అటుతరువాత యితర దేశాలవారితో సంబంధాలుచేస్తే తల్లిదండ్రులు తమకూతుళ్లను తరుచుగా చూస్తూవుండరని ఇతర దేశాలవారితో యిచ్చిపుచ్చుకోవడాలు మానివేసినారు. ఇప్పటిమల్లే అప్పుడు రోడ్లు మొదలైనవి లేకపోవడంవల్లనూ దోవలో దొంగలభయమూ ఘాతుకమృగముల భయమూ విస్తారంగా వుండడంవల్లనూ పూర్వకాలాలలో దూరదేశాలవారితో సంబంధాలు చేసేవారుకారు. అంతేకాకుండా పూర్వం యేదేశాన్నుంచో వకకంసాలి బ్రాహ్మణ్ణిఅని పేరుపెట్టుకొనివచ్చి యేలేశ్వరపు పుపాధ్యాయులకూతురిని పెళ్లి ఆడినట్టునూ, అటుతరువాత నిజం తెలిసి వాణ్ణి వెళ్లకొట్టివేసి యిఖముందు వకదేశంవారితో వకదేశంవారు సంబంధాలు చెయ్యకూడదని కట్టు యేర్పరచినట్టునూ, అప్పటినుంచే యీనాడిభేదాలు యేర్పడినట్టున్నూ, పెద్దలు చెపుతారు. ఇప్పుడు అటువంటి యిబ్బందులు యేమీలేవు. దూరదేశాలలో వుండే

కుండా మనమంతా యిప్పుడు వక్కడేశంలో వుండడంచేత అంద రమూ వక్కనామువారమే అయినాము. అందుచేత మనం తప్పకుండా సంబంధాలు చేసుకోవడం ఆరంభించవలసిందే.

సోమ—— ఏయిబ్బందులు లేకున్నా లౌకికపుయుక్తులు యెన్ని చెప్పినా శిష్టాచారం మీరడానికి నేను యెంతమాత్రమూ వప్పుకోను. యీవివాహం చేయిస్తే నేను మీయిద్దరినీకూడా స్వాములవారికివ్వాసి వెలి వేయిస్తాను. పూర్వాచారం మీరడానికి యెవరితర మవుతుంది? మనపూర్వులు బుద్ధితక్కువవాళ్ళనూనా మనం మహాబుద్ధిమంతుల మనూనా అయినామా?

పర—ఏమండి శాస్త్రులుగారూ! మీరు ఆలాగు సెలవిస్తారు? యీనాడులభేదం శాస్త్రాలలో యెక్కడైనా వున్నదండీ?

సోమ—లేకపోతే మానేను శిష్టాచారం ముఖ్యమని వున్నది.

భాను—అవును శిష్టాచారం మీరడానికి నేనూ వప్పుకోను. మురికినాటివారిపిల్లదాన్ని మావాడు యెట్లాచేసుకుంటాడో చూతాం కాదూ? నిజంగా పెళ్లి చేసుకుంటే వారింటికి వక్కడు భోజనానికి వెళ్ళడు. స్వాములవారికి వాసి బహిష్కారపత్రిక తెప్పించకపోతే నేను బ్రాహ్మణ్నే కాను.

పర — మీరు కోపం మానిబాగా విచారించండి. యీ సంబంధాలు లేకపోవడంచేత చాలానష్టాలువున్నవి. యిప్పుడు నామట్టుకు చూడండి. నేను రెండువందల రూపాయలు జీతం తెచ్చుకుంటూ వున్నాను. నాకు ఫదివేలరూపాయలస్థితి వున్నది. మా అమ్మాయి గరల్సునూళ్లలో చదువుకుని మంచిబహుమానాలు పొందినది. మంచి చక్కనిది. యెంతమాగం విచారించినా మురికినాటివాళ్లలో అంతా బ్రాహ్మణార్థాలు చేసేవాళ్లేకాని వక్కడూ నాలుగుముక్కలు

ఇంగ్లీషు చదివినవాడూ పరీక్ష ప్యాసయినవాడూ కాస్తస్థితికలవాడు కనపడడు. నారాయణమూర్తిగారికీ నాకూ ప్రాణస్నేహము. ఆయన కొమారుడికీ యెక్కడా మంచిసంబంధం దొరకక తంటాలుపడుతూ వున్నాడు. కొమారుడు చక్కనివాడు. ఇంగ్లీషు చదువుకుని రెండు పరీక్షలు ప్యాసయినాడు. తండ్రికి నూరురూపాయలపని. ఆపిల్లవాడికిస్తే మాచిన్నదానికిస్తే వకరిని వకరు వివాహం చేసుకోవలెనని యెంతో అభిలాష వున్నది. ఇలాగంటిస్థితిలో యీసంబంధ మయితే యెంత బాగావుంటుంది? యిందులో యెవరికి నష్టం వున్నది?

సోమ—నష్టం లేకపోతేమాత్రం కులం చెరుపుకుంటారషయ్యా? మాలచదువు ఇంగ్లీషు యిప్పుడు వచ్చినది. యివ్వాలెనంటే మీచిన్న దాన్ని మాపిల్లవాడి కియ్యరాదు? వాడు బ్రహ్మచర్యం చేస్తూ వేదం చదువుకుంచూ వున్నాడు.

భాను— తనకొడు క్కంత మంచిసంబంధం కావలిస్తే నారాయణమూర్తిగారు నారెండోకూతురిని చేసుకోరాదూ ? దానిది యెంత శ్రోత్రియసంప్రదాయం ? యెంతఆచారవ్యవహారాలు తెలిసిన పిల్ల ! అది చిన్నతనమైనా రోజూ అయిదుస్నానాలు చేస్తూ తల్లి కంటెనూ ఆచారంగలది అనిపించుకుంచూ వున్నది. దాని మేనమామ యజ్ఞం చేసినాడు. నేను ఆధానం చేసినాను.

పర—ఈసంగతి తరువాత చూచుకుందాముకాని మీరు యీ సంబంధం వప్పుకుంటే సభవారికి మంచికట్నము యిచ్చుకుంటాను. మీరు అందరూ చక్కగా ఆలోచించుకొని రేపు వచ్చి యెదోజవాబు చెప్పండి. కచేరీవేళ అయింది వెళ్ళుతాను. (అని వెళ్ళుచున్నాడు.)

వాసు — ఓరీ మీ దెబ్బలాటలుమాని మన కందరికీ తలో ఫదిరూపాయలసొమ్ము చేతులో పడుతుంది. వప్పుకుందాము పట్టండి.

సోమ—నాకు రెండువందలరూపాయలు యిస్తే నేను వప్పుకుంచాను.

భాను—నాకు అయిదువందలరూపాయలు యిస్తే నేను వప్పుకుంచాను.

సోమ—నీయెక్కువ యేమిటి? నీకు అయిదువందలు యిస్తే నాకూ అయిదువందలు కావలెను.

భాను—నాకు యెక్కువ లేకపోతే నేను వప్పుకోనే వప్పుకోను. నేను వెళ్ళిపోచాను. (అని లేవఁగా అంగఱును పడుచుచున్నారు.)

హాస్యసంజీవిని

ద్వితీయభాగము.

వేశ్యావిషయసంవాదము.

[వేశ్యాప్రియురాలుగారును, విరాగాచార్యులుగారును ప్రవేశించుచున్నారు.]

వేశ్యా—ఏమయ్యా విరాగాచార్యులూ! యీవూళ్ళోవాళ్ళ స్థితి అంతా బొత్తిగా వెర్రిలో పడిపోతూవున్నది. ఎవళ్ళో బోగముమృత్తి అక్కరలేదన్నారట! అటువంటి విపరీతం పుడుతూవుంటే పెద్దమనుష్యులు మీవంటివాళ్లంతావుండి వాళ్లకు తగినబుద్ధి చెప్పకుండా వూరుకోవడం మీకు న్యాయమనే తోచినదా?

విరా—వేశ్యలను వృద్ధరించడానికి నీవంటి మహాపెద్దలంతా కయ్యానికి కత్తికట్టుకొని నిలబడుతూవుండగా మావంటి బక్కవాళ్ళు యేమిచెయ్యగలరు? యెవరికిబుద్ధిచెప్పినా యేకార్యము సాధించినా మీవంటి అసహాయశూరులు చెయ్యనలెనుగాని మాచేత యేమీ కాదు.

వేశ్యా—కర్రిలుపుచ్చుకొని దెబ్బలాడమంటే మీచేతగాదు గాని లోకోపకారంగా నోట్లోవున్నవి నాలుగుమాటలూ అని యీ మాత్రపు వాక్సహాయం చెయ్యలేరటయ్యా! పూర్వాచారం నిలవబెట్ట డానికే అక్కరకురాకపోతే అవతల మీచనువంతాయెందుకు? తగల బెట్టనా?

విరా—మాపెద్దల బుద్ధితక్కువచేత నాకు నాలుగుముక్కలు చనువుచెప్పించినారు. ఆనాలుగుముక్కలూ కడుపులో పడడంచేత

నాకుకూడా వేశ్యావృత్తి మంచిదికాదనే తోస్తూవున్నది.

వేశ్యా—యేమిటీ? నీకుకూడా ఆమమ్మబ్ధేపుట్టినదీ? ఇదంతా కలియుగమహాత్మ్యం. వినాశకాలే విపరీతబుద్ధి అన్నట్టు చెడిపోయేకాలానికి మీకందరికీ యిటువంటి విపరీతపువూహాలు పుడుతూవున్నవి. యిగా వెధవయింగ్లీషుదొరతనం కాకపోతేనా—

విరా—ఏమయ్యా ఆలా పళ్ళికొరికివేస్తూవున్నావు? నన్ను కొడతావాయేమిటి?

వేశ్యా—నేను కొట్టేస్థితిలోవుంటే బోగంవారికి వ్యతిరేకంగా యిటువంటి అవ్యక్తపుసంగం యెందుకు చేస్తారు? బోగంవృత్తి మంచిది కాదనేవాళ్ళనుచూస్తే నావళ్ళు భగ్గున మండుకొనిపోతుంది. ఆసౌఖ్యం వాళ్ళకు యేమి తెలుస్తుంది? నపుంసకుడికి రంభతో యేమి ప్రయోజనము? ఇదంతా కాలమహాత్మ్యం. యీపాపిష్టికాలంలో యేమి చెయ్యడానికీ వల్లకాదు. యీ యింగ్లీషుప్రభుత్వం లేక మునుపటిదినాలు యీ కాళ్ళనొప్పులు లేకపోయినట్టయితే కర్రిపుచ్చుకొని యీ వాదాలు చేసేవాళ్ళందరినీ పడగొడుతును. దిక్కుమాలినవైద్యుడు సవాయిరోగానికి మంచుయిమ్మంటే రసం పెట్టడంచేత కాళ్లు పడిపోయినవి. వంటినిండా కంతులుకూడా బయలుదేరుతూవున్నవి. యెన్నాళ్లను నమ్మినా వైద్యంచేసేగాడిదకొడుకులనుమాత్రం యెంతమాత్రమూ నమ్మరాదు. ఉస్సిస్సి రామ రామా! యెంతబాధగా వున్నదీ?

విరా—అవును. తమరు చెప్పినట్టు తమవంటి అనుభవశాలులకుగాని ఆసౌఖ్యం తెలియదు. మీరు అనుభవించే లోపలిసుఖం యేమీ తెలియక వూరికే పయిస్థితిచూస్తే మావంటివాళ్ళకు భయం వేస్తుంది. మీరు కాళ్ళనొప్పులచేత కాబోలును బాధపడుతూ వున్నారు.

వేశ్యా—వెధవనోప్పులు నాకు యీనోప్పులు లక్ష్యమటయ్యా! పచ్చ సెగచేత లోపల కొంచెం పోట్లుపొడిచేటప్పటికి చుట్టుమని రామ రామా అన్నాను. సెగరోగంఅంటూకాని అది వంటికి మెరుగు తొస్తుంది. నేను బోగం రత్నంయింటికి వెళుదామని మెల్లిగాలేచి కర్రి పుచ్చుకొని వీధిలోకిబయలుదేరివచ్చినాను. బండగాడిదకొడుకు యింకా వచ్చినాడుకాడు. దానిమొగంచూస్తే యీనోప్పులూ గిప్పలూ అన్నీ వకక్షణంలో మంత్రించినట్టు మాయమయిపోతవి. బోగంవాళ్లసొఖ్యంఅంటే అనుభవిస్తూవున్న మాకు తెలియాలిగాని మీరు యేమి తెలుస్తుంది? ఇది మాటలతో చెపితే బోధపడేదికాదు.

విరా—అవును. తమరు సెలవిచ్చినమాట సత్యము. వకక్ష సెగ మాత్రమేకాదు. అన్నిరోగాలూకూడా వంటిని జీర్ణిస్తే బహుమంచివి. వాటివల్ల భగవద్భక్తికూడా కుదురుతుంది. చుకుచుకుకున ఇప్పుడు పోట్లుపొడవబట్టిగాని లేకపోతే మీరు లక్షవరహాలిచ్చినా రాను కామా అనేవారా? చిలుమువదలితే చీడ వదలుతుందని చిన్నతనంలో మీ వలెనే వేశ్యలతోతిరిగేవా రనేకులు పెద్దతనం వచ్చినతరువాత డబ్బు వూడి పరమభాగవతోత్తములై తులసిపూసలతావళాలు వంటినిండా వేసుకుని హరిభజనచేసుకుంటూ వుండడం నేను కళ్ళారాచూచినాను.

వేశ్యా—మీరు చెప్పేమాటలు మమ్మలిని వేళాకోళాలు చేస్తూ వున్నట్టున్నవి. అడుగో మాఅబ్బాయి వస్తూవున్నాడు. వాడు కావలిస్తే మీకు కావలసినన్నిసమాధానాలు చెపుతాడు. నేను వీణ్ణి పెంచుకున్నాకానీ, యీకాలపువాళ్లకుమల్లే వివరీతబుద్ధులు లేక మంచి వాడు దొరికినాడు. వీడు ఫస్టుఆర్ట్సు ప్యాసయినాడు. పట్టుమంచే నాలుగుముక్కలు రాని సూక్ష్మలువెధవలకుమల్లే వీడు బోగంవాళ్ళు మంచివాళ్ళు కారని యెప్పుడయినా అంటాడేమో చూడండి. యెందుకు

వెధవచచ్చు ? గుణం ప్రధానంకాని చచ్చువు ప్రధానం కాదు. మా రత్నానికి వీడంటే ప్రాణము. దాని వదినెగారికూతురికి వీడిచేత కన్నెతీకం చేయించి జమీందారీవెళ్ళిలాగు వైభవం జరిగించు మని పోరుతూ వున్నది. నేనే చేతులో డబ్బులేక వెనుకా ముందూ తటపటా యిస్తూ వున్నాను. యీవూళ్ళోడబ్బుగలముండాకొడుకులు ఇంతమంది వున్నారు. నక్కలంజెకొడుకయినా వెయ్యిరూపాయలు బదులుయివ్వ మంటే ఇవ్వకుండా వున్నాడు. వాళ్లకు ఆస్తి చూపించవలెనట. వెయ్యిరూపాయలు ఇటువంటి సత్కార్యంలో పడితే వాళ్లకు దండుగ వస్తుందా యేమిటి ?

విరా—లోకంలో యెవరికీ ఆనూత్రించివేకం లేదండి. మీకు సంతానం లేక పెంచుకోవలసిన అదృష్టం పట్టకూడా బోగందాన్ని వుంచుకోవడంవల్ల కలిగినఫలమే కాబోలును.

వేశ్యా—చేప్పినమాట మీరు గ్రహించలేరు. మీరదగ్గిర యే మయినారసికత్వంగవుంటే బోగంవాళ్లలో వుండేసారం మీకు తెలుసును. యేమీ తెలియనివాడితో మాట్లాడుతూ వుండడానికి నాకు ఓపిక లేదు. నోరుకూడా నొప్పిపెడుతుంది. అదుగో బండి వస్తూవున్నది. అది నాకోసం యెదురుచూస్తూవుంటుంది. వేగిరంవెళ్లవలెను. మీకు యేమయినా సందేహాలు వుంటే మాఅబ్బాయి తీరుస్తాడు. ఓరీ శంకరయ్యా ! యుక్తులు నాలుగుచెప్పి యీఆచార్లను నోరుయెత్తకుండా చేసి పంపివెయ్యి. బోగంవాళ్లను వుంచుకోవడంచేత నాకు సంతానం కలగలేదని యెత్తిపొడిచినాడు. కుయుక్తులు చెప్పి ఇలాగంటివాళ్లను నోరు యెత్తకుండా చెయ్యడానికి స్కూళ్లలో చదువుకునేవాళ్లే సరి.

శంక—మంచిది మీరు వెళ్లండి. రత్నం మీకోసం కనిపెట్టుకు వుంటుంది. అది నావిషయమయి మీతో చెప్పినసంగతి బాగా

ఆలోచించవలెను సుమండీ. మనకు డబ్బు వచ్చినప్పుడు కార్యం రాదు. మీకు యెక్కడా ఋణం పుట్టకపోతే అమ్మమెడలో కాసులపేరు యేదో మూయోపాయం చేసి పుచ్చుకోలేరూ ? స్త్రీలవిషయంలో అబద్ధం ఆడితే దోషం లేదని శుక్రాచార్యులవారు ,,వారిజాక్షులందు వైవాహికములందు ..... బొంకవచ్చు నఘము పొందదధిప'' అని శ్రీమద్భాగవతంలో చెలవిచ్చి వున్నారు. తరువాత మాట్లాడుదాము మీరు పోయి రండి—ఏమయ్యా ! విరాగా చార్యులూ ! బోగంవాళ్లను వుంచుకోవడం తప్పని మా నాయనగారితో వాదం చేసి ఆయనకు సంతానం కలుగ లేదని ఆక్షేపించినావుటయ్యా! బోగంవాళ్లను వుంచుకోవడంవల్ల లక్షలాభాలు వున్నవి. అందులో ఇది వకటి. అందరికీ సంతానం కలిగి జనం అభివృద్ధి అవుతూ వుంటే యీభూమిమీద పండే పంట వాళ్ళతిండికి చాలక కరువులు వచ్చి అందరూ చావవలసివస్తుంది; లేకపోతే దొంగతనాలు మొదలైనవి వృద్ధిఅయి తిండికోసం వకళ్ళ తలకాయలు వకళ్ళు బద్దలుకొట్టుకుంటారు. బోగంవాళ్లను వుంచుకోవడంచేత పెళ్ళానికి సంతానం కలుగక జనం తక్కువైపోయి యిటువంటి గొప్పఆపదలు నివారణం అవుతవి.

విరా—నీవు చెప్పినయుక్తి బహుబాగా వున్నది. నీవు కష్టపడి చదువుకొని పరీక్షలు ప్యాసైనందుకు నీబుద్ధిని బహుబాగా వుపయోగిస్తూవున్నావు. మనదేశంలో వున్నభూమిఅంతా సాగుబడిచేసినట్లయితే, ఇఖ మూడింతలుజనం వృద్ధిఅయినా మనదేశంలోపంట మనకు సరిపోయి ఇతర దేశాలకుగూడా యెగుమతీ చెయ్యవచ్చును. మీరు లోకోపకారం నిమిత్తం యీకార్యం చేస్తూవున్నా మంటారుగాని చేసుకున్న భార్యలు వడేళ్లోభకు మీరు యేమిసమాధానం చెపుతారు?

శంక—అముండలు వోరవలేక యేడిస్తే మనము యేమి చేయ

గలము ? పరులకు సుఖం కలిగిపోతుం దని యేడిచేవాళ్ళు యెప్పుడూ దుఃఖపడుతూనే వుంటారు. అది వాళ్ళగ్రహచారం.

విరా—అంతేకాని పెళ్ళి చేసుకున్న భార్యలను సుఖపెట్టడం మనకు ధర్మం కాదు ?

శంక—మనకు యెంతమాత్రమూ ధర్మం కాదు. మనయిష్టం పుచ్చుకోకుండా పెద్దవాళ్ళు స్వతంత్రించి తమయిష్టం వచ్చినవాళ్లను మనకు కట్టిపెడుతూ వుంటే ఆముండలసుఖంకోసం తంటాలుపడడం మనకు ధర్మమా ? పెద్దపిల్లలను తీసుకువచ్చి మనతో మాట్లాడిస్తే మనం ఇష్టం వుంటే చేసుకుంటాము లేకుంటే మానుతాము. నా పెళ్ళాము అనాకారికదా నేను పుణ్యానైనా సుఖం అనుభవించకుండా పెళ్ళిఆడినా నని ఆముండతో యెల్లకాలమూ యేడుస్తూ కూర్చోనా?

విరా—నీవు పెళ్ళినాటికి చిన్నవాడవా చితకవాడవా ? ఇరవై యేళ్ళు పైకివచ్చి అనాకారిగా వున్నట్లుతోస్తే పెళ్ళినాడే నాకు యీ పెళ్ళాము యెందుకు వద్దన్నావుకావు ? అప్పు డేమో మహోయిష్టం వున్నవాడివలె తలవూచి పెళ్ళిఆడి తీరా ఇప్పుడు తల్లినీ తండ్రినీ బంధువులనూ అందరినీ వదిలిపెట్టి అన్నిటికిన్ని నిన్నే నమ్ముకునివచ్చిన ధర్మపత్నికి ద్రోహం తలచి యిలా తిరగడం పాపం కాదా ? పెళ్ళి కాలంలో అగ్నిహోత్రసన్నిధానమందు చేసిన ప్రమాణాలన్నీ వ్యర్థమేనా ?

శంక—ప్రమాణాలు యెవరు చేసినారు ? మాపౌరోహిత్యుడు సంస్కృతములో యేమి చదివినాడో యేమియేడిసినాడో నా కేమి తెలుసును ? నాకు తెలియని దేమో మీలోమీరు చదువుకుని దాని ప్రకారం నన్ను నడవమంటే నేను యెందుకునడుస్తాను ? బోగంజాతి యేర్పరిచిన మనపూర్వులందరూ బుద్ధిహీను లనుకునారా యేమిటి ?

మన పూర్వులంతటిబుద్ధిమంతులు యెవరూ లేరని యూరోప్రలోవుండే గొప్పపండితులుకూడా వప్పుకుంటూ వున్నారు. యెవళ్లకూ అక్కరకు రాకపోతే మనవాళ్ళు బోగంవాళ్లను యెందుకు చేసినారు ?

విరా—మీవంటి మహానుభావులు ముందుపుడతారని తెలిసే చేశారుకాబోలును. వాళ్లను మీవంటి గృహస్థునిమిత్తమేనా బ్రహ్మచారులనిమిత్తమూకూడా చేసినారా ?

శంక — అందరినిమిత్తమూకూడా చేసినారు. బ్రహ్మచర్యం చెయ్యడం బహుకష్టం. చిన్నతనంలో స్త్రీసంభోగం లేకపోతే వాళ్లకు ఇంద్రియసప్తం కలిగి చాలా బాధచేస్తుంది. పెళ్ళాలుయెదిగి కాపురానికివచ్చేదాకా పెళ్ళిఅయినవాళ్లకుకూడా కావలెను. వకవేళ భార్యాలు కాపురానికి వచ్చినాకానీ వాళ్ళు అనాకారులైనా, కడుపుతోవున్నా, పుట్టింటికివెళ్ళినా, రోగాలువచ్చినా, మగవాడికి బోగంవాళ్ళు అవశ్యం గావుండవలెను. సంభోగం లేకపోతే పురుషులు వేగిరం చచ్చిపోతారు. అందుచేత చావస్తం లేకపోతే సన్యాసులకుకూడా బోగంవాళ్ళు వుండడం జరూరే అనుకుంటాము.

విరా — ఇక్కడితో పూర్ణంగా కుదిరింది. ఇఖ లోకమంతా బోగంవాళ్లలో వున్నది. పెళ్ళివిషయంలో నీవు చెప్పిన సబబులన్నీ నీపెళ్ళానికికూడా పనికివస్తవి. నీవుమాత్రం మహా అందగాడవా యేమిటి ? నల్లగా కోతిలాగువున్నావు. నీపెళ్ళాము నీకంటె పదిరెట్లు చక్కగా వుంటుంది. నీవు చెప్పిన సబబుచేత నీవు అనాకారివిఅని నీ పెళ్ళాం మరివకణ్ణి చూచుకోవచ్చును. నీవుకూడా అప్పుడప్పుడు వూరికివెళుతూవుంటావు; నీకూ ఖాయిలాయి వస్తూవుంటవి. నీవంటి వాళ్ళు యింకా లక్షలు వుంటారు. మీపూర్వోకంటెకూడా మీరు బుద్ధిమంతులయి మొగవాళ్ళల్లోకూడా బోగంజాతి యేర్పరిస్తే యెన

రికీ అక్కిమం లేకుండా కుదురుతుంది. మొగుళ్ళు అనాకారులుగా వున్నా, వూరికివెళ్ళినా, ఖాయిలాపడ్డా, ఇష్టంలేకపోయినా, మీవలెనే మీభార్యలుకూడా వాళ్ళను వుంచుకుంటూ వుంటారు. నాయనా! యీవుపకారం నీవు కట్టుకుంటూ.

శంక—నీవు మోటపక్షిసంగం చేస్తూవున్నావు. నీతోమాటలాడ కూడదు. మొగుళ్ళు యేమిచేసినా ఆడముండలు ఇంట్లో చచ్చినట్టు పడి వుండవలెను. బ్రహ్మదేవుడు వాళ్ళనోసట అలా వ్రాసిపెట్టినాడు. ఇక నీతో మాట్లాడను పో. (అని పోవుచున్నాడు.)

స్వర్గలోకసుఖము.

రంగము—రంభమందిరము.

[బడేసాహేబుగారును, నరసింహసోమయాజులుగారును, సుబ్బరాయ చయనులు గారును, కామరాజు వాజపేయాజులుగారును ప్రవేశించుచున్నారు.]

నర—బడేసాహేబుగారూ! సలాంగండీ. తమరు లోపలకు వెళ్ళ కుండా మాతోకూడా వీధిసావిట్లోనే అట్టే వున్నారేమండీ? యిలా చాపమీద దయచేస్తారా మేము కూర్చుంటాము.

బడే— అరే భాంచోత్! మాజోలి నీకు యెందుకుపోయి? మాకు కావలిస్తే యీగాడిదలని జుట్టుపిలక పట్టుకుని యీడ్చివేసి మేముకూర్చుంటాము. సాహేబు దగ్గరగావస్తే మయిలపడతా నన్నం దుకు మొన్న సోమయాజులు గాడిదకొడుకును యెలా తన్నినానో జ్ఞాపకంవుంచుకోండి. యజ్ఞాలుచేసిన బేపనవాళ్ళకు మీకు బుద్ధిలేదు. లోపల సాహేబువుండగా రంభతో యెలావెళుతామనుకున్నాయో?

నర— చిత్తము చిత్తము. లోపల సాహేబుగారు వున్నది

మాకు తెలియదండి. ఆయనకు మాభాష తెలిసిందిగాదు గనుక ఆవేషం చూచి మేము దొరగా రనుకున్నామండి.

బడే — భంచోత్ ! మిమ్మల్ని పట్టుకుని బూట్సుకాళ్ళతో తన్నితే దొరగా రనుకోవడమూ గిరవారనుకోవడమూ అన్నీ వదులు తవి. యీజిప్టుయుద్ధంలో చచ్చినవాడికి మీభాష యెలా తెలుస్తుం దోమి? భాంచోత్! మీరు లోపలమాట వినబడకుండా మహాగడబిడ చేస్తూవున్నారు. మీరు చచ్చినట్టు నోరుమూసుకొని కూర్చోకపోతే మొన్న సోమయాజులను తన్నినట్టు మిమ్మలినందరినీ యెలాగు తన్ను తానో చూడండి. తన్నినతరువాత కావలిస్తే మీఅబ్బతో చెప్పుకోండి.

నర — మహాప్రభో ! మేము మాట్లాడమండి. మీకు దణ్ణం పెడతాము. మాజోలికి రాకండి. మాకు రంభాఅక్కరలేదు. యేమీ అక్కరలేదు మీరుసెలవైతే వెళ్ళిపోతాము.

బడే — పోతేపొండి పోకపోతే గంగలోదిగండి. మీరు వెయ్యేళ్లు యిక్కడ తల్లకిందుగా తపస్సుచేసినా మీకిప్పుడు రంభ రాదు. ఆఫ్ ఘ్ యుద్ధములో మాతో చచ్చినవాళ్ళు ఇరవైవేలమంది సాహేబు లున్నారు. ఈజిప్టుయుద్ధంలో చచ్చినవాళ్ళకు ఇంకా వంతురాకుండా ఫదివేలమంది దిగబడి వున్నారు. ఇంకా సౌథానుయుద్ధములో చచ్చిన తురకలు యెంతమందో యిప్పుడు వస్తూవ్రన్నారు. మీగ్రహచారం వీళ్ళలోబడి యేడుస్తూవుండవలసినదే. యేమిటోయి మీరు యేదో నములుతూ తాగుతూవున్నారు.

నర — చిత్తము. తమకుకూడా సమర్పించుకుంటాము. ఇది యజ్ఞాలలో పురోడాశమండి. ఇది సోమరసమండి.

(అని యిచ్చుచున్నారు.)

బడే — (పుచ్చుకొని నోట్లోవేసుకొని తుప్పున మొగముమీద

నుమ్మి వేసి) భాంచోత్ ఇని యేమిటోయి చప్పనిది పెట్టినావు. మాది చూపు మీకుపోస్తాము. యెంతయసిగావుంటుందో. (అని బ్రాహ్మణులు మొట్టి పెట్టుచుండగా వారినోళ్ళలో బలవంతముగా మాంసము పెట్టి కల్లునీళ్లు పోయుచున్నాడు)

నర--మహాప్రభో ! చాలును చాలు నండి. అదుగో యెవరో తలుపు తీసినారు.

బడే -- మీరాసాహేబు వచ్చినాడు. మేము రంభదగ్గిరకి యెల్లాలె. (అని పోవుచున్నాడు.)

నర--ఆరంభపుణ్యంగా చయనులూ! మనము యీవాళ దెబ్బలు తినకుండా యీ తురకముండాకొడుకు చేతులోనుంచి తప్పించుకుని బ్రతికినాము. మననోట్లో మాంసం పెట్టినందుకు మనం ప్రాయశ్చిత్తం చేయించుకోవలెను. దీనికి యేమిప్రాయశ్చిత్తంవున్నదో చెప్పు.

సుబ్బి--నేను శ్రోత్రం చదువుకున్నానుగాని శాస్త్రం చదువుకో లేదు. అందుచేత నాకు రోజూ ప్రాయశ్చిత్తాలు చేసుకోవడమేకాని దేనికి యేమి ప్రాయశ్చిత్తంవున్నదో తెలియదు. మన వాజపేయ సోమయాజులుగారికి యేమైనా తెలుసునేమో.

కామ--లాక్ష్యంలో తిరిగినవాణ్ణి కనుక నాకైతే ప్రాయశ్చిత్తాలసంగతి బాగా తెలియదుకాని యుక్తిచేత నాకు తోచింది నేను చెపుతాను. మాంసం తిన్నందుకు ప్రాయశ్చిత్తమే అక్కరలేదు. నేను బోగందాన్ని వుంచుకొని దాసియింట్లో మాంసం తినటూవచ్చినందుకు భూలోకంలో వున్నప్పుడు వక్కరోజూ నేను ప్రాయశ్చిత్తం చేయించుకోలేదు. క్షుండలాలు వేసుకుని శాస్త్రాలన్నీ పారజదివిన మహా కొమ్మలుతిరిగినపండితులు వచ్చి నాపంక్తిని భోజనం చేసేవారు. నాసంగతి వాళ్ళకు బాగా తెలిసినప్పటికీ వక్కళ్ళా ప్రాయశ్చిత్తము

కావలెనని చెప్పలేదు. అంతే కాకుండా మనం యజ్ఞాలలో మేక మాంసము తిని సోమపానము చెయ్యలేదా? వాటికి లేని ప్రాయశ్చిత్తము వీటికి మొందుకు?

సుబ్ర — వాటి కక్కర లేకపోతే తురకవాడు ముట్టుకున్నంత కయినా ప్రాయశ్చిత్తం వుండవలెనా అక్కర లేదా?

కామ — దానికే అక్కర లేదు. ఇప్పుడు యుద్ధాలమూలంగా వీరస్వర్గానికి వచ్చి రంభతో సంభోగానికి వచ్చేవాళ్ళంతా తురకవాళ్లే. మనం యెన్నిమాట్లని ప్రాయశ్చిత్తాలు చేసుకుంటాము? ఆమోట ముండాకొడుకులు తాకవద్దంటే మానుతారా?

నర — నీవు యింకా తురకవాళ్ళంటూనేవున్నావు. ఆఫ్ఘన్ యుద్ధములో చచ్చి వీరస్వర్గానికి వచ్చినా డట! మాలవాడు వచ్చి రంభతో సంభోగం చేసి వెళ్లేటప్పుడు మమ్మలినందరినీ రాచుకుని మరీ పోయినాడు.

సుబ్ర — వైధవస్వర్గము. ఇది స్వర్గమన్నమాటే కాని ఇక్కడంతా వర్ణసంకరం. వాపీ వరసా యేమీ లేదు. ఆ మాలవాడు వెళ్లడంతోటే రంభవద్దకు నేనూ వెళ్లినాను. అందరమూ యజ్ఞాలు చెయ్యడంచేత మాతండ్రిగారూ నేనూ మా భావమరిదీగూడ వక్క. ముండతోనే యేడవవలసివచ్చింది. ఆ రంభముండ ముసలివాడని మా తండ్రిగారిని వక్కతోపు తోసేటప్పటికి ముసలిబ్రాహ్మడు కిందపడి పోయినాడు. నేను ఆయనచెవులు మూసి వుపచారం చేస్తూవుంటే మోటముండావాడు మా భావమరిది వచ్చి అస్తమానమూ మీరే యిక్కడవుంటే మేము వెళ్లవద్దా అని గుబికే గుబికే నావీపుమీద ఫది గుద్దులు గుద్దినాడు. అన్నికష్టాలూపడి తీరా కాస్త రంభాసంభోగం లభించవచ్చేవరకు తుండ్లగాగు తురకముండావాళ్లు వచ్చి మమ్మలిని

నాలుగుతన్ని జుట్టుపట్టుకొని అవతలకు యీడ్చి పడలాగివేసినారు. మా భావమరిదిగాడికి మహాచెడ్డరోగాలు అంటుకున్నవి. వాడు అప్పటి నుంచీ ఆవతిన్న పసరంలాగు కిందపడి కొట్టుకుంటూ వూరంతా దొర్లి పుచ్చకాయలాగు దొర్లుతూ వున్నాడు. గాడిదకొడుకు నన్ను కొట్టి నందుకు వాడికి శాస్తి కావలసినదే.

నర—మీరు యిక్కడనషయ్యా పగసాధించుకోవడం ? కాస్త వెళ్ళి వైద్యుణ్ణి తీసుకుని రాలేకపోయినారా ?

సుబ్ర — ఇంతమందికి వైద్యం చెయ్యడానికి ఇక్కడ అశ్వినీ దేవతలు ఇద్దరే వైద్యులున్నారు. ఇంతమందికి వాళ్ళు యెక్కడ చేస్తారు ? వాళ్లశర్మం వాళ్ళదని యేమో నోట్లో నాలుగునీళ్ళు పోసి వూరుకుంచారు.

కామ — రంభదగ్గిర రోగాలుకూడా వున్నవషయ్యా ? నేను యింతవరకూ రంభ అంటే యేమో అనుకుంటూ వున్నాను.

సుబ—పదిమంది యెక్కడకు వెళితే అక్కడల్లా రోగాలు వుంచువి. ఇక్కడ వున్నరోగాలవంటివి భూలోకంలో యెక్కడా లేవు.

కామ—ఆలాగైతే నాకీవెభవరంభాసంభోగం అక్కరనేలేదు. మావూళ్ళో నేను వుంచుకొన్నబోగంవికూడా ఇక్కడకే వచ్చిం దని విన్నాను. అది స్వర్గంలో వున్నదో నరకంలో వున్నదో తెలిస్తే దాని దగ్గరకే వెళ్ళిపోచాను.

సుబ్ర — అది తప్పకుండా నరకంలోనే వుంచుంది. బ్రతికి వున్నంతకాలమూ యెంతమందికొంపలో కూలతోసినదానికి స్వర్గం యెలాగు వస్తుంది ?

కామ—అలాగునఅనకూడదు. అది యెన్నోనరమేధయాగాలు చేసినదేను. దానికిమాత్రం స్వర్గం యెందుకు యివ్వరు ? దానియందు

నాకు మహావిశ్వాసం. మేము యిద్దరమూ భూలోకంలో వున్నప్పుడు మాయింటిల్లిపాడికి దానిచేత బియ్యంకొలిపించి యిప్పించేవాణ్ణి. మా యింట్లో అదిపెట్టింది బిక్షము. నేను దానిదగ్గిరకు వెళ్ళకమానను. ఆ యింప్రిడుసూత్రము నాకు రంభ అక్కరలేదు దాన్ని యివ్వండంటే యివ్వడా ?

(అని వెళ్లుచున్నాఁడు)

చంద్రగ్రహణము — తేలువంది

పరిదేశము — సీతారామపురము.

[జనవంచకాచార్యులుగారును, మతిహీనరావుపంతులుగారును, వివేకభూషణుఁడుగారును పరివేశించుచున్నారు.]

వివే — ఏమయ్యా మతిహీనరావుగారూ! అలా రాగాలు పెడు తూవున్నారు ?

మతి — మరియేమీలేదండి. యీజనవంచకాచార్లగారిని తేలు మంత్రం వుపదేశించమని నాలుగు నెలలనుంచి అనుసరిస్తూ వున్నాను. నావద్ద నాలుగురూపాయలు పుచ్చుకొని గ్రహణం రానిమ్మని యిప్పటిదాకా జరిపినాడు. నిన్నరాత్రి తీరావుపదేశిస్తానని వూరిబయటి చెరువులోకి తీసుకునివెళ్ళి కంఠంలోతు నీళ్లలో దింపినాడు — ఉస్సి ! అబ్బబ్బా ! గుండెలలోకి పోట్లుపొడుస్తూవున్నది. చెయ్యి బద్దలువేసుకు పోతూవున్నది.

వివే — ఆకాలినిండా నెత్తురేమిటయ్యా ?

మతి — అదేనండి. మనవిచెయ్యబోతూవున్నాను. గ్రహణ సమయంలో స్నానం చేసి కంఠంలోతునీళ్ళల్లో నిలుచుండి మంత్రం వుపదేశం అవుతూవ్రండగా దిక్కు మాలినజలగలు వచ్చి కాళ్ళన్నీపీకి

నెత్తుకొల్లుచేసినవి. ఆబాధకయినా ఓర్చుకున్నానుకానండి యిప్పుడీ తేలుబాధ సహించలేకుండా వున్నాను.

వివే—నీకు యీ తేలుబాధ యెలాతటస్థపుయినది?

మతి—మంత్రం వుపదేశం అయినతరువాత దినమొలతో వెళ్ళి పుట్టమీాదవున్న జిల్లేడుచెట్టు పెల్లగించి దానివేరుగంధం వ్రాస్తే యెటు వంటితేలు కుట్టినా పోతుందని మెల్లిగావెళ్లి పెల్లగించడానికి చెరువుగట్టు మీాదవున్న జిల్లేడుచెట్టుమొదట్లో చెయ్యిపెట్టేటప్పటికి నాపాణాని కా పాపిష్ట తేలు యెక్కడనుంచి వచ్చినదోకాని చటుక్కున చిటికినవే లంట పొడిచింది. రాత్రినుంచి దానితో బాధపడుతూ వున్నాను. ఇప్పటికి చెయ్యంతా వెయ్యిగొడ్డళ్ళతో నరికినట్లు బద్దలువేసుకుని పోతూవున్నది.

వివే—మీాగురువుగారు మంత్రం వెయ్యలేదా?

మతి—కావలసినన్ని మంత్రాలు వేసినారు. యెన్నో వేళ్ళరగ దీసి రాసినారు. యేమీాకార్యంలేకపోయింది. నీపురాకృతకర్మం అనుభవించక తీరదంటారు. ఏమయ్యాఅంటే యీామంత్రం వెయ్యడంచేతనే బ్రతికినావుకాని లేకపోతే అటువంటి పుట్టతేలు కుట్టినందుకు తక్షణం చావవలసినదేనని చెప్పినారు. ఆయన బహుదొడ్డవాడు. మంచిమంత్రి వేత్త. ఆయన వుండబట్టి బ్రతికినాను. రాత్రి రెండుఝాములనేళ చెరువుగట్టుమీాద రొమ్ముగరిసిలపడి పడిపోతే బుజాలమీాదవేసి ననున్ను మోసుకువచ్చి యింట్లో పడవేసినాడు.

వివే—మీరు తేలుమంత్రం వుపదేశం అయినారుగనుక మీాకు తేలు ప్రత్యక్షమయి వరం యిచ్చినది. మీారువెనుకకూడా యీా ఆచార్యులగారివద్ద యేదో మంత్రం వుపదేశమయినట్టున్నారే. అప్పుడూ యీాలాగే ఫలం వెంటనే అనుభవమయినట్టున్నది. వీరు వుపదేశించే

మంత్రాల కెప్పుడూ సద్యోఫలం కలుగుతుంది కాబోలును.

మతి—యేడిచేవాణ్ని మీరు నన్ను మరింత యేడిపించకండి. నేను నెనుక స్త్రీనశ్యానికి వుపదేశమయిన మంత్రంమాట కాబోలును మీరు పిలవిస్తూవున్నారు. అప్పుడు వుపదేశమయిన మంత్రం జపించి మంత్రోపకరం—గారి భార్యమీద వీధులో వెళుతూవుండగా చల్లేట ప్పటికి ఆవిడ నన్ను పట్టుకుని చెడతిట్టినది. మాటలకేమి గాలికి పోతవని నాదారిని నేను వెళుతూవుంటే లోపలినుంచి బడితెలలాగు నలుగురు మొగవాళ్లువచ్చి నన్ను సున్నంలోకి ఎముక లేకుండా చితుకపొడిచినారు. ఆసంగతి తలుచుకుంటే నాకు దుఃఖంవస్తూవున్నది. నీరామాట తల పెట్టకండి.

వివే—మీరామంత్రం మళ్ళీ యెవరిమీదా ప్రయోగించలేదని తోస్తుంది.

మతి—పోనిస్తురూ దిక్కుమాలినమంత్రం దానిమాట చెప్పకండి. మంత్రం గహస్యముగా వుంచవలెనుగనుక మళ్ళీ దాన్ని పయికి తియ్యలేదు. మంత్రాలలో గొప్పనుహత్యం వున్నది. వుపదేశమయిన వాళ్ళు తిన్నగా పునశ్చరణచెయ్యకపోతే ఫలం కనుపడదు. అదంతా మనలోపమేకాని మంత్రముయొక్క లోపము యేమీలేదు.

వివే—ఇదంతా మోసంచేసి తెలివితక్కువవాళ్ళనద్ద డబ్బు కడతేర్చడానికి వంచకులు పన్నినపన్నుగడకాని తేలుకూ పాముకూ మంత్రాలు యేమిటి? యీనృధాశ్రమకంటె మంత్రములకోసం ప్రయత్నం చేస్తే చాలా లాభం వుంటుంది. చందుడికి భూమినీడ అడ్డంవచ్చి గ్రహణంపడితే యీవెట్టిసాన్నాలూ జపాలూ యేమిటి?

జన— మీకు గ్రహణాసంగతి బహుబాగా తెలుసును! భూమిచ్ఛా కేతువూ పట్టడమూ శాస్త్రాలూ బ్రాహ్మణీకమూ అన్ని

మన్ను కొట్టుకునిపోయినవి. మీరు యిప్పుడు చదువుకున్న మూలకూత లనుబట్టి గ్రహణమంటే భూమినీడ అడ్డం రావడంకాడికి వచ్చింది. మీవంటి నాస్తికులు యెటువంటి దుర్బోధలుచేసినా ప్రజలు మీవంటి శిష్టులైన మంత్రివేత్తల మాటవిని దానధర్మాలు చెయ్యగా మానరు. మీరు వూరికే మంత్రాలను పరిహాసం చేస్తూవుంటే తెలియనివాళ్ళ తోటి యేమిటని వూరుకున్నాను. నామంత్రంయొక్క ఫలం కావలిస్తే కాలుతీసి కాలుపెట్టేటప్పటికి నెత్తురు కక్కుకుని చచ్చేటట్టు చేస్తాను. ఎందుకు? కానికాలాలు వచ్చినవి. ఈమాటలు చెప్పరాదు. వెళ్ళిపోతాను.

మతి—నాకు తేలుబాధ బహుమిక్కుటంగా వున్నది. నేనూ వెళ్ళిపోతాను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

నారద సందర్శనము.

——:0:——

[నృసింహాస్థ్లవారును, పరబ్రహ్మసోమయాజులుగారును, నారదులవారును వూరుచుండగా విశ్వస్తపల్లభాచార్యులుగారు ప్రవేశించుచున్నారు]

నృసిం — ఆచార్యులుగారూ దయచెయ్యండి. ఈభూమివిహారాదికి నారదులవారు విజయంచేసినారు చూచినారా ?

విశ్వ—వీరేనా నారదులవారు ? ఆహా ! యేమి వీరి బ్రహ్మ తేజస్సు ! పూసినవిభూతిచేత దేహ మెంత ధవళముగా నున్నది ? ఓ బ్రహ్మమానసపుత్రా ! నీకు నమస్కారము. మీ రెక్కడనుండి విజయంచేసినారు ?

పర—వీరు బ్రహ్మలోకమునుండి స్వర్గాదిలోకములకు విజయం

చేసి మన పితృదేవతల ప్రార్థనప్రకారం మనతో వారియాజ్ఞను చెప్ప డానికి వచ్చినారు.

విశ్వ—ఇప్పుడు ఇంగ్లీషు చదువుకున్నవాళ్ళు స్వర్గాదిలోకాల నుంచి మహాత్ములు వచ్చేవారంటే మనను పరిహాసం చేస్తారు. వారి కందరికీ బుద్ధివచ్చేటట్టుగా కలహాశనులవారు మనకు ప్రత్యక్షమైనారు గదా? మహాత్ము లాకాశగమనముచేత తమవద్దకు వచ్చి మాట్లాడి పోతారని దివ్యజ్ఞానసమాజమువా రన్నమాట లబద్ధ మనేవారిని యీలాగు యీడ్చుకొని రా. వీరిని ప్రత్యక్షంగా చూపించి వాళ్ళనో రడుతాము. వకవేళ వాళ్ళు చూచినాకానీ నమ్మరేమో! ఈయన కృతయుగంనాటివాడుగదా గడ్డం నెరియలేదంటే మన మేమి చెపు తాము?

నృసిం—దేవత లెప్పుడూ త్రిదశులు. వాళ్ళ ముప్పయి యేళ్లకు మించినవారుగావ్రాడకు గనుక గడ్డములు నెరియవు.

విశ్వ—స్వామీ ! తమరు బ్రహ్మమానసికపుత్రులు గదా ? బ్రహ్మకు నాలుగుముఖాలూ యే ప్రకారంగా వుంటవో తెలిచ్చెదరా?

నార—అవి నాలుగూ వకడానితరువాతవకటి వరసగా వుంటవి; కాను కాదు నాలుగూ నాలుగువైపులకు వుంటవి; అలా కాదు మూడు ముందువైపునా వకటి వెనుకవైపునా వుంటుంది; మరిచిపోయినాను జ్ఞాపకం చేసుకోనీ; రెండు వకవైపునా రెండు రెండోవైపునా వుంటవి. ఈచెప్పినవిధాలలో యెలాగు వుంటవో నిశ్చయంగా చెప్పలేను. ఈమాటు బ్రహ్మనడిగివచ్చి చెప్తాను.

పర—స్వామీ! తమ కంతశ్రమ యెందుకు ? దివ్యదృష్టిచేత చూచి చెప్పరాదా ?

నార—ఆంతరదృష్టిచేత చూచినాము. వకతల పుట్టే వకతల

కిందికీ వకతల ముందుకూ వకతల వెనుకకూ వకతల మూలకూ వెరసి నాలుగుతలలూ నాలుగునాలుగు లష్టదిక్కులకూ తిరిగి వుంటవి.

విశ్వ — ఇవి తమరు దివ్యమానపరికారం చెపుతూ వున్నారు కాబోలును. నా కేమీ అర్థము కాలేదు.

సృసిం—మనము బాహ్యార్థము విచారింపరాదు. వారు చెప్పే మాటల కన్నిటికి లోపల గూఢార్థము వేదాంతార్థము వుంటుంది.

విశ్వ—రహస్యార్థం పోసిచ్చి, స్వామీ ! తమరు భూలోకమునకు వచ్చినప్రయోజనము సెలవిచ్చెదరా ?

నార—మీపితృదేవత లందరూ మీతో వక్క-సంగతి చెప్పు మన్నారు. మృతులయొక్క- భార్య లందరూ తరువాత స్వర్గలోకానికి వచ్చి భర్తలతో స్వర్గసుఖం అనుభవిస్తా రన్నసంగతి శాస్త్రాలనుబట్టి మీకు తెలిసేవున్నదికదా ? మీరు వాళ్ళకందరికీ తలవెంట్రుకలు తీసివేయించడముచేత మీకు స్వర్గంలో బోడిభార్యలు వస్తూవున్నారు. ఈబాధ లేకుండా చెయ్యమని మీతో చెప్పమన్నారు.

విశ్వ—అంతేనా ? యింకా యేమయినా చెప్పమన్నారా ?

నార—"మీరు మాపేరు చెప్పి బ్రాహ్మలకు పెట్టేది యేదిస్నీ మాకు ముట్టడం లేదు. మేము దానధర్మాలకూ నిత్యకృత్యాలకూ డబ్బు లేక చాలాయిబ్బంది పడుతూ వున్నాము. ఘడియఘడియకూ మళ్ళీ స్వర్గానుంచి వచ్చేవారు యెవరూ వుండరు గనుక ఇప్పుడే మీ వద్ద నున్న డబ్బంతా యీనారదుడిచేతి కిచ్చి పితృఋణవిముక్తులు కావలసినది" అని చెప్పమన్నారు.

విశ్వ — నాకు పని వున్నది. నేను మళ్లీ వచ్చి దర్శనం చేసుకుంటాను.

పర—నాకగ్నిహోత్రాలవేళ అయింది పోచాను.

నృసిం — శిష్యులు నాకోసం కనిపెట్టుకుని వుంచారు. నేను పోవలెను.

(అని యందఱును నిష్క్రమింపఁగా నారదులవా
రంతర్ధాన మగుచున్నారు.)

యజ్ఞ పర్యా ప్తి ము.

(భార్యా భర్తృ సంవాదము)

పరిదేశము — వేంకటదీక్షితులు గారి శయనగృహము.

[వేంకటదీక్షితులుగారును, భార్యా అక్ష్మీదేవియు పరివేశించుచున్నారు.]

వెంక — అవునే! యింటిదానా! రేపు అమావాస్య వెళ్ళిన విదియనాడు బయలుదేరి యాగభక్తికోసం వక్క-సారి దేశసంచారం చేసివస్తునా ?

లక్ష్మి — దేశసంచారం కాదుకదా మీరు గ్రామసంచారమైనా చెయ్యరు. రాత్రి పగలూకూడా మీరు పెళ్లామును యెవరూ యెత్తుకు పోకుండా కనిపెట్టుకుని కూరుచుంచారు. మీకుకాగా నేటికాలానికి అరవయ్యోపడిని పడుచుపెళ్ళాము దొరికింది. ఇట్లో నన్ను యెవ్వరూ యెత్తుకుపోరు లెండి. రోజూ నాలుగుఘడియలు వీధిలోకి వెళ్లి నలుగురు పెద్దమనుష్యులనూ చూచివస్తూవుండండి. నేను కాపురానికి రాకము నుపు అక్క-డా అక్క-డా తిరిగి నాలుగుడబ్బులసొమ్మ యేరుకు వచ్చే వారు. ఇప్పు డదీపోయింది.

వెంక — నీవు యింట్లో వక్క-ర్తెవూ వుండిపోచావనే భయం చేత యెక్క-డకూ వెళ్లడం మానుకున్నాను; నీపెళ్ళినిమి త్తం ఖర్చు చేసిన వెయ్యిరూపాయలమాటా తలుచుకుంచే నాగుండెలు బద్దలయి

పోచూవుంచవి. నేను యింటులోయేమీ అబద్ధం ఆడడంలేదుగదా ? వొక్క నీతండ్రికే యెనిమిదిపందలరూపాయలు రొక్కం యిచ్చిన సంగతి నీవే యెరుగుదువు. మూడుఝాములదాకా భోజనం లేకుండా మూడి దొడ్డిసంభావనలో దెబ్బలుతిని డబ్బుడబ్బుకాడినుంచి గణించిన యేడువందలరూపాయలూ పోగా మూడువందలరూపాయలు ఋణం కూడా అయింది. ఆబాధ తీర్చుకోవడానికే ఇప్పుడు యాగభిక్ష తల పెట్టుకున్నాను. యజ్ఞంపేరు చెపితే యెంతకఠినుడయినా రూపాయీ అర్థా యివ్వకమానడు.

లక్ష్మి—అది బాగానేవున్నది. సంవత్సర మయినాసరే రెండు సంవత్సరాలైనాసరే తిరిగి నాలుగువేలరూపాయలు కళ్ళపడ్డదాకా మళ్ళీ యింటికి రాకండి. నాకోసం మీరు తొందరపడి రావద్దు. మీరు యింట్లోలేకన్న లోపం లేకుండా నేను సంసారం గుట్టుగా జరుపుకుంచాను.

వెంక—నేను అంతకాలం నిన్ను వదిలివుండలేను. వూరు బయలుదేరినతరువాత నాపాపాలన్నీ నీమీదనే వుంచవి. మనకు రెండువేలరూపాయలు దొరికితే చాలును. వెయ్యిరూపాయలు యజ్ఞానికి ఖర్చుఅయినా పయిగా వెయ్యిరూపాయలు మనకు మిగులుచవి.

లక్ష్మి—మీరు నిజంగా యజ్ఞంకూడా చేస్తారా ? నేను వూరికే యజ్ఞం పేరుచెప్పి సొమ్ము సంపాదించి నాకు నగలుచేయించి పెడచారనుకొంచూవున్నాను. ఆలాగైతే మూడిరూపాయలువెయ్యిరూపాయలు యేమిచాలుచవి ? ఆవెయ్యిరూపాయలూపెట్టి నాకు నగలే కొంచారా ? అప్పులే తీరుస్తారా ? ఎల్లేకడుతారా ? నామాట విని యజ్ఞం చెయ్యకండి. పూర్వం మల్లిఖార్జునదీక్షితులుగారు యజ్ఞం చేస్తానని డబ్బు పోగుచేసి ఇల్లు కట్టించుకుంటే యెవరేంచేసినారు ?

మ: మూ ఆలాగే డబ్బుతో సుఖంగా వుందామ!

వెంక—అలా కాదు. యజ్ఞంచేస్తేనే చాలాలాభంవున్నది. నలు
గురూ సోమయాజులుగారని నాకు గౌరవం చేస్తారు. సంభావనకుపోతే
డబ్బయిచ్చేచోట రెండుడబ్బులు యిస్తారు. సోమిదేవమ్మఅంటే నీకూ
యెంతో గొప్పగా వుంచుంది.

లక్ష్మి — ఆగొప్పాగిప్పా నాకు అక్కరలేదు. చక్కగా తల
దువ్వుకొని కొప్పుపెట్టుకొని ఖులాసాగా వుండకుండా, అగ్నిహోత్రాల
కని రోజూ స్నానాలుచేయించి కళ్ళు పోయేటట్టుగా పొగదగ్గిరకూర్చో
పెట్టి మూసివాయినంమొత్తయిదులాగు వుండమంటే నేనువుండేదాన్ని
కానుసుమండీ. యిప్పుడే చెపుచూవున్నాను.

వెంక—అన్నంతించానా గడ్డితించానా ? నీసుఖం నేనుమా
త్రం యెగుగనూ ? యజ్ఞం అయినతరువాత అగ్నిహోత్రాలు మరు
నాడే మానివేతాము. నీసవితికాలంలో ఆధానం చేసినానుకదా. అగ్ని
హోత్రాలు వుంచి దానికేమయినా వత్తుకు కలుగచేసినానేమో యీ
యిరుగుపొరుగువారినందరినీ అడుగు. నిన్ను వక్కరోజు స్నానం
చెయ్యమనను.

లక్ష్మి — అది సరేకాని యజ్ఞంలో మూడుదినాలుమాత్రం
నేను వుపవాసాలు వుండి మాడగలనా ? నేను ప్రతిరోజూ మూడుపూ
టలూ అన్నం తినడానికి వప్పుకుంచేనేగాని మీరు యజ్ఞంమాట తల
పెట్ట వల్లకాదు.

వెంక—నీకు రాత్రిళ్లు అన్నం రహస్యంగా తెప్పించి పెట్టిస్తాను.
పగలుమాత్రం యెలాగైనా మూడురోజులు వోపిక పెట్టివుండు. పగలు
అందరూ వుంచారు. వారు చూస్తూవుండగా అన్నంతించే బాగా
వుండదు. కావలిస్తే పగలు నీమనసువచ్చినన్ని పళ్ళూ పాలూ

పుచ్చుకో.

లక్ష్మీ—నాకు అలా పసికిరాదు. నేను చద్దిఅన్నం తినకుండా వక్క-దినం వుండలేను. మహామహా అమావాస్యనాడుసమేతు చద్ది అన్నం తినకుండా రెండుజాములదాకా వుండమంటే వుండకపోతే, నాకు పొద్దున్నే రహస్యంగా చద్దిఅన్నం పెట్టించి మరీ బ్రాహ్మడికి పెట్టుకునే వారు మీకు తెలియదా? యజ్ఞశాలలోకి తరవాణికుండ తెచ్చుకో నిస్తేనేకాని నేను యజ్ఞానికే రాను.

వెంక—నీవు తరవాణికుండమాత్రం తీసుకునిరాకు. నేను యెలాగో తంటాలుపడి నాలుగుఘడియల తెల్లవారిగట్ట నీకు పెరుగూ అన్నమూ దొరికేలాగు చేస్తాను. ఆమూడురోజులూమాత్రం శ్రమపడు.

లక్ష్మీ—తెల్లవారిగట్ట చలిలో చద్దిమెతుకులు నాకు గొంతుక లోకి పోచవా యేమిమి? నేనుమాత్రం అమ్మా అయ్యా కడుపునపుట్టి మనుష్యజన్మ యెత్తలేదూ? నాకు సౌఖ్యం లేకపోయినతరువాత వెధవ యజ్ఞం నాకెందుకు?

వెంక—నిన్ను గడ్డం పట్టుకొని బతిమాలుకుంచాను. నామాట విను. ఈమూడురోజులూ శ్రమపడితే నీకు నూరువరహాలనగలు కొని పెట్టి కావలసినన్ని చీరెలూ రవికెలూ యిప్పిస్తాను. యజ్ఞంచేస్తే పర లోకమందుకూడా చాలాఫలం వుంచుంది. నీవు అక్కడ యెంతో సుఖం అనుభవిస్తావు.

లక్ష్మీ—యజ్ఞంచేస్తే స్వర్గంలో యేమిసుఖం వస్తుందో ముందుగా నాతో చెప్పండి. ఆలోచించుకొంచాను.

వెంక—అన్నిసుఖాలూ వస్తవి. రంభాసంభోగం వస్తుంది.

లక్ష్మీ—రంభ ఆడదా? మగవాడా?

వెంక—రంభ ఆడది. దాన్నిచూస్తే పురుషులు పరవశులయి

పోచారు. దాసిచక్కదనం వర్ణించడానికి బ్రిహ్మకయినా శక్యం కాదు. వెయ్యేళ్ళు తపస్సుచేసినా లభించని దానిపొందు మూడురోజులలో యజంచేసే చులాగా దొరుకుచుంది.

లక్ష్మి—ఈసోది చాలించండి. ఈసౌఖ్యమంతా మీకు దొరుకు తుందిగాని నాకు యేమివున్నది? నాకు వచ్చేలాభం యేమయినా వుం చుందేమో చెప్పండి. అక్కడ రంభవలెనే చక్కగావుండే పురుషుడు యెవరయినా వుంచాడేమో చెప్పండి. తప్పకుండావుంచాడు. బ్రిహ్మ దేవుడు సోమయాజులుగారికి రంభను సృష్టించి, సోమిదేవికిమాత్రం అన్యాయం చేస్తాడా యేమిషి?

వెంక—ఆసిసీకోరిక కాలిపోనూ! నీకు యెంతదుర్బుద్ధిపుట్టినదే! నీమనస్సులో యెంత దురూహ వున్నదే! నీకుమాత్రం తెకపోవడం యేమి? నీకు మహారాజులాగు చేసుకున్నభర్తతో వెయ్యికల్పాలు సుఖం కలుగుచుంది. నీపుణ్యంచేత జన్మజన్మాలకూ నీకు యీభర్తే లభిస్తాడు.

లక్ష్మి—వెధవసుఖం నాకు ఆసుఖం అక్కరలేదు. గాడిదె కొడుకు బ్రిహ్మదేవుడుకూడా ఆడవాళ్లకు యింత అన్యాయం చేస్తాడని నేను కలలోనూ అనుకోలేదు. ఈలాగు పక్షపాతం చేసినతరువాత వాడి దేవత్వం యేమిషి వెధవదేవత్వం? స్వర్గానికి వెళ్లినా వడేకులు తప్ప వన్నట్లు, అక్కడికి వెళ్లినా ముసలికంపు కొడుచూ మొఖంనిండా విభూతిపట్టెలూ తానూ బ్రిహ్మరాక్షసివలె నాకు యీ ముదిమగడేనా? యీ వక్కజన్మాన్ని చాలక యింకా జన్మజన్మాలకూకూడా నాకు యీ మగడే కావలెనా యేమిషి? నేను యేజన్మానో చేసుకున్నపాపంచేత నాకు యిప్పుడు ఇలాగంటి ముసలిమగడు తటస్థించినాడు. నాకు యజ్ఞమూ వద్దు. యింకోజన్మాన్ని నాకు యీమగడు రానూవద్దు.

నీ యజ్ఞానికీ నీకూ వెయ్యినమస్కారాలు. నన్ను ముందుజన్మంలోనైనా కొంచెం సుఖపడనియ్యి. నాలుగురోజులు యీయిల్లు విడిచివెళ్ళి యిప్పుడు నన్ను కాస్త సుఖపడనియ్యరాదూ! దిక్కుమాలిన యజ్ఞంచేసి ముందుకూడా నేను సుఖపడకుండా చెయ్యడానికా విశ్వప్రయత్నం? చాలుచాలు తెలిసిపోయింది. మీరు యిక లక్షరూపాయలు యిచ్చినా నేను యజ్ఞంలోకేరాను. కావలిస్తే యజ్ఞానికని తిరిగి వెయ్యో రెండు వేలో తీసుకురండి. మనమిద్దరమూ సుఖంగా వుందాము.

వెంక—ఓసి ఘాతుకురాలా! నీమనసు తెలిసినతరువాతకూడా నేను యిల్లు కదులుచానుపే? నాకు యజ్ఞమూవద్దు యేమీవద్దు. వుప వాసాలైనా మాడుచూ గుమ్మం కదలకుండా యింట్లోనేకని పెట్టుకుని వుంచానుగాని నిన్ను వక్కనిముషం వంటిగా వదిలి వుండను.

లక్ష్మి—ఆసంగతి నేనూ యెరుగుదును. నాఅదృష్టం తిన్నగా వుండి దైవం వదిలిస్తే వదలాలిగాని, అందాకా మీరు నన్ను వదలరు. పిశాచం పట్టుకున్నా నాలుగుఘడియలు వదిలి వుంచుందిగాని మీ కదీ లేదు. దైవం నన్ను యెప్పుడు తిన్నగాచూస్తాడో, నేను సుఖపడే యోగం యెప్పుడువున్నదోకాని, మీమూలంగా నేను బాధపడలేక చచ్చిపోచూవున్నాను. యజ్ఞాలని పేరుచెప్పి యిప్పుడు వూరికే నోరెరుగని మేకలను చంపుచాలుకాని, పూర్వంవలె నరమేధయాగాలు వున్నా బాగా వుండును. యేమహారాజుకాళ్ళయినా పట్టుకుని, ముసలితనంలో పడుచుపెళ్ళాలని కట్టుకుని హింసపెట్టినపాపం రాకుండా ముసలివాళ్ళను యాగపశువులనుగా సమర్పించి పుణ్యలోకాలు కలిగే సదుపాయం చేస్తును.

వెంక—ఓసి పాపాత్మురాలా! యెంతఘాత తలచుకున్నావే? యిలాగంటిదానవు నన్ను యెలాగైనా విషంపెట్టి చంపివేస్తావు. ఇఖ

నీతో యింట్లో వుండకూడదు. బ్రతికివుంటే బలుసుకూర యేరుకుని తినవచ్చును. నేను యీసంగతి రాజుగారితో మనవిచేసి నీకు శిక్ష వేయిస్తాను చూడు. (అని వీధిలోకి పరుగెత్తుచున్నాడు)

లక్ష్మి—(తనలో) ఈభయంచేతనైనా యీవాళ వీధిలోనికి పోయినాడు. ఇఖ సాయంకాలముదాకా యింటికి రాడు. తలదువ్వుకొని కొప్పువెట్టుకొని యీరోజున నాలుగు ఘడియలు కాస్తసుఖం అనుభవిస్తాను. (అని నిష్క్రమించుచున్నది.)

జమీందారీ ధర్మఖర్చు.

ప్రదేశము—జమీన్‌దారు వెంకటాద్రివాంధరాయనింగారి యాస్థానము.

[దివాన్ తసక్‌రాచార్యులుగారును, గుమస్తా జంబుకరావుగారును ప్రవేశించుచున్నారు.]

తసక్— — ఏమయ్యా! గుమాస్తాగారూ! లెక్కలన్నీ సిద్ధంగా వున్నవా? శ్రీరాజావారు యిప్పుడు తనిఖీచేస్తామన్నారు.

జంబు——రాజాగారుచేసే తనిఖీకి మనం భయపడనక్కరలేదండి. యెలాగువున్నా దస్కతుచేస్తారు.

తసక్———అయితే మనం యీనాలో ధర్మఖర్చుకింద అంతా యెంతఖర్చుపెట్టినామో జ్ఞాపకంవున్నదా?

జంబు——యెంతోలేవండి. చాలాపద్దులున్నని. ఇందాకా వేరే కాగితంమీద బేరీజువేసిచూస్తే అరవైయేడువేల రూపాయల పదిహేడనాల పద్ధెనిమిది పైసలు అయిండండి!

తసక్— — మీరు అణాలూ పైసలూకూడా తెప్పించినారు యెలావచ్చిందయ్యా?

జంబు—ఆలా వేస్తే నేకాని లెఖ్ఖలు చూచేవారికి నిజమైనవని నమ్మకంవుండదండి. నాకు సంస్థానంలో ముప్పయియేళ్ల సర్వీసు వున్నది గనుక యెంతమాత్రమూ సందేహపడడానికి అవకాశంలేకుండా అణాలూ పైసలూ సెంట్లుకూడా వేసి లెక్కలు నిరాక్షేపంగా వుంచుతాను.

తస్క.—అణాలూ పైసలూ యేమిటని శ్రీరాజావా రడిగితే యేమిచెప్పుతావు ?

జంబు—మనం ధర్మఖర్చుకింద వేసేటప్పుడు దాల్లో కొంచె మయినా ధర్మ ఖర్చు వుండవలెను. ఆ అణాలూ పైసలూ ముష్టివాళ్ళకు యీనెలలో యిచ్చినధర్మం అని చెపుతాను.

తస్క—ముష్టివాళ్ళకు యీనెలలో అంతఖర్చుఅయిందటయ్యా చాలానే అయింది. ఇది సంవత్సరంలో అయినఖర్చు కాదుకదా ? పోనియ్యండి. అయినదేమో అవనేఅయింది కాని ఇఖముందైనా విస్తారం ఖర్చుకాకుండా జాగ్రత్తపెట్టండి. అయితే మొన్న నాయుడుగారికి మేజస్ట్రీటు కేసులో యిచ్చినపద్దు చిల్లరలో తగిలిందా ?

జంబు—తగిలిందండి. ఆలాగంటిఖర్చు నేను యెప్పుడైనా మరిచిపోతానా ? ఇందులో నాకు కొంచెం అన్యాయం జరిగింది. ప్రభువువారి తరువాత మాకు తమరే ప్రభువులుగనుక మనవి చేసుకుంటాను. వెనుకటిదివానులు మాకు నూటికి ఫదిరూపాయలు యిప్పించడం మామూలండి. తమ రయిదేసిరూపాయల చొప్పుననే దయచేయించినారు.

తస్క—ఇందులో తగాదాపెట్టకయ్యా. చిన్నపద్దు. ఇందులో మాకుమాత్రం యేమివున్నది ? మాకంతా ఇందులో మూడువేలేనా యింకా యేమైనా వున్నదా ? పెద్దపద్దు వచ్చినప్పుడు మీరు కోరిన

పరికారమే జరిగిస్తాము లెండి.

జంబు—చిత్తము చిత్తము. ఇందులో తమఅనుగ్రహం కావ లెనుకానండి ముష్టిసొమ్ము నాకు సొమ్ము పావనం కాదండి. రేపు నా కొడుకుకు పెళ్ళిచేసుకుంటూనంటే ప్రభువువారితో మనవిచేసి తమరే రెండువేలు పారవేయిస్తారు.

తస్క—సరేకాని ఇందులో మేజస్ట్రేటునాయుడుగారికి ముట్టింది యెంతా ? మీరు సొమ్ము పదిలంగా పంపించినారా ? పంపించిన సొమ్ముమాత్రమే చిఠ్ఠాలో వెయ్యలేదుకదా ?

జంబు — లేదండి. అలా వెయ్యడానికి నేనంత తెలివితక్కువాణ్ణా ? నాయుడుగారికి పంపించింది. రెండువేల రూపాయలు. అయ్యా ! చిఠ్ఠాలో వేసింది అయిదువేలరూపాయలు. సరేకాని నాయుడుగారు నూటికి రూపాయచొప్పున ఇచ్చినకమీషన్ ఇరవైరూపాయలూ నాకు వెళుతుందా ? సొమ్ముపట్టించుకొనిపోయిన భుజంగరావు పంతులుకు వెళుతుందాండి ? పంతులాసొమ్ము తనకేవస్తుంది కాని దానిలో నాకేమీ ఇలాకా లేదని సొమ్ముపహరించి కావలిస్తే తమతో చెప్పుకోమన్నాడండి.

తస్క—పోనిస్తూ. ఇరవైరూపాయలు వాడినే పుచ్చుకోనిస్తూ. వాడికి యెప్పుడూ దొరకవ్రగడా ?

జంబు—తమరు అలా సెలవియ్య కూడదండి. సొమ్ముకోసం కాదు కానండి, ఒకసారి మనం వదిలిపెడితే ఇదేమామూలై పోవు సొమ్ముపట్టించుకునివెళ్లే మరివకడుకూడా తనకే రావలెనంటాడు. ఇది యెప్పుడూ హుజూర్‌గుమాస్తాకే రావడం మామూలండి. అరుగో శ్రీరాజావారు విజయం చేస్తూవున్నారు. తమరు లేచి నిలువవలె నండి.

[కిందిచూపులుచూచుచు, ఒకచేతితో మీసము వడివేయుచు, రెండవచేతితో బొజ్జనిమురుకొనుచు, శ్రీరాజావారు ప్రవేశించుచున్నారు]

రాజా—(కూరుచుండి) దివాంజీగారూ ! లెఖలు సిద్ధంచేసినారా ?

తసక్—మహాప్రభో ! సిద్ధంచేసినానండి. యేలినవారు చిత్తగించి దస్కతు చెయ్యవలెనండి.

రాజా—మీరు చూచారో లేదోకాని ఇందాకా మన దోడపుంజు బహుబాగా పోట్లాడింది సుమండీ.

తసక్—దివ్యంగా పోట్లాడుతుందండి. యెలాగా పోట్లాడక పోతే యేలినవారు దాన్ని మెచ్చుకుంటారా ? ఇన్నిపుంజులు వున్నవి కదాండి; దివాణంలో వక్క- జబ్బుపుంజును కనపరచమనండి. నేను లక్ష రూపాయలు పందెం వేస్తాను. ఇన్ని జమీందారీసంస్థానాలు వున్నవి కానండి యేసంస్థానంలోనూ ఇటువంటి మంచిపుంజులు లేవండి. కోడి పందాలసరదా అంటే తమదేకానండి మరివకరిది కాదు.

రాజా—మన జిల్లాకలక్టరుగారికి పెళ్ళాలు యెంతమందండీ?

తసక్—వక్కర్తేనండి.

రాజా ...మరి మన చిన్నపట్నం గవర్నరుగారికో ?

తసక్—ఆయనకూ వక్కతేనని వింటాను. వాళ్ళశాస్త్రప్రకారం విస్తారంమందిని చేసుకోరాదటండి. వాళ్ళకు యెంతఐశ్వర్యంవున్నా అనుభవించడం వాళ్లచేత కాదండి! అంతరాజ్యం చేతికింద వున్నంమకు అనుభవించడానికి ఫదిమందిపెళ్ళాలు లేకపోతే, ఆసొమ్మంతా యెందుకండి?

రాజా—మీరన్నమాట నిజమే. బాగా ఆలోచించిచూస్తే మనశాస్త్రాలే బహుమంచివిగా కనపడుతూ వున్నవి. చూచినారా మన

శాస్త్రులు యెంతమంది పెళ్ళాలినుసా చేసుకోవడానికి అంగీకరిస్తవి కదా? శ్రీకృష్ణమూర్తివారివలె పగహారువేలు కాకపోయినా పదహారు గురినుసా పెళ్ళాడవలెనని వున్నది.

తస్క---తమకోరిక అమోఘంగా సిద్ధిస్తుంది. సిద్ధసంకల్పులు యేలినవారు తలుచుకోవడమూ కాకపోవడమూ కూడానాండి? పదహారు గురింటికి యిఖ యేడుగురేకదాండి తక్కువ? వారు పైసంవత్సరాదిలోగా పూర్తి అవుతారు.

రాజా---యేవీ వక్కసారి లెక్కలు తీసుకురండి. జూదం ఆడుకోవలెను. అవతల రాజబంధువులంతా కనిపెట్టుకు వుంటారు. జూదం రాజులకు ధర్మమే కాదండీ?

తస్క--- చిత్తము. అదిరాజులకు వుత్తమధర్మమండి. అందు చేతనే పూర్వం ధర్మరాజులవారు, నలమహారాజు, మొదలైన చక్రవర్తులంతా ఆడేవారు. తమదీ వారి ప్రభేనండి.

రాజా --- ఈసంవత్సరం సర్కారుపేష్కషుపోగా మనసంస్థానం మీద యెంతలాభం వచ్చిందండీ? క్రిందటినెలలో మీరు చెప్పినారు కాని పరాకుపడ్డాము.

తస్క---తమరు అలాగు పరాకుపడడమే ధర్మమండి. అది మహారాజచిహ్నము. అందుచేతనే వేత్రహస్తులు సంస్థానాలలో బహుపరాకని హెచ్చరిక చేస్తారు. మనసంస్థానంమీద సర్కారుపేష్కషుపోగా అయిదు లక్షల డెబ్బయిమూడువేల నాలుగునందల రూపాయలు వచ్చినవండీ. ఇకగో మొత్తం తమరు చిత్తగించవచ్చును.

రాజా--- అక్కరలేదు. మనధర్మఖర్చులు యేవో వేగిరం చదవండీ.

తస్క--- చిత్తము. పదకొండోతారీఖున ధర్మఖర్చు పదివేలు.

రాజా—ఇది యేబాపతండీ?

తస్క—— గోపాలయ్యమీద మనం తీసుకువచ్చిన రెండుమూడు క్రిమినల్ కేసులలోనూ ముద్దాయీకి శిక్ష వేయించడం నిమిత్తమై డిప్టీ కలెక్టరుగారికి యిచ్చినవండి.

రాజా—ఇందులో యెంతఖర్చు పెట్టినా ఖర్చు పెట్టవలసిందే. మరి ఫదివేలు ఖర్చుచేసిఅయినా వాడికి శిక్ష వేయించండి. వాడు మనవూళ్ళో కాపురంచేస్తూ మనతో సమానంగా మేడకట్టించుకొని తీసివెయ్యమంటే తీసివెయ్యడూ? కోర్టులోకూడా వ్యాజ్యాలు వేయించి వాడి పొగరు అణచండి. సాక్షులకూ, గుమాస్తాలకూ, ప్లీడర్లకూ మీమనసు వచ్చినట్టు ఖర్చు పెట్టండి.

తస్క——చిత్తము. వాడిల్లు అమ్మించి జులులోకి పంపించి యేలినవారివద్ద మొఖాసా పొందుతాను.

రాజా—ఈడిప్టీకలెక్టరుకూ తహశ్శీలుదారుకూ యేటా జీతాలు మామూలు వున్నవికదా? అది కాకుండా కేజు వచ్చినప్పుడల్లా మళ్ళీ యింతసొమ్ము పుచ్చుకుంటాడా?

తస్క—ఇంతా మరింత పుచ్చుకుంటాడాండి? నేనుగనుక ఇక్కడికే చాలా తగ్గించినాను. డిప్టీకలెక్టరుగారికీ సబుమేజస్ట్రీటుగారికీ ఆఫీసులోవారికీ యేటా ఇచ్చేమామూళ్ళు వున్నా కేజు వచ్చినప్పుడు వేరే ఇవ్వక తప్పదండి. తరువాతపద్దు చిత్తగిస్తారా?

రాజా—యేదో చదవండి.

తస్క—పదమూడో తారీఖున ధర్మఖర్చు మూడువేల రూపాయలు.

రాజా—ఇది యేమిటండీ?

తస్క—దివాణందాసీలూ లంపతోలూ తాగికొట్టుకొన్నప్పుడు

సబు మేజస్ట్రేటుగారికి తెలిసి పోలీసువారిని కేజు చెయ్యమంటే పైకి రాకుండా వుండడానికి చేసినదండి.

రాజా—సరే యిది అవశ్యకమైనఖర్చే. మన దివాణంలో దాసీలకూ ఖాసాలకూ అవమానంవస్తే మనకు వచ్చినట్టే. వాళ్లను తప్పించడానికి యేమిన్యయపెట్టినా పెట్టవచ్చును. పోలీసు యిన్స్పెక్టరుకూ స్టేషనుఆఫీసరులకూ యీసంవత్సరం మామూళ్ళు పంపించివేసినారు కాదా? వాళ్ళతోమాత్రం యెప్పుడూ విరోధం పెట్టుకోకూడదు. తరువాతపద్దు చదవండి.

తస్క—పోలీసువారి మామూళ్ళు వెనుకనే పంపించివేసినానండి. అదికాకుండా యీకేసులో ఫక్తు ఫదివందలరూపాయలు వారికే యిచ్చినానండి. తరువాతపద్దు పద్ధాలుగోతారీఖున ధర్మఖర్చు రెండువేలరూపాయలండి.

రాజా—ఇది యేమిటి ?

తస్క — పంటకాలవలోకి నీరు వదలిపెట్టడానికి డిల్లాసూపరింటెండెంటుగారికండి.

రాజా—సరే తరువాత ?

తస్క — పదిహేనోతారీఖున ధర్మఖర్చు వెయ్యిరూపాయలు.

రాజా—ఇదో ?

తస్క — మనం నీలాద్రిరావుగారిమీద తెచ్చిన పదహారో నెంబరు అసలువ్యాజ్యంలో కోర్టు శిరాస్తాదారుగారికి ఇచ్చినదండి.

రాజా — సరే. రహితులమీద మనం తెచ్చిన వ్యాజ్యాలలో యేమీ ఖర్చుపడలేదా ? అవి ప్రధానమైనవి. అందులో యెంతసొమ్మయినా ఖర్చు పెట్టి రహితుగాడిదకొడుకులను సాధించండి.

తస్క — ఆపద్దు ముందు వున్నదండి. ఇరవైమూడోతారీఖున

ధర్మఖర్చు పదివేలు.

రాజా—సరే పద్దులన్నీ సరిగానేవుంటవి. మేము చూడనక్కర లేదు. మనకు ఈసంవత్సరంలో వచ్చిన ఆదాయంకాక యేమయినా ఋణంఅయిందేమో చూడండి.

తస— లక్షాయేభయివేలరూపాయలు మాత్రం కొత్తగా ఋణమయిందండి. ఖర్చు తగ్గించడానికి యేలినవారి సెలవుప్రకారం ఆస్థానంలోవున్న పండితులందరినీ కిందటినెలలోనే తీసివేసినానండి. పెద్దబాటలోవున్న రాచూరిసత్రం తీసివేయించి పాత్రిసామాను దివాణంలోకి తెప్పించినాను. సెలవైతే గరల్సుస్కూలు తీసివేయించడానికి వుత్తరవు చేయిస్తానండి.

రాజా—ఆడవాళ్ళకు చదువు వెందుకు? అది తప్పకుండా తీసి వెయ్యవలసిందే; కాని కలెక్టరుదొరగారు సిఫారసుచేసి పెట్టించడం చేత యీపని కొంచెం ఆలోచించి మరీచెయ్యనలెను. ఇందులో మాష్టరులకు యెన్ని నెలలజీతాలు బాకీవున్నవి?

తస— ఈబాలికాపాఠశాలలోనూ సంస్థానంస్కూలులోనూ కూడా మాష్టర్లకు ఆరునెలలజీతాలు బాకీ వున్నవి. మనవాళ్లకు ఇంగ్లీషెందుకు? ఈరెండుస్కూళ్ళూ సెలవయితే తీసివేయిస్తానండి.

రాజా—ముందునెలలో ఆలోచింతాము. ఒరే! వెంకా! పాచికలు తీసుకురా వక్కాటవేతాము.

(అని లేచి వెళ్ళుచున్నారు.)

హిందూ వివాహములు.

ప్రదేశము—పాలుదొరగారి ఇల్లు.

[పాలుదొరగారును, మిరాసాహేబుగారును ప్రవేశించుచున్నారు]

మిరా — దొరగారికీ సలాం. తమరు యేమిటో చాలానేపటి నుంచి తలయెత్తకుండా వ్రాస్తూవున్నారు.

పాలు — సలాం—హిందూ వివాహాలనుగురించి లెక్చరు మాసొసయిటీలో చదవడానికి వ్రాస్తున్నాను. ఆలెక్చరు యీసాయంకాలానికి కావలెనుగనుక, మీరు వచ్చినదిచూడకుండా వ్రాసుకుంటూవున్నాము. పార్డనుచెయ్యండి. ఈసబ్బకుమీద మనం డిస్కస్సు చేతాము. మీలో వివాహం అనగా యేమిటి ?

మిరా — పెళ్ళిచేసుకున్నవాడూ పెళ్ళిచేసుకున్నది బ్రతికివున్నంతకాలమూ వకరినివకరు మీరి తిరగకుండా వుండడానికి చేసుకునే ఖరారు?

పాలు — సరే మీరన్నట్టుగా అది వివాహంచేసుకునేవారు యిద్దరూ యావజ్జీవమూ వకరిని మీరి వకరు తిరుగకుండానూ వకరికష్టసుఖములకు వకరుఅవుతూ యిద్దరూకలిసి వక్కరుగా వుండేటట్టుగానూ చేసుకున్న కంట్రాక్టు. అయితే కంట్రాక్టుకు యేమి ముఖ్యంగా వుండవలెనో మీరు చెప్పగలరా?

మిరా — చేసుకునేవాళ్ళు యిద్దరూ సమ్మతిపడవలెను. ఆలాసమ్మతి లేకుండా బలవంతపెట్టిచేస్తే యేఖరారూ చెల్లదు.

పాలు — వివాహంనాటికి ఆలాగంటిసమ్మతి యివ్వడానికి శక్తికలిగివుండడానికి వారు యుక్తవయస్సు వచ్చినవారుగా కూడా వుండనక్కఅలేదా ?

మీరా—తప్పకుండా వుండవలెను. అలాలేకపోతే వివాహాలే కావు. భాంచోత్. బ్రాహ్మలలోచేసేపెళ్ళిళ్ళు యేమి పెళ్ళిళ్ళండీ ? వాటికంటె బొమ్మల పెళ్ళిళ్ళయినా మంచివే. పాలుదాగే పసిపిల్లలనూ బట్టవిప్పివేసుకు తిరిగే పసిబాలుణ్ణీ పల్లకీలోపెట్టి దుంయి డుంయిమని బాజాలతో వూరేగించి పెళ్ళిఅంటారు.

పాలు — ఆపిల్లల కప్పుడు పెళ్ళిఅంటే యేమో తెలియదు. బ్రాహ్మణపెళ్ళిళ్ళు పురోహితుల డబ్బులాభానికేకాని వధూవరుల క్షేమానికికాదు. పురోహితులు తమకూ అర్థం తెలియకుండా యేమేమో మంత్రాలుచదివి డబ్బు పుచ్చుకొని ఆపసిపిల్లలిని పొగవద్ద కూర్చోపెట్టి నాలుగుమాట్లు యిటూఅటూతిప్పి అది పెళ్ళిఅంటారు. వూళ్ళో వాళ్ళు అంతాపోగయి గారెలూబూరెలూ తిని బట్టలుకట్టుకుని కుర్ర వాళ్ళకొంపలు తీస్తారు. బొమ్మలపెళ్ళిళ్ళుచేస్తే యెవళ్ళకీ నష్టం లేదు. యీపెళ్ళిళ్లు పెద్దవాళ్ళు ముచ్చటకోసం చేస్తే తరువాత పిల్లవాడికయినా పిల్లదానికైనా మసూచికం వచ్చి కాళ్లు పోయినా కళ్ళు పోయినా బాలరోగాలచేత యేదైనా ప్రాణభయం వచ్చినా తరువాత యిద్దరూ యేడుస్తారు. పిల్లవాడు చస్తే పిల్లది వక్కరోజయినా సుఖం యెరగక పెద్దదైనతరువాత నానాబాధలూ పడుతూ గంకుతనము మొదలైన పాపాలకు లోబడి యెల్లకాలమూ పెళ్ళిచేసినవాళ్ళ జీవానికి వుసూరు మని యేడుస్తూవుంటుంది.

మీరా—హిందువులు తమ పెళ్ళిళ్లలో బిడ్డలను కోతులలాగూ చతుష్పాదజంతువులలాగూ చూస్తారు. పూర్వం బరోడామహారాజుగారైన మల్హారిరావుగాయకవారుగారు పావురాలకు అయిదురోజులూ పెళ్ళి చేసి, బ్రాహ్మలచేత మంత్రాలు చెప్పించి, సంభావనలు యిచ్చి, విందులు చేయించి, వేలకొద్ది రూపాయలు ఖర్చుపెట్టి గొప్ప వుత్సవం

చేసినారు. పెళ్ళిఅయిన మూడోనాడే మొగపావురాన్ని పిల్లి యెత్తుకు పోయినది. ఆపెళ్ళిళ్ళకీ యీపిల్లలపెళ్ళిళ్ళకీ యేమీ భేదం లేదు.

పాలు — వక్క మల్లారిరావుగారయితే మాత్రమేకాదు ఇలాగంటి పిచ్చిపెళ్ళిళ్లు చేసింది. నవద్వీపపురాజయిన యీశ్వరచంద్రుడనే ఆయన కోతులకు యథావిధిగా మంత్రాలతో పెళ్ళి చేయించి లక్షరూపాయలు ఖర్చుపెట్టినసంగతి మీరు న్యూస్పేపర్లలో చదువలేదా ?

మీరా — చదివినాను. వారు వివాహాలు చేసిన కోతులకూ పావురాలకూ వున్నవివేకమైనా యిటునంటిమహారాజులకు వున్నట్టు కనపడదు. ఇదంతా బ్రాహ్మలు డబ్బులాగడానికి ప్రజలను మూఢులను చేసి పన్నినయంత్రము. ఇలాగంటి పాడువివాహాలు హిందువులలో తానా వున్నవి. వుత్తరహిందూస్థానములో డబ్బువున్నవిధవలు వుంటే వాళ్ళనద్ద డబ్బు లాగడానికి వెధవలయిళ్లల్లో వుండే తులిసిమొక్కను బ్రాహ్మడికి యిచ్చి వివాహంచేయించి, అది మొదలుకుని ఆబ్రాహ్మలను అల్లుళ్లలాగు చూపిస్తూ ఆడబ్బంతా వాళ్లకు కట్టిపెట్టిస్తారు.

పాలు — ఇలా చెయ్యడం మొగవాళ్లకుమాత్రమే కాకుండా విస్తారండబ్బు యిచ్చుకోలేని కులీన బ్రాహ్మలు స్త్రీలకుకూడా చేస్తారు. వివాహంకాకమునుపే బ్రాహ్మణస్త్రీ సమర్తాడితే కులంవారు గంగలో దిగవలె నని దాన్ని తప్పించుకోవడానికి వారు తమకొమార్తెను అరిటి చెట్లకూ సాలిగ్రామాలకూ యిచ్చి వివాహంచేసి ఆపద తప్పించు కుంటారు.

మీరా—హిందువుల అభిప్రాయప్రకారం అరిటిచెట్లు ఆడవో మొగవో నాకు తెలియకుండా వున్నది. ఆడవాళ్లకు కదళీపివాహాలు చేసినట్టే మొగవాళ్లకుకూడా మూడోపెళ్ళికి అరిటిచెట్టునే వివాహం

చేస్తారు. అటిచెట్టుకు వివాహం చేస్తే దోషం పోయేటట్టయితే, బ్రాహ్మలు చిన్నపిల్లలగొంతుకలు కొయ్యడంకంటె ముందుగా అరిటి చెట్లకు వివాహం చేసి తరువాత రజస్వల లైనతరువాత వారి యిష్టం వచ్చినవాళ్ళకు వివాహం చేసుకునేటట్టు చెయ్యరాదా ?

పాలు—చేస్తే బాగానే వుండును. నాకు యీవుపాయం తోచ లేదు. ఈసంగతి నేను యీరోజు లెక్చరులో వ్రాస్తాను. మీరుకూడా వస్తారుకాదా ? ఈదేశంలో యింకా యెన్నిచిత్రమైనవివాహాలు వున్న వనుకున్నారు ? బోగంవాళ్ళను దేవుడిగుళ్ళలో వుండేరాతిదేవతలకు వివాహం చేసి వాళ్లను కన్నవాడితోనూ రంకుతనం చెయ్యడానికి వూరిమీద వదిలిపెడతారు. వ్యభిచారం వీళ్లకు కులవృత్తి కావడంచేత వయస్సులో వుండేసంసారులు వీళ్ళవలలోపడి మాణిక్యంవంటి పెళ్లాలను వదలిపెట్టి యిల్లూ వళ్ళూ గుల్లచేసుకుని నిష్కారణంగా పాడవుతారు. ఆలోచిస్తే యిటువంటి పాడువివాహాలు యెన్నయినా వున్నవి. రావి చెట్లకూ వేపచెట్లకూ వివాహాలు చెయ్యడం మీరు మొన్న చూచి నారుగదా ? ఇవన్నీ నాలెక్చరులో వ్రాస్తాను. తరువాత విందురుగాని యిప్పుడు నాకు లెక్చరు వ్రాసుకోవడానికి సెలవు యిస్తారా ?

మీరా—సలాం. మీపని చూచుకోండి. కేపువ్రుదయం వచ్చి మీతో మాట్లాడవలసినసంగతి మాట్లాడుతాను.

(అని వెళ్ళిపోయినాడు.)

వినాయకచతుర్థి.

[వెంకట్రావుపంతులుగారును, రామనాథరావుగారును, శేషాచార్యులుగారును ప్రవేశించుచున్నారు.]

రామ—ఏమండీ పంతులుగారూ నిన్న వినాయకుడిచవితిగదా మీరు విఘ్నేశ్వరపూజ చేసుకున్నారా ?

వెంక — ఏమిటో ఇటూఅటూ చేసినాము. కానికాలాలు వచ్చినవి. ఇప్పుడు దేవుళ్ళమహిమా విస్తారంగా కనపడడం లేదు.

రామ — మీరు యేమివిఘ్నాలు పోవలెనని పూజచేసినారయ్యా ? మీలంచాలకు విఘ్నం లేకుండా యెల్లకాలమూ అవిచ్ఛిన్నంగా సాగిరావడానికి చేసినారా ?

వెంక — ఓర్వలేనిముండాకొడుకులకుమ్మల్లే మీరూ లంచాలు లంచాలు అంటారు. కార్యంచేసి వాళ్ళు సంతోషించి నాలుగుడబ్బులు యిస్తే పుచ్చుకుంటే యేమిదోషము? ఇదియేమి కన్నాలు వెయ్యడమా ? రండావివాహాలు చేసుకోవడమా ? ఏమి అకార్యకరణము ? మనం స్వతంత్రంగా చేసేటప్పుడు పుచ్చుకుంటే తప్పితంగాని పయిని పనిచేసే వాడు దొర అయినప్పుడు వాక్సహాయం చేసి లాభం పొందితే యేమి తప్పు ? పుచ్చుకోవడం చేతగాని అప్రయోజకపు ముండాకొడుకులు ప్రయోజకులను చూచి ఓర్వలేక కళ్ళల్లో నిప్పులు పోసుకుంటారు.

రామ — విస్తారం కోపంచెయ్యకండి. కొత్తరకంవాళ్ళముందర లంచాలు పుచ్చుకునేవాళ్ళను దూషిస్తూ మీరూ శ్రీరంగనీతులే సెలవిస్తారే ! మనలోమాట అడుగుతానుగాని కోపం చెయ్యక మీరు స్వతంత్రపుపనిలో వున్నప్పుడుమాత్రము లంచాలు మానివేసి మహా మడిగట్టుకొనివున్నారా ?

వెంక — వక్కజమీందార్లదగ్గిరతప్ప నేను యెక్కడా వక్కదమ్మిడీ పుచ్చుకోలేదు. ఆజమీదార్లపద్దనైనా మూడువేలూ నాలుగువేలూ అయిదువేలూ లాటుగా కొట్టివేస్తూవచ్చినానుగాని చిల్లర యెంగిలిపద్దుల కెప్పుడూ ఆశ పడలేదు. పెట్టెలనిండా ధనం మూలుగుతూ వళ్ళుకొవ్వివున్నారు. వాళ్ళవద్ద ఫదివేలులాగితే వాళ్ళఅయిశ్వర్యాని కేమయినా లోటు వస్తుందా యేమిటి ? అదియేమోకాని యిప్పటి కారు యింగ్లీషు చదువుకున్నవాళ్ళు వుద్యోగస్థులు పరియోజకులయి సంపాదించి పెళ్ళాలకు నగలు పెట్టుకున్నా బిడ్డలకు నగలు పెట్టుకున్నా మంచియిల్లు కట్టుకున్నా చూచి ఓర్వలేరండి. మేమూ ఇంగ్లీషు చదువుకున్న వాళ్లమేకదాండి ? మాకాలపువాళ్ళల్లో యిటువంటి ఓర్వలేనితనమూ ఫీతూరీకోరుతనమూ యేమీలేవండి. వాళ్లఓర్వలేని తనంచూచే దైవం యిప్పటివాళ్లకు యెంత గొప్పవుద్యోగాలుచేసినా అప్పులలోమునిగి యేడుస్తూవుండేటట్టు చేస్తూవున్నాడు. కాస్తలేసి వాళ్ళూ బియ్యేలు ప్యాసై వుద్యోగాలలోకి వచ్చి వుద్యోగాలవఖరే చెడగొట్టివేస్తూ వున్నారు. వీళ్లను చూస్తే మూలనున్నముసలముండ లేవదు. మావంటివాళ్లం కొందరం వుండబట్టి యీవుద్యోగాలకయినా కొంతమట్టుకు పూర్వపురస్మీ గౌరవమూ నిలుపుతూవున్నాముకాని మాతరువాతవచ్చేవాళ్ళకాలంలో అదీ పోతుంది.

రామ—అందుచేతనే మీరు సాధ్యమైనంతవరకు పెద్దపరీక్షల నిచ్చినవారిని దరికి చేరకుండా తరిమివేస్తూ మీబంధువుల కే వుద్యోగాలు యిప్పిస్తూ వున్నారు. యింకా పండుగు విశేషాలు యేమైనావుంటే సెలవియ్యండి.

వెంక—విశేషాలు యేమి వున్నవి ? రాత్రి కుర్చిముండాకొడుకులు యెవళ్ళోకాని మాయింటిమీద బెడ్డలు వేసినారండీ.

రామ — వినాయకుడిచవితినాటిరాత్రి యిళ్లమీద రాళ్ళు వేసి యెన్నితిట్లుతింటే అంతపుణ్యమట! చూచినారా యీమూర్ఖత?

వెంక — మనం అలాఆపూషించరాదు. ఏమీ పుణ్యం లేకపోతే మనవెద్దలు యిటువంటి ఆచారం అంగీకరించరు. మేమూ మాచిన్న తనంలో దీపాలు పెట్టగానే వడినిండా రాళ్ళుకట్టుకుని బయలుదేరి వీధివీధి తిరిగి ప్రతియింటిమీదా రాళ్ళు వేసి చెడతిట్లు తినేవాళ్లము. ఆరాత్రి తిన్నతిట్లన్నీ అన్ని ఆశీర్వచనాలేకాని అవి తిట్లుకావు.

రామ — మీరు యేమిచెప్పినా రాళ్ళు వెయ్యడం చాలాతప్పి తం. వొకానొకప్పుడు రాళ్లు పిల్లలకూ ఆడవాళ్లకు తగిలి చాలాఅపా యం చేస్తవి; ఇళ్లమీద పెంకులన్నీ చితికిపోతవి. ఈమరాచారం యెలాగైనా మానిపించవలసిందే.

వెంక — పోనియ్యండి. దీనిమాట యెలాగువున్నా గుమ్మాల ముందర పల్లేరుకాయలు వెయ్యడంలోమాత్రం యేమీ హాని లేదు. మేము మూడునాలుగురోజులకు పండుగ వస్తుందనగానే బయలుదేరి డొంకలన్నీ తిరిగి వొక్కొక్కడు రెండేసిగంపలు మూడేసిగంపలు పల్లేరుకాయలు పోగుచేసి గుమ్మాలవద్ద పోసేవాళ్లము. ఇంట్లో పడు కున్నవాళ్లు తెల్లవారిగట్ల చీకట్లో అల్పాచమానానికి లేచివచ్చి యెరక్కా కాలువేసి కసుక్కున గుచ్చుకున్నప్పుడు నొప్పిపెట్టి మూలుగుతూ వుంటే యెంతతమాషాగావుండేదనుకున్నారు? మేము యెవళ్లగుమ్మాల వద్ద మానినా బోగంవాళ్లే యిళ్లముందుమాత్రము తప్పకుండా కావలసినన్ని పల్లేరుకాయలు పోసి వచ్చేవాళ్లము. ఇది వంచిపని అంటారా కాదంటారా?

రామ — మొదట మీరుచెప్పిన దెంతమంచిపనో ఇదీఅంతే మంచిపని. ఇతరులు ముళ్లుగుచ్చుకుని బాధపడియేడుస్తూన్నంతసేపు మీకు

వినోదంగా వుంటుందండీ? ఇతరులను యేడిపించి లంచాలు పుచ్చుకుని తాము సంతోషిస్తూవుండేవాళ్లకు యిదీ అలాగే వుంటుంది--ఏమండీ శేషాచార్లుగారూ! బెల్లంకొట్టినరాయిలాగు మీరు మాట్లాడక వూరు కుంటారేమి?

శేష--పంతులుగారు అక్రమమైనమాట చెపుతారా? వారె ప్పుడూ మంచిదే సెలవిస్తారు. మీరు చెప్పినమాటా బొత్తిగా కొట్టి వెయ్యరాదు. అదీ కొంచెం ఆలోచించవలసిందే.

రామ--మీరు పంతులుగారి తాబేదార్లయినందుకు తగినట్టు గానే చెప్పినారు. పంతులుగారూ! మీరు శిష్యుణ్ణి బహుబాగా తర బీతుచేసినారండీ. నిన్నరాత్రి మబ్బువేసింది. చంద్రుడు కనపడ్డాడో లేదో కనిపెట్టిరారా?

వెంక--నిన్నరాత్రి నేను దీపాలు పెట్టకముందే భోంచేసి గదిలో ప్రవేశించి చంద్రుడు కనపడిపోతాడేమో అనేభయంచేత అల్పాచమా నానికైనా యివతలకు వచ్చినానుకాను. నేనైతే మధ్యాహ్నమే భాగ వతం చదివించి అక్షింతలు వేసుకున్నానుగాని యెందుకైనా మంచిదని గదిలోనుంచి కదలలేదు. పాలముంతలో చంద్రుడు కనపడి స్వామివారం తటివాడికీకూడా నీలాపనింద వచ్చినప్పుడు మనకు యెక్కడ తప్పు తుంది? వారంటే సమర్థులుగనుక యెన్నో తంటాలుపడి వచ్చిన నిందను పోగొట్టుకున్నారుగాని మేము యెక్కడపోగొట్టుకోగలము? యేమీ లేకుండా లంచాలు పుచ్చుకుంటామని యీవచ్చిన నిందలే చాలును. చంద్రుణ్ణిచూచికూడా యింకా లేనిపోనిసిందలు యెందుకు? నాకు తెలియక అడుగుతాను కానండి లంచాలుయిచ్చినవాళ్ళూ పుచ్చుకున్న వాళ్ళూవుండగా మధ్య వీళ్ళుయేడవడం యెందుకండీ? వాళ్లు యిలాగు యేడవడంవల్ల వాళ్ళకళ్లపైత్యపునీళ్ళు పోతవేకాని మాకు యేమీ

లోపం రాదు.

రామ—మీవీధి యేదైనా కేజువచ్చి రుజువుపడేదాకా మీరు మహారాజులవలె వుంటారు. పూర్వం శిరస్తాదారీలు చేసినవాళ్లూ తహశీల్దారీలు చేసినవాళ్ళూ యెంతమంది జమిలులోకి వెళ్లినారుకారు? దొంగతనాలు కొన్ని బయలుపడకుండా దాగిదొంగలు భాగ్యం అనుభవిస్తూవున్నట్టే లంచాలు పుచ్చుకునేవాళ్ళూ కొందరు ధనవంతులై గర్వపడుతూ వుంటారు.

వెంక—మీరు దొంగతనంతో పోలుస్తూవున్నారు. వుద్యోగధర్మాన్నిబట్టి సంపాదించుకొనేదానికీ దొంగతనానికీ సాపత్యమండీ? మీరు స్నేహితులు గనుక వూరుకున్నానుకానండి మరివకరు యీమాట అంటే యేమి చేస్తునో.

రామ—మీరు యేమి చేయించడానికైనా సమర్థులు; అధికారం చేతిలోవున్నది. మావీధి దొంగఛార్జి తీసుకరమ్మన్నా తీసుకవస్తారు. మీరు యిలాగంటి కపటోపాయాలచేత యవరినైనా వంచించవలెను గాని రుజువార్గంగా యెవరినీ యేమీ చెయ్యలేరు. దొంగతనానికీ దీనికీ కొంచెంభేదం వున్నది. డబ్బు హరించడము దీనికీ దానికీ సమమేకాని వాళ్ళు రాత్రిళ్లు యజమానులు యెరగకుండా యేమరించి యెత్తుకు పోతారు; వీళ్ళు పట్టపగలు సొమ్ముగలవాళ్లచేతనే సొమ్ము తెప్పించి మోళ్ళో వేసుకుంటారు.. ఆదొంగలినైనా తప్పించుకోవడానికి వీలువున్నది కాని యీపగటిదొంగలనుంచి తప్పించుకోవడానికి వీలులేదు. దొంగతనంతో పోల్చడానికి మీకు సరిపోకపోతే బందెపోటుదొంగతనంతో పోల్చవచ్చును. అప్పుడు దానికీ దీనికీ ఆట్టే భేదం వుండదు. అదీ యివ్వకపోతే అపాయంచేస్తామని బెదరించి పుచ్చుకోవడమే; యిదీ యివ్వకపోతే హానిచేస్తానుని బెదరించి పుచ్చుకోవడమే. నా మాటలు వింటే కోపం

మాటలు వింటే మీకు కోపం వస్తూవున్నట్టు మీ ముఖచర్యవల్ల కనపడుతూ వున్నది. ఎంతస్నేహితుడైనా వుద్యోగస్థుణ్ణి చూస్తే జడుస్తూవుండవలెను. మీరు రాత్రి చందుణ్ణి చూడకుండానూ, అష్టింతలు వేసుకునీ విఘ్నేశ్వరుడికి వుదరంపూజా మొదలైనవి చేసి వుండాల్సి పోసిన్నీ మీరు జాగ్రతపడ్డారు గనుక ఆమహానుభావుని బానకడుపునూ, చేటచెవులున్ను, వంకరతొండమున్ను, వంటి కొమ్మున్ను, యెలకవాహనమున్ను, మీకు యేఅపాయమూ రాకుండా రక్షించునుగాక! నేను సెలవు పుచ్చుకుంటాను.

వెంక—మంచిది వెళ్ళిరండి. మన మనుకున్నమాటలు పేపరు వాళ్ళతో చెప్పేరు సుమండీ. (అని వెళ్ళుచున్నారు.)

అంత్యపుష్కరమహాత్మ్యము.

[అప్పావధానులుగారును, రామసోమయాజులుగారును, భీమరాజుపంతులుగారును పరివేశించుచున్నారు]

అప్పా—ఏమండి పంతులుగారు స్నానానికి విజయంచేసినారా! దయచెయ్యండి పుణ్యకాలం మించిపోతుంది.

భీమ—స్నానానికి తొందర లేదు లెండి. మీరు మీదస్తు చేసుకుంటూ వుండండి. మాఆడంగులబండివచ్చినతరువాత మేము వస్తాము.

అప్పా—రామసోమయాజులుగారూ? మీరు దయచేస్తారా పుష్కరమహత్యం చూచినారా గోదావరి యెలాగు పుష్కరంగా వచ్చిందో.

రామ—నేను పంతులుగారితోనే వస్తాను. వెనకాల మా బందువులుకూడా వస్తూవున్నారు. వారు వచ్చిందాకా నేను రాను,

అప్పా — అలాగైతే . నేను సెలవు పుచ్చుకొని యీరేవులో మీరు వుభయులకోసమూ కసిపెట్టుకొని వుంటాను. నన్ను పిలవడం మరిచిపోయేరు సుమండీ ?. (అని వెళ్ళుచున్నాడు.)

భీమ—మీరు బంధువ్ర లంటే జ్ఞాపకం వచ్చింది. ఈబంధువుల బాధ పడలేక యీవూరు విడిచి లేచిపోదా మని బుద్ధిపుడుతూ వున్నది. నాకు తాలూకాకచేరీలో నెలకు పదియేనురూపాయలుజీతం వస్తుంది. మహాదొరికితే పైగా ఫది దొరికేను ఫదిహేను దొరికేనుగాని అంత కంటె యెక్కువ దొరకవు. మాది పదిమందిగలకుటుంబము. మాకు వచ్చేది యీపట్నవాసంలో తిన్నగా తిండికే చాలదు. అటువంటి సితిలో రోజూ నలుగురూ అయిదుగురూ కోర్టుసాక్ష్యాలనిమిత్తం వచ్చి బంధువుల మని యింటిమీద వచ్చి కూర్చుంటారు. వాళ్లకు తెలియ వలెనుకాని మొఖమాటం లేకుండా వచ్చినవాళ్ళను యెలాగు పొమ్మ నను? వాళ్ళబంధుత్వంకాల! యెలాగంటి బంధువులో నాకు తెలియదు. వొకడు మా మేనమామగారి సవతితల్లికి వక వేలువిడిచిన పినతల్లి మనమడిని అంటాడు. ఇంకొకడు మా సవతి ముత్తవతల్లి మేనమామ గారి పెంపుడుకొడుకు మునిమనమడికి తోడల్లు ణ్ణంటాడు. ఇలాగు ఫదితరాలునుంచి బంధుత్వాలు తెలుపుకొనివచ్చే గాడిదెకొడుకులు తాము వంటరిగానైనా రాకుండా తమతోకూడా దొంగసాక్ష్యాలకు వచ్చేవాళ్ళను నలుగురిని యింటిమీద తెచ్చి కూర్చోపెడుతారు. మేము ఋణమో భణమోచేసి డబ్బు తేవడం వకయెత్తూ ఆడవాళ్ళు చాకిరీచెయ్యడం వకయెత్తుగావున్నది. మాఆడవాళ్ళు వీళ్లందరికీ వంట చేసిపెట్టలేకనూ స్నానాలుచెయ్యలేకనూ చచ్చిపోతూవున్నారు. మీరు పైదీకులుగనుక అదృష్టమంతులు. మీకు యిటువంటి చుట్టాల బాధ లేదు. వకనాడు యెవరైనా నలుగురు చుట్టాలు వచ్చినా వాళ్ళను

తీసుకుని మీరుకూడా యేసత్రములోకైనా బయలుదేరుతారు. మీలోనైనా లౌక్యంలోవున్నవారికి యీ బాధకాలుగాని మీకు లేవు.

రామ—మీరు పుణ్యవుండి ఆలాగే అనుకుంచారు. బంధువులతో మేము పడేపాట్లు దేవుడికి యెరికె. మద్దెలవచ్చి రోలుతో మొట్టి పెట్టుకున్నట్టు మాదుఃఖము మేము యెవరితో మొట్టి పెట్టుకోము? మీరా రన్నట్టు ఇప్పు డాసతాల్రూ విశేషంగా లేవు. జమీందారులుకూడా సతాల్రు యెత్తివేస్తూవున్నారు. వున్న రెండుమూడు సతాల్రలలోనైనా ఆవేళకు మూడురూపాయలకు అరదేశికీ పరదేశికీ వక్కమూటు నాలుగుమెతుకులు వేస్తారేకాని గ్రామంలో వారికి యెవరూ పెట్టరు. మాయిళ్ళకు మీకంటె యెక్కువబంధువులు వస్తారు. మీబంధువులైనా యేపట్టుగుడ్డకట్టుకునివండి నాలుగుమెతుకులు విస్తట్లోవేసినా తిని లేచిపోచాగుగాని మావాళ్ళు స్వహస్తపాలకులమనీ వైశ్వదేవపరులమనీ శ్రోత్రియులమనీ అహితాగ్నులమనీ సకలమైన యాతనలూ పెడుచారు. వొకొక్కడునచ్చి గోముఖంలో చెయ్యి దూర్చుకొని దర్భాసనంమీద ముక్కుమూసుకొని కూర్చున్నాడంటే యింట్లో వున్నవాళ్ళందరూ మూడురూపాయల దాకా మెతుకులు దొరకక మాడి చావడమే కాకుండా ఆడవాళ్ళు పొద్దున్ననగా మడికట్టుకుని పొయికాడ నూర్చుండి యీలోగా కడుపుబ్బుకునివచ్చి పదిస్నానాలు చేస్తారు. మావాళ్ళచాదస్తం కాలిపోను మీలోమల్లె మాలోకంతస్నానాలు పనికిరావు ఇంతమందిని చూస్తారుగదా మావైదీకంలో వున్నవారిలో చక్కగా తలదువ్వుకుని కొప్పుపెట్టుకుని వున్న ముత్తైదును మీరు యెప్పుడైనా చూచినారేమో చెప్పండి. పట్టుమంటే మాయిళ్ళకువచ్చినంతమంది బంధువులు మీయింట్లకు

రానేరాదు. రాచకార్యమో యేదో వుంటేనేకాని మీాయిళ్ళకు చుట్టా లురారుకాని మీాయిళ్ళకైతేనో కోర్టుసాక్ష్యాలకే కాకుండా యీవూళ్లోయెవళ్ళయింట్లో యేశుభకార్యమైనా అశుభకార్యమైనా ఫదామడల నుంచి సంభావనల నిమిత్తం బ్రాహ్మలు పరుగెత్తుకునివచ్చి తిండికి బంధువుల యిళ్ళనీాద కూర్చుంటారు. ఈపట్నవాసంలో యేగొల్ల వాళ్ళ యింట్లోనో యేకోమటి వాళ్ళయింట్లోనో ప్రతిరోజూ యేదైనా శుభకార్యమో అశుభకార్యమో అవుతూనే వుంటుంది అదంతా యెందుకుకానండి యీాపుష్కరాలలో డబ్బునిమిత్తంవచ్చి తమ డబ్బు మీాటకట్టుకుంచూ యెంతమంది బంధువులున్నాగో మా యింటికి వచ్చి మీారు వక్కపర్యాయం చిత్తగించండి. మాయింట్లో యిప్పుడు కాలుపెట్టడానికి యెడములేదు. వీరు యీాపన్నెండురోజులూ వుండేవారే కాని యీాలోపుగా వదలిపోరు.

భీమ—మీాకంతబాధగా వుంటే వెళ్ళిపొమ్మని వారితో మొఖ మీాటం లేకుండా చెప్పివెయ్యరాదా?

రామ—మీారు మాత్రం యెందుకుచెప్పరాదు?

భీమ—అవును మనంచెప్పడం బహుకష్టం. వకరియింటినీాదపడి తినేవాళ్ళు వాళ్ళకు జ్ఞానంవుండవలెనుగాని మనం యెట్లాగుచెప్పము?

రామ—ఋణాలుచేసి పెట్టలేక బాధపడుతూవుండేవాళ్ళం మనమే కాస్తచెప్పలేకపోతే డబ్బుఖర్చు అక్కరలేకుండా తేరగా సుఖభోజనం చేస్తూవుండేవాళ్ళకు లేచిపోవడానికి వాళ్ళకేమిపట్టింది; మొఖమీాటం మనను విడవకుండా వున్నంతవరకు మనం యిలాయేడుస్తూ వుండవలసిందే.

భీమ—అగుగో మా వాళ్లువస్తూవున్నారు. ఇక మనం స్నానానికి వెళ్దుంవు

రామ — ఆడంగులువున్నారు. మీరు బహుజాగ్రత్తగా సీటిలో దిగవలెను సుమండీ. నిన్న వకతూర్పుబ్రాహ్మడు పాపం నిష్కారణంగా స్నానం చెయ్యబోయి యిట్టేచచ్చిపోయినాడు. పలుగుముండా వాళ్ళు మూక సందట్లో తోసివేస్తారు. సంభావననిమిత్తమై బ్రాహ్మలు మీదపడ్డప్పుడూ అప్పుడూ మీరు పరాకుగా వుండకూడదు.

భీమ — పాపం, ఆబ్రాహ్మడివిషయంలో మోక్షానికి వస్తే మొసలి యెత్తుకుపోయిందన్న సామెత నిజం అయింది ఆయనకు ముప్ప యియేళ్ళువున్నవట ! పాపం భార్యకూడా దగ్గర వుండి మునిగిపోతూ వుండగా చూస్తూనేయున్నదట! మనవాళ్ళ యిటువంటి యాత్రలు పుణ్యమని చెప్పడమేకాని నాకుచూస్తే నాలుగుడబ్బులు వదలడమూ బాధపడడమూతప్ప మరియేమీ పుణ్యం కనపడదు. ఈపుష్కరాలకు యెవరైనా గొప్పవారు వచ్చినారండీ ?

రామ — నాకు యెవరూ కనపడలేదండి. మరిడిఅమ్మవారు గొప్పామె వస్తుందని చెప్పినారుకానండి ఆమెవచ్చినజాడ ఇంకా తెలియలేదు. వస్తేమాత్రం యీవచ్చినవాళ్ళను చాలామందిని తీసుకు పోకుండాపోదు. ఆమె ప్రత్యక్షముక్తిదేవత! వేళకు తిండి లేకుండా యేచెట్టుకిందనో పచ్చిపులుసూ మెతుకులూ తిని, వానలలో తడిసి, ముక్తికోరి బహుదూరాన్నుంచి వచ్చినవారిని అనేకమందిని ఆమె స్వర్గానికి పంపించకుండా మానదు.

భీమ — ఆమె యీమాటు యిక్కడకు వచ్చేటట్టు కనపడలేదు. ఇప్పుడు కృష్ణపుష్కరాలు ఆరంభమట ! అక్కడకు విజయంచేస్తుందని విన్నాను. ఇంతకూ ఆమెచిత్తము. ఇంతమంది రావడంచేత మన వూళ్ళో ఇప్పుడు పేడబొమ్మలకూ, చెడిపోయిన పాతమిఠాయికీ పండీ పండని అరటికాయలకూ అమ్ముడుపోకుండా నిలవవున్న పాతరవికల

గుడ్డలకూ గొప్పమృత్యువువచ్చినది. వూళ్లవూళ్లనుంచివచ్చిన తుప్ప తలము తైదులు పైవస్తువులను వేటినిజూచినా బ్రీతుకనియ్యడం లేదు.

రామ.—తమరు విన్నారేమో యీపుష్కరమహాత్యం నాకు కాస సెల విసారూ.

భీమ — నేను యేమహత్యమూ వినలేదు. ప్రత్యక్షంగా కనపడే మహత్యం చెపుతాను కావలిస్తేవినండి. మనవూళ్ళో వోధ్రులు మూకలు మూకలుగా వచ్చి మురికిగుడ్డలతో ములగడంచేత గోదావరి జిడ్డుతేరి నల్లగా యమునానది అవుతూవున్నది; నీరుకాసులు పట్టెబ్రాహ్మణులకు ధనలాభం కలుగుతూ వున్నది ; మ్యునిసిపల్ వారికి కావలసినంత పెంట భాగ్యం కలుగుతూ వున్నది ; వీధులన్నిటికీ చిన్నకాలువలతో ముక్కు-మూసుకోవలసిన పరిమళం యెక్కువవుతూ వున్నది ; బళ్ళు విస్తారం వస్తూ పోతూ వుండడంచేత టోలుకంట్రాక్టర్లకు సంతోషం యెక్కువవుతూ వున్నది; బజారులో వస్తువులు ప్రియం కావడంచేత పేదలకు సంతోషం తక్కువవుతూ వున్నది. ఇదే నాకు తెలిసిన పుష్కర మహత్యం. మీకొమారుడికి వుద్యోగం అయినప్పటినుంచీ మీరు సంభావనకు వెళ్ళడం లేదుకాబోలును.

రామ — వెళితే మావాడికి కోపంగా వుంటుందని మాని వేసినాము. అదుగో అప్పానభానులు మళ్ళీ వస్తూవున్నాడు. స్నానానికి పోదాముర౦డి మీవాళ్ళూ వచ్చినారు. (అని వెళ్లుచున్నారు.)

జమాబందీ. ౧

[కరణము శామయ్యగారును, శాపులదొరయ్యయు, మువిస్వామియు,
వీరాస్వామియు ప్రవేశించుచున్నారు.]

కర—దొరయ్యా! నీవు గ్రామానికి మునసపువు అయివుండీ తవ్వల తాతయ్యగాడివద్ద నాలుగురూపాయలు వసూలు చెయ్యలేక పోయినావుగదా?

దొర—బండముండాకొడుకు యివ్వకపోతే నే నేమి చెయ్యనండీ? అన్నీ యిప్పుడే వచ్చినవి. అవతలగ్రామంలో దస్తుచేసి డెల్టాసూర్యాప రింటెండెంటు మొఖాన్ని పోస్తేనేకాని పొలాలలోకి వక్కచుక్క నీరు రాదు. ఇవతల జమాబందీఖర్చులకు దస్తు చెయ్యవలెను. గోరుచుట్టు మీద రోకటిపోటు పడ్డట్టు సర్కారుకిస్తీకూడా యిప్పుడే వచ్చింది.

కర—వీరాస్వామీ! నీవు డెల్టాసూర్యాపరింటెండెంటుగారి వద్దకు పోయి యిప్పుడు జమాబందీ తొందరవచ్చింది, యీతొందర అణిగిం దాకా నెలదినాలు వోపికచేస్తే సొమ్ము దాఖలుచేసుకుంటాము, యీ లోపుగా నీరు వదిలిపెట్టు మని అడగలేకపోయినా వోయి!

వీరా— యెవరియొద్దనైనా పనికివస్తుందికాని ఆ మారాజువద్ద ఆపప్పుకుదు. చిల్లిగవ్వ తక్కువకాకుండా సొమ్ము అక్కడపెట్టి మరీ మాటాడ మంటాడు. నిరుడుసంవత్సరం మామూలులో వక్కరూపాయి తక్కువవచ్చిం దని నేను మళ్ళీ వూరికివచ్చి పట్టుకువెళ్ళి యిచ్చిందాకా చేలు యెండిపోయినా గిడ్డెము నీరు వదిలిపెట్టినాడు కాడు. పొలాలు యెండిపోయి రహీతులందరూ గొల్లున గోలపెట్టినారు. ఎవరికి కాంత యెనకాముం దయినా తిరపతియెంకటేశ్వర్లముడు పది ముందుగా చెల్లించుకోక తప్పదు. మనని యిలా యేడిపించి సొమ్ము పుచ్చు

కుంటూరా అండి. ఆభ్యా యిలాగే పయివాళ్ళకు లంచాలు పొయ్యాల నంట సుమండీ ?

కర — మనం వాళ్ళకు యెలాలోకువో పైవాళ్ళకు వాళ్ళూ ఆలాగే లోకువ. ఇప్పుడు హుజూరున యెవరో మేనేజరు వున్నాడట. అతడు డెల్టాసూపరెండెంట్లూ మొనలయిన వాళ్ళవద్ద లంచాలు మహా దోచుకుంటూవున్నా డట ! అన్నవేళకు లంచంసొమ్ము దాఖలుచెయ్య లేకపోతే మొన్న వక డెల్టాసూపరెండెంటును తీసివేయించి రెండు వందలరూపాయలు పుచ్చుకుని ఆపని మరివకడికి వేయించినాడు. రెండు నెలలయినా గాలేదు. ఇంతలోకే యేదో తప్పితం వచ్చిం దని యీ కొత్తవాణ్ణికూడా తీయించివేసి మూడువందలు దొబ్బి మరివకరికి వేయించినాడు. శ్రీరంగరంగా హుజూరులో మరీ అన్యాయంగా వున్నది.

మని — డెల్టాసూపరెండెంట్లకు అలా కావలసినదే. మొన్న నేను పాడికి మా పెద్దఆవును తోలిపెట్టినాను కానని మాదొడ్డెడు పశువులనూ కాలువగట్లు తొక్కిన వని వంక పెట్టి యీనెలలో మూడు మాట్లు బండెలదొడ్లో పెట్టించినాడు. నాకు యాభయిరూపాయలు వదలినవి. యీపాట్లు పడలేక నిన్నవుదయాన్ని మాఆవును తోలించి వేసినాము. ఆవును పంపించేటప్పుడు నాపెళ్ళాము పెద్దపెట్టున యేడ్చింది. నిరుడీదినాలలో దాన్ని నూరురూపాయలు పెట్టి కొన్నాను. పూటకు దూడకుపోగా మూడుసేర్లపాలు యిస్తుంది. ఈవుద్యోగస్థులమూలంగా మంచివస్తువ యేదీ కొనుక్కోరాదు.

కర — దానితల్లిశిఖకోసిన ఆవు. అదే పోయిందికాని ముందుగా యీ జమాబందీమాట చూతూ. ఈగండం గడిచి పిండం బయలపడితే తరువాత అన్ని మెల్లిగా చూచుకోవచ్చును. జమాబందీఖర్చులు

నాలుగువందలూ నేట రేపటిలో మనగ్రామంమీద వసూలయ్యేసాధనం చూడు. నీపెత్తందారీ చూతాము.

మని — మరేమీ పర్వా లేదు. యెలాగో వకలాగు ఎసూలవుతవి. నాది పూచీ. వూరిమీద వూగుపడ్డా కరణంమీద కాసు పడదు. మెట్టుమీద మీకు యిందులో వందరూపాయలు మిగులుతవి గాని వక్కదమ్మిడీ చేతిది తగలదు.

కర—అలాగైతే తరువాత మెల్లిగా రాబట్టుకోవచ్చునుగాని మోతుబరీరహితులు మీరు తలాషదిరూపాయలూ మళ్ళీ వేసుకుని రేపు నాచేతి కివ్వండి.

వీరా — ఈజమాబందీ యెప్పుడు విరగడవుతుందో కాని గ్రామంలో బహుఅల్లరిగా వున్నది. బట్రోతువాళ్ళు వూరిమీద పడి యీడిగవాళ్లయిళ్లలోనూ చాకలవాళ్ల యిళ్లలోనూ దూరి కోడి పిట్టలనూ కూరగాయలనూ బలవంతంగా కొట్టి లాక్కు-పోతూవున్నారు. వూరంతా గోలయెత్తి లబ్బున మొత్తుకుంటూ వున్నారు. పాకల నిమిత్తమూ పందిళ్ళనిమిత్తమూ మనవూళ్ళో తాటిచెట్లన్నీ మోళ్లయి పోయినవి. పుల్లలకింద సఖంతుమ్మచెట్లు పోయినవి. పదిహేను రూపాయల గుమాస్తాకాడినుంచి ప్రతివారియింటివద్దా పందిరి వెయ్యవలెను; ప్రతివారియింటికీ తోరణాలే కట్టవలెను. వూరువూరునుంచీ యిలాగు ప్రతిరోజూ ప్రతియింటికీ పెరుగుకావిళ్ళూ పాలకావిళ్ళూ కర్రిలకావిళ్ళూ కూరలకావిళ్లూ వెళతవికదా! ఇవన్నీ యేమిచేస్తారండీ?

కర — యేమి చేస్తారా ? తమకు కావలసినవిపోగా మిగిలినవి బసదిగిన యింటివాళ్ళకు యిచ్చివేస్తారు. పుల్లలు మొదలైనవి మళ్ళీ జమాబందీ వచ్చిందాకా యేటికియేడాదీ సరిపోతవి. అందుచేతనే పర దేశబ్రాహ్మడు వస్తే బసయివ్వనిముండాకొడుకులందరూ మాయింట్లో

దిగవలసింది మూయింట్లో దిగవలసిన దని వుద్యోగస్థులను యెదురు గుండా వెళ్ళి తీసుకువచ్చి ఇళ్లల్లో దింపుకుంటారు. యేమిలాభం లేక పోతే వారిమొఖం కంచిగరుడస్సేనా యేమిటి వూరికే బసలు యెందుకు యిస్తారు.

వీరా — వుద్యోగస్థులు వెచ్చాలనిమిత్తం కోమట్లకు వ్రాసే చీట్లు బహుచిత్రంగావుంటవి. యెవరి కావస్తుపులు కావలెనో యెక్కడా పేరు వుండదు. యెవరి కీచీట్లు వ్రాసినారో ఆకోమటి పేరు వుండదు సరిగదా కింద కావలసినవారిదస్కత్తైనా వుండదు. కరణంగారూ! కోమట్లు మనను దగాచేసి దొంగచీట్లు వ్రాసి మనవద్ద సొమ్ము పుచ్చుకున్నా పుచ్చుకోవచ్చును. అడుగున దస్కత్తా వల్లకాడా? పట్టుకోవడానికి యేమి ఆధారము?

కర—గుండెలు వున్నవీ? కోమటివాడు వక్కనాటికి ఆలాగంటి దగా చెయ్యడు. పట్టణవాసపుకోమట్లయితే చేస్తారేమోకాని పల్లెటూరి కోమట్లు చెయ్యలేరు.

ముని—అయ్యా కరణంగారూ! వుద్యోగస్థులు మనంతినేదాని కంటే మూడు రెట్లు భోజనం చేస్తారు సుమండీ! మనం పద్దులుచూస్తే వక్కొక్కరికి రోజుకు మూడు సేర్లు బియ్యమూ సేరుసేరునెయ్యీ అవుతుంది. సప్లయిలన్నీ మనంచేస్తాము కదా ఈరోజులలో సరాకారువారు వుద్యోగస్థులకు జీతాలు యిస్తారా? యివ్వరా?

కర — సరాకారువారు యెప్పటికిమల్లేనే జీతాలు యిస్తారు. ఆజీతాలుమాత్రమే కాకుండా మనం యిచ్చేమామూళ్ళూ అన్నీ కలిసి షదిహేనురూపాయల గుమాస్తాలు సమేతూ జమాబందీ అయి ఇంటికి వెళ్ళేటప్పుడు నాలుగేసివందలు అయిదేసివందలు పట్టుకు వెళుతారు. వుద్యోగస్తులూ భోజనాలు మనలాగే చేస్తారుకాని

యెక్కువ తెప్పించిం దంతా తమరిని ఆశ్రయించుకుని వున్నవారికి ఇస్తారు.

ముని—ఈ జమాబందీలో అంతా శిరస్తాదారుగారికి యేమి దొరుకుతుందండీ ?

కర—మన శిరస్తాదారుగారికా ? యెంత దొరుకుతుందో నాకు తెలియదుకాని తహశ్శీలుదారుగారిద్వారా మామూళ్ళు వుంటవి. ఈ తాలూకాలో అంతా నాలుగువేలరూపాయలు మామూళ్ళు వుండ వచ్చును. వీరికి యిచ్చేది కాకుండా తహశ్శీలుదారు పెద్దహుజూరు వారికికూడా వేరే యివ్వవలెను. అంతమాత్రం యెందుకు ? వుపనయనం చేసుకుంటారనీ, యిల్లుకట్టించుకుంటారనీ, యజ్ఞాలుచేస్తారనీ, సత్కాలూ చలివేంద్రాలూ పెట్టిస్తారనీ, వీరుసిఫారసుచేసే బ్రాహ్మలకు యివ్వడానికి ఫక్తు గ్రామాలనూద వసూలుచేసేసొమ్ము యెంత వుంటుందోచూడు. మొన్న కాశీసంతర్పణ చేస్తానన్న బ్రాహ్మడు వక్క- మనతాలూకాలో నుంచి యెనిమిదివందలరూపాయలు పట్టుకునిపోయినాడు. శిరస్తాదారు గారు పంపించిన బోగందానికి యేతాలూకాలోనూ వెయ్యన్నినూట పదహార్లకు తక్కువ యివ్వలేదు.

వీరా— శిష్టాగసులుమాత్రమే కానండీ. యీవుద్యోగస్థులు కూడా యిళ్ళు కట్టించుకుంటూ మనీ కోమాళ్ళకూ కోమార్తెలకూ పెళ్ళిళ్ళు చేసుకుంటూ మని చాలాసొమ్ము వసూలు చేస్తారు.

కర—అది సరే. వారియింట్లో కార్యము లయినప్పుడు వక్క డబ్బుతో కుదరదు. వూళ్ళల్లో వున్నమంచివస్తువు లన్నీ వారియిళ్ళకే వెళుతవి. మొన్న శిరస్తాదారుగారు ఫనివేలరూపాయలుఖర్చుపెట్టి యిల్లు కట్టించు కున్నారుగదా వారికి వక్కదమ్మిడీ చేతిది తగిలిందీ ? నీకు జ్ఞాపకం లేదు. మనవూళ్ళో వున్నచేవతాడిచెట్లన్నీ కొట్టించి నీవే కాదూ తరు

వులు వేుంచి వెట్టివాళ్ళ చేత పంపించినావు. మనవూళ్ళో దానయ్య గాడు వేుంచిన ఇటుకామమంతా రాత్రికి రాత్రి అక్కడకు వెళ్ళ లేదా ? గొప్పవుద్యోగస్థులఇంట్లో శుభకార్యాలు అుతే పంపించిన వస్తువులలో మిగిలినవి అమ్మివేస్తే యెంతోసొమ్ము వస్తుంది.

వీరా—అగుగో శిరస్తాదారుగారు వస్తూవున్నారు. దొరగారి ఛోరాదగ్గిర వడిగ్గా మాట్లాడుతూవున్నారని బంట్రోతులనుపెట్టి కొట్టించి పోతారు పారిపోదాము రండి. (అని లేచిపోవుచున్నారు.)

జ మా బ ం ది. ౨.

[తహశ్శీలుదారుగారును, తాలూకాగుమాస్తాయును, ప్రవేశించుచున్నారు]

తహ—ఏమండీగుమాస్తాగారూ! మీరుచెప్పినమాట నిజమేనా?

గుమా—నిజమేనండి. కిలెక్టరుదొరగారు మీమీద మండి పడుతూ వున్నారని ఇవాళ వుదయాన్న శిరస్తాదారుగారి ఇంటికి వెళితే చెప్పినారు. మీరు తహశ్శీలుదారీపనికి పనికిరారనిన్నీ పైకి వ్రాస్తామనిన్నీ దొరగారేమో సెలవిచ్చినారట ?

తహ—నిష్కారణంగా నామీద దొరగారికి యీప్రకారంగా ఆగ్రహం రావడానికి కారణమేమండీ ? నేను ఎక్కడమ్మిడీ లంచం పుచ్చుకోను. శిస్తులో యెక్కడా అరియరున్న లేదు. చురుకుగా పని చేసాను. అందరికంటెను యెక్కువపరీక్షలు యిచ్చినాను.

గుమా—మీరు యెక్కువ పరీక్షలు ఇవ్వడమూ లంచాలు పుచ్చుకోకపోవడమూ యీకాండేమండి దొరగారి ఆగ్రహానికి కారణమయింది. మీరు పరీక్షలు యివ్వకపోతే అందరుతహశ్శీలుదార్లూ లంచాలు పుచ్చుకుని హుజూరువారికి లంచాలు యిస్తూ

వుందురు. అందువల్ల మీరూ బాగుపడుదురు. వారూ సంతోషిస్తురు. మీకు దొరగారివద్ద క్యారక్టరూ వచ్చును. మీరు నిన్న బొల్లేరు వాడికి మామూలు నాలుగురూపాయిలూ యిచ్చివేసినట్లయితే వాడు దొరగారితో యేమీ చెప్పకుండా వుండును.

తహ -- నాకువచ్చే నూటడెబ్బయిఅయిదు రూపాయలతోను ప్రతివాడికీ లంచాలు యెక్కడయివ్వను? నాజీతం మాయింట్లో భోజనానికే సరిపోతుంది. వాడు యీతాలూకాలో యెక్కడాదొరకని సువాసనగలసబ్బు దొరసానిగారికి కావలె నంటాడు. అసాధ్యమయిన కోరికలు కోరితె యెక్కడ తేగలము? యెంతమంచివస్తువులు తెచ్చినా మంచివి కావంటాడు. పుచ్చుకొన్నవస్తువులకు సొమ్మి యివ్వడు.

గుమా -- యెవరిమామూళ్ళు వాళ్ళకు యివ్వకపోతే అన్నీ ఇలాగంటి తటాంతే వస్తవి. బొల్లేరువాడు మనంయిచ్చిన ప్రశస్తమైన సన్నబియ్యం యెక్కడనోదాచి యెక్కడివో ముతకవిచేబియ్యం వండి పెట్టి దొరగారితో తహశ్శీలుదారు ఇలాగంటి పాడుబియ్యం పంపించినాడని చెప్పినాడట. మీరుపంపించినసబ్బుబిళ్ళలు చూపక దాచి తహశ్శీలుదార్ యీవూళ్ళో సబ్బుదొరకదన్నాడని దొరసానిగారితో చెప్పినాడట.

తహ--దొరలు నిజంకనుక్కోకుండా ఇలాగంటివాళ్ళ చెప్పుడు మాటలు వింటారండీ ?

గుమా--అందరూ యేకమై చెపుతూవుంటే యెంతమంచివాడైనా వింటాడు. దొరగారు తిండితిని ఢేరాలో వక్కడూ కనిపెట్టుకు కూర్చుంటే నిన్నటిదినం గుమాస్తాలు రెండుఘంటలకు కచేరీకి ఆలస్యంగా వెళ్ళినారు. యెందుచేత ఇంతఆలస్యంగా వచ్చినారంటే మేము సొమ్మిపంపినా తహశ్శీలుదారు బియ్యం మొదలైనవి వేళకు సప్లయి

చెయ్యక అరఘంటముంచు వట్టి చేబియ్యముపంపించినాడనిన్నీ, కనిపెట్టు కుని వుండివుండి ఆ అన్నముతినడానికి వల్లకాక పారవేసి దొరగారు కోపపడుతారేమో అని వేగిరం పరుగెత్తుకొని వచ్చినామనిన్నీ అందరూ వక్కటక్కట్టుగా చెప్పినారు. ఆలా చెప్పినతరువాత యెంతశాంతుడి కయినా మొలాకోపం రాకుండా వుంటుంది ?

తహ—డబ్బులేకుండా నాజీతాలోది పెట్టుకొని అన్నిసప్ల యిలూ వేళకు జరిపిస్తూవున్నానుగదా, అలాఅబద్ధాలు చెప్పడానికి ఈగుమాస్తాలకు యేమిపాయ్యేకాలం వచ్చింది ?

గుమా—సప్లయిలు యెన్నిచేసినా మామూళ్ళు యివ్వక పోతే వాళ్ళకు కోపం వుండకమానదు. వాళ్ళు సదా హుజూరునవుండే వాళ్ళు. యెప్పుడైనా సమయంచూచి దొరగారితో యేదైనా శితూరీ చేస్తారు. యెంతన్యాయంగా వెళ్లేవారికీ యొకానొకప్పుడు సన్నిధాన వర్తులు చెప్పేమాటలు నమ్మక తప్పదు.

తహ — నేను యీసంగతులన్నీ దొరగారితో స్వయంగా చెప్పుదామని పొద్దున్న వెళితే ఘంటసేపు ఇవతల చింతచెట్టుక్రింద కూర్చున్నా సమయంకాక చక్కావచ్చినాను. ఢలాయతుతో యెన్ని మాట్లు చెప్పినా వెళ్ళిచూచి దొరగారు పనిమీద వున్నారు. సమయం కాదని చెపుతూవచ్చినాడు. వున్నసంగతి మనవి చేసుకోవడానికి దొర గారికి సమయంకూడా కాకపోతే యెట్లా మొత్తుకోను ?

గుమా — డలాయితువాళ్ళ మామూళ్ళు పారవేసినట్టయితే పొద్దున్న వెళ్లగానే మీకు దొరవారిదగ్గనవైవుండును. మామూలు యివ్వకుండా వున్నట్టయితే మీరువెళ్ళి ఢేరాముందు వెయ్యేళ్లు కని పెట్టుకునివున్నా మీదర్శనం దొరగారికికాదు, దొరగారిదర్శనం మీకు కాదు. ఆఫీసులో చూస్తే శిరస్తాదారుగారు దగ్గిర వుంటూరుగనుక

అప్పును మీాసంగతియేమీా మనవిచేసుకోవడానికి వల్లపడదు. అడిగే వాడికి చెప్పేవాడు లోకువ ; గనుక మీారు యెంత శ్రోపంలేకుండా పనిచేస్తూవున్నా శిరస్తాదారుగారు పట్టుకోవలెనంటే లోపాలు దొరకకుండా మానవు. శిరస్తాదారుగారికీ మీామీాద కోపమే. పైకి మంచి మాటలు చెపుతూవున్నా సమయందొరికితే మిమ్మలిని యెందులోనైనా పట్టుకొని గట్టిగా నొక్కివెయ్యవలెనని చూస్తూవున్నాడు. నిరుటిసంవత్సరం ఆయనపంపించిన బోగందానికి మీారు యేమీామట్లు చెప్పకుండా పంపించివేసినారట!

తహ—నిష్కారణంగా ఇంతమంది హానిచెయ్యడానికి చూస్తూవుంటే వక్కణ్ణి నేను యేమిచెయ్యను? నాపని అయినా పోవడానికి వప్పుకుంటీానుగాని నాజన్మంలో నేను లంచాలుమాత్రం పుచ్చుకోను. బాధ తప్పించుకోవడానికి నాకుయేమీా వుపాయము తోచకుండావున్నది.

గుమా—లంచాలు పుచ్చుకోవడంతప్ప రెండవసాధనం యేమీా లేదు. మీారు లంచాలు పుచ్చుకుంటేనేతప్ప మీాసంవత్సరజీతము ఖర్చు చేసినా యీావుద్యోగస్తులను సంతోషపెట్టలేరు. హుజూరువాళ్ళకు మీారు స్వాతంగ్రానైన ఇచ్చుకోవలెను. లేదా తాలూకామీా దగ్గినా దస్తుచేసి ఇవ్వవలెను. ఆరెండూ మీాచేత కావు. మీారు ఇఖ వాళ్ళను యెలాగు మెప్పించగలుగుతారు? మీావలెనే నేను మడికట్టుకునికూర్చుంటా నని బెట్టుచెయ్యబోతే తహశ్శీలుదారుకి ఇబ్బంది బరతరపుఅయింది.

తహ—యేమీాకారణం లేకుండా పైవాళ్ళుమాత్రం వూరికే బరతరపు చేస్తారా ?

గుమా—వెతికేవాళ్ళకు అన్నీ కారణాలేకనపడతవి. మీాలాగే ఆయన జమాబందీలో మామూళ్ళు యివ్వకపోయేటప్పటికి ఆకోపం మనసులో వుంచుకొని, అక్కడనుంచి ప్రతివిషయంలోనూ చివాట్లు

పెడుతూ హుకుములు వ్రాసి తాలూకాశిరస్తాదారుద్వారా ఇళ్ళు కట్టుకోవడానికి బలవంతపెట్టి ఇటుక పుచ్చుకొన్నాడని దొంగఫిర్యాదు తెప్పించి బరతరపు చేయించినారు. లంచాలు పుచ్చుకోని తహశ్శీలు దారుణ్ని చూస్తే తాబేదార్లకూ ఇష్టంగా వుండదు. పైవాడు పుచ్చుకునేవాడు వుంటేనే కిందవాళ్లకూ దొరుకుతూ వుంటుంది. ప్రజలకుకూడా లంచాలు పుచ్చుకునేవాడు వుండడమే ఇష్టము. అలాంటి వాడు వుంటే సర్కారుకు నష్టంవచ్చినా లంచాలు యిచ్చి తాము లాభం పొందుతూ వుంటారు.

తహ — పోనియ్యండి. ఆలా లంచాలు పుచ్చుకొని బాగుపడుట కంటె ముష్టియెత్తుకోవడం వుత్తమం. యీ ఛోరాలూ యీహడావడీ చూస్తే వుద్యోగస్తుల లంచాలజమాబందీలాగు కనపడుతూ వున్నది గాని సర్కారు శిస్తులజమాబందీలాగు కనపడడంలేదు. ఇది యేమి దురన్యాయమో నాకు తెలియకుండా వున్నది.

గుమా — మీకు యింకా అనుభవంలోకి రాలేదు గనుక నీతులు యెన్నైనా చెపుతారు. ఈతహశ్శీలుదారీ కాస్తా పోయినతరువాత యెవరూ మీముఖం చూచేవారు వుండరు. బాగా ఆలోచించుకోండి. నేను ఇప్పుడు చెప్పినతహశ్శీలుదారుగారున్ను మించిపోయినతరువాత చాలా పశ్చాత్తాపపడినారు. తరువాత విచారించిన కార్యము లేదు. మీకూ మాకూ బంధుత్వం కలిసివున్నది. గనుక మీక్షేమం గోరి ఇంతగా మనవిచేసినాను. సెలవైతే నేను యీసాయంకాలము శిరస్తా దారుగారితో మాట్లాడి అన్నీ చక్కబెట్టుకుని వస్తాను.

తహ — తరువాత ఆలోచించి చెపుతాను లెండి. ఇప్పుడు భోజనపువేళ అయింది వెళుతాను

(అని వెళ్ళి చున్నాడు.)

గొట్టాలమ్మ సభ

[మాదిగ మల్లిగాడును, గమళ్ళ గాలిగాడును, పూజారి పూర్ణయ్యయు, కాపు కామయ్యయు ప్రవేశించుచున్నారు.]

కామ — ఒరే మల్లిగా! వూళ్ళో అమ్మవారిజాడ్యాలు ఇలాగ వున్నప్పుడు మనం అమ్మవారిని నడివీధిలో నిలపనక్కరలేదుట్రా ?

మల్లి — బాబూ ! తప్పకుండా నిలపాలండి. మాకు డప్పులపని లేకపోవడంచేత కల్లునీళ్లకి లేక చచ్చిపోతూవున్నాము. మా మాదిగ వాళ్ళనందరినీ పోగుచేస్తాము. తప్పకుండా వుత్సవం చేయించండి. యీ మూలంగానైనా మాకు నాలుగుడబ్బులసొమ్మ దొరుకుతుంది.

గాలి — అవునండి తప్పకుండాచెయ్యవలసిందే. మాదిగవాళ్ళకు మాత్రమే కాదు మాకూ నాలుగుడబ్బులసొమ్మ దొరుకుతుంది. ఇప్పుడు మనవూళ్ళో యెంతమంది కల్లు తాగేవాళ్ళవున్నా యీ వుత్సవదినాలలోవలె యెప్పుడూ ఖర్చు కాదు. కావలిస్తే మావాళ్ళ నందరినీ పోగుచేసి వుత్సవానికి కావలసినంతసరంజాం చేయిస్తాను. ఇచ్చుకోమంటే తలా రెండణాలూ చందా యిచ్చుకుంటాము.

కామ — ఇఖ నంతా కుదిరింది. పూర్ణయ్యా ! నీ వేమంటావు ?

పూర్ణ — నేననేది యేమున్నది ? మీచిత్తము నాలుగుడబ్బుల సొమ్మ దొరికేటప్పుడు నాకూ సంతోషమే. ఈయేడు వేటపోతులూ బియ్యమూ చాలా దొరుకుతవి.

కామ — అందుకు సందేహ మేమి ? వెయ్యివేటపోతులూ ఘది వేల కోడిపిట్టలూ తెగకపోతే నన్ను యీపేరున పిలుచవద్దు. పాపిష్టి దేవుడు మాంసం నిలవ వుండకుండా చేసినాడు కాని లేకపోతే యేటికి యేడాదీ యీమాంసం మనకందరికీ పుష్కరంగా సరిపోను.

పూర్ణ—కామయ్యగారూ ! ఇందులో ఇంకొకటి యున్నది. బ్రాహ్మలూ కోమట్లూ నరికించేవేటపోతులుమాత్రమే మనకుదక్కుతవి గాని శూద్రులవి వక్కతలమాత్రం యిచ్చి తక్కినభాగం వాళ్ళేపట్టుకు పెళుతారు. అది లేకుండా చేస్తారూ.

కామ—ఇప్పుడు మనం ఆపర్యత్నం చెయ్యకూడదు. ముందు ఆసంగతి ఆలోచింతాము. బ్రాహ్మలు యిచ్చేమేకపోతులే మనకు నెత్తికీ నేలకూకూడా చాలును. అంతగా చాలకపోతే తరువాత మన గణాచారిగాడిచేత మేకపోతులను ఇంటికిపట్టుకుపోతే రోగాలుయెక్కువ చేసి వూరందరినీ చంపుకొనిపోతా ననిపింతాము. అమ్మవారు యిలా గన్నదంటే అందరూ మేకపోతులను మనకు ఇచ్చే పోతారు.

మల్లి—నేను ఇప్పుడే చెప్పుతూవున్నాను. తెగిన మేకపోతుల తలకాయలన్నీ మా మాదిగవాళ్ళనే సుమండీ. తరువాత లేదనేరు.

కామ—సరే మామూలు యెలాగో ఆలాగే జరగవచ్చును. పూర్ణయ్యా ! ఇప్పుడే చెపుతూవున్నాను. దొరికే బియ్యంలోనూ దక్షిణలలోనూ సగం మాదీ సగం మీదీ సుమా. తగువులుపెడితే పనికిరాదు.

పూర్ణ — అలాకాదు. కష్టపడేవాళ్ళము మేముగనుక రెండు వంతులు మాకిచ్చి వకవంతు మీరు పుచ్చుకోండి.

కామ—అలా వల్లపడదు. మాకు సఖంవంతు యిస్తేనే వున్న వం జరుగుతుంది లేకపోతే జరగనేజరగదు. నన్ను కలుపుకోకుండా మీరు పాకలు వేయిస్తురూ మరునాటికి తగులడతవోలేదో మీరే చూస్తారు.

పూర్ణ — మీ యిష్టంవచ్చినట్టే మీరు పుచ్చుకోండి. బాజా వాళ్ళకూ డప్పులవాళ్ళకూ అయ్యేఖర్చుపోగా మిగిలేదాల్లో సుమండీ

మీకు సఖం ఇవ్వడం, ఆనికె అంతలోనూ సఖం తెమ్మంటారు.

కామ—ఆలా తెమ్మనడానికి నేనుమాత్రం న్యాయం యెరగని వాణ్ణా ? అన్నిఖర్చులూపోగా మిగిలిన దానిలోనే చెరిసగము పుచ్చు కుందాము. అవునుగాని నీవు గరగలను యెత్తుకొని వీధులలో తిరిగే టప్పుడు అమ్మవాగు యేమిచెప్పినదని చెపుతావు ?

పూర్ణ—అదీ మీరే సెలవియ్యవలెను.

కామ—మంచిది ఆలోచించి చెపుతానువుండు. సర్కారు వాళ్ళ షూటవిని వేపరొట్టలు కట్టకుండా గంధకమూ తారూ పొగలు వెయ్యడంచేత నాకు కోపంవచ్చి ఇలాగు చంపుతూవున్నా నని ముఖ్యంగా చెప్పవలెను. తరువాత నాకు జాతరలూ వుత్సవాలూ చెయ్యడం మానివేసినారు. ఇప్పుడైనా బుద్ధిగలిగి నాకు జాతరలు చేయించకపోతే శవాలను బళ్ళలో తోలేటట్టు చేయిస్తానన్న దని చెప్పు. మరిచిపోకుండా యీరెండునూ ముఖ్యంగా చెప్పవలెను. అలా చెప్పకపోతే యింగ్లీషుచదువుకున్నవాళ్ళ మాటలు నమ్మి దొడ్లు శుభ్రంచేసుకోవడమూ గోడలకు వెల్ల వేసుకోవడమూ నీళ్ళుకాచి వడకట్టి తాగడమూ తారూ గంధకమూ పొగలు వెయ్యడమూ ముఖ్యంగా చూసుకుంటారుకాని మనకు బియ్యాలు ఇవ్వడమూ చలిమిడీ నానుపప్పూ నైవేద్యాలు పెట్టడమూ వేటపోతులను యివ్వ డమూ ముఖ్యంగా చూడరు.

పూర్ణ—అది సరేకాని యీగంధకపుపొగవల్లనూ వాటి వల్లనూ యేమయినా కార్యం వున్నదీ ?

కామ—కార్యంవున్నదీ లేకపోయినదీ అదంతా మనకెందుకు? మనకు నాలుగుడబ్బులసొమ్ము దొరికేపని మనం చూచుకుందాము, మనకు బలులు యిచ్చేవారికందరికీ రోగాలు రాకుండాను వచ్చిన

వాళ్ళు చావకుండానూ మానుతూవున్నవా ?. యేమిచేసినా చచ్చే వాళ్ళు యెలాగూచస్తారు. బ్రతికేవాళ్ళు యెలాగూ బ్రతుకుతారు. గాలిలోనూ నీళ్ళలోనూ యేమివున్నది ? యీగోదావరీ యీ గాలీ ప్రపంచం పుట్టినప్పటినుంచీ వున్నవిగాని బ్రహ్మదేవుడు వీటిని కొత్తగా పుట్టించినాడాయేమిటి ?

పూర్ణ — పోనియ్యండి. ఆయుర్దాయం వుంటే యెలాగూ బ్రతుకుతారు. ఆసంగతి మన కెందుకుగాని అమ్మగారు మాకుట్లో యేమిపడవేసిందని అడుగుతారు. యేమి చెప్పమన్నారు ?

కామ — యేమి చెప్పమన్నావా ? పసుపూ కుంకమూ పడవేసిందని చెప్పు. ఇఖ నాకు తిన్నగా సేవచేయిస్తే మీపసుపూ కుంకమూ చల్లగా వుంచుతానని అమ్మవారి అభిప్రాయం అని అర్థం నీవు విప్పి చెపుతూవుండు.

పూర్ణ — అలాగే చెపుతానుగాని ఫదిమంది గణాచార్లనూ శివశక్తులనూ పోగుచేస్తారా ?

కామ — ఇప్పుడు అంతమంది రారు. యెవళ్ళయినా డబ్బు యిచ్చి రోజుకూలికి తీసుకునిరావలెను. వాళ్ళయినా మునుపటిలాగు అల్లరి చెయ్యడానికి వల్లకాదు. వాళ్ళింటికాడ గంతులువేస్తే పిల్లవాడు జడుసుకున్నాడని కిందటిమాటు వక తురకసాహేబు వక శివశక్తిని చావతన్నినాడు. అప్పటినుంచీ భయంచేత యెవళ్ళూరారు. వక్క తురకసాహేబేకాదు మనవాడుకూడా వక గణాచారి తన్నేమో తిట్టినాడని కోపంచేత తిన్నగా బజారుకు పరుగెత్తి పేపబెత్తం కొను క్కొని విభూతి పూసుకొని వేపమండలు చేతితోపట్టుకొని తన పగ తీర్చేట్టుగా పడకొట్టినాడు. మామూలుగావచ్చే ఆముండలుమాత్రం ముద్దరువస్తారు.

పూర్ణ—వాళ్ళేచాలును లెండి. వాళ్ళకు కాసిన్ని కల్లుసీళ్ళు పోస్తే కొంచెం తూలుతూ నడుస్తారు. వళ్ళు తెలిసివుంటే యెవరయినా కొట్టిపోతారేమో అనే భయంచేత వాళ్ళయినా ఆ కాస్త అల్లరీ చెయ్యరు. ఇప్పుడన్నీ కానికాలాలు వచ్చినవి.

కామ—అవును. ఇప్పుడు కాలం మంచిదికాదు. మనం వెళ్ళుదాంవురండి. రేపు వూళ్ళో నలుగురితోనుచెప్పి మీటింగుచేయించి అమ్మవారివుత్సవంనిమిత్తం చందాలు చేయించాము. మనవూళ్ళో అధమం అయిదువందలయినా చందాకాకపోతవా ?

(అని మాటాడుకొనుచు వెళ్ళుచున్నారు.)

బహుభార్యాత్వము.

---:0:---

[తిమ్మజగపతి వ వహారాజులుంగారును, మంత్రి యుగంధరుడుగారును, శాలకమహారాజుగారును, ప్రవేశించుచున్నారు.]

యుగం — శాలకమహారాజుగారూ ! మీబావగారు బహుభూతదయాళుత్వము గలవారు సుమండీ ?

శాల—అందుకు సందేహ మేమి ? చెవులు వొక్కమాటుగా కోస్తే నొప్పియెత్తుతుం దని నిత్యమూ కాస్తకాస్త చొప్పున దగ్గిరవుండి మన వేటకుక్క చెవులు ఆరునెలలు కోయించిచారు.

తిమ్మ—మనం ఆలాగు చేసినా, అది చెడఅరిచే దేమండీ? దాని యేడుపుచేత నాకు రాత్రికూడా నిద్రపట్టదేకాదు.

శాల — అది వట్టికృతఘ్నపుకుక్క. దేవరవారు చెవు లంత మెల్లగా కోయించినందుకు దానికి మీయం దెంతవిశ్వాస ముండవలసినది ? కుక్కకు విశ్వాసం వుంటుం దంటారుగాని దానివద్ద నాకు

లేశమూ కనపడలేదు. మీది మిక్కిలి యిల్లూవాకిలీ యెగిరిపోయేటట్టు రాత్రి పగలూ చెడఅరిచి మిమ్మల్ని చెడఅల్లరిపెట్టింది. అది గా జాస్థానంలో వుండతగ్గది కాదు. అందుచేతనే అది చెవులు పుచ్చి పురుగులు పడి మరీ చచ్చింది.

తిమ్మ — భావగారూ ! మీకు లోపల యేమో పని వున్నది కాబోలునే వక్కసారి విజయంచెయ్యరా ?

శాల — నాకు లోపల పని లేదు. ఇక్కడనే పని వున్నది. మీ మగత్రిగారూ మీరూ చేస్తూవున్నఆలోచన మంతా నాకు తెలిసే వచ్చినాను. నేను వుంటే మీకడ్డం యేమిటి ? మీకు నేనుకూడా సహాయం చేస్తాను. మాట్లాడుకోండి.

తిమ్మ—ఆలాగా? తమరుకూడా మాలో చేరినవారేనా! మీ చెల్లెలిగారిమూలంగా మీకు యిష్టం వుండదేమో అనుకున్నాము.

శాల—కొత్తచెల్లెళ్లు వస్తూవుంటే నాకుమాత్రం యెందుకు యిష్టం లేకపోతుంది ? వొక్కొక్కచెల్లెలు వచ్చినకొద్దీ అన్నయ్యా అని పిలిచేవారు యెక్కువయి నాకూ సంతోషంగానే వుంటుంది.

తిమ్మ—ఇప్పుడు వచ్చేచెల్లెలు వకవేళ మీకంట పడదేమో ! అప్పుడు మీకోరిక విఫలం అవుతుందే !

శాల — ఓహో ! మీ భూతదయమాట మరిచిపోయినానే. మీ కొత్తచెల్లెలిగారినికూడా ఇల్లంతా తిరిగి అలసిపోకుండానూ, సూర్యుడిముఖం చూచి యెండలో జడుసుకోకుండానూ, గది దాటి యివతలకు రాకుండా సుఖపెడుతారు కాబోలును. యీ వున్న భార్యలు చాలక మీకు యిప్పుడు మళ్ళీ వివాహం యెందుకో తెలియక అడుగు తాను : లవిస్తారా ?

యుగం.—మీరలాగు ప్రశ్న వేయకూడదు. మహారాజుల కెంత

మందిభార్యలు వుండినా వుండవచ్చును. శ్రీకృష్ణమూర్తి వానికి పదహారు వేలు గోపికాస్త్రీలూ యెనమండుగురు పట్టపు దేవులూ వున్నమాట మీరు యెరగరా ? సమస్తమూ తెలిసినవారు పామరులవలె మీరూ యిలాగే సెలవిస్తారేమి ? మన ఆస్థానంలోనిపండితులూ జ్యోతిష్కులూ బ్రాహ్మణులూ అందరూ యేక వాక్యంగా వివాహం కావలసిందనే సెలవిస్తూవున్నారు. బ్రాహ్మణవాక్యం వూరికే పోదు.

శాల — మీరూ బ్రాహ్మణులూ చెప్పడాని కేమి ? బిడ్డలు లేకపోయినా రాజుగారికి వివాహాలమీదనే వివాహాలు అవుతూవుంటే మీకు ఫదివరహాలసొమ్ము దొరుకుతూ వుంటుంది. కాబట్టి మంత్రులూ బ్రాహ్మణులూ యెప్పుడూ నిత్యకళ్యాణమూ పచ్చతోరణమూ కోరుతూ వుంటారు. అది లేకపోతే మీకు యేమీ లేదు. బ్రాహ్మణ వాక్యం అమోఘంగా అవుతుం దని నాకూ తెలుసును. తెలిసే మళ్ళీ యీవెర్రిలో పడుతూ వున్నాను. మీరు సిద్ధసంకల్పులు. మీరు సంకల్పించుకొన్న తరువాత బ్రాహ్మణవాక్యానికైనా తిరుగువుంటుంది గాని మీసంకల్పానికి తిరుగు వుండదు.

యుగం — ఇప్పుడు మహారాజుగారికి వున్నవారల్లా యిద్దఱు మహాదేవులేనా అంతకంటె యెక్కువ వున్నారా ? వంశం నిలవడానికి వారిలో వక్కరికైనా సంతానంలేమకదా? జాతకం చూచినజ్యోతిష్కులందరూ యీయేడు రాజుగారికి తప్పకుండా కళ్యాణయోగం వున్న దని సెలవిస్తూ వున్నారు. దైవసంకల్పం తప్పిపోదు.

శాల—జాతకాలూ గ్రహాలూ జ్యోతిష్కులచేతులో వున్నవి ; జ్యోతిష్కులు మీచేతిలో వున్నారు. ఒక్కకళ్యాణం కాదు చేసుకునే వాడు వెఱ్ఱివాడయితే యెన్ని కళ్యాణాలైనా అవుతవి. భావగారువరుస గనుక నేను పరియాచకాని కంటూవున్నాను సుమండీ. ఈసంతానం

లేనిలోపము మహారాజులంగారిదో మహారాణులంగారిదో యెవరు నిర్ణయించినారు ? వఖవేళ మహారాజులంగారిదైనా ఫర్వాలేదు. వచ్చే ఆవిడ పతివ్రతాశిరోమణి అయితే, ఆమె పతివ్రతామహత్యంవల్లనైనా సంతానం కలుగవచ్చును.

తిమ్మ—భావగారూ ! హాస్యం పేరుపెట్టి నన్ను అంతమాట అనడం రాచకులంలో మీకు భావ్యమేనా ?

శాల—అయ్యయ్యో ! పెద్దల్ని మిమ్మలిని అలా అనకూడదు. మీశూరత్వం యెరగక అన్నాను. క్షమించండి. మీరు విన్నారో లేదోకాని ఆడమళయాళం అని యెక్కడనో వున్నదట ! అక్కడంతా ఆడవాళ్ళ అధికారం. ఆడవాళ్ళు వుద్యోగాలు చేస్తూవుంటే మగవాళ్ళు యింట్లో వంటచేసి పెడుతూవుంటారట. అక్కడ మొగవాళ్ళకు యెక్కడలేనిఘోషా వున్నదట ! ఆదేశంలో మహారాణీకి సంతానం లేకపోతే ఖయిదీలలాగు కొట్లునక్కంటికి వొక్కొక్కడు వుండేలాగున యేటా యేటా వొక్కొక్కమహారాజును పెండ్లాడి మహా ఘోషాలో వుంచుతుం దట ! ఆడమళయాళం అంటే దక్షిణాన్ని మన వాళ్ళు చూచే యీమళయాళం కాదుసుండీ.

తిమ్మ—ఆసి దానిసిగకొయ్యానూ ! ఆడముండ మహారాజునే అంతబాధ పెడుతుందండీ ? అక్కడ బిడ్డలు ఆడవాళ్ళకే పుడుతారా ? మగవాళ్ళకు పుడుతారా ?

శాల—ఆడవాళ్ళకే పుడుతారటగాని పెంచడమూ పాలుపోయడమూ అంతా మగవాళ్ళు చెయ్యవలెను. అంతఃపురాలలో రాణిగారి భర్తలయిన మహారాజుల నందరినీ తలావక కొట్లోనూ పెట్టి తాళంవేసి యివతలకురాకుండా గుమ్మాలవద్ద మగ నవుకర్లను కావలి వుంచుతారు. వీధిలోవెళ్ళే ఆడవాళ్ళు కనపడిపోతారని యీమహారా

జులువుండే చీకటిగదులకు కిటికీలుకూడా పెట్టించరు. ఆమహారాజులను కలలోనూ మేడలమీదికి యెక్కనియ్యరు. ఈప్రకారంగా వొకొక్కమహారాణి భర్తలని పేరు చెప్పి నాలుగేసివందలనూ అయిదేసివంద లనూ చక్కనిమగవాళ్ళను ఖయిదులో వుంచుతుంది. ఈషూపా చూచి మీరు ఆశ్చర్యపడుతూవున్నారుగాని మనదేశంలో ఆడవాళ్ళను మనం యీలాగు ఘోషాలో వుంచడంలేదూ ? ఇక్కడ మీరాణీలకు సంభవించిన శిక్షే అక్కడ రాజులకు సంభవించినది. ఇందులో హాశ్చర్యం యేమివున్నది. అధికారబలమూ మరివకటా ? యెవరికి అధి కారంవుంటే యెవరుమానుతారు? భావగారూ! మీకు వున్న అధికారం రాణీగార్లకుండి మీరు వాళ్ళకు దాసులుకండి. రేపీపాటికి సంతానం లేదనే హేతువుచేత వీరివంటిమంత్రిగార్లు ఆలోచనప్రకారం మీలాగే వొకొక్కళ్ళు యెనమండుగురేసి భర్తలను కట్టుకోవడానికి ప్రయత్నం చేస్తారో లేదో చూతాము.

తిమ్మ—మంత్రిగారూ ! ఇదివరదాకా యేమో అనుకున్నాను. భావగారు నన్నే ఆక్షేపణ చేస్తూవున్నారు. నాకు ఇఖ పెళ్ళీవద్దు యేమీవద్దు. మారాజకులంలోవుండే పౌరుషమున్ను అభిమానమున్నూ వీరు ఆలోచించకుండా మాటాడుతూవున్నారు.

శాల—అయ్యో ! పౌరుషం వచ్చి రాజుగారు పెళ్ళి మానివేసి నారు. యేమిబుద్ధి; శిక్షార్హులైన వక్క రాచకూతురికి పెళ్ళి లేక పోవడంమూలంగా కారాగృహవాస శిక్ష తప్పిపోయింది. అయ్యో జ్యోతిష్కులారా గ్రహాలలారా ! రాజుగారి పౌరుషం మూలంగా మీశాస్త్రాలూ మీగతులూకూడా తప్పిపోతూ వున్నవిగదా ?

తిమ్మ — మాకు రోషం వస్తూవున్నది. శిరంగీకత్తి తీసుకుని రావయ్యా ! మాపౌరుషం కనపరుస్తాము.

మంత్రి)---చిత్తము. (అని లేచుచున్నాడు)

శాల—నన్ను పొడుస్తారేమో ! నేను పారిపోతాను.

(అని పాతిపోవుచున్నాడు.)

తిమ్మ — మంత్రిగారూ ! మీ కాకత్తి కనపడదేమో ! కన పడితే ఒక్కపోటులో భావగారిప్రాణాలు పుచ్చుకొని మేము పొడుచుకుందుమునుమా ?

మంత్రి—యేలినవారి సెలవైతే మరివకకత్తి తీసుకునివస్తాను.

తిమ్మ — సామాన్యపుకత్తితో పొడుచుకోవడం పౌరుషంకాదు. పొడుచుకుంటే వజ్రాలుచెక్కిన మనకత్తితోనే పొడుచుకోవలెను. అది యెక్కడపెట్టినానో మరిచిపోయినానుగదా ? అది యెంతవెతికినా కనపడదు.

మంత్రి—అవును కనపడదండి.

తిమ్మ — ఆలాగయితే మాపౌరుషం లోకానికి వెల్లడిచెయ్యడానికి అవకాశం తప్పిపోయింది.

మంత్రి—అవును తప్పిపోయిందండి

తిమ్మ — ఇటువంటి అవకాశం మళ్ళీ యెప్పుడూ రాదు.

మంత్రి— అవును రాదండి.

తిమ్మ—మాకు యిప్పుడు ఆలోచనయేమీ తోచకుండా వున్నది.

మంత్రి—అవును నాకూ తోచకుండా వున్నదండి.

తిమ్మ—వంటిమీద వక్కపోటు పడకుండా మన శూరత్వమూ సాహసమూ లోకానికి వెల్లడికావలెను.

మంత్రి—అవును వెల్లడి కావలెనండి.

తిమ్మ—ఆలాగయితే యిప్పుడు మీరు తిన్నగా మాభావ

గారిదగ్గరకు పరుగెత్తుకుని వెళ్ళి మీరు బతిమాలుకుంటేనేతప్ప రాజు గారు పొడుచుకుంటారని చెప్పి తక్షణం తీసుకునిరావలెను.

మంత్రి--తప్పకుండా తీసుకునివస్తానండి.

తిమ్మ--మీరు అభయహస్తం యిస్తే లోపలినుంచి కత్తి తీసుకునివచ్చి పొడుచుకోవడానికి సిద్ధంగా వున్నట్టుంటాను.

మంత్రి-- నీ రలా వుండవచ్చును.

తిమ్మ--కత్తి యీగదిలోనే వుంది. మీరు భావగారిని తప్పకుండా తీసుకుని వస్తారుగదా ?

మంత్రి--తప్పకుండా తీసుకునివస్తాను.

తిమ్మ--ముఖ్యంగా ?

మంత్రి--ముఖ్యంగా తీసుకువస్తాను.

తిమ్మ--అవశ్యంగా ?

మంత్రి--అవశ్యంగా.

తిమ్మ--ఆలాగయితే భావగారు చేయిపట్టుకునేలోగా గుండెల మీద వక్కపోటు పొడుచుకుంటాను. పోటు తగలకుండా వుండడానికి కనపడకుండా అంగీలో ఇరుపరేకు అమర్చుకుంటూ మాపనిమీద మేము వుంటాము. మీరు మీపనిమీద పొండి.

మంత్రి--చిత్తము.

(అని యిద్దఱును చెఱియొకతోరివను పోవుచున్నారు)

హిందూమతసభ.

[నంబి నరసింహాచార్యులుగారును, ఆరాధ్యుల అయ్యావార్లంగారును, పుప్పాల పాపిరెడ్డిగారును, సోమయాజుల సూరయ్యశాస్త్రిగారును, ధరణిపగ్గిడ ధర్మరాజుగారును, విశ్వనాధశాస్త్రిగారును, ఇతరసభికులును ప్రవేశించుచున్నారు.]

నర--మనకందరికీ హిందూమతమందు అభిమానం వుండవలెను. ఇవాళ వేదశాస్త్రాలకు విరోధంగా ధర్మరాజుగారు యేదో నాస్తిక వుపన్యాసం చేస్తారట: మనం ఆయనను యెలాగైనా అవమానపర్చవలెను.

అయ్య -- నరిసింహాచార్లుగారుచెప్పింది బాగావున్నది. మతాభిమానం వున్నవాళ్ళందరూ ఆయనను చప్పట్లుగొట్టి పంపివెయ్యావలెను.

పాపి--అయ్యావార్లంగారి సెలవుప్రకారం మనపూర్వీకుల మతం కాపాడడానికి నేను యెంతపనిఅయినా చేస్తాను.

సూర--ధర్మశాస్త్ర ప్రమాణాలు చూపి నేను యీరోజున దిగ్విజయంచేసి భూమిమీద నుళ్ళీ హిందూమతం నిలువపెడుతాను.

ధర్మ -- సూరయ్యశాస్త్రిగారూ! ననుు యీరోజున మతవిషయం కొంచెం వుపన్యసించవలసిందని మనవారు కోరినారు. తమరు దయచేసి కొంచెం మాట్లాడడం చాలించి నామనవి కొంచెం వింటారా?

సూర--కానియ్యండి.

ధర్మ--ఓసభికులారా! ఈలోకములో సత్యముతో సరియైన ధర్మ మింకొకటిలేదు. సత్యముకంటె శ్రేష్ఠమయిన దేదియులేదు. అసత్యముకంటె తీవ్రతరమయిన దింకొకటిలేదు. అహింస, సత్యము,

దొంగిలింపకుండుట, శౌచము, ఇంద్రియనిగ్రహము, ఇవి సర్వవర్ణ ములవారును అనుష్ఠింపదగిన ధర్మములు. ఇతడు బంధుడు, ఇతడు కాడు, అనుగణన క్షుద్రమనస్కులకుండునుగాని యీశ్వరభక్తిగల యుదారచరితులకు లోకమంతయు కుటుంబమే. కాయక్లేశముచేత గాని తీర్థసేవవలనగాని పుణ్యపదము కలుగదు. అది మనోజయము వలనకలుగును.—

పాపి—మాకీ నాస్తికబోధలు పనికిరావు. మాకు మా హిందూమతమే కావలెను. మాకు వేదశాస్త్రాలు ప్రమాణాలు.

అయ్యా—మహాబ్రాహ్మలం మేమంతావుండగా శూద్రివాడవు నీవు మాట్లాడుతావేమి ?

పాపి—నేను మీ హిందూమతం నిలువబెట్టడానికే మాట్లాడుతూవున్నాను.

అయ్యా—అదుగో మళ్ళీమాట్లాడుతావు? బ్రాహ్మలువుండగా సభలో శూద్రవాడు నోరెత్తడం బ్రాహ్మణులకు అవమానం. నేను నిశ్రేయస్సుకోసమే చెపుతూవున్నాను. దానివల్ల నీకే పాపం వస్తుంది.

పాపి—శూద్రివాడు శూద్రివాడు అంటూవున్నారు. మాటలు జాగ్రత్తగా రానియ్యండి.

అయ్యా—శూద్రివాడనక నిన్ను యేమండి అని మన్నించవలెనా ? నీవు బ్రాహ్మలలో వచ్చికూర్చోవడానికే తగవు. మాట్లాడక దూరంగా పో. ఏదీశాస్త్రర్ల గారూ! ధర్మశాస్త్రవచనం చదవండి.

సూర—మనుస్మృతి యెనిమిదో అధ్యాయములో—

శ్లో॥ సహాసన మభిప్రేప్సు రుత్కృష్ట స్యాపకృష్టజః।
కట్యాంకృతాంకో నిర్వాస్యః స్ఫిచం వాస్యావకర్తయేత్॥ అరం॥

"తక్కువకులంవాడు అగ్రకులంవారితో కూడా కూర్చోవడానికి

కోరితే వాణ్ని తుంటిమీద వాత వేసి పంపించిఅయినా వెయ్యనలెను! లేదా పిల్లలు కోసిఅయినా వెయ్యవలెను" అనివున్నది.

పాపి—అందులో భూదుర్గిడన్నమాట లేదు.

శూర—ఓరి పరమనాస్తికుడా! ధర్మశాస్త్రాలకుకూడా వంకలు పెడుచూవున్నావురా? వ్యాఖ్యానంలో కుల్లూకభట్టాచార్యులు "బ్రాహ్మణేన సహాసనోపవిష్టః శూద్రః కట్యాం తప్తలోహాంకృత చిహ్నోపదేశో నిర్వాసనీయః స్ఫిచంవాస్యయధానమ్రియతే తథా ఛేదయేత్" అని వ్రాసినమాట నీ వెరుగవు.

పాపి—అది వేదం చదువుకొన్న బ్రాహ్మణుల విషయం.

నూర — బ్రాహ్మణులు వేదం చదువుకోనూ అక్కర లేదు; కర్మలు చెయ్యనూఅక్కర లేదు. వారు జన్మచేతనే మహాపవిత్రులు. నీకు బ్రాహ్మణప్రభావం తెలియదు. చెపుచాను విను. శాతాతప ధర్మశాస్త్రం పాష్టాధ్యాయంలో—

"శ్లో॥ జన్మనైవమహాభాగో బ్రాహ్మణో నామ జాయతే।
మాతాసా సర్వభూతానాం వర్ణశ్రేష్ఠః పితాగురుః॥9॥

బ్రాహ్మణు డనుపేరుచే పుట్టినవాడు జన్మచేతనే మహాభాగుఁడు. ఆవర్ణశ్రేష్ఠుడు సమస్తభూతములకున్ను తల్లి దండ్రి గురువు.

"శ్లో॥ దేవతాదివ్యభూతేషు క్వచిత్కాచి త్ప్రతిష్ఠితా।
బ్రాహ్మణా దేవతాస్సర్వాః తస్మాత్సంపూజయేత్సదా॥10॥

ఒక్కొక్కదేవత యొక్కొక్కదివ్యస్థలమునందు ప్రతిష్ఠ చేయబడి వున్నది. అన్ని దేవతలున్ను బ్రాహ్మణులే కాబట్టి వారిని సదా పూజింపవలెను. అని చెప్పివున్నది. భూదేవతలప్రభావం నీకు యిప్పుడయినా తెలిసిందా? బ్రాహ్మలకోపం విష్ణుదేవుని చక్రముకంటెనూ తీవ్రమయింది. వారికి కోపం తెప్పించక వూరుకో. అందుకు నేను కావలిస్తే ప్రమాణవచనం

చదువుచాను విను. శంఖలిఖితధర్మశాస్త్రములో—

శ్లో॥ మన్యుప్రహరణావిప్రా శ్చక్రప్రహరణోహరిః!
చక్రాత్తీవ్రతరో మన్యు స్తస్మాద్విప్రా న్నకోపయేత్॥౩౫॥

బ్రాహ్మణులు కోప మాయుధంగా గలవారు; విష్ణు చక్రాయుధుడు. బ్రాహ్మణకోపము చక్రముకంటెనూ తీక్ష్ణతరమయినది గనుక బ్రాహ్మణులను కోపింప చేయకూడదు."

పాపి—(తనలో) శాస్త్రప్రమాణం వప్పుకోవడంచేత నేను యిక నోరెత్తడానికి వల్లకాదు.

నర—ఈశాస్త్రుల్లగారు యీరోజుసభలో బ్రాహ్మణ్యంపోకుండా నిలువబెట్టినారు.

అయ్య—శాస్త్రుల్లగారు శాస్త్రవచనాలు కురిపించి శూద్ర వాణ్ని నోరెత్తకుండా తలవంచుకునేట్లు చేసినారు. ఇకవాడికి స్వధర్మంచెప్పి బ్రాహ్మణవిశ్వాసం కలిగేట్లుచేస్తే లోకానికి మహోపకారంగా వుంటుంది.

సూత—అదీ చేస్తాను చూడండి. ఓ రెడ్డీ! నీశ్రేయస్సు కోరి చెపుతూవున్నాను. బ్రాహ్మణసేవ చేసుకోవడం మీకులధర్మం. ఆపని మీకు బ్రహ్మదేవుడు విధించినాడు. మీరు బ్రాహ్మణసేవ చేసుకుంటూ వారియెంగిలి తింటూ, వారు యిచ్చినచిరుగుబట్టలు కట్టుకుంటూ, బ్రతికితే మీకు యెంతో పుణ్యము. నీవు శాస్త్రవిశ్వాసం గలవాడవుగనుక చెపుచూవున్నాను. హింసామతం యిప్పుడు నీకు పూర్ణంగా బోధపడిందా? కావలిస్తే ప్రమాణవచనాలుకూడా వుదాహరిస్తాను. మనుస్మృతి అష్టమాధ్యాయములో—

శ్లో॥ శూద్రస్తు కారయే ద్దాస్యం క్రీత మక్రీత మేన వా।
దాస్యాయైవహిసృష్టోసౌ బ్రాహ్మణస్య స్వయంభువా॥౪౧౩॥

కొనబడినవాడయినా కాకపోయినా శూద్రుడు దాస్యము చేయవలెను ఆతడు బ్రాహ్మణుని దాస్యమునిమిత్తమే బ్రహ్మదేవుడిచేత సృజింపఁబడినాడు." దశమాధ్యాయములో——

శ్లో॥ ఉచ్చిష్ట మన్నం దాతవ్యం జీర్ణాని వసనాని చ।
పులాకాంశ్చైవధాన్యానాం జీర్ణాశ్చైవ పరిచ్ఛదాఃII౧౨౫II

(శూద్రునకు) ఎంగిలియన్నమును, చిరిగినబట్టలును, పొల్లుధాన్యమును, జీర్ణములయినదుప్పటులును ఇయ్యవలెను."

పాపి——(తనలో) ఇప్పుడు నాకు స్వమతం కొంత బోధపడినది. అయినాకానీ మొదట అన్నానుగనుక మతాభిమానం వున్నట్టు నేను యింకా సంస్కారం కావలెననే వారితో పోట్లాడుతాను.

ధర్మ——శాస్త్రుల్లుగారూ! మీమాటలు కొంచెం చాలించి వక్క నిముషం నాపుపన్యాసం సాగనిస్తారా?

అయ్య——మీనాస్తికవాదం మేము వినము.

నర——మీ బౌద్ధమతం మాకక్కరలేదు.

పాపి——లేవిడి! మాకు హింమూమతంతప్ప మరి యేమీ అక్కర లేదు.

నర——ఈపాపిరెడ్డికి యిప్పుడు బ్రాహ్మణుల్లయందు భక్తి విశ్వాసాలు కుదిరినవి. ఇతడు మాశిష్యుడు. ఇదంతా రామానుజుల వారి అనుగ్రహం. శ్రీమతే రామానుజాయనమః. బ్రాహ్మణులలో వైష్ణవులు మూడులోకాలినీ క్షణంలో పవిత్రం చేయ్యగలరు.

శ్లో॥ యే కంఠలగ్నతులసీనళినాక్షమాలాఃI
యే బాహుమూలపరిచిహ్నితశంఖచక్రాఃI
యే వా లలాటఫలకే లసదూర్ధ్వపుండ్రాఃI
తే వైష్ణవా భువన మాశు పవిత్రయంతిII

ఎవ్వారుకంఠమునందు తులసితావళములను తామరపూసల తావళములను ధరింతురో, యెవరు బాహుమూలములయందు శంఖ చక్రాంకములను చేసికొందురో, యెవరులలాటములయందు పట్టెనామములను పెట్టుకొందురో, ఆవైష్ణవులు లోకమును నిమిషములో పవిత్రము చేయుదురు."

అయ్య — చాలుచాలించు. ఇది కేవల తామసవచనము. కల లోనూ విష్ణునామము స్మరించకూడదు. విష్ణుదర్శనముచేయగూడదు.

శ్లో॥ విష్ణుదర్శనమాత్రేణ శివద్రోహాః ప్రజాయతే।
శివద్రోహాన్నసందేహో నరకం యాతి దారుణమ్।
తస్మాచ్చ విష్ణునామాపి నవ్యక్తం కదాచన కుర్యాత్,

విష్ణుదర్శనమాత్రమునచే శివద్రోహము కలుగుచున్నది. శివద్రోహ మువలన దారుణమయిన నరకమును పొందుచున్నాడు. కాబట్టి విష్ణు నామము నొకప్పుడును చెప్పగూడదు. తులసికంటె బిల్వపత్రము శ్రేష్ఠమయినది.

శ్లో॥ సర్వకామప్రదంబిల్వం దారిద్ర్యస్య ప్రణాశనం।
బిల్వపత్రాత్పరం నాస్తి యేన తుష్యతి శంకరః॥

మారేడు సమస్తాభీష్టముల నిచ్చును. దారిద్ర్యమును పోగొట్టును. దేని చేత శంకరుడు తుష్టినొందుచున్నాడో అటువంటి మారేడుపత్రికంటె శ్రేష్ఠమయిన దేదియు లేదు. కాబట్టి బ్రాహ్మణులలో శైవులే పరమశ్రేష్ఠులు.

సూర — మీరిద్దరును శ్రేష్ఠులుకారు. మిమ్ము చూచిన బట్ట లతో స్నానముచేయవలెను. "లింగిణం చక్రిణందృష్ట్వా సచేల స్నాన మాచరేత్" అని వుండుటచేత లింగం కట్టుకున్నవాణ్ణి చూచినా చక్రాంకితం అయినవాణ్ణి చూచినా సచేలస్నానం చెయ్యవలెను. స్మార్తులు సర్వశ్రేష్ఠులు. బ్రాహ్మణులంటే స్మార్తులేకాని యితరులుకారు.

నర — (తనలో) ఇతణ్ణి పదలిపెడితే శ్లోకాలు మహాచదువు రాదు. ఇతనితో మనం సభలో వాదం పెట్టుకోరాదు. (బిగ్గరగా) శాస్త్రుల్లుగారూ ! మనం వచ్చినపని మరిచిపోయి వేరేవాదంలోకి దిగినాము. హిందూమతం పునరుద్ధారణం చెయ్యడానికి మనమందరమూ యిక్కడికి వచ్చినాము. మనం మౌనంగా ఆపని చెయ్యవలెను. మీరు యిప్పుడు చదివిన ధర్మశాస్త్రాలు యే వేదంలోవో చెప్పి ప్రతివాదుల నోరడచండి.

సూర— అవి వేదంలోవికావు. ధర్మశాస్త్రాలనగా స్మృతులు.

నర—అవునవును. నాకు తెలిసింది. ధర్మశాస్త్రాలు శ్రీమద్భాగవతంలో భగవద్గీతలలో శ్రీకృష్ణులవారు ప్రహ్లాదుడికి సెలవిచ్చిన పాశురాలు.

అయ్య—కావుకావు. భాగవతంలోవుంటే అవి ప్రమాణం యెట్లాఅవుతవి ? ధర్మశాస్త్రాలన్నీ బసవపురాణంలో విభూతి మహత్వ ఘట్టములో పార్వతీ పరమేశ్వరులు ప్రమథగణాలకు సెలవిచ్చినారు.

నూర—శాస్త్రుప్రశంస చాలును వూరుకోండి. కలిమహిమ చేతనూ మూలచదువుచేతనూ యిప్పుడు యిటువంటి కిరస్తానీమతాలూ కిరస్తానీబోధలూ ప్రబలుచూవున్నవి. ఈమూలబళ్లలోకి వెళ్ళేవాళ్ళం దరినీ వెలివేసి వాళ్లకు పెద్దపెద్ద ప్రాయశ్చిత్తాలు పెట్టవలెను. దిక్కుమాలిన యింగ్లీషుమూలంగా యిటువంటి నాస్తికవుపన్యాసాలన్నీ వస్తూ వున్నవి. ఒక్కళ్ళకీ శాస్త్రవిశ్వాసం లేదు.

విశ్వ—మీకుమాత్రం శాస్త్రవిశ్వాసం మహావున్నది. మీరెంత శాస్త్రప్రకారం నడుచుకుంటూవున్నారో మేమూ అదేప్రకారం నడుచుకుంటూవున్నాము. మాకు ప్రాయశ్చిత్తాలు కావలిస్తే మీకూ కావలెను.

నర—ఈనా స్తికు డెవరయ్యా?

సూర—ఇతను ఇంగ్లీషుబళ్ళో సంస్కృతం చదువుకున్నాడప. పుస్తకాలుచూచి యీయనకూడా రెండు ధర్మశాస్త్రపుముక్కలు నేర్చుకున్నాడు. ఈయనకు నేనే తగినవాణ్ణి. ఇలారా? విశ్వనాధ శాస్త్రీ! మాకు యెందుకు ప్రాయశ్చిత్తం కావలెనో చెప్పు.

విశ్వ—మీ కెందుకు ప్రాయశ్చిత్తం కావలెనా? మొన్న మీ బంధువుల యింట్లో వకావిడె సాహేబును తీసుకొని లేచిపోయి కడుపుతోవుండి మళ్ళీవస్తే మీరంతా డబ్బుపుచ్చుకొని ఆవిడెను మళ్ళీ కులంలో యెందుకుకలుపుకున్నారు?

సూర — అదా? దానిపూర్వోత్తరం నీకు తెలియదు. దానికి వేరే ధర్మశాస్త్రం వున్నది. ధర్మశాస్త్రంలేనిదే మేము యేపనీ చేయించము. దేవలస్మృతిలో—

"శ్లో॥ గృహీతా స్త్రీ బలా దేవ మ్లేచ్ఛై ర్యద్యో కృతా యది।
శుద్ధ్యే స శుద్ధి మిచ్ఛంతి త్రిరాత్రేణ విశుద్ధ్యతి॥ 3౬॥

బలవంతముగా మ్లేచ్ఛులచేత తీసుకొనిపోబడి స్త్రీ గర్భవతిఅయినపక్షమున, అటువంటిస్త్రీలు శుద్ధిని కోరరు. ఆ స్త్రీ మూడురాత్రులలో శుద్ధురా లగుచున్నది." అని చెప్పబడివున్నది. ఆస్త్రీని తురకసాహేబు యెన్నిసారులు యింటిచుట్టూ తిరిగి యెంతబలవంత పెట్టి వకరాత్రి దొంగతనంగా తీసుకువెళ్ళినాడో అసంగతి నీకేమయినా తెలుసునా? ధర్మశాస్త్రాన్నిబట్టి మూడురాత్రులు వుంచి మరీ మేము ప్రాయశ్చిత్తంలేకుండా కలుపుకున్నాము. ధర్మశాస్త్రరహస్యాలు తెలియకుండా ఇటువంటి తెలిసీ తెలియనిప్రశ్నలు యెప్పుడూ పెయ్యకు.

శ్లో॥ సువర్ణ దానం గోదానం భూమిదానం గవాదికమ్॥
విప్రేభ్యస్సంప్రయచ్ఛేత ప్రాయశ్చిత్తీ విశుద్ధ్యతి ॥౬౦॥

అనడంచేత బ్రాహ్మడికి దానాదులు చెయ్యకుండా ప్రాయశ్చిత్తము చేయించుకొన్నవాడికి శుద్ధిలేదుగనుక మేము డబ్బు పుచ్చుకొన్నాము.

విశ్వ—(తనలో) ఇటువంటివాళ్ళకు ధర్మశాస్త్రాలలో యేవైనా అనకతవకప్రశ్నలు వెయ్యవలెను. అప్పుడు మనం అడిగేప్రశ్నలకూ వీళ్ళుచెప్పే వుత్తరాలికీ సరిపోతుంది. (బిగ్గరగా) ఈగ్రోజున మేమంద రమూ చూస్తూవుండగా మీరు బర్రెంకిపుడకతో మొఖం కడుకున్నా రుగదా ? హారీతస్మృతిలో—

శ్లో॥ కరంజం ఖాదిరంవాపి కదంబం కురవం తథా।
సప్తపర్ణి ప్రశిప్రర్ణి జంబు నింబ తథైవచ।
అపామార్గంచ బిల్వంచ అర్కం చౌదుంబరం తథా।
ఏతే ప్రశస్తాః కథితా దంతధావనకర్మణి॥

అని దంతధావసమునకు గానుగ, కదిర, కడిమి, గోరింట, అరటి, నెల్లి, నేరేడు, వేప, ఉత్తరేణి, మారేడు, జిల్లేడు, అత్తిపుల్లలు ప్రశస్తము లని చెపుతూ వుండగా ధర్మశాస్త్రంమీరి బర్రెంకిపుడకతో నెందుకు పళ్ళు తోముకున్నారు ?

సూర—(తనలో) వీళ్ళడిగేప్రశ్నలకల్లా చేసిందిలేదని అబద్ధా లాడితే సరిపోతుంది. నిజం చెప్పి వీళ్ళు వేసేప్రశ్నలకు నిలువలేము. (బిగ్గరగా) పయిధర్మశాస్త్రంలో పయిపుడకలు ప్రశస్తము లని చెప్ప బడినవేకాని మరి యేవీ కూడవని చెప్పకపోవడంచేత బర్రెంకిపుడకతో తోముకున్నాను.

విశ్వ—అలాగయితే యీవేళ నవమితిథిగదా ధర్మశాస్త్రంలో

శ్లో॥ ప్రతిప త్పర్వషష్ఠీషు నవమ్యాం చైవ సత్తమాః।
దంతానాం కాష్టసంయోగా ద్దహం త్యాసప్తమం కులమ్॥

అని పాడ్యమినాడు, షష్టినాడు, నవమినాడు, పుడకతో దంతధావనము

చేసినట్టయితే వీడవతరమువరకును కులమును దహించునని చెప్పబడి వుండగా ఇంత పాపకార్యం యెందుకు చేసినారో చెప్పండి.

సూర—— (తనలో) ,పుస్తకాలు అచ్చుపడడంచేత వీళ్లతో అసాధ్యంగా వున్నది. ఇదివరకు ఒప్పుకున్నాను గనుక యిప్పుడు లేదనడానికి వల్లకాదు. ఇంకోమోస్తరు అబద్ధం ఆడుచాను. (బిగ్గరగా) ఆదోషం పోనడానికి నేను పంచగవ్యం పుచ్చుకొని ప్రాయశ్చిత్తం చేయించుకొన్నాను.

విశ్వ—యెవరియింటికీ వెళ్లకుండా మీకు యీవేళ పంచగవ్యం యెట్లా దొరికింది?

సూర—మాయింట్లో తెల్లఆవును నీవు యెప్పుడూ చూడలేదా యేమిషి? అది నెల్లాళ్ళకిందనే వట్టిపోయినా పంచగవ్యానికి కావలసినవి మాత్రం యిస్తూవున్నది.

విశ్వ——అలాగయితే మీప్రాయశ్చిత్తం అంతా వృథా అయి పోయింది.

శ్లో॥ గోమూత్రం తామ్రవర్ణాయా శ్శ్వేతాయా శ్చైవ గోమయం।
పయః కాంచనవర్ణాయాః నీలికాయా శ్చ గోర్దధి।
ఘృతం వై కృష్ణవర్ణాయాః విభ క్తిర్వర్ణగోచరా।
ఉదకం సర్వవర్ణం తు తస్యవర్ణస్య గృహ్యతే॥౫౧॥

అని దేవలస్మృతిలో యెరాఁవుమూత్రమును, తెల్లావుగోమయమును, పచ్చఆవుపాలును, నీలిఆవుపెరుగును, నల్లఆవునెయ్యియు పంచగవ్యానికి విధించి వుండగా అన్నీ వకఁ తెల్లఆవువాటితోనే చేస్తే మీకు ప్రాయశ్చిత్తసిద్ధి యేలాగు అయింది?

సూర—— (తనలో) దీనికి యేమిఉత్తరం చెప్పను? అదుగో యెవరో ముసలామె బక్కచిక్కి యేడుస్తూ కుంటుకుంటూ వస్తూ

వున్నది. ఈమిష పెట్టి దీనికి జవాబు చెప్పకుండా తప్పించుకుంటాను. (బిగ్గరగా) ఈనాస్తికవాదాలమూలంగా దయాధర్మమూ అన్నీ చెడిపోచూయున్నవి. కాస్సేపు వూరుకో; పాపం యేదో ఆపత్తు పొంది యేడుస్తూవున్న యీవిడ సంగతి విచారించి ఆపన్నివారణం చెయ్యవలెను. అమ్మా! నీవు యెవరు?

[పయివేషముతో జీర్ణహిందూమతకాంత ప్రవేశించుచున్నది.]

హిందూ——నాయనా! నేను మీతల్లిని మీరందరూచేరి నా బిడ్డలమని చెప్పి బూటకాలతో మీపొట్ట పోసుకుంటూ నాసంగతి చూడక నన్ను మాడ్చివేసి, సత్యశౌచాదులైన నాఅవయవాలన్నిటినీ విరిచివేసి, మీలో మీశుష్కకలహాలతో నన్ను చంపివేస్తూ వున్నారు. మీఅనాదరణవల్లనూ దుర్నయంవల్లనూ శిథిలమయిన నాఅవయవము లను బాగుచేసి నన్ను తిన్నగా నడిపించవలెనని యీధర్మరాజువంటివా రెవరైనా కాస్తప్రయత్నంచేస్తే పనిసాగకుండా అడ్డంవచ్చి శాస్త్రి లని మీరు ద్వేషంచేతనూ స్వప్రయోజనపరత్వముచేతనూ కల్పించిన శ్లోకాలనే విషంపూసినశస్త్రాలతో నాకు మరింతవేదన కలుగచేస్తూ వున్నారు. ఈసంగతి యెదుటబడి మీలో మీరు పెట్టుకుంటే యేమయినాకార్యం వుంటుందేమో అనే అడియాశచేత మీరు మీలోపల నుంచి గెంటివేసినా పుత్రవాత్సల్యం విడువలేక మీకోసం యింతదూరం కుంటుకుంటూ నడిచివచ్చినాను. ఇందాకా మీరు నాస్తిక వాక్యాలని యెగతాళిచేసిన యీధర్మరాజువాక్యాలన్నీ నా నిజమయినఅంగములు. మీరు చదివినవన్నీ నాఅవయవములు పెరుగకుండా మీరు రడ్డుపెట్టిన కొయ్యకాళ్లూ కొయ్యచేతులూ కాని నా నిజమయినఅనయవాలు కావు.

ఈలోకములో సత్యముతో సరియైనధర్మ మింకొకటి లేదని

యుతడు చెప్పినది.

శ్లో॥ నాస్తి సత్యసమో ధర్మో న సత్యా ద్విద్యతే పరమ్।
న హి తీవ్రతరం కించి దనృతా దిహ విద్య తే॥

అను భారతాదిపర్వములోని వ్యాసవచనము. అహింస సత్యమిత్యాది వాక్యము.

శ్లో॥ అహింసా సత్యమ స్తేయం శౌచ మింద్రియనిగ్రహః॥
ఏతత్సమూజికం ధర్మం చాతుర్వర్ణ్యేబవీన్మనిః॥

మనుస్మృతిలో దశమాధ్యాయమునందుఁ జెప్పఁబడినది. ఇతఁడు బంధుఁడు మొదలుగాఁ గలవాక్యము.

శ్లో॥ అయంబంధు రయన్నేతి గణనా ళ్ఘదచేతసామ్।
ఉదారచరితానాంతు వసుధైవ కుటుంబకమ్॥

యోగవాసిష్ఠములోనిది. కాయక్లేశ మాదిగాగల వాక్యము.

శ్లో॥ న కాయక్లేశ వైధుర్యం నతీర్థాయతనాశ్రియః।
కేవలం తన్మనోమాత్ర జయేనాసాద్య తే పదమ్॥

వసిష్ఠ—

నర—ఓ ఓ ఓ. (అని కేకలు వేయుచున్నాఁడు.)

అయ్య—కాపుకీపు. (అని ఆఁచుచున్నాఁడు)

సూర—ఠప్, ఠప్, (అని చప్పటలు చరచు చున్నాఁడు.)

హిందూ—ఓ బిడ్డలారా ! నిష్కారణంగా అల్లరిచెయ్యకండి. మీరు బొమ్మలాటలు మరిగి టంగుటంగున గంటలువాయించుకుంటూ యెప్పుడూ బొమ్మలమీదనే ధ్యానంగా వుండడంచేత పెద్దదాన్ని నాబుద్ధినికపోవడమే కాకుండా యెదుటవున్న పురాణపురుషుడయిన మీతండ్రిసకూడా భక్తిగో కన్నెత్తిచూడడమయినా మానివేసినారు. గడ్డాలూ మీసాలూ నెరిసిన నాముసలిపిల్లలారా ! బొమ్మలపెళ్ళిళ్ళ

కోసమూ గుజ్జనకూళ్ళకోసమూ మీలోమీరు తగువులాడే మీకు వయస్సు ముదరడంచేత యిఖబుద్ధిరాకపోయినా, యింకా మీవగా ర్దంలో ప్రవేశించకుండా వూగులాడుతూవున్న యీపసిబిడ్డలనైనా మీవెంటబెట్టుకుని తిరుగుతూ మాతృపితృభక్తిలేకుండా చెరపక వదిలి వెయ్యండి. చిరుతిండికోసమై తల్లి మెడలో పుస్తెలు తెంపుకొని పరు గత్తే అల్లరిపిల్లవాళ్ళవలెనే మీరునూ కుర్రితనంచేత పూర్వం వ్యాసా దులయిన మీఅన్నలు నాకు పెట్టిన సత్యాది అలంకారముల నన్ని టినీ నా దేహం నొచ్చేటట్టు బలవంతంగా తెంపివేసి, నన్ను విడా పినిగా చేసి వాటికి కట్టివున్న తాళ్ళతోనూ తంకరలతోనూ ఆడు కుంటూ, బాలభోగాలు అనుభవిస్తూ, బ్రతికివున్నంతకాలమూ తల్లికి తిన్నగా అన్నమూ బట్టా పెట్టక చచ్చినతరువాత శ్రాద్ధాలపేరుచెప్పి పిండివంటలు చేసుకొనే బుద్ధిమంతులలాగే మీరు నాగతి చూడకుండా నా పేరుచెప్పుకొని వుత్సవాలూ భోగాలూచేసుకుని తింటూవున్నారు. మీ అజ్ఞానదశకు తోడుగా దురాచారభూతంకూడా మిమ్మలిని సోకి వుండడంచేత, మీరు ఎొళ్ళుతెలియక వికారపుచేష్టలు చేస్తూవున్నారు. మీరు తత్త్వవిచారమంత్రించేత కొంచెం తెలివితెచ్చుకొని మాతృ పోషణం ధర్మమని తెలుసుకొని శల్యావశిష్టంగావున్న నన్ను కన్నెత్తి చూచి నాసత్యాది అవయవములను దృఢపరిస్తే నేను తిరిగీబలపడి మీకు వుపచారంచేసి చిరకాలం మిమ్మలిని సుఖ పెడుతాను. అందువల్లమీకు కీర్తికూడా—

నర—ఈముసలిది మనతల్లిఅయితే గుజ్జనకూళ్ళు వండుకుని ఆడుకొమ్మని బొమ్మలను యివ్వకుండా చవిలేని విషప్రాయమైన సత్యాది గుళికలను మింగమంటుందా ? ఈముదిపిశాచంమాట వినక దీన్ని దూరంగా తరిమివెయ్యండి.

అయ్యా—"స్త్రీబుద్ధిః ప్రళయంకరీ" అన్నాడుగనుక దీనిబోధ వినబడకుండా చెవులు మూసుకోండి.

సూర—చదువునేర్చిన ఆడదానితోనూ వంటనేర్చిన మగవాడితోనూ ఎప్పరాదుగనుక యీరాకాసిని కాళ్ళూ చేతులూ విరగకొట్టి మూల పడవెయ్యండి. ఇక్కడవుంటే యీమునులభూతం మనను వదలదు. వేగిరం పారిపోదామురండి.

(అంటూను నిష్క్రమించుచున్నారు.)

యోగాభ్యాసము.

——:0:——

ప్రథమరంగము.

[యోగి, అవయోగి, మహాయోగి, అతియోగి ప్రవేశించుచున్నారు.]

అవయోగి—స్వామీ! కన్నులుమూసుకుని. ఋషీశ్వరునివలె దివ్యచక్షుస్సుచేత మీరు మూడులోకాలమహాత్మ్యాలూ మహాచూస్తూవున్నారు. మీశిష్యుణ్ణి అయిననాకు మీరు చూచినదానిలో లవలేశం కటాక్షించి నన్ను కృతార్థుణ్ణి చేస్తారా?

అతియోగి— ఓరీ! శిష్యా! నీవు యింకా యోగాభ్యాసంలో మొదటి అవస్థలోనే వున్నావు. నీవు యింకా జ్ఞానబోధకు అర్హుడవు కావు. నిజమయినలోకాలు యేడయివుండగా మూడులోకాలు అనుకునే మూఢుడికి నీకు యేమిజ్ఞానోపదేశం చెయ్యను? లోకాలు యేడని తెలుసుకోవడం యోగాభ్యాసానికల్లా మూలాధారము. అది తెలిస్తేనేకాని మనం యెత్తబోయే జన్మపరంపరను గురించికూడా తెలియము.

అవ—స్వామీ ! లోకాలసంగతి నాకు అనుగ్రహించి మీ శిష్యే ప్రశిష్యుణ్ణి అయిన నన్ను ధన్యుణ్ణి చెయ్యండి.

అతి — మన పరిణామ సిద్ధాంతానుసారముగా మనుష్యుడు నిర్వాణాన్ని పొందడానికి ముందుగా యేడులోకాలలో అవతరించ వలెను. అందులో వకటి భూలోకము, యిరొకటి బుధలోకము, మరివకటి అంగారకలోకము. ఆపయిని నాలుగు సూక్ష్మాతిసూక్ష్మము లయిన లోకాలు. అవి నీకు చెప్పినాకాని యిప్పుడు తెలియవు.

అవ—తెలియనివి పోనిచ్చి తెలిసేవి అనుగ్రహించండి.

అతి—ఇప్పుడు యేడులోకాలను గురించి చెప్పినానుగదా ? ఈయేడుసంఖ్య మహాప్రధానమయినది. శాస్త్రానికి మూలకారణము. నీవు బాగా జ్ఞాపకం వుంచుకోవలెను. ఏడులోకాలే యేడుగ్రహాలు, ఏడులోకాలూ, ఏడుద్వీపాలూ, ఏడుసముద్రాలూ, ఏడువారాలూ, నీకు తెలిసినవేకదా ? యీ సప్తసంఖ్యలోనే సృష్టిరహస్యమంతా గూఢంగా దాగివున్నది.

అవ—అలాగయితే గూఢార్థము నాకు విప్పి సెలవియ్యండి.

అతి—ఈయేడులోకాలలోను వొక్కొక్క-లోకంలో యేడేసి జాతు లున్నవి. యేడేసిజాతులలోను వొక్కొక్కజాతిలో యేడేసి వుపజాతులు వున్నవి. అన్నీ వుపజాతులు యెన్నో తెలిసినవా ?

అవ—తెలియలేదు.

యోగి — ప్రథమావస్థలో వున్నవాడవు నీకు యెట్లా బోధ పడుతుంది ? ద్వితీయావస్థలో వున్నానుగనుక నాకు నిమిషంలో బోధ పడ్డది. యేడేళ్ళ నలభయితొమ్మిదిజాతులు నలభయితొమ్మిదియేళ్ళ మూడువందల నలభయిమూడు వుపజాతులు.

అతి — నీవు గ్రహించినావు. స్త్రీ లయినా పురుషు లయినా

మనుష్యజన్మం యెత్తినవా రందరూ యీమూడువందల నలభయిమూడవస్థలనూ వొక్కొక్కరు రెండేసిసార్లు పొందవలెను.

యోగి—అలాగయితే ప్రతిమనుష్యుడూ యీయేడు లోకాలలోనూ ఆరువందల యెనభయిఆరు జన్మాలు యెత్తవలెను.

అతి—అంతేకాదు. యింకులో యింకా వకసూక్ష్మం వున్నది.

మహా—ఈసూక్ష్మం యోగాభ్యాసంలో తృతీయావస్థలోవున్న నాకు బోధపడవలెనుగాని యీయోగికికూడా బోధపడదు. ఆసూక్ష్మం సెలవియ్యండి.

అతి—లోకచక్రము యొక్క భ్రమణమునుబట్టి యీపరిణామము యేడు ఆవృత్తులు జరగగా ప్రతిమనుష్యుడికిన్ని నిర్వాణానికి వెళ్ళడానికి ముందు ఆరువందల యెనభయిఆరు యేళ్లు నాలుగువేల యెనిమిదివందల రెండు జన్మాలు యెత్తవలెను.

యోగి—అబ్బో! చాలాజన్మాలు యెత్తవలెను.

అతి—నీవు యీజన్మాలకే యింత ఆశ్చర్యపడుతూ వున్నావు గాని జన్మజన్మానికి మధ్య వుండేకాలవ్యవధి వింటే మరీ ఆశ్చర్యపడుతావు.

యోగి—సెలవియ్యండి. నేను ఆశ్చర్యపరవశుణ్ణి అవుతాను. యిదివరకు విన్నదానివల్లనే అపయోగికి ఆశ్చర్యమహాసముద్రంలో మునగడంచేత నోట మాట రాకుండావున్నది.

మహా—ఈ ఆశ్చర్యమంతా ప్రథమ ద్వితీయఅవస్థలో వున్న మీకుగాని చరమావస్థలు దాటి ఆరూఢుడను వున్న నాకు యేమి చెప్పినా ఆశ్చర్యం లేదు.

అతి—పని చేసినతరువాత విశ్రాంతికావలె నన్నమాట యీ లోకంలో మీకు ప్రతిదినమూ అనుభవములో వున్నదేకదా! వక్క

జన్మంలో కష్టపడ్డతరువాత మళ్ళీ జన్మం యెత్తడానికి మధ్య యెనిమిది వేలయేళ్ళు విశ్రాంతి కావలెను. పైనిచెప్పిన నాలుగువేల యెనిమిది వందలరెండుజన్మాలనూ విశ్రాంతికాలమున యెనిమిదివేలచేత గుడి స్తే మధ్యజన్మాలలో జీవించేకాలంగాక నిర్వాణం పొందడానికి మూడు కోట్ల యెనభయినాలుగులక్షల పదహారు వేల సంవత్సరాలు కావలెను.

మహా—మధ్యజన్మాలలో జీవించేకాలం యెంతో సెలవియ్య వలెను.

అతి—ఆకాలాన్ని గురించి మహాత్ములయితే స్పష్టంగా చెప్ప లేదుగాని అంతా యేడుకోట్లసంవత్సరాలు కావలెనని చెప్పినట్లు జ్ఞాపకం.

యోగి—ఇటువంటి అసంభవాలకు గ్రంథపరిమాణం వుంటేనే గాని నమ్మడానికి శక్యం కాదు.

అతి—మహాత్ములు చెప్పినదానికి ప్రమాణం యెందుకు? వారు ప్రమాణాతీతులు.

మహా—తెలివిమాలినప్రశ్నలు వెయ్యక వూరుకో. మహాత్ముల మాటలకంటెనూ వేరేమి ప్రమాణం కావలెను.

యోగి—అసలు యీసంగతులు చెప్పినమహాత్ములు యెవరు?

మహా—వారిదాకా యెందుకు? నీప్రశ్నకు వుత్తరం నేను చెపుతాను విను. వీరు దివ్యజ్ఞానంచేత కొత్తగా సృష్టింపబడినారు. వీ రందరూ అదివరకు మరుగుడివుండి యిప్పుడు దివ్యజ్ఞానంచేత బయలపడ్డారు.

యోగి—ఈసంగతులు యేమహాత్ముడు చెప్పినాడు?

అతి—ఏమహాత్ముడా? కూట్‌హూమీలార్ సింగుగారు చెప్పినారు.

యోగి—ఆయన చెప్పినందుకు నిదర్శనం యేమిటి ?

అవ—గ్రంథనిదర్శనం లేనిదీ మేము నమ్మము.

అతి — నేను మీకు కావలసిన గ్రంథనిదర్శనంకూడా కనపరు స్తాను ఓపిక చెయ్యి. ఈసత్యము లస్సీన కూట్ హూమీగారు సెల విచ్చినట్లు మెస్టరు సిన్నెట్టుదొరవారు హూణభాషలో రచియించిన గుప్తశాస్త్రములో వున్నవి.

మహా—గుప్తశాస్త్ర మంటే యీమందజ్ఞానులకు తెలియదు. అక్కల్టుసమన్ను.

యోగి—కూట్ హూమీ యీ భరతఖండపుమహాత్ముడేనా?

మహా—అవును. ఆతడు పంజాబుదేశస్థుడు. చిన్నతనంలో వక బంధువుడియొక్క సహాయంచేత యూరోపుఖండమునకువెళ్ళి పశ్చిమ విద్య నేర్చుకునివచ్చి తరువాత పాశ్చ్యశాస్త్రాలలోకూడా మహాపండితు డయినాడు. అది తిబితీయదేశపు పేరు. నీవు ప్రమాణం వుంటేనేకాని యేదీ నమ్మవు గనుక చెపుతాను విను. ఈరహస్యం సిన్నెట్టుదొరగారు తమ అక్కల్టుసైన్సులో ఆశీవ పేజీలో వ్రాసివున్నారు.

అతి—నేను యింతకంటెనూ ప్రబలప్రమాణం చూపుతాను చూడు. మేడమ్ బ్లావట్ స్కీదొరసానిగారు "ఐసిస్ అన్వీల్డు" అను తమ మహాగ్రంథముయొక్క రెండవవాల్యము ఆంఓవ పేజీలో కూట్ హూమీగారు కాశ్మీర దేశస్థుడని వ్రాసి వున్నారు. ఆమహాగ్రంథము యొక్క రెండవవాల్యాములోనే ఆఅరవ పేజీలో అతడు కచ్చి దేశస్థుని కుమారు డనినట్లు పుదొరసానిగారే తమ దివ్యజ్ఞానంచేత లిఖించియున్నారు.

యోగి — మీరు యిద్దరూ వకరు పంజాబుదేశస్థు డనీ వకరు కాశ్మీరదేశస్థుడనీ వేరేవేరేవిధంగా చెపుతూవున్నారే !

మహా—ఇలాగంటి పనికిమాలినప్రశ్నలు యెప్పుడూ అడుగ బోకు. "ఋషీణాం మతయ శ్చ భిన్నాః" అన్నాడుగనుక ఋషుల మతాలు వెయ్యివిధాలుగా వుంటవి. ఆ దేవరహస్యాలు దివ్యజ్ఞానం కలవారికేకాని మనవంటి నరమాత్రులకు తెలియవు. మనంకూడా అనేకఅవతారాలు యెత్తుతూ యోగాభ్యాసం చేస్తూవుంటే యేదో వక జన్మంలో యీరహస్యాలు గ్రహించేకాలం వస్తుంది.

యోగి — ఆలాగయితే నాకు యిప్పుడే యోగవిద్యోపదేశం చెయ్యండి. యోగంయొక్క నాలుగవస్థలలోనూ యేమేమి తెలుస్తవో సెలవియ్యండి.

అతి—యోగి ప్రథమదశలో యోగముయొక్క ప్రథమాంగము లను నేర్చుకొని యింద్రియములను వశపర్చుకోవడానికి కృషిచేస్తాడు. రెండవదశలో సంపూర్ణజ్ఞానమును పొందుతాడు. మూడవదశలో యింద్రియనిగ్రహం చేసి చతుర్వర్గములను భూతములను జయిస్తాడు. అప్పుడాయోగిని నిప్పు కాల్చలేదు; నీళ్ళు ముంచలేవు; మట్టి కప్పివెయ్య లేదు; విషవాయువు చంపలేదు. అప్పుడతడు మహాశక్తిసంపన్ను డయి పరిమితజ్ఞానదాయకములయిన యింద్రియముల సహాయ మక్కర లేకుండానే దూరశ్రవణ దూరదర్శనాది శక్తులను పొంది సమస్త లోకములలోనూ జరిగేచర్యలు యిక్కడనుంచే చూడగలుగును; అనంతకోటిబ్రహ్మాండములలోనూ పుట్టేశబ్దా లన్నీ వినగలుగును; మహాసూక్ష్మరూపముతో భూమిలో మధ్యకు దూరగలుగును; అతి లఘువయి ధ్యానశక్తిచేత యీ దేహముతో లేచి వాయువులో తేలి ఆకాశగమనము చెయ్యగలుగును ; భూమిలో నిలువెడుగులోతున పాతి పెట్టినా చావక సమాధిచేత యిష్టమున్నంతకాలము బ్రతికి స్వేచ్ఛ మరణమును పొందగలుగును; కాళ్ళు తడికాకుండా నీళ్ళమీద నడవ

గలుగును. పశ్చిమఖండశాస్త్రజ్ఞులగర్వ మంతా అణిగేలాగు యోగ మహిమచేత యిటువంటి అద్భుతాలను అపరిమితంగా చెయ్యగలుగును. నాలుగోదశలో కేవలం నిర్వాణమే వస్తుంది.

అవ — మాకు వీటి కన్నిటికీ హిందూశాస్త్రాలలోనుంచి ప్రమాణాలు కావలెను. మీరు మహానిర్వాణమని బౌద్ధశాస్త్రాలు వుపయోగిస్తూ వున్నారు.

మహా — బౌద్ధులకూ హిందువులకూ భేదము లేదు. బుద్ధదేవుడే తరువాత శంకరాచార్యావతార మెత్తినాడు. ఈమహారహస్యమును మెస్టరు సిన్నెట్టుదొరవారు "ఈసాటరిక్ బుద్ధిజమ్" అను తమపవిత్ర గ్రంథముయొక్క ఇరవ వ పేజీలో విశదపరచి యున్నారు.

అవ — మాకు యీప్రమాణాలు బాగా తెలియడంలేదు. ఈసారి వచ్చేటప్పుడు ప్రమాణగ్రంథాలు తెలిసినపండితుణ్ణి వెణ్ణి వెంటబెట్టుకుని వస్తాను. (అందఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయరంగము.

[యోగియు, అవయోగియు, వియోగియు ప్రవేశించుచున్నారు.]

వియో — ఏమయ్యా యోగిగారూ! మహాయోగిగారున్ను, అతియోగిగారున్ను యింకా రాలేదు.

యోగి — వారు కొంచెం ఆలస్యంగా దయచేస్తారు. అతియోగిగారు రాత్రి చలిమంట వేసుకుంటూవుంటే కొరకంచు కాలిమీద పడి అతియోగిగారికాలు కొంచెం కాలి బొబ్బయెక్కింది. కాలినచోట గొబ్బరినూనె రాతామని సీసాకోసం యిట్టే గూట్లో చెయ్యిపెట్టేటప్పటికి మృత్యుదేవతలాగు యెక్కడనుంచివచ్చిందోకాని యెర్రితేలు వకటి మహాయోగిగారి నడింవేలు అంటకుట్టింది. ఆవిషం గుండెలలోకి

యెక్కి కిందా మీదా నిలువక ఆయన బాధపడుతూవుంటే చస్నీళ్ళు పోస్తే విషం దిగుతుందని యెవరో చెప్పడంచేత మహాయోగిగారు తోడడానికి వెళ్ళి చీకట్లో తొందరచేత గుభిల్లున నూతిలో కూలి నాలుగు గుక్క-లు నీళ్ళుతాగి వుక్కిరిబిక్కిరయినారు. అప్పుడు మేమంతాచేరి ఆయనను పయికితీసి వొళ్లంతా కాచి నీళ్లు కక్కించి, మహాయోగి గారికి తేలుమంత్రించేసి జాముసేపట్లో విషం దిగేటట్టు చేసినాము. ఇప్పటికీ ఆయనకు కుట్టినచోట మంట పోలేదు. ఈ యిబ్బందులు రావడంచేతగాని లేకపోతే వారు యీపాటికే సభకు విజయంచేసి వుందురు.

అవ—వారు యోగంయొక్క మూడునాలుగవస్థలు పొందినవారంటిరే. వారికి నిప్పు కాలదుకాదా? విషం యెక్కదుకాదా? వారిని నీళ్ళు ముంచవుకాదా? ఏడులోకాలసంగతిన్ని చూడగలిగిన మహాయోగులకు వారికి గూట్లోతేలునూ దొడ్లోనుయ్యీన్ని కనబడ్డవి కావేమి?

యోగి—వూరుకో. పెద్దలవిషయంలో యిటువంటి ప్రశ్నలు వెయ్యరాదు. అపచారం వస్తుంది. వారప్పుడు యోగంపట్టి సమాధిలో వుండకపోవడంచేత అవియేమీ కనబడ్డవికావు. అరుగో మహాయోగి గారున్ను అతియోగిగారున్ను దయచేస్తూవున్నారు.

[అతియోగిగారును, మహాయోగిగారును ప్రవేశించుచున్నారు.]

అతి—రాత్రి నూతులో పడడంచేత కాలు నొప్పియెత్తినా నీకోసం కుంటుకుంటూ నడిచివచ్చినాను.

మహా—రాత్రి తేలుకుట్టినబాధ యింకా పోకపోయినా నీ కోసం మూలుగుకుంటూ నడిచివచ్చినాను.

యోగి—పరోపకారపారీణులుగనుక నీశ్రమకు నా ఓర్చు

కొని లోకహితార్థం ఇంతమూరం విజయంచేసినారు.

అతి--మేము వేగిరం వెళ్ళిపోవలెను. వేగిరం వేగిరం అడిగి మీసంశయాలన్నీ తీర్చుకోండి.

అవ--యోగంవల్ల మీరుచెప్పిన దూరదర్శన దూరశ్రవణాది శక్తులు యెప్పుడైనా యెవరికయినా కలిగినవా ?

అతి--మహాయోగులైన మనపూర్వపురుషులకందరికీ కలిగినవి. అలాకలిగిన జ్ఞానంచేతనే వారు పురాణాలు మొదలైన గ్రంథాలు చేసినారు.

అవ--ఇప్పటివారికి తెలియని సంగతులు వారికి యేమి తెలిసి వ్రాసినారో సెలవియ్యండి.

అతి--వొక్క టేమిటి? అన్నీ యిప్పటివారికి తెలియనిసంగ తులే. కల్లుసముద్రాలు ఇప్పటివారి కెవరికి తెలుసును ? నేతిసముద్రా లుయిప్పటివారి కెవరికి తెలుసును ? పెరుగుసముద్రాలు ఇప్పటివారి కెవరికి తెలుసును ? భూమిని పాము మోస్తూవున్నసంగతి యిప్పటి వారి కెవరికితెలుసును? ఆపాముకు వెయ్యితలకాయ లున్నసంగతి యెవరికి తెలుసును ? అగస్త్యుడు సముద్రం తాగివేసినమాట యెవరికి తెలుసును ? హిరణ్యాక్షుడు భూమి చంకకింద పెట్టుకొని పారిపోయిన మాట యెవరికి తెలుసును ? మధుకైటభులమెదడుతో భూమినిచేసిన మాట యెవరికి తెలుసును ? నదులకూ పర్వతాలకూ బిడ్డలుపుట్టిన మాట యెవరికి తెలుసును ? కావలిస్తే ఇలాగంటివి గుక్కతిప్పకుండా లక్షసంగతులు యేకరువుపెట్టగలను. ఇప్పటివాళ్ళకు తెలియనివి ఇవన్నీ మనపూర్వులకు యోగమహిమచేతనే తెలిసినవి.

అవ--యెక్కడనైనా యేళ్ళకూ కాళ్ళకూ బిడ్డలు పుడతవండీ?

అతి--తప్పకుండాపుడతవి. శక్తిమతీనదికిన్ని కోలాహలపర్వ

శానికిన్నీ గిరిక పుట్టలేదా ?

వియోగి—పుట్టినది. యేటికిన్నీ గట్టుకునూ్నా గిరిక పుట్టడం నేను ప్రత్యక్షంగా చూచినాను. నేను చూచిన గిరిక వెనుకటివలె కోలాహలపర్వతంవచ్చి శుక్తిమతీనదిమీద పడితే నదికిపుట్టలేదుగాని నదే వచ్చి కొండమీద పడేటప్పటికి కొండకే పుట్టినది.

అతి—చూచినావా? ఇంగ్లీషుశాస్త్రం చదువుకున్న మీవాడు కూడా ప్రత్యక్షనిదర్శనం కనబడడంచేత మన పూర్వులు చెప్పిన సత్యం వప్పుకుంటూవున్నాడు. మనపూర్వులు యెంతదివ్యజ్ఞానం కల వారో ఇప్పుడైనా బోధపడినదా ? కాస్తభేదానికి ఫర్వాలేదు.. గిరిక పర్వతానికి పుట్టినా నదికిపుట్టినా రెండూ వకటే.

అవ—నది ఆడదిగనుక పిల్ల పుట్టవచ్చునుగాని మగవాడైన పర్వతానికి యెలా పిల్లపుడుతుంది?

మహా—పురాణాలలో మగవాళ్ళకుకూడా పిల్లలు పుడుతారు. వేనుడికి పృథుచక్రివర్తిపుట్టినాడు. పరిమ్యాన్నుడు కడుపుతో వుండి పురూరవశ్చక్రివర్తిని కన్నాడు. యువనాశ్వుడు గర్భము ధరించి మాంధాతను గన్నాడు.

అతి—వియోగిగారూ ! మీరు ప్రత్యక్షంగా చూచిన గిరికా జననమహత్యం చెప్పి యీఅవయోగిసంశయం పోగొట్టండి. ఇంగ్లీషు చదువుకొన్నవారు చెపితేనేగాని యీఅవయోగికి నమ్మకంలేదు.

వియో—చెపుతాను వినండి. నేను వర్షాకాలంలో వక్కరోజు పాండవులవారి మెట్టమీద కూర్చుండి వుండగా రాత్రికురిసిన వర్షం చేత పొంగి యేలేరు పరుగెత్తుకొనివచ్చి ఆకొండమీద పడ్డది. ఆ యేరున్ను కొండానున్ను కలియడంచేత నీళ్ళన్నీ కొండకలుగులలోకి పోయేటప్పటికి నేను చూస్తూవుండగా నాముంచువున్న గుహాగర్భము

లోనుంచి గిరిక కిచకిచలాడుతూ పుటికి వచ్చినది.

మహా—ఇది కలియుగంలో అత్యద్భుతమైన సంగతి. పురాణాలలో చెప్పిన పూర్వకాలమహిమలు మనదేశంలో ఇంకా పోలేదు.

అతి—ఆగిరికావృత్తాంతము సవిస్తరముగా చెప్పండి.

వియో—ఆగిరిక కిచకిచలాడుతూపాకి నాముందరికి వచ్చేటప్పటికి కరుస్తుందేమోనని భయపడి నేను వెనుకకు జరిగినాను. ఇంతలో గిరిక చటుక్కున మరివకకన్నంలోదూరి మాయమైపోయింది.

అవ—గిరికఅంటే యేమిటి?

వియో—నీవు నిఘంటువు యేమి చదవలేదా? గిరిక అంటే చిట్టెలుక. ఇప్పుడు తెలిసిందా?

అవ—సరిసరి! ఇప్పుడు తెలిసింది. మీరుచెప్పినదంతా నీళ్ళు కొండకలుగులో దూరేటప్పటికి కన్నంలోనుంచి యెలక పుటికి వచ్చిందనా?

వియో—చురి యేమనుకున్నావు?

మహా—ఈయన మనను వేళాకోళం చేస్తూవున్నాడు. మనం యీయనతో మాట్లాడగూడదు.

వియో—మీరు నాతో మాట్లాడినాసరే మాట్లాడకపోయినాసరే నాకు యేమీ లోపం లేదు. మీరు మాట్లాడడంచేత నావంటికి బంగారం యేమీ అంటుకోలేదు. అంటుకుంటే వకవేళ మీచాదసం కూడా నాకు కొంచెం అంటుకోవచ్చును. యోగుల మని మీరు యెన్ని వేషాలు వేసినా మీకోసం సృష్టిధర్మాలు యిప్పుడు కొత్తగా మారవు. ఏమహాయోగిని తీసుకొనివచ్చి లోతుసీళ్ళలో పడవేసినా బుడుంగుమని లోపలికి మునిగి గుటుక్కుమంటాడుగాని యీతరాకపోతే పైకి తేలడు. మీలోవున్నమహాయోగినియె వరినయినా నావద్దకు

తీసుకురండి. కర్పూరమొకటిగాకాల్చి వాతవేసి నిప్పు కాలుతుందో లేదో చూపిస్తాను. ఏలోకంలో యేసంగతి తెలిసినా శోధనచేసి దేశాలుతిరిగి శోధనచేస్తే తెలుస్తుందిగాని యింట్లో కూర్చుండి ముక్కుమూసుకుని యోగంపడితే తెలియదు. సత్యగ్రహణానికి వక్కపరిశోధన సాధనముగాని ఆకాశపంచాంగాలూ, దివ్యజ్ఞానాలూ, యోగనిష్ఠలూ సాధనాలుకావు. మీయోగంవల్లనూ, గాలిలో వ్రాసిన వ్రాతల వల్లనూ తెలిసేవి మీవిభూతిమహాత్మ్యాలూ రుద్రాక్షమహాత్మ్యాలూ తులసిమహిమలూ క్షేత్రిమహిమలూ మొదలుగాన పుక్కిటి పురాణాలు మాత్రమే. సత్యమయిన జ్ఞానము శోధనచెయ్యనిదీ లేశమూ మంత్రాలతో రాదు.

అతి—ఈయన నాస్తికవాదాలు చేస్తూవున్నాడు. యుక్తిరహిత మయిన యీవాదాలు మనం వినరాదు. లేచిపోదాముర౦డి.

మహా—లేచిపోదాముర౦డి. ఈబౌద్ధులకు తర్కాలు యెన్ని వినిపించినా ఆర్యమహాజనులలో శాస్త్రవిశ్వాసం పోదు.

(అందఱును పోవుచున్నారు.)

బహిష్కారపత్రికలు.

[రామచంద్రశాస్త్రియు, గోపాలశాస్త్రియు ప్రవేశించుచున్నారు.]

గోపా—ఓరీ! రామచంద్రశాస్త్రి! నిన్ను సేవేమో మా కా మాధ్వానులవద్ద మహాకూసినావట. నేను దగ్గిర వున్నట్టుంటే డొక్క బద్దలచేస్తును జాగ్రత్తగా మసులుకో.

రామ—మాటలు మిగుల రానియ్యకు. యీవూరికి నీవు మొక్కడవేనా సభాపతివి మరియెవరైనా వున్నారా?

గోపా --యెవడువుంటేయేమి ? నామట్టుకు నేనే సభాపతిని. నీకు శక్తివుంటే నీవుకూడా యేరుకోరాదా ? నాకు దొరికిపోయిందని యేడుస్తారేమి ?

రామ—మన పెద్దలనాటినుంచీ వచ్చే ఆచారం విచారించవలెనా ? అక్కరలేదా ? గ్రామంలో యేమయినా దొరికితే సభాపతులు నలుగురూ పంచుకోవలెనా ? నీవువక్కడవే కడతేర్చవలెనా ?

గోపా--నామనసు, నాకు దొరికింది నేను పుచ్చుకుంటాను. నీకు దొరికినదాల్లో నాకూ యేమిభాగం యివ్వవద్దు. ఆచారం యేమిటి వెధవ ఆచారం. నీతమ్ముడికి యింగ్లీషు చెప్పిస్తూ వున్నావు కదా, యీఆచారం మీయింట యెప్పుడయినావున్నదా ? నీవు రహస్యంగా చుట్టలు కాలుస్తావుకదా వైదీకంలో మీతండ్రి కాల్చేవాడా ? ఆవేషాలు మాదగ్గిర పనికిరావు. డబ్బుదొబ్బుడానికి మీకు యీవూళ్ళో సభాపత్యం. యెవరుయిచ్చినారు?

రామ--నీకుమాత్రం యెవరు యిచ్చినారు?

గోపా--నాకు నాచేతులు యిచ్చినవి. నేను వివాహాలలో తోరణాలు తెంపిన్నీ, స్తంభాలు వూడపెరికిన్నీ, పెనుగులాడి చేతులు బద్దలుచేసి, డబ్బుపుచ్చుకునిన్నీ, పిడిగుద్దులు గుద్దిన్నీ, నా మగతనంచేత నేను సంపాదించినాను. నాకు యిందులో అయినా పాండిత్యం వున్నది కాని వెధవవు నీకదీలేదు. ఈపాండిత్యమూలేక చదువూలేకపోయి నప్పుడు నీకీశాస్త్రిపేరు యెందుకురా?

రామ--ఆట్టే పేలకు నలుగురూ ఛీఛీ అంటారు. నేనూ చిన్నప్పుడు రఘువంశం నాలుగుసర్గలు చదువుకున్నాను. శాస్త్రులుకావడానికి అదిచాలదా? చదువులేకపోయినా శాస్త్రులన్న పేరయినా పెట్టుకోకపోతే పయివాళ్లు యెవరుగౌరవంచేస్తారు? యెవరో పెద్దమను

ష్యాలు వస్తూవున్నారు. మనం యిద్దరమూ ఘర్షణపడకూడదు. మనకు యిరుపక్షాల్లోనూ పెద్దపరివార వస్తూవున్నది. ఇది పాతికలూ యాభైలూ వచ్చేపద్దు. సభాపతులందరమూ యేకముకావలెను.

గోపా--ఆలాగేఅవుదాముకాని రాత్రి మీయింట్లో నీవెళ్ళా ముకునూ నీకునూ మహాయుద్ధము జరుగుతూవున్నదే.

రామ--ఆముండమాట నాతో చెప్పకు. దానిపేరు చెపితే నావళ్ళు మండుకువస్తూవున్నది.

గోపా--ఆలా నీవంటినిండా సింహాచలంకొండమీది పంచధారలవలె మొఖముమీదనూ చేతులమీదనూ వీపుమీదనూ అయి దేసి యెఱ్ఱనీటిధారలు కనపడుతూవుండగా నీవళ్ళమండకుండా యేలా వుంటుంది? రాత్రినీకు దంతక్షతాలూ నఖక్షతాలూ మహాకలిగినవి. జరిగినది ఘంటసేపయినా మీది భారతయుద్ధమును మించిపోయినది. మీరు కచాకచీనీ, నఖానఖీనీ, దంతాదంతీనీ, ఘోరయుద్ధము చేసినారు. మీమతయుద్ధం అయినతరువాత చివరకు శిలాయుద్ధమూ వృక్షయుద్ధ మూకూడా జరిగినట్టున్నదే! వృక్షయుద్ధముకాదు. చీపురుకట్టయుద్ధము కాబోలును. ఇంతసేపు యుద్ధముజరిగినా నీభార్య సింహానాదములూ జయధ్వనులూ వినబడుతూవచ్చినవికాని నీగొంతుక యెక్కడా వినబడ దేమిరా! చివరకు నీభార్యకే విజయం కలిగినట్లున్నది. నీరోదనధ్వని చూచి మేము ఆలాగు అనుకున్నాముకాని మాకు నిజం తెలియదు. చివరకు విజయం యెవరికి కలిగిందో చెప్పుమా.

రామ--ఆపాడుముండమాట పోనిచ్చి మనకు దొరికేడబ్బుమాట మాట్లాడుమా.

గోప--ఓరి నీభార్య మహిషాసురమర్దనిని మించిపోయినదిరా! ఓరీ! మీ యిద్దరికి అర్ధరాత్రివేళ కలహం యెందుకు వచ్చిందీ? నీవు

మీ యింటియెదటి బోడిముండతో వెళుతావనేనా?

రామ — అంతా తెలిసినతరువాత న న్నెందుకు బాధిస్తావు? మన డబ్బుమాట మాట్లాడుమా.

గోపా—నిరుడు దానికి కడుపువచ్చినప్పుడు నీవే కాదుట్రా మందు యిచ్చినావు.

రామ—ఊస్సి; ఆమాటలు చాలించి మనకు వచ్చేడబ్బుమాట చూచుకుందూ.

గోపా — రామచంద్రిగా ! డబ్బు యేమిటో చెప్పు. నాకు రాత్రికి ముండకూ చుట్టుకూ కావలెను. ఓరే! నేను యిప్పుడు శాస్త్రేయంకూడా చేస్తూవున్నాను సుమా.

రామ—ఆసంగతి నీనోరు వాసనచూచినా నీపేలాపనచూచినా నీవు చెప్పకుండానే తెలిసింది. దానిలో యేమితప్పితం వున్నదికాని నిన్న రాత్రి మనవూళ్ళో వక వెధవపెళ్ళి జరిగింది సుమా !

గోపా—ఏమి? జరిగితే యేమి? నీవు చేసేపనికంటే అదే మంచిది.

రామ—నీవు వక్కడవు యిలాగు అంటూ వున్నావుకాని మన సభాపతులలో మరి యెవరూ ఇలాగు అనరు. ఇలాగు వెధవముండను పెండ్లి చేసుకొని కులాసికి వెలివైై నింద పడకపోతే మహారాజులాగు వొక వెధవముండను వుంచుకొని అది పడుచుతనంలో వున్నన్నాళ్ళు దానిదగ్గిర డబ్బు లాగుతూ సుఖంగావుండరాదూ ?

గోపా—వకవేళ దానికి కడుపు వస్తేనో ?

రామ—వస్తే నేమి ? కడుపు దింపుకున్నా పోతుంది పిల్లనుకని చంపి పారవేసినా పోతుంది. ఈరెండుపనులలో యేది చేసినా కులం పోదు. వకవేళ తెలివితక్కువచేత యీ రెండుపనులూ జరగడానికి

వీలు లేకపోతే ఆ వెధవముండ కులంలోనుంచి చెడిపోతుంది కాని మన కేమీ అపాయము లేకుండా మనం నిర్భయంగా వుండవచ్చును. అంతగా కావలిస్తే మనకు మరివక వెధవముండ దొరుకుతుంది.

గోపా — రాత్రి నీ పెళ్ళాంవల్ల నీకు తటస్థించినప్రాయశ్చిత్తం చూస్తే నావంటివాడు యెప్పుడూ వెధవముండ పేరు తల పెట్టడు. వాళ్ళు పెళ్ళిచేసుకుంటే మన కెందుకు పోనిన్స్తూ.

రామ — ఆలా కాదు. యీ విధవముండలు అందరూ పెళ్ళి చేసుకుంటే నోములూ వ్రితాలూ చేసి మనకు డబ్బు యెవరు ఇస్తారు? మొన్న కడుపు దింపుకోవడానికి కాశీయాత్రి వెళ్ళిన కాంతమ్మ కాశీ సంతర్పణ చెయ్యబట్టేనా మనకందరకూ సంభావనలు దొరకడమే కాకుండా రెండువందలమందిబ్రాహ్మలకు వీసెబూరెలతో అన్నం దొరికింది? మొన్న తురకవాణ్ణి తీసుకుని అవతలివీధిలో వుండి మళ్ళీ యింటికివచ్చిన చేబియ్యంవారి సీతమ్మ సంతర్పణ చేసినట్లు లక్షవత్తుల నోము పట్టి వెయ్యిబ్రాహ్మణ్యానికి యీవూళ్ళో యేమగముండాకొడుకయినా యెప్పుడయినా చేసినాడా? వక్క-నోములూ వ్రితాలే కాకుండా వెలివేస్తామని, స్వాములవారికి వ్రాసి బహిష్కారపత్రికలు తెప్పిస్తామనీ బెదరించడంచేతకూడా యెంత లేదన్నా మనకు యాభై గ్రామంమీద తలావందరూపాయలూ రాకుండామానవు. మనకు జీవనానికి భంగం వచ్చేపనిలో నీవు అడ్డం చెప్పరాదు.

గోపా — మగి నన్ను యేమి చెయ్యమంటావు?

రామ — వివాహం జరుగుతూవున్నప్పుడు ఆవీధినినడిచినవారినీ లోపలికి వెళ్ళి తొంగిచూచినవారిని చూరంగా నిలుచుండి బాజాలు విన్నవారినీ అందరినీ నేను జాబితా వ్రాసినాను. మనం అందరమూ దస్కతులు చేసి కావలిస్తే వూళ్ళోవాళ్ళ పేర్లుకూడా వక వందమందివి

వొంకరటింకరక్షేత్రాలతో మనమే అడుగున యెక్కించి స్వాములవారి దగ్గరకు పంపిస్తే అందరికీ ఆంక్షపత్రికలు వస్తవి. అప్పుడు మనం వొక్కొక్కడిదగ్గిర ఫడేసీ ఇరవయ్యేసీ పుచ్చుకుని ప్రాయశ్చిత్తాలు చేయింతాము.

గోపా—నీ ఆలోచన బాగా వున్నది. నీవుకూడా అక్కడకు వెళ్ళినావే మరి నీమాటో ?

రామ—నాకు అక్కర లేదు. నేను వూరికే జాబితా వ్రాయడానికి వెళ్ళినాను. అది కాకుండా మనకు యెవరయినా వకటీ రెండూ చేతులో పెడితే ఇతరసభాషతులకు తెలియకుండానే వాళ్ళపేర్లు జాబితాలోనుంచి తీసివేతాము.

గోపా—నీవు జాబితాలో వ్రాసినవారంతా ఆవీధిని వెళ్ళిన వారేనా ?

రామ—కొందరు ఆరాత్రి వెళ్ళినవారూ వుంటారు. కొందరు వెళ్ళనివారూ వుంటారు. నేను జాబితాలోమాత్రం డబ్బు దొరుకుతుందని తోచినవాళ్ళనే ఆలోచించి యెక్కించినాను. ఆరాత్రి కాకపోతే మానెను ఆజాబితాలో పడ్డవాళ్ళు యెప్పుడయినా ఆవీధిని వెళ్ళే వుంటారు. అందుచేత మనకు అనృతదోషం లేదు. వకవేళ అది అబద్ధమయినా ఫర్వాలేదు. "ప్రాణవిత్తమానభంగమందు బొంకవచ్చు" నని శుక్రాచార్యులు చెప్పినాడు గనుక, మనకు విత్తభంగం వచ్చేటప్పుడు తప్పకుండా బొంకవచ్చును.

గోపా—నీవు చెప్పిననీతులూ సబబులూ యేడిసినట్టేవున్నవి కాని వచ్చేడబ్బులో నాకు సఖంభాగం ఇస్తారా లేదా ? నాకు సఖంభాగం ఇచ్చి తక్కినసఖమూ మీరందరూ చేరి పంచుకోవలెను. అలా గయితేనే నే నిందులో దిగుతాను,

రామ—అందరితోటిపాటు నీకు ఒకభాగం ఇస్తాము కాని నీకు ప్రత్యేకంగా సఖి మివ్వము. నీవు రాకపోతే నీవు లేకుండానే మేమే స్వాములవారికి వాగ్గిసి వెలిపత్రికలు తెప్పిస్తాము.

గోపా — యేడిసినాడు. యేదీ నాకు తెలియకుండా యీ గ్రామంలో యెవరుమహాజరుపంపిస్తారో పంపించమను. వొక్కొక్కణ్ణే పట్టుకుని డొక్క బద్దలుచేయిస్తాను. నాదస్కత్తు లేకుండా ఆంక్ష పత్రిక పంపించడానికి ఆస్వాములవారుమాత్రం అంత గుడ్డివాడా ? ఏదీ నాకు సఖింభాగం' యివ్వ మని యింకొకమాటు అను. నిన్ను రాత్రి నీపెళ్ళాం కొట్టినది అబద్ధమూ ఇప్పుడు నేను కొట్టినది నిబద్ధి చేస్తాను. ఏమీ నోరు మెదపవేమి ?

రామ—నీకు సఖింభాగం యిస్తాము.

గోపా—భేషు నేను పెద్దసభాపతినా మతివకటా ? నాపేరు చెపితే తక్కినసభాపతుల కంపరికే గర్భనిర్భేదం. వొరే యీజాబితా అంతా నీవు రాత్రి యెక్కడ కూర్చుండి తయారు చేసినావురా ?

రామ—రాత్రిసంగ తంతా నీవుచూచే మళ్ళీ నన్ను అడుగుతా వేమి ?

గోపా—ఓహోహో తెలిసినది. నిన్నరాత్రి అంతా మీవిధవ భార్యాగారి యింటికాడ వుండి ఇంటికి పోకుండా వున్నందుకా నీభార్య నిన్ను కొట్టినది. రాత్రిఘంటసేపు నీవొళ్ళురణభేరిలాగున మోగిందిరా.

రామ—మరి యెందుకూ కాదుకాని మొన్న యీసంగతి తెస్తే నాభార్య తానుకూడా విధవావివాహం చేసుకుంటా ననడంచేత ఈవివా హాలవాళ్లమీద నాకు మరీ కోపంవచ్చింది. అందుచేతనే నేను యింత కష్టతో పనిచేస్తూ వున్నాను.

గోప—వోరీ తెలియక అడుగుతానుగాని నీవు బ్రతికివుండగా

సీభార్య విధవావివాహం యెలాగు చేసుకుంటా నన్నదిరా! నీవు బ్రతికి వున్నా చచ్చినవాడింకోటే సమానంగా కట్టివేసిందా యేమిటి ?

రామ—నాకు దైవం యిచ్చినఆయువు తిన్నగా వున్నది కాని నాభార్యాకు విసుగు వచ్చి మరికాస్తసేపు వూరుకోకపోయినట్లయితే దానికోరికే సిద్ధించును. నేను మళ్ళీ సభాపతినై హిందూధర్మాలు నిలవపెట్టడానికోసం గాబోలును భగవంతుడు నాకు ఆపశ పట్టకుండా చేసినాడు.

గోపా — ఆంక్షపత్రికలకోసం ప్రయత్నం చేస్తూవుంటే యీ మాటు సీభార్యా నిన్ను పశువునుగా పట్టి యజ్ఞం చేస్తుం దేమో? నిన్నటిరాత్రి దెబ్బలకు తాళినా రేపటిదెబ్బలకు తాళలేవు. నీ కిది అలవాటయిపోయి నీవళ్ళు కాయలుకాసి నీది వజ్రదేహం అయినది కాబోలును.

రామ — నాభార్యవిషయము భయపడవలసినపని లేదు. దాన్ని నేను సమాధానం చేసినాను. యీ వచ్చేసొమ్మ్ము పెట్టి దానికి నగలు చేయించిపెడతా నని చెప్పితే గ్రామంలో నాకు తెలియని పేర్లు అదే చెప్పి వాయించినది. చానికి అప్పుడప్పుడు కోపం వచ్చి చేసుకున్న మొగుణ్ణి గనుక స్వతంత్రంగా రెండు కొట్టినా అది నాయాజ్ఞ మీరదు సుమా.

గోపా — నేను చెప్పినట్లు వింటూవున్నంతకాలమూ నేనూ మీరను. నామాటకు యెదురుచెప్పితేమాత్రం మూతిపళ్ళు వూడేలాగు తన్నుతాను. నాకు పని వున్నది. అవతల సంభావన మించిపోతుంది వెళ్ళవలెను. (అని వెళ్ళిపోవుచున్నాడు.)

బాలభార్య వృద్ధభర్త సంవాదము.

——:o:——

[సర్వజ్ఞాస్త్రీలును, భార్యా సోమిదేవియు ప్రవేశించుచున్నారు.]

సర్వ—ఏమే నాకోసం వచ్చిన పెద్దమనిషిమీద పేడనీళ్ళు అలా చల్లినావు? నిన్ను యేమైనా అంటే బ్రహ్మరాక్షసిలాగు మీదపడుతావని అప్పుడేమీ అనక ఆయనను మంచిమాటలతో సమాధానం చేసి పంపివచ్చినాను.

సోమి—వాకట్లో పెద్దమనిషి వున్నమాట నాతో ముందు చెప్పి యేడవలేకపోయిందా? వాకట్లో మీరువక్కరే వున్నారనుకుని గోడచాటునుంచి చటుక్కున పోసినాను.

సర్వ—ఆఅభిషేకం నాకుమాత్రం చెయ్యవలెనా? ఫ్రాద్దున్నే లేచి నీరుకావిధోవతి కట్టుకున్నాను. అదంతా పేనీళ్ళతో డాగులు పడ్డది.

సోమి — చాలుచాలు ఆట్టేవాగక యీపాటికి వూరుకోండి. యెప్పుడూ మీరు నన్ను ఆడిపోసుకోవడంతోటే సరిపోతుంది. నా చెల్లిలిని యిచ్చిన ముసలిబ్రహ్మయ్యకిచ్చి నన్ను వివాహంచేసినా నేను సుఖపడిపోదును. నాకంటె మూడేళ్ళుచిన్నది. అది అప్పుడే నాలుగేళ్లకిందటనే మండామోసి సుఖంగా వున్నది. నన్ను మొట్టమొదట నా తండ్రి ఆయనకే యిస్తా ననాడు. యమకింకరుడులాగున నీవు మధ్య అడ్డంవచ్చి నూరురూపాయలు యెక్కువ యిస్తాననడంచేత నాతండ్రి ముండాకొడుకు నాగ్రహచారం కాలి నీకు కట్టిపెట్టినాడు. నీవుమాత్రం నామరిదిగారికంటె చిన్న వాడవా యేమిటి? అది మహారాజులాగు నెత్తి సింగా ముసుగువేసుకుని స్వేచ్ఛగావుండగా నీకోత పడుతూవుండడానికి దిక్కుమాలినబ్రహ్మదేవుడు పునిస్త్రీతనం నాకోసటనే వ్రాయవలెనా?

సర్వ——యేమి నన్ను చావమంచావమే ?

సోమి——నేను మిమ్మలిని యెందుకుచావుమంచాను ? యెల్లకా లమూ పెళ్ళాన్ని యేడిపిస్తూవుందురుకాని ముసలితోకుక్కలాగు వెయ్యే ళ్ళుబ్రతకండి. నేను ముండామొయ్యనలెననుకొన్నాను గాని మిమ్మలిని చావమనలేదు. ఆలా అనడానికి వైదీకపుముంటపుట్టి నేనంత అవివేకం గలదాన్నా?

సర్వ——నీవు వివేకంగలదానివే. నీవు ముండామొయ్యడం అంటే నేను చావడంఅని అర్థమవునా కాదా ?

సోమి——ఆమాట నేనెందుకంచాను? నా కాఅర్థాలూ గిర్థాలూ తెలియవు. మీరు పండితులు. యేఅర్థంచేసుకున్నా మీ రేచేసుకోండి. పెద్దబ్రాహ్మలు మీనోటిమాటయినా శీఘ్రంగా ఫలించవలెనుగాదా.

సర్వ—నాబరువు నీవేమి మోసుకున్నావు ? నేనేమి నిన్ను ఆజ్ఞ పెడుతానా ? అదమాయిస్తానా ? నీవు యేపోకిళ్ళుపోయినా కళ్ళు పెట్టుకుని చూస్తూవుంచాను. కాస్తయెప్పుడయినా నోరు యెత్తితె రాకాసిలాగు మీదపడి కొడచావు. నీదెబ్బలచేతనే నాకు యెప్పుడో చచ్చేయోగం వున్నది.

సోమి—ఆదెబ్బలు వుండబట్టే కాస్తయినా చెప్పినట్టు వస్తూ వున్నారు కాని లేకపోతే బొత్తిగానే మీరిపోదురు. దెబ్బలమూలంగా చస్తూవున్నానంచారుకాని నిజానికి నాదెబ్బలమూలంగా వళ్ళు గట్టి పడి యింతకాలం బ్రతికినారు. ముసలితనంవచ్చి మతిపోయి ప్రతిదానికీ చిట్టు బుస్సు మంచూవుంటే యింటికి కావలసినది కొంచెం అద మాయించనక్కరలేదా ? యేమయినా వంటిమీద వక్కదెబ్బవేస్తే నన్ను నలుగురినోళ్లలోనూ పెట్టి రవ్వపెడుతారుకాని నిజం చెప్పండి; ముసలిప్రాణం యెక్కడపోచుందోఅని అక్కడికీ నేను గట్టిగా కొట్టను.

చెయ్య వంటిమీద పడడంతోటే పసిపెల్లవాడిలాగు యేడుస్తూవుంటే నేను యెక్కడ మొత్తుకోను. మీరు కళ్ళారా చూస్తూవున్నానంనారు గాని మీకు కళ్ళువుంటే పోకిళ్ళుపోచూవున్నానంచారూ ? ఇటువంటి మతిమాలిన మాటలు యెప్పుడూ అనకుండా నెత్తిమీద వక్కచరుపు చరుతునా ?

సర్వ—అయ్యో ! అయ్యో ! నీవు మహాదొడ్డయిల్లాలవు. నన్ను కొట్టకే కొట్టకే బతిమాలుకుంచాను.

సోమి—నేను యెంతదొడ్డయిల్లాలనయితేనేమి ? లేనిపోనివాదు మొగుణ్ణి కొట్టేదాన్ని అని నాకు పేరు తెచ్చినారు. మీమూలంగా నాదొడ్డతనమంతా బూడిదలోపోసిన పన్నీరయిపోయింది.

సర్వ—అను అను. యెన్నిఅంచావో అను. నీకు బిడ్డా పాపా లేదు గనుక కొట్టీ తిట్టీ నీబిడ్డలముచ్చటంతా నామీద తీర్చుకుంచూవున్నావు. అంతేకాని పెద్దవాణ్ణి ఆదరించి వేళకుమూత్రం పట్టెడన్నం పెట్టవు.

సోమి—యిదే నన్ను అల్లరిపెట్టడం. బిడ్డా పాపా లేరని మహా యెత్తిపొడుస్తూవుంచారు. అది యెవరితప్పితం ? కాటికి కాళ్ళుచాచుకున్న వాణ్ణి చేసుకుంటే బిడ్డలు పుట్టక యేమవుచారు ? నావెనుక చచ్చిపోయిన నీమూడో పెళ్ళాంవలె తిరిగితే యెంతమంది బిడ్డలయినా నేనూకంటును. అలాకనేదాన్నయితే నాకు మీరు బ్రతికివున్నా రని విచారం యెందుకు ? దీపాలు పెడితే శవంలాగు మంచంమీద పడి నిద్రపోచారు. తలుపు యివతల గొళ్ళెం పెట్టి నామనసు వచ్చినట్లే నేను తిరుగుదును.

సర్వ—ఇప్పుడుమాత్రం యెప్పుడయినా మంచముమీద ముచ్చటకయినా పడుకుంచూవున్నావా ? ముసలిప్రాణ మని నడుము

నొచ్చినా కాళ్ళునొచ్చినా యెప్పుడయినా కాస్తనడుముమీంద చెయ్యి వెయ్యడం వున్నదా? కాళ్లు పిసకడంవున్నదా?

సోమి—కాళ్ళుకాదు గొంతుక పిసుకవలెను. మీనొప్పులు యెన్ని చేతులు వేసినా ఆలాగువుండేవే. అవి రెండుమోపుల కట్టలతో గాని పోవు. దిక్కుమాలిన ముసలికంపు కొడుతూవుంటే మీగదిలో యెలాపడుకోను?

సర్వ—నీవు పడుకోకపోతే మానినావుకాని నన్నుమాత్రం తిట్టబోకు. నాముసలికంపు నీకూవద్దు; నీపడుచుకంపు నాకూవద్దు. జిన్నాకు యింపుగా వేళకుమాత్రం భోజనం పెడుమా!

సోమి—ఆ పెడచాను. యీముసలిఅబ్బాయికి మూడువేళలా పిండివంటలుకూడా చేసి పెడచాను.

సర్వ—మనవాళ్ళయింట్లో యివాళ వాళ్ళఅబ్బాయికి పుట్టింటికలు తీయిస్సారమ! నీవు చెయ్యకపోయినా రెండుబూరెలు వాళ్లయింట్లో వయినా తెచ్చిపెడుమూ వోసే!

సోమి—వూరుకోండి మీమాటలుచూస్తే నాకు వళ్ళుమండుకు వస్తూవున్నది. వాళ్ళయింట్లోకాదు. మనయింట్లో నాకు పుట్టింటికలు తీయించేకోజున మీకు గారెలు వండించి పెడుతాను. తిందురుగాని లెండి. నావంటి నిర్భాగ్యురాలికి ఆమాత్రంభాగ్యంకూడానా? మీతో మొండివాదానికి కూర్చుంటే వోపల అన్నం చిమిడిపోచుంది పోవలెను.

(అని నిష్క్రమించుచున్నది.)

హాస్యసంజీవని

తృతీయభాగము.

కన్యాశుల్కము.

[కామావధానులును, రామశాస్త్రియు ప్రవేశించుచున్నారు.]

రామ—ఓరే కామావధానులూ! శంకరాచార్లు మనవ్యూరి నుంచి వెళ్ళిపోయినాడుట్రా?

కామ—రాత్రి వెళ్ళిపోయినాడు. ఇఖ మనం సంబంధాన్నిగురించి స్వేచ్ఛగా మాట్లాడుకోవచ్చును.

రామ—వుంటేమాత్రం భయమేమిటి? నీకుగాని నాకు ఆలా గంటిభయాలూగియాలూ లేవు. యీవూళ్లో యింతమందిదగ్గర స్వాముల వారు యిండ్లనంతు రూపాయలూ అర్థలూ పుచ్చుకున్నాడుగాని నావద్ద కొత్తకాసయినా పుచ్చుకోగలిగినాడా?

కామా—నీవెక్కడ? వుద్దండపిండానవు. రెండుమాట్లు ఖూనీలు చేసి తప్పించుకొని జయిలులోపడి యెవ్వరికీ వక్కడబ్బ యివ్వకుండా వచ్చినావు. స్వాములవారికిమాత్రం యిస్తావా? నీవు జయిలులోనుంచి వచ్చినతరువాత మనిషివి బాగావున్నావుసుమా.

రామ—మనుగుడుపు పెండ్లికొడుకువలె వున్నాను. ఇఖనీవు పిల్లనియ్యడమే అవశిష్టము. జయిలులో పడితేపడ్డానుకాని దొంతా బత్తులవారియింట్లో కన్నంవేసినబాపతు వక్కదమ్మిడీఅయినా యెవరికీ దక్కనియ్యలేదుసుమా. పోలీసువారు యెన్నివిధాల బాధపెట్టికొట్టినా దానిస్థలంచెప్పక సొమ్మంతా నేనే దక్కించుకొన్నాను.

కామా—నీవు యింటిమూపాయ యిచ్చినావుకావని యీమధ్య

స్వాములవారయేమో నిన్ను వెలివేస్తానని చెప్పుకొన్నారు. అది యేమయింది ?

రామా—వెలీ లేదు గిలీ లేదు. వెలివెయ్యడానికి నాగరాజుగారికిమల్లే నేను బ్రాహ్మణీకానికి హానివచ్చేకార్యం యేమీ చెయ్యలేదు. నన్ను డబ్బు గట్టిగా అడిగితే నేను యేసందులోనో పెట్టి చావగొడతానని తెలిసి స్వాములవారు నన్ను డబ్బు అడగడం మానివేసి నన్ను పిలిచి మంచిమాటలుచెప్పి భిక్షలయినప్పుడల్లా పిండివంటలతో తమపంక్తినే నాకుకూడా భోజనం పెట్టించిరాను. నీ వెలిమాట యేమయినది?

కామా—నీకు లేనప్పుడు నాకుమాత్రం వెలియేమిటి ? యీ వూళ్ళో ఎవర్నీలేని లౌక్యపుముండాకొడుకుల కుట్రచేత కన్యావిక్రయం చేసినందులకు వెలి వేస్తానని బెదిరించినాడుగాని నేను భిక్షచేసి యిరవైరూపాయలు పాదపూజ సమర్పించడంతోటే అస్మిపోయినవి. పూర్వాశ్రమంలో అయిదేసివందలరూపాయలు పుచ్చుకొని యిద్దరు కూతుళ్ళను అమ్మకున్న ముండాకొడుకు స్వాములవారికిమాత్రం కష్టసుఖాలు తెలియవా ? నేను అయిదారుగురు పిల్లలను అమ్మకుని కాస్తసొమ్ము చేసుకున్నానని ఎవర్నీలేని గాడిదకొడుకులకు కన్నెరగ్గా వున్నది. నేను కష్టపడి కనుక్కున్న నాపిల్లలను అమ్మకున్నాను వూళ్ళోవాళ్ళపిల్లలను అమ్మకోలేదుగదా ?

రామ—నిన్ను వెలివేస్తానన్నదియెందుకు ? పిల్లలను అమ్మినందుకా ? నీమూడోచిన్నదాన్ని రజస్వలఅయిందాకా పెళ్ళిచెయ్యకుండా వుంచినందుకా ?

కామా — పిల్లది రజస్వల అయిందో లేదో యెవరుచూచినారు ? నేను మూడుపుట్లు యింట్లోకలుపుకుని పిల్లది రజస్వల కానే

లేదన్నాను. డానితో సరిపోయింది. ఇదివరకు తెలియక పిల్లదాన్ని చాలాకాలం వుంచితే డబ్బు యెక్కువవస్తుందని దాన్ని పథ్నాలుగో యేడు వచ్చినదాకా వుంచినానుగాని యిఖనెవ్వరినీ అలావుంచను. సమర్థాడినపిల్లను పెళ్ళిచెయ్యకుండా యింట్లోవుంచుకున్నానని స్వాముల వారికి వ్రాస్తామని అడ్డమయిన గాడిదకొడుకులూ బెదరించడం మొదలు పెడితే వాళ్ళపోరు పడలేక మునుపు వకరు యిస్తామన్న సొమ్మ్రికన్న వందరూపాయలు తక్కువకే పిల్లను వకముసలిముండా కొడుకుకు కట్టిపెట్టినాను. ఆవకదానితోనూ నాకు బుద్ధివచ్చి యిప్పుడు యెనిమిదేళ్ళ దాటకమునుపే వచ్చినంతడబ్బు రాబట్టుకొని తక్కిన వాళ్ళకు పెళ్ళిళ్ళు చేస్తూవున్నాను.

రామ — ఈకబుర్లకేమిగాని సోమిని నాకివ్వడంమాట యేమి చేసినావు? దానికి నాలుగేళ్ళు వెళ్ళవస్తూవున్నవి కాబోలును.

కామా — దాన్ని నీకుయివ్వడానికి వల్లపడదు. ఇదివరకే దాన్ని యీవూళ్ళో పూటకూళ్లమ్మపెట్టే రెండుచింతల వెంకయ్యగాడికి యివ్వడానికి నిశ్చయించి ఆరువందలరూపాయలు పుచ్చుకున్నాను.

రామ—అయితేయేమి? ఆ ఆరువందల రూపాయలూ నావద్ద పుచ్చుకొని పిల్లదాన్ని నాకే ఇయ్యి? నీకు యీసొమ్మా ఆసొమ్మా కూడా దక్కుతుంది. అంతగావస్తే వాడు సొమ్మ్రియివ్వలేదను. పెళ్ళి కార్యంలో అబద్ధంఆడితే దోషంలేదు. యేభైయేళ్ళ గుడ్డివెధవకు వాడి కేమిటి పెళ్ళియేమిటి? కావలిస్తే నన్ను సాక్ష్యంవేసుకో వాడు సొమ్మ్రి ఇవ్వలేదని కోర్టులలో అపిమాణాలుచేసి వెయ్యితప్పుసాక్ష్యాలు పలుకుతాను. యీవిషయంలో నాకువున్న పాండిత్యం నీకులేదు.

కామా—యీసారి అలా చెయ్యడానికి వల్లకాదు. వాడితో నాకు వేరేపని వున్నది. మొన్న పనికిమాలిన మగగాడిద కొడుకు

పుట్టినాడు కాని అదికూడా ఆడ దయినట్టయితే యీ ఆగువందల రూపాయలూ పుచ్చుకొని దాన్ని నీకు యిస్తాను. నిష్కారణంగా ఆగువందలరూపాయలుసిద్ధాన్నం పడిపోయింది. ఘనము దెప్పుడైనా మగపిల్లవాణ్ణి కన్నట్టయితే డొక్క బద్దలచేస్తానని మా యింటి దానితో గట్టిగా చెప్పినాను. ఆభయంచేత యిఖ యెప్పుడూ మగ పిల్లవాణ్ణి కనదన్నధైర్యం నాకు వున్నది.

రామ—నాపని వట్టిదే చేసినావా !

కామ—యేమయినా వుపాయం ఆలోచిస్తాను వుండు. పూర్వం శిఖండిని ఆడదాన్ని మొగవాణ్ణి చేసినట్టుగా యీ మగవాణ్ణి ఆడదాన్ని చేసేవారు యీకాలంలో యెవరైనావున్నారేమో చూడు. నాలుగువందలరూపాయలు నాచేతిలో పోస్తినా నీ వన్నదానిలో రెండువందలు తగ్గించి యీమట్టుగా కిష్టాయతుగా వీణ్ణి నీ కిచ్చి వేస్తాను. ఇది సరేనా ?

రామ—నే నాలోచిక లన్నీ పడలేను. మళ్ళీ ఆడపిల్ల పుట్టే యోగం యేమైనా వుంటే చెప్పు. మీపిల్లవాడికి రెండేళ్ళు వెళతవి కామా ?

కామ—నాపెళ్ళాముముండ రెండేళ్ళకు వక్కమాటుగాని పిల్లను కనకుండా వున్నది. యాటాయాటా పిల్లలనుకనే పిల్లలను యిద్దరు ముగ్గురిని తెచ్చి నాకు వివాహం చేస్తూ. మొట్టమొదట పుట్టేపిల్లను యేమీ పుచ్చుకోకుండా నీ కిచ్చి పెళ్ళిచేస్తాను. ఇదే ఖరారు. అలా చెయ్యి.

రామ—యీమాటల కేమిగాని నీపెళ్ళానికి యిప్పుడు నెల తప్పిందేమో చెప్పు.

కామా—రెండునెలలు వెళ్ళి మూడోనెల చొరబడ్డదని చెప్పు

కుంచూ వున్నారు. ఆకడుపులో వున్నపిల్లకు యేమి యిస్తావో చెప్పు యిప్పుడే బేరము ఫరిష్కరించుకుందాము. ఆరువందలరూపాయలు యిస్తానని నీవు యిప్పు డన్నమాట తిరిగిపోకూడదసుమా.

రామ — ఆరువందలరూపాయలు నేను పెద్దపిల్లకు యిస్తా ననాన్నుకాని కడుపులోవున్నదానికి యిస్తా ననలేదు. దీనికయితే మూడువందలరూపాయలకంటె యెక్కువ యివ్వను.

కామా—సాహసం యెవరికయినా వుండవలెను. ఆలాగే వప్పు కుంటాను. మూడువందలరూపాయలూ తెచ్చి యీసాయంత్రంలోగా నాచేతిలో పొయ్యి. బజారులో వుప్పూ చింతపండూవలె దీనికి అరువు బేరము లేదు. రొక్కము గుమ్మరించవలెను.

రామ—తరువాత మగవాడు పుడితేనో ?

కామా — మూడువందలరూపాయలు తక్కువ చేసినప్పుడు ఆలాభనష్టా లన్నీ నీవే. మగపిల్లవాడుపుట్టినా, కడుపుదిగపడిపోయినా పుట్టినబిడ్డ చచ్చినా, నాకు యిచ్చినదానిలోనుంచి నీకు చిల్లిగవ్వ ముజరా రాదు.

రామ—అలాగయితే యింకొక వందరూపాయలు తగ్గించు.

కామా—ఇందులో బేరము లేదని మొదట చెప్పినాను. మళ్ళీ మాట్లాడితే వందరూపాయలు పెంచుతాను కాని తగ్గించను. బజారులో అమ్మేమాంసానికి సే రింతస నిర్ణయమయినఖరీదు వున్నదికాని దీని కటువంటివెల నిర్ణయము లేదు. అవసరమునుబట్టి వెల హెచ్చునుతుంది. అడుగో నాగరాజు యిలాగువస్తూవున్నాడు, అతడు యీమాటలు వినకూడదసు. అతడు బాల్యవివాహాలు కన్యాశుల్కాలు కూడ వని పాదిస్తూ వుంటాడు. అందుచేత అతనికి తగినపాఠంయిచ్చి త్తం చేయించ వలెనని మనవాళ్ళందరూ ఆలోచించి స్వాములవారితో చెప్పితే ఆయన

నాగరాజుగారికి తనకూతురిని పన్నెండేళ్ళు వచ్చినదాకా వివాహం చెయ్యకుండా అట్టేవుంచినందుకు ఆంక్షపత్రిక పంపిస్తానని చెప్పినారు. ఆచిన్నది యింకా రజస్వల కాలేదుగాని మనవాళ్ళంతా రజస్వల అయిం దని అల్లరి చేస్తూవున్నారు.

[నాగరాజు గారు ప్రవేశించుచున్నారు.]

నాగ—ఏమి కామావధానులు ! ఏమోఆలోచిస్తూ వున్నావు. యింకాకూతుళ్ళను అమ్మకోవడానికా యేమి ?

కామ—అమ్మకుంటే యేమి ? నేను కష్టపడి కనుక్కున్న కుమార్తెలను నామనసు వచ్చినట్లు చేసుకుంటాను.

నాగ—అలాగే చేస్తూవున్నావు. అయిదువందలరూపాయలకు అమ్మకున్న నీపెద్దకూతురు ముండామోసి మూలకూర్చుంది. రెండో కూతురి మొగుడు దానికి ముత్తాతలాగు వుండడంచేత అందరూ ఆలా గంటూ రని సిగ్గుపడి ఆముండాకొడుకును మూల కూర్చోపెట్టి స్వేచ్ఛగా తిరుగుతూవున్నది. మూడోకూతురికి తినడానికి అన్నము లేక " అష్టదరిద్రమయ్యగారియిల్లూ, అంతకంటెనూ దరిద్రమత్తగారిల్లూ " అన్నట్టయినది. " అమ్మగారు గృహప్రవేశము, అయ్యగారు స్మశాన ప్రవేశమూ " అన్నట్టు నాలుగోకూతురు కాపురానికి వెళ్ళగానే మొగుడు స్వర్గానికి వెళ్ళినాడు. అయిదోకూతురు జ్వరంవచ్చి చావడం చేత వెళ్ళామూ డబ్బూబ్బకూడా పోయిం దని ముసలిముండాకొడుకు మంచంపట్టి యేడుస్తూవున్నాడు. ఆరోకూతురికి మసూచికంలో కళ్ళు పోవడంచేత వుపచారం చెయ్యలే నని మొగుడుముండాకొడుకు కాశీలేచి పోయినాడు. రేపు యేడోకూతురిని అమ్మకోవడానికి సిద్ధంగా వున్నావు. యీ కసాయివ్యాపారం యింకా యెంతకాలము చేస్తావు ?

కామ—ఇది కసాయివ్యాపారమా ? పిల్లను పెళ్ళిచెయ్యకుండా

అట్టేవుంచి నీకుమల్లే నేను బ్రాహ్మణ్యాహాని వచ్చేపని యేమీ చెయ్యడం లేదు. "వర్ణానాం బ్రాహ్మణో గురు" వన్నన్యాయం నేను నిలుపుతూ వున్నాను.

నాగ — నీదానికంటె కసాయివ్యాపారమే వంచిది. కసాయి వాడు మేకమాంస మమ్ముతాడు. నీవు నరమాంస మమ్ముతూ వున్నావు. వాడు జంతువుచచ్చినతరువాత మాంసముతీసి అమ్ముతాడు; నీవు మనిషి బ్రతికివుండగానే మాంస మమ్ముతూ వున్నావు. వాడు యెక్కడనో పుట్టినపశుమాంసము విక్రయిస్తాడు; నీవు కడుపునపుట్టిన శిశుమాంసము విక్రయిస్తూ వున్నావు. నీవ్యాపారముకంటె వాడిదే మంచిది. గుండు భీమిసెట్టి దివాలాతీసి నీ వన్యాయంగా సంపాదించిన సొమ్మంతా హరించి మంచిపని చేసినాడు? నీవు తినడానికి అన్నం లేక పాపం పండి పురుగులు పడి మరీ చస్తావు.

కామా — నీవు బ్రాహ్మణభూషణ చేస్తూ వున్నావు. నేను యిప్పుడు స్వాములవారివద్దకు వెళ్ళి నీకు ఆంక్షపత్రిక తీసికొనిరాకపోతే నేను బ్రాహ్మణ్ణి కాను. రారా రామశాస్త్రీ! వెళ్దుదాము.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

వినాయకచతుర్థి.

రంగము—కొత్తపేటయిల్లు.

[దంభవ్రితుఁడు విఘ్నేశ్వరపూజ కారంభించుచుండఁగా, బిడాలవ్రితుఁడును బకవ్రితుఁడును పరివేశించుచున్నారు.]

బిడా—ఓరీ దంభవ్రితా ! రాత్రి ఝామునుప్పొద్దునా పోండే అప్పుడే పూజ కారంభించినా వేమిరా ? నీలాపనింద రాకుండా వుండ డానికి అక్షింతలు వేసుకున్నావా ?

దంభ — నీవు అక్షింతలు తెస్తానని యెంతసేపటికీ రాకపోతే యిప్పుడే పూజకు కూర్చున్నాను.

బిడా—నీకోసమే అక్షింతలు వేగిరం తెచ్చినాను. అక్షింతలు వేసుకోకుండా నీకు యింతలోనే పూజకు యేమితొందర వచ్చింది ? నీకు వినాయకుడిమీద మహాభక్తి గోడిసిందా యేమిటి ?

దంభ—ఈపూజ వుండార్థిళ్ళమీద భక్తిచేతగాని వినాయకుడి మీద భక్తిచేతగాదు. మధ్యాహ్నం నాకోసం దాచినవుండార్థిళ్ళ పెట్టునుంటే మూఅవ్వ విఘ్నేశ్వరపూజ చేసుకుని నైవేద్యం పెడితేనే కాని పెట్ట నన్నది. అందుచేత పూజ అయితే వేగిరం తిననచ్చు నని, అయగో వుండార్థిళ్ళ పళ్ళెంలో ముందుగా వినాయకుడిముందు పెట్టించి మరీ పూజకు కూర్చున్నాను.

బక—అదుగోనీభక్తికిమెచ్చి వినాయకుడివాహనం వినాయకుడి కంటె ముందుగా ప్రత్యక్ష మయింది. గోడమూల చూడు. మూషక వాహనదర్శన మవుతూ వున్నది.

[ఆప్పుడు మూషకస్వామి ప్రవేశించుచున్నాడు.]

దంభ—(చూచి చేయి విసరికొట్టుచు) పోపో !—నీవు చూచి చెప్పబట్టిగాని లేకపోతే యీపాడుయెలుక యిపాటి నానోట గడ్డకొట్టి యీడ్చుకొనిపోయి వకకుడుం తనపొట్టను పెట్టుకునేదే ?

బక—యెలక అనకు ! విఘ్నేశ్వరుడి వాహనం అను. నీవు రోజూలాగు యివేళ యెలకా గిలకా అన్నావంటే పాపం వస్తుంది సుమా. నీలాపనిందానివారణంలో " మోదకాదు లొసంగ ముదితుఁ డగుచుఁ దా గొన్నిభక్షించి తన వాహనమునకుఁ గొన్నిభక్ష్యములిడి " అని విఘ్నేశ్వరుడుకూడా తన వాహనానికి వుండ్రాళ్ళు పెట్టినట్టు వుండడం చేత యీరోజు మనం అవశ్యంగా మూషకవాహనానికి కుడుములు పెట్టవలెను. మనఆడవాళ్ళుకూడా మూషకవాహనం నిమిత్తం యింటి మీద వుండ్రాళ్ళు గిరవాటు వెయ్యడం నీవు చూడడం లేదా?

దంభ — పాడుపొస్తకంలే. అందుగో నైనా వుండ్రాళ్లు విఘ్నేశ్వరుడు పెట్టినట్టు వున్నదికాని యింటివాళ్ళు పెట్టినట్టుగా లేదు. అనేకకారణాలచేత నేను దీనికి కుడుములో కాస్తముక్కయినా పెట్టను. అందులో మొదటికారణం యీవున్న మూడువుండ్రాళ్ళూ నాకే కావలెను. రెండోకారణం విఘ్నేశ్వరుడు రాకుండా అతణ్ణి దోవలో నెక్కడనో పడవేసి తాను వొంటిగా రావడం. మూడోకారణం నేను పెట్టినదాకా వుండకుండా తనంతట తానే దొంగతనంగా యెత్తుకు పోవడానికి ప్రయత్నం చెయ్యడం. కావలిస్తే మధ్యాహ్నం నైవేద్యం పెట్టినవాటిలో రెండుముక్కలు తనవాహనానికి విఘ్నేశ్వరుడే పెట్టుకుంటాడుగాని నేను పెట్టను.

బక—నీవు రీజన్లు మహాచెప్తూవున్నావు. ఆ కన్నంవంక చూస్తూవున్నావా ?

దంభ—ఓసీ దీనిసిగతొయ్యా ! ఆ ర్యాట్ మళ్ళీవస్తూందిరా. ఓరీ బిడాలవ్రితా ! నీవు సంస్కృతక్లాసులో చదువుకుంటూవున్నావు గదా? నీవు విష్ణ్వీశ్వరపూజ బ్రీపుగా చేయుస్తూ. లేకపోతే ర్యాట్ వచ్చి వుండ్రింముక్క తనమాత్తుకో వేసుకుపోతుంది. కర్రితేరా ర్యాట్టును కొడదాము.

బిడా—నాన్నెన్ను ! మడికట్టుకుని ర్యాటూ, క్లాసూ, బ్రీపూ, మాత్తూ, అని యింగ్లీషుమూట లనవచ్చునా?

దంభ—యిందాకా బకవ్రితుడు యెలుకంటే కోపపడ్డాడు. గనుక ర్యాటన్నాను. తెపుగుమూటఅంటే మాఅవ్వ అర్థం తెలిసి కోపపడుతుందేమో అని బ్రీపుగా అన్నాను. శుమించి వేగిరం చేయి స్తూ నీకు దక్షిణ యిస్తాను.

బక—మినిట్టులో చేయిస్తాను. దక్షిణ టూకాపర్సు. టూకా పర్సూ యిచ్చినావంటే యీరాత్రికి చుట్టలకు వేగే వెతుకోకనక్కర లేదు. పూజ చేయిస్తాను పట్టు—

శ్లో॥ శుక్లాంబరధరం విష్ణు శశివర్ణం చతుర్భుజా
ప్రసన్నవదనం ధ్యాయే త్సర్వవిఘ్నోపశాంతయే.

పూజచెయ్య—లంబోదరాయనమః ఉదరంపూజయామి. స్థూలకంఠా యనమః కంఠంపూజయామి. శూర్పకర్ణాయనమః కర్ణౌపూజయామి. గజాననాయ దూర్వాయుగ్మం సమర్పయామి. లంబోదరాయ బదరీ పత్రం సమర్పయామి. ఏకదంతాయ చూతపత్రం సమర్పయామి.

దంభ—అర్థంతెలియకుండా పూజచేస్తే యేమిప్రయోజనంరా ?

బక—నీకు తెలియకపోతే అర్థంకూడా చెపుతాను విను—

పెద్దబొజ్జవాడికి నమస్కారము పొట్టపూజ చేస్తూన్నాను. బొనకడుపు వానికి రేగాకులు సమర్పిస్తున్నాను. ఒంటిపంటివానికి మామిడాకులు సమర్పిస్తూ—

(తెరలో—ఆగు, ఆగు, నీకు బుద్ధివచ్చేటట్లు చేస్తాను.)

బిడా—అదుగోనురోయి విఘ్నేశ్వరుడే వస్తూవున్నాడు.

[విఘ్నేశ్వరుడు ప్రవేశించుచున్నాడు].

విఘ్నే—నాదిబ్రాహ్మకడుపయితే మీ కేమి ? వంటిపన్నయితే మీ కేమి ? సూత్రాల్లో చదువుకోవడం చేత వాళ్ళుపొగరెక్కి- యిలా ఆడ్డేపిస్తారురా ?

దంభ—స్వామీ ! మీకు పూజచేస్తూవున్నాము.

విఘ్నే—భక్తివుంటే నన్ను పొగడవలెనుగాని నాపొట్టకూ వంటికీ పూజయేమిరామీకు ? పనికిరాని గడ్డిపరకలూ, రేగాకులూ, మామిడాకులూ యిస్తాననడం పూజటరా ? యిదివరదాకా నేను ప్రత్యక్షం కాకపోవడంచేత మీరు నేను లేనప్పుడు చాటున యేమి కూసినా సరిపోయింది గాని మొగంయెదుటకూడా యిలా దూషణ చేస్తూవుంటే నేను సహించి వూరకుంటా ననుకున్నారురా ?

దంభ— (తనలో) వున్న మాటంటే పులుకు వేసుకు వస్తుంది. (బిగ్గరగా) స్వామీ ! క్షమించవలెను. ఇకముందు మీరు యెలాగు పూజచెయ్యమంటే ఆలాగు చేస్తాము.

విఘ్నే—భక్తితో అర్ఘ్యపాద్యాదు లిచ్చి పూజచెయ్యవలెను. ఏదీ ? నీభక్తి చూతాము. కైలాసాన్నుంచి నడిచివచ్చి అలసి యున్నాము. ఆవుండ్రాళ్ళు ముందుగా ఆరగించి తరువాత సావకాశంగా నీకు పూజావిధానం వుపదేశం చేస్తాము. ఆవుండ్రాళ్ళు నాముందు పెట్టి దణ్ణంపెట్టి దూరంగా నిలుచుండి భక్తికనపర్చు.

దంభ—ఇందులో వొక్కవుండ్రాయి ప్రాణంపోతేయివ్వను. మాదేశంలో వున్న ఆచారమంతా కుడుములు దేవుడికి నైవేద్యము పెట్టి మేము తినడమేకాని దేవుడు యెక్కడా తినడంలేదు. మాకు

లేకుండా దేవుళ్ళేతినడం ఆరంభిస్తే వొక్క-దేవుణ్ణి యెవరైనా యింటికి రానిస్తారా ?

విష్ణు--నాకు నైవేద్యం పెట్టినవి నాకు రావలెను. మీరు మంచిమాటలతో యివ్వకపోతే నేను బలవంతముగా పుచ్చుకుంటాను. దివ్యజ్ఞానుల ఉపదేశంవల్ల మీకు నిజమయినభక్తి కుదిరిందంటే వచ్చినానుగాని లేకపోతే నేను యీభూలోకానికి రాకనేపోదును. వొకరు లేదంటే వొకరినిచూచివకరు అందరూ లేదంటారు. కాబట్టి యిక్కడ నేను వుండాళ్ళేతినకుండా వెళ్ళను.

దంభ--జాగ్రత్త ! యిందులో వొక్క-వుండాయి ముట్టుకున్నా వంటే దేవుడవూ గీవుడవూ అని చూడక యీకర్రతో కాలు విరగేస్తాను. బకవ్రితా ! బిడాలవ్రితా ! మీరుకూడా సహాయం రండి. యెలా పుచ్చుకుంటాడో చూతాము.

విష్ణు--మీరందరూ చేరి యింటికి పిలిచి దౌర్జన్యం చేసేట్టు వున్నది. మాఅన్నగారికూడా పిల్చుకునివస్తాను. మేము యిద్దరమూ చేరి మిమ్మలిని యేమిచేస్తామో చూడండి.

(అని నిష్క్రమించు చున్నాడు.)

దంభ -- వీడి కెవరో అన్నగారుకూడా వున్నాడటోయి. యెందరు వచ్చి నాలుక పెరుక్కున్నా మనం వక్క-వుండయినుక్క యివ్వకూడదు మనం ముగ్గురమూ యిప్పుడు యేకమై దెబ్బలాడ వలెను.

బీడా--మీ యింటికి వచ్చినవాడు మాయింటికి రాకమానడు. మాటలధోరణిబట్టి చూస్తే. అందరియిళ్ళకూ వెళ్ళేటట్టే వున్నది. మాయింటికాడ నీవు వచ్చి సహాయం చేసేమాట వుంటే ఇప్పుడు మీ యింటికాడ మేమూ సహాయం చేస్తాము. అన్నగా రెవరురా ?

బక---కుమారస్వామి కాబోలును ! దంభవ్రితా ! బిడాలవ్రితు డడిగినదానికి ప్రుత్తరం చెప్పవేమి ?

దంభ---తప్పకుండావచ్చి సహాయంచేస్తాను. మనం ముగ్గురమూ మూడుయిళ్ళకాడా త్రిమూర్తులలాగు పోరాడవలెను ఆసూబలకర్రిలు చెరివకటీ ప్రుచ్చుకొని సిద్ధంగా వుండండి.

బిడా---అడుగో నెమలి నెక్కి యెవడో వస్తూ వున్నాడు.

దంభ---వాడే అన్నగారు. నేను యీవుండార్రిళ్ళను రక్షిస్తూ వుంటాను. మీరు వీరభటులవలె ఆవచ్చేయిద్దరితోనూ ద్వంద్వయుద్ధం చెయ్యండి.

[కుమారస్వామితో మరల విష్ణ్వీశ్వరుడు ప్రవేశించుచున్నాడు.]

కుమా---ఆవుండార్రిళ్ళు మాకు యిచ్చి మీరు దూరంగాపొండి.

బిడా---మీరు దగ్గరకు వచ్చినారంటే కర్రిలు మీవీపుమీద విరుగుతవి జాగ్రిత్త !

కుమా---అన్నా! నీచేతులో వక కర్రివున్నా మనం నిరాయుధుల మై వచ్చినాము. దేవతలం మనం మనుష్యులతో యుద్ధంచేసి ఓడిపోతే అనమానం. దూరప్రియాణం చేసి అలసివున్న మనం యీక్షుద్రాబ్ధతో యుద్ధం చెయ్యలేము. యీ కపటవేషగాళ్ళను విడిచిపెట్టి నిజమయిన భక్తులవద్దకు వెళ్ళి కడుపునిండా కుడుములు తిని యిక్కడకు సమీపంగా వున్న పాతాళలోకానికిపోయి నాగులను వీళ్ళమీదికి ప్రేరేపింతామురా.

విష్ణు---మనం వట్టికడుపుతో కాలినడకను పోలేము. వాహనాలమీద వెళితే నాయెలుకను నాగులు భక్షించడానికి చూస్తవి. నీనెమలిసమీపిస్తే డాక్కుంటవి. వాటిని మనం కలుసుకోవడం యెలాగు ?

కుమా---నేను వుపాయం చెపుతాను రా. ఈప్పుడు నారదుడు

భూలోకానికి వచ్చినాడు. అతనితో మాట్లాడి శేషు లాలకించేటట్లుగా పాటపాడించి నాగకుమారులను ఆకర్షింతాము.

(అని యిద్దఱును నిష్క్రమించుచున్నారు.)

దంభ—వీళ్ళపీడ వదలిపోయింది. ఇఁక నేను వుండ్రింముక్కలు తినవచ్చునా ?

బక—నీతికల్పం చెప్పనిదీ తినరాదు. ఒక్కనిముషంవుండు. కల్పం మహాముక్తసరుగా చెపుతాను.—"శ్లో. ఆసీత్పురా చంద్ర వంశే రాజా ధర్మ ఇతి శ్రుతః। స్వరాజ్యే దైవయోగేన జ్ఞాతిభిః కుటిలైర్హృతే॥" పూర్వకాలమునందు ధర్మరాజులవారు తన రాజ్యమును కుటిలులైన జ్ఞాతులు హరించగా సూతాశ్రమంలో వున్న మునులవద్దకు పోయి—

దంభ—ఏనీతం చేస్తే రాజ్యం మళ్ళీ వస్తుం దని అడిగినాడు. త్వరగా వేగిరం కానీ.

బక—శ్లో. నీతం సంపత్కరంనృణాం సర్వసౌఖ్యప్రివర్ధనం। శ్రుణుధ్వం పాండవా స్సర్వే నీతానా ముత్తమంనీతం. ఆసూతుల వారు పాండవుల నందరినీ వినుమని సంపత్కరమయినటువంటిన్ని సౌఖ్యవృద్ధిప్రదమయినటువంటిన్ని నీతా లన్నింటికీనూ వుత్తమమయినటువంటిన్ని—

దంభ—వూరికే చాదస్తం చెయ్యకు. ఆనీతం చెయ్యమన్నాడు. అది చేసి ధర్మరాజు జయం పొందినాడు. అంతేనా, మరియేమైనా వున్నదా ? సంస్కృతక్లాసులో చదువుకుంటూవుండడంచేత నీకు చాదస్తం అంతకంతకు బలిసిపోతూ వున్నది. మనం వూరికే నీతకల్పంతో కూర్చుంటే ఈమధ్య ఈవుండ్రింముక్కలు రెండూ యెలక యిండ్లుకొనిపోతుంది.

బక—అయిపోయింది. తొందరపడబోకు. ఫలశ్రుతిమాత్రం చెప్పి ముగిస్తాను—శ్లో. ఏతద్వ్రతంహరిశ్చాపి దమయంతీ పురాకరోత్। కృష్ణోజాంబవతీమాదా చ్ఛమంతకమణింతథా । దమయంతీ నలంచైవ వ్రతస్యాస్యప్రభావతః॥ శక్రేణపూజితః పూర్వం వృత్రాసురవధే తథా। రామదేవేన తద్వచ్చ సీతాయా మార్గణేపురా । భగీరథేనతద్వచ్చ గంగా మానయతా పురా॥ ఈవ్రతం పూర్వం కృష్ణమూర్తివారు చేసి జాంబవతిని శమంతకమణినీకూడా పొందినారు. దమయంతి చేసి నలమహారాజును పొందినది. వృత్రాసురుణ్ని చంపడానికి ముందు దేవేంద్రుడును, సీతాదేవిని వెతకడానికి ముందు శ్రీరాములవారున్ను గంగను భూలోకానికి తేవడానికి ముందు భగీరథుడున్ను—

దంభ—అందరూచేసినారు. చాలులేస్తూ.

బక—అలాగయితే వేగిరం తిను. మనంవెళ్ళి యిళ్ళమీద రాళ్లు వెయ్యవలెను. గుమ్మాలకాడ పల్లేరుకాయలూ, ఇళ్ళమీద రాళ్లూవేసి ఈవాళ తిట్లుతింటే యెంతోపుణ్యం.

దంభ—ఓరే? ఇందాకా అడగడం మరిచిపోయినాను. విష్ణు శ్వారుడికి యేనుగుతలకాయ యెలావచ్చిందీ ?

బక—ఒక్కవిధంగా వచ్చిందనుకున్నావా యేమిటి ? అనేక పురాణాలనుబట్టి అనేకవిధాలుగా వచ్చింది. ఒక్కపురాణాన్ని బట్టి పార్వతిదేవి అసలు నలుగుపిండితో చేసేటప్పుడే యేనుగుతలకాయ చేసింది. ఇంకోపురాణాన్నిబట్టి దక్షాధ్వరధ్వంసంలో వీరభద్రుడు తల సరికితే యేనుగుతలకాయ అతికించినారు. మరోపురాణాన్నిబట్టి శివుడే తలనరికి తానుతెచ్చిన గజాసురుడితల అతికించినాడు. వేరే పురాణాన్నిబట్టి—

దంభ—ఇన్నివిధాలగా చెపుతూవుంటే ముందుగా యేదినిజం ?

బక—దేని కదే నిజం. ఏది చదువుతూవుంటే దాన్నే నమ్మ వలెను. జ్యోతిషం దాఖలాచూడడానికి పార్వతీదేవి దిసమొలతో స్నానం చేస్తూవున్నప్పుడు లోపలికి వెళ్ళనియ్యకుండా వుండడంచేత శివుడు తలనరికినాడనీ, పార్వతీదేవి జ్యోతిషానికి శాపంపెట్టినదనీ జ్యోతిష్కులు చెపుతారు ; గజాసురుణ్ని చంపివచ్చినప్పుడు లోపలికి వెళ్ళనియ్యకపోతే తలనరికి పడుకోగూడదని పుత్తరతలాపిగా పరున్న యేనుగుతల నరికితెచ్చి అతికించినారని శాకునికులు చెపుతారు.

దంభ—ఇన్ని సరేకాని చందుడికి శాపం యెలావచ్చింది ?

బక—వకపురాణాన్ని బట్టి హాస్యరూపుడయిన తన్నుచూచి నవ్వితే విఘ్నేశ్వరుడే శాపంపెట్టినాడు. మరివకపురాణాన్నిబట్టి వినాయకుడు పొట్టనిండా కుడుములుతిని వెళుతూవుంటే చూచి నవ్వడం చేత రాజదృష్టితగిలి పొట్టబద్దలై తే పార్వతీదేవి శాపం పెట్టింది. ఇంకొకపురాణాన్నిబట్టి విఘ్నేశ్వరుడు కడుపునిండాతిని నచ్చి పార్వతీపరమేశ్వరులకు సాష్టాంగనమస్కారం చెయ్యబోతే బానపొట్ట భూమిమీద మోసి కాళ్ళూచేతులూ నేలకందకపోవడంచేత శివుని శిరస్సు లోవున్న చందుడునవ్వితే శాపం వచ్చింది.

దంభ—ఒకదానికి ఒకటి సందర్భంచకుండా వుంటే ఇటువంటిసంగతులన్నీ నీవు నమ్మశావటా ?

బక—నమ్మేదేమిటి ? నమ్మినట్లు నటించవలెను. లోపల నమ్మకపోయినా పయికినమ్మినట్లు నటించి నమ్మమనేవాళ్ళను తిడుతూ లోకాచారప్రకారం నడుస్తూవుంటే జనులందరూ మనని దేశాభిమానంగలవాళ్ళమని పొగడి గౌరవంచేస్తారు. విఘ్నేశ్వరుడు హాస్యరసాధిపతిగనుక ఇదంతా హాస్యంలాగు తమాషాగా వుంటుంది.

బిడా — అలాగయితే మనమందరమూ ప్రతీయేటా విఘ్నే

శ్వరపూజచేసి బోగంమేళాలతో వుత్సవాలు చేస్తూ దేశాభిమానుల మని పేరుపొందుదాము. హాస్యరసాధిపతిని కొలవడంచేత వివేకుల దృష్టిలో హాస్యపాత్రులం కాముగదా ! ఎంతే ! నేను విఘ్నేశ్వరపూజ చేసినా నిరుడు నాపరీక్ష తప్పిపోయిందేమిరా ?

దంభ—నీది ఒక్కడిదే పోయిందా యేమిటి ? నీక్లాసులో పరీక్షలో తప్పిపోయినవా ళ్ళందరూమాత్రము విఘ్నేశ్వరపూజ చెయ్యా లేదా యేమిటి ? బాగా చదివితే సరి యీసారి ప్యాసవుతావు.

బిడా—పండుగసెలవులలో నల్లా యీ వుత్సవాలకోసం తిరగ డంతో సరిపోతూవుండడంచేత నాకు చదువుకోవడానికి తీరుబడి లేకుండా వున్నది. యీసంవత్సరమూ పరీక్ష పోయేటట్టే వున్నది.

బక—యెవరయినా విసిపోతారు వూరుకో. అతని భోజనమ యింది వీధులోకి వెళ్ళవలెను. నీకు నిరాపనింద రాకుండా యీఅక్షిం తలు నెత్తినిూద వేసుకో. భాగవతం దశమస్కంధంలో శ్రీకృష్ణుల వారు జాంబవంతునిదగ్గిరనుంచి శమంతకమణి తీసుకుని సత్రాజిత్తునకు యిచ్చిన కథపట్టు అయినదాకా వుండి మరీ యీఅక్షింతలు తీసు కొని వచ్చినాను. నీవు యిదివరకు చంద్రుణ్ణి చూడలేదుగదా ?

బిడా—లేదు. శ్రీకృష్ణమూర్తికి చంద్రుడు పాలచెంబులోనా కనపడినది ?

దంభ—అవును. నాభోజన మయింది. వెళుదాము రండి.

(అని నిష్క్రమించుచున్నారు.)

అతిబాల్యవివాహము.

——:0:——

ప్రథమాంకము.

౧. ప్రదేశము:—పంతయ్యపంతులుగారిల్లు.

[పంతయ్యపంతులుగారును, సీతయ్య సిద్ధాంతిగారును కూరుచుండి మాటాడుకొనుచుండగా భుజంగరావుగారు ప్రవేశించుచున్నారు.]

పంత—భుజంగరావుగారు! దయచెయ్యండి. (అని కొంచెము లేచి తివాసీ చూపుచున్నాడు.)

భుజం—మీరు దయచెయ్యండి. నేను కూర్చుంటాను. స్నేహితులమూ దగ్గిర బంధువులమూ కూడా అయిన మనలోమనకు వచ్చినప్పుడల్లా యిటువంటి మర్యాద లేమిటండీ? (అని కూర్చున్నాడు.)

పంత —— ఈసిద్ధాంతిగారు బహు ఘట్టివారు సుమండీ. మీకొమార్తె వివాహానికి యీయనచేతనే ముహూర్తం పెట్టించవలెను.

భుజం—నాకొమార్తె వివాహాని కప్పుడే తొందరయేమి? యిక నాలుగేళ్ళ మీదటిమాట. అప్పుడు చూచుకొందాము.

పంత—మీరు ఆలా సెలవిస్తారేమి? మీఅమ్మాయి మాపెద్ద కుఱ్ఱిదానికంటె నాలుగేళ్ళు పెద్దది. మా అమ్మాయికి రేపు మాఘ బహుళంలో పెళ్ళి తలపెట్టినాము.

భుజం—నాలుగేళ్ళు వెళ్ళలేదు. మీరు చిన్నదానికప్పుడే వివాహమేమిటండీ?

పంత—అవును. పెళ్ళిపనులు చెయ్యడానికి వ్యవధానము లేదుగనుక మొదట యీమాఘమాసములో వివాహం చెయ్యతలచుకోనే లేదండి. సిద్ధాంతిగారు పది సంవత్సరము లైతే వైశాఖ మాసములలో ముహూర్తాలు లేవంటూవున్నారు—ఏమండి సిద్ధాంతిగారూ!

కేపు చైత్రిమాసంలోగాని వైశాఖుమాసంలోగాని పెళ్ళిముహూర్తా లున్నవండీ?

సీత—లేవండి. ఈమాఘబహుళ పంచమీ బుధవారమునా డుంచినదే దివ్యముహూర్తమండి.

భుజం—ఏమయ్యా మాయింటి యెసుట వున్న కోమటి కన్న య్యగారిలోపల చైత్రిశుద్ధమందు మీరే వివాహముహూర్తం పెట్టి నారటే; చైత్రివైశాఖాలలో ముహూర్తాలు లేవంటారేమి?

సీత—(కొంచె మాలోచించి) ముహూర్తాల కేమండి? యేవో వొకమో స్తరు ముహూర్తాలు యెప్పుడూ వుంటవండి. చైత్రివైశా ఖాలలోవున్న ముహూర్తాలు తమవంటి గొప్పవారి యిళ్లలో పెట్ట దగ్గవికావు. అవెల్లాకోమటివాళ్ళకూ గొల్లవాళ్లకూ తగివుంటవి. కేపటి మాఘమాసములో పెట్టినది మహోమంచిముహూర్తమండి. ఆలాగంటి ముహూర్తము మరినాలుగేళ్ళదాకా రాదండి. కన్నయ్యసెట్టి పెళ్ళా నికి మాఘమాసంలో ప్రసవదినములు వస్తవంటేను కకూర్తిపట్టంలో చైత్రిమాసముహూర్తం పెట్టినాను.

పంత—మన కటువంటి కకూర్తిపట్టం యెందుకు? మాఘ మాసంలోనే చేతాము. డబ్బుగలవాడికి రేపు పెళ్ళి తల పెట్టుకుంటే యీబస్తీలో సమస్తవస్తువులూ అదునుకు దొరుకుతవి. వక్క అప్పడాలూ వడియాలుమాత్రం పెట్టించుకోవలెను.

భుజం—చైత్రివైశాఖమాసాలలో ముహూర్తాలు వున్నా మీరిచ్చినదాని వివాహం అప్పుడు చెయ్యడంసమేతు నాకు యిష్టం లేదు. అధమపక్షం పిల్లదానికి ఫదిపన్నెండేళ్ళు వచ్చేవఱి కయినా అట్టేవుండవలెనని నా తాత్పర్యం.

పంత—మీయింగ్లీషు చదువుకున్నవారి కందరికీ యేమోకాని

యిటువంటి బుద్ధులే నండీ. స్కూలులో చదువుకునే పదేళ్ళ పిల్లకాయ సమేతూ యిటువంటిమాటలే చెప్పుతాడు. మీరు ముద్దూ ముచ్చట బాగా యెరగరు. చిన్నపిల్లలకు పెళ్ళిచేస్తే వుండేసొగసు పెద్దపిల్లలకు చేస్తేవుండదు. కొంచెము జ్ఞానం వచ్చినతరువాత పెళ్ళికూతురు పిల్ల కీలో సిగ్గుచేత తలకాయ వంచుకుని కూర్చుంటే యేమిసొగసుగా వుం దండీ ? అజ్ఞానదశలో వివాహంచేస్తే యేమీ తెలియక ఖులాసాగా పెళ్ళికొడుకూ పెళ్ళికూతురూ నవ్వుతూ పేలుతూ సిగ్గుయెరుగక ఆకు కుంటూవున్నట్టుంటే చూడడానికి బహుముచ్చటగావుంటుంది. చక్క-గా చిన్నపిల్లలూ పిల్లవాడిసి పెళ్ళిపల్లకీలో పెట్టి వూరేగిస్తే బొమ్మల పెళ్ళిలాగు బహుఅందంగా వుంటుంది.

భుజం—బొమ్మలపెళ్ళినలె వివాహం వట్టివేడుకకార్యం గాదు. దంపతులు —

పంత—ఆహాహా ! పెళ్ళి వేడుక కార్యం కాదంటూవున్నారే. యింకా యేముంది ? మనము చేసేశుభకార్యములలో యింతకంటె వేడుకకార్యం యేమివుంటుందండీ ?

భుజం—ముందుగానేనవ్వక నామాట కడతేరా నిని మరీ నవ్వండి. వేడుకకార్యం కాదంటే కేవలంతమాషాకోసం చేసేదికాదని నాఅభిప్రాయం. పెళ్ళివుద్దేశ్యం వధూవరులు యావజ్జీవం సుఖపడడా నికిగాని బాజాభజంత్రీలుచూచి మనం సంతోషించడానికే కాదు. కాబట్టి కార్యగౌరవముబట్టి సంగతి బాగాఆలోచించవలెను. నే నేమో అమంగళవాక్యాలు పలుకుతూవున్నానని కోపపడవద్దు. నేను మీమాటకాదు; లోకసామాన్యంమాట చెపుతాను. కీడెంచి మేలెంచ మని సామెతవున్నది. గనుక, ముందుగా మనము చెడ్డనే చూచుకో వలెను. సాధారణంగా లోకంలో పిల్లలకు పదిపన్నెండేళ్ళలోగానే

మాటకం విస్తారంగా వుంటుంది. వయసు యెంతచిన్నతనంలో వివాహం చేసినా వధూవరులకు యుక్తవయస్సునచ్చేవరకూ యేలాగూ వాళ్లు సుఖం అనుభవించడానికి వల్లకాదు. కాబట్టి పిల్లదానివివాహం అయిదేళ్ళప్పుడుచేసినా పన్నెండేళ్లప్పుడుచేసినా ఫలానికి వకటే అవుతుంది. మరీచిన్నతనంలో వివాహం చెయ్యడంచేతమాత్రం బహు నష్టాలు వున్నవి. అందులో పెళ్ళికొడుకు కేమైనా యిబ్బంది తటస్థించినయెడల చిన్నది యావజ్జీవమూ దుఃఖపడవలసివచ్చును. పిల్లదాని కేమైనా తటస్థించినయెడల భర్తకు సుఖం కలుగకపోవడమే కాకుండా మొట్టమొదట పెళ్ళి కైనసామ్మంతా వ్యర్థమైపోతుంది. మనము నాలుగేళ్ళుచూచి మరీవివాహంచేస్తే, మొట్టమొదట యిస్తామనుకొన్న వరుడు కాలంచేసినా చిన్నదాని కేమీ యిబ్బంది లేదు; వృథాకర్చుకాదు. ఇస్తామన్నపిల్ల కాలంచేస్తే, పెళ్ళికొమారుడివారికీ ఆలాగే వ్యర్థవ్యయమున్ను లేనిపోని దుఃఖమున్ను కూడా తప్పిపోతవి. మీకు దగ్గిరబంధువుల్నీ స్నేహితుల్నీకూడా గనుక, మీశ్రేయమున్ను పిల్లదానిశ్రేయమున్నుకూడా కోరి హితం చెపుతూవున్నాను. నామాటవిని పిల్లదానికి పదిసంవత్సరములు వచ్చినమీద మరీవివాహం తలపెట్టండి.

పంత—అవును మీరు సెలవిచ్చినమాటలు బొగాసేకనపడుతూవున్నవి. కాని మాఘమాసంలో మాపిల్లవాడికుపనయనం తలపెట్టినాము. వాడికి యేడేళ్ళు వచ్చినవి. వడుగుయీడు దాటిపోయినది గనుక వేగిరం వుపనయనం చెయ్యక తప్పదు. కార్యంలో కార్యం చేసివేస్తే ఖర్చు తక్కువవుతుం దని నాయభిప్రాయము.

భుజం — యేవుపనయనంలో చేసినా డబ్బుఖర్చు తప్పదు. ఉపా కూడివస్తే యాభైరూపాయలు కూడివస్తవి; నూరురూపాయలు కూడివస్తవి. వేడుకకు విలువ లేదు. ఖ్రీత డబ్బు ఖర్చు చేస్తేనేకాని

పెళ్ళి కాదని నియమం లేదు. ఫదిరూపాయలతో చేసినా పెళ్ళే అవుతుంది; ఫదివేలరూపాయలతో చేసినా పెళ్ళే అవుతుంది. పిల్లదానికి పదేళ్ళు వచ్చినప్పుడు మీరంత చేతిలో డబ్బు లేకపోతే స్వల్పంతోనే చెయ్యవచ్చును.

పంత—అదీ కాదండీ. మాతండ్రిగారు పెద్దలయినారు. మనమరాలి పెండ్లికార్యం చూడవలెనని వారు బహు ముచ్చటపడుతూ వున్నారు. వారు—

భుజం—ఆసంగతికూడా ఆలోచింతాము. మీతండ్రిగారు పెద్ద లయినారు. వారు చూడవలెననేకదా మీరు మీపిల్లదానిపెళ్ళికి తొందరపడుతూ వున్నారు? కాటికి కాళ్ళుచాచుకొని మతిమాలివున్న వగ్గుతండ్రియొక్క-వేడుక యెక్కు-వా? మీగర్భవాసాన్న పుట్టి యీ లోకంలో యావజ్జీవమూ సుఖపడవలసిన మూడేళ్ళపసికూనయొక్క-సౌఖ్యంయెక్కు-వా? పిల్లదానిసుఖము విచారించకుండా తన వేడుక కోసం మనుమరాలిని పెళ్ళి చెయ్యమనే యీముసలాయన తాను స్వర్గంలోకూర్చుండి తరువాత దైవికంగా పిల్లదానికి వైధవ్యంతటస్థించి పెద్దవాళ్ళజీవానికి వుసూరుమంటూ యావజ్జీవమూ దుఃఖపడుతూవుంటే తానేమైనా వచ్చి అడ్డపడుతాడా? ఆయనకు బొమ్మలపెళ్ళి ళ్ళంత వేడుకైతే నిజమయినబొమ్మలనే రెంటిని పల్లకీలో పెట్టి బాజాభజంత్రీలతో వూరేగించి ఆయనవేడుక తీర్చు—

పంత—పోనియ్యండి ఈసంగతి మరివకప్పుడు సావకాశంగా మాట్లాడుదాము. లోపల యెందుకో పిలుస్తూ వున్నారు. వెళ్ళవలెను.

(అని లేవఁగా నందఱును లేచి వెళ్ళుచున్నారు.)

మ్యునిసిపల్ నాటకము.

ప్రథమాంకము.

ప్రథమరంగము

౧. ప్రథమరంగము—బుచ్చయ్యపంతులుగారి చావడి.

[కమీషనరులు బుచ్చయ్యపంతులుగారును, గున్నయ్యనాయుడుగారును, సోమిసెట్టిగారును, ఖాదర్‌సాహెబుగారును ప్రవేశించుచున్నారు.]

బుచ్చ — నాయుడుగారూ ! ఇప్పుడు మన మునిసిపాలిటీస్థితి యేమీ బాగావున్నది కాదు. అంతా కొత్తకొత్తవాళ్ళు అప్రయోజకులు కమీషనరుహోదాకు వచ్చినారు. వాళ్ళకు నాలుగుడబ్బులు యేరుకోవడమూ చేతకాదు. యేరుకునేవాళ్ళను చూస్తే ఓర్వనూ లేరు.

గున్న — అవునయ్యా వీళ్ళమూలంగా మనవుద్యోగం వఖరంతా చచ్చిపోతూ వున్నది. అక్కడికీ మన ప్రయోజకత్వంచేత యెలాగో నెలకు నాలుగురాళ్లు వాళ్ళ యెంతయేడుస్తున్నా మనవంటివాళ్లం తంటాలుపడుతూ వున్నాముకాని పెద్దమనుష్యులుగా వుండేవాళ్లకు చిల్లిగవ్వ దొరకడం లేదు.

సోమి — ఇది మహాఅన్యాయంగావున్నది. మన మందరమూ చేరి యేదో వికవిధంగా ఆలోచించి యీకొత్తగా వచ్చినవాళ్లను వదల్చుకుంటేనేకాని మన మర్యాద దక్కదు. పూర్వకాలంలో యెంత లేదన్నా అయిదారుగురు దీనివల్ల జీవనం చేస్తూవుండేవారు. కొద్దిగానో గొప్పగానో లాభంపొందని కమీషనరులు అప్పుడు నక్కరూ లేరు. నామట్టుకు నాకు యీవకేజీమీద నెలకు ముప్ఫైరూపాయలు కళ్ళ పడేవి.

ఖాద — భంచోత్ ! మీకీ యేమిదొరకేదోకాని మాకీ పావలా

బేడాకంటె యెప్పుడూ యెక్కువా చేతులో పెట్టలేదు. అప్పుడూ మీరే అంతా దోచుకుదొబ్బేవారు.

బుచ్చ—సాహేబుగారూ ! మనలోమనం దొమ్మ్మలాడడం న్యాయం కాదు. మనం యెంతతిన్నా తిన్నవాళ్లమే. మన మందరమూ యేకముగావుంటే అప్పుడు విస్తారం దొరకకపోయినా ఇఖ దొరుకుతుంది.

ఖాద—భాంఛోత్ ! నేను యేమీ అన్నానయ్యా ? నాకీ నెలకీ ఫదిరూపాయలు ఇస్తానని దస్తావేజు వ్రాసియిచ్చావు నేను యెందులో దస్కత్ చెయ్యమంటే అందులో చేస్తాను.

బుచ్చ—సరిసరి! ఇందులో దస్తావేజులూ దస్కతు చెయ్యడమూ కూడానా ? కాస్త కాగితంముక్క మన విరోధులచేతులో పడితే వాళ్ళు మనకొంప తీసివేస్తారు. వాళ్ళు యెప్పుడు సమయం దొరుకుతుందా అని చూస్తూవున్నారు. వాళ్ళు యెన్నివిధాల తంటాలుపడినా మన ప్రియోజకత్వంచేత మనము దొరకకుండా వున్నాము.

గున్న—అవునవును. మీరు చెప్పినది బహుబాగా వున్నది. అన్నతరువాత లేదనవచ్చును గనుక మనం యెన్నిమాటలు చెప్పవచ్చునుగాని కాగితంమీద వక్కఅక్షరం యెక్కించరాదు. అది వాళ్ళ చేతులో చిక్కింది అంటే తరువాత దస్తావేజు అయి గొంతుక పట్టుకుంటుంది.

ఖాద—సరిసరి లేవయ్యా ! మీరందరూ యేక ముడబ్బు దొబ్బడం మొదలుపెట్టి మానెత్తికి పేడరాయడానికే యేపాల్ వేస్తూ వున్నాఢు. దస్తావేజు లేకపోతే యెలా నమ్మఖం కుదురుతుందయ్యా ? కావలిస్తే దస్తూరీమాత్రం లేదనరాదూ ! మీదస్తూరీని నాకు దస్తావేజు వ్రాసి యివ్వండి; మీకంతగా మాటవచ్చేమాట వుంటే యీదస్తూరీ మీది కాదని ప్రమాణాచేసి వాగ్మూలం యిస్తానో లేదో చూస్తురు

గాని. మాటంచే ఖరార్ వక్కమో స్తరుగా వుండవలెను. యెందు కయ్యా నీకీ ఈభయం ? మొన్న హేడ్డుగుమాస్తాగారికి మాట వస్తుం దంచే మన మందరమూ ప్రత్యక్ష్యంగా యెరిగినదానిలో దస్తూరీ అతనిది కాదని వక్కతాకీని పలకలేదూ? అప్పుడు నిజం చెప్పినవాళ్ళ మాటే అబద్ధ మయిపోయిందా లేదా? ఇందులోనూ అంతే అవు తుంది వాసి యివ్వండి.

బుచ్చ—మీకు వెయ్యిసలాములు పెడతాను. మీరు మాలోకి కలిసివచ్చినా సరే రాకపోయినా సరే. నేను కాగితంముక్క-మీద మాత్రం వక్క అక్షరం వాసి యివ్వను. కలిసివస్తే మీకే లాభం.

ఖాద—మీరు డబ్బు యిప్పిస్తా మని యింతగా నాకే చెపుతూ వున్నారు. గనుక మీతో చేరుతూ వున్నాను. ఇప్పుడు యీ అరుగుల విషయంలో నాకే యేమి యిస్తార్?

గున్న—ఇప్పుడు యీకొత్తవాళ్ళ అడ్డం రాకపోతే మనకు ఇందులో పాతికరూపాయలకు తక్కువలేకుండా వస్తవి. ఇందులో మన ప్రయోజకత్వం కనపరిచి మనపంతం నెగ్గించుకోవలెను

ఖాద—వక్క దెబ్బను నెగ్గించుకుంటాము. సర్కారుస్థలము కలుపుకున్నారన్నా ఫదిగజాలవీధి వున్నప్పుడు అందులో నాలుగు గజాలస్థలము పోతే యెవరికీ యిబ్బంది లేదని వాదింతాము. యెందు కయ్యా అంత వెడల్పువీధి? అక్కడికీ వీధి ఆరుగజాలవెడల్పువుంటుంది గదా ? యేదీ మనవూళ్ళో నాలుగు గజాలవెడల్పుబండి వక్కటి చూపించు. వీధి సన్ననయితే బళ్ళు వెళ్ళడానికి వల్లకాదని చెప్పేవాళ్ళ వాదం మొత్తుకున్నట్టే వున్నది.

బుచ్చ—ఆవీధులో పరీక్ష చేసేవాళ్ళు వుంటే వరుసగా రెండు బళ్ళు నేను నడిపిస్తాను. నేను నడిపించలేకపోతే ఫదిరూపాయలు

గునహా యిస్తానుగాని నడిపిస్తే వీధివెడల్పు చాలదనే కమీషనర్లు యెవ రయినా నాకు రెండురూపాయలు యిస్తారేమోకనుక్కోండి. సాహేబు గారూ! యింపులో మనమంతా వక్కటొక్కిని పలుకవలెను సుమండీ? యేమయ్యా మనవాళ్ళు యేడుగురు వుండగా మనం నలుగురంమాత్రమే ఇక్కడ కనుపడుతూ వున్నాము. వాళ్ళు రాలేదేమి?

సోమి—వాళ్ళపూచీ నాది. వాళ్ళను యెలాగు పలికించమంటే అలాగు నేను పలికిస్తాను. వాళ్ళతో యేమి చెప్పమన్నారో చెప్పండి. మనవిరోధు లంతా యెప్పుడూ మీటింగుకు రారు. మన మందరమూ మీటింగుకు వెళితే రేపు మెజారిటీ మనదే అవుతుంది.

గున్న—భేష్. అలాగయితే మనకు విజయం అయినట్టే. పంతులుగారూ! వీధిఅరుగులవిషయ మయి యాభయిరూపాయలకు తక్కువవల్లపడ దని ఖండితంగా యీరాత్రే బేర మాడుకొని సొమ్మ్ర చేతులో పడవేయించుకోండి. రేపు మీటింగులోనుంచి వచ్చేటప్పుడు యీదారినే వచ్చి అందరమూ సొమ్మ్ర పంచుకొందాము.

సోమి—అప్పుడే తొందరపడకండి. రేపు మీటింగులోనుంచి వచ్చి తరువాత అప్పుడు కార్యం అయిందనుకోవలెను గాని అందాకా కాదు. మునుపటికాలాలలో అయినట్టయితే మనవంటివాళ్ళం మాట్లాడు కోవడంతోటే కార్య మయినట్టే. ఇప్పుడు తీరా నెగ్గినదాకా సం దేహమే. మునుపటికాలంలో మేము యెందరికో వుపకారాలు చేసి వాళ్ళనూ బాగుచేసినాము. మేమూ బాగుపడినాము. వెనుక మా యిల్లు కట్టించుకున్నాము కదా వక్కదమ్మిడి అయినా మనచేతిది ఖర్చు అయిందటండీ? తలావక తాచుపామూ చంపినా రని కూలివాళ్ళ కందరికీ పావలా పావలా యిప్పిస్తే వాళ్ళూ సంతోషపడేవారు మన కార్యమూ అయ్యేది. మ్యూనిసిపల్ సొమ్మ్రలోనుండి ఫదిరూపాయలు ఇప్పిస్తే

యిందులో యెవడితాతసొమ్ము పడిపోయింది! వక్కపీధిని తూము కట్టించవలసివస్తే పెయ్యియిటుకలకు నాలుగువేలయిటుకలు లెక్కలో! వేసి బజారులో అమ్మేదానికంటె రెండురెట్లు యెక్కువఖరీదు పుచ్చుకొని తెల్లవారేటప్పటికి వక్కొక్కయింటిగోడలు లేవతీయించేవాణ్ని. మునుపు ఇటుకగోడ గజానికి యెనిమిదిరూపాయలు ధరవేస్తే ఇప్పుడు రెండురూపాయలకాడికి దిగింది. యేమీ లాభము లేదు. ఆకాలంలో ఇటుకలుకూడా చాలా చవక. ధోరలు ధర్మాత్ములు గనుక వాళ్ళకు యీమాయలూ మర్మాలూ యేమీ తెలిసేవి కావు.

బుచ్చి—మీరు వెనుక దీపాలు పెట్టించేవారుగదా అందులో యేమాత్రం మిగిలేదండీ?

సోమి—అందులో దీపంవక్కంటికి ఫక్తు నాకు రూపాయపైగా మిగిలేది. ఇదికాకుండా యెనమండుగురునవుకర్లు యెప్పుడూ మనయింట్లో పని చేస్తూవుండేవారు. కమీషనర్లకందరికీ దీపాలలోకి చమురు ఇందుల నుంచే సప్లయిచేసేవాళ్ళము.

గున్న—వెనుకటిమాట లెందుకుగాని మొన్న వాళ్ళస్థలానికి ఆవరణపుగోడసంగతి యేమైనది? అందులో మనకు యాభయిరూపాయలు దొరుకుతవా?

సోమి—అంతమట్టుకు దొరకవచ్చును. మనకు యేమైనా పెద్ద మొత్తాలు దొరికితే ఇటువంటివాటిగోనే. మనవూళ్ళో ఖాలీస్థలాలు చాలావున్నవి. మనకు యేమయినా ఫదిరూపాయలసొమ్ము చేతిలో పడితే వాళ్ళచేత మాస్థలానికి గోడపెట్టించుకోవడానికి సెలవు ఇప్పించుమని పిటీషన్ పెట్టించి, దాని వెనుకపీఠీని మేముయెరుగుదుము; ఆస్థలం వాడిదేగనుక సెలవు యివ్వవచ్చునని మనం వాస్తే ఆప్రకారం జరుగుతుంది.

ఖాద—ఇప్పుడు తాటాకులఇళ్ళకు సెలవిచ్చిసందుకు ఇంటి వక్కంటికి యెంతవస్తూవున్నదండీ ? అందులో నాకు యేమీభాగం రావడం లేదు.

గున్న—తాటాకుఇళ్ళని పేరేకాని ఇంటివక్కంటికి పావలా కంకె యెవళ్లూ యెక్కువ ఇవ్వడంలేదు. మీరోడ్డుకంట్రాక్టులో యేమి దొరుకుతూవున్నదండీ ?

బుచ్చి—ఇప్పుడు రేట్లు తక్కువైనవిగనుక కంట్రాక్టుదారులు నూటికి ఫదిరూపాయలకంకె యెక్కువ ఇవ్వడం లేదు. ఆఫదిరూపాయలూకూడా దొరకకుండా యీకొత్తకమీషనరులు పనులన్నీ తమ లోవారిచేతనే చేయించడానికి రిజోల్యూషనులు చేస్తూవున్నారు. యేమైనాఅంటే మనచేత పని కాదంటారు. అక్కడికీ మేనేజరు మన వాడుగనుక వాళ్ళు మీటింగులోకి రానప్పుడు వకటీ అరా రోడ్లమర మ్మతులు మనమీద పెడుతూవుంటాడు. అదుగో వెంకట్రావు వస్తూ వున్నాడు. అతడు మన శత్రుపక్షంలో వాడుగనుక మనం యీసంగతి ఇప్పుడు మాట్లాడుకోకూడదు. రేపు మళ్ళీ ఇక్కడనే మీటవుదాము.

(అని వెళ్ళుచున్నారు.)

---

౫. ద్వితీయాంకము—మ్యూనిసిపల్ సభ.

[వైస్ ప్రెసిడెంటుగారును, మదనయ్యగారు, నాగభూషణరావుగారు, బుచ్చయ్య పంతులుగారు, గున్నయ్యనాయుడుగారు, సోమిసెట్టిగారు, ఖాదర్‌సాహేబు గారు మొదలయిన కమీషనరులును పరివేశించుచున్నారు.]

బుచ్చ—మేనేజరుగారూ! కామిసెట్టి వీధిఅరుగులఅర్జీ ముందుగా తియ్యండి

మేనే—అదేపయినివున్నది కొని, దానిలో యింకా కొంచెం

తగాదాగావున్నది. పయిమీటింగుకు నిలుపుచెయ్యవలెను.

మద—యీ మీటింగులోనే ఫరిష్కారం కానియ్యండి. ఆ యింట్లో వెనుక నేను కాపురం వుండేవాణ్ణి. ఆసంగతి నాకు బాగా తెలుసును.

గున—ఆలాగైతే తియ్యండి. మేముందరముకూడా యెరుగుదుము. అందరూ యెరిగినవారు వున్నపట్టే ఇది ఫరిష్కారం కావలెను.

మేనే—ఇందులో దస్తావేజులూ అవీ చూడవలెను. తొందర పడతాదేమి వుండండి.

బుచ్చ— (సోమిసెట్టిగారితో రహస్యముగా) ఇందులో మేనే జరుగారిచేతిలో పడేది ఇంకాపడలేదు. అందుచేతనే యీఅభ్యంతరం. అంతా ఆముండాకొడుకు ఇచ్చేది నిన్ననే యెందుకు ఇచ్చినాడుకాడు ?

సోమి—(రహస్యముగా) వాడు నిన్ననే యిస్తానని సొమ్మ తీసుకుని వెళ్ళినాడు కాని బేరం సొసాయించిందికాదు. ఆయన ఫదిరూపాయలకు వప్పుకోలేదు.

మద—దస్తావేజులసంగతి నాకు తెలుసును తియ్యండి.

సోమి—నాకూ తెలుసును తియ్యండి.

నాగ—అందరు తెలుసునని చెపుతూవుంటే మీకేమి అభ్యంతరం? కాగితాలు తియ్యండి.

మేనే—చిత్తము. తమకందరికీ అభ్యంతరం లేకపోతే ఆలాగే తీస్తాను. అవునోయి సిస్థలంయొక్క వెడల్పు యెంత ?

కా—ఫదిగజాలండి.

బుచ్చ—నీకు బాగాజ్ఞాపకం వున్నదో లేదో జ్ఞాపకం లేదనిచెప్పు.

సోమి—ఏమోయి వూరుకుంటావు ? దస్తావేజు చూచి మనవి చెయ్యనలెనని చెప్పు.

మద—నేను యెరుగుదును. వెడల్పు ఫదిగజాలే. అతడు కమీ షనర్లవారి సెలవు పొందకుండానే వీధిలోస్థలం నాలుగుగజాలవరకూ ఆక్రమించుకొని అరుగులు పెట్టినాడు. అవి తీసివేయించవలెను.

కా—అయ్యా! నేను డివిజన్ కమీషనర్ల సెలవుప్రకారమే అరుగులు వేసుకున్నాను. వారు స్థలం హద్దుచూపించి ఇండ్లార్సు మెంటు వెనుకనుంచి పంపిస్తాము వేసుకోవచ్చునని సెలవిచ్చినారు.

బుచ్చ—అవును మేము యెరుగుదుము గనుక గున్నయ్యనా యుడుగారూ నేనూ వెళ్ళి కట్టలు పాతించి హద్దు చూపించినాము. ఇతడు అరుగులు హద్దులోనే వేసుకున్నాడు గాని. వక్రమించిఅయినా అవతలికి రానియ్యలేదు.

ఖాద—అవునయ్యా అది మేము యెరుగుదుము. అతడు యేమీ సర్కారుస్థలం ఆక్రమించుకోలేదు. రాజాగారి వీధి మేము యెరుగమటయ్యా?

మద—అది రాజాగారి వీధికాదండి నబాబుగారి వీధండోయి. మీరు యేదో మరో యింటిమాట అనుకుంటూవున్నారు.

ఖాద—అదేఅది. యేవీధయితేనేమి? మేము నబాబుగారి వీధియెరుగుదుము. అన్నివీధులూ యెరుగుదుము. మేము తురకలమై వుండి నబాబువారివీధే యెరగమండీ?

సోమి—యేవీధయినా అతడు స్థలం ఆక్రమించుకోలేదు. ఏమయ్యా నాయుడుగారు! మీరు యెరిగినవారు ఇందులో మాట్లాడక వూరుకుంటారేమి?

గున్న—నేను వెళ్ళి స్వయంగా చూచి ఫరిష్కరించినవాణ్ణి. నాఅభిప్రాయం మరివకలాగు వుంటుందా?

మద—ఆయింట్లో కాపురంవున్నవాణ్ణి నాకంటె మీకందరికీ

మహాయెక్కువ తెలుసునా యేమిటి ? అసలు స్థలం మొట్టమొదట బచ్చువారికి అమ్మిందియెవరు మేముకాదూ ? ఆబచ్చునాదగ్గిరనుంచి ఇతనుకొన్నాడు. రిజిష్టరీదస్తావేజు తెప్పించి చూచి యేకీఇప్పుడు వెడల్పు కొలిపించండి. నాలుగు గజాలు యెక్కువ వున్నదో లేదో కను పడుతుంది.

బుచ్చి--అప్పటిగజాలు బహుపెద్దవండి. ఆఫదిగజాలు యీ పద్ధాలుగుగజాలూ వకటేనండి. యేమోయి కామిసెట్టీ కాదుటోయి ?

మద--ఏమండీ మీరు ఆలాగు సెలవిస్తారు ? ఏదీ పెద్దమనిషి కామిసెట్టి కన్యకామ్మవారిమొగం చూచి ఆమాట అనుమనండి.

బుచ్చి--ఆలాగైతే ఆకొలతలో వీధిఅరుగులు పడ లేదు. ఆ నాలుగుగజాలు వీధిఅరుగులకొలత.

మద--యేమిమాటయ్యా ? మునుపాపక్కను అరుగులుండే వటయ్యా ? అక్కడ గుమ్మమేలేదు.

సోమి--అరుగులుండేవి కాని ఈమధ్య రోడ్డుగెత్తు యెక్కువ కావడంచేత పూడిపోయినవి. మదనయ్యగారూ ! మీరుయెవరూ పుట్టక మునుపటినుంచీ నేను ఆస్థలం యెరుగుదును. అక్కడ అరుగులు పూర్వ ము వుండేవి.

గున్న--అదుగో హాదుగో యెరిగినవా రాయన అలాసెలవి స్తూ వుంటే మనమందరమూ వప్పుకొని వూరుకోవలెను.

నాగ--అసలు దస్తావేజులోవున్న దానికంటె నాలుగుగజాలు స్థలం యెక్కువ కనుపడుతూవుంటే యెలాగు వూరుకోము.

మద--వకవిషయంలో వూరుకుంటే అందరూకూడా వీధు లన్నీ ఆక్రమించుకొంటారు.

బుచ్చి--(మదనయ్యగారితో గహస్యముగా) వాడు సర్కారు

వీధి ఆక్రమించుకొన్నాడుగాని యెవరిస్థలమూ అక్రమంగా ఆక్రమించుకోలేదుగదా ? ఇందులో నీకు యేమినష్టం వున్నది ? బీదవాడు పెట్టుకున్న గోడా అరుగులూ తీసివెయ్యకుండా అనుగ్రహించి కాస్త తలవూపుమరూ మీకు బీదవాడికి వుపకారం చేసినపుణ్యం వస్తుంది.

ఖాద—ఇందులో సర్కారుస్థలం కాస్త కలుపుకుంటే మాత్రము యెవరికి యిబ్బంది వున్న దయ్యా ? వీధి కావలసినంతా యెడల్నూ వుండాది. అరుగుల్ వేసుకోమని ఆర్డర్ యేసీయెయ్యండి.

సైసు—(ఇంగ్లీషులో) కమీషనర్లు యేమిటంటూవున్నారు ?

నాగ— (ఇంగ్లీషులో) స్థలంకలుపుకున్నట్టు స్పష్టంగా కనపడుతూవున్నది. అరుగులు తీసివెయ్యవలసిన దని వుత్తరవు చెయ్యవచ్చును.

మేనే—అరుగులు వారముదినములలోగా తీసివెయ్యవలసిన దనీ తీసివెయ్యకపోతే ప్రాసిక్యూషన్ చేస్తామనీ ధొరగారు రిజల్యూషన్ పాసు చేసినారు.

ఖాద—ఇది కేవలం అన్యాయం. వాడినోట్లో మన్ను వేస్తే మీకో యేమివస్తుందయ్యా ?

బుచ్చి—కామిసెట్టీ ! మేము యేమిచెప్పినా కార్యం లేకపోయినది. నాలుగు నెలలు వూరుకుని యీసంగతి వుదహరించకుండా మళ్ళీ పిటీషన్ యిచ్చుకో. యీకమీషనర్లు రానిసమయం చూచి అప్పుడు మేము నీపక్షంగా వుత్తరవుచేస్తాము. ఇంతమాత్రంచేత సీపు ఇప్పుడు అరుగులు తీసివెయ్యనక్కరలేదులే.

కాపు—చిత్తము మహాప్రభో ! ఎలాగురక్షించినా యేలినవారు రక్షించవలెను. తనుకు నాకు యీవుపకారం చేస్తే తమ వుత్తరవు ప్రకారం యేమిదాఖలుచేసుకోమంటే అది దాఖలు చేసుకుంటానండి.

బుచ్చ--ఆట్టే మాట్లాడక వెళ్లిపోవోయి. మేము దాఖలు చేసుకోమనకపోతే నీకు తెలియదూ! అప్పీలుపిటీషన్ దాఖలుచేసుకో పో పో.

నాగ--మేనేజరుగారూ! తరువాత సబ్జక్టు యేమిటో తియ్యండి.

మేనే--ఇందులో యేమీ లేదండి. పల్లపువీధిని వకడు తన స్థలానికి ఆవరణపుగోడ పెట్టుకోవడానికి సెలవడిగినాడు. డివిజనల్ కమీషన ర్లాప్రకారం పెట్టుకోవడానికి అభ్యంతరం లేదని వ్రాసినారు. ఆప్రకారం సెలవు యివ్వవచ్చును.

బుచ్చ--(గున్నయ్యనాయుఁడుగారితో రహస్యముగా) ఇందులో మేనేజరుగారిచెయ్యి తడి అయింది. ఇది యేప్రకారంగా సద్ది చెపుతూ వున్నాడో చూచినారా?

నాగ--అలాగైతే వుత్తరవు వెయ్యవచ్చును.

మద--కాదు కాదండి. ఇటువంటివాటిలోనే చాలా దగాలు వుంటవండి. ఆస్థలం యెక్కడిదో నాతో చెప్పండి.

గున్న--అది నాడివిజక్‌లోదండి. అనుగో పల్లపువీధులో ధర్మసావడికి యెదురుగుండావున్న ఖాళీస్థలం. అది వాళ్లే హక్కు గోడలు పెట్టుకోవడానికి శలవు యివ్వవచ్చును.

మద--సరిసరి! అదా? దానినిగురించి నాకు బాగా తెలుసును. ఆస్థలం వాళ్ళభుక్తంలో యెన్నడూ లేదు. వెనుక రిచ్చర్డుధొరగారి హయాములో ఇటువంటి అర్జీ లేవస్తే వల్లకాదని సెలవిచ్చినారు. మేనేజరుగారూ! ఆవెనుకటిరిజల్యూషన్ తియ్యండి.

మేనే--ఏదో యెప్పటిదో పాతపురాణం యెలాకనపడుతుంది? దానికి పనిచేసుకుని నెల్లాళ్ళో రెండు నెలలో వెతకవలెను. ఇలాంటి స్థలాలు మనవూళ్ళో లక్ష వున్నవి. అది యేస్థలాన్నిగురించో. దీన్ని

గురించి ఇదివరకు యెప్పుడూ అర్జీ వచ్చినట్టు నాకు జ్ఞాపకం లేదు.

మద—కాదు కాదండి. దీన్నిగురించే; నాకు బాగా జ్ఞాపకం వున్నది.

మేనే—మీకు యెలాగు జ్ఞాపకం వున్నదోకాని ఘోరపడి వుంటారు.

గున్న—అవునండీ. మీరనుకున్నది యేదో మరివకటికాని యిది కాదు. దీనివిషయంలోయెప్పుడూ యెవరూ అర్జీ యిచ్చుకోలేదు. యీ విషయంలో విమర్శించినవాణ్ని నాకు బాగా తెలుసును. యెంత విమర్శా చెయ్యకపోతే అర్జీలమీద నేను అల్లాటప్పాగా వుత్తరవు యిస్తానండీ? నేను కుళ్ళు యేమైనా వుంటే అట్టుపుట్టు ఆనవాళ్లతో పెల్లగించి వదిలిపెడుతాను. ఈయింటివాళ్ళు బహు పెద్దమనుష్యులు. వాళ్లు తమ స్థలం కాకపోతే అక్రమంగా వచ్చేవారు కారు.

మద—వెనక తగాదావచ్చినది ఈచోటేనండి. దీనికిచుట్టూ ఆవరణపుగోడ యెప్పుడూ లేదు. పశువులను తోలుకువెళ్లేవాళ్ళు పశువులను దానిలోవున్న రావిచెట్టుకింద తోలుతూ వుండడం నేను యిరవయిసంవత్సరములనుంచి యెరుగుదును. వారి యింటిదస్తావేజు తెప్పించి చూడండి. అందులో యీస్థలము లేదు.

సోమి—అవును. స్థలం మీరు చెప్పినదేకాని దస్తావేజులో లేక పోయినంతమాత్రంచేత హక్కు వాళ్ళది కాదనడానికి వీలు లేదు. తప్ప కుండా హక్కు వాళ్ళదే.

మేనే—అవునండి. యెవరూ తగాదాచేసేవారు లేనప్పుడు మనం గోడ పెట్టుకోవడానికి సెలవు యివ్వడానికి అభ్యంతరం యేమి వున్నది? మరి యెవరిహక్కయినా అయితే వాళ్లే వ్యాజ్యంవేసి పుచ్చు కుంటారు. సర్కారుస్థలమయితే రివిన్యూసైడున కలక్టరుగారే ఆటంక

పెడుతారు. మీరు సెలవు ఇవ్వండి.

మద--అలా వల్లకాదు.

గున్న-- వల్లకాకపోవడానికి గవర్నమెంటువారు యేర్పరిచిన కమీషనరులము మేము అక్రమంచేసేవాళ్లమా యేమిటి? ఇందులో మామాట సాగకపోతే మాకు అవమానంగా వుంటుంది.

ఖాద--అవును బాగా పోట్లాడవయ్యా. ఇందులో మన తక్కువ యేమిటి? వాళ్లయెక్కువ యేమిటి? కావలిస్తే గవర్నమెంటు దాకా వెళుదాము.

బుచ్చి--మనకేం భయమేమిటి తప్పకుండా వెళుదాము. ఇందులో మనం వదిలిపెట్టి వూరుకోకూడదు. బాగా పోట్లాడవయ్యా.

సోమి--పోట్లాడడం యెందుకు? మెజారిటీ మనమే వున్నాము. వోట్లు పుచ్చుకుంటే తెలుస్తుంది. ఇందులో తప్పకుండా డివిజన్ కమీషనర్లు ఇష్టప్రకారం జరగవలెను.

మద--మీరు యెంతమందివున్నా ఇందులో న్యాయం చూడవలెనుగాని సంఖ్య చూడకూడదు.

గున్న---మీరు మహాన్యాయం చూస్తూ వున్నారు. మహా మహాకోర్టులలో లంచాలు పుచ్చుకుని వుపకారం చేస్తారు. అంతా మహామడికట్టుకుని కూర్చున్నారా యేమిటి?

ఖాద--యెవళ్లకిచ్చినా యేమిచ్చినా దొరికిపోతుందని వోర్వలేని ముండాకొడుకులు ప్రతీదానిలోనూ అడ్డం వస్తారు.

మద--మాటలు తిన్నగా రానీ. నీలాగు గడ్డితినేగాడిదెలు వుంటే --.

ఖాద--అదుగో అదుగో మిగలమాటలు రానిస్తూ వున్నావు. ధారగాను విటూవున్నారు. నేను మేజస్ట్రేటుతో ఫిర్యాదు చేస్తాను.

మీరంతా సాక్షులయ్యా!

బుచ్చ--చెయ్యండి. ఇలాగంటివాళ్లకు వక్కమూటు శిక్ష అయితే ఇఖ యెప్పుడూ మనకు అడ్డం రాకుండా వుంటారు.

వైసు--- (ఇంగ్లీషుతో) కమీషనర్లు పోస్టాడుతూ వున్నారు. నేను వెళ్ళిపోతాను.

మేనే-- (ఇంగ్లీషుతో) దీనిమీద గోడలు పెట్టుకోవచ్చునని వుత్తరవు వేసి వెళ్లండి.

నాగ-- (ఇంగ్లీషులో) వారు అలాగు చెపుతూవుండగా యిప్పుడు వెయ్య వల్లకాదు.

వైసు-- (ఇంగ్లీషుతో) నేను వెళ్ళిపోతాను.

(అని వెళ్ళుచున్నాడు.)

---

3. తృతీయరంగము---సోమిసెట్టిగారి యిల్లు.

[ఖాదర్ సాహేబుగారును, బుచ్చయ్యపంతులుగారును, గున్నయ్యనాయుడు గారును, సోమిసెట్టిగారును, కామిసెట్టియు ప్రవేశించు చున్నారు.]

బుచ్చ--ఏమోయి కామిసెట్టీ! మేనేజరుగారియింటికివెళ్ళి రాత్రి ఫరిపాకరం చేసుకున్నావా?

కామి-- ఏమిఫరిపాకరమండీ? ఆయనకు దాహం మహా విశేషంగా వున్నది. అంతదాహం నేను తీర్చలేనండి.

బుచ్చ--నీవు యెంతయితే యిచ్చుకుంటావు?

కామి--నేను పదిహేనురూపాయలకు వక్కగవ్వ యెక్కువే యిచ్చుకోలేనండి ఆయనవక్కడికే అయితే ఇంకా ఫదిరూపాయలు ఇచ్చుకోమన్నా ఇచ్చుకుంటాను. ఇందులో మీకు యాభైరూపాయలు ఇచ్చుకోవలెనాండి? శానిటరీ యిన్స్పెక్టరుగారికికూడా యేమయినా

ఇచ్చుకోవలె గని మీరే సెలవిచ్చినారండి ! ఇంకా యెంతమందికి యేమి యిచ్చుకోవలెనో ! ఆయనకక్కడా ముప్ఫురూపాయలు వొళ్ళో పొయ్యమంటే ఎట్లా పొయ్యగలనండీ ?

బుచ్చ—సమయం వచ్చినప్పుడు తప్పుతుందీ ? ఇవాళ వచ్చిన ఖర్చు రేపురాదు. నీకు కొట్టుఅరుగులు కావలసివున్నట్టయితే ఇల్లో వాకలో తాకట్టు పెట్టి నాలుగురూపాయలు హెచ్చుతగ్గుగా సొసాయించుకో. ఆయనచేతులో మంత్రిపుష్పం పడకపోతే రిజల్యూషన్ పరికారం హుకుం వాయించి రేపు యీపాటికి అరుగులు తవ్వించి వేస్తాడు. స్వాములవారికి చెల్లించవలసిన ముడుపు చెల్లించినట్టయితే ఇది పడవేసిపెట్టి యేదో వకవిధంగా హుకుములు వాస్తూ ఆరునెలలు జరుపుతాడు. యీలోగా నీవు యెప్పుడయినా మళ్ళీ అర్జీపెట్టుకుంటే వోర్వాలేని కమీషనరులు లేనికాలములో మేము నలుగురమూ వున్నప్పుడు పెట్టి అరుగులు పెట్టుకోవలసిన దని దానిమీద గీటు పెట్టించివేస్తాడు. అంతకూ వల్లకాకపోతే అరుగులు తీయించివెయ్యవలసిన దని హుకుం వాసి దొరగారి సంతకం చేయించి శానిటరీ ఇన్‌స్పెక్టరుకు పంపించినట్టు ఆఫీసుబుక్కులో యింటరుచేసి పంపించకుండా వూరుకుంటాడు. నీవు నాలుగురూపాయలు శానిటరీఇన్‌స్పెక్టరు చేతులోకూడా పెడితే యెవ్వరూ ఆసంగతి కదిపేవారే లేరు. ఈ పోయినకమీషనరులంతా అరుగులు తీసివేసినారో లేదో అని మళ్ళీ వచ్చి చూస్తా రనుకున్నావా యేమిటి ? అందులో ఇంతశ్రద్ధ యెవరికి ? ఆనీటింగులోకి వచ్చి నాలుగుముక్కలూ వాగి చక్కాపోతారు. తరువాత యేమి జరిగిందో యేమిటో మళ్ళీ దానిజోలి తలపెట్టరు. కార్య మంతా మాలో వున్నది. మేనేజరూ మేమూ - శానిటరీ ఇన్‌స్పెక్టరూ యేకమై ఇదివరకు ఇటువంటి రిజల్యూషనులు లక్ష

అమలు జరగకుండా ఆపివేసినాము. యెవడు కనుక్కొన్నాడు ? మా చేతులో పడకపోతేమాత్రం వక్కపని సాగదు. మేము ప్రతివీధీ తిరిగి ఇటువంటికుళ్ళు యేమయిన వుంటే పుటకి యెక్కతీసి మమ్మి సమాధానం చేసుకోకపోతే మూడు చెరువులనీళ్ళు తాగించి మరీ వదిలి పెడుతాము. యేమి మా యాభయిరూపాయలూ తెచ్చినావా ?

కామి—కార్యమైతే ఇచ్చుకోక యేమిచేస్తానండీ ? మీకూ మేనేజరుగారికీ కట్నం సమర్పించుకుంటే ఇఖ నేమీ యెవరికీ ఇవ్వనక్కరలేదుగదండీ ?

బుచ్చి—ఇది మహానైవేద్యం. ఇది యిచ్చుకుంటే ఇఖ చిల్లర దేవతలకు రూపాయా అర్థా ఇచ్చుకోవలసినదేకాని ఇంత పెద్ద మొత్తం యేదీ వుండదు. ఆవీధిని పనిచూసే బంటోతువాళ్ళచేతిలో చెరివక అర్థాపెడుదూ. దానితో సరిపోతుంది.

కామి—అంతేనాండి? ఇఖ శానిటరీయిన్‌స్పెక్టరుగారికి యేమీ ముట్టచెప్పనక్కరలేదుగదే?

బుచ్చి—యేది తప్పినా శానిటరీయిన్‌స్పెక్టరుగారిది తప్పదు. అది తండ్రితద్దినంవంటిది. నీయిట్లో భోజనం మానుకొని అయినా పెంకటేశ్వరులముడుపు అది చెల్లించవలెను.

కామి—ఆయనకు వెనుక అగుగులు కట్టిచుంకునేటప్పుడు అటంక పెడితే రెండురూపాయలు ఇచ్చినా నండి.

బుచ్చి—అది అవసరనైవేద్యం. అప్పటికి సరిపోయింది. ఇప్పుడు ఇచ్చేది మహానైవేద్యం. ఇది ఇచ్చుకుంటే ఇఖ యీఅరుగులనిమిత్తం మళ్ళీ ఇచ్చుకోనక్కరలేదు.

కామి—ఇంతమంది దేవతలకు ఇన్నిమాట్లు యిచ్చుకోవలసివస్తే మావంటి బీదవాళ్ళము యీఘట్టుఘాసాలలో బ్రతకగలమండీ ?

బుచ్చ—డబ్బకోట్లో దేవుడున్నాడు. యేమిసమర్పించుకోక పోతే దేవతలకుహూత్కం నీమీద అనుగ్రహం యెలావస్తుంది? దేవతా ప్రసాదం కావలిస్తే మీదుకట్టింది తీసుకువచ్చి చెల్లించి ఆపద తప్పించుకోవలెను. నీవు యెరుగవుకాని కొన్నిదేవతలకు నిలువుదోపు కూడా ఇవ్వవలసి వస్తుంది. ఆవువంటిదిసమేతూ కడుపునిండా మేతమేస్తే నే కాని చేపదు. మేతలేకుండా యీకామధేనువులుమాత్రం పొడి పొడిపణ్ణాలతో వరాలు కురిపిస్తవనుకున్నావా? ముందుగా మాకను కున్నది మొక్కుచెల్లించుకో.

కామి—యే దేవతయినా కార్యమయినతరువాత మొక్కు-చెల్లించుమంటుంది గాని ముందుగానే చెల్లించమనదు. కార్యమైతేనే కాని నేను యేమీ ఇచ్చుకోలేను.

బుచ్చి—కామిసెట్టీ! చెవులోమాటోయి. (రహస్యముగా) మీనేజరుగారితో చెప్పి ఆయనచేత నాలుగురూపాయలు మాన్పించి నీకు చాలాకిపాయతు చేయిస్తాను. శానిటరీ-యిన్స్పెక్టరుగారికి కూడా ఇప్పుడంతా ఇచ్చుకోనక్కరలేకుండా సగంమాత్రమే ఇప్పుడు ఇచ్చు కునేటట్టు సిఫారసు చేస్తాను. మా యాభయిరూపాయలుమాత్రం ముందుగా తెచ్చుకో. ఇఖ మాట్లాడకు తక్షణం వెళ్ళిపో.

కామి—చిత్తము. (అని వెళ్ళుచున్నాడు.)

ఖాద—యేమిటయ్యా? మే మింతసేపటినుంచీ కూకుండాము. భాంచోత్ మంచేతిలో వక్కపైసా పడలేదు.

గున్న—తొందరపడకయ్యా! పంతులుగారు అందువిషయమే కాపూ తంటాలు పడుతూవున్నారు. సొమ్మ చేతులో పడడంతోటే వక్కడమ్మిడీ మిగుల్చుకోకుండా యెవరిది వారికి పంచిపెడతారు

ఖాద—భాంచోత్ మీహింమవుల్కా- మాకీ నమ్మం. డబ్బా

సేతిలోపడితే దగాసేస్తార్. ముందుగా నావంతునాకో ఫైసల్ సెయ్యండి.

సోమి—సొమ్మ్ర. కానిదే ముందుగా యెవరయినా పైకెట్ల డబ్బు తెచ్చియిస్తారటయ్యా? కానియ్యండి.

ఖాద—అదంతా మాకీతెల్సు. ముందుగా మాసేతిలో డబ్బు యేసి మాట్లాడండి.

బుచ్చి—మీచేతులో వెయ్యడానికి ఇస్సాము యెవరితాతముల్లె దాచిపెట్టినారు ? సొమ్మువస్తే అంచరమూ పంచుకుందాము.

ఖాద—భాంచోత్ మీరంతా యేకమయి నాసొమ్మ్ర యెగ బెట్టడానికి యేషాల్ యేస్తూవుండార్. ఈయన చెవ్లో యేదో గుస గుసలాడి సొమ్మ్ర ఇదినగకే లాగియేసినాడు. నాపన్నెండు రూపాయల నరా అక్కడపెట్టి మాటాడండి.

బుచ్చి—నేను యేమీ పుచ్చుకోలేదు. కావలిస్తే నాబట్టలు సోదాచూడు.

ఖాద—మాకీ ఏమీ ఖబుర్లతో జరూర్ లేను. మీహిందువులు గాగడీసేసి సొమ్మ్ర మాయంసేసివేస్తార్. నావంతుసొమ్మ్ర అక్కడపెట్టి కదలండి.

సోమి—సాహేబుగారూ ! కొంచెం ఓపిక చెయ్యండి. ఖొదాతోడు. మీసొమ్మ్రకు నేను పూచీపడతాను. తక్కిన సంగతులు ముందుగా కానియ్యండి.

బుచ్చి—మేనేజరుగారు ముసద్దీపేచీ యేలాపెట్టినారో చూచినారా? మనం యింతమందీ యేకమైనా కార్యంలేక వక్కమాటతో అడ్డి వూరుకున్నది

గున్న—ఆసుసామర్థ్యం మరివకరికికాదు. నాలుగుమో స్తర్లు దస్తూరీ వాస్తాము. ప్రత్యక్షంగా తాను వాసింది తనదస్తూరీ కా

దని సాధించి తనతప్పితం ఇతరులమీద తోసివేసేశక్తి యీాయనవద్దనే వున్నది. మనం వక్కఘుడియ యీాయనవద్ద మాట్లాడితే యింటికి వెళ్ళినతరువాత తలలు మార్చినాడేమో అని అద్దంపెట్టి మన ముఖాలు చూచుకోవలెను.

సోమి—అటువంటి మాయోపాయాలూ ఇంద్రజాల మహేంద్ర జాలలూ వున్నవి కనుకనే యెంతలేదన్నా యేవకేజీమీద రోజుకు నాలుగయిదురూపాయలకు తక్కువలేకుండా యేరుతాడు. ముందుగా దక్షిణ ఆయనచేతిలో పడితేనేకాని వక్కపిటీషన్ మీటింగులోకి రాదు.

బుచ్చి—యీాసంగతులు మనకు కొత్తయేమిటి కాని మనం మాట్లాడుకోవలసినసంగతులు మాట్లాడుకుందాము. కామిసెట్టిఅరుగుల విషయంలో అనుకూలంగానే జరుగుతుంది. మొన్నటి స్థలానికి ఆవరణపు గోడవిషయంలోకూడా మన కనుకూలంగా జరిగితే బాగుండును. అదీ పెద్దపద్దే.

గున్న—అందులో మేనేజరుగారుకూడా మనపక్షమే. మనకు తప్పకుండా విజయం కలుగుతుంది డివిజనల్‌కమీషనర్లు సిఫారసుచేసి మెజారిటీ మనమైనప్పుడు మరివకలాగు యెలాగు జరుగుతుంది?

సోమి—తప్పకుండా అందులో మనకార్యం అవుతుంది యెం దరు యేడిస్తేయేమి? సిద్ధసంకల్పులు మీరు తలపెట్టిన కార్యం కాక పోవడంకూడానా? మనం టోలు కంట్రాక్టరుకు యెనిమిదివందలరూపా యలూ రిమీషన్ ఇప్పించడంలో మన యెవరెవరిశక్తి కనపడవలెను. ఇందులో మనం యీాపుపకారం చేస్తే రెండువందల రూపాయలు వక్కసారి ఘుళ్ళుమని చేతిలో పడతవి. మేనేజరు యిదివరకే పెద్ద మొత్తం. మాట్లాడుకొన్నాడు. మనంకూడా అందులో చేరకపోతే

యేదోవకవిధంగా గీటు పెట్టించి గళ్ళగాహి అంతా మేనేజరే మింగి వేస్తాడు.

ఖాద—భాంచోత్. ఆపూ యీడూ మింగివేస్తార్ అనిచెప్పు అంతా మీరే మింగియేస్తూ వున్నారు. అరేమీకీ యీసర్కీ మూడు నాల్గువండాల్ వచ్చాయి. నాకీ వక్కరూపాయీ యిచ్చారులేదు. నా వంతూ నాసేతులో పడాయెయ్యండి తరువాతా మాటలూ ఆడుకొందురుగాని.

బుచ్చ—వుండవయ్యా మేమూ సొమ్మనచ్చే వుపాయమే ఆలోచిస్తూ వున్నాము. మనకు యేమీ దొరకకుండా చెయ్యడానికి మదనయ్య ఇప్పుడు మహోపని చేస్తూవున్నాడు. ముందుగా మనం అతనితాళం పటించవలెను.

గున్న—అద్దే ఆదెంతసేపు? మన మందరమూ యేకమయితే నాలుగునెలలలో మనకు విరోధులుగా వుండేకమీషనర్లు నందరినీ యేరి పారవేస్తాము. మదనయ్య లంచాలు పుచ్చుకుంటూ వున్నాడనీ కంట్రాక్టుదార్లవద్ద కడితేరుస్తూవున్నాడనీ మనవైసుప్రసిడెంటు మెస్టరు తేజీధారగారితో నేను చెప్పి నిప్పంటిస్తాను. మీరందరూగూడా సమయం వచ్చినప్పుడు తలావకపుడకా వెయ్యవలెను. నేను ఇదివఱకే మార్కెట్టు ఇన్‌స్పెక్టరుగారిచేత మనవిరోధు లందరిమీదా బాదులు బాదించినాను. సమయానవస్తే అవిఅన్నీ యెలా పనిచేస్తవో మీరే చూస్తారు. మనము అన్నిపక్కలనుంచీ బాదులు చేస్తే వక్కసారి అవి అన్నీ ఫిరంగీగుళ్ళలాగు తగులుకోవూ? చూడు నాధాక కనుపరుస్తాను. వాళ్లను వొక్కక్కళ్ళనే కమీషనర్ హోదాలోనుంచి తీసివేయించక పోతే నాపేరు గున్నయ్యనాయుడు కాదు.

(అని మీసము మెలివేయుచున్నాడు)

బుచ్చ--మీకంటె ముందర్తిగానే నేను మేనేజరుగారిచేత వాళ్ళమీద వారంట పెట్టించినాను. అంతా లోపల పొగ రాజుతూ వున్నది. యెప్పుడో గభీలు మని మండి పయికి లేస్తుంది. మన వైసు పెర్సిడెంటు శుద్ధబుద్ధావతారముగాని లేకపోతే యీపాటికి వాళ్ళను చీమలిని మాడ్చివేసినట్టు మాడ్చివెయ్యడూ ?

సోమి--మనం యెంతప్రయత్నం చేసినా ఇంకా వాళ్ళదినాలు బాగావుండడంచేత వాళ్ళఆటలు సాగుతూ వున్నవి. ఇంకా యెన్ని దినాలు సాగుతవో చూతాము కాదూ ?

ఖాద--ఆళ్ళదినాలూ లేవు యీళ్ళ దినాలూ లేవు. ఇప్పుడు నా దినాలు భాగాలేవు. నాకే యీరాత్రికే ఫదిరూపాయలు వుండాలె. మీలో యెవరయినా ఇచ్చుకోకపోతే మీఆబురీ దక్కనియ్యను.

బుచ్చ--ముందుగా ఇవ్వడానికి మాదగ్గిర సొమ్మ్ లేదు.

ఖాద -- భాంచోత్ మాకో రూపాయలూ యియ్యకపోతే నేను ఇప్పుడు పోయి మదనయ్యగారితో యావత్తుకుట్రా మనవిచేసి మీమీద సాక్ష్యం పలికి మిమ్మల్ని వకొక్కడినే బొక్కలోకి తోయిస్తాను.

(అని లేచి వెళ్ళుచున్నాడు)

బుచ్చ -- సాహేబు వెళ్ళిపోతూవున్నాడు పట్టుకోవయ్యా పట్టుకోవయ్యా.

(అని అందఱును వెనుక వెళ్ళుచున్నారు.)

ద్వితీయాంకము.

ప్రథమరంగము—ధర్మసావిడి.

[పోలిసెట్టియు, రామిసెట్టియు, గురవయ్యనాయుకును, భీమలింగముకు, కూరచుండియుండగా వంకాయలచందర్మిమ్మ ప్రవేశించుచున్నది.]

పోలి—రామిసెట్టిగారూ! మీరు నాలుగురోజులనుంచి దుకాణం ఎదిలిపెట్టి మహాతిరుగుతూవున్నారు. మీవ్యవహారం ఫరిష్కారం అయినదా ?

రామి—తడిమన్నంతా పొడిమన్నయ్యేట్టుగా యీ నాలుగు రోజులనుంచీ మేనేజరుగారి ఇంటిచుట్టూ తిరగగా తిరగగా వకీలశతమానంతో నేటిదినం ఫరిష్కారమయింది. మేము ఫదిమందీ ఫది ఫదులు వేసుకుని నూరురూపాయలమూటా యీఫుదయూన్న పట్టుకుని వెళ్ళి సమర్పించడంతోటే మానేర్లు లిష్టులోనుంచి తీసివేసినారు.

పోలి—యీ మునిసిపాలిటి బహుఅక్రమంగా వున్నది. అన్యాయంగా ప్రజలసొమ్మ దోచుకుంటూవున్నారు. నేను ముందటియేడు బోలెడుసొమ్మ మేనేజరుచేతులో పోసినాను. ఆసంవత్సరం కాస్తపన్ను తగ్గించినట్లే తగ్గించి నిరుడు సంవత్సరం మళ్ళీ హెచ్చుచేసి జాబితాలో వ్రాసి నోటీసు పంపించినారు. అందుమీద నేను మదనయ్యగారివద్దకి వెళ్ళి యీఅన్యాయం యేమిటని మొత్తుకుంటే సిపు వొక్కదమ్మిడి యెవ్వరికీ ఇవ్వనక్కరలేదు. అప్పీలు చేసుకోమని సెలవిచ్చినారు. అందుమీద నేను అప్పీలు చేసుకుంటే నాఅదృష్టంచేత మంచికమీషనర్లు నలుగురు రావడంచేత హెచ్చుచేసినసొమ్మ కొట్టివేసి యెప్పటి పన్నే ఖాయము చేసినారు. ఇలా ప్రతివేటుగా వీళ్ళకూ వాళ్ళకూ దర్శించుకోవడంకంటె సబ్లీకుగా అప్పీలు చేసుకుంటే మన అదృష్టము

బాగావుంటే పన్ను కొట్టుబడేపోతుంది. మేనేజరూ యిద్దరు కమీషన్లూ చేరి యిన్సూరెన్సు ప్రీమియం పూరికే తయారుచేసి ఫదిమందివర్తకులను పిల్చిపించి యిచ్చినవాళ్లపేర్లు తీసివేసి ఇవ్వనివాళ్లపేర్లు మీటింగులో పెడుతారు.

రామి—అవును. ఆమాట నిజమేకాని అంతధైర్యం యెవరికీ వుండదు. పంకాయలపాపిసెట్టివద్ద పాతికరూపాయలు లంచంపుచ్చుకుని పన్ను యెంతో తక్కువ కట్టినారు. ఫదిసంవత్సరాలనుంచి వక్కమోస్తరుగా సాగివస్తూ వున్నదా లేదా? రెండేళ్లకూ మూడేళ్లకూ వక్కమాటు పన్ను మళ్ళీ యెక్కువ కడతామని బెదిరిస్తూవస్తే నాలుగూ అయిదూ వాళ్లమొగాన్ని పారవేసి నోరణుస్తూ వుంటాడు. అతనికి పోయినవలా మహాపోతే నూరురూపాయలకంటె యెక్కువ వుండవు. పచ్చినకిపాయతు చూడబోతే యెంతలేదన్నా యీఫదేళ్ళల్లోనూ మూడునాలుగువందలరూపాయలకు తక్కువ వుండవు. ముసద్దీలతో కటికట్టడంకంటె వాళ్లచేతులో నాలుగుడబ్బులసొమ్ము పెడితే యెండెందులకూ మంచిది. వాళ్లు తలచుకుంటే యెప్పుడయినా కాస్తవుపకారం చేస్తారు. వాళ్ళమామూలు వాళ్లచేతులో పడకపోతే కార్పణ్యం మనసులో వుంచుకుని యెందులోనైనా పట్టుకొని నొక్కుతారు. మొన్న మాభావమరిది మామూలు నాలుగురూపాయలు ఇచ్చినాడుకాడని శానిటరీఇన్స్పెక్టరు గుమ్మముముందర పొంటవున్నదని ఛార్జీషీటుచేసి రెండునెలలలో ఫదిరూపాయలు జులుమానా వేయించినాడు? అటుతరువాత పిచ్చతవ్వాతో కొలిచినాడని ఫిర్యాదుచేసి యాభయిరూపాయలు పడిపోయ్యించినాడు. అతనిచేతిలో మొట్టమొదటనే నాలుగురూపాయలూ పెట్టినట్టయితే యీఅయిదుగలసీన్లు తప్పేవేనా? తరువాత చచ్చినాళ్లు ఫదిరూపాయలు సమర్పించినాడు.

పోలి—మనం తిన్నగావుంటే యెవరికీ ఝుడియనక్కరలేదు. మనదగ్గిర పిచ్చతవ్వాలు యెందుకు వుంచుకోవలెను? తరువాత కచేరీ చుట్టూ యెందుకు తిరగవలెను? మనం న్యాయంగావుండి యెక్కువ పన్ను కట్టినప్పుడు అప్పీలు చేసుకుని మన లెక్కలు దాఖలుచేస్తే పన్ను తీసివెయ్యక యేమిచేస్తారు?

రామి—న్యాయంగా ప్రవర్తిస్తే వర్తకమే సాగదు. ప్రతిదానిలోనూ కొంచెం అబద్ధం వుండవలెను. మొన్న న్యాయమైన లెక్కలు దాఖలుచేసి తనకు అక్రమంగాకట్టినపన్ను యాభైరూపాయలూ మాపు చెయ్యవలసినదని నరసయ్య అర్జీ యిచ్చుకుంటే అందరూ యెదిగిపున్న సంగతిలో కమీషనర్లందరూచేరి అప్పీలు కొట్టివేసి పన్ను ఖాయం చేసినారు. అందులో యెంత అన్యాయం జరిగింది! మొట్టమొదట మేనే జరుకూ వాళ్లకూ ఫదిరూపాయలు పారవెయ్యలేదు. న్యాయంగా వెళ్ళుతానని భీష్మించుకుని కూర్చోవడంచేత యీఅనర్థం అంతా పొసగింది. అందుమీదట మొన్న బుచ్చయ్యపంతులుగారు కొట్లోకి వచ్చి రెండురూపాయల ఖరీదుచేసే ధోవతులచాపు వూరికే యివ్వమంటే ఆయనకు యివ్వకపోవడంచేత అప్పీలుకూడా ఓపరమైనది. బుచ్చయ్యపంతులుగా రాలెక్కలు దొంగలెక్కలనేటప్పటికి వారి పరివారమంతా వక్కాకీని అని దొంగలెక్కలని వేశారు. అంతటితో న్యాయంగా చెప్పేకమీషనర్లు యేమిచెప్పినా కార్యం లేక మొజారిటీ చెప్పినట్టు అయినది. ఏమయ్యా? గురయ్యనాయుడుగారూ! మీ అభిప్రాయం యేమిటి?

గుర—నేనూ మీ అభిప్రాయంలోనే యేకీభవిస్తాను. మీరన్నీ అనుభవంచేత చెప్పిన మాటలుగాని మరొకటి కాదు. మనం యేలాగో వోలాగు మంచితనంగా వుద్యోగస్థులను సమాధానపరచు

కోకపోతే వాళ్ళు పెట్టేతంటాలు మనం పడలేము. మాకు యాభయి రూపాయలుపన్ను అధికంగా కట్టినట్టు మీ కందరికీ తెలుసును. మా దగ్గిర సరియైన లెక్కలుకూడా వున్నవి. అంతే లాక్ష్యబాధకాలూ చిక్కులూ వుండడంచేత మేమాలెక్కలు పబ్లీకులోకి తీసుకునివచ్చి కనపరచడానికి వల్లకాదు. మేము చేసేది సారాహ్యనహారం. అందులో అనేకమంది బ్రాహ్మలు ప్రతిదినమూ మావద్ద బ్రాందీ జిన్నూ మొదలయినసారాలు బుడ్లాది పట్టుకునెళుతూ వుంటారు. పక్కమాటు బుడ్లుగా కొనుక్కోలేని బీదబ్రాహ్మలు కొట్లోకే వచ్చి గ్లాసుచొప్పున కొనుక్కుని అక్కడనే తాగిపోతారు. వారిపేర్లన్నీ మాచిట్టాలో తగిలి వుంటవి. వక్కసారి ఆబుక్కు బయలపెడితే మరునాటినుంచీ మా వ్యవహార మంతా తొంగుంటుంది. మొదట మావాడు తెలివితక్కువ పనిచేసినాడు. పన్నుకట్టేటప్పుడు వాళ్ళడిగినట్టు యాభయిరూపాయలూ ఆముగ్గురి నలుగురి కమీషనర్లకూ యిచ్చినట్టయితే యేమాసికలూ అక్కరలేకుండా యీయాభయిరూపాయలపన్నూ అప్పుడే తగ్గిపోవును.

పోలి—బ్రాహ్మలు తాగగాలేనిది లెక్కలు చూపిస్తే మహా గొప్పవతప్పితం వచ్చినదా యేమిటి? మనకు కొంచెంనష్టం వచ్చినా న్యాయానికి కట్టుపడి వుండవలెను. కొన్నివేళ్లలో తప్పిపోయినా సాధారణముగా న్యాయమే అక్కరకు వస్తుంది.

భీమ—ఆలాగు అనరాదు. యీప్రపంచంలో సాధారణంగా అన్యాయమే అక్కరకు వస్తుంది. యీవూళ్ళో మునిసిపల్ కమీషనర్ కందుల సోమిసెట్టిదగ్గిర వున్నడబ్బు న్యాయంగా ప్రవర్తించే మీదగ్గిర వున్నదేమో చెప్పండి. లోకంలో డబ్బుపుంటేనే అన్నిగౌరవాలూను.

పోలి—వెధవడబ్బు అటువంటిడబ్బు లేకపోతే యేమిటి? గుణం ప్రధానముగాని డబ్బు ప్రధానం కాదు. డబ్బుమూట పట్టవస్తే మన

– వూళ్ళో బోగం చందసుఖివగ్గిర కావలసినంతడబ్బు వున్నది.

భీమ——నేను చెప్పేనది వక్కడబ్బుమూటే కాదు. యెందులోనూ బంగారానికి టంకంపొడి వేసినట్టుగా యెంత నిజమునా మధ్య నాలుగుఅబద్ధాలు వేస్తేనేకాని అతకదు. న్యాయంగా పోతే అన్నీ తంటాలే వస్తవి. అందరితోనూ విరోధాలే వస్తవి. కేవలం సత్యంతో కూర్చోక కొంచెం లాక్యంకూడా చూడవలెను. మనపట్టేలజాబితాలు అందరికీ నిజమయినవి కనపరుస్తామా? మనం దగ్గిర వుంచుకునేది వకటీ, యితరులకు చూపించడానికి తయారుచేయించేది వకటీని. మనచిత్తాలలో కూడా అమ్మినది వున్నట్టుగా వేసి కొనవచ్చినవారి కల్లా పద్దులు చూపిస్తూవుంటే మనకు యేమునాలాభం వస్తుందీ? మనం రూపాయికి రూపాయిపావలా వేసి కొత్తగా వచ్చినవారికి రూపాయబేడకాడికి యిచ్చి అయినా యెంతోలాభం చేసినట్టు కనపరచవలెను. మళ్ళీ మ్యూనిసిపల్ వారు యెక్కవపన్ను కట్టకుండా మనం దినానికి యాభయి రూపాయలసరుకు అమ్మితే యిరవైరూపాయలసొమ్మే అమ్మినట్టు పయికి కనపరిచి మన లోపాయికారీ లెక్కలలో తక్కినది వేసుకుని రహస్యంగా వుంచుకోవలెను. ఇటువంటి రహస్యాలన్నీ వర్తకులం మనము మనలో వుంచుకోవలసినవేగాని పబ్లీకులో చెప్పదగినవికావు.

పోలి——మనం ఇన్నిదగాలుచేసి ఇన్నితంటాలు పడినాగానీ మనలో వక్కడిదగ్గిరా పట్టుమంటే పదివేలరూపాయలు లేవు. దొరలు చూడు కంపినీలుపెట్టి న్యాయంగా వ్యవహరిస్తే వకటి రెండు సంవత్సరాలలో లక్షలకొద్దిసొమ్మే యెలా సంపాదిస్తారో ! మీరు యెన్ని మాటలు చెప్పినా యెప్పుడూ చిట్టచివరకు న్యాయమే అక్కరకువస్తుందని నానమ్మకము. యేమి చంద్రమ్మా ! అట్టే నిలుచున్నావు. నీ కూరగాయలవ్యవహారంలో లాభం బాగా వస్తూవున్నదా ?

చంద్ర--యేమిలాభమండి బాబూ! అడ్డమునగాడిదకొడు కులూవచ్చి మమ్మల్ని బెదరించి కాయాగట్రా లాక్కు-పోతూవుంటే మాకు అమ్మకానికి యేమివుంటుంది? లాభంయేమివుంటుంది? యేమిటో పూర్వమునుంచీ చేస్తూవున్న వృత్తికావడంచేత విడవలేక యీడ్చుకుని వస్తూవున్నాను. దిక్కు-మాలినంత పనున్నవున్నది. పన్నేచెల్లక పుస్తే పుడకా తాకట్టుపెట్టి సర్కారుకు బాకీలేకుండా చెల్లిస్తూ వున్నాము.

పోలి--నీవు యెప్పుడూ పుచ్చువంకాయలూ చచ్చుబీరకాయలూ కుళ్ళుఅరటిపళ్లూ దుకాణంలో వుంచుతావుగాని మంచివి నీ దుకాణంమీద యెప్పుడూ కనపడవు.

చంద్ర--మంచిపళ్లూ కాయలూ గుమాస్తాలు ఇన స్పెక్టర్లు బంట్రోతులు ఫదిమందివచ్చి గంపదింపడంతోటే పట్టుకుపోతూవుంటే అమ్మడానికి చచ్చువీ కుళ్ళువీగాక మంచివి యెలాగువుంటవండి బాబూ!

పోలి--అలాకాదు. కూరలూ పళ్లూ నీవు మంచివితెస్తే మ్యూనిసిపల్ వుద్యోగస్థులు అడిగిపోతారని నీవు యెప్పుడూ గంపలో పసుకి మాలినవే పెడతావు.

చంద్ర--రామ రామా! అలాచేస్తే పాపంరాదూ బాబూ! మేనేజరుగారు యిప్పుడు ఫదిరూపాయలు తెచ్చుకుంటేనేకాని పన్ను యెక్కువచేయిస్తామంటూవున్నారు. యెవరికయినా అర్జీ యిచ్చుకుంటే కార్యం వుంటుందీబాబూ?

పోలి--నీవు వక్కత్తెవు అర్జీయిచ్చుకోవడంకాదు. ఫదిమంది చేరి మహజ్జరుచేస్తే కార్యంవుంటుంది. రామిసెట్టిగారూ! యిటువంటి అక్రమాలు జరుగుతూ వున్నప్పుడు మీరందరూచేరి మహజ్జరువిషయము యేమయినా ఆలోచించరాదూ?

రావి—వుద్యోగస్థులమీద మహాజరు యిచ్చి మనం యీ వూళ్ళో రెండురోజులు కొంపకట్టుకుని కాపురం చెయ్యలేము. అందుకో మేనేజరుగారు అఫీసుకు వెళ్ళడానికి వస్తూవున్నారు. మనంఅందరమూ యిక్కడ గుంపుచేరి వుంటే యేదో గూడుపుఠాణీ చేస్తూవున్నామని కొంప తీసివేస్తాడు. ఆయన అసాధ్యుడు. వెళ్ళిపోదామురండి.

(అని అందఱును వెళ్ళుచున్నారు.)

ద్వితీయరంగము—మ్యునిసిపల్ ఆఫీసు.

[మొదటివ్యక్తికి సుబ్బిహ్మణ్యముగారును, రెండవవ్యక్తికి వెంకయ్యనాయుడు గారును, మూడవవ్యక్తికి అచ్చయ్యశాస్త్రిగారును పరివేశించుచున్నారు.]

సుబ్బి—వెంకయ్యనాయుడుగారూ ! మేనేజరుగారు పన్నెండు ఘంటలయినది యింకా ఆఫీసుకురాలేదు. ఆయన భోజనంచేసి పరుండి వకనిద్రతీసి నిక్కి నీలిగి తమ మనసువచ్చినప్పుడు ఆఫీసుకు వస్తాడు. మనను పొద్దున్నా మధ్యాహ్నమూకూడా వచ్చి పని చెయ్యమని తోమి వేపుకుతింటూవున్నాడు.

వెంక—అవును. డబ్బాబసక్కమూ వస్తే దొబ్బడము ఆయనా, అడ్డమయిన వెట్టిచాకిరీ చెయ్యడము మనమూను. దొర గుడ్డివాడు గనుక ఆయన ఆడినదల్లాఆటా పాడినదల్లా పాట అయి దినాలు సాగి వస్తూవున్నవి.

అచ్చ—మనుపు తాను ఫదులు పుచ్చుకున్నా నూరులుపుచ్చుకున్నా అడపాదడపా మనచేత్తులోకూడా రెండురూపాయలు పెట్టేవాడు యిప్పు డవీ యెగపెట్టినాడు.

సుబ్బి—మొన్న టోలుకట్టాక్టరుకు నాలుగువందల రూపాయలు రిమిషన్ యిప్పించినప్పుడు బెత్తులలాగు నూరురూపాయలు

వొక్కసారి వొళ్ళో పోసుకొన్నాడుగదా? అందులో సుబ్బిహ్మణ్య ముగారూ కూర కొనుకోమని వక్కపావలాడబ్బులు చేతులో పెట్టిన పాపాన్ని పోయినాడుటయ్యా? బిళ్ళగుమములలాగు రూపాయలుచూస్తే నాకన్ను చెదిరిపోయింది.

వెంక—ఆయన యెంతవచ్చినా గళగ్రాహిగా మింగివేస్తూ వుంటే మనము చాటున గుటకలు మింగుతూ కూర్చుంటాము. యేమి ప్రయోజనము? మీకు మగతనం వుంటే యేది మాకుకూడా భాగము యివ్వావలసినది; యివ్వకపోతే మీరు లంచాలు పుచ్చుకుంటూవున్న సంగతి కమీషనర్లనోటీసులోకి తెస్తామని మీలో యెవరయినా ఘట్టిగా అడగరాదూ? అసలు మీకు అడగడానికి నోట్లో నాలుక లేదు. పుచ్చుకోవడానికి చేతగాక మీరు మూలముసుగులో కూర్చుండి గుసగుసలాడుతారు.

సుబ్ర——మనం కమీషనర్లతో చెప్పుకోవడానికి అసలు కమీషనర్లకు వకటి దిక్కువున్నదీ? కొందరు కమీషనర్లను తీసివేయిస్తామని బెదరించి యిది చెయ్యలేదనీ అది చెయ్యలేదనీ ధోరణితోచెప్పి చివాట్లు పెట్టిస్తాడు. యిఖకొందరు కమీషనర్లూ ఈయనా మమేకమే. వారితోకలిసి వందలకు వందలు కొట్టివేస్తూవున్నాడు. యెక్కడ సబు కమిటీవచ్చినా యీ కమీషనర్లే వుంటారు. యెక్కడ యేమరమ్మతూ యేకొత్తపనులూవచ్చినా యీకమీషనరులే వుంటారు. వెయ్యి యెందుకు? డబ్బువచ్చేది యేమయినావుంటే యీకమీషనర్లు వుండకుండా వుండరు. కమీషనరులే యీప్రకారంగా పావలాకాడినుంచి లంచాలు పుచ్చుకుని అక్రమాలు చేస్తూవుంటే యిఖ ప్రజలకు యేమి న్యాయం దొరుకుతుంది?

అచ్చ—— యిటువంటి కమీషనర్లను వెయ్యడం గవర్నమెంటు

వారిది తప్పితం. కమీషనర్లలో యిలాగంటి యేడుపు వుండబట్టే మేనేజరు నిర్భయంగా యిలాగు జుట్టువిరబోసుకుని తిరుగుతూవున్నాడు. కమీషనర్లు శుద్ధంగావుంటే మేనేజరు యీ ప్రకారంగా ప్రతిదానిలోనూ విచ్చలవిడిగా పుచ్చుకోనడానికి గుండెలు వుంట వండీ ? మెజారిటీకి యిబ్బందిచగొండి కమీషనరులే విస్తారంగా వున్నారు. వారు భోషన వర్షం కురుస్తూవున్నా మీటింగుకు రావడం మానరు. యింగ్లీషువచ్చిన యిద్దరుముగ్గురు కమీషనర్లకుమాత్రం యీయన కొంచెంవిధేయతగా వుండి పుకిి మహాభృత్యుడులాగు నటిస్తాడు. వా రప్పుడప్పుడు మీటింగుకోకివచ్చి తమకు తోచింది యేమిటో చెప్పిపోవడం తప్ప యెందులోనూ జోక్యం కలుగజేసుకోక యేది యెలాగయినా సరే వూరుకుంటారు.

సుబ్ర—వెంకయ్యనాయుడుగారూ ! పూర్వం పిటీషన్ యెండార్సుమెంట్లమీద వచ్చేమామూలు మీకు వదిలిపెట్టేవారు కాదండీ ?

వెంక—అది యెంతండీ? నెలకు నాలుగురూపాయ లయినా తిన్నగా వచ్చేవి కావు. జమీందారయినపిటీషన్ వుంటే పావలా మామూలు యిచ్చి యిండార్సుమెంటు వేగిరం పట్టుకువెళుతారు. శలవు యివ్వ వల్లకాదని వేసినఆర్డరులకు యెంతకాలం వుంచినా వచ్చి యిండార్సు మెంట్లే పట్టుకువెళ్ళేరు. అబిచ్చపురూపాయలు నాలుగూకూడా యీడాదినుంచి నాకు యివ్వకుండా ఆసుహానుభావుడే కాజేస్తూ వున్నాడు. ఆసుహా వ్యాభగ్యమంతా ఆయననే బావుకుని పెద్దకాపురం చెయ్యనియ్యండి. నేను అంతటితో చెడిపోను. నా అదృష్టం బాగావుంటే బేడబేడకాడినుంచీ ఆయనే చెయ్యి చాపుతూవున్నా నేను యేచాటునో నాలుగురూపాయలు యేరుకోలేకపోను.

అచ్చ—మీరంటే మొదటినుంచీ వున్నాగు. యేమూలంగా

నుయినా నాలుగురాళ్లు లాగులాడుతారు. యెందుకూ పనికిరాకుండా వున్న వట్టినిరర్థకుణ్ణి నేనువక్కణ్ణి కనపడుతూవున్నాను. పోనియ్యండి. నాకు దైవంయిచ్చినది యీఫదిరాళ్లే చాలును. మేనేజరుగారికి బాగా దొరికేది యెందులో నండీ?

సుబ్బి—వకదానిలో యేమిటి? అన్నింటిలోనూ దొరుకుతుంది. రోడ్డుకంట్రాక్టులో సగానికిసగంలాభం వున్నది. అందులో కమీషనర్లు సగమూ యీయన సగమూ కడితేరుస్తారు. యిటుకగోడలు పని వేటుగా చేయిస్తే గజానికి రెండురూపాయలకంటె యెక్కువ కావు. యిప్పుడు వీరు నాలుగురూపాయలరేటు వేసి సఖు కాజేస్తూవున్నారు. కంట్రాక్టర్లకందరికీ లోపాయకారీని యీకమీషనర్లతోనూ మేనేజరు తోనూ భాగం వుంటుంది గనుక అంతా కట్టుకట్టి రేట్లు తగ్గించరు. యెవరయినా తగ్గిస్తామని వస్తే వాణ్ణి నానాచిక్కులూ పెట్టి సొమ్మి యివ్వాక పని బాగాలేదని నాలుగుమాట్లు పెట్టినగోడలు తీయించీ వేసినరోడ్డు తవ్వించీ దండుగ తెప్పించి యెప్పుడూ పోటీకి రాకుండా పాడిలిపోయేట్లు చేస్తారు. యీవిధమయినరశ్మి రోడ్లమరమ్మతులోనూ చెరువులూ కాలవలూ బాగుచేయించడములోనూ గట్లు పోయించడంలోనూ యీబాపతుపను లన్నిటిలోనూ వుంటుంది. కొత్తగా స్థలాలు యివ్వడంలో మరీలాభం వుంటుంది. ఖాలీగావున్న సర్కారుస్థలాలు తమవని యెవరిచేతనో పిటీషను పెట్టించి వాటికిచుట్టూ గోడ పెట్టుకోవ డానికి సెలవు యివ్వవచ్చునని తనకు యిష్టులైన యిద్దరుకమీషనర్లచేత ప్రాయించి యేసందడిలోనో ధారచేత. దానిమీద గీటుపెట్టించి ఫదులూ యిరవయిలూ పుచ్చుకుంటారు. కొందరికి యెంతోకాలం నుంచి పన్ను కట్టకుండానే అట్టేవుంచి లోపాయకారీని యేమో పుచ్చుకుని దొంగను తెలుకుట్టినట్టు యేమీ యెరగనివానివలె వూరుకుంటారు. పన్నులూ

యివ్వనివారిని యేమైనా పుచ్చుకుని యేళ్లకొద్ది ప్రాసిక్యూషన్ చెయ్య కుండా వూరుకుండి యెప్పుడో రానిబాకీలకింద చేర్చి కొట్టివేయిస్తారు. అప్పీళ్ళలో వీరందరూ చేరి లంచాలు పుచ్చుకొని పన్ను తగ్గిస్తారు. వక దానిలోయేమిటి? ఆఖరుకు చచ్చు స్కూలుమాష్టరవద్ద రిజల్ట్రగాం టులోకూడా నూటికి ఫదిరూపాయలు చొప్పున కమీషన్ పుచ్చు కోనిదీ సొమ్మి యివ్వరు. దీపాలకంట్రాక్టరువద్ద నెలకు యింతస మామూలు పుచ్చుకోవడమే కాకుండా యింటికి కావలసిన చమురంతా వాడిదగ్గిర పుచ్చుకుంటారు. యిఖ కమీషనర్లతో సంబంధము లేకుండా యీయన స్వంతంగా కడితేర్చేవి యిటికామలూ పెంకామలూ పెళ్ళి పందిళ్ళూ మొదలయినవాటి బాపతు కావలసినంత వుంటుంది. యెన్ని పందిళ్ళు వేసినారో యెన్ని యిటుకామలు కాల్చినారో యెంతసొమ్మి వచ్చినదో కనుక్కునేవారు యెవరు? ఈయన దయతలచి చిత్తాను యెంత జమకడితే అంత.

అచ్చ—యీఅన్ని బాపతులూ నెలకు నూరురూపాయలు గిడత వండీ?

సుబ్ర—ఆ! నూరురూపాయలు మేనేజరుగారికి ముట్టవచ్చును.

వెంక—యెక్కడ నూరురూపాయలండీ? నూటయాభయికి యెక్కువముతవిగాని తక్కువ ముట్టవు. యీబాపతులన్నీ నాచేతికి యిస్తే నూటయాభయికాడికి యివ్వడానికి నేను నాలుగు సంవత్సరాలికి కంట్రాక్టు వ్రాయిస్తాను. అదుగో బడేసాహేబు మేనేజరుగారి పెట్టె తీసుకుని వస్తూవున్నాడు. మనం నోరెత్తుకుంటే వెళ్ళి ఆయనతో రిపోర్టు చేస్తాడు. దస్త్రాలు విప్పి యిఖ మీరు పని చూచుకుంటూ వుండండి.

తృతీయరంగము—లక్ష్మినారాయణగారి యిల్లు

[కమీషనర్లు లక్ష్మినారాయణగారును, బుచ్చయ్యాపంతులుగారును, గన్నయ్య నాయుడుగారును, ఖాదర్‌సాహేబుగారును, మేనేజరుగారును ప్రవేశించుచున్నారు.]

లక్ష్మీ—ఏమండీ మేనేజరుగారూ! మొన్న పడమటికోష్టులో కొట్టించిన యెండుచెట్ల కట్టలన్నీ మీలోపల వేయించుకోవడమేనా మాకు యేమయినా నాలుగు కావిళ్లకట్టలు పంపించడం వున్నదా?

మేనే—ముష్టికట్టలు అవి యేమికట్టలండీ? అన్నీ బాడిదె చెక్కలూ మట్టికట్టలూ రావికట్టలూను. వూరికే పొగరావడమేకాని యేమీవుండవు. అవి బంటోతువాళ్ళు తలానాలుగుమోపులూ పట్టించుకుని వెళ్ళినారు. మీరు కావలిస్తే పల్లపువీధిలోవున్న రెండు చింత చెట్లూ కొట్టించుకొనిపొండి. యిందులో శానిటరీ యిన్‌స్పెక్టరుకు ఫదిమోపులకట్టలు పంపిస్తేనేకాని వూరుకుండడు.

లక్ష్మీ—దానిముండామోసినకట్టలు ఆలాగే పంపింతాము. రేపు దీపాలకంట్రాక్టరుతాలూకు ఫదిమంది చాకలవాళ్ళనూ పిలిపించి సాయంత్రానికల్లా రెండుచెట్లూ కొట్టించివేసి పలచని పేళ్ళుగా చూచి ఫదికావిళ్ళచెక్కలు మూయింట్లో వేయించి వీరి కందరికీ తలా నాలుగు కావిళ్ళా పంపించండి. కట్టలు జారిపోకుండా డివిజన్ బంటోతులను నలుగురినీ దగ్గిర వుండి కొట్టించు మని వుత్తరవు చేయించండి.

మేనే—వాళ్లంతా మహా పొగరెక్కి వున్నారు. మనమాటంటే బొత్తిగా లక్ష్యం లేదు. మనం యేదయినాపని చెపితే యీపనీ ఆపనీ వున్నదని వూరికే సాకులు చెపుతారు.

లక్ష్మీ—వాళ్ళకు వెయ్యిపనులు వున్నా అవి అన్నీ కట్టివేసి

ముందుగా యీపని చెయ్యమని గట్టిగా తాఖీదు చెయ్యండి. కమీషనర్లగారి పనికంటె తక్కినపనులు యెక్కువండీ ? వాళ్ళు మనం చెప్పినపని చెయ్యకపోతే నాతో చెప్పండి. వాళ్ళు తమ నవుకరీలో తిన్నగా పని చెయ్యడం లేదని రిపోర్టుపెట్టి వాళ్లను వెళ్ళగొట్టి వేస్తాను. అక్కడితో వాళ్లరోగం కుదిరి యీలాగంటితిరుగబాటు చెయ్యకుండా అందరికీ బుద్ధి వస్తుంది.

మేనే—అలాగంటిపని చెయ్యడానికి మీలో చేరిక వుండవలెను. మళ్ళీ వాళ్ళు వచ్చి నాలుగురోజులు మీ యింటిచుట్టూ తిరిగి కాళ్ళా కడుపులూ పట్టుకోవడంతోటే మొఖమాటపడుతారు. యేదీ యిప్పుడు గంగులమీద రిపోర్టు పెట్టి రేపటినాటింగులో అతనిపని తీయించి వెయ్యండి మీశక్తి చూతాము.

లక్ష్మీ—దానిమాట తరువాతచూచుకుందాముగాని ముందుగా మనం వచ్చినపని కానియ్యండి.

మేనే—మీ రందరూ నాకు యెందుకు నర్తమానం పంపించి నారో సెలవియ్యండి.

లక్ష్మీ—చల్లకివచ్చి ముంత దాచడం యెందుకు ? బుచ్చయ్య పంతులుగారూ ! మొఖమాటము మాని మీ రంతా నాతో సెలవిచ్చిన సంగతి మేనేజరుగారితో చెప్పండి.

బుచ్చ—మీరే చెప్పండి.

లక్ష్మీ—యెవరు చెప్పినా వకటే మీరే సెలవియ్యండి.

బుచ్చ — అలా కాదు మా అందరితరపునా మీరే సెల వియ్యండి. మే మందరమూ మివ్వాలిని కోరినాము.

లక్ష్మీ—అలాగయితేవినండి. యిప్పుడు మనకు వచ్చినలాభంలో నాలుగోవంతు మేనేజరుగారున్ను మూడువంతులు తక్కిన కమీషన

ర్లున్నూ పుచ్చుకుంటూ వుండడంచేత సగటుమీద మేనేజరుగారికి యెక్కువా కమీషనర్లకు తక్కువా ముడుతూవుం దని వీరంతా చెపుతూ వున్నారు. యేకమీషనరు చేయించేపనిలో వారి వారి. కొక్కరికే ముడుతూ వుండడమూ మీ కందరికమీషనర్లు దానిలోనూ కూడా నాలుగోభాగము వుండడమూచేత మీకు మా అందరికంటెనూ మేధా యెక్కువవుంది అనడానికి సందేహం. లేదు. కమీషనర్లకంటె మ్యూనిసిపల్ నవుకర్లకు యెక్కువముట్టడం నాకూ న్యాయంగా కనపడడం లేదు. మేనేజరుగారూ ! మీపక్షంగా మాట్లాడుకోక యిందులో యిప్పుడు జరుగుతూవున్నపద్ధతి న్యాయంగా వున్నదేమో మీరే సెల వియ్యండి.

మేనే—అయితే యిప్పుడు మీ రనేమాట యేమిటో స్పష్టంగా సెలవియ్యండి. మీరనేమాటకు నాకు అర్థం కావడం లేదు.

లక్ష్మీ—మే మనేది మరి యేమీ లేదు. మీకు యెక్కువగా ముడుతూ వున్నది గనుక నాలుగోవంతు మానివేసి ప్రతిదానిలోనూ మీరు ఎనిమిదోవంతు పుచ్చుకోవడం న్యాయమని మా అభిప్రాయము.

మేనే—యెవరిపుణ్యాం బాగా వుంటే వారికి యెక్కువ దొరుకుతుంది. అందుకు మనం యేమి చేస్తాము ? మీకు యెక్కువదొరికితే మీరు పుచ్చుకోండి. నాకు భాగం లేకుండా మీకు దొరికేబాపతులు యెన్నివున్నవి? ధొరదగ్గిర సముజాయిషీ చెప్పి అన్నీ ప్యాసుచేయించడం డ్యూటీ నాది గనుక నాకు యెక్కువ దొరకడం న్యాయమే. అందులో యేమయినా అవకతవక జరిగితే తంటా ధొరకు వస్తుందా మీలో యెవరికయినా వస్తుందా ? ధొరకు మాటవచ్చినప్పుడు యిలాయెందుకు చేసినా వని ధొర నన్ను అడుగుతాడా మిమ్మల్ని అడుగుతాడా ? జవాబుదారీపని అంతా నాది, యిందులో మీరేమీ ఆశ పడకండి

నేను ధారతో తిన్నగా సరిది చెప్పకపోతే మీకు వక దమ్మిడీ దొరకదు.

లఖీమ్మ—అవి యేమి మాటలయ్యా! మాకు దొరక్కపోతే మీకుమాత్రం దొరుకుతుందా యేమిటి? ఆ బెదిరింపులన్నీ కట్టిపెట్టండి. నిజం దాచివేసి మీరు యిచ్చేతప్పుసముజాయిషీ అంతా మీడబ్బు కోసం యిస్తారుగాని మామీద దయచేత యివ్వరు. మ్యూనిసిపల్ నవుకర్ల జీతాలలోనూ యిటుకామలలోనూ పెంకామలలోనూ సున్నపుబట్టీలలోనూ యింకా యిటువంటి లక్షబాపతులలో మీరు మాకు యేమీ యివ్వడం లేకుండా అంతా కడతేర్చడం లేదూ?

మేనే — బిచ్చపుసొమ్మ్మ అదెంత? మహాదొరికితే ఫది రూపాయలు దొరుకుతవి; యిరవయిరూపాయలు దొరుకుతవి. మీకు మల్లే వందలూ నూర్లూ కడితేర్చడం లేదుగదా? నూకాలమ్మ చెరువు బాగుచేయిస్తామని నూరురూపాయలు పుచ్చుకొని దానిలో వక్క దమ్మిడీ ఖర్చుపెట్టక అంతా కడితేర్చివేసినారు గదా? మీరు చేసినవల్లా మీగోడలు పెట్టించుకోవడానికి యెక్కడా మన్ను దొరకక యీ మిష మీద చెరువులో గొయ్యిపెట్టించి మీకు కావలసినమన్ను తవ్వించుకొని పోయినారు. సత్రింపుయింటికి వెల్ల వేయించడానికి నూరురూపాయలు వొళ్ళో పోయించుకున్నారు గదా? అందులో యిరవయిరూపాయల కంటె యెక్కువ ఖర్చుపెట్టినారేమో చెప్పండి. రహదారీబంగాళా తిరగవేయించడానికి నూటయాభయిరూపాయలు శాంక్షన్ చేయించి పుచ్చుకొన్నారు గదా. అందులో మీరు యెన్నోనంతు ఖర్చు పెట్టినారు? క్రిమపద్ధికారంగా రేట్లు వేసి యిప్పేమొంటు పుచ్చుకొని పని జరిగిన తరువాత పని తెలిసినవారిని యెవరినయినా తనిఖీ చెయ్యమంటే మీ మీపని అంతా బయట పడుతుంది. యిటువంటి రంకులు మీవి లక్ష నాకు తెలుసును. మగ్మమంతా నాచేతులో వున్నప్పుడు నావద్ద గడుసు

తనపుమాటలు చెప్పకండి. పిటీషనర్లూ మీరూ యేకమయి సర్కారు స్థలాలూ బేవరసుస్థలాలూ దొబ్బివేసినవి యెన్ని వున్నవి ? అవన్నీ పయికి కెక్కరిస్తే మీ రందరూ వక్కసారి అగ్నిహారప్రవేశం కావలసి వస్తుంది. తాబేదారుగా వుండి ధార చెప్పినపన్లూ చేసేవాడికి యిందులో నాకు యేమిజవాబుదారీ వుంటుంది ? పోతే మీరుపోతారు వారు పోతారుగాని నాకు యేమీ ఫర్వా లేదు. యెక్కడనైనా పిల్ల గండమూ తల్లిగండమూ వుంటుందిగాని మంత్రిసానిగండము యెక్కడా వుండదు.

లక్ష్మి—పోనియ్యండి. మేనేజరుగారూ వూరుకోండి. మీ అభిప్రాయం యెలాగు వుంటుందో అని మేము వూరికే పరియాచకాని కన్నాముగాని మీరనద్ద మేము సొమ్మ యెక్కవ పుచ్చుకోవడాని కనలేదు. మీరు యిలాగు అనక అలాగే యెనిమిదోవంతే నాకిచ్చి తక్కినదంతా మీరే పుచ్చుకోమనలేమాత్రము మేము పుచ్చుకుంటా మండీ ? మీరు మాఅభిప్రాయం కనిపెట్టడానికయినా వప్పకుని మాట దక్కించుకున్నారు కారుగద ? వూరికే కాలహరణ మవ్వతూ వున్నది. ముందు జరగవలసినమాట చెప్పండి.

మేనే—అది యే విషయమో మీరే చెప్పండి.

లక్ష్మి—నంవత్సరం ఆఖరు గనక యిప్పుడు యిళ్ళపన్నులూ వృత్తిపన్నులూ లయిసెన్సుసన్నులూ కొత్తగా కట్టడానికి వున్నవి. రిపైజు చెయ్యడానికి సమయం వచ్చింది. యిందులో మనకు బోలెడు సొమ్మ దొరుకుతుంది. తరువాత అప్పీళ్ళల్లో కావలసినంతసొమ్మ వస్తుంది. రిమిూషనర్ల జాబితా తయారు చేయించడంలో కావలసినంత సొమ్మ రాబట్టవచ్చును. యింకా యెన్నెనో వున్నవి. మేము యిప్పుడు వూరికే మీమనసు కనిపెడదా మని వేళాకోళాని కన్న

మాటలు నిజంగా పట్టుకొని పూరుకుంటే మీకూ మాకూకూడా నష్టం వస్తుంది. కాబట్టి మనమంతా చురుకుగా పని చెయ్యవలెను.

మేనే—ఇప్పుడు నేను థొరగారింటికివెళ్ళి జరూరుగా సముజాయిషీ యివ్వవలసిన పని వున్నది. యీసంగతులు తరువాత నిమ్మళంగా మాట్లాడుకోవచ్చునులెండి. నాకు కష్టం మహాయెక్కువగా వున్నది. కష్టానికి తగిన రాబడిలేదు. యిందులో మీరు నాకు సహాయం వంతు వదలి పెడితేనేకాని సరిపడదు. మీరే ఆలోచించండి. నేను యిప్పుడు వెళ్తుతాను.

(అని వెళ్ళుచున్నాడు.)

తృతీయాంకము.

పరిథమరంగము—గోవిందరాజులు గారియిల్లు.

[శానిటరీఇనస్పెక్టరును, బంట్రోతు మల్లయ్యగారును, ఒవర్సీయరు రంగయ్యయు, గోవిందరాజుగారును ప్రవేశించుచున్నారు.]

శాని — గోవిందరాజుగారూ! మీరు సర్కారు వుత్తరవు లేకుండా అరుగులూ గోడా కట్టించుకుంటూవున్నారు. పని ఆపుచేయించండి.

గోవిం — లేదండీ. ఇప్పుగో నేను యిండారున్నమెంటు పుచ్చుకొని మరీ పని ఆరంభం చేసినాను. ఈ యిండారున్నమెంటుకోసం ఫదిరోజులు మేనేజరు యింటిచుట్టూ తిరిగి అనుసరించి యెక్కడకూ టికాణా లేకపోతే ఇలాగంటితంటాలు వచ్చిపోతవనే రెండురూపాయలు సమర్పించి మేనేజరుగారిని పంపించి థొరగారిచేత వెంటనే ఆర్డరు వేయించి నిముషాలమీద వాయించి యిండారున్నమెంటు పట్టుకుని మరీవచ్చి

నాను. కావలిస్తే ఇండారున్నమెంటు చూడండి.

శాని—చూడనక్కరలేదు. దానిలో మిాస్థలంలో గోడా అరుగులూ పెట్టించుకోమని వుంటుందికాని అంతకంటె మరేమీ వుండదు. మీరు సర్కారుస్థలం ఆక్రమించుకున్నారు. పని నిలుపు చేయించండి. మల్లయ్యా! కూలివాళ్ళను పని మానివెయ్యమని చెప్పు.

గోవిం—లేదండీ మేము సర్కారుస్థలం వక్క అంగుళమయినా కలుపుకోలేదు. యివిగో యింకా మాపాతహద్దులు కనపడుతూనేవున్నవి చూడండి. వీధివిశాలంగా వుండవలెనని మా స్థలమే అరగజం వదలిపెట్టి అరుగులు లోపలికి జరుపుకొని పెట్టిస్తూవున్నాము. మాకు యివతలపక్కనూ అవతలపక్కనూవున్న అరుగులు యెంత ముందుకున్నవో చూడండి.

శాని—మాకు అవంతా తెలియదు. మీఅరుగులు మునుపు యింకా లోపలికి వుండేవి. మీరు చూపించే పాతఆనవాళ్ళు మీరు యెప్పుడో మట్టివేసి పెంచినవికాని నిజమయినవికావు.

గోవిం—స్పష్టంగా కనపడుతూవున్న గోడసుక్కలు నిజమయినవికావు! దేమే ఆనవాళ్లూలేనిదీ అంబరిస్థలమంకంటెనూ ముందుకు జరుపుకొని నెల్లాళ్ల క్రిందట వీధిమీదికి తోసుకువచ్చేలాగు పెట్టుకున్న ఆకొత్తఅరుగులు సర్కారుస్థలం కలియకుండా కట్టుకున్న నిజమయినవా? మాదానిలో నిజమయినదానికి ఇంత తంటాలు పెడుతూ వున్నారు. నిజమయిన ఆక్రమణం యిలాగు స్పష్టంగా కనపడుతూవుంటే యీవెంకటాద్రివుగారి అరుగులవిషయంలో యేమీ తగాదా పెట్టక మీరు యెందుకు వూరుకున్నారండీ?

శాని—ఇటువంటి బేజారూరుసవాళ్ళు వెయ్యిక యితరుల పేటలు వదిలిపెట్టి నీమాట మీరు చూచుకోండి. వెంకటాద్రివుగారు

సర్కారుస్థలం యేమీ కలుపుకోలేదు. బాగా యెరుగుదుము, మీరు మళ్ళీ మాట్లాడక తక్షణం పని ఆపుచేయించండి. తరువాతమాట చూచుకుందాము.

గోవిం — ఆస్తిగురు మేస్త్రుర్లూ ఇరువదిమంది కూలివాళ్ళూ ఇంతమంది పనిచేస్తూవుంటే యీపని మానిపించి యీరోజుకూలి ఆరురూపాయలూ దండుగపెట్టుకుని వూరుకోనండీ ? న్యాయం బహు బాగావున్నది ?

శాని — యెవరికోసం వూరుకుంటారు ? సర్కారుస్థలం ఆక్రమించుకున్నందుకు దక్కిస్తూ వూరుకోవలెను. ఆరురూపాయలుకాక పోతే ఫదిరూపాయలూ దండుగ వస్తుంది. ఇందుకు యెవరు జవాబు దారీ చేస్తారు ? మీరు పని ఆపకపోయినట్టయితే తిరుగుబాటు నేరం కింద శిక్షఅవుతుంది సుమండీ. ముందుగాచెప్పినాను జాగ్రత్త.

గోవిం — మీరు నామనవి చిత్తగించి కావలిస్తే చుట్టుపట్ల వారిని విచారించి న్యాయం దయచేయించవలెను. ఇప్పుడు పని నిలుపుతే నాకు చాలా దండుగ వస్తుంది. వర్షాకాలం దగ్గరకు వచ్చింది. వక్కసారి వర్షం కురిసిందంటే యీ చేయించిన పసంతా వ్యర్థమయి పోతుంది. మీరు యెలాగయినా కటాక్షించవలెను.

శాని — కటాక్షించడం గిటాక్షించడం నాకు యేమీ తెలియదు. సర్కారుసొమ్ము తింటూవున్నందుకు మేము న్యాయంగా పని చేయవలెను. మీస్థలంవిషయమయి మాకంటె చుట్టుపట్లవాళ్ళకు మహా యెక్కువ తెలుసునా యేమిటి ? యీ వూళ్ళోస్థలాలవిషయమయి మాకు తెలిసినట్టు మరియెవరికీ తెలియదు. రంగయ్యా ! మనకు మాటలతో ప్రయోజనంయేమి? పీరిపేర్లు వ్రాసుకో. తరువాత మేజస్ట్రీటువద్ద పోలీసికూటుచేతాము. మీరు మామాటవినకుండా నిర్లక్ష్యం

చేసి అరుగులు పెట్టిస్తట్టయితే మీకు జనుమూనాపడడమే కాకుండా అరుగులూ గోడా తప్పించి పడగొట్టివేయిస్తాము సుమండీ. (అని పది బారలునడిచి 'మల్లయ్యా' అని పిలుచుచున్నాడు.)

మల్ల—చిత్తము. వస్తూవున్నానండి. —గోవిందరాజుగారూ ? ఆయన రిపోర్టుచేస్తే మీకు చెడ్డతంటా వస్తుంది. ఆయనతోకూడా వెళ్ళి మాట్లాడుకుని నాలుగురూపాయలసొమ్ము చేతులో పెడితే యేతంటా లేకుండా సరిపోతుంది. అలాచెయ్యండి.

గోవిం—అయ్యా ! ఇన్‌స్పెక్టరుగారు ! నేను వస్తూనేవున్నానను మనవండి. ఏక్‌నిమిషం దయచెయ్యవలెను.

(అని పరుగెత్తుచున్నాడు.)

శాని—ఏమయ్యా ఇంతలోకే మళ్ళీ యేమి మనవి వచ్చింది ! మాకు అవతల చాలాపని వున్నది. వెళ్ళనలెను. వేగిరం చెప్పివెయ్యండి.

గోవిం — తమకు యేమైనా ఇచ్చుకుంటాను. అభ్యంతరం చెప్పక పని జరిగించుకోవడానికి సెలవిప్పించండి.

శాని — ఇంత గందరగోళం జరిగించకపోతే చాటుకు పిలిచి ఆమాటే మొట్టమొదట నాతో చెప్పరాకపోయిందీ ? న్యాయమైతే మాత్రము మాతో మాట్లాడి మమ్మలిని సమాధానపరచకపోతే పని సాగుతుందీ? మేనేజరు తానుమాత్రం దొబ్బి మాకు యేమీ లేకుండా చెయ్యవలె ననుకొన్నాడూ? అతను మిమ్మలిని బుట్టలోపెడితే మేము లోకమందరినీ బుట్టలో పెట్టినవాళ్ళము. తెల్లవారి లేస్తే మాకు యిదే పని. మీరుమమ్మల్ని మోసం చెయ్యగల రండీ? యేకమీషనర్లు శాంక్షన్ యిచ్చినా, యేమి చేసినా వాగితో యేనీ లేదు. పని అంతా మాతో వున్నది. మాచేతులో పడేది పడకపోతే ఫదిగజాలు తమస్థలం వదిలిపెట్టినాకిందా మీదా పెట్టి యేవో చిక్కులు పెట్టి పనిజరగకుండా

ఆటంక పెడుతాము. మగాచేతులో పడేది పడ్డట్టయితే నాలుగుగజాలు వీధి కలుపుకున్నా చూచీచూడనట్టు వూరుకుంటాము. కమీషనర్లకు అర్జీ అయినా లేకుండా వూళ్ళో యెన్నిస్థలాలు మేము అరుగులు పెట్టుకోవడానికి ఇచ్చివేసినాము. యెవరైనా తగాదాకువస్తే యీ అరుగులు పూర్వమే వున్నవి అంటాము. మీపొరుగువాడు వెంకట్రావు గారికి అరుగులకింద రెండుగజాలస్థలం ఇటిపొడుగునా నేను ఇచ్చినాను. యెవరు యేమిచేసినారు? ఇక్కడికే చాలపొద్దు యెక్కింది. జాప్యం చెయ్యక ఇందులో మీరు యేమి యిస్తారో చటపట చెప్పివెయ్యండి.

గోవిం—నాలుగురూపాయలు ఇస్తాను. తమరు మళ్ళీ యేమీ సెలవియ్యక వప్పుకోవలెను.

శౌని—ఇందులో ఫదిరూపాయలకు తక్కువపుచ్చుకోవలసినది కాదు. అయినాకానీ మీరూ మేమూ వక్కవూళ్ళో వున్నాము. తెల్లవారిలేస్తే అనేకపనులు వస్తూవుంటవి గనుక అందుకే వప్పుకున్నాను. మరిగత్తె ఇందులో నేను మీకు చేసేలాభంమాట యెప్పుడూ మరిచిపోకూడదు సుమండీ ?

గోవిం—చిత్తము. నేను యెప్పుడూ అలా మరిచిపోయేవాణ్ణి కాను. సెలవు పుచ్చుకుంటాను.

శౌని—మంచిది. వెళ్ళి రూపాయలు మల్లయ్యచేత పంపించి మీపని మీరు యథాప్రకారంజరిగించుకుంటూ వుండండి. బంటోతుల మామూలుమాట అందరికీ తెలిసిందే. నలుగురికీ నాలుగుపావలాలు రూపాయకూడా మల్లయ్యచేతి కివ్వండి పొండి.—మల్లయ్యా ! పంతులు గారితో వెళ్ళి మళ్ళీ మమ్మల్ని వీధిచివరను వేగిరం కలుసుకో.

మల్ల—చిత్తము. (అని రూపాయలు పుచ్చుకొని వచ్చి కలిసికొనుచున్నాడు.)

శాని — మల్లయ్యా ! వూళ్ళో యేవీధిని యెవరు గోడలూ అరుగులూ పెట్టుకుంటూవున్నా తక్షణం వచ్చి మాకు రిపోర్టు చెయ్యి: మనకు యేమునా విశేషంగా లాభిస్తే ఇందులోనే. ప్రతివీధీ ప్రతిగల్లీ తప్పకుండా తిరిగి యెక్కడ యెవరు కాస్తగోడ కదిపినా తక్షణం మా జాహీరులోకి తీసుకురావలసిన దని బంట్రోతు లందరితోనూ చెప్పు. ఇప్పుడు చాలా యెండ యెక్కింది. మేము రాలేము. నీవు సోమవారపు పేటలోకి వెళ్ళి పెళ్ళిపందిరిగలకలు తవ్వకుండ ఆటంక పెట్టు. పెళ్ళి పందిళ్ళకు యిండారుమొట్లు పెళ్ళి అయిన కొన్నిదినాలకు కాని సాధారణంగా రావు. వారు రూపాయి చేతిలో పడవేసినట్టయితే అభ్యంతరం పెట్టక పందిరి వేసుకోనిచ్చి రూపాయి మాఇంటికి తీసుకుని వచ్చి యివ్వు.

మల్ల — చిత్తము. బుచ్చయ్యఅరుగులు తీయించి వెయ్యవలసిన దని కమీషనర్లు వుత్తరవు చేసిరా రట. నాలుగురూపాయలూ యిచ్చుకొన్నా యింతే అయిం దని మహాయేడుస్తూవున్నాడు. నిన్ను తమదర్శనానికివస్తే బసలో లేకపోయినారట.

శాని — అతనితో ఫర్వాలేదని చెప్పు. కమీషనర్లు వుత్తరువు యిస్తే అమలు జరిగించేవాళ్ళము మేముకాని వాళ్లు కాదు. వూళ్ళో యిలాగంటివి లక్ష అమలు జరిగించకుండా మేము వదిలి పెట్టినాము. నీవు వెంటనే మాయింటికిరావలెను సుమా ! మాదొడ్లో పందిరి వెయ్యవలెను.

మల్ల — వైసు పెర్సిడెంటుగారు నిన్నసాయంకాలమువచ్చి పడమటి వీధి చూచి అది మహాకశ్మలంగా వున్నది యిరోజున .నన్ను దగ్గిర వుండి తుడిపించమన్నారు. ఆపని చేయించవద్దండీ ?

శాని — వెధవపని అందులో దొరికేదీ పెట్టేదీ యేమైనా

వున్నదా? మాట్లాడ కూరుకో. ఇంతట్లో ధొరగారు మళ్ళీ వచ్చి ఆవీధి చూడరు. వకవేళ చూచినా వకమాటు తుడిపించినా వీధివాళ్ళు మళ్ళా ఖచారా చేసినారని చెప్పపచ్చును వూరుకో. పాదుతీగెలు పడిపోతూ వున్నవి. మాపందిరి బహుజరూరు. పంది రయ్యేటప్పటికి మధ్యాహ్నం గడ్డి పోగుచేసేవేళ అవుతుంది. నిన్నటి మోపు మహాచిన్నదిగా వున్నది. వక్క ఆవుకే సరిపోయింది కాదు. యీరోజున నీవు స్వంతంగా వెళ్లి పచ్చగడ్డిమోపులవాళ్ళచేత తలామరికాస్తా వేయించి పెద్దమోపు కట్టించి పట్టించుకొని రా. వాళ్ళు తిన్నగా వెయ్యకపోతే వీధిలో పెట్టి అమ్మితూవున్నారని రేపు వాళ్ళ నందరినీ పోలీసికొయ్యాటు చేతాము. నీవు వెళ్ళి రా. భోజనపువేళ అయింది. మేము యింటికి వెళుతాము. వారముదినముల డయిలీ అట్టే వున్నది. యేదో వకటికల్పించి పూర్తి చేసి రేపటిమీటింగుకు తయారు చెయ్యవలెను.

(అని వెళ్ళిచున్నాడు.)

ద్వితీయరంగము—గోవిందరాజుగారి సావిడి.

[కామిసెట్టియు, గోవిందరాజుగారును, వెంకట్రాజును, గంగయ్యనాయుడును, వ్యాఘ్రీవుభానులుగారును, భీమారావుపంతులుగారును, మరికొందఱును పరివేశించుచున్నారు.]

కామి—గోవిందరాజుగారూ! యీరోజు మీటింగులో చెయ్యవలసినపని యేమిటి?

గోవిం — మరి యేమీ లేదు. మ్యూనిసిపల్ కమీషనర్లను యేర్పరచుకునే అధికారం జనులకు యిప్పించవలసిం దని పన్నులు చెల్లించేవా రందరూ దస్కతులు చేసి గవర్నమెంటుకు మన గ్రామం నుంచి మహజ్జరు పంపించడానికి. ఈమ్యూనిసిపాలిటీలో జరుగుతూవున్న

అక్రమాలన్నీ మీరు చూస్తూవున్నారు గదా ?

కామి — తప్పకుండా మహాజరు పంపించవలెను. ఇప్పుడు కమీషనర్లు మహా దోచుకుంటూ వున్నారు. నావద్ద—

భీమా—అలాగంటిసంగతులు పదిమందిలోనూ చెప్పకు తంటా వస్తుంది. మనం యీ యిరవయిమందితోనేనా మీటింగు చెయ్యడం ?

గోవిం—మామనుషులను అందరియిళ్ళకూ తిప్పినాను. యెంతో మంది వస్తామని నాతో చెప్పినవాళ్ళే రాలేదు. ఇటువంటివిషయంలో మనవాళ్ళకు శ్రద్ధ లేదు.

గంగ—నాకు తెలియక అడుగుతాను చెప్పండి. యేర్పరుచుకునే అధికారం గవర్నమెంటువారు ప్రజలకుయిస్తే దానివల్ల మనకు పలికే వెకుంఠం యేమిటి ?

గోవిం—మదనయ్యగారూ నాగభూషణరావుగారూ మొద లయినవారివంటి మంచికమీషనర్లను మనం యేర్పర్చుకోవచ్చును. అటువంటివారు వస్తే అక్రమాలు యేమీ జరిగక అందరికీ న్యాయం దొరుకుతుంది.

వ్యాఘ్రా — అటువంటివారు కమీషనర్లయితే ప్రజల కేమీ లాభం వుండదు. వాళ్ళకు దేవబ్రాహ్మణభక్తి లేదు. నేను మొన్న యిల్లు కట్టుకుంటూ వీధిఅరుగులకోసం వీధిలోది సరాసరుస్థలం రెండు గజాలు యిప్పించ మని బతిమాలుకుంటే తమపుట్టి మునిగిపోయినట్లు వేదం చదువుకున్న బ్రాహ్మణ్ణి అని అయినా చూడక వల్లపడవన్నాను.

గోవిం—వీధిలో స్థలాలు కలుపుకుంటే వీధి యిరుకయి బళ్లు వెళ్ళడానికి యిబ్బంది కాదటయ్యా ?

వ్యాఘ్రా—ఏమీ యిబ్బంది లేదు. వూళ్ళో మావీధికంటె యిరుకుసందులు లేవూ? మావీధిలో రెండుబళ్ళు అవ్యాహతంగా వెళ్ళ

డానికి స్థలంవున్నది. నాకు రెండుగజాలుస్థలం యిచ్చినా వక్క-బండీ నిరభ్యంతరంగా వెళ్ళవచ్చును. సర్కా-రుస్థలంగాని వాళ్ళతాతలు సంపాదించినది యేమునా భూదానం చేస్తారా యేమిటి ?

గోవిం—సర్కా-రుస్థల మయితేమాత్రం యుక్తాయుక్తామక్క-ర లేదండీ ?

వ్యాఘ్రా—వాళ్ళ యుక్తాయుక్తాలు యేడిసినట్టే వున్నవి. బ్రాహ్మడికి భూమి యివ్వడంకంటెనూ యుక్తం యేమి వున్నది? అడిగితే నాలుగురూపాయలు వాళ్ళమొఖాన్న పార వెయ్యడానికికూడా నేను సిద్ధపడినాను. వాళ్ళ నాలుగుడబ్బుసొమ్మ తిని అయినా పరోపకారం చెయ్యడం యెరగరు. వాళ్ళు వట్టి కరోక్-టకులు. వాళ్ళ మాట దక్కించుకున్నారు కారుగాని నేను వెళ్ళి బుచ్చయ్యపంతులుగారితో మనవిచేసుకుంటే ఆమహారాజు నావద్ద యేమీ పుచ్చుకోకుండానే గున్నయ్యనాయుడుగారితోనూ సోమిసెట్టిగారితోనూ చెప్పి ఆకీరాతులు వూళ్ళో లేనప్పుడు నాపిటీషన్ మీటింగులో పెట్టించి అరుగులకు శాంక్షన్ యిప్పించినారు. ఎందుకయినా జనుల కష్టనిష్టూరాలు తెలిసిన బుచ్చయ్యపంతులుగారివంటి కమీషనర్లు వుంటేనే లాభం వున్నదిగాని దయాదాక్షిణ్యాలు లేని నాగభూషణరావుగారు మొదలయినవారివంటి కరోక్-టకులు కమీషనర్లుగా వుంటే ప్రజలకు యేమీ సదుపాయం లేదు.

గోవిం—మీరంటే లాభంపొందినారు గనుక యిలా అంటూ వున్నారుగాని వీధిలో యిటునుంచి వకబండీ అటునుంచి వకబండీ నస్తే యెటువెళ్ళడానికి వల్లకాక యెంత యిబ్బంది కలుగుతుంది ?

వ్యాఘ్రా—బ్రాహ్మణవీధులోనుంచి అసలే బళ్ళు రానియ్యకూడదు. యీ దిక్కు-మాలిన బళ్ళరహదారీ మూలంగా మొన్న

కట్టించుకున్న మావీధిఅరుగు లన్నీ వారానికి రెండుసార్లు పడిపోతూ వున్నవి. మెత్తుకోలేక చస్తూవున్నాము మునుపు మావీధిని బళ్ళను గాని మాలవాళ్ళనుగాని నడవనిచ్చేవాళ్ళమయ్యా ? మీరు మహా అక్రమాలు అంటారుగాని ఆకమీషనర్లు చేసే అక్రమాలు యేమిటో నాతో చెప్పండి. యెవరివృత్తి యెవరు మానుతారు ? లంచం పంచం తినడం వుద్యోగధర్మ మవునా కాదా ?

గోవిం—ఇప్పుడు జరుగుతూవున్న అక్రమాలు లక్షలూ కోట్లూ వున్నవి. రోడ్లు మరమ్మతు చెయ్యడానికి సొమ్ము ఖర్చువాసి తిన్నగా బాగుచేయించకుండా అదంతా లోపాయికారీని కంట్రాక్టరులూ తామూ కడితేరుస్తారు. వీధులలో లాంతర్లు వెలిగించడానికి యెంతో చమురు ఖర్చువాసియించి లాంతర్లలో తగినంతచమురు పోయించక తమ యిళ్లవద్దదీపాలలో పోయించుకుంటారు. వీధులలో దీపాలు చమురు లేక పెట్టడంతోటే ఆరిపోయి వీధంతా చీకటిగా వుంటుంది. బీదవాళ్ళు తాటాకుగుడిసెలు వేసుకోవడానికి సెలవియ్యక తంటాలు పెట్టి వాళ్ళను యేడిపించి వాళ్ళవద్ద రూపాయీ అర్ధా పుచ్చుకుంటారు. లేనిపోనివాళ్ళకు వృత్తిపన్నులు——

గంగ——మీమాటకు అడ్డం వస్తాను. ముందుగా నాప్రశ్నకు జవాబు చెప్పండి. ఈఅక్రమా లన్నీ మనం యేర్పరుచుకున్నవాళ్ళే చేస్తే అప్పుడు యేంచేస్తారు ?

గోవిం——మనం యేర్పరుచుకున్నవాళ్ళు వక్క-సారి అక్రమం చేస్తే రెండోసారి వాళ్ళను మనం మళ్ళీ యేర్పరుచుకోము. ఆభయం చేత వారు జాగ్రత్తగా ప్రవర్తిస్తారు.

గంగ——మీరు నూరనండి వెయ్యినండి. లంచాలు పుచ్చుకునే కమీషనర్లు వుంటేనే మనకు లాభం. వాళ్ళు నాలుగుడబ్బులు తిన్నా

వుపకారం చేసి మరీ తింటారు. ఏమీ తినకపోతే వూరికే వూరంతా తిరిగి కమీషనరుగా వెట్టిపని చెయ్యడం వారికి కంచిగరుడసేవా యేమిటి ?

వ్యాఘ్రా—మీరు బహుబాగా అడిగినారు. మీతో నేను పూర్తిగా యేకీభవిస్తాను. లంచాలు పుచ్చుకునేవాళ్ళు వుండడమే యెందెందులకూ మంచిది. యిల్లు కట్టుకుని వూళ్లో కాపురం చేసేటప్పుడు యే లోపాలయినా వుంటవి ! యేవుపకారమయినా కావలసివస్తుంది.

వెంక—శాస్త్రులగారు బహు తెలిసినవారు. ఆయన చెప్పినట్టే మేము నడుచుకుంటాము. మీటింగుఅక్కరలేదు. వెళ్ళుదాముపదండి.

గోవిం—ఏర్పరచుకునే అధికారం మనచేతులో వుంటే ఆ లంచాలు పుచ్చుకునే కమీషనర్లయినా మనం చెప్పినట్టు వింటారు. మహాజరు తప్పకుండా పంపించవలెను.

వ్యాఘ్రా—మదనయ్యగారినీ నాగభూషణరావుగారినీ యెప్పుడూ కోగకుండా వుండేటట్టయితే నేను మహాజరులో దస్కతు చేస్తాను.

భీమ—మహాజరు తయారుచేయించండి. రేపు మళ్ళీనవస్తాము.

(అందఱును లేచిపోవుచున్నారు)

కామరూపమంత్రము

ప్రథమాంకము.

ప్రథమరంగము—జంబుకేశ్వరవర్మగృహము.

[జంబుకేశ్వరవర్మయు, రాజరత్నముఖు ప్రవేశించుచున్నారు.]

జంబు—నీ వెనుకటిప్రయత్నమును పూర్ణముగా వదిలిపెట్టి తివిగదా?

రాజ—మొదలంట విడిచినాను.

జంబు—నీవు నీ తల్లిగర్భములో నుండగానే మన బ్రహ్మసిద్ధాంతి నాకు పుత్రుడు కలుగునని చెప్పినాడు. ఆయన మహా తపశ్శాలి. ఆయన యన్నమాట యమోఘమనుమా!

రాజ—ఆయన తపోమహిమ నాకు తెలియదా? ఆయన చెప్పినజ్యోతిషమును బట్టియే నేను మీ కిటునంటిపుత్రుడను పుట్టినాను.

జంబు—తల్లిపోయిన బిడ్డను నిన్ను బహుకష్టపడి పెంచినాను. నీవు నీ వెట్టియాలోచనను విడిచిపెట్టబట్టిగాని పోకపోయినయెడల నీ మాతామహార్జిత మైనధనము నపహరించనలెనని నోళ్ళు తెఱచికొని యున్న నీతాతజ్ఞాతు లింతకు ముందే యానందభరితులై పొంగుచుందురుసుమా. ఇంతవఱకును వారి కన్నులను గప్పిపుచ్చి కప్పిపుచ్చి గాని యిప్పుడు నీసహాయముచేత నిశ్చయముగా వారినోళ్ళలో మన్ను వేసినాను. ధనములో నెంతమహిమ యున్నదనుకున్నావు "ధనమూల మిదంజగ" త్తన్న వాక్యము నీవు వినలేదా?

రాజ—వినాను. మీరన్నది నిజమేకాని సుఖప్రదముగాని

ధనమువలన బ్రియోజన మేమి? ధనమువలన గలుగవలసిన ప్రియోజన మంతయు సుఖమేకదా ? సుఖమునకు భంగము కలిగించునది యా నేని అట్టిధనమును విడుచుటయే ధర్మము.

జంబు—నీవింకను ధనముకంటె సుఖమే యెక్కు-వనుచున్నావు. నీ వెనుకటికోరిక నీమనసులో మొగలంట నణింపలేనని తోచుచున్నది.

రాజ—నిజము చెప్పుచున్నాను. ఇప్పు డాప్రియోజ్ఞము నా మనస్సులో లేనేలేదు. ఇప్పుడు నేను పూర్ణముగా కొత్తదారికి వచ్చినాను.

జంబు—ఈమాట నీనోటినుండి విని నాచెవులు చల్లపడినవి. ధనముతో సమానమయినది లోకములో నేదియు లేదు. వేయిసుఖములు పోయినను ధనమును పోగొట్టుకోరాదు. నిత్యమును కన్నుల పండువుగా ధనమును చూచుచుండుసుఖమును మించిన సుఖము మఱియేమున్నది ? సంచులలో గల్లుగల్లునని రూపాయలమ్రోత వినుచుండుట చెవులపండువు కాదా ? మన క్షత్రియకులమున బుట్టిన వారికి మనకింతయున్నది చాలదా యని ధనవిషయమున తృప్తియుండ రాదు. "అసంతుష్టా ద్విజా నష్టా స్సంతుష్టా ఇన పార్థివా" అని చెప్పిన పూర్వులు వెఱ్ఱివారనుకొన్నావా ?

రాజ—వారు వెఱ్ఱివా రనుకోలేదుగాని నేనుమాత్రము నా యభిప్రాయమును సుఖముకంటె ధన మెక్కు-వ యున్నయుద్దేశముతో మార్చుకోలేదు.

జంబు—మఱి యేల మార్చుకొన్నావు ?

రాజ—నాసుఖముకంటెను జనకాజ్ఞ నా కెక్కు-వయినది. యావజ్జీవమును కష్టముల కైన నోర్వవలెనుగాని యవిలంఘనీయమైన తండ్రియాజ్ఞను మీఱరాదన్న పితృభక్తిచేత మానుకొన్నాను.

జంబు—నీవన్నది పరిహాసపుమాట కాదుగదా?

రాజ—నామాటయం దంతనమ్మకము లేనియెడల మీయిష్టము వచ్చినట్లు భావించుకొనుడు.

జంబు —పిత్రాజ్ఞాపరిపాలనమునందు శ్రీరాములను మించిన బిడ్డను గనుటచే నే నిప్పుడు కృతార్థు డయినాను. నీకు కన్యల నిచ్చెద మని యెందఱో తిరుగుచున్నను నామనస్సులోని భయముచేత—

రాజ —గతమును గూర్చి విచారించిన ప్రయోజనము లేదు. ముందు జరుగవలసిన పని చూడుడు. సత్రములో దిగియున్న యోగిని మీరాహ్వానము చేసినారా?

జంబు—ఆయన తపస్సంపన్నుడేకదా?

రాజ—మహాతపస్సంపన్నుడు. ఆయన బ్రహ్మతేజమును మీరు చూడలేదా? తపశ్శక్తిచేతనే కాకపోయినపక్షమున, మేలిమి బంగారు నపహసించెడు పసిమిచాయ యాయన కాయమున కెట్లు వచ్చినది? గడ్డమంతయు తెల్లపడినను దేహమున నొక్క ముడుతయైనను లేక పోవుటనుబట్టియైనను మీరా మహాత్ముని తపోమహిమను కనిపెట్టలేదా? ఆయన మహా మంత్రసిద్ధుడు.

జంబు—అంతటి మంత్రసిద్ధుడా? ఈకలియుగములో మంత్ర మహిమలు ప్రత్యక్షముగా కనబడునా?

రాజ — ఇటువంటి మహానుభావులవద్దమాత్రము కనబడును. పుత్రులులేనివారికి పుత్రులను కలిగించెడి మహామంత్ర మాయనవద్ద నున్నది. మనుష్యులను కామరూపములనుజేయు దివ్యమంత్ర మాయ నకు సిద్ధించినట్లు నేను రహస్యముగా దెలిసికొన్నాను. ఇది పరమరహ స్యము. నాకుతప్ప నన్యులకు తెలియదు. నేను కొన్నిదినము లాయన వెంటనుండి స్వీయమంత్రశక్తిచేత నామహామహుడు నిజరూపమును

మార్చుకోగలుగుట నేను మాయోపాయముచేత కనిపెట్టినాను.

జంబు--ఆమంత్రిమొక్కటి నీయందు ప్రయోగించిన--

రాజ--వేయిమాట లెందుకు? ఆయనను దెచ్చి మనయింట నుంచి నన్ను శిష్యునిగా నుంచితిరా శుశ్రూషచేత నే నాయనను మెప్పించి పూర్వము దూర్వాసునివలన సంతానమంత్రమును కుంతీదేవి గ్రహించినట్లుగా కామరూపమంత్రమును సమర్థముగా నుపదేశము పొందెదను. అప్పుడుగాని నాశక్తి మీకు దెలియదు.

జంబు-- మంత్రప్రభావముచేత స్త్రీలు పురుషులును పురుషులు స్త్రీలును అగుదురా?

రాజ-- స్త్రీలను పురుషులనుగాను పురుషులను స్త్రీలనుగాను మార్చుట యేమివింత? ఆయన తలచుకొన్నపట్టున మీరు చూచు చుండగానే జనులనందఱిని గాడిదలనుగా మార్చగలడు.

జంబు--ఆయద్భుతము నేను చూడవలెను.

రాజ-- ఇప్పుడేపోయి ప్రార్థించి మీరాయోగిని మనగృహము నకు తోడ్కొనిరండు. ఆయద్భుతమును మీ రల్పకాలములోనే చూడ గలరు; పొండు.

జంబు--నీవు లోపలిగది యోగిజనులుండుటకు తగినట్లు చేయు చుండుము. నే నింతలో పోయి యోగీంద్రుని ప్రార్థించి తోడుకొని వచ్చెదను.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయరంగము—జంబుకేశ్వరవర్మ గృహములోని గది.

[చిదానంద యోగీశ్వరుడును, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

చిదా—ఓ రాజకులరత్నమా ! నీతండ్రి నిత్యమును కామరూపమంత్రిమని పలవరించుచున్నాడు. ఇన్ననాళ్ళనుండి శుశ్రూష చేయుచున్నావు గదా ? నా కామరూపమంత్రిమహిమను నీవు కని పెట్టినావా ?

రాజ—మీ మహిమను ముందుగా నే యెఱిగియుండబట్టి నేను కనిపెట్టగలిగితినిగాని మీ కామరూపమహిమ నెవ్వరు కనిపెట్టగలరు? మీమహిమ లితరులకు దురూహ్యములు. కుసుమకోమలమైన మీ లేత దేహమున చామరమునుబోలిన యీ ముసలిగడ్డ మెప్పు డెట్లు మొలచినదో యెవ్వరికి గోచర మగును ? ఇట్లు కొన్నిదినములు గాక మీకు నిరంతరసేవచేయు భాగ్యము సంభవించినప్పుడుగదా నేను కృతార్థతబొందుదును!— ఎవ్వరిదో యడుగుల చప్పుడువలె నున్నది. (ఆలకించి) లేదు లేదు. మనస్సులో శంకించుచున్నప్పు డూరక యిట్టి భ్రమ కలుగును.—నిన్న మీ రుపదేశించినమంత్రమును నేను చక్కగా గ్రహించినాను. మన మంత్రిరహస్య మెవ్వరికిని తెలియ గూడదు. ఇక దానిని ప్రయోగించవలెను. దాని సిద్ధినిషయమున నాకు సందేహము లేదు.

[జంబుకేశ్వరవర్మ ప్రవేశించుచున్నాడు.]

జంబు—(తనలో) ఈబుష్కేశ్వరుడు మన రాజరత్నమునకు మంత్రోపదేశము చేసినమాట చెవినిబడి నేను చరితార్థుడ నయినాను. అయినను నేనిది విననట్లు నటించెదను. రాజరత్నమునస్సు నిజము గానే తిరిగినది. నే నిక నారాయణవర్మవిషయమున భయపడవలసిన పని లేదు. (అనుకొనుచు సమీపించి) స్వామీ ! దేవరకు పరిచర్య

చక్క-గా జరుగుచున్నదా ?

చిదా—(తనలో) ఇప్పుడు విసుబడ్డది యితని అడుగులచప్పుడే. సందేహము లేదు. ఇతడు మా సంభాషణమును వినియుండునుగాని యర్థమును గ్రహింపగలిగి యుండడు. (ప్రకాశముగా) ఇటువంటి యపూర్వ పరిచర్యాసుఖమును మే మిదివఱి కేశిష్యులవలనను బొంది యుండలేదు. ఈయవ్యాజసపర్యకు మాహృదయు మానందించినది. నీమనోరథము శీఘ్రముగానే సఫలము కాగలదు.

జంబు—ఓ మహానుభావా ! సఫలమయినదనియే సెలవిండు. మంత్రోపదేశము చేసితి రన్నశుభవార్త నేను పొంచుండి యిప్పుడు మా రాజరత్నము నోటినుండి విని కృతార్థుడ నయినాను. నేను జేసిన యాయపచారమును మన్నింపవలెను. నారాయణవర్మ బాధ విముక్తి చేసి నన్ను బ్రతికించినారు.

చిదా—మీ రాజరత్నమునకు వివాహమహోత్సవము నడుచు వఱకును నారాయణవర్మ బాధ విముక్తి యయిన దని సంతోషింప గూడదు. మేము మాశిష్యునకు జేయవలసినయుపదేశమును జేసితిమి. సమర్మముగా నుపదేశించిన మామంత్రిప్రభావముచేత సమస్తమును శస్తమగును. ఇటువంటి మంత్రరాజము కరగత మయినప్పుడు పురుషులు స్త్రీలుగా మాఱుదురు స్త్రీలు పురుషులుగా మాఱుదురు కడకు మీ రాదిగా జనులందఱును గాడిదలుగా మాఱినను నెవ్వరును నాశ్చర్య పడవలసినపని లేదు. మం డీకన్నులనే నీవన్నెన్నో వింతలుచూడగలవు.

జంబు—రాజరత్నముయొక్కమాతామహాధనమునకు భంగము రాదుగదా ?

చిదా—రాదు. మే మన్నమాట వరదానమనుకో. నేటి కోటి సెలలగోపల నీకోడలే నీ వియ్యంకునిజ్ఞాతులకు తృప్తికరముగా జెప్పి

సందేహనివారణ చేసి నిర్వివాదముగా మీరాజిరత్నము పుత్రిపౌత్రి పారంపర్యముగా ననుభవించుటట్లు చేయగలదు. మామాట నమ్ముము. ధనము చెందనర్హులైనవారి కేల చెందకుండును ?

జంబు—(ఆశ్చర్యముతో) ఆఱునెలలలోపలనె నాకు కోడలు వచ్చునా ?

చిదా—మేము యోగదృష్టిచేత సర్వమును జూచినాము. నేటికి నాలవదినము రాత్రి కనకాభరణభూషితురాలయి యొక రాచకన్నియ మీయింటికి రాగలదు. ఆమెను కులగోత్రినామము లడుగక తక్షణమే మీరాజిరత్నమునకు వివాహము చేయుము. నీ వీలోపలనే వివాహ సన్నాహమును జేసికొన సంసిద్ధుడవు యుండుము. ఈ మూడు దినములను మీరాజిరత్నము మే ముపదేశించిన మహామంత్రిమును దినమునకు వేయేసిమూఁటులు పునశ్చరణము చేయుచుండవలెను. అది సంవత్సరమునకుగాని సిద్ధి పొందదు. మీయింటికి వచ్చెడు చిన్నదానిని స్త్రీరూపమున వచ్చిన రాజిరత్నము పాలిటి భాగ్యదేవతనుగా భావింప వలెనుగాని సామాన్యమానవభామినిగా భావింపగూడదు. మేము జేపు రాత్రి యంతర్ధానులమయి పోయి మా యోగమహిమచేత నెడబాయకుండి మీరాజిరత్నము పుత్రిసంపదలతో వర్ధిల్లునట్లు కటాక్షించుచుండెదము. మే ముపదేశించినమంత్రిము నిర్విఘ్నముగా ఫలించును గాక !

జంబు — ఇవి యాశీర్వచనములు గాక మాకు సిద్ధమయిన వరములే.

చిదా—మాయింత్రిముయొక్క ప్రయోగోపసంహారక్రియమునును మే మింకొక్కసారి రాజిరత్నమునకు నే దుపదేశింపవలెను. నీ వించుక తడవు పూర్వముగా నుండవలెను. జేపటికో మూడుపదేశములు

కాగానే మేఘు తపస్సమాధినిమి త్తము హేమాద్రికి బోయెదము.

జంబు—చి త్తము. (అందఱును నిష్క్రమించు చున్నారు.)

తృతీయరంగము—నీళ్ళాటకేవు.

[రంగమ్మ, వెంకమ్మ, సుందరమ్మ మొదలయిన వారు ప్రవేశించుచున్నారు.]

రంగ—వెంకమ్మా ! వెంకమ్మా ! వూళ్ళోవింతలు విన్నావా? అందరూ చెడచెప్పుకుంటూవున్నారే.

వెంక—ఏమి వింతలే ? కాలమహిమ యేమోకాని యిప్పుడు మహావిధ్వంసాలు పుడుతూ వున్నవి సుమా.

రంగ—నే నన్నది జంబుకేశ్వరవర్మగారి యింట్లోమాటే.

వెంక—నేనన్నదీ అదేనే. ఆడదాసికి మీసాలు రావడం యేమిటే ? యెక్కడైనా యింతవిరుద్ధం వుంటుందా? అంతా అబద్ధమే. ఇది వట్టికల్పన.

రంగ—మన కేం తెలుసునే అంతా నిజమనే చెప్పుకుంటూ వున్నారు.

సుంద—నిజం కాకపోతే వూరికే అబద్ధాలు పుట్టవు. మీరు విన్నది సందేహం లేకుండా నిజమైనమాట. దగ్గిరగా రండి నేను రహస్యం చెపుతాను. (అని రహస్యముగా) నేను వాళ్ళ యింటి దాసీదాస్ని కనుక్కున్నానరా). అది జంబుకేశ్వరవర్మగారి కోడలికి మీసాలు రావడం తాను కళ్ళారా చూచినా నసీ, రాణివాసం అవడం చేత మొగవాళ్ళకి యెవరికీ తెలియదనీ, నిన్న నాతో ప్రమాణం చేసి చెప్పింది.

వెంక—ఇటువంటి నిరుద్ధాలు యెక్కడనయినా వుంటవిటమ్మా? నేను నమ్మను.

రంగ — ఆడవాళ్లకుకూడా అక్కడక్కడ మీసాలు రావడం కలగు. మామేనత్త కొకావిడకు కొంచెం నూగునూగుగా వచ్చినవి.

వెంక — రాజరత్నము పెళ్ళాము మహాఅదృష్టవంతురాలట. నాలుగు నెలలకిందట రాజరత్నము తల్లి పినతాతమనమలు నచ్చి రాజ రత్నము మగవాడే కాడనీ, అతని మాతామహుని ఆస్తిని తమకు రావలెననీ తగాదా పెట్టినారట. అప్పుడా చిన్నది తగిన నిదర్శనంచూపి దాహిత్రం మొగుడికి వచ్చేటట్టుచేసి వాళ్లను పంపించివేసిందట. వాళ్లు సిగ్గుపడి నోరెత్తకుండా లేచిపోయినారట.

సుంద — మీరు మాట తెచ్చినారుగనుక నేను మీతో యింకా రహస్యంకూడా చెపుతాను. రాజరత్నమునకు కడుపు యెత్తయి యేడు మాసాలగర్భంలాగు వున్నదట! ఇదేంవిరుద్ధమే? ఆడవాళ్లకు మీసాలు రావడమైనా విన్నానుగాని మొగవాళ్లకు కడుపురావడం నేను యెక్కడా వినలేదో.

రంగ — ఓసి మెల్లిగా మాట్లాడవే. అవతల జపం చేసుకుంటూ వున్న శాస్త్రుల్లుగారు వినిపోతారు. వింటే అప్రతిష్ట.

(అని చేతితో నోరు మూసికొనుచున్నది.)

శాస్త్రి — అందఱును విన్నదాని కింత రహస్య మేమి? మీరు విన్నదానిలో విరుద్ధ మేమియు లేదు. మగవాండ్రకును కడుపు రావచ్చును. పూర్వము మాంధాత తండ్రికి యువనాశ్వునికి కడుపు రాలేదా? పురూరవశ్చక్రివర్తి తండ్రికి సుద్యుమ్ననికి కడుపు రాలేదా? మంత్రప్రభావమువల్ల కలుగవచ్చును. ఈమధ్య నెవరో యోగి వారింటికి వచ్చినారట! ఆయోగి మంత్రిమహిమచేతనే యీఅద్భుతాలన్నియు పుట్టినవి. బ్రాహ్మణప్రభావమంటే సామాన్యమనుకొన్నారా యేమిటి? ఈమధ్య తపశ్శాలులు తక్కువ మహిమలు కొంత

కాలమునుండి కనపడకుండ నున్నవి.

వెంక—ఏమిమహిమలోకాని నాబుద్ధికి బోధపడకుండావున్నవి. రాజరత్న మాడదీ, పెళ్ళాము మగవాడూ కాడుగదా? ఆచిన్నది యెవ రాడపసుచో యెవరికీ తెలియదట.

రంగ—అంతవిరుద్ధం వుంటుందే?

శాస్త్రి—ఉండవచ్చును. అది విరుద్ధమే కాను. మంత్రిమహిమ చేత నెంతలేసివింతలైనను పుట్టవచ్చును. పూర్వము శిఖండి ఆమది మగవాడు కాలేదా? యక్షుడు మగవాడు ఆడది కాలేదా? ఇదంతా ఆయోగిప్రభావమున యుండును. నేను పోయి దీని నిజమంతయు మధ్యాహ్నమునింద జంబుకేశ్వరవర్మగారినే అడిగి తెలుసుకొనెదను.

సుంద—ఈవెట్టిబ్రాహ్మడు కొంపతీసి అక్కడ మనపేర్లు చెపు తాడేమో?

మంగ—నీళ్లకు వచ్చి చాలానే పయింది. అత్తగారు కోపపడు తుంది. యింటికి వేగిరం వెళుదాము రండే.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

చతుర్థరంగము—జంబుకేశ్వరవర్మ గృహము.

[శాస్త్రియు, జంబుకేశ్వరవర్మయు ప్రవేశించుచున్నారు.]

జంబు—మీరు విన్నదంతయు సర్వాబద్ధము. ఆడదాని కేమి? మీసా లేమి? పోవయ్యా.

శాస్త్రి—ఒకవేళ నిజమే కావచ్చును. జనవాక్య మెప్పుడును అబద్ధము కాదు. యోగియొక్క—మహత్వముచేత సీకొడుకును కోడలును రూపాలు మార్చుకొన్నారని పురాణపండితులు చేసిన సంశయనివా రణమునుబట్టి యీగ్రామములో అందఱును ఏకవాక్యముగా సిద్ధాంతము

చేసికొన్నారు. ఆలోపలినుండి వచ్చువా రెవరు ?

[నారాయణవర్మయు, రాజరత్నమును ప్రవేశించుచున్నారు.]

నారా—నేను నీయల్లుడను నారాయణవర్మను. ఈమె నాభార్య రాజరత్నము. మీయింటనుండి నీకూతురికి మంత్రోపదేశము చేసి వివాహము చేయించిన యోగిని నేనే. తరువాత నాలవనాటిరాత్రి రాచకన్నియవేషము వేసికొనివచ్చి నీకూతురిని వివాహము చేసి కొన్నదియు నేనే. నా కామరూపమంత్రిమహిమ ఇప్పుడు బోధ పడినదా ? తెలియకపోయినపక్షమున, నీకొడుకును కూతురినిగా మార్చినదానిని బట్టియైనను నాకామరూపమంత్రిమహిమ నీ కిప్పుడు బోధపడకపోదు. దాహిత్రి డని చెప్పి నీ వియ్యంకునిసొత్తు జ్ఞాతులకు చెందకుండ నపహరింపవలెనన్నదురుద్దేశముతో కూతురు కొడు కని బొంకి నీ వింతకాలము లోకమును మోసపుచ్చినావు. రాజరత్నమునకు కొడుకు పుట్టినతరువాతనైనను నిజము గ్రహింతురని చెప్పి నే నప్పుడు జ్ఞాతులను బంపివేసినాను. ఎవరి కేని రావలెనో వారి కవే వచ్చినవిగాని ఇ మగవానికి కడుపును రాలేను; ఆడదానికి మీసములును రాలేవు. మే మిద్దఱమును సహాధ్యాయుల మయి యున్నప్పుడు నీకొమార్తెకు నా మీద గలిగినవలపుచేత గుట్టు బయలబడి మే మిద్దఱమును దంపతులము కాజూడగా నీ వనేకవిధముల విఘ్నములు కలిగించి కార్యఘాతము చేయ జూచినావు. నీవప్పుడు ద్వేషించిన నారాయణవర్మనే నేను. నేను యోగినయి యుండినప్పుడు నిన్నును సర్వజనులనుగూడ గాడిద లనుగా జేయగలశక్తినాయొద్ద నున్న దని నీతో జెప్పి యున్నాను. నా మంత్రిమహిమను దెలిసికోలేకపోవుటచేత నిన్నును నమ్మరాని విరుద్ధాంశములను నమ్మించుటచేత జనులను గాడిదలనుగా జేసినానా ? లేదా ? ఇక మీరిట్టికామరూపములను మంత్రిములనునమ్మకుందురుగాక!

జంబు—(విస్మయముతో) నాకు కోడలు రాగానే విఫల ప్రయత్నుడయి నారాయణవర్మ చింతచేత గ్రామమువిడిచి లేచిపోయినా డని యెల్లవారును చెప్పుకోగా విని నమ్మి యేమతి యున్నాను. వీడు నాయింటనే ప్రవేశించి నాకొంప తీసినాడా ! ఎంతమోసము చేసినాడు !

నారా—ఇది మోసము కాదు. ముందయినను నీవు బుద్ధికలిగి యుండుటకు చేసినహితోపదేశము.

జంబు—రాజనత్నమా ! ఇంతకాలము కొడుకునలె పెంచి నీవు చదువు చెప్పించినందునకు తుదకు నీవు తండ్రికే పంగనామాలు పెట్టినావు ! ఉపాధ్యాయులవద్ద నీవు మంచిచదువే చదివినావు. ఆడ దానికి చదువు చెప్పించరా దని పెద్దలు చెప్పినమాట—

రాజ—చదువులో నేమున్నది ? చదువుకోబట్టియే నేను సద సద్వివేకముగలదాని నయి యీశ్వరభక్తి గలిగి—

జంబు—(కుతీత విభ్రాంతుడయి) చాలు చాలు. ఈపాటి నీచదువు చాలించు. నీ వన్నపితృభక్తి యిదేనా ?

రాజ—నీయెడల నాకు భక్తి లేకపోలేదు. నీ కేయుపచారము చేయుచున్నను నీయాజ్ఞను శిరసా వహించి యిప్పుడును చేసెదను. అయినను నే నన్యాయపరిత్యాగమునకు జొచ్చి యితరులను మోసము చేసి పితాజ్ఞయని తండ్రులకెల్లను దండ్రియు న్యాయాధిపతులకెల్ల న్యాయాధిపతియునగు నీశ్వరునియెడల నపరాధము చేయజాలను. ఈ నారాయణవర్మసొత్తును, ఇచ్చినయెడల నీ సొత్తును, మా సుఖజీవన మునకు జాలును. ఏసొత్తు రాకపోయినను మేము మాకష్టార్జితవిత్త ముతో సుఖపడుదుము. నామాతామహవిత్తము జ్ఞాతులకే పోనిమ్మా. ఇంకొకమాటవినుము —

జంబు — నా కన్నకూతురినోటికుడి యిటువంటిమాటలు

నేను వినజాలను. ఓశాస్త్రి! నీవు మాంధాతకథలను శిఖండికథలను జెప్పి, మంత్రిప్రభావముచేత నా కొడుకును కోడలును తారుమారయి రని యెల్లవారికిని జెప్పుము. చేత జిక్కినసొత్తు నేను విడువను. ఆవల నన్నెవ్వరేమి చేసెదరో చూతము. నీతో నింకొక రహస్యము చెప్పెదను నావెంట రా.

(అని యావలి కీడ్చుకొని పోవుచున్నాడు)

లు లా య శా స్త్రి.

---

౧. రంగము—భోజనగృహము.

[కరణము వేంకటరావుపంతులుగారును, శంకరశాస్త్రిగారును, భోజనములు చేయుచు ప్రవేశించుచున్నారు.]

శంక—(జుఱ్ఱుచు) పంతులుగారూ! పెరుగు దివ్యంగావున్నది. ఇది ఆవు పెరుగేనా?

వెంక — ఆవుపెరు గింతగట్టిగా వుండదు. ఇది బఱ్ఱెపెరుగు. శాస్త్రం చదువుకున్నవారు యింతమాత్రం తెలుసుకోలేకపోయినారు గదా?

శంక—(తనలో) ఇతడు నన్ను అల్లాటప్పా శాస్త్రికింద కట్టివేసినాడు. విస్తరిదగ్గిరనుంచి లేచేలోగా నాపాండిత్యము ఈయనకు కనపరచవలెను. (పయివంక చూచి) అటకమీద గుమ్మిడికాయలు చాలావున్నవి. ఈయన కర్థం తెలియకుండా కగాప్మాండా లెక్కడివని అడుగుదామా? వద్దువద్దు. ఈయనకేమాట కర్థం తెలియకపోయినా నేను అటకవంక చూడడాన్ని పట్టి గ్రహిస్తాడు. ఏదయినా గూఢమైనప్రశ్న వెయ్యవలెను. (ఆలోచించి) ఇన్ని గుమ్మిడికాయలు

వుండడాన్నిబట్టి యీాయనకు పొలమూా వ్యవసాయమూా చాలావుండి వుంటుంది. ఎన్నికాళ్ళసేవు లున్న వని అడుగుదామూా ? ఇలాగడి గితే తెలిసిపోతుంది. ఎన్ని పృషభా లున్న వని అడుగుచాను. వద్దు. ఆమూటా తెలిసేదే. ఎన్నిపోతు లున్నవని సంస్కృతపదాలతో అడు గుచాను. దున్నపోతులకు సంస్కృతం యేమిషీ ? మహిషము: మహి షమంటే తెలిసిపోచుంది. ఇంతకంటె పెద్దమాట వెయ్యనలెను. ఏదీ నిఘంటు ? దిక్కుమాలిననిఘంటు సమయాానికి స్మరణకు రాదు ఈశ్వ రానుగ్రహావల్ల జ్ఞాపకం వచ్చింది. నేను నాపాలిట దైవమున్నాడు. "లులాయో మహిషో వాహద్విష త్కాపర స్సైరిభాः" ఇత్యమరः లులాయమన్న పదం దివ్యమైపది. (ప్రకాశంగా) కరణంగారూా ! మీావద్ద లులాయాలు చాలావున్నట్టున్నవే ?

వెంక— (తనలో) యీాయన యేదో మహాకవిప్రయోగం చేసినాడు. లులాయమన్నది వ్యాకఘట్టంలాగు వున్నదే ? ఎంత ఆలో చించినా అర్థము కావడములేదు. అర్థం అడిగితే మనపాండిత్యానికి భంగం వస్తుంది. బుద్ధిబలముచేత యెలాగమునా అడగకుండా అర్థం నాఅంతట నేనేకనిపెట్టనలెను. (ఆలోచించి) ఓహోహో ! ఆ పదమున కర్థ మిప్పుడు బోధపడినది. నియోగిబిడ్డ సీమాత్రము గ్రహించలేకపోతే యిక నాబుద్ధిపశేష మేమున్నది ? ఈయన అటకేసంక చాలాసేపు మాచి ససీన్రశ్న అడిగినాను. లులాయాలనగా గుమ్మిడికాయలు. ఈవిషయమును నేనాలోచించినట్లు కనపడకుండదు. (ప్రకాశముగా) శాస్త్రుల్లుగారూా ! ఏమిటీ అడిగినారు ? నా కుమారుడిపెళ్ళివిషయమును ఆలోచిస్తూా తిన్నగా వినలేదు.

శంక—మీావద్ద లులాయాలు చాలావున్నట్టున్నవే అన్నాను.

వెంక—లులాయాలా ? ఎన్నోలేవండి ఈవున్నవి మాకు

సంవత్సరంపొడుగునా కూరకే చాలవు. మావాడిపెళ్ళికూడా వస్తూ వున్నది.

శంక—(తనలో) ఇంతకతినమైనపదం ప్రయోగించినా, ఈయన యర్థం యిట్టే గ్రహించినాడే. నియోగులు తెలుగుకవిత్వం చెప్పే వారుగనుక వీరికి సిఫుంటులు ముఖస్తంగా వచ్చి వుంటవి. అయ్యో! నేడు నాకు గొడ్డుమాంసం తినేవాళ్ళయింట్లో భోజనం తటస్థమయినదే. దీని కేమి ప్రాయశ్చిత్తం వున్నదో? ఈసంగతి యెవరితోనూ చెప్పను. వీరియింట్లో భోజనం చెయ్యలేదను వక్క అబద్ధం ఆడితే అస్మి తీరిపో తవి. విస్తరి విడిచిపెట్టి లేచిపోతాను.

(అని లేచుచున్నాడు.)

వెంక—ఆకాస్తఅన్నం తిని మరీ లేచి పో వయ్యా. కరువు కాలంలో అన్నం పార వెయ్యరాదు.

శంక—నాకు కడుపునొప్పి వచ్చిందండి వేగిరం పోవలెను.

(అని లేచి పరుగెత్తుచున్నాడు.)

అ. రంగము—మేజస్ట్రీటుకోర్టు.

[మేజస్ట్రీటుదగ్గర ఫిర్యాదీ వెంకటరావుపంతులును సాక్షులును ముద్దాయి శంకరశాస్త్రియు నిలుచున్నారు.]

మేజ—ఏమయ్యా? శాస్త్రి! ఇతడు నీమీద తెచ్చినఅప్రతిష్ఠ నేరం పూర్తిగా రుజువుపడ్డది. నీ వితడు గొడ్డుమాంసం తినేవాడని ప్రచురం చేసినావా? లేదా?

శంక.—నేను యెవ్వరితోనూ చెప్పలేదండి. ఇతడు తాను దుస్నేహితులను కూటికోసం తెప్పించుకొన్నాడని నాతో చెప్పితే యొక్కడపోయి ఆగూట నేను రహస్యంగా నాభార్యతో అన్నాను.

అంతకంటె నేను మరి యేపాపమూ యెరగను. ఆసంగతి యెలాగో వూరంతా వ్యాపించింది. పాపం యెప్పుడూ దాగదండి.

వెంక—నేనా ? నేనా ? నేను మున్నపోతులను కూరకోసం తెప్పించినా నని నీతో చెప్పినానుటయ్యా ?

శంక—ఆహా. నీవే నీవే. అక్షరాలా నీవే చెప్పినావు. నేను మీవద్ద లులాయాలు చాలా వున్నట్టున్నవే అంటే, అవి కూరకే చాల వని నీ వప్పు డనలేవా ? అనలే దని బిడ్డలుకలవాడవు రామా యణం నెత్తిమీద పెట్టుకుని యేదీ ప్రమాణం చెయ్యి.

వెంక—ఆహా ! హాహా ! నీపాండిత్యం యేపిసినట్లే వున్నది. లులాయా లంటే గుమ్మిడికాయలు కావటయ్యా ?

శంక — నీపాండిత్యం మొత్తుకున్నట్లేవున్నది. లులాయాలంటే మున్నపోతులు. ఎవరిని పిలిచి అడుగుతారో అడిగి నాఅర్థం కాదని పించండి.

మేజ—ఏమయ్యా ? నీరిద్దరూ పబ్లీకులో అలా వివాదపడు తూవున్నారు ? కంటొంపట్టాపుకోర్టుకింద శిక్షిస్తాము సుమండీ. ఓశాస్త్రీ ! కోర్టువా రడిగినదానికి జవాబు చెప్పు. ఆమాట యేమిటీ ? లులా—?

శంక—లులాయ మండి. నేను లులాయమంటే యీమహాను భావుడు గుమ్మిడికాయ అని అర్థం చేసుకున్నాడట.

మేజ—ఈమాట యెప్పుడూ విన్నట్టు లేదే ! ఇది తెలుగు మాటేనా ? ఇది యింగ్లీషుమాటలాగున్నది పీకనేరీ చూడనలెను. స్పెల్లింగు యెట్లాగయ్యా ?

శంక—ఇది సంస్కృతపుమాటండి. స్పెల్లింగు మూడణాలండి. మొన్న మా పిల్లవాడికి కావలిస్తే బజారులో మూడణాలకే కొని యిచ్చినానండి.

మేజ—సంస్కృతంపూటా? అలాగుచెప్పు. అందుచేతనే యీపూట నాకు యింగ్లీషుడిక్షనేరీలో యెక్కడా చూచినట్టు జ్ఞాపకం రాలేదు. అంత పెద్దమాట యెందుకు వుపయోగించినావయ్యా? మనం మాట్లాడుకోవడం వకరిమాటల అర్థం నకరికి తెలియడానికా? మరి యెందుకైనానా?

శంక.—మాది పండితసాంప్రదాయం గనుక పాండిత్యం కనపడడానికి కాస్తమారుమూలపూట ప్రయోగించినానండి. పామరులు వుపయోగించే సామాన్యపుమాటలే వుపయోగిస్తే మాపాండిత్యమూ మా ఆధిక్యమూ యేమిటండి?

మేజ.—ఏదీ ఆమాట? లులాయమూ? నాకు చూస్తే నీవే బుద్ధిలేని లులాయంలాగు కనపడుతూ వున్నావే. నీపే రెవరూ? శంకర శాస్త్రి? శంకరశాస్త్రి అనడంకంటె నేటినుంచి నిన్ను లులాయశాస్త్రి అంటేనే బాగావుండేటట్టు కనపడుతూవున్నది.

ఒకప్లీడరు—లులాయశాస్త్రి అంటే అర్థం యేమిటీ?

ఇ కొకప్లీడరు—దున్నపోతుశాస్త్రి అని అర్థము.

వేరొకప్లీడరు—ఆహాహాహాహా! దున్నపోతుశాస్త్రా? కేజు చూడవచ్చిన యీకుర్రివాళ్ళు నవ్వుపట్టలేక వీధిలోకి యెలా పరుగెత్తుతూవున్నారో.

శంక—అయ్యా! అయ్యా! మేజస్ట్రేటుగారూ! తమరు చిత్తగించవలెను. వీధిలో కుర్రిముండాకొడుకులు "దున్నపోతుశాస్త్రి". "దున్నపోతుశాస్త్రి" అని యెలా అనుస్తూవున్నారో చూడండి. తమరు కాస్త మందలిస్తేనేకాని వాళ్ళనోళ్ళు మూత పడవు. తమ రిప్పుడు శిక్షించకపోతే రేపటినుంచి నన్ను బొత్తిగానే అల్లరిపిల్లకాయలు వీధిలో గేలిచేసి వదలిపెడుతారు

మేజ—బంట్రోత్ ! ఆ అరచేవాళ్ళను పట్టుకొని యిలాకోర్టు వారియెదుటకు యీడ్చుకొని రా.

బంట్రోతు—చిత్తము మహాప్రభూ !

మేజ — నీవు చూపిన పాండిత్యానికి తగిన బిరుదుపేరు నీకు శాశ్వతంగా లభించింది. యింతమందినోళ్ళల్లో పడ్డతరువాత యిక నీకది తీసివేసుకుందామన్నా పోయేది కాదు. అవునుగాని నీవు రహస్యంగా నీభార్యతో చెప్పినమాట వూరిమీద యెలాపడ్డదయ్యా !

శంక—దానమ్మకిదుపుళ్ళాలు! ఆడవాళ్ళతోచెప్పినమాట దాగదండి. దానికి పూర్వం ధర్మరాజువారిశాపం వున్నదండి. అది దాని చెలికత్తె వక్కత్తెతో చెపితే ఆనోటిమాట ఆనోట వూరంతా పొక్కి వీధి వీధినీ పాకిందండి.

మేజ—ఇదంతా భగ్నుచేత వచ్చిందిగాని మరివకటి కాదు. ఇందులో దురుద్దేశం కనపడకందుకే కేజు కొట్టివేసినాము. ఓశాస్త్రీ ! ఇకముందునీవు యెప్పుడూ యిటువంటి పెద్దమాటలు వుపయోగించ బోకు. ఇప్పు డయినదానితో బుద్ధి తెచ్చుకో. నిన్ను విడుదల చేసినాము పో.

శంక—చిత్తము. చిత్తము.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

పూర్వాచారము.

[పూర్వాచారదీక్షితులును, సవనాగరికకాస్త్రియు, మొదలైన సభికు లందఱు నిండియుండఁగా నుపన్యాసకు లయిన యవిజేకాచార్యులవా రుపన్యాసము నారంభించున్నారు.]

అవి—ఓ విద్వన్మహాజనులారా! నేడు లోకోపకారమైన మహా విషయమును గూర్చి యుపన్యసింపబోవు చున్నాను. మీ రందఱును శాస్త్రసమ్మత మైన నా యుపన్యాసమును సావధానముగా విని, పాఠశాలలలో శూద్రులను జనువకుండ జేయుడని దొరతనమువారికి సంఘ క్షేపనము పంపవలెను. శూద్రులు చదువుకొనుటచేత బొత్తిగా తెలుగుమీఱిపోయి బ్రాహ్మణభక్తిలేక స్వధర్మమును విడిచి యధోగతి పాలయి చెడిపోవుచున్నారు. బ్రాహ్మణసేవయేకదా శూద్రులకు కుల ధర్మము? అది యొక్కటి లేకపోయినపక్షమున, ఎన్నిగుణసంపదలు కలిగినను అవి యన్నియు వ్యర్థములు. స్వధర్మ మయిన బ్రాహ్మణ సేవను పరిత్యజించుటవలన, శూద్రుల కిహలోకహానియు పరలోక హానియుసంభవించును. ఇదియంతయు నేను శూద్రులనిష్కారణముగా స్వధర్మమును గౌరవింపక చెడిపోవుచున్నారే యన్నజాలిచేత వారి క్షేమమునుకొఱకు చెప్పుచున్నానే కాని స్వప్రయోజనపరత్వముచేత గాదు. స్వధర్మత్యాగమూ మహాపాతకము. స్వధర్మమును విడిచి సంప దలతో తులతూగుటకంటె స్వధర్మమున దుండి తిండికి లేక మరణము కొందుట శ్రేయస్కరము.

శ్లో. శ్రేయాన్ స్వధర్మో విగుణః పరధర్మా త్స్వనుష్ఠితాత్
స్వధర్మే నిధనం శ్రేయః పరధర్మో భయావహః.

అని శ్రీకృష్ణులవారు భగవద్గీతలలో తృతీయాధ్యాయమున సెలవిచ్చి

యున్నారు. "చక్కగా ననుష్ఠింపబడిన పరధర్మమునకంటె విగుణమైన స్వధర్మము శ్రేష్ఠము. స్వధర్మమునందు చచ్చుటమేలు; పరధర్మము భయావహమైనది" అని శ్రీకృష్ణులవారే సెలవిచ్చునప్పుడు నాబోటులు వేఱుగ జెప్పవలసిన దేమున్నది? శూద్రులు చదువ్రుకొనుట యెంతో పాపము.

శ్లో. శూద్రో మక్షరసంయుక్తో దూరతః పరివర్జయేత్.

అని శాస్త్రములు ఘోషపెట్టుచున్నవి. చదువుకొన్న శూద్రుని దూరముగా తటిమివేయువలెను. శూద్రులు చదువుకొనుట పూర్వాచారవిరుద్ధము. మహానుభావులైనపూర్వులు చేసినశాస్త్రములను మీఱవచ్చునా? పూర్వులమహిమలముందట మన మెంతటివారము? పూర్వులవంటి బుద్ధిమంతులిప్పుడెక్కడనున్నారు? యుగములన్నీ వారిబుద్ధితోను సర్వజ్ఞత్వముతోను నిన్న మొన్నటి మన యల్పజ్ఞానము సాటి యగునా? శూద్రులకు విద్య మంచిదయినపక్షమున మన పూర్వులు దాని నేల నిషేధింతురు? కృతయుగమునాటి మహాపురుషుల కంటె నీ పాడుకలియుగములోనివా రెక్కువ బుద్ధిమంతులా? కించిజ్ఞులమయిన మనము సదా వారియాజ్ఞలకు బద్ధులమయి నడవవలెను. శాస్త్రాధికారముచేయరాదు. ఇది యనాదిగా వచ్చుచున్న శిష్టాచారముగాని నిన్న మొన్న వచ్చినదికాదు. నవనాగరికుల కుయుక్తుల నమ్మి మీ రెవ్వరును శూద్రులవిద్య కంగీకరింపగూడదు. ఈ నవనాగరికులమాటలు నమ్మి యొక్కదానిలో నేడు మనము కొంచె మవకాశ మిచ్చినపక్షమున జేపు వా రింతకంటెను హీనమైనదురాచారమును దెచ్చి పెట్టుదురు. అప్పుడు శాస్త్రపరిమాణము నిర్మూలమయిపోవును. శాస్త్రవిశ్వాసము చెడినపక్షమున దేశమున కెన్నియనర్థములైన సంప్రాప్తము లగును. శూద్రులకు విద్య లేకపోవుటవలన

నెవ్వారికిని నష్టము లేదు. స్వధర్మపరాయణు లయినశూద్రులలో సహితతృప్తి లేదు. అపూర్వబుద్ధిమంతు లైనయీనవనాగరికు లొక్కరుదక్క నెవ్వరును మా కీమార్పు కానలె నని కోరుచుండ లేదు. కొత్తకొత్తమార్పులవలన దేశసంక్షోభము కలుగును. జనులలో నిప్పుడున్నయైకమత్యము చెడిపోవును. కాబట్టి ప్రభుత్వమువారికి శూద్రులవిద్యమాన్పించి కులాచారధర్మములను రక్షింపవలయు నని శీఘ్రముగా సంఘవిజ్ఞాపనములు ప్రతిగ్రామమునుండి పంపవలెను.

పూర్వా—ఆహా! ఏమి యీపుపన్యాసము! దీనిని సహస్రముఖములు గలశేషు డయినను వర్ణింపజాలడు.

నవ—ఉపన్యాసము సాంత మయినదా?

పూర్వా—ఏమి? ఇం దేమైనలోప మున్నదా?

నవ—మాటలలో లోపము లేదు.

పూర్వా—మీ రేమైన చెప్పదలచుకొన్నారా?

నవ—మీ రెల వయినపట్టమున నాలుగుమాటలు చెప్పెదను. పూర్వులే బుద్ధిమంతులనియు, ఇప్పటివారు బుద్ధిహీను లనియు, పూర్వాచారమును దేనిని మీఱరా దనియు, చెప్పెడుమాట వెట్టిమాట. పూర్వ మున్నయీశ్వరుడే యిప్పు డున్నాడు; పూర్వులకిచ్చిన బుద్ధినే యిప్పటివారికిని బ్రిసాదించి యున్నాడు. ఆబుద్ధి నుపయోగపఱుచుకోకపోయినదోషము మనయందే యున్నది.

అవి—ఆహాహాహా! ఏమి యీయుక్తి! పూర్వులబుద్ధి యెక్కడ? మనబుద్ధియెక్కడ? యుగములకిందట నున్న వారి కున్నలోకాను భవము నిన్న మొన్న పుట్టిన మన కెక్కడనుండి వచ్చును? వారు సర్వజ్ఞులు, సువివేకులు; మహిమాఢ్యులు.

నవ—ఈవర్ణనలు చాలును. సర్వజ్ఞులయిన పెద్దలు, పూర్వుల

వివేకము, పూర్వకాలపు మహిమలు, ఇటువంటిమాటలు వినుట కెంతయు నింపుగానే యుండును. కాని యిందు సార మేదియు లేదు. ఇటువంటి పనికిమాలినవిమర్శక మాలోచన లేకపోవుటచేతనే సంభవించును. మీరు సెలవిచ్చినట్లు లోకానుభవమునవలన బుద్ధి హెచ్చునను టకు సందేహము లేదు. పిన్నలకంటె పెద్దలకు బుద్ధి హెచ్చగుట నైసర్గికము.. అనుభవ మెక్కువ యున్నవారికి బుద్ధి హెచ్చకపోవుట యస్వాభావికము. అది వారి బుద్ధిజాడ్యము " ఎవరు పెద్దలు ? ఎవరు పిన్నలు ? ఎవరికి లోకానుభవ మెక్కువగలదు ? " అన్నయంశములను విచారింపవలెను. లోకానుభవ మెక్కువగుటనుబట్టి బ్రతికియున్న వారిలో చిన్నవారికంటె పెద్దవారధికజ్ఞాను లయినట్లు, గతించిన వారిలో మొదటితరమువారికంటె దరువాతితరమువారును వారికంటె నాపయితరమువారును గ్రమక్రమముగా నధికానుభవము కలవారయి యధికజ్ఞానము కలవారగుచుండుట స్వాభావికము. అట్లు కాకుండుట స్వాభావికవిరుద్ధమైన బుద్ధిరోగము. నిజము విచారింపగా నల్పకాలానుభవము గలవారగుటచేత బూర్వము మండినవారే తరువాతమండిన వారికంటె బిన్న లని చెప్పనచ్చును. పరంపరగా వచ్చుచున్న పెక్కుతరములనారి యనుభవముకూడ మన యనుభవముతో జేరుచుండుటచేత మనమే విశేషజ్ఞానము కల వృద్ధులము కావలెను. కాబట్టి మున మాపూర్వులు చెప్పినదెల్లను మంచిదను మూర్ఖపుపట్టును మాని మన బుద్ధిచేత నాలోచించి యిప్పటిస్థితినిబట్టి కాలానుగుణములయిన మార్పులను జేసికొనుచు లోకమునకు సుఖాభివృద్ధి కలుగజేయుచుండవలెను. పూర్వులకంటె మన మొకవేళ నల్పబుద్ధి కలవారమేయయినను పౌరి జ్ఞానమునకు మనజ్ఞానమును జేర్చి పనిని గూర్చుండుటచేత దీర్ఘ కాయుని భుజములమీద గూర్చున్న మరుగుజ్జువానివలెనే యెక్కువ

దూరమును జూడనచ్చునని యొకానొకవిద్వాంసుడు వ్రాసియున్నాడు. జ్ఞానక్షేత్రము మూతపడి యంధప్రాయముగా నున్నజనసామాన్యము విద్యాగంధము నొంది కన్ను దెఱచినంగాని మనదేశము మంచిస్థితికి రానేరదు అజ్ఞానరోగముచేతనే మనదేశమునందు జను లంతకంతకు హీనదశకు వచ్చుట సంభవించుచున్నది. అజ్ఞానరోగపీడితు లయినవారికి బుద్ధ్యనుపానముతో దివ్యౌషధమున్ను సేవింపనిచ్చినంగాని జ్ఞానారోగ్యము గలిగి దేశము బాగుపడదు.

అవి— ఈపాటి యూహాపెట్టిచదువు చాలించు. శాస్త్రముల నెన్నడైనమార్ప శక్యమగునా? నీవు చెప్పినది శాస్త్రవిరుద్ధ మగుటచేత కేవలోన్మత్తప్రలాపము; నీమాటలు ప్రమాణబుద్ధి గల మావంటిశిష్టు లంగీకరింపదగినవి కావు.

నవ— పెద్దలు చేసినశాస్త్రరచ్చణము నిమిత్తమయి పెద్దల కెల్లను పెద్దయైనయీశ్వరుడు దయచేసినబుద్ధిని పదటగలపజూడకుడు. మనుష్యుల సౌఖ్యాభివృద్ధినిమిత్తమయి శాస్త్రములు చేయబడినవి గాని శాస్త్రములగౌరవమును కాపాడునిమిత్తము కష్టపడుట కయి మనుష్యులు చేయబడలేదు. పూర్వకాలమునకు దగినట్లుగా జేయబడిన శాస్త్రమును మార్పగూడదని యవిచారమూలకముగా భావించి యందలి యంశములు పనికిమాలిన వయి నష్టకరము లయిన వని తెలిపి నప్పుడుకూడ దుర్భమచే పట్టుపట్టి మార్చుకోక సహించుచువచ్చిన యెడల శాస్త్రగౌరవము విడిచి జనులు దానిని బహిరంగముగానే మూఁటుదురు. మీవంటిపెద్ద లిందఱుపన్యాసముచేసి శాస్త్రప్రమాణము లను జూపుచున్నను, శూద్రులలో విద్య వృద్ధియగుచుండుటయే యిందునకు నిదర్శనముగా జూపవచ్చును. కొంద ఱీట్లు ప్రస్తుత కాలమునకు దగని శాస్త్రవిశ్వాసమునే మాని వృద్ధిపొందుచుండగా,

బుద్ధిని విడిచి ప్రతివిషయమునను శాస్త్రము శాస్త్రమని పలవరించు వారు పాపములనుసహేతుకము శాస్త్రోక్తముగానే చేయుచు దమకును దేశమునకుగూడ ననర్థములను దెచ్చిపెట్టు చున్నారు.

అవి—కలికాలమహిమచేత మీవంటివారి కిప్పు డిటువంటి బుద్ధులు పుట్టుచున్నవి. శూద్రు లింతకాలమును జదువు లేక చచ్చి పోయినారా? వీరి పూర్వులు సుఖపడలేదా? ధనము సంపాదించలేదా? బ్రాహ్మణపూజ చేసి తరింపలేదా? దేశము మహోన్నతదశయం దుండినదికాదా? ఇంతకాలము లేనిచదువు శూద్రుల కిప్పు డేల కావలసివచ్చినవి?

నవ—ఇటువంటిప్రశ్న లడుగువారికి సమాధానము చెప్పి యొప్పించుట బ్రహ్మకు శక్యము కాదు! ఈప్రశ్నములు పూర్వ మొక గృహస్థునకును మీవంటి మఱియొక బుద్ధిమంతునకును నడిచిన ప్రసంగమును స్మరణకు దెచ్చి నవ్వు తెప్పించు చున్నది.

అవి—ఆ యవివేకప్రసంగ మేది?

నవ—ఒకగ్రామములోనివాడు తరములనుండి యొక చెరువు లోని కలుషోదకము త్రాగుచు గారణము తెలియ లేక యుబ్బురోగము చేత బాధపడుచుండిరి. ఆగ్రామమునం దున్న వారిలో గొందఱు పాటు పడి ధనము సంపాదించి ధనికులయినవారును గలరు. ఇట్లుండగా నాధనికులలో నొకడు పూర్వాచారవిరుద్ధముగా దనకుమారుని రాజ ధానికిబంపి యింగ్లీషుపాఠశాలలో జదువుచెప్పించెను. ఆబాలుడక్కడ బరీక్షలం దేటి యారోగ్యధర్మములను నేర్చికొనివచ్చి స్వగ్రామములో సభచేసి "మనగ్రామములోని యుబ్బుజబ్బులన్నియు నీటికాలుష్యము వలన గలుగుచున్నవి. మనము పానము చేయునీటిలో కట్టెలు నాన వేయుట, గొడ్లను కడుగుట మొదలయిన కర్మలములను జేసినీక నీరు

పరిశుద్ధపఱుపవలెను. అని యుపన్యసించెను.

అవి—అప్పు డేమిజరిగినది ?

నన—అక్కడ నున్నవారిలో నొక ప్రబుద్ధుడు లేచి " చెఱువు నీరు చిరకాలమునుండి యిట్టివిధముగానే యున్నది. మీతండ్రితాత లీ నీరు త్రాగుచు నుబ్బుజబ్బుతో చిరకాలము జీవించి ధనము సంపాదించలేదా ? ఇప్పుడేమి కొత్త వచ్చినది ? మనము పూర్వాచారము మీఱరాదు. ఈజబ్బునల్ల దోషము లేదు. ఇది గ్రామములో తరములనాటినుండి వచ్చుచున్నది. " అని సమాధానము చెప్పెను.

అవి—మంచిసమాధానము చెప్పినాడు. అంతటితో నాకుట్టి వాని నో రడగినదా ?

నన—ఆకుట్టినా డిట్లనియెను—" ఓ బుద్ధిహీనుడా ! నా పెద్దలు కాని మితులుకాని ధనికులయినది యీ రోగముచేతగాదు. యీ రోగమే లేకపోయిన పక్షమున వా రింతకంటెను అధిక ధనవంతులై యెక్కువ బల సౌఖ్యముల ననుభవించి యుందురు. "

అవి—అనగానే దొడమీగ రెండువాయించలేదా ? వానికి బుద్ధిగకపోయినను నీవు మరల మాటాడినపక్షమున నీ కిప్పుడు దొడబుద్ధి బరుగును.

నన—మీకు నమస్కారము. నేను బోయెదను.

(అంతట సభ కలిసెను.)

లక్క గేదె.

శ్లో. ముగ్ధే పయోపి దుగ్ధే తృణ మప్యశ్నాతి తర్ణకం సూతే
నాడింధమస్య మాయాం జాతు న జానాసి జాతుషీ మహిషీ.

ప్రథమరంగము—కామావధానులగృహము.

[కామావధానులు, సోమిదేవియుఁ బ్రవేశించుచున్నారు]

సోమి — సోమయాజులవారియింట పుట్టినాను; వాజిపేయ యాజులవారియింట చొచ్చినాను; మిమ్మలిని చేసుకొని నేను వక్క నగయినా పెట్టుకోలేదు. వక్క మంచి జరీబట్టయినా కట్టుకోలేదు.

కామ——నన్నేమంచావే? నేను తెచ్చినదంతా నీచేతులోనే పోస్తూవున్నాను. నిన్ను మంచి చీరలూ నగలూ కొనుక్కోకుండా నేను వద్దన్నానా?

సోమి——ముష్టిసంపాదన లెండి. మీరు తెచ్చేదంతా తిన్నగా తింటే తిండికే సరిపోదు. మాడలు తెస్తారా? వరహాలు తెస్తారా? యెప్పుడు తెచ్చి చేతిలో పెట్టినా నాలుగు సంభావన డబ్బులేనా? యేమయినా అంతకంటె యెక్కువ మహాభాగ్యం వొలికిస్తూ వున్నారా? ఆబిచ్చపుడబ్బులతో నేనా మీరు నన్ను నగలూ చీరలూ కొనుక్కోమనేది?

కామా——ముష్టిసంపాదనగాక మనకు మాన్యాలూ మడులూ వున్నవా యేమిషి? యేమి తెచ్చినా వంటిరిగాణ్ణి నారెక్కల కష్టం మీద తేవలెను. మనకు వుండే పిత్రార్జితం మాన్యపుకొండ్రి కాస్తా నీపెళ్ళితో కడతేరింది—

సోమి——అదిగో? ఆవూసు తలపెట్టవద్దని యెన్నిసార్లుచెప్పినా గడియ గడియకూ నాపెళ్ళిమాట తలపెడుతూనే వుంచారు. ఇఁకో

సారి మళ్ళీ ఆవూసెత్తినారంటే మీకూనాకూ బాగా జరగదుసుమండీ. పోయిన పెధవమాన్యంకోసం యేడవకపోతే తుండులాగు వున్నారు పనిచేసి నెలకు పదివరహాలసొమ్ము సంపాదించితెచ్చి నాచేతిలో వెయ్యా రాదా? నేనప్పుడు సంసారం గుప్పంగా జరిపి పదివరహాలగుల్లలు చేసుంచి వంట పెట్టుకుంచాను.

కామా—నాకు నెలకు పదివరహాలు యెవరు యిస్తారు? శుభా లకూ అశుభాలకూ యింటింటికీ తిరిగి మాగాభిమానాలు వదలి అడ్డ మైననాళ్ళనూ పీడిస్తే నాలుగువరాలసొమ్ము దొరికేటప్పటికి బ్రహ్మాండ మవుతూ వున్నది. అన్నాసికీ వస్త్రానికీ లోపంలేదు గదా? నగలు లేకపోతే తిని సుఖంగా వుండరాదా?

సోమి—పరగడ పందిలాగు పొట్ట కింత తిని గౌరనం లేకుండా బ్రతుకుమంచారు. అలాగంటి బ్రతుకు బ్రతకడంకంటె నూతిలోనో గోతిలోనో పడీ గుక్కెడు ప్రాణం వొక్కమాటు పోగొట్టుకోవడం వుత్తమము. మీరు పరువూ ప్రతిష్ఠా ముద్దూముచ్చటా యేమీ యెర గరు. పెళ్ళాము చేసిపెడితే పొట్టకింత తిని వూరుపట్టుకుని తిరిగేవాడికి యింట్లో ఆడదానిపాట్లు యేమి తెలుస్తవి? నేను మొన్న మోడులాగు పేరంటానికి వెళ్ళిసప్పుడు నీకు నగలు యేమీలేవా? అని అడిగితే అమ్మలక్కలునలుగురిలోనూ యేమీ చెప్పలేక తల పొట్టలో పెట్టుకుని యింటికి చక్కావచ్చినాను. ముష్టి గురవావధానులు పెళ్ళామును చూస్తే ముచ్చటన్నతుంది. దానివంటినిండా యెన్నినగలు వున్నవో చూడండి.

కామా—దానిమొగుడు పునాసాతారావెళ్ళి సంపాదించుకొని వచ్చినాడు గనుక దాని కన్నినగలు నచ్చినవి. వాణ్ణికూడా నావలె వూళ్ళోవుండి సంపాదించమను! యెన్ని నగలుపెడుచాడో చూతాము.

సోమి—మీరు వూళ్ళోవుండి మహాదాభగ్యం బావుకుంటూ వున్నారు. యెన్నియేళ్ళవచ్చినా మీకు బుద్ధిలేదు. ఆ గుర్వావధాను లను చూచిఅయినా కాస్తబుద్ధి తెచ్చుకోరాదూ! మిమ్మలిని పునా సాతారావెళ్ళి సంపాదించవద్దని యెవరు కాళ్ళూచేతులూకట్టి యింట్లో పడవేసినారు? మీకు కాళ్ళు విరిగిపోయినవా యేమిషి? మూలనున్న ముసలముండలాగు వూరు విడచి కదలరు. మిమ్మలిని యేమనినా అంటే రోషంగాని—.

కామ—ఓసి! కోపపడకే సిపుణ్యమూయెను. లేపు నేను యీ వూళ్ళో మళ్ళీ నిద్రచేస్తే నేను బ్రాహ్మణ్ణి కాను. తెల్లవారగట్ట లేచిపోయి పునాసాతారా వెళ్ళి సంపాదించుకొని వచ్చి నీకు కావలసి నన్ని నగలు చేయించి పెడుచాను.

సోమి—మీతల్లికడుపు చల్లగా వెయ్యేళ్ళు వర్ధిల్లండి. ఇప్పుడు వచ్చినబుద్ధి యిదివరకే వచ్చినట్టయితే మన మీపాటే బాగుపడి నలుగురిలోనూ తలయెత్తుకొని తిరుగుచూ వుందుము. మనకీపుర్యోగం వుండగా యిలాగంటిమంచిబుద్ధి మీకుయిదివరకు యెందుకుపుడుచుంది? లోపలకు రండి. మీకు యివాళ పిండివంటతో భోజనం పెడుచాను.

(ఇద్దఱును పోవుచున్నారు)

ద్వితీయరంగము—పునానగరము.

[కామావధానులును, వీరాసారియు ప్రవేశించుచున్నారు.]

కామా—వీరాసారీ! నగలు చేయించేటట్టయితే యీపునహా నగరంలో వున్న కంసాలులను యెవరిని నమ్మినద్దని నీవు చెప్పినమాట మరచిపోలేదు సుమా.

వీరా—సిత్తము. సిత్తము. కానుతే మా వర్ణమేకానండి

మూఁచెడ్డ దగాఁకోరువర్ణ మండి. కంసాలివాడిని నెమ్మడినీ నమ్మకూడ దండి. కాసుబంగారం చేతులోఁపెడితే అరకాసుబంగారం అపహరించి మోసంచేస్తారు.

కామా—నీవు దొడ్డవాడవుగనుక స్వజాతి అభిమానంలేకుండా సత్యం చెపుచూ వున్నావు. నీసత్యసంధతకు నాకు బహుసంతోష మవుచున్నది.

వీరా—ఎంతమాట సెలవిచ్చినారు! తమస్నేహానికి నే నెంత వాణ్ణండి? తమవంటిపెద్దల శిక్షూషనల్ల కొంచెంపుణ్యమూ పాపమూ అనే తెలివి గలిగింది. డబ్బు పావనము కాదండి. యీమొండిఘటాలు యెప్పుడో పోతవి. బ్రతికిననాళ్ళూ నలుగురుచేత యింత మంచివా డనిపించుకొని యెవ్వరికీ ద్రోహం చెయ్యకుండా లేచిపోయిన వా డొక్కడే కృతార్థుడు. ఇది సత్యానికి కాలంకాదండి. ఎక్కడచూచినా అబద్ధాలూ మాయలూ మోసాలూ. తమరు మహానుభావులు గనుక నావంటి నిజంచెప్పేవాళ్ళనుచూస్తే దయ. మీవంటిపెద్దల ఆశీర్వచనం వల్ల ప్రాణంపోయినా అబద్ధం ఆడకుండా వుండేవృత్తి భగవంతుడు నాకు దయచేసినాడు.

కామా—నీవు మహాయోగ్యుడవు. మూటాడినకొద్దినీయోగ్యత తెలుస్తూవున్నది. నీయెరుకను యెవరైనా నమ్మకమైన మంచిపనివాడు లేడుగదా?

వీరా—పనివాళ్ళు కావలసినంతమందివున్నారు కానండి యింత పునాపట్టణంలో నమ్మకమైనవాడు వక్కడయినా దొరకడండి. బాబు! మీ రేమయినా నగలు చేయిస్తారా యేమిటండి? ఈపట్టణానికి వచ్చి యేమాత్రం సంపాదించినారు?

కామా—ఎంతో లేదోయి యిన్నూరువరహాలుసంపాదించినాను.

వీరా—ఇంతేనాండి? ఇది వట్టికలికాల మండి. ఎటువంటివారికీ దానము చెయ్యవలెనో యెవరికి యిస్తే పుణ్యమూ పురుషార్థమూ వుంటుందో యెరిగే ప్రాజ్ఞత లోకులకు లేదండి. మీచేతిలో వక్క తృణం పెడితే, అదంతా కోటిగుణితంగా స్వర్గంలో దాచుకోవడమని గ్రహించేవారు లేరు. బాబు! ఈసొమ్ము యెలాసంపాదించినా రండి?

కామా—ఏమో శవాలనుమోసి శల్యపాశభక్షణము చేసీ—

వీరా—సరిసరి బోధ పడ్డది. తమరు దుర్దాన దురన్నములకు పోరు గనుకనే మీరింత తక్కువగా సంపాదించినారు. మీకంటె నాలుగు వెనుకలు వచ్చినమీ దేశస్థులందరూ ఎొక్కొక్కడు నాలుగేసి వందల వరహాలు దేశానికి హుండీలు కట్టి పంపించినారు. ఇంతమంది తెలుగువాళ్ళను చూచినానుగాని మీవంటిమహానుభావులను యిది వరకు యెన్నడూ చూడలేదు. వక్కమాటు మీనామస్మరణ చేసుకుంటే సహస్రజన్మాల చేసినపాపాలు విమోచన మవుతవి.

కామా—నాయోగ్యత నీవు గనిపెట్టినావు. నీయోగ్యత నేను గ్రహించినాను. అన్నీ సరేకాని ఎంవాకటి సంగతిలో గొప్పచిక్కు సంభవించిండే.

వీరా—స్వామీ! ఏమిచెయ్యను? మీవంటి దొడ్డబ్రాహ్మడి కానగకాస్తా నేనే చేసిపెడుమనుగాని నాకు పనిలో యెక్కడా తీసుబడి లేదండి. నేను పొసుగూసువాణ్ణి యినా నామాటఖిరాసునుబట్టి నగలు చెయ్యడానికి తులాలకొద్ది బంగారము బలవంతముగా నామీదనే పడవేసి పోతారండి.

కామా—వీరాసారి! నాకు నీ వీవుపకారం చెయ్యక తప్పదు. నీవుతప్ప నాకు యీవూళ్ళో నమ్మకమైనవారు యెవరూ కనపడడం లేదు. అదిగో చంకసంచీలో బ్రాసూ రాళ్ళాలాగు వున్నవి. పయికి

తీసి యీవరాలు తూచుకో. నామాట కభ్యంతరం చెప్పనవద్దు. న్యాయమైన మజాకత్తు——

వీరా——సరిసరి ! మీకు నాలుగు వరాల సొమ్మ చేతిలో పెట్టక పోవడమే కాకుండా మీవద్ద కూలికూడా పుచ్చుకుంటానా ? ఎంత మాట సెలవిచ్చినారు! వస్తువు చేసి యిచ్చినతరువాత మళ్ళీ తూచుకొని కొంచెం యిప్పటికంటె మొగ్గువుంటేనే నన్ను ఖాతరుచెయ్యండి. బాబూ ! మీకు చెయ్యనలసినన్నగ లేమిటండీ ?

కామా——నాచెప్పులకు కుండలాలునూ నాభార్య మెడలోకి కంఠె బిరికీల సజ్జూను. ఇవిగో బంగారం తూచుకో. బ్రాహ్మడికి వూరికే నగ చేసిపెట్టినందుకు నీకు శతసువర్ణదానఫలం వస్తుంది.

వీరా——కుండలాలు చేయించి నావంటి రిక్కుణ్ణి కృతార్థుణ్ణి చెయ్యడంచేత శతసువర్ణదానఫలము తనుకే వస్తుంది.

(అని బంగారము తూచుకొను చున్నాడు.)

కామా——వస్తువు లెన్నాళ్ళలో చేసి తెస్తావు ?

వీరా——ఏకోన్నానాళ్ళా అండి ? నాలుగు దినాలలో చేసి తీసుకుని వచ్చి దాఖలు చేసుకుంటాను. నగలు చూచిన తరువాత నా పనివాడి తనానికి మెచ్చుకొని కలకాలమూ నన్ను తలచుకుంటా వుంటారు. బాబూ ! సెలవు పుచ్చుకోనా ? (అని పోవుచున్నాడు.)

తృతీయరంగము——భోజనగృహము.

[కామావధానులు, సోమిదేవియు ప్రవేశించు చున్నారు.]

కామా—— (పెరుగు జుఱ్ఱుచు) నేను జన్మంయెత్తిన తరువాత యిటువంటి పెరుగు యెప్పుడూ తాగలేదు. మహాబాగా వున్నది.

సోమి——మీరు దేశం పోయి సొమ్మ సంపాదించుకు వచ్చిన

రిన్న సంతోషంచేత పాలు నేను స్వయంగా కాచి తోడుపెట్టి యీ గట్టిపెరుగు మీకోసం చేసినాను.

కామ—మనకు పాలు యెక్కడవే ?

సోమి—యెక్క-డవా ? మనగేదెవే.

కామగా—నీవు గేదెనుకూడా కొన్నానా ?

సోమి—కొనకపోతే యిన్నాళ్ళు నేను జీవనం యెలాగు చేసినా ననుకున్నారు ? నాపట్టెడ తాకట్టు పెట్టి యిరవైరూపాయలు తెచ్చి గేదెను కొని దానిపాలూ పెరుగూ నెయ్యీ అమ్మి సంసారం గడుపుకోవడమే కాకుండా కొంత మిగిల్చి చేసిన అప్పుకూడా తీర్చి వేసినాను.

కామా—నీవు బుద్ధిమంతురాలవు గనుక మంచిపని చేసినావు. అప్పునుగాని యీగేదెను నీకెవరు కొనిపెట్టినారే !

సోమి—ఒకరు కొనిపెట్టేదేమిటి ? మనడబ్బు పెట్టి మన యింటి పొరుగుననున్న కంసాలి పాపాసారివద్ద నేనే కొనుక్కున్నాను.

కామా—ఎంత తెలివిమాలినపని చేసినావు ! ఓసీ భ్రిష్టురాలా! నావలెనే నీవునూ మాయలో పడిపోయినావు.

సోమి—ఏమిమాయ ?

కామా—ఏమయితే నేమి ? నీవు మోసపోయినావు. ఆడబుద్ధి అపరబుద్ధి అన్నవాడు వెట్టివాడా ?

సోమి—ఏమిమోసము ?

కామా—కంసాలివాడిదగ్గర కొన్నావు. అది నిశ్చయముగా లక్కగేదె. వాడు నిన్ను మాయలో పడవేసినాడు.

సోమి—గేదె స్పష్టముగా కనపడుతూవుండగానేనా ?

కామా—పుు కలాగే కనపడుతుంది. నాకుండలాలు చూచి

నాపు కావూ? కంసాలివాడు మాయమాటలు చెప్పి నావద్ద బంగారం తీసుకొనిపోయి కుండలాలు చేసి తీసుకుని వచ్చినాడు. తూనిక సరి పోయింది, ఎత్తుసరిపోయింది, వన్నెసరిపోయింది, రూపం సరిపోయింది, అన్నీ సరిగా సరిపోయినవి. పయి కవి చూచేవారి కందరికీ శుద్ధసువర్ణ కుండలాలలాగే కనపడ్డవి. త్రోవలో మొన్న సంభావనకాడ పోట్లాడి విశాఖపట్నంలో గడేకారీవాడు నాచెవి పట్టుకుని లాగేటప్పటికి కుండలాలు వెళ్ళుకుక్కిన విధిగి లోపలిలక్క బయలబడ్డది. కంసాలివద్ద కొన్నతరువాత యిది లక్కగేదె కాక తప్పదు.

సోమి.—పాలు యిస్తూవున్నదే?

కామూ—పాలూ యిస్తుంది.

సోమి—గడ్డి మేస్తూవున్నదే?

కామూ—గడ్డీమేస్తుంది.

సోమి—దూడను వేస్తూవున్నదే?

కామూ—దూడనూ వేస్తుంది.

సోమి—ఇన్నివుంటే యిక లక్కగేదె యేమిషీ?

కామూ—ఎన్నివున్నా కంసాలివద్ద కొన్నావు గనుక, ఇది నిస్సందేహముగా లక్కగేదె. మోసపోయినవాణ్ణి మగవాణ్ణి నాకు తెలుస్తుంది గాని కంసాలివాడిమాయ ఆడదానపు నీకు యేమి తెలుస్తుంది?

సోమి—నీకు మతిపోయినదా యేమి? దొడ్లోకివచ్చి గేదెను చూడండి.

కామూ—నేను చూడివక్కరలేదు. నీవు కంసాలివద్ద గేదెను యెప్పుడు కొన్నానన్నావో నిజం నా కప్పుడే తెలిసింది. నీవిక మెల్ల చెప్పి లక్షచెప్పు. నీమాట నేను నమ్మను. నీవు కొన్నది నిశ్చయంగా

లక్ష్మగేదె. నామాట త్రిలోకాలలోకి వెళ్లినా తిరగదు. విప్రవాక్యం జనార్దన మన్నాడు.

క. మేయఁగ నీ కస విటువలె,
నీయఁగ నీ పాలు, వేయ నీ దూడన్, ము
గ్ధా! యెఱుఁగ లేవు కంసలి
మాయల్, నిక్ష్మమిది లక్ష్మమహిషమె సుమ్మా!

సోమి—ఈపాటి యీమాటలు చాలించి విస్తరిముందునుంచి లేచి వేగిరము పోఁజపరుండండంఁడి. రేపటికి మీమనస్సు స్వస్థపడుచుంది.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు.)

సమాప్తము.

రాజమహేంద్రవరము:
పిళ్లారిశెట్టి సీతారామయ్య ఆండ్ సన్సువారి
శ్రీరామ్ ప్రెస్ నందు ముద్రింపబడియె—1949.

శ్రీ శేషు లైన రా వు బ హా ద్దూ రు
కందుకూరి వీరేశలింగం పంతులుగారి గ్రంథములు.

ప్ర హ స న ము లు

మొదటి సంపుటము

1 అపూర్వబ్రహ్మచర్య ప్రహసనము
2 విచిత్రవివాహ ప్రహసనము
3 మహాబధిర ప్రహసనము
4 పునర్మరణ ప్రహసనము
5 బలాత్కారగానవినోద ప్రహసనము
6 కలహప్రియా ప్రహసనము
7 మహామహోపాధ్యాయ ప్రహసనము
8 యోగనిద్రా ప్రహసనము
9 మహావంచక ప్రహసనము
10 అసహాయశూర ప్రహసనము
11 కలిపురుషశనైశ్చర విలాసము
12 వేశ్యాప్రియా ప్రహసనము
13 కౌతుకవర్ధని
14 వినోదతరంగిణి
14 హాస్యసంజీవిని మొ॥భా॥
16 ,, రెం॥భా॥
17 ,, మూ॥భా॥

నా ట క ము లు

రెండవసంపుటము

1 బ్రాహ్మవివాహము
2 వ్యవహారధర్మబోధిని
3 తిర్యగ్విన్మహాసభ (మూషకాసురవిజయం)
4 మహారణ్యపురాధిపత్యము
5 ప్రహ్లాదనాటకము
6 సత్యహరిశ్చంద్ర నాటకము
7 దక్షిణగోగ్రహణము
8 వివేకదీపిక

భాషాంతరీకృతనాటకములు

మూడవసంపుటము

1 చమత్కారరత్నావళి
2 రాగమంజరి
3 కళ్యాణకల్పవల్లి
4 అభిజ్ఞానశాకుంతలము
5 రత్నావళి
6 మాలవికాగ్నిమిత్రము
7 ప్రబోధచంద్రోదయము
8 వినీసువర్తకచరిత్రము

వ చ న ప్ర బం ధ ము లు
ప ద్య కా వ్య ము లు

నాల్గవ సంపుటము

1 సత్యరాజాపూర్వదేశ యాత్రలు మొ॥భా॥
2 ,, రెం॥భా॥
3 రాజశేఖరచరిత్రము
4 శుద్ధాంధ్రసరోష్ఠ్యనిర్వచనైషధము

5 రసికజనమనోరంజనము
6 శుద్ధాంధ్రభారత
సంగ్రహము
7 అభాగ్యోపాఖ్యానము
8 పథికవిలాసము
9 జాన్‌గిల్పిన్
10 నీతిదీపిక

స్త్రీలకుపయోగించు కథలు
అయిదవ సంపుటము

1 సత్యవతీచరిత్ర
2 చంద్రమతీచరిత్ర
3 సత్యసంజీవిని
4 చమత్కారరత్నావళి
5 సతీమణివిజయము
6 సుమిత్రచరిత్రము
7 రఘుదేవరాజీయము
8 కురంగేశ్వరవర్ణక
చరిత్రము
9 కళావతి పరిణయము
10 గయ్యాళినిసాధుచేయుట
11 చిత్రకేతు చరిత్రము
12 దానకేసరీవిలాసము
13 వైదర్భివిలాసము
14 భానుమతీకళ్యాణము
15 సరసిజనమనోభిరామము
16 ధర్మకవచోపాఖ్యానము
17 కుమారద్వ్యర్థవిలాసము

స్త్రీలకుపయోగించు పుస్తకములు
ఆఱవ సంపుటము

1 శ్రీవిక్టోరియామహారాజ్ఞి
చరిత్రము
2 సతీహితబోధిని
3 పత్నీహితసూచని
4 స్త్రీనీతిదీపిక
5 సత్యాద్రౌపదీసంవాదము
మాతృపూజ పితృపూజ
6 నీతికథామంజరి
ప్రథమభాగము
7 డిటో ద్వితీయభాగము
8 దేహారోగ్యధర్మబోధిని
ఉపన్యాసములు
ఏడవసంపుటము

1 జన్మాంతరము
2 అతిబాల్యవివాహము
3 విగ్రహారాధనము
4 ఈశ్వరదత్తపుస్తకములు
5 ఈశ్వరోపాసనము
6 ప్రార్థన
7 మానుషధర్మము
8 విద్యాధికుల ధర్మములు
మనుష్యజీవితముల
యొక్క పరమార్థము
10 వైరాగ్యము
11 విద్యాధురీణుల యుర్వా
క్ష్యములు

18 పద్మినీప్రభాకరము
19 మాలతీమధుకరము
14 స్వయంకృషి
15 సకాయకష్టకర్మలు
16 వేశ్యాకాంతల యుపన్యాసములు
17 ఐకమత్యము
18 దానములు
19 స్త్రీపునర్వివాహచరిత్రము
20 స్త్రీపునర్వివాహవిషయకోప
న్యాసము
21 స్త్రీపునర్వివాహవిషయక
ప్రథమవిజ్ఞాపనము
22 స్త్రీపునర్వివాహవిషయక
ద్వితీయవిజ్ఞాపనము
23 స్త్రీపునర్వివాహశాస్త్ర
సంగ్రహము
24 స్త్రీపునర్వివాహభూతవర్త
మానస్థితులు

ఉపన్యాసములు-జీవచరిత్రలు

ఎనిమిదవ సంపుటము

---

1 దేశీయమహాసభ,
దానియుద్దేశము
2 శంకరాచార్యులు
2 బసవరాజు గన్నరాజుగారి జీవ
చరిత్రము
4 జోసన్ చరిత్రము

పుస్తకములు వలయువారు:-

కార్యదర్శి, హితకారిణీ సమాజము, రాజమహేంద్రవరము.
ఆనిర్వాసిత బడయుగలరు.

12 వర్ణము
13 హిందూమతములు
5 స్వదేశసంస్థాన చరిత్రాదులు
6 విగ్రహతంత్రవిమర్శనము
7 ఉపన్యాసమంజరి
8 వివేకవర్ధని మొదటిభాగము
9 " రెండవభాగము
10 " మూడవభాగము

సాహిత్యగ్రంథములు

తొమ్మిదవ సంపుటము

---

1 సంగ్రహవ్యాకరణము
2 కావ్యసంగ్రహము
3 అలంకారసంగ్రహము
4 నీతిచంద్రిక-విగ్రహము
5 నీతిచంద్రిక-సంధి
6 తర్క-సంగ్రహము
7 సత్యవాదిని
8 ఉత్తమస్త్రీచరిత్రములు
పూర్వాంధ్రకవులు

పదియవ సంపుటము

ఆధునికాంధ్రకవులు

పదకొండవ సంపుటము

స్వీయచరిత్ర

4

5

Check List

Book Number	NPR01B345	Date	29/03/2023
Front Cover	Yes	Back Cover	Yes
Blank Pages	CI, IV, VIII, 41		
Missing Pages	NO		
Prepared By	Sireesha	Cutting By	Sireesha
Scanned By	Pradhyu	Pages	85
Quality Checking	Anusha		